శ్రీవేదవ్యాస విరచితం

# శివమహాపురాణం

## ద్వితీయ భాగం

(తెలుగు అనువాదంతో)


అనువాదకులు

**డా॥ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి**

ఎం.ఎ.(తెలుగు), ఎం.ఎ.(సంస్కృతం), ఎం.యిడి., పిహెచ్.డి.

సంపాదకులు

**డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ**

ఎం.ఎ.(సంస్కృతం), ఎం.ఎ.(తెలుగు), పిహెచ్.డి.

ప్రత్యేకాధికారి

**పురాణ ఇతిహాస ప్రాజెక్టు**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**



ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి**

**2024**

# SIVA MAHAPURANAM
**SECOND PART**

(with Telugu Translation)

Translated by
**Dr. Dhulipala Prabhakara Krishnamurthy**
M.A. (Telugu), M.A. (Sanskrit), M.Ed., Ph.D.

Editor
**Dr. Akella Vibhishana Sharma**
M.A. (Sanskrit), M.A. (Telugu), Ph.D.

T.T.D. Religious Publications Series No.

© All Rights Reserved

First Print : 2024

Copies: 500

*Published by:*
**Sri J.Syamala Rao, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*Cover Design*
*Type Setting*
Office of the Special Officer, Purana Itihasa Project,
TTD,Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.



శ్రీపద్మావతిఅమ్మవారు



శ్రీవేంకటేశ్వరస్వామివారు



వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

# తిరుమల తిరుపతి దేవస్థానములు
## పురాణ ఇతిహాస ప్రాజెక్టు
## పండితపరిషత్తు
(సలహామండలి)

### అధ్యక్షులు

**శ్రీ జె. శ్యామలరావు** గారు ఐ.ఏ.ఎస్.,

**కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.**

### సభ్యులు

**శ్రీమతి ఎం. గౌతమి** గారు ఐ.ఏ.ఎస్.

**సంయుక్త కార్యనిర్వహణాధికారిణి,**

**తి.తి.దే.,తిరుపతి**

**డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు**
విశ్రాంత ఆచార్యులు,
జాతీయ సంస్కృత విద్యాపీఠం - తిరుపతి.

**డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు**
విశ్రాంత ఉపకులపతి,
జాతీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

**డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు**
విశ్రాంత సంచాలకులు,
ప్రభుత్వ ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ,
హైదరాబాద్.

**డా॥ ధూళిపాళ మహదేవమణిగారు**
విశ్రాంత కళాశాలాధ్యక్షులు,
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి.

**సంచాలకులు**

**డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మగారు**

ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు

# తిరుమల తిరుపతి దేవస్థానములు

## పురాణ ఇతిహాస ప్రాజెక్టు

# పరిష్కరణ పరిషత్తు


**డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణ**గారు
విశ్రాంత ఆచార్యులు, జాతీయ సంస్కృత విద్యాపీఠం,
తిరుపతి.

**డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తి**గారు
విశ్రాంత ఉపకులపతి,
జాతీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

**డా॥ సూరం శ్రీనివాసులు**గారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు,
శ్రీ గోరంట్లవెంకన్న ఓరియంటల్ కళాశాల,
తిమ్మసముద్రం.

**డా॥ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి**గారు
విశ్రాంత డిస్ట్రిక్ట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్,
నిడదవోలు.

**డా॥ ధూళిపాళ అన్నపూర్ణ**గారు
విశ్రాంత కళాశాలాధ్యాపకురాలు,
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి.

**డా॥ వేదాల వేంకట సీతారామాచార్యులు**గారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు,
ఎస్.బి.ఎస్. సంస్కృతకళాశాల, పొన్నూరు.

**శ్రీ గార్లపాటి ప్రభాకరశర్మ**గారు
విశ్రాంత ప్రిన్సిపాల్, ధర్మప్రబోధ కళాశాల,
హిందూ ధర్మప్రచార పరిషత్, తి.తి.దే., తిరుపతి.

**ఆచార్య డి.వి.జి.ఎ.సోమయాజులు**గారు
విశ్రాంత సహప్రాచార్యుడు (తెలుగు),
ఎ.యమ్.ఎ.యల్.కళాశాల, అనకాపల్లి.

**డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యం**గారు
విశ్రాంత సంచాలకులు,
ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ, హైదరాబాద్.

**డా॥ ధూళిపాళ మహాదేవమణి**గారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు,
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి.

**ఆచార్య ఆర్.వెంకటరామకృష్ణశాస్త్రి**గారు
విశ్రాంత ఆచార్యులు (సంస్కృతం&తెలుగు),
హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**డా॥ కె.లక్ష్మీనారాయణ**గారు
విశ్రాంత రీడర్(సంస్కృతం),
వేదసంస్కృత కళాశాల, నెల్లూరు.

**ఆచార్య జానమద్ది రామకృష్ణ**గారు
విశ్రాంత వ్యాకరణాచార్యులు,
జాతీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

**డా॥ కడిమిళ్ళ వరప్రసాద్**గారు
విశ్రాంత ఆంధ్రోపాధ్యాయుడు,
టేలర్ హైస్కూల్, నరసాపురం.

**డా॥ సి.హెచ్.రమాదేవి**గారు
విశ్రాంత కళాశాల అధ్యక్షురాలు (FAC),
యస్.వి.జె.వి.సంస్కృత కళాశాల, కొవ్వూరు.

**డా॥ ఓరుగంటి సీత**గారు
విశ్రాంత సహప్రాచార్యురాలు,
ఎ.వి.ఎన్.కళాశాల, విశాఖపట్నం.

**సంచాలకులు**

**డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మగారు**
ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

# విషయానుక్రమణిక


| విషయం | | పుటసంఖ్య |
|---|---|---|
| తొలిపలుకు | ... | 1 |
| నివేదన | ... | 3 |
| పురాణపురుషుడు శ్రీమన్నారాయణుడు | ... | 7 |
| శివపురాణం - రుద్రసంహిత- సతీఖండం, పార్వతీఖండం సారాంశం | ... | 18 |
| **రుద్రసంహిత - సతీఖండం** | | |
| 01. సంక్షిప్త సతీచరిత్ర | ... | 1 |
| 02. మన్మథజననం | ... | 8 |
| 03. కామశాపానుగ్రహం | ... | 15 |
| 04. కామవివాహవర్ణన | ... | 27 |
| 05. సంధ్యా చరిత్ర | ... | 32 |
| 06. సంధ్యతపోవర్ణనం | ... | 43 |
| 07. అరుంధతి వసిష్ఠుల వివాహవర్ణన | ... | 53 |
| 08. వసంతునిస్వరూపవర్ణన | ... | 57 |
| 09. కామప్రభావం, మారగణాల ఉత్పత్తివర్ణన | ... | 65 |
| 10. బ్రహ్మవిష్ణుసంవాదం | ... | 75 |
| 11. దుర్గాస్తుతి బ్రహ్మవరప్రాప్తి | ... | 85 |
| 12. దక్షునకువరప్రాప్తి | ... | 93 |
| 13. నారదునికిశాపం | ... | 99 |
| 14. సతీదేవిజననం బాలలీలావర్ణనం | ... | 105 |
| 15. నందావ్రతవిధానం శివస్తుతి | ... | 114 |
| 16. విష్ణుబ్రహ్మకృత శివప్రార్థనావర్ణనం | ... | 125 |
| 17. సతీవరలాభం | ... | 133 |
| 18. కన్యాదానవర్ణనం | ... | 144 |

| | | |
|---|---|---|
| 19. సతీవివాహ శివలీలావర్ణనం | ... | 150 |
| 20. సతీవివాహవర్ణనం | ... | 162 |
| 21. సతీశివ క్రీడావర్ణనం | ... | 171 |
| 22. సతీశివ విహారవర్ణనం | ... | 178 |
| 23. భక్తిప్రభావవర్ణనం | ... | 188 |
| 24. రామ పరీక్షావర్ణనం | ... | 197 |
| 25. సతీవియోగం | ... | 207 |
| 26. శివునితో దక్షునివిరోధం | ... | 218 |
| 27. దక్షయజ్ఞప్రారంభం | ... | 227 |
| 28. సతీయాత్రావర్ణనం | ... | 236 |
| 29. సతీదేవివాక్యవర్ణనం | ... | 243 |
| 30. సతీదేవితనువుచాలించుట | ... | 253 |
| 31. ఆకావాణిమాటలు | ... | 258 |
| 32. వీరభద్రోత్పత్తి శివాదేశం | ... | 264 |
| 33. వీరభద్రయాత్రావర్ణనం | ... | 273 |
| 34. దుశ్శకునదర్శనం | ... | 279 |
| 35. విష్ణువాక్యవర్ణనం | ... | 283 |
| 36. విష్ణు వీరభద్రసంవాదం | ... | 292 |
| 37. యజ్ఞధ్వంసమునువర్ణించుట | ... | 303 |
| 38. క్షువదధీచుల వాదమునువర్ణించుట | ... | 313 |
| 39. విష్ణుదధీచులయుద్ధమునువర్ణించుట | ... | 323 |
| 40. శివసందర్శనం | ... | 332 |
| 41. దేవతలు శంకరునిస్తుతించుట | ... | 339 |
| 42. దక్షుని దుఃఖమును నివారించుట | ... | 347 |
| 43. దక్షయజ్ఞమును అనుసంధానపరచుట | ... | 356 |

## రుద్రసంహిత - పార్వతీఖండం


| | | |
|---|---|---|
| 01. హిమాచల వివాహవర్ణనం | ... | 363 |
| 02. పూర్వగతివర్ణనం | ... | 369 |
| 03. దేవీస్తుతి | ... | 376 |
| 04. దేవతలను ఓదార్చుట | ... | 383 |
| 05. మేనావరలాభవర్ణనం | ... | 391 |
| 06. పార్వతీజన్మవర్ణనం | ... | 399 |
| 07. పార్వతీదేవిబాల్యలీలలు | ... | 408 |
| 08. నారదహిమగిరులసంవాదం | ... | 412 |
| 09. స్వప్నవర్ణన పూర్వక సంక్షేప శివచరిత్రవర్ణన | ... | 421 |
| 10. భౌమోత్పత్తిశివలీలావర్ణనం | ... | 427 |
| 11. శివశైలేశ సమాగమవర్ణన | ... | 432 |
| 12. శివహిమాచల సంవాదవర్ణనం | ... | 439 |
| 13. పార్వతీపరమేశ్వరులసంవాదం | ... | 445 |
| 14. తారకోత్పత్తి యందు వజ్రాంగోత్పత్తియు, తపోవర్ణనం | ... | 455 |
| 15. తారకాసుర తపోరాజ్యవర్ణన | ... | 462 |
| 16. బ్రహ్మ దేవతలను ఓదార్చుట | ... | 471 |
| 17. ఇంద్రమన్మథుల సంభాషణము | ... | 478 |
| 18. కామవికారవర్ణన | ... | 485 |
| 19. మన్మథనాశవర్ణనం | ... | 492 |
| 20. బడబానల చరిత్రం | ... | 500 |
| 21. నారదోపదేశం | ... | 504 |
| 22. పార్వతి తపోవర్ణనం | ... | 511 |
| 23. పార్వతిని ఓదార్చుట మరియు శివదేవునిదర్శనం | ... | 522 |
| 24. పార్వతివివాహస్వీకారం | ... | 530 |
| 25. సప్తర్షులు పార్వతిని పరీక్షించుట | ... | 542 |
| 26. పార్వతీజటిలసంవాదం | ... | 554 |
| 27. బ్రహ్మచారి మోసపుమాటలవర్ణనం | ... | 561 |
| 28. పార్వతికి పరమశివ సాక్షాత్కారం | ... | 567 |

29. పార్వతీ పరమేశ్వరులసంవాదం ... 575
30. పార్వతి తపస్సునుండి తిరిగివచ్చుట ... 582
31. శివమాయావర్ణనం ... 590
32. సప్తర్షులరాక ... 599
33. సప్తర్షులు హిమవంతునకునచ్చచెప్పుట ... 609
34. అనరణ్యచరిత్ర ... 619
35. పిప్పలాదునిచరిత్ర ... 625
36. సప్తర్షులు హిమవంతునకు ఉపదేశించుట ... 635
37. లగ్నపత్రమును పంపుట, సామగ్రి సమకూర్చుకొనుట, పర్వతముల రాక ... 641
38. మండపాదుల నిర్మాణవర్ణనం ... 649
39. దేవనిమంత్రణ, దేవాగమన శివయాత్రావర్ణనం ... 655
40. శివయాత్రనువర్ణించుట ... 664
41. మండప నిర్మాణవర్ణన ... 672
42. దేవగిరిమిలనవర్ణనం ... 681
43. శివుని అద్భుతలీలావర్ణనం ... 686
44. మేనాదేవికి తెలియజెప్పుటను గూర్చివర్ణన ... 696
45. శివసుందరస్వరూప పురవాసియొక్క ఉత్సవం ... 712
46. వరుడైన శివుని రాకనువర్ణించుట ... 719
47. శివుడు హిమవంతుని గృహంలోనికి వెళ్ళుట ... 725
48. కన్యాదానవర్ణనం ... 733
49. విధిమోహనవర్ణనం ... 742
50. పరిహాసవర్ణనం ... 749
51. కామదేవుని జీవనవిదానవర్ణనం ... 757
52. వరవర్గీయుల భోజన ఏర్పాటు, శివుని శయనవర్ణనం ... 764
53. శివయాత్రావర్ణనం ... 770
54. పతివ్రతల ధర్మములవర్ణనం ... 776
55. శివుడు కైలాసానికి వెళ్లుటనువర్ణించుట ... 788
పురాణప్రశస్తి ... 794
అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం ... 807



# తొలిపలుకు

**"ఓం నమో వేంకటేశాయ"**

**శ్రీ జె.శ్యామలరావు,** ఐ.ఏ.యస్.,
**కార్యనిర్వహణాధికారి,**
తిరుమల తిరుపతి దేవస్థానములు.

వేదాలలో ఉపదేశింపబడిన ధర్మమార్గం, పరబ్రహ్మతత్త్వం, కథలరూపంలో సామాన్య జనులకు స్పష్టంగా తెలియజేయడానికే 'పురాణ వాఙ్మయం' ఆవిర్భవింపబడింది. ఈ పురాణ వాఙ్మయం వేదవ్యాస మహర్షిచే సంస్కృత భాషలో వెలువరింపబడింది. ఆధునిక కాలంలో సంస్కృత భాషాధ్యయనం కొరవడినది. కనుక సామాన్య జనులకు తాము ఆచరించవలసిన ధర్మమార్గం స్వరూపం స్పష్టంగా తెలియకుండా పోయింది. ఈలోటు తీర్చడానికి తిరుమల తిరుపతి దేవస్థానములు, పురాణ ఇతిహాస ప్రాజెక్టును ప్రారంభించి, సరళమైన తెలుగు అనువాదానికి శ్రీకారం చుట్టింది.

భారతీయ సంస్కృతికి పట్టుకొమ్మలైన అష్టాదశ పురాణాలలో, అష్టాదశ మహాపురాణాలను కూర్మపురాణం, విష్ణుపురాణం, బ్రహ్మపురాణం, మత్స్యపురాణం, అగ్నిపురాణం, వామన పురాణం, మార్కండేయ పురాణం, లింగపురాణం మరియు గరుడపురాణములు తెలుగువారికి తి.తి.దే., అందించింది. ఈ పరంపరలో భాగమే ఇప్పుడు ప్రచురింపబడుచున్న ఈ 'శివమహాపురాణం' – ఇది వాయు పురాణంగా కూడా కీర్తింపబడుతున్నది.

శ్రీశివమహాపురాణంలో మొత్తం ఏడు సంహితలున్నాయి. అవి వరుసగా 1. విద్యేశ్వర సంహిత, 2. రుద్ర సంహిత, 3. శతరుద్ర సంహిత, 4. కోటిరుద్ర సంహిత, 5. ఉమా సంహిత, 6. కైలాస సంహిత, 7. వాయవీయ సంహిత. ఈ ఏడు సంహితలతో కూడిన శ్రీశివమహాపురాణం విషయదృష్టితో 5 భాగాలుగా ప్రచురిస్తున్నాం. శ్రీ శివమహాపురాణంలోని ఏడు సంహితలలో రెండవదైన రుద్రసంహిత 5 ఖండాలుగా విరాజిల్లుతోంది. 1. సృష్టిఖండం, 2. సతీఖండం, 3. పార్వతీఖండం, 4. కుమారఖండం, 5. యుద్ధఖండం.

రుద్రసంహితలోని ఈ 5 ఖండాలలో రెండవదైన సతీఖండం, మూడవదైన పార్వతీఖండం కలిపిన భాగమే ఈ "శ్రీశివమహాపురాణం (ద్వితీయ భాగం)". దక్షప్రజాపతి కుమార్తె సతీదేవి శివ భగవానుడిని ఆదరంతో వివాహమాడింది. కానీ యజ్ఞంలో తండ్రి దక్షప్రజాపతి శివదేవుడిని నిందించాడు. ఇందుకు కలతచెందిన సతీదేవి యోగాగ్నిలో తనువు చాలించడం, సతీఖండంలో ప్రధాన కథాంశం. దేహాన్ని విడిచిన సతీదేవియే తరువాత హిమవంతునకు పుత్రికగా "పార్వతి"యై అవతరించింది. తన కఠోరతపస్సుతో పరమేశ్వరుని మెప్పించి, శివుని వివాహమాడిన వృత్తాంతం పార్వతీ ఖండంలోని ప్రధాన కథ. ఈ రెండు ఖండాలలోను, ప్రధానమైన ఈ కథాంశాలతోబాటు

అనేక ఉపాఖ్యానాలు కూడా ఉన్నాయి. వివిధ దేవతలను ఆరాధించే విధానాలు, శైవ దార్శనిక సిద్ధాంతాలు సందర్భానుగుణంగాను, విస్తృతంగాను వర్ణించబడ్డాయి. అంతేగాక 'దేవీ వైభవం' సంపూర్ణంగా ఈ ఖండాలలో వివరింపబడింది. కాబట్టి మోక్షాన్ని కోరుకునే శివభక్తులకు, దేవీభక్తులకు ఈ పురాణభాగం ఎంతగానో ఉపయోగపడుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఈ 'శ్రీశివమహాపురాణము (ద్వితీయ భాగము)'నకు సరళమైన, వ్యావహారిక శైలిలో తెలుగులో అనువాదాన్ని అందించిన డా॥ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి గారికి, పరిష్కరించిన పండిత మండలికి, సమగ్రంగా పరిశీలించిన పురాణ ఇతిహాస ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ గారికి నా శుభాభినందనలు.

**సదా శ్రీవారి సేవలో**



**జె.శ్యామల రావు,** ఐ.ఏ.యస్.,

**కార్యనిర్వహణాధికారి,**

తిరుమల తిరుపతి దేవస్థానములు.

# నివేదన

వాఙ్మయంలో పురాణాలకు, పురాణాలలో శివపురాణానికి ఉన్నస్థానం విశిష్టమైనది. శివపురాణంలో ఏడు సంహితలున్నాయి. అందులో రెండవదయిన రుద్రసంహితలో 43 అధ్యాయాలు, 2312 శ్లోకాలున్నాయి. రుద్రసంహితలోని ఐదు ఖండాలలో రెండవ ఖండానికి వ్యాసులవారు సతీఖండమని నామకరణంచేసారు. సామాన్యులకు పార్వతికి సంబంధించిన విశేషాంశాలు తెలుసు. ప్రత్యేకించి కాళిదాసమహాకవి కుమారసంభవకావ్యం ఈ అంశానికి సంబంధించి రమ్యాతిరమ్యకథనం చేసింది. అయితే కుమారసంభవకావ్యంలో 'సతీదేవి' చరిత్ర రేఖామాత్రమే. కాని శివమహాపురాణరుద్రసంహిత సతీదేవికి సంబంధించిన అనేకాంశాలు వర్ణించింది.

సతీఖండం మొదటి అధ్యాయం 46 శ్లోకాలలో సతీదేవి చరిత్రలోని ప్రముఖ సన్నివేశాల ఉల్లేఖనముంది. 26వ అధ్యాయంనుండి 43వ అధ్యాయంవరకు విస్తృతంగా కనిపిస్తుంది. చివరి అధ్యాయాలలో దక్షప్రజాపతి దుఃఖనివారణం, ఆపై దక్షుడు మొదలుపెట్టిన శివదేవుని ఆగ్రహంతో విధ్వంసమయిన యజ్ఞం శివానుగ్రహంతోనే ఋత్విక్కుల సహకారంతో పూర్తిచేసిన కథనముంది. చివరి అధ్యాయంలో సతీచరిత్ర కథాశ్రవణఫలితం చెప్పబడింది.

## స్థూలంగా సతీఖండ చరిత్ర

నారదమహర్షి బ్రహ్మముఖతః శంభుని గాథలను వినాలని ఆశించాడు. శివుని చరిత్రతోబాటు సతీదేవి యశస్సుతోడి దివ్యగాథను వినాలని ప్రార్థిస్తే తాను జ్ఞాని అయినా విష్ణువువల్ల విన్న పురాణకథను తానే వివరించసాగాడు. ముందుగా శివుని రెండు రూపాలను పరిచయం చేశాడు.

ఒకరూపంలో శివుడు నిర్గుణుడు, నిర్వికల్పుడు, రూపంలేనివాడు, శక్తిభేదం లేనివాడు, చైతన్యఘనుడు. ఇక రెండవ రూపంలో సగుణుడు. శక్తిభేదం కలవాడు. అందరిలో గొప్పవాడు. అతని ఎడమభాగంనుండి విష్ణువు, కుడిభుజంనుండి బ్రహ్మపుట్టారు. హృదయంనుండి పుట్టినవాడు రుద్రుడు. సృష్టి బ్రహ్మచేయగా, పాలన విష్ణువు కొనసాగించగా, రుద్రుడు లయం చేస్తాడు. సదాశివుడు ఈ త్రిమూర్తుల రూపంలో ఉన్నాడు. వీరిలో బ్రహ్మ దేవతలను, రాక్షసులను, మానవులను పుట్టించాడు. దక్షుని సృష్టించినవాడు, అతనిని ప్రజాపతిగా గౌరవించినవాడు కూడా బ్రహ్మయే. వీరేగాక మరీచి, వసిష్ఠ, నారదులనే మానసపుత్రులను వీరు సృష్టించాడు. వీరి జననానంతరం మానసపుత్రికగా 'సంధ్యా'సుందరి పుట్టింది. ఆమె అందచందాలు మహర్షులను కూడా మోహంలో ముంచాయి.

బ్రహ్మ దక్షాదులను స్మరిస్తున్న వేళ మరొక మానస పుత్రుడుదయించాడు. అతడే స్రష్ట. అతడు బ్రహ్మను చూచి నమస్కరించి తాను చేయవలసిన పని ఏమిటో సెలవిమ్మన్నాడు. 'నా పేరు చెప్పండి. నా స్థానాన్ని నిర్దేశించండి. నా భార్య ఎవరో తెలియజేయండి' అని ప్రశ్నించాడు. ఈ ప్రశ్నపరంపరలకంతా జవాబుగా బ్రహ్మ 'నీద రూపంలో నీవు ఉండు. అయిదు పూలబాణాలతో స్త్రీ పురుషుల్ని మోహంలో ముంచు. సనాతనమయిన సృష్టి గావించు. నిన్ను కాదనువారు లేరు. నీ ముందు నిలబడగలవారు కూడా లేరు. ఇంతెందుకు? నీ ముందు నేను, వాసుదేవుడు, శివుడు కూడా వశులయ్యేవారమే. ప్రాణుల హృదయాలలో రహస్యరూపంలో ఉండి వారి సుఖానికి కారణమౌతూ సనాతనమైన సృష్టి చేయాలి. నీవు ప్రయోగించే పూలబాణాలతో ప్రాణులు మదనప్రేరితాలవుతారు. నీ స్వరూపానికి తగిన పేర్లు నాకుమారులే సూచిస్తారన్నాడు. అపుడు బ్రహ్మ ఆలోచన, అదేశాల మేరకు ఋషులు అతనికి మన్మథ,

కామ, మదన, కందర్ప అని నామకరణం చేశారు. అంతేకాదు దక్షుడు నీకు తగిన భార్యను కూడా స్వయంగా ఇస్తాడన్నారు. ఆ మదనుని బాణాలే హర్షణం, రోచనం, మోహనం, శోషణం మారణమనేవి. ఈ బాణాలతో మదనుడు తన కౌశలాన్ని జోడించి వాటిని సంధ్య మీద ప్రయోగించాడు. ఆ బాణాల ప్రయోగంతో బ్రహ్మ, అతని మానసపుత్రులందరు మోహితులయ్యారు. ఆపై ఇంద్రియ వికారాలకు లోనయ్యారు. ఇంద్రియవికారాలకు లోనయిన బ్రహ్మలో 49 భావాలు పుట్టాయి. చివరకు సంధ్యను కూడా ఆ బాణాలు తికమకపెట్టాయి. వ్యామోహాలకు తగిన వాతావరణం ఏర్పడడంతో ఇవన్నీ చూశాక మన్మథునిలో విశ్వాసం పెరిగింది.

ఆ వేళ బ్రహ్మపుత్రుడయిన ధర్ముడు శివస్తవం చేశాడు. 'నా కారణంగా నా సోదరులు కూడా పాపబుద్ధి కలవారయినారని నివేదిస్తే', శివుడు ప్రత్యక్షమై ఇలా వీరందరు మోహితులు కావడం తగునా అని బ్రహ్మాదుల్ని, యోగుల్ని మందలించాడు. ఆ సమయంలో బ్రహ్మ చెమటనుండి పితృదేవతలు, పితరులు పుట్టారు. అంతేకాదు ఆ సమయంలో ఒక యువతి కూడా పుట్టినది. ఆమె ఎవరోకాదు. మునులను సహితం మోహింపచేసే రతిదేవి. ఇలావుంటే సంధ్య మాత్రం తండ్రిగుణాలను పుణికిపుచ్చుకొన్నదై ధర్మబద్ధజీవి అయింది.

శివుడు అంతర్ధానమయ్యాక బ్రహ్మ తనలో వికారం కలగడానికి కారణమేమిటో తెలుసుకోవాలనుకొన్నాడు. వీటికంతా మన్మథుడే కారణమనే కోపంతో మదనుని శివనేత్రానలజ్వాలతో కాల్చివేయబడతావని శపించాడు. ఆ సమయంలో ఋషులు, మునుల సమక్షంలో మదనుడు బ్రహ్మతో 'నాకు ఈ దారుణశాపం తగదు. నేను స్వతంత్రించి ఏపనీ చేయలేదు. మీరు అదేశించిన పనినే చేశానన్నాడు. ఇందు నా తప్పేదీ లేద'న్నాడు. అపుడు బ్రహ్మకు నామీదే బాణాలు ప్రయోగించావు. నా కుమార్తె పట్ల వికారభావం కలగజేశావు. అందువల్ల శపించా'నన్నాడు. 'అయినా నా శాపానికి తిరుగులేదు. నీవు కాల్చబడినా మరల నీకు శరీరాకారం వస్తుందని' నమ్మబలికాడు. అయితే ఈ స్థితి శివుడు భార్యను స్వీకరించాక అని శాప అవధి నిర్దేశించాడు. ఆపై దక్షాజ్ఞతో కాముడు రతిని భార్యగా స్వీకరించాడు.

తదనంతరం నారదుడు 'సంధ్య సంగతి ఏమిటని' అడిగాడు. బ్రహ్మ 'నారదా! ఆమె శుభచరిత. ఆమె తపస్సుచేసి శరీరత్యాగంచేసి అరుంధతిగా పుట్టింది. తండ్రి మేధాతిథి. ఆమె వసిష్ఠుని భర్తగా వరించింది. ఈ వివాహానికి నడుము బిగించినవారు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులన్నాడు.

తనపట్ల శివుని హేళనకు బ్రహ్మ నొచ్చుకొన్నాడు. చివరకు మన్మథునితో 'మన్మథా! నీవు ప్రపంచం మేలుకోరి ఎలాగయినాసరే శివుని మోహింపచేయి. నిన్ను తరింపచేస్తాడు' అన్నాడు.

అపుడు 'నిజమే అయితే శివుని మోహింపచేయగల స్త్రీని నీవే సృష్టించు' అన్నాడు. ఈ ఆలోచనలో ఉండగా బ్రహ్మ నిశ్వాసం నుండి వసంతుడు పుట్టాడు. మదనునితో 'ఈ వసంతుడు సర్వదా తోడయి ఉంటాడని' అతనికి అప్పగించాడు.

శౌనకాదులు సూతమహర్షిని ముందు దుర్గాదేవి దక్షుని కూతురు కదా మఱి ఆమె ఆపై హిమవంతుని కూతురెలా అయిందని కుతూహలంతో ప్రశ్నించి ఆ వృత్తాంతాలను చెప్పవలసిందిగా కోరగా, చెప్పాడు. పట్టుబట్టిన

బ్రహ్మదేవుని సలహాతో రతీమన్మథులు శివుని మోహింపచేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. అవన్నీ వ్యర్థమయ్యాయి. ఆ సమయంలో బ్రహ్మ విచారగ్రస్తుడయి విష్ణువును ప్రార్థించాడు. తన ఆలోచనను ప్రకటించుకొన్నాడు. మహావిష్ణువు ఈ ఆలోచన తగదంటూ శివుని వేడుకోవడమే సరి అయిన మార్గమని ఉపదేశించాడు. ఆపై బ్రహ్మ దుర్గాస్తుతి చేశాడు. దుర్గ కరుణించి వరం కోరుకో అన్నది. బ్రహ్మ ఆ తల్లితో "అమ్మా! రుద్రుడు కైలాసంలో వున్నాడు. మేము వివాహితులమయ్యాం. కాని రుద్రుడు అవివాహితుడుగా ఉన్నాడు. అతనిని మోహింపచేయాలి. అంచేత తల్లీ! నీవు దక్షపుత్రికగా అవతరించు" అని కోరాడు. 'అమ్మా దక్షుడు కూడా క్షీరసముద్రం ఉత్తరదిశలో నీకోసం తపస్సు చేస్తున్నాడు' అని సెలవిస్తే దుర్గ 'అంతా బాగుంది, కాని శివుని మోహింపచేయడం అంత సులభంకాదు. అయినా నేను ప్రయత్నిస్తాను. నేను దక్షుని భార్యకు 'సతీదేవిగా అవతరిస్తానని' భరోసా పలికి అంతర్ధానమయింది. అలాగే దక్షునికి వరమిచ్చింది. దుర్గాదేవి దక్షుని భార్య అయిన 'వీరిణి'కి పుత్రికగా అవతరించింది. తన పుత్రికకు 'ఉమా' అని దక్షుడు పేరు పెట్టాడు. సతి సర్వావయవ సుందరి అయింది. సదా సర్వేశ్వరుణ్ణి ధ్యానిస్తూ కాలం గడిపేది. ఆమె భక్తికి తల్లిదండ్రులు సంతోషించేవారు.

ఒకసారి నారదుడు దక్షప్రజాపతి దగ్గరికి వచ్చాడు. అక్కడి వారంతా నారదునికి గౌరవమర్యాదలు చేశారు. దగ్గరున్న సతీదేవి భక్తితో నారదులవారికి నమస్కరించగా ఆ మహర్షి అమ్మా! జగదీశ్వరుని పెళ్ళాడతావని చెప్పి మాయమయ్యాడు. నారదోక్తవరం సతికి కొండంతబలం సమకూర్చింది. పవిత్ర తిథివార నక్షత్రాలలో శివానుగ్రహం కోసం రకరకాల నోములు నోచింది. పెద్దలు చెప్పినట్లుగా 'నందావ్రతం' చేసింది ఆపై దేవతలు కైలాసానికి వెళ్ళి 'విశ్వహితార్థం సురలోకసుఖార్థం శోభనాంగియైన ఒక స్త్రీని వివాహమాడవలసిందని' శివుని ప్రార్థించారు. కాని శివుడు తాను విరాగినని, యోగమార్గగామిని, భోగవర్జితుణ్ణి, అమంగళకర, అశుభ్రవేషధరుణ్ణి. నాకు వివాహంపై అభిరుచిలేదు. ఒకవేళ వివాహమాడకతప్పదంటారా! వివాహమాడడానికి నాకు కొన్ని షరతున్నాయి. మొదటిది నేను వివాహమాడాలంటే ఆ స్త్రీ యోగశక్తి కలదిగా ఉండాలి. ఇచ్ఛ వచ్చిన రూపం ధరించాలి. నాకు తగినట్లు యోగాసక్తిగా, కామాసక్తి కలదిగా ఉండాలి'. అని అంటే బ్రహ్మ, విష్ణు దేవతలు 'అలాగే' అంటూ దక్షప్రజాపతి కూతురు సతి గుణగణాదులను ఏకరువు పెట్టారు. తన కుమార్తెకు వరుడెవరా అని ఆలోచించే దక్షుడు సంతోషించాడు.

సతీదేవి మానసికసంకల్పాన్ని నెరవేర్చవలసిందిగా దేవతలు కోరగా పరమేశ్వరుడు సరేనన్నాడు. ఆ సమయంలో సతీదేవి 'దేవదేవ! మహాదేవ! వివాహవిధినా ప్రభో। పితుర్మే గోచరీకృత్య మాం గృహాణ జగత్పిత' అనగా శివుడు 'తథాస్తు' అన్నాడు. వివాహం నిశ్చితమయింది. కాని అపుడే ఒక అసంభావిత సంఘటన జరిగింది.

వైవాహికపు తంతులో భాగంగా సతీదేవి అగ్నిప్రదక్షిణం చేస్తుంటే ఆమె సుందర ఆకర్షకపాదాలను బ్రహ్మచూచాడు. మోహావేశంలో ఆమె సర్వాంగాలపై దృష్టి సారించాడు. చివరకు సతీదేవి ముఖసందర్శనం చేయాలనుకున్నాడు. కామార్తితో ఆమె మొగం చూడాలనుకొంటే వీలుకాలేదు. ఆ సమయాన కల్యాణవేదిక నిండా పొగ క్రమ్ముకొంది. పరమేశ్వరుడు పొగపీడతో కళ్ళుమూసుకొన్నాడు. సతి అపుడు మేలిముసుగెత్తింది. ఇదే తగిన సమయమని బ్రహ్మ తదేకంగా సతిని చూస్తుంటే అతనికి రేతస్ఖలనం జరిగింది. అయినా వెంటనే బ్రహ్మ దానిని

కప్పేశాడు. కాని రుద్రుడు బ్రహ్మ అనుచితచర్యకు అసహ్యించుకొని ఆ బ్రహ్మను సంహరించడానికి శూలాన్ని పైకెత్తాడు. వివాహసమయంలో ఊహించని ఈ సంఘటనకు దక్షుడు చలించి నివారించబోయాడు. కాని విష్ణువు శివునితో బ్రహ్మగాని, నేనుగాని నీకు భిన్నులము కాముకదా అలాంటివేళ అంశజుల పరస్పరహననం తగదు కదా అని ఆశ్వాసిస్తే శివుడు చల్లబడ్డాడు. కళ్యాణమయ్యాక సతీదేవితో కైలాసానికి శివుడు తరలి వెళ్ళాడు. ఆపై దక్షకన్యకతో శివుడు తన ఇచ్ఛమేరకు గడిపాడు. సతీదేవి శివేచ్ఛప్రకారం నడుచుకొన్నా తను మేఘ సంచారం లేనిచోట ఉండాలని చెప్పింది. శివుడు 'సరేనంటూ' మేఘాలు కైలాసపర్వతంపై పాదాలవరకే విహరిస్తాయి. హిమవత్పర్వతంపై వెళదామని చెప్పినా తుదకు సతీదేవి

**హిమాద్రావేవ వసితుమహమిచ్ఛే త్వయా సహ ।**
**న చిరాత్కురు సంవాసం తస్మిన్నేవ మహాగిరౌ ॥22.53॥**

అలా సతీ పరమేశ్వరులు కాలం గడుపుతున్నా వారిరువురికి అనుకోని వియోగం తటస్థించింది. శివమహాపురాణంలో సామాన్యులకు తెలియని ఆ కథాంశం 'రామపరీక్షావర్ణనం'.

ఒకసారి రుద్రుడు సతీదేవితో వృషభారూఢుడయి పర్యటిస్తూ భూలోకం చేరుకొన్నాడు. అక్కడి విశేషాలను సతీదేవికి తెలియజేస్తున్నాడు. అక్కడ సీతాదేవిని అన్వేషిస్తున్న శ్రీరాముని శంకరుడు చూచాడు. శివుడు శ్రీరాములవారికి నమస్కరించాడు. ఈ చర్య సతీదేవికి వింతగా అనిపించింది. వారెవరని కుతూహలంతో వాకబు చేసింది. అపుడు రుద్రుడు వరదానప్రభావంతో వారికి గౌరవనమస్కారం తాను చేశానన్నాడు. అంతేకాదు వారిని గురించి చెప్పాడు. మహావిష్ణువు పరిపూర్ణాంశ శ్రీరాముడని అన్నాడు. కాని సతీదేవికి ఈ సమాధానం నచ్చలేదని శివుడు గ్రహించాడు. పైగా సతీదేవితో 'నీకు విశ్వాసం కలగకపోతే నీవే పరీక్షించుకో. నేను అప్పటిదాకా మర్రిచెట్టు క్రింద ఉంటా'నన్నాడు. సతి ఆలోచించి తానే సీతరూపం ధరిస్తానంది. సీతగా కదలింది. ఆ ప్రాంతంలోని శ్రీరాముడు తనదగ్గరికి సతీదేవి సీతగా వచ్చిందని గ్రహించాడు. ఆమెను చూచి దరహాసం చేస్తూ శివనామం జపిస్తూ ఆమెతో 'సతీదేవీ! నీ మనోగతుడయిన శంభుడెక్కడ? ఒంటరిగా ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చా'వని అడిగాడు.

శ్రీరాముని మాటలను సతీదేవి ఆశ్చర్యపడింది. ముందు రుద్రుడు ఇందాకా చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకొంది. సిగ్గుపడింది. ఆపై శివునితోడి తన సంభాషణను తెలియజేసింది. 'శ్రీరామా! నీవు విష్ణువని తెలుసుకొన్నాను. అయినా శివునికి నీవు వందనీయుడవు కావడానికి కారణమేమిటన్నది?' సతిప్రశ్నలతో శ్రీరాముడు సంతోషించి శంభుని స్మరించాడు. అతని హృదయంలో ప్రేమ ప్రవాహ రూపమయింది. తదనంతరం రాముడు గతంలో హరుడు తన్ను సత్కరించాడని, తన్ను వర్ణించిన రీతిలో విష్ణువును వర్ణించాలని దేవతలను ఆజ్ఞాపించాడని చెప్పాడు. అపుడు ఆ హరికి గొప్ప గొప్ప వరాలిచ్చాడు. అంతేకాదు 'రామా! నీవు నా ఎడమభుజమన్నాడు. నీవిక్కడవుండి లోకాలను పాలించు. ఈ ధామం గోలోకం పేరుతో ప్రసిద్ధి పొందుతుందన్నాడు. అలాగే లక్ష్మీపతి ఆపై గోలోకపాలకుడయ్యాడు. ఈ వృత్తాంతమంతా చెప్పి సతీదేవితో శ్రీరాముడు తన సోదరులు కూడా విష్ణ్వంశజులమన్నాడు. అంతా విన్నాక సతీదేవి శంకరుని దగ్గరికి వెళుతూ శివుని మాటలను వినకపోవడం తప్పంటూ శ్రీరాముని పట్ల కుత్సితబుద్ధిని ప్రదర్శించాను. సీతరూపంలో వెళ్ళడం తప్పే అని బాధపడింది.

శివుడు సతీదేవితో నీవు ఏ విధంగా రాముని పరీక్షించావని ప్రశ్నించాడు. సతి జరిగినవృత్తాంతం చెప్పడంతో ఆమె చర్య నచ్చక శివుడు మనసా ఆమెను పరిత్యజించి కైలాసానికి వెళ్ళిపోయాడు. అపుడు ఆకాశవాణి శివుని ప్రశంసించింది. శివుడు ఆపై సతీదేవితో రోజులు గడిపినా సహజ సాంసారిక జీవనానికి భిన్నంగా సతీపరిత్యక్త మనస్కుడుగానే ప్రవర్తించాడు.

శివమహాపురాణం రుద్రసంహిత భాగంలోని 26వ అధ్యాయం నుండి 43వ అధ్యాయం వరకు దక్షప్రజాపతి వృత్తాంతమే ప్రాధాన్యం వహించింది.

ఒకసారి ప్రయాగలో మునుల యాగం మొదలయింది. దేవాధిదేవతలు, ప్రజాపతులు అక్కడ గుమికూడారు. అక్కడివారంతా దక్షుని పెద్దగా కొనియాడారు. ఆ యాగానికి వచ్చిన వారందరు దక్షుని గౌరవిస్తుంటే అక్కడికి వచ్చిన శివుడు దక్షుణ్ణి పట్టించుకోలేదు. అపుడు దక్షుడు తాను శివాధికుడనని గర్వితుడయ్యాడు. తన్ను గౌరవించనివారిని తాను గౌరవించకూడదనుకొన్నాడు. పైగా శివుని వేషభాష ప్రవర్తనలను తక్కువ చేస్తూ ప్రసంగించాడు. ఆ సందర్భంలో అతడు తన అల్లుడు అని కూడా మరచాడు. అపుడు చిత్రంగా భృగువులాంటివారు కూడా దక్షప్రజాపతికి వంతపాడారు. ఇవన్నీ చూస్తున్న నంది ఓర్వలేకపోయాడు. దేవతల్ని క్రూరంగా శపించాడు. ఈ శాపానికి నివ్వెరపోతూ బ్రాహ్మణులు హాహాకారం చేశారు. ఇవన్నీ చూస్తున్న శివుడు నందిని మందలించి విప్రులను తక్కువ చేయడం తగదన్నాడు. ఆపై వారు కైలాసం వెళ్ళిపోయారు.

ఈ సంఘటన జరిగాక దక్షునిలో అహం పెరిగింది. సకల దేవతాసాహాయ్యముండగా శంభుడొకడు లేకుంటే ఏమని ఆ స్వామిని వేదబాహ్యుడు, యాగబాహ్యుడని నిందిస్తూ అహంకారంతో ఒక మహత్తరయాగం మొదలుపెట్టాడు. అతని ఆహ్వానమందుకొని దేవతలురాగా దధీచిమాత్రం దక్షునిచేతను తప్పుపట్టాడు. ఇది తగదన్నాడు. శివుడులేని యాగం యాగం కాదు. అది అయజ్ఞమన్నాడు. దక్షుని చూచి 'దక్షా! నీకు వినాశనమే' అన్నాడు. ఇతరులు కూడా తగదన్నారు. అయినా దక్షుడు వారి బెదిరింపులను, శాపాలను తేలికగా అంచనా వేశాడు. యాగనిర్వహణ మొదలయింది. దేవాధిదేవతలు దక్షయాగానికి పరువులు తీస్తుంటే కైలాసంలోని సతి తన చెలికత్తె ద్వారా రోహిణీచంద్రులు కూడా యాగానికి వెళుతుండడం తెలిసి ఆశ్చర్యపడింది. కడకు తన తండ్రి ఆధ్వర్యవంలో చేస్తున్న యాగమని నిర్ధారణ అయ్యాక చలించింది. వెనువెంటనే శివుని దగ్గరికి వెళ్ళి ఇద్దరం యాగానికి వెళదామన్నది. కాని శివుడు ఆహ్వానం లేక వెళ్ళరాదన్నాడు. అవమానం తప్పదన్నాడు. కాని సతి పట్టుపట్టి తాను వెళతానంటే శంభుడు అందుకు తగిన ఏర్పాట్లు కూడా చేశాడు. సతీదేవి యాగస్థలికి వెళ్ళి తానొకతే లోపల ప్రవేశించింది. అపుడు తల్లి, సోదరీమణులు సత్కరించినా మనసులో ఏదో కొరత. ఇతరులు దక్షుడంటే భీతితో స్వాగతం పలకలేదు. 'యాగంలో శివునికి ఆహ్వానం పంపకపోవడమేమిటని? శివునికి హవిర్భాగం లేదా?' అని తండ్రిని అధిక్షేపించింది. శంభుని ఆజ్ఞ లేక ఇతర దేవతలు రావడమేమిటని గద్దించింది. తండ్రి శివుని వేదబాహ్యుడంటే వినలేకపోయింది. తాను రావడం తప్పని గ్రహించి తనపతిని తండ్రితూలనాడడం వినలేక చివరకు సతీదేవి ఆత్మార్పణ చేసుకొంది. ఈ వార్త విన్న శంభుడు కోపోద్రిక్తుడయ్యాడు. అతని జటాజూటం నుండి వీరభద్రుడుదయించి, 'ఏమి ఆన' అడగ్గా శివుడు కర్తవ్యముపదేశించాడు. వీరభద్రుడు యాగధ్వంసం చేశాడు.

ఈ వృత్తాంతం విశదంగా 32 నుండి 39 అధ్యాయాలలో వర్ణితం. ఆ విధ్వంససమయాన దేవతలు శంభుని అనునయించడానికి ప్రయత్నించారు.

**దక్షస్య యజ్ఞభంగోఽయం కృతశ్చ మయా క్వచిత్ ।**
**పరం ద్వేష్టి పరేషాం యదాత్మనస్తద్భవిష్యతి ॥42.5॥**

**పరేషాం క్లేదనం కర్మ న కార్యం తత్కదాచన ।**
**పరం ద్వేష్టి పరేషాం యదాత్మనః తత్ భవిష్యతి ॥42.6॥**

కరుణాసముద్రుడయిన శంభుడు దక్షునిచేతను క్షమించి శిరసు కోల్పోయిన దక్షునికి మేకతల అతికేట్టు చేశాడు. ఆ సందర్భంలో వారు చేసిన ప్రార్థనలు –

**నమామి వరదం వరేణ్యం మహేశ్వరం జ్ఞాననిధిం సనాతనమ్ ।**
**నమామి దేవాధిపతీశ్వరం హరం సదా సుఖాఢ్యం జగదేకబాంధవమ్ ॥42.5॥**

చివరకు దక్షయాగం పూర్తి అయ్యేటట్టు శివుడు అనుగ్రహించాడు. ఈ వృత్తాంతంతో సతీఖండం సమాప్తం.

శివమహాపురాణం రుద్రసంహిత పార్వతీఖండంలోని అధ్యాయాలు 55, శ్లోకాల సంఖ్య 2704. ఈ ఖండం ప్రధానంగా పార్వతిజననం, బాల్యలీలలు, పార్వతి శివభక్తి, కామదహనం, పార్వతితపస్సు, పరమేశ్వరానుగ్రహం, పార్వతీపరమేశ్వరుల కల్యాణం, శివయాత్రావర్ణనం, శివకైలాసగమనాది అంశాలతో కథాప్రధానంగా ఉంది. పురాణాలకు తగినట్లు దుర్గాస్తుతి, విష్ణుస్తుతి, శివస్తుత్యాదులున్నాయి. ఈ పార్వతీ ఖండంలోని క్రమమే కాళిదాసు కుమారసంభవకావ్యంలోను కనిపిస్తుంది. అయినా కుమారసంభవంలో విశదంగా లేని మేనాదేవిచరిత్ర, అనరణ్యచరిత్ర, పిప్పలాదుల చరిత్రలున్నాయి.

బ్రహ్మతో నారదుడు మేనాదేవిచరిత్ర చెప్పమంటే బ్రహ్మ చెప్పడంతో పురాణం మొదలవుతుంది. బ్రహ్మ కథనం మేరకు దక్షుడు తన అరవై పుత్రికలను కశ్యపాదులకిచ్చి వివాహం జరిపించాడు. ఆ అరవై మందిలో 'స్వధ' ఒకతే. ఆమెకు ముగ్గురు కుమార్తెలు. పెద్దకుమార్తె మేన, రెండవ కుమార్తె ధన్య, మూడవ కుమార్తె రాధ. వీరందరు పితృదేవతల మానసిక పుత్రికలు, వీరు యోగినులు. పరమజ్ఞాననిధులు. ఒకసారి వీరంతా కలిసికట్టుగా శ్వేతద్వీపానికి వెళ్ళారు. అక్కడ ఒక సభ జరుగుతోంది. ఆ సమయాన సనత్కుమారుడు సభలో ప్రవేశించగా అందరు లేచి నిలబడ్డారు. కాని మేన, ధన్య, రాధ లేచి నిలబడలేదు. ఈ చర్యను సనత్కుమారుడు అవజ్ఞగా భావించాడు. వీరిచేతను మహర్షులు కూడా నివ్వెరపోయారు. అపుడు సనత్కుమారుడు మీరు మానసపుత్రికలయినా మానవస్త్రీలుగా జన్మించాల్సిందే అని తీవ్రంగా శపించాడు. ఈ శాపం ఊహించని వీరు మాకు స్వర్లోకవాసభాగ్యం కలిగించమని కోరారు. వారి విన్నపం ఆలించి సనత్కుమారుడు – 'మేన హిమవంతునికి భార్య అయి పార్వతికి జన్మనిస్తుంది', 'ధన్య జనకునికి ప్రియురాలయి సీతకు తల్లి అవుతుంది', 'రాధ వృషభానుడనే వైశ్యుని పెళ్ళాడి రాధకు జన్మనివ్వగా ఆ రాధ ద్వాపరాంతంలో కృష్ణప్రియ అవుతుంది'. వీరందరు శివభక్తిపరాయణురాళ్ళయి ఉంటారు అని అనుగ్రహించాడు. వీరిలో పార్వతి శివుని పెళ్ళాడి జగన్మాత అయింది. సీతమ్మ రాముని వరించి మహాలక్ష్మి

స్వరూపురాలవుతుంది. రాధ కృష్ణునితో రహస్యప్రణయం జరిపి గోలోకంలో కృష్ణపత్ని అవుతుంది అనడంతో వీరంతా తమతమ స్వస్థలాలకు వెళ్ళారు.

మహర్షుల అనుగ్రహఫలితంగా మేనాహిమవంతుల వివాహం జరిగింది. హిమవంతుడు చక్కని విందు ఇచ్చాడు. ఆ విందుకు దేవతలు వచ్చారు. హిమవంతుడు తన ఆహ్వానాన్ని మన్నించి, వచ్చినవారిని చూచి సంతోషించాడు. పైగా తానేమి చేయాలో వారినే అడిగాడు. అపుడు వారు సతీదేవివృత్తాంతాన్ని విశదం చేశారు. 'మీవల్ల ఒక మేలు జరగవలసివుంది. అంచేత దుర్గానుగ్రహం పొందా'లని ఆదేశిస్తే హిమవంతుడు అలాగే చేశాడు. దుర్గమ్మ సాక్షాత్కరించగా 'అమ్మా సతీదేవి ఆత్మార్పణ చేసుకొంది. అ చేతకు మేమంతా దుఃఖితులమయ్యాము. అయినా అమ్మా 'మీరు భూలోకంలో మరో రూపంలో జన్మించి పరమేశ్వరుని చేబట్టవలె. ఇదే మా ప్రార్థన' అన్నారు. అపుడాతల్లి "దక్షుడు కూడా నన్ను పుత్రికగా కోరి ముందు తపస్సు చేస్తే నేను మేనకా హిమవంతులకు కుమార్తెగా జన్మిస్తాను. ఆపై శివుని మెప్పించి పెళ్ళాడతాను. అంతేకాదు మహాదేవుని సంకల్పం కూడా ఇదే" అంది.

అలాగే హిమవంతుడు తపస్సుచేశాడు. మేన దుర్గను ఆరాధించింది. వారి నిరీక్షణ ఫలించింది. మేన గర్భవతియై ముందు సముద్రునితో మైత్రిగల మైనాకుని కన్నది. మేనాహిమవంతులు శ్రద్ధతో భక్తితో సేవించగా ఆ తల్లి అనుగ్రహంతో వారికి 'పార్వతి'నామక పుత్రిక జన్మించింది. ఆ రోజు వసంత ఋతువు. చైత్రమాసం నవమితిథి 'మృగశిరా నక్షత్రం' అద్దమరేయి. ఆమె జననం చంద్రమండలం నుండి ఆకాశగంగలా అనిపించిందట. ఆ తరువాత వృత్తాంతాలు పార్వతిబాల్యలీలలు, శివహిమవంతుల సంవాదం, తారకాసురుని ఆగడాలు, బ్రహ్మ ఉపశమన వాక్యాలూ, ఇంద్రమన్మథసంవాదం, హిమవన్నగరంలో కామవికారాలు, మన్మథుని తులువతనం, కామదహనం, పార్వతి హతాశురాలయి తపస్సుచే శివుని మెప్పించాలను కోవడం, మహాదేవునితో సంవాదం, పార్వతి ఏకాగ్రతను శివుడు గుర్తించడం, ఆపై సప్తర్షులు హిమవంతునికి చేయగల కార్యం చెప్పడం, శివుని సమ్మతి, వైవాహికసంరంభం, కన్యాదానం, చివరకు శివుడు వివాహమయ్యాక కైలాసానికి కదలడం లాంటి సన్నివేశాలతో ఈ భాగం పూర్తవుతుంది.

పార్వతీఖండంలో 34వ అధ్యాయంలో వర్ణిత చరిత్ర అనరణ్యచరిత్ర. అనరణ్యుడు మంగళారణ్యంలో జన్మించినవాడు. పైగా శివభక్తుడు. భృగువు పౌరోహిత్యం సలపగా 100 యుగాలు చేశాడు. దేవతలు ఇంద్రపదవి ఇచ్చినా తిరస్కరించాడు. అతనికి నూరుగురు పుత్రులున్నా అతనికి కుమార్తె అంటే అమితాభిమానం. అతనికి ఐదుగురు భార్యలు. అతని కుమార్తె పద్మ.

ఒకసారి పిప్పలాదుడు తన తపోవనానికి వెళ్ళుతూ దారిలో ఒక గంధర్వుని చూశాడు. అతడప్పుడు శృంగారరస సముద్రంలో మునిగి తేలుతుంటే పిప్పలాదుడు చూచి తాను వివాహితుడు కాదలచుకొన్నాడు. దారిలో ఆ మునికి 'పద్మ' కనిపిస్తే ఆమె ఎవరని దగ్గరలోని జనులను అడిగాడు. వారు అసలుసంగతి చెప్పగా రాజులనేకులు ఆమెను పెళ్ళాడదలచారు అనడంతో మునిమొగం చిన్నబోయింది. అయినా పవిత్ర స్నానంచేసి రాజుదగ్గరకి వెళ్ళి కన్యను తనకు ఇమ్మని కోరాడు. రాజు దిగ్భ్రాంతిలో మునిగాడు. రాజపరివారం ముదుసలి అనరణ్యుని చూచి

రోదించారు. భార్యలు దిక్కులు చూడసాగారు. ఈలోగా పురోహితుని రాకతో రాజు అన్ని విషయాలు చెప్పాడు. అపుడా పురోహితుడు ఏనాటికయినా అమ్మాయిని ఒకరికి ఇవ్వకతప్పదు కదా! అంచేత పిప్పలాదునికిచ్చి పెళ్ళి చేయమన్నాడు. రాజు ఆలోచించి అలాగే చేశాడు. ముని పద్మతో కలిసి తన గృహానికి వెళ్ళాడు. ఆపై రాజు అడవికి తపస్సుకోసం అరణ్యగమనం చేశాడు. రాణి ఈ అనువుగాని పెళ్ళిచూసి ప్రాణాలు కోల్పోయింది. అనరణ్యుడు తపస్సుచేసి శివుని మెప్పించి శోకరహితలోకాన్ని చేరుకొన్నాడు. ఆపై రాజు పెద్దకుమారుడు కీర్తిమంతుడు రాజ్యాధికారం చేపట్టాడు. ఈ వృత్తాంతమంతా హిమవంతునికి నారదుడు చెప్పాడు. ఆ తరువాత కథ చెప్పమంటే నారదుడు...

పిప్పలాదునికి సంసారలంపటం నచ్చలేదు. అయిన పద్మ భక్తితో భర్తను సేవించేది. ఒకరోజు పద్మ ఆనందంతో గంగానదిలో తానమాడడానికి వెళుతూ రాజవేషధారి 'ధర్ముని' చూసింది. ధర్ముడు ఆమెతో మాటలు కలిపాడు. అంతేగాక రథందిగి ఆమె చేయిపట్టుకొన్నాడు. ఈ చేతతో పద్మ ఉలిక్కిపడింది.

రాజా! పాపాత్ముడవు, నీకిది తగదు, నాపతి పవిత్రజీవనుడు. నీవు రతిలంపటుడివి. స్త్రీలోలుడివి. పరమపాపివి. నీకు తల్లిలాంటి నేను నిన్ను శపిస్తున్నా. నీవు కాలక్రమంలో క్షయమవుతావు" అన్నది. అపుడు ఆ రాజు తాను ధర్ముడని పరిచయం చేసుకొన్నాడు. 'నీ మనస్సు తెలిసినా నీలోని లోపం తెలుసుకొందామని పరీక్షించాను' అన్నాడు. ఆపై శివుని స్మరించాడు. ఈ వైనమంతా అవలోకనం చేసుకొని పద్మ చాల బాధపడింది. నేను శపించడం తప్పే. నీవు యుగాలకు తగినట్లు వృద్ధిక్షయాలు పొందుతావన్నది. అపుడూ ధర్ముడు సంతోషించి ఆమెకు వరాలిచ్చాడు. వాటిలో ఒకటి పిప్పలాదుడు రూపవంతుడు, యువకుడు కావడం, రెండవది జీవనకాలంలో ఆనందంతో జీవించడం. మూడవది గుణవంతులు, చిరంజీవులయిన 10 మంది పుత్రులకు తల్లికావడం. నాలుగవది సర్వసంపదలతో వర్ధిల్లడం. ఇవన్నీ విన్నాక పద్మ ధర్మునికి నమస్కరించి, ప్రదక్షిణచేసి తన గృహానికి వెళ్ళిందన్నాడు. ఈ వృత్తాంతమంతా విశదం చేసి నారదుడు ఆపై శివునికి పార్వతిని కన్యాదానం చేయడం తగునన్నాడు.

ఏడు రోజులు గడిచాక శుభముహూర్తంలో లగ్నాధిపతియైన చంద్రుడు తనదైన కుమారుడు బుధునితో కలిసి లగ్నంలో ఉండి ఆనందంతో రోహిణితో కలిసివుండగా మార్గశీర్షమాసంలో ఏ దోషమును లేని సోమవారం శుభగ్రహాల శుభవీక్షణవేళ వివాహం జరపమని ఆజ్ఞాపించాడు. తదనంతరం శివపార్వతీకల్యాణం, కైలాసగమనం లాంటి సన్నివేశాల వర్ణనలతో పార్వతీఖండం సమాప్తమయింది.

**"సర్వం శివమయం జగత్"**

**డా॥ ఆకెళ్ల విభీషణశర్మ**
ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# పురాణపురుషుడు శ్రీమన్నారాయణుడు




బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ । వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥
ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ । మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥
భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః । బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥
లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ । స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥
కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేధః ప్రకీర్త్యతే । మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।

# శ్రీశివమహాపురాణము - ద్వితీయభాగ సారాంశము

**"శివైకో బ్రహ్మరూపత్వాన్నిష్కలః పరికీర్తితః"** అనే శివమహాపురాణ వాక్యానుసారం శివుడు ఒక్కడే పరబ్రహ్మస్వరూపుడు, కావున ఆయన నిరాకారుడని, లింగమే (చిహ్నమే) ఆయన అని చెప్పబడుతున్నాడు. శివునకు రూపంకూడా ఉండడం చేత ఆయన సాకారుడు కూడా, కనుక ఆయన మూర్తియందు కూడా ఆరాధింపబడుచున్నాడు. బ్రహ్మేంద్ర నారాయణాది తక్కిన వారెవరూ ఈ విధంగా సాకార (సగుణ), నిరాకారు (నిర్గుణ)లుగా ఆరాధింపబడడం లేదనునది అందరు ఎరిగినదే. కావున శివుడు సాకారుడు, నిరాకారుడు అగుటచేత పరబ్రహ్మ శబ్ద వాచ్యుడౌతున్నాడు. 'శివ' నామంతో ఇట్టి పూర్ణపరాత్పర బ్రహ్మ తత్త్వమే శివమహా పురాణమునందు వ్యాఖ్యానింపబడింది.

శ్రీశివమహాపురాణం సుమారు 24,000 శ్లోకాలతో ఏడు సంహితలతో వ్యాసభగవానునిచే వెలువరింపబడింది. అందులో మొదటి సంహిత 'విద్యేశ్వర సంహిత' రెండవది 'రుద్ర సంహిత', ఈ రుద్రసంహిత సృష్టిఖండం, సతీఖండం, పార్వతీఖండం, కుమారఖండం, యుద్ధఖండం అనే ఐదు ఖండాలుగా విభజింపబడింది. అట్టి రుద్రసంహితలోని ఐదు ఖండాలలో రెండవదైన 'సతీఖండం' మూడవదైన 'పార్వతీఖండం' ఆంధ్రానువాదంతో 'శివమహా పురాణం – ద్వితీయభాగం'గా పాఠకులకు అందింపబడుతోంది.

## సతీఖండము

శివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితలోని రెండవ ఖండం 'సతీఖండం'. ఇది 43 అధ్యాయాలతో సుమారు 2312 శ్లోకాలతో బ్రహ్మ నారద సంవాద రూపంలో వెలువరింపబడింది. "ఓ బ్రహ్మదేవా! నీవు నాకు అద్భుతములైన శుభకరములైన పార్వతీ పరమేశ్వరుల గాథలు అనేకం చెప్పియున్నావు. అయినా నాకు తృప్తి కలగడంలేదు. శివకథలను ఇంకా అనేకం వినాలని నాకు కుతూహలంగా ఉంది.

విష్ణువు మున్నగు సమస్త దేవతలచేత సేవింపబడే మహేశ్వరుడు ద్వంద్వాలకు అతీతుడు, నిర్వికారియై ఎల్లప్పుడూ క్రీడిస్తూ ఉండే మహాప్రభువు. తనగురించి తపస్సు చేసిన సర్వమంగళయైన పార్వతిని విష్ణువు ప్రార్థనను మన్నించి వివాహమాడి తిరిగి గృహస్థుడయ్యాడు. ఆమె ముందుగా దక్షుని కుమార్తెయైన సతీదేవి. తదనంతరం ఆమెయే హిమవంతుని కుమార్తెయైన పార్వతిగా జన్మించింది. ఒకే దేహంతో ఆమెయే ఇరువురకు కుమార్తెగా ఎలా ఉద్భవించింది? సతీదేవియే పార్వతీదేవిగా తిరిగి శివుని ఎలా పొందింది? ఓ బ్రహ్మదేవా! నీవు ఈ కథను, ఇతర కథలను పూర్తిగా వివరింపుమని నారదుని ప్రశ్నకు సమాధానంగా బ్రహ్మదేవుడు సతీదేవి సంక్షేప చరిత్రను వర్ణించడంతో మొదటి అధ్యాయం ముగిసింది.

బ్రహ్మదేవుడు నారదునితో శివదేవుని దివ్యత్వాన్ని గురించి చెప్పడం కొనసాగిస్తూ ఇలాపలికాడు. "సదాశివుని ఎడమ భాగంనుండి విష్ణువు పుట్టాడు. కుడిభాగము నుండి బ్రహ్మదేవుడు. రుద్రుడు హృదయం నుండి పుట్టాడు. బ్రహ్మ సృష్టి చేస్తాడు, విష్ణువు పాలిస్తాడు. రుద్రుడు లయంచేస్తాడు. సదాశివుడు ఈ త్రిమూర్తుల రూపంలో ఉంటాడు. బ్రహ్మ ఆ సదాశివుని ఆరాధించి దేవతలు, రాక్షసులు, మానవులు మున్నగు సంతతిని పుట్టించాడు. దక్షుడు మున్నగు మానసపుత్రులను సృష్టించిన తరువాత బ్రహ్మమనసు నుండి సుందరమైన రూపం, శ్రేష్ఠమైన

అవయవాలు గల ఒక యువతి పుట్టింది. ఆమెపేరు సంధ్య. ఆమె పగటికాలంలో క్షీణించి సాయంకాలం సుందరంగా ప్రకాశిస్తుంది. ఆమె చాలా అందగత్తె. మహర్షుల మనసులకు మోహం కలిగించేది. ఆమెను చూసి బ్రహ్మ తన కుమారుడైన దక్షుడు మున్నగు ప్రజాపతులను, మరీచి మున్నగు మహర్షులను స్మరిస్తూ ఉండగా బ్రహ్మనుండి ఒక మానస పుత్రుడు, అతిలోక సౌందర్యంతో జన్మించాడు. అతనిని శృంగార రసం సేవిస్తోందన్నట్లు ఉంటాడు. ఆ పురుషుణ్ణి చూసి దక్షుడు మొదలైన బ్రహ్మ కుమారులంతా విస్మయంతో ఉన్నారు. అంతట ఆ పురుషుడు బ్రహ్మకు నమస్కరించి తనపేరును, యోగ్యమైన స్థానాన్ని, మరియు భార్యను గురించి తెలియజేయండని అడిగాడు. అంతట బ్రహ్మ “ఈ సుందర రూపంతో ఉండి, అయిదు పుష్పబాణాలతో స్త్రీ పురుషులను మొహపెట్టి, వారి హృదయంలో రహస్యరూపంలో ఉండి సనాతనమైన సృష్టిని చేయు” మని ఆ పురుషుని ఆదేశించాడు. “నీవు పుట్టగానే మా హృదయాలను, బ్రహ్మ మనసును మథించావు. కాబట్టి నీవు లోకంలో మన్మథుడనియు, కాముడనియు, కందర్పుడనియు ప్రసిద్ధిని పొందుతావని” ఋషులు ఆ పురుషునకు చెప్పారు. దక్షుడు నిన్ను ప్రేమించే భార్యను స్వయంగా ఇస్తాడని కూడ తెలియజేశారు, అంతట మన్మథుడు హర్షణం, రోచనం, మోహనం, శోషణం మరియు మరణం అనే పేర్లుగల అయిదు పూలబాణాలను వీరందరి సమక్షంలో ప్రయోగిస్తాను. అంతేగాక ఇక్కడనే ఉన్న సంధ్యపై కూడ పరీక్ష కోసం ప్రయోగిస్తానని మన్మథుడు తలంచి, తనపూలబాణాలను ప్రయోగించి, బ్రహ్మను, బ్రహ్మమానస పుత్రులందరినీ మోహింపజేశాడు. వారికందరికి ఇంద్రియ వికారం పొందేలా చేశాడు. అదే సమయంలో సంధ్యపై కూడా ఆ బాణాల ప్రభావం పడింది. దానితో మన్మథుడు తనకు బ్రహ్మ అప్పగించిన పనిని పూర్తిచేయగలననే విశ్వాసం పొందాడు. అపుడు పాపభావంతో ఉన్న వారినందరినీ, తండ్రియైన బ్రహ్మనూ చూసి ధర్ముడు శంకరుని మనసులో స్మరిస్తూ స్తుతించాడు. ధర్మ రక్షణకోసం మహేశ్వరుడు అక్కడకుచేరి ఆకాశమందే ఉండి చిరునవ్వులు చిందించాడు. తన కుమార్తెయైన సంధ్యపై కామభావం పొందిన బ్రహ్మ సంధ్యను పట్టుకోవాలన్న కోరికతో ఉన్నప్పటికి శివుని భయంతో నిగ్రహించుకున్నాడు. ఆ సమయంలో బ్రహ్మ శరీరం నుంజి జారిపడిన చెమటనీటి నుండి అగ్నిష్వాత్తులనే 64వేలమంది పితృదేవతలు పుట్టారు. 86వేల సంఖ్యగల బర్హిషదులు పుట్టారు. అప్పుడు దక్షుని శరీరం నుండి నేలపైకి జారిన చెమట బిందువులనుండి, అపురూప సౌందర్యరాశియైన ‘రతి’ జన్మించింది. అంతట బ్రహ్మ కోపంతో “ఈ మన్మథుడు శివునియందు చేయడానికి వీలులేని కర్మ చేసినందువల్ల ఆయన నేత్రం నుండి పుట్టిన అగ్ని జ్వాలలో కాల్చివేయబడతాడు.” అని మన్మథుని శపించాడు. అంతట మన్మథుడు “తప్పుచేయని నాకు దారుణమైన శాపమిచ్చావు క్షమించమని” ప్రార్థించగా బ్రహ్మ మన్మథునితో ఇలా పలికాడు “శివ నేత్రాగ్ని జ్వాలలు నిన్ను భస్మంచేస్తాయి. తరువాత నీవు మరలా దేహాన్ని పొందుతావని” చెప్పి అంతర్ధానమయ్యాడు. ఈ విధంగా మన్మథుని జననం, కామశాపానుగ్రహం మున్నగు గాథలు 2, 3 అధ్యాయాలలో వర్ణింపబడ్డాయి. రతీ మన్మథుల వివాహ వర్ణనం 4వ అధ్యాయంలో వర్ణింపబడింది.

మన్మథుని శపించి బ్రహ్మ అంతర్ధానమైన తరువాత, అభిమానవతియైన సంధ్య “నన్ను చూసి నా తండ్రి, నా సోదరులు కామవికారం పొందటమేగాక, వారిని చూసిననాకు కూడా కామభావం కలగడం వల్ల నాకు మహాపాపం సంభవించింది. నా ఈ పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. అంతేగాక మానవులు పుట్టుకతోడనే కామవికారం పొందకుండా ఉండే ఒక మర్యాదను లోకంలో స్థాపించాలి” అని తలంచి చంద్రభాగా నదీతీరంలో

తపస్సు ప్రారంభించాలని సంధ్య నిర్ణయించుకొన్నది, వసిష్ఠుని ఉపదేశానుసారం సంధ్య గావించిన తపస్సు, సంధ్యాదేవియొక్క సంపూర్ణ చరిత్ర 5,6 అధ్యాయాలలో వర్ణింపబడింది. ఈ సందర్భంలో వసిష్ఠుడు "ఓం నమశ్శంకరాయ ఓం" అనే మహామంత్రోపదేశం, మౌనతపో విధానం సంధ్యకు ఉపదేశించిన మిషతో లోకాలకు ఉపదేశించడం సతీఖండంలోని ప్రత్యేకాంశంగా, విశేషాంశంగా పరిగణింపవచ్చు. శివైక్యం పొందాలనే భక్తులకు ఈ ఉపదేశం ఎంతో ఉపయుక్తమౌతుందని నిస్సంశయంగా చెప్పవచ్చు.

సంధ్య తన శరీరాన్ని మేధాతిథి యజ్ఞగుండంలో హుతం గావించడం, ఆమె తిరిగి అగ్నిహోత్రం నుండి అరుంధతిగా అవతరించి మేధాతిథి మహర్షికి కుమార్తె అగుట అరుంధతీ వసిష్ఠుల వివాహ వర్ణన 7వ అధ్యాయంలో మనకు కనబడుతుంది. ''సంసారమందు విముఖుడు, మహావిరాగియునైన శంభునకు మోహం కలిగించగలవాడెవడని" బ్రహ్మ ఆలోచించి శంభుని మోహింప చేసేపనిని మన్మథునకు అప్పగించాడు. అంతట మన్మథుడు "నేను శంభుని మోహింపజేస్తాను. కాని నా మహాస్త్రం స్త్రీమూలం కాబట్టి ముందుగా, అటువంటి స్త్రీని సృష్టించండి, నేను శంభుని ముందుగా మోహింపజేసిన తరువాత, ఆ స్త్రీయే మరలా శంభుని మోహింపజేయాలి. కావున ఈ విషయంలో చక్కని ఉపాయం ఆలోచించవలసిందని" బ్రహ్మతో పలికాడు. మన్మథుని మాటలను విని, ఉపాయం గురించి ఆలోచిస్తున్న బ్రహ్మయొక్క విశ్వాసం నుండి వసంతుడు అవతరించాడు. ఆ వసంతుని స్వరూప ప్రభావం 8వ అధ్యాయంలో వర్ణింపబడింది.

శివుని మోహింపజేయడం కొరకు కామదేవుడు చేసిన ప్రయత్నాలు, కాముని యొక్క ప్రభావం, తెలుసుకొనిన బ్రహ్మ తీవ్రమైన విచారంతో విడిచిన నిట్టూర్పుల నుండి మారగణాల ఉత్పత్తి వర్ణన 9వ అధ్యాయంలో కావింపబడింది. తదనంతరం శంకరుడు వివాహం చేసుకొనే ఉపాయం గురించి బ్రహ్మ ఆలోచిస్తూ, విష్ణువును స్మరించాడు. విష్ణువు వెంటనే బ్రహ్మ ఎదుట ప్రత్యమయ్యాడు. వారిరువురి మధ్య జరిగిన సంభాషణ 10వ అధ్యాయంలో వర్ణింపబడింది. ఈ సందర్భంలో విష్ణువు బ్రహ్మకు తెలియజేసిన అంశాలు శివతత్త్వాన్ని, దేవీతత్త్వాన్నీ స్పష్టంచేస్తున్నాయి.

"మాయను తనవశంలో ఉంచుకొనే శంభుని కంటె మాయ, వేరుగాలేదు. ఆయనను శరణు వేడుకొనిన వారు సకల అభీష్టాలను పొందగలరు, అంతేగాక త్రిమూర్తులు మహాదేవుని కుమారులు అందులో రుద్రుడు పూర్ణాంశగలవాడు, ఉమాదేవికి కూడా మూడు రూపాలు కలుగుతాయి. లక్ష్మి అనే పేరుతో విష్ణువును, సరస్వతి అనే పేరుతో బ్రహ్మకు, సతి అనే పేరుతో రుద్రునకు భార్యకాగలదు. కాగలదు, ఉమను ఉద్దేశించి శివుని స్మరిస్తూ గొప్పతపస్సు చేసినచో ఆ దేవదేవి ప్రసన్నురాలు కాగలదు" బ్రహ్మకు విష్ణువు చేసిన ఉపదేశ సారమిది. విష్ణువు చేసిన ఉపదేశాన్ని అనుసరించి, బ్రహ్మవిద్యాస్వరూపిణీ, అవిద్యా స్వరూపిణీ అయిన దుర్గాదేవిని స్తుతించగా వెంటనే చండిక బ్రహ్మకు ప్రత్యక్షమయ్యింది. ఆ కాళీదేవి ప్రీతితో తల్లి పిల్లవానిని భావించినట్లు భావించి అందరికీ అర్థమయ్యే సరళమైన భాషతో ఇలా పలికింది. "ఓ బ్రహ్మ! నేను తప్ప మరొకరు శంకరుని మోహింపచేయలేరు. శివుడు తనంత తానుగానే మోహమును పొందినవాడై వివాహమాడేటట్లుగా ప్రయత్నిస్తాను. నేను సతీదేవి రూపం ధరించి, నా లీలతో శంకరుని సంతోషపెడతాను." ఈ విధంగా ఉమాదేవి బ్రహ్మకు ఇచ్చిన వరప్రదాన వర్ణన 11వ అధ్యాయంలో వర్ణింపబడింది.

"దృఢంగా వ్రతనియమాలు పాటించే దక్షుడు తపస్సు చేసి దేవినుండి దక్షుని కుమార్తెగా, సతీదేవిగా జన్మిస్తాననే వరం, దక్షుడు పొందిన విధం 12వ అధ్యాయంలో వర్ణింపబడింది, ఈ సందర్భంలో "ఏనాడైతే నీవు నాయందు ఆదరం కోల్పోతావో ఆనాడు నేను నా దేహాన్ని విడిచి పెడతాను. వేరొక దేహాన్ని ధరిస్తాను. ఇది సత్యం నేను నా మాటమీద ఉంటాను" అనే షరతు విధించిన విషయం కూడ మనం గమనించవలసి ఉంది. "స్థిరంగా ఒకచోటులో లేని వాడవై, లోకాలన్నీ తిరుగుతూ ఉందువుగాక" అని సాధువులకు కూడా పూజ్యుడైన నారదుని దక్షుడు శపించిన వృత్తాంతం 13వ అధ్యాయంలో వర్ణింపబడింది. దక్షుడు తన భార్యయందు అరవైమంది సుందరీమణులను కుమార్తెలుగా పొందడం, ధర్ముడు మున్నగువారితో వారి వివాహం జరపడం, సతీదేవి జననం, బాల్యలీలలు 14వ అధ్యాయంలో వర్ణింపబడ్డాయి. దక్ష ప్రజాపతికి సతీదేవి పెద్దకుమార్తె అని కొందరు, మధ్య కుమార్తె అని కొందరు, కనిష్ఠ కుమార్తె అని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. కల్పభేదం వల్ల ఈ మూడు అభిప్రాయాలు సత్యమే. కాని కుమారులు పుట్టిన తరువాత దక్షప్రజాపతికి సతీదేవి జన్మించిందనే సత్యం కూడ ఈ సందర్భంలో (14వ అధ్యాయంలో) తెలియజేయబడింది. ఇది సతీదేవి జననం విషయంలో అందరికీ సరియైన సమాధానమని చెప్పవచ్చు.

సతీదేవి, మహేశ్వరుని భర్తగా పొందడంకోసం, తల్లి అనుమతిని పొంది, శివుని ఆరాధించిన నందావ్రత విధాన వర్ణనం ఈ సతీఖండంలోని 15వ అధ్యాయంలో కనబడుతోంది. ఈ నందావ్రతంలో ప్రతిమాసంలోను ఏయే తిథులనాడు ఏయే నైవేద్యాలతో, ఏ విధంగా శివార్చన చేయాలో విస్తారంగా వర్ణింపబడింది. అంతేగాక విష్ణువు మున్నగు సమస్త దేవతలు, మహర్షులు సతీదేవి తపస్సును, నందావ్రతాచరణను చూడడానికి వచ్చి, మూర్తీభవించిన తపస్సిద్ధివలె అన్న సతీదేవిని దర్శించారు. అనంతరం కైలాసపర్వతానికి వెళ్ళి, దేవతలందరు గావించిన శివస్తుతి కూడ ఈ అధ్యాయంలో వర్ణింపబడింది. ఈ శివస్తుతి పరబ్రహ్మతత్త్వాన్ని, శివుడే పరబ్రహ్మయనే ప్రతిపాదనను స్పష్టంగా వ్యక్తీకరిస్తోంది.

విష్ణ్వాది దేవతలు చేసిన స్తుతిని విని శంకరుడు మిక్కిలి ప్రసన్నుడై చిరునవ్వుతో బ్రహ్మ, విష్ణువుల రాకకు కల కారణాన్ని గూర్చి ప్రశ్నించాడు. అంతట బ్రహ్మ "ఓ దేవదేవా! త్రిమూర్తులమైన మనం ముగ్గురము సృష్టిచక్రాన్ని నడిపించే ప్రయోజనం కోసం ఒకరికొకరు సహాయకులం పరస్పర సహాయోగం పొందడం శ్రేష్ఠం. లేనిచో జగత్తునకు మనుగడ ఉండదు. మీరు సర్వదా జగత్తునకు స్వస్థతను, అభయాన్ని ప్రదానం చేస్తున్నారు. మీరిప్పుడు రాగద్వేషవర్జితులై సదా యోగయుక్తుడవై రాక్షస సంహారం చేయడంలేదు. మీరు ఈ విధంగా ఉంటే సృష్టి స్థితులెట్లు కొనసాగుతాయి? మనం ముగ్గురము భగవానుడైన సదాశివునకు, శివాదేవికి పుత్రులము. మా ఇరువురివలెనే మీరు కూడ శోభనాంగియైన స్త్రీని భార్యగా స్వీకరింపుము. అంతేగాక పూర్వకాలంలో సదాశివుని రూపంలో ఉండగా "నేను సగుణ రుద్రరూపుడనై, నేనొక స్త్రీని వివాహమాడి ఉత్తమమమైన లోక కార్యాన్ని నిర్వహిస్తానని మీరు ప్రతిజ్ఞచేసి ఉన్నారు. పూర్వం మీరు చేసిన ప్రతిజ్ఞను పూర్తిచేయుము" అని రుద్రునితో పలికాడు.

బ్రహ్మ విజ్ఞాపను వినిన ఈశ్వరుడు ఇలా జవాబిచ్చాడు "మీరు చెప్పిన మాట చాల యోగ్యమైనది. కాని నాకు వివాహం ఉచితంకాదు. నేను తపోనిష్ఠుడను, విరాగిని, సదా యోగమార్గమునందుండే వాడిని, నివృత్తి

మార్గంలోని వాడను, కామ వర్జితుడను. ఆత్మావలోకనపరుడను. సర్వదా అమంగళకరమైన, అశుభ్రమైన వేషం ధరించే వాడను, యోగలగ్నుడను అయినందున మాత్రమే నాకు నిత్యానందం కలుగుతుంది. నాకు వివాహంపై అభిరుచిలేదు. అయినప్పటికి లోకకల్యాణం కొరకు మీరు చెప్పిన విధంగా చేస్తాను. నేను లోగడ మీకిచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి తప్పనిసరిగా వివాహం చేసుకుంటాను. కాని నేను ఎటువంటి కన్యను, ఏయే షరతులపై వివాహమాడతానో చెబుతాన్నాను. జాగ్రత్తగా వినండి. ఏ స్త్రీ నా తేజస్సును వివేకంతో ధరింప సమర్థురాలగునో అట్టి యోగశక్తికలట్టియు, కామరూపధారణ చేయగలట్టియు, స్త్రీని భార్యగా స్వీకరించడానికి నాకు చూపించండి. అంతేగాక నేను యోగాసక్తుడనైతే ఆమెకూడా, యోగాసక్తురాలు కావాలి. నేను కామాసక్తుడనైతే, ఆమెకూడా కామాసక్తురాలు కావాలి. పరబ్రహ్మమైన సదాశివుని ధ్యానింపని సమయంలో మాత్రమే నేను ఆమెతో విహరిస్తాను. నాయీ ధ్యానానికి, విఘ్నం కలిగిస్తే ఆమె నశింపజేయబడుతుంది. కావున కర్మలలో సదా నన్ను అనుసరించి ఉండగలిగే భార్యను నాకు చూపుము. అంతేకాదు. ఆమె నా మాటయందు విశ్వాసం కోల్పోయిననాడు నేను ఆమెను పరిత్యజిస్తాను. త్రిమూర్తులమైన మనం పరబ్రహ్మ స్వరూపుడైన సదాశివుని అంశభూతులం, కావున మనం సదా, సదాశివునియందే చింతకలిగియుండడం తగినది."

శివుని ఈ మాటలను విని, విష్ణువు, బ్రహ్మ మిక్కిలి ఆనందించిన మనస్సులుగలవారై శివునకు ఇలా విన్నవించారు. "ఓ ప్రభూ! ఉమాదేవి పూర్వం లోక కార్యసిద్ధికై లక్ష్మి సరస్వతి అనే రెండు రూపాలను ధరించింది. అప్పుడామె మూడవ రూపాన్ని ధరించలేదు. కాని ఆమె ఇప్పుడు లోకహితం కొరకు 'సతి' అనే పేరుతో దక్షుని కుమార్తెగా జన్మించింది. నీవు కోరిన లక్షణాలు ఆమెయందు ఉన్నాయి. ఆమె నీ కొరకు తపస్సు చేస్తోంది. ఓ పరమేశ్వరా! ఆమె కోరిన వరాన్ని ఇచ్చి ప్రీతితో ఆమెను వివాహమాడుము. ఇది మా అందరి అభీష్టం. కృపా దృష్టితో మా కోరికను పూర్తి చేయుము. ఇది గొప్ప మంగళమై ముల్లోకాలకు సుఖాన్ని కలిగించగలదు. ఆమెను వివాహమాడి ముల్లోకాలను సనాథులను చేయుము" అని పలికి మిన్నకున్నారు. భక్తవత్సలుడైన శివప్రభువు చిరునవ్వు నవ్వి వారి ప్రార్థనకు అంగీకారాన్ని తెలియజేశాడు (16వ అధ్యాయంలో).

నందావ్రతం పూర్తియైన తరువాత ఆశ్వయుజ శుద్ధ నవమినాడు సతీదేవి ధ్యాననిమగ్నురాలైయుండగా శివుడు సతికి ప్రత్యక్షమౌట, 'నా భార్యవు కమ్మని' సతీదేవికి శివుడు వరంప్రసాదించుట, తల్లిదండ్రుల అనుమతితో విధిపూర్వకంగా వివాహం చేసుకొని నన్ను స్వీకరించండి' అని సతీదేవి శివుని ప్రార్థించుట, శివుడు 'అట్లే' అని తన హిమవత్పర్వత మైదానంలోని తన ఆశ్రంలో ప్రవేశించుట, సతీదేవి తల్లి చెంతకు వెళ్ళుట శివుడు బ్రహ్మ దంపతులకు దక్షుని చెంతకు సతీశివుల వివాహం చేయమని కోరడానికి పంపుట, దానికి దక్షుడు అంగీకరించుట 17వ అధ్యాయంలో వర్ణింపబడ్డాయి.

తక్షుడు సతీదేవిని శివునకు కన్యాదానం చేయుట, వివాహ మహోత్సవం నిర్వహించుట, ఆ సమయంలో సతీదేవి శివమాయా ప్రభావం వల్ల బ్రహ్మ మన్మథావిష్ట హృదయుడై శరీర సౌందర్యాన్ని, మేలిముసుగులోని ఆమె ముఖ సౌందర్యాన్ని చూచుట. ఇంద్రియ వికారం పొందుట అతని రేతస్సు భూపతనమగుట. దివ్య దృష్టితో రుద్రుడు దానిని తెలుసుకొని, ఉగ్రుడై బ్రహ్మను సంహరించడానికి ఉద్యుక్తుడగుట, విష్ణువు సృష్టికర్తను సంహరిస్తే

సృష్టిచేసే వాధుదుండడని, నిన్ను నీవు సంహరించుకోకూడదని, మనమంతా ఏకరూపమే భిన్నరూపులం కాదనే తత్త్వాన్ని, సర్వస్వం మీరేననియు పలికి మహాదేవుని సంతసింపజేసి బ్రహ్మను సంహరింపకుండా విడిచిపెట్టుట మున్నగు కథలు 18, 19వ అధ్యాయాలలో వర్ణింపబడ్డాయి. ఈ సందర్భంగా నిర్గుణ పరబ్రహ్మమైన సదాశివుడే, బ్రహ్మ, విష్ణు, రుద్రులైన సగుణ రూపమని వివరణాత్మకంగా తెలియజేయబడింది.

బ్రహ్మ 'రుద్రశిరస్కుడు' అనే నామంతో ప్రఖ్యాతుడైన విధం, బ్రహ్మనుండి స్ఖలమైన రేతస్సునుండి సంవర్తకం, ఆవర్తం, పుష్కరం, ద్రోణం అనే లయకారులైన నాలుగు మహా మేఘాలు ఆకాశంలో సంచరించడం, శివుడు సతీదేవితోను, ప్రమథగణాలతోను కైలాసానికి వెళ్ళడం, మున్నగు గాథలు 20వ అధ్యాయంలో వర్ణింపబడ్డాయి. శుభకరమైన ఈ కథను ప్రేమతోవిని, వివాహంచేసుకొనే స్త్రీలు సుఖసౌభాగ్యాలు, సౌశీల్యం, సదాచార పరాయణత్వం మొదలైన సద్గుణాలతో సుసంపన్నులై సాధ్వీమణులై, పుత్రవంతులై వెలుగందుతారనే ఫలశ్రుతికూడా ఇందులో చెప్పబడింది. అంతేగాక సతీశంకరుల వివాహ మహోత్సవ గాథ సమస్త మోహాలను తొలగించి, పరమజ్ఞాన సంపన్నులను చేస్తుందని కూడ తెలియజేయబడింది.

సతీశంకరుల వివాహానంతర గాథను వివరించవలసినదిగా నారదుడు బ్రహ్మదేవునికోరగా "శంకరుడు హిమవత్పర్వత ప్రాంతంలోని నికుంజములందు, నదీ తీరములందు సతీదేవితో ఇరవైయైదు దివ్య సంవత్సరాలు యథేచ్ఛగా విహరించి, ఆనందించాడని (21వ అధ్యాయం) బ్రహ్మ వివరించాడు అంతేగాక ప్రకృతి రామణీయకతతో విలసిల్లే కైలాస శిఖరంపై సతీశంకరులు పదివేల దివ్య సంవత్సరాలు విహరించిన విధం కూడ (22వ అధ్యాయం) నారదునకు బ్రహ్మవివరించాడు. సతీదేవి శంకరునితో విస్తృత విహారాలుచేసి అత్యంత సంతుష్టురాలైన తరువాత ఆమె విరాగురాలయ్యింది. నివృత్తి భావంతో ఉన్న సతీదేవి ఒకానొక రోజున ఏకాంతంలో ఉన్న శంకరుని ఇలా ప్రార్థించింది. "నిరతిశయానందాన్ని ప్రసాదించే పరతత్త్వజ్ఞానాన్ని పొందాలని నాకు కోరికగా ఉన్నది. జీవుడు సంసార దుఃఖం నుండి అనాయాసంగా ఉద్ధరింపబడే మార్గాన్ని తెలియజేయండి" అని ప్రార్థించింది. సతీదేవి ప్రార్థనను మన్నించి వాసనలలో చిక్కుకుపోయిన జీవుడు అప్పటికప్పుడు ముక్తుడుకాగల పరమతత్త్వాన్ని శంకరుడు సతీదేవికి బోధించాడు. అంతేగాక శంకరుడు భక్తవశంకరుడని తనకు తానుగా ప్రకటించుకొని సోదాహరంగా నిరూపించుకొనిన విధం కూడ ఈ సందర్భంగా వర్ణింపబడింది (23వ అధ్యాయం).

సతీశివులు శబ్దార్థములవలె ఒకరికొకరు నిత్య సంయుక్తులు ఇరువురు ఎల్లపుడు కలిసే ఉంటారు. వారిరువురిలో వియోగం కలగడం అసంభవం, ఒకవేళ సంభవిస్తే అది వారి ఇచ్ఛానుసారమే. అది లీలావియోగమే అని 24, 25 అధ్యాయాలలో నిరూపింపబడింది. ఇందులో భాగంగానే సతీదేవి చేసిన శ్రీరామ పరీక్షా వర్ణన కూడా చోటుచేసుకున్నది. ఈ వర్ణన శివపురాణమునందు మాత్రమే కనబడే ప్రత్యేకాంశం విశేషాంశం. పరమాత్ముడైన శంభునితో దుష్టంగా ప్రవర్తించి, శపించి శివునితో దక్షుడు విరోధాన్ని పొందిన విధం 26వ అధ్యాయంలో వర్ణింపబడింది. శివుని శపించినందులకు క్రోధావిష్టుడై నంది దక్షుని శపించినతీరు కూడ ఈ అధ్యాయంలోనే వర్ణింపబడింది. అనంతరం 'కనఖల' మహాతీర్థంలో దక్షయజ్ఞం ప్రారంభింపబడడం, అందులో శంకర ప్రభువు కనబడకపోవడంతో దధీచ మహర్షి సతీసహితుడైన రుద్రునిరావించి ఈ యజ్ఞాన్ని పరిపూర్ణం చేయమని చెప్పడం,

దానికి దక్షుడు తిరస్కరించడం, దానితో దధీచి 'శివుడులేని ఈ యజ్ఞం అయజ్ఞంగా మారిందనీ, దక్షునకు విశేషమైన వినాశనం కూడా సంభవిస్తుందనీ శపించి యజ్ఞవాటికను బహిష్కరించాడు (27వ అధ్యాయం), దక్షయజ్ఞం గూర్చి తెలుసుకొనిన సతీదేవి మనమిరువురం ఆ యజ్ఞానికి ప్రయాణమౌదామని పరమేశ్వరుని అడగడం, అహ్వానంలేకుండా వెళ్ళడం దుఃఖకరమని శివుడు చెప్పడం, దక్షుడు మనలను ఆహ్వానించకపోవడానికి కల కారణాలన్నిటినీ తెలుసుకోవడానికి తాను వెళతానని శివునకు తేలియజేయడం, నందిని అధిరోహించి, అరవైవేల రుద్రగణాలు వెంటరాగా సతీదేవి దక్షయజ్ఞానికి ప్రయాణమైన సతీయాత్రా వర్ణనం 28వ అధ్యాయంలో వర్ణింపబడింది.

దక్షునియజ్ఞం మహావైభవంగా సాగుతూ ఉండగా సతీదేవి యజ్ఞవాటికలో ప్రవేశించడం, తల్లి, సోదరీమణులు తప్ప తక్కినవారు ఆదరించకపోవడం, శంభునకు హవిర్భాగాన్ని ఈయకపోవడాన్ని చూచి సతీదేవి పట్టరాని కోపంతో దక్షుని ప్రశ్నించడం, విష్ణువునకు బ్రహ్మకు ఇంద్రునకు సమస్తదేవతలు రుద్రుడు ఇంతకుపూర్వం చేసిన సహాయాలనన్నిటినీ గుర్తుచేసి, అట్టి శంకరుడులేని యజ్ఞానికి వచ్చి మూర్ఖులయ్యారని నిందించడం, దక్షుడు "నీవిక్కడకు ఎదులకు వచ్చావు? ఉంటావా వెళ్తావా? అని ప్రశ్నించి శివనింద చేయడం, సతీదేవి 'శివనింద' తగదని ధర్మనీతిని బోధించడం, శివనిందా పరుడైన దక్షుని శరీరంనుండి పుట్టిన నాయీ శరీరం 'శవం' వంటిది కావున ఈ దేహాన్ని వీడి, సుఖాన్ని పొందుతానని నిశ్చయించుకోవడం (29వ అధ్యాయం), సతీదేవి యోగమార్గాన్ని అనుసరించి దేహమునందు వాయువును, అగ్నిని ధరించడం, శంభుని పాదధ్యానం చేస్తున్న సతీదేవి శరీరాన్ని అగ్నిచే భస్మం గావింపబడడం, శివగణాలు మహాకారాలు చేస్తూ ప్రళయాన్ని సృష్టించడం, ఋభువులు (భృగువు హోమం చేయడంవల్ల ఆ అగ్నినుండి పుట్టిన మహావీరులు) శివగణాలను తరిమివేయడం, ఇట్లు దక్షుని యజ్ఞంలో విఘ్నం కలిగిన తీరూ (30వ అధ్యాయం) వర్ణింపబడ్డాయి. యజ్ఞానికి విఘ్నం కలిగిన సందర్భంలో నభోవాణీ వర్ణనం 31వ అధ్యాయంలో కనబడుతుంది. ఇందులో సర్వమంగళ స్వరూపులైన సతీశివులను అర్చించకపోవడం వల్ల దక్షుడు, దక్షయజ్ఞం వినాశనాన్ని పొందుతాయని, పూజింపదగిన వారిని పూజింపనిచో నిశ్చయంగా అమంగళం కలుగుతుందనియు దక్షునికి సహాయం చేసిన వారుకూడా మాడిమసి అవుతారనియు ఆకాశవాణి శపించింది. హరి బ్రహ్మాదులను అందరిని దక్షుని యజ్ఞశాలనుండి వెళ్ళిపోవలసినదిగా హెచ్చరించడం జరిగింది.

ఆకాశవాణిని వినిన తరువాత దేవతలు, ఇతరులు ఆశ్చర్యచకితులై, ఏమి చేయాలో తెలియక విమూఢులయ్యారు. భృగువు యొక్క మంత్రబలంవల్ల కొందరు శివగణాలు సంహరింపబడ్డారు. మిగిలిన శివగణాలు పారిపోయి, శివుని వద్దకు చేరి జరిగిన వృత్తాంతమునంతటిని వివరించారు. (ఆ మూర్ఖుల విషయంలో మీరేమి చేయాలనుకుంటారో అదే చేయండని శివునకు నివేదించారు) వారు చెప్పిన వృత్తాంతాన్ని విని క్రోధోద్రిక్తుడైన శివుడు తనజటనొకదానిని ఊడబెరికి పర్వతం పై విసిరికొట్టడంతో అందుండి ప్రళయాగ్నివంటి వీరభద్రుడు, మహాకాళి ఉద్భవించారు. వారిని దక్షయజ్ఞం విధ్వంసంగావించమని అక్కడున్న బ్రహ్మాదులనందరిని కూడ భస్మంగావించవలసిందని శివుడు ఆజ్ఞాపించాడు (32వ అధ్యాయంలో). శివుని శాసనాన్ని శిరసావహించి, వీరభద్రుడు యజ్ఞస్థానానికి, కోట్లాది శివగణాలతో బయలుదేరిన వీరభద్రయాత్రావర్ణన (33వ అధ్యాయంలో) వెలువరింపబడింది. వీరభద్రుడు ఈ విధంగా వివిధగణాలతో కూడ దక్షయజ్ఞానికి పయనిస్తూ ఉండగా, అక్కడ

దక్షునకు, యజ్ఞవాటికలో ఉన్న ఇతరులకు అనేక దుశ్శకునాలు కనిపించాయి. రక్తవర్షం కురిసింది, దిక్కులన్నీ చీకట్లతో నిండిపోయాయి. ఈ రీతిగా సంభవించిన అరిష్టాలను చూచి విష్ణువు మున్నగు వారందరు భయమూర్ఛితులయ్యారు. ఆ సమయంలో ఆకాశవాణి శంకరుని నుండి మహాదుఃఖం సంప్రాప్తం కాగలదని దక్షునికి తెలిపింది, తక్కిన దేవతలకు కూడ నిస్సంశయంగా మహా దుఃఖం కలుగబోతోందని హెచ్చరించింది. ఆ పలుకులను విని భయకంపితుడైన దక్షుడు శ్రీమహావిష్ణువును శరణు పొందాడు (34వ అధ్యాయంలో). నన్ను నా యజ్ఞాన్ని నీవే రక్షించాలని విష్ణువును ప్రార్థించాడు. అంతట విష్ణువు శివుని స్మరించి దక్షునితో ఇలా పలికాడు. "ఈశ్వరావజ్ఞ (అవమానం)వల్ల సర్వ కార్యములు, సర్వవిధములా విఫలమౌతాయి. అడుగడుగునా ఆపదలు ఎదురౌతాయి. ఎక్కడ పూజింపదగనివారు పూజింపబడతారో, ఎక్కడ పూజింపదగినవారు పూజింపబడరో అక్కడ నిశ్చయంగా దారిద్ర్యం, మరణం భయం ఈ మూడూ సంభవిస్తాయి. దీనివలన కలిగే ఆపదను నివారించడం సాధ్యంకాదని" విష్ణువు దక్షునితో పలికాడు. దానితో దక్షుడు నేలపై కూలబడ్డాడు.

ఇంతలో సైన్య సమేతుడైన వీరభద్రుడు యజ్ఞవాటికను సమీపించాడు. ఆ సైన్య సంరంభాన్ని చూచిన దక్షుడు రక్తాన్ని క్రక్కాడు. విష్ణువు ఎదుట నిలబడి యజ్ఞాన్ని రక్షించమని దక్షుడు ప్రార్థించాడు. అతని ప్రార్థనను విని వీర భద్రుని నివారింపగల శక్తి తనకు లేదనియు, తన సుదర్శనచక్రం శైవచక్రమనియు, అది శివభక్తులుకానివారిని సంహరిస్తుంది. లోకంలో శివద్రోహికి శరణమిచ్చే వాడుంరని విష్ణువు వివరించాడు (35వ అధ్యాయం). విష్ణువును పరిహసించి ఇంద్రాది దేవతలందరు శివగణాలతో యుద్ధం చేయగా భృగువు మంత్రబలంతో రుద్ర గణాలను తరిమికొట్టాడు. తన బలాలు పరాజితులవ్వడం చూచిన వీరభద్రుడు భూతప్రేత విశాచాది గణాలను వెంటబెట్టుకొని దేవగణాలను నాశనం చేయడం ప్రారంభించాడు. శైవ, దేవగణాల మధ్య భయంకరమైన యుద్ధం జరిగింది. సుదర్శన చక్రం వీరభద్రునిచే స్తంభింపజేయబడింది. విష్ణువు కదలికలేని వాడయ్యాడు. బ్రహ్మ వీరభద్రుని పరాక్రమం సహింపరానిదని హితం పలుకగా విష్ణువు అంతర్ధానమయ్యాడు. బ్రహ్మ తనలోకానికి వెళ్ళాడు. దేవగణాలు పారిపోయారు. అక్కడ మిగిలిన మునులను  శివగణాలు జయించారు. వీరభద్రుడు మృగరూపంలో పారిపోతూ యజ్ఞపురుషుని తలనరికాడు, దక్షుని శీరస్సును వీరభద్రుడు అగ్ని కుండమునందు పారవైచాడు. ఇట్లు వీరభద్రునిచే గావింపబడిన దక్షయజ్ఞ విధ్వంసం, వీరభద్ర విజయం 36, 37 అధ్యాయాలలో వర్ణింపబడింది.

'శివుడు లేని దక్షయజ్ఞానికి వెళ్ళి పరాభవం పొందడానికి కారణమేమి' అని నారదుడు బ్రహ్మను ప్రశ్నించగా 'పూర్వం దధీచ మహర్షి శాప ప్రభావంచే జ్ఞాన భ్రష్టుడైన విష్ణువు దక్షయజ్ఞానికి వెళ్లవలసి వచ్చిందనియు, విష్ణువు 'క్షువునకు' సహాయం చేయబోయి దధీచుని శాపాన్ని పొందాడని తెలిపిన శాపవృత్తాంత వర్ణన, విష్ణు దధీచియుద్ధ వర్ణన 38,39 అధ్యాయాలలో వర్ణింపబడింది. ఇందులో భాగంగా శుక్రాచార్యునిచే దధీచి మహర్షికి ఉపదేశింపబడిన "మహామృత్యుంజయ మంత్రం" మంత్రార్థం, ధ్యానం జపవిధానం, సంపూర్ణంగా వివరింపబడడం మఖ్యాతిముఖ్యమైన విశేషాంశంగా  పరిగణింపవచ్చును.

వీరభద్రుడు దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసిన పిమ్మట దుఃఖాక్రాంతులైన దేవతలకు సుఖం కలగడానికి, దక్షుడు తిరిగి బ్రతికి యజ్ఞాన్ని పూర్తిచేయగల ఉపాయం గురించి ఆలోచించిన బ్రహ్మ, విష్ణువు, దేవతలు, సిద్ధులు,

గణాధీశులు, మహర్షులు కైలాసానికి వెళ్ళి శివదర్శనం చేసుకొనిన విధం 40వ అధ్యాయంలోను, విష్ణువుమున్నగు దేవతలందరు చేతులొగ్గి, భూమిపై దండంవలే పడి, నమస్కరించి, స్తుతించి, శివునకు క్షమాపణలు చెప్పినవిధం 41వ అధ్యాయంలో వర్ణింపబడింది. విష్ణువు మున్నగు దేవతలందరి ప్రార్థనలను వినిన పరమేశ్వరుడు ప్రసన్నుడై దక్షుని మొండెమునకు యజ్ఞపశువు యొక్క శిరస్సుతో సంధానంచేసి బ్రతికించాడు. తక్కిన యజ్ఞ కార్యాలను చక్కబెట్టడానికి తగు వ్యవస్థను ఏర్పాటు చేశాడు. దానితో దక్షుడు, బ్రహ్మ, విష్ణువు దేవతలందరు ప్రసన్నమనస్కులై శంకరుని పరాభక్తితో స్తుతించారు (42వ అధ్యాయం).

మహాదేవుడు దక్షునకు చేసిన తత్త్వోపదేశం, దక్షయజ్ఞాంను సంధాన వర్ణనతో (43వ అధ్యాయం) సతీఖండం సమాప్తమయ్యింది.

## విశేషాంశాలు

రామపరీక్షా వర్ణనం, నందా వ్రతవిధానం, మౌనతపోవిధానం, శివాష్టాక్షరీ మహామంత్రోపదేశం, మహామృత్యుంజయ మంత్రోపదేశం మున్నగునవి సతీఖండంలో వర్ణింపబడిన ముఖ్యమైన ప్రత్యేకాంశాలలో కొన్ని మాత్రమే.

## రామపరీక్ష

ఒకానొక సమయంలో లీలావిశారదుడైన రుద్రుడు సతీదేవితో ముల్లోకాలలో పర్యటిస్తూ భూలోకం చేరుకున్నాడు. శంకరుడు సతీదేవినకి భూతలం యొక్క శోభనంతటినీ చూపుతూ దండకారణ్యానికి చేరారు. అక్కడ రావణునిచే అపహరింపబడిన సీతా దేవిని వెదుకుచున్నట్టియు రామలక్ష్మణులను శంకరుడు చూశాడు. వెంటనే శంకరుడు మిగుల ప్రసన్నతతో రామునికి నమస్కరించాడు. జయజయ ధ్వానాలను చేస్తూ, శంకరుడు వేరొక దిశగా వెళ్ళాడు. అంతేగాని భక్తవత్సలుడైన శంకరుడు రామునకు తన దర్శనమీయలేదు.

సతీదేవి శివుడు చేసిన పనిని చూచి మిక్కిలి ఆశ్చర్యాన్ని పొందింది. “హరి బ్రహ్మాది దేవతలందరూ నిన్ను సర్వదా సేవిస్తూ ఉంటారు కదా! అటువంటి మీరిప్పుడు ఏకారణంచే నీలమేఘ శ్యాముడైన ఈ పురుషుని చూచి ఆనందభరితులౌతున్నారు. సేవ్యుడైన వానికి సేవకునివలె మీరెందుకీతనికి నమస్కరించారు? నాయీ సంశయాన్ని తీర్చవలెనని” సతీదేవి శంకరుని ప్రశ్నించింది. సతీదేవి మాటలను విని, ఆమెకు శంకరుడు ఇలా జవాబిచ్చాడు. “వీరిలో గౌరవర్ణం కలవాడు చిన్నవాడు. సాక్షాత్తు శేషుని అంశం, అతని పేరు లక్ష్మణుడు, పెద్దవానిపేరు రాముడు. భగవంతుడైన శ్రీమహావిష్ణువే పరిపూర్ణాంశతో ఇలా అవతరించాడు. వీరిరువురూ సాధుపురుషులను సంరక్షించడానికి, మనకు శుభాలను సమకూర్చడానికి, భూలోకంలో అవతరించారు” అని శంకరుడు సతీదేవితో పలికాడు. కాని శివుడు పలికిన ఈ మాటలందు సతీదేవికి విశ్వాసం కలగలేదు. తనమాటలయందు సతీదేవికి విశ్వాసం కలగలేదని శంకరుడు తెలుసుకున్నాడు. “దేవీ! నా మాటలపై నీ మనస్సుకు విశ్వాసం కలగకపోయినచో, నీవక్కడకు వెళ్ళి, నీ బుద్ధికి తోచినట్లు శ్రీరాముని పరీక్షించు” అని సతీదేవితో శంకరుడన్నాడు.

శివుని ఆజ్ఞతో సతీదేవి అక్కడకు వెళ్ళింది. “నేను సీతాదేవి రూపాన్ని ధరించి, రాముని చెంతకు వెళతాను. శ్రీరాముడు సాక్షాత్తు విష్ణువే అయినచో ఈ విషయమంతా తెలుసుకుంటాడు. లేనిచో నన్ను సీతగానే భావిస్తాడని” భావించి, సీతాదేవి రూపాన్ని ధరించి, శ్రీరాముని పరీక్షించడానికి ఆయన చెంతకు వెళ్ళింది. సతీదేవి సీతాదేవి రూపంలో తనవద్దకు వచ్చిందని శ్రీరాముడు తెలుసుకున్నాడు. ఆమెను చూచి, నవ్వి, శివనామాన్ని జపిస్తూ, ఆమెకు నమస్కరించాడు, అంతేగాక ఆమెతో ఇలా అన్నాడు “సతీదేవీ! నీ మనోగతుడైన శంభుడెక్కడున్నాడు? భర్తలేకుండా ఒంటరిగా మీరీ వనానికి ఎందుకువచ్చారు? సీతాదేవి రూపాన్ని ఎందుకు ధరించారు? అని రాముడు అడిగాడు.

శ్రీరాముని మాటలను విని, ఆశ్చర్యచకితురాలై, శ్రీరాముడు శ్రీమహావిష్ణువే! అని తెలిసుకొని, సతీదేవి నిజరూపాన్ని పొంది, శివుని పాదారవిందాలకు మనసులోనే నమస్కరించింది. “శ్రీరామా! భగవానుడైన శివుడు, నేను భూమండలంలో పర్యటిస్తూ ఈ దండకారణ్యానికి వచ్చాము. సీతావిరహంతో పీడింపబడుతున్న నిన్ను చూచి, నీకు మనస్కరించి, వెళ్ళి వటవృక్షం క్రింద నిలబడి, నీ వైష్ణవరూపం యొక్క మహిమను ఆనందంతో గానం చేస్తున్నారు. ఆ ఆనందానికిగల కారణాన్ని గూర్చి నేనడుగగా శివభగవానుడు చెప్పిన మాటలను విని, నాకు భ్రమకలిగి, ఆయన ఆజ్ఞతో ఇచటకువచ్చి, పరీక్షించి, కృతార్థురాలనయ్యాను. నా సందేహం తొలగిపోయింది. కాని నీవు శివునకు కూడా ఎలా వందనీయుడవయ్యావు? ఈ విషయంలో ఉన్నదున్నట్లుగా తెలియజేసి, నాకు శాంతిని కలిగించు” అని సతీదేవి రామునితో పలికింది. శివాజ్ఞలేనందున శ్రీరాముడు, శంకరుని సమీపానికి రాలేదు. కాని మనసులో శివుని మహిమను స్మరిస్తూ సతీదేవితో రాముడిలా చెప్పనారంభించాడు.

“ప్రాచీన కాలంలో ఒకనాడు శంభుడు తన ధామానికి విశ్వకర్మను పిలిపించి తనగోశాలయందు మిక్కిలి విశాలము, రమణీయమునైన భవనాన్ని నిర్మింపజేశాడు. దానిలో శ్రేష్ఠమైన సింహాసనాన్ని కూడా నిర్మింపజేశాడు. ఒక దివ్యమైన ఛత్రాన్ని కూడా చేయించాడు, అనంతరం ఇంద్రాది దేవతాగణాలను, సకలలోక వాసులను అక్కడకు వేగంగా పిలిపించాడు. దేవతాస్త్రీలు వివిధ వస్తువులను తీసికొనివచ్చారు. గొప్ప ఉత్సవాన్ని నిర్వహించారు. ఆయన శ్రీహరిని వైకుంఠం నుండి పిలిపించాడు. ఒక సుముహూర్తంలో మహాదేవుడు శ్రీహరిని ఆ సింహాసనంపై కూర్చుండబెట్టి, సర్వాభరణ భూషితుణ్ణి చేశాడు. శ్రీహరి తలపై మనోహరమైన కిరీటాన్ని ధరింపచేశాడు. “మంగళ కౌతుక”మనే మంగళ కర్మను చేయించి, మహేశ్వరుడు స్వయంగా బ్రహ్మాండమండపంలో శ్రీహరిని అభిషేకించాడు. అనంతరం శంభుడు అన్యులెవరివద్ద లేని తన సకలైశ్వర్యాలను శ్రీహరికి సమర్పించి, స్తుతించి సంతోషాన్ని కలుగజేశాడు.

శంభుడు తన భక్తిపరవశతను, సర్వత్ర ప్రసిద్ధం చేస్తూ బ్రహ్మదేవునితో ఇలా అన్నాడు “ఓ బ్రహ్మదేవా! నేటినుండి నా ఆదేశానుసారం విష్ణువు స్వయంగా నాకు వంద్యుడయ్యాడు. వేదాలు నన్ను వర్ణించిన విధంగానే నా ఆజ్ఞతో ఈ నాటినుండి శ్రీహరిని వర్ణించాలి” అని చెప్పి స్వయంగా గరుడధ్వజునికి నమస్కరించాడు. శ్రీహరికి గొప్పగొప్ప వరాలను ప్రసాదించాడు. ఇంకా ఇలా చెప్పసాగాడు. “శ్రీహరీ! నా ఆజ్ఞచే సకల లోకాలకు కర్తవు, పాలకుడవు, సంహారకుడవు నీవే ధర్మార్థకామాల ప్రదాతవు నీవే. దుష్టులను శిక్షించువాడవు నీవే! జగత్పూజ్యుడవు,

అజేయుడవు నీవే! నాచే కూడా నీవెప్పుడూ పరాజితుడవుకావు. నాచే నీకివ్వబడుచున్న శక్తి త్రయాన్ని స్వీకరించు, ఆ మాడింటిలో, మొదటిది ఇచ్ఛ మొదలగువాటి సిద్ధిశక్తి, రెండవది నానావిధములైన లీలలను ప్రకటించే శక్తి, మూడవది త్రిలోకాలలోను 'నిత్య స్వాతంత్ర్యం'. శ్రీహరీ! నిన్ను ద్వేషించువాడు నాచే దండింపబడతాడు. నీ భక్తులకు నేను మోక్షాన్ని ప్రసాదిస్తాను. నీవు ఈ 'మాయ'ను కూడా స్వీకరించు. దీనిని నివారించడం దేవతలకు కూడా సాధ్యంకాదు, ఈ విధాతకు కూడా జనకుడవు, పాలకుడవు కాగలవు. ఈ రుద్రుడు నీకును బ్రహ్మాది సమస్త దేవతలకును పూజ్యుడనేది నిశ్చయం, నీవు ఇచ్చటనుండియే సంపూర్ణ జగత్తును పాలింపుము. భిన్న భిన్న అవతారాలతో అందిరిని సదా రక్షిస్తూ ఉండుము. నాచిన్మయ ధామంలో పరమ వైభవశాలియైన నీయీ ధామం 'గోలోక'మనే పేరుతో భవిష్యత్తులో విఖ్యాతి చెందుతుంది. నాటినుండి లక్ష్మీపతి గోపవేషాన్ని ధరించి, అక్కడికి వచ్చి, గోవకులకు, గోవులకు, గోపికలకు అధిపతియై మిక్కిలి ఆనందంతో నివాసమున్నాడు. శివాజ్ఞచే అనేక అవతారాలను ఎత్తి జగత్పాలన చేస్తున్నాడు. ఆ శ్రీహరియే శంకరాజ్ఞచే నలుగురు సోదరుల రూపంలో అవతరించాడు. ఆ నలుగురిలో పెద్దవాడనైన నేను రాముడను. రెండవవాడు భరతుడు, మూడవవాడు లక్ష్మణుడు, నాలుగవవాడు శత్రుఘ్నుడను. మా తండ్రిగారి ఆజ్ఞానుసారం ఇక్కడ విహరిస్తూ మిమ్ములను దర్శించగలిగాను. మీ దర్శనం వల్ల సీత నిశ్చయంగా లభిస్తుందనే వరం ప్రాప్తమయ్యింది. మీ ఇరువురి కృప నామీద కలగడం నాకు మహద్భాగ్యం నీ దయను పొందిన పురుషుడు ధన్యుడు, శ్రేష్ఠుడు కాగలడు". ఇట్లు అనేక విషయములు చెప్పి, సతీదేవికి ప్రణమిల్లి, ఆమె అనుమతితో శ్రీరాముడు దండకారణ్యంలో సంచరింపసాగాడు. సతీదేవి పశ్చాత్తాపానికి గురియై, శివుని సమీపించి నమస్కరించింది. ఆమె విషాద వదనాన్ని చూచిన శివుడు 'నీవేవిధంగా రాముని పరీక్షించావు' అని సతిని అడిగాడు. సతీదేవి తలవంచి అతని చెంత నిలిచింది. శివమహాపురాణంలోని సతీఖండంలోని ఈ వృత్తాంతం రామాయణంలోగాని ఇతర పురాణాలలోగాని కనపడదు.

ఈ వృత్తాంతం ద్వారా ఈ పురాణం "శివస్య హృదయగ్ం విష్ణుః విష్ణోశ్చ హృదయగ్ం శివః" అనే శ్రుతి వాక్యానికి వ్యాఖ్యా గ్రంథమైనదనవచ్చు. 'గోలోకం' గూర్చి వివరింపబడిన కావ్యంగా కూడ సతీఖండాన్ని పేర్కొనవచ్చును అనడంలో సందేహంలేదు.

## నందావ్రత విధానం

సతీదేవి శివుని భర్తగా పొందడంకోసం తల్లియైన వీరిణి అనుమతిని పొంది, నందా వ్రతాన్ని ప్రారంభించింది. ఆమె ఆశ్వయుజమాసంలో పాడ్యమి, షష్ఠి, ఏకాదశి తిథులలో లవణాన్నం, గుడాన్నం నైవేద్యం పెట్టి శివుని భక్తితో పూజించింది.

కార్తిక చతుర్దశి నాడు అప్పాలను, పాయసాన్ని నైవేద్యంపెట్టి పరమేశ్వరుని భక్తితో ఆరాధించి ధ్యానంచేసింది. మార్గశిర బహుళ అష్టమినాడు నీటితో అభిషేకించి, యవాన్నం నైవేద్యం పెట్టి, శివుని పాలతో అభిషేకించి తక్కిన రోజులన్నీ గడిపింది. పుష్య శుక్ల సప్తమినాడు జాగరణచేసి, ఉదయం నాడు, తడిబట్టలతో నదీతీరంలో శంకరుని పూజించింది. ఫాల్గుణమాస బహుళ చతుర్దశి రోజన జాగరణచేసి, నాలుగు జాములలోనూ మారేడు పత్రాలతో విశేష పూజలు చేసింది. చైత్ర శుక్ల చతుర్దశి రోజున రాత్రింబవళ్లు శివుని మోదుగ పూలతో పూజించి, దవనం అనే

సుగంధ ఆకులతో పూజించింది. ఆ మాసమంతా రాత్రింబవళ్లు శివధ్యానంలో గడిపింది. వైశాఖ శుక్ల తదియనాడు తిలాన్నం, యవాన్నం నైవేద్యం పెట్టి రుద్రుని పూజించింది. ఆమె ఆ నెలంతా అలాగే ఆరాధించింది, జ్యేష్ఠ పూర్ణిమనాడు రాత్రియందు శంకరుని క్రొత్త బట్టలతో, బృహతీ పుష్పాలతో పూజించి ఉపవాసం చేసింది. ఆ మాసమంతా, ఆమె ఈ విధంగానే ఆరాధనలో గడిపింది. ఆషాఢ శుక్ల చతుర్దశినాడు నల్లని బట్టలు ధరించి, బృహతీ పుష్పాలతో రుద్రుని పూజించింది. శ్రావణశుద్ధ అష్టమి రోజున మరియు చతుర్దశినాడు ఆమె శివునకు యజ్ఞోపవీతాలూ, పవిత్రమైన బట్టలూ సమర్పించి పూజించింది, భాద్రపదమాస బహుళ త్రయోదశినాడు, అనేకవిధాలైన పువ్వులతో, పండ్లతో శివుని పూజించి, నీటిని మాత్రమే త్రాగి ఉపవాసం చేసింది.

ఈ విధంగా ఆమె అన్ని మాసాలలోను, గొప్ప ఆహార నియమాలు కలదై, ఆయా ఋతువులలో లభించే సస్యాలతో నైవేద్యం తయారుచేసింది. అట్లే ఆయా ఋతువులలో లభించే పుష్పాలతో పూజించి, ఫలాలు నైవేద్యం పెట్టి శివుని అర్చించి, మంత్రజపం చేసింది. ఈ విధంగా అన్ని మాసాలలోను, ప్రతిరోజు, దృఢదీక్షతో సతీదేవి శివార్చనలో లీనమయ్యింది. సతీదేవి ఈ విధంగా నందావ్రతాన్ని ముగించి, నిశ్చలమైన మనస్సుతో శివుని ప్రేమపూర్వకంగా ధ్యానించింది. మహాదేవుడు సతీదేవికి ప్రత్యక్షమై “భవత్వం మమ భార్యేతి ప్రాహ తాం భక్తవత్సలః (నీవు నాకు భార్యవు కమ్ము)” అని వరాన్ని అనుగ్రహించాడు. తన అభీష్టం నెరవేరినందులకు అతిశయించిన ఆనందంతో సతీదేవి మారు మాట్లాడలేకపోయింది.

నందావ్రతాచరణవల్ల మహాదేవుడు సంప్రీతుడై భక్తులు కోరకుండగానే, వారి మనోభీష్టాలను నెరవేరుస్తాడనియు, కన్య ఈ వ్రతం ఆచరించినచో శివానుగ్రహం వల్ల తాము కోరుకున్న వరునితో వెంటనే వివాహం కాగలదని కూడ ఈ గాథద్వారా లోకానికి శివపురాణం తెలియజేస్తోంది.

## మహామృత్యుంజయ మంత్రమహిమ

మహాతేజస్వియైన క్షువుడనే రాజొకడుండేవాడు, ఆయనకు ముని శ్రేష్ఠుడైన దధీచ మహర్షితో మైత్రి కలిగింది. ‘దీర్ఘకాల తపస్సు’ అనే విషయంలో వారిరువురకు వాదం చెలరేగింది. ఈ వాదం ముల్లోకాలలోను మిక్కిలి ప్రఖ్యాతమయ్యింది. మూడు వర్ణాలకంటె శ్రేష్ఠుడైన బ్రాహ్మణుడే తపస్సునకు సమర్థుడని వేదవేత్తయైన దధీచి పలికాడు. “రాజు సర్వదేవతా స్వరూపుడనియు, అట్టి దేవతను నేనే. రాజు బ్రాహ్మణుని కంటే శ్రేష్ఠుడు కావున నీవు నన్ను అవమానించరాదు. అంతేగాక నీవు నన్ను అన్ని విధములుగా పూజించవలసియున్నది” అని క్షువుడు దధీచ మహర్షితో పలికాడు. అతని పలుకులు విని దధీచ మహర్షి కోపించినవాడై, వేద శాస్త్రవిరుద్ధమైన పలుకులు పలికిన క్షువుని శిరస్సుపై ఎడమ ముష్టితో కొట్టాడు. బ్రహ్మాండాధిపతియైన క్షువుడు, దధీచ మహర్షిని కొట్టడంతో కోపించి తన వజ్రాయుధంతో కొట్టాడు. దానితో నేలమీద పడిన దధీచ మహర్షి శుక్రాచార్యుని స్మరించాడు. క్షువునిచే చీల్చి వేయబడిన దధీచుని దేహాన్ని మరలా సంధించాడు, పూర్వమున్న రీతిలో దధీచుని దేహాన్ని సంధించిన మృత్యుంజయ విద్యా ప్రవర్తకుడైన శుక్రాచార్యుడు దధీచునితో ఇలా పలికాడు “ఓ దధీచా! నీకు సర్వశ్రేష్ఠమగు మహా మృత్యుంజయ మంత్రాన్ని ఉపదేశిస్తాను. నా అభిప్రాయంలో ఈ మృత సంజీవనీ

మంత్రం సర్వశ్రేష్ఠమైనది. నీవు ప్రీతితో శివుని స్మరిస్తూ నియమంతో దీనిని జపింపుము" అని పలికి మహా మృత్యుంజయ మంత్రాన్ని ఉపదేశించి, మంత్రార్థాన్ని కూడ వివరించాడు. "జపమైన తరువాత హోమం చేయుము. అహోరాత్రములలో ఎప్పుడు జలపానం చేసినప్పటికీ, ఆ నీటిని ఈ మంత్రంతో అభిమంత్రించి త్రాగుము. దీనిని శివ సన్నిధిలో ధ్యానం చేసేవానికి ఎన్నటికి మృత్యుభయం కలుగదు. న్యాసాదికమునంతటిని చేసి, భక్తవత్సలుడు, మంగళకరుడునగు శివుని యథావిధిగా పూజించి ఈ మంత్రాన్ని జపించి దుఃఖం నుండి విముక్తిని పొందుము. ఈ మంత్రానికి ధ్యానాన్ని చెబుతాను. ఈ విధంగా ధ్యానించి, మంత్రాన్ని జపించే జ్ఞాని శంభుని అనుగ్రహంచే శీఘ్రంగా మంత్రసిద్ధిని పొందుతాడు.

**హస్తాంభోజ యుగస్థ కుంభయుగళా దుద్ధృత్య తోయం శిరః ।**
**సించంతం కరయోర్యుగేన దధతం స్వాంకే సకుంభౌ కరౌ ।**

**అక్షస్రఙ్మృగ హస్త మంబుజ గతం మూర్ధస్థ చంద్రస్రవత్ ।**
**పీయూషార్ద్ర తనుం భజే సగిరిజం త్ర్యక్షం చ మృత్యుంజయమ్ ॥**

అని శుక్రాచార్యుడు దధీచ మహర్షికి ఉపదేశించాడు.

శుక్రాచార్యుని మాటలను విని, దధీచి మహర్షి వనానికి వెళ్ళి శివుని స్మరిస్తూ, మహామృత్యుంజయ మంత్రాన్ని జపిస్తూ, తపస్సు చేశాడు. ఆ మహామంత్ర జపానికి ప్రసన్నుడైన శంభుడు ప్రత్యక్షమై దధీచుని వరంకోరమన్నాడు. అంతట దధీచి వజ్రం వంటి దృఢమైన ఎముకలు కలిగి ఉండుట, తద్వారా అవధ్యత్వం (ఎవ్వరు సంహరింపకుండుట), అదీనత్వం (దైన్యం లేకుండుట) అనే మూడు వరాలను కోరాడు. పరమేశ్వరుడు 'తథాస్తు' (అట్లే అగుగాక) అని పలికి అంతర్ధానమయ్యాడు.

దధీచి శివుని నుండి మూడు వరాలను పొంది, ఆనందించినవాడై వెంటనే క్షువుడున్న స్థానానికి వెళ్ళాడు. తన పాదముతో క్షువుని శిరస్సుపై తన్నాడు. విష్ణువు తనకిచ్చిన గౌరవంతో గర్వితుడైన క్షువుడు, దధీచుని వక్షస్థలంపై వజ్రాయుధంతో కొట్టాడు. పరమేశ్వరుని వర ప్రభావంవల్ల ఆ వజ్రాయుధం దధీచుని నశింపజేయలేకపోయింది. మృత్యుంజయ మంత్ర జపంచేసే దధీచునిచే పరాజితుడైన క్షువుడు వెంటనే అరణ్యాలకు పోయి శ్రీమహావిష్ణువును అర్చించాడు. దానితో ప్రసన్నుడైన విష్ణువు క్షువునకు ప్రత్యక్షమయ్యాడు. క్షువుడు "దధీచి మృత్యుజయ మంత్రసిద్ధి పొందినందున అతిశయించిన గర్వంతో నా శిరస్సుపై కోపంగా తన్నాడు. నాకు అతనిని జయించగల శక్తిని పొందడానికి నాతో కలసి యజ్ఞం చేయవలసిందని" విష్ణువును ప్రార్థించాడు. అంతట దధీచుని ఎవ్వరునూ సంహరింప లేరనే సత్యాన్ని గ్రహించిన విష్ణువు క్షువునితో "ఓ రాజేంద్రా! బ్రాహ్మణులకు ఎచ్చటనైనను, లేశమైనను భయము లేదు. ప్రత్యేకించి రుద్రభక్తులకు భయము లేనేలేదు. ఆ బ్రాహ్మణునకు దుఃఖాన్ని కలిగిస్తే అతడు నాకు కూడా శాపమీయగలడు. ఆయన శాపంచే దక్షయజ్ఞంలో దేవదేవుడైన శివుని వలన నాకు వినాశం కలుగుతుంది. కావున నేను నీతో కలసి ఎన్ని యజ్ఞాలు చేసినను వ్యర్థమే. నీకు దధీచిపై విజయం లభించడానికి నేనే ప్రయత్నిస్తాను" అని పలికాడు. క్షువునకు హితం చేయదలంచిన విష్ణువు బ్రాహ్మణరూపం ధరించి దధీచి ఆశ్రమానికి వెళ్ళి

ఒకవరం కోరదలచినానని విష్ణువు దధీచితో పలికాడు. అంతట దధీచి "నీవు క్షువకార్యార్థివై బ్రాహ్మణరూపంలో వచ్చిన విష్ణు భగవానుడవు. రుద్రుని అనుగ్రహంచే త్రికాలజ్ఞుడనైనాను, నీవు నిజరూపమును స్వీకరించి శంకరుని స్మరింపుము. శివుని అర్చించువారిలో ఎవ్వనికైనను భయమున్నచో నిశ్చితంగా చెప్పుము. నేను ఈ జగత్తులో ఎవ్వనికీ భయపడను. అని విష్ణువుతో పలికాడు. అంతట విష్ణువు "నీవు సర్వజ్ఞుడవు. కాని నీవు నా ఆజ్ఞచే 'భయపడుతున్నాను' అని ఒక్కసారి నీ శత్రువైన క్షువ మహారాజు ఎదుట పలుకుము" అని దధీచుని వేడుకున్నాడు. విష్ణువు మాటలను వినిన దధీచి నవ్వి "శంభుని ప్రభావం వలన నేను ఏ కాలమునందైనను, ఏ దేశమునందైనను, ఏ వస్తువు వలననైనను లేశమైనను భయపడను" అని విష్ణువునకు బదులిచ్చాడు. దానితో విష్ణువు కోపించి అతనిని దహించు కోరికతో తన చక్రమును ప్రయోగించగా అది దధీచియందు వ్యర్థమౌటయేగాక మొక్కపోయింది. దానితో కోపించిన విష్ణువు అతనిపై అస్త్రాలనన్నింటిని ప్రయోగించాడు. ఇంద్రాది దేవతలు కూడా ఆ బ్రాహ్మణునితో యుద్ధానికి సిద్ధమయ్యారు, తమతమ శస్త్రాలను, అస్త్రాలను అతనిపై ప్రయోగించారు. వెంటనే దధీచి శివుని స్మరిస్తూ గుప్పెడు దర్భలను దేవతలందరిపై ప్రయోగించగా, అది కాలాగ్నివంటి త్రిశూలమై, దేవతలందరి ఆయుధాలను నిర్వీర్యం చేసింది. అంతట విష్ణువు తన దేహంనుండి కోట్లాది దివ్యగణాలను సృష్టించి దధీచి మహర్షిపై యుద్ధానికి పంపాడు. దధీచి క్షణంలో వారినందరిని దహించివేశాడు. అంతట విష్ణువు దధీచిని ఆశ్చర్యచకితుని చేయడానికి తాని విశ్వరూపాన్ని పొందాడు. ఆ విశ్వరూపాన్ని చూచిన దధీచి "ఓ మాధవా! నీవు మాయను వీడుము. నీది ఆభాసయని స్పష్టమౌతోంది. నీకు దివ్య దృష్టిని ఇస్తున్నాను. నన్ను దర్శింపుమని" పలికి శంభుని తేజస్సుచే దధీచి విరాట్ దేహాన్ని పొంది తన శరీరంలో బ్రహ్మాండాలనన్నిటిని ప్రదర్శించాడు. అయినను విష్ణ్వాది దేవతలందరు మరలా దధీచితో యుద్ధానికి సిద్ధంకాగా, బ్రహ్మ "ఈ బ్రాహ్మణుడు జయింపశక్యంకాని వాడు" అని చెప్పి వారినందరిని యుద్ధం నుండి వారించి, దధీచ మహర్షికి నమస్కరింపవలసినదిగా విష్ణువునకు తెలియజేశాడు. దానితో విష్ణువు, క్షువుడు దధీచ మహర్షి వద్దకు వెళ్ళి నమస్కరించి, స్తోత్రం చేశారు, అంతట దధీచమహర్షి రాజైన క్షువుని అనుగ్రహించాడు. కాని "దేవతలు, దేవేంద్రుడు, మహర్షులు, విష్ణుదేవుడు, విష్ణుగణాలు రుద్రుని కోపాగ్నిలో వినాశనమను పొందుదురు గాక" అని శపించాడు. అనంతరం దధీచి మహర్షి క్షువునితో "ఓ రాజేంద్రా! బ్రాహ్మణోత్తముడు, రాజులచేత, దేవతలచేత కూడ పూజ్యుడు, బ్రాహ్మణులే బలవంతులు, సమర్థులు" అని స్పష్టంగా పలికి తన ఆశ్రమానికి వెళ్ళాడు. క్షువుడు తన గృహానికి వెళ్ళాడు. విష్ణువు తన లోకానికి వెళ్ళాడు. ఆ స్థానమే "స్థానేశ్వరం" అనే పేరుతో పుణ్య క్షేత్రాన్ని దర్శించినవారు శివసాయుజ్యం పొందుతారు. ఈ గాథనంతటిని "అన్నియు తెలిసిన విష్ణువు దక్షయజ్ఞానికి వెళ్ళి ఎందుకు పరాభవింపబడ్డాడని" ప్రశ్నించిన నారదునకు సమాధానంగా బ్రహ్మదేవుడు వివరించాడు. ఈ గాథను నిత్యం కీర్తించే మానవుడు అపమృత్యువును జయించి, దేహాన్ని విడిచిన తరువాత బ్రహ్మలోకం పొందుతారనియు, ఈ గాథను కీర్తించిన పిదప యుద్ధానికి బయలుదేరు వారికి మృత్యుభయం ఉండనే ఉండదు. అంతేగాక వారు విజయాన్ని పొందుతారనే ఫలశ్రుతి కూడా ఈ సందర్భంలో (39వ అధ్యాయం)లో పేర్కొనబడింది.

ఈ విధంగా మహామృత్యుంజయ మంత్రోపదేశం మంత్రార్థం, జపవిధానం, ధ్యానం, మంత్రమహిమ ఈ శివపురాణంలో మాత్రమే వివరింపబడింది. ఇతరత్ర ఎక్కడను ఇదికానరాదు. శివైక్యం పొందాలని భావించే

భక్తులకందరకు ఈ మంత్రమే శరణ్యము. శివమహాపురాణ పరమార్థమంతయు ఇదియే. దీనితో బాటు వశిష్ఠునిచే సంధ్యాదేవికి ఉపదేశింపబడిన 'శివాష్టాక్షరీ మహామంత్రం' 'మౌన తపోవిధానం' కూడ ఈ సతీఖండంలో మాత్రమే వివరింపబడుట శివమహాపురాణంలోని సతీఖండం యొక్క విశిష్టతను విశ్వవ్యాప్తం చేస్తోంది. అంతేగాక బ్రహ్మాది దేవతలు, మహర్షులు చేసిన అనేక శివస్తోత్రాలు, దేవీస్తోత్రాలతోపాటు మహాదేవుడు తాను స్వయంగా ఉపదేశించిన 'శివతత్త్వం' కూడ ఈ ఖండంలో వర్ణింపబడడం గమనించవలసిన ప్రత్యేకాంశం. అంతేగాక శివకేశవాద్వైత పరబ్రహ్మ తత్త్వం లోకానికి సోదాహరణంగా వివరించిన పరమ పవిత్ర గ్రంథంగా కూడ 'సతీఖండం' పేర్కొనదగిందని నిర్ద్వంద్వంగా పేర్కొనవచ్చు.

## మానవాళికి మార్గదర్శకాలు

భక్తి, ముక్తి మార్గంలో పయనించేవారికి మంత్రోపదేశాలు, తత్త్వోపదేశాలు చేయడమేకాదు శివమహాపురాణం సామాన్య మానవుడు, శాంతిసౌఖ్యాలతో జీవనం కొనసాగించడానికి అవసరమైన మర్గదర్శకాలను కూడా తెలియజేస్తోందని నిస్సంశయంగా చెప్పవచ్చు. పిలువని పేరంటూనికి పోరాదనే సామెతలోకంలో మిక్కిలి వ్యాప్తిలో ఉన్న సంగతి అందరికీ తెలిసినదే. ఈ లోకోక్తికి దక్షయజ్ఞానికి దక్షుడు ఆహ్వానింపక పోయినప్పటికి వెళ్ళి అవమానింపబడి, శరీర త్యాగం చేసిన సతీదేవి గాథయే మూలమని చెప్పవచ్చు. ఎందులకనగా సతీదేవి దక్షయజ్ఞానికి వెళ్లడానికి పరమేశ్వరుని కోరిన సందర్భంలో శివుడు సతీదేవితో ఇలా పలికాడు.

**అనాహూతాశ్చ యే దేవీ గచ్ఛన్తి పరమందిరమ్ ।**
**అవమానం ప్రాప్నుయంతి మరణాదధికం తథా ॥**

**పరాలయం గతోపీంద్రో లఘుర్భవతి తద్విధః ।**
**కా కథా చ పరేషాం వై రీథా యాత్రాహి తద్విధా ॥**

**తథారిభిర్న వ్యథతే హ్యార్దితోపి శరైర్జనః ।**
**స్వానాందురుక్తిభిర్మర్మతాడితస్స యథామతః ॥**

– శి.పు. రు.సం. స.ఖం. 28వ అ. 26,27,28 శ్లో.

ఓ దేవీ! ఎవరైతే ఆహ్వానం లేకుండగా ఇతరుల గృహాలకు వెళతారో వారు మరణం కంటె అధికమైన దుఃఖాన్ని ఇచ్చే అవమానాన్ని పొందుతారు. ఆహ్వానం లేకుండా ఇతరుల గృహాలకు వెళ్ళేవాడు ఇంద్రుడైననూ చులకనగా చూడబడతాడు. అటువంటప్పుడు ఇతరుల మాట చెప్పవలెనా? ఆ విధంగా వెళ్ళేవారికి అది తిరస్కార యాత్రయే అవుతుంది. అటువంటి వారికి తెగడ్తయే ప్రాప్తిస్తుంది. తనకు కావలసిన వారి నిందా వాక్యాలచే హృదయం వేధింపబడినవాడు పొందే దుఃఖాన్ని శత్రువులు బాణాలతో కొట్టికూడా అంతగా కలిగించలేరు. ఇది ముమ్మాటికి యథార్థమని పరమశివుడు నొక్కి వక్కాణించియున్నాడు. ఇది లోకోపయోగమైన హితోక్తియే గదా! అంతేకాదు సాక్షాత్తు మహాదేవుడు చేసిన హితోపదేశం.

"కామింప కూడని వారిని కామంచినవారు శిక్షార్హులు, అంతేగాదు దానివలన కలిగిన బాధ శరీరం విడిచేవరకూ బాధిస్తూనే ఉంటుందని" కూడ శివపురాణం లోకులను హెచ్చరిస్తోంది. దీనికి సతీశివుల కల్యాణ సమయంలో సతీదేవి యొక్క సౌందర్యానికి మోహపడిన బ్రహ్మదేవుని పరమశివుడు శిక్షించిన గాథయే ప్రబల తార్కాణం. అంతేగాక ఇందులోని 'సంధ్యా చరిత్ర' కూడ లోకాలకు ఈ హితోపదేశమే చేస్తోంది. మన్మథుడు తన శక్తిని పరీక్షించుకోవడానికి ప్రయోగించిన బాణ ప్రహారంవల్ల బ్రహ్మ తన కుమార్తెయైన సంధ్యాదేవియందు మోహాన్ని పొందాడు. దానివలన కలిగిన దుఃఖం సతీశివుల కల్యాణం జరిగిన పిదప కూడా పూర్తిగా ఉపశమనాన్ని పొందలేదు. అదే సందర్భంలో సంధ్యాదేవి కామింపకూడని తండ్రియైన బ్రహ్మదేవుని సోదరులైన దక్షుడు మున్నగువారిని కామించింది. దానివలన కలిగిన దుఃఖం, పాపం, వేయిదివ్య సంవత్సరాలు శివాష్టాక్షరీ మంత్రం జపిస్తూ తపస్సుచేసి, శివుని ఆజ్ఞమేరకు యజ్ఞగుండంలో తన శరీరాన్ని దహింపచేసుకొని, అరుంధతిగా జన్మించిన తరువాత మాత్రమే తొలగిపోయింది. అప్పుడు మాత్రమే పవిత్రురాలుగా, పతివ్రతాశిరోమణిగా జగత్ప్రసిద్ధి పొందినది. ఈ రెండు గాథలు. "అకామాం కామయానేన శరీరము పతప్యతే" (కామింపకూడని వారిని కామించడంవల్ల శరీరం తపింపబడుతుంది) అనే రామాయణ వాక్యానికి వ్యాఖ్యాప్రాయమనవచ్చును.

**అపూజ్యా యత్ర పూజ్యంతే పూజనీయో న పూజ్యతే ।**
**త్రీణి తత్ర భవిష్యంతి దారిద్ర్యం మరణం భయమ్ ॥**

– శి.పు. రు.సం. స.ఖం. 34వ అ. 09 శ్లో.

ఎక్కడ పూజింపదగనివారు పూజింపబడతారో, ఎక్కడ పూజింపదగినవారు పూజింపబడరో, అక్కడ నిశ్చయంగా దారిద్ర్యం, మరణం, భయం అనే మూడు సంభవిస్తాయని శ్రీమహావిష్ణువు ఈ పురాణంలో ఘంటాపథంగా ప్రకటించియున్నాడు. అంతేగాక హరి

**శ్రుణు దక్ష ప్రవక్ష్యామి తత్త్వతః శ్రుణు మే వచః ।**
**సర్వధా తే హితకరం మహామంత్రం సుఖప్రదమ్ ॥**

నేను సత్యమైన తత్త్వాన్ని చెబుతున్నాను. నీకు అన్ని విధముల హితాన్ని చేకూర్చి, సుఖాన్నిచ్చే మహామంత్రాన్ని చెబుతాను అని దక్షునితో చెప్పడాన్ని బట్టి లోకాలకు అన్నింటికీ సుఖాన్నిచ్చే మహామంత్రం ఇదియే అని తెలియజేసినట్లయ్యింది దీనికి దక్షుని చరిత్రయే ఉదాహరణ.

"ఏ పనిని చేయాలి? దేనిని చేయకూడదు? అనే వివేకం లేకుండా కర్మాచరణ చేసినంత మాత్రంచేత కర్మఫలం సంప్రాప్తింపదు. ఎట్టి కర్మాచరణ వలన మానవుడు ఉన్నతిని పొందుతాడో అదియే అతని కర్తవ్య కర్మ అవుతుంది. కర్మలకు శుభఫలాలనిచ్చేవాడు ఈశ్వరుడు మాత్రమే కాని మరియొకడు కాదు. ఎవడైతే మనస్సును శివునిపై నిలిపి, శాంతచిత్తంలో కర్మాచరణ చేస్తాడో అట్టివానికి కర్మాంతంలో శివుడు కర్మఫలాన్ని అనుగ్రహిస్తాడు, కేవలం జ్ఞానాన్ని ఆశ్రయించి, ఈశ్వరుని సేవింపని నరుడు వందకోటి కల్పాంతాలవరకు నరకంలోనే ఉంటాడు. కేవలం కర్మలనాచరించేవాడు కర్మపాశబద్ధుడై జన్మజన్మలయందు నరక ప్రాయమైన బ్రతుకులోనే బ్రతుకుతూ ఉంటాడు.

– శి.పు. రు.సం. స.ఖం. 35వ అ. 28,29,30,31,32 శ్లో.

ఇది శివపురాణం ద్వారా శ్రీమహావిష్ణువు లోకహితం కొరకు చేసిన ఉపదేశం. ఇట్టి హితోపదేశాలు ఈ పురాణ భాగంలో లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. కావున, ఈ పురాణభాగం సమస్త జనులకు ఐహిక, పారలౌకిక సౌఖ్యాలను కలుగజేసే పవిత్రగ్రంథంగా కీర్తింపవచ్చును.

## పార్వతీఖండం సారాంశము

శివపురాణంలోని రెండవదైన రుద్రసంహితలోని మూడవ ఖండం పార్వతీఖండం. ఈ ఖండం 55 అధ్యాయాలతో 2704 శ్లోకాలతో వ్యాసభగవానునిచే వెలువరింపబడింది. పార్వతీఖంఢంలోని కథాకథనం కూడా బ్రహ్మ, నారద సంవాద రూపంలోనే సాగింది.

'ఓ బ్రహ్మదేవా! సతీదేవి తనతండ్రియైన దక్షుడు చేసిన యజ్ఞంలో దేహాన్ని వీడిన తరువాత హిమవత్పర్వత పుత్రికగా జన్మించిన విధానమెట్టిది?' అని నారదమహర్షి బ్రహ్మదేవుని ప్రశ్నించడంతో పార్వతీ ఖండం ప్రారంభమౌతుంది. దేవతల ప్రార్థనమేరకు పితృదేవతల పెద్ద కుమార్తెయైన మేనాదేవిని హిమవంతునకిచ్చి వివాహం చేసిన విధం బ్రహ్మ నారదునకు వివరించడంతో ప్రథమాధ్యాయం ముగిసింది. ఈ సందర్భంగా హిమవంతునకు జంగమం, స్థిరం అనే రెండు రూపాలున్నాయని చెప్పడంతోబాటు హిమవద్వైభవం సంక్షిప్తంగా పేర్కొనబడింది, మేనాదేవి పూర్వచరిత్ర 2వ అధ్యాయంలో వర్ణింపబడింది. మేనాదేవి హిమవంతుని వివాహమాడి మిక్కిలి ప్రీతితో వారిరువురు చక్కని స్థానాలలో విహరిస్తూ ఉన్న సమయంలో విష్ణువు మున్నగు దేవతలందరు హిమవంతుని సమీపించి, దక్షయజ్ఞంలో దేహత్యాగం చేసిన ఉమాదేవి నీకు కుమార్తెగా జన్మించడానికిగాను నీవు మేనాదేవిని వివాహమాడినావని తెలియజేశారు. దేవతలందరు ఉమాదేవిని స్తుతించి భూలోకంలో హిమవత్పుత్రికగా జన్మించి దేవకార్యాన్ని పరిపూర్తి చేయవలసిందని ప్రార్థించారు, వారి స్తుతికి సంప్రీతురాలైన ఉమాదేవి ప్రత్యక్షమై ఈ భూమండలంలో తాను పూర్ణాంశతో అవతరించడానికిగల కారణాలను వారికి వివరించి, హిమవంతుని ఇంట అవతరిస్తానని వారిని ఓదార్చింది. అంతట మేనాదేవి ముందుగా వందమంది పుత్రులను ప్రసాదించవలసినదియు, తదనంతరం దేవకార్యాన్ని నెరవేర్చడానికి ఉమాదేవియే తనకు పుత్రికగా జన్మించి రుద్రదేవునకు పత్ని కావలయుననియు ఉమాదేవిని వరంగా కోరింది. ఉమాదేవి మేనాదేవికి ఆమె కోరిన వరం ప్రసాదించి అంతర్ధానం పొందింది (3,4,5 అధ్యాయాలలో). ఈ సందర్భంగా విష్ణ్వాది దేవతలు చేసిన దేవీస్తుతిలో బ్రహ్మాండమే దేహంగా కలిగినదనియు, బ్రహ్మాండంలోని ప్రాణులన్నింటిలో చలన శక్తిరూపంలో ఉన్నదియు, బ్రహ్మనుండి తృణంవరకుగల సమస్త ప్రాణులను సంతృప్తి పరచునదియూ అయిన దేవీతత్త్వమంతయూ స్పష్టంగా వివరింపబడింది. అంతేగాక పరమేశ్వరుడు యథార్థముగా వికారముగాని, దైన్యముగాని లేనివాడనియు, శివుడు పరిపూర్ణుడైన స్వామియనియు, మాయను వశంచేసుకున్న సర్వేశ్వరుడనియు ఉమాదేవియే స్వయంగా శివతత్త్వాన్ని దేవతలకు తెలియజేయడం విశేషం.

ఉమాదేవి వరప్రసాదంవల్ల మేనాదేవికి మైనాకుడు జన్మించాడు. అనంతరం వసంత ఋతువులో, చైత్రమాసంలో, నవమి తిథినాడు మృగశిర నక్షత్రమందు, అర్ధరాత్రి సమయంలో పార్వతీదేవి అవతరించింది (6వ అధ్యాయంలో). పార్వతి బాల్యలీలా వర్ణనం 7వ అధ్యాయంలో వర్ణింపబడగా నారద హిమాలయ సంవాదం

8వ అధ్యాయంలో వర్ణింపబడింది. నారదుడు ఒకనాడు హిమవంతుని గృహానికి వెళ్ళి పార్వతీదేవి హస్తరేఖలను చూచి శంభునకు పత్నియై, సువ్రతయై, అనన్య సామాన్యమైన పరస్పర ప్రేమ కలిగిన జంటగా ముక్కాలాలలోను, ముల్లోకాలలోను విఖ్యాతి గాంచగలదని హిమవంతునకు తెలియజేసిన వృత్తాంతం ఇందులో వర్ణింపబడింది. అంతేగాక ఈ సందర్భంలో "కరరేఖా బ్రహ్మలిపిర్నమృషా భవతి ధ్రువమ్" (హస్తరేఖలు బ్రహ్మలిపి. అది ఎన్నడును అసత్యం కానేరదు. ఇది నిశ్చయం) అని హస్త సాముద్రిక శాస్త్ర ప్రామాణ్యత కూడా సుప్రతిష్ఠితం చేయబడింది, అంతేగాక "అమంగళాని సర్వాణి మంగళాని సదాశివే" (అమంగళాలన్నీ సదాశివునియందు మంగళరూపాలుగా పరిణమిస్తాయి) అని కూడ ఈ సందర్భంగా స్పష్టంగా తెలియజేయబడింది.

ఒకనాడు హిమవంతుని ఆదేశం మేరకు పార్వతి శివుని గూర్చి తపస్సుచేయడంలో అభిరుచి కలిగించడానికి, కుమార్తెకు ఉపదేశమివ్వడానికి మేనాదేవి పార్వతీదేవి వద్దకు వెళ్ళింది. అప్పుడు పార్వతి గడచిన రాత్రి బ్రహ్మ ముహూర్తంలో స్వప్నంలో ఒక దయాళువు, తపస్వియునగు బ్రాహ్మణుడు కనిపించి శివుని ప్రసన్నంచేసుకోవడానికి ఉత్తమమైన తపోవిధానాన్ని ప్రీతిపూర్వకంగా తనకు ఉపదేశించాడని మేనాదేవికి తెలియజేసింది, ఆ స్వప్న వృత్తాంతం హిమవంతునకు తెలియజేయగా, హిమవంతుడు గడచిన రాత్రియొక్క అంతంలో (తెల్లవారు ఝామున) తాను కలలో దర్శించిన సంక్షిప్తశివచరిత్రను వర్ణించి చెప్పాడు (9వ అధ్యాయంలో) అంతేగాక "నారదుడు చెప్పిన శ్రేష్ఠమైన లక్షణాలతో కూడిన ఒక తపస్వి, మిగుల ప్రసన్నుడై మన నగర సమీపంలో తపమాచరించడానికి వచ్చాడనియు, మన కుమార్తెను ఆ తపస్వికి సేవచేయడానికి నియోగించినట్లు కలగాంచాననియు, ఈ స్వప్న ఫలాన్ని పరీక్షించడానికి కొంతకాలం వేచిచూద్ధామనియు" హిమవంతుడు మేనాదేవికి తెలియజేసినట్లు కూడ వర్ణింపబడింది. కొన్నిరోజులు గడిచిన తరువాత ఆ విధంగానే జరగడాన్నిబట్టి తెల్లవారు ఝామున వచ్చిన కలలు కల్లలు కావనియు, నిత్య సత్యాలనియు శివపురాణం ఈ సందర్భంగా లోకులకు తెలియజేస్తోంది. స్వప్నశాస్త్రం యొక్క విశిష్టత కూడ దీనిద్వారా వ్యక్తీకరింపబడిందని చెప్పవచ్చు.

శివుని శ్రమజలంతో ఉద్భవించి భూదేవితో లాలింపబడి 'భౌముడు' 'కుజగ్రహం'గా అవతరించిన గాథ 10వ అధ్యాయంలో వర్ణింపబడింది. విరహాకులుడైన శివుడు నందిమున్నగు కొలది శివగణాలతో కూడి హిమవత్పర్వత ప్రాంతానికి తపమాచరించడానికి రావడం, హిమవంతుడు శివునికి స్వాగతం పలికి గంగావతరణ తీర్థంలో ఏకాంతంగా తపమాచరించుకోవడానికి చేసిన ఏర్పాట్లు 11వ అధ్యాయంలో వర్ణింపబడ్డాయి. అనంతరం పర్వతరాజు తన కుమార్తెతో కూడి శివుని దర్శించి, ప్రతినిత్యం దర్శనం, సేవచేసికొనే భాగ్యం కలిగించవలసినదిగా కోరుతూ, వారిరువురిమధ్య జరిగిన సంవాదం 12వ అధ్యాయంలో వర్ణింపబడింది. ఈ సందర్భంగా

**"అతస్తపస్వినా శైల న కార్యా స్త్రీషు సంగతిః ।**
**మహావిషయ మూలం సా జ్ఞాన వైరాగ్య నాశినీ ॥**

తపశ్శాలి స్త్రీలతో మైత్రిచేయరాదు, ఇంద్రియ భోగలాలసతకు మూలమైన స్త్రీ, జ్ఞానాన్ని వైరాగ్యాన్ని నశింపజేస్తుంది." అని మహేశ్వరుడు తపస్వులను హెచ్చరించి ఉన్నాడు. పరమేశ్వరుడు హిమవంతునితో పలికిన

పలుకులు విని పార్వతి సాంఖ్యశాస్త్రానుసారంగా సమాధానం చెప్పింది. ఆమె వాదనకు సమాధానంగా శివుడు వేదాంత మతాన్ని అనుసరించి సంవాదాన్ని కొనసాగించాడు. అనంతరం పార్వతీదేవిని సేవకొరకు స్వీకరించాడు, అనంతరం పార్వతీదేవి ప్రతినిత్యం తన ఇద్దరి చెలికత్తెలతో కూడి శివునికి షోడశోపచారాలు చేసిన విధం వర్ణింపబడింది. ఆమె సేవలకు సంప్రీతుడైన శివుడు "ఎప్పుడైతే ఈ కాళి తీవ్ర తపస్సు చేస్తుందో అప్పుడీమెలోని గర్వబీజాలు తొలగిపోతాయి అప్పుడీమెను నేను స్వీకరిస్తాను" అని తలంచి ధ్యానమగ్నుడయ్యాడు (13వ అధ్యాయంలో). ఈ విధంగా సాగిన పార్వతీ పరమేశ్వర సంవాదంలో ప్రకృతియే సృష్టినంతటినీ, రచించి, పాలించి నశింపజేస్తోంది. ప్రకృతిలేకుండగా మహేశ్వరుడు సగుణ రూపధారి కాలేడు, ప్రకృతితో కూడి ఉండడంచేతనే పరమేశ్వరుడు (పురుషుడు) సర్వదా ప్రాణులచే పూజింపబడి, నమస్కరింపబడి, ధ్యానింపబడుతున్నాడనే ప్రకృతితత్త్వం, సాంఖ్యశాస్త్రం స్పష్టంగా బోధింపబడింది. అదేవిధంగా పురుషుడు (పరబ్రహ్మ) మాయాలేపనం లేనివాడనియు, వేదాంత సిద్ధాంతం కూడ ఈ ఘట్టంలో స్పష్టంగా వివరింపబడింది. అంతేగాక 'జాగ్రత్తగా పరిశీలిస్తే పార్వతీపరమేశ్వరుల (ప్రకృతి, పురుషుల) మధ్య భేదం లేదు. అట్టివారిరువురు సాంఖ్య, వేదాంతమతాలను అనుసరించి గావించిన సంవాదం సర్వదా మంగళాలను కలిగిస్తుందనే ఫలశ్రుతి కూడ వివరింపబడింది. ఈ సంవాదం 'శివాశివుల' పరమ చరితను స్పష్టం చేస్తోంది.

దితికి నలభైతొమ్మిదిమంది పుత్రులు జన్మించి, వారందరు మరుత్తులై స్వర్గాన్ని పొందినవిధం, అనంతరం దితి పదివేల సంవత్సరాలు బ్రహ్మను గూర్చి తపస్సుచేసి వజ్రాంగుని పుత్రునిగా పొందినవిధం, వజ్రాంగుడు 'వరాంగి'ని వివాహమాడిన విధం, వరాంగి కోరిక మేరకు ముల్లోకాలను జయించగలవాడును, ఇంద్రునిసైతం దుఃఖపెట్టగల వాడును, పరాక్రమ శాలియునైన పుత్రుని పొందాలనే కోరికతో బ్రహ్మనుద్దేశించి అనేక సంవత్సరాలు దుష్కరమైన తపస్సుచేసి, బ్రహ్మ నుండి తాను కోరిన వరం పొందడంతో 14వ అధ్యాయం సమాప్తమయ్యింది. అనంతరం వరాంగి గర్భాన్ని ధరించిన సమయంలో దుఃఖ హేతువులైన అనేక మహోత్పాతాలు చాలా వివరంగా వర్ణింపబడ్డాయి. అనంతరం తారకుడు జన్మించడం, దేవతలను జయించే నిమిత్తం తారకుడు బ్రహ్మను గూర్చి అనేకవిధంగా తీవ్రమైన తపస్సుచేశాడు. ఈ బ్రహ్మాండంలో ఎక్కడైననూ తనతోసమానమైన బలవంతుడు ఉండరాదనియు, శివవీర్య సముద్భూతుడైన కుమారుని ద్వారా మాత్రమే మరణించాలని తారకుడు బ్రహ్మ నుండి వరాలను పొందాడు, తదనంతరం తారకుడు ముల్లోకాలకు రాజుగా అభిషేకింపబడ్డాడు. దేవతలను, తదితర ప్రజలను పీడిస్తూ రాజ్యపాలన చేయసాగాడు. తారకునిచే పీడింపబడిన దేవతలందరు దుఃఖంతో బ్రహ్మను శరణు వేడుకున్నారు (15వ అధ్యాయంలో), శివుని వీర్యంవల్ల జన్మించిన కుమారుడు మాత్రమే తారకాసురుని సంహరింపగలడనియు, మేనాదేవి గర్భంలో జన్మించిన పార్వతిని వివాహమాడే ఉపాయాన్ని అనుసరించవలసినదనియు, బ్రహ్మ, దేవతలకు తెలియజేశాడు, బ్రహ్మ తారకాసురుని వద్దకు వెళ్ళి హితవు పలికాడు. దానితో తారకుడు స్వర్గాన్ని వదలి శోణిత నగరానికి వెళ్ళి రాజ్య పాలన చేయసాగాడు, కాముని ప్రభావంచే శివాదేవియందు శివునకు అనురాగం కలిగేటట్లు ప్రయత్నించవలసినదిగా బ్రహ్మ ఇంద్రునకు తెలియజేశాడు (16వ అధ్యాయంలో), వెంటనే ఇంద్రుడు శివుని సేవిస్తున్న పార్వతియందు, శివునకు గొప్ప ప్రేమ కలిగెటట్లు చేసి దేవకార్యాన్ని నెరవేర్చవలసినదిగా మన్మథుని కోరాడు. మన్మథుడు అందులకు అంగీకరించి, వసంతునితోను,

భార్యతోను కూడి మన్మథుడు శివుడు తపస్సు చేస్తున్న ప్రాంతానికి వెళ్ళాడు (17వ అధ్యాయంలో), ముమ్మందుగా ఆ ప్రదేశంలో వసంతుని ప్రభావం విస్తరింపజేయసాగాడు. అనంతరం మన్మథుడు తన పూలబాణాలతో శృంగారరసం విజృంభింపజేశాడు. ఆ సమయంలో శివుని సేవించడానికి పార్వతి శివుని సమీపించింది. శంకరుడు క్షణకాలం ధ్యానాన్ని వీడి, పార్వతి సర్వాంగ సౌందర్యాన్ని వర్ణింపసాగాడు. పార్వతి సిగ్గుతో దూరానికి వెళ్ళింది. వెంటనే శివుడు మోహాన్ని క్షణకాలం పొందాడు, మరల విచారించి 'దీనివలన ప్రయోజనమేమున్నదని' నిశ్చయించుకొని, వైరాగ్యాన్ని ఆశ్రయించి, పార్వతిని పొందాలనే కాంక్షను నివారించుకున్నాడు (18వ అధ్యాయం), ఉత్తమమైన తపస్సు చేస్తున్న నాకు విఘ్నంకలగడానికి గల కారణం గూర్చి శివుడు ఆలోచింపసాగాడు. ఆ స్వామి దృష్టి శరసంధానం చేస్తున్న కామునిపై పడింది. వెంటనే కోపంతో లలాటంలో ఉన్న మూడవ నేత్రంనుండి అగ్ని జ్వాలలు ఆకాశానికెగసి, భూమిపై పడ్డాయి 'ప్రభూ క్షమింపుము' అనేమాట కాముని నుండి, దేవతలు నుండి వెలువడక ముందే ఆ అగ్ని కాముని దహించి భస్మం చేసింది. అంతట పార్వతి వికృత చిత్తురాలై తన భవనానికి వెళ్ళింది. రతీదేవి విలపించసాగింది. బ్రహ్మాది దేవతల కామదేవుని శివుడు తిరిగి బ్రతికింపజేస్తాడని రతీదేవిని ఊరడించారు. రతీదేవి దుఃఖాన్ని, దేవతల దుఃఖాన్ని తొలగింప చేయవలసినదని బ్రహ్మాది దేవతలు మహేశుని ప్రార్థించారు. రుక్మిణీ పతియైన శ్రీకృష్ణుడు భూమిమీద అవతరించే వరకు మన్మథుడు అనంగుడై ఉంటాడనియు, అప్పుడు రుక్మిణీ గర్భంలో ప్రద్యుమ్నుడుగా అవతరిస్తాడనియు, అతనిని శంబరాసురుడు హరిస్తాడనియు, అప్పుడు ప్రద్యుమ్నుడు ఆ రాక్షసుని వధించి, నిన్ను పొందుతాడనియు, అంతవరకు శంబరాసురుని నగరంలోనే ఉండవలసినదనియు, శివుడు రతీదేవికి తెలియజేశాడు దేవతలను ఊరడించాడు (19వ అధ్యాయంలో).

కాముని దహించిన అగ్ని జ్వాలలు ముల్లోకాలలో వ్యాపించి దహింపసాగాయి. అంతట బ్రహ్మ ఆ క్రోధాగ్నిని ఒక గుఱ్ఱం (బడబం) రూపంలో మార్చి, ఆ బడబాగ్నిని ప్రళయాంతం వరకు సముద్ర మధ్యంలో ఉండే విధంగా సముద్రంలో ప్రవేశపెట్టాడు (20వ అధ్యాయంలో), కాముడు దహింపబడిన తరువాత, తన తండ్రి ఇంటిలో ఉన్న పార్వతి శివవిరహంచే దుఃఖితురాలయ్యింది. ఆ సమయంలో నారదమహర్షి పార్వతిని సమీపించి, చిరకాలం గొప్ప తపస్సుచేసి, ఈశ్వరుని ఆరాధించవలెననియు, తద్వారా మాత్రమే నీవు పవిత్రురాలవు కాగలవనియు, అపుడు మాత్రమే శివుడు నిన్ను భార్యగా స్వీకరించగలడనియు, పార్వతీదేవికి హితోపదేశం గావించాడు. శివపంచాక్షరీ మహామంత్రాన్ని నారదుడు యథావిధిగా పార్వతికి ఉపదేశించాడు. ఆ మహామంత్రం యొక్క మాహాత్మ్యం కూడ ఈ సందర్భంగా తెలియజేశాడు (21వ అధ్యాయంలో), దానితో పార్వతి సంతోషించినదై, శివుడు తపస్సుచే ప్రసన్నుడు కాగలడని తెలుసుకొని తపమాచరించడానికి నిశ్చయించుకున్నది. తల్లిదండ్రుల అనుమతిని పొందింది. శివుని స్మరించి, తపస్సు చేయడానికి గంగానది దివినుండి భువికి అవతరించిన స్థలానికి చేరుకుంది, శివుడు తపస్సు చేసిన స్థానానికి సమీపంలో పంచాగ్ని మధ్యలో శివపంచాక్షరీ మంత్రాన్ని నిరంతరం జపిస్తూ శివుని గూర్చి తపస్సుచేసింది. ఆమె తపస్సు చేసిన ఆ శిఖరానికి 'గౌరీశిఖరం' అనే పేరు వచ్చింది. ఆమె తన తపశ్చర్యలో భాగంగా పర్ణములను కూడా భుజించడం మానివేసినందున ఆమెకు దేవతలు 'అపర్ణ' అనే నామకరణం చేశారు. ఈ విధంగా ఆ కాళి తపస్సుచేస్తూ ఉండగా మూడువేల సంవత్సరాలు గడిచిపోయాయి. ఆమె తపః ప్రభావం వల్ల ఆమె ఆశ్రమం వద్ద విరోధ జంతువులు కూడా విరోధాన్ని వీడి సహజీవనం చేసేవి. పార్వతి తపస్సు చేసిన

కాలంలో ఆమె తపస్సిద్ధియే వనరూపాన్ని ధరించిందా! అన్నట్లుగా ఆ వనమంతా కైలాసంవలె ప్రకాశించింది (22వ అధ్యాయంలో) కాని శివుడు సాక్షాత్కరింపలేదు అంతట హిమవంతుడు భార్యతోను, కుమారులతోను, మంత్రులతోను కూడి పార్వతి వద్దకువచ్చి శివుడు పొందశక్యం కానివాడని అనేక యుక్తులు పలికి తపస్సు కొనసాగించ వలదని పలికారు. అయినప్పటికీ పార్వతి 'భక్తవత్సలుడైన శంకరుని నేను తపస్సుతో సంతోషింపజేస్తానని' ప్రతిజ్ఞ చేసింది. తదనంతరం ఆమె శివదర్శనం కొరకు ముల్లోకాలు తాపాన్ని పొందేవిధంగా అధికంగా తపమాచరింపసాగింది. దానితో నష్టమైన కాంతికల దేవతలందరు బ్రహ్మతో కూడి విష్ణువును శరణువేడినారు. లోకకల్యాణార్థం పార్వతిని చేపట్టవలెనని మనమందరం శివదేవుని ప్రార్థిద్దామని పలికి రుద్రుడు తపమాచరిస్తున్న స్థలానికి వెళ్ళారు. శివుని వేదాలతో ఉపనిషత్తులతో కూడిన సూక్తాలతో స్తుతించారు (23వ అధ్యాయంలో), వీరి ప్రార్థనను నంది పరమేశ్వరునకు విన్నవించగా శివుడు ధ్యానం నుండి మేల్గాంచి "మీరందరు కామ క్రోధాలను వీడి మీరు కూడ సమాధినిష్ఠితులు కావాలని" హితం పలికి తిరిగి ధ్యానమగ్నుడయ్యాడు.

అంతట విష్ణువు మున్నగు దేవతలందరు కైలాసపతి ప్రసన్నుడయ్యే ఉపాయాన్ని తెలియజేయవలసిందని నందీశ్వరుని ప్రార్థించారు, అంతట నంది 'మహాదేవుడు భక్తికి వశుడౌతాడు. భక్తుని విషయంలో చేయతగని పనిని కూడ చేసిపెడతాడని. కావున మీరందరు మిక్కిలి దైన్యంతో భక్తితో ప్రార్థించండని' దేవతలందరికి ఉపాయాన్ని తెలియజేశాడు. బ్రహ్మాది దేవతలందరు ఈ మహా దుఃఖం నుండి ఉద్ధరించి రక్షించండని శివుని దైన్యంగా వేడుకొన్నారు. వారి దీనాలాపాలను విని భక్తవాత్సల్యంచే ధ్యానాన్ని విరమించి "ఇంద్రియ సుఖాలు నాశనం కలిగిస్తాయి, అయినప్పటికి మీ ప్రార్థనను సఫలం చేస్తాను. నాకు భోగవిలాసాలలో అభిరుచి లేకపోయినప్పటికి తారకాసురుని సంహరించడానికి అవసరమైన పుత్ర సంతానం పొందడానికి పార్వతిని వివాహమాడతాను" అని బ్రహ్మాది దేవతలకు తెలియజేశాడు. ఈ సందర్భంగా శివుని భక్తవాత్సల్యం ఎంతటిదో శివుడే వివరించడం విశేషం (24వ అధ్యాయంలో).

బ్రహ్మాది దేవతలందరు తమతమ స్థానాలకు వెళ్ళగా పార్వతి తపస్సును పరీక్షింపగోరి శివుడు సమాధి స్థితిలోనికి వెళ్ళాడు. పార్వతి తపస్సును చూచి, మిక్కిలి విస్మయాన్ని పొందాడు. సమాధి నుండి చలించి శివుడు వసిష్ఠాది సప్తర్షులను స్మరించాడు. "పార్వతి మనస్సు ఎంత దృఢమైనదో పరీక్షించవలెననియు పూర్తి అసత్యాలు, నిందా వాక్యాలు పార్వతితో పలకవలెననియు సప్తర్షులను ఆజ్ఞాపించాడు, అంతట సప్తర్షులు పార్వతిని సమీపించి 'నీవు బుద్ధిమంతురాలవే అయినను నారదుని ఉపదేశాన్ని పొంది, మూర్ఖురాలవై వ్యర్థంగా కఠిన తపస్సు చేస్తున్నావని పలికి శివనింద చేసి, విష్ణువును వివాహం చేసుకొని సర్వసుఖాలను పొందవలెనని సలహాయిచ్చారు. అంతట పార్వతి గురువు అనుగ్రహం చేత మాత్రమే శివుని యథార్థ స్వరూపాన్ని తెలుసుకోగలిగానని తెలియజేసింది. సప్తర్షులు పలికిన వాక్యాలలోని అంతరార్థాన్ని కూడ వారికి వివరించి చెప్పింది. అంతేగాక శివుడు నన్ను వివాహమాడనిచో నేను శాశ్వతంగా అవివాహితురాలిగానే ఉంటానని ప్రతిజ్ఞచేసింది, పార్వతి దృఢమైన అభిప్రాయాన్ని తెలుసుకొనిన సప్తర్షులు ఈ వృత్తాంతాన్ని అంతటిని శివునకు నివేదించారు (25వ అధ్యాయంలో). సప్తర్షులు పలుకులను వినిన పిమ్మట శంకర ప్రభుడు పార్వతిని తాను స్వయంగా పరీక్షించాలని తలంచి జటాధారియైన

విప్రరూపాన్ని ధరించి పార్వతి తపస్సు చేస్తున్న వనానికి వెళ్ళాడు. ఆమె తపస్సునకు కారణమడిగాడు, అంతట పార్వతి శివుని పెండ్లాడాలనే తలంపుతో తపోదీక్ష వహించాను. కాని చిరకాలం తపస్సు చేసినను శివుని పొందలేక పోయినందున అగ్నిలో ప్రవేశింపదలచానని పలికి అగ్నిలో ప్రవేశించింది. అగ్ని శివమహిమచే గంధపు ముద్దవలె అయ్యింది. అగ్నినుండి పైకి వస్తున్న పార్వతిని చూచి, శివుడు తపస్సునకుగల నిజమైన కారణాన్ని తెలియజేయమని అడిగాడు. అంతట పార్వతి తన చెలికత్తెల ద్వారా తన చరిత్రనంతటిని బ్రాహ్మణునకు తెలియజేసింది. మీరు పలికిన మాటలు నిజమైతే, ఈ మాటలను మీ చెలికత్తె తననోటితోనే చెప్పవచ్చును కదా! అని బ్రాహ్మణుడు ప్రశ్నించడంతో 26వ అధ్యాయం ముగిసింది.

వెంటనే పార్వతి తన మాటలతోనే తన మనస్సులోని అభిప్రాయాన్ని తెలియజేసింది. అంతట ఆ బ్రాహ్మణుడు 'నీకు శివునకు రూపాదులన్నియూ విరుద్ధమైనవే. నీవు సృష్టిలోని అసద్వస్తువులను అన్నింటిని కోరుకుంటున్నావు. శివునితో నీ వివాహం తగినది కాదు. కావున శివుని నుండి నీమనస్సు మళ్ళించుకోవాలని పార్వతితో మోసపు మాటలు పలికాడు (27వ అధ్యాయం) బ్రాహ్మణుని మాటలను విని, మనస్సులో క్రోధాన్ని పొందిన పార్వతి "నేను శంకరుని స్వరూపాన్ని, ఎరుగుదును. శివతత్త్వాన్ని కూడ ఎరుగుదునని" ఆ బ్రాహ్మణునితో పలికి, శంకరస్వ రూపాన్ని, శివతత్త్వాన్ని సంపూర్ణంగా సుమారు 25 శ్లోకాలలో వివరించింది. ఈ సందర్భంగా శివుని ద్వేషించువానిని చూచినవెంటనే కట్టుబట్టలతో స్నానంచేసి ప్రాయశ్చిత్తం చేసుకోవాలని పార్వతీ దేవి స్పష్టంగా వివరించింది అంతేగాక శివనింద చేసేవాడు బ్రాహ్మణుడైనందున అతనిని విడిచి, దూరంగా వెళ్ళిపోవాలని నిశ్చయించుకొని పార్వతి ముందడుగు వేయడానికి సిద్ధమైన సమయంలో శివుడు స్వస్వరూపంలో ప్రత్యక్షమై "ఈనాటి నుండి నేను నీ దాసుణ్ణి, నీవు నా సనాతన ధర్మపత్నివి, లోకలీలానుసారం నిన్ను అనేక విధాల పరీక్షించాను. నీవంటి ప్రేమమూర్తి ముల్లోకాలలోను కానరాదు. నేను నీ వరుడను. నా నివాసమైన కైలాసానికి త్వరలో నిన్ను తోడ్కొని పోతాను" అని పార్వతిని అనుగ్రహించాడు. దేవదేవుని పలుకులతో పార్వతీదేవి శ్రమయంతయు తొలగిపోయింది. మిక్కిలి సంతసించింది (28వ అధ్యాయంలో).

"ఓ ప్రభూ! నీవు భిక్షుకుడవై హిమవంతుని నుండి నన్ను కోరుకొమ్ము. పూర్వం దక్షకన్యగా జన్మించినపుడు మన వివాహం యథావిధిగా నిర్వహింపబడలేదు. నా తండ్రియైన దక్షునిచే గ్రహపూజ జరుపబడలేదు. గ్రహాల విషయంలో అది పెద్దపొరపాటుగా పరిణమించింది. ఇప్పుడు అటువంటి పొరపాటు జరగకూడదు. దేవతల కార్యసిద్ధివై నీవు నన్ను యథావిధిగా వివాహమాడుము" అని పార్వతి శివునకు విన్నవించింది. మహేశ్వరుడు లోకపు తీరును అనుసరించడానికి అట్లే చేస్తానని అంగీకరించాడు. ఈ సందర్భంగా శివపార్వతుల మధ్య జరిగిన సంభాషణ శివపార్వతులు ప్రకృతి పురుషులనే తత్త్వాన్ని, స్పష్టం చేస్తోంది. అంతేగాక భక్తులను ఉద్ధరించడానికి అద్భుతమైన లీలలను ప్రదర్శిస్తారనియు అటువంటి లీలలను కీర్తించడం ద్వారా జనులను వేగంగా సంసార సముద్రం నుండి తరింపజేస్తారనియు, స్పష్టంగా తెలియజేయబడింది (29వ అధ్యాయంలో).

అనంతరం భక్తవత్సలుడు, లీలావిశారదుడునైన శంభుడు నాట్యంచేసే నటుని రూపాన్ని ధరించి, మేనాదేవి వద్దకు వెళ్ళి చక్కని గీతాన్ని వినిపించి, మనోహరమైన నృత్యాన్ని చూపించి మేనాదేవితో సహా అందరినీ మోహపరవశు

లను చేశాడు. మేనాదేవి బంగారు పాత్రలో రత్నాలను పోసి భిక్షుకుని రూపంలో ఉన్న శివునకు ఇవ్వబోగా శివుడు ఆ రత్నాలను నిరాకరించి, పార్వతిని భిక్షగా ఇవ్వమని కోరాడు. దానితో మేనాదేవి, హిమవంతులు మిక్కిలి కోపించి భటులతో ఆదిభిక్షువును బయటకు నెట్టడానికి ప్రయత్నించారు. అంతట లీలావిశారదుడైన శివుడు తన అనంత మహిమలను హిమవంతునకు చూపించాడు. ఆ సమయంలో సర్వదేవతా స్వరూపుడుగా, సగుణ, నిర్గుణ రూపుడుగా హిమవంతునకు సాక్షాత్కరించాడు. దుర్గను భిక్షగా కోరాడు. పర్వతరాజు అంగీకరించలేదు. భిక్షువు ఇతరమైన భిక్షను దేవిని స్వీకరించకుండానే, అంతర్ధానమయ్యాడు. ఆ సమయంలో మేనాహిమవంతులలో మహా మోక్షమును ఇచ్చునదియు, దివ్యమైనదియు, సర్వానంద ప్రదాయినియు అగు శివభక్తి ఉదయించింది (30వ అధ్యాయంలో).

మేనా హిమవంతులకు ఇరువురికి శివునియందు పరాభక్తి కలదని దేవతలకు అందరికి తెలిసింది. హిమవంతుడు తన కుమార్తెయైన పార్వతిని శివునకు కన్యాదానం చేస్తే మహాదేవునితో సారూప్యాన్ని పొంది, తదనంతరం మోక్షాన్ని పొందుతాడని ఆలోచించిన దేవతలు హిమవంతుని వద్దకు బృహస్పతిని పంపాలని తలంచారు. కాని బృహస్పతి అందులకు అంగీకరించలేదు. శివనింద నరకప్రాప్తిని కలుగజేస్తుందని ఈ సందర్భంగా హితవుపలికాడు. బ్రహ్మాది దేవతలందరు ఆలోచించుకొని దేవతలందరు కలిసి కైలాసానికిపోయి శంకరుని ప్రసన్నుని చేసుకొని, శంకరునే హిమవంతుని గృహానికి ప్రయాణం కట్టించడానికి సంకల్పించారు దేవతలందరు వెంటనే శంకరునిదర్శించి తమ అభిప్రాయాన్ని విన్నవించారు. సదాశివుడు అందులకు అంగీకరించి హిమవంతుని వద్దకు బ్రాహ్మణవేషంలో వెళ్ళాడు. శ్మశానవాసి, సంగహీనుడునైన శివునకు పార్వతిని ఇవ్వవలెననే నీ బుద్ధి మంగళదాయకం కాదు. పార్వతిని దానం చేయడానికి శివుడు తగిన పాత్రుడు కాదని పలికి శివుడు తన నివాసానికి చేరుకున్నాడు (31వ అధ్యాయంలో).

బ్రాహ్మణుని మాటలను వినిన మేనాదేవి దుఃఖిస్తూ నా కుమార్తెను కురూపి, దుశ్శీలుడు, అయిన రుద్రునకు ఇవ్వడానికి నిశ్చయించినచో ఆత్మహత్య చేసుకుంటానని పలికి కోపగృహానికి వెళ్ళింది. ఇంతలో విరహంచే దుఃఖితుడైన శంభుడు సప్తర్షులను స్మరించాడు. వారు రాగానే శివుడు జరిగినదంతయు వివరించాడు. మేనా హిమవంతులకు బోధించి, దేవతలకు హితాన్ని చేకూర్చండని సప్తర్షులను కోరాడు. వెంటనే సప్తర్షులు ఆకాశమార్గంలో హిమవంతుని రాజధానికి వెళ్ళారు (32వ అధ్యాయంలో).

పార్వతిని శంకరునికిచ్చి వివాహం చేయవలసినదిగా కోరారు. కాని భిక్షుక రూపధారియైన మహేశ్వరునకు కుమార్తెను ఇవ్వడం ఇష్టంలేదని హిమవంతుడు వారితో చెప్పాడు. అంతట సప్తర్షులు అరుంధతిని మేనక వద్దకు పంపారు. అరుంధతి ఆమెకు అనేక విధాల బోధించింది, సప్తర్షులు హిమవంతునకు అనేక విధాలుగా హితవును బోధించారు. ఈ సందర్భంగా అనరణ్య రాజు, తన కుమార్తెను బ్రాహ్మణులకిచ్చి తన సంపదలను రక్షించుకున్న వృత్తాంతం వసిష్ఠుడు హిమవంతునకు వివరించాడు. అదేవిధంగా నీవు నీకుమార్తెను శివునకిచ్చి, కులాన్నంతటిని రక్షించుకొమ్ము, దేవతలందరు నీకు వశులైనట్లు చేసుకోవలసిందని హిమవంతునకు వసిష్ఠుడు బోధించాడు (33, 34, 35 అధ్యాయాలలో).

వసిష్ఠుని మాటలు వినిన హిమవంతుడు 'నా కర్తవ్యమేమి'టని మేరువు మున్నగు పర్వత శ్రేష్ఠులను ప్రార్థించాడు. పార్వతి దేవకార్యం కొరకు మాత్రమే జన్మించింది. రుద్రుని ఆరాధించింది. రుద్రుడు ఆమెను స్వీకరించడానికి అంగీకరించారు. కాబట్టి పార్వతిని రుద్రునకిచ్చి వివాహం చేయవలసిందని పర్వత శ్రేష్ఠులు హిమవంతునికి తెలియజేశారు. అంతట హిమవంతుడు నా శరీరం, భార్య, కుమారులు, కుమార్తె, సాధన సంపత్తి అన్నీ శివునకు చెందినవేగాని మరియొకటికాదని సప్తర్షులకు విన్నవించాడు, తదనంతరం శివపార్వతుల కల్యాణానికి ఉత్తమ లగ్నాన్ని నిర్ణయించి, పరస్పరం సన్మానించుకొని సప్తర్షులు శివుని సన్నిధికి వెళ్ళారు. సప్తర్షులు పరమేశ్వరునకు "పర్వతరాజు పార్వతిని నీకు వాగ్దత్తం చేశాడు, కాబట్టి నీవు దేవతలతోను గణాలతోను కూడి వివాహనికి తరలివెళ్ళు. నీవు పార్వతిని వివాహమాడి, పుత్రసంతానాన్ని పొందవలసిందని" చెప్పారు. వివాహ విధిని గురించి శంకరునకు వివరించారు (36వ అధ్యాయంలో).

మహర్షుల ఆజ్ఞ ప్రకారం హిమవంతుడు తనపురోహితుడైన గర్గునిచేత లగ్నపత్రికను వ్రాయించాడు. ఆ లగ్నపత్రికను, వివిధములైన వస్తువులను బంధువులతో హిమవంతుడు శివునకు పంపించాడు. వారు ఆ పత్రానికి తిలకం అద్ది శివునకు సమర్పించారు. హిమవంతుడు ఆనందంతో అనేక దేశాలందున్న తన బంధువులందరికి ఆహ్వానాన్ని పంపాడు. వివాహానికి కావలసిన వివిధ సామగ్రులను, బంగారాన్ని ప్రోగుచేయసాగాడు. బంధువులనందరిని ఆహ్వానించాడు. ఈ ద్వీపంలోనేగాక ఇతర ద్వీపాలలో ఉన్న పర్వతాలన్నీ హిమవంతుని నగరానికి విచ్చేశాయి. నదులన్నీ దివ్యరూపాలు ధరించి పార్వతీ పరమేశ్వరుల వివాహానికి విచ్చేశాయి. ఈ విధంగా పార్వతీ పరమేశ్వరుల వివాహానికి కావలసిన సామగ్రీ సంగ్రహం, శైలాగమం, నదులరాక, వివరంగా 37వ అధ్యాయంలో వర్ణింపబడింది.

హిమవంతునిచే ప్రేరితుడైన విశ్వకర్మ అనతికాలంలో అక్కడ దేవసమాజాన్నంతటిని నిర్మించాడు. దివ్యమైన వివాహమంటపాన్ని నిర్మించాడు. దేవతా గణాలకందరికిని నివాసానికిగాను వారి వారి లోకాలను ప్రయత్న పూర్వకంగా నిర్మించాడు. ఈ నిర్మాణాలన్నింటిలో విశ్వకర్మ తన రచనా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. ఈ విధంగా హిమవంతుడు పెండ్లి ఏర్పాట్లనన్నింటిని పూర్తి చేసుకొని, శంభుని రాకకొరకు ఆనందంతో నిరీక్షిస్తున్నాడు (38వ అధ్యాయంలో). పరమశివుని ఆదేశం మేరకు నారదుడు విష్ణువుమున్నగు దేవతలను, మునులను, సిద్ధులను, తక్కినవారినందరిని శివకల్యాణానికి ఆహ్వానించాడు. వారందరు సపరివారంతో శివుని వివాహయాత్రను సుసంపన్నం చేయుడానికి కైలాసానికి విచ్చేశారు. సప్తమాతృకలు యథోచిత రీతిని శివుని అలంకరించారు. లోకాచార నిరతుడైన శంభుడు మండపస్థాపన, నాందీ ముఖం, గ్రహపూజ, రక్షాబంధనం, గ్రహపూజ మున్నగు వివాహ కర్మలన్నింటిని యథావిధిగా ఆచరించాడు, తద్వారా లోకమందంతటా వివాహవిధి ఆచరింపబడేటట్లు చేశాడు. అంతట శివుడు దేవతలను బ్రాహ్మణులను ముందు ఉంచుకొని కైలాసం నుండి హిమవన్నగరానికి పార్వతిని వివాహమాడడానికి బయలుదేరాడు. ఈ విధంగా 39వ అధ్యాయంలో దేవనిమంత్రణ, దేవాగమన, శివయాత్రారంభ వర్ణన గావింపబడింది.

శివ వివాహ యాత్రలో పాల్గొనిన సేనావివరాలు శివయాత్రా వర్ణనమనే 40వ అధ్యాయంలో వర్ణింపబడ్డాయి. శివాజ్ఞ ప్రకారం నారదుడు ముందుగా హిమవన్నగరానికి వెళ్ళి అక్కడ విశ్వకర్మచే నిర్మింపబడిన మాయారచననంతటిని

తిలకించి తిరిగివచ్చి విష్ణ్వాది దేవతలకు అందరికిని వివరించాడు అంతట శివుడు హిమవంతుడు కన్యనిచ్చేసంకల్పంతో ఉన్నపుడు, మనకు మాయతో పనియేమి అని భావించి, విష్ణువు మున్నగు వారితో కూడి హిమవన్నగర సమీపానికి వచ్చాడు (41వ అధ్యాయంలో). ఈశ్వరుడు తన నగరం శివార్లకు వచ్చాడని తెలుసుకొని ఆనందంతో హిమవంతుడు ఎదురేగి ఈశ్వరుని, దేవతా గణాలను దర్శించి పరమానంద భరితుడై వారినందరిని తన నగరానికి సాదరంగా తోడ్కొని వచ్చాడు (42వ అధ్యాయంలో). ఎవని కొరకు పార్వతి గొప్ప తపస్సుచేసిందో అట్టి శివునిరూపం ఎలా ఉంటుందో చూడాలని కోరికతో ప్రాసాదం యొక్క అగ్రభాగంలో ఉన్న మేనాదేవికి గుండె జారిపోయే విధంగా విశ్వేశ్వరుడు ప్రదర్శించిన శివుని అద్భుత లీలావర్ణనం 43వ అధ్యాయంలో వర్ణింపబడింది.

దానితో మేనాదేవి మిక్కిలి సంక్షోభాన్ని పొంది, రోదించి పార్వతిని, సప్తర్షులను నిందించి, ఆ వివాహాన్ని తిరస్కరించింది. ఆ సమయంలో దేవతలందరూ అచ్చటకు విచ్చేశారు. శివుడు సాక్షాత్తుగా పరమానందాన్ని ఇచ్చేవాడు, నీవు ఇప్పుడు చూచినది శివుని వాస్తవరూపంకాదు, కాబట్టి శివునకు పార్వతిని ఈయడానికి అంగీకరించమని నారదాదులు మేనాదేవికి విన్నవించారు. అయినప్పటికి మేనాదేవి అంగీకరించలేదు. అంతట హిమవంతుడు మేనాదేవి చెంతకు చేరి "అనేక నామాలు, రూపాలు ధరించు శంకరుని భయకరరూపాన్ని చూచి నీవు కంగారు పడ్డావు. ఆయన మహా మహిమను చూచి. మనమిద్దరం కన్యను ఆయనకు ఈయడానికి అంగీకరించాము కదా!" అని హితవు పలికాడు. అయినప్పటికి మేనాదేవి మన పుత్రికను వికటరూపుడైన రుద్రునికిచ్చినచో నేను నిశ్చయంగా దేహత్యాగం చేస్తానని హిమవంతునకు తెలియజేసింది. అంతట పార్వతి స్వయంగా అచ్చటకువచ్చి 'సర్వప్రాణులకు శివుడు అధిష్ఠాత, సృష్టి స్థితి లయకారకుడు, వికారాలు లేనివాడు, అట్టి శివునకు కన్యాదానం చేసి నీ గృహస్థాశ్రమాన్ని సఫలం చేసుకో, నేను మరియొక వరుని వివాహమాడనని" మేనాదేవితో నొక్కి వక్కాణించింది. దానితో మేనాదేవి మిక్కిలి కోపంతో పార్వతిని పిడికిళ్ళతోను, మోచేతులతోను కొట్టింది. అక్కడున్న నారదాది మహర్షులు పార్వతిని మేనాదేవి చేతినుండి విడిపించి, దూరంగా తీసుకొనిపోయారు. దానితో మేనక పరిపరివిధాల విలపించి బిగ్గరగా రోదించింది. అంతట విష్ణువు పరమశివుని నుండి వచ్చిన సృష్టిక్రమాన్ని మేనకకు వివరించాడు దానితో మేనకయొక్క మనస్సు కొంచెం మెత్తబడింది. శివుడు సుందరాకారుడైనచో నా కుమార్తెనిస్తాను. అట్లుకానిచో కోటియత్నాలు చేసినప్పటికి నేను ఇవ్వనని దృఢంగా శ్రీమహావిష్ణువుతో మేనాదేవి పలికింది (44వ అధ్యాయంలో).

ఇంతలో విష్ణువుచే ప్రేరితుడైన నారదుడు శంభుని సమీపించి, వివిధ స్తోత్రాలతో స్తుతించి, ప్రసన్నుని గావించుకున్నాడు, అంతట శంభుడు దయాగుణాన్ని ప్రదర్శించి, అద్భుతము, ఉత్తమము, దివ్యమునైన రూపాన్ని ధరించాడు, శివునియొక్క దివ్యమంగళ రూపరేఖా వైభవాలను మేనాదేవి దర్శించింది. క్షణకాలం బిత్తరపోయింది, నేనింతకుముందు శివనిందచేశాను. నన్ను క్షమించి ప్రసన్నుడవు కమ్మని మేనాదేవి శివునకు చేతులు జోడించి నమస్కరించింది. ఇంతలో నగరంలో నివసించే ఎందరో స్త్రీలు శివుని చూడగోరి, వివిధ కార్యాలు విడిచిపెట్టి బయటకు వచ్చారు. శివుని చూచి, తమజన్మలు సార్థకమయ్యాయని ఆనందించారు, శివుని పూజించి సాదరంగా పేలాలు వర్షించి మేనాదేవితో కూడి అక్కడ నిలబడ్డారు (45వ అధ్యాయంలో).

అంతట ప్రసన్నాత్ముడైన శివుడు దూతలతో, శివగణాలతో, దేవతలతో మిగిలిన వారందరితో కూడి హిమవంతుని గృహానికి వెళ్ళాడు, మేనాదేవి చేతిలో దీపపాత్ర ధరించి, శంభునకు నీరాజనమిచ్చింది. ఆనందంతో నిండిన మేనా హిమవంతులు స్త్రీలందరితోగూడి, మహోత్సాహంతో ద్వారం వద్ద జరిగే ఆచారాన్ని అనుష్ఠించారు. మేనాదేవి పార్వతీ పరమేశ్వరుల పేర్లనడిగి చెప్పించింది. శివుడు తన గణాలతో తన విడిది గృహానికి వెళ్ళాడు. హిమవంతుని అంతఃపుర పరిచారికలు కులదేవతను ఆరాధించడానికి పార్వతిని తీసుకొని నగర బహిఃస్థానానికి వెళ్ళారు. అంబికను అర్చించి తిరిగి హిమవంతుని భవనానికి చేరారు. ఈ సందర్భంగా పార్వతీదేవి యొక్క అతిలోక సౌందర్యం వర్ణింపబడింది (46వ అధ్యాయంలో).

పిమ్మట పర్వతరాజు ప్రీతితో శివపార్వతులకు వేదమంత్ర పూర్వకంగా ఉపవీతాలను ధరింపజేశాడు. వేదాచారాన్ని, లోకాచారాన్ని యథావిధిగా ఆచరించి, శివుడిచ్చిన అలంకారాలతో పార్వతిని అలంకరింప చేశారు. అంతేగాక పార్వతి విడదీయబడని జంట వస్త్రాలను ధరించి ప్రకాశించింది. ఇంతలో జ్యోతిశ్శాస్త్ర విశారదుడైన గర్గుడు హిమవంతుని వద్దకు వచ్చి, కన్యాదానానికి సమయమాసన్నమైనదనియు, పాణి గ్రహణం కొరకు శంభుని హిమవంతుని మందిరానికి తోడ్కొని రావలసినదనియు హిమవంతునికి తెలియజేశాడు. అంతట హిమవంతుడు పర్వతులను, బ్రాహ్మణులను ఇతరులను శివుని తీసుకొనిరావడానికి ఆనందంతో పంపాడు. వారందరూ శివునివద్దకు వెళ్ళి కన్యాదాన సమయం సమీపిస్తోంది కాన బయలుదేరండని ప్రార్థించారు. అంతట ప్రసన్నుడైన శివుడు మంగళస్నానాన్ని ఆచరించి చక్కని వస్త్రాలు ధరించి, లోకపాలకులందరూ సేవిస్తూ ఉండగా, వృషభారూఢుడై మంగళవాద్యాలతో, యజ్ఞమండపంలోనికి ప్రవేశించాడు, పర్వతశ్రేష్ఠులు మహేశ్వరుని వృషభం నుండి దింపి, నీరాజనమిచ్చి గృహంలోనికి తోడ్కొని పోయారు. విష్ణువు, బ్రహ్మమున్నగు దేవశ్రేష్ఠులనందరిని రత్నసింహాసనాలపై కూర్చుండబెట్టారు. వివాహ ప్రక్రియనెరిగిన పురోహితుడు, మహాత్ముడైన శంకరునకు మధుపర్కాదికములిచ్చి, చేయదగిన కర్మలనన్నింటిని ఆనందంతో చేయించాడు. శివుడు హిమవంతునితో పాటు వివాహ వేదికలో ప్రవేశించాడు. సర్వాలంకార శోభితయైన పార్వతీదేవి అప్పటికే అక్కడనే ఉంది. గర్గుడు గడియారం ఉన్నచోట కూర్చుండి లగ్నంవరకు ఉన్న మధ్యకాలంలో ఓంకారాన్ని ఉచ్చరించాడు. గర్గుడు పుణ్యాహ మంత్రాలను పఠిస్తూ, పార్వతి దోసిలిలో అక్షతలు నింపాడు. వాటిని ఆమె ఆనందంతో శివుని శిరస్సుపై పోసింది. పెరుగు, అక్షతలు, దర్భలు, జలం మున్నగువానితో పార్వతి రుద్రుని పూజించింది. గర్గాది మునులు చెప్పగా శంభుడు లోకాచారము నందు శ్రద్ధగలవాడై, పార్వతిని పూజించాడు, ఈ విధంగా పరస్పరం పూజించుకొని ఒకరినొకరు చూచుకొనుచున్న పార్వతీ పరమేశ్వరులకు లక్ష్మిమున్నగు స్త్రీలు నీరాజనమిచ్చారు. వారిద్దరినీ చూస్తూ వారందరూ మహానందాన్ని, ఉత్సాహాన్ని పొందారు (47వ అధ్యాయంలో).

ఇంతలో గర్గాచార్యునిచే ప్రేరేపింపబడిన హిమవంతుడు మేనాదేవితో కూడి కన్యాదానానికి ఉపక్రమించాడు. హిమవంతుడు వరుని అర్ఘ్య పాద్యాదులతో ఆనందంగా పూజించాడు. బ్రాహ్మణోత్తములు పరమానందంతో తిథ్యాదులను కీర్తించారు. అంతట "సమయం దాటిపోకుండా నీ గోత్రాన్ని, ప్రవరను, పేరును, వేదాన్ని, వేదశాఖను చెప్పుమని" హిమవంతుడు శివునితో పలికాడు. హిమవంతుని మాటలువిని, అప్పటివరకు సుముఖుడుగా ఉన్న

శివుడు క్షణంలో విముఖుడయ్యాడు. మహేశ్వరుని నోటివెంట సమాధానం రాలేదు. ఇంతలో శివప్రేరితుడైన నారదుడు వీణవాయించడం మొదలుపెట్టాడు. హిమవంతుడు, విష్ణువు మున్నగు వారందరూ ఆపమని గట్టిగా నారదుని హెచ్చరించారు. అంతట నారదుడు 'నీవు ఈ సమయంలో హరుని గోత్రాదులను చెప్పమని ప్రశ్నించావు. ఇది ఎంతటి అపహాస్యకరమైన మాటయో కదా! ఇతని గోత్రాదులు బ్రహ్మవిష్ణువులకు కూడా తెలియవు. ఎవనియొక్క ఒక్క దినంలో కోటిబ్రహ్మలు లయమౌతారో ఆ శంకరుడీనాడు కాళి తపోబలం వల్ల నీకు కనబడ్డాడు. ఈయన నిర్మల, నిరాకార పరబ్రహ్మ ప్రకృతికతీతుడై, ప్రకృతిని తనవశమందుంచుకుంటాడు. ఆయన తన ఇచ్ఛచే సగుణుడై, దేహాన్ని స్వీకరించి అనేక నామాలు ధరిస్తాడు. ఇతడు సుగోత్రుడు, గోత్రహీనుడు. అట్టి శివుడీనాడు పార్వతి తపస్సుచే నీ అల్లుడయ్యాడు శివమాయ దాటడం శక్యంకాదు. విష్ణుబ్రహ్మాదులతో సహా ముల్లోకాలూ, శివమాయాధీనం. ఇటువంటి వరుని విషయంలో అల్పమైన విచారం చేయరాదు. మహేశ్వరుని కులగోత్రాలు కేవలం నాదం మాత్రమేనని తెలుసుకో, శివుడు నాదస్వరూపుడు నాదం శివస్వరూపం. నాదానికి శివునకు భేదంలేదు, అందువల్లనే నేను శివప్రేరితుడనై వీణవాయించాను. తెలుసుకో, పార్వతిని శివునకిచ్చి వివాహం చేయమని" నారదుడు హిమవంతుని హెచ్చరించాడు. అంతట మేరువు మున్నగు పర్వతశ్రేష్ఠులు ఆశ్చర్యపడినవారై ఏకకంఠంతో పర్వతరాజైన హిమవంతునితో కన్యాదాన కార్యమునందు నిమగ్నుడవు కమ్ము. కన్యను ఈశ్వరునకు ఇమ్మని పలికారు. వారిమాటలువిని, హిమవంతుడు బ్రహ్మగారి పర్యవేక్షణలో తనకుమార్తెను శివునకు కన్యాదానం చేయడానికి ఉద్యుక్తుడయ్యాడు. ఈమెను భార్యగా స్వీకరింపమని శివునకు తెలియజేసి, పార్వతిని రుద్రునకు కన్యాదానం చేసాడు. శివుడు పార్వతి కరగ్రహణం చేశాడు. శంకరుడు లోకాచారాన్ని ప్రదర్శించి, భూమిని స్పృశించి, "కామస్యకోఽ దాత్" ఇత్యాది మంత్రాన్ని శ్రద్ధగా పఠించాడు, హిమవంతుడు కన్యాదానానికి లింగంగా యథోచిత పురస్కారం చేశాడు. రక్షాబంధనాలను, వివిధ రత్నాభరణాలను, లక్షగోవులు, వందగుర్రాలు, లక్షమంది దాసీలు, కోటి ఏనుగులు, కోటిబంగారు రథాలు శివునకు బహూకరించి యథావిధిగా కన్యాదానంచేసి, హిమవంతుడు శుక్ల యజుర్వేద మధ్యందిన శాఖయందలి స్తోత్రాన్ని చక్కగా పఠించాడు. అనంతరం వేదవేత్తలు పార్వతి శిరస్సుపై అభిషేకించారు. శివునకు యథావిధిగా ప్రోక్షణ చేశారు. ఈ విధంగా కన్యాదానం పూర్తి చేయబడింది (48వ అధ్యాయంలో).

అనంతరం బ్రాహ్మణులు అగ్నిని వ్రేల్చారు. ఈశ్వరుడు పార్వతి ప్రక్కన కూర్చుండగా హోమం చేశాడు, శివుడు ఋగ్యజుస్సామ మంత్రాలచే అగ్నియందు ఆహుతులనిచ్చాడు. పార్వతి సోదరుడైన మైనాకుడు లాజహోమం చేయించాడు, అంతట పార్వతీ పరమేశ్వరులు ఇరువురూ అగ్నికి ప్రదక్షిణలు చేశారు, ఆ సమయంలో శివమాయమోహితుడైన బ్రహ్మ పార్వతీదేవి పాదాలను, చంద్రవంక వంటి కాలిగోళ్ళను చూసి కామవికారం పొందాడు. వెంటనే వీర్యస్ఖలనమై భూమిపై పడింది. దానిని దాచడానికి బ్రహ్మచరణాలతో మర్దించాడు. ఈ విషయాన్ని గమనించిన రుద్రుడు మిక్కిలి కోపించి బ్రహ్మను చంపడానికి ఉద్యమించాడు, భయభ్రాంతులైన విష్ణువు మున్నగు దేవతలు ఆ సమయంలో శివస్తుతి గావించారు. దానితో ప్రసన్నుడైన శివుడు బ్రహ్మకు అభయమిచ్చాడు, బ్రహ్మనుండి స్ఖలనమైన వీర్యం మరల మరల మర్దింపబడి, అనేక వీర్యకణాలుగా మారి, వాటినుండి గొప్ప తేజస్సుతో ప్రకాశించే వాలఖిల్యులనే వేలాది ఋషులు జన్మించారు. వారందరూ బ్రహ్మచెంత నిలబడ్డారు. అంతట శివాజ్ఞచే నారదుడు

వారినందరిని గంధమాదన పర్వతానికి వెళ్ళి గొప్ప తపస్సుచేసి, మునీశ్వరులై సూర్యునకు శిష్యులు కాగలరని వాలఖిల్యులతో పలుకగా వారందరు శంకరునకు ప్రణమిల్లి గంధమాదన పర్వతానికి వెళ్ళారు. విష్ణువు మున్నగువారు బ్రహ్మను ఓదార్చగా భయాన్ని విడనాడి పరమేశ్వరుని స్తుతించాడు. మహేశ్వరుడు ప్రసన్నుడయ్యాడు (49వ అధ్యాయంలో).

అనంతరం బ్రహ్మ పార్వతీ పరమేశ్వరుల వివాహంలో మిగిలిన కార్యాలను నిర్వహింపజేశారు. అనంతరం దంపతులకు బ్రాహ్మణులు అభిషేకాన్ని సాదరంగా జరిపించారు. తరువాత ధ్రువనక్షత్ర దర్శనం చేయించాడు. అనంతరం హృదయాన్ని స్పృశించడమనే కర్మజరుపబడింది. స్వస్తిపఠనం నిర్వహింపబడింది. బ్రాహ్మణుల ఆజ్ఞచే, శంభుడు పార్వతి శిరస్సుపై సిందూరాన్ని ఉంచాడు. అనంతరం ఆ దంపతులు హోమశేష ద్రవ్యాన్ని ఆనందంతో భుజించారు. అనంతరం శివుడు బ్రహ్మకు పూర్ణపాత్రనిచ్చాడు, శంభుడు గోదానాన్ని ఆచార్యునకిచ్చి మంగళప్రదమైన మహాదానాలు కూడా ప్రీతితో చేశాడు. అనంతరం అచ్చటి స్త్రీలు మహానందంతో పార్వతీ పరమేశ్వరులను తోడ్కొని హిమవంతుని గృహానికి వెళ్ళారు. వారు సాదరంగా నూతన దంపతులచే లోకాచారాలను నిర్వర్తింపజేశారు. అప్పుడు ఆ దంపతులను చూడడానికి సరస్వతి, లక్ష్మి, సావిత్రి, గంగ మున్నగు పదునారుగురు దివ్యస్త్రీలు విచ్చేశారు. ఆ దేవీమూర్తులందరు క్రమంగా ఆ దంపతులతో మధురమైన వాక్కులను పలికారు. అనంతరం మహేశ్వరుడు మృష్టాన్నాన్ని భుజించి, ఆచమనంచేసి, భార్యతో కలిసి కర్పూర తాంబూలాన్ని సేవించాడు (50వ అధ్యాయంలో).

రతీదేవి ఇదియే అనుకూలమైన సమయమని తలంచి తన భర్తను బ్రతికింపుమని శివుని ప్రార్థించింది రతీవిలాపాన్ని విని సరస్వతి మున్నగు దేవతాస్త్రీలు కూడ మన్మథుని బ్రతికింపుమని శివుని ప్రార్థించారు. రతీదేవి మూటకట్టియున్న మన్మథుని భస్మాన్ని శివుని ముందు ఉంచింది. శివుని అమృత దృష్టిచే భస్మంనుండి అదేరూపం, వేషం, చిహ్నాలుగల అద్భుతమైన, సుందరమైన దేహంకలవాడై మన్మథుడు బయటకు వచ్చాడు. భార్యతోకూడి మన్మథుడు శివుని స్తుతించాడు. దానితో ప్రసన్నుడైన శివుడు వరం కోరుకొమ్మనగా మన్మథుడు 'పూర్వం తాను చేసిన అపరాధాన్ని మన్నించి, శివభక్తులయందు పరమ ప్రీతిని, శివుని పాదాలయందు భక్తిని ప్రసాదింపుమని శంకరుని వేడుకున్నాడు' శివుడు అనుగ్రహించాడు. శంభుడు విడిది గృహంలో పార్వతిని ఎడమవైపు కూర్చుండబెట్టుకొని, ఆమెకు మృష్టాన్నాన్ని తినిపించగా ఆమెకూడా ఆనందంతో ఆయనకు తినిపించింది. తరువాత శంభుడు అచ్చట కర్తవ్యాన్ని పూర్తిచేసి, మేనాహిమవంతుల అనుమతినిపొంది, జనావాసానికి వెళ్ళాడు. దేవతలు జయస్తోత్రం చేశారు. విష్ణువు మున్నగు దేవతలందరూ పరమేశ్వరుని అనుమతిని పొంది, మహానందంతో సాదరంగా తమతమ స్థానాలకు వెళ్ళారు (51వ అధ్యాయంలో).

హిమవంతుడు ఏర్పాటుచేసిన విందు భోజనాల వర్ణన ఈ సందర్భంగా సుమారు 13శ్లోకాలలో వర్ణింపబడింది, అనంతరం శంభుని నివాసగృహశోభ, శివలోక రచనావైభవం సుదీర్ఘంగా వర్ణింపబడింది. ఈ విధంగా వరవర్గ భోజన, శివశయన వర్ణనంతో 52వ అధ్యాయం ముగిసింది. వివాహయజ్ఞంలో రెండవనాడు, మూడవనాడు,

నాలుగవ నాడు చేయవలసిన కర్మలను ఆచరించిన విధం వర్ణింపబడింది. 5వ రోజు ఉదయమే దేవతలందరూ హిమవంతునకు తిరుగు యాత్రగురించి విన్నవించారు. పార్వతి చిన్ననాటి నుండి శివుని గూర్చి ఎంత తపించిందో మేనాదేవి వివరించింది, అనంతరం హిమవంతునకు మంగళాశాసనంచేసి శివుడు తిరుగు ప్రయాణానికి సిద్ధమై పార్వతిరాకకై ప్రతీక్షిస్తుండగా 53వ అధ్యాయం ముగిసింది.

ఒక బ్రాహ్మణ స్త్రీ పార్వతికి బోధించిన అతి విస్తారమైన, సంపూర్ణమైన పతివ్రతాధర్మవర్ణనం 54వ అధ్యాయంలో వర్ణింపబడింది. పార్వతిని శివునితో పంపించే సందర్భంగా మేనా హిమవంతులు రోదించిన తీరు కరుణారసభరితంగా సాగింది, ఆ సందర్భంగా జ్ఞాని శ్రేష్ఠుడైన పురోహితుడు సుఖకరమైన ఆధ్యాత్మ విద్యను వారందరికి బోధించాడు. అనంతరం బ్రహ్మాది దేవతలందరూ పార్వతీ పరమేశ్వరుల వివాహాన్ని ప్రీతితో కొనియాడుతూ తమతమ నివాసాలకు వెళ్ళారు. శివుడు కూడా పార్వతితో కలిసి కైలాసంచేరి గణాలందరూ సేవిస్తూ ఉండగా ఆనందంగా విహరింపసాగాడు. ఈ విధంగా పరమమంగళము, శోకాన్ని నశింపజేయునదియు, ఆనందాన్ని కలిగించునదియు, ఆయుర్దాయాన్ని ఇచ్చునదియు, ధనవర్ధనమునగు పార్వతీ కల్యాణం బ్రహ్మ నారదునకు వివరించడం (55వ అధ్యాయం)తో శివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందలి మూడవదైన పార్వతీఖండం సమాప్తమౌతుంది.

ఈ పార్వతీ ఖండం పఠించడంవల్ల, వినడంవల్ల కలిగే ఫలశ్రుతికూడా ఈ సందర్భంలో ఇలా వివరింపబడింది. "ఎవడైతే దీనిని నిత్యం శుచియై, దానియందు మనస్సు లగ్నంచేసి వింటాడో, లేదా నియమంతో వినిపిస్తాడో అట్టివాడు శివలోకాన్ని పొందుతాడు.

కీర్తినికలిగించునదియు, స్వర్గాన్నిచ్చునదియు, ఆయుష్యమునిచ్చునదియు, పుత్రపౌత్రకరమును, ఇహలోకంలో సర్వకామప్రదమును, భుక్తి ముక్తిప్రదమును, అపమృత్యు ప్రశమనమును, మహాశాంతికరమును, శుభకరమును, సమస్త దుస్స్వప్న ప్రశమనమును, బుద్ధి ప్రజ్ఞాది సాధనమును, శివసంతోష కారణమునగు ఈ వృత్తాంతం శుభాన్ని కోరే జనులు శివోత్సవాలన్నింటియందును, శ్రద్ధతో, ప్రీతితో పఠించాలి. దేవాదులను, శివుని ప్రతిష్ఠించే సమయంలోను, సర్వకార్యాలను ఆరంభించే శుభసమయంలోను, దీనిని ప్రత్యేకించి, మిక్కిలి ప్రీతితో పఠించాలి, లేదా శుచియై పార్వతీ పరమేశ్వరుల ఈ మంగళచరిత్ర వినాలి. ఆ విధంగా చేస్తే సర్వకార్యాలు సిద్ధిస్తాయి. ఇది ముమ్మాటికీ సత్యం. ఇందులో సందేహం లేదు.

**॥ సిద్ధ్యంతి సర్వకార్యాణి సత్యం సత్యం న సంశయః ॥**

**"సర్వేజనాః సుఖినో భవన్తు"**

సదా శ్రీవారి సేవలో

**ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి**

ఓం శ్రీనివాస పరబ్రహ్మణే నమః

శ్రీవేదవ్యాస విరచితం

# శ్రీ శివమహాపురాణం – రుద్రసంహిత

# సతీఖండః – సతీఖండం

## ప్రథమోऽధ్యాయః – మొదటి అధ్యాయం

## సతీసంక్షేపచరిత్రవర్ణనమ్ – సంక్షిప్త సతీచరిత్ర

**నారద ఉవాచ** – నారదుడు పలికాడు.

**విధే! సర్వం విజానాసి కృపయా శంకరస్య చ ।**
**త్వయాద్భుతా హి కథితాః కథా మే శివయోశ్శుభాః ॥1॥**

ఓ బ్రహ్మదేవా! శంకరుని దయవల్ల నీకు అన్నీ తెలుసు. నీవు నాకు అద్భుతములైన, శుభకరములైన పార్వతీపరమేశ్వరుల కథలు చెప్పావు.

**త్వన్ముఖాంభోజసంవృత్తాం శ్రుత్వా శివకథాం పరామ్ ।**
**అతృప్తో హి పునస్తాం వై శ్రోతుమిచ్ఛామ్యహం ప్రభో ॥2॥**

ఓ ప్రభూ! నీ ముఖపద్మం నుండి తెలియబడిన గొప్పదైన శివకథను విన్నాను. అయినా నాకు తృప్తి కలగడం లేదు. మరలా శివకథను వినాలని అనుకుంటున్నాను.

**పూర్ణాంశశ్శంకరస్యైవ యో రుద్రో వర్ణితః పురా ।**
**విధే! త్వయా మహేశానః కైలాసనిలయో వశీ ॥3॥**

**స యోగీ సర్వవిష్ణ్వాది సురసేవ్యస్సతాం గతిః ।**
**నిర్ద్వంద్వః క్రీడతి సదా నిర్వికారీ మహాప్రభుః ॥4॥**

ఓ బ్రహ్మదేవా! శంకరుని పూర్ణాంశ అవతారమైన రుద్రుని గురించి తమరు ఇది వరకే తెలియజేశారు. మహేశ్వరుడు కైలాస వాసి. యోగి అయిన అతడు విష్ణువు మున్నగు దేవతల చేత సేవింపబడేవాడు. సత్పురుషులకు అతడే గతి అతడు ద్వంద్వాలకు అతీతుడు, నిర్వికారియై ఎల్లపుడు క్రీడిస్తూ ఉండే మహాప్రభువు.

**సోऽభూత్పునర్గృహస్థశ్చ వివాహ్య పరమాం స్త్రియమ్ ।**
**హరిప్రార్థనయా ప్రీత్యా మంగలాం స్వతపస్వినీమ్ ॥5॥**

ఆయన విష్ణువు ప్రార్థనను మన్నించి తన గురించి తపస్సు చేసిన శ్రేష్ఠమయినస్త్రీ సర్వమంగళను ప్రేమతో పెళ్లి చేసుకుని తిరిగి గృహస్థుడయ్యాడు.

**ప్రథమం దక్షపుత్రీ సా పశ్చాత్సా పర్వతాత్మజా ।**
**కథమేకశరీరేణ ద్వయోరప్యాత్మజా మతా ॥6॥**

ఆమె ముందుగా దక్షుని కూతురు. తర్వాత హిమవంతుని కూతురు. ఇది ఎలా కుదురుతుంది? ఒకే శరీరంతో ఇద్దరికి కూతుళ్లుగా ఎలా కాగలదు?

**కథం సతీ పార్వతీ సా పునశ్శివముపాగతా ।**
**ఏతత్సర్వం తథాన్యచ్చ బ్రహ్మన్ గదితుమర్హసి ॥7॥**

సతి పార్వతి శివుణ్ణి ఎలా పొందింది? ఓ బ్రహ్మదేవా! నీవు ఈ కథను, ఇతర కథలను పూర్తిగా వివరించుము.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఇతి తస్య వచః శ్రుత్వా సురర్షేశ్శంకరాత్మనః ।**
**ప్రసన్నమానసో భూత్వా బ్రహ్మా వచనమబ్రవీత్ ॥8॥**

ఈ విధముగా దేవర్షి, శివ భక్తుడు అయిన నారదుని ప్రశ్నలను విని ప్రసన్నాత్ముడై బ్రహ్మదేవుడు ఈ విధంగా చెప్పనారంభించాడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికెను.

**శృణు తాత మునిశ్రేష్ఠ కథయామి కథాం శుభామ్ ।**
**యాం శ్రుత్వా సఫలం జన్మ భవిష్యతి న సంశయః ॥9॥**

వత్సా! మహర్షీ! విను. శుభకరమైన కథ చెప్తాను. ఈ కథను విన్నవాళ్ల జన్మసార్థకం అవుతుందనడంలో సందేహం లేదు.

**పురాహం స్వసుతాం దృష్ట్వా సంధ్యాహ్వాం తనయైస్సహ ।**
**అభవం వికృతస్తాత కామబాణప్రపీడితః ॥10॥**

పూర్వం నేను నా కుమారులతో కలసి ఉండగా నా కూతురైన సంధ్య కనబడింది. అపుడు నేను మన్మథబాణాలతో పీడింపబడి వికారం పొందాను.

**ధర్మః స్మృతస్తదా రుద్రో మహాయోగీ పరః ప్రభుః ।**
**ధిక్కృత్య మాం సుతైస్తాత స్వస్థానం గతవానయమ్ ॥11॥**

అపుడు ధర్ముడు రుద్రుని స్మరించాడు. అతట మహాయోగి, మహాప్రభువైన రుద్రుడు కుమారులతో కలసి ఉన్న నన్ను నిందించాడు. ఆ విధంగా నిందించి ఆయన తన నివాసానికి వెళ్లాడు.

**యన్మాయా మోహితశ్చాహం వేదవక్తా చ మూఢధీః ।**
**తేనాకార్షం సహాకార్యం పరమేశేన శంభునా ॥12॥**

నేను వేదాలను లోకంలో అందించిన వాణ్ణి అయినప్పటికీ శివుని మాయచే మోహితుడనై, మూర్ఖుడ నయ్యాను. అందువల్లనే శంభుని విషయంలో దోషం చేశాను.

**తదీర్ష్యయాహమకార్షం బహూపాయాన్సుతైస్సహ ।**
**కర్తుం తన్మోహనం మూఢశ్శివమాయా విమోహితః ॥13॥**

శివమాయ వల్ల మోహంతో మూర్ఖుడనైన నేను ఆయన మీద ఈర్ష్యతో, పుత్రులతో కలసి ఆయనను మోహింపచేయటానికి అనేక ప్రయత్నాలు చేశాను.

**అభవంస్తేఽథ వై సర్వే తస్మిన్ శంభౌ పరప్రభౌ ।**
**ఉపాయా నిష్ఫలాస్తేషాం మమ చాపి మునీశ్వర ॥14॥**

ఓ మహర్షీ! పరమాత్మ అయిన శంభునిపై నేను, నా కుమారులూ ప్రయోగించిన ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి.

**తదాఽస్మరం రమేశానం వ్యర్థోపాయస్సుతైస్సహ ।**
**అబోధయత్స ఆగత్య శివభక్తిరతస్సుధీః ॥15॥**

ఈ విధంగా ఉపాయాలన్నీ వ్యర్థం కాగానే నేను కొడుకులతో కలిసి రమాపతిని స్మరించాను. అపుడు శివభక్తుడు, జ్ఞానియు అయిన విష్ణువు వచ్చి నా మూఢత్వాన్ని పోగొట్టాడు.

**ప్రబోధితో రమేశేన శివతత్త్వప్రదర్శినా ।**
**తదీర్ష్యామత్యజం సోఽహం తం హఠం న విమోహితః ॥16॥**

శివతత్త్వాన్ని బోధించి రమాపతి నా కళ్లు తెరిపించాడు. అపుడు నేను ఈర్ష్యను విడిచిపెట్టాను. కాని మోహంలో ఉన్న నేను మొండిపట్టును విడిచిపెట్టలేదు.

**శక్తిం సంసేవ్య తత్ప్రీత్యోత్పాదయామాస తాం తదా ।**
**దక్షాద(సి)శిక్న్యాం వీరిణ్యాం స్వపుత్రాద్ధరమోహనే ॥17॥**

అపుడు శక్తిని సేవించి ఆమె అనుగ్రహంతో శివుణ్ణి మోహింపచేయటం కోసం నా కుమారుడైన దక్షుని వలన వీరిణి అనే అసిక్నియందు ఆమె పుట్టేలా చేశాను.

**సోమా భూత్వా దక్షసుతా తపః కృత్వా తు దుస్సహమ్ ।**
**రుద్రపత్న్యభవద్భక్త్యా స్వభక్తహితకారిణీ ॥18॥**

ఆ ఉమాదేవి దక్షుని కుమార్తెగా పుట్టి, దుస్సహమైన తపస్సును భక్తితో చేసి రుద్రునికి భార్య అయ్యింది. ఆమె తన భక్తులకు కోరినది ప్రసాదించగలదు.

**సోమో రుద్రో గృహీ భూత్వాఽకార్షీల్లీలాం పరాం ప్రభుః ।**
**మోహయిత్వాథ మాం తత్ర స్వవివాహేఽవికారధీః ॥19॥**

పరమేశ్వరుడైన రుద్రుడు ఉమాదేవితో కలసి గృహస్థుడై గొప్ప లీలలను ప్రకటించాడు. ఆయన బుద్ధియందు వికారాలుండవు. ఆయన తన వివాహంలో నన్ను మోహింపజేశాడు.

**వివాహ్య తాం స ఆగత్య స్వగిరౌ సూతికృత్తయా ।**
**రేమే బహువిమోహో హి స్వతంత్రస్స్వాత్తవిగ్రహః ॥20॥**

సృష్టిని చేసేవాడు, మోహాలు లేనివాడు, స్వతంత్రుడు, స్వేచ్ఛగా రూపాలను ధరించేవాడు అయిన రుద్రుడు ఆమెను పెళ్లిచేసుకొని, తన పర్వతాన్ని చేరి బహువిధాలుగా రమించాడు.

**తయా విహరతస్తస్య వ్యతీయాయ మహాన్ మునే ।**
**కాలస్సుఖకరశ్శంభోర్నిర్వికారస్య సద్రతేః ॥21॥**

ఓ మహర్షీ! వికారాలు లేని వాడు అయిన శంభుడు చిరకాలం ఆమెతో విహరిస్తూ సుఖంగా కాలం గడిపాడు.

**తతో రుద్రస్య దక్షేణ స్పర్ధా జాతా నిజేచ్ఛయా ।**
**మహామూఢస్య తన్మాయామోహితస్య సుగర్విణః ॥22॥**

అపుడు శివమాయవలన మహామూర్ఖుడు, శివమాయా మోహితుడు, గర్విష్ఠి అయిన దక్షునితో రుద్రునకు విరోధం ఏర్పడింది.

**తత్ప్రభావాద్ధరం దక్షో మహాగర్వీ విమూఢధీః ।**
**మహాశాంతం నిర్వికారం నినింద బహుమోహితః ॥23॥**

చాలా గర్వం, మూఢ బుద్ధిగల దక్షుడు, చాలా శాంతస్వరూపుడు, వికారాలు లేని శివుణ్ణి, శివ మాయాప్రభావం వల్ల నిందించాడు.

**తతో దక్షస్స్వయం యజ్ఞం కృతవాన్ గర్వితోఽహరమ్ ।**
**సర్వానాహూయ దేవాదీన్ విష్ణుం మాం చాఖిలాధిపః ॥24॥**

అపుడు గర్వితుడైన దక్షుడు దేవతలనందరిని, నన్ను, విష్ణువును ఆహ్వానించి, శివుడు లేకుండా యజ్ఞాన్ని చేశాడు.

**నాజుహావ తథా భూతో రుద్రం రోషసమాకులః ।**
**తథా తత్ర సతీం నామ్నా స్వపుత్రీం విధిమోహితః ॥25॥**

మోహం, గర్వం, రోషంతో కల్లోలమైన మనసుగల దక్షుడు రుద్రుని, రుద్రుని సతియైన తన కుమార్తెను ఆ యజ్ఞానికి ఆహ్వానించలేదు.

**యదా నాకారితా పిత్రా మాయామోహితచేతసా ।**
**లీలాం చకార సుజ్ఞానా మహాసాధ్వీ శివా తదా ॥26॥**

మాయచే విమూఢుడైన తండ్రి తనని పిలవలేదని గొప్పజ్ఞానవతి, మహాసాధ్వియైన సతీదేవి భావించింది.

**అథాగతా సతీ తత్ర శివాజ్ఞామధిగమ్య సా ।**
**అనాహూతాపి దక్షేణ గర్వీణా స్వపితుర్గృహమ్ ॥27॥**

అపుడు సతీదేవి శివుని ఆజ్ఞను ధిక్కరించి, గర్విష్ఠి అయిన దక్షుడు పిలవకపోయినా, తన తండ్రి ఇంటికి వెళ్లింది.

**విలోక్య రుద్రభాగం నో ప్రాప్యావజ్ఞాం చ తాతతః ।**
**వినింద్య తత్ర తాన్ సర్వాన్ దేహత్యాగమథాకరోత్ ॥28॥**

అక్కడ ఆయజ్ఞంలో రుద్రునికి భాగం లేకపోవడం, తండ్రి చేసిన అవమానాన్ని చూసి అక్కడున్న వారినందరినీ నిందించి, తన దేహాన్ని విడిచి పెట్టింది.

**తచ్ఛ్రుత్వా దేవదేవేశః క్రోధం కృత్వా తు దుస్సహమ్ ।**
**జటాముత్కృత్య మహతీం వీరభద్రమజీజనత్ ॥29॥**

దేవదేవుడైన శివుడు జరిగిన ఆ సంగతి విని సహింపరాని కోపాన్ని తెచ్చుకొని, పెద్దజటను ఒకదానిని తీసి వీరభద్రుణ్ణి జనియింపచేసాడు.

**సగణం తం సముత్పాద్య కిం కుర్యామితి వాదినమ్ ।**
**సర్వాపమానపూర్వం హి యజ్ఞధ్వంసం దిదేశ హ ॥30॥**

వీరభద్రునితోపాటు గణాలను కూడా పుట్టించాడు. “నేనేమి చేయాలి?” అని ప్రశ్నించిన వీరభద్రునికి అందర్ని అవమానించి, దక్షయజ్ఞాన్ని నాశనం చేయమని ఆదేశించాడు.

**తదాజ్ఞాం ప్రాప్య స గణాధీశో బహుబలాన్వితః ।**
**గతోఽరం తత్ర సహసా మహాబలపరాక్రమః ॥31॥**

**మహోపద్రవమాచేరుర్గణాస్తత్ర తదాజ్ఞయా ।**
**సర్వాన్ స దండయామాస న కశ్చిదవశేషితః ॥32॥**

గణాధీశుడైన ఆ వీరభద్రుడు శివుని ఆజ్ఞను పొంది, గొప్ప సైన్యంతో అక్కడికి వెంటనే వెళ్లాడు, గొప్పబలం, పరాక్రమం కల్గిన ఆ వీరభద్రుని ఆజ్ఞచే గణాలు అక్కడ గొప్ప ఉపద్రవాన్ని చేశారు. ఆతడు ఎవ్వరినీ మిగల్చకుండా అందరిని దండించాడు.

**విష్ణుం సంజిత్య యత్నేన సామరం గణసత్తమః ।**
**చక్రే దక్షశిరచ్ఛేదం తచ్ఛిరోగ్నౌ జుహావ చ ॥33॥**

గణశ్రేష్ఠుడైన వీరభద్రుడు దేవతలతో కూడిన విష్ణువును జయించి, దక్షుని తలను నరికి, దానిని అగ్నిలో హుతం చేశాడు.

**యజ్ఞధ్వంసం చకారాశు మహోపద్రవమాచరన్ ।**
**తతో జగామ స్వగిరిం ప్రణనామ ప్రభుం శివమ్ ॥34॥**

అక్కడ గొప్ప ఉపద్రవాన్ని కలిగించి, దక్ష యజ్ఞాన్ని ధ్వంసం చేసి, తర్వాత కైలాసపర్వతాన్ని చేరుకొని, శివప్రభువుకి నమస్కారం చేశాడు.

**యజ్ఞధ్వంసోఽభవచ్చేత్థం దేవలోకే హి పశ్యతి ।**
**రుద్రస్యానుచరైస్తత్ర వీరభద్రాదిభిః కృతః ॥35॥**

వీరభద్రుడు, మొదలుగా గల రుద్రుని అనుచరులు, ఈ విధంగా దేవతలు చూస్తుండగా యజ్ఞాన్ని ధ్వంసం చేశారు.

**మునే! నీతిరియం జ్ఞేయా శృతిస్మృతిషు సమ్మతా ।**
**రుద్రే రుష్టే కథం లోకే సుఖం భవతి సుప్రభౌ ॥36॥**

మహర్షీ! మహాప్రభువైన రుద్రుడు కోపిస్తే లోకంలో సుఖం ఎలా ఉంటుంది? స్మృతులు తెలియజేస్తున్న ఈ నీతిని మనం తెలుసుకోవాలి.

**తతో రుద్రః ప్రసన్నోఽభూత్ స్తుతిమాకర్ణ్య తాం పరామ్ ।**
**విజ్ఞప్తిం సఫలాం చక్రే సర్వేషాం దీనవత్సలః ॥37॥**

అపుడు దేవతలందరూ చేసిన గొప్పస్తోత్రాలను విని దీనవత్సలుడైన రుద్రుడు ప్రసన్నుడై వారి విన్నపాలను సఫలం చేశాడు.

**పూర్వవచ్చ కృతం తేన కృపాలుత్వం మహాత్మనా ।**
**శంకరేణ మహేశేన నానాలీలావిహారిణా ॥38॥**

ఈ విధంగా శంకరుడు అనేకలీలలను ప్రదర్శించాడు. మహాత్ముడు అయిన రుద్రుడు తిరిగి ఎప్పటి వలెనే కరుణను చూపించాడు.

**జీవితస్తేన దక్షో హి తత్ర సర్వే హి సత్కృతాః ।**
**పునస్స కారితో యజ్ఞశ్శంకరేణ కృపాలునా ॥39॥**

ఆయన దక్షుణ్ణి జీవింప చేసి, అక్కడున్నవారినందరిని సత్కరించాడు. కృపానిధి అయిన శంకరుడు తిరిగి ఆ యజ్ఞాన్ని యథావిధిగా చేయించాడు.

**రుద్రశ్చ పూజితస్తత్ర సర్వైర్దేవైర్విశేషతః ।**
**యజ్ఞే విష్ణ్వాదిభిర్భక్త్యా సుప్రసన్నాత్మభిర్మునే ॥40॥**

ఆ యజ్ఞంలో సుప్రసన్నాత్ములయిన దేవతలందరూ విష్ణువును ముందుంచుకొని భక్తితో రుద్రుని ప్రత్యేకంగా పూజించారు.

**సతీదేహసముత్పన్నా జ్వాలా లోకసుఖావహా ।**
**పతితా పర్వతే తత్ర పూజితా సుఖదాయినీ ॥41॥**

ఓ మహర్షీ! సతీదేహం నుండి పుట్టిన జ్వాల పర్వతమునందు పడింది. ఆమెను అచట పూజిస్తే సకల సుఖాలు కలుగుతాయి.

**జ్వాలాముఖీతి విఖ్యాతా సర్వకామఫలప్రదా ।**
**బభూవ పరమా దేవీ దర్శనాత్పాపహారిణీ ॥42॥**

అన్ని కోరికలను తీర్చి, దర్శనమాత్రంచేతనే పాపాలు పోగొట్టే ఆ దేవదేవి జ్వాలాముఖి అని పేరు పొందింది.

**ఇదానీం పూజ్యతే లోకే సర్వకామఫలాప్తయే ।**
**సంవిధాభిరనేకాభిః మహోత్సవపురస్సరమ్ ॥43॥**

ఇప్పటికీ ఆమె లోకంలో అందరి కోర్కెలను తీర్చడానికి, మహోత్సవంగా అనేక విధాలుగా పూజింపబడుతోంది.

**తతశ్చ సా సతీ దేవీ హిమాలయసుతాఽభవత్ ।**
**తస్యాశ్చ పార్వతీ నామ ప్రసిద్ధమభవత్తదా ॥44॥**

ఆ తర్వాత ఆ సతీదేవి హిమాలయుని కుమార్తె అయ్యింది. అపుడామెకు పార్వతి అనే పేరు వచ్చింది.

**సా పునశ్చ సమారాధ్య తపసా కఠినేన వై ।**
**తమేవ పరమేశానం భర్తారం సముపాశ్రితా ॥45॥**

ఆమె మరల కఠోరమైన తపస్సు చేసి ఆ పరమేశ్వరుని భర్తగా పొందింది.

**ఏతత్సర్వం సమాఖ్యాతం యత్పృష్టోఽహం మునీశ్వర ।**
**యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే నాత్ర సంశయః ॥46॥**

ఓ మునిశ్రేష్ఠా! నువ్వు నన్ను అడిగిన విషయాలన్నింటినీ చెప్పాను. దీనిని విన్నవారి పాపాలన్నీ తొలగిపోతాయనడంలో సందేహం లేదు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే సతీసంక్షేపచరిత్ర వర్ణనం నామ ప్రథమోఽధ్యాయః ॥1॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో సంక్షిప్త సతీచరిత్ర అనే మొదటి అధ్యాయం సమాప్తం.

## ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయము

## కామప్రాదుర్భావః - మన్మథజననం

**సూత ఉవాచ** - సూతుడు చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య నైమిశారణ్యవాసినః ।**
**పప్రచ్ఛ చ మునిశ్రేష్ఠః కథాం పాపప్రణాశినీమ్ ॥1॥**

ఓ నైమిశారణ్యవాసులారా! బ్రహ్మయొక్క ఈ మాటలను విని మునిశ్రేష్ఠుడైన నారదుడు పాపాలను పోగొట్టే కథను గురించి అడిగాడు.

**నారద ఉవాచ** - నారదుడు పలికాడు.

**విధే విధే మహాభాగ కథాం శంభోశ్శుభావహామ్ ।**
**శృణ్వన్ భవన్ముఖాంభోజాన్న తృప్తోఽస్మి మహాప్రభో ॥2॥**

ఓ బ్రహ్మదేవా! మహాత్మా! మహాప్రభో! నీ ముఖపద్మంనుండి శంభుని గాథను ఎంత విన్నప్పటికీ, నాకు తృప్తి కలగడం లేదు.

**అతః కథయ తత్సర్వం శివస్య చరితం శుభమ్ ।**
**సతీకీర్త్యన్వితం దివ్యం శ్రోతుమిచ్ఛామి విశ్వకృత్ ॥3॥**

ఓ సృష్టికర్తా! నువ్వు శివుని శుభచరిత్రను సంపూర్ణంగా చెప్పు. సతీదేవి యొక్క యశస్సుతో కూడిన ఆ దివ్యగాథను నేను వినాలనుకుంటున్నాను.

**సతీ హి కథముత్పన్నా దక్షదారేషు శోభనా ।**
**కథం హరో మనశ్చక్రే దారాహరణకర్మణి ॥4॥**

మంగళస్వరూపురాలైన సతి దక్షపత్నియందు ఎలా పుట్టింది? ఆమెను శివుడు పెళ్లాడాలనుకోవడానికి గల కారణం ఏమిటి?

**కథం వా దక్షకోపేన త్యక్తదేహా సతీ పురా ।**
**హిమవత్తనయా జాతా భూయో వాకాశమాగతా ॥5॥**

సతీదేవి పూర్వం దక్షుని మీద కోపంతో శరీరాన్ని విడిచి హిమవంతుని కూతురై పుట్టిన కథ ఏమిటి? ఆమె తిరిగి శివుణ్ణి భర్తగా పొందిన విధం ఏమిటి?

**పార్వత్యాశ్చ తపోఽత్యుగ్రం వివాహశ్చ కథం త్వభూత్ ।**
**కథమర్ధశరీరస్థా బభూవ స్మరనాశినః ॥6॥**

పార్వతి యొక్క అత్యుగ్రమైన తపస్సు, వివాహం ఏ విధంగా సుసంపన్నం అయ్యాయి? మన్మథుని భస్మం చేసిన శివునికి ఆమె అర్ధాంగి ఎట్లయ్యింది?

**ఏతత్సర్వం సమాచక్ష్వ విస్తరేణ మహామతే ।**
**నాన్యోఽస్తి సంశయచ్ఛేత్తా త్వత్సమో న భవిష్యతి ॥7॥**

ఓ బుద్ధిశాలీ! వీటన్నింటినీ వివరంగా చెప్పండి. సందేహాలను పోగొట్టడంలో నీకు సమానుడైనవాడు వేరొకడు లేడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**శృణు త్వం చ మునే సర్వం సతీశివయశశ్శుభమ్ ।**
**పావనం పరమం దివ్యం గుహ్యాద్గుహ్యతమం పరమ్ ॥8॥**

ఓ మహర్షీ! శుభకరం, పవిత్రం చేసేది, గొప్పది, దివ్యమైనది, రహస్యాలలోకెల్లా రహస్యమైన సతీశివుల కీర్తిని పూర్తిగా విను.

**ఏతచ్ఛంభుః పురోవాచ భక్తవర్యాయ విష్ణవే ।**
**పృష్టస్తేన మహాభక్త్యా పరోపకృతయే మునే ॥9॥**

ఓ మహర్షీ! శివభక్తులలోకెల్లా శ్రేష్ఠుడైన విష్ణువు లోకోపకారం కోసం గొప్పభక్తితో పూర్వం ఇలాగే అడుగగా శంభుడు చెప్పాడు.

**తతస్సోఽపి మయా పృష్టో విష్ణుశ్శైవవరస్సుధీః ।**
**ప్రీత్యా మహ్యం సమాచఖ్యౌ విస్తరాన్మునిసత్తమ ॥10॥**

ఓ మునీంద్రా! శివభక్తులలో శ్రేష్ఠుడు, జ్ఞాని అయిన విష్ణువు నేను అడిగితే ఆయన నాకు ప్రీతితో విస్తారంగా చెప్పాడు.

**అహం తత్కథయిష్యామి కథామేతాం పురాతనీమ్ ।**
**శివాశివయశోయుక్తాం సర్వకామఫలప్రదామ్ ॥11॥**

శివాశివుల కీర్తితో కూడినది, అన్ని కోరికలను తీర్చేది అయిన ఈ పురాతన కథను నేను నీకు చెబుతాను.

**పురా యదా శివో దేవో నిర్గుణో నిర్వికల్పకః ।**
**అరూపశ్శక్తిరహితశ్చిన్మాత్రస్సదసత్పరః ॥12॥**

శివదేవునికి రెండు రూపాలున్నాయి. ఒక రూపంలో ఆయన నిర్గుణుడు. నిర్వికల్పుడు. రూపం లేని వాడు. శక్తిభేదము లేని వాడు. చైతన్యఘనుడు. మరియు కార్యకారణభవాతీతుడు.

**అభవత్సగుణస్సోఽపి ద్విరూపశ్శక్తిమాన్ ప్రభుః ।**
**సోమో దివ్యాకృతిర్విప్ర నిర్వికారీ పరాత్పరః ॥13॥**

ఆయనే రెండవ రూపంలో సగుణుడు, శక్తిభేదం కలవాడు. జగత్ ప్రభువు. ఉమాసహితుడు. దివ్యమైన ఆకారం కలవాడు. ఓ విప్రా! ఆయన వికారాలు లేనివాడు. అందరిలో గొప్పవాడు.

**తస్య వామాంగజో విష్ణుర్బ్రహ్మాహం దక్షిణాంగజః ।**
**రుద్రో హృదయతో జాతోఽభవచ్చ మునిసత్తమ! ॥14॥**

విష్ణువు ఆయన ఎడమభాగం నుండి పుట్టాడు. బ్రహ్మనైన నేను ఆయన కుడిభాగం నుండి పుట్టాను. ఓ మునిశ్రేష్ఠా! రుద్రుడు హృదయం నుండి పుట్టాడు.

**సృష్టికర్తాభవం బ్రహ్మా విష్ణుః పాలనకారకః ।**
**లయకర్తా స్వయం రుద్రస్త్రిధాభూతస్సదాశివః ॥15॥**

బ్రహ్మనైన నేను సృష్టిని చేశాను. విష్ణువు పాలిస్తున్నాడు. రుద్రుడు లయాన్ని చేస్తాడు. సదాశివుడు ఈ త్రిమూర్తుల రూపంలో ఉన్నాడు.

**తమేవాహం సమారాధ్య బ్రహ్మా లోకపితామహః ।**
**ప్రజాస్ససర్జ సర్వాస్తాస్సురాసురనరాదికాః ॥16॥**

లోకానికి పితామహుడు, బ్రహ్మ అయిన నేను ఆ సదాశివుని ఆరాధించి దేవతలు, రాక్షసులు, మానవులు మొదలైన సంతతిని పుట్టించాను.

**సృష్ట్వా ప్రజాపతీన్ దక్షప్రముఖాన్ సురసత్తమాన్ ।**
**అమన్యం సుప్రసన్నోఽహం నిజం సర్వమహోన్నతమ్ ॥17॥**

దక్షుడు మొదలైన ప్రజాపతులను దేవశ్రేష్ఠులను సృష్టించి, నేను చాలా ఆనందించి, సుప్రసన్నుడనై నన్ను చాలా గొప్పవానిగా భావించాను.

**మరీచిమత్రిం పులహం పులస్త్యాంగిరసౌ క్రతుమ్ ।**
**వసిష్ఠం నారదం దక్షం భృగుం చేతి మహాప్రభూన్ ॥18॥**

**బ్రహ్మాహం మానసాన్ పుత్రానసర్జం చ యదా మునే ।**
**తదా మన్మనసో జాతా చారురూపా వరాంగనా ॥19॥**

బ్రహ్మనైన నేను మరీచి, అత్రి, పులహుడు, పులస్త్యుడు, అంగీరసుడు, క్రతువు, వసిష్ఠుడు, నారదుడు, దక్షుడు, భృగువు మొదలైన గొప్పసమర్థులను మానసపుత్రులను సృష్టించిన తర్వాత నా మనసునుండి సుందరమైన రూపం, శ్రేష్ఠమైన అవయవాలు గల యువతి పుట్టింది.

**నామ్నా సంధ్యా దివః క్షాంతా సాయం సంధ్యా జపంతికా ।**
**అతీవ సుందరీ సుభ్రూర్మునిచేతో విమోహినీ ॥20॥**

ఆమె పేరు సంధ్య. ఆమె పగటికాలంలో క్షీణించి సాయంకాలం సుందరంగా ప్రకాశిస్తుంది. ఆమె చాలా అందగత్తె. చక్కని కనుబొమ్మలు కలిగి, మహర్షుల మనసులకు మోహం కలిగించేది.

**న తాదృశీ దేవలోకే న మర్త్యే న రసాతలే ।**
**కాలత్రయేఽపి వై నారీ సంపూర్ణగుణశాలినీ ॥21॥**

అన్ని గుణాలతో విరాజిల్లే ఆ సుందరితో సమానమైన స్త్రీ మూడుకాలాలలోను, దేవ, మనుష్య, పాతాళ లోకాలలోను కూడ లేదు.

**దృష్ట్వాహం తాం సముత్థాయ చింతయన్ హృది హృద్గతమ్ ।**
**దక్షాదయశ్చ స్రష్టారో మరీచ్యాద్యాశ్చ మత్సుతాః ॥22॥**

**ఏవం చింతయతో మే హి బ్రహ్మణో మునిసత్తమ ।**
**మానసః పురుషో మంజురావిర్భూతో మహాద్భుతః ॥23॥**

ఆమెను చూసి నేను లేచి నిలబడి, నా మనస్సులో నా కుమారుడైన దక్షాది ప్రజాపతులను మరీచి మొదలైన ఋషులను స్మరిస్తుండగా అట్టి నా నుంచి ఒక మానసపుత్రుడు పుట్టాడు. ఓ మునిశ్రేష్ఠా! అతడు మంచిసౌందర్యం కల్గి, మహాద్భుతంగా ఉన్నాడు.

**కాంచనీకృతజాతాభిః పీనోరస్కస్సునాసికః ।**
**సువృత్తోరు కటీ జంఘో నీలవేలిత కేసరః ॥24॥**

అతడు బంగారంలా ప్రకాశిస్తున్నాడు. అతడు దృఢమైన వక్షస్థలం, అందమైన ముక్కు, గుండ్రని తొడలు, కటి భాగమూ, మోకాళ్లు, పిక్కలూ, నల్లని జుట్టును కలిగి ఉన్నాడు.

**లగ్నభ్రూయుగలః లోలః పూర్ణచంద్రనిభాననః ।**
**కపాటాయతసద్వక్షో రోమరాజీవరాజితః ॥25॥**

అతని కనుబొమలు కలిసి వుండి అందంగా కదుల్తున్నాయి. అతని ముఖం పూర్ణిమనాటి చంద్రునిలా ఉంది. తలుపును పోలిన విశాలమైన వక్షస్థలం గల అతడు రోమవరుసలతో ప్రకాశిస్తున్నాడు.

**అభ్రమాతంగకాకారః పీనో నీలసువాసకః ।**
**ఆరక్తపాణినయనముఖపాదకరోద్భవః ॥26॥**

అతడు మేఘంలా, ఏనుగులా ప్రకాశించాడు. అతడు చాలా బలంగా ఉన్నాడు. నీలంరంగు కల్గిన బట్టలను ధరించాడు. అతని చేతులు, కళ్లు, ముఖం, పాదాలు రక్తవర్ణంలో ఉన్నాయి.

**క్షీణమధ్యశ్చారుదంతః ప్రమత్తగజగంధనః ।**
**ప్రఫుల్లపద్మపత్రాక్షః కేసరఘ్రాణతర్పణః ॥ 27॥**

అతడు సన్నని నడుముతో, అందమైన పలువరుసతో, మదించిన ఏనుగులా సుగంధం కలవాడై, విచ్చుకున్న పువ్వురేకుల వంటి కళ్లు కలవాడై ఉన్నాడు. పున్నాగపువ్వువంటి ముక్కుతో ప్రకాశిస్తున్నాడు.

**కంబుగ్రీవో మీనకేతుః ప్రాంశుర్మకరవాహనః ।**
**పంచపుష్పాయుధో వేగీ పుష్పకోదండమండితః ॥28॥**

అతడు శంఖం వంటి కంఠాన్ని, చేప కేతనం కలిగి ఉన్నాడు. పొడవైన వాడు, మొసలి వాహనంగా కల్గి అయిదు పువ్వులే ఆయుధంగా కలిగి ఉన్నాడు. వేగం కలిగి పూలవిల్లుతో ప్రకాశిస్తున్నాడు.

**కాంతః కటాక్షపాతేన భ్రామయన్నయనద్వయమ్ ।**
**సుగంధిమారుతో తాత శృంగారరససేవితః ॥29॥**

మంచికాంతికలవాడు. కళ్లను ఇటూ అటూ తిప్పుతూ చూసే వాడు. వత్సా! అతని మీది నుంచి వచ్చే గాలి పరిమళంగా ఉంది. అతనిని శృంగారరసం సేవిస్తోందన్నట్లు ఉన్నాడు.

**తం వీక్ష్య పురుషం సర్వే దక్షాద్యా మత్సుతాశ్చ యే ।**
**ఔత్సుక్యం పరమం జగ్ముర్విస్మయావిష్టమానసాః ॥30॥**

ఆ పురుషుణ్ణి చూసి దక్షుడు మొదలైన నా కుమారులంతా విస్మయంతో కూడిన మనస్సు కలవారై మిక్కిలి ఉత్సుకతను పొందినవారయ్యారు.

**అభవద్వికృతం తేషాం మత్సుతానాం మనో ద్రుతమ్ ।**
**ధైర్యం నైవాలభత్తాత! కామాకులితచేతసామ్ ॥31॥**

కామంతో వ్యాకులమైన నా కుమారుల మనస్సు వికారం పొందింది. వత్సా! వాళ్లంతా ధైర్యాన్ని పోగొట్టుకున్నారు.

**మాం సోఽపి వేధసం వీక్ష్య స్రష్టారం జగతాం పతిమ్ ।**
**ప్రణమ్య పురుషః ప్రాహ వినయానతకంధరః ॥32॥**

ఆ పురుషుడు స్రష్ట. జగత్తుకు ప్రభువు. బ్రహ్మనైన నన్ను చూసి వినయంతో తలవంచి నమస్కారం చేసి నాతో ఇలా అన్నాడు.

**పురుష ఉవాచ –** పురుషుడు అన్నాడు.

**కిం కరిష్యామ్యహం కర్మ బ్రహ్మంస్తత్ర నియోజయ ।**
**మాన్యోద్య పురుషో యస్మాదుచితశ్శోభితో విధే ॥33॥**

ఓ బ్రహ్మదేవా! నేను చేయవలసిన పని ఏమిటి? దాని కోసం నన్ను వినియోగించండి. ఓ బ్రహ్మ! ఈ లోకంలో పూజ్యనీయుడు, ధర్మంతో శోభిల్లేవాడివి నీవే కదా!

**అభిమానం చ యోగ్యం చ స్థానం పత్నీ చ యా మమ ।**
**తన్మే వద త్రిలోకేశ త్వం స్రష్టా జగతాం పతిః ॥34॥**

నా పేరును, నాకు యోగ్యమైన స్థానాన్ని మరియు నా భార్యగురించి నాకు చెప్పండి. మూడులోకాలకు ప్రభువైన ఓ బ్రహ్మా! సృష్టించేవాడవు, జగత్తుకు పతివి నీవే కదా!

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఏవం తస్య వచశ్శ్రుత్వా పురుషస్య మహాత్మనః ।**
**క్షణం న కించిత్ప్రావోచత్స స్రష్టా చాతివిస్మితః ॥35॥**

ఆ పురుషుని మాటలను విన్న బ్రహ్మ ఆశ్చర్యపడి క్షణకాలం ఏమీ మాట్లాడలేదు.

**అతో మనస్సుసంయమ్య సమ్యగుత్సృజ్య విస్మయమ్ ।**
**అవోచత్పురుషం బ్రహ్మా తత్కామం చ సమావహన్ ॥36॥**

అపుడు బ్రహ్మ మనసును నిలదొక్కుకొని, ఆశ్చర్యాన్ని పూర్తిగా విడిచి, అతణ్ణి చేరదీసి ఆ పురుషునితో అతడు అడిగినదానిననుసరించి ఇలా అన్నాడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**అనేన త్వం స్వరూపేణ పుష్పబాణైశ్చ పంచభిః ।**
**మోహయన్ పురుషాన్ స్త్రీంశ్చ కురు సృష్టిం సనాతనీమ్ ॥37॥**

నువ్వు ఈ రూపంతో ఉండి, అయిదు పుష్పాలబాణాలతో స్త్రీ పురుషులను మోహపెట్టి, సనాతనమైన సృష్టి చేయి.

**అస్మిన్ జీవాశ్చ దేవాద్యాస్త్రైలోక్యే సచరాచరే ।**
**ఏతే సర్వే భవిష్యంతి న క్షమాస్త్వవలంబనే ॥38॥**

స్థావరజంగమాత్మకమైన ఈ మూడులోకాలలో దేవతలు మొదలైన జీవులందరూ కలసి నిన్ను కాదని నిలబడుటకు సమర్థులు కాలేరు.

**అహం వా వాసుదేవో వా స్థాణుర్వా పురుషోత్తమః ।**
**భవిష్యామస్తవ వశే కిమన్యే ప్రాణధారకాః ॥39॥**

నేను, వాసుదేవుడు, శివుడు కూడా నీకు వశమయ్యే వాళ్లమే. ఇంక ఇతర ప్రాణులగురించి చెప్పేది ఏముంది?

**ప్రచ్ఛన్నరూపో జంతూనాం ప్రవిశన్ హృదయం సదా ।**
**సుఖహేతుస్స్వయం భూత్వా సృష్టిం కురు సనాతనీమ్ ॥40॥**

నువ్వు ప్రాణులలో హృదయాలలో ఎపుడూ రహస్యరూపంలో ఉండి వారికి స్వయంగా సుఖానికి కారణమౌతూ సనాతనమైన సృష్టిని చెయ్యాలి.

**త్వత్పుష్పబాణస్య సదా సుఖలక్ష్యం మనోద్భుతమ్ ।**
**సర్వేషాం ప్రాణినాం నిత్యం సదా మదకరో భవాన్ ॥41॥**

అద్భుతమైన ఆ మనస్సు ఎపుడూ నీ పుష్పబాణాలకు లక్ష్యమై సుఖాన్నిస్తుంది. నీవు ప్రాణులందరికీ ఎపుడూ మదాన్ని కలిగిస్తావు.

**ఇతి తే కర్మ కథితం సృష్టిప్రావర్తకం పునః ।**
**నామాన్యేతే వదిష్యంతి సుతా మే తవ తత్త్వతః ॥42॥**

ఈ విధంగా నేను సృష్టిని అభివృద్ధిని చేసే నీ పనులను గూర్చి చెప్పాను. నా కుమారులు నీ స్వరూపానికి అనువైన పేర్లను చెప్తారు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**ఇత్యుక్త్వాహం సురశ్రేష్ఠ స్వసుతానాం ముఖాని చ ।**
**ఆలోక్య స్వాసనే పాద్మే ప్రోపవిష్టోఽభవం క్షణమ్ ॥43॥**

ఓ దేవశ్రేష్ఠా! నేను ఇలా చెప్పి, నా కుమారుల ముఖాలను చూసి, పద్మాసనంలో కూర్చున్నాను.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే కామప్రాదుర్భావో నామ ద్వితీయోఽధ్యాయః ॥2॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో మన్మథజననం అనే రెండవ అధ్యాయం సమాప్తం.

## **తృతీయోఽధ్యాయః** – మూడవ అధ్యాయము

## **కామశాపానుగ్రహమ్** – కామశాపానుగ్రహం

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**తతస్తే మునయస్సర్వే తదభిప్రాయవేదినః ।**
**చక్రుస్తదుచితం నామ మరీచిప్రముఖాస్సుతాః ॥1॥**

మరీచి మొదలైన ఆ మునులందరూ మరియు కుమారులు బ్రహ్మయొక్క అభిప్రాయం తెలుసుకొని ఆ పురుషునకు యోగ్యమైన పేరు పెట్టారు.

**ముఖావలోకనాదేవ జ్ఞాత్వా వృత్తాంతమన్యతః ।**
**దక్షాదయశ్చ స్రష్టారస్థానం పత్నీం చ తే దదుః ॥2॥**

బ్రహ్మ వారి ముఖాల వైపు చూడగా ఆయన అభిప్రాయాన్ని గ్రహించి దక్షాది ప్రజాపతులు ఆ పురుషునకు స్థానాన్ని, భార్యను ఏర్పాటు చేశారు.

**తతో నిశ్చిత్య నామాని మరీచిప్రముఖా ద్విజాః ।**
**ఊచుస్సంగతమేతస్మై పురుషాయ మమాత్మజాః ॥3॥**

అపుడు నా కుమారులైన మరీచి మొదలైన ఋషులు అతని పేరును నిశ్చయించి, యుక్తమైన ఆ మాటను ఆ పురుషునితో చెప్పారు.

**ఋషయ ఊచుః** – ఋషులు చెప్పారు.

**యస్మాత్ప్రమథసే తత్త్వం జాతోఽస్మాకం యథా విధేః ।**
**తస్మాన్మన్మథనామా త్వం లోకే ఖ్యాతో భవిష్యసి ॥4॥**

నువ్వు పుట్టగానే మా యొక్క, బ్రహ్మ యొక్క మనసులను మథించావు. కాబట్టి నీవు లోకంలో మన్మథుడనే పేరుతో ప్రసిద్ధి కెక్కుతావు.

**జగత్సు కామరూపస్త్వం త్వత్సమో న హి విద్యతే ।**
**అతస్త్వం కామ నామాపి ఖ్యాతో భవ మనోభవ ॥5॥**

మనసులో పుట్టే ఓ మన్మథా! నీకు నచ్చిన అనేకరూపాలను ధరించటంలో నీతో సమానమైన వాడు ప్రపంచంలో లేడు. కాబట్టి నువ్వు "కాముడు" అనే పేరుతో గొప్పవాడవౌతావు.

**మదనాన్మదనాఖ్యస్త్వం జాతో దర్పాత్సదర్పకః ।**
**తస్మాత్కందర్ప నామాపి లోకే ఖ్యాతో భవిష్యసి ॥6॥**

నీవు జనులకు మదమును కలుగ చేస్తావు. కాబట్టి నీకు మదనుడు అని పేరు. నీవు దర్పం కలవాడివి. దర్పం నుండి పుట్టావు. కాబట్టి నీకు లోకంలో కందర్పుడనే పేరు ప్రసిద్ధి అవుతుంది.

**త్వత్సమం సర్వదేవానాం యద్వీర్యం న భవిష్యతి ।**
**తతః స్థానాని సర్వాణి సర్వవ్యాపీ భవాంస్తతః ॥7॥**

నీతో సమానమైన బలం కలవాడు మరొకరు ఉండబోడు. కావున అన్నిచోట్లా నీవు వ్యాపించి సర్వవ్యాపి అని పేరొందుతావు.

**దక్షోఽయం భవతే పత్నీం స్వయం దాస్యతి కామినీమ్ ।**
**ఆద్యః ప్రజాపతిర్యో హి యథేష్టం పురుషోత్తమః ॥8॥**

పురుషశ్రేష్ఠుడు, మొదటి ప్రజాపతి అయిన ఈ దక్షుడు తనకు నచ్చిన విధంగా నీకు నిన్ను ప్రేమించే భార్యను స్వయంగా ఇస్తాడు.

**ఏషా చ కన్యకా చారురూపా బ్రహ్మమనోభవా ।**
**సంధ్యా నామ్నేతి విఖ్యాతా సర్వలోకే భవిష్యతి ॥9॥**

బ్రహ్మ మనసునుంచి పుట్టిన ఈ సౌందర్యరూపం గల కన్య లోకాలన్నింటియందు సంధ్య అను పేరుతో ప్రసిద్ధి చెందుతుంది.

**బ్రహ్మణో ధ్యాయతో యస్మాత్సమ్యగ్జాతా వరాంగనా ।**
**అతస్సంధ్యేతి విఖ్యాతా క్రాంతాభా తుల్యమల్లికా ॥10॥**

ధ్యానం చేస్తున్న బ్రహ్మనుండి ఈ సుందరి చక్కగా జన్మించింది. కాబట్టి ఈమె సంధ్య అని పేరు పొందింది. ఈ సుందరి మల్లెతీగలా ప్రకాశిస్తోంది.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**కౌసుమాని తథాస్త్రాణి పంచాదాయ మనోభవః ।**
**ప్రచ్ఛన్నరూపీ తత్రైవ చింతయామాస నిశ్చయమ్ ॥11॥**

మనసులో పుట్టే మన్మథుడు అయిదు పుష్పబాణాలను తీసుకొని, మారువేషంలో అక్కడే ఉండి ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు.

**హర్షణం రోచనాఖ్యం చ మోహనం శోషణం తథా ।**
**మారణం చేతి ప్రోక్తాని మునేర్మోహకరాణ్యపి ॥12॥**

మునులకు కూడా మోహాన్ని కలిగించు ఈ బాణాలకు హర్షణం, రోచనం, మోహనం, శోషణం మరియు మారణం అని పేర్లు ఉన్నాయి.

**బ్రహ్మణా మమ యత్కర్మ సముద్దిష్టం సనాతనమ్ ।**
**తదిహైవ కరిష్యామి మునీనాం సన్నిధౌ విధేః ॥13॥**

బ్రహ్మ నాకు ఉపదేశించిన సనాతనసృష్టికార్యక్రమాన్ని నేను ఇక్కడే ఈ మునుల సన్నిధిలో, బ్రహ్మ సన్నిధిలో ప్రయోగిస్తాను.

**తిష్ఠంతి మునయశ్చాత్ర స్వయం చాపి ప్రజాపతిః ।**
**ఏతేషాం సాక్షిభూతం మే భవిష్యంత్యద్య నిశ్చయమ్ ॥14॥**

ఇక్కడ మునులున్నారు. ప్రజాపతి కూడా స్వయంగా ఉన్నాడు. నా నిర్ణయానికి వీరందరూ సాక్షులు అవుతారు.

**సంధ్యాపి బ్రహ్మణా ప్రోక్తా చేదానీం ప్రేషయేద్వచః ।**
**ఇహ కర్మ పరీక్ష్యైవ ప్రయోగాన్మోహయామ్యహమ్ ॥15॥**

సంధ్య కూడా ఇక్కడే ఉంది. బ్రహ్మచే నిర్మితమైన పుష్పబాణం ప్రయోగకర్మను పరీక్షకోసం ఈమెపై ప్రయోగించి నేను ఈమెను మోహింపజేస్తాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**ఇతి సంచింత్య మనసా నిశ్చిత్య చ మనోభవః ।**
**పుష్పజం పుష్పజాతస్య యోజయామాస మార్గణైః ॥16॥**

మన్మథుడు ఈ విధంగా నిర్ణయించుకొని పుష్పబాణాలను ఎక్కుపెట్టాడు.

**ఆలీఢస్థానమాసాద్య ధనురాకృష్య యత్నతః ।**
**చకార వలయాకారం కామో ధన్వివరస్తదా ॥17॥**

అపుడు కాముడు కుడికాలును ముందుకు వంచి, ఎడమ కాలును వెనుకకు పెట్టి, ధనుస్సును బలంగా లాగి గుండ్రంగా చేశాడు.

**సంహితే తేన కోదండే మారుతాశ్చ సుగంధయః ।**
**వవుస్తత్ర మునిశ్రేష్ఠ సమ్యగాహ్లాదకారిణః ॥18॥**

అతడు ధనుస్సును ఎక్కుపెట్టగానే పరిమళభరితాలైన గాలులు అక్కడ వీచాయి. ఓ మహర్షీ! ఆ గాలులు చక్కని ఆహ్లాదాన్ని కలిగించాయి.

**తతస్తానపి ధాత్రాదీన్ సర్వానేవ చ మానసాన్ ।**
**పృథక్ పుష్పశరైః తీక్ష్ణైర్మోహయామాస మోహనః ॥19॥**

మోహింప చేసే ఆ మన్మథుడు తీక్ష్ణములైన పూలబాణాలతో బ్రహ్మను, అతని మానస పుత్రులందర్నీ మోహింప చేశాడు.

**తతస్తే మునయస్సర్వే మోహితాశ్చాప్యహం మునే ।**
**సంహితో మనసా కంచిద్వికారం ప్రాపురాదితః ॥20॥**

ఓ మునీ! అపుడు నేను, ఆ మునులందరూ మోహితులమయ్యాము. మొట్టమొదటిసారిగా బ్రహ్మాదులు మనసులో ఒకరకమైన వికారాన్ని పొందారు.

**సంధ్యాం సర్వే నిరీక్షంతస్సవికారం ముహుర్ముహుః ।**
**ఆసన్ ప్రవృద్ధమదనాః స్త్రీ యస్మాన్మదనైధినీ ॥21॥**

వారంతా సంధ్యను మళ్లీ మళ్లీ వికారాలతో చూశారు. వాళ్ల మన్మథవికారాలు పెరిగిపోయాయి. స్త్రీ కామవికారాన్ని పెంచుతుంది కదా!

**తతస్సర్వాన్ స మదనో మోహయిత్వా పునః పునః ।**
**యథేంద్రియవికారం తే ప్రాపుస్తానకరోత్తథా ॥22॥**

ఈ విధంగా మన్మథుడు వాళ్లందరిని మళ్లీ మళ్లీ మోహింపచేసి వాళ్లు ఇంద్రియవికారం పొందేలా చేశాడు.

**ఉదీరితేంద్రియో ధాతా వీక్ష్యాహం స యదా చ తామ్ ।**
**తదైవ చోనపంచాశద్భావా జాతాశ్శరీరతః ॥23॥**

బ్రహ్మనైన నేను పెరిగిన ఇంద్రియవికారంతో ఆమెను చూస్తున్న సమయంలో శరీరంనుండి నలభైతొమ్మిది (49) భావాలు పుట్టాయి.

**సాపి తైర్వీక్ష్యమాణాథ కందర్పశరపాతనాత్ ।**
**చక్రే ముహుర్ముహుర్భావాన్ కటాక్షావరణాదికాన్ ॥24॥**

వారందరూ అలా చూస్తుండగా ఆమెపై కూడా మన్మథబాణాల ప్రభావం పడింది. ఆమె కూడా క్రీగంటితో చూడడం, సంజ్ఞలు (సైగలు) తో ఆహ్వానించఃడం మొదలైన శృంగారవికారాలను ఎక్కువగా చేయడం మొదలుపెట్టింది.

**నిసర్గసుందరీ సంధ్యా తాన్ భావాన్ మానసోద్భవాన్ ।**
**కుర్వంత్యతితరాం రేజే స్వర్ణదీవ తనూర్మిభిః ॥25॥**

సహజసుందరి అయిన సంధ్య మనసులో పుట్టే కామభావాలను ప్రకటిస్తూ, చిన్న తరంగాలున్న మందాకినీ నదిలా ప్రకాశించింది.

**అథ భావయుతాం సంధ్యాం వీక్ష్యాకార్షం ప్రజాపతిః ।**
**ధర్మాభిపూరితతనురభిలాషమహం మునే ॥26॥**

ఓ మహర్షీ! ప్రజాపతి అయిన నేను కామభావంతో ఉన్న సంధ్యను చూసి, కామభావంతో ఆమెను కావాలని కోరుకున్నాను.

**తతస్తే మునయస్సర్వే మరీచ్యత్రిముఖా అపి ।**
**దక్షాద్యాశ్చ ద్విజశ్రేష్ఠ ప్రాపుర్వైకారికేంద్రియమ్ ॥27॥**

అపుడు ఆ మరీచి, అత్రి మొదలగు మునులు, దక్షుడు మొదలగు ప్రజాపతులు కూడా ఇంద్రియవికారాలు పొందారు.

**దృష్ట్వా తథావిధా దక్షమరీచిప్రముఖాశ్చ మామ్ ।**
**సంధ్యాం చ కర్మణి నిజే శ్రద్దధే మదనస్తదా ॥28॥**

ఓ విప్రా! దక్షుడు, మరీచి, నేను అలా అవటం చూసి మరియు సంధ్యను చూసి మన్మథునికి తన సామర్థ్యంపై నమ్మకం పెరిగింది.

**యదిదం బ్రహ్మణా కర్మ మమోద్దిష్టం మయాపి తత్ ।**
**కర్తుం శక్యమితి హ్యద్ధా భావితం స్వభువా తదా ॥29॥**

బ్రహ్మ తనకు అప్పగించిన పనిని నేను చేయగలననే విశ్వాసం మన్మథునికి దృఢంగా కలిగింది.

**ఇత్థం పాపగతిం వీక్ష్య భ్రాతౄణాం చ పితుస్తథా ।**
**ధర్మస్సస్మార శంభుం వై తదా ధర్మావనం ప్రభుమ్ ॥30॥**

అపుడు ధర్ముడు పాపభావనలతో ఉన్న సోదరులను, తండ్రిని చూసి ధర్మరక్షకప్రభువైన శివుణ్ణి స్మరించాడు.

**సంస్మరన్మనసా ధర్మం శంకరం ధర్మపాలకమ్ ।**
**తుష్టావ వివిధైర్వాక్యైర్దీనో భూత్వాజసంభవః ॥31॥**

బ్రహ్మపుత్రుడైన ధర్ముడు దీనుడై ధర్మపాలకుడు, ధర్మస్వరూపుడు అయిన శంకరుణ్ణి మనసులో స్మరిస్తూ అనేక వాక్యాలతో ఇలా స్తుతించాడు.

**ధర్మ ఉవాచ –** ధర్ముడు పలికాడు.

**దేవ దేవ మహాదేవ ధర్మపాల నమోస్తు తే ।**
**సృష్టిస్థితివినాశానాం కర్తా శంభో త్వమేవ హి ॥32॥**

దేవదేవా! మహాదేవా! ధర్మరక్షకా! నీకు నమస్కారం. శంభో! సృష్టిస్థితిలయకర్తవు నీవే కదా!

**సృష్టౌ బ్రహ్మా స్థితౌ విష్ణుః ప్రలయే హరరూపధృక్ ।**
**రజస్సత్త్వతమోభిశ్చ త్రిగుణైరగుణః ప్రభో ॥33॥**

ప్రభో! గుణరహితుడవైన నీవు రజస్సు, సత్త్వ, తమస్సు అనే గుణాలను తీసుకొని, సృష్టియందు బ్రహ్మరూపాన్ని, స్థితియందు విష్ణురూపాన్ని, ప్రళయమందు రుద్రరూపాన్ని ధరిస్తావు.

**నిస్త్రైగుణ్యః శివః సాక్షాత్తుర్యశ్చ ప్రకృతేః పరః ।**
**నిర్గుణో నిర్వికారీ త్వం నానాలీలావిశారదః ॥34॥**

శివుడు మూడుగుణాలకు అతీతుడు. త్రిమూర్తులకు అతీతమైన తురీయతత్త్వమే శివుడు. ఆయన ప్రకృతికంటే ఉత్కృష్టమైనవాడు. అలాంటి నీవు నిర్గుణుడవు. నిర్వికారుడవు. అయినా అనేకలీలలను ప్రదర్శించటంలో నీవు సమర్థుడవు.

**రక్ష రక్ష మహాదేవ పాపాన్మాం దుస్తరాదితః ।**
**మత్పితాయం తథా చేమే భ్రాతరః పాపబుద్ధయః ॥35॥**

మహాదేవా! దాటలేని ఈ పాపం నుండి నన్ను రక్షించు. నా తండ్రి మరియు నా సోదరులు పాపబుద్ధిని కలిగి ఉన్నారు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**ఇతి స్తుతో మహేశానో ధర్మేణైవ పరః ప్రభుః ।**
**తత్రాజగామ శీఘ్రం వై రక్షితుం ధర్మమాత్మభూః ॥36॥**

పరమప్రభువు, స్వయంభువుడైన మహేశ్వరుడు ధర్మునిచే ఈ విధంగా స్తుతించబడి, వెంటనే ధర్మరక్షణకోసం అక్కడికి వచ్చాడు.

**జాతో వియద్గతశ్శంభుర్విధిం దృష్ట్వా తథావిధమ్ ।**
**మాం దక్షాద్యాంశ్చ మనసా జహాసోపజహాస చ ॥ 37॥**

నన్ను, దక్షుడు మొదలైన వారందరిని చూసిన శంభుడు ఆకాశమునందే ఉండి చిరు నవ్వులు చిందించాడు.

**స సాధువాదం తాన్ సర్వాన్ విహస్య చ పునః పునః ।**
**ఉవాచేదం మునిశ్రేష్ఠ లజ్జయన్ వృషభధ్వజః ॥38॥**

వృషభవాహనుడైన ఆ శివుడు వారందరితో "సాధు సాధు" అని పలికాడు. ఓ మహర్షీ! ఆయన మరల మరల నవ్వి, వాళ్లకు సిగ్గు కలిగేవిధంగా ఇలా అన్నాడు.

**శివ ఉవాచ** – శివుడు పలికాడు.

**అహో బ్రహ్మంస్తవ కథం కామభావస్సముద్గతః ।**
**దృష్ట్వా చ తనయాం నైవ యోగ్యం వేదానుసారిణామ్ ॥39॥**

ఓ బ్రహ్మా! కుమార్తెను చూసి నీకు కామభావం ఎలా కలిగింది? వేదమార్గంలో నడిచేవారికి ఇది తగదు.

**యథా మాతా చ భగినీ భ్రాతృపత్నీ తథా సుతా ।**
**ఏతాః కుదృష్ట్యా ద్రష్టవ్యా న కదాపి విపశ్చితా ॥40॥**

వివేకి అయినవాడు తల్లిని, సోదరిని, సోదరుని భార్యను మరియు కుమార్తెను తప్పుడుదృష్టితో ఎపుడూ చూడకూడదు.

**ఏష వై వేదమార్గస్య నిశ్చయస్త్వన్ముఖే స్థితః ।**
**కథం తు కామమాత్రేణ స తే విస్మారితో విధే ॥41॥**

ఇది వేదమార్గం యొక్క నిర్ణయం. వేదం నీ ముఖంలో ఉంది. ఓ బ్రహ్మా! అల్పుడైన కాముడు నిన్ను ఈ విషయాన్ని మరిచిపోయేలా ఎలా చేశాడు?

**ధైర్యం జాగరితం బ్రహ్మన్ మనస్తే చతురానన ।**
**కథం క్షుద్రేణ కామేన రంతుం విఘటితం విధే ॥42॥**

నాలుగు ముఖాలు గల ఓ బ్రహ్మా! నీ మనసులో వివేకాన్ని మేలుకొలుపు. విధీ! నువ్వు క్షుద్రమైన కామంతో క్రీడించడానికి ఎలా సిద్ధపడతావు?

**ఏకాంతయోగినస్తస్మాత్సర్వదాదిత్యదర్శినః ।**
**కథం దక్షమరీచ్యాద్యా లోలుపాః స్త్రీషు మానసాః ॥43॥**

మానసపుత్రులైన దక్ష, మరీచ్యాదులు గొప్పస్థానం ఉన్న యోగులు. అందువల్లనే వాళ్లు ఎపుడూ సూర్యుని దర్శించగలిగే వారు. అలాంటి వాళ్లు స్త్రీమోహాన్ని ఎలా పొందారు?

**కథం కామోఽపి మందాత్మా ప్రాబల్యాత్సోఽధునైవ హి ।**
**వికృతాన్ బాణైః కృతవానకాలజ్ఞోఽల్పచేతనః ॥44॥**

మూర్ఖుడు, కాలం యొక్క ఔచిత్యం తెలియని వాడు, అల్పశక్తిమంతుడైన కాముడు పుట్టిన కొద్దిసేపటికే గర్వంతో, బాణాలతో మీకు వికారం ఎలా కల్గించాడు?

**ధిక్తం శ్రుతం సదా తస్య యస్య కాంతా మనోహరత్ ।**
**ధైర్యాదాకృష్య లౌల్యేషు మజ్జయత్యపి మానసమ్ ॥45॥**

ఎవడి మనసును స్త్రీ అపహరిస్తుందో వాడికి వాని పాండిత్యం నింద అవుతుంది. అవివేకులు ధైర్యం (వివేకజ్ఞానం) నుండి మనసుని మరల్చి చంచలమైన విషయసుఖాలయందు నిమగ్నం చేస్తారు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**ఇతి తస్య వచః శ్రుత్వా లోకే సోఽహం శివస్య చ ।**
**వ్రీడయా ద్విగుణీభూతస్స్వేదార్ద్రస్త్వభవం క్షణాత్ ॥46॥**

శివుని మాటలు విన్న నేను రెండు రెట్లు ఎక్కువగా సిగ్గుపడ్డాను. క్షణంలో చెమటతో తడిసిపోయాను.

**తతో నిగృహ్యైంద్రియకం వికారం చాత్యజం మునే ।**
**జిఘృక్షురపి తద్భీత్యా తాం సంధ్యాం కామరూపిణీమ్ ॥47॥**

ఓ మునీ! మనోహరరూపం ఉన్న సంధ్యను పట్టుకోవాలన్న కోరిక ఉన్నా, నేను శివుని భయంతో నిగ్రహించుకొని, ఇంద్రియవికారాన్ని విడిచిపెట్టాను.

**మచ్ఛరీరాత్తు ఘర్మాంభో యత్పపాత ద్విజోత్తమ ।**
**అగ్నిష్వాత్తాః పితృగణా జాతాః పితృగణాస్తతః ॥48॥**

ఓ ద్విజశ్రేష్ఠా! నా శరీరంనుండి జారిన చెమటనీటి నుండి అగ్నిష్వాత్తులనే పితృదేవతలు, మరియు ఇంకొక పితరులు పుట్టారు.

**భిన్నాంజననిభాస్సర్వే ఫుల్లరాజీవలోచనాః ।**
**నితాంతయతయః పుణ్యాస్సంసారవిముఖాః పరే ॥49॥**

వాళ్లందరూ కాటుకపొడిలా నల్లగా ఉన్నారు. వాళ్ల కళ్లు వికసించిన పద్మాల్లా ఉన్నాయి. వాళ్లు గొప్ప యతిశ్రేష్ఠులు. వారు సంసారమునందు విరక్తి కల్గిన మహానుభావులు.

**సహస్రాణాం చతుఃషష్టిరగ్నిష్వాత్తాః ప్రకీర్తితాః ।**
**షడశీతిసహస్రాణి తథా బర్హిషదో మునే ॥50॥**

ఓ మహర్షీ! అగ్నిష్వాత్తుల సంఖ్య అరవైనాలుగువేలు. బర్హిషదుల సంఖ్య ఎనభయ్యారువేలు.

**ఘర్మాంభః పతితం భూమౌ తదా దక్షశరీరతః ।**
**సమస్తగుణసంపన్నా తస్మాజ్జాతా వరాంగనా ॥51॥**

అపుడు దక్షుని శరీరంనుండి చెమటనీరు భూమిపై పడింది. దానినుండి అన్ని మంచిగుణాలు గల ఒక గొప్ప యువతి పుట్టింది.

**తన్వంగీ సమమధ్యా చ తనురోమావలీ శ్రుతా ।**
**మృద్వంగీ చారుదశనా నవకాంచనసుప్రభా ॥52॥**

ఆమె అందమైన అవయవాలు, సమమైన నడుమును, సన్నని రోమములవరుసలను కలిగి ఉంది. ఆమె అవయవాలు మృదువుగా, దంతాలు సుందరంగా ఉన్నాయి. ఆమె మెరుగు పట్టిన బంగారం వలె ప్రకాశిస్తోంది.

**సర్వావయవరమ్యా చ పూర్ణచంద్రాననాంబుజా ।**
**నామ్నా రతిరితి ఖ్యాతా మునీనామపి మోహినీ ॥53॥**

ఆమె అన్ని అవయవాలు రమ్యంగా ఉన్నాయి. ఆమె ముఖం పున్నమి నాటి చంద్రునిలా ఉంది. మునులను కూడా మోహింప చేసే ఆమె పేరు రతి.

**మరీచిప్రముఖాః షడ్వై నిగృహీతేంద్రియక్రియాః ।**
**ఋతే క్రతుం వసిష్ఠం చ పులస్త్యాంగిరసౌ తథా ॥54॥**

క్రతు, వసిష్ఠ, పులస్త్య, అంగీరసులు తప్ప మరీచి మొదలగు ఆరుగురు ఋషులు ఇంద్రియవికారాన్ని నిగ్రహించగలిగారు.

**క్రత్వాదీనాం చతుర్ణాం చ బీజం భూమౌ పపాత చ ।**
**తేభ్యః పితృగణా జాతా అపరే మునిసత్తమ ॥55॥**

క్రతువు మొదలైన ఆ నలుగురు ఋషుల నుండి వేర్వేరుగా బీజం భూమిపై పడింది. ఓ మునిశ్రేష్ఠా! అపుడు ఆ బీజాల నుండి మరి కొందరు పితృగణాలు పుట్టారు.

**సోమపా ఆజ్యపా నామ్నా తథైవాన్యే సుకాలినః ।**
**హవిష్మంతస్సుతాస్సర్వే కవ్యవాహాః ప్రకీర్తితాః ॥56॥**

సోమపులు, ఆజ్యపులు, సుకాలులు మరియు హవిష్మంతులని ఆ పితృకుమారుల పేర్లు. వారందరూ కవ్యవాహులుగా పేరుపొందారు.

**క్రతోఽస్తు సోమపాః పుత్రా వసిష్ఠాత్కాలినస్తథా ।**
**ఆజ్యపాఖ్యాః పులస్త్యస్య హవిష్మంతోఽంగిరస్సుతాః ॥57॥**

క్రతువు నుండి సోమపులు, వసిష్ఠుని నుండి కాలులు అనే పుత్రులు పుట్టారు. పులస్త్యుని సుతులు ఆజ్యపులనియు, అంగీరసుని సుతులు హవిష్మంతులనీ పిలవబడ్డారు.

**జాతేషు తేషు విప్రేంద్ర అగ్నిష్వాత్తాదికేష్వథ ।**
**లోకానాం పితృవర్గేషు కవ్యవాట్ స సమంతతః ॥58॥**

ఓ విప్రశ్రేష్ఠా! అగ్నిష్వాత్తులు మొదలైన ఈ పితృదేవతలు పుట్టగా వాళ్లందరికీ మానవులు సమర్పించే హవ్యాలను సమర్పించే అగ్ని కవ్యవాట్ అయ్యాడు.

**సంధ్యా పితృప్రసూర్భూత్వా తదుద్దేశయుతాఽభవత్ ।**
**నిర్దోషా శంభుసందృష్టా ధర్మకర్మపరాయణా ॥59॥**

బ్రహ్మ కుమార్తె అయిన సంధ్య తండ్రిగుణాలను పుణికి పుచ్చుకుంది. శంభునిచే చూడబడిన ఆమె దోషాలు లేనిదై, ధర్మబద్ధమైన పనులందు అభిరుచి కలదై ఉంది.

**ఏతస్మిన్నంతరే శంభురనుగృహ్యాఖిలాన్ ద్విజాన్ ।**
**ధర్మం సంరక్ష్య విధివదంతర్ధానం గతో ద్రుతమ్ ॥60॥**

ఇంతలో శంభుడు ఆ ఋషులందర్నీ అనుగ్రహించి, ధర్మాన్ని యథావిధిగా సంరంక్షించి, మాయమయ్యాడు.

**అథ శంకరవాక్యేన లజ్జితోఽహం పితామహః ।**
**కందర్పాయా కోపితం హి భ్రుకుటీకుటిలాననః ॥61॥**

అపుడు పితామహుడనైన నేను శంకరుని మాటల వల్ల సిగ్గుపడి, మన్మథునిపై కోపం రాగా ముడివడిన కనుబొమ్మలు కలవాణ్ణయ్యాను.

**దృష్ట్వా ముఖమభిప్రాయం విదిత్వా సోఽపి మన్మథః ।**
**స్వబాణాన్ సంజహారాశు భీతః పశుపతేర్మునే ॥62॥**

మన్మథుడు నా ముఖంలో అభిప్రాయాన్ని గ్రహించాడు. ఓ మునీ! అతడు శివునికి భయపడి వెంటనే తన బాణాలను వెనక్కి తీసుకున్నాడు.

**తతః కోపసమాయుక్తః పద్మయోనిరహం మునే ।**
**అజ్వలం చాతిబలవాన్ దిధక్షురివ పావకః ॥63॥**

ఓ మహర్షీ! గొప్పబలం కల్గి, పద్మం నుండి పుట్టిన నేను కోపంతో నిండి అన్నింటినీ తగులబెట్టే నిప్పులాగా మండిపడ్డాను.

**భవనేత్రాగ్నినిర్దగ్ధః కందర్పో దర్పమోహితః ।**
**భవిష్యతి మహాదేవే కృత్వా కర్మ సుదుష్కరమ్ ॥64॥**

గర్వం, మోహం కలిగిన ఈ మన్మథుడు శివునియందు చేయటానికి వీలులేని కర్మను చేయాలనుకొని, ఆయన నేత్రం నుండి పుట్టే అగ్నితో కాల్చివేయబడతాడు.

**ఇతి వేధాస్త్వహం కామమక్షయం ద్విజసత్తమ ।**
**సమక్షం పితృసంఘస్య మునీనాం చ యతాత్మనామ్ ॥65॥**

ఓ ద్విజశ్రేష్ఠా! నేను ఈ విధంగా యతీశ్వరులైన మునులు, పితృదేవతలు చూస్తుండగా కాముని శపించాను.

**ఇతి భీతో రతిపతిస్తత్క్షణాత్త్యక్తమార్గణః ।**
**ప్రాదుర్బభూవ ప్రత్యక్షం శాపం శ్రుత్వాతిదారుణమ్ ॥66॥**

కాముడు వెంటనే భయపడి బాణాలను అవతల పడేసి, అతిదారుణమైన శాపాన్ని విన్న వెంటనే నా ముందు ప్రత్యక్షమయ్యాడు.

**బ్రహ్మాణం మామువాచేదం సదక్షాదిసుతం మునే ।**
**శృణ్వతాం పితృసంఘానాం సంధ్యాయాశ్చ విగర్వధీః ॥67॥**

ఓ మహర్షీ! దక్షుడు, కుమారులతో ఉన్న నాతో గర్వం పోగొట్టుకున్న ఆ మన్మథుడు పితృదేవతలు, సంధ్య అందరూ ఉన్నప్పుడు ఇలా అన్నాడు.

**కామ ఉవాచ** - కాముడు అన్నాడు.

**కిమర్థం భవతా బ్రహ్మన్ శప్తోఽహమతిదారుణమ్ ।**
**అనాగాస్తవ లోకేశ న్యాయ్యమార్గానుసారిణః ॥68॥**

ఓ బ్రహ్మా! నీవు నన్ను ఇంత దారుణంగా శపించటానికిగల కారణం ఏమిటి? ఓ లోకప్రభూ! నీవు చేసే పనులు పాపాలు లేని, న్యాయమార్గాన్ని అనుసరించేవిగా ఉంటాయి.

**త్వయా చోక్తం ను మత్కర్మ యత్తద్బ్రహ్మన్ కృతం మయా ।**
**తత్ర యోగ్యో న శాపో మే యతో నాన్యత్కృతం మయా ॥69॥**

నేను చెయ్యాల్సిన పనిని నువ్వే నిర్ణయించావు. ఓ బ్రహ్మా! నేను ఆ పనే చేశాను. ఈ విషయంలో నాకు శాపం ఇవ్వకూడదు. నేను నీవు చెప్పిన దానికి వ్యతిరేకంగా పనిచేయలేదు.

**అహం విష్ణుస్తథా శంభుస్సర్వే త్వచ్ఛరగోచరాః ।**
**ఇతి యద్భవతా ప్రోక్తం తన్మయాపి పరీక్షితమ్ ॥70॥**

"నేను, విష్ణువు, శంభుడు, అందరూ నీ బాణాలకు వశులౌతాము" అని నీవు చెప్పిన మాటను మాత్రమే నేను పరీక్షించాను.

**నాపరాధో మమాప్యత్ర బ్రహ్మన్ మయి నిరాగసి ।**
**దారుణస్సమయశ్చైవ శాపో దేవ జగత్పతే ॥71॥**

ఓ బ్రహ్మా! దీనిలో నా తప్పు ఏదీ లేదు. ఓ దేవా! జగత్ప్రభూ! తప్పు చేయని నాకు దారుణమైన శాపాన్నిచ్చావు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**ఇతి తస్య వచః శ్రుత్వా బ్రహ్మాహం జగతాం పతిః ।**
**ప్రత్యవోచం యతాత్మానం మదనం దమయన్ముహుః ॥72॥**

మన్మథుని ఆ మాటలను విని బ్రహ్మనైన నేను ఆత్మనియంత్రణ గల మన్మథుని నిగ్రహించి ఇలా బదులు చెప్పాను.

**ఆత్మజా మమ సంధ్యేయం యస్మాదేతత్సకామతః ।**
**లక్ష్యీకృతోఽహం భవతా తతశ్శాపో మయా కృతః ॥73॥**

ఈ సంధ్య నా కూతురు. నేను ఆమెయందు వికారం పొందేలా నీవు నన్ను నీ బాణాలకు గురి చేశావు. అందువల్లే నేను శపించాను.

**అధునా శాంతరోషోఽహం త్వాం వదామి మనోభవ ।**
**శృణుష్వ గతసందేహఃసుఖీ భవ భయం త్యజ ॥74॥**

ఇపుడు నాకు కోపం తగ్గింది. ఓ మన్మథా! నేను చెప్పే మాటలను విను. నీ సందేహాలు తీరుతాయి. నీవు సుఖిస్తావు. భయాన్ని విడిచిపెట్టు.

**త్వం భస్మ భూత్వా మదన భర్గలోచనవహ్నినా ।**
**తథైవాశు సమం పశ్చాచ్ఛరీరం ప్రాపయిష్యసి ॥75॥**

మన్మథా! శివుడి కంటినుంచి వచ్చిన అగ్ని నిన్ను భస్మం చేస్తుంది. తర్వాత నీవు వెంటనే మరల శరీరాన్ని పొందుతావు.

**యదా కరిష్యతి హరోంజసా దారపరిగ్రహమ్ ।**
**తదా స ఏవ భవతశ్శరీరం ప్రాపయిష్యతి ॥76॥**

శివుడు భార్యను స్వీకరించిన వెంటనే నీకతడు శరీరాన్ని పొందిస్తాడు.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ పలికాడు.

**ఏవముక్త్వాథ మదనమహం లోకపితామహః ।**
**అంతర్గతో మునీంద్రాణాం మానసానాం ప్రపశ్యతామ్ ॥77॥**

లోకపితామహుడైన నేను మునీశ్వరులు, మానసపుత్రులు చూస్తుండగా ఈ విధంగా చెప్పి మాయమయ్యాను.

**ఇత్యేవం మే వచశ్శ్రుత్వా మదనస్తేఽపి మానసాః ।**
**సంబభూవుస్సుతాస్సర్వే సుఖినోఽరం గృహం గతాః ॥78॥**

ఈ నా మాటలు విని మన్మథుడు మరియు మానసపుత్రులు అందరూ సుఖాన్ని పొంది, వెంటనే ఇళ్లకు వెళ్లిపోయారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే కామశాపానుగ్రహో నామ తృతీయోఽధ్యాయః ॥3॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో కామశాపానుగ్రం అనే మూడవ అధ్యాయం సమాప్తం.

## చతుర్థోఽధ్యాయః - నాలుగవ అధ్యాయము
## కామవివాహవర్ణనః - కామవివాహవర్ణన

**నారద ఉవాచ** - నారదుడు పలికాడు.

**విష్ణుశిష్య మహాప్రాజ్ఞ విధే లోకకర ప్రభో ।**
**అద్భుతేయం కథా ప్రోక్తా శివలీలామృతాన్వితా ॥1॥**

ఓ విష్ణుశిష్యా! నువ్వు గొప్పజ్ఞానివి. ఓ విధీ! ఓ ప్రభూ! నువ్వు లోకాలను సృష్టించావు. హే ప్రభో! శివుని లీలలు అనే అమృతంతో కూడిన అద్భుతగాథను చెప్పావు.

**తతః కిమభవత్తాత చరితం తద్వదాధునా ।**
**అహం శ్రద్ధాన్వితశ్శ్రోతుం యది శంభుకథాశ్రయమ్ ॥2॥**

తండ్రీ! ఆ తర్వాత ఏమైంది? ఆ కథను ఇపుడు చెప్పండి. నేను శంభుని కథను వినటంలో శ్రద్ధ ఉన్నవాడిని.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**శంభౌ గతే నిజస్థానే వేధస్యంతర్హితే మయి ।**
**దక్షః ప్రాహాథ కందర్పం సంస్మరన్ మమ తద్వచః ॥3॥**

శంభుడు తన చోటుకు వెళ్లాడు. బ్రహ్మనైన నేను మాయమయ్యాను. అపుడు దక్షుడు నా మాటలను గుర్తుకుతెచ్చుకొని మన్మథునితో ఇలా అన్నాడు.

**దక్ష ఉవాచ** - దక్షుడు పలికాడు.

**మద్దేహజేయం కందర్ప సద్రూపగుణసంయుతా ।**
**ఏనాం గృహ్ణీష్వ భార్యార్థం భవతస్సదృశీం గుణైః ॥4॥**

ఓ మన్మథా! ఈమె నా దేహము నుండి పుట్టింది. మంచి రూపం, గుణాలు కలది. ఈమె గుణములలో నీకు తగినది. ఈమెను భార్యగా స్వీకరించు.

**ఏషా తవ మహాతేజాస్సర్వదా సహచారిణీ ।**
**భవిష్యతి యథాకామం ధర్మతో వశవర్తినీ ॥5॥**

గొప్ప తేజస్వి అయిన ఈమె నీకు ఎపుడూ తోడుగా ఉంటుంది. ఈమె నిన్ను ప్రేమిస్తుంది. నీకు అనుకూలంగా ఉండి ధర్మాన్ని పాలిస్తుంది.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**ఇత్యుక్త్వా ప్రదదౌ తస్మై దేహస్వేదాంబుసంభవామ్ ।**
**కందర్పాయాగ్రతః కృత్వా నామ కృత్వా రతీతి తామ్ ॥6॥**

దక్షుడు ఈ విధంగా మాట్లాడి తన శరీరంలోని చెమట నుండి పుట్టిన ఆమెకు 'రతి' అని పేరు పెట్టి, ఆమెను కందర్పుని ఎదుట నిలబెట్టి అప్పగించాడు.

**వివాహ్య తాం స్మరస్సోఽపి ముమోదాతీవ నారద ।**
**దక్షజాం తనయాం రమ్యాం మునీనామపి మోహినీమ్ ॥7॥**

ఓ నారదా! మునులను కూడా మోహింప చేసే సుందరి అయిన ఆ దక్షపుత్రిని పెళ్లాడి మన్మథుడు మిక్కిలి ఆనందించాడు.

**అథ తాం వీక్ష్య మదనో రత్యాఖ్యాం స్వస్త్రియం శుభమ్ ।**
**ఆత్మా గుణేన విద్ధోసౌ ముమోహ రతిరంజితః ॥8॥**

అపుడు మన్మథుడు రతి అనే శోభగల తన భార్యను చూసి, అనురాగం నిండిన మనస్సు కలవాడై, తన బాణాలతో తానే కొట్టబడినట్లుగా మోహాన్ని పొందాడు.

**క్షణప్రదాఽభవత్కాంతా గౌరీ మృగదృశీ ముదా ।**
**లోలాపాంగ్యథ తస్యైవ భార్యా చ సదృశీ రతౌ ॥9॥**

ఉత్సవాన్నిచ్చేదీ గౌరవర్ణం కలదీ, లేడి కన్నులు కలదీ, చంచలమైన ఓరచూపులు కలది, సుందరి అయిన ఆ మన్మథుని భార్య అతనితో సమానమైన అనురాగం కలిగి అతనికి ఆనందాన్ని కలిగించింది.

**తస్యా భ్రూయుగలం వీక్ష్య సంశయం మదనోఽకరోత్ ।**
**ఉత్పాదనం మత్కోదండం విధాత్రాస్యాం నివేశితమ్ ॥10॥**

ఆమె కనుబొమలను చూసి "బ్రహ్మ నా ధనస్సును లాగుకొని ఈమె కనుబొమలను మలచాడా ఏమి?" అని మన్మథుడు సందేహపడినాడు.

**కటాక్షాణామాశుగతిం దృష్ట్వా తస్యా ద్విజోత్తమ ।**
**ఆశుగంతుం నిజాస్త్రాణాం శ్రద్దధే న చ చారుతామ్ ॥11॥**

ఓ ద్విజశ్రేష్ఠా! అతడు ఆమె యొక్క వేగమైన చూపులను చూసి, తన బాణములందలి శ్రద్ధను వెంటనే కోల్పోయాడు. ఆమె ఇతరమైన అందాలేవి కూడా చూడలేదు.

**తస్యాస్స్వభావసురభిధీరశ్వాసానిలం తథా ।**
**ఆఘ్రాయ మదనః శ్రద్ధాం త్యక్తవాన్మలయాంతికే ॥12॥**

స్వభావసిద్ధంగా పరిమళం గల ఆమె నిటారైన శ్వాస, గాలి, ఆఘ్రాణించి మన్మథుడు మలయమారుతం మాట మరిచాడు.

**పూర్ణేందుసదృశం వక్త్రం దృష్ట్వా లక్ష్మసులక్షితమ్ ।**
**న నిశ్చికాయ మదనో భేదం తన్ముఖచంద్రయోః ॥13॥**

పూర్ణిమనాటి చంద్రుని పోలి ఉన్న, చిన్న మచ్చతో శోభించే ఆమె ముఖాన్ని చూసి మన్మథుడు ఆమె ముఖానికి, చంద్రునకుగల తేడాను ఎరుగలేక పోయాడు.

**సువర్ణపద్మకలికాతుల్యం తస్యాః కుచద్వయమ్ ।**
**రేజే చూచుకయుగ్మేన భ్రమరేణేవ వేష్టితమ్ ॥14॥**

బంగారు పద్మాల మొగ్గల వంటి ఆమె చనుద్వయం తుమ్మెదలు వాలినవా అన్నట్లు చూచుకములతో ప్రకాశించాయి.

**దృఢపీనోన్నతం తస్యాస్తనమధ్యం విలంబినీమ్ ।**
**ఆనాభిప్రతలం మాలాం తన్వీం చంద్రాయితాం శుభామ్ ॥15॥**

**జ్యాం పుష్పధనుషః కామః షట్పదావళిసంభ్రమామ్ ।**
**విసస్మార చ యస్మాత్తాం విసృజ్యైనాం నిరీక్షతే ॥16॥**

దృఢంగా బలిసి ఎత్తుగా ఉన్న ఆమె స్తనముల మధ్యలో నాభిగహ్వరం వరకు వెన్నెల లాంటి తెల్లని సన్నని మాల వ్రేలాడుతున్నది. శుభకరమైన ఆ మాలను చూస్తూ, మన్మథుడు తుమ్మెదల పంక్తితో తయారై, అల్లకల్లోలంగా ఉన్న పుష్పధనుస్సు యొక్క నారి తాడును మరిచి పోయాడు.

**గంభీరనాభిరంధ్రాంతశ్చతుః పార్శ్వత్వగావృతమ్ ।**
**ఆననాబ్జేఽక్షణద్వంద్వమారక్తకఫలం యథా ॥17॥**

అన్ని పక్కల మెత్తని చర్మంతో ఆవరించి ఉన్న నాభిరంధ్రం లోతుగా ఉంది. పద్మం లాంటి ఆ ముఖంలో రెండుకళ్లు ఎర్రని పండ్లలాగ ఉన్నాయి.

**క్షీణాం మధ్యేన వపుషా నిసర్గాష్టాపదప్రభా ।**
**రుక్మవేదీవ దదృశే కామేన రమణీ హి సా ॥18॥**

సన్నని నడుము, సహజమైన బంగారురంగు గల ఆ రమణి మన్మథునికి బంగారు వేదికలా కనిపించింది.

**రంభాస్తంభాయతం స్నిగ్ధం యదూరుయుగలం మృదు ।**
**నిజశక్తిసమం కామో వీక్షాం చక్రే మనోహరమ్ ॥19॥**

అరటిబోదెల వలె పొడవైనది, అందమై మెత్తగా మనోహరమైన ఆమె యొక్క రెండు తొడలను చూసి మన్మథుడు తన సమ్మోహనశక్తితో సమానమైనదని అనుకున్నాడు.

**ఆరక్తపార్ష్ణిపాదాగ్రప్రాంతభాగం పదద్వయమ్ ।**
**అనురాగమివాఽనేన మిత్రం తస్యా మనోభవః ॥20॥**

ఆమె రెండుపాదాల కొనలు, మధ్యభాగం మడమలు చాలా ఎర్రగా ఉండి, ఆమె ప్రియుడైన మన్మథునియందు గల అనురాగం వాటియందు తెలుస్తోందా అన్నట్లున్నాయి.

**తస్యాః కరయుగం రక్తం నఖరైః కింశుకోపమైః ।**
**వృత్తాభిరంగులీభిశ్చ సూక్ష్మాగ్రాభిర్మనోహరమ్ ॥21॥**

ఆమె చేతులు ఎర్రగా ఉండి, చిగుళ్లవంటి గోళ్లతో, గుండ్రని సన్నని కొసలు కల్గిన వ్రేళ్లతో అందంగా ఉన్నాయి.

**తద్బాహుయుగలం కాంతం మృణాలయుగలాయతమ్ ।**
**మృదుస్నిగ్ధం చిరం రాజత్కాంతిలోహప్రవాలవత్ ॥22॥**

సుందరములు, మృదువైనవి, అందమైనవి అయిన ఆమె చేతులు (భుజాలు) చాలా పొడవుగా ఉండి బంగారురంగుతో పగడాల కాంతులతో ప్రకాశిస్తున్నాయి.

**నీలనీరదసంకాశః కేశపాశో మనోహరః ।**
**చమరీవాలభరవద్విభాతిస్మ స్మరప్రియః ॥23॥**

నల్లని మేఘాల వలె మనసును హరించే మన్మథునకు ప్రియమైన ఆమె జుట్టు చమరీమృగంయొక్క గుబురైన తోకలా ప్రకాశిస్తోంది.

**ఏతాదృశీం రతిం నామ్నా ప్రాలేయాద్రిసముద్భవామ్ ।**
**గంగామివ మహాదేవో జగ్రాహోత్ఫుల్లలోచనః ॥24॥**

విప్పారిన కళ్లు కలిగిన మన్మథుడు ఆ రతీదేవిని, మహాదేవుడు హిమపర్వతం నుండి పుట్టిన గంగను స్వీకరించిన విధంగా స్వీకరించాడు.

**చక్రపద్మాం చారుబాహుం మృణాలశకలాన్వితామ్ ।**
**భ్రూయుగ్మవిభ్రమవ్రాతతనూర్మిపరిరాజితామ్ ॥25॥**

ఆమె స్తనములనే పద్మాలను కలిగినది, బాహువులనే తామరతూడులు కలది, కనుబొమల విరుపుల వరుసలచే, పిల్లకెరటాలతో ప్రకాశించే సరస్సులాగ విరాజిల్లుతోంది.

**కటాక్షపాతతుంగౌఘాం స్వీయనేత్రోత్పలాన్వితమ్ ।**
**తనులోమాంబుశైవాలాం మనోద్రుమవిలాసినీమ్ ॥26॥**

ఆమె వాడిచూపులనే గొప్ప ప్రవాహం కలది. నేత్రాలనే నల్లకలువలు కలది, సన్నని రోమములవరుసగల నీటినాచు కలది. మనోవృత్తులనే ఒడ్డుపై ఉన్న చెట్లతో ప్రకాశించేదిలా ఉంది.

**నిమ్ననాభిహ్రదాం క్షామాం సర్వాంగరమణీయకామ్ ।**
**సర్వలావణ్యసదనాం శోభమానాం రమామివ ॥27॥**

లోతైన నాభి అనే సరస్సు కలది. కృశించినది (నడుము) ఆ యువతి అన్ని అవయవాలు రమణీయంగా ఉన్నాయి. లావణ్యం ఆమెలో నివాసం ఉంది. ఆమె లక్ష్మి వలె ప్రకాశిస్తోంది.

**ద్వాదశాభరణైర్యుక్తాం శృంగారైష్షోడశైర్యుతామ్ ।**
**మోహినీం సర్వలోకానాం భాసయంతీ దిశో దశ ॥28॥**

**ఇతి తాం మదనో వీక్ష్య రతిం జగ్రాహ సోత్సుకః ।**
**రాగాదుపస్థితాం లక్ష్మీం హృషీకేశ ఇవోత్తమామ్ ॥29॥**

పన్నెండు ఆభరణములను ధరించి, పదహారు అలంకారాలు చేసుకొని, అన్నిలోకాలను మోహింప చేస్తూ పది దిక్కులను ప్రకాశింపజేస్తున్న ఆ రతీదేవిని చూసి, ప్రేమతో దగ్గరకు వచ్చిన ఉత్తమమైన లక్ష్మిని విష్ణువు వలె మన్మథుడు ఆమెను ఉత్సాహంతో గ్రహించాడు.

**నోవాచ చ తదా దక్షం కామో మోదభవాత్తతః ।**
**విస్మృత్య దారుణం శాపం విధిదత్తం విమోహితః ॥30॥**

చాలా మోహితుడై ఉన్న మన్మథుడు బ్రహ్మ ఇచ్చిన దారుణమైన శాపం సంగతి మరచిపోయి దక్షునితో చెప్పలేదు.

**తదా మహోత్సవస్తాత బభూవ సుఖవర్ధనః ।**
**దక్షః ప్రీతతరశ్చాసీన్ముముదే తనయా మమ ॥31॥**

వత్సా! అపుడు సుఖమును వర్ధిల్ల చేసే మహోత్సవం జరిగింది. తన కుమార్తె యొక్క ఆనందాన్ని చూసి దక్షుడు చాలా ఆనందించాడు.

**కామోஉతీవ సుఖం ప్రాప్య సర్వదుఃఖక్షయం గతః ।**
**దక్షజాపి రతిః కామం ప్రాప్య చాపి జహర్ష హ ॥32॥**

కాముడు చాలా సుఖాన్ని పొందాడు. అతని దుఃఖాలన్నీ తొలగిపోయాయి. దక్షుని కుమార్తె రతి కూడ కాముని పొంది ఆనందించింది.

**రరాజ చ తయా సార్ధం భిన్నశ్చారువచస్స్మరః ।**
**జీమూత ఇవ సంధ్యాయాం సౌదామిన్యా మనోజ్ఞయా ॥33॥**

సుందరంగా మాటలాడు మన్మథుడు ఆమెతో కూడి సంధ్యాకాలంలో సుందరమైన మెరుపుతో కూడిన మేఘంలా ప్రకాశించాడు.

**ఇతి రతిపతిరుచ్చైర్మోహయుక్తో రతిం తాం హృదుపరి జగృహే వై యోగదర్శీవ విద్యామ్ ।**
**రతిరపి పతిమగ్ర్యం ప్రాప్య సా చాపి రేజే హరిమివ కమలా వై పూర్ణచంద్రోపమాస్యా ॥34॥**

అధికమైన మోహంతో కూడిన మన్మథుడు రతిని, యోగి ఆత్మవిద్యను వలె హృదయసింహాసనంలో అధిష్ఠింప చేశాడు. పూర్ణచంద్రుని వంటి ముఖం కల్గిన లక్ష్మి హరిని వలె రతి గొప్ప భర్తను పొందింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే కామవివాహ వర్ణనం నామ చతుర్థోஉధ్యాయః ॥4॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో కామవివాహవర్ణన అనే నాలుగవ అధ్యాయం సమాప్తం.

## పంచమోఽధ్యాయః - ఐదవ అధ్యాయం

## సంధ్యా చరిత్రవర్ణనమ్ - సంధ్యా చరిత్ర

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య బ్రహ్మణో మునిసత్తమః ।**
**స ముదోవాచ సంస్మృత్య శంకరం ప్రీతమానసః ॥1॥**

మునిశ్రేష్ఠుడైన నారదుడు బ్రహ్మ యొక్క ఈ మాటలను విని సంతసించిన మనసుతో శంకరుని స్మరించి ఇలా అన్నాడు.

**నారద ఉవాచ** - నారదుడు పలికాడు.

**బ్రహ్మన్ విధే మహాభాగ విష్ణుశిష్య మహామతే ।**
**అద్భుతా కథితా లీలా త్వయా చ శశిమౌలినః ॥2॥**

ఓ బ్రహ్మ! విధీ! మహాత్మా! విష్ణుశిష్యా! మహాప్రాజ్ఞా! నీవు చంద్రశేఖరుని అద్భుతలీలలను చెప్పావు.

**గృహీతదారే మదనే హృష్టే హి స్వగృహం గతే ।**
**దక్షే చ స్వగృహం యాతే తథా హి త్వయి కర్తరి ॥3॥**

**మానసేషు చ పుత్రేషు గతేషు స్వ స్వ ధామసు ।**
**సంధ్యా కుత్ర గతా సా చ బ్రహ్మపుత్రీ పితృప్రసూః ॥4॥**

మన్మథుడు పెళ్లి చేసుకొని ఆనందంతో తన ఇంటికి వెళ్లగా, దక్షుడు తన ఇంటికి చేరుకొనగా, జగత్ కర్తవైన నీవు కూడా ఇంటికి చేరగా మానసపుత్రులు కూడా తమ తమ స్థానాలకు చేరుకొనగా బ్రహ్మపుత్రిక, పితృదేవతలకు తల్లి అయిన సంధ్య ఎక్కడికి వెళ్లింది?

**కిం చకార చ కేనైవ పురుషేణ వివాహితా ।**
**ఏతత్సర్వం విశేషేణ సంధ్యాయాశ్చరితం వద ॥5॥**

ఆమె ఏమి చేసింది? ఏ పురుషుణ్ణి పెళ్లి చేసుకుంది? నువ్వు సంధ్య యొక్క చరిత్రను వివరంగా చెప్పు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య బ్రహ్మపుత్రశ్చ ధీమతః ।**
**సంస్మృత్య శంకరం భక్త్యా బ్రహ్మా ప్రోవాచ తత్త్వవిత్ ॥6॥**

బుద్ధిమంతుడు బ్రహ్మపుత్రుడు అయిన ఆ నారదుని మాటను విని తత్త్వవేత్త అయిన బ్రహ్మ భక్తితో శంకరుని తలచుకొని ఇలా అన్నాడు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**శృణు త్వం చ మునే సర్వం సంధ్యాయాశ్చరితం శుభమ్ ।**
**యచ్ఛృత్వా సర్వకామిన్యస్సాధ్వ్యస్స్యుస్సర్వదా మునే ॥7॥**

ఓ మహర్షీ! శుభకరమైన సంధ్య చరితం పూర్తిగా విను. ఓ మునీ! దీనిని ఎల్లప్పుడూ వినే స్త్రీలందరూ సాధ్వీమణులౌతారు.

**సా చ సంధ్యా సుతా మే హి మనోజాతా పురాఽభవత్ ।**
**తపస్తప్త్వా తనుం త్యక్త్వా సైవ జాతా త్వరుంధతీ ॥8॥**

ఆ సంధ్య ముందుగా నా మానసపుత్రికగా పుట్టింది. ఆమె తపస్సు చేసి శరీరాన్ని వీడి అరుంధతిగా పుట్టింది.

**మేధాతిథేస్సుతా భూత్వా మునిశ్రేష్ఠస్య ధీమతీ ।**
**బ్రహ్మవిష్ణుమహేశానవచనాచ్చరితవ్రతా ॥9॥**

**వవ్రే పతిం మహాత్మానం వసిష్ఠం శంసితవ్రతమ్ ।**
**పతివ్రతా చ ముఖ్యాఽభూద్వంద్యా పూజ్యా త్వభీషణా ॥10॥**

బుద్ధిమంతురాలైన ఆమె గొప్ప ముని అయిన మేధాతిథికి కూతురై పుట్టింది. గొప్ప నిష్ఠ గల ఆమె బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల మాటచే మహాత్ముడు, ప్రశంసింపదగిన తపోనిష్ఠ గల వసిష్ఠుని భర్తగా వరించింది. మంచి మనసు గల ఆమె పతివ్రతలలో శ్రేష్ఠురాలై ప్రపంచానికి నమస్కరింపదగిన పూజ్యురాలైంది.

**నారద ఉవాచ** – నారదుడు పలికాడు.

**కథం తయా తపస్తప్తం కిమర్థం కుత్ర సంధ్యయా ।**
**కథం శరీరం సా త్యక్త్వాఽభవన్మేధాతిథేః సుతా ॥11॥**

ఆ సంధ్య తపస్సును ఎక్కడ? ఎందుకోసం? ఎలా చేసింది? ఆమె ఎలా శరీరాన్ని విడిచిపెట్టి మేధాతిథి కూతురుగా పుట్టింది?

**కథం వా విహితం దేవైర్బ్రహ్మవిష్ణుశివైః పతిమ్ ।**
**వసిష్ఠం తు మహాత్మానం సంవవ్రే శంసితవ్రతమ్ ॥12॥**

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులచే నిర్ణయించబడినవాడు, మెచ్చుకోదగ్గ తపోనిష్ఠ కలవాడు, మహాత్ముడైన వసిష్ఠుణ్ణి ఆమె భర్తగా ఎలా ఎంచుకుంది?

**ఏతన్మే శ్రోష్యమాణాయ విస్తరేణ పితామహ ।**
**కౌతూహలమరుంధత్యాశ్చరితం బ్రూహి తత్త్వతః ॥13॥**

ఓ పితామహా! నేను ఈ అరుంధతిచరిత్రను వినాలనుకుంటున్నాను. కూతూహలంగా ఉన్న నాకు ఈ చరిత్రసారాన్ని వివరంగా చెప్పండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**అహం స్వతనయాం సంధ్యాం దృష్ట్వా పూర్వమథాత్మనః ।**
**కామాయాశు మనోఽకార్షం త్యక్త్వా శివభయాచ్చ సా ॥14॥**

పూర్వం నేను నా కుమార్తె అయిన సంధ్యను చూసి వెంటనే కామించాను. కాని శివుని భయంవలన ఆ అధర్మాన్ని విడిచి పెట్టాను.

**సంధ్యాయాశ్చలితం చిత్తం కామబాణవిలోడితమ్ ।**
**ఋషీణామపి సంరుద్ధమానసానాం మహాత్మనామ్ ॥15॥**

మన్మథుడి బాణ ప్రయోగాలతో సంధ్య మనసు చలించింది. మనోనిగ్రహం కల మహాత్ములు అయిన ఋషులు కూడా మనోవికారాన్ని పొందారు.

**భర్గస్య వచనం శ్రుత్వా సోపహాసం చ మాం ప్రతి ।**
**ఆత్మనశ్చలితత్వం వై హ్యమర్యాదమృషీన్ ప్రతి ॥16॥**

శివుడు నాతో పరిహాసంగా అన్న మాటలను సంధ్య విని, తాను పొందిన మనోవికారాన్ని, ఋషుల విషయంలో జరిగిన అమర్యాదను చూసింది.

**కామస్య తాదృశం భావం మునిమోహకరం ముహుః ।**
**దృష్ట్వా సంధ్యా స్వయం తత్రోపయమాయాతిదుఃఖితా ॥17॥**

మునులకు కూడా మోహం కలిగించే కాముని సామర్థ్యం పరిశీలించి సంధ్యస్వయంగా తానూ శృంగారభావం పొందినందుకు దుఃఖించింది.

**తతస్తు బ్రహ్మణా శప్తే మదనే చ మయా మునే ।**
**అంతర్భూతే మయి శివే గతే చాపి నిజాస్పదే ॥18॥**

ఓ మహర్షీ! నేను మన్మథుణ్ణి శపించి మాయమయ్యాను. శివుడు తన చోటుకి వెళ్లిపోయాడు.

**ఆమర్షవశమాపన్నా సా సంధ్యా మునిసత్తమ ।**
**మమ పుత్రీ విచార్యైవం తదాధ్యానపరాభవత్ ॥19॥**

ఓ మహర్షీ! జరిగిన కథను సహించలేక నా పుత్రి సంధ్యచింతతో ధ్యానంలో మునిగిపోయింది.

**ధ్యాయంతీ క్షణమేవాశు పూర్వం వృత్తం మనస్వినీ ।**
**ఇదం విమమృశే సంధ్యా తస్మిన్కాలే యథోచితమ్ ॥20॥**

అభిమానవతి అయిన సంధ్య జరిగిన విషయాలను తలచుకొని ఆనాటికి తగిన విధంగా ఇలా ఆలోచించుకుంది.

**సంధ్యోవాచ** – సంధ్య పలికింది.

**ఉత్పన్నమాత్రాం మాం దృష్ట్వా యువతీం మదనేరితః ।**
**అకార్షీత్సానురాగోఽయమభిలాషం పితా మమ ॥21॥**

నేను యువతిగా జన్మించిన మరుక్షణంలో మన్మథునిచే ప్రేరేపించబడిన నా తండ్రి నన్ను వికారంతో కామించాడు.

**పశ్యతాం మానసానాం చ మునీనాం భావితాత్మనామ్ ।**
**దృష్ట్వైవ మామమర్యాదం సకామమభవన్మనః ॥22॥**

బ్రహ్మమానస పుత్రులు, అంతఃకరణశుద్ధి గల మునులు చూస్తుండగా ఆయన నన్ను మర్యాదలేని విధంగా చూసి, మనసులో కోరిక పెట్టుకున్నాడు.

**మమాపి మథితం చిత్తం మదనేన దురాత్మనా ।**
**యేన దృష్ట్వా మునీన్ సర్వాంశ్చలితం మన్మనో భృశమ్ ॥23॥**

దుర్మార్గుడైన మన్మథుడు నా మనసును కూడా కల్లోలపెట్టగా, ఆ మునులందర్నీ చూస్తున్న నా మనస్సు చాలా చలించి పోయింది.

**ఫలమేతస్య పాపస్య మదనస్స్వయమాప్తవాన్ ।**
**యస్తం శశాప కుపితః శంభోరగ్రే పితామహః ॥24॥**

ఈ పాపానికి ఫలితాన్ని మన్మథుడు పొందాడు. శంభుని ఎదురుగా పితామహుడు కోపించి వానిని శపించాడు.

**ప్రాప్నుయాం ఫలమేతస్య పాపస్య స్వఘకారిణీ ।**
**తచ్ఛేధనఫలమహామాశు చేచ్ఛామి సాధనమ్ ॥25॥**

ఈ పాపం చేసిన నాకు పాపఫలితం వస్తుంది. కాని నేను వెంటనే ఆ పాపప్రక్షాళనచేయగలిగే సాధనాన్ని తీసుకోవాలనుకున్నాను.

**యన్మాం పితా భ్రాతరశ్చ సకామమపరోక్షతః ।**
**దృష్ట్వా చక్రుః స్పృహాం తస్మాన్న మత్తః పాపకృత్పరా ॥26॥**

నన్ను ప్రత్యక్షంగా చూచిన నా తండ్రి మరియు సోదరులు కామవికారాలను పొందారంటే నా కంటె పెద్దపాపాత్మురాలు ఉండబోదు.

**మమాపి కామభావోఽభూదమర్యాదం సమీక్ష్య తాన్ ।**
**పత్యా ఇవ స్వకే తాతే సర్వేషు సహజేష్వపి ॥27॥**

మర్యాద లేకుండా నా తండ్రిని, సోదరులనందరినీ చూసిన నాకు కూడా కామభావం మొదలైంది.

**కరిష్యామ్యస్య పాపస్య ప్రాయశ్చిత్తమహం స్వయమ్ ।**
**ఆత్మానమగ్నౌ హోష్యామి వేదమార్గానుసారతః ॥28॥**

నేను ఈ పాపానికి ప్రాయశ్చిత్తాన్ని స్వయంగా చేసుకోగలను. నేను వేదధర్మాన్ననుసరించి నా దేహాన్ని అగ్నిలో దహింప చేయగలను.

**కిం త్వేకాం స్థాపయిష్యామి మర్యాదామిహ భూతలే ।**
**ఉత్పన్నమాత్రా న యథా సకామాస్స్యుశ్శరీరిణః ॥29॥**

ఈ విధంగా చేసి నేను ఈ భూమండలంలో ఒక మర్యాదను స్థాపిస్తాను. అది ఏమంటే మానవులు పుట్టుక తోడనే కామవికారాలు పొందకుందురు గాక!

**ఏతదర్థమహం కృత్వా తపః పరమదారుణమ్ ।**
**మర్యాదాం స్థాపయిష్యామి పశ్చాత్త్యక్ష్యామి జీవితమ్ ॥30॥**

దీని కోసం నేను ఉగ్రమైన తపస్సు చేసి, మర్యాదను స్థాపన చేసి తర్వాత ప్రాణాలను విడిచి పెడతాను.

**యస్మిన్ శరీరే పిత్రా మే హ్యభిలాషస్స్వయం కృతః ।**
**భ్రాతృభిస్తేన కాయేన కించిన్నాస్తి ప్రయోజనమ్ ॥31॥**

ఏ శరీరమందు నా తండ్రి, సోదరులు స్వయంగా కామవికారాలను ప్రదర్శించారో అట్టి ఈ శరీరంతో నాకు కొంచెం అయినా ప్రయోజనం లేదు.

**మయా యేన శరీరేణ తాతేషు చ సహజేషు చ ।**
**ఉద్భావితః కామభావో న తత్సుకృతసాధనమ్ ॥32॥**

ఏ శరీరంచే నేను తండ్రి మరియు సోదరులందు కామవికారానికి కారణమయ్యానో ఆ ఈ శరీరం ధర్మసాధనం కాదు.

**ఇతి సంచింత్య మనసా సంధ్యా శైలవరం తతః ।**
**జగామ చంద్రభాగాఖ్యం చంద్రభాగాపగా యతః ॥33॥**

సంధ్య ఈ విధంగా ఆలోచించిన తర్వాత చంద్రభాగానదీతీరంలో ఉన్న చంద్రభాగపర్వతానికి వెళ్లింది.

**అథ తత్ర గతాం జ్ఞాత్వా సంధ్యాం గిరివరం ప్రతి ।**
**తపసే నియతాత్మానం బ్రహ్మోవోచమహం సుతమ్ ॥34॥**

**వసిష్ఠం సంయతాత్మానం సర్వజ్ఞం జ్ఞానయోగినమ్ ।**
**సమీపే స్వే సమాసీనం వేదవేదాంగపారగమ్ ॥35॥**

సంధ్య తపస్సు కోసం ఆ పర్వతం దగ్గరకు వెళ్లిందని తెలిసి నా కుమారుడు ఇంద్రియనిగ్రహం కలవాడు, జ్ఞానయోగి, వేదవేదాంగాలసారాన్ని చూసిన జ్ఞాని అయిన వసిష్ఠుని దగ్గర కూర్చుండబెట్టుకొని ఇలా అన్నాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**వసిష్ఠ! పుత్ర! గచ్ఛ త్వం సంధ్యాం జాతాం మనస్వినీమ్ ।**
**తపసే ధృతకామాం చ దీక్షస్వైనాం యథావిధి ॥36॥**

పుత్రా! వసిష్ఠా! అభిమానవతి అయిన నాకుమార్తె సంధ్య వద్దకు నీవు వెళ్లు. ఆమె తపస్సు చేయాలనుకుంటోంది. ఆమెకు యథావిధిగా దీక్షను ఇవ్వు.

**మందాక్షమభవత్తస్యాః పురా దృష్ట్వైవ కాముకాన్ ।**
**యుష్మాన్మాం చ తథాత్మానం సకామాం మునిసత్తమ ॥37॥**

ఓ మహర్షీ! నన్ను, మిమ్మల్ని కామవికారాలలో ఉండగా గతంలో ఆమె చూసి, తాను కూడా కామవికారం పొందటాన్ని చూసి చాలా సిగ్గుపడింది.

**అభూతపూర్వం తత్కర్మ పూర్వమృత్యుం విమృశ్య సా ।**
**యుష్మాకమాత్మనశ్చాపి ప్రాణాన్ సంత్యక్తుమిచ్ఛతి ॥38॥**

ఇంతకు ముందెన్నడూ జరగని మీ యొక్క, నా యొక్క పాపభావనను చూడటం వల్ల కర్మగా తలంచి, ప్రాణములు విడుచుటకు నిశ్చయించింది.

**సమర్యాదేషు మర్యాదాం తపసా స్థాపయిష్యతి ।**
**తపః కర్తుం గతా సాధ్వీ చంద్రభాగాఖ్య భూధరే ॥39॥**

ఆమె తపస్సుచే లోకంలో మర్యాదను నిలబెడుతుంది. తపస్సు చేయటానికి ఆ సాధ్వి చంద్రభాగపర్వతానికి వెళ్లింది.

**న భావం తపసస్తాత సానుజానాతి కంచన ।**
**తస్మాద్యథోపదేశాత్సా ప్రాప్నోత్విష్టం తథా కురు ॥ 40॥**

వత్సా! ఆమెకు తపస్సు గురించి ఏమియూ తెలియదు. కావున నువ్వు ఆమెకు ఉపదేశించి ఆమె తన ఇష్టం పొందేలా ప్రయత్నించు.

**ఇదం రూపం పరిత్యజ్య నిజం రూపాంతరం మునే ।**
**పరిగృహ్యాంతికే తస్యాస్తపశ్చర్యాం నిదర్శయన్ ॥41॥**

ఓ మహర్షీ! నీ నిజరూపాన్ని విడిచి, మరొక రూపాన్ని ధరించి, ఆమె దగ్గరకు వెళ్లి ఆమె చేస్తున్న తపస్సును పరిశీలించు.

**ఇదం స్వరూపం భవతో దృష్ట్వా పూర్వం యథాత్ర వామ్ ।**
**నాప్నుయాత్సాఽథ కించిద్వై తతో రూపాంతరం కురు ॥42॥**

ఇంతకు ముందు ఆమె నిన్ను చూసింది. ఇదే రూపంలో చూస్తే ఆమె ఏదైనా వికారం పొందవచ్చు. కాబట్టి రూపాన్ని మార్చుకో.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**నారదేత్థం వసిష్ఠో మే సమాజ్ఞప్తో దయావతా ।**
**తథాఽస్త్వితి చ మాం ప్రోచ్య యయౌ సంధ్యాంతికం మునిః ॥43॥**

ఓ నారదా! నేను ఈ విధంగా వసిష్ఠుని దయాబుద్ధితో ఆజ్ఞాపించాను. ఆయన అలాగే జరుగు గాక! అని నాతో చెప్పి సంధ్య దగ్గరకు వెళ్లాడు.

**తత్ర దేవసరః పూర్ణం గుణైర్మానససమ్మితమ్ ।**
**దదర్శ స వసిష్ఠోఽథ సంధ్యాం తత్తీరగామపి ॥44॥**

అచట గొప్ప గుణములు గల మానససరోవరాన్ని పోలి ఉన్న దేవసరస్సును చూసి, ఆ తీరమునందున్న సంధ్యను చూశాడు.

**తీరస్థయా తయా రేజే తత్సరః కమలోజ్జ్వలమ్ ।**
**ఉద్యదిందుసునక్షత్రం ప్రదోషే గగనం యథా ॥45॥**

ప్రదోషకాలమందు ఉదయించే చంద్రునితో, నక్షత్రాలతో ఆకాశం నిండి ఉన్నట్లు, ఆ సరస్సు తీరమందున్న ఆమెతో మరియు కమలాలతో నిండి ఉజ్జ్వలంగా ప్రకాశించింది.

**మునిర్దృష్ట్వాథ తాం తత్ర సుసంభావాం స కౌతుకీ ।**
**వీక్షాంచక్రే సరస్తత్ర బృహల్లోహితసంజ్ఞకమ్ ॥46॥**

వసిష్ఠమహర్షి ఉత్కంఠ కలవాడై, గొప్ప నిర్ణయం గలిగిన ఆమెను అచట చూశాడు. మరియు బృహల్లోహితం అనే పేరుగల సరస్సును చూశాడు.

**చంద్రభాగానదీ తస్మాత్ప్రాకారాద్దక్షిణాంబుధిమ్ ।**
**యాంతీ సా చైవ దదృశే తేన సానుగిరేర్మహత్ ॥47॥**

**నిర్భిద్య పశ్చిమం సా తు చంద్రభాగస్య సా నదీ ।**
**యథా హిమవతో గంగా తథా గచ్ఛతి సాగరమ్ ॥48॥**

ప్రాకారంలా ఉన్న ఆ పర్వతం నుండి దక్షిణసముద్రం వరకు ప్రవహిస్తున్న చంద్రభాగానదిని ఆయన చూశాడు. ఆ నదిపర్యంతం యొక్క గొప్ప సానువును భేదించుకొని, పశ్చిమంవైపుకు ప్రవహిస్తోంది. హిమవత్పర్వతం నుండి సముద్రం వైపునకు పయనించే గంగలా ఆ నది సాగుతోంది.

**తస్మిన్ గిరౌ చంద్రభాగే బృహల్లోహితతీరగామ్ ।**
**సంధ్యాం దృష్ట్వాథ పప్రచ్ఛ వసిష్ఠస్సాదరం తదా ॥49॥**

అపుడు ఆ చంద్రభాగపర్వతంలో, బృహల్లోహితమనే సరస్సు తీరంలో సంధ్యను చూసి వసిష్ఠుడు ఆదరంతో ఇలా ప్రశ్నించాడు.

**వసిష్ఠ ఉవాచ –** వసిష్ఠుడు అన్నాడు.

**కిమర్థమాగతా భద్రే నిర్జనం త్వం మహీధరమ్ ।**
**కస్య వా తనయా కిం వా భవత్యాపి చికీర్షితమ్ ॥50॥**

ఓ మంగళస్వరూపురాలా! జనసంచారం లేని ఈ కొండపైకి ఎందుకు వచ్చావు? నీవెవరి కుమార్తెవు? నీవు ఏం చేయాలని అనుకుంటున్నావు?

**ఏతదిచ్ఛామ్యహం శ్రోతుం వద గుహ్యం న చేద్భవేత్ ।**
**వదనం పూర్ణచంద్రాభం నిశ్చేష్టం వా కథం తవ ॥51॥**

ఇది రహస్యం కాకపోతే నేను వినాలనుకుంటున్నాను. పున్నమి చంద్రుని లాంటి నీ ముఖం అలంకారం లేకుండా ఉంది. ఎందువలన?

**బ్రహ్మ ఉవాచ –** బ్రహ్మ పలికాడు.

**తచ్ఛ్రుత్వా వచనం తస్య వసిష్ఠస్య మహాత్మనః ।**
**దృష్ట్వా చ తం మహాత్మానం జ్వలంతమివ పావకమ్ ॥52॥**

**శరీరధృగ్ బ్రహ్మచర్యం విలసంతం జటాధరమ్ ।**
**సాదరం ప్రాణిపత్యాథ సంధ్యోవాచ తపోధనమ్ ॥ 53॥**

మహాత్ముడైన వసిష్ఠుని యొక్క ఆ మాటలను విని, అగ్నిలా ప్రకాశిస్తున్న ఆ మహాత్ముని చూసి. మూర్తీభవించిన బ్రహ్మచర్యమా అన్నట్లు జటలను ధరించి ప్రకాశిస్తున్న తపోనిష్ఠుడైన వసిష్ఠునకు సాదరముగా నమస్కరించి, సంధ్య ఇలా పలికింది.

**సంధ్యోవాచ –** సంధ్య పలికింది.

**యదర్థమాగతా శైలం సిద్ధం తన్మే నిబోధ హ ।**
**తవ దర్శనమాత్రేణ యన్మే సేత్స్యతి వా విభో ॥54॥**

నేను ఏ ప్రయోజనాన్ని ఆశించి ఈ పర్వతానికి వచ్చానో, ఆ ప్రయోజనం నెరవేరిందని తెలుసుకోండి. ఓ ప్రభూ! మిమ్మల్ని దర్శించటం మాత్రం చేతనే నాకు ఆ ప్రయోజనం సిద్ధించగలదు.

**తపశ్చర్తుమహం బ్రహ్మన్నిర్జనం శైలమాగతా ।**
**బ్రహ్మణోఽహం సుతా జాతా నామ్నా సంధ్యేతి విశ్రుతా ॥55॥**

ఓ బ్రహ్మనిష్ఠుడా! నేను తపస్సు కోసం ఈ జనసంచారంలేని పర్వతానికి వచ్చాను. నేను బ్రహ్మగారి కుమార్తెను. నాకు సంధ్య అనే పేరు ప్రసిద్ధమై ఉంది.

**యది తే యుజ్యతే సహ్యం మాం త్వం సముపదేశయ ।**
**ఏతచ్చికీర్షితం గుహ్యం నాన్యైః కించన విద్యతే ॥56॥**

మీకు ఉచితమనిపిస్తే నాకు చక్కగా ఉపదేశించండి. నేను ఈ తపస్సును రహస్యంగా చేయాలనుకుంటున్నాను. దీనికి ఇతరులతో పనిలేదు.

**అజ్ఞాత్వా తపసో భావం తపోవనముపాశ్రితా ।**
**చింతయా పరిశుష్యేఽహం వేపతే హి మనో మమ ॥57॥**

తపస్సు చేసే విధానం తెలియకుండానే నేను తపోవనానికి చేరుకున్నాను. నేను దుఃఖంతో ఎండిపోతున్నాను. నా మనస్సు వణుకుతోంది.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**ఆకర్ణ్య తస్యా వచనం వసిష్ఠో బ్రహ్మవిత్తమః ।**
**స్వయం చ సర్వకృత్యజ్ఞో నాన్యత్కించన పృష్టవాన్ ॥58॥**

బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడు, తపస్సు యొక్క అన్ని పనులనూ స్వయంగా తెలిసినవాడు అయిన వసిష్టుడు ఆమె మాటలను విని ఆమెను ఏమియూ ప్రశ్నించలేదు.

**అథ తాం నియతాత్మానం తపసేతి ధృతోద్యమామ్ ।**
**ప్రోవాచ మనసా స్మృత్వా శంకరం భక్తవత్సలమ్ ॥59॥**

ఆయన భక్తవత్సలుడైన శంకరుణ్ణి మనసులో స్మరించుకొని, నియంత్రింపబడిన దేహేంద్రియ మనస్సులను కలిగినది, తపస్సు కోసం గొప్పదీక్షతో ఉద్యమించినది అయిన సంధ్యతో ఇలా పలికాడు.

**వసిష్ఠ ఉవాచ** – వసిష్ఠుడు పలికాడు.

**పరమం యో మహత్తేజః పరమం యో మహత్తపః ।**
**పరమః పరమారాధ్యః శంభుర్మనసి ధార్యతామ్ ॥ 60॥**

ఎవరు తేజోమూర్తులలో కెల్లా గొప్ప తేజోమూర్తియో, తపస్వులలో కెల్లా గొప్ప తపోమూర్తియో, పూజ్యులలో కెల్లా గొప్ప పూజ్యుడో అలాంటి శంభుని మనసులో నిలుపుకొనుము.

**ధర్మార్థకామమోక్షాణాం య ఏకస్త్వాదికారణమ్ ।**
**తమేకం జగతామాద్యం భజస్వ పురుషోత్తమమ్ ॥61॥**

ధర్మార్థకామమోహాలకు ప్రథమకారణం, జగత్తుకు ఆది, అద్వితీయుడు, పురుషశ్రేష్ఠుడు అయిన శంభుని సేవించు.

**మంత్రేణానేన దేవేశం శంభుం భజ శుభాననే ।**
**తేన తే సకలావాప్తిర్భవిష్యతి న సంశయః ॥62॥**

ఓ సుందరవదనా! నువ్వు ఈ మంత్రంతో దేవేశ్వరుడయిన శంభుని భజించు. అలా సేవించడం వలన నీకు నిస్సందేహంగా కోరికలన్నీ తీరుతాయి.

**ఓం నమశ్శంకరాయేతి ఓమిత్యంతేన సంతతమ్ ।**
**మౌనతపస్యా ప్రారంభం తన్మే నిగదతశ్శృణు ॥63॥**

ఓం నమశ్శంకరాయ ఓం అను ఆది, అంతములందు ఓంకారం గల మంత్రాన్ని జపించు. మౌనతపస్సును నేను చెప్తాను వినుము.

**స్నానం మౌనేన కర్తవ్యం మౌనేన హరపూజనమ్ ।**
**ద్వయోః పూర్ణజలాహారం ప్రథమం షష్ఠకాలయోః ॥64॥**

మౌనంగా స్నానం చేసి, మౌనంగా శివుణ్ణి పూజించాలి. మొదటి రెండు షష్ఠకాలాల్లోనూ. ముందుగా పూర్తిగా నీటిని ఆహారంగా తీసుకోవాలి.

**తృతీయే షష్ఠకాలే తు హ్యుపవాసపరో భవేత్ ।**
**ఏవం తపస్సమాప్తౌ వా షష్ఠే కాలే క్రియా భవేత్ ॥65॥**

మూడవ కాలంలో ఉపవాసం చేయాలి. ఈ తీరున తపస్సు పూర్తి అయ్యేవరకు ఆరవకాలంలో ఉపవాసం లేదా జల ఆహారం స్వీకరించ వచ్చు.

**ఏవం మౌనతపస్యాఖ్యా బ్రహ్మచర్యఫలప్రదా ।**
**సర్వాభీష్టప్రదా దేవీ సత్యం సత్యం న సంశయః ॥66॥**

ఓ దేవీ! ఈ విధంగా మౌనతపస్సును చేస్తే, బ్రహ్మచర్యం ఫలించుటయే గాక, కోరికలన్నీ తీరుతాయి. ఇది ముమ్మాటికి నిజం. సంశయం లేదు.

**ఏవం చిత్తే సముద్దిశ్య కామం చింతయ శంకరమ్ ।**
**స తే ప్రసన్న ఇష్టార్థమచిరాదేవ దాస్యతి ॥67॥**

ఇట్లు మనస్సులో నిర్ణయించుకొని, యథేచ్ఛగా శంకరుని ధ్యానించు. ఆయన ప్రసన్నుడై కోరిన కోరికలను శీఘ్రమే తీరుస్తాడు.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ పలికాడు.

**ఉపవిశ్య వసిష్ఠోఽథ సంధ్యాయై తపసః క్రియామ్ ।**
**తామాభాష్య యథా న్యాయం తత్రైవాంతర్దధే మునిః ॥68॥**

వసిష్ఠుడు ఈ విధంగా సంధ్యకు తపస్సు చేయవలసిన విధానాన్ని ఉపదేశించాడు. తర్వాత ఆ ముని అక్కడనుండి మాయమయ్యాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే సంధ్యాచరిత్రవర్ణనం నామ పంచమోఽధ్యాయః ॥5॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో సంధ్యాచరిత్ర అనే ఐదవ అధ్యాయం సమాప్తం

## షష్ఠో౽ధ్యాయః - ఆరవ అధ్యాయం

## సంధ్యాతపోవర్ణనమ్ - సంధ్యతపోవర్ణనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికెను.

**సుతవర్య! మహాప్రాజ్ఞ! శృణు సంధ్యాతపో మహత్ ।**
**యచ్ఛ్రుత్వా నశ్యతే పాపసమూహస్తత్క్షణాద్ధ్రువమ్ ॥1॥**

మహాప్రాజ్ఞా! నువ్వు నా కుమారులలో శ్రేష్ఠుడవు. సంధ్య చేసిన తపస్సును విను. అది విన్న వాళ్ల పాపాలు వెంటనే తప్పకుండా నశిస్తాయి.

**ఉపవిశ్య తపోభావం వసిష్ఠే స్వగృహం గతే ।**
**సంధ్యాపి తపసో భావం జ్ఞాత్వా మోదమవాప హ ॥2॥**

ఆ తపస్సు యొక్క స్వరూపాన్ని ఉపదేశించి వసిష్ఠుడు తన ఇంటికి వెళ్లగా. సంధ్య తపస్సు యొక్క రూపాన్ని తెలుసుకొని ఆనందించింది.

**తతస్సానందమనసో వేషం కృత్వా తు యాదృశమ్ ।**
**తపశ్చర్తుం సమారేభే బృహల్లోహితతీరగా ॥3॥**

అపుడు ఆమె బృహల్లోహిత నదీతీరంలో కూర్చుని, ఆనందంతో నిండిన మనసు కలదై, తపస్సుకు వీలయిన వస్త్రాలను ధరించి, తపస్సు చేయటం ప్రారంభించింది.

**యథోక్తం తు వసిష్ఠేన మంత్రం తపసి సాధనమ్ ।**
**మంత్రేణ తేన సద్భక్త్యా పూజయామాస శంకరమ్ ॥4॥**

తపస్సునందు సాధనంగా వసిష్ఠుడు ఉపదేశించిన మంత్రంతో, ఆమె మంచి భక్తి కలదై శంకరుని పూజించింది.

**ఏకాంతమనసస్తస్యాః కుర్వంత్యాస్సుమహత్తపః ।**
**శంభౌ విన్యస్తచిత్తాయా గతమేకం చతుర్యుగమ్ ॥5॥**

ఆమె శంభునియందు మనసును దృఢంగా నిలిపి, ఇతర వ్యాపకాలు లేనిదై గొప్పతపస్సును చేస్తుండగా ఒక మహాయుగకాలం గడిచిపోయింది.

**ప్రసన్నో౽భూత్తదా శంభుస్తపసా తేన తోషితః ।**
**అంతర్బహిస్తథాకాశే దర్శయిత్వా నిజం వపుః ॥6॥**

ఆ తపస్సుకు శంభుడు సంతోషించి, ప్రసన్నుడై లోపల బయట మరియు ఆకాశంలో తన రూపాన్ని ప్రకటించాడు.

**యద్రూపం చింతయంతీ సా తేన ప్రత్యక్షతాం గతః ।**
**అథ సా పురతో దృష్ట్వా మనసా చింతితం ప్రభుమ్ ॥7॥**

ఆమె ఏ రూపాన్ని ధ్యానం చేస్తోందో అదే రూపంలో ఆయన ప్రత్యక్షమయ్యాడు. తాను మనసులో ధ్యానం చేసిన ప్రభువును ఆమె ఎదుట చూసింది.

**ప్రసన్నవదనం శాంతం ముమోదాతీవ శంకరమ్ ।**
**ససాధ్వసమహం వక్ష్యే కిం కథం స్తౌమి శంకరమ్ ॥**
**ఇతి చింతాపరా భూత్వా న్యమీలయత చక్షుషీ ॥8॥**

ప్రసన్నమైన ముఖం కలవాడు, శాంతుడు అయిన శంకరుని చూసి, ఆమె చాలా సంతోషించింది. ఆమె తొట్రుపాటుతో నేనేమి మాట్లాడగలను? శంకరుని ఎలా స్తుతించాలి? అని ఆమె ఆలోచిస్తూ కళ్లు మూసుకుంది.

**నిమీలితాక్ష్యాస్తస్యాస్తు ప్రవిశ్య హృదయం హరః ।**
**దివ్యం జ్ఞానం దదౌ తస్యై వాచం దివ్యే చ చక్షుషీ ॥9॥**

**ప్రత్యక్షం వీక్ష్య దుర్గేశం తుష్టావ జగతాం పతిమ్ ॥10॥**

కళ్లు మూసుకున్న ఆమె హృదయంలో హరుడు ప్రవేశించి ఆమెకు దివ్యజ్ఞానాన్ని, దివ్యవాక్కును, దివ్యనేత్రాలను ఇచ్చాడు. ఆమె జగత్ప్రభువైన పార్వతీపతిని ప్రత్యక్షంగా చూసి ఇలా స్తుతించింది.

**సంధ్యోవాచ -** సంధ్య పలికింది.

**నిరాకారం జ్ఞానగమ్యం పరం యన్నైవ స్థూలం నాపి సూక్ష్మం న చోచ్చమ్ ।**
**అంతశ్చింత్యం యోగిభిస్తస్య రూపం తస్మై తుభ్యం లోకకర్త్రే నమోఽస్తు ॥11॥**

నువ్వు నిరాకారుడవు. నీ సర్వాతీత తత్త్వజ్ఞానంతో నిన్ను పొందగలము. నీ రూపం స్థూలం కాని, సూక్ష్మంకాని, ఉన్నతం కాని కాదు. యోగులు నీ రూపాన్ని తమ హృదయంలో ధ్యానిస్తారు. లోకకర్తవగు నీకు నమస్కారం.

**సర్వం శాంతం నిర్మలం నిర్వికారం జ్ఞానగమ్యం స్వప్రకాశేఽవికారమ్ ।**
**స్వాభ్యప్రఖ్యం ధ్వాంతమార్గాత్పరస్తద్రూపం యస్య త్వాం నమామి ప్రసన్నమ్ ॥12॥**

సర్వవ్యాపకం, శాంతం, దోషరహితం, జ్ఞానంచే పొందగలిగేది, స్వప్రకాశంలో వికారం లేనిది, సంసారమనే తమోమార్గంలో అతీతంగా చిదాకాశంలో యోగులకు ప్రసిద్ధమైన రూపం ఉన్న దయామయుడైన నీకు నమస్కారం.

**ఏకం శుద్ధం దీప్యమానం తథాజం చిదానందం సహజం చావికారి ।**
**నిత్యానందం సత్యభూతిప్రసన్నం యస్య శ్రీదం రూపమస్మై నమస్తే ॥13॥**

అద్వయం, శుద్ధం, ప్రకాశించేది, పుట్టుక లేనిది, చిత్‌ఘనం, ఆనందఘనం, వికారాలు లేనిది, స్వరూపభూతం, శాశ్వతానందరూపం, సత్యమనే సంపదచే ప్రసన్నసంపదలనిచ్చేది అయిన రూపం గల నీకు నమస్కారం.

**గగనం భూర్దిశశ్చైవ సలిలం జ్యోతిరేవ చ ।**
**పునః కాలశ్చ రూపాణి యస్య తుభ్యం నమోస్తుతే ॥14॥**

ఆకాశం, భూమి, దిక్కులు, నీరు, అగ్ని, కాలం అనేవి నీ రూపాలే. అలాంటి నీకు నమస్కారం.

**విద్యాకారోద్భావనీయం ప్రభిన్నం సత్త్వచ్ఛందం ధ్యేయమాత్మస్వరూపమ్ ।**
**సారం పారం పావనానాం పవిత్రం తస్మై రూపం యస్య చైవం నమస్తే ॥15॥**

సర్వవిద్యారూపంగా భావింపదగిందీ భిన్నమైందీ, సత్త్వగుణప్రధానమైందీ, ప్రత్యగాత్మకంటే అభిన్నమైందీ అయిన నీ రూపం జ్ఞానం చేత తెలియబడుతుంది. భక్తులచే ధ్యానించబడునదీ, సారభూతమైందీ, అలౌకికమైందీ, పావనం చేసే తీర్థాలను పావనం చేసేదీ అయిన రూపం గల నీకు నమస్కారం.

**యత్త్వాకారం శుద్ధరూపం మనోజ్ఞం రత్నాకల్పం స్వచ్ఛకర్పూరగౌరమ్ ।**
**ఇష్టాభీతీ శూలముండే దధానం హస్తైర్నమో యోగయుక్తాయ తుభ్యమ్ ॥16॥**

నీ రూపం శుద్ధమైనది. మనోహరమైనది. రత్నాలతో అలంకరింపబడింది, స్వచ్ఛమైన కర్పూరంలా తెల్లనైనది. చేతులలో అభయవరముద్రలనూ, శూలాన్నీ, కపాలాన్నీ ధరించిన యోగీశ్వరుడైన నీకు నమస్కారం.

**ప్రధానపురుషౌ యస్య కాయత్వేన వినిర్గతౌ ।**
**తస్మాదవ్యక్తరూపాయ శంకరాయ నమో నమః ॥17॥**

ఎవని శరీరం నుండి ప్రధానము, పురుషుడు పుట్టారో, అలాంటి ఇంద్రియగోచరం కాని రూపం గల శంకరునికి అనేక నమస్కారాలు.

**యో బ్రహ్మా కురుతే సృష్టిం యో విష్ణుః కురుతే స్థితిమ్ ।**
**సంహరిష్యతి యో రుద్రస్తస్మై తుభ్యం నమో నమః ॥18॥**

బ్రహ్మరూపంలో సృష్టిని, విష్ణురూపంలో స్థితిని, రుద్రరూపంలో సంహారాన్ని చేయు నీకు అనేక నమస్కారాలు.

**త్వం పరః పరమాత్మా చ త్వం విద్యా వివిధా హరః ।**
**సద్బ్రహ్మ చ పరం బ్రహ్మ విచారణపరాయణః ॥19॥**

నీవు సర్వశ్రేష్ఠుడవు. పరమాత్మవు. అన్ని విద్యలు నీ రూపమే. నీవు హరుడవు. జ్ఞానం చేత మాత్రమే లభ్యమయ్యే సత్‌ఘనుడవైన పరబ్రహ్మవు నీవే.

**నమో నమః కారణకారణాయ దివ్యామృతజ్ఞానవిభూతిదాయ ।**
**సమస్తలోకాంతరభూతిదాయ ప్రకాశరూపాయ పరాత్పరాయ ॥20॥**

సర్వకారణకారణుడూ, దివ్యమైన అమృతం వంటి జ్ఞానసంపదను ఇచ్చేవాడూ, ఇతరపుణ్యలోకాల్లో కూడా సంపదలని ఇచ్చేవాడూ, ప్రకాశస్వరూపుడూ, పరాత్పరుడూ అయిన నీకు నమస్కారం.

**యస్యాऽపరం నో జగదుచ్యతే పదాత్ క్షితిర్దిశస్సూర్య ఇందుర్మనోజః ।**
**బహిర్ముఖా నాభితశ్చాంతరిక్షం తస్మై తుభ్యం శంభవే మే నమోऽస్తు ॥21॥**

భూమి, దిక్కులు, సూర్యచంద్రులు, మన్మథుడు మొదలగు జగత్తు శివునికంటే భిన్నంగా లేదని శాస్త్రం బోధిస్తోంది. అంతర్ముఖులే కాదు బహిర్ముఖులు కూడా ఆయన స్వరూపమే. ఆయన నాభినుంచి అంతరిక్షం ఉదయించింది. ఓ శంభూ! అలాంటి నీకు నమస్కారం.

**త్వం పరః పరమాత్మా చ త్వం విద్యా వివిధా హరః ।**
**సద్బ్రహ్మ చ పరం బ్రహ్మ విచారణపరాయణః ॥22॥**

నీవే పరానివి, పరమాత్మవు మరియు వివిధరూపములు కలవాడవూ. పరంబ్రహ్మవూ, సకలజీవులకు విచారణ పరాయణుడవూ నీవే!

**యస్య నాదిర్నమధ్యం చ నాంతమస్తి జగద్యతః ।**
**కథం స్తోష్యామి తం దేవం వాఙ్మనోగోచరం హరమ్ ॥23॥**

ఎవనికి మొదలూ, నడుమా, తుదలూ లేవో, ఎవనినుండి జగత్తు పుట్టిందో, అలాంటి వాక్కునకూ మనసుకూ గోచరం కాని ఆ దేవదేవుణ్ణి శివుణ్ణి ఎలా స్తుతించగలను?

**యస్య బ్రహ్మాదయో దేవ మునయశ్చ తపోధనాః ।**
**న వివృణ్వంతి రూపాణి వర్ణనీయః కథం స మే ॥24॥**

ఎవని రూపాలను బ్రహ్మాది దేవతలు, తపోనిష్ఠులయిన మునులు కూడా వర్ణింపజాలరో అలాంటి రూపాలను నేనెలా వర్ణించగలను?

**స్త్రియా మయా తే కిం జ్ఞేయా నిర్గుణస్య గుణాః ప్రభో ।**
**నైవ జానంతి యద్రూపం సేంద్రా అపి సురాసురాః ॥25॥**

ఓ ప్రభూ! ఎవని రూపాన్ని ఇంద్రాది దేవతలు, రాక్షసులు కూడా తెలియజాలరో అలాంటి నిర్గుణమైన నీ గుణములను స్త్రీనైన నేనెట్లు తెలుసుకోగలను?

**నమస్తుభ్యం మహేశాన! నమస్తుభ్యం తపోమయ ।**
**ప్రసీద శంభో దేవేశ! భూయో భూయో నమోస్తు తే ॥26॥**

ఓ మహేశ్వరా! నీకు నమస్కారం. తపస్వరూపుడవైన ఓ శివా! నీకు నమస్కారం. నాపై దయచూపు. నీకు అనేక నమస్కారాలు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్యాస్సంస్తుతః పరమేశ్వరః ।**
**సుప్రసన్నతరశ్చాభూచ్ఛంకరో భక్తవత్సలః ॥27॥**

అలా ఆమె మాటలతో నుతింపబడిన మహాదేవుడైన భక్తప్రీతిగల శంకరుడు మిక్కిలి ప్రసన్నుడుగా మారాడు.

**అథ తస్యాశ్శరీరం తు వల్కలాజినసంయుతమ్ ।**
**పరిచ్ఛన్నం జటావ్రాతైః పవిత్రే మూర్ధ్ని రాజితైః ॥28॥**

**హిమానీ తర్జితాంభోజసదృశం వదనం తదా ।**
**నిరీక్ష్య కృపయావిష్టో హరః ప్రోవాచ తామిదమ్ ॥29॥**

ఆమె శరీరంపై నారబట్టను, మృగచర్మాన్ని ధరించి ఉంది. పవిత్రమైన ఆమె తలపై జుట్టు జడలు కట్టి ప్రకాశించింది. ముఖం మంచుదెబ్బకు వాడిన పద్మంలా ఉంది. అట్టి ఆమెను చూసి దయ కలిగిన హరుడు ఆమెతో ఇలా అన్నాడు.

**మహేశ్వర ఉవాచ –** మహేశ్వరుడు పలికాడు.

**ప్రీతోఽస్మి తపసా భద్రే భవత్యాః పరమేణ వై ।**
**స్తవేన చ శుభప్రాజ్ఞే వరం వరయ సాంప్రతమ్ ॥30॥**

ఓ మంగళరూపురాలా! నీవు చేసిన గొప్ప తపస్సు చేత, స్తోత్రం చేత నేను ప్రీతుడయ్యాను. ఓ శుభకరమైన బుద్ధి కలదానా! ఇపుడు వరాన్ని కోరుకో!

**యేన తే విద్యతే కార్యం వరేణాస్మిన్మనోగతమ్ ।**
**తత్కరిష్యే చ భద్రం తే ప్రసన్నోఽహం తవ వ్రతైః ॥31॥**

నీ మనస్సులో ఉన్న వరం ఇస్తాను. నీకు మంగళకరమగు గాక! నీ వ్రతాలతో నేను ప్రసన్నుడయ్యాను. నీ మనస్సులో చేయదగ్గ అభిలాషను వరంతో తీరుస్తాను. నీ తపోవ్రతానికి నేను ప్రసన్నుణ్ణి అయ్యాను. నీకు మంగళమగుగాక!

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**ఇతి శ్రుత్వా మహేశస్య ప్రసన్నమనసస్తదా ।**
**సంధ్యోవాచ సుప్రసన్నా ప్రణమ్య చ ముహుర్ముహుః ॥32॥**

అపుడు ప్రసన్నమైన మనసు గల మహేశ్వరుని మాటను విని సంధ్య ఆనందించి, చాలాసార్లు నమస్కారం చేసి ఇలా అంది.

**సంధ్యోవాచ –** సంధ్య పలికింది.

**యది దేయో వరః ప్రీత్యా వరయోగ్యాస్మ్యహం యది ।**
**యది శుద్ధాస్మ్యహం జాతా తస్మాత్పాపాన్మహేశ్వర ॥33॥**

**యది దేవ ప్రసన్నోఽసి తపసా మమ సాంప్రతమ్ ।**
**వృత్తస్తదాయం ప్రథమో వరో మమ విధీయతామ్ ॥34॥**

ఓ మహేశ్వరా! ప్రీతితో వరాన్ని ఇచ్చే పక్షంలో, నేను వరానికి యోగ్యురాలను అయితే ఈ పాపము నుండి శుద్ధురాలనగు విధంగా, నాకు మొదటి వరం ప్రసాదాచండి.

**ఉత్పన్నమాత్రా దేవేశ ప్రాణినోఽస్మిన్నభస్థలే ।**
**న భవంతు సమేనైవ సకామాస్సంభవంతు వై ॥35॥**

హే దేవదేవా! ఈ ప్రపంచంలో అన్ని ప్రాణులు పుట్టిన వెంటనే కామం కలిగినవిగా పుట్టకుండు గాక!

**యద్ధి వృత్తా హి లోకేషు త్రిష్వపి ప్రథితా యథా ।**
**భవిష్యామి తథా నాన్యా వర ఏకో వృతో మయా ॥36॥**

జరిగిన కథంతా మూడు లోకాలలో ప్రసిద్ధి చెంది నేను అపకీర్తిని పొందకుండా అనుగ్రహించండి. ఇది నేను కోరే వరాలలో ఒకటి.

**సకామా మమ సృష్టిస్తు కుత్రచిన్న పతిష్యతి ।**
**యో మే పతిర్భవేన్నాథ సోఽపి మేఽతిసుహృచ్చ వై ॥37॥**

ఏ వ్యక్తిపైననూ కామంతో కూడిన నా చూపు పడకుండుగాక! హే నాథా! నాకు భర్త అయిన వ్యక్తి నాకు మంచిమిత్రుడై ఉండాలి.

**యో ద్రక్ష్యతి సకామో మాం పురుషస్తస్య పౌరుషమ్ ।**
**నాశం గమిష్యతి తదా స చ క్లీబో భవిష్యతి ॥38॥**

నన్ను కామంతో చూచే వ్యక్తి పురుషత్వం నశించి, వాడు నపుంసకుడు కావాలి.

**బ్రహ్మ ఉవాచ** - బ్రహ్మ పలికాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్యశంకరో భక్తవత్సలః ।**
**ఉవాచ సుప్రసన్నాత్మా నిష్పాపాయాస్తయేరితే ॥39॥**

భక్తవత్సలుడగు శంకరుడు సర్వపాపముల నుండి విముక్తురాలైన ఆమె మాటలను విని చాలా సంతోషించి ఇలా పలికాడు.

**మహేశ్వర ఉవాచ** - మహేశ్వరుడు పలికాడు.

**శృణు దేవి చ సంధ్యే త్వం త్వత్పాపం భస్మతాం గతమ్ ।**
**త్వయి త్యక్తో మయా క్రోధః శుద్ధా జాతా తపః కరాత్ ॥40॥**

ఓ సంధ్యాదేవీ! విను. నీ పాపం నశించింది. నీవు తపస్సు చేసి శుద్ధురాలవయ్యావు. నీపై కల కోపాన్ని నేను విడిచిపెట్టాను.

**యద్యద్వృతం త్వయా భద్రే దత్తం తదఖిలం మయా ।**
**సుప్రసన్నేన తపసా తవ సంధ్యే వరేణ హి ॥41॥**

ఓ మంగళస్వరూపురాలా! సంధ్యా! నీ తపస్సు చేత మరియు వరాల చేత నేను చాలా ప్రసన్నుడయ్యాను. నీవు కోరిన వరాలన్నీ ఇస్తున్నాను.

**ప్రథమం శైశవో భావః కౌమారాఖ్యో ద్వితీయకః ।**
**తృతీయో యౌవనో భావశ్చతుర్థో వార్ధకస్తథా ॥42॥**

మానవులు ముందుగా శైశవము (శిశుప్రాయం) తర్వాత రెండవదైన కౌమారం (కౌమారదశ), మూడవదైన యవ్వనం, చివరగా నాల్గవది అయిన వార్ధక్యం అను దశలను వరుసగా పొందుతారు.

**తృతీయే త్వథ సంప్రాప్తే వయోభాగే శరీరిణః ।**
**సకామాస్స్యుర్ద్వితీయాంతో భవిష్యతి క్వచిత్ క్వచిత్ ॥43॥**

ప్రాణుల మూడవదైన యౌవనాన్ని పొందినపుడు కామభావన కలిగి ఉంటారు. కొన్ని సందర్భాలలో కౌమారప్రాయం చివరలో కూడా వారు కామం కలిగియుండవచ్చు.

**తపసా తవ మర్యాదా జగతి స్థాపితా మయా ।**
**ఉత్పన్నమాత్రా న యథా సకామాస్స్యుశ్శరీరిణః ॥44॥**

ప్రాణులు పుట్టుకతోనే కామభావన గలవారు కాకుందు గాక! అను నీ మర్యాదను, నీ తపస్సునకు మెచ్చి లోకంలో స్థాపిస్తున్నాను.

**త్వం చ లోకే సతీభావం తాదృశం సమవాప్నుహి ।**
**త్రిషు లోకేషు నాన్యస్యా యాదృశం సంభవిష్యతి ॥45॥**

మూడు లోకాలలో ఇతరస్త్రీలెవ్వరికీ లేని పాతివ్రత్యాన్ని నీవు పొందుతావు.

**యః పశ్యతి స కామస్త్వాం పాణిగ్రాహమృతే తవ ।**
**స సద్యః క్లీబతాం ప్రాప్య దుర్బలత్వం గమిష్యతి ॥46॥**

నిన్ను చేపట్టిన నీ భర్త తప్ప ఇతరులు ఎవరైనా నిన్ను కామముతో చూస్తే అట్టి వ్యక్తి వెంటనే నపుంసకుడై, దుర్బలుడవుతాడు.

**పతిస్తవ మహాభాగస్తపోరూపసమన్వితః ।**
**సప్తకల్పాంతరజీవీ చ భవిష్యతి సహ త్వయా ॥47॥**

నీ భర్త మహాత్ముడు, తపశ్శాలి, తాపస రూపం కలవాడౌతాడు. నీ భర్త నీతో కూడి ఏడుకల్పాలు పూర్తి అయ్యేవరకు జీవిస్తాడు.

**ఇతి తే యే వరాః మత్తః ప్రార్థితాస్తే కృతా మయా ।**
**అన్యచ్చ తే వదిష్యామి పూర్వజన్మని సంస్థితమ్ ॥48॥**

ఈ విధంగా నీవు కోరిన వరాలన్నింటినీ ఇచ్చాను. పూర్వజన్మలో జరిగిన కథను ఒకదానిని ఇపుడు చెబుతాను.

**అగ్నౌ శరీరత్యాగస్తే పూర్వమేవ ప్రతిశ్రుతః ।**
**తదుపాయం వదామి త్వాం తత్కురుష్వ న సంశయః ॥49॥**

నువ్వు అగ్నిలో శరీరం విడవాలని పూర్వమే ప్రతిజ్ఞ చేశావు. నేను ఈ విషయంలో ఒక ఉపాయం చెప్తాను. నీవు దానిని తప్పక చేసి తీరాలి.

**స చ మేధాతిథిర్యజ్ఞే మునే ద్వాదశవార్షికే ।**
**కృత్స్నప్రజ్వలితే వహ్నావచిరాత్ క్రియతాం త్వయా ॥50॥**

మేధాతిథియను మహర్షి 12 సంవత్సరముల నుండి యజ్ఞం చేస్తున్నాడు. నీవు తొందరలో అక్కడ ప్రజ్వరిల్లిన అగ్నిలో నీ శరీరాన్ని విడిచిపెట్టు.

**ఏతచ్ఛైలోపత్యకాయాం చంద్రభాగానదీతటే ।**
**మేధాతిథిర్మహాయజ్ఞం కురుతే తాపసాశ్రమే ॥51॥**

ఈ పర్వతసమీపభూమియందు చంద్రభాగానదీతీరంలోని ఒక తాపాశ్రమంలోని మేధాతిథి ఆ మహాయజ్ఞాన్ని చేస్తున్నాడు.

**తత్ర గత్వా స్వయం ఛందం మునిభిర్నోపలక్షితా ।**
**మత్ప్రసాదాద్వహ్నిజాతా తస్య పుత్రీ భవిష్యసి ॥52॥**

నీ ఇష్టం ప్రకారం అక్కడికి వెళ్లు. నా అనుగ్రహముచే నీవు అక్కడ మునులకు కనిపించవు. నీవు అగ్నిహోత్రం నుండి పుట్టి, అతనికి కూతురువు కాగలవు.

**యస్తే వరో వాంఛనీయః స్వామీ మనసి కశ్చన ।**
**తం నిధాయ నిజస్వాంతే త్యజ వహ్నౌ వపుస్స్వకమ్ ॥53॥**

నీ మనసులో నీకు నచ్చిన పతిని స్మరిస్తూ నీ శరీరాన్ని అగ్నిలో విడిచిపెట్టు.

**యదా త్వం దారుణం సంధ్యే తపశ్చరసి పర్వతే ।**
**యావచ్చతుర్యుగం తస్య వ్యతీతే తు కృతే యుగే ॥54॥**

ఓ సంధ్యా! నీవు ఈ పర్వతంలో ఒక మహాయుగకాలం తపస్సు చేశావు. ఆ సమయంలో కృతయుగం గడిచిపోయింది.

**త్రేతాయాః ప్రథమే భాగే జాతా దక్షస్య కన్యకాః ।**
**యాస్తాశ్శీలసమాపన్నా యథా యోగ్యం వివాహితాః ॥55॥**

అపుడు త్రేతాయుగంలోని మొదటిపాదంలో దక్షునికి అనేకమంది కన్యలు పుట్టారు. వారు శీలవతులు. దక్షుడు వాళ్లకు చక్కగా పెళ్లిళ్లు చేశాడు.

**తన్మధ్యే స దదౌ కన్యా విధవే సప్తవింశతిః ।**
**చంద్రోఽన్యాస్సంపరిత్యజ్య రోహిణ్యాం ప్రీతిమానభూత్ ॥56॥**

ఆ కన్యలలో 27 మందిని ఆయన చంద్రునికిచ్చి పెళ్లి చేశాడు. చంద్రుడు తన ఇతర భార్యలను పట్టించుకోకుండా, రోహిణియందు మాత్రమే ప్రేమను చూపించాడు.

**తద్ధేతోర్హి యదా చంద్రశ్శప్తో దక్షేణ కోపినా ।**
**తదా భవత్యా నికటే సర్వే దేవాస్సమాగతాః ॥57॥**

ఆ కారణంతో దక్షుడు కోపించి చంద్రుణ్ణి శపించగా దేవతలందరు నువ్వు ఉన్న ఈ చోటుకు వచ్చారు.

**న దృష్టాశ్చ త్వయా సంధ్యే తే దేవా బ్రహ్మణా సహ ।**
**మయి విన్యస్తమనసా ఖం చ దృష్ట్వా లభేత్పునః ॥58॥**

ఓ సంధ్యా! నువ్వు బ్రహ్మతో కలసి వచ్చిన ఆ దేవతలను చూడలేదు. నాయందు లగ్నమైన మనస్సుగల్గి నీవు ఆకాశమును చూసిన తరువాత మరల వారి దర్శనం పొందగలవు.

**చంద్రస్య శాపమోక్షార్థం జాతా చంద్రనదీ తదా ।**
**సృష్టా ధాత్రా తదైవాత్ర మేధాతిథిరుపస్థితః ॥59॥**

చంద్రుని శాపవిముక్తి కోసం బ్రహ్మ చంద్రభాగానదిని పుట్టించాడు. అదే సమయంలో మేధాతిథి మహర్షి అక్కడకు వచ్చాడు.

**తపసా తత్సమో నాస్తి న భూతో న భవిష్యతి ।**
**యేన యజ్ఞస్సమారబ్ధో జ్యోతిష్టోమో మహావిధిః ॥60॥**

తపస్సులో మేధాతిథికి సమానమైనవాడు మరొకడు లేడు ఉండబోడు. ఆయన అతిగొప్పదైన జ్యోతిష్టోమమనే యజ్ఞాన్ని ప్రారంభించాడు.

**తత్ర ప్రజ్వలితో వహ్నిస్తస్మిన్ త్యజ వపుస్స్వకమ్ ।**
**సుపవిత్రా త్వమిదానీం సంపూర్ణోఽస్తు పణస్తవ ॥61॥**

అక్కడ అగ్ని ప్రకాశిస్తోంది. నీవు నీ దేహాన్ని దానియందు విడిచి పెట్టు. ఇపుడు నీవు చాలా పవిత్రురాలవైనావు. నీ ప్రతిజ్ఞ (అభీష్టం) నెరవేరు గాక!

**ఏతన్మయా స్థాపితం తే కార్యార్థం భో తపస్విని ।**
**తత్కురుష్వ మహాభాగే యాహి యజ్ఞే మహామునేః ॥**
**తస్యాహితం చ దేవేశస్తత్రైవాంతరధీయత ॥62॥**

ఓ తపస్వినీ! ఈ విధంగా నేను నీ కార్యములను సిద్ధింప చేశాను. ఓ మహాత్మురాలా! నేను చెప్పినట్లు చెయ్యి. ఆ మహాముని యజ్ఞం చేస్తున్న చోటుకు వెళ్లు. ఈ విధంగా దేవదేవుడు ఆమెకు హితవును ఉపదేశించి అక్కడే మాయమయ్యాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే సంధ్యాతపోవర్ణనం నామ షష్ఠోఽధ్యాయః ॥6॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో సంధ్యతపోవర్ణనం అనే ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తమోఽధ్యాయః - ఏడవ అధ్యాయం

## అరుంధతీ వసిష్ఠ వివాహవర్ణనమ్ - అరుంధతి వసిష్ఠుల వివాహవర్ణన

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**వరం దత్త్వా మునే తస్మిన్ శంభావంతర్హితే తదా ।**
**సంధ్యాప్యగచ్ఛత్తత్రైవ యత్ర మేధాతిథిర్మునిః ॥1॥**

ఓ మహర్షీ! శంభుడు వరాలన్నీ ఇచ్చి మాయమవ్వగానే, సంధ్య మేధాతిథి ఉన్న స్థానానికి వెళ్లింది.

**తత్ర శంభోః ప్రసాదేన న కేనాప్యుపలక్షితా ।**
**సస్మార వర్ణినం తం వై స్వోపదేశకరం తపః ॥2॥**

శంభుని అనుగ్రహం వల్ల ఆమె అక్కడ ఎవ్వరికీ కనిపించ లేదు. ఆమె తనకు తపస్సు చేయటానికి విధానాన్ని ఉపదేశించిన బ్రహ్మచారిని స్మరించింది.

**వసిష్ఠేన పురా సా తు వర్ణీభూత్వా మహామునే ।**
**ఉపదిష్టా తపశ్చర్తుం వచనాత్పరమేష్ఠినః ॥3॥**

ఓ మహర్షీ! పూర్వం నా ఆదేశంతో వసిష్ఠుడు బ్రహ్మచారిరూపంలో ఆమెకు తపస్సు చేసే విధానాన్ని ఉపదేశించాడు.

**తమేవ కృత్వా మనసా తపశ్చర్యోపదేశకమ్ ।**
**పతిత్వేన తదా సంధ్యా బ్రాహ్మణం బ్రహ్మచారిణమ్ ॥4॥**

తపస్సు చేయటానికి విధానాన్ని తెలియ చేసిన ఆ బ్రాహ్మణబ్రహ్మచారిని ఆమె మనసులో భర్తగా స్వీకరించింది.

**సమిద్ధేగ్నౌ మహాయజ్ఞే మునిభిర్నోపలక్షితా ।**
**దృష్టా శంభుప్రసాదేన సా వివేశ విధేస్సుతా ॥5॥**

ఆ మహాయజ్ఞంలో మండుతున్న అగ్నిలో బ్రహ్మమానసపుత్రిక అయిన ఈశ్వరానుగ్రహముతో సంధ్య మునులకు కనిపించకుండా ఆనందంగా ప్రవేశించింది.

**తస్యాః పురోడాశమయం శరీరం తత్క్షణాత్తతః ।**
**దగ్ధం పురోడాశగంధం తస్తార యదలక్షితమ్ ॥6॥**

పురోడాశరూపంగా సమర్పించబడిన ఆమె దేహం తత్క్షణమే (వెంటనే) కాలిపోయి పురోడాశగంధం అంతటా వ్యాపించింది. ఈ గంధానికి గల కారణం ఎవ్వరికి తెలియలేదు.

**వహ్నిస్తస్యాశ్శరీరం తు దగ్ధ్వా సూర్యస్య మండలమ్ ।**
**శుద్ధం ప్రవేశయామాస శంభోరేవాజ్ఞయా పునః ॥7॥**

ఆజ్ఞతో అగ్ని ఆ శరీరాన్ని దహించి, శివుని ఆజ్ఞతో శుద్ధమైన సూక్ష్మశరీరాన్ని తిరిగి సూర్యమండలంలో ప్రవేశపెట్టాడు.

**సూర్యో ద్వ్యర్ధం విభజ్యాథ తచ్ఛరీరం తదా రథే ।**
**స్వకేశం స్థాపయామాస ప్రీతయే పితృదేవయోః ॥8॥**

సూర్యుడు ఆమె శరీరాన్ని రెండుగా విభజించి పితరులకు, దేవతలకు ప్రీతిని కలిగించటానికి తన రథమునందు స్థాపించాడు.

**తదూర్ధ్వభాగస్తస్యాస్తు శరీరస్య మునీశ్వర ।**
**ప్రాతస్సంధ్యాభవత్సా తు అహోరాత్రాది మధ్యగా ॥9॥**

ఓ మహర్షీ! ఆమె శరీరం యొక్క పై భాగం రాత్రికి, పగలుకు మధ్యలో ఉండే ప్రాతస్సంధ్య అయింది.

**తచ్ఛేషభాగస్తస్యాస్తు అహోరాత్రాంతమధ్యగా ।**
**సా సాయమభవత్సంధ్యా పితృప్రీతిప్రదా సదా ॥10॥**

ఆమె యొక్క మిగిలిన భాగం పగలుకి రాత్రికి మధ్యలోని సాయంసంధ్య అయింది. ఎల్లప్పుడూ పితృదేవతలకు ప్రీతిని కలిగిస్తుంది.

**సూర్యోదయాత్తు ప్రథమం యదా స్యాదరుణోదయః ।**
**ప్రాతః సంధ్యా తదోదేతి దేవానాం ప్రీతికారిణీ ॥11॥**

సూర్యునికంటె ముందుగా ఉదయకాలంలో అరుణుడు ఉదయిస్తాడు. ఆ సమయంలోనే దేవతలకు ప్రీతిని కలిగించే ప్రాతస్సంధ్య ఉదయిస్తుంది.

**అస్తం గతే తతస్సూర్యే శోణపద్మనిభే సదా ।**
**ఉదేతి సాయంసంధ్యాపి పితౄణాం మోదకారిణీ ॥12॥**

ఎర్రని పద్మాన్ని పోలిన సూర్యుడు అస్తమించగానే, పితృదేవతలకు ఆనందాన్నిచ్చే సాయంసంధ్య ఉదయిస్తుంది.

**తస్యాః ప్రాణాస్తు మనసా శంభునాథ దయాలునా ।**
**దివ్యేన తు శరీరేణ చక్రిరే హి శరీరిణః ॥13॥**

అపుడు దయాళువు అయిన శంభుడు ఆమె ప్రాణాలను మనస్సుతో కలిపి స్థూలశరీరం గల దేహి యొక్క దివ్యమైన సూక్ష్మశరీరంగా నిర్మాణం చేశాడు.

**మునేర్యజ్ఞావసానే తు సంప్రాప్తే మునినా తు సా ।**
**ప్రాప్తా పుత్రీ వహ్నిమధ్యే తప్తకాంచనసుప్రభా ॥14॥**

మహర్షి యొక్క యజ్ఞం పూర్తి కాగానే ఆ అగ్నిమధ్య నుండి పుటము పెట్టిన బంగారంలా మెరిసిపోతున్న ఆమె కుమార్తెగా మహర్షిచే పొందబడింది.

**తాం జగ్రాహ తదా పుత్రీం మునిరామోదసంయుతః ।**
**యజ్ఞార్థం తాం తు సంస్నాప్య నిజక్రోడే దధౌ మునే ॥15॥**

ఆ మహర్షి ఆనందంతో ఆ కుమార్తెను స్వీకరించాడు. ఓ మహర్షీ! ఆయన ఆమెను యజ్ఞం కొరకు స్నానం చేయించి తనఒడిలో కూర్చుండబెట్టుకున్నాడు.

**అరుంధతీ తు తస్యాస్తు నామ చక్రే మహామునిః ।**
**శిష్యైః పరివృతస్తత్ర మహామోదమవాప హ ॥16॥**

ఆ మహర్షి ఆమెకు అరుంధతి అను పేరు పెట్టి, తన శిష్యులతో కలసి మిక్కిలి ఆనందంగా ఉన్నాడు.

**విరుణద్ధి యతో ధర్మం సా కస్మాదపి కారణాత్ ।**
**అతస్త్రిలోకే విదితం నామ సంప్రాప తత్స్వయమ్ ॥17॥**

ఆమె ఏ కారణంచేతనైనా ధర్మానికి అడ్డుపడదు. అందువలనే ఆమె మూడులోకాలలో అరుంధతి అనే అన్వర్థనామాన్ని పొందింది.

**యజ్ఞం సమాప్య స మునిః కృతకృత్యభావమాసాద్య సంపదయుతస్తనయా ప్రలంభాత్ ।**
**తస్మిన్నిజాశ్రమపదే సహ శిష్యవర్గైస్తామేవ సంతతమసౌ దయితే సురర్షే ॥18॥**

ఆ మహర్షి యజ్ఞాన్ని పూర్తి చేసి, కుమార్తెను పొందడంతో, సంపదలతో కూడిన వాడై తాను కృతార్థునిగా భావించాడు. ఓ దేవర్షీ! ఆయన తన ఆశ్రమంలో తన శిష్యులతో కూడిన ఆమెను అన్ని వేళలా లాలించి పాలిస్తూ గడపుతున్నాడు.

**అథ సా వవృధే దేవీ తస్మిన్మునివరాశ్రమే ।**
**చంద్రభాగానదీతీరే తాపసారణ్యసంజ్ఞకే ॥19॥**

అపుడు ఆ దేవి చంద్రభాగానదీతీరంలో, తాపసారణ్యం అనే పేరు గల ఆ మహర్షి ఆశ్రమంలో పెరిగింది.

**సంప్రాప్తే పంచమే వర్షే చంద్రభాగాం తదా గుణైః ।**
**తాపసారణ్యమపి సా పవిత్రమకరోత్సతీ ॥20॥**

ఆ సాధ్వి అయిదవయేడు వచ్చేనాటికి తన గుణాలతో చంద్రభాగానదినీ, తాపసారణ్యాన్నీ కూడ పవిత్రం చేసింది.

**వివాహం కారయామాసుస్తస్యా బ్రహ్మసుతేన వై ।**
**వసిష్ఠేన హ్యరుంధత్యా బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ॥21॥**

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఆ అరుంధతికి బ్రహ్మకుమారుడైన వసిష్ఠునితో పెళ్లి చేశారు.

**తద్వివాహే మహోత్సాహో బభూవ సుఖవర్ధనః ।**
**సర్వే సురాశ్చ మునయస్సుఖమాపుః పరం మునే ॥22॥**

ఓ మునీ! ఆ పెళ్లిలో సుఖాన్నిచ్చే గొప్ప ఉత్సవం జరిగింది. దేవతలు మరియు ఋషులు అందరూ ఆనందించారు.

**బ్రహ్మవిష్ణుమహేశానాం కరనిస్సృతతో యతః ।**
**సప్తనద్యస్సముత్పన్నాశ్శిప్రాద్యాస్సుపవిత్రకాః ॥23॥**

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల చేతుల నుండి జారిన నీటి నుండి పరమపావనములయిన శిప్రా మొదలైన ఏడునదులు పుట్టాయి.

**అరుంధతీ మహాసాధ్వీ సాధ్వీనాం ప్రవరోత్తమా ।**
**వసిష్ఠం ప్రాప్య సంరేజే మేధాతిథిసుతా మునే ॥24॥**

ఓ మహర్షీ! సాధ్వీమణులలోకెల్లా శ్రేష్ఠురాలు, మేథాతిథి కుమార్తె అయిన అరుంధతి వసిష్ఠుని పొంది ప్రకాశించింది.

**యస్యాః పుత్రాస్సముత్పన్నా శ్రేష్ఠాశ్శక్త్యాదయశ్శుభాః ।**
**వసిష్ఠం ప్రాప్య తం కాంతం సంరేజే మునిసత్తమాః ॥25॥**

ఓ మునిశ్రేష్ఠులారా! వసిష్ఠుని భర్తగా పొందిన ఆమెకు శ్రేష్ఠులు, పుణ్యాత్ములు అయిన శక్తి మొదలగు కుమారులు కలిగారు.

**ఏవం సంధ్యాచరిత్రం తే కథితం మునిసత్తమ ।**
**పవిత్రం పావనం దివ్యం సర్వకామఫలప్రదమ్ ॥26॥**

ఓ మహర్షీ! పవిత్రం, పావనం, దివ్యం, కోరికలన్నీ తీర్చేది అయిన సంధ్యకథను నీకు చెప్పాను.

**య ఇదం శృణుయాన్నారీ పురుషో వా శుభవ్రతః ।**
**సర్వాన్కామానవాప్నోతి నాత్ర కార్యా విచారణా ॥27॥**

స్త్రీ గాని, పురుషుడు గాని పవిత్రమైన నిష్ఠతో ఈ గాథను వింటే వారి కోరికలన్నీ సిద్ధిస్తాయనడంలో సందేహం లేదు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే అరుంధతీ వసిష్ఠ వివాహవర్ణనం నామ సప్తమోఽధ్యాయః ॥7॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో అరుంధతి వసిష్ఠుల వివాహవర్ణన అనే ఏడవ అధ్యాయం సమాప్తం.

## **అష్టమోఽధ్యాయః** - ఎనిమిదవ అధ్యాయం

## **వసంతస్వరూపవర్ణనమ్** - వసంతునిస్వరూపవర్ణన

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య బ్రహ్మణో హి ప్రజాపతేః ।**
**ప్రసన్నమానసో భూత్వా తం ప్రోవాచ స నారదః ॥1॥**

ప్రజాపతి అయిన బ్రహ్మ మాటలను విని ప్రసన్నమైన మనసు గల వాడైన నారదుడు ఇలా అన్నాడు.

**నారద ఉవాచ** - నారదుడు పలికాడు.

**బ్రహ్మన్! విధే! మహాభాగ! విష్ణుశిష్య మహామతే ।**
**ధన్యస్త్వం శివభక్తో హి పరతత్త్వప్రదర్శకః ॥2॥**

ఓబ్రహ్మదేవా! బ్రహ్మన్! విధీ! మహాత్మా! నీవు విష్ణుని శిష్యుడవు. మహాప్రాజ్ఞుడవు. శివభక్తుడవైన నీవు ధన్యుడవు. నీవు పరమాత్మతత్త్వాన్ని కళ్లకు కట్టినట్లు చెప్పగలవు.

**శ్రావితా సుకథా దివ్యా శివభక్తివివర్ధినీ ।**
**అరుంధత్యాస్తథా తస్యాస్స్వరూపాయాః పరే భవే ॥3॥**

అరుంధతి కథను, ఆమె పూర్వజన్మవృత్తాంతంతో సహా తరువాతి జన్మకథను వినిపించావు. ఈ దివ్యకథ శివభక్తిని పెంచేలా చేస్తుంది.

**ఇదానీం బ్రూహి ధర్మజ్ఞ పవిత్రం చరితం పరమ్ ।**
**శివస్య పరపాపఘ్నం మంగలప్రదముత్తమమ్ ॥4॥**

ఓ ధర్మజ్ఞా! పవిత్రం, శ్రేష్ఠం, మహాపాపాలను పోగొట్టేది, మంగళాలను ఇచ్చేది, ఉత్తమోత్తమమైనది అయిన శివచరితాన్ని ఇపుడు చెప్పండి.

**గృహీతదారే కామే చ దృష్టే తేషు గతేషు చ ।**
**సంధ్యాయాం కిం తపస్తప్తుం గతాయామభవత్తతః ॥5॥**

మన్మథుడు ఆనందంగా పెళ్లి చేసుకొని, వాళ్లందరూ తమ తమ చోట్లకి వెళ్లగా, సంధ్య తపస్సు కోసం వెళ్లగా అపుడు ఏం జరిగింది?

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్య ఋషేర్వై భావితాత్మనః ।**
**సుప్రసన్నతరో భూత్వా బ్రహ్మా వచనమబ్రవీత్ ॥6॥**

పవిత్రమైన అంతఃకరణం గల ఆ ఋషి మాటలను విని, బ్రహ్మ ఎంతో ప్రసన్నుడై ఇలా అన్నాడు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**శృణు నారద విప్రేంద్ర! తదేవ చరితం శుభమ్ ।**
**శివలీలాన్వితం భక్త్యా ధన్యస్త్వం శివసేవకః ॥7॥**

ఓ విప్రశ్రేష్ఠా! నారదా! శివుని లీలలతో కూడిన ఆ శుభచరితను భక్తితో విను. శివుని సేవకుడవైన నీవు ధన్యుడవు.

**అహం విమోహితస్తాత యదైవాంతర్హితః పురా! ।**
**అచింతయం సదాహం తచ్ఛంభువాక్యవిషార్దితః ॥8॥**

వత్సా! పూర్వం శివుడు మాయమవ్వగానే నేను మోహాన్ని పొంది ఆ శివుని వాక్యాలనే విషము వలన పీడింపబడి చింతించాను.

**చింతయిత్వా చిరం చిత్తే శివమాయావిమోహితః ।**
**శివే చేర్ష్యామకార్షం హి తచ్ఛృణుష్వ వదామి తే ॥9॥**

శివుని మాయచే మోహితుడనైన నేను చాలాకాలం మనసులో చింతించి శివుని పట్ల ఈర్ష్యను పొందాను. ఆ కథను చెప్తాను. విను.

**అథాహమగమం తత్ర యత్ర దక్షాదయః స్థితాః ।**
**సరతిం మదనం దృష్ట్వా సమదోహం హి కించన ॥10॥**

అపుడు నేను దక్షుడు, ఇతరులు ఉన్న చోటుకు వెళ్లాను. అక్కడ రతితో కూడియున్న మన్మథుణ్ణి చూసి నేను కొంచెం గర్వాన్ని పొందాను.

**దక్షమాభాష్య సుప్రీత్యా పరాన్ పుత్రాంశ్చ నారద ।**
**అవోచం వచనం సోఽహం శివమాయావిమోహితః ॥11॥**

ఓ నారదా! శివమాయామోహితుడనైన నేను దక్షుణ్ణి, ఇతర కుమారులను ప్రేమతో పలకరించి ఇలా అన్నాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**హే దక్ష హే మరీచ్యాద్యాస్సుతా శ్రుణుత మద్వచః ।**
**శ్రుత్వోపాయం విధేయం హి మమ కష్టాపనుత్తయే ॥12॥**

ఓ దక్షా! ఓ మరీచ్యాది కుమారులారా! నా మాట విని, నా కష్టాన్ని తీర్చే ఉపాయాన్ని చేయండి.

**కాంతాభిలాషమాత్రం మే దృష్ట్వా శంభురగర్హయత్ ।**
**మాం చ యుష్మాన్మహాయోగీ ధిక్కారం కృతవాన్ బహు ॥13॥**

నేను స్త్రీయందు అభిలాషను మాత్రమే తెలియ చేశాను. అది చూసి శివుడు నిందించాడు. మహాయోగి అయిన శివుడు నన్నూ, మిమ్మల్నీ చాలా విధంగా ధిక్కరించినాడు.

**తేన దుఃఖాభితప్తోఽహం లభేఽహం శర్మ న క్వచిత్ ।**
**యథా గృహ్ణాతు కాంతాం స స యత్నః కార్య ఏవ హి ॥14॥**

ఆ కారణం వల్ల నేను దుఃఖంతో వేగిపోతున్నాను. నాకు ఎక్కడా సుఖం దొరకటం లేదు. ఆయన స్త్రీని పెళ్లి చేసుకునేలా మీరు ప్రయత్నించాలి.

**యథా గృహ్ణాతు కాంతాం స సుఖీ స్యాం దుఃఖవర్జితః ।**
**దుర్లభస్స తు కామో మే పరం మన్యే విచారతః ॥15॥**

ఆయన స్త్రీని చేబట్టిన రోజు నేను దుఃఖాన్ని విడిచి సుఖాన్ని పొందుతాను. కాని ఆలోచించి చూస్తే నా కోరిక తీరదని అనిపిస్తోంది.

**కాంతాభిలాషమాత్రం మే దృష్ట్వా శంభురగర్హయత్ ।**
**మునీనాం పురతః కస్మాత్స కాంతాం సంగ్రహీష్యతి ॥16॥**

నేను స్త్రీని చూసి అభిలాషను మాత్రమే ప్రకటించాను. అది చూసి శంభుడు నన్ను మునుల ఎదుట అవమానపరచాడు. అటువంటి ఆయన స్త్రీని ఎలా స్వీకరిస్తాడు.

**కా వా నారీ త్రిలోకేఽస్మిన్ యా భవేత్తన్మనాస్థితా ।**
**యోగమార్గమవజ్ఞాప్య తస్య మోహం కరిష్యతి ॥17॥**

ఆయన మనసులో ప్రవేశించి, యోగమార్గంలో ఉండే ఆయన మనసును కదిలించి, ఆయనకు మోహం కలిగించగల స్త్రీ ఈ మూడులోకాలలో ఎవరైనా ఉన్నారా?

**మన్మథోఽపి సమర్థో నో భవిష్యత్యస్య మోహనే ।**
**నితాంతయోగీ రామాణాం నామాపి సహతే న సః ॥18॥**

యోగీశ్వరుడైన ఆయనను మోహింప చేయడంలో మన్మథుడు కూడా సమర్థుడు కాలేదు. ఆయన స్త్రీల పేరును వినడానికి కూడా సహించడు.

**అగృహీతేషుణా చైవ హరేణ కథమాదినా ।**
**మధ్యమా చ భవేత్సృష్టిస్తద్వాచానన్యవారితా ॥19॥**

ఆదికారణుడైన శివుడు మన్మథుని బాణాల ప్రభావాన్ని తిరస్కరిస్తే, మధ్యమ సృష్టి, ప్రథమ సృష్టిలాగ నిరాటంకంగా ఎలా కొనసాగుతుంది?

**భువి కేచిద్భవిష్యంతి మాయాబద్ధా మహాసురాః ।**
**బద్ధా కేచిద్ధరేర్నూనం కేచిచ్ఛంభోరుపాయతః ॥20॥**

భూలోకంలో కొందరు మహాసురులు మాయచే బంధింపబడుతున్నారు. కొందరు హరిమాయచే, మరికొందరు శివునిమాయచే ఉపాయంగా బంధింపబడుతున్నారు.

**సంసారవిముఖే శంభౌ తథైకాంతవిరాగిణి ।**
**అస్మాదృతే న కర్మాన్యత్ కరిష్యతి న సంశయః ॥21॥**

సంసారమునందు విముఖుడు, ఏకాకిగా మహావిరాగి అయిన శంభునికి మోహం కలిగించడం అనే పనిని మనం తప్ప మరియొకరు చేయలేరు. ఇందులో సందేహం లేదు.

**ఇత్యుక్త్వా తనయాంశ్చాహం దక్షాదీన్ సునిరీక్ష్య చ ।**
**సరతిం మదనం తత్ర సానందమగదం తతః ॥22॥**

నేను, దక్షుడు, నా కుమారులతోనూ ఇలా అని, రతీదేవితో కలసి ఉన్న మదనుణ్ణి చూసి, సంతోషించినవాడినై ఇలా అన్నాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**మత్పుత్ర! వర! కామ! త్వం సర్వథా సుఖదాయకః ।**
**మద్వచశ్శృణు సుప్రీత్యా స్వపత్న్యా పితృవత్సల! ॥23॥**

ఓ కామా! నువ్వు నా కుమారులలో శ్రేష్ఠుడవు. నీవు అన్ని విధాలా సుఖాలను ఇచ్చేవాడివి. తండ్రియందు ప్రేమగల ఓ కామా! నీవు నీ భార్య కలిసి నా మాట ప్రేమతో వినండి.

**అనయా సహచారిణ్యా రాజసే త్వం మనోభవ ।**
**ఏషా చ భవతా పత్యా యుక్తా సంశోభతే భృశమ్ ॥24॥**

మన్మథా! నీవు నీ భార్యతో కలసి ఆనందంగా ఉన్నావు. ఈమె కూడా భర్తైన నీతో కలసి చాలా ఆనందంగా ప్రకాశిస్తోంది.

**యథా స్త్రియా హృషీకేశో హరిణా సా యథా రమా ।**
**క్షణదా విధునా యుక్తా తయా యుక్తో యథా విధుః ॥25॥**

**తథైవ యువయోశ్శోభా దాంపత్యం చ పురస్కృతమ్ ।**
**అతస్త్వం జగతః కేతుర్విశ్వకేతుర్భవిష్యతి ॥26॥**

హరి లక్ష్మితో, లక్ష్మి హరితో, రాత్రి చంద్రునితో, చంద్రుడు రాత్రితో ప్రకాశించినట్లుగా మీరిద్దరూ ఆ విధంగానే శోభిల్లుతున్నారు. మీ దాంపత్యం మెచ్చుకోదగింది. కావున నువ్వు జగతికి ఉన్నతుడవై విశ్వోన్నతుడవవుతావు.

**జగద్ధితాయ వత్స! త్వం మోహయస్వ పినాకినమ్ ।**
**యథాశు సుమనశ్శంభుః కుర్యాద్దారప్రతిగ్రహమ్ ॥27॥**

హే వత్సా! నువ్వు ఈ ప్రపంచం మేలు కోరి, శివుని మోహింప చేసి, ఆయన భార్యను వెంటనే పొందేటట్లు చేయి.

**విజనే స్నిగ్ధదేశే తు పర్వతేషు సరస్సు చ ।**
**యత్ర యత్ర ప్రయాతీశస్తత్ర తత్రానయా సహ ॥28॥**

శివుడు ఏకాంతసుందర ప్రదేశానికి కాని, పర్వతానికి గాని, సరస్సుకు గాని, ఇతర స్థలాలకు కాని, ఎచటకు వెళ్లినా, నీవు ఈమెతో కలసియుండి వెంబడించు.

**మోహయ త్వం యతాత్మానం వనితావిముఖం హరమ్ ।**
**త్వదృతే విద్యతే నాన్యః కశ్చిదస్య విమోహకః ॥29॥**

ఆత్మనిగ్రహం కలిగి స్త్రీ విముఖుడై ఉన్న ఈ శివుని మోహింప చేయి. ఆయనను నీవు తప్ప ఎవరూ మోహింపజేయ లేరు.

**భూతే హరే సానురాగే భవతోఽపి మనోభవ ।**
**శాపోపశాంతిర్భవితా తస్మాదాత్మహితం కురు ॥30॥**

ఓ మన్మథా! శివుడు అనురాగం కలవాడైతే, నీ శాపానికి కూడా ఉపశమనం కలుగుతుంది. కాబట్టి నీకు హితము కలిగేటట్లు ప్రవర్తించు.

**సానురాగో వరారోహాం యదీచ్ఛతి మహేశ్వరః ।**
**తథా భవోఽపి యోగ్యార్యస్త్వాం చ సంతారయిష్యతి ॥31॥**

మహేశ్వరుడు దయామయుడైన దైవం. ఆయన ఒక సుందరియందు అనురాగం పొందితే నిన్ను కూడా తరింపచేస్తాడు.

**తస్మాజ్జాయా ద్వితీయస్త్వం యతస్వ హరమోహనే ।**
**విశ్వస్య భవ కేతుస్త్వం మోహయిత్వా మహేశ్వరమ్ ॥32॥**

కాబట్టి నీవు నీ భార్యతో కలసి శివుణ్ణి మోహింప చేయటానికి ప్రయత్నించు. మహేశ్వరుని మోహింప చేసి నువ్వు ప్రపంచానికి నాయకుడవ్వాలి.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**ఇతి శ్రుత్వా వచో మే హి జనకస్య జగత్ప్రభోః ।**
**ఉవాచ మన్మథస్తథ్యం తదా మాం జగతాం పతిమ్ ॥33॥**

జగత్ప్రభువైన నా మాటలను విని మన్మథుడు నాతో ఈ సత్యవాక్యాన్ని పలికాడు.

**మన్మథ ఉవాచ** – మన్మథుడు పలికాడు.

**కరిష్యేహం తవ విభో! వచనాచ్ఛంభుమోహనమ్ ।**
**కిం తు యోషిన్మహాస్త్రం మే తత్కాంతాం భగవన్ సృజ ॥34॥**

హే విభో! నీ మాటల ప్రకారం నేను శంభుని మోహింప చేస్తాను. కాని నా మహాస్త్రం స్త్రీమూలం కాబట్టి అలాంటి స్త్రీని పుట్టించు.

**మయా సమ్మోహితే శంభౌ యయా తస్యానుమోహనమ్ ।**
**కర్తవ్యమధునా ధాతస్తత్రోపాయం పరం కురు ॥35॥**

నేను ముందుగా శంభుని మోహింప చేసిన తర్వాత ఆమె ఆయనను మరలా మోహింప చేయాలి. ఓ బ్రహ్మదేవా! ఇపుడు ఈ విషయంలో చక్కని ఉపాయాన్ని చేయండి.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**ఏవం వాదిని కందర్పే ధాతాహం స ప్రజాపతిః ।**
**కయా సమ్మోహనీయోసావితి చింతామయోఽభవమ్ ॥36॥**

మన్మథుడు ఇలా పలుకగా, ప్రజాపతి అయిన నేను “ఈ శివుని సమ్మోహింప చేయ గల స్త్రీ ఎవరు?”అని ఆలోచించాను.

**చింతావిష్టస్య మే తస్య నిశ్వాసో యో వినిస్సృతః ।**
**తస్మాద్వసంతస్సంజాతః పుష్పవ్రాతవిభూషితః ॥37॥**

ఈ విధంగా ఆలోచిస్తున్న నా నిశ్వాసం నుండి వసంతుడు పుట్టాడు. అతడు పుష్పమాలలతో అలంకరింపబడి ఉన్నాడు.

**శోణరాజీవసంకాశః ఫుల్లతామరసేక్షణః ।**
**సంధ్యోదితాఖండశశిప్రతిమాస్యస్సునాసికః ॥38॥**

ఎర్రని పద్మం లాగ ప్రకాశించాడు. అతని కళ్లు వికసించిన పద్మాల్లాగ ఉన్నాయి. అందమైన ముక్కు ఉన్న అతడు సంధ్యాకాలంలో ఉదయించిన పూర్ణచంద్రుని లాంటి ముఖం కలిగి ఉన్నాడు.

**శార్ఙ్గవచ్చరణావర్తశ్యామకుంచితమూర్ధజః ।**
**సంధ్యాంశుమాలిసదృశః కుండలద్వయమండితః ॥39॥**

అతని పాదాల క్రింద ధనుస్సు ఆకారం గల రేఖలున్నాయి. అతని జుట్టు నల్లగా వంకరలు తిరిగి ఉంది. సాయంకాలపు సూర్యుడిలా ఉన్న అతని ముఖం రెండు కుండలాలచే అలంకరింపబడి ఉంది.

**ప్రమత్తేభగతిః పీనాయతదోరున్నతాంసకః ।**
**కంబుగ్రీవస్సువిస్తీర్ణహృదయః పీనసన్ముఖః ॥40॥**

బలిసిన పొడవైన చేతులు, ఎత్తయిన భుజాలు గల అతడు మదించిన ఏనుగులా మెల్లగా నడుస్తున్నాడు. అతని మెడ శంఖాన్ని పోలివుంది. విశాలమైన వక్షం కలిగి చక్కని ముఖంతో ఉన్నాడు.

**సర్వాంగసుందరః శ్యామస్సంపూర్ణస్సర్వలక్షణైః ।**
**దర్శనీయతమస్సర్వమోహనః కామవర్ధనః ।।41।।**

సర్వాంగసుందరుడు, నీలవర్ణం కల వాడు, అన్ని లక్షణాలతో సంపూర్ణమైన వాడు, గొప్ప సౌందర్యం వలన అతడు అందరినీ మోహింప చేస్తూ, కామాన్ని వృద్ధి చేసేలా ఉన్నాడు.

**ఏతాదృశే సముత్పన్నే వసంతే కుసుమాకరే ।**
**వవౌ వాయుస్సుసురభిః పాదపా అపి పుష్పితాః ।।42।।**

పువ్వులకు ఆశ్రయమైన ఇలాంటి వసంతుడు పుట్టగానే మంచిగంధాల గాలులు వీచాయి. చెట్లన్నీ పువ్వులతో నిండిపోయాయి.

**పికా వినేదుశ్శతశః పంచమం మధురస్వనాః ।**
**ప్రఫుల్లపద్మా అభవన్ సరస్యస్స్వచ్ఛపుష్కరాః ।।43।।**

మధురమైన శబ్దాలను చేసే వందలాది కోయిలలు పంచమస్వరంతో కూశాయి. స్వచ్ఛంగా వికసించిన పద్మాలతో సరస్సులు కూడి ఉన్నాయి.

**తముత్పన్నమహం వీక్ష్య తదా తాదృశముత్తమమ్ ।**
**హిరణ్యగర్భో మదనమగదం మధురం వచః ।।44।।**

అలాంటి ఉత్తముడైన వసంతుని పుట్టుక చూడగానే హిరణ్యగర్భుడనైన నేను మదనునితో మధురంగా ఇలా మాట్లాడాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**ఏవం స మన్మథనిభస్సదా సహచరోఽభవత్ ।**
**ఆనుకూల్యం తవ కృతస్సర్వం దేవ కరిష్యతి ।।45।।**

ఓ మన్మథా! నీతో సమానమైన వసంతుడు నీకు తోడుగా ఉండి అన్నింట్లో నీకు అనుకూలంగా చేయగలడు.

**యథాగ్నే పవనో మిత్రం సర్వత్రోపకరిష్యతి ।**
**తథాయం భవతో మిత్రం సదా త్వామనుయాస్యతి ।।46।।**

ఏవిధంగా నిప్పునకు గాలి ఎప్పుడూ మిత్రుడై ఉపయోగపడతాడో, అట్లే ఇతడు నీకు మిత్రుడై ఎప్పుడూ నిన్ను అనుసరించి ఉంటాడు.

**వసతేరంతహేతుత్వాద్వసంతాఖ్యో భవత్వయమ్ ।**
**తవానుగమనం కర్మ తథా లోకానురంజనమ్ ।।47।।**

ప్రసన్నంగా ఉన్న మనసు కలవారి ఆనందాన్ని అంతమొందించే వాడు కాబట్టి వసంతుడని ఇతనికి పేరు గలుగు గాక! ఎపుడూ నిన్ను అనుసరిస్తూ లోకాలను రంజింప చేయటం ఇతని పని.

**అసౌ వసంతశృంగారో వాసంతో మలయానిలః ।**
**భవేత్తు సుహృదో భావస్సదా త్వద్వశవర్తినః ॥48॥**

ఈ వసంతుడు వసంతకాలంలో వచ్చే కొండగాలి సదా నీకు వశమై నీ యందు స్నేహభావం కలిగి ఉంటారు.

**బిబ్బోకాద్యాస్తథా హావాశ్చతుష్షష్టికలాస్తథా ।**
**రత్యాః కుర్వంతు సౌహృద్యం సుహృదస్తే యథా తవ ॥49॥**

భావప్రకటన, హావభావాలు, అరవై నాలుగు కళలు మొ॥వి కూడా నీకు సహకరిస్తాయి. వీరు నీకు స్నేహితులైనట్లే రతి దేవికి కూడా మిత్రులుగా ఉండి సౌహార్దాన్ని అందిస్తారు.

**ఏభిస్సహచరైః కామ వసంతప్రముఖైర్భవాన్ ।**
**మోహయస్వ మహాదేవం రత్యా సహ మహోద్యత ॥50॥**

ఓ మన్మథా! నీవు వసంతుడు మరియు రతీదేవితో కలసి ఈ గొప్ప పనిని ఉత్సాహంతో చేపట్టి మహాదేవుణ్ణి మోహింప చేయాలి.

**అహం తాం కామినీం తాత భావయిష్యామి యత్నతః ।**
**మనసా సువిచార్యైవ యా హరం మోహయిష్యతి ॥51॥**

వత్సా! హరుని మోహింప చేయగల సుందరిని గూర్చి బాగా ఆలోచించి ప్రయత్నించి సృష్టిస్తాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**ఏవముక్తో మయా కామస్సురజ్యేష్ఠేన హర్షితః ।**
**ననామ చరణౌ మేఽపి స పత్నీ సహితస్తదా ॥52॥**

దేవనాయకుడైన నేను ఇలా చెప్పగా మన్మథుడు చాలా సంతోషించి, భార్యతో కలసి నా పాదాలకు నమస్కరించాడు.

**దక్షం ప్రణమ్య తాన్ సర్వాన్మానసానభివాద్య చ ।**
**యత్రాత్మా గతవాన్ శంభుస్తత్ స్థానం మన్మథో యయౌ ॥53॥**

మన్మథుడు దక్షునకు, ఇతర బ్రహ్మమానసపుత్రులందరికీ నమస్కారం చేసి, శంభుడు వెళ్లిన చోటుకువెళ్లాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే వసంత స్వరూపవర్ణనం నామాష్టమోఽధ్యాయః ॥8॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో వసంతుని స్వరూపవర్ణన అనే ఎనిమిదవ అధ్యాయం సమాప్తం

## నవమోఽధ్యాయః - తొమ్మిదవ అధ్యాయం

## కామప్రభావ మారగణోత్పత్తివర్ణనమ్ - కామప్రభావం, మారగణాల ఉత్పత్తివర్ణన

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**తస్మిన్ గతే సానుచరే శివస్థానం చ మన్మథే ।**
**చరిత్రమభవచ్చిత్రం తచ్ఛృణుష్వ మునీశ్వర ॥1॥**

ఓ మహర్షీ! ఆ మన్మథుడు తన అనుచరులతో కూడి శివస్థానానికి వెళ్లగానే చిత్రమైన కథ జరిగింది. దానిని విను.

**గత్వా తత్ర మహావీరో మన్మథో మోహకారకః ।**
**స్వప్రభావం తతానాశు మోహయామాస ప్రాణినః ॥2॥**

మహావీరుడు, మోహకారకుడు అయిన మన్మథుడు అచటకు చేరిన వెంటనే తన ప్రభావాన్ని విస్తరించాడు. మరియు ప్రాణులను మోహపెట్టాడు.

**వసంతోఽపి ప్రభావం స్వం చకార హరమోహనమ్ ।**
**సర్వే వృక్షా ఏకదైవ ప్రఫుల్లా అభవన్మునే ॥3॥**

వసంతుడు కూడా శివునికి మోహం కలిగించడానికి తన ప్రభావాన్ని విస్తరించాడు. ఓ మునీ! ఒకే సమయంలో చెట్లన్నీ పువ్వులతో నిండిపోయాయి.

**వివిధాన్ కృతవాన్ యత్నాన్ రత్యా సహ మనోభవః ।**
**జీవాస్సర్వే వశం యాతాస్సగణేశశ్శివో న హి ॥4॥**

మన్మథుడు రతీదేవి కూడా అనేక ప్రయత్నాలు చేశారు. జీవులన్నీ వశమైనాయి. కాని గణేశుడు, శివుడు వారికి వశం కాలేదు.

**సమధోర్మదనస్యాసన్ ప్రయాసా నిష్ఫలా మునే ।**
**జగామ స మమ స్థానం నివృత్య విమదస్తదా ॥5॥**

ఓ మహర్షీ! మన్మథుడు వసంతునితో కలసి చేసిన ప్రయత్నాలన్నీ వృథా అవ్వగా అతని గర్వం తొలగిపోయింది. అపుడు అతడు నా దగ్గరకు వచ్చాడు.

**కృత్వా ప్రణామం విధయే మహ్యం గద్గదయా గిరా ।**
**ఉవాచ మదనో మాం చోదాసీనో విమదో మునే ॥6॥**

ఓ మహర్షీ! అతడు గర్వం పోయినవాడై, నిరుత్సాహంతో ఉండి సృష్టికర్తనైన నాకు ప్రణమిల్లి గద్గదస్వరంతో ఇలా అన్నాడు.

**మన్మథః ఉవాచ** - మన్మథుడు పలికాడు.

**బ్రహ్మన్ శంభుర్మోహనీయో న వై యోగపరాయణః ।**
**న శక్తిర్మమ నాన్యస్య తస్య శంభోర్హి మోహనే ॥7॥**

ఓ బ్రహ్మ! యోగనిష్ఠుడైన శంభుని మోహింపచేయటం అసంభవం సుమా! నాకు గాని ఇతరులకు గాని అలాంటి శంభుని మోహింప చేసే శక్తి లేదు.

**సమిత్రేణ మయా బ్రహ్మన్నుపాయా వివిధాః కృతాః ।**
**రత్యా సహాఖిలాస్తే చ నిష్ఫలా అభవన్ శివే ॥8॥**

ఓ బ్రహ్మ! నా మిత్రునితో కూడి రతీదేవి సహకారంతో నేను చేసిన అన్ని ప్రయత్నాలు వ్యర్థములైనాయి.

**శృణు బ్రహ్మన్ యథాఽస్మాభిః కృతా హి హరమోహనే ।**
**ప్రయాసా వివిధాస్తాత గదతస్తాన్మునే మమ ॥9॥**

ఓ బ్రహ్మ! శివుని మోహింపచేయటానికి మేము చేసిన అనేక ఉపాయాలూ, కష్టాలూ చెప్తాను. తండ్రీ! వినండి.

**యదా సమాధిమాశ్రిత్య స్థితశ్శంభుర్నియంత్రితః ।**
**తదా సుగంధివాతేన శీతలేనాతివేగినా ॥10॥**

**ఉద్వేజయామి రుద్రం స్మ నిత్యం మోహనకారిణా ।**
**ప్రయత్నతో మహాదేవం సమాధిస్థం త్రిలోచనమ్ ॥11॥**

శంభుడు ఇంద్రియాలను నియంత్రించి సమాధిలో ఉండగా ఆ ముక్కంటికి చల్లనైన వేగంతో కూడిన, ఎప్పుడూ మోహాన్ని కలిగించే పరిమళంగల వాయువుతో శివుణ్ణి ఉద్వేగపరచాను.

**స్వసాయకాంస్తథా పంచ సమాదాయ శరాసనమ్ ।**
**తస్యాభితో భ్రమంతస్తు మోహయంస్తద్గణానహమ్ ॥12॥**

నేను నా అయిదు బాణాలను మరియు ధనస్సును చేతబట్టి, శివగణాలను మోహింపచేస్తూ ఆయన చుట్టు పక్కల తిరిగాను.

**మమ ప్రవేశమాత్రేణ సువశ్యాస్సర్వజంతవః ।**
**అభవద్వికృతో నైవ శంకరస్సగణః ప్రభుః ॥13॥**

నేను ప్రవేశించగానే అన్ని ప్రాణులు నాకు తేలికగా వశమౌతాయి. కాని శివప్రభువు, ఆయన గణాలు ఎలాంటి వికారాన్ని పొందనే లేదు.

**యదా హిమవతః ప్రస్థం స గతః ప్రమథాధిపః ।**
**తత్రాగతస్తదైవాహం సరతిస్సమధుర్విధే ॥14॥**

ఓ బ్రహ్మా! ప్రమథగణాధిపతి అయిన ఆ శివుడు హిమవత్పర్వతమైదానాలకు వెళ్తే, అపుడు నేను, రతి మరియు వసంతుడు కూడా అక్కడకు వెళ్లాము.

**యదా మేరుం గతో రుద్రో యదా వా నాగకేశరమ్ ।**
**కైలాసం వా యదా యాతస్తత్రాహం గతవాంస్తదా ॥15॥**

ఆ రుద్రుడు మేరు పర్వతానికి, నాగకేశర పర్వతానికి గాని, లేదా కైలాసానికి గాని వెళ్ళగా నేను కూడా ఆయా స్థలాలకు వెళ్లి ఆయన వెనకాలే ఉన్నాను.

**యదా త్యక్తసమాధిస్తు హరస్తస్థౌ కదాచన ।**
**తదా తస్య పురశ్చక్రయుగం రచితవానహమ్ ॥16॥**

ఎపుడైన శివుడు సమాధిని వీడినాడో, ఆ సమయంలో నేను ఆయన ఎదుట చక్రవాకపక్షుల జంటను కల్పించాను.

**తచ్చ భ్రూయుగలం బ్రహ్మన్ హావభావయుతం ముహుః ।**
**నానాభావానకార్షీచ్చ దాంపత్యక్రమముత్తమమ్ ॥17॥**

ఓ బ్రహ్మా! ఆ పక్షుల జంట మళ్లీ మళ్లీ హావభావాలు ప్రకటిస్తూ ఉత్తమమగు దాంపత్యపద్ధతిని తెలియజేయు అనేక విధములైన శృంగార భావాలను ప్రదర్శించాయి.

**నీలకంఠం మహాదేవం సగణం తత్పురస్థితాః ।**
**అకార్షుర్మోహితం భావం మృగాశ్చ పక్షిణస్తథా ॥18॥**

ప్రమథగణాలతో కూడి ఉన్న నీలకంఠుడగు ఆ మహాదేవుని ఎదుట మృగాలు, పక్షులు తమ శృంగార భావాలతో సమ్మోహితుని చేశాయి.

**మయూరమిథునం తత్రాకార్షీద్భావం రసోత్సుకమ్ ।**
**వివిధాం గతిమాశ్రిత్య పార్శ్వే తస్య పురస్తథా ॥19॥**

ఆయన ఎదురుగా, దగ్గరలో నున్న నెమలిజంట శృంగారాన్ని పెంపు చేసే విధంగా వివిధ రకాల నాట్యాలు జరిపాయి.

**నాలభద్వివరం తస్మిన్ కదాచిదపి మచ్ఛరః ।**
**సత్యం బ్రవీమి లోకేశ మమ శక్తిర్న మోహనే ॥20॥**

నా భాణం ఏ సమయంలోను కూడ ఆ శివునిపై ప్రయోగించుటకు అవకాశమే లేకపోయినది. శివుని మోహింపజేయగల శక్తినాకులేదు. నేను నిజము చెబుతున్నాను.

**మధురప్యకరోత్కర్మ యుక్తం యత్తస్య మోహనే ।**
**తచ్ఛృణుష్వ మహాభాగ సత్యం సత్యం వదామ్యహమ్ ॥21॥**

వసంతుడు శివుని మోహింప చేయటానికి ప్రయత్నించాడు. మహాత్మా! ఆ కథను వినుము. నేను ముమ్మాటికీ నిజమే చెప్తున్నాను.

**చంపకాన్ కేశరాన్ బాలాన్ అరుణాన్ పాటలాంస్తథా ।**
**నాగకేశరపున్నాగాన్ కింశుకాన్ కేతకాన్ కరాన్ ॥22॥**

**మాగధీమల్లికాపర్ణభరాన్ కురవకాంస్తథా ।**
**ఉత్ఫుల్లయతి తత్ర స్మ యత్ర తిష్ఠతి వై హరః ॥23॥**

శివుడు ఉన్నచోట వసంతుడు సంపెంగలను, కేసర, కురువేరు పువ్వులను, ఎర్రని పొన్నపూలు, నాగకేశరాలను, మొగలిపువ్వులనూ, దానిమ్మలనూ అడవిమొల్లలూ, మల్లెలూ, గోరింటలూ, మోదుగ పూలు మొదలైన వానిని అపరితముగా పూయించెను.

**సరాంస్యుత్ఫుల్లపద్మాని వీజయన్ మలయానిలైః ।**
**యత్నాత్సుగంధీన్యకరోదతీవ గిరిశాశ్రమే ॥24॥**

అతడు శివుని ఆశ్రమంలోని సరస్సులలో వికసించిన పద్మాలను సుగంధభరితం అయ్యేలా చేసి చల్లనిగాలి వీచేలా చేశాడు.

**లతాస్సర్వాస్సుమనసో దధురంకురసంచయాన్ ।**
**వృక్షాంకం చిరభావేన వేష్టయంతిస్మ తత్ర చ ॥25॥**

అక్కడున్న లతలన్నీ మొలకలతో, పూలతో, చిగుళ్లతో నిండి చెట్లమొదళ్లను ప్రేమతో చుట్టుకొని ఉన్నాయి.

**తాన్ వృక్షాంశ్చ సుపుష్పోఘాన్ తైస్సుగంధిసమీరణైః ।**
**దృష్ట్వా కామవశం యాతా మునయోఽపి పరే కిము ॥26॥**

పువ్వులతో నిండిన ఆ చెట్లను చూసి, సుగంధభరితమైన గాలులను అనుభవించిన మునులు కామానికి వశులయ్యారు. ఇంక ఇతరుల మాటచెప్పనేల?

**ఏవం సత్యపి శంభోర్న దృష్టం మోహస్య కారణమ్ ।**
**భావమాత్రమకార్షీన్నో కోపో మయ్యపి శంకరః ॥27॥**

ఇలా ఉన్నప్పటికీ శివునకు మోహం కలిగే అవకాశం కనిపించ లేదు. ఆయనలో రవ్వంతైనా వికారం కలుగ లేదు. శంకరుడు నాపై కోపించ లేదు.

**ఇతి సర్వమహం దృష్ట్వా జ్ఞాత్వా తస్య చ భావనామ్ ।**
**విముఖోఽహం శంభుమోహాన్నియతం తే వదామ్యహమ్ ॥28॥**

ఈ విషయాలన్నీ చూసి నేను శివుడి భావనను తెలిసికొన్నాను. నాకు శివుని మోహింప చేయాలని కోరిక లేదు. నేను ఈ మాటను నిశ్చయంగా చెప్తున్నాను.

**తస్య త్యక్తసమాధేస్తు క్షణం నో దృష్టిగోచరే ।**
**శక్నుయామో వయం స్థాతుం తం రుద్రం కో విమోహయేత్ ॥29॥**

ఆయన సమాధిని విడిచినపుడు ఆయన చూపుల ముందు క్షణకాలం కూడా మేము నిలబడటానికి సమర్థులం కాము. అలాంటి రుద్రుణ్ణి ఎవరు మోహింప జేయగలరు?

**జ్వలదగ్నిప్రకాశాక్షం జటారాశికరాలినమ్ ।**
**శృంగిణం వీక్ష్య కస్స్థాతుం బ్రహ్మన్ శక్నోతి తత్పురః ॥30॥**

ఓ బ్రహ్మా! మండే అగ్నిలా ప్రకాశించు కన్నులు కలిగి, జటాజూటంతో భయంకరంగా ఉండి, తీక్ష్ణముగా నున్న ఆయన ఎదుట నిలబడగలవారెవ్వరు?

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**మనోభవవచశ్చేత్థం శ్రుత్వాహం చతురాననః ।**
**వివక్షురపి నావోచం చింతావిష్టోఽభవం తదా ॥31॥**

నాలుగు ముఖాలు గల నేను ఈ మన్మథుని మాటలను విని, సమాధానం చెప్పాలనుకొని కూడా చెప్పకుండా ఆలోచిస్తూ ఉండిపోయాను.

**మోహనేఽహం సమర్థో న హరస్యేతి మనోభవః ।**
**వచః శ్రుత్వా మహాదుఃఖాన్నిరశ్వసమహం మునే ॥32॥**

"శివుణ్ణి నేను మోహింప చేయలేను" అని చెప్పిన మన్మథుని మాటలను విన్నాను. ఓ మహర్షీ! ఈ మాటలను విన్న నేను చాలా బాధపడి నిట్టూర్పు విడిచాను.

**నిశ్వాసమారుతా మే హి నానారూపమహాబలాః ।**
**జాతా గతా లోలజిహ్వా లోలాశ్చాతిభయంకరాః ॥33॥**

నా నిట్టూర్పు గాలినుండి అనేక రూపాలు గల మహాబలవంతులు, కదులుతున్న నాలుకలు గల వాళ్లు, అతి చంచలమైన వాళ్లు, చాలా భయం కలిగించే వాళ్లు అయిన గణాలు పుట్టారు.

**అవాదయంత తే సర్వే నానా వాద్యానసంఖ్యకాన్ ।**
**పటాహాది గణాస్తాంస్తాన్ వికరాలాన్మహారవాన్ ॥34॥**

వాళ్లందరూ అసంఖ్యాకమైన, గొప్ప భయంకరమైన ధ్వనులను చేస్తూ, పటాహం లాంటి అనేక వాద్యాలను మ్రోగించారు.

**అథ తే మమ నిశ్వాససంభవాశ్చ మహాగణాః ।**
**మారయచ్ఛేదయేత్యూచుర్బ్రహ్మణో మే పురః స్థితాః ॥35॥**

నా నిట్టూర్పు నుండి పుట్టిన ఆ మహాగణాలు నా ఎదుట నిలబడి చంపండి, నరకండి అని కేకలు వేశాయి.

**తేషాం తు వదతాం తత్ర మారయచ్ఛేదయేతి మామ్ ।**
**వచశ్శృత్వా విధిం కామః ప్రవక్తుముపచక్రమే ॥36॥**

నన్ను ఉద్దేశించి వారు "చంపండి, నరకండి" అని వేస్తున్న కేకలు విని మన్మథుడు బ్రహ్మతో ఈ విధముగా పలికేడు.

**మునేఽథ మాం సమాభాష్య తాన్ దృష్ట్వా మదనో గణాన్ ।**
**ఉవాచ వారయన్ బ్రహ్మన్ గణానామగ్రతః స్మరః ॥37॥**

ఓ మహర్షీ! అపుడు మన్మథుడు నా ఎదుటనున్న ఆ గణాలను వారించి నాతో బ్రహ్మన్! అని పిలిచి ఇలా పలికాడు.

**కామ ఉవాచ** - కాముడు పలికాడు.

**హే బ్రహ్మన్! ప్రజానాథ సర్వసృష్టిప్రవర్తక ।**
**ఉత్పన్నాః క ఇమే వీరా వికరాలా భయంకరాః ॥38॥**

ఓ బ్రహ్మా! ప్రజాపతీ! సృష్టి అంతటినీ ప్రవర్తిల్లచేసే వాడా! ఈ పుట్టిన భయంకరవీరులు ఎవరు?

**కిం కర్మైతే కరిష్యంతి కుత్ర స్థాస్యంతి వా విధే ।**
**కిన్నామధేయా ఏతే తద్వద తత్ర నియోజయ ॥39॥**

ఓ విధీ! వీరు చేసే పని ఏమిటి? వీళ్లు ఎక్కడుంటారు? వీళ్ల పేర్లు ఏమిటి? అన్నవి చెప్పు ఆ పనిలో పెట్టు.

**నియోజ్య తాన్నిజే కృత్యే స్థానం దత్వా చ నామ చ ।**
**మామాజ్ఞాపయ దేవేశ కృపాం కృత్వా యథోచితమ్ ॥40॥**

వాళ్లను తగిన పనిలో పెట్టి వారు ఉండేచోటు ఇచ్చి, పేరు పెట్టి ఓ దేవేశా! ఇపుడు దయతో నాకు తగిన ఆజ్ఞను ఇవ్వండి.

**బ్రహ్మో ఉవాచ** - బ్రహ్మ పలికాడు.

**ఇతి తద్వాక్యమాకర్ణ్య మునేఽహం లోకకారకః ।**
**తమవోచం హ మదనం తేషాం కర్మాదికం దిశన్ ॥41॥**

ఓ మహర్షీ! మన్మథుని ఆ మాటలను విని, వారు చేయు పనులను, వారి పేర్లను నిర్ణయిస్తూ మన్మథునితో ఇలా అన్నాను.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**ఏత ఉత్పన్నమాత్రా హి మారయేత్యవదన్ వచః ।**
**ముహుర్ముహురతోఽమీషాం నామ మారేతి జాయతామ్ ॥42॥**

వీళ్లు పుడుతూనే మారయ మారయ (చంపండి) అని చాలా సార్లు అరిచారు. కాబట్టి వీరికి మారులు అనే పేరు సార్థకమగు గాక!

**సదైవ విఘ్నం జంతూనాం కరిష్యతి గణా ఇమే ।**
**వినా నిజార్చనం కామ నానాకామరతాత్మనామ్ ॥43॥**

ఈ గణాలు తమను పూజించకుండా మానవులు కోరికలను తీర్చుకోవాలనుకుంటే వీరు విఘ్నాలను కలిగిస్తారు.

**తవానుగమనం కర్మ ముఖ్యమేషాం మనోభవ ।**
**సహాయినో భవిష్యంతి సదా తవ న సంశయః ॥44॥**

ఓ మన్మథా! వీళ్లందరూ నిన్ను అనుసరించటం వీళ్ల ముఖ్యమైన పని. వీళ్లు ఎప్పుడూ నిన్ను అనుసరించి ఉంటారనటంలో సందేహం లేదు.

**యత్ర యత్ర భవాన్ యాతా స్వకర్మార్థం యదా యదా ।**
**గంతా స తత్ర తత్రైతే సహాయార్థం తదా తదా ॥45॥**

**చిత్తభ్రాంతిం కరిష్యంతి త్వదస్త్రవశవర్తినామ్ ।**
**జ్ఞానినాం జ్ఞానమార్గం చ విఘ్నయిష్యంతి సర్వథా ॥46॥**

నువ్వు నీ పనులమీద ఎపుడెపుడు ఎక్కడెక్కడికి వెళ్తావో, అపుడపుడు, అక్కడక్కడకు వీళ్లు సహాయంగా నిన్ను అనుసరిస్తారు. నీ బాణాలకు వశులయ్యే మానవులకు వీళ్ల చిత్తభ్రాంతిని కలిగిస్తారు. వీళ్లు జ్ఞానుల జ్ఞానమార్గాలకు చాలా ఆటంకాలు కలిగిస్తారు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**ఇత్యాకర్ణ్య వచో మే హి సరతిస్సమహానుగః ।**
**కించిత్ ప్రసన్నవదనో బభూవ మునిసత్తమ ॥47॥**

ఓ మహర్షీ! ఈ నా మాటలు వినగానే రతీదేవితోను అసభ్యాకరమైన అనుచరులతోను ఉన్న మన్మథునికి ముఖంలో కొంత ఆనందం కలిగింది.

**శ్రుత్వా తేఽపి గణాస్సర్వే మదనం మాం చ సర్వతః ।**
**పరివార్య యథాకామం తస్థుస్తత్ర నిజాకృతిమ్ ॥48॥**

ఆ గణాలన్నీ ఈ మాటలను విని, మన్మథుని చుట్టూ నిజమైన తమ ఆకారాలతో నిలబడి ఉన్నాయి.

**అథ బ్రహ్మా స్మరం ప్రీత్యా౨_గదన్మే కురు నాశనమ్ ।**
**ఏభిస్సహైవ గచ్ఛ త్వం పునశ్చ హరమోహనే ॥49॥**

అపుడు బ్రహ్మ మన్మథునితో ఇలా అన్నాడు. ప్రేమతో "నా ఆజ్ఞను పాలించు. నువ్వు మళ్లీ వీళ్లందరితో కలసి వెళ్లి, శివుని ధైర్యనాశం చేసి శివుని మోహింప చేయుము."

**మన ఆధాయ యత్నాద్ధి కురు మారగణైస్సహ ।**
**మోహో భవేద్యథా శంభోర్దారగ్రహణహేతవే ॥50॥**

మనస్సులగ్నం చేసి ప్రయత్నం చేయి. ఈ మారగణాలతో కలసి వెళ్లి శివునకు మోహం కలిగించు అలా మోహం కలిగితే శివుడు భార్యను గ్రహించడానికి కారణం అవుతుంది.

**ఇత్యాకర్ణ్య వచః కామః ప్రోవాచ వచనం పునః ।**
**దేవర్షే గౌరవం మత్వా ప్రణమ్య వినయేన మామ్ ॥51॥**

ఈ మాటలను విని మన్మథుడు నన్ను మర్యాద చేసి వినయంతో నమస్కరించాడు. ఓ దేవర్షీ! అపుడాతడు ఇలా అన్నాడు.

**కామ ఉవాచ -** మన్మథుడు పలికాడు.

**మయా సమ్యక్ కృతం కర్మ మోహనే తస్య యత్నతః ।**
**తన్మోహో నాభవత్తాత న భవిష్యతి నాధునా ॥52॥**

తండ్రీ! శివుని మోహింప చేయటానికి నేను శ్రద్ధగానే ప్రయత్నించాను. కాని ఆయన మోహాన్ని పొందలేదు. ఇటు తరువాత కూడా మోహాన్ని పొందడు.

**తవ వాగ్గౌరవం మత్వా దృష్ట్వా మారగణానపి ।**
**గమిష్యామి పునస్తత్ర సదారో౨_హం త్వదాజ్ఞయా ॥53॥**

**మనో నిశ్చితమేతద్ధి తన్మోహో న భవిష్యతి ।**
**భస్మ కుర్యాన్న మే దేహమితి శంకాస్తి మే విధే ॥54॥**

నీ మాట మీద గౌరవంతో నీ ఆజ్ఞ ప్రకారం నేను రతీదేవితో కలిసి శివుని నివాసానికి వెళ్తాను. ఈ మారగణాలు నాకు కొంత ఆశ కల్గిస్తున్నాయి. ఇది నా నిశ్చయము. కాని నా మనస్సులో శివుడు మోహాన్ని పొందడని అనిపిస్తోంది. ఓ బ్రహ్మా! శివుడు నా దేహాన్ని బూడిద చేస్తాడేమో అనే శంక కలుగుతోంది.

**ఇత్యుక్త్వా సమధుః కామస్సరతి స్సభయస్తదా ।**
**యయౌ మారగణైస్సార్ధం శివస్థానం మునీశ్వర ॥55॥**

మన్మథుడు ఇలా మాట్లాడి భయం కలిగినవాడై వసంతుడు, రతీదేవితో కలసి శివుని ధామానికి వెళ్లాడు. మారగణాలు కూడా మన్మథుని అనుసరించాయి.

**పూర్వవత్స్వప్రభావం చ చక్రే మనసిజస్తదా ।**
**బహూపాయం స హి మధుర్వివిధాం బుద్ధిమావహన్ ॥56॥**

అపుడు మన్మథుడు వసంతునితో బాగా ఆలోచించి అనేక ఉపాయాలు శివునిపై ప్రయోగించి ఇంతకు ముందు వలెనే తన ప్రభావం చూపాడు.

**ఉపాయం స చకారాతి తత్ర మారగణోఽపి చ ।**
**మోహోఽభవన్న వై శంభోరపి కశ్చిత్పరాత్మనః ॥57॥**

మన్మథుడూ, మారగణమూ కూడా ఉపాయం పన్నారు. కాని శివపరమాత్మకు మోహం కలుగనే లేదు.

**నివృత్య పునరాయాతో మమ స్థానం స్మరస్తదా ।**
**ఆసీన్మారగణోఽగర్వోఽహర్షోమేపి పురస్థితః ॥58॥**

అపుడు మన్మథుడు వెనుదిరిగి నా స్థానానికి వచ్చాడు. మారగణాలు గర్వాన్ని విడిచి దుఃఖంతో నా ముందు నిలబడ్డాయి.

**కామః ప్రోవాచ మాం తాత ప్రణమ్య చ నిరుత్సవః**
**స్థిత్వా మమ పురోఽగర్వో మారైశ్చ మధునా తదా ॥59॥**

కుమారా! అపుడు నిరుత్సాహంతో ఉన్న మన్మథుడు మారగణాలతో, వసంతునితో కలసి గర్వాన్ని విడిచి నా ఎదుట నిల్చి ఇలా పలికాడు.

**కృతం పూర్వాదధికతః కర్మ తన్మోహనే విధే ।**
**నాభవత్తస్య మోహోఽపి కశ్చిద్ధ్యానరతాత్మనః ॥60॥**

ఓ బ్రహ్మా! శివుని మోహింప చేయటానికి పూర్వం కన్నా అధికంగా ప్రయత్నించాను. కాని ధ్యానంలో నిమగ్నమైన శివుని మనసును కొంచెమైనా కదిలించలేక పోయాము.

**న దగ్ధా మే తనుశ్చైవ తత్ర తేన దయాలునా ।**
**కారణం పూర్వపుణ్యం చ నిర్వికారీ స వై ప్రభుః ॥61॥**

దయామయుడైన శివుడు నా దేహాన్ని భస్మం చేయలేదు. పూర్వపుణ్యమే దీనికి కారణం కావచ్చు. ఆ ప్రభువు నందు వికారములేవియూ కలుగలేదు.

**చేద్వరస్తే హరో భార్యాం గృహ్ణీయాదితి పద్మజ ।**
**పరోపాయం కురు తదా విగర్వ ఇతి మే మతిః ॥62॥**

ఓ పద్మసంభవా! శివుడు పెళ్లి చేసుకోవాలనే కోరిక మీకుంటే నీ గర్వాన్ని విడిచి మరొక ఉపాయం చేయుమని నా అభిప్రాయము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**ఇత్యుక్త్వా సపరివారోఽసౌ యయౌ కామస్వమాశ్రమమ్ ।**
**ప్రణమ్య మాం స్మరన్ శంభుం గర్వదం దీనవత్సలమ్ ॥63॥**

మన్మథుడు ఇలా మాట్లాడి, నాకు నమస్కరించి, గర్వాన్ని పోగొట్టి దీనులపై ప్రేమను కురిపించే శంభుని స్మరిస్తూ, తన అనుచరులతో కలసి తన ఆశ్రమానికి వెళ్లాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే కామప్రభావ మారగణోత్పత్తివర్ణనం నామ నవమోఽధ్యాయః ॥9॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో కామప్రభావం, మారగణాల ఉత్పత్తివర్ణన అనే తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## దశమోఽధ్యాయః – పదవ అధ్యాయం

## బ్రహ్మవిష్ణుసంవాదః – బ్రహ్మవిష్ణుసంవాదం

**నారద ఉవాచ** – నారదుడు పలికాడు.

**బ్రహ్మన్ విధే మహాభాగ ధన్యస్త్వం శివసక్తధీః ।**
**కథితం సుచరిత్రం తే శంకరస్య పరాత్మనః ॥1॥**

ఓ బ్రహ్మా! సృష్టి కర్తా! మహాత్మా! శివునియందు లగ్నమైన మనసు గల నీవు ధన్యుడవు. శంకరుని పుణ్య చరిత్రను చెప్పావు.

**నిజాశ్రమే గతే కామే సగణే సరతౌ తతః ।**
**కిమాసీత్కిమకార్షీస్త్వం తచ్చరిత్రం వదాధునా ॥2॥**

మన్మథుడు తన సహచరులతో మరియు రతితో కలసి ఆశ్రమానికి వెళ్లగా ఏమైంది? నీవు ఏం చేశావు? ఆ కథను చెప్పుము.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**శృణు నారద సుప్రీత్యా చరిత్రం శశిమౌలినః ।**
**యస్య శ్రవణమాత్రేణ నిర్వికారో భవేన్నరః ॥3॥**

నారదా! చంద్రమౌళి యొక్క చరిత్రను ప్రేమతో విను. దీనిని విన్నంతనే మానవుడు కామక్రోధాది వికారాలకు దూరము కాగలడు.

**నిజాశ్రమం గతే కామే పరివారసమన్వితే ।**
**యద్బభూవ తదా జాతం తచ్చరిత్రం నిబోధ మే ॥4॥**

మన్మథుడు తన అనుచరులతో కలసి తన ఆశ్రమానికి వెళ్లిన తర్వాత జరిగిన చరిత్రను చెప్తాను. తెలుసుకో.

**నష్టోఽభూన్నారద! మదో విస్మయోఽభూచ్చ మే హృది ।**
**నిరానందస్య చ మునేఽపూర్ణే నిజమనోరథే ॥5॥**

నారదా! నా గర్వం తొలగిపోయింది. నా హృదయంలో ఆశ్చర్యం కలిగింది. ఓ మహర్షీ! నా కోరిక తీరక పోవటం వల్ల నాకు ఆనందం కరువైంది.

**అశోచం బహుధా చిత్తే గృహ్ణీయాత్స కథం స్త్రియమ్ ।**
**నిర్వికారీ జితాత్మా స శంకరో యోగతత్పరః ॥6॥**

కామ, క్రోధవికారాలు లేనివాడు, జితేంద్రియుడు, యోగపరాయణుడు అయిన ఆ శంకరుడు వివాహం చేసుకునే ఉపాయం ఏది? అని నా మనసులో పలురకాలుగా ఆలోచించాను.

**ఇత్థం విచార్య బహుధా తదాహం విమదో మునే ।**
**హరిం తం సోऽస్మరం భక్త్యా శివాత్మానం స్వదేహదమ్ ॥7॥**

ఓ మహర్షీ! అపుడు నేను గర్వాన్ని తొలగించుకొని, పలురకాలుగా ఆలోచించి, శివస్వరూపుడు, నాకు తండ్రి అయిన విష్ణువును భక్తితో స్మరించాను.

**అస్తవం చ శుభస్తోత్రైర్దీనవాక్యసమన్వితైః ।**
**తచ్ఛ్రుత్వా భగవానాశు బభూవావిర్హి మే పురా ॥8॥**

మరియు దీనవచనాలతో కూడిన స్తోత్రాలతో ఆ స్వామిని స్తుతించాను. వాటిని విని విష్ణువు వెంటనే నా ఎదుట ప్రత్యక్షమయ్యాడు.

**చతుర్భుజోऽరవిందాక్షశ్శంఖశార్‌ఙ్గగదాధరః ।**
**లసత్పీతపటశ్శ్యామతనుర్భక్తప్రియో హరిః ॥9॥**

**తం దృష్ట్వా తాదృశమహం సుశరణ్యం ముహుర్ముహుః ।**
**అస్తవం చ పునః ప్రేమ్ణా బాష్పగద్గదయా గిరా ॥10॥**

నాలుగుభుజములు కలవాడు, పద్మాలవంటి కళ్లుకలవాడు, శంఖం, శార్‌ఙ్గమనే ధనుస్సును, గదను ధరించినవాడు, ప్రకాశించే పచ్చని వస్త్రం కలవాడు, నీలమేఘశ్యాముడు, భక్తవత్సలుడు భక్తులకు శరణునిచ్చేవాడు అయిన ఆ హరిని చూచి కన్నీరు కారుస్తూ, జీరబోయిన గొంతులోని మాటలతో, ప్రేమతో అనేక సార్లు స్తుతించాను.

**హరిరాకర్ణ్య తత్‌స్తోత్రం సుప్రసన్న ఉవాచ మామ్ ।**
**దుఃఖహా నిజభక్తానాం బ్రహ్మాణం శరణం గతమ్ ॥11॥**

ఆ స్తోత్రాలను విని తన భక్తుల దుఃఖాలను తొలగించే హరి చాలా ప్రసన్నుడై, శరణు పొందిన నన్ను చూసి ఇలా అన్నాడు.

**హరిరువాచ** - విష్ణువు పలికాడు.

**విధే బ్రహ్మన్ మహాప్రాజ్ఞ ధన్యస్త్వం లోకకారక ।**
**కిమర్థం స్మరణం మేऽద్య కృతం చ క్రియతే నుతిః ॥12॥**

ఓ విధీ! బ్రహ్మ! సృష్టికర్తవైన నీవు మహాప్రాజ్ఞుడవు. ధన్యుడవు. ఈనాడు నీవు నన్ను స్మరించి స్తుతించడానికి కారణం ఏమిటి?

**కిం జాతం తే మహద్దుఃఖం మదగ్రే తద్వదాధునా ।**
**శమయిష్యామి తత్సర్వం నాత్ర కార్యా విచారణా ॥13॥**

నీకు కల్గిన గొప్ప బాధ ఏమిటి? నాకు చెప్పు. నీ అన్ని దుఃఖాలను పోగొడతాను. నీకు సంశయం అవసరం లేదు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**ఇతి విష్ణోర్వచశ్శ్రుత్వా కించిదుచ్ఛ్వసితాననః ।**
**అవోచం వచనం విష్ణుం ప్రణమ్య సుకృతాంజలిః ॥14॥**

విష్ణువు పల్కిన ఈ మాటలను విన్న నేను ఊపిరి పీల్చుకొన్న ముఖంతో దోసిలి పట్టి విష్ణువుకు నమస్కరించి ఇలా అన్నాను.

**దేవదేవ రమానాథ మద్వార్తాం శృణు మానద ।**
**శ్రుత్వా చ కరుణాం కృత్వా హర దుఃఖం కమావహ ॥15॥**

ఓ దేవదేవా! లక్ష్మీపతీ! మర్యాదను నిలబెట్టు వాడా! నా మాటను విని, దయను చూపి, దుఃఖాన్ని పోగొట్టి సుఖాన్ని కలిగించు.

**రుద్రసమ్మోహనార్థం హి కామం ప్రేషితవానహమ్ ।**
**పరివారయుతం విష్ణో సమారమధుబాంధవమ్ ॥16॥**

నేను రుద్రుణ్ణి మోహింపజేయటానికి మన్మథుణ్ణి పంపాను. ఓ హరీ! అతడు మారగణాలు, వసంతుడు మరియు భార్యతో, సహచరులతో కలసి వెళ్లాడు.

**చక్రుస్తే వివిధోపాయాన్ నిష్ఫలా అభవంశ్చ తే ।**
**అభవత్తస్య సమ్మోహో యోగినస్సమదర్శినః ॥17॥**

వారంతా అనేక ఉపాయాలు చేశారు. కాని ఫలితంలేక పోయింది. యోగి, సమదర్శి అయిన శివునకు వ్యామోహం కలగలేదు.

**ఇత్యాకర్ణ్య వచో మే స హరిర్మాం ప్రాహ విస్మితః ।**
**విజ్ఞాతాఖిలదజ్ఞానీ శివతత్త్వవిశారదః ॥18॥**

సర్వజ్ఞుడు, శివతత్త్వాన్ని బాగా తెలిసిన వాడు అయిన విష్ణువు, నా మాటలను విని ఆశ్చర్యం కలిగి నాతో ఇలా అన్నాడు.

**విష్ణురువాచ** – విష్ణువు పలికాడు.

**కస్మాద్ధేతోరితి మతిస్తవ జాతా పితామహ ।**
**సర్వం విచార్య సుధియా బ్రహ్మన్ సత్యం హి తద్వద ॥19॥**

ఓ పితామహా! నీకు ఇలాంటి ఆలోచన రావడానికి కారణం ఏమిటి? ఓ బ్రహ్మా! నీవు మంచి బుద్ధితో ఆలోచించి నాకు నిజాన్ని చెప్పు.

**బ్రహ్మ ఉవాచ** - బ్రహ్మ పలికాడు.

**శృణు తాత చరిత్రం తత్ తవ మాయా విమోహినీ ।**
**తదధీనం జగత్సర్వం సుఖదుఃఖాది తత్పరమ్ ॥20॥**

తండ్రీ! ఆ కథను విను. నీ మాయ మోహింపజేస్తుంది. ప్రపంచం అంతా ఆ మాయకు వశమై సుఖదుఃఖాలలో మునిగి ఉంది.

**యయైవ ప్రేషితశ్చాహం పాపం కర్తుం సముద్యతః ।**
**ఆసం తచ్ఛృణు దేవేశ వదామి తవ శాసనాత్ ॥21॥**

ఆ మాయచే ప్రేరేపించబడి పాపం చేయాలనుకున్నాను. ఆ కథను వినండి. ఓ దేవదేవా! నీ ఆజ్ఞతో చెప్తున్నాను.

**సృష్టిప్రారంభసమయే దశపుత్రా హి జజ్ఞిరే ।**
**దక్షాద్యాస్తనయా చైకా వాగ్భవాప్యతిసుందరీ ॥22॥**

సృష్టి మొదట్లో నాకు దక్షుడు మొదలైన పదిమందికొడుకులు, ఒక కూతురు పుట్టారు. అతిసుందరి అయిన ఆమె నా వాక్కు నుండి పుట్టింది.

**ధర్మో వక్షఃస్థలాత్కామో మనసోఽన్యోఽపి దేహతః ।**
**జాతాస్తత్ర సుతాం దృష్ట్వా మమ మోహోఽభవద్ధరే ॥23॥**

వక్షస్థలం నుండి ధర్ముడు, మనస్సు నుండి మన్మథుడు, ఇంకొకడు శరీరం నుండి పుట్టారు. ఓ! హరీ! ఆ కూతురిని చూచి నాకు మోహం కలిగింది.

**కుదృష్ట్యా తాం సమద్రాక్షం తవ మాయావిమోహితః ।**
**తత్క్షణాద్ధర ఆగత్య మామనిందత్సుతానపి ॥24॥**

నేను నీ మాయచే మోహితుడనై ఆమెను చెడుదృష్టితో చూశాను. వెంటనే శివుడు వచ్చి నన్ను, నా కుమారులను నిందించాడు.

**ధిక్కారం కృతవాన్ సర్వాన్ నిజం మత్వా పరప్రభుమ్ ।**
**జ్ఞానినం యోగినం నాథంభోగినం విజితేంద్రియమ్ ॥25॥**

తాను స్వామి పరమాత్మ, జ్ఞానీ, యోగీ, విషయలాలసత లేని జితేంద్రియుడనీ సర్వేశ్వరుడనీ తలచే శివుడు అందరినీ ఉద్దేశపూరకంగా ధిక్కారం చేశాడు.

**పుత్రో భూత్వా మమ హరేఽనిందన్మాం చ సమక్షతః ।**
**ఇతి దుఃఖం మహన్మే హి తదుక్తం తవ సన్నిధౌ ॥26॥**

ఓ హరీ! నా కుమారుడైన రుద్రుడు వీళ్లందరి ఎదురుగా నన్ను నిందించాడని నాకు చాలా బాధ కల్గింది. నేను నీ ఎదుట నిజం చెప్పాను.

**గృహ్ణీయాద్యది పత్నీం స స్యాం సుఖీ నష్టదుఃఖధీః ।**
**ఏతదర్థం సమాయాతుశ్శరణం తవ కేశవ ॥27॥**

ఆయన పెళ్లిచేసుకుంటే నాకు దుఃఖం తొలగిపోయి సుఖం కల్గుతుంది. ఓ! కేశవా! దీనికోసం నేను నిన్ను శరణు వేడుతున్నాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**ఇత్యాకర్ణ్య వచో మే హి బ్రహ్మణో మధుసూదనః ।**
**విహస్య మాం ద్రుతం ప్రాహ హర్షయన్ భవకారకమ్ ॥28॥**

నా మాటను విని మధుసూదనుడు నవ్వి, సృష్టికర్తనైన నాకు ఆనందం కలిగించినవాడై వెంటనే ఇలా పలికాడు.

**విష్ణురువాచ –** విష్ణువు పలికాడు.

**విధే! శృణు హి మద్వాక్యం సర్వభ్రమనివారణమ్ ।**
**సర్వం వేదాగమాదీనాం సమ్మతం పరమార్థతః ॥29॥**

ఓ బ్రహ్మన్! భ్రాంతులన్నింటినీ తొలగించునదీ, వేదశాస్త్రలన్నింటి యొక్క పరమార్థసారమూ అయిన నా మాటను విను.

**మహామూఢమతిశ్చాద్య సంజాతోఽసి కథం విధే ।**
**వేదవక్తాపి నిఖిలలోకకర్తా హి దుర్మతిః ॥30॥**

ఓ బ్రహ్మ! నీవు ఈనాడు ఇంత పెద్దమూర్ఖుడవు ఎలా అయ్యావు? వేదప్రవక్తవు, సర్వజగతినీ సృష్టించిన వాడవు అయిన నీకు దుర్బుద్ధి ఎలా పుట్టింది?

**జడతాం త్యజ మందాత్మన్ కురు త్వం నేదృశీం మతీమ్ ।**
**కిం బ్రువంత్యఖిలా వేదాస్స్తుత్యా తత్స్మర సద్ధియా ॥31॥**

ఓ తెలివి తక్కువ వాడా! జడత్వాన్ని విడిచి పెట్టు. ఇలాంటి ఆలోచనలు చేయకు. మెచ్చుకోదగిన వేదాలన్ని ఏ పరమాత్మతత్త్వాన్ని బోధిస్తున్నాయో వాటన్నింటినీ మంచిబుద్ధితో స్మరించు.

**రుద్రం జానాసి దుర్బుద్ధే స్వసుతం పరమేశ్వరమ్ ।**
**వేదవక్తాపి విజ్ఞానం విస్మృతం తేఽఖిలం విధే ॥32॥**

ఓ దుష్టబుద్ధీ! పరమేశ్వరుడైన రుద్రుని నీ కొడుకులా అనుకొంటున్నావు. ఓ బ్రహ్మా! నీవు వేదప్రవర్తకుడవే అయినప్పటికీ విజ్ఞానమంతా మరచి పోయావు.

**శంకరం సురసామాన్యం మత్వా ద్రోహం కరోషి హి ।**
**సుబుద్ధిర్విగతా తేద్యావిర్భూతా కుమతిస్తథా ॥33॥**

శంకరుని దేవతలలో ఒకనిగా అనుకొని నీవు ద్రోహం చేస్తున్నావు. ఈ రోజు నీకు మంచిబుద్ధి తగ్గిపోయి చెడుబుద్ధి పుట్టింది.

**తత్త్వసిద్ధాంతమాఖ్యాతం శృణు సద్బుద్ధిమావహ ।**
**యథార్థం నిగమాఖ్యాతం నిర్ణీయ భవకారకమ్ ॥34॥**

యథార్థబోధకమగు తత్వసిద్ధాంతము విను. మంచిబుద్ధి కలిగి ఉండు. వేదాలలో చెప్పిన విధంగా వాస్తవమైన సృష్టికర్తను తెలుసుకో.

**శివస్సర్వస్వకర్తా హి భర్తా హర్తా పరాత్పరః ।**
**పరబ్రహ్మ పరేశశ్చ నిర్గుణో నిత్య ఏవ చ ॥35॥**

అన్నింటినీ పుట్టించి, రక్షించి, హరించేది శివుడే. ఆయనే పరాత్పరుడు. పరబ్రహ్మ, పరమేశ్వరుడు, ఆయన నిర్గుణుడు, నిత్యుడు.

**అనిర్దేశ్యో నిర్వికారీ పరమాత్మాఽద్వయోఽచ్యుతః ।**
**అనంతోంతకరస్స్వామీ వ్యాపకః పరమేశ్వరః ॥36॥**

వికారాలు లేని శివుణ్ణి ఇదమిత్థంగా నిర్దేశించ లేము. ఆయన అద్వితీయుడు, నాశము లేనివాడు. అనంతపరమాత్మ. ప్రళయకర్త అయిన ప్రభువు. సర్వవ్యాపకుడైన ప్రభువు ఆయనే.

**సృష్టిస్థితివినాశానాం కర్తా త్రిగుణభాగ్విభుః ।**
**బ్రహ్మవిష్ణుమహేశాఖ్యో రజస్సత్త్వతమః పరః ॥37॥**

ఆ ప్రభువు సత్త్వరజస్తమోగుణప్రధానుడై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు అనే పేర్లతో సృష్టిస్థితిలయములను చేస్తుంటాడు.

**మాయాఽభిన్నో నిరీహశ్చ మాయో మాయావిశారదః ।**
**సగుణోఽపి స్వతంత్రశ్చ నిజానందో వికల్పకః ॥38॥**

మాయను తన వశంలో ఉంచుకునే ఆ మాయావి కంటే వేరుగా మాయ లేదు. ఆయన కోరికలు లేనివాడు, మాయ బాగా తెలిసినవాడు సగుణుడు. అయినా నిర్గుణుడు, ఆయన స్వతంత్రుడు, ఆనందస్వరూపుడు.

**ఆత్మారామో హి నిర్ద్వంద్వో భక్తాధీనస్సువిగ్రహః ।**
**యోగీ యోగరతో నిత్యం యోగమార్గప్రదర్శకః ॥39॥**

ఆయన తనలో తాను రమించే యోగి. ద్వంద్వాలకు అతీడు. భక్తులకు వశమై ఉంటాడు. మహాయోగి. నిత్యం యోగనిష్ఠుడిగా ఉండి, భక్తులకు యోగమార్గాన్ని చూపిస్తాడు.

**గర్వాపహారీ లోకేశస్సర్వదా దీనవత్సలః ।**
**ఏతాదృశో హి యస్స్వామీ స్వపుత్రం మన్యసే హి తమ్ ॥40॥**

ఆ లోకప్రభువు దుష్టుల గర్వాన్ని అణచివేస్తాడు. ఆయన అన్ని వేళలా దీనులపై దయ చూపిస్తాడు. అలాంటి స్వామిని నీవు కొడుకుగా భావిస్తున్నావా?

**ఈదృశం త్యజ కుజ్ఞానం శరణం వ్రజ తస్య వై ।**
**భజ సర్వాత్మనా శంభుం సంతుష్టశ్శం విధాస్యతి ॥41॥**

నీవు ఈ చెడు ఆలోచనను విడిచి పెట్టి ఆయన్ని శరణు వేడుకో. అన్ని విధాల ఈశ్వరుని భజించు. ఆయన సంతోషించి నీకు సుఖాన్ని ఇస్తాడు.

**గృహ్ణీయాచ్ఛంకరః పత్నీం విచారో హృది చేత్తవ ।**
**శివాముద్దిశ్య సుతపః కురు బ్రహ్మన్ శివం స్మరన్ ॥42॥**

ఓ బ్రహ్మా! శంకరుడు భార్యను పొందాలనే ఆలోచన నీ మనస్సులో ఉంటే, ఉమను ఉద్దేశించి శివుని స్మరిస్తూ మంచి తపస్సును చేయి.

**కురు ధ్యానం శివాయాస్త్వం కామముద్దిశ్య తం హృది ।**
**సా చేత్ప్రసన్నా దేవేశీ సర్వం కార్యం విధాస్యతి ॥43॥**

శంకరుడు భార్యను పొందాలనే కోరికతో నీవు నీ మనసులో ఉమను ధ్యానించు. ఆ దేవదేవి ప్రసన్నురాలైతే నీ కోరికలన్ని నెరవేర్చగలదు.

**కృత్వావతారం సగుణా యది స్యాన్మానుషీ శివా ।**
**కస్యచిత్తనయా లోకే సా తత్పత్నీ భవేద్ధ్రువమ్ ॥44॥**

ఆ శివాదేవి సగుణయై అవతారమునెత్తి లోకంలో మనుష్యదేహంతో ఎవరో ఒకరి గృహంలో జన్మిస్తే, ఆమె నిశ్చయంగా శివుని భార్య కాగలదు.

**దక్షమాజ్ఞాపయ బ్రహ్మన్ తపః కుర్యాత్ప్రయత్నతః ।**
**తాముత్పాదయితుం పత్నీం శివార్థం భక్తితత్పరః ॥45॥**

ఓ విధీ! శివుని కోసం కన్యను పుట్టించడానికి దక్షుడు భక్తితో ప్రయత్నపూర్వకంగా తపస్సు చేయాలి. కాబట్టి దక్షుణ్ణి ఆజ్ఞాపించు.

**భక్తాధీనౌ చ తౌ తాత సువిజ్ఞేయౌ శివాశివౌ ।**
**స్వేచ్ఛయా సగుణౌ జాతౌ పరబ్రహ్మస్వరూపిణౌ ॥46॥**

వత్సా! పరబ్రహ్మస్వరూపులైన ఆ ఉమామహేశ్వరులు భక్తసులభులు. వాళ్ల స్వరూపాన్ని భక్తితో తేలికగా తెలుసుకోవచ్చును. వాళ్లు తమ ఇచ్ఛతో (అనుకున్నట్లుగా) సగుణరూపాన్ని స్వీకరిస్తారు.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ పలికాడు.

**ఇత్యుక్త్వా తత్ క్షణం స్వేశం శివం సస్మార స్వప్రభుమ్ ।**
**కృపయా తస్య సంప్రాప్య జ్ఞానమూచే చ మాం తతః ॥47॥**

ఇలా పలికి విష్ణువు వెనువెంటనే తన ప్రభువైన శివుణ్ణి స్మరించాడు. ఆయన కృపతో ఆయన స్వరూపాన్ని తెలుసుకొని తర్వాత నాతో ఇలా అన్నారు.

**విష్ణురువాచ -** విష్ణువు పలికాడు.

**విధే! స్మర పురోక్తం యద్వచనం శంకరేణ చ ।**
**ప్రార్థితేన యదావాభ్యాముత్పన్నాభ్యాం తదిచ్ఛయా ॥48॥**

ఓ బ్రహ్మ! మనిద్దరం శంకరుని సంకల్పంతో పుట్టిన సమయంలో ఆయనను ప్రార్థించగా, మనల్ని ఉద్దేశించి ఆయన అపుడు చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకో!

**విస్మృతం తవ తత్సర్వం ధన్యా యా శాంభవీ పరా ।**
**తయా సమ్మోహితం సర్వం దుర్విజ్ఞేయా శివం వినా ॥49॥**

నీవు ఈ కథనంతా మరిచిపోయావు. పరాదేవీ, ధన్యురాలూ అయిన పరమేశ్వరిచే ఈ జగత్తు మోహించబడింది. శివుడు తప్ప ఇతరులు ఆమెను తెలియ లేరు.

**యదా హి సగుణో జాతస్స్వేచ్ఛయా నిర్గుణశ్శివః ।**
**మాముత్పాద్య తతస్త్వాం చ స్వశక్త్యా సువిహారకృత్ ॥50॥**

శివుడు తన ఇష్టంతో నిర్గుణరూపం నుండి సగుణుడయ్యాడు. ముందు నన్ను సృష్టించి తరువాత నిన్ను సృష్టించాడు. ఆయన తన శక్తితో లీలలు సృష్టించగలడు.

**ఉపాదిదేశ త్వాం శంభుస్సృష్టికార్యం తదా ప్రభుః ।**
**తత్పాలనం చ మాం బ్రహ్మన్ సోమస్సూతికరోఽవ్యయః ॥51॥**

అపుడు శంభుప్రభువు నిన్ను సృష్టిచేయమని ఆదేశించాడు. ఓ బ్రహ్మా! దాని పాలనను నాకు అప్పజెప్పాడు. నాశరహితుడైన, ఉమాసహితుడైన శివుడే వాస్తవంగా జగతికి కారణమయినవాడు, నాశములేనివాడు.

**తదా వాం వేశ్మ సంప్రాప్తౌ సాంజలీ నతమస్తకౌ ।**
**భవ త్వమపి సర్వేశోఽవతారీ గుణరూపధృక్ ॥52॥**

**ఇత్యుక్తః ప్రాహ స స్వామీ విహస్య కరుణాన్వితః ।**
**దివముద్వీక్ష్య సుప్రీత్యా నానాలీలావిశారదః ॥53॥**

అపుడు మన ఇద్దరం దోసిలి పట్టి, సాష్టాంగనమస్కారం చేసి మన చోట్లకు వచ్చాము. సర్వేశ్వరుడైన నీవు కూడా గుణసహితుడవై రూపాన్ని స్వీకరించి అవతరించు. ఈ విధంగా మనం కోరితే, కరుణామయుడు అనేకలీలలను సృష్టించటంలో నిపుణుడు అయిన ఆ ప్రభువు నవ్వి ఆకాశం కేసి చూసి ఇలా అన్నాడు.

**మద్రూపం పరమం విష్ణో! ఈదృశం హ్యంగతో విధేః ।**
**ప్రకటీభవితా లోకే నామ్నా రుద్రః ప్రకీర్తితః ॥54॥**

ఓ హరీ! నా శ్రేష్ఠమైన రూపం, నన్ను పోలిన రూపం, బ్రహ్మదేహం నుండి ప్రకటితమై లోకంలో రుద్రుడు అనే పేరుతో కీర్తింపబడుతుంది.

**పూర్ణరూపస్స మే పూజ్యస్సదా వాం సర్వకామకృత్ ।**
**లయకర్తా గుణాధ్యక్షో నిర్విశేషః సుయోగకృత్ ॥55॥**

ఆ రుద్రుడు పూర్ణస్వరూపుడు. మీరు ఆయనను ఎప్పుడూ పూజించండి. ఆయన మీ కోరికలన్నింటిని తీరుస్తాడు. త్రిగుణసాక్షి, నిర్గుణుడు, గొప్ప యోగానికి ప్రవర్తకుడైన ఆ రుద్రుడు లయం చేయగలడు.

**త్రిదేవా అపి మే రూపం హరః పూర్ణో విశేషతః ।**
**ఉమయా అపి రూపాణి భవిష్యంతి త్రిధా సుతాః ॥56॥**

ఈ త్రిమూర్తులు నా కుమారులు. వాళ్లు నా స్వరూపమే. ముఖ్యంగా రుద్రుడు నా పూర్ణాంశ కలవాడు. ఉమాదేవిచే కూడా మూడు రూపాలు కలుగుతాయి.

**లక్ష్మీర్నామ హరేః పత్నీ బ్రహ్మపత్నీ సరస్వతీ ।**
**పూర్ణరూపా సతీ నామ రుద్రపత్నీ భవిష్యతి ॥57॥**

ఆమె లక్ష్మి అనే పేరుతో విష్ణువుకి భార్య అవుతుంది. సరస్వతి అనే పేరుతో బ్రహ్మకు భార్య అవుతుంది. ఆమె పూర్ణరూపంతో సతి అనే పేరు కలిగి రుద్రునికి భార్య కాగలదు.

**విష్ణురువాచ** – విష్ణు పలికెను.

**ఇత్యుక్త్వాంతర్హితో జాతః కృపాం కృత్వా మహేశ్వరః ।**
**అభూతాం సుఖినావావాం స్వస్వకార్యపరాయణౌ ॥58॥**

మహేశ్వరుడు దయతో ఈ విధంగా చెప్పి మాయమయ్యాడు. మనం మనకు అప్పగించిన పనులలో నిమగ్నులమయ్యాము.

**సమయం ప్రాప్య సస్త్రీకావావాం బ్రహ్మన్! న శంకరః ।**
**అవతీర్ణస్స్వయం రుద్రనామా కైలాససంశ్రయః ॥59॥**

హే బ్రహ్మ! మనకు తగినసమయం వచ్చినందువలన వివాహం చేసుకున్నాము. శంకరుడు ఇంకా పెళ్లి చేసుకోలేదు. ఆయన స్వయంగా రుద్రుడనే పేరుతో కైలాసంలో ఉన్నాడు.

**అవతీర్ణా శివా స్యాత్సా సతీ నామ ప్రజేశ్వర ।**
**తదుత్పాదనహేతోర్హి యత్నోఽతః కార్య ఏవ వై ॥60॥**

ఓ ప్రజాపతీ! ఉమాదేవి సతి అనే పేరుతో అవతరిస్తుంది. ఆమె పుట్టుక కోసం ప్రయత్నం చేయాలి.

**ఇత్యుక్త్వాంతర్దధే విష్ణుః కృత్వా స కరుణాం పరమ్ ।**
**ప్రాప్నువం ప్రముదం చాథ హ్యధికం గతమత్సరః ॥61॥**

విష్ణువు ఇలా పలికి అంతర్ధానమయ్యాడు. నేను చాలా సంతోషించాను. నాలోని ఈర్ష్య తొలగిపోయింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే బ్రహ్మవిష్ణు సంవాదో నామ దశమోఽధ్యాయః ॥10॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో బ్రహ్మవిష్ణుసంవాదం అనే పదవ అధ్యాయం సమాప్తం.

## ఏకాదశోఽధ్యాయః - పదకొండవ అధ్యాయం

## దుర్గాస్తుతిః బ్రహ్మవరప్రాప్తివర్ణనః - దుర్గాస్తుతి బ్రహ్మవరప్రాప్తి

**నారద ఉవాచ** - నారదుడు పలికాడు.

**బ్రహ్మన్ తాత మహాప్రాజ్ఞ వద నో వదతాం వర ।**
**గతే విష్ణౌ కిమభవత్ అకార్షీత్కిం విధే భవాన్ ॥1॥**

తండ్రీ! బ్రహ్మ! నీవు మహాబుద్ధిశాలివి. వక్తలలో గొప్పవాడివి. విష్ణువు వెళ్లిపోయాక ఏమి జరిగిందో మాకు చెప్పండి. ఓ విధీ! మీరు ఏమి చేశారు?

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**విప్రనందనవర్య! త్వం సావధానతయా శృణు ।**
**విష్ణౌ గతే భగవతి యదకార్షమహం ఖలు ॥2॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! నీవు సావధానంగా విను. విష్ణువు వెళ్లిపోగానే నేనేమి చేశానో చెప్తాను.

**విద్యావిద్యాత్మికాం శుద్ధాం పరబ్రహ్మస్వరూపిణీమ్ ।**
**స్తౌమి దేవీం జగద్ధాత్రీం దుర్గాం శంభుప్రియాం సదా ॥3॥**

విద్యాస్వరూపిణీ మరియు అవిద్యా స్వరూపిణీ, శుద్ధ స్వరూపురాలూ, పరబ్రహ్మరూపిణి, జగన్మాతయు, ఎపుడూ శివప్రియయును అయిన దుర్గాదేవిని స్తుతిస్తున్నాను.

**సర్వత్ర వ్యాపినీం నిత్యాం నిరాలంబాం నిరాకులామ్ ।**
**త్రిదేవజననీం వందే స్థూలస్థూలామరూపిణీమ్ ॥4॥**

సర్వవ్యాపకురాలూ, నిత్యస్వరూపిణీ, ఇతర ఆశ్రయం లేనిదీ, సంసారదుఃఖం లేనిదీ, మూడుమూర్తులకు తల్లీ, గొప్ప వాటికంటే గొప్పది, రూపం వాస్తవంగా లేనిది అయిన దుర్గను నమస్కరిస్తున్నాను.

**త్వం చితిః పరమానందా పరమాత్మస్వరూపిణీ ।**
**ప్రసన్నా భవ దేవేశి! మత్కార్యం కురు తే నమః ॥5॥**

చైతన్యం, బ్రహ్మానందం నీవే. నీవే పరమాత్మస్వరూపిణివి. దేవదేవీ! నీవు ప్రసన్నురాలివై నా పనిని జరుగునట్లు చేయి. నీకు నమస్కారం.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**ఏవం సంస్తూయమానా సా యోగనిద్రా మయా మునే ।**
**ఆవిర్బభూవ ప్రత్యక్షం దేవర్షే చండికా మమ ॥6॥**

ఓ మహర్షీ! నేను యోగనిద్రను ఈ విధంగా స్తుతించగా  అపుడు చండిక నా ఎదుట ప్రత్యక్షమైంది.

**స్నిగ్ధాంజనద్యుతిశ్చారురూపా దివ్యచతుర్భుజా ।**
**సింహస్థా వరహస్తా చ ముక్తామణికచోత్కటా ॥7॥**

**శరదింద్వాననా శుభ్రచంద్రభాలా త్రిలోచనా ।**
**సర్వావయవరమ్యా చ కమలాంఘ్రినఖద్యుతిః ॥8॥**

**సమక్షం తాముమాం వీక్ష్య మునే! శక్తిం శివస్య హి ।**
**భక్త్యా వినతతుంగాంశః ప్రాస్తవం సుప్రణమ్య వై ॥9॥**

చిక్కని కాటుక వలె ప్రకాశించి, సుందరరూపం గల్గి, ప్రకాశించే నాలుగు భుజాలు కలదీ, సింహాన్ని అధిష్ఠించి, చేతిలో వరముద్ర కలిగి, ముత్యాలతో కూడిన చూడామణి ప్రకాశించే జుట్టు కలదీ, శరత్కాలచంద్రుని వంటి ముఖం కలది, చంద్రునిలా స్వచ్ఛమైన నుదురుభాగం కలది, మూడు కళ్లు కలది, సర్వాంగసుందరీ, పద్మాలవంటి పాదములు, గోళ్ల కాంతి కలిగినదీ శివుని శక్తీ అయిన ఆ ఉమాదేవిని నా ఎదుట చూశాను. ఓ మహర్షీ! నేను భక్తితో శిరస్సును వంచి నమస్కరించి, స్తుతించాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**నమో నమస్తే జగతః ప్రవృత్తినివృత్తిరూపే స్థితిసర్గరూపే ।**
**చరాచరణాం భవతీ సుశక్తిః సనాతనీ సర్వవిమోహినీతి ॥10॥**

ఓ తల్లీ! ప్రపంచంలోని ప్రవృత్తినివృత్తులు నీ స్వరూపమే. జగతి యొక్క సృష్టిస్థితులు నీ స్వరూపమే. స్థావరజంగమాత్మకమైన ప్రాణులలో నీవు శక్తిరూపంగా ఉండి అన్ని ప్రాణులకు మోహం కలిగిస్తున్నావు. నీవు సనాతనివి. నీకు నమస్కారం.

**యా శ్రీస్సదా కేశవమూర్తిమాలా విశ్వంభరా యా సకలం బిభర్తి ।**
**యా త్వం పురా సృష్టికరీ మహేశో హర్త్రీ త్రిలోకస్య పరా గుణేభ్యః ॥11॥**

**యా యోగినాం వై మహితా మనోజ్ఞా సా త్వం నమస్తే పరమాణుసారే ।**
**యమాదిపూతే హృది యోగినాం యా యా యోగినాం ధ్యానపథే ప్రతీతా ॥12॥**

**ప్రకాశశుద్ధ్యాది యుతా విరాగా సా త్వం హి విద్యా వివిధావలంబా ।**
**కూటస్థమవ్యక్తమనంతరూపం త్వం బిభ్రతీ కాలమయీ జగంతి ॥13॥**

కేశవుని వక్షస్థలమునందు అలంకారంగా ఉండే లక్ష్మీదేవివి నీవే! అన్నింటిని భరించి, పోషించు విశ్వంభరవు నీవే. నీవు సృష్టిని చేసిన మహేశ్వరివి. మూడు లోకాలను లయం చేసేది నీవే. నీవు గుణాతీతురాలివి. యోగులు నిన్ను పూజించి తమ హృదయాలలో చూస్తారు. అలాంటి నీకు నమస్కారం చేస్తున్నాను. పరమాణువులోని సారం (శక్తి) నీవే. యమనియమాలచే పవిత్రమైన యోగుల హృదయాలలో నీవు ఉండి వారికి ధ్యానమార్గంలో దర్శనం ఇస్తావు. ప్రకాశమూ, శుద్ధీ వంటి గుణాలచే విరాజిల్లే నీకు రాగద్వేషాలు లేవు. అన్ని శాస్త్రవిజ్ఞానాలకు సంబంధించిన

విద్యలన్నీ నీ స్వరూపమే.నీ స్వరూపం కూటస్థం (మార్పులకు లోనుకానిది) మరియు నీవు కాలస్వరూపురాలివై లోకాలను ధరించావు.

**వికారబీజం ప్రకరోషి నిత్యం గుణాన్వితా సర్వజనేషు నూనమ్ ।**
**త్వం వై గుణానాం చ శివే త్రయాణాం నిదానభూతా చ తతః పరాసి ॥14॥**

నువ్వు గుణములతో కూడి ఉండి మానవులందరికి రాగద్వేషాది వికారాలకు మూలమై అవిద్యారూపంలో ఉన్నావనటం నిశ్చయం. ఓ గౌరీ మూడుగుణాలకు ఆశ్రయం నీవే. మరియు గుణాతీతురాలై ఉన్నావు.

**సత్త్వం రజస్తామస ఇత్యమీషాం వికారహీనా సముపస్థితిర్యా ।**
**సా త్వం గుణానాం జగదేకహేతుః బ్రహ్మాంతరారంభసి చాత్సి పాసి ॥15॥**

సత్త్వమూ, రజస్సూ, తమస్సూ అనే గుణవికారాలు నీ యందు లేవు. కాని వాటి ఉనికియందు మాత్రమే ఉండి, జగత్తుకు ఏకైకకారణమైన త్రిగుణాత్మకప్రకృతి నీవే. నీవే బ్రహ్మ మనస్సులో ఉండి బ్రహ్మాండం సృష్టించి, రక్షిస్తున్నావు మరియు భక్షిస్తున్నావు.

**అశేషజగతాం బీజే జ్ఞేయజ్ఞానస్వరూపిణి ।**
**జగద్ధితాయ సతతం శివపత్ని నమోస్తు తే ॥16॥**

సర్వజగత్తుల బీజం నీవే. తెలియదగినదీ, జ్ఞానమూ నీ స్వరూపమే. ఓ శివపత్నీ! లోకాల క్షేమం కోరి నేను నీకు నమస్కరిస్తున్నాను.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**ఇత్యాకర్ణ్య వచస్సామే కాలీ లోకవిభావినీ ।**
**ప్రీత్యా మాం జగతామూచే స్రష్టారం జనశబ్దవత్ ॥17॥**

ఈ నా మాటలు విని లోకరక్షకురాలైన ఆ కాళీదేవి నాతో ప్రీతితో తల్లి పిల్లవానిని లాలించినట్లు అందరికీ అవగతమయ్యే సరళమైన భాషలో ఇలా పలికింది.

**దేవ్యువాచ** – దేవి పలికింది.

**బ్రహ్మన్ కిమర్థం భవతా స్తుతాహమవధారయ ।**
**ఉచ్యతాం యది ధృష్యోసి తచ్ఛీఘ్రం పురతో మమ ॥18॥**

ఓ బ్రహ్మ! నీవు నా ఎదుట ధైర్యం కలవాడివైతే, నీవు నన్ను స్తుతించటానికి గల కారణం వెంటనే నిశ్చయంగా చెప్పు.

**ప్రత్యక్షమపి జాతాయాం సిద్ధిః కార్యస్య నిశ్చితా ।**
**తస్మాత్త్వం వాంఛితం బ్రూహి యా కరిష్యామి భావితా ॥19॥**

నేను ప్రత్యక్షమైన తర్వాత కార్యం సిద్ధించటం తథ్యం. కాబట్టి నీ కోరిక తెలియ చేయి. నీచేత ఆరాధించబడ్డ నేను నీ కోరికను తీరుస్తాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**శృణు దేవి మహేశాని కృపాం కృత్వా మమోపరి ।**
**మనోరథస్థం సర్వజ్ఞే ప్రవదామి త్వదాజ్ఞయా ॥20॥**

దేవీ! మహేశ్వరీ! నాపై దయుంచి విను. నీకు సర్వము తెలుసు. అయినా నేను నా మనసులోని కోరికను నీ ఆజ్ఞతో చెబుతున్నాను.

**యః పతిస్తవ దేవేశి లలాటాన్మేఽభవత్పురా ।**
**శివో రుద్రాఖ్యయా యోగీ స వై కైలాసమాస్థితః ॥21॥**

ఓ దేవేశీ! నీ భర్త పూర్వం నా నుదుటినుండి ఉద్భవించాడు కదా! ఆ యోగేశ్వరుడైన శివుడు రుద్రనామంతో కైలాసంలో ఉన్నాడు.

**తపశ్చరతి భూతేశ ఏక ఏవావికల్పకః ।**
**అపత్నీకో నిర్వికారో న ద్వితీయాం సమీహతే ॥22॥**

కూటస్థుడు (పరివర్తన లేనివాడు) అయిన భూతనాథుడు అక్కడ తపస్సు చేస్తున్నాడు. భార్య లేనివాడు, వికారం లేనివాడు అయిన ఆ ప్రభువు భార్యను గ్రహించడానికి ఇష్టుడుగా లేడు.

**తం మోహయ యథా చాన్యాం ద్వితీయాం సతి వీక్షతే ।**
**త్వదృతే తస్య నో కాచిద్భవిష్యతి మనోహరా! ॥23॥**

ఓ పతివ్రతా! అతడు వివాహమాడటానికి నీవు ఆయనను మోహింప చేయాలి. నీవు తప్ప ఆయన మనసును ఆకర్షించగలవారు మరొకరు లేరు. సమాధి స్థితినుంచి ఆయన దృష్టిని మరలించాలి అని భావం.

**తస్మాత్త్వమేవ రూపేణ భవస్వ హరమోహినీ ।**
**సుతా భూత్వా చ దక్షస్య రుద్రపత్నీ శివే భవ ॥24॥**

కావున నీవే దక్షునికి కూతురుగా జన్మించు. హే! శివే! నీవు నీ రూపంతో రుద్రుని మోహింప చేసి ఆయనకు భార్యవు అవ్వాలి.

**యథా ధృతశరీరా త్వం లక్ష్మీరూపేణ కేశవమ్ ।**
**ఆమోదయసి విశ్వస్య హితాయై తం తథా కురు ॥25॥**

నీవు లక్ష్మీరూపంలో శరీరాన్ని ధరించి కేశవుని అలరించినావు. లోకకల్యాణం కొరకు రుద్రుని కూడా అలా చేయి.

**కాంతాభిలాషమాత్రం మే దృష్ట్వాఽనిందద్వృషధ్వజః ।**
**స కథం వనితాం దేవీ స్వేచ్ఛయా సంగ్రహీష్యతి ॥26॥**

ఓ దేవీ! నేను కాంతను అభిలషించినంత మాత్రాన నన్ను నిందించి, ఆ వృషభవాహనుడు తన ఇష్టప్రకారం భార్యను ఎలా పొందుతాడు.

**హరే గృహీతకాంతే తు కథం సృష్టిశ్శుభావహా! ।**
**ఆద్యంతమధ్యే చైతస్య హేతౌ తస్మిన్ విరాగిణి ॥27॥**

ఈ సృష్టికి ఆది, మధ్య, అంతాలకు కారణమైన ఆ హరుడు విరాగియై భార్యను స్వీకరించకపోతే ఈ సృష్టి మంగళకరమెట్లు అవుతుంది?

**ఇతి చింతాపరో నాహం త్వదన్యం శరణం హితమ్ ।**
**కృచ్ఛ్రవాంస్తేన విశ్వస్య హితాయై తత్కురుష్వ మే ॥28॥**

ఈ విషయం నన్ను బాధిస్తోంది. నీవు తప్ప మరొకరు శరణు లేరు. నేను ఈ రకమైన కష్టంలో ఉన్నాను. కావున లోకహితం కోసం నా కోరికను తీర్చు.

**న విష్ణుస్తస్య మోహాయ న లక్ష్మీర్న మనోభవః! ।**
**న చాప్యహం జగన్మాతర్నాన్యస్త్వాం కోఽపి వై వినా ॥29॥**

ఆయనకు లక్ష్మి గాని, విష్ణువు గాని, మన్మథుడు గాని, నేను కాని మోహం కలిగించలేము. ఓ జగన్మాతా! నీవు తప్ప ఈ పని మరొకరి వల్ల కాదు.

**తస్మాత్త్వం దక్షజా భూత్వా దివ్యరూపా మహేశ్వరీ! ।**
**తత్పత్నీ భవ మద్భక్త్యా యోగినం మోహయేశ్వరమ్ ॥30॥**

కాబట్టి నీవు దక్షుని కూతురుగా జన్మించి, దివ్యరూపం కలిగి, యోగియైన శివుని మోహింప చేసి ఆయనకు భార్యవు కావాలి. ఓ మహేశ్వరీ! నా భక్తిని ఈ విధంగా సఫలం చేయి.

**దక్షస్తపతి దేవేశి క్షీరోదోత్తరతీరగః ।**
**త్వాముద్దిశ్య సమాధాయ మనస్త్వయి దృఢవ్రతః ॥31॥**

ఓ దేవదేవీ! దక్షుడు క్షీరసముద్రము యొక్క ఉత్తరతీరంలో దృఢమైన వ్రతం చేస్తూ నీయందు మనసు లగ్నం చేసి, నిన్ను ఉద్దేశించి తపస్సు చేస్తున్నాడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**ఇత్యాకర్ణ్య వచస్సా తుచింతామాప శివా తదా ।**
**ఉవాచ చ స్వమనసి విస్మితా జగదంబికా ॥32॥**

ఆ మాటలు విన్న ఉమాదేవి ఆలోచించటం మొదలు పెట్టి, ఆశ్చర్యం పొంది, తన మనసులో ఇలా అనుకొంది.

**దేవ్యువాచ** - దేవి పలికింది.

**అహో సుమహదాశ్చర్యం వేదవక్తాపి విశ్వకృత్ ।**
**మహాజ్ఞానపరో భూత్వా విధాతా కిం వదత్యయమ్ ॥33॥**

అహో! ఇది చాలా ఆశ్చర్యం. వేదప్రవర్తకుడు, సృష్టికర్త, మహాజ్ఞాని అయిన బ్రహ్మ ఏమి మాటలాడుతున్నాడు?

**విధేశ్చేతసి సంజాతో మహామోహోఽసుఖావహః ।**
**యద్వరం నిర్వికారం తం సమ్మోహయితుమిచ్ఛతి ॥34॥**

బ్రహ్మ మనసులో దుఃఖదాయకమైన మహామోహం పుట్టింది. అందువల్లనే వికార రహితుడగు శివప్రభువుని మోహింపచేయాలని కోరుతున్నాడు.

**హరమోహవరం మత్తస్సమిచ్ఛతి విధిస్స్వయమ్ ।**
**కో లాభోస్యాత్ర స విభుర్నిర్మోహో నిర్వికల్పకః ॥35॥**

హరుని మోహింప చేయాలనే వరాన్ని నా నుండి ఈ బ్రహ్మ కోరుతున్నాడు. దాని వలన ఇతనికి లాభమేమిటి? శివుడు కూటస్థుడు(పరివర్తన లేనివాడు) కాబట్టి ఆయనను మోహింపచేయుట చాలా కష్టం.

**పరబ్రహ్మాఖ్యో యశ్శంభుర్నిర్గుణో నిర్వికారవాన్ ।**
**తస్యాహం సర్వదా దాసీ తదాజ్ఞావశగా సదా ॥36॥**

శివపరబ్రహ్మ నిర్గుణుడు, నిర్వికారుడు. నేను ఆయనకు ఎప్పుడూ దాసిని. నేను అన్ని వేళలా ఆయన ఆజ్ఞను పాటించే దానిని.

**స ఏవ పూర్ణరూపేణ రుద్రనామాభవచ్ఛివః ।**
**భక్తోద్ధారణహేతోర్హి స్వతంత్రః పరమేశ్వరః ॥37॥**

ఆ శివుడే పూర్ణాంశతో రుద్రుడను పేరుతో భక్తులను ఉద్ధరించటానికి అవతరించాడు. ఆయన స్వతంత్రుడైన మహేశ్వరుడు కదా!

**హరేర్విధేశ్చ స స్వామీ శివాన్న్యూనో న కర్హిచిత్ ।**
**యోగాదరో హ్యమాయస్థో మాయేశః పరతః పరః ॥38॥**

హరికి, బ్రహ్మకు ప్రభువైన రుద్రుడు ఏ విధంగా చూసినా శివుని కన్నా తక్కువ కాదు. మాయాతీతుడు, మాయకు ప్రభువు, సర్వముకంటె శ్రేష్ఠుడు అయిన ఆయనకు యోగమునందు ప్రేమ ఎక్కువ.

**మత్వా త్వమాత్మజం బ్రహ్మా సామాన్యసురసన్నిభమ్ ।**
**ఇచ్ఛత్యయం మోహయితుమతోఽజ్ఞానవిమోహితః ॥39॥**

అలాంటి రుద్రుణ్ణి సామాన్యదేవతలలో ఒకడిగను, తన కుమారునిగను తలంచి, అజ్ఞానముచే పూర్తిగా మోహితుడై ఈ బ్రహ్మ ఆయనను మోహపెట్టాలని నన్ను కోరుతున్నాడు.

**న దద్యాం చేద్వరం వేదనీతిర్భ్రష్టా భవేదితి ।**
**కిం కుర్యాం యేన న విభుః క్రుద్ధస్స్యాన్మే మహేశ్వరః ॥40॥**

ఈతనికి వరమివ్వక పోతే వేదధర్మం పాడవుతుంది. నేనేమి చేయాలి? నా ప్రభువుకి నాపై కోపము రాని విధంగా చేయాలి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**విచార్యేత్థం మహేశం తం సంస్మార మనసా శివా ।**
**ప్రాపానుజ్ఞాం శివస్యాథోవాచ దుర్గా చ మాం తదా ॥41॥**

ఇట్లు తలచి ఆ ఉమాదేవి మనసులో ఆ మహేశ్వరుని స్మరించింది. అపుడు ఆ ఉమాదేవి శివుని అనుజ్ఞను పొంది నాతో ఇలా పలికింది.

**దుర్గోవాచ –** దుర్గాదేవి పలికింది.

**యదుక్తం భవతా బ్రహ్మన్ సమస్తం సత్యమేవ తత్ ।**
**మదృతే మోహయిత్రీహ శంకరస్య న విద్యతే ॥42॥**

ఓ బ్రహ్మా! నీవు చెప్పినదంతా నిజమే. కాని నేను తప్ప మరొకరు శంకరుని మోహింప చేయలేరు.

**హరేఽగృహీతదారే తు సృష్టిర్నైషా సనాతనీ ।**
**భవిష్యతీతి తత్సత్యం భవతా ప్రతిపాదితమ్ ॥43॥**

శివుడు భార్యను స్వీకరించనిదే ఈ సనాతనమైన సృష్టి సంపూర్ణం కాదని నీవు చేసిన ప్రతిపాదనలో వాస్తవం ఉంది.

**మమాపి మోహనే యత్నో విద్యతేఽస్య మహాప్రభోః ।**
**త్వద్వాక్యాద్ద్విగుణో మేద్య ప్రయత్నోఽభూత్స నిర్భరః ॥44॥**

ఆ మహాప్రభువును మోహ పెట్టగలననే విశ్వాసం నాకు కూడా లేదు. కాని నీ మాటలు విన్న నాకు విశ్వాసం రెట్టింపు అయింది. ఇపుడు నేను దృఢంగా ప్రయత్నిస్తాను.

**అహం తథా యతిష్యామి యథా దారపరిగ్రహమ్ ।**
**హరః కరిష్యతి విధే స్వయమేవ విమోహితః ॥45॥**

ఓ! బ్రహ్మా! శివుడు తనంత తానుగానే మోహమును పొందినవాడై వివాహమాడేట్లుగా నేను ప్రయత్నిస్తాను.

**సతీమూర్తిమహం ధృత్వా తస్యైవ వశవర్తినీ ।**
**భవిష్యామి మహాభాగా లక్ష్మీర్విష్ణోర్యథా ప్రియా ॥46॥**

నేను సతీదేవి రూపం ధరించి, లక్ష్మి విష్ణువునకు ప్రియురాలు అయిన విధంగా ఆయనకు వశవర్తిని అవుతాను.

**యథా సోఽపి మయ్యైవేహ వశవర్తీ సదా భవేత్ ।**
**తథా యత్నం కరిష్యామి తస్యైవ కృపయా విధే ॥47॥**

ఓ బ్రహ్మా! ఆయన అనుగ్రహాన్ని పొంది, ఆయన నాకు సర్వదా అధీనుడై ఉండేట్లు కూడా ప్రయత్నిస్తాను.

**ఉత్పన్నా దక్షజాయాయాం సతీరూపేణ శంకరమ్ ।**
**అహం సభాజయిష్యామి లీలయా తం పితామహ ॥48॥**

ఓ పితామహా! నేను దక్షుని భార్యయందు సతీదేవి రూపంలో పుట్టి నా లీలతో శంకరుని సంతోషపెడతాను.

**యథాన్యజంతురవనౌ వర్తతే వనితావశే ।**
**మద్భక్త్యా స హరో వామావశవర్తీ భవిష్యతి ॥49॥**

ఇతరమానవులు స్త్రీకి వశులై ఉన్న విధంగానే ఆ హరుడు నా భక్తికి మెచ్చి నాకు అనగా స్త్రీకి వశవర్తియై ఉండగలడు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**మహ్యమిత్థం సమాభాష్య శివా సా జగదంబికా ।**
**వీక్ష్యమాణా మయా తాత తత్రైవాంతర్దధే తతః ॥50॥**

ఓ వత్సా! జగన్మాత అయిన ఆ ఉమాదేవి నాతో ఇలా పలికినతర్వాత నేను చూస్తుండగనే మాయమయింది.

**తస్యామంతర్హితాయాం తు సోఽహం లోకపితామహః ।**
**అగమం యత్ర స్వసుతాస్తేభ్యస్సర్వమవర్ణయమ్ ॥51॥**

లోకములకు పితామహుడైన నేను ఆమె మాయమవ్వగానే, నా కుమారులున్న చోటుకి వెళ్లి జరిగిన కథనంతనూ చెప్పాను.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే దుర్గాస్తుతిః బ్రహ్మావరప్రాప్తివర్ణనో నామైకాదశోఽధ్యాయః ॥11॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో దుర్గాస్తుతి బ్రహ్మావరప్రాప్తి అనే పదకొండవ అధ్యాయము సమాప్తం.

## ద్వాదశోఽధ్యాయః - పన్నెండవ అధ్యాయం

## దక్షవరప్రాప్తివర్ణనః - దక్షునకువరప్రాప్తి

**నారద ఉవాచ** - నారదుడు పలికాడు.

**బ్రహ్మన్ శంభువర ప్రాజ్ఞ సమ్యగుక్తం త్వయానఘ ।**
**శివాశివచరిత్రం చ పావితం జన్మ మే హితమ్ ॥1॥**

ఓ బ్రహ్మా! నీకు శివతత్త్వం బాగా తెలుసు. ఓ పుణ్యాత్మా! నీవు ఉమాశివుల చరితాన్ని చక్కగా చెప్పి నా జన్మను పవిత్రం చేయి.

**ఇదానీం వద దక్షస్తు తపః కృత్వా దృఢవ్రతః ।**
**కం వరం ప్రాప దేవ్యాస్తు కథం సా దక్షజాఽభవత్ ॥2॥**

దృఢంగా వ్రతనియమాలు పాటించే దక్షుడు తపస్సు చేసి దేవినుండి ఏ వరాన్ని పొందాడు? ఆమె దక్షుని కూతురు ఎలా అయింది? ఆ కథ చెప్పండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**శృణు నారద ధన్యస్త్వం మునిభిర్భక్తితోఽఖిలైః ।**
**యథా తేపే తపో దక్షో వరం ప్రాప చ సువ్రతః ॥3॥**

ఓ నారదా! మునులందరితో కలిసి విను. నీవు ధన్యుడవు. దక్షుడు తపం చేసి వరం పొందిన విధానాన్ని చెప్తాను.

**మదాజ్ఞప్తస్సుధీర్దక్షస్సమాధాయ మహాధిపః ।**
**అయాద్యష్టుం చ తాం దేవీం తత్కామో జగదంబికామ్ ॥4॥**

బుద్ధిశాలీ, గొప్ప సమర్థుడూ ఐన దక్షుడు నా ఆజ్ఞ మేరకు జగదంబయైన ఆ ఉమాదేవిని కుమార్తెగా పొందాలని, ఆ దేవిని ఆరాధింపబోయాడు.

**క్షీరోదోత్తరతీరస్థాం తాం కృత్వా హృదయస్థితామ్ ।**
**తపస్తప్తుం సమారేభే ద్రష్టుం ప్రత్యక్షతోఽంబికామ్ ॥5॥**

పాల సముద్రతీరం ఉత్తరతీరమున ఉండి, ఆ తల్లిని ప్రత్యక్షంగా చూడాలనుకొని, ఆమెను హృదయంలో నిశ్చలభావన చేసికొని తపస్సు చేయటం ప్రారంభించాడు.

**దివ్యవర్షేణ దక్షస్తు సహస్రాణాం త్రయం సమాః ।**
**తపశ్చచార నియతస్సంయతాత్మా దృఢవ్రతః ॥6॥**

కఠినమైన దీక్షతో దక్షుడు జితేంద్రియుడై మూడువేల దివ్యసంవత్సరాలు నియమంతో తపస్సు చేశాడు.

**మారుతాశీ నిరాహారో జలహారీ చ పర్ణభుక్ ।**
**ఏవం నినాయ తం కాలం చింతయన్ తాం జగన్మయీమ్ ॥7॥**

అతడు గాలిని భక్షించి, ఉపవాసముంటూ ఒకప్పుడు నీళ్లను మాత్రమే త్రాగి, మరొకప్పుడు ఆకులను తిని జగద్రూపిణి అయిన ఆ తల్లిని ధ్యానిస్తూ కాలాన్ని గడిపాడు.

**దుర్గాధ్యానసమాసక్తశ్చిరం కాలం తపోరతః ।**
**నియమైర్బహుభిర్దేవీమారాధయతి సువ్రతః ॥8॥**

మంచి వ్రతనిష్ఠ గల అతడు అనేకనియమాలతో తపోనిష్ఠుడై ప్రతిరోజు, చాలాకాలం దుర్గాదేవిని ధ్యానిస్తూ ఆ దేవిని ఆరాధించాడు.

**తతో యమాదియుక్తస్య దక్షస్య మునిసత్తమ ।**
**జగదంబాం పూజయతః ప్రత్యక్షమభవచ్ఛివా ॥9॥**

ఓ మహర్షీ! అపుడు యమనియమాదులతో జగన్మాతను పూజిస్తున్న దక్షునికి ఆ ఉమాదేవి ప్రత్యక్షమైంది.

**తతః ప్రత్యక్షతో దృష్ట్వా జగదంబాం జగన్మయీమ్ ।**
**కృతకృత్యమథాత్మానం మేనే దక్షః ప్రజాపతిః ॥10॥**

దక్షుడు ఆ జగద్రూపిణి అయిన జగదంబను ప్రత్యక్షంగా చూసి తన జన్మ చరితార్థమైనదని తలచాడు.

**సింహస్థాం కాలికాం కృష్ణాం చారువక్త్రాం చతుర్భుజామ్ ।**
**వరదాభయనీలాబ్జఖడ్గహస్తాం మనోహరామ్ ॥11॥**

సింహముపై కూర్చుండి, నల్లని రంగు, సుందరమైన ముఖం, నాలుగు చేతులు కలిగి, వరదముద్ర, అభయ ముద్ర, నల్లని కలువ మరియు కత్తి అనే వాటిని నాలుగు చేతులలో ధరించి అందంగా ఉంది.

**ఆరక్తనయనాం చారుముక్తకేశీం జగత్ప్రసూమ్ ।**
**తుష్టావ వాగ్భిశ్చిత్రాభిస్సుప్రణమ్యాథ సుప్రభామ్ ॥12॥**

ఎర్రని కళ్లు కలది, వ్రేలాడుచున్న అందమైన జట్టు కలది, గొప్ప కాంతి కల్గిన ఆ జగన్మాతకు నమస్కరించి అతడు చిత్రమైన మాటలతో స్తుతించాడు.

**దక్ష ఉవాచ** - దక్షుడు పలికాడు.

**జగదంబ మహామాయే జగదీశే మహేశ్వరి ।**
**కృపాం కృత్వా నమస్తేఽస్తు దర్శితం స్వవపుర్మమ ॥13॥**

ఓ జగన్మాతా! మహామాయా! జగదీశ్వరీ! మహేశ్వరీ! నీకు నమస్కారం. నీవు నాపై దయ చూపి ప్రత్యక్షమయ్యావు.

**ప్రసీద భగవత్యాద్యే ప్రసీద శివరూపిణి ।**
**ప్రసీద భక్తవరదే జగన్మాయే నమోఽస్తు తే ॥14॥**

ఓ ఆదిభగవతీ! దయ చూపుము. శివస్వరూపిణీ. ప్రసన్నురాలవై భక్తులకు వరాలిచ్చే ఓ తల్లీ! అనుగ్రహించు. ఓ జగన్మాయా! నీకు నమస్కారం.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**ఇతి స్తుతా మహేశానీ దక్షేణ ప్రయతాత్మనా ।**
**ఉవాచ దక్షం జ్ఞాత్వా పి స్వయం తస్యేప్సితం మునే ॥15॥**

ఓ మహర్షీ! దక్షుడు దేవియందు మనసు లగ్నం చేసి ఇలా ప్రార్థించగా, ఆ మహేశ్వరి దక్షుని కోరిక తెలిసి కూడా దక్షునితో ఇలా అంది.

**దేవ్యువాచ –** దేవి పలికింది.

**తుష్టాహం దక్ష భవతస్సద్భక్త్యా హ్యనయా భృశమ్ ।**
**వరం వృణీష్వ స్వాభీష్టం నాదేయం విద్యతే తవ ॥16॥**

ఓ దక్షా! నీ మంచి భక్తితో నేను చాలా సంతోషించాను. నీకిష్టమైన వరం కోరుకో! నీకు ఈయదగని వరం లేదు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ అన్నాడు.

**జగదంబావచశ్శ్రుత్వా తతో దక్షః ప్రజాపతిః ।**
**సుప్రహృష్టతరః ప్రాహ నామం నామం చ తాం శివామ్ ॥17॥**

దక్షప్రజాపతి జగన్మాత మాటలను విని, చాలా సంతోషించి ఆ ఉమాదేవికి అనేకసార్లు నమస్కారం చేసి ఇలా అన్నాడు.

**దక్ష ఉవాచ –** దక్షుడు అన్నాడు.

**జగదంబ! మహామాయే యది త్వం వరదా మమ ।**
**మద్వచశ్శృణు సుప్రీత్యా మమ కామం ప్రపూరయ ॥18॥**

ఓ జగన్మాతా! మహామాయా నీవు నాకు వరం ఇవ్వాలనుకుంటే ప్రీతితో నా మాటను విని, కోరిన వరాన్నివ్వు.

**మమ స్వామీ శివో యో హి స జాతో బ్రహ్మణస్సుతః ।**
**రుద్రనామా పూర్ణరూపావతారః పరమాత్మనః ॥19॥**

నా ప్రభువైన శివపరమాత్మ పూర్ణావతారుడై రుద్రుడు అనే పేరుతో బ్రహ్మకుమారుడై జన్మించాడు.

**తవావతారో నో జాతః కా తత్పత్నీ భవేదతః ।**
**తం మోహయ మహేశానమవతీర్య క్షితౌ శివే ॥20॥**

కాని, నీవు ఇంకా అవతారం దాల్చలేదు. ఆయనకు నీవు తప్ప మరెవ్వరు భార్య కాగలరు? నీవు భూమియందు అవతరించి శివుని మోహింప చేయాలి.

**త్వదృతే తస్య మోహాయ న శక్తాన్యా కదాచన ।**
**తస్మాన్మమ సుతా భూత్వా హరజాయా భవాఽధునా ॥21॥**

నీవు తప్ప మరొకరు ఎవరూకూడ శివుని మోహింప చేయలేరు. కావున నీవు నాకు కూతురివై పుట్టి హరునికి భార్యవు కావాలి.

**ఇత్థం కృత్వా సులీలాం చ భవ త్వం హరమోహినీ ।**
**మమైవైష వరో దేవి సత్యముక్తం తవాగ్రతః ॥22॥**

నీవు ఇలాంటి చక్కని లీలలను ప్రకటించి శివుని మోహింప చేయి. ఓ దేవీ! ఇదే నేను కోరే వరం. నీ ఎదుట నిజాన్ని చెప్పాను.

**కేవలం స్వార్థమితి చ సర్వేషాం జగతామపి ।**
**బ్రహ్మవిష్ణుశివానాం చ బ్రహ్మణా ప్రేరితో హ్యహమ్ ॥23॥**

దీనిలో నా స్వార్థమే గాకుండా, సర్వజగత్తుల క్షేమం, బ్రహ్మ, విష్ణు, శివుల ఆకాంక్షలు కూడా ఉన్నాయి. ఈ పనికి బ్రహ్మ నన్ను ప్రేరేపించాడు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**ఇత్యాకర్ణ్య ప్రజేశస్య వచనం జగదంబికా ।**
**ప్రత్యువాచ విహస్యేతి స్మృత్వా తం మనసా శివమ్ ॥24॥**

జగన్మాత ప్రజాపతి మాటలను విని, నవ్వి మనసులో శివుని స్మరించి ఇలా బదులు చెప్పింది.

**దేవ్యువాచ** - దేవి పలికింది.

**తాత! ప్రజాపతే! దక్ష! శృణు మే పరమం వచః ।**
**సత్యం బ్రవీమి త్వద్భక్త్యా సుప్రసన్నాఖిలప్రదా ॥25॥**

వత్సా! దక్షప్రజాపతీ! నేను చెప్పే మాటలను విను. నేను సత్యం చెప్తున్నాను. నేను నీ భక్తికి ప్రసన్నురాలనయ్యాను. నీ కోరికలన్నింటిని తీరుస్తాను.

**అహం తవ సుతా దక్ష త్వజ్జాయాయాం మహేశ్వరీ ।**
**భవిష్యామి న సందేహస్త్వద్భక్తివశవర్తినీ ॥26॥**

ఓ దక్షా! మహేశ్వరినైన నేను నీ భక్తికి వశురాలనై నీ భార్యయందు నీకు కూతురుగా జన్మిస్తాను. దీనిలో సందేహం లేదు.

**తథా యత్నం కరిష్యామి తపః కృత్వా సుదుస్సహమ్ ।**
**హరజాయా భవిష్యామి తద్వరం ప్రాప్య చానఘ ॥27॥**

ఓ పుణ్యాత్మా! అనఘా! ఘోరమైన తపస్సు చేసి శివుని వరం పొంది, శివునికి భార్యను అయ్యే విధంగా ప్రయత్నిస్తాను.

**నాన్యథా కార్యసిద్ధిర్హి నిర్వికారీ చ స ప్రభుః ।**
**విధేర్విష్ణోశ్చ సంసేవ్యః పూర్ణ ఏవ సదాశివః ॥28॥**

కార్యసిద్ధికి తపస్సు తప్ప మరో దారి లేదు. ఆ ప్రభువు వికారం లేని వాడు. బ్రహ్మవిష్ణువులచే పూజింపబడే వాడు. సదాశివుడు మాత్రమే పూర్ణుడు.

**అహం తస్య సదా దాసీ ప్రియా జన్మని జన్మని ।**
**మమ స్వామీ స వై శంభుర్నానారూపధరోఽపి హ ॥29॥**

నేను ఆయనకు జన్మ జన్మల నుండి దాసిని, ప్రియురాలిని. శివుడు అనేక రూపాలు ధరించినా ఆయనే నా ప్రభువు.

**వరప్రభావాద్భ్రుకుటేరవతీర్ణో విధేస్స్మ చ ।**
**అహం తద్వరతోపీహావతరిష్యే తదాజ్ఞయా ॥30॥**

ఆయన వరప్రభావముచే అనగా సంకల్పముచే బ్రహ్మ కనుబొమ్మల నుండి ఆ రుద్రుడు అవతరించాడు. ఇచ్చాను నేను కూడా ఆయన వరం వలన ఆయన ఆదేశంతో ఈ లోకంలో అవతరించగలను.

**గచ్ఛ స్వభవనం తాత మయాజ్ఞప్తా తు దూతికా ।**
**హరజాయా భవిష్యామి భూతా తే తనయాచిరాత్ ॥31॥**

నీవు నిశ్చింతగా గృహమునకు వెళ్ళుము. నేను ఇందుకవసరమైన ఏర్పాటుచేయుటకు దూతికకు ఆజ్ఞను ఇచ్చితిని నేను త్వరలోనే నీ కుమార్తెగా జన్మించి హరునకు భార్యగా స్థానాన్ని సంపాదిస్తాను.

**ఇత్యుక్త్వా సద్వచో దక్షం శివాజ్ఞాం ప్రాప్య చేతసి ।**
**పునః ప్రోవాచ సా దేవి స్మృత్వా శివపదాంబుజమ్ ॥32॥**

ఆ దేవి దక్షునితో ఇలా మంచి మాటలు పలికి, మనసులో శివుడి ఆజ్ఞ పొంది, శివుడి పాదపద్మాలు స్మరించి మరలా ఇలా పలికింది.

**పరం తు పణ ఆధేయో మనసా తే ప్రజాపతే ।**
**శ్రావయిష్యామి తే తం వై సత్యం జానీహి నో మృషా ॥33॥**

ఓ ప్రజాపతీ! కాని ఒక షరతు ఉంది. దీనిని నీ మనస్సులో గట్టిగా ఉంచుకో. నేను నీకు ఆ షరతు చెప్తాను. నిజాన్ని తెలుసుకో! అసత్యం వద్దు.

**యదా భవాన్మయి పునర్భవేన్మందాదరస్తదా ।**
**దేహం త్యక్ష్యే నిజం సత్యం స్వాత్మన్యస్త్వథ వేతరమ్ ॥34॥**

ఏనాడైతే నీవు నా యందు ఆదరం కోల్పోతావో, ఆనాడు నేను నా దేహాన్ని విడిచి పెడతాను. మరోదేహాన్ని ధరిస్తాను ఇది సత్యం నేను నామాట మీద ఉంటాను లేదా మరో దేహాన్ని ధరిస్తాను.

**ఏష దత్తస్తవ వరః ప్రతిసర్గం ప్రజాపతే ।**
**అహం తవ సుతా భూత్వా భవిష్యామి హరప్రియా ॥35॥**

ఓ ప్రజాపతీ! ప్రతికల్పంలో నీకు ఈ వరం ఇస్తున్నాను. నేను కూతురిగా పుట్టి, హరునికి భార్యనవుతాను.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ పలికాడు.

**ఏవముక్త్వా మహేశానీ దక్షం ముఖ్యప్రజాపతిమ్ ।**
**అంతర్దధే ద్రుతం తత్ర సమ్యగ్దక్షస్య పశ్యతః ॥36॥**

ప్రజాపతులలో ముఖ్యుడైన దక్షునితో ఇలా మాట్లాడి ఆ మహేశ్వరి వెంటనే దక్షుడు చూస్తుండగానే మాయమయింది.

**అంతర్హితాయాం దుర్గాయాం స దక్షోఽపి నిజాశ్రమమ్ ।**
**జగామ చ ముదం లేభే భవిష్యతి సుతేతి సా ॥37॥**

ఆ దక్షుడు దుర్గ మాయమవ్వగానే తన ఆశ్రమానికి వెళ్లాడు. ఆమె తన కుమార్తె కాబోతున్నందుకు చాలా సంతోషించాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే దక్షవరప్రాప్తి వర్ణనః నామైద్వాదశోఽధ్యాయః ॥12॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో దక్షునకువరప్రాప్తి అనే పన్నెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయోదశోऽధ్యాయః - పదమూడవ అధ్యాయం

## నారదశాపః - నారదునికిశాపం

**నారద ఉవాచ** - నారదుడు పలికాడు.

**బ్రహ్మన్విధే మహాప్రాజ్ఞ వద నో వదతాం వర ।**
**దక్షే గృహం గతే ప్రీత్యా కిమభూత్తదనంతరమ్ ॥1॥**

ఓ బ్రహ్మా! విధీ! నీవు మహాబుద్ధిశాలివి. ప్రవక్తలలో శ్రేష్ఠుడవు. దక్షుడు ఆనందంతో ఇంటికి వెళ్లాక ఏం జరిగింది? మాకు చెప్పండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**దక్షః ప్రజాపతిర్గత్వా స్వాశ్రమం హృష్టమానసః ।**
**సర్గం చకార బహుధా మానసం మమ చాజ్ఞయా ॥2॥**

దక్షప్రజాపతి ఆనందంతో నిండిన మనసు కలవాడై తన ఆశ్రమానికి వెళ్లి నా ఆజ్ఞచే అనేక విధాల మానసికసృష్టిని చేశాడు.

**తమబృంహితమాలోక్య ప్రజాసర్గం ప్రజాపతిః ।**
**దక్షో నివేదయామాస బ్రహ్మణే జనకాయ మే ॥3॥**

దక్షప్రజాపతి ఆ సృష్టిలో వృద్ధి లేకపోవటం వలన బ్రహ్మనూ తండ్రియూ అయిన నాకు తెలియచేశాడు.

**దక్ష ఉవాచ** - దక్షుడు పలికాడు.

**బ్రహ్మంస్తాత ప్రజానాథ వర్ధంతే న ప్రజాః ప్రభో ।**
**మయా విచరితాస్సర్వాస్తావత్యో హి స్థితాః ఖలు ॥4॥**

ఓ బ్రహ్మా! తండ్రీ! ప్రజాపతీ! ప్రభూ! నాచే సృష్టించబడిన సంతానంలో పెరుగుదల లేక అలాగే ఉన్నారు.

**కిం కరోమి ప్రజానాథ! వర్ధేయుః కథమాత్మనా ।**
**తదుపాయం సమాచక్ష్వ ప్రజాః కుర్యాం న సంశయః ॥5॥**

హే ప్రజానాథా! నేను ఏమి చేయాలి? ఈ సంతానం తనంత తాను వృద్ధి అయ్యే ఉపాయం చెప్పండి. నేను సృష్టి చేస్తాను. సందేహం లేదు.

**బ్రహ్మో ఉవాచ** - బ్రహ్మ పలికాడు.

**దక్షః ప్రజాపతే! తాత! శృణు మే పరమం వచః ।**
**తత్కురుష్వ సురశ్రేష్ఠ శివస్తే శం కరిష్యతి ॥6॥**

వత్సా! దక్షప్రజాపతీ! నా మంచి మాటను విని అలాగే చేయి. నీవు దేవతలలో గొప్ప వాడివి. శివుడు నీకు మంచినే చేస్తాడు.

**యా చ పంచజనస్యాంగసుతా రమ్యా ప్రజాపతే ।**
**అసిక్నీ నామ పత్నీత్వే ప్రజేశ! ప్రతిగృహ్యతామ్ ॥7॥**

కుమారా! పంచజనప్రజాపతికి అసిక్ని అనే అందమైన కూతురు ఉంది. ఓ ప్రజాపతీ! నీవు ఆమెను భార్యగా స్వీకరించు.

**వామవ్యవాయధర్మస్త్వం ప్రజాసర్గమిమం పునః ।**
**తద్విధాయాం చ కామిన్యాం భూరిశో భావయిష్యసి ॥8॥**

నీవు అలాంటి సుందరి అయిన భార్యయందు మైథునధర్మంచే ఈ ప్రజాసృష్టిని విస్తారంగా చేయగలవు.

**బ్రహ్మో ఉవాచ** – బ్రహ్మ పలికాడు.

**తతః సముత్పాదయితుం ప్రజా మైథునధర్మతః ।**
**ఉపయేమే వీరణస్య నిదేశాన్మే సుతాం తతః ॥9॥**

అపుడు దక్షుడు నా ఆదేశంతో పంచజనుని (వీరణుని) కూతురిని మైథునధర్మంతో సంతానం పొందుటకు పెళ్లి చేసుకున్నాడు.

**అథ తస్యాం స్వపత్న్యాం చ వీరిణ్యాం స ప్రజాపతిః ।**
**హర్యశ్వసంజ్ఞానయుతం దక్షః పుత్రానజీజనత్ ॥10॥**

అపుడు దక్షప్రజాపతి వీరణుని కూతురైన అసిక్నియందు హర్యశ్వులు అను పేరు గల పదివేలమంది కొడుకులను పుట్టించాడు.

**అపృథగ్ధర్మశీలాస్తే సర్వ ఆసన్ సుతా మునే ।**
**పితృభక్తిరతా నిత్యం వేదమార్గపరాయణాః ॥11॥**

ఓ మహర్షీ! వాళ్లంతా తండ్రివలెనే వైదిక ధర్మానురక్తిగలవారై, తండ్రియందు భక్తికలవారై నిత్యం వేదమార్గంలో నిష్ఠ కలిగియున్నారు.

**పితృప్రోక్తాః ప్రజాసర్గకరణార్థం యయుర్దిశమ్ ।**
**ప్రతీచీం తపసే తాత సర్వే దాక్షాయణాస్సుతాః ॥12॥**

తండ్రి వారందరిని సంతానమును వృద్ధి చేయమని చెప్పాడు. వత్సా! ఆ దక్షపుత్రులందరూ తపస్సు కోసం పడమరవైపుకి వెళ్లారు.

**తత్ర నారాయణసరస్తీర్థం పరమపావనమ్ ।**
**సంగమో యత్ర సంజాతో దివ్యంసింధుసముద్రయోః ॥13॥**

అక్కడ దివ్యమైన సింధునది సముద్రంలో కలిసే సంగమం దగ్గర పరమపవిత్రమైన నారాయణ సరస్సు అనే తీర్థం ఉంది.

**తదుపస్పర్శనాదేవ ప్రోత్పన్నమతయోఽభవన్ ।**
**ధర్మే పరమహంసే చ వినిర్ధూతమలాశయాః ॥14॥**

ఆ నీళ్లను ముట్టుకున్న వెంటనే వాళ్ల మనస్సులోని మాలిన్యాలు తొలగి పోతాయి. వాళ్ల బుద్ధి పరమహంస ధర్మము (నివృత్తిధర్మం) నందు స్థిరపడింది.

**ప్రజావివృద్ధయే తే వై తేపిరే తత్ర సత్తమాః ।**
**దాక్షాయణా దృఢాత్మానః పిత్రాదేశసుయంత్రితాః ॥15॥**

పుణ్యాత్ములు, జితేంద్రియులు అయిన దక్షపుత్రులు తండ్రి ఆదేశం ప్రకారం నియంత్రింపబడిన వారై సంతానం వృద్ధి చేయటానికి అక్కడ తపస్సు చేస్తున్నారు.

**త్వం చ తాన్నారద! జ్ఞాత్వా తపతస్సృష్టిహేతవే ।**
**అగమస్తత్ర భావం చ హార్దమాజ్ఞాయ మాపతేః ॥16॥**

నారదా! సృష్టికోసం తపిస్తున్న వారి మనస్సు నువ్వు తెలుసుకొని హరి చిత్తమూగ్రహించి అక్కడకు వెళ్లావు.

**అదృష్ట్వా తం భువః సృష్టిం కథం కర్తుం సముద్యతాః ।**
**హర్యశ్వా దక్షతనయా ఇత్యవచంస్తమాదరాత్ ॥17॥**

భూమినిగూర్చి సంపూర్ణంగా తెలుసుకోకుండా సృష్టి ఎలా చేస్తారు అని నారదుడు హర్యశ్వులను అడిగాడు.

**తన్నిశమ్యాథ హర్యశ్వాస్తే త్వదుక్తమతంద్రితాః ।**
**ఔత్పత్తికధియస్సర్వే స్వయం విమమృశుర్భృశమ్ ॥18॥**

అపుడు హర్యశ్వులు శ్రద్ధతో నీ మాటలు విన్నారు. వాళ్లంతా పుట్టుకతో బుద్ధిమంతులు కదా! వాళ్లు నీ మాటలను చక్కగా విచారణ చేశారు.

**సుశాస్త్రజనకాదేశం యో న వేద నివర్తకమ్ ।**
**స కథం గుణవిశ్రంభీ కర్తుం సర్గముపక్రమేత్ ॥19॥**

తండ్రి వంటి శాస్త్రం నివృత్తిధర్మాన్ని తెలియ చేస్తుంది. ఆ శాస్త్రవిషయాలు తెలియక గుణాలందు విశ్వాసముంచినవాడు సృష్టిఎట్లుచేయ గలడు? (గుణము=అదృష్టము)

**ఇతి నిశ్చిత్య తే పుత్రాస్సుధయశ్చైకచేతసః ।**
**ప్రణమ్య తం పరిక్రమ్యాయుర్మార్గమనివర్తకమ్ ॥20॥**

బుద్ధిశాలురైన ఆ దక్షపుత్రులు ఇలా నిశ్చయించుకొని, ఆ నారదునికి నమస్కరించి, ప్రదక్షిణం చేసి పునరావృత్తి లేని జ్ఞానంలోకి వెళ్లిపోయారు.

**నారద త్వం మనశ్శంభోర్లోకానన్యచరో మునే ।**
**నిర్వికారో మహేశానమనోవృత్తికరస్సదా ॥21॥**

నారదా! నీవే శంభుని చిత్తానివి ఓ మహర్షీ! నీవు ఒంటరిగా లోకాలను తిరిగే వాడివి. నీవు వికారాలు లేనివాడవై ఎపుడూ మహేశ్వరుని మనసులోని ఆశయాలను నెరవేరుస్తావు.

**కాలే గతే బహుతరే మమ పుత్రః ప్రజాపతిః ।**
**నాశం నిశమ్య పుత్రాణాం నారదాదన్వతప్యత ॥22॥**

చాలా కాలం గడచిన తర్వాత నా కుమారుడైన దక్షప్రజాపతికి తన కుమారులు నారదుడి వల్ల ప్రవృత్తి మార్గం నుండి తొలగిపోయారని విని చాలా బాధపడ్డాడు.

**ముహుర్ముహురువాచేతి సుప్రజాత్వం శుచాం పదమ్ ।**
**శుశోచ బహుశో దక్షశ్శివమాయావిమోహితః ॥23॥**

మంచి కుమారులను కలిగియుండుట దుఃఖాలకు కారణమని చెప్తూ దక్షుడు శివమాయచే అనేక రకాలుగా బాధ పడ్డాడు.

**అహమాగత్య సుప్రీత్యా సాంత్వయం దక్షమాత్మజమ్ ।**
**శాంతిభావం ప్రదర్శ్యైవ దైవం ప్రబలమిత్యుత ॥24॥**

నేను వచ్చి కుమారుడైన దక్షునితో శాంతంగా ఉండమని, దైవం బలీయమైనదని చెప్పి ఓదార్చాను.

**అథ దక్షః పంచజన్యాం మయా సపరిసాంత్వితః ।**
**సబలాశ్వాభిధాన్ పుత్రాన్ సహస్రం చాప్యజీజనత్ ॥25॥**

తర్వాత దక్షుడు పంచజనుని కుమార్తె పంచజన్య అను తన భార్యయందు శబలాశ్వులను పేరు గల వెయ్యిమంది కుమారులను పొందాడు.

**తేఽపి జగ్ముస్తత్ర సుతాః పిత్రాదిష్టా దృఢవ్రతాః ।**
**ప్రజాసర్గే యత్ర సిద్ధాస్స్వపూర్వభ్రాతరో యయుః ॥26॥**

మంచివ్రతం గల ఆ దక్షపుత్రులు కూడా తండ్రిచే ఆదేశింపబడిన వాళ్లై ప్రజాసృష్టిని చేయాలని, తమ సోదరులు గతంలో సిద్ధి పొందిన తీర్థానికే వెళ్లారు.

**తదుపస్పర్శనాదేవ నష్టాఘా విమలాశయాః ।**
**తేపుర్మహత్తపస్తత్ర జపంతో బ్రహ్మ సువ్రతాః ॥27॥**

ఆ తీర్థజలాలు ముట్టుకున్న వెంటనే వాళ్ల పాపాలు నశించి మనసులు శుద్ధమయ్యాయి. వారు అక్కడ వ్రతపరాయణులై ఓంకారాన్ని జపిస్తూ గొప్ప తపస్సును చేశారు.

**ప్రజాసర్గోద్యతాంస్తాన్ వై జ్ఞాత్వా గత్వేతి నారద ।**
**పూర్వవచ్చాగదో వాక్యం సంస్మరన్నైశ్వరీం గతిమ్ ॥28॥**

ఓ నారదా! వాళ్లు ప్రజాసృష్టికి సిద్ధంకాగా ఆ సంగతి తెలిసి గతంలో లాగానే వాళ్ల దగ్గరకు నీవు వెళ్లి, ఈశ్వరభావాన్ని స్మరించి, మరల వాళ్లకు ఉపదేశం చేశావు.

**భ్రాతృపంథానమాదిశ్య త్వం మునే మోఘదర్శనః ।**
**అయాశ్చోర్ధ్వగతిం తేఽపి భాతృమార్గం యయుస్సుతాః ॥29॥**

మహర్షీ! అమోఘజ్ఞానం గల నువ్వు వారికి సోదరులు వెళ్లిన దారిని తెలియ జేసి, నీ దారిన నువ్వు వెళ్లావు. వాళ్లు కూడా సోదరుల మార్గంలో వెళ్లి మోక్షాన్ని పొందారు.

**ఉత్పాతాన్ బహుశోఽపశ్యత్తదైవ స ప్రజాపతిః ।**
**విస్మితోఽభూత్స మే పుత్రో దక్షో మనసి దుఃఖితః ॥30॥**

అదే సమయంలో దక్షప్రజాపతికి అనేక చెడు శకునాలు కన్పించాయి. నా కుమారుడు దక్షుడు మనసులో చాలా బాధ పడ్డాడు.

**పూర్వవత్త్వత్కృతం దక్షశ్శుశ్రావ చకితో భృశమ్ ।**
**పుత్రం నాశం శుశోచాతిపుత్రశోకవిమూర్ఛితః ॥31॥**

నారదుడు గతంలో చేసినట్లే ఇపుడూ చేశాడని దక్షుడు విని చాలా బాధ పడి, పుత్రశోకంతో ఆశ్చర్యం కల్గి మూర్ఛ పోయాడు.

**చుక్రోధ తుభ్యం దక్షోఽసౌ దుష్టోఽయమితి చాబ్రవీత్ ।**
**ఆగతస్తత్ర దైవాత్త్వమనుగ్రహకరస్తదా ॥32॥**

ఈ దక్షుడు నీ మీద కూడా కోపపడి 'వీడు దుష్టుడు' అని కూడా అన్నాడు. అనుగ్రహాన్నిచ్చే నువ్వు అపుడు అక్కడికి వచ్చావు.

**శోకావిష్టస్సదక్షో హి రోషవిస్ఫురితాధరః ।**
**ఉపలభ్య తమాహత్య ధిగ్ధిక్ ప్రోచ్య విగర్హయన్ ॥33॥**

బాధతో ఉన్న దక్షునకు రోషముచే పెదవులు వణికాయి. నిన్ను చూడగానే ధిక్.....ధిక్ ....అని నిందించి నిన్ను అసహ్యించుకున్నాడు.

**దక్ష ఉవాచ** – దక్షుడు పలికాడు.

**కిం కృతం తేఽధమశ్రేష్ఠ సాధూనాం సాధులింగతః ।**
**భిక్షామార్గోర్భకానాం వై దర్శితస్సాధుకారి నో ॥34॥**

నేను నీకు ఏం అపకారం చేశాను? నీవు సాధువేషంలో ఉన్న మోసగాడివి. పిల్లలకు భిక్షామార్గాన్ని (సన్యాసం) చూపించావు. ఇది సాధువులు చేసే పని కాదు.

**ఋణైస్త్రిభిరముక్తానాం లోకయోరుభయోః కృతః ।**
**విఘాతశ్శ్రేయసోఽమీషాం నిర్దయేన శఠేన తే ॥35॥**

వారికింకా మూడు ఋణాలనుండి విముక్తి కలుగ లేదు. వాళ్లు ఇహపరాల నుండి భ్రష్టులయ్యారు. నీవు దయ లేని మోసగాడివి. వారి అభివృద్ధికి ఆటంకం కలిగించావు.

**ఋణాని త్రీణ్యప్రాకృత్య యో గృహాత్ప్రవ్రజేత్పుమాన్ ।**
**మాతరం పితరం త్యక్త్వా మోక్షమిచ్ఛన్ వ్రజత్యధః ॥36॥**

మూడు ఋణాలు తీరకుండా తల్లిదండ్రులను విడిచి మోక్షాన్ని కోరుకొని, ఇల్లు వదలి సన్యసించేవాడు పతితుడౌతాడు.

**నిర్దయస్త్వం సునిర్లజ్జశ్శిశుధీభిద్యశోఽపహా ।**
**హరేః పార్షదమధ్యే హి వృథా చరసి మూఢధీః ॥37॥**

నీకు దయలేదు, సిగ్గు అసలే లేదు. పిల్లల బుద్ధిని చెడగొట్టి గౌరవాన్ని పోగొట్టావు. మూర్ఖుడవైన నువ్వు విష్ణుసేవకులతో కలిసి అనవసరంగా తిరుగుతున్నావు.

**ముహుర్ముహురభద్రం త్వమచరో మేఽధమాఽధమ ।**
**విభవేద్భ్రమతస్తేఽతః పదం లోకేషు న స్థిరమ్ ॥38॥**

నువ్వు అనేకసార్లు నాకు అమంగళాన్ని కల్గించిన అధమాధముడవు. నీవు స్థిరంగా ఒక చోటులో లేని వాడవై లోకాలన్నీ తిరుగుతూ ఉందువు గాక!

**శశాపేతి శుచా దక్షస్త్వాం తదా సాధుసమ్మతమ్ ।**
**బుబోధ నేశ్వరేచ్ఛాం స శివమాయావిమోహితః ॥39॥**

అని దక్షుడు సాధువులకు కూడా పూజ్యుడైన నిన్ను శపించాడు. శివమాయలో ఉన్న అతనికి శివతత్త్వం, సంకల్పం, అర్థం కాలేదు.

**శాపం ప్రత్యగ్రహీచ్చ త్వం స మునే నిర్వికారధీః ।**
**ఏష ఏవ బ్రహ్మ సాధో సహతే సోఽపి చ స్వయమ్ ॥40॥**

ఓ మహర్షీ! నీవు వికారం లేని మనసుతో దానిని తీసుకున్నావు. బ్రహ్మనిష్ఠ అంటే ఇదే. ఓ సాధూ! భగవానుడు కూడా ఇలాగే సహించుకుంటాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే నారదశాపో నామ త్రయోదశోఽధ్యాయః ॥13॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో నారదునకుశాపం అనే పదమూడవ అధ్యాయం సమాప్తం

## **చతుర్దశోఽధ్యాయః** – పద్నాల్గవ అధ్యాయం
## **సతీజన్మ బాలలీలావర్ణనమ్** – సతీదేవిజననం బాలలీలావర్ణనం

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ పలికాడు.

**ఏతస్మిన్నంతరే దేవమునే లోకపితామహః ।**
**తత్రాగమమహం ప్రీత్యా జ్ఞాత్వా తచ్చరితం ద్రుతమ్ ॥1॥**

ఓ దేవర్షీ! ఇంతలో లోకపితామహుడనైన నేను ఆ కథను తెలుసుకొని, వేగంగా అచ్చటకు వెళ్లాను.

**అసాంత్వయమహం దక్షం పూర్వవత్సువిచక్షణః ।**
**అకార్షం తేన సుస్నేహం తవ సుప్రీతిమావహన్ ॥2॥**

విద్వాంసుడనైన నేను గతంలో లాగే దక్షుని ఓదార్చాను. వానితో మంచిస్నేహాన్ని కల్పించి నీకు ఆనందాన్ని కలిగించాను.

**స్వాత్మజం మునివర్యం త్వాం సుప్రీత్యా దేవవల్లభమ్ ।**
**సమాశ్వాస్య సమాదాయ ప్రత్యపద్యే స్వధామ హ ॥3॥**

నా కుమారుడవు, మునిశ్రేష్ఠుడవు, దేవతలకు ఇష్టుడవు అగు నిన్ను చాలా ప్రేమతో ఓదార్చి, నిన్ను తీసుకొని నా నివాసానికి చేరుకున్నాను.

**తతః ప్రజాపతిర్దక్షోఽనునీతో మే నిజస్త్రియామ్ ।**
**జనయామాస దుహితౄస్సుభగాష్షష్టి సమ్మితాః ॥4॥**

తర్వాత నాచే ఓదార్పు పొందిన దక్షప్రజాపతి తన భార్యయందు అరవైమంది సుందరీమణులైన కన్యలను పొందాడు.

**తాసాం వివాహం కృతవాన్ ధర్మాదిభిరతంద్రితః ।**
**తదేవ శృణు సుప్రీత్యా ప్రవదామి మునీశ్వర ॥5॥**

అతడు శ్రద్ధతో వారి వివాహాన్ని ధర్ముడు మొదలగు వారితో జరిపించాడు. ఓ మహర్షీ! ఆ విషయాలను చెప్తాను విను.

**దదౌ దశసుతా దక్షో ధర్మాయ విధివన్మునే ।**
**త్రయోదశ కశ్యపాయ మునయే త్రినవేందవే ॥6॥**

**భూతాంగిరః కృశాశ్వాభ్యాం ద్వే ద్వే పుత్రీః ప్రదత్తవాన్ ।**
**తార్క్ష్యాయ చాపరాః కన్యాః ప్రసూతిప్రసవైర్యతః ॥7॥**

**త్రిలోకాః పూరితాస్తన్నో వర్ణ్యతే వ్యాసతో భయాత్ ।**
**కేచిద్వదంతి తాం జ్యేష్ఠాం మధ్యమాం చాపరే శివామ్ ॥8॥**

ఓ మహర్షీ! దక్షుడు ధర్మునకు పదిమందిని, కశ్యపమహర్షికి పదమూడుమందిని, చంద్రునికి ఇరవైఏడు మందినీ భూతాంగిరసునికి ఇద్దరినీ, కృశాశ్వునకు ఇద్దరినీ, తార్‌క్ష్యునకు మిగిలిన కన్యలనిచ్చి యథావిధిగా పెళ్లిళ్లు ఇష్టంగా చేశాడు. వారి సంతానంతో మూడు లోకాలు నిండిపోయాయి. గ్రంథవిస్తరభయంతో ఆవిషయాన్ని వివరంగా చెప్పలేకపోతున్నాను. సతీదేవి పెద్దకుమార్తె అని కొందరు, మధ్యమ కుమార్తె అని కొందరు చెబుతారు.

**సర్వానంతరజాం కేచిత్కల్పభేధాత్త్రయం చ సత్ ।**
**అనంతరం సుతోత్పత్తేస్సపత్నీకః ప్రజాపతిః ॥9॥**

**దక్షో దధౌ సుప్రీతాత్మా తాం మనసా జగదంబికామ్ ।**
**అతః ప్రేమ్ణా చ తుష్టావ గిరా గద్గదయా హి సః ॥10॥**

కనిష్ఠ కుమార్తె అని మరి కొందరి అభిప్రాయం. కల్పబేధం వల్ల ఈ మూడు పక్షాలు సత్యమే. కుమారులు పుట్టిన తర్వాత దక్షప్రజాపతి భార్యతో కూడి చాలా సంతోషించి ఆ జగన్మాతను మనసులో ధ్యానించాడు. అతడు గద్గదమైన మాటలతో, ప్రేమతో ఆమెను స్తుతించాడు.

**భూయో భూయో నమస్కృత్య సాంజలిర్వినయాన్వితః ।**
**సంతుష్టా సా తదా దేవీ విచారం మనసీతి చ ॥11॥**

ఆమెకు వినయంతో దోసిలి పట్టి చాలాసార్లు నమస్కరించాడు. అపుడు ఆ దేవి సంతోషించి మనసులో ఇలా తలచింది.

**చక్రేఽవతారం వీరిణ్యాం కుర్యాం పణవిపూర్తయే ।**
**అథ సోవాస మనసి దక్షస్య జగదంబికా ॥12॥**

నేను ప్రతిజ్ఞను నెరవేర్చుకోవటం కోసం ఈ వీరిణిలో అవతరిస్తాను. ఇలా తలచి ఆ జగన్మాత దక్షుని మనసులో స్థిరంగా ఉండిపోయింది.

**విలలాస తదాతీవ స దక్షో మునిసత్తమ ।**
**సుముహూర్తేనాథ దక్షోఽపి స్వపత్న్యాం నిదధే ముదా ॥13॥**

ఓ మహర్షీ! అపుడు ఆ దక్షుడు ఉల్లాసంతో ఒక సుమూహూర్తంలో ఆనందంగా భార్యయందు తేజాన్ని ఉంచాడు.

**దక్షపత్న్యాస్తదా చిత్తే శివోవాస దయాన్వితా ।**
**ఆవిర్బభూవుశ్చిహ్నాని దోహదస్యాఖిలాని వై ॥14॥**

అపుడు దయావతి అయిన ఉమ దక్షుని భార్యలో నివసించింది. దక్షుని భార్యలో గర్భిణీలక్షణాలు కన్పించాయి.

**విరేజే వీరిణీ తాత హృష్టచిత్తాధికా చ సా ।**
**శివావాసప్రభావాత్తు మహామంగలరూపిణీ ॥15॥**

వత్సా! చాలా ఆనందంతో ఆ వీరిణి మంచి ప్రకాశంతో ఉంది. ఉమ ఆమె గర్భంలో ఉండటం వల్ల ఆమె మహామంగళరూపిణిగా కనిపిస్తోంది.

**కులస్య సంపదశ్చైవ శ్రుతేశ్చిత్తసమున్నతేః ।**
**వ్యధత్త సుక్రియా దక్షః ప్రీత్యా పుంసవనాదికాః ॥16॥**

దక్షుడు తన కులానికి, సంపదకు, విద్యకు, ఉదారతకు తగ్గట్లుగా ప్రేమతో ఆమెకు పుంసవనాది సంస్కారాలు చేయించాడు.

**ఉత్సవోతీవ సంజాతస్తదా తేషు చ కర్మసు ।**
**విత్తం దదౌ ద్విజాతిభ్యో యథాకామం ప్రజాపతిః ॥17॥**

ఆ సంస్కారకర్మలతోపాటు గొప్ప ఉత్సవములు కూడా జరిగాయి. ఆ ప్రజాపతి బ్రాహ్మణులకు కోరినంత ధనం నిచ్చాడు.

**అథ తస్మిన్నవసరే సర్వే హర్యాదయస్సురాః ।**
**జ్ఞాత్వా గర్భగతాం దేవీం వీరిణ్యాస్తే ముదం యయుః ॥18॥**

అపుడు ఉమాదేవి వీరిణిగర్భంలో ఉందని తెలిసి విష్ణువు మొదలైన దేవతలు అందరూ ఆనందించారు.

**తత్రాగత్య చ సర్వే తే తుష్టువుర్జగదంబికామ్ ।**
**లోకోపకారకరిణీం ప్రణమ్య చ ముహుర్ముహుః ॥19॥**

వీళ్లంతా అక్కడికి వచ్చి జగన్మాతను స్తుతించారు. లోకాలకు ఉపకారం చేసే ఆ తల్లికి అనేకసార్లు ప్రణామాలు చేశారు.

**కృత్వా తతస్తే బహుధా ప్రశంసాం హృష్టమానసాః ।**
**దక్షప్రజాపతేశ్చైవ వీరిణ్యాస్స్వగృహం యయుః ॥20॥**

అపుడు వారందరూ ఆనందంతో దక్షుణ్ణీ, వీరిణినీ ప్రసంశించి తమ ఇంటికి వెళ్లారు.

**గతేషు నవమాసేషు కారయిత్వా చ లౌకికీమ్ ।**
**గతిం శివా చ పూర్ణే సా దశమే మాసి నారద ॥21॥**

**ఆవిర్బభూవ పురతో మాతుస్సద్యస్తదా మునే ।**
**ముహూర్తే సుఖదే చంద్రగ్రహతారానుకూలకే ॥22॥**

**తస్యాం తు జాతమాత్రాయం సుప్రీతోఽసౌ ప్రజాపతిః ।**
**సైవ దేవీతి తాం మేనే దృష్ట్వా తాం తేజసోల్బణామ్ ॥23॥**

ఓ నారదా! తొమ్మిది నెలలు నిండగానే దక్షుడు లౌకికకర్మలను చేయించాడు. పదవనెల నిండగానే ఆ ఉమాదేవి తల్లిగర్భం నుంచి పుట్టింది. సుఖకరమైన ఆ ముహూర్తంలో చంద్రగ్రహతారలు అనుకూలంగా ఉన్నాయి. ఆమె పుట్టిన వెంటనే ప్రజాపతి ఎంతో సంతోషించాడు. గొప్ప తేజస్సుతో ప్రకాశించుచున్న ఆ శిశువుని చూచి ఆమెయే దేవియని సంతోషించాడు.

**తదాభూత్పుష్పసద్వృష్టిర్మేఘాశ్చ వవృషుర్జలమ్ ।**
**దిశశ్శాంతా ద్రుతం తస్యాం జాతాయాం చ మునీశ్వర ॥24॥**

అపుడు చక్కని పూలవాన కురిసింది. మేఘాలు నీటిని వర్షించాయి. ఓ మహర్షీ! ఆమె పుట్టిన వెంటనే దిక్కులు ప్రసన్నములయ్యాయి.

**అవాదయంత త్రిదశాశ్శుభావాద్యాని ఖే గతాః ।**
**జజ్వలుశ్చాగ్నయశ్శాంతాస్సర్వమాసీత్సుమంగలమ్ ॥25॥**

దేవతలు ఆకాశంలో శుభవాద్యాలను ప్రయోగించారు. అగ్నులు శాంతంగా ప్రజ్వరిల్లాయి అంతటా మంగళప్రదంగా ఉంది.

**వీరిణే సంభవాం దృష్ట్వా దక్షస్తాం జగదంబికామ్ ।**
**నమస్కృత్య కరౌ బద్ధ్వా బహు తుష్టావ భక్తితః ॥26॥**

దక్షుడు వీరిణియందు పుట్టిన జగన్మాతను చూసి చేతులు కట్టుకుని నమస్కరించి, భక్తితో స్తుతించాడు.

**దక్ష ఉవాచ** - దక్షుడు పలికాడు.

**మహేశాని నమస్తుభ్యం జగదంబే సనాతని ।**
**కృపాం కురు మహాదేవి సత్యే సత్యస్వరూపిణి ॥27॥**

ఓ మహేశ్వరీ! జగన్మాత! నీవు సనాతనివి. నీకు నమస్కారం. ఓ మహాదేవీ! దయను చూపు. సత్యం నీవే. సత్యస్వరూపమూ నీవే.

**శివా శాంతా మహామాయా యోగనిద్రా జగన్మయీ ।**
**యా ప్రోచ్యతే వేదవిద్భిర్నమామి త్వాం హితావహామ్ ॥28॥**

వేదవేత్తలు నిన్ను శివా, శాంతా, మహామాయా, యోగనిద్రా, జగత్స్వరూపిణి అని వర్ణిస్తారు. హితాలను చేకూర్చే నీకు నేను నమస్కరిస్తున్నాను.

**యయా ధాతా జగత్సృష్టౌ నియుక్తస్తాం పురాకరోత్ ।**
**తాం త్వాం నమామి పరమాం జగద్ధాత్రీం మహేశ్వరీమ్ ॥29॥**

పూర్వం నీవు ధాతను సృష్టికార్యమునందు వినియోగించగా ఆయన సృష్టిని చేశాడు. అటువంటి మహేశ్వరీ నీకు నమస్కారం.

**యయా విష్ణుర్జగత్స్థిత్యై నియుక్తస్తాం సదా కరోత్ ।**
**తాం త్వాం నమామి పరమాం జగద్ధాత్రీం మహేశ్వరీమ్ ॥30॥**

నీవు విష్ణువును జగద్రక్షణ కోసం నియోగించగా ఆయన ఆ విధంగా చేశాడు. అలాంటి నీకు నమస్కారం. పరబ్రహ్మస్వరూపిణి, జగన్మాతవు, మహేశ్వరివి నీవే.

**రజస్సత్వతమోరూపాం సర్వకార్యకరీం సదా ।**
**త్రిదేవ జననీం దేవీ త్వాం నమామి చ తాం శివామ్ ॥31॥**

రజస్సత్త్వతమోగుణాత్మికవైన నీవు త్రిమూర్తుల రూపంలో అన్ని పనులను చేస్తున్నావు. నీవు జననివి. ఓ శివే! నీకు నేను నమస్కారం చేస్తున్నాను.

**యస్త్వాం విచింతయేద్దేవీం విద్యావిద్యాత్మికాం పరామ్ ।**
**తస్య భుక్తిశ్చ ముక్తిశ్చ సదా కరతలే స్థితా ॥32॥**

విద్యలు, అవిద్యలు అన్నీ నీ స్వరూపమే. పరాదేవి అయిన నిన్ను ధ్యానించే వారికి ఇహలోకసౌఖ్యమే కాక మోక్షం కూడా అరచేతిలో ఉంటుంది.

**యస్త్వాం ప్రత్యక్షతో దేవి శివాం పశ్యతి పావనీమ్ ।**
**తస్యావశ్యం భవేన్ముక్తిర్విద్యావిద్యాప్రకాశికా ॥33॥**

ఓ దేవీ! పావని అయిన నిన్ను ప్రత్యక్షంగా దర్శించేవారికి విద్య, అవిద్య ప్రకాశింప బడి. ముక్తి వస్తుందనుట నిశ్చయం.

**యే స్తువంతి జగన్మాతర్భవానీ అంబికేతి చ ।**
**జగన్మయీతి దుర్గేతి సర్వం తేషాం భవిష్యతి ॥34॥**

ఓ జగన్మాతా! నిన్నెవరైతే భవానీ! అంబికా! జగన్మాతా! దుర్గా! అని స్తుతిస్తారో వారికి అన్నీ సిద్ధిస్తాయి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**ఇతి స్తుతా జగన్మాతా శివా దక్షేణ ధీమతా ।**
**తథోవాచ తదా దక్షం యథా మాతా శృణోతి న ॥35॥**

బుద్ధిశాలి అయిన దక్షుడు ఇలా ప్రార్థించగా జగన్మాత అయిన ఉమ తల్లికి వినబడని విధంగా దక్షునితో ఇలా మాట్లాడింది.

**సర్వం సంమోహ్య తథ్యం చ తథా దక్షశ్శృణోతు తత్ ।**
**నాన్యస్తథా శివా ప్రాహ నానోతిః పరమేశ్వరీ ॥36॥**

దక్షునిచే స్తుతింపబడిన పరమేశ్వరి వారినందరినీ మోహింపజేసి దక్షుడు తప్పఎవ్వరూ వినకుండా జగత్తును రక్షించే శివాదేవి ఇలా పలికింది.

**దేవ్యువాచ** - దేవి పలికింది.

**అహమారాధితా పూర్వం సుతార్థం తే ప్రజాపతే ।**
**ఈప్సితం తవ సిద్ధం తు తపో ధారయ సంప్రతి ॥37॥**

ఓ ప్రజాపతీ! నీవు పూర్వం నన్ను కుమార్తెగా కావాలని ఆరాధించావు. నీ కోరిక నెరవేరింది. ఇపుడు నీవు తపస్సును కొనసాగించుము.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**ఏవముక్త్వా తదా దేవీ దక్షం చ నిజమాయయా ।**
**ఆస్థాయ శైశవం భావం జనన్యంతే రురోద సా ॥38॥**

ఆ దేవి దక్షునితో అలా మాట్లాడి తన మాయచే మరలా శిశుభావం పొంది తల్లి దగ్గర ఏడ్చింది.

**అథ తద్రోదనం శ్రుత్వా స్త్రియో వాక్యం ససంభ్రమాః ।**
**ఆగతాస్తత్ర సుప్రీత్యా దాస్యోఽపి చ ససంభ్రమాః ॥39॥**

అప్పుడామె ఏడుపువిని అంతఃపుర స్త్రీలూ, దాసీజనమూ, సంతోషంగా తొందరతొందరగా దగ్గరకు వచ్చారు.

**దృష్ట్వాసిక్నీ సుతారూపం ననందుస్సర్వయోషితః ।**
**సర్వే పౌరజనాశ్చాపి చక్రుర్జయరవం తదా ॥40॥**

అసిక్ని మరియు ఇతర స్త్రీలు అందరూ ఆ శిశువు రూపాన్ని చూసి ఆనందించారు. పౌరులందరూ కూడా జయజయధ్వానాలు చేశారు.

**ఉత్సవశ్చ మహానాసీద్గానవాద్యపురస్సరమ్ ।**
**దక్షోఽసిక్నీ ముదం లేభే శుభం దృష్ట్వా సుతాననమ్ ॥41॥**

పాటలతోను, వాద్యాలతోను గొప్ప ఉత్సవం జరిగింది. కుమార్తె యొక్క మంగళరూపాన్ని చూసి దక్షుడూ, అసిక్నీ చాలా ఆనందించారు.

**దక్షః శ్రుతికులాచారం చక్రే చ విధివత్తదా ।**
**దానం దదౌ ద్విజాతిభ్యోఽన్యేభ్యశ్చ ద్రవిణం తథా ॥42॥**

దక్షుడు యథావిధిగా వేదోక్తసంస్కారాలతోపాటు కులాచారాలను నెరవేర్చి బ్రాహ్మణులందరికీ ధనాన్ని దానం చేశాడు.

**బభూవ సర్వతో గానం నర్తనం చ యథోచితమ్ ।**
**నేదుర్వాద్యాని బహుశస్సుమంగలపురస్సరమ్ ॥43॥**

తగిన విధంగా అక్కడంతటా పాటా, ఆటా జరిగింది. మంగళవాద్యాల ధ్వనులు మిన్నుముట్టాయి. ఎక్కువగా మ్రోగించారు.

**అథ హర్యాదయో దేవాస్సర్వే సానుచరాస్తదా ।**
**మునిబృందైస్సమాగత్యోత్సవం చక్రుర్యథా విధి ॥44॥**

విష్ణువు మొదలైన అందరు దేవతలు మునులసమూహాలతో కలిసి వచ్చి యథావిధిగా గొప్ప ఉత్సవం నిర్వహించారు.

**దృష్ట్వా దక్షసుతామంబాం జగతః పరమేశ్వరీమ్ ।**
**నేముస్సవినయాస్సర్వే తుష్టువుశ్చ శుభైఃస్తవైః ॥45॥**

జగత్తుకు పరమేశ్వరియైన దక్షసుతను చూసి అందరూ సంతోషంతో సవినయంగా స్తుతించారు.

**ఊచుస్సర్వే ప్రముదితా గిరం జయజయాత్మకామ్ ।**
**ప్రశశంసుర్ముదా దక్షం వీరిణీం చ విశేషతః ॥46॥**

వారందరూ మిక్కిలి ఆనందించి జయ జయ శబ్దాలు పలికి ప్రీతితో దక్షుని, వీరిణిని ప్రశంసించారు.

**తదోమేతి నామ చక్రే తస్యా దక్షస్తదాజ్ఞయా ।**
**ప్రశస్తాయాస్సర్వగుణసత్త్వాదపి ముదాన్వితః ॥47॥**

అపుడు దక్షుడు ఆమెకు మునుల సూచనప్రకారం “ఉమ” అని పేరు పెట్టాడు. ఆమెకున్న అన్ని సుగుణాలు చూసి, దక్షుడు చాలా ఆనందించాడు.

**నామాన్యన్యాని తస్యాస్తు పశ్చాజ్జ్ఞాతాని లోకతః ।**
**మహామంగలదాన్యేవ దుఃఖఘ్నాని విశేషతః ॥48॥**

తర్వాత ఆమెకు లోకంలో ఇతరనామాలు కలిగాయి. ఆ నామాలన్నీ మహామంగళాలను ఇచ్చేవే. ఆ నామాలు విశేషించి దుఃఖాలను పోగొడతాయి.

**దక్షస్తదా హరిం నత్వా మాం సర్వానమరానపి ।**
**మునీనపి కరౌ బద్ధ్వా స్తుత్వా చానర్చ భక్తితః ॥49॥**

అపుడు దక్షుడు విష్ణువునకూ, నాకూ, దేవతలకందరకూ, మునులకు చేతులు జోడించి నమస్కరించి, స్తుతించి భక్తితో ఆరాధించాడు.

**అథ విష్ణ్వాదయస్సర్వే సుప్రశస్యాజనందనమ్ ।**
**ప్రీత్యా యయుస్స్వధామాని సంస్మరన్ సశివం శివమ్ ॥50॥**

అపుడు విష్ణువు మొదలగు దేవతలందరూ బ్రహ్మకుమారుడైన దక్షుని ప్రశంసించి, ఆనందంతో ఉమామహేశ్వరులను స్మరించుకుంటూ తమ తమ చోటులకు వెళ్లారు.

**అతస్తాం చ సుతాం మాతా సుసంస్కృత్య యథోచితమ్ ।**
**శిశుపానేన విధినా తస్యైస్తన్యాదికం దదౌ ॥51॥**

అపుడు తల్లి ఆ శిశువును యథాయోగ్యంగా సంస్కరించి, ఆమెకు పాలిచ్చి లాలించింది.

**పాలితా సాథ వీరిణ్యా దక్షేణ చ మహాత్మనా ।**
**వవృధే శుక్లపక్షస్య యథా శశికలాన్వహమ్ ॥52॥**

మహాత్ముడైన దక్షుడు మరియు వీరిణి ఆమెను పెంచుతున్నారు. ఆమె శుక్లపక్షంలోని చంద్రరేఖ వలె రోజురోజుకి ఎదుగుతోంది.

**తస్యాం తు సద్గుణాస్సర్వే వివిశుర్ద్విజసత్తమ ।**
**శైశవేఽపి యథా చంద్రే కలాస్సర్వా మనోహరాః ॥53॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! చంద్రునిలో రోజున కళ ప్రవేశించినట్లు బాల్యంలోనే మంచిగుణాలన్నీ ఆమెలో ప్రవేశించాయి.

**ఆచరన్నిజభావేన సఖీమధ్యగతా యదా ।**
**తదా లిలేఖ భర్గస్య ప్రతిమామన్వహం ముహుః ॥ 54॥**

ఆమె సఖుల మధ్య ఉన్నపుడు తన మనసులోని భావాలకు అనుగుణంగా ప్రతిరోజూ అనేకసార్లు శివుని చిత్రాలను గీసి ఆనందించేది.

**యదా జగౌ సుగీతాని శివా బాల్యోచితాని సా ।**
**తదా స్థాణుం హరం రుద్రం సస్మార స్మరశాసనమ్ ॥55॥**

ఆమె బాల్యానికి తగ్గట్లుగా తగిన పాటలు పాడుతూ, స్థాణువు, హరుడు, రుద్రుడు, స్మరశాసనుడు (మన్మథుని నియంత్రించే వాడు) వంటి శివనామాలను స్మరించేది.

**వవృధేఽతీవ దంపత్యోః ప్రత్యహం కరుణాతులా ।**
**తస్యా బాల్యేఽపి భక్తాయాస్తయోర్నిత్యం ముహుర్ముహుః ॥56॥**

ఆమె బాల్యం నుండి శివభక్తురాలు కావడం చూసిన ఆ తల్లిదండ్రులకు ఆమెమీద సాటిలేని కరుణ కల్గుచుండగా ఆ బాలిక పెరిగి పెద్దదైంది.

**సర్వబాలగుణాక్రాంతాం సదా స్వాలయకారిణీమ్ ।**
**తోషయామాస పితరౌ నిత్యం నిత్యం ముహుర్ముహుః ॥57॥**

బాల్యగుణాలన్నింటితో కూడియుండి, గృహకర్మకుశలయైన ఆ సతి ప్రతిదినము ధ్యానమునందు నిమగ్నురాలై, ఎల్లప్పుడూ తల్లిదండ్రులకు ఆనందం కలిగించింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే సతీజన్మబాలలీలా వర్ణనం నామ చతుర్దశోఽధ్యాయః ॥14॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో సతీజన్మం బాలలీవర్ణనం అనే పద్నాల్గవ అధ్యాయం సమాప్తం.

## **పంచదశోఽధ్యాయః** - పదిహేనవ అధ్యాయం

## **నందావ్రతవిధాన శివస్తుతివర్ణనమ్** - నందావ్రతవిధానం శివస్తుతి

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ పలికాడు.

**అథైకదా పితుః పార్శ్వే తిష్ఠంతీం తాం సతీమహమ్ ।**
**త్వయా సహ మునేఽద్రాక్షం సారభూతాం త్రిలోకకే ॥1॥**

ఓ మునీ! తర్వాత ఒకనాడు నేను నీతో కలసి తండ్రి ప్రక్కన నిలబడి ముల్లోకాలలో సారభూతయైన సతీదేవిని చూసాను.

**పిత్రా నమస్కృతం వీక్ష్య సత్కృతం త్వాం చ మాం సతీ ।**
**ప్రణనామ ముదా భక్త్యా లోకలీలానుసారిణీ ॥2॥**

తండ్రి (దక్షుడు) నీకు నాకు నమస్కారం చేసి సత్కరించటాన్ని చూసిన సతీదేవి ఆనందంతో లోకవిధానాన్ని అనుసరించి భక్తితో మనకు కూడా నమస్కరించింది.

**ప్రణామాంతే సతీం వీక్ష్య దక్షదత్తశుభాసనే ।**
**స్థితోఽహం నారద త్వం చ వినతామహమాగదమ్ ॥3॥**

ఓ నారదా! మనమిద్దరం దక్షుడు ఇచ్చిన శుభాసనాల మీద కూర్చున్నాము. అపుడు నమస్కారం చేసి వినయంగా నిలబడిన సతీదేవిని చూసి నేను ఇలా అన్నాను.

**త్వామేవ యః కామయతే యం తు కామయసే సతి ।**
**తమాప్నుహి పతిం దేవం సర్వజ్ఞం జగదీశ్వరమ్ ॥4॥**

ఓ సతీ! నిన్ను ఎవడు గాఢంగా ప్రేమిస్తున్నాడో, ఎవరిని నీవు ప్రేమిస్తున్నావో ఆ సర్వజ్ఞుడు, జగత్ప్రభువు అయిన దేవదేవుని భర్తగా పొందుతావు.

**యో నాన్యాం జగృహే నాపి గృహ్ణాతి న గ్రహీష్యతి ।**
**జాయాం స తే పతిర్భూయాదనన్యసదృశశ్శుభా ॥5॥**

ఏ ఈశ్వరుడు ఇతరస్త్రీని స్వీకరించ లేదో, స్వీకరించుట లేదో, భవిష్యత్తులో స్వీకరించడో, అతడు నీకు భర్త అగు గాక! ఓ శుభకరీ! నీ భర్తకు మరియొకరు సాటిలేరు.

**ఇత్యుక్త్వా సుచిరం తాం వై స్థిత్వా దక్షాలయే పునః ।**
**విసృష్టౌ తేన సంయాతౌ స్వస్థానం తౌ చ నారద ॥6॥**

నారదా! మనం ఇలా మాట్లాడి చాలాసేపు దక్షుని ఇంటిలో ఉండి తర్వాత దక్షుని అనుమతితో మన నివాసాలకు చేరుకున్నాము.

**దక్షోఽ భవచ్చ సుప్రీతస్తదాకర్ణ్య గతజ్వరః ।**
**ఆదదే తనయాం స్వాం తాం మత్వా హి పరమేశ్వరీమ్ ॥7॥**

ఆ మాటలు విన్న దక్షుడు సంతోషించాడు. అతని చింత తొలగిపోయింది. అతడు తన కుమార్తెను దగ్గరకు తీసుకున్నాడు. ఆమె పరమేశ్వరియని అతనికి తెలుసు.

**ఇత్థం విహారై రుచిరైః కౌమారైర్భక్తవత్సలా ।**
**జహావవస్థాం కౌమారీం స్వేచ్ఛాధృతనరాకృతిః ॥8॥**

తనయిష్టంప్రకారం మానవాకృతిని ధరించిన భక్తవత్సలయైన సతీదేవి ఈ తీరున బాల్యాన్ని అందమైన ఆటపాటలతో గడిపి, కాలక్రమంలో బాల్యావస్థను వీడి పెరిగి పెద్దదయ్యింది.

**బాల్యం వ్యతీత్య సా ప్రాప కించిద్యౌవనతాం సతీ ।**
**అతీవ తపసాంగేన సర్వాంగేషు మనోహరా ॥9॥**

ఆ సతీదేవి బాల్యాన్ని దాటి అప్పుడే యవ్వనంలో అడుగు పెట్టింది. ఆమె సర్వావయవసుందరి అయ్యింది. ఆమె సన్నని దేహంతో శోభిల్లింది.

**దక్షస్తాం వీక్ష్య లోకేశః ప్రోద్భిన్నాంతర్వయస్థితామ్ ।**
**చింతయామాస భర్గాయ కథం దాస్య ఇమాం సుతామ్ ॥10॥**

యవ్వనంలో అడుగుపెట్టిన ఆమెను చూసి, ఈమెను శివునికిచ్చి ఎలా వివాహం చేయాలా? అని దక్షప్రజాపతి ఆలోచించాడు.

**అథ సాపి స్వయం భర్గం ప్రాప్తుమైచ్ఛత్తదాన్వహమ్ ।**
**పితుర్మనోగతిం జ్ఞాత్వా మాతుర్నికటమాగమత్ ॥11॥**

ఆమె కూడా అదే కాలంలో శివుణ్ణి భర్తగా పొందాలని కోరుకొంది. ఆమె తండ్రి మనస్సు తెలుసుకొని, తల్లి దగ్గరకు వచ్చింది.

**పప్రచ్ఛాజ్ఞాం తపోహేతోశ్శంకరస్య వినీతధీః ।**
**మాతుశ్శివాథ వీరిణ్యాస్సా సతీ పరమేశ్వరీ ॥12॥**

పరమేశ్వరి అయిన సతీదేవి వినయంతో, శివుని కోసం తపస్సు చేయటానికి తల్లి వీరిణిని అనుమతిని కోరింది.

**తతస్సతీ మహేశానం పతిం ప్రాప్తుం దృఢవ్రతా ।**
**సా తమారాధామాయాస గృహే మాతురనుజ్ఞయా ॥13॥**

దృఢమైన దీక్ష గల సతీదేవి మహేశ్వరుని భర్తగా పొందటం కోసం తల్లి అనుమతిని పొంది ఇంట్లో శివుణ్ణి ఆరాధించింది.

**ఆశ్వినే మాసి నందాయాం తిథావానర్చ భక్తితః ।**
**గుడౌదనైస్సలవణైర్హరం నత్వా నినాయ తమ్ ॥14॥**

ఆమె ఆశ్వయుజమాసంలో పాడ్యమి, షష్ఠి, ఏకాదశి తిథులలో ఉప్పువేసిన బెల్లంపొంగలినీ నైవేద్యం పెట్టి శివుణ్ణి భక్తితో పూజించింది.

**కార్తికస్య చతుర్దశ్యామపూపైః పాయసైరపి ।**
**సమాకీర్ణైస్సమారాధ్య సస్మార పరమేశ్వరమ్ ॥15॥**

కార్తికచతుర్దశి నాడు అప్పాలను, పాయసాన్ని నైవేద్యం పెట్టి పరమేశ్వరుణ్ణి భక్తితో ఆరాధించి ధ్యానం చేసింది.

**మార్గశీర్షేఽసితాష్టమ్యాం సలిలైస్స యవౌదనైః ।**
**పూజయిత్వా హరం క్షీరైర్నినాయ దివసాన్ సతీ ॥16॥**

మార్గశిరకృష్ణాష్టమినాడు నీళ్లతో అభిషేకించి, యవధాన్యంతో అన్నం చేసి, నైవేద్యం పెట్టి, శివునికి పాలతో అభిషేకం చేసింది. ఈ విధంగా రోజులన్నీ గడిచాయి.

**పౌషే తు శుక్లసప్తమ్యాం కృత్వా జాగరణం నిశి ।**
**అపూజయచ్ఛివం ప్రాతః కృశరాన్నేన సా సతీ ॥17॥**

పుష్యశుక్లసప్తమి రోజున జాగరణ చేసి, ఉదయం పులగమును శివునికి నైవేద్యం పెట్టి పూజించింది.

**మాఘే తు పౌర్ణమాస్యాం సా కృత్వా జాగరణం నిశి ।**
**ఆర్ద్రవస్త్రా నదీతీరేఽకరోచ్ఛంకరపూజనమ్ ॥18॥**

ఆమె మాఘమాసం పూర్ణిమనాడు రాత్రియందు జాగరణ చేసి, తడిబట్టలతో నదీతీరంలో శంకరుని పూజించింది.

**తపస్య సితభూతాయాం కృత్వా జాగరణం నిశి ।**
**విశేషతస్సమానర్చ శైలూషైస్సర్వయామసు ॥19॥**

ఫాల్గుణకృష్ణచతుర్దశి రోజున జాగరణ చేసి, నాలుగుజాములలోనూ మారేడు పత్రాలతో విశేషపూజలు చేసింది.

**చైత్రే శుక్లచతుర్దశ్యాం పలాశైర్దమనైశ్శివమ్ ।**
**అపూజయద్దివారాత్రౌ సంస్మరన్ సా నినాయ తమ్ ॥20॥**

చైత్రశుక్లచతుర్దశి రోజున ఆమె రాత్రింబవళ్లు శివుణ్ణి మోదుగపుష్పాలతో పూజించి, మరియు దమనం అనే సుగంధ ఆకులతో పూజించింది. మరియు ఆ మాసమంతా రాత్రింబవళ్లు శివధ్యానంలో గడిపింది.

**రాధశుక్లతృతీయాయాం తిలాహారయవౌదనైః ।**
**పూజయిత్వా సతీ రుద్రం నవ్యైర్మాసం నినాయ తమ్ ॥21॥**

వైశాఖశుక్ల తదియనాడు సతీదేవి నువ్వుల ఆహారాన్ని. యవధాన్యంతో వండిన అన్నాన్ని నైవేద్యం పెట్టి రుద్రుని పూజించింది. ఆమె ఆ నెలంతా అలాగే ఆరాధించింది.

**జ్యేష్ఠస్య పూర్ణిమాయాం వై రాత్రౌ సంపూజ్య శంకరమ్ ।**
**వసనైర్బృహతీపుష్పైర్నిరాహారా నినాయ తమ్ ॥22॥**

జ్యేష్ఠపూర్ణిమనాడు రాత్రియందు శంకరుని కొత్తబట్టలతో మరియు బృహతీపుష్పాలతో పూజించి ఉపవాసం చేసింది. ఆ మాసమంతా ఆమె ఇలా ఆరాధనతో గడిపింది.

**ఆషాఢస్య చతుర్దశ్యాం శుక్లాయాం కృష్ణవాససా ।**
**బృహతీకుసుమైః పూజా రుద్రస్యాకారి వై తయా ॥23॥**

ఆమె ఆషాఢశుక్లచతుర్దశినాడు నల్లని బట్టలు ధరించి, బృహతీపుష్పాలతో రుద్రుని పూజించింది.

**శ్రావణస్య సితాష్టమ్యాం చతుర్దశ్యాం చ సా శివమ్ ।**
**యజ్ఞోపవీతైర్వాసోభిః పవిత్రైరప్యపూజయత్ ॥24॥**

శ్రావణశుద్ధ అష్టమి రోజున మరియు చతుర్దశినాడు ఆమె శివునికి యజ్ఞోపవీతాలనూ, పవిత్రమైన బట్టలనూ సమర్పించి పూజించింది.

**భాద్రే కృష్ణత్రయోదశ్యాం పుష్పైర్నానావిధైః ఫలైః ।**
**సంపూజ్య చ చతుర్దశ్యాం చకార జలభోజనమ్ ॥25॥**

ఆమె భాద్రపదకృష్ణత్రయోదశిరోజున అనేకవిధములైన పువ్వులతో, పండ్లతో శివుని పూజించి, నీళ్లను మాత్రమే తాగి ఉపవాసం చేసింది.

**నానావిధైః ఫలైః పుష్పైస్సస్యైస్తత్కాలసంభవైః ।**
**చక్రే సునియతాహారా జపన్మాసే శివార్చనమ్ ॥26॥**

ఆమె అన్ని మాసాలలోనూ గొప్ప ఆహారనియమాలు కలదై, ఆయా ఋతువులలో లభించే సస్యాలతో నైవేద్యం తయారు చేసింది. ఆయా ఋతువులలో లభించే పుష్పాలతో పూజించి, పండ్లను నైవేద్యం పెట్టి శివుని అర్చించి, మంత్రజపం చేసింది.

**సర్వమాసే సర్వదినే శివార్చనరతా సతీ ।**
**దృఢవ్రతాభవద్దేవీ స్వేచ్ఛాధృతనరాకృతిః ॥27॥**

తన కోరికతో మానవరూపం ధరించిన సతీదేవి అన్ని మాసములలోను ప్రతిరోజు దృఢదీక్షతో శివార్చనలో లగ్నమైంది.

**ఇత్థం నందావ్రతం కృత్స్నం సమాప్య సుసమాహితా ।**
**దధ్యౌ శివం సతీ ప్రేమ్ణా నిశ్చలాభూదనన్యధీః ॥28॥**

ఆ సతీదేవి మంచి శ్రద్ధతో నందావ్రతాన్ని ఈ విధంగా ముగించి, నిశ్చలమైన మనస్సుతో శివుని ప్రేమపూర్వకంగా ధ్యానించింది.

**ఏతస్మిన్నంతరే దేవా మునయశ్చాఖిలా మునే ।**
**విష్ణుం మాం చ పురస్కృత్య యయుర్ద్రష్టుం సతీతపః ॥29॥**

ఓ మహర్షీ! ఇంతలో దేవతలు, మహర్షులు, అందరు విష్ణువును, నన్ను ముందుంచుకొని, సతీదేవి యొక్క తపస్సును చూచుటకు బయలుదేరారు.

**దృష్ట్వాగత్య సతీదేవైర్మూర్తా సిద్ధిరివాపరా ।**
**శివధ్యానమహామగ్నా సిద్ధావస్థాం గతా తదా ॥30॥**

దేవతలు అక్కడకు వచ్చి మూర్తీభవించిన తపస్సిద్ధిలా ఉన్న, శివుని ధ్యానంలో పూర్తిగా నిమగ్నమైన తపస్సిద్ధిని పొందిన స్థితిలో ఉన్న సతీదేవిని చూశారు.

**చక్రుస్సర్వే సురాస్తస్త్యై ముదా సాంజలయో నతిమ్ ।**
**మునయశ్చ నతస్కంధా విష్ణ్వాద్యాః ప్రీతమానసాః ॥31॥**

దేవతలు, మునులు మరియు విష్ణువు ఆనందంతో తలలను వంచి దోసిలి పట్టి సతీదేవికి వంగి నమస్కరించారు.

**అథ సర్వే సుప్రసన్నా విష్ణ్వాద్యాశ్చ సురర్షయః ।**
**ప్రశశంసుస్తపస్తస్యాస్తత్యాస్తస్మాత్సవిస్మయాః ॥32॥**

అపుడు విష్ణువు, దేవతలు, మునులు చాలా ఆశ్చర్యం పొంది, సతీదేవి తపస్సును చూసి ప్రసన్నులై ఆమెను ప్రశంసించారు.

**తతః ప్రణమ్య తాం దేవీం పునస్తే మునయస్సురాః ।**
**జగ్ముర్గిరివరం సద్యః కైలాసం శివవల్లభమ్ ॥33॥**

ఆ దేవతలు, ఋషులు ఆ సతీదేవికి మరలా నమస్కరించి, వెంటనే శివుడికి ఇష్టమైన కైలాసపర్వతానికి బయలుదేరి వెళ్లారు.

**సావిత్రీసహితాశ్చాహం సహ లక్ష్మ్యా ముదాన్వితః ।**
**వాసుదేవోఽపి భగవాన్ జగామాథ హరాంతికమ్ ॥34॥**

సరస్వతితోకూడిన నేనూ, లక్ష్మీదేవితో కూడిన విష్ణువూ ఆనందిస్తూ శివుని సన్నిధికి వెళ్లాము.

**గత్వా తత్ర ప్రభుం దృష్ట్వా సుప్రణమ్య సుసంభ్రమాః ।**
**తుష్టువుర్వివిధైస్స్తోత్రైః కరౌ బద్ధ్వా వినమ్రకాః ॥35॥**

అక్కడకు వెళ్లి శివప్రభువును చూసి తొట్రుపాటుతో నమస్కారం చేసి, చేతులు జోడించి వివిధస్తోత్రాలతో సవినయంగా స్తుతించాము.

**దేవా ఊచుః** – దేవతలు పలికారు.

**నమో భగవతే తుభ్యం యత ఏతచ్చరాచరమ్ ।**
**పురుషాయ మహేశాయ పరేశాయ మహాత్మనే ॥36॥**

భగవంతుడు, పురుషుడు, మహేశ్వరుడు, సర్వేశ్వరుడు, పరమాత్ముడు అయిన నీకు నమస్కారం. ఈ చరాచరప్రపంచం నీ నుండి పుట్టింది.

**ఆదిబీజాయ సర్వేషాం చిద్రూపాయ పరాయ చ ।**
**బ్రహ్మణే నిర్వికారాయ ప్రకృతేః పురుషస్య చ ॥37॥**

అన్ని ప్రాణులకు ఆదికారణము, పరమాత్మస్వరూపము, ప్రకృతిపురుష వికారరహిత పరబ్రహ్మము అయిన నీకు నమస్కారము.

**య ఇదం ప్రతిపచ్యేదం యేనేదం విచకాస్తి హి ।**
**యస్మాదిదం యతశ్చేదం యస్యేదం త్వం చ యత్రతః ॥38॥**

**యోస్మాత్పరస్మాచ్చ పరో నిర్వికారీ మహాప్రభుః ।**
**ఈక్షతే యస్స్వాత్మనీదం తం నతాస్స్మ స్వయంభువమ్ ॥39॥**

ఎవడు ఈ జగత్ రూపంలో ఉన్నాడో, ఎవనిచే ఈ జగత్తు ప్రకాశిస్తుందో, ఎవడి నుండి పుట్టిందో, ఎందువల్ల ఉందో, ఎవనిదో ఎక్కడిదో అలాంటి పరమాత్మవు నువ్వు. మాకూ పరలోకాలకు అతీతుడూ, నిర్వికారుడూ, మహాప్రభువూ, ఎవనియందు ఇదంతా కనిపిస్తోందో స్వయంభువుడు అయిన అతనికి నమస్కారం.

**అవిద్ధదృక్ పరస్సాక్షీ సర్వాత్మాఽనేకరూపధృక్ ।**
**ఆత్మభూతః పరబ్రహ్మ తపంతం శరణం గతాః ॥40॥**

అమోఘమైన దృష్టి కలవాడు, పరమాత్మ, సాక్షి, సర్వాత్మ, అనేకరూపాలు ధరించేవాడు, అన్నింటికీ ఆత్మ అయినవాడూ, పరబ్రహ్మనూ గూర్చి, తపస్సు చేసేవాడూ అయిన నిన్ను శరణు వేడుతున్నాము.

**న యస్య దేవా ఋషయః సిద్ధాశ్చ న విదుః పదమ్ ।**
**కః పునర్జంతురపరో జ్ఞాతుమర్హతి వేదితుమ్ ॥41॥**

నీ పదమును దేవతలు, ఋషులు మరియు సిద్ధులు కూడా తెలియజాలరు. ఇతరప్రాణులలో నిన్ను ఎవరు ఎరుగగలరు?

**దిదృక్షవో యస్య పదం ముక్తసంగాస్సుసాధవః ।**
**చరితం సుగతిర్నస్త్వం సలోకవ్రతమవ్రణమ్ ॥42॥**

నీ పదాన్ని చూడాలనుకున్న మానవులు సంసారబంధాలను వీడి సాధువులు అవుతున్నారు. నీ చరితం మాకు మోక్షాన్నిస్తుంది. లోకాలన్నీ నీ నుండి వచ్చినా, నీవు వ్రణం (ఛిద్రం) లేనివాడివి.

**త్వజ్జన్మాది వికారా నో విద్యంతే కేఽపి దుఃఖదాః ।**
**తథాపి మాయయా త్వం హి గృహ్ణాసి కృపయా చ తాన్ ॥43॥**

నీకు దుఃఖాన్ని కల్గించే జన్మ మొదలైన వికారాలు లేవు. కాని నీవు మాయచే దయతో వాటిని తీసుకుంటున్నావు.

**తస్మై నమః పరేశాయ తుభ్యమాశ్చర్యకర్మణే ।**
**నమో గిరాం విదూరాయ బ్రహ్మణే పరమాత్మనే ॥44॥**

పరమేశ్వరుడూ, ఆశ్చర్యకరమైన కర్మలను చేయువాడూ, మాటలకు అందనివాడూ, పరబ్రహ్మమూ, పరమాత్మవూ అయిన నీకు నమస్కారం.

**అరూపాయోరురూపాయ పరాయానంతశక్తయే ।**
**త్రిలోకపతయే సర్వసాక్షిణే సర్వగాయ చ ॥45॥**

**నమ ఆత్మప్రదీపాయ నిర్వాణసుఖసంపదే ।**
**జ్ఞానాత్మనే నమస్తేఽస్తు వ్యాపకాయేశ్వరాయ చ ॥46॥**

రూపం లేనివాడు, గొప్పరూపం కలవాడు, పరుడూ అనంతశక్తి కలవాడు, మూడు లోకాలకు ప్రభువు, అన్నిటికీ సాక్షి భూతుడు సర్వాన్నీ వ్యాపించినవాడూ ఆత్మస్వరూపుడిగా ఉండి అన్నింటిని ప్రకాశింప చేసేవాడూ, మోక్షసుఖసంపద అయినవాడూ, జ్ఞానమే ఆత్మ ఐనవాడూ సర్వవ్యాపకుడూ, సర్వమునకు ప్రభువు అయిన నీకు నమస్కారమగును గాక

**నైష్కర్మ్యేణ సులభ్యాయ కైవల్యపతయే నమః ।**
**పురుషాయ పరేశాయ నమస్తే సర్వదాయ చ ॥47॥**

సర్వకర్మసన్యాసయోగంతో తేలికగా లభించేవాడూ, మోక్షాన్నిచ్చే ప్రభువూ, పురుషస్వరూపుడూ, సర్వేశ్వరుడు, సర్వమును ఇచ్చేవాడూ అయిన నీకు నమస్కారము.

**క్షేత్రజ్ఞాయాత్మరూపాయ సర్వప్రత్యయహేతవే ॥48॥**

**సర్వాధ్యక్షాయ మహతే మూలప్రకృతయే నమః ।**
**పురుషాయ పరేశాయ నమస్తే సర్వదాయ చ ॥49॥**

శరీరం నందు ఉండే సాక్షి, ఆత్మరూపుడు, మనోవృత్తులన్నింటికీ కారణమైనవాడు అన్నింటికీ అధ్యక్షుడూ, మహాత్ముడూ మూలప్రకృతిస్వరూపుడూ, పురుషుడూ, పరానికి ప్రభువు అన్నీ ఇచ్చేవాడూ అయిన పరమాత్మకు నమస్కారం.

**త్రినేత్రాయేషు వక్త్రాయ సదా భాసాయ తే నమః ।**
**సర్వేంద్రియగుణద్రష్టే నిష్కారణ నమోఽస్తు తే ॥50॥**

**త్రిలోకకారణాయాథాపవర్గాయ నమో నమః ।**
**అపవర్గప్రదాయాశు శరణాగతతారిణే ॥51॥**

మూడుకన్నులు కలవాడు, ముఖమునందు బాణం (అగ్ని) కలవాడూ, ఇంద్రియ గుణాలన్నింటికీ సాక్షీ, కారణం లేనివాడు అయిన నీకు నమస్కారం. ఎప్పుడూ ప్రకాశించేవాడూ మూడు లోకాలకు కారణమైన వాడు, మోక్షస్వరూపుడు, వెంటనే మోక్షాన్నిచ్చేవాడు, శరణు పొందిన వారిని రక్షించేవాడవూ అయిన నీకు నమస్కారం.

**సర్వామ్నాయాగమానాం చోదధయే పరమేష్ఠినే ।**
**పరాయణాయ భక్తానాం గుణానాం చ నమోఽస్తు తే ॥52॥**

అన్ని వేదశాస్త్రలకూ సముద్రం వంటివాడూ, పరమేష్ఠిస్వరూపుడు, భక్తులకు పొందదగిన ఉత్తమమైన స్థానం కలవాడు, సర్వసద్గుణ నిధివీ అయిన నీకు నమస్కారం.

**నమో గుణారణిచ్ఛన్నచిదూష్మాయ మహేశ్వర ।**
**మూఢదుష్ప్రాపరూపాయ జ్ఞాని హృద్వాసినే సదా ॥53॥**

సత్త్వరజస్తమోగుణాలు అనే అరణిచే దాచి ఉంచబడిన చిత్ఘనుడూ, మహేశ్వరుడూ, మూఢులచే పొందశక్యం కాని రూపం కలవాడూ, జ్ఞానుల హృదయాలలో నిత్యనివాసి అయిన శివా! నమస్కారం.

**పశుపాశవిమోక్షాయ భక్తసన్ముక్తిదాయ చ ।**
**స్వప్రకాశాయ నిత్యాయాఽవ్యయాయాజస్రసంవిదే ॥54॥**

**ప్రత్యగ్ద్రష్టేఽవికారాయ పరమైశ్వర్య ధారిణే ।**
**యం భజంతి చతుర్వర్గం కామయంతీష్టసద్గతిమ్ ॥55॥**

**సోఽభూదకరుణస్త్వం నః ప్రసన్నో భవ తే నమః ।**
**ఏకాంతినః కంచనార్థం భక్తా వాంఛంతి యస్య న ॥56॥**

జీవులకు బంధాన్ని తొలగించేవాడూ, భక్తులకు స్థిరమైన ముక్తిని ఇచ్చేవాడు, స్వయంగా ప్రకాశించేవాడూ, నిత్యుడూ, నాశనం లేని వాడూ, నిత్యజ్ఞానీ ప్రత్యగాత్మరూపంలో ఉండి అన్నింటిని చూసే వాడు, వికారాలు లేని వాడు, పరమైశ్వర్యమును ధరించినవాడూ ఎవర్నిసేవించి పురుషార్థాలు, ఇష్టమైన మార్గాన్నీ, కోరుతారో! నిన్ను సేవించే వారికి ధర్మార్థకామమోక్షాలు మరియు కోరుకున్న సద్గతి లభింపజేస్తావు. అలాంటి నీవు మాయందు

దయను వీడినావు. మాకు ప్రసన్నుడవు కావాలి. నీకు నమస్కారం. నీ ఏకాంతభక్తులు ఏ వస్తువులనూ కోరుకోరు.

**కేవలం చరితం తే తే గాయంతి పరమంగలమ్ ।**
**అక్షరం పరమం బ్రహ్మతమవ్యక్తాకృతిం విభుమ్ ॥57॥**

**అధ్యాత్మయోగగమ్యం త్వాం పరిపూర్ణం స్తుమో వయమ్ ।**
**అతీంద్రియమనాధారం సర్వాధారమహేతుకమ్ ॥ 58॥**

వాళ్లు పరమమంగళప్రదమైన నీ చరిత్ర మాత్రమే గానం చేస్తూ ఉంటారు. అక్షరపరబ్రహ్మ, అవ్యక్తస్వరూపుడు, సర్వవ్యాపి, ఆధ్యాత్మయోగముచే పొందబడేవాడు, పరిపూర్ణుడు, ఇంద్రియాలకు కనిపించనివాడు, ఆధారం లేనివాడు, అన్నింటికి ఆధారమైనవాడు, కారణము లేనివాడు అయిన నిన్ను మేము స్తుతిస్తున్నాము. అనంతుడు, ఆద్యుడు, ఇంద్రియాలకు కనిపించేవాడు, సర్వేశ్వరుడు అయిన నీకు ప్రణమిల్లుతున్నాము.

**హర్యాదయోఽఖిలా దేవాస్తథా లోకాశ్చరాచరాః ।**
**నామ రూపవిభేదేన ఫల్గ్వా చ కలయా కృతాః ॥59॥**

విష్ణువు మొదలైన సమస్తదేవతలను, లోకాలను, చరాచరజగత్తును నువ్వు నామరూపభేదం కలిగేలా అల్పప్రయత్నంతో నిర్మించావు.

**యథార్చిషోగ్నేస్సవితుర్యాంతి నిర్యాంతి వాసకృత్ ।**
**గభస్తయస్తథాయం వై ప్రవాహో గౌణ ఉచ్యతే ॥60॥**

అగ్నినుంచి విస్ఫులింగాల వలె, సూర్యుని నుండి కిరణాల వలె ఈ త్రిగుణప్రవాహరూపమైన జగత్తు నీ నుండి పుట్టి మరల నీలో లీనమౌతోంది.

**న త్వం దేవోఽసురో మర్త్యో న తిర్యఙ్ న ద్విజః ప్రభో ।**
**న స్త్రీ న షండో న పుమాన్ సదసన్న చ కించన ॥61॥**

ఓ ప్రభూ! నీవు దేవతవు కాదు. రాక్షసుడవు కాదు. మానవుడవు కాదు. పశువు కాదు. పక్షివి కాదు. నీవు స్త్రీ కాదు. నపుంసకుడవు కాదు. పురుషుడవు కాదు. సత్తువు కాదు. అసత్తువు కాదు. ద్రవ్యం కాదు.

**నిషేధశేషస్సర్వం త్వం విశ్వకృద్విశ్వపాలకః ।**
**విశ్వలయకృద్విశ్వాత్మా ప్రణతాస్స్మస్తమీశ్వరమ్ ॥62॥**

అన్నింటిని నిషేధించాక మిగిలే అద్వైతతత్త్వమే నీవు. విశ్వాన్ని నిర్మించి, పాలించి, లయాన్ని చేసే విశ్వస్వరూపుడవు నీవే. సర్వేశ్వరుడవగు నీకు ప్రణమిల్లుతున్నాము.

**యోగరంధితకర్మాణో యం ప్రపశ్యంతి యోగినః ।**
**యోగసంభావితే చిత్తే యోగేశం త్వాం నతా వయమ్ ॥63॥**

యోగులు, యోగముచే శుద్ధమైన కర్మలు కలవారై, యోగముచే నిర్మలమైన చిత్తముతో యోగీశ్వరుడవైన నిన్ను దర్శిస్తారు. అటువంటి నీకు మేము నమస్కరిస్తున్నాము.

**నమోఽస్తు తేఽసహ్యవేగ శక్తిత్రయ త్రయీమయ ।**
**నమః ప్రపన్నపాలాయ నమస్తే భూరిశక్తయే ॥64॥**

నీ వేగం సహింపరానిది. ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తులు, ఋగ్యజుసామవేదములు నీ స్వరూపమే. శరణు కోరిన వారిని రక్షించు వాడూ, అనంతశక్తిమంతుడూ అయిన నీకు నమస్కారం.

**కదింద్రియాణాం దుర్గేశానవాప్య పరవర్త్మనే ।**
**భక్తోద్ధారరతాయాథ నమస్తే గూఢవర్చసే ॥65॥**

ఉమాపతీ! ఇంద్రియనిగ్రహం లేని వారికి అధికారవ్యామోహంగలవారికి పొందశక్యం కాని జ్ఞానమార్గం నీది. భక్తులను ఉద్ధరించుటలో ఇష్టం గల నీకు నమస్కారం. నీ ప్రకాశం నిగూఢంగా ఉంటుంది.

**యచ్ఛక్త్యాహం ధియాత్మానం హతం వేద న మూఢధీః ।**
**తం దురత్యయమాహాత్మ్యం త్వాం నతః స్మో మహాప్రభుమ్ ॥66॥**

నీ మాయాశక్తిచే నేను మోహాన్ని పొంది, మూర్ఖుడనై నీ మహిమను, మా అసమర్థతను తెలుసుకోలేక పోయాము. నీ మహిమ అపారం. మహాప్రభువైన నీకు మేము నమస్కరిస్తున్నాము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**ఇతి స్తుత్వా మహాదేవం సర్వే విష్ణ్వాదికాస్సురాః ।**
**తూష్ణీమాసన్ ప్రభోరగ్రే సద్భక్తినతకంధరాః ॥67॥**

విష్ణ్వాది దేవతలందరూ మహాదేవుణ్ణి ఈ విధంగా స్తుతించి, ఆ ప్రభువు ఎదుట మంచి భక్తితో సాష్టాంగ ప్రణామమును చేసి మిన్నకుండిపోయారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే నందావ్రతవిధాన శివస్తుతివర్ణనం నామ పంచదశోఽధ్యాయః ॥15॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో నందావ్రత విధానం, శివస్తుతి అనే పదిహేనవ అధ్యాయం సమాప్తం.

## షోడశోఽధ్యాయః - పదహారవ అధ్యాయం

## విష్ణుబ్రహ్మకృత శివప్రార్థనావర్ణనమ్ - విష్ణుబ్రహ్మకృత శివప్రార్థనావర్ణనం

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇతిస్తుతిం చ హర్యాదికృతమాకర్ణ్య శంకరః ।**
**బభూవాతిప్రసన్నో హి విజహాస చ సూతికృత్ ॥1॥**

శ్రీమహావిష్ణువు మున్నగు దేవతలు చేసిన ఈ స్తుతిని విని శంకరుడు మిక్కిలి ప్రసన్నుడై మందహాసాన్ని చేశాడు.

**బ్రహ్మవిష్ణూ తు దృష్ట్వా తౌ సస్త్రీకౌ సంగతౌ హరః ।**
**యథోచితం సమాభాష్య పప్రచ్ఛాగమనం తయోః ॥2॥**

తమతమ భార్యలతో వచ్చిన బ్రహ్మవిష్ణువులను చూచి, హరుడు యథోచితంగా పలకరించి, వారి రాకకుగల కారణాన్నిగూర్చి అడిగాడు.

**రుద్ర ఉవాచ -** రుద్రుడు చెప్పాడు.

**హే హరే! హే విధే! దేవా మునయశ్చాద్య నిర్భయాః ।**
**నిజాగమనహేతుం హి కథయస్వ సుతత్త్వతః ॥3॥**

ఓ హరీ! ఓ బ్రహ్మా! ఓ దేవతలారా! మునులారా! మీరందరు ఈనాడు నిర్భయులై ఇక్కడకు రావడానికిగల కారణం యథార్థంగా నాకు చెప్పండి.

**కిమర్థమాగతా యూయం కిం కార్యం చేహ విద్యతే ।**
**తత్సర్వం శ్రోతుమిచ్ఛామి భవత్స్తుత్యా ప్రసన్నధీః ॥4॥**

మీరిక్కడకు ఎందుకు వచ్చారు. ఏపనిగూర్చి మీరు నాచెంతకు వచ్చారు. అదిఅంతయు మీ స్తోత్రంతో ప్రసన్నుడనైన నేను వినదలిచాను.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి పృష్టే హరేణాహం సర్వలోకపితామహః ।**
**మునేఽవోచం మహాదేవం విష్ణునా పరిచోదితః ॥5॥**

ఓ మహర్షీ! శివుడిట్లు ప్రశ్నించగా విష్ణువు నన్ను ప్రేరేపించాడు. సర్వలోక పితామహుడనైన నేను మహాదేవునితో ఇలా పలికాను.

**దేవదేవ! మహాదేవ! కరుణాసాగర! ప్రభో! ।**
**యథార్థమాగతావావాం తచ్ఛృణు త్వం సురర్షిభిః ॥6॥**

"ఓ దేవదేవా! మహాదేవా! కరుణాసాగరా! ప్రభో! మేమిరువురం దేవతలతోను, ఋషులతోను కలసి ఇక్కడకు రావడానికిగల యథార్థమైన కారణాన్ని వినండి.

**విశేషతస్త్వైవార్థమాగతా వృషభధ్వజ! ।**
**సహార్థినస్సదాయోగ్యమన్యథా న జగద్భవేత్ ॥7॥**

ఓ వృషభధ్వజా! మేమిరువురము ప్రత్యేకించి నీకొరకు మాత్రమే వచ్చాము. మనము ముగ్గురము సహార్థులము. సృష్టి చక్రాన్ని నడిపించే ప్రయోజనసిద్ధికి మనము ముగ్గురము ఒకరికొకరు సహాయకులము. సహార్థులమైన మనమెల్లపుడు తగిన విధంగా పరస్పరసహయోగం పొందడం శ్రేష్ఠం. లేనిచో జగత్తునకు మనుగడ ఉండదు.

**కేచిద్భవిష్యంత్యసురా మమ వధ్యా మహేశ్వర ।**
**హరేర్వధ్యాస్తథా కేచిద్భవతశ్చాపి కేచన ॥8॥**

ఓ మహేశ్వరా! కొందరు రాక్షసులు నాచేతిలోను, కొందరు రాక్షసులు శ్రీహరి చేతిలోను, మరికొందరు నీచేతిలోను మరణించడానికి జన్మిస్తారు.

**కేచిత్త్వద్వీర్యజాతస్య తనయస్య మహాప్రభో! ।**
**మాయా వధ్యాః ప్రభో! కేచిద్భవిష్యంత్యసురాస్సదా ॥9॥**

ఓ మహాప్రభో! కొందరు నీనుండి జన్మించిన కుమారునిచే వధింపబడతారు. మరికొందరుమాత్రం విరళంగా మాయద్వారా హతమౌతారు.

**తవైవ కృపయా శంభోస్సురాణాం సుఖముత్తమమ్ ।**
**నాశయిత్వాఽసురాన్ ఘోరాఞ్ జగత్స్వాస్థ్యం సదాభయమ్ ॥10॥**

ఓ శంభో! నీ దయవలననే దేవతలకెల్లప్పుడు ఉత్తమమైన సుఖం ప్రాప్తిస్తుంది. మీరు దుష్టరాక్షసులను నాశనంచేసి, జగత్తునకు స్వస్థతను, అభయాన్ని ప్రదానం చేస్తున్నారు.

**యోగయుక్తే త్వయి సదా రాగద్వేషవివర్జితే ।**
**దయాపాత్రైకనిరతే న వధ్యా హ్యథవా తవ ॥11॥**

నీవిప్పుడు రాగద్వేషవర్జితుడవై, సదా యోగయుక్తుడవై, ఏరాక్షసుని సంహరించడం లేదు.

**ఆరాధితేషు తేష్వీశ కథం సృష్టిస్తథా స్థితిః ।**
**అతశ్చ భవితా యుక్తం నిత్యం నిత్యం వృషధ్వజ! ॥12॥**

ఓ ఈశ్వరా! వారిని ఈవిధంగా అనుగ్రహిస్తే సృష్టి స్థితులెట్లు కొనసాగుతాయి? కాబట్టి ఓ వృషభధ్వజా! నీవు నిత్యం సృష్టికార్యానికి సహకరించడమే యుక్తము.

**సృష్టిస్థిత్యంతకర్మాణి న కార్యాణి యదా తదా ।**
**శరీరభేదశ్చాస్మాకం మాయాయాశ్చ న యుజ్యతే ॥13॥**

మనము సృష్టి స్థితి లయ కర్మలను యథావిధిగా ఆచరింపనిచో మాయమతీయు మనం పొందిన భిన్నభిన్నరూపాలకు ఏవిధమైన ఉపయోగంగాని, ఔచిత్యంగాని ఉండదు.

**ఏకస్వరూపా హి వయం భిన్నాః కార్యస్య భేదతః ।**
**కార్యభేదో న సిద్ధశ్చేద్రూపభేదోఽప్రయోజనః ॥14॥**

వాస్తవానికి మనస్వరూపమొకటే. కాని కార్యభేదంచే మనము భిన్నరూపాలను పొందాము. ఈ కార్యభేదం సిద్ధింపనిచో ఈరూపభేదం నిష్ప్రయోజనమౌతుంది.

**ఏక ఏవ త్రిధా భిన్నః పరమాత్మా మహేశ్వరః ।**
**మాయాయాఃకారణాదేవ స్వతంత్రో లీలయా ప్రభుః ॥15॥**

ఒకే పరమాత్మయైన మహేశ్వరుడే మూడు రూపాలలో అభివ్యక్తమౌతున్నాడు. స్వతంత్రుడైన ఆ ప్రభువు తన మాయాశక్తిచే ఈ లీల నిర్వహిస్తున్నాడు.

**వామాఙ్గజో హరిస్తస్య దక్షిణాంగభవో హ్యహమ్ ।**
**శివస్య హృదయాజ్జాతస్త్వం హి పూర్ణతనుశ్శివః ॥16॥**

ఆయన ఎడమభాగంనుండి విష్ణువు, కుడిభాగంనుండి నేను ప్రకటితమయ్యాము. నీవు ఆ సదాశివుని హృదయంనుండి ఆవిర్భూతమైనందున సదాశివుని పరిపూర్ణరూపం నీవే.

**ఇత్థం వయం త్రిధా భూతాః ప్రభాభిన్నస్వరూపిణః ।**
**శివాశివసుతాస్తత్త్వం హృదా విద్ధి సనాతన ॥17॥**

ఈవిధంగా మనము అభిన్నులమైనప్పటికి మూడురూపాలలో ప్రకటితమయ్యాము. మనము ముగ్గురము భగవానుడైన సదాశివునకు, శివాదేవికి పుత్రులము. హే సదాశివా! నీవీసత్యాన్ని నీహృదయానుభవంద్వారా గ్రహించు.

**అహం విష్ణుశ్చ సస్త్రీకౌ సంజాతౌ కార్యహేతుతః ।**
**లోకకార్యకరౌ ప్రీత్యా తవ శాసనతః ప్రభో ॥18॥**

హేప్రభూ! నేను, విష్ణువు నీఆజ్ఞానుసారం భార్యాసహితులమై ప్రసన్నతాపూర్వకంగా లోకాలకు ప్రీతిని కలిగించడానికి సృష్టిస్థితికార్యాలను నిర్వహిస్తున్నాము.

**తస్మాద్విశ్వహితార్థాయ సురాణాం సుఖహేతవే ।**
**పరిగృహ్ణీష్వ భార్యార్థే రామామేకాం సుశోభనామ్ ॥19॥**

కావున విశ్వహితము కొరకును, దేవతలకు సుఖాన్ని కలిగించడానికి, నీవుకూడా శోభనాంగియైన స్త్రీని భార్యగా స్వీకరింపుము.

**అన్యచ్ఛృణు మహేశాన పూర్వవృత్తం స్మృతం మయా ।**
**యన్నౌ పురఃపురా ప్రోక్తం త్వయైవ శివరూపిణా ॥20॥**

ఓ మహేశ్వరా! ఇంతకుముందు జరిగిన వృత్తాంతమొకటి నాకు జ్ఞప్తికి వచ్చింది. వినుము. పూర్వకాలంలో సదాశివుని రూపంలో ఉండగా నీవు మాకు చెప్పినమాటలివే.

**మద్రూపం పరమం బ్రహ్మన్నీదృశం భవదంగతః ।**
**ప్రకటీ భవితా లోకే నామ్నా రుద్రః ప్రకీర్తితః ॥21॥**

ఓ బ్రహ్మ! ఇటువంటి నా శ్రేష్ఠరూపం నీదేహంనుండి ప్రకటితమై లోకంలో **"రుద్ర"** నామంతో ప్రసిద్ధిని పొందుతుంది.

**సృష్టికర్తాఽభవద్బ్రహ్మా హరిః పాలనకారకః ।**
**లయకారీ భవిష్యామి రుద్రరూపో గుణాకృతిః ॥22॥**

బ్రహ్మవైననీవు సృష్టికర్తవయ్యావు. శ్రీహరి జగత్పాలకుడయ్యాడు. నేను సగుణరుద్రరూపుడనై లయకారకుడనౌతాను.

**స్త్రియం వివాహ్య లోకస్య కరిష్యే కార్యముత్తమమ్ ।**
**ఇతి సంస్మృత్య స్వప్రోక్తం పూర్ణం కురు నిజం పణమ్ ॥23॥**

నేనొక స్త్రీని వివాహమాడి ఉత్తమమైన లోకకార్యాన్ని నిర్వహిస్తాను. నీవు చెప్పిన ఈ మాటలు జ్ఞప్తికి తెచ్చుకొని నీవు పూర్వమొనరించిన ప్రతిజ్ఞను పూర్తి చేయుము.

**నిదేశస్తవ చ స్వామిన్నహం సృష్టికరో హరిః ।**
**పాలకో లయహేతుస్త్వమావిర్భూతస్స్వయం శివః ॥24॥**

ఓ స్వామీ! నేను సృష్టి గావించాలని, విష్ణువు పరిపాలకుడు కాగలడని, లయకర్తగా స్వయంగా రుద్రరూపంలో నీవే ప్రకటితం కాగలవనేది నీనిర్దేశమే.

**త్వాం వినా న సమర్థౌ హి ఆవాం చ స్వస్వకర్మణి**
**లోకకార్యరతౌ తస్మాద్దైకాం గృహ్ణీష్వ కామినీమ్ ॥25॥**

మీరు లేకుండా మేమిరువురం మామా కార్యాలను నిర్వహించడానికి సమర్థులం కాదు. కావున లోకకార్యరతుడవైన నీవు ఒక స్త్రీని భార్యగా స్వీకరించుము.

**యథా పద్మాలయా విష్ణోస్సావిత్రీ చ యథా మమ ।**
**తథా సహచరీం శంభో కాంతాం గృహ్ణీష్వ సంప్రతి ॥26॥**

ఓ శంభో! విష్ణువు లక్ష్మీదేవిని, నేను సావిత్రిని, స్వీకరించిన విధంగానే నీకు తోడుగానుండే సుందరిని భార్యగా స్వీకరింపుము.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇతి శ్రుత్వా వచో మే హి బ్రహ్మణః పురతో హరేః ।**
**స మాం జగాద లోకేశః స్మేరాననముఖో హరః ॥27॥**

నాయీ మాటలను విని, లోకేశ్వరుడు చిరునవ్వుతో, శ్రీహరి ఎదుట నాతో ఇలా అన్నాడు.

**ఈశ్వర ఉవాచ** - ఈశ్వరుడు చెప్పాడు.

**హే బ్రహ్మన్ హే హరే మే హి యువాం ప్రియతరౌ సదా ।**
**దృష్ట్వా త్వాం చ మమానందో భవత్యతితరాం ఖలు ॥28॥**

ఓ బ్రహ్మా! ఓ హరీ! మీరిరువురు నాకెల్లప్పుడు అత్యంత ప్రీతిపాత్రులు. మిమ్ము చూచినప్పుడు నాకు పరమానందం కలుగుతుంది.

**యువాం సురవిశిష్టౌ హి త్రిభవస్వామినౌ కిల ।**
**కథనం వాం గరిష్ఠేతి భవకార్యరతాత్మనోః ॥29॥**

మీరిద్దరు దేవతలలో ప్రముఖులు. ముల్లోకాలకు ప్రభువులు. జగత్కార్యమునందు లగ్నమైన మనస్సుగల మీరు చెప్పినమాట చాల యోగ్యమైనది.

**ఉచితం న సురశ్రేష్ఠౌ వివాహకరణం మమ ।**
**తపోరతవిరక్తస్య సదా విదితయోగినః ॥30॥**

దేవతాశ్రేష్ఠులారా! నాకు వివాహం ఉచితంకాదు. నేను తపోనిష్ఠుడను, విరాగిని, సర్వదా యోగమార్గమునందుండువాడను.

**యో నివృత్తిసుమార్గస్థః స్వాత్మారామో నిరంజనః ।**
**అవధూతతనుర్జ్ఞానీ స్వద్రష్టా కామవర్జితః ॥31॥**

నేను పవిత్రమైన నివృత్తిమార్గంలోనివాడను. నేనెల్లప్పుడు నిర్వికారంగా నాయందు నేను రమిస్తూ ఉంటాను. జ్ఞానినైన నారూపం అవధూతను పోలియుంటుంది. నేను కామవర్జితుడను. ఆత్మావలోకనపరుడను.

**అవికారీ హ్యభోగీ చ సదాఽశుచిరమంగళః ।**
**తస్య ప్రయోజనం లోకే కామిన్యా కిం వదాధునా ॥32॥**

నేను వికారములు లేనివాడను. భోగవర్జితుడను. నేను సర్వదా అమంగళకరమైన, అశుభ్రమైన వేషాన్ని ధరించేవాడను. అట్టి నాకిపుడు ఈలోకంలో భార్యతో ఏమిప్రయోజనం కలదో చెప్పుము.

**కేవలం యోగలగ్నస్య మమానందస్సదాస్తి వై ।**
**జ్ఞానహీనస్తు పురుషో మనుతే బహు కామకమ్ ॥33॥**

ఎల్లప్పుడు యోగలగ్నుడనై యున్నందున మాత్రమే నాకు నిత్యానందం కలుగుతుంది. జ్ఞానహీనుడైన పురుషుడు మాత్రమే యోగాన్ని విడిచి భోగానికి అతిప్రాధాన్యతనిస్తాడు. అనేకకోర్కెలను మనస్సులో భావిస్తూ ఉంటాడు.

**వివాహకరణం లోకే విజ్ఞేయం పరబంధనమ్ ।**
**తస్మాత్తస్య రుచిర్నో మే సత్యం సత్యం వదామ్యహమ్ ॥34॥**

లోకంలో వివాహం చేసుకోవడం ఇతరుల బంధంలో చిక్కుకోవడమే. కాబట్టి నాకు వివాహంపై అభిరుచిలేదు. నేను ముమ్మాటికి సత్యాన్నే పలుకుతున్నాను.

**న స్వార్థే మే ప్రవృత్తి ర్హి సమ్యక్స్వార్థవిచింతనాత్ ।**
**తథాపి తత్కరిష్యామి భవదుక్తం జగద్ధితమ్ ॥35॥**

ఆత్మనిష్ఠుడను, సమ్యగ్దర్శననిష్ఠుడను అగు నా ప్రవృత్తి నాకొరకై ఉండదుగదా! అయినప్పటికి లోక కల్యాణం కొరకు మీరు చెప్పిన విధంగా చేస్తాను.

**మత్వా వచో గరిష్ఠం వా నియోక్తిపరిపూర్తయే ।**
**కరిష్యామి వివాహం వై భక్తవశ్యస్సదా హ్యహమ్ ॥36॥**

మీ మాటలపై గల గౌరవం వల్లగాని, నేను లోగడ మీకిచ్చిన మాటను నిలబెట్టుకోవడానికిగాని తప్పనిసరిగా వివాహం చేసుకుంటాను. నేనెల్లప్పుడు భక్తులకు వశుడనై ఉంటానుగదా!

**పరం తు యాదృశీం కాంతాం గ్రహిష్యామి తథా పణమ్ ।**
**తచ్ఛృణుష్వ హరే బ్రహ్మన్ యుక్తమేవ వచో మమ ॥37॥**

కాని నేను ఎటువంటి కన్యను, ఏయే షరతులపై వివాహమాడతానో చెబుతున్నాను. మీరిద్దరు జాగ్రత్తగా వినండి. ఓ బ్రహ్మా!, విష్ణూ! నేను యోగ్యమైన మాటమాత్రమే చెబుతున్నాను.

**యా మే తేజస్సమర్థా హి గ్రహీతుం స్యాద్విభాగశః ।**
**తాం నిదేశయ భార్యార్థే యోగినీం కామరూపిణీమ్ ॥38॥**

ఏ స్త్రీ నాతేజస్సును వివేకంతో ధరింప సమర్థురాలగునో, అట్టి యోగశక్తి గలట్టియు, ఇచ్చవచ్చిన రూపం ధరించగలట్టియు, స్త్రీని నాకు భార్యగా స్వీకరించడానికి చూపించండి.

**యోగయుక్తే మయి తథా యోగిన్యేవ భవిష్యతి ।**
**కామాసక్తే మయి తథా కామిన్యేవ భవిష్యతి ॥39॥**

నేను యోగాసక్తుడనైతే ఆమెకూడా యోగాసక్తురాలు కావాలి. నేను కామాసక్తుడనైతే ఆమెకూడా కామాసక్తురాలు కావాలి.

**యమక్షరం వేదవిదో నిగదంతి మనీషిణః ।**
**జ్యోతీరూపం శివం తే చ చింతయిష్యే సనాతనమ్ ॥40॥**

**తచ్చింతాయాం యదాసక్తో బ్రహ్మన్ గచ్ఛామి భావినీమ్ ।**
**తత్ర యా విఘ్నజననీ న భవిత్రీ హతాస్తు మే ॥41॥**

వేదవిదులైన విద్వాంసులు ఎవరిని నాశనం లేనివానిగాను, జ్యోతిస్వరూపునిగాను, సనాతనునిగాను, పరబ్రహ్మగాను, శివునిగాను కీర్తిస్తున్నారో అటువంటి సదాశివుని ధ్యానించని సమయంలో మాత్రమే నేనామెతో విహరిస్తాను. నాయీ ధ్యానానికి విఘ్నాన్ని కలిగిస్తే ఆమె నాచే నశింపజేయబడుతుంది.

**త్వం వా విష్ణురహం వాపి శివస్య బ్రహ్మరూపిణః ।**
**అంశభూతా మహాభాగా యోగ్యం తదనుచింతనమ్ ॥42॥**

నీవు, విష్ణువు, నేను, పరబ్రహ్మ స్వరూపుడైన సదాశివుని అంశభూతులము. కాబట్టి మనమెల్లప్పుడు సదాశివునియందే చింతకలిగియుండడం మనకు తగినది.

**తచ్చింతయా వినోద్వాహం స్థాస్యామి కమలాసన ।**
**తస్మాజ్జాయాం ప్రాదిశ త్వం మత్కర్మానుగతాం సదా ॥43॥**

ఓ పద్మసంభవా! ఆయనను స్మరిస్తూ నేను వివాహం లేకుండగానైనా ఉండగలను. కావున కర్మలలో నన్ను సదా అనుసరించి, ఉండగలిగే భార్యను నాకు నీవు చూపుము.

**తత్రాప్యేకం పణం మే త్వం వృణు బ్రహ్మంశ్చ మాం ప్రతి ।**
**అవిశ్వాసో మదుక్తే చేన్మయా త్యక్తా భవిష్యతి ॥44॥**

ఓ బ్రహ్మ! ఆ విషయంలో మరియొక షరతు కలదు. వినుము. ఆమె నామాటయందు విశ్వాసము కోల్పోయిననాడు నేనామెను పరిత్యజిస్తాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇతి తస్య వచశ్శ్రుత్వాహం స విష్ణుర్హరస్య చ ।**
**సస్మితం మోదితమనోఽవోచం చేతి వినమ్రకః ॥45॥**

శివుని ఈమాటలను విని, నేను మరియు విష్ణువు ఆనందించిన మనస్సు గలవారమై వినయంగా చిరునవ్వుతో ఇలా పలికాము.

**శృణునాథ! మహేశాన! మార్గితా యాదృశీ త్వయా ।**
**నివేదయామి సుప్రీత్యా తాం స్త్రియం తాదృశీం ప్రభో ॥46॥**

ప్రభో!, మహేశ్వరా! విను నీవెలాంటి స్త్రీని కోరుకున్నావో అదే శుభలక్షణాలు గల మంగళాంగిని నీకు నివేదించడానికి మేము చాలా సంతోషిస్తున్నాము.

**ఉమా సా భిన్నరూపేణ సంజాతా కార్యసాధినీ ।**
**సరస్వతీ తథా లక్ష్మీర్ద్విధా రూపా పురా ప్రభో ॥47॥**

ఓ ప్రభో! పూర్వం ఉమాదేవి లోకకార్యసిద్ధికై లక్ష్మి, సరస్వతి అనే రెండు రూపాలను ధరించింది.

**పాద్మా కాంతాఽభవద్విష్ణోస్తథా మమ సరస్వతీ ।**
**తృతీయరూపా సా నాభూల్లోకకార్యహితైషిణీ ॥48॥**

లక్ష్మి విష్ణువునకు, సరస్వతి నాకు అర్ధాంగి అయ్యింది. అప్పుడామె మూడవరూపాన్ని ధరించలేదు. కాని ఇప్పుడు ఆమె లోకహితైషిణియై అవతరించింది.

**దక్షస్య తనయా యాభూత్సతీ నామ్నా తు సా విభో ।**
**సైవేదృశీ భవేద్భార్యా భవేద్ధి హితకారిణీ ॥49॥**

ఓ ప్రభూ! ఆమె "సతి" అనుపేర దక్షుని కుమార్తెగా జన్మించింది. ఆమెయందు నీవు కోరిన లక్షణాలున్నాయి. ఆమె నీకు భార్యయై హితమును చేయగలదు.

**సా తపస్యతి దేవేశ త్వదర్థం హి దృఢవ్రతా ।**
**త్వాం పతిం ప్రాప్తుకామా వై మహాతేజోవతీ సతీ ॥50॥**

ఓ దేవేశా! దృఢవ్రతయగు ఆమె నీకొరకు తపస్సు చేస్తోంది. మహాతేజశ్శాలినియైన సతీదేవి నిన్ను భర్తగా పొందగోరుచున్నది.

**దాతుం గచ్ఛ వరం తస్యై కృపాం కురు మహేశ్వర ।**
**తాం వివాహయ సుప్రీత్యా వరం దత్త్వా చ తాదృశమ్ ॥51॥**

ఓ పరమేశ్వరా! నీవు దయచేసి ఆమెకు వరాన్ని ఇవ్వడానికి వేంచేయుము. ఆమె కోరిన వరాన్ని యిచ్చి, ఆమెను ప్రీతితో వివాహమాడుము.

**హరేర్మమ చ దేవానామియం వాఞ్ఛాస్తి శంకర ।**
**పరిపూరయ సద్దృష్ట్యా పశ్యామోత్సవమాదరాత్ ॥52॥**

ఓ శంకరా! ఇది విష్ణువు యొక్కయు, నాయొక్కయు మరియు దేవతలయొక్కయు అభీష్టము. నీవు కృపాదృష్టితో మా కోర్కెను పూర్తిచేయుము. వివాహమహోత్సవాన్ని మేమానందంతో తిలకిస్తాము.

**మంగళం పరమం భూయాత్త్రిలోకేషు సుఖావహమ్ ।**
**సర్వజ్వరో వినశ్యేద్వై సర్వేషాం నాత్ర సంశయః ॥53॥**

ఇది గొప్ప మంగళమై, ముల్లోకాలకు సుఖాన్ని ఈయగలదు. అందరికి అన్నిదుఃఖాలు నశిస్తాయనడంలో సందేహం లేదు.

**అథవాస్మద్వచశ్శేషే వదంతం మధుసూదనః ।**
**లీలాజాకృతిమీశానం భక్తవత్సలమచ్యుతః ॥54॥**

నేను చెప్పగా మిగిలిన మాటలను మధుసూదనుడైన అచ్యుతుడు లీలచే రుద్రాకృతిని దాల్చిన పరమశివుడవగు నీకు చెప్పగలడు. నీవు భక్తవత్సలుడవుగదా!.

**విష్ణురువాచ** - విష్ణువు చెప్పాడు.

**దేవదేవ! మహాదేవ! కరుణాకర! శంకర! ।**
**యదుక్తం బ్రహ్మణా సర్వం మదుక్తం తన్నసంశయః ॥55॥**

ఓ దేవదేవా! మహాదేవా! కరుణామూర్తీ! శంకరా! బ్రహ్మచెప్పిన మాటలన్నింటిని నేను చెప్పిన మాటలుగానే స్వీకరింపుము. ఇందులో సందేహము లేదు.

**తత్కురుష్వ మహేశాన! కృపాం కృత్వా మమోపరి ।**
**సనాథం కురు సద్దృష్ట్యా త్రిలోకం సువివాహ్య తామ్ ॥56॥**

ఓ మహేశ్వరా! నీవు నాపై దయయుంచి అట్లే చేయుము. ఆమెను వివాహమాడి, ముల్లోకాలను కృపాదృష్టితో సనాథులను చేయుము.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా భగవాన్ విష్ణుస్తూష్ణీమాస మునే సుధీః ।**
**తథా స్తుతిం విహస్యాహ స ప్రభుర్భక్తవత్సలః ॥57॥**

ఓ మహర్షీ! బుద్ధిశాలియైన విష్ణువిట్లు పలికి ఊరకుండెను. భక్తవత్సలుడైన శివప్రభువు నేను చేసిన స్తోత్రాన్ని విని, చిరునవ్వు నవ్వాడు.

**తతస్త్వావాం చ సంప్రాప్య చాజ్ఞాం సమునిభిస్సురైః ।**
**అగచ్ఛావస్వేష్టదేశం సస్త్రీకౌ పరహర్షితౌ ॥58॥**

అప్పుడు మేమిద్దరం భార్యలతోను, మునులతోను, దేవతలతోనుగూడి, శివాజ్ఞనుపొంది, మాకిష్టమైన స్థానాలకు మిక్కిలి ఆనందంతో చేరుకున్నాము.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే విష్ణుబ్రహ్మకృత శివప్రార్థనావర్ణనం నామ షోడశోఽధ్యాయః ॥16॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో విష్ణుబ్రహ్మకృత శివప్రార్థనావర్ణనం అనే పదహారవ అధ్యాయం సమాప్తం.

# సప్తదశోఽధ్యాయః - పదిహేడవ అధ్యాయం

## సతీవరలాభమ్ - సతీవరలాభం

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తాస్సర్వదేవైశ్చ కృతా శంభోర్నుతిః పరా ।**
**శివాచ్చ సా వరం ప్రాప్తా శృణు హ్యాదరతో మునే ॥1॥**

ఓ దేవర్షీ! ఈవిధంగా దేవతలు శివుని గొప్ప స్తోత్రాలతో స్తుతించారు. శివునినుండి సతీదేవి వరాన్ని పొందింది. ఈ వృత్తాంతం శ్రద్ధతో వినుము.

**అథో సతీ పునః శుక్లపక్షేఽష్టమ్యాముపోషితా ।**
**ఆశ్వినే మాసి సర్వేశం పూజయామాస భక్తితః ॥2॥**

అప్పుడు సతీదేవి ఆశ్వయుజ శుక్ల అష్టమినాడు మరలా ఉపవశించి, సర్వేశ్వరుని భక్తితో పూజించింది.

**ఇతి నందావ్రతే పూర్ణే నవమ్యాం దినభాగతః ।**
**తస్యాస్తు ధ్యానమగ్నాయాః ప్రత్యక్షమభవద్ధరః ॥3॥**

ఈ తీరున నందావ్రతం పూర్తిఅయ్యింది. నవమినాడు పగటి సమయంలో ఆమె ధ్యాన నిమగ్నురాలై యుండగా శివుడు ప్రత్యక్షమయ్యాడు.

**సర్వాంగసుందరో గౌరః పంచవక్త్రస్త్రిలోచనః ।**
**చంద్రభాలః ప్రసన్నాత్మా శితికంఠశ్చతుర్భుజః ॥4॥**

ఆయన సర్వాంగ సుందరుడు, గౌరవర్ణుడు, ఐదు మోములవాడు, ముక్కంటి, చంద్రశేఖరుడు, ప్రసన్నాత్ముడు, శితికంఠుడు, చతుర్భుజుడు,

**త్రిశూలబ్రహ్మకవరాభయధృగ్భస్మభాస్వరః ।**
**స్వర్ధున్యా విలసచ్ఛీర్ష స్సకలాఙ్గమనోహరః ॥5॥**

ఆయన త్రిశూలాన్ని, బ్రహ్మకపాలాన్నీ, వరముద్రను, అభయముద్రను, నాల్గుచేతులయందు ధరించియున్నాడు. ఆయన భస్మచే తెల్లగా ప్రకాశిస్తున్నాడు. ఆయన శిరస్సుపై మందాకిని విలసిల్లుతోంది. ఆయన సర్వాంగ సుందరుడు.

**మహాలావణ్యధామా చ కోటిచన్ద్రసమాననః ।**
**కోటిస్మరసమా కాంతి స్సర్వధా స్త్రీ ప్రియాకృతిః ॥6॥**

ఆయన లావణ్యానికి పెన్నిధి, కోటిచంద్రులతో సమానంగా ప్రకాశిస్తున్నాడు. కోటి మన్మథ సమాన కాంతితో వెలుగొందుతున్నాడు. ఆయన ఆకారం యువతులకన్నివిధములగా ప్రీతిపాత్రమై విరాజిల్లుతోంది.

**ప్రత్యక్షతో హరం వీక్ష్య సతీ సేదృగ్విధం ప్రభుమ్ ।**
**వవన్దే చరణౌ తస్య సులజ్జావనతాననా ॥7॥**

ఈవిధంగానున్న శివప్రభువును సతీదేవి ప్రత్యక్షంగా దర్శించి, సిగ్గుతో శిరము వంచి, ఆయన పాదాలకు నమస్కరించింది.

**అథ ప్రాహ మహాదేవస్సతీం సద్వ్రతధారిణీమ్ ।**
**తామిచ్ఛన్నపి భార్యార్థం తపశ్చర్యాఫలప్రదః ॥8॥**

అంతట మహాదేవుడు తపఃఫలంగా ఆమెను భార్యగా స్వీకరింపగోరి, మహావ్రతాన్ని అనుష్ఠిస్తున్న సతీదేవితో ఇలా పలికాడు.

**మహాదేవ ఉవాచ** - మహాదేవుడు చెప్పాడు.

**దక్షనందిని! ప్రీతోఽస్మి వ్రతేనానేన సువ్రతే ।**
**వరం వరయ సందాస్యే యత్తవాభిమతం భవేత్ ॥9॥**

"ఓ దక్షపుత్రీ! నీవ్రతానికి సంతోషించాను. నీకు వరాన్ని ప్రదానం చేస్తాను. నీకభీష్టమైన వరాన్ని కోరుకో" అన్నాడు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**జానన్నపీహ తద్భావం మహాదేవో జగత్పతిః ।**
**జగౌ వరం వృణీష్వేతి తద్వాక్యశ్రవణేచ్ఛయా ॥10॥**

జగత్పతియైన మహాదేవుడు ఆమె మనోగతాభిప్రాయాన్ని ఎరిగినప్పటికి, ఆమె కోమల కంఠస్వరాన్ని వినాలనే కోరికతో 'వరం కోరుకోమ'ని చెప్పాడు.

**సాపి త్రపావశాయుక్తా వక్తుం నో హృది యత్స్థితమ్ ।**
**శశాక సాత్వభీష్టం యత్తల్లజ్జాచ్ఛాదితం పునః ॥11॥**

కాని సతీదేవి లజ్జావశురాలై తన మనస్సులోనున్న భావాన్నికూడా స్పష్టంగా చెప్పలేకపోయింది. ఆమెకభీష్టమైన మనోరథాన్ని లజ్జ కప్పేసింది.

**ప్రేమమగ్నాఽభవత్సాతి శ్రుత్వా శివవచఃప్రియమ్ ।**
**తజ్జ్ఞాత్వా సుప్రసన్నోఽభూచ్ఛంకరో భక్తవత్సలః ॥12॥**

భక్తవత్సలుడైన శంకరుని ప్రియవచనం విని, సతీదేవి ప్రేమమగ్నురాలయ్యింది. ఈవిషయం తెలుసుకొని శంకరుడు మిక్కిలి ప్రసన్నుడయ్యాడు.

**వరం బ్రూహి వరం బ్రూహి ప్రాహేతి స పునర్ద్రుతమ్ ।**
**సతీభక్తివశశ్శంభురంతర్యామీ సతాం గతిః ॥13॥**

అంతర్యామి, సత్పురుషులకు శరణ్యుడునగు శంభుడు సతీదేవియొక్క భక్తికి వశుడై, వెంటనే "వరమునడుగుము, వరమునడుగుము" అని మరల మరల పలికాడు.

**అథ త్రపాం స్వాం సంధాయ ముదా ప్రాహ హరం సతీ ।**
**యథేష్టం దేహి వరద! వరమిత్యనివారకమ్ ॥14॥**

అంతట సతీదేవి తనలజ్జను తాను నియంత్రించుకొని, 'ఓ వరదా! నీ కిష్టమైన, అనివారకమైన వరాన్ని నాకు ప్రసాదించండి' అని శంకరుని కోరింది.

**తదా వాక్యస్యావసానమనవేక్ష్య వృషధ్వజః ।**
**భవ త్వం మమ భార్యేతి ప్రాహ తాం భక్తవత్సలః ॥15॥**

వెంటనే వృషభధ్వజుడు ఆమె వాక్యం పూర్తికాకుండానే 'నీవు నాభార్యవుకమ్ము' అన్నాడు.

**ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య సాభీష్ట ఫలభావనమ్ ।**
**తూష్ణీం తస్థౌ ప్రముదితా వరం ప్రాప్య మనోగతమ్ ॥16॥**

తన అభీష్టం నెరవేరినందులకు అతిశయించిన ఆనందంతో సతి మారు మాట్లాడలేకపోయింది.

**సకామస్య హరస్యాగ్రే స్థితా సా చారుహాసినీ ।**
**అకరోన్నిజభావాంశ్చ హావాన్కామవివర్ధనాన్ ॥17॥**

ప్రేమతో కూడియున్న శివుని ఎదుట నిలబడి, సుందరమైన చిరునవ్వుగల సతీదేవి శివుని కామాన్ని వృద్ధిపొందించే హావభావాలను ప్రకటించింది.

**తతో భావాన్సమాదాయ శృంగారాఖ్యో రసస్తదా ।**
**తయోశ్చిత్తే వివేశాశు కలా హావా యథోదితమ్ ॥18॥**

అపుడు భావాలతోగూడి, శృంగారరసం వెంటనే వారి హృదయాలలో ప్రవేశించింది. పైన తెలిపిన విధంగా హావభావాలు సుందరంగా ప్రకటితమయ్యాయి.

**తత్ప్రవేశాత్తు దేవర్షే! లోకలీలానుసారిణోః ।**
**కాప్యభిఖ్యా తయోరాసీచ్చిత్రా చన్ద్రమసోర్యథా ॥19॥**

ఓ దేవర్షీ! లోకలీలలననుకరించే వారిద్దరిలో శృంగారప్రవేశంవలన చిత్రాచంద్రమసులయందువలె వారిద్దరియందు వర్ణింపశక్యంగాని శోభ కన్పట్టింది.

**రేజే సతీ హరం ప్రాప్య స్నిగ్ధభిన్నాంజనప్రభా ।**
**చన్ద్రాభ్యాశేఽభ్రలేఖేవ స్ఫటికోజ్జ్వలవర్ష్మణః ॥20॥**

చిక్కని కాటుక కాంతిగల సతి స్ఫటికంవలె ప్రకాశించే దేహంగల శివుని సమీపంలో చంద్రుని ప్రక్కన మేఘపంక్తివలె భాసిల్లింది.

**అథ సా తమువాచేదం హరం దాక్షాయణీ ముహుః ।**
**సుప్రసన్నా కరౌ బద్ధ్వా నతకా భక్తవత్సలమ్ ॥21॥**

అంతట దాక్షాయణీదేవి మిక్కిలి ప్రసన్నురాలై వినయంతో చేతులు జోడించి, భక్తవత్సలుడైన శంకరునితో ఇలాచెప్పింది.

**సత్యువాచ** - సతీదేవి చెప్పింది.

**దేవదేవ! మహాదేవ! వివాహ విధినా ప్రభో ।**
**పితుర్మే గోచరీకృత్య మాం గృహాణ జగత్పతే ॥22॥**

"ఓ దేవదేవా! మహాదేవా! జగత్పతే! తల్లిదండ్రుల అనుమతితో వివాహవిధిపూర్వకంగా వివాహమాడి, నన్ను స్వీకరించండి." అంది.

**బహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏవం సతీవచః శ్రుత్వా మహేశో భక్తవత్సలః ।**
**తథాస్త్వితి వచః ప్రాహ నిరీక్ష్య ప్రేమతశ్చ తామ్ ॥23॥**

ఓ దేవర్షీ! సతీదేవి పల్కులను విని, భక్తవత్సలుడైన మహేశుడు ఆమెను ప్రేమతోచూచి, 'తథాస్తు (అట్లే అగుగాక!)' అని పలికాడు.

**దాక్షాయణ్యపి తం నత్వా శంభుం విజ్ఞాప్య భక్తితః ।**
**ప్రాప్తాజ్ఞా మాతురభ్యాశమగాన్మోహముదాన్వితా ॥24॥**

దాక్షాయణి భక్తితో శంభునికి నమస్కరించి, అతని అనుజ్ఞ పొంది మోహము సంతోషములతో కూడిన మనోహరమైననూ తనదైన శోభితో ప్రకాశించుచు తల్లిచెంతకు వెళ్లింది.

**హరోఽపి హిమవత్ప్రస్థం ప్రవిశ్య చ నిజాశ్రమమ్ ।**
**దాక్షాయణీ వియోగాద్వై కృచ్ఛ్రధ్యాన పరోఽభవత్ ॥25॥**

శివుడుకూడా హిమవత్పర్వత మైదానంలోని తన ఆశ్రమంలో ప్రవేశించి, దాక్షాయణీ వియోగంచే అతికష్టంతో ధ్యానం చేయడం మొదలుపెట్టాడు.

**సమాధాయ మనః శంభుర్లౌకికీం గతిమాశ్రితః ।**
**చింతయామాస దేవర్షే! మనసా మాం వృషధ్వజః ॥26॥**

వృషభధ్వజుడైన శంభుడు మనస్సును నియంత్రించుకున్నాడు. ఓ దేవర్షీ! ఆయన లౌకిక ప్రవృత్తినాశ్రయించి మనస్సులో నన్ను తలంచాడు.

**తత స్సంచిత్యమానో౽హం మహేశేన త్రిశూలినా ।**
**పురస్తాత్ప్రావిశం తూర్ణం హరసిద్ధిప్రచోదితః ॥27॥**

త్రిశూలి, మహేశ్వరుడునైన హరుడు నన్ను స్మరించగా ఆయనయొక్క సిద్ధిచే ప్రేరితుడనైన నేను ఆయనముందు వెంటనే నిలబడ్డాను.

**యత్రాసౌ హిమవత్ప్రస్థే తద్వియోగీ హరః స్థితః ।**
**సరస్వతీయుతస్తాత తత్రైవ సముపస్థితః ॥28॥**

వత్సా! శివుడు సతీవియోగంతో ఏ హిమవత్పర్వత మైదానంలో ఉన్నాడో నేను వెంటనే సరస్వతితోకూడి అచ్చటకు చేరుకున్నాను.

**సరస్వతీయుతం మాం చ దేవర్షే వీక్ష్య స ప్రభుః ।**
**ఉత్సుకః ప్రేమబద్ధశ్చ సత్యా శంభురువాచ హ ॥29॥**

ఓ దేవర్షీ! సతీదేవియందు దృఢమైన ప్రేమగల శంభుప్రభుడు ఉత్కంఠతో కూడియున్నాడు. సరస్వతితోకూడి వచ్చిన నన్నుచూచి ఆయన ఇలా అన్నాడు.

**శంభురువాచ –** శంభుడు చెప్పాడు.

**అహం బ్రహ్మన్ స్వార్థపరః పరిగ్రహకృతౌ చ యత్ ।**
**తదా స్వత్వమివ స్వార్థే ప్రతిభాతి మమాధునా ॥30॥**

హే బ్రహ్మన్! నేను సతిని వివాహమాడగోరి స్వార్థపరుడనయ్యాను. స్వార్థచింతనయే నాస్వభావమన్నట్లు, ప్రపంచమంతా స్వార్థంమీదే నడుస్తోందనట్లు నాకిప్పుడనిపిస్తోంది.

**అహమారాధితస్సత్యా దాక్షాయణ్యాథ భక్తితః ।**
**తస్యై వరో మయా దత్తో నందావ్రతప్రభావతః ॥31॥**

దాక్షాయణిచే నందావ్రతం ద్వారా భక్తితో ఆరాధింపబడ్డ నేను ఆమెకు వరాన్నిచ్చాను.

**భర్తా భవేతి చ తయా మత్తో బ్రహ్మన్ వరో వృతః ।**
**మమ భార్యా భవేత్యుక్తం మయా తుష్టేన సర్వథా ॥32॥**

హే బ్రహ్మన్! "నాకు భర్తవు కమ్ము" అని ఆమె వరాన్ని నానుండి కోరింది. నేను మిక్కిలి సంతోషించి, "నాభార్యవు కమ్ము" అన్నాను.

**అథావదత్తదా మాం సా సతీ దాక్షాయణీత్వితి ।**
**పితుర్మే గోచరీకృత్య మాం గృహాణ జగత్పతే ॥33॥**

అంతట దాక్షాయణి దీనిని తన తండ్రికెరిగించి, ఆయన అనుమతితో నన్ను స్వీకరింపుమని చెప్పింది.

**తదప్యంగీకృతం బ్రహ్మన్మయా తద్భక్తితుష్టితః ।**
**సా గతా భవనం మాతు రహమత్రాగతో విధే ॥34॥**

నేను దానికికూడా అంగీకరించగా ఆమె తన తల్లి మందిరానికి వెళ్లింది. నేనిచ్చటకు వచ్చాను.

**తస్మాత్త్వం గచ్ఛ భవనం దక్షస్య మమ శాసనాత్ ।**
**తాం దక్షోఽపి యథా కన్యాం దద్యాన్మేఽరం తథా వద ॥35॥**

కావున నీవు నా ఆజ్ఞచే దక్షుని గృహానికి వెళ్ళుము. దక్షుడు నాకాకన్యను వివాహంలో శీఘ్రంగా ఇచ్చే విధంగా నచ్చజెప్పుము.

**సతీ వియోగభంగస్స్యాద్యథా మే త్వం తథా కురు ।**
**సమాశ్వాసయ తం దక్షం సర్వవిద్యావిశారదః ॥36॥**

నాకు ఈ సతీవియోగంనుండి విముక్తి కలుగు ఉపాయమును అనుష్ఠింపుము. నీవన్నివిద్యలయందు దిట్టవు. ఆ దక్షుని ఒప్పింపుము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుదీర్య మహాదేవస్సకాశే మే ప్రజాపతేః ।**
**సరస్వతీం విలోక్యాశు వియోగవశగోఽభవత్ ॥37॥**

మహాదేవుడు ప్రజాపతినైన నాతో ఇలా మాట్లాడి, సరస్వతినిచూచి వెంటనే సతీవియోగానికి వశుడయ్యాడు.

**తేనాహమపి చాజ్ఞప్తః కృతకృత్యో ముదాన్వితః ।**
**ప్రావోచం చేతి జగతాం నాథం తం భక్తవత్సలమ్ ॥38॥**

శివుడీవిధంగా ఆజ్ఞాపించగా కృతకృత్యుడనై నేను మిక్కిలి సంతసించాను. భక్తవత్సలుడైన ఆ జగత్ప్రభువుతో ఇలా పలికాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**యదాత్థ భగవన్ శంభో తద్విచార్య సునిశ్చితమ్ ।**
**దేవానాం ముఖ్య స్స్వార్థో హి మమాపి వృషభధ్వజ ॥39॥**

హే భగవన్!, శంభో! నీవు చెప్పిన పలుకులను విచారణచేసి, యుక్తమేనని నేను నిశ్చయించుకున్నాను. హే వృషభధ్వజా! ఈ వివాహంలో ప్రధానంగా దేవతలకు, నాకూకూడా స్వార్థం కలదు.

**దక్షస్తుభ్యం సుతాం స్వాం చ స్వయమేవ ప్రదాస్యతి ।**
**అహం చాపి వదిష్యామి త్వద్వాక్యం తత్సమక్షతః ॥40॥**

దక్షుడు స్వయంగానే తనకుమార్తెను మీకు ప్రదానం చేస్తాడు. నేనుకూడా నీసందేశాన్ని దక్షునకు విన్నవిస్తాను.

**ఇత్యుదీర్య మహాదేవమహం సర్వేశ్వరం ప్రభుమ్ ।**
**అగమం దక్షనిలయం స్యందనేనాతివేగినా ॥41॥**

ఈవిధంగా నేను మహేశ్వరునితోచెప్పి, అత్యంత వేగవంతమైన రథంపై దక్షుని నివాసానికి వెళ్లాను.

**నారద ఉవాచ –** నారదుడు చెప్పాడు.

**విధే! ప్రాజ్ఞ! మహాభాగ! వద నో వదతాం వరః ।**
**సత్యై గృహాగతాయై స దక్షః కిమకరోత్తతః ॥42॥**

ఓ మహాభాగా! నీవు వక్తలలో శ్రేష్ఠుడవు. సతీదేవి తపస్సునుండి ఇంటికి తిరిగివచ్చిన తరువాత దక్షుడేమిచేశాడో తెలియజేయండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**తపస్తప్త్వా వరం ప్రాప్య మనోఽభిలషితం సతీ ।**
**గృహం గత్వా పితుర్మాతుః ప్రణామమకరోత్తదా ॥43॥**

తపస్సుచేసి మనోభిలషితవరాన్ని పొందిన సతి యింటికి వెళ్లి తల్లిదండ్రులకు నమస్కరించింది.

**మాత్రే పిత్రేఽథ తత్సర్వం సమాచఖ్యౌ మహేశ్వరాత్ ।**
**వరప్రాప్తిః స్వసఖ్యా వై సత్యాస్తుష్టస్తు భక్తితః ॥44॥**

సతీదేవియొక్క భక్తికి సంతసించి, మహేశ్వరుడు వరాన్నిచ్చిన వృత్తాంతాన్ని ఆమె తన సఖిచేత సమగ్రంగా తల్లిదండ్రులకు చెప్పించింది.

**మాతా పితా చ వృత్తాంతం సర్వం శ్రుత్వా సఖీముఖాత్ ।**
**ఆనందం పరమం లేభే చక్రే చ పరమోత్సవమ్ ॥45॥**

మహేశ్వరునినుండి సతీదేవి పొందిన వరాన్ని, సంతోషాన్ని గూర్చిన వృత్తాంతమంతా ఆమె తల్లిదండ్రులు చెలికత్తెలద్వారా విని, మిక్కిలి ఆనందాన్ని పొంది, మహోత్సవాన్ని జరిపించారు.

**ద్రవ్యం దదౌ ద్విజాతిభ్యో యథాభీష్ట ముదారధీః ।**
**అన్యేభ్యశ్చాంధ దీనేభ్యో వీరిణీ చ మహామనాః ॥46॥**

బ్రాహ్మణులకు, దీనులకు, అంధులకు, తదితరులకు కూడ వారు కోరిన ద్రవ్యాలను దానమిచ్చారు.

**వీరిణీ తాం సమాలింగ్య స్వసుతాం ప్రీతివర్ధినీమ్ ।**
**మూర్ధ్న్యుపాఘ్రాయ ముదితా ప్రశశంస ముహుర్ముహుః ॥47॥**

తల్లియైన వీరిణి ప్రీతివర్ధినియైన తన కుమార్తెను కౌగిలించుకుని, మూర్ధాన్నాఘ్రాణించి, అమితానందాన్ని పొంది, పలుమార్లు ప్రశంసించింది.

**అథ దక్షః కియత్కాలే వ్యతీతే ధర్మవిత్తమః ।**
**చింతయామాస దేయేయం స్వసుతాం శంభవే కథమ్ ॥48॥**

అనంతరం దక్షుడు తన కుమార్తెను శంభునకిచ్చి వివాహం చెయ్యడమెలా? అని ఆలోచింపసాగాడు.

**ఆగతోఽపి మహాదేవః ప్రసన్నస్స జగామ హ ।**
**పునరేవ కథం సోఽపి సుతార్థేఽత్రాగమిష్యతి ॥49॥**

మహాదేవుడు ప్రసన్నుడై ఇక్కడకు వచ్చాడుకాని తిరిగి వెళ్లిపోయాడు. అతడు నా పుత్రిక కొరకు మళ్లీ ఇక్కడకెలావస్తాడు?

**ప్రస్థాప్యోథ మయా కశ్చిచ్ఛంభోర్నికటమంజసా ।**
**నైతద్యోగ్యం నగృహ్ణీయాద్యద్యేవం విఫలార్థనా ॥50॥**

నాపుత్రిక నిమిత్తం నేనే పరమశివుని చెంతకు ఎవరినైనా పంపడంకూడా ఉచితంకాదు. ఎందుకనగా నేనీవిధంగా ప్రయత్నించినప్పటికి శివుడు నా పుత్రికను స్వీకరించకపోయినచో నా అభ్యర్థన నిష్ఫలమౌతుంది.

**అథవా పూజయిష్యామి తమేవ వృషభధ్వజమ్ ।**
**మదీయతనయా భక్త్యా స్వయమేవ యథా భవేత్ ॥51॥**

లేదా నేను ఆ వృషభధ్వజుని పూజిస్తాను. ఇట్టి భక్తిచే నాకుమార్తె స్వయంగానే ఆయనకు భార్యకాగలదు.

**తథైవ పూజితస్సోఽపి వాంఛత్యార్యప్రయత్నతః ।**
**శంభుర్భవతు మద్భర్తేత్యేవం దత్తవరేణ తత్ ॥52॥**

అట్లే ఆమెచే పూజింపబడిన శంభుడు తాను ఆమెకు భర్తకాగలనని వరమిచ్చియున్నాడు. ఆయనకూడా పెద్దలద్వారా వివాహప్రయత్నం చేయవచ్చునుగదా!

**ఇతి చింతయతస్తస్య దక్షస్య పురతోఽన్వహమ్ ।**
**ఉపస్థితోహం సహసా సరస్వత్యన్విత స్తదా ॥53॥**

ఈవిధంగా దక్షుడు చింతిస్తున్న సమయంలో నేను సరస్వతీ సహితుడనై అతని యెదుట సాక్షాత్కరించాను.

**మాం దృష్ట్వా పితరం దక్షః ప్రణమ్యావనతః స్థితః ।**
**ఆసనం చ దదౌ మహ్యం స్వభవాయ యథోచితమ్ ॥54॥**

తండ్రినైన నన్నుచూచి దక్షుడు వినయ పూర్వకంగా నమస్కరించి, నాకు సముచితాసనాన్నిచ్చాడు.

**తతో మాం సర్వలోకేశం తత్రాగమనకారణమ్ ।**
**దక్షః పప్రచ్ఛ స క్షిప్రం చింతావిష్టోఽపి హర్షితః ॥55॥**

చింతావిష్టుడైనప్పటికి నా రాకతో ఆనందించిన దక్షుడు నా రాకకుగల కారణాన్ని గూర్చి ప్రశ్నించాడు.

**దక్ష ఉవాచ –** దక్షుడు చెప్పాడు.

**తవాత్రాగమనే హేతుః కః ప్రవేశే స సృష్టికృత్ ।**
**మమోపరి సుప్రసాదం కృత్వాచక్ష్వ జగద్గురో ॥56॥**

హే జగద్గురో! సృష్టి కర్తవైన నీవు నాపై గొప్ప అనుగ్రహం గలవాడవై ఇక్కడకు వచ్చియున్నావు. నీ రాకకు కారణాన్ని చెప్పుము.

**పుత్రస్నేహాత్కార్యవశాదథవా లోకకారక ।**
**మమాశ్రమం సమాయాతో దృష్టస్య తవ దర్శనాత్ ॥57॥**

హే లోకకర్తా! నీవు నా ఆశ్రమానికి పుత్రప్రేమతో వచ్చితివా? లేక ఏదేని కార్యము కొరకై వచ్చితివా? నీదర్శనంచే నాకు ఆనందం కలిగింది.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి పృష్టస్స్వపుత్రేణ దక్షేణ మునిసత్తమ ।**
**విహసన్నబ్రువం వాక్యం మోదయంస్తం ప్రజాపతిమ్ ॥58॥**

నా కుమారుడైన దక్షప్రజాపతి నన్నిలా ప్రశ్నించాడు. ఓ మహర్షీ! నేను చిరునవ్వునవ్వి, అతనికి ఆనందాన్ని కలిగిస్తూ ఇలా పలికాను.

**శృణు దక్ష యదర్థం త్వత్సమీపమహమాగతః ।**
**త్వత్తోకస్య హితం మేఽపి భవతోఽపి తదీప్సితమ్ ॥59॥**

హే దక్షా! నేను నీవద్దకు వచ్చిన కారణం వినుము. నేను నీకుమార్తె హితాన్ని కోరుతున్నాను. నీకోరికకూడా అదియేగదా!

**తవపుత్రీ సమారాధ్య మహాదేవం జగత్పతిమ్ ।**
**యో వరః ప్రార్థితస్తస్య సమయోయముపాగతః ॥60॥**

నీ కుమార్తె శివుని ఆరాధించి ఒక వరం కోరియున్నది. దానికిపుడు సమయం ఆసన్నమైనది.

**శంభునా తవ పుత్ర్యర్థం త్వత్సకాశమహం ధ్రువమ్ ।**
**ప్రస్థాపితోఽస్మి యత్కృత్యం శ్రేయస్తదవధారయ ॥61॥**

శివుడు నన్ను నీవద్దకు పంపినాడు. ఆయన నీకుమార్తె కొరకు నన్ను పంపినాడు. నీకర్తవ్యాన్ని నీకు శ్రేయస్సు కలిగే విధాన్ని శ్రద్ధగా వినుము.

**వరం దత్వా గతో రుద్ర స్తావత్ప్రభృతి శంకరః ।**
**త్వత్సుతాయా వియోగేన న శర్మ లభతేంఽజసా ॥62॥**

శివుడు వరాన్ని ఇచ్చి వెళ్ళిననాటినుండియు నీకుమార్తెయొక్క వియోగంచే సుఖాన్ని పొందలేకున్నాడు.

**అలబ్ధచ్ఛిద్రమదనో జిగాయ గిరిశం న యమ్ ।**
**సర్వైః పుష్పమయై ర్బాణైర్యత్నం కృత్వాపి భూరిశః ॥63॥**

**స కామబాణావిద్ధో౽పి పరిత్యజ్యాత్మచింతనమ్ ।**
**సతీం విచింతయన్నాస్తే వ్యాకులః ప్రాకృతో యథా ॥64॥**

మన్మథుడు పుష్పబాణాలన్నిటితో పెద్ద ప్రయత్నం చేసినప్పటికి ఛిద్రం (దౌర్బల్యం) లభించకపోవడంచేత ఏశివుని జయింపలేకపోయినాడో ఆశివుడిప్పుడు కామ బాణాలచే కొట్టబడకపోయినప్పటికి, ఆత్మధ్యానాన్నివీడి, దుఃఖితుడై ప్రాకృత జనునివలె సతిని ధ్యానిస్తున్నాడు.

**విస్మృత్య ప్రశ్రుతాం వాణీం గణాగ్రే విప్రయోగతః ।**
**క్వ సతీత్యేవమభితో భాషతే నికృతావపి ॥65॥**

ఆయన వియోగదుఃఖితుడై గణాల ఎదుట ఆరంభించిన ప్రసంగాన్ని మరచి, "సతిఎక్కడ?" అనిపలికి నలువైపులా పరికిస్తున్నాడు. మరియు నిట్టూర్పులను విడుస్తున్నాడు.

**మయా యద్వాంఛితం పూర్వం త్వయా చ మదనేన చ ।**
**మరీచ్యాద్యైర్మునివరైస్తత్సిద్ధమధునా సుత ॥66॥**

కుమారా! పూర్వము నేను, నీవు, మన్మథుడు మరీచి మున్నగు మహర్షులు దేనిని కోరుకున్నారో అది ఇప్పుడు సిద్ధించింది.

**త్వత్పుత్ర్యారాధితశ్శంభుస్సో౽పి తస్యా విచింతనాత్ ।**
**అనుశోధయితుం ప్రేప్సుర్వర్తతే హిమవద్గిరౌ ॥67॥**

నీకుమార్తె శంభునారాధించింది. ఆయన ఆమెను ధ్యానిస్తూ ఆమెను పొందగోరి ఆమెకు అనుకూలుడై హిమవత్పర్వతమునందున్నాడు.

**యథా నానావిధైర్భావై స్సత్త్వాత్తేన వ్రతేన చ ।**
**శంభురారాధితస్తేన తథైవారాధ్యతే సతీ ॥68॥**

ఆమె నానావిధ భావాలతో సత్త్వగుణశీలియై, దృఢవ్రతంతో శంభుని ఏతీరున ఆరాధించిందో ఆయన ఆ సతిని ఆవిధంగానే ఆరాధిస్తున్నాడు.

**తస్మాత్తు దక్షతనయాం శంభ్వర్థం పరికల్పితామ్ ।**
**తస్మై దేహ్యవిలంబేన కృతా తే కృతకృత్యతా ॥69॥**

కావున శంభుని కొరకు శరీరాన్ని ధరించిన దాక్షాయణిని ఆయనకు సమర్పింపుము. విలంబము చేయవద్దు.ఆవిధంగాచేసి, నీవు కృతార్థుడవు కమ్ము.

**అహం తమానయిష్యామి నారదేన త్వదాలయమ్ ।**
**తస్మై త్వమేనాం సంయచ్ఛ తదర్థే పరికల్పితామ్ ॥70॥**

నేను నారదునిద్వారా ఆయనను నీ ఇంటికి రప్పిస్తాను. నీవు ఆయన కొరకు తనువుదాల్చిన ఈమెను ఆయనకు సమర్పింపుము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**శ్రుత్వా మమ వచశ్చేతి స మే పుత్రోఽతిహర్షితః ।**
**ఏవమేవేతి మాం దక్ష ఉవాచ పరిహర్షితః ॥71॥**

నాకుమారుడైన దక్షుడు నాయీ మాటలను విని, మిక్కిలి సంతసిల్లి "అటులనే అగుగాక!" అని నాతో పలికాడు.

**తతస్సోఽహం మునే తత్రాగమమత్యంతహర్షితః ।**
**ఉత్సుకో లోకనిరతో గిరిశో యత్ర సంస్థితః ॥72॥**

ఓ మహర్షీ! అపుడు లోకకార్యమునందు నిమగ్నుడనైన నేను ఉత్సాహంతో మిక్కిలి ఆనందంతో శివుదున్న స్థానానికి చేరాను.

**గతే నారద దక్షోఽపి సదారతనయో హ్యపి ।**
**అభవత్ పూర్ణకామస్తు పీయూషైరివ పూరితః ॥73॥**

ఓ నారదా! నేను వెళ్లగానే దక్షుడు భార్యతో, కుమార్తెతోగూడి, అమృతపానాన్ని తృప్తిగా చేసినవానివలె పూర్ణ మనోరథుడయ్యాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే సతీవరలాభో నామ సప్తదశోఽధ్యాయః ॥17॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో సతీవరలాభం అనే పదిహేడవ అధ్యాయం సమాప్తం.

## అష్టాదశోఽధ్యాయః - పద్దెనిమిదవ అధ్యాయం

## కన్యాదానవర్ణనమ్ - కన్యాదానవర్ణనం

**నారద ఉవాచ** - నారాదుడు చెప్పాడు.

**రుద్రపార్శ్వే త్వయి గతే కిమభూచ్చరితం తతః ।**
**కా వార్తా హ్యభవత్తాత కిం చకార హరః స్వయమ్ ॥1॥**

ఓ తండ్రీ! నీవు రుద్రుని చెంతకు వెళ్ళిన పిదప జరిగిన విశేషాలేమిటి? హరుడు స్వయంగా ఏమిచేశాడు?

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథాహం శివమానేతుం ప్రసన్నః పరమేశ్వరమ్ ।**
**ఆసదం హి మహాదేవం హిమవద్గిరిసంస్థితమ్ ॥2॥**

నారదా! అనంతరం నేను హిమవత్పర్వతంపైనున్న పరమేశ్వరుడు, మహాదేవుడునైన శివుని తీసుకొని రావడానికి సంతోషంతో ఆయన చెంతకు వెళ్ళాను.

**మాం వీక్ష్య లోకప్రస్టారమాయాంతం వృషభధ్వజః**
**మనసా సంశయం చక్రే సతీప్రాప్తౌ ముహుర్ముహుః ॥3॥**

సృష్టికర్తనైన నన్నుచూచి వృషభధ్వజుడైన శివుడు సతీప్రాప్తి విషయంలో మనస్సులో సంశయాన్ని మళ్ళీమళ్ళీ పొందుతూనే ఉన్నాడు.

**అథ ప్రీత్యా హరో లోకగతిమాశ్రిత్య లీలయా ।**
**సత్యా భక్త్యా చ మాం క్షిప్రమువాచ ప్రాకృతో యథా ॥4॥**

సంతీదేవీ యందు ప్రేమ, తన లీలావిలాసము, లోకములోని సంప్రదాయమును అనుసరించుట అనువిషయములు స్పష్టంమగుగా సతీదేవి విషయములోన కుమారుడైన ధక్షుడు ఎమిచేయాలని భావిస్తున్నాడు. చెప్పు.

**ఈశ్వర ఉవాచ** - ఈశ్వరుడు చెప్పాడు.

**కిమకార్షీత్సురజ్యేష్ఠ సత్యర్థే త్వత్సుతస్స మామ్ ।**
**కథయస్వ యథా స్వాంతం న దీర్యే మన్మథేన హి ॥5॥**

**ధావమానో విప్రయోగో మామేవ చ సతీంప్రతి ।**
**అభిహంతి సురజ్యేష్ఠ త్యక్త్వాన్యాం ప్రాణధారిణీమ్ ॥6॥**

**సతీతి సతతం బ్రహ్మాన్ వద కార్యం కరోమ్యహమ్ ।**
**అభేదాన్మమ సా ప్రాప్యా తద్విధే క్రియతాం తథా ॥7॥**

సతీదేవి విషయంలో నీకుమారుడైన దక్షుడు ఏమిచేయాలని భావిస్తున్నాడు. చెప్పు మన్మథుడు వలన కలిగే భాధకు నేను భరింపలేక పోతున్నాను. సతీదేవి సహకారుగా మన్మథుడు లోకంలో అందరినీ విడిచిపెట్టి నన్నే బాధిస్తున్నాడు. సతీ అనే నామాన్ని జపిస్తూనే నేను ఏపనైనా చేస్తున్నాను. ఆమెకు నాకు భేదంలేదు. ఆ సతీదేవితో నావివాహం జరగడానికి తగిన ప్రయత్నంచెయ్యి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి రుద్రోక్తవచనం లోకాచార సుగర్భితమ్ ।**
**శ్రుత్వాహం నారదమునే సాంత్వయన్నగదం శివమ్ ॥8॥**

నారదా! లోకాచార గర్భితమైన రుద్రుని మాటలు విని ఆయనను ఓదారుస్తూ నేనిలా చెప్పాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**సత్యర్థం యన్మమ సుతో వదతిస్మ వృషధ్వజ ।**
**తచ్ఛృణుష్వ నిజాసాధ్యం సిద్ధమిత్యవధారయ ॥9॥**

వృషభధ్వజా! సతిని గురించి నాకుమారుడైన దక్షుడు చెప్పిన మాటలను విను. అసాధ్యమని భావించిన కార్యం సిద్ధించిందని భావించు.

**దేయా తస్మై మయా పుత్రీ తదర్థం పరికల్పితా ।**
**మమాభీష్ట మిదం కార్యం త్వద్వాక్యాదధికం పునః ॥10॥**

"నేను నాపుత్రికను శివునకే ఇస్తాను. ఆమె ఆయనకొరకే జన్మించింది. శివునితో సతీదేవి వివాహం జరగడమే నాఅభీష్టం. నీమాటలవల్ల నీఇష్టం మరింత అధికమయ్యింది.

**మత్పుత్ర్యారాధితశ్శంభురేతదర్థం స్వయం పునః ।**
**సోఽప్యన్విష్యతి మాం యస్మాత్తదా దేయా మయా హరే ॥11॥**

నాకుమార్తె స్వయంగా ఇదే ఉద్దేశ్యంతో శివుని ఆరాధించింది. శివుడుకూడా ఆవిషయాన్ని నాతో చర్చించడానికి ఎదురుచూస్తుంటాడు. కాబట్టి ఈకన్యను తప్పక శివునకే ఇస్తాను.

**శుభే లగ్నే సుముహూర్తే సమాగచ్ఛతు సోంఽతికమ్ ।**
**తదా దాస్యామి తనయాం భిక్షార్థం శంభవే విధే ॥12॥**

ఓ విధాతా! శంకరుడు శుభలగ్నంలో ఒక సుముహూర్తంలో ఇక్కడకు వస్తాడు. అప్పుడు నేను విధివిధానంగా ఆయనకు నా కుమార్తెను కన్యాదానం చేస్తాను".

**ఇత్యువాచ స మాం దక్షస్తస్మాత్త్వం వృషభధ్వజః ।**
**శుభే ముహూర్తే తద్వేశ్మ గచ్ఛ తామానయస్వ చ ॥13॥**

అని దక్షుడు నాతో చెప్పాడు. కాబట్టి ఒక సుముహూర్తంలో దక్షుని గృహానికి వెళ్ళండి. సతీదేవిని తీసుకొనిరండి.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి శ్రుత్వా మమ వచో లౌకికీం గతిమాశ్రితః ।**
**ఉవాచ విహసన్రుద్రో మునే మాం భక్తవత్సలః ॥14॥**

నారదమునీ! నామాటలనువిని భక్తవత్సలుడైన శంకరుడు లౌకిక పద్ధతినాశ్రయించి నవ్వుతూ నాతో ఇలా అన్నాడు.

**రుద్ర ఉవాచ -** రుద్రుడు చెప్పాడు.

**గమిష్యే భవతా సార్ధం నారదేన చ తద్గృహమ్ ।**
**అహమేవ జగత్స్రష్ట స్తస్మాత్త్వం నారదం స్మర ॥15॥**

బ్రహ్మదేవా! నేను నీతోను నారదునితోను కూడి దక్షుని గృహానికి వెళ్తాను. నీవు జగత్స్రష్టవు. కావున నారదుని స్మరింపుము.

**మరీచ్యాదీన్ స్వపుత్రాంశ్చ మానసానపి సంస్మర ।**
**తైః సార్ధం దక్షనిలయం గమిష్యే సగణో విధే ॥16॥**

మరీచి మొదలగు నీ మానసపుత్రులనుకూడా స్మరింపుము. వారితోను నాగణాలతోను కూడి దక్షుని నివాసానికి **వెళ్తాను.**

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాజ్ఞప్తోఽహమీశేన లోకాచారపరేణ హ ।**
**సంస్మరం నారదం త్వాం చ మరీచ్యాదీన్సుతాంస్తథా ॥17॥**

ఓ నారదా! లోకాచార వలననురించుట యందు ఆసక్తిగల శివునిచే నేనిట్లు ఆజ్ఞాపింపబడగానే నేను నిన్ను, మరీచీ మొదలగు నామానస పుత్రులను స్మరించాను.

**తత స్సమాగతాస్సర్వే మానసాస్తనయాస్త్వయా ।**
**మమ స్మరణ మాత్రేణ హృష్టస్తే ద్రుతమాదరాత్ ॥18॥**

నేను స్మరించినంత మాత్రంచేతనే నీవెంట నామానస పుత్రులందరు మిక్కిలి సంతోషంతో ఇక్కడకు వచ్చిచేరారు. అప్పుడచ్చట నున్నవారంతా హర్షాతిరేకంతో పులకితులయ్యారు.

**విష్ణుస్సమాగతస్తూర్ణం స్మృతో రుద్రేణ శైవరాట్ ।**
**సస్వసైన్యః కమలయా గరుడారూఢ ఏవ చ ॥19॥**

రుద్రుడు స్మరింపగానే విష్ణుదేవుడుకూడా తనసైన్యంతోను, లక్ష్మీదేవితోనుకూడి గరుడారూఢుడై వెంటనే అక్కడకి వచ్చాడు.

**అథ చైత్రే సితే పక్షే నక్షత్రే భగదైవతే ।**
**త్రయోదశ్యాం దినే భానౌ నిర్గచ్ఛత్స మహేశ్వరః ॥20॥**
**సర్వైస్సురగణైస్సార్ధం బ్రహ్మవిష్ణుపురస్సరైః ।**
**తథా తైర్మునిభిర్గచ్ఛన్ స బభౌ పథి శంకరః ॥21॥**

అనంతరం చైత్రమాస శుక్లపక్ష త్రయోదశి ఆదివారం ఉత్తరఫల్గునీ నక్షత్రంలో బ్రహ్మవిష్ణువులను ముందిడుకొని సకలదేవతలతోకూడి, మహేశ్వరుడు దక్షుని చెంతకు వెళ్ళడానికి బయల్దేరాడు. మార్గమధ్యంలో దేవతలతో ఋషులతోకూడి వివాహయాత్ర చేస్తున్న శంకరుడు మిక్కిలి శోభాయమానుడై యున్నాడు.

**మార్గే సముత్సవో జాతో దేవాదీనాం చ గచ్ఛతామ్ ।**
**తథా హరగణానాం చ సానందమనసామతి ॥22॥**

అచటికి వెళ్ళుచున్న దేవతలు, ఆనందమగ్నులైన ప్రమథగణాలు, మార్గమధ్యంలో గొప్ప ఉత్సవాన్ని జరుపుకున్నారు.

**గజగోవ్యాఘ్రసర్పాశ్చ జటా చంద్రకలా తథా ।**
**జగుః సర్వే భూషణత్వం యథాయోగ్యం శివేచ్ఛయా ॥23॥**

భగంతుడైన శివుడు కోరగానే ఏనుగు, వృషభం, వ్యాఘ్రం, సర్పం, జటలు, చంద్రకళ మొదలైనవన్నీ తగినవిధంగా ఆయనకు అలంకారాలయ్యాయి.

**తతః క్షణేన బలినా బలీవర్దేన యోగినా ।**
**స విష్ణుప్రముఖః ప్రీత్యా ప్రాప దక్షాలయం హరః ॥24॥**

అనంతరం వేగంగా పయనించే తన వాహనమగు బలమైన బలీవర్దమైన నందికేశ్వరునిమీద మహాదేవుడారూఢుడై విష్ణువు మొదలగు ప్రముఖులతోకూడి ప్రసన్నతాపూర్వకంగా దక్షుని గృహానికి చేరాడు.

**తతో దక్షో వినీతాత్మా సంప్రహృష్టతనూరుహః ।**
**ప్రయయౌ సన్ముఖం తస్య సంయుక్తస్సకలైర్నిజైః ॥25॥**

అంతట వినీతాత్ముడగు దక్షప్రజాపతి సంతోషంతో రోమాంచితుడై తన ఆత్మీయ జనులందరితోకూడి, శివునకు ఎదురువెళ్ళాడు.

**సర్వే సురగణాస్తత్ర స్వయం దక్షేణ సత్కృతాః ।**
**పార్శ్వే శ్రేష్ఠం చ మునిభిరుపవిష్టా యథాక్రమమ్ ॥26॥**

దక్షుడు స్వయంగా సకల దేవతలను సత్కరించాడు. శివుని పార్శ్వభాగమందు యథాక్రమంగా శ్రేష్ఠులైన మునులందరిని కూర్చుండబెట్టాడు.

**పరివార్యాఖిలాన్దేవాన్గణాంశ్చ మునిభిర్యథా ।**
**దక్షస్సమానయామాస గృహాభ్యంతరతశ్శివమ్ ॥27॥**

అప్పుడు దక్షుడు మునులతోసహా సమస్త దేవతలకు కైవారములొనరించాడు. శివుని తన ఇంటిలోపలివరకు తీసుకువెళ్ళాడు.

**అథ దక్షః ప్రసన్నాత్మా స్వయం సర్వేశ్వరం హరమ్ ।**
**సమానర్చ విధానేన దత్త్వాసనమనుత్తమమ్ ॥28॥**

అంతట దక్షుడు మిక్కిలి ప్రసన్నాత్ముడై సర్వేశ్వరుడైన హరునికి స్వయంగా ఉత్తమమైన ఆసనాన్నిచ్చి, విధిపూర్వకంగా పూజించాడు.

**తతో విష్ణుంచ మాం విప్రాన్సురాన్సర్వాన్గణాంస్తథా ।**
**పూజయామాస సద్భక్త్యా యథోచితవిధానతః ॥29॥**

అనంతరం విష్ణువును, నన్ను, బ్రాహ్మణులను, దేవతలను, సమస్త శివగణాన్ని యథోచితంగా ఉత్తమ భక్తిభావంతో దక్షుడు పూజించాడు.

**కృత్వా యథోచితాం పూజాం తేషాం పూజ్యాదిభిస్తథా ।**
**చకార సంవిదం దక్షో మునిభిర్మానసైః పునః ॥30॥**

ఇట్లు పూజనీయులనందరిని యథోచితరీతిని పూజించి, నామానస పుత్రులైన మరీచి మున్నగు మహర్షులనుండి తగిన సలహాలను గ్రహించాడు.

**తతో మాం పితరం ప్రాహ దక్షః ప్రీత్యా హి మత్సుతః ।**
**ప్రణిపత్య త్వయా కర్మ కార్యం వైవాహికం విభో ॥31॥**

తదనంతరం నాకుమారుడైన దక్షుడు తండ్రినైన నాపాదాలకు ప్రణమిల్లి సంతోషంతో "ప్రభూ! మీరు ఈ వివాహకార్యాన్ని సుసంపన్నం చేయండి" అన్నాడు.

**బాఢమిత్యహమప్యుక్త్వా ప్రహృష్టేనాంతరాత్మనా ।**
**సముత్థాయ తతోఽకార్షం తత్కార్యమఖిలం తథా ॥32॥**

అంతట నేను సంతుష్టాంతరంగంతో అలాగే అనిచెప్పి పైకిలేచి, కార్యమంతటిని చేయించడంలో నిమగ్నమయ్యాను.

**తతశ్శుభే ముహూర్తే హి లగ్నే గ్రహబలాన్వితే ।**
**సతీం నిజసుతాం దక్షో దదౌ హర్షేణ శంభవే ॥33॥**

అనంతరం గ్రహబలయుక్తమైన శుభలగ్నంలో సుముహూర్తంలో దక్షుడు హర్షాతిరేకంతో తనపుత్రికయైన సతీదేవిని శంభునకిచ్చాడు.

**ఉద్వాహ విధినా సో౨పి పాణిం జగ్రాహ హర్షితః ।**
**దాక్షాయణ్యా వరతనోస్తదానీం వృషభధ్వజః ॥34॥**

అంతట వృషభధ్వజుడైన శివుడు సంతోషంతో వైవాహికవిధానంలో పరమసుందరియైన దాక్షాయిణీదేవి పాణిగ్రహణం చేశాడు.

**అహం హరిస్త్వదాద్యా వై మునయశ్చ సురా గణాః ।**
**నేముస్సర్వే సంస్తుతిభి స్తోషయామాసురీశ్వరమ్ ॥35॥**

నేను, నీవు, శ్రీహరి, ఇతర మునులు, దేవతలు, ప్రమథగణాలు శివునకు నమస్కరించారు. నానావిధాలైన స్తోత్రాలతో అందరూ ఆ స్వామిని సంతుష్టుని చేశారు.

**సముత్సవో మహానాసీన్నృత్యగాన పురస్సరః ।**
**ఆనందం పరమం జగ్ముస్సర్వే మునిగణాః సురాః ॥36॥**

ఆ సమయంలో నృత్యగానాదులతో గొప్ప ఉత్సవాన్ని జరుపుకున్నారు. సమస్త దేవతలకు, మునులకు, పరమానందం కలిగింది.

**కన్యాం దత్త్వా కృతార్థో౨భూత్తదా దక్షో హి మత్సుతః ।**
**శివాశివౌ ప్రసన్నౌ చ నిఖిలం మంగళాలయమ్ ॥37॥**

నాకుమారుడైన దక్షుడు భగవంతుడైన శివునకు కన్యాదానంచేసి కృతార్థుడయ్యాడు. సతీదేవి, శివుడు ప్రసన్నులయ్యారు. సృష్టియంతా శుభకరమైంది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే కన్యాదాన వర్ణం నామ అష్టాదశో౨ధ్యాయః ॥18॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో కన్యాదానవర్ణనం అనే పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనవింశోఽధ్యాయః - పంతొమ్మిదవ అధ్యాయం

## సతీవివాహ శివలీలావర్ణనమ్ - సతీవివాహ శివలీలావర్ణనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**కృత్వా దక్షస్సుతాదానం యౌతకం వివిధం దదౌ ।**
**హరాయ సుప్రసన్నస్య ద్విజేభ్యో వివిధం ధనమ్ ॥1॥**

నారదా! దక్షుడు కన్యాదానంచేసి శంకరునకు అనేక విధాలైన వస్తువులను వరకట్నంగా ఇచ్చాడు. దానితో అతడు మిక్కిలి ప్రసన్నుడైనాడు. బ్రాహ్మణులకు వివిధమైన ధనాలను దానంచేశాడు.

**అథ శంభుముపాగత్య సముత్థాయ కృతాంజలిః ।**
**సార్ధం కమలయా చేదమువాచ గరుడధ్వజః ॥2॥**

అనంతరం లక్ష్మీదేవితోకూడి విష్ణుభగవానుడు శివుని చెంతకు వచ్చి, చేతులుజోడించి, ఇలాపలికాడు.

**విష్ణురువాచ** - విష్ణువు చెప్పాడు.

**దేవదేవ! మహాదేవ! కరుణాసాగర! ప్రభో! ।**
**త్వం పితా జగతాం తాత సతీ మాతాఽఖిలస్య చ ॥3॥**

దేవదేవా! మహాదేవా! కరుణాసాగరా! ప్రభో! మీరు సకల జగత్తుకు తండ్రి, సతీదేవి జగన్మాత.

**యువాం లీలావతారౌ వై సతాం క్షేమాయ సర్వదా ।**
**ఖలానాం నిగ్రహార్థాయ శ్రుతిరేషా సనాతనీ ॥4॥**

మీరిరువురు సత్పురుషులకు మేలుచేయడానికి దుష్టులను శిక్షించడానికి, ఎల్లప్పుడు లీలగా అవతరిస్తుంటారని సనాతన శ్రుతి తెలియజేస్తోంది.

**స్నిగ్ధ నీలాంజన శ్యామ శోభయా శోభసే హర! ।**
**దాక్షాయణ్యా యథా చాహం ప్రతిలోమేన పద్మయా ॥5॥**

మీరు మనోహరమైన నీలవర్ణపు కాటుకతో సమానంగా శోభిల్లు సతీదేవితో విరాజిల్లుతుండగా నేను దానికి విరుద్ధంగా లక్ష్మితో శోభాయమానుడనై యున్నాను. అనగా సతీదేవి నీలవర్ణ. మీరు గౌరవర్ణులు. దానికి విరుద్ధంగా నేను నీలవర్ణుడను. లక్ష్మి గౌరవర్ణురాలు.

**దేవానాం వా నృణాం రక్షాం కురు సత్యాఽనయా సతామ్ ।**
**సంసారసారిణాం శంభో మంగళం సర్వదా తథా ॥6॥**

ఓ పరమేశ్వరా! ఈ సతీదేవితో కలసి ఎల్లప్పుడు దేవతలను, మానవులను రక్షించండి. అప్పుడే లోకంలోని సమస్త ప్రాణులకు శుభం కలుగుతుంది.

**య ఏనాం సాభిలాషో వై దృష్ట్వా శ్రుత్వాథవా భవేత్ ।**
**తం హన్యాస్సర్వభూతేశ విజ్ఞప్తిరితి మే ప్రభో ॥7॥**

'సర్వభూతేశా! ఈసతీదేవిని ఎవరైతే కోరికతో చూస్తారో, కామాసక్తతతో ఈమెనుగూర్చి వింటారో అట్టివారిని సంహరించండి'. ఇది నావిన్నపం.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి శ్రుత్వా వచో విష్ణో ర్విహస్య పరమేశ్వరః ।**
**ఏవమస్త్వితి సర్వజ్ఞః ప్రోవాచ మధుసూదనమ్ ॥8॥**

విష్ణువు పల్కిన మాటలనువిని సర్వజ్ఞుడైన పరమేశ్వరుడు నవ్వుతూ 'అట్లే అగుగాక!' అని మధుసూదనునితో అన్నాడు.

**స్వస్థానం హరిరాగత్య స్థిత ఆసీన్మునీశ్వర ।**
**ఉత్సవం కారయామాస జుగోప చరితం చ తత్ ॥9॥**

విష్ణువు ఈవిధంగా పరమేశ్వరునితో పల్కి లోకమునకుపోయెను అక్కడ ఒక గొప్ప ఉత్సవమును నిర్వహించెను సతీ శివుల వివాహ విషయములను రహస్యముగానుంచెను.

**అహం దేవీం సమాగత్య గృహ్యోక్తవిధినాఽఖిలమ్ ।**
**అగ్నికార్యం యథోద్దిష్ట మకార్షం చ సువిస్తరమ్ ॥10॥**

నారదా! నేను సతీదేవి చెంతకువెళ్ళి గృహ్యసూత్రోక్త విధానంతో విస్తృతంగా అగ్నికార్యాన్ని చేయించసాగాను.

**తతశ్శివా శివశ్చైవ యథావిధి ప్రహృష్టవత్ ।**
**అగ్నేః ప్రదక్షిణం చక్రే మదాచార్య ద్విజాజ్ఞయా ॥11॥**

ఆచార్యుడనైన నాయొక్కయు, బ్రాహ్మణులయొక్కయు ఆదేశానుసారం సతీశివులు మిక్కిలి ఆనందంతో విధిపూర్వకంగా అగ్నికి ప్రదక్షిణలు చేశారు.

**తదా మహోత్సవ స్తత్రాద్భుతోఽభూద్ద్విజసత్తమ ।**
**సర్వేషాం సుఖదం వాద్యం గీతనృత్యపురస్సరమ్ ॥12॥**

అప్పుడచ్చట మిక్కిలి అద్భుతమైన ఉత్సవం జరిగింది. మంగళవాద్యాలతో, నృత్యగీతాలతో, అందరికి ఆ ఉత్సవం సంతోషాన్ని కల్గించింది.

**తదానీమద్భుతం తత్ర చరితం సమభూదతి ।**
**సువిస్మయకరం తాత తచ్ఛృణు త్వం వదామి తే ॥13॥**

అప్పుడచ్చట అత్యద్భుతమైన మిక్కిలి ఆశ్చర్యకరమైన ఒక సంఘటన జరిగింది. దానినిగూర్చి చెబుతాను విను.

**దుర్జ్ఞేయా శాంభవీ మాయా తయా సంమోహితం జగత్ ।**
**సచరాచర మత్యంతం సదేవాసురమానుషమ్ ॥14॥**

శివునిమాయ దుర్జ్ఞేయమైనది. చరాచర సృష్టితోకూడిన ఈజగత్తు, దేవతలు, దానవులు, మానవులందరు ఆ మాయచే మిక్కిలి సమ్మోహితులయ్యారు.

**యోఽహం శంభుం మోహయితుం పురైచ్ఛం కపటేనహి ।**
**మాం చ తం శంకరస్తాత మోహయామాస లీలయా ॥15॥**

నేను, కపటోపాయంతో ముందుగా శంభుని మోహపరచడానికి ప్రయత్నించాను. కాని శంకరుడే నన్ను లీలగా మోహపరచసాగాడు.

**ఇచ్ఛేత్పరాపకారం యస్య తస్యైవ భవేద్ధ్రువమ్ ।**
**ఇతి మత్వాఽపకారం నో కుర్యాదన్యస్య పూరుషః ॥16॥**

ఇతరులకపకారం చేయాలనుకున్నవారికే నిశ్చయంగా అపకారం కలుగుతుంది. ఈవిషయాన్ని దృష్టిలో నుంచుకొని ఏమానవుడు ఇతరులకపకారం చేయకూడదు.

**ప్రదక్షిణాం ప్రకుర్వంత్యా వహ్నేస్సత్యాః పదద్వయమ్ ।**
**ఆవిర్బభూవ వసనాత్తదద్రాక్ష మహం మునే ॥17॥**

నారదా! అగ్నికి ప్రదక్షిణం చేస్తున్న సతీదేవి చీరతొలగి లాక్షారంజితము, కుసుమ కోమలము, అలంకార శోభితమునైన పాదద్వయం బయటకు కనిపించింది. నేనాపాదాలను చూశాను.

**మదనావిష్టచేతాశ్చ భూత్వాంగాని వ్యలోకయమ్ ।**
**అహం సత్యా ద్విజశ్రేష్ఠ శివమాయావిమోహితః ॥18॥**

శివమాయామోహితుడనైన నేను ఆ పాదాలను చూడగానే నామనస్సు వికలమయ్యింది. మదనావిష్ట హృదయంతోనున్న నాకు సతీదేవి శరీరాంగాలన్నిటిని చూడాలనే మోహం కలిగింది.

**యథా యథాహం రమ్యాణి వ్యైక్షమంగాని కౌతుకాత్ ।**
**సత్యా బభూవ సందృష్టః కామార్తో హి తథా తథా ॥19॥**

కామార్తితో నేను ఏయే విధాలుగా ఆమెను చూడాలనుకున్నానో ఆయారీతిగానే సతీదేవి రమ్యాంగాలనన్నిటిని చూశాను.

**అహమేవం తథా దృష్ట్వా దక్షజాం చ పతివ్రతామ్ ।**
**స్మరావిష్టమనా వక్త్రం ద్రష్టుకామోభవం మునే ॥20॥**

నారదా! మన్మథావిష్ట హృదయుడనైన నేనీవిధంగా పతివ్రతయైన దాక్షాయణీదేవి శరీర సౌందర్యాన్నంతటిని చూచినపిదప ఆమె ముఖసందర్శనం చేయాలని కుతూహలం కలిగింది.

**న శంభోర్లజ్జయా వక్త్రం ప్రత్యక్షం చ విలోకితమ్ ।**
**న చ సా లజ్జయావిష్టా కరోతి ప్రకటం ముఖమ్ ॥21॥**

ఆసమయంలో సిగ్గుతో శివుని ముఖాన్ని ప్రత్యక్షంగా చూడలేకపోయాను. అదేవిధంగా లజ్జయావిష్టయైన సతీదేవిముఖంకూడా మేలిముసుగునుండి ప్రకటంకాలేదు.

**తతస్తద్దర్శనార్థాయ సదుపాయం విచారయన్ ।**
**ధూమ్రఘోరేణ కామార్తోఽకార్షం తచ్చ తతః పరమ్ ॥22॥**

కామార్తితో ఆమెముఖసందర్శనానికి ఉపాయాన్ని ఆలోచిస్తూ అగ్నికార్యాన్ని చేయిస్తున్న నేను అంతటా దట్టమైనపొగ కమ్ముకొనేటట్లు చేశాను.

**ఆర్ద్రేంధనాని భూరీణి క్షిప్త్వా తత్ర విభావసౌ ।**
**స్వల్పాజ్యాహుతివిన్యాసా దార్ద్రద్రవ్యోద్భవ స్తథా ॥23॥**

తడిసిన ఇంధనాలను, ద్రవ్యాలను అగ్నిలో ఎక్కువగా వేయడం వలనను, ఆజ్యాహుతులు స్వల్పంగా వేయడం వలనను దట్టమైనపొగ వ్యాపించింది.

**ప్రాదుర్భూత స్తతో ధూమో భూయాంస్తత్ర సమంతతః ।**
**తాదృగ్ యేన తమో భూతం వేదీభూమి వినిర్మితమ్ ॥24॥**

ఆవిధంగా పుట్టిన పొగతో ఆప్రాంతమంతా నిండిపోయింది. దానివల్ల కళ్యాణవేదిక చీకటితో నిండిపోయింది.

**తతో ధూమాకులే నేత్రే మహేశః పరమేశ్వరః ।**
**హస్తాభ్యాం ఛాదయామాస బహులీలాకరః ప్రభుః ॥25॥**

అంతట బహులీలాకరుడైన పరమేశ్వరుడు పొగతోనిండిన కళ్ళను తనచేతులతో మూసుకున్నాడు.

**తతో వస్త్రం సముత్క్షిప్య సతీవక్త్రమహం మునే ।**
**అవేక్షం కిల కామార్తః ప్రహృష్టేనాంతరాత్మనా ॥26॥**

నారదా! ఆ సమయంలో సతీదేవి మేలిముసుగును పైకెత్తి ఆమెముఖాన్ని ప్రహృష్టాంతరంగంతో, కామార్తితో చూశాను.

**ముహుర్ముహురహం తాత పశ్యామి స్మ సతీముఖమ్ ।**
**అథేన్ద్రియవికారం చ ప్రాప్తవానస్మి సోఽవశః ॥27॥**

ఆమెముఖాన్ని మళ్ళీమళ్ళీ అలాచూస్తూ ఉండిపోయాను. నిగ్రహాన్ని కోల్పోయాను. ఇంద్రియ వికారంకూడా కలిగింది.

**మమ రేతః ప్రచస్కంద తతస్తద్వీక్షణాద్ధ్రుతమ్ ।**
**చతుర్బిన్దుమితం భూమౌ తుషారచయసంనిభమ్ ॥28॥**

వెంటనే మంచుముద్దవలె నాలుగుబిందువుల పరిమాణంగల నా రేతస్సుజారి భూమిపై పడింది.

**తతో౽హం శంకితో మౌనీ తత్క్షణం విస్మితో మునే ।**
**ఆచ్ఛాదయేస్మ తద్రేతో యథా కశ్చిద్బుబోధ న ॥29॥**

దానితో నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఆ శుక్రం ఎవరికి కనపడకుండా దానిని కప్పేశాను.

**అథ తద్భగవాఞ్ఛంభు ర్జ్ఞాత్వా దివ్యేన చక్షుషా ।**
**రేతోవస్కందనాత్తస్య కోపాదేతదువాచ హ ॥30॥**

భగవానుడైన రుద్రుడు దివ్యదృష్టితో దానిని తెలుసుకొని ఉగ్రుడై ఇలాఅన్నాడు.

**రుద్ర ఉవాచ** - రుద్రుడు చెప్పాడు.

**కిమేతద్విహితం పాప త్వయా కర్మ విగర్హితమ్ ।**
**వివాహే మమ కాంతాయా వక్త్రం దృష్టం ను రాగతః ॥31॥**

విధీ! ఈవిధమైన పాపకర్మ నీవెందుకు చేశావు? వివాహసమయంలో నాభార్యయైన సతీదేవి ముఖాన్ని అనురాగంతో ఎవరూ చూడకూడదు.

**త్వం వేత్సి శంకరేణైతత్కర్మ జ్ఞాతం న కించన ।**
**త్రైలోక్యే౽పి న మే౽జ్ఞాతం గూఢం తస్మాత్కథం విధే ॥32॥**

నీవుచేసిన ఈపని శంకరునికి తెలుస్తుందని నీకుతెలుసు ఎందుకనగా ముల్లోకాలలోను నాకు తెలియకుండా రహస్యంగా జరిగేదేమీ లేదుకదా! అటువంటి స్థితిలో నీవెందుకిలా చేశావు?

**యత్కించిత్త్రిషులోకేషు జంగమం స్థావరం తథా ।**
**తస్యాహం మధ్యగో మూఢ తైలం యద్వత్తిలాంతికమ్ ॥33॥**

మూఢుడా! తిలలలో నూనె అంతర్నిగూఢమైనట్లు ముల్లోకాలలోని ప్రతిచిన్న వస్తువులోను, స్థావర జంగమాదు లన్నింటిలోను నేనుంటాననికూడా నీకు తెలుసుకదా!

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా ప్రియవిష్ణుర్మాం తదా విష్ణువచః స్మరన్ ।**
**ఇయేష హంతుం బ్రహ్మాణం శూలముద్యమ్య శంకరః ॥34॥**

అనిపలికి, శంకరుడు విష్ణువు తనతో పలికిన పలుకులను స్మరిస్తూ బ్రహ్మను సంహరించడానికి శూలాన్ని పైకెత్తాడు.

**శంభునోద్యమితే శూలే మాం చ హంతుం ద్విజోత్తమ ।**
**మరీచిప్రముఖాస్తే వై హాహాకారం చ చక్రిరే ॥35॥**

నారదా! నన్ను సంహరించడానికి శంకరునిచే పైకెత్తబడిన శూలాన్నిచూచి, మరీచ్యాది ప్రముఖులంతా హాహాకారాలు చేశారు.

**తతో దేవగణాస్సర్వే మునయశ్చాఖిలాస్తథా ।**
**తుష్టువుశ్శంకరం తత్ర ప్రజ్వలంతం భయాతురాః ॥36॥**

అగ్నిసదృశంగా, భయంకరంగా ప్రజ్వరిల్లుతున్న శంకరుని చూచి, సర్వదేవగణాలు, మహర్షులు, సమస్త జనులు భయకంపితులై ఇలా స్తుతించారు.

**దేవా ఊచుః –** దేవతలు ప్రార్థించారు.

**దేవదేవ మహాదేవ శరణాగతవత్సల ।**
**బ్రహ్మాణం రక్ష రక్షేశ కృపాం కురు మహేశ్వర ॥37॥**

"ఓ దేవదేవా! మహాదేవా! శరణాగతవత్సలా! మహేశ్వరా! ఈశానా! ఈ బ్రహ్మను రక్షించండి".

**జగత్పితా మహేశ త్వం జగన్మాతా సతీ మతా ।**
**హరిబ్రహ్మాదయస్సర్వే తవ దాసాస్సురప్రభో ॥38॥**

ఓ మహేశ్వరా! నీవు సమస్తమైన లోకాలకు తండ్రివి. సతీదేవి జగన్మాత. హరిబ్రహ్మాదులందరు నీదాసులు.

**అద్భుతాకృతిలీలస్త్వం తవ మాయాద్భుతాప్రభో ।**
**తయా విమోహితం సర్వం వినా త్వద్భక్తిమీశ్వర ॥39॥**

ఓ ప్రభూ! నీలీలాకృతి అత్యద్భుతమైనది. నీమాయకూడా మిక్కిలి అద్భుతమైనది. నీభక్తితక్క తక్కినదంతయు ఆమాయచే విమోహితమైనదేకదా!

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్థం బహుతరం దీనా నిర్జరా మునయశ్చ తే ।**
**తుష్టువుర్దేవ దేవేశం క్రోధావిష్టం మహేశ్వరమ్ ॥40॥**

ఈవిధంగా దేవతలు, మునులు, మిక్కిలి దీనంగా క్రోధావిష్టుడైన మహేశ్వరుని ప్రార్థించారు.

**దక్షో మైవం మైవమితి పాణి ముద్యమ్య శంకితః ।**
**వారయామాస భూతేశం క్షిప్రమేత్య పురోగతః ॥41॥**

దక్షుడుకూడా 'వద్దు' 'వద్దు' అని అరుస్తూ ముందుకురికి, శూలపాణియైన శివుని చేతిని పట్టుకుని, నివారించాడు.

**అథాగ్రే సంగతం వీక్ష్య తదా దక్షం మహేశ్వరః ।**
**ప్రత్యువాచాప్రియమిదం సంస్మరన్ప్రార్థనాం హరేః ॥42॥**

ఆవిధంగా ముందుకు వచ్చిన దక్షునితో మహేశ్వరుడు శ్రీమహావిష్ణువు ప్రార్థించి చెప్పిన ప్రియవాక్యాన్ని స్మరిస్తూ ఇలా అన్నాడు.

**మహేశ్వర ఉవాచ** - మహేశ్వరుడు చెప్పాడు.

**విష్ణునా మేతి భక్తేన యదిదానీముదీరితమ్ ।**
**మయాప్యంగీకృతం కర్తుం తదిహైవ ప్రజాపతే ॥43॥**

ఓ ప్రజాపతీ! నాయందు భక్తితో శ్రీమహావిష్ణువు చెప్పిన మాటలకు నేనంగీకారాన్ని తెలియజేశాను. దానిని నేనిప్పుడు అమలుచేయడానికి ప్రయత్నిస్తున్నాను.

**సతీం యస్యాభిలాషస్సన్ వీక్షేత వధ తం ప్రభో ।**
**ఇతి విష్ణువచస్సత్యం విధిం హత్వా కరోమ్యహమ్ ॥44॥**

'ఓ ప్రభూ! సతీదేవిని అనురాగంతో ఎవడు చూస్తాడో వాడిని సంహరించు' ఇది విష్ణువు చెప్పినమాట. నేడీ బ్రహ్మను సంహరించి, ఆమాటనిప్పుడు నిజంచేస్తాను.

**సాభిలాషః కథం బ్రహ్మా సతీం సమవలోకయత్ ।**
**అభవత్త్యక్తరేతాస్తు తతో హన్మి కృతాగసమ్ ॥45॥**

బ్రహ్మ సతీదేవిని కామార్తుడై చూస్తూ రేతస్క లనాన్ని పొందాడు కాబట్టి నేను బ్రహ్మను సంహరిస్తున్నాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తవతి దేవేశ మహేశే క్రోధసంకులే ।**
**చకంపిరే జనాస్సర్వే సదేవమునిమానుషాః ॥46॥**

మహేశ్వరుడు కోపంతో ఇలాచెప్పగానే దేవ, ముని, మానుష గణాలందరు భయకంపితులయ్యారు.

**హాహాకారో మహానాసీదౌదాసీన్యం చ సర్వశః ।**
**అభూవ మ్వికలో౽తీవ తదాహం తద్విమోహకః ॥47॥**

ఆ ప్రాంగణమంతా హాహాకారాలతో దద్దరిల్లింది. అంతటా విచారం నెలకొంది. నేనుకూడా మిక్కిలి వైకల్యాన్ని పొందాను.

**అథ విష్ణు ర్మహేశాతి ప్రియః కార్యవిచక్షణః ।**
**తమేవం వాదినం రుద్రం తుష్టావ ప్రణతస్సుధీః ॥48॥**

అంతట కార్యవిచక్షుండు, బుద్ధిశాలియు, మహేశ్వరునికి ప్రీతిపాత్రుడునైన విష్ణువు రుద్రునికి నమస్కరించి ఇలా అన్నాడు.

**స్తుత్వా చ వివిధైః స్తోత్రైః శంకరం భక్తవత్సలమ్ ।**
**ఇదమూచే వారయంస్తం క్షిప్రం భూత్వా పురస్సరః ॥49॥**

భక్తవత్సలుడైన శంకరుడు శ్రీమహావిష్ణువు వివిధమైన స్తోత్రాలతో స్తుతించి, ఎదురుగావచ్చి, అతనిని వారిస్తూ ఇలా అన్నాడు.

**విష్ణురువాచ** – విష్ణువు చెప్పాడు.

**విధిం న జహి భూతేశ స్రష్టారం జగతాం ప్రభుమ్ ।**
**అయం శరణగస్తేఽద్య శరణాగతవత్సలః ॥50॥**

భూతేశా! సృష్టికర్త, జగత్ప్రభువునైన బ్రహ్మను సంహరించవద్దు. శరణాగతవత్సలుడవైన నిన్ను అతడిప్పుడు శరణుకోరాడు.

**అహం తేఽతి ప్రియో భక్తో భక్తరాజ ఇతీరితః ।**
**విజ్ఞప్తిం హృది మే మత్వా కృపాం కురు మమోపరి ॥51॥**

నేను నీకత్యంత ప్రియుడనని నీచేకీర్తింపబడిన నా విజ్ఞప్తిని మన్నించి, నాయందు దయచూపుము.

**అన్యచ్చ శృణు మే నాథ! వచనం హేతుగర్భితమ్ ।**
**తన్మనుష్వ మహేశాన కృపాం కృత్వా మమోపరి ॥52॥**

హేతుగర్భితమైన మరియొక మాటకూడా వినుము. ఓ మహేశ్వరా! నాయందు దయతో అతనిని బ్రదుకనిమ్ము.

**ప్రజాస్స్రష్టుమయం శంభో ప్రాదుర్భూతశ్చతుర్ముఖః ।**
**అస్మిన్ హతే ప్రజాస్రష్టా నాస్త్యన్యః ప్రాకృతోఽధునా ॥53॥**

ఓ మహేశ్వరా! చతుర్ముఖుడైన ఇతడు ప్రజాసృష్టి కొరకు జన్మించాడు. ఇతనిని సంహరిస్తే ఇప్పుడింక సృష్టిచేసేవాడుండడు.

**సృష్టి స్థిత్యంత కర్మాణి కరిష్యామః పునఃపునః ।**
**త్రయో దేవా వయం నాథ శివరూప త్వదాజ్ఞయా ॥54॥**

మహాశివుని రూపుడవైన నీఆజ్ఞచే త్రిమూర్తులమైన మనము మళ్ళీమళ్ళీ సృష్టి, స్థితి, లయకర్మలను చేస్తున్నాము.

**ఏతస్మిన్నిహతే శంభో కస్త్వత్కర్మ కరిష్యతి ।**
**తస్మాన్నవధ్యో భవతా సృష్టికృల్లయకృద్విభో ॥55॥**

ఇతనిని సంహరించినట్లయితే ఇతడు చేయవలసిన సృష్టి కర్మను ఎవరు చేస్తారు? కాబట్టి లయకర్తవైన నీచే సృష్టికర్తయైన బ్రహ్మ చంపబడరాదు.

**అనేనైవ సతీ కన్యా దక్షస్య చ శివా విభో ।**
**సదుపాయేన వై భార్యా భవదర్థే ప్రకల్పితా ॥56॥**

దక్షపుత్రికయైన సతీదేవిని మంచిఉపాయంతో నీకు భార్యఅయ్యేటట్లుగా ఏర్పాటు చేసింది బ్రహ్మయేకదా!

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య మహేశస్తు విజ్ఞప్తిం విష్ణునా కృతామ్ ।**
**ప్రత్యువాచాఖిలాం స్తాంశ్చ శ్రావయంశ్చ దృఢవ్రతః ॥57॥**

ఈవిధంగా పల్కిన విష్ణుని విజ్ఞప్తిని మహేశుడు విని, దృఢనిశ్చయంతో అందరూ వినేటట్లుగా ఇలా జవాబిచ్చాడు.

**మహేశ ఉవాచ –** మహేశుడు చెప్పాడు.

**దేవదేవ రమేశాన విష్ణో మత్ప్రాణవల్లభ ।**
**న నివారయ మాం తాత వధాదస్య ఖలస్త్వయమ్ ॥58॥**

ఓ దేవదేవా! రమాపతీ! నా ప్రాణసమానమైవాడా ఖలుడైన ఈబ్రహ్మను వధించే విషయంలో నీవునన్ను వారించవద్దు.

**పూరయిష్యామి విజ్ఞప్తిం పూర్వాన్తేంఽగీకృతాంమయా ।**
**మహాపాపకరం దుష్టం హన్మ్యేనం చతురాననమ్ ॥59॥**

మహాపాపకర్ముడు, దుష్టుడునైన ఈచతురాననునిచంపి, పూర్వం నీవిజ్ఞప్తికి నేను తెలిపిన అంగీకారాన్ని సంపూర్ణం చేస్తాను.

**అహమేవ ప్రజాస్స్రక్ష్యే సర్వాః స్థిరచరా అపి ।**
**అన్యం స్రక్ష్యే సృష్టికరమథవాహం స్వతేజసా ॥60॥**

నేనే ప్రజాసృష్టి చేస్తాను. చరాచర జగత్తునంతటినీకూడా నేనే సృష్టిస్తాను. లేదా నాతేజస్సుతో మరొక సృష్టి కర్తను సృష్టిస్తాను.

**హత్వైనం విధిమేవాహం స్వపణం పూరయన్ కృతమ్ ।**
**స్రష్టారమేకం స్రక్ష్యామి న నివారయ మేశ మామ్ ॥61॥**

ఈబ్రహ్మను సంహరించి, నేను నాప్రతిజ్ఞను పూర్తిగావిస్తాను. మరొక సృష్టి కర్తను సృష్టిస్తాను. రమాపతీ! నీవునన్ను నివారించవద్దు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇతి తస్య వచశ్శ్రుత్వా గిరీశస్యాహ చాచ్యుతః ।**
**స్మితప్రభిన్నహృదయః పునర్నైవమితీరయన్ ॥62॥**

గిరీశుని మాటలు వినిన విష్ణువు చింతాక్రాంతహృదయంతో మళ్ళీ ఇలాచెప్పడం మొదలుపెట్టాడు.

**అచ్యుత ఉవాచ** – అచ్యుతుడు చెప్పాడు.

**ప్రతిజ్ఞాపూరణం యోగ్యం పరస్మిన్పురుషేఽస్తి వై ।**
**విచారయస్వ వధ్యేశ భవత్యాత్మని న ప్రభో ॥63॥**

పరమపురుషా! ప్రతిజ్ఞాపాలన యుక్తమే కాని, నీవెవరిని వధిస్తావు? ఈపితామహుడు నీనుండి ఆవిర్భవించిన నీ స్వరూపమేకదా! పరరూపమైతే సంహరిస్తావుకాని, నిన్నునీవు చంపుకోకూడదుకదా! ఆలోచించిచూడు.

**త్రయో దేవా వయం శంభో త్వదాత్మనః పరా న హి ।**
**ఏకరూపా న భిన్నాశ్చ తత్త్వతస్సువిచారయ ॥64॥**

త్రిమూర్తులమైన మనం నీ ఆత్మస్వరూపులమేకాని ఇతరులం కాదు. మనమంతా ఏకరూపమేగాని భిన్నరూపులం కాదు. ఈ తత్త్వాన్నిగూర్చి ఆలోచించు.

**తతస్తద్వచనం శ్రుత్వా విష్ణో స్స్వాతిప్రియస్య సః ।**
**శంభురూచే పునస్తం వై ఖ్యాపయన్నాత్మనో గతిమ్ ॥65॥**

అంతట తనకత్యంత ప్రీతిపాత్రుడైన విష్ణువు పల్కులనువిని, శంభుడు తన నిర్ణయాన్ని మళ్ళీ ఇలాచెప్పాడు.

**శంభురువాచ** – శంభుడు చెప్పాడు.

**హే విష్ణో సర్వభక్తేశ కథమాత్మా విధిర్మమ ।**
**లక్ష్యతే భిన్న ఏవాయం ప్రత్యక్షేణాగ్రతః స్థితః ॥66॥**

ఓ విష్ణూ! సర్వభక్తేశా! బ్రహ్మ నాయొక్క ఆత్మ ఎలాఅవుతాడు? నాఎదురుగా అతడు ప్రత్యక్షంగా కన్పిస్తున్నాడుకదా! కాబట్టి అతడు నాకు భిన్నుడే.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాజ్ఞప్తో మహేశేన సర్వేషాం పురతస్తదా ।**
**ఇదమూచే మహాదేవం తోషయన్ గరుడధ్వజః ॥67॥**

ఈవిధంగా మహేశ్వరునిచే ఆజ్ఞాపింపబడిన విష్ణువు మహాదేవుని సంతసింపజేయడానికి అందరిముందు ఇలాచెప్పాడు.

**విష్ణురువాచ** - విష్ణువు చెప్పాడు.

**న బ్రహ్మా భవతో భిన్నో న త్వం తస్మా త్సదాశివ ।**
**న వాహం భవతో భిన్నో న మత్త్వం పరమేశ్వరః ॥68॥**

ఓ సదాశివా! బ్రహ్మ నీకు భిన్నుడుకాదు. నీవు బ్రహ్మకు భిన్నుడవు కాదు. నేను బ్రహ్మకు భిన్నుడను కాదు. నీకునూ భిన్నుడనుకాదు.

**సర్వం జానాసి సర్వజ్ఞ పరమేశ సదాశివ ।**
**మన్ముఖాదఖిలాన్సర్వం సంశ్రావయితు మిచ్ఛసి ॥69॥**

ఓ సదాశివా!

పరమేశా! సర్వజ్ఞా! నీకు సర్వంతెలుసు కాని, ఈ తత్త్వాన్ని నామాటలద్వారా అందరికి వినిపించాలని నీవు కోరుకుంటున్నావు.

**త్వదాజ్ఞయా వదామీశ శృణ్వంతు నిఖిలాస్సురాః ।**
**మునయశ్చాపరే శైవం తత్త్వం సంధార్య స్వం మనః ॥70॥**

ఓ పరమేశా! నేను మీఅనుమతితో శివతత్త్వాన్ని తెలియజేస్తాను. సకల దేవతలు, మునీంద్రులు, ఏకాగ్రచిత్తులై వినెదరుగాక!

**ప్రధానస్యాఽప్రధానస్య భాగాభాగస్య రూపిణః ।**
**జ్యోతిర్మయస్య భాగాస్తే వయం దేవాః ప్రభోస్త్రయః ॥71॥**

భగవన్! ప్రధానము అప్రధానమునైన (ప్రకృతి మరియు తదతీతమైన పరమాత్మయునైన) మీరు అనేకంగా విభజింపబడ్డారు. అయినప్పటికి మీరు విభాగరహితులు. జ్యోతిర్మయస్వరూపులు. పరమేశ్వరులైన మీ మూడు దేవతాంశాలే త్రిమూర్తులైన మనము ముగ్గురము.

**కస్త్వం కోహం చ కో బ్రహ్మా తవైవ పరమాత్మనః ।**
**అంశత్రయమిదం భిన్నం సృష్టిస్థిత్యంతకారణమ్ ॥72॥**

మీరెవరు? నేనెవరు? బ్రహ్మఎవరు? పరమాత్ములగు మీమూడంశలే ఈముగ్గురు. సృష్టి, స్థితి, లయకార్యాలు నిర్వహించడం వల్ల ఒకరి కంటె ఒకరు భిన్నంగా కన్పిస్తున్నారు.

**చింతయస్వాత్మనాత్మానం స్వలీలాధృతవిగ్రహః ।**
**ఏకస్త్వం బ్రహ్మ సగుణో హ్యంశ భూతా వయం త్రయః ॥73॥**

మీఅంతట ఆలోచించండి. మీరు లీలగా శరీరాన్ని ధరించియున్నారు. మీరు నిర్గుణ పరబ్రహ్మమైన ఒక్కరే.

మీరే సగుణబ్రహ్మ. బ్రహ్మ, విష్ణు, రుద్రులమైన మేము ముగ్గురము మీఅంశలము.

**శిరోగ్రీవాదిభేదేన తథైకస్యైవ వర్ష్మణః ।**
**అంగాని తే తథేశస్య తస్య భాగత్రయం హర ॥74॥**

ఒకేశరీరంలోని భిన్నభిన్న అవయవాలైన మస్తకం, కంఠం, అని వేర్వేరు నామాలను ధరించినప్పటికి అవి శరీరంనుండి వేరుకావు. అట్లే మనం ముగ్గురము పరమేశ్వరుడవైన మీ అంశలమే.

**యజ్జ్యోతిరభ్రం స్వపురం పురాణం కూటస్థ మవ్యక్త మనంత రూపమ్ ।**
**నిత్యం చ దీర్ఘాదివిశేషణాద్యై ర్హీనం శివస్త్వం తత ఏవ సర్వమ్ ॥75॥**

జ్యోతిర్మయుడు, ఆకాశంవలె సర్వవ్యాపి, నిర్లిప్తుడు, స్వయంధాముడు, పురాణుడు, కూటస్థుడు, అవ్యక్తుడు, అనంతుడు, నిత్యుడు, దీర్ఘుడు మొదలైన విశేషాలతో రహితుడు, నిర్విశేషబ్రహ్మ. ఆయనయే శివుడగు మీరు. కనుక మీరే సర్వస్వము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య మహాదేవో మునీశ్వర ।**
**బభూవ సుప్రసన్నశ్చ న జఘాన స మాం తతః ॥76॥**

ఈవిధంగా మహేశ్వరునిచే ఆజ్ఞాపింపబడిన విష్ణువు మహాదేవుని సంతసింపజేయడానికి అందరిముందు ఇలాచెప్పాడు.

నారదా! విష్ణుభగవానుని ఈ మాటలను విని, మహాదేవుడు మిగుల ప్రసన్నుడయ్యాడు. అంతట అతడు నన్ను సంహరింపక విడిచిపెట్టాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే సతీవివాహ శివలీలావర్ణనం నామైకోనవింశోஉధ్యాయః ॥19॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో సతీవివాహ శివలీలా వర్ణనం అనే పంతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## **వింశోఽధ్యాయః** – ఇరవైయవ అధ్యాయం
## **సతీవివాహవర్ణనమ్** – సతీవివాహవర్ణనం

**నాదర ఉవాచ** – నారదుడు చెప్పాడు.

**బ్రహ్మన్ విధే మహాభాగ శివభక్తవర ప్రభో ।**
**శ్రావితం చరితం శంభోరద్భుతం మంగళాయనమ్ ॥1॥**

బ్రహ్మన్!, విధీ! మహాభాగా! శివభక్తవరా! ప్రభో! మంగళకరమైన అద్భుతమైన శంభుని చరితము వినిపించారు.

**తతః కిమభవ త్తాత కథ్యతాం శశిమౌళినః ।**
**సత్యాశ్చ చరితం దివ్యం సర్వాఘౌఘవినాశనమ్ ॥2॥**

తండ్రి తదనంతరం సమస్త పాపసమూహ వినాశకము, దివ్యమునైన సతీశంకరుల వివాహ చరిత్ర ఏమిజరిగిందో చెప్పండి.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**నివృత్తే శంకరే చాస్మద్వధాద్భక్తానుకంపిని ।**
**అభవన్నిర్భయాస్సర్వే సుఖినస్సుప్రసన్నకాః ॥3॥**

భక్తానుకంపియైన శంకరుడు నాసంహారాన్ని విరమించుకొన్న తరువాత అందరు నిర్భయులు, సుఖవంతులు, సుప్రసన్నులు అయ్యారు.

**నతస్కంధా స్సాంజలయః ప్రణేముర్నిఖిలాశ్చ తే ।**
**తుష్టువు శ్శంకరం భక్త్యా చక్రుర్జయరవం ముదా ॥4॥**

సమస్త జనులు, మిక్కిలి భక్తితో చేతులు జోడించి వినమ్రులై శంకరుని స్తుతించారు. సంతోషంతో జయజయధ్వానాలు చేశారు.

**ఏతస్మిన్నేవ కాలేఽహం ప్రసన్నో నిర్భయో మునే ।**
**అస్తవం శంకరం భక్త్యా వివిధైశ్చ శుభస్తవైః ॥5॥**

అంతట నేనుకూడా నిర్భయుడను, ప్రసన్నుడనునై వివిధ స్తోత్రాలతో భక్తిపూర్వకంగా శంకరుని స్తుతించాను.

**తతస్తుష్టమనా శ్శంభుర్బహులీలాకరః ప్రభుః ।**
**మునే మాం సమువాచేదం సర్వేషాం శృణ్వతాం తదా ॥6॥**

నారదా! బహులీలాకరుడు, ప్రభుడు నైన శంభుడు సంతుష్టాంతరంగుడై, అందరూ వినుచుండగా నాతో ఇలా అన్నాడు.

**రుద్ర ఉవాచ** – రుద్రుడు చెప్పాడు.

**బ్రహ్మన్ తాత ప్రసన్నోఽహం నిర్భయస్త్వం భవాధునా ।**
**స్వశీర్షం స్పృశ హస్తేన మదాజ్ఞాం కుర్వసంశయమ్ ॥7॥**

"పితామహా! నేను మిక్కిలి ప్రసన్నుడనయ్యాను. భయాన్ని విడిచి నీతలను నీచేతితో స్పృశించు. నిస్సంశయంగా నా ఆజ్ఞను పాటించు".

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచశ్శంభోర్బహులీలాకృతః ప్రభోః ।**
**స్పృశన్ స్వం కం తథా భూత్వా ప్రణామం వృషభధ్వజమ్ ॥8॥**

శివుని మాటలనువిని, నేనతనికి నమస్కరించి నాతలను చేతితో స్పృశించాను.

**యావదేవమహం స్వం కం స్పృశాని నిజపాణినా ।**
**తావత్తత్ర స్థితం సద్యస్తద్రూప వృషవాహనమ్ ॥9॥**

నేనెప్పుడైతే అలాచేశానో నాకక్కడ వెంటనే వృషభవాహనుడైన శివునిరూపం గోచరించింది.

**తతో లజ్జా పరీతాంగస్థితశ్చాహమధోముఖః ।**
**ఇంద్రాద్యైరమరైస్సర్వైస్సుదృష్టస్సర్వతస్థితైః ॥10॥**

అంతటనేను సిగ్గుతో తలదించుకున్నాను. ఈ సంఘటనను అక్కడున్న ఇంద్రాది సమస్తదేవతలు స్పష్టంగా చూశారు.

**అథాహం లజ్జయావిష్టః ప్రణిపత్య మహేశ్వరమ్ ।**
**ప్రవోచం సంస్తుతిం కృత్వా క్షమ్యతాం క్షమ్యతామితి ॥11॥**

లజ్జావిష్టుడనైననేను వెంటనే మహేశ్వరునికి నమస్కరించి, ఆయనను స్తుతించి, 'క్షమించండి, క్షమించండి' అని వేడుకున్నాను.

**అస్య పాపస్య శుద్ధ్యర్థం ప్రాయశ్చిత్తం వద ప్రభో ।**
**నిగ్రహం చ తథాన్యాయం యేన పాపం ప్రయాతు మే ॥12॥**

శంకరా! నాయీ పాపశుద్ధి నిమిత్తం ప్రాయశ్చిత్తాన్ని చెప్పవలసినదని వేడుకుంటున్నాను.

**ఇత్యుక్తస్తు మయా శంభురువాచ ప్రణతం హి తమ్ ।**
**సుప్రసన్నతరో భూత్వా సర్వేశో భక్తవత్సలః ॥13॥**

నాయీ విన్నపాన్ని భక్తవత్సలుడైన శంకరుడు సుప్రసన్నుడై విని, నాతో ఇలా అన్నాడు.

**శంభురువాచ –** శంభుడు చెప్పాడు.

**అనేనైవ స్వరూపేణ మదధిష్ఠితకేన హి ।**
**తపః కురు ప్రసన్నాత్మా మదారాధన తత్పరః ॥14॥**

"వత్సా! నేనధిష్ఠించియున్న ఈరూపంతోనే మదారాధనతత్పరుడవైతపస్సుచెయ్యి."

**ఖ్యాతిం యాస్యసి సర్వత్ర నామ్నా రుద్రశిరః క్షితౌ ।**
**సాధకః సర్వకృత్యానాం తేజోభాజాం ద్విజన్మనామ్ ॥15॥**

ఈపైన లోకంలో నీవు 'రుద్రశిరస్కుడు' అనే నామంతో ప్రఖ్యాతికెక్కగలవు. తేజోవంతులైన బ్రహ్మణుల సర్వకృత్యములను సిద్ధింపచేసేవాడవవుతాడు.

**మనుష్యాణా మిదం కృత్యం యస్మాద్వీర్యం త్వయాఽధునా ।**
**తస్మాత్త్వం మానుషో భూత్వా విచరిష్యసి భూతలే ॥16॥**

ఈ వీర్యపతనం మానవుల లక్షణం. కాబట్టి నీవు మానవుడవై భూలోకంలో సంచరించు.

**యస్త్వాం చానేన రూపేణ దృష్ట్వా కౌ విచరిష్యతి ।**
**కిమేత ద్బ్రహ్మణో మూర్ధ్ని వదన్నితి పురాన్తకః ॥17॥**

ఈ రూపంతో భూమిమీద చరించే నిన్ను దర్శించినవారు 'బ్రహ్మ శిరస్సుపై రుద్రుడున్నాడేమిటని' ఆశ్చర్యమగ్న మానసులౌతారు.

**తతస్తే చేష్టితం సర్వం కౌతుకాచ్ఛ్రోష్యతీతి యః ।**
**పరదారకృతాత్త్యాగాన్ముక్తిం సద్యస్స యాస్యతి ॥18॥**

నీచే చేయబడిన ఈపనినిగూర్చి కోరికతో వినినవారు 'పరదారాభిలాష' అనే దోషంనుండి విముక్తులౌతారు.

**యథా యథా జనశ్చైత త్కృత్యన్తే కీర్తయిష్యతి ।**
**తథా తథా విశుద్ధిస్తే పాపస్యాస్య భవిష్యతి ॥19॥**

ఈ గాథను అధికంగా చెప్పుకొని, నీయందు దోషారోపణ ఎంత అధికంగా చేస్తే అంత అధికంగా నీపాపం తొలగి, ఆపాపం వారికి సంక్రమిస్తుంది.

**ఏతదేవ హి తే బ్రహ్మన్ ప్రాయశ్చిత్తం మయేరితమ్ ।**
**జనహాస్యకరం లోకే తవ గర్హాకరం పరమ్ ॥20॥**

జనులందరూ హేళనచేసేవిధంగా నీకు సిగ్గుకలిగించేవిధంగా ఉండే ఇదే నీకు శిక్ష. బ్రహ్మన్! ఇదేనీకు ప్రాయశ్చిత్తం.

**ఏతచ్చ తవ వీర్యం హి పతితం వేది మధ్యగమ్ ।**
**కామార్తస్య మయా దృష్టం నైతద్ధార్యం భవిష్యతి ॥21॥**

కామార్తుడవైన నీరేతస్సు నాలుగు బిందువులు భూమిపై ఈవేదిమధ్యలో పడడాన్ని నేను చూశాను.

**చతుర్బిందుమితం రేతః పతితం యత్క్షితౌ తవ ।**
**తన్మితాస్తోయదా వ్యోమ్ని భవేయుః ప్రళయంకరాః ॥22॥**

నీనుండి భూమిపైపడ్డ నాలుగు బిందువుల రేతస్సునుండి ప్రళయకారకములైన నాలుగు మేఘాలు ఆకాశంలో ఉద్భవిస్తాయి.

**ఏతస్మిన్నంతరే తత్ర దేవర్షీణాం పురో ద్రుతమ్ ।**
**తద్రేతస స్సమభవం స్తన్మితాశ్చ బలాహకాః ॥23॥**

ఈలోగా నాలుగు రేతస్సుబిందువుల నుండి ఈనాలుగు మేఘాలు ఉద్భవించాయి.

**సంవర్తక స్తథావర్తః పుష్కరో ద్రోణ ఏవ చ ।**
**ఏతే చతుర్విధాస్తాత మహామేఘా లయంకరాః ॥24॥**

సంవర్తకం, ఆవర్తం, పుష్కరం, ద్రోణం అనేవే లయకారులైన ఆనాలుగు మహామేఘాలు.

**గర్జంతశ్చాథ ముంచంత స్తోయానీషచ్ఛివేచ్ఛయా ।**
**ఫేలుర్వ్యోమ్ని మునిశ్రేష్ఠ తోయదాస్తే కదారవాః ॥25॥**

శివేచ్ఛతో ఈనాలుగు మహామేఘాలు భయంకరంగా గర్జిస్తూ, అల్పవృష్టిని వర్షిస్తూ, ఆకాశంలో సంచరించాయి.

**తైస్తు సంఛాదితే వ్యోమ్ని సుగర్జద్భిశ్చ శంకరః ।**
**ప్రశాన్ దాక్షాయణీ దేవీ భృశం శాంతోఽభవద్ద్రుతమ్ ॥26॥**

శంకరుని పలుకులకు ప్రత్యక్షసాక్ష్యంగా ఆకాశంలో వెంటనే నాలుగు మేఘాలుఉద్భవించి, గర్జిస్తు, అల్పవృష్టిని కురిపించాయి. దాక్షాయణీ శంకరుల ఆజ్ఞతో అవి వాటిస్థానానికి చేరుకున్నాయి.

**అథ చాహం వీతభయశ్శంకరస్యాజ్ఞయా తదా ।**
**శేషం వైవాహికం కర్మ సమాప్తిమనయం మునే ॥27॥**

నారదా! నేనుకూడా భయవర్జితుడనయ్యాను. అప్పుడు శంకరుని ఆజ్ఞచే తక్కిన వివాహకర్మను పూర్తిచేయించాను.

**పపాత పుష్పవృష్టిశ్చ శివా శివ శిరస్కయోః ।**
**సర్వత్ర చ మునిశ్రేష్ఠ ముదా దేవగణోఽర్ఝుతా ॥28॥**

దాక్షాయినీ శంకరుల శిరస్సులపై పుష్పవృష్టి కురిసింది. అంతటా ఆనందం వెల్లివిరిసింది. దేవతాగణాలన్నీ ఆనందంతో ఉప్పొంగాయి.

**వాద్యమానేషు వాద్యేషు గాయమానేషు తేషు చ ।**
**పఠత్సు విప్రవర్యేషు వాదాన్ భక్త్యాన్వితేషు చ ॥29॥**

భక్తి తత్పరులైన వాద్యకారులు వివిధ వాద్యాలను ప్రయోగించారు. గాయకులు గానాలు చేశారు. విప్రవర్యులు వేదమంత్రాలను పఠించారు.

**రంభాదిషు పురంధ్రీషు నృత్యమానాసు సాదరమ్ ।**
**మహోత్సవో మహానాసీ ద్దేవపత్నీషు నారద ॥30॥**

రంభాది అప్సరసలు ఆనందంతో నృత్యాలు చేశారు. దేవతాస్త్రీలు మహోత్సాహంతో ఉత్సవాన్ని జరుపుకున్నారు.

**అథ కర్మవితానేశః ప్రసన్నః పరమేశ్వరః ।**
**ప్రాహ మాం ప్రాంజలిం ప్రీత్యా లౌకికీం గతిమాశ్రితః ॥31॥**

అనంతరం యజ్ఞాది కర్మలకు ప్రభువైన పరమేశ్వరుడు ప్రసన్నుడై లౌకిక విధానాన్ని ఆశ్రయించి, చేతులు జోడించి, బ్రహ్మనైన నాతో ప్రీతితో ఇలా అన్నాడు.

**ఈశ్వర ఉవాచ –** ఈశ్వరుడు చెప్పాడు.

**హే బ్రహ్మన్ సుకృతం కర్మ సర్వం వైవాహికం చ యత్ ।**
**ప్రసన్నోఽస్మి త్వమాచార్యో దద్యాం తే దక్షిణాం చ కామ్ ॥32॥**

బ్రహ్మదేవా! నీవు వైవాహిక కర్మనంతటిని చక్కగా సంపూర్ణం చేయించావు. నేను చాలా సంతోషించాను. మీరు మాకు ఆచార్యులు. మీరు కోరిన దక్షిణనిస్తాను.

**యాచస్వ తాం సురజ్యేష్ఠ యద్యపి స్యాత్సుదుర్లభా ।**
**బ్రూహి శీఘ్రం మహాభాగ నాదేయం విద్యతే మమ ॥33॥**

ఓ సురజ్యేష్ఠా! మీరు దక్షిణను కోరండి. అది అత్యంత దుర్లభమైనదైనా శీఘ్రంగా తెలియజేయండి. మీకు నేను ఇవ్వలేనిదేదియు లేదుకదా!

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్సోఽహం శంకరస్య కృతాంజలిః ।**
**మునేఽవోచం వినీతాత్మా ప్రణమ్యేశం ముహుర్ముహుః ॥34॥**

మునీంద్రా! భగవంతుడైన శంకరుని మాటలను విని, వినమ్రచిత్తుడనై పదేపదే శంకరునికి నమస్కరిస్తు నేనిలా అన్నాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**యది ప్రసన్నో దేవేశ వరయోగ్యోఽస్మ్యహం యది ।**
**తత్కురు త్వం మహేశాన సుప్రీత్యా యద్వదామ్యహమ్ ॥35॥**

దేవేశా! మీరు ప్రసన్నులైతే, నేను వరాన్ని పొందడానికి అర్హుడనైతే, నేను చెప్పినదానినాలకించి ప్రీతితో దానిని సఫలం చేయండి.

**అనేనైవ తు రూపేణ వేద్యామస్యాం మహేశ్వర ।**
**త్వయా స్థేయం సదైవాత్ర నృణాం పాపవిశుద్ధయే ॥36॥**

మహేశ్వరా! మీరు ఈరూపంతోనే, ఈ వేదికమీదనే శాశ్వతంగా విరాజమానులు కండు. మీదర్శనంచే మానవుల పాపాలన్నీ ప్రక్షాళితమౌతాయి.

**యేనాస్య సంనిధౌ కృత్వా స్వాశ్రమం శశిశేఖర ।**
**తపః కుర్యాం వినాశాయ స్వపాపస్యాస్య శంకరః ॥37॥**

ఇది నీసాన్నిధ్యమైనందువలన దీనికి సమీపంలో నేను ఆశ్రమాన్ని నిర్మించుకొని, నాయీపాప నివృత్తికై తపస్సు చేసుకుంటాను.

**చైత్రశుక్లత్రయోదశ్యాం నక్షత్రే భగదైవతే ।**
**సూర్యవారే చ యో భక్త్యా వీక్షేత భువి మానవః ॥38॥**

**తదైవ తస్య పాపాని ప్రయాంతు హర సంక్షయమ్ ।**
**వర్ధతే విపులం పుణ్యం రోగా నశ్యంతు సర్వశః ॥39॥**

చైత్రమాస, శుక్లపక్ష త్రయోదశి ఆదివారం ఉత్తరఫల్గుణీ నక్షత్రమున భూతలమునందలి మానవులు భక్తితో మిమ్ము దర్శించినచో వారిపాపములన్నీ అప్పటికప్పుడే నశిస్తాయి. విపులమైన పుణ్యం వృద్ధిపొందుతుంది. సమస్తమైన రోగాలు పూర్తిగా నశిస్తాయి.

**యా నారీ దుర్భగా వంధ్యా కాణా రూపవివర్జితా ।**
**సాపి త్వద్దర్శనాదేవ నిర్దోషా సంభవే ద్ధ్రువమ్ ॥40॥**

దౌర్భాగ్యురాలు, గొడ్రాలు, అంగవికారి, రూపహీనయునైన స్త్రీ నీదర్శనమాత్రంచేతనే దోషరహితురాలౌతుంది. ఇది నిశ్చయం.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచో మే హి స్వాత్మసర్వసుఖావహమ్ ।**
**తథాఽస్త్వితి శివః ప్రాహ సుప్రసన్నేన చేతసా ॥41॥**

తన అందరికీ కూడ సుఖాన్నిచ్చే నాయీమాటలువిని, శివుడు ప్రసన్నచిత్తంతో 'విధాతా! అట్లే అగుగాక!' అన్నాడు.

**శివ ఉవాచ –** శివుడు చెప్పాడు.

**హితాయ సర్వలోకస్య వేద్యాం తస్యాం వ్యవస్థితః ।**
**స్థాస్యామి సహితః పత్న్యా సత్యా త్వద్వచనాద్విధే ॥42॥**

**ఇత్యుక్త్వా భగవాంస్తత్ర సభార్యో వృషభధ్వజః ।**
**ఉవాచ వేదిమధ్యస్థో మూర్తి కృత్వాంశ రూపిణీమ్ ॥43॥**

"నీవుచెప్పినట్లే సకల జగత్తునకు హితమునుకూర్చే తలంపుతో నేను నాపత్నియైన సతీదేవితోకూడి ఈవేదికమీదనే సుస్థిరంగా ఉంటాను." అనిపలికి భగవంతుడగు శివుడు పత్నీ సమేతుడై తన అంశరూపిణియైన మూర్తితని ప్రకటించి వేదిక మధ్యభాగంలో విరాజమానుడయ్యాడు.

**తతో దక్షం సమామంత్ర్య శంకరః పరమేశ్వరః ।**
**పత్న్యా సత్యా గంతుమనా అభూత్స్వజనవత్సలః ॥44॥**

అనంతరం స్వజనులపై వాత్సల్యభావంగల పరమేశ్వరుడు దక్షునినుండి శెలవు గైకొని తనభార్యయైన సతీదేవితోకూడి కైలాసానికి వెళ్ళడానికి సంసిద్ధుడయ్యాడు.

**ఏతస్మిన్నంతరే దక్షో వినయావనతస్సుధీః ।**
**సాంజలిర్నతకః ప్రీత్యా తుష్టావ వృషభధ్వజమ్ ॥45॥**

ఇంతలో దక్షుడు వినయంతో, శిరస్సు వంచి, చేతులు జోడించి, ప్రేమతో వృషభధ్వజుని కీర్తించాడు.

**విష్ణ్వాదయస్సురాస్సర్వే మునయశ్చ గణాస్తదా ।**
**నత్వా సంస్తూయ వివిధం చక్రుర్జయరవం ముదా ॥46॥**

అప్పుడు విష్ణువు మొదలైన సమస్తదేవతలు, మునులు, శివగణాలు కూడా అనేకవిధాలుగా స్తుతించారు. ఆనందంతో జయజయధ్వానాలు చేశారు.

**ఆరోప్య వృషభే శంభు స్సతీం దక్షాజ్ఞయా ముదా ।**
**జగామ హిమవత్ప్రస్థం వృషభస్థస్స్వయం ప్రభుః ॥47॥**

దక్షుని ఆజ్ఞతో పరమశివుడు సంతుష్టుడై సతీదేవిని వృషభవాహనంపై ఆసీనురాలను చేసి, స్వయంగా తానుకూడా వృషభారూఢుడై హిమాలయాలవైపునకు బయలుదేరాడు.

**అథ సా శంకరాభ్యాసే సుదతీ చారుహాసినీ ।**
**విరేజే వృషభస్థా వై చంద్రాంతే కాలికా యథా ॥48॥**

అంతట వృషభ వాహనంపై శంకరుని సమీపంలో ఆశీనురాలైన, చారుహాసినియైన సతీదేవి చంద్రునిలోని నీలిరేఖవలె శోభాయమానంగా ప్రకాశించింది.

**విష్ణ్వాదయ స్సురాస్సర్వే మరీచ్యాద్యా స్తథర్షయః ।**
**దక్షోఽపి మోహితశ్చాసీ త్తథాన్యే నిశ్చలా జనాః ॥49॥**

అప్పుడాదంపతుల శోభనుచూచి, విష్ణువు మున్నగు దేవతలు, మరీచ్యాది మహర్షులు, తదితర జనులందరు నిశ్చలులు, ఆశ్చర్యచకితులు అయ్యారు. దక్షుడుకూడ సమ్మోహితుడయ్యాడు.

**కేచిద్వాద్యాన్వాదయన్తో గాయంత స్సుస్వరం పరే ।**
**శివం శివయశశ్శుద్ధమనుజగ్ముః శివం ముదా ॥50॥**

అప్పుడు కొందరు వాద్యాలను వాయిస్తున్నారు. మరికొందరు మధుర స్వరంతో గానంచేస్తున్నారు. చాలామంది ప్రసన్నతతో శివుని, శివుని కల్యాణమయవిశుద్ధయశస్సును గానంచేస్తూ శివునివెంట నడుస్తున్నారు.

**మధ్యమార్గాద్విసృష్టో హి దక్షః ప్రీత్యాథ శంభునా ।**
**స్వధామ ప్రాప సగణః శంభుః ప్రేమ సమాకులః ॥51॥**

శంకరుడు మార్గమధ్యంనుండి దక్షునికి ప్రీతితో వీడ్కోలు పలికి సాగనంపాడు. స్వయంగా ప్రేమపరవశు డై, సతీదేవితోను, ప్రమథగణాలతోను తననివాసమైన కైలాసానికి చేరుకున్నాడు.

**విసృష్టా అపి విష్ణ్వాద్యా శ్శంభునా పునరేవ తే ।**
**అనుజగ్ముశ్శివం భక్త్యా సురాః పరమయా ముదా ॥52॥**

విష్ణ్వాది సమస్త దేవతలకు శంకరుడు వీడ్కోలు పల్కినప్పటికి, శివునియందలి భక్తిచే వారందరు పరమానందంతో తిరిగి శివునివెంట నడిచారు.

**తైస్సర్వైస్సగణై శ్శంభుసత్యా చ స్వస్త్రియా యుతః ।**
**ప్రాప స్వం ధామ సంహృష్టో హిమవద్గిరిశోభితమ్ ॥53॥**

వారందరితో, తన శివగణాలతో, తనభార్యయైన సతీదేవితో కూడిన శివుడు సంతుష్టాంతరంగుడై, హిమవద్గిరి శోభితమైన కైలాసధామానికి చేరుకున్నాడు.

**తత్ర గత్వాఖిలాన్దేవాన్మునీనపి పరాం స్తథా ।**
**ముదా విసర్జయామాస బహుసమ్మాన్య సాదరమ్ ॥54॥**

అక్కడకు వెళ్ళిన శంకరుడు దేవతలను, మునులను, ఇతరులందరిని అనేక విధాలుగా సన్మానించి సంతోషంతో వారికందరికి వీడ్కోలు పలికాడు.

**శంభుమాభాష్య తే సర్వే విష్ణ్వాద్యా ముదితాననాః ।**
**స్వం స్వం ధామ యయుర్నత్వా స్తుత్వా చ మునయస్సురాః ॥55॥**

శంభుని ఆజ్ఞనుపొంది విష్ణ్వాది సమస్త దేవతలు, మునీంద్రులు, ఆ స్వామికి నమస్కరించి, స్తుతించి, ఆనందంతో నిండిన ముఖాలతో తమతమ నివాసాలకు వెళ్ళారు.

**శివోఽపి ముదితోఽత్యర్థం స్వపత్న్యా దక్షకన్యయా ।**
**హిమవత్ప్రస్థసంస్థో హి విజహార భవానుగః ॥56॥**

శివుడుకూడా ఎల్లప్పుడు సదాశివుని సంస్మరిస్తూ, హిమవత్ పర్వత శిఖరంపై తనపత్నియైన దక్షకన్యతోకూడి, పరమానందంతో విహరింపసాగాడు.

**తతస్స శంకరస్సత్యా సగణస్సూతికృన్మునే ।**
**ప్రాప స్వం ధామ సంహృష్టః కైలాసం పర్వతోత్తమమ్ ॥57॥**

ఈవిధంగా సతీదేవితో, తనశివగణాలతో, తననివాసమైన కైలాసశిఖరం చేరి, శంకరుడు సంతుష్టాంత రంగుడయ్యాడు.

**ఏతద్వస్సర్వమాఖ్యాత యథా తస్య పురాఽభవత్ ।**
**వివాహో వృషయానస్య మనుస్వాయంభువాంతరే ॥58॥**

పూర్వకాలంలో స్వాయంభువ మన్వంతరంలో శంకరభగవానుడు సతీదేవిని పరిణయమాడిన విధమంతా నీకు వినిపించాను.

**వివాహసమయే యజ్ఞే ప్రారంభే వా శృణోతి యః ।**
**ఏతదాఖ్యానమవ్యగ్రస్సంపూజ్య వృషభధ్వజమ్ ॥59॥**

వివాహసమయంలోను, యజ్ఞసమయంలోను, తదితరశుభకార్యప్రారంభంలోను వృషభధ్వజుని పూజించి, శాంతచిత్తంతో ఈగాథను వినాలి.

**తస్యాఽవిఘ్నం భవేత్సర్వం కర్మవైవాహికం చ యత్ ।**
**శుభాఖ్యమపరం కర్మ నిర్విఘ్నం సర్వదా భవేత్ ॥60॥**

అట్టివానికి సకల కార్యాలు, వైవాహికకర్మ, నిర్విఘ్నంగా నెరవేరుతాయి. తక్కిన శుభకార్యాలుకూడా నిర్విఘ్నంగా కొనసాగుతాయి.

**కన్యా చ సుఖసౌభాగ్యశీలాచారగుణాన్వితా ।**
**సాధ్వీ స్యాత్పుత్రిణీ ప్రీత్యా శ్రుత్వాఖ్యానమిదం శుభమ్ ॥61॥**

శుభంకరమైన ఈకథను ప్రేమతోవిని, వివాహం చేసుకొనే కన్యలకుకూడా శుభపరంపర కలుగుతుంది. అట్టి స్త్రీలు సుఖ సౌభాగ్యాలు, సౌశీల్యం, సదాచార పరాయణత్వం మొదలైన సద్గుణాలతో సుసంపన్నులై, సాధ్వీమణులై, పుత్రవంతులై వెలుగొందుతారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే సతీవివాహవర్ణనం నామ వింశోఽధ్యాయః ॥20॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో సతీవివాహవర్ణనం అనే ఇరవైయవ అధ్యాయం సమాప్తం.

## ఏకవింశోऽధ్యాయః - ఇరవై ఒకటవ అధ్యాయం
## సతీశివ క్రీడావర్ణనమ్ - సతీశివ క్రీడావర్ణనం

**సమీచీనం వచస్తాత సర్వజ్ఞస్య తవాऽనఘ ।**
**మహాద్భుతం శ్రుతం నో వై చరితం శివయోశ్శుభమ్ ॥1॥**

తండ్రీ! సర్వజ్ఞులైన సతీశంకరుల మహాద్భుతమైన, శుభంకరమైన చరిత్రను మీరు చక్కగా చెప్పగా విన్నాను.

**వివాహశ్చ శ్రుతస్సమ్యక్ సర్వమోహాపహారకః ।**
**పరమజ్ఞానసంపన్నో మంగళాలయ ఉత్తమః ॥2॥**

సమస్త మోహాలను తొలగించి, పరమజ్ఞాన సంపన్నులను చేసే మంగళప్రదమైన ఉత్తమమైన సతీశంకరుల వివాహ మహోత్సవ గాథను కూడా చక్కగా విన్నాను.

**భూయ ఏవ వివిత్సా మే చరితం శివయోశ్శుభమ్ ।**
**తద్వర్ణయ మహాప్రాజ్ఞ కృపాం కృత్వాऽతులామరమ్ ॥3॥**

వారి దివ్యచరితను ఇంకావినాలని, నాకుకోరికగా వుంది. కాబట్టి నాకు దయతో సతీశంకరుల వివాహానంతర గాథను వివరించి చెప్పవలసినదిగా కోరుతున్నాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**సమ్యక్కారుణికస్యైవ మునే తే విచికిత్సితమ్ ।**
**యదహం నోదితస్సౌమ్య శివలీలానువర్ణనే ॥4॥**

శివలీలావర్ణనలలో నాచేచెప్పబడని, నీచే కోరబడినగాథను చక్కగా వివరించాలని నాకుకూడా కుతూహలంగావుంది.

**వివాహ్య దక్షజాం దేవీం సతీం త్రైలోక్యమాతరమ్ ।**
**గత్వా స్వధామ సుప్రీత్యా యదకార్షీన్నిబోధ మే ॥5॥**

ముల్లోకాలకు తల్లియైన దాక్షాయణీదేవిని శంకరుడు వివాహమాడినతరువాత తన నివాసానికి వెళ్ళి సుప్రసన్నుడై వారుచేసినదేమిటో తెలియజేస్తాను.

**తతో హరస్య సగణస్స్వస్థానం ప్రాప్య మోదనమ్ ।**
**దేవర్షే తత్ర వృషభాదవాతరదతిప్రియాత్ ॥6॥**

నారదా! అంతట హరుడు సగణంతో సంతోషంతో స్వస్థానానికి చేరిన పిదప సతీదేవిని మిక్కిలి ప్రీతితో వృషభవాహనం నుండి క్రిందికి దింపాడు.

**యథాయోగ్యం నిజస్థానం ప్రవిశ్య స సతీసఖః ।**
**ముముదేऽతీవ దేవర్షే భవాచారకరశ్శివః ॥7॥**

సతీసఖుడైన శంకరుడు తన ఆశ్రమానికి చేరుకుని మిక్కిలి ఆనందించాడు.

**తతో విరూపాక్ష ఇమాం ప్రాప్య దాక్షాయణీం గణాన్ ।**
**స్వీయాన్ నిర్యాపయామాస నంద్యాదీన్ గిరికందరాత్ ॥8॥**

విరూపాక్షుడైన పరమేశ్వరుడు తనగిరికందరంనుండి నంది మొదలైన సమస్తగణాన్ని స్వయంగా తానే పంపించేశాడు.

**ఉవాచ చైతాంస్తాన్ సర్వాన్నంద్యాదీనతిసూనృతమ్ ।**
**లౌకికీం రీతిమాశ్రిత్య కరుణాసాగరః ప్రభుః ॥9॥**

కరుణాసాగరుడైన శంకరుడు ప్రాకృతజనునివలె నంది మున్నగువారందరితో ఇలా అన్నాడు.

**మహేశ ఉవాచ** – మహేశ్వరుడు చెప్పాడు.

**యదాహం చ స్మరామ్యత్ర స్మరణాదరమానసాః ।**
**సమాగమిష్యథ తదా మత్పార్శ్వం మే గణాద్రుతమ్ ॥10॥**

"నేనెప్పుడు స్మరిస్తే అప్పుడు తక్షణం నాచెంతకు రండు".

**ఇత్యుక్తే వామదేవేన నంద్యాద్యాస్స్వగణాశ్చ తే ।**
**మహావేగా మహావీరా నానాస్థానేషు సంయయుః ॥11॥**

అనిపలికి వామదేవుడు నంది మున్నగు సమస్త గణాలను అక్కడనుండి పంపించగా, వారందరు మహావేగంగా నానాస్థానాలకు వెళ్ళారు.

**ఈశ్వరోఽపి తయా సార్ధం తేషు యాతేషు విభ్రమీ ।**
**దాక్షాయణ్యా సమం రేమే రహస్యే ముదితో భృశమ్ ॥12॥**

వారందరు వెళ్ళిపోగానే ఈశ్వరుడుకూడా చాలా సంతోషించి, ఆ రహస్యస్థావరంలో దాక్షాయణీదేవితో అనేక విధాలుగా విహరించాడు.

**కదాచిద్వన్యపుష్పాణి సమాహృత్య మనోహరమ్ ।**
**మాలాం విధాయ సత్యాస్తు హారస్థానే స యోజయత్ ॥13॥**

ఒక్కొక్కప్పుడు వనంలోనికివెళ్ళి, పుష్పాలను కోసితెచ్చి, మాలగాకూర్చి, దానిని సతీదేవి కంఠంలో అలంకరించేవాడు.

**కదాచిద్దర్పణే చైవ వీక్షంతీమాత్మనస్సతీమ్ ।**
**అనుగమ్య హరో వక్త్రం స్వీయమప్యవలోకయత్ ॥14॥**

ఒక్కొక్కప్పుడు సతీదేవి నిలువుటద్దంముందు నిలబడి తాను అద్దంలో చూచుకొనుచుండగా హరుడు హఠాత్తుగా ఆమెవెనుకకు వచ్చి తన ముఖాన్నికూడా చూసుకుంటుండేవాడు.

**కదాచిత్కుండలం తస్యా ఉల్లాస్యోల్లాస్య సంగతః ।**
**బధ్నాతి మోచయత్యేవ సా స్వయం మార్జయత్యపి ॥15॥**

ఒక్కొక్కమారు ఆమె వారిస్తున్నను కుండలాలను శంకరుడు లాగిలాగి పట్టుకుంటున్నాడు. విడిచి పెడుతున్నాడు.

**సరాగౌ చరణావస్యాః పావకేనోజ్జ్వలేన చ ।**
**నిసర్గరక్తౌ కురుతే పూర్ణరాగౌ వృషధ్వజః ॥16॥**

ఒక్కొక్కమారు శిరీష కుసుమ పేశలమైన ఆమె పాదాలను లత్తుకతో ఎర్రగా అలంకరించి, మరింత రాగరంజితం చేసేవాడు.

**ఉచ్చైరపి యదాఖ్యేయ మన్యేషాం పురతో బహు ।**
**తత్కర్ణే కథయత్యస్యా హరో ద్రష్టుం తదాననమ్ ॥17॥**

ఒక్కొక్కమారు సతీదేవి ముఖసౌందర్యాన్ని అతిసన్నిహితంగా చూడాలనే కుతూహలంతో “ఇతరుల ఎదుట బిగ్గరగా మాట్లాడకూడదు. నామాటలు వారు వినకూడదు. ఇది రహస్యం” అంటూ చెవిలో చెప్పేవాడు.

**నదూరమపి గన్తాసౌ సమాగత్య ప్రయత్నతః ।**
**అనుబధ్నాతి వామాక్షీ పృష్ఠదేశేఽన్యమానసామ్ ॥18॥**

అన్యమనస్కురాలై, కొంచెం దూరంలో కూర్చున్న సతీదేవిని వెనుకనుండి వచ్చి కన్నులు మూసేవాడు.

**అంతర్హితస్తు తత్రైవ మాయయా వృషభధ్వజః ।**
**తామాలిలింగ భీత్యా స్వం చకితా వ్యాకులాఽభవత్ ॥19॥**

వృషభధ్వజుడు తన మాయచే అంతర్హితుడు కాగా భయంతో వ్యాకులపడుతున్న సతీదేవిని కౌగిలించుకొని ఆశ్చర్యచకితను చేసేవాడు.

**సౌవర్ణపద్మకలికాతుల్యే తస్యాః కుచద్వయే ।**
**చకార భ్రమరాకారం మృగనాభివిశేషకమ్ ॥20॥**

బంగారు తామర మొగ్గవలె రమ్యమైన ఆమె కుచద్వయంపై మృగనాభి (కస్తూరి) తో తుమ్మెదల ఆకారాన్ని రచించేవాడు.

**హారమస్యాః కుచయుగా ద్వియోజ్య సహసా హరః ।**
**న్యయోజయచ్చ తత్రైవ స్వకరస్పర్శనం ముహుః ॥21॥**

హరుడు ఆమె హారాన్ని కుచద్వయంపైనుండి తీస్తు, వేస్తు మాటిమాటికి కుచద్వయాన్ని తనచేతులతో స్పృశించేవాడు.

**అంగదాన్వలయా నూర్మాన్విశ్లేష్య చ పునః పునః ।**
**తత్స్థానా త్పునరేవాసౌ తత్స్థానే ప్రత్యయోజయత్ ॥22॥**

పావడా, వడ్డాణం, వస్త్రాల ముడతలను సరిచేయడానికి, వాటివాటి స్థానాలనుండి తీయడము, మళ్ళీ అదేస్థానంలో పెట్టడం, మళ్ళీ మళ్ళీ చేసేవాడు. ఈనెపంతో ఆమెయొక్క ఆయా అంగాలను లీలగా తాకేవాడు.

**కాలికేతి సమాయాతి సవర్ణా తే సఖీత్వమామ్ ।**
**యాస్యత్యస్యాస్తథేక్షంత్యాః ప్రోత్తుంగౌ సాహసం కుచౌ ॥23॥**

కాళికా! నీతో సమానమైన వన్నెగల నీ చెలికత్తె వస్తోందని శివుడు పిలిచేవాడు. ఆమె ఆ దిక్కునకు చూస్తూ ఉండగా ఆమె ఉన్నతమైన స్తనాలను దర్శించేవాడు. స్తనాలను అలా చూడాలనే కోరికతోనే ఆయన అట్లు పిలిచేవాడు.

**కదాచిన్మదనోన్మాదచేతనః ప్రమథాధిపః ।**
**చకార నర్మ శర్మాణి తథాకృత్ప్రియయా ముదా ॥24॥**

అప్పుడప్పుడు మదనోన్మాదచేతనుడైన ప్రమథాధిపుడు ప్రియురాలితో సంతోషంగా నర్మగర్భ సంభాషణలు, రహస్యమైన సంతోషకార్యాలను చేసేవాడు.

**ఆహృత్య పద్మపుష్పాణి రమ్యపుష్పాణి శంకరః ।**
**సర్వాంగేషు కరోతిస్మ పుష్పాభరణ మాదరాత్ ॥25॥**

శంకరుడు తామర పూవులను, రమ్యమైన పుష్పాలను తెచ్చి, ప్రేమతో ఆమె సర్వావయవాలను పుష్పాభరణాలతో విరాజిల్లేటట్లు చేసేవాడు.

**గిరికుంజేషు రమ్యేషు సత్యా సహ మహేశ్వరః ।**
**విజహార సమస్తేషు ప్రియయా భక్తవత్సలః ॥26॥**

భక్తవత్సలుడైన మహేశ్వరుడు కైలాసపర్వతప్రాంత రమ్యలతాగృహాలన్నింటియందు సతీదేవితోకూడి విహరించాడు.

**తయా వినా స్మ నో యాతి నాస్థితో న స్మ చేష్టతే ।**
**తయా వినా క్షణమపి శర్మ లేభే న శంకరః ॥27॥**

శంకరుడు ఆమె లేకుండా ఎక్కడకూ వెళ్ళేవాడుకాదు. ఆమెకు ప్రియంకానిచోట ఉండేవాడుకాదు. ఆమె లేకుండా క్షణంకూడా ఆనందంగా ఉండలేకపోయేవాడు.

**విహృత్య సుచిరం కాలం కైలాసగిరికుంజరే ।**
**అగమద్ధిమవత్ప్రస్థం సస్మార స్వేచ్ఛయా స్మరన్ ॥28॥**

ఇట్లు కైలాస పర్వతప్రాంత లతాగృహాలలో చిరకాలం విహరించిన పిమ్మట కైలాసాన్నివీడి, హిమవత్పర్వత ప్రాంతవనప్రదేశాలకు వెళ్ళాడు. అప్పుడు కందర్పుడు దర్పంతో ఎల్లవేళలా శంకరునిచెంత కింకరునిలా ఉంటున్నాడు.

**తస్మిన్ప్రవిష్టే కామే తు వసంతశ్శంకరాంతికే ।**
**వితస్తార నిజం భావం హార్దం విజ్ఞాయ యత్ప్రభోః ॥29॥**

మన్మథుడెప్పుడైతే వచ్చాడో వసంతుడుకూడా హృదయాహ్లాదకరమైన విధంగా శంకరుని నివాస ప్రాంతమంతా వ్యాపించాడు.

**సర్వే చ పుష్పితా వృక్షా లతాశ్చాన్యాశ్చ పుష్పితాః ।**
**అంభాంసి ఫుల్లపద్మాని పద్మాస్స్వభ్రమరాస్తథా ॥30॥**

అప్పుడు వృక్షాలన్నీ పుష్పించాయి. తక్కిన లతలన్నీకూడ పుష్పితమయ్యాయి. సరోవరాలన్నీ వికసించిన పద్మాలతో నిర్మల జలపూర్ణమై మనోజ్ఞంగా ఉన్నాయి. పద్మాలన్నీ తుమ్మెదలతోకూడి శోభిస్తున్నాయి.

**ప్రవిష్టే తత్ర సదృతౌ వవౌ స మలయో మరుత్ ।**
**సుగంధిగంధపుష్పేణ మోదకశ్చ సుగంధియుక్ ॥31॥**

అక్కడంతా వసంతవైభవం రాగానే సకలజన మోహకారకమైన పుష్ప సుగంధాలతోకూడిన మలయ మారుతంకూడ అక్కడకు వచ్చిచేరింది.

**సంధ్యార్ధచంద్రసంకాశాః పలాశాశ్చ విరేజిరే ।**
**కామాస్త్రవత్సుమనసః ప్రమోదాత్పాదపాధరః ॥32॥**

సంధ్యాసమయంలోని చంద్రునితో సమానమైన కాంతిగల మొదలగు పూలువికసించాయి విరాజిల్లాయి. అదేవిధంగా మన్మథబాణాలవంటి పుష్పాలను చెట్లన్నీ ఆనందంగా ధరించాయి.

**బభుః పంకజపుష్పాణి సరస్సు సకలాఙ్జనాన్ ।**
**సంమోహయితు ముద్యుక్తా సుముఖీ వాయుదేవతా ॥33॥**

సరస్సులు పద్మాలతో నయనానందకరంగా ఉన్నాయి. సుగంధముఖియైన వాయుదేవత లోకాలను సమ్మోహపరచడానికి ఉద్యుక్తురాలయ్యింది.

**నాగకేశరవృక్షాశ్చ సర్వవర్ణైః ప్రసూనకైః ।**
**బభుర్మదనకేత్వాభా మనోజ్ఞాశ్శంకరాంతికే ॥34॥**

శంకరుని నివాసంలో నాగకేసర వృక్షాలు సమస్త వర్ణాలతో కూడిన పుష్పాలతో మనోజ్ఞంగా మన్మథకేతనాలవలే విరాజిల్లాయి.

**లవంగవల్లీ సురభిగంధేనోద్వాస్య మారుతమ్ ।**
**మోహయామాస చేతాంసి భృశం కామిజనే పురా ॥35॥**

లవంగపుతీగ సురభిగంధంతో కూడిన మందమారుతం కాముకజనుల చిత్తాలను సమ్మోహపరచసాగింది.

**చారు చర్చితభృంగౌఘా సుస్వరాశ్చూతశాలినః ।**
**బభుర్మదన బాణౌఘ పర్యంక మదనావృతాః ॥36॥**

ఆప్రాంతంలోనివారంతా మదనాగ్నిని తొలగించు చందనాది మైపూతలతోను, కోకిల సుస్వర గానాలతోను, మన్మథ బాణ సమూహాల పర్యంకాలతోను, మదనావృతులై విరాజిల్లుతున్నారు.

**అంభాంసి మలహీనాని రేజుః ఫుల్లకుశాశయాః ।**
**మునీనామివ చేతాంసి ప్రవ్యక్త జ్యోతిరుద్గమమ్ ॥37॥**

నిర్మలమైన జలాలు, వికసించిన పుష్పాలతో ఒప్పారిన సరస్సులు, ఆత్రజ్ఞానంపొందిన మునుల హృదయాలవలె స్పష్టమైన జ్యోతిరా విర్భావం కలుగునట్లుగా ప్రకాశించాయి.

**తుషారా స్సూర్యరశ్మీనాం సంగమాదగమన్ బహిః ।**
**ప్రమత్వానీక్ష్యతేక్షాశ్చ సలిలీహృదయా స్తదా ॥38॥**

మంచుబిందువులు సూర్యరశ్ముల సంగమంచే నీరుగారిన హృదయాలుగలవై, అంతరిక్షంలోనికి ఆవిరి రూపంలో ఎగిశాయి.

**ప్రసన్నా సహచన్ద్రేణ ననిషారా స్తదాఽభవన్ ।**
**విభావర్యః ప్రియేణైవం కామిన్య స్సుమనోహరాః ॥39॥**

అప్పుడు రాత్రులు చంద్రునితో, కూడియున్నవై ప్రియునితోకూడిన అందమైన మేలిముసుగులేని యువతులవలె నిర్మలంగా ప్రకాశిస్తున్నాయి.

**తస్మిన్కాలే మహాదేవ స్సహసత్యా ధరోత్తమే ।**
**రేమే స సుచరం ఛన్దం నికుంజేషు నదీషు చ ॥40॥**

ఆసమయంలో శైల శిఖరాగ్రాలయందును, అద్రి నికుంజాలలోను, నదులలోను సతీదేవితోకూడి, శంకరుడు యథేచ్ఛగా విహరించాడు.

**తథా తేన సమం రేజే తదా దాక్షాయణీ మునే ।**
**యథా హరః క్షణమపి శాంతిమాప తయా వినా ॥41॥**

అప్పుడు శంకరుడు సతీదేవి లేనిచో క్షణంకూడ శాంతిని పొందలేడనే రీతిలో ఆమెకూడ శంకరునితోకూడి విహరించింది.

**సంభోగవిషయే దేవీ సతీ తస్య మనః ప్రియా ।**
**విశతీవ హరస్యాంగే పాయయన్నివ తద్రసమ్ ॥42॥**

హరుని శరీరాంగాలలోని రసాన్ని వివశురాలై పానంచేస్తున్న విధంగా సంభోగవిషయంలో సతీదేవి శంకరుని మనస్సునకు ప్రీతికరంగా వర్తించింది.

**తస్యాః కుసుమమాలాభి ర్భూషయన్సకలాం తనుమ్ ।**
**స్వహస్తరచితాభిస్తు నవశర్మా కరోచ్చ సః ॥43॥**

శంకరుడు స్వహస్తాలతోగ్రుచ్చిన పూలదండలతో సతీదేవి శరీరాన్నంతనూ అలంకరిస్తూ క్రొత్త సౌఖ్యాన్ని ఆమెకు కలిగించాడు.

**ఆలాపై ర్వీక్షితై ర్హాస్యైస్తథా సంభాషణైర్హరః ।**
**తస్యాదిదేశ గిరిజాం శంసతీవాత్మసంవిదమ్ ॥44॥**

నిర్విరామంగా సల్లాపాలతోను, కృపావీక్షణాలతోను, హాస్యప్రసంగాలతోను, చతుర సంభాషణలతోను, ఆక్షణంలోనే ఆత్మబోధ చేస్తున్నాడా! అన్నట్లుగా హరుడు సతితోకూడి, లీలావిహారం చేశాడు.

**తద్వక్త్ర చంద్రపీయూష పాన స్థిర తనుర్హరః ।**
**నానావైశేషికీం తన్వీమవస్థాం స కదాచన ॥45॥**

ఆమె ముఖారవింద సౌందర్యాన్ని పానంచేసి, హరుడు ఆనందంగా ఉండి. తన శరీరాన్నేమఱిచిపోయాడు. మైమరిచపోయాడు.

**తద్వక్త్రాంబుజ వాసేన తత్సౌన్దర్యైశ్చ నర్మభిః ।**
**గుణైరివ మహాదంతీ బద్ధో నాన్యవిచేష్టితః ॥46॥**

కదలడానికి వీలులేకుండు రీతిలో ఏనుగును త్రాళ్ళతో బంధించిన విధంగా ఆమె ముఖపద్మ వాసనలచేత ను, ఆమె రహస్య సౌందర్యాలచేతను, ఈశ్వరుడు స్థిరమైన తనువు కలవాడయ్యాడు. అనగా నిశ్చలుడయ్యాడని భావము.

**ఇతి హిమగిరి కుంజ ప్రస్థభాగే దరీషు ప్రతిదిన మభిరేమే దక్షపుత్ర్యా మహేశః ।**
**క్రతుభుజ పరిమాణైః క్రీడతస్తస్య జాతా దశదశ చ సురర్షే వత్సరాః పంచచాన్యే ॥47॥**

ఓ దేవర్షీ! ఈవిధంగా హిమవత్పర్వత ఉపత్యకలయందును, నికుంజాలయందును, వారితీరాలయందును, దక్షపుత్రికతో మహేశుడు ప్రతిదినం యథేచ్ఛగా విహరించాడు. దేవమానం ప్రకారం శంకరుడీవిధంగా సతీదేవితో ఇరవైఐదు సంవత్సరాలు వినోదించాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే సతీశివ క్రీడావర్ణనం నామైకవింశోఽధ్యాయః ॥21॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో సతీశివ క్రీడావర్ణనం అనే ఇరవైఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్వావింశోఽధ్యాయః - ఇరవై రెండవ అధ్యాయం
## సతీశివ విహారవర్ణనమ్ - సతీశివ విహారవర్ణనం

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**కదాచిదథ దక్షస్య తనయా జలదాగమే ।**
**కైలాస క్ష్మాభృతః ప్రాహ ప్రస్థస్థం వృషభధ్వజమ్ ॥1॥**

ఒకానొకప్పుడు వర్షఋతువురాగా దాక్షాయణికైలాస పర్వతసానువులందున్నశకంరునితో పలికెను.

**సత్యువాచ -** సతీదేవి చెప్పింది.

**దేవదేవ! మహాదేవ! శంభో! మత్ప్రాణవల్లభ! ।**
**శృణు మే వచనం నాథ శ్రుత్వా తత్కురు మానద ॥2॥**

దేవదేవా! మహాదేవా! శంభో! ప్రాణవల్లభ! నేను చెప్పే మాటలను విని, ఆ పనిని పూర్తిచేయండి.

**ఘనాగమోయం సంప్రాప్తః కాలః పరమదుస్సహః ।**
**అనేకవర్ణ మేఘౌఘా స్సంగీతాంబరదిక్చయాః ॥3॥**

నాథా! మిక్కిలి దుస్సహమైన వర్షఋతువు ఆరంభమయ్యింది. అనేక వర్ణాల మేఘసముదాయాలు తమ ఉరుములతో దిక్కులన్నిట ఆకాశంలో వ్యాపించాయి.

**వివాంతి వాతా హృదయం హారయంతీతి వేగినః ।**
**కదంబ రజసా ధౌతాః పాథోబిందు వికర్షణాః ॥4॥**

వేగంగా వీచేగాలులు కదంబపుష్ప పరాగాన్ని ఎగరగొడుతు, నీటిధారలను చెదరకొడుతు, హృదయానికి ఆనందంకలిగిస్తున్నాయి.

**మేఘానాం గర్జితై రుచ్చైర్ధారా సారం విముంచతామ్ ।**
**విద్యుత్ పతాకినాం తీవ్రైః క్షుబ్ధం స్యాత్కస్య నో మనః ॥5॥**

కుండపోతగా జలాలను వర్షిస్తూ, మెరుపుతీగలే పతాకలుగా తీవ్రంగా గర్జిస్తున్న ఈమేఘాలనుచూస్తే ఎవరి మనస్సు భీతావహం కాకుండా ఉంటుంది?

**న సూర్యో దృశ్యతే నాపి మేఘచ్ఛన్నో నిశాపతిః ।**
**దివాపి రాత్రివద్భాతి విరహివ్యసనాకరః ॥6॥**

మేఘచ్ఛన్నమైన సూర్యచంద్రులు గోచరంకాని కారణంగా విరహబాధను కలిగించుచు పగలుకూడా రాత్రివలె భాసిస్తోంది.

**మేఘా నైకత్ర తిష్ఠంతో ధ్వనన్తః పవనేరితాః ।**
**పతంత ఇవ లోకానాం దృశ్యన్తే మూర్ధ్ని శంకర ॥7॥**

గర్జిస్తూ వాయుసంచలిత ములైన మేఘాలు ఏఒక్కచోటా కూడా నిలబడడంలేదు. జనుల శిరస్సుపై పడుతున్నట్లుగా కన్పిస్తున్నాయి.

**వాతాహతా మహావృక్షా నర్తంత ఇవ చాంబరే ।**
**దృశ్యంతే హర భీరూణాం త్రాసదాః కాముకేప్సితాః ॥8॥**

వాతాహతములైన మహావృక్షాలు ఆకాశంలో నర్తిస్తున్నట్లున్నాయి. ఇవి కాముకులకు కోరికలను కల్గించేవిగాను, భీరువులకు భయాన్ని కలిగించేవిగాను, కన్పిస్తున్నాయి.

**స్నిగ్ధనీలాంజనస్యాశు సదివౌఘస్య పృష్ఠతః ।**
**బలాకరాజీవాత్యుచ్చై ర్యమునాపృష్ఠఫేనవత్ ॥9॥**

నల్లని మేఘాలు, వాటివెనక ఎగిరే తెల్లని కొంగలు ఉత్తుంగ తరంగాలతో వెళుతున్న యమునానది మీద నురుగువలె ప్రకాశిస్తున్నాయి.

**క్షపాక్షయేశవలయం దృశ్యతే కాలికాగతం ।**
**అంబుధావివ సందీప్తపావకో వడవాముఖః ॥10॥**

నల్లని మబ్బులలో ఉన్న ఉదయిస్తున్న సూర్యుడు సముద్రంలో మండుతున్న బడబాగ్నివలె ఉన్నాడు.

**ప్రారోహంతీహ సస్యాని మందిరప్రాఙ్గణేష్వపి ।**
**కిమన్యత్ర విరూపాక్ష సస్యోద్భూతం వదామ్యహమ్ ॥11॥**

గృహ ప్రాంగణంలోని గింజలే మొలకెత్తుతున్నాయి. అటువంటప్పుడు పంటపొలాల్లో సస్యాలు పెరుగుతున్నాయని వేరే చెప్పనవసరంలేదుకదా!

**శ్యామలై రాజతై రక్తై ర్విశదోయం హిమాచలః ।**
**మందరాశ్రయ మేఘౌఘః పత్రై ర్దుగ్ధాంబుధి ర్యథా ॥12॥**

శ్యామల వర్ణంతో, వెండిరంగుతో, రక్త వర్ణంతో ప్రకాశిస్తున్న పత్రాలతో హిమాలయపర్వతం చాలా విశదంగా పాలసముద్రంలోని మందరపర్వతంవలె భాసిస్తోంది.

**అసమశ్రీశ్చ కుటిలం భేజే యస్యాథ కింశుకాన్ ।**
**ఉచ్చావచాన్ కలౌ లక్ష్మీర్గన్తా సంత్యజ్య సజ్జనాన్ ॥13॥**

నాథా! ఈ సౌందర్యం చాలా కుటిలమైనదిసుమా! కలియుగంలో లక్ష్మీదేవి సత్పురుషులనువీడి, దుష్టులను ఆశ్రయించినట్టుగా ఈఅనంత సౌందర్యం కింశుక పుష్పాలను ఆశ్రయించింది.

**మందరాచలమేఘానాం శబ్దేన హృషితా ముహుః ।**
**కేకాయంతే ప్రతివనే సతతం పృష్ఠసూచకమ్ ॥14॥**

వనసీమలలో నెమళ్లు మంతరపర్వతము మీద నున్న మేఘగర్జనలను విని, చాల ఆనందంతో కేకాధ్వనులను చేస్తూ, పింఛాలను విప్పి, నాట్యం చేస్తున్నాయి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఏవముక్తస్తయా శంభు ర్దాక్షాయణ్యా తథాఽసకృత్ ।**
**సంజహాస చ శీర్షస్థ చన్ద్రరశ్మి స్మితాలయమ్ ॥21॥**

దాక్షాయణి పలుకులను విని, తనశిరోభూషణమైన చంద్రుని వెన్నెలకు మెరుగు పెట్టే విధంగా ఇందుధరుడు మందహాసం చేశాడు.

**అథోవాచ సతీం దేవీం స్మితభిన్నోష్ఠసంపుటః ।**
**మహాత్మా సర్వతత్త్వజ్ఞ స్తోషయ న్పరమేశ్వరః ॥22॥**

చిరునవ్వుతో విచ్చుకున్న పెదవులు కలిగినట్టియు, తత్త్వజ్ఞుడు, మహాత్ముడు అయినట్టియు పరమేశ్వరుడు సతీదేవిని సంతోషపరుస్తూ ఆమెతో ఇలా అన్నాడు.

**ఈశ్వర ఉవాచ –** ఈశ్వరుడు చెప్పాడు.

**యత్ర ప్రీత్యై మయా కార్యో వాసస్తవ మనోహరే ।**
**మేఘాస్తత్ర న గంతారః కదాచిదపి మత్ప్రియే ॥23॥**

ఓ మనోహరీ! నీప్రీతికొరకు గృహాన్ని ఎక్కడ నిర్మించమంటావో చెప్పు? అక్కడకు ఎప్పుడూకూడా మేఘాలు రాకూడదు. అటువంటి నీకు ప్రీతికరమైన ప్రాంతాన్ని తెలియజేయి.

**మేఘా నితంబపర్యంతం సంచరంతి మహీభృతః ।**
**సదా ప్రాలేయసానోస్తు వర్షాస్వపి మనోహరే ॥24॥**

ఓ మనోహారిణి! ఈ హిమవత్పర్వతంయొక్క మధ్యభాగ పర్యంతం మాత్రమే మేఘాలు సంచరిస్తుంటాయి. హిమవత్పర్వత సానువులలో వర్షాకాలంలోనూ మేఘాలు నిరంతరం సంచరిస్తూ ఉంటాయి.

**కైలాసస్య తథా దేవి పాదగా ప్రాయశో ఘనాః ।**
**సంచరంతి న గచ్ఛంతి తత ఊర్ధ్వం కదాచన ॥25॥**

మేఘాలు కైలాస పర్వతంపై పాదాలవరకు మాత్రమే విహరించగలవు. అంతకంటె ఎత్తునకు అవి ఎప్పుడూ వెళ్ళలేవు.

**సుమేరోర్వా గిరేరూర్ధ్వం న గచ్ఛంతి బలాహకాః ।**
**జంబూమూలం సామాసాద్య పుష్కరావర్తకాదయః ॥26॥**

ఇక మేరుపర్వతంగూర్చి ఆలోచిస్తే వారివాహకాలైన పుష్కరావర్తకాది బలమైన మేఘాలుకూడా మేరుపర్వతంపై ఉన్న జంబూపర్వతం యొక్క మూలంవరకే వెడతాయి అంతకంటేపైకి వెళ్ళదు.

**ఇత్యుక్తేషు గిరీంద్రేషు యస్యోపరి భవేద్ధితే ।**
**మనోరుచి ర్నివాసాయ తమాచక్ష్వ ద్రుతం హి మే ॥27॥**

నాచే చెప్పబడిన ఈపర్వతాలలో ఏపర్వతంపై నివాసం చేయడం నీకభిమతమో నాకు తెలియజేయి.

**స్వేచ్ఛా విహారై స్తవ కౌతుకాని సువర్ణ పక్షానిల వృన్దవృన్దైః ।**
**శబ్దోత్తరంగై ర్మధుర స్వనైస్తై ర్ముదోపగేయాని గిరౌ హిమోత్థే ॥28॥**

హిమవత్పర్వతమైతే అక్కడ మందమారుతం వీస్తూవుంటే బంగారు రెక్కల పక్షులు ఎగురుతూ ఉంటాయి. ఆ స్వేచ్ఛా విహారాలు నీకు కుతూహలాన్ని కలిగిస్తుంటాయి. ఇక్కడి తరంగాలు శ్రవణపేయమైన మధుర స్వనాలు చేస్తుంటాయి. వాటితో నీవుకూడా గొంతుకలిపి పాడుకోవచ్చు.

**సిద్ధాఙ్గనాస్తే రచితాసనా భువ మిచ్ఛంతి చైవోపహృతం సకౌతుకమ్ ।**
**స్వేచ్ఛావిహారే మణికుట్టిమే గిరౌ కుర్వన్తి చేష్టంతి ఫలాదిదానకైః ॥29॥**

ఇక్కడి మణికుట్టిమములందు సిద్ధాంగనలు స్వేచ్ఛా విహారాలు చేయడానికి ఎప్పుడూ కుతూహల పడుతుంటారు. వివిధ చేష్టలతో విహరిస్తుంటారు.

**ఫణీన్ద్ర కన్యా గిరికన్యకాశ్చ యా నాగకన్యాశ్చ తురంగముఖ్యాః ।**
**సర్వాస్తు తాస్తే సతతం సహాయతామ్ సమాచరిష్యంత్యనుమోదవిభ్రమైః ॥30॥**

నాగాంగనలు, గిరికన్యలు, కిన్నెర యువతులు మొదలైనవారందరు ఆనందకరమైనట్టియు, ఆశ్చర్యకర మైనట్టియు ఆటపాటలలో నీకెల్లప్పుడు సహాయకారులుగా ఉంటారు.

**రూపం తదేవ మతులం వదనం సుచారు దృష్ట్వాంగనా నిజవపుర్నిజకాంతి సహ్యమ్ ।**
**హేలా నిజే వపుషి రూపగణేషు నిత్యం కర్తార ఇత్యనిమిషేక్షణ చారు రూపాః ॥31॥**

నీ అద్వితీయమైన రూపాన్ని, మనోహరమైన వదనాన్ని, చూచి దేవతాస్త్రీలకు వారి శరీరకాంతిపై అనాదరణ కలుగుతుంది. అందువల్ల నీరూప, గుణవిశేషాలను తిలకిస్తు వారు అనిమిషేక్షణలౌతారు.

**యా మేనకా పర్వతరాజ జాయా రూపైర్గుణైః ఖ్యాతవతీ త్రిలోకే ।**
**సా చాపి తే తత్ర మనోనుమోదం నిత్యం కరిష్యత్యనునాథనాద్యైః ॥32॥**

రూప, గుణాలలో ముల్లోకాలలో ప్రఖ్యాతి చెందిన హిమవంతుని భార్యయైన మేనకాదేవి కూడా నీకనుకూలంగా ఉండి, నిత్యోల్లాసియై ఉంటుంది.

**పురం హి వర్తై ర్గిరిరాజవంద్యైః ప్రీతిం విచిన్వద్భి రుదార రూపా ।**
**శిక్షా సదా తే ఖలు శోచితాపి కార్యాஉన్వహం ప్రీతియుతా గుణాద్యైః ॥33॥**

గిరి సార్వభౌముడైన హిమవంతుని రాజధాని మహాశోభాయమానంగా ఉంటుంది. అది సిద్ధసేవితమైనది.

**విచిత్రైః కోకిలాలాపమోదైః కుంజగణావృతమ్ ।**
**సదా వసంతప్రభవం గంతుమిచ్ఛసి కిం ప్రియే ॥34॥**

విచిత్రమైన కోకిలాలాపాలతో సంతోషకరంగా చక్కని వృక్షగణాలతో హిమవంతుని రాజధాని ఎల్లప్పుడూ వసంతఋతువు వలె శోభాయమానంగా ఉంటుంది. ప్రియా! నీవక్కడికి వెళ్ళాలనుకుంటున్నావా?

**నానాబహుజలాపూర్ణసరశ్శీత సమావృతమ్ ।**
**పద్మినీశతశోయుక్త మచలేన్ద్రం హిమాలయమ్ ॥35॥**

చల్లని, చక్కని నీటితోను, పద్మినీ శతంతోను, శోభాయమానంగానున్న సరస్సులతో కూడినది హిమాలయ పర్వతము.

**సర్వకామ ప్రదై ర్వృక్షై శ్శాద్వలైః కల్పసంజ్ఞకైః ।**
**సక్షణం పశ్య కుసుమాన్యథాశ్వ కరి గో వ్రజమ్ ॥36॥**

అశ్వకరిగోసమూహాలు అక్కడ ఉత్సాహంతో విహరిస్తూంటాయి. ఎన్నోవిధాలైన పూవులతో అది మనోహరంగా ఉంటుంది. అచ్చటి వృక్షాలన్నీ సమస్తమైన కోరికలను తీర్చే కల్పవృక్షములని పిలువబడేవే.

**ప్రశాంత శ్వాపదగణం మునిభిర్యతిభిర్వృతమ్ ।**
**దేవాలయం మహామాయే నానామృగ గణైర్యుతమ్ ॥37॥**

ఆప్రాంతమంతా మహోదారులు, పరమశాంతులు, తపోధనులునైన మునులతో, యతులతో, శాంతగంభీరంగా వుంటుంది. అనేక రకాలైన మృగగణాలతో, కూడినది, అచ్చటి వ్యాఘ్రగణం ప్రశాంతంగా వుంటూ మునులచుట్టు, యతులచుట్టు తిరుగుతుంటాయి.

**స్ఫటిక స్వర్ణ వప్రాద్యై రాజతైశ్చ విరాజితమ్ ।**
**మానసాది సరోరంగై రభితః పరిశోభితమ్ ॥38॥**

స్ఫటిక, స్వర్ణ, రత్నాలతోను, రజతమయమైన సానువులతోను, మానసాద్యనేక సరస్సులతోను, ఆప్రాంతమంతా శోభాయమానంగా ప్రకాశిస్తుంది.

**హిరణ్మయై రత్ననాళైః పంకజై ర్ముకుళై ర్వృతమ్ ।**
**శింశుమారై స్తథా సంఖ్యైః కచ్ఛపై ర్మకరైః కరైః ॥39॥**

అక్కడ బంగారు తూండ్లుగల పద్మాలతోను, విరిసి విరియని మొగ్గలతోను, తాబేళ్ళు, మొసళ్ళు మున్నగు వివిధ జలచరాలతో శోభిల్లుతున్న సరస్సులు అనేకమున్నాయి.

**నిషేవితం మంజులైశ్చ తథా నీలోత్పలాదిభిః ।**
**దేవేశి తస్మా న్ముక్తైశ్చ సర్వగంధైశ్చ కుంకుమైః ॥40॥**

నీలోత్పలాలతో మనోహరమైన సరస్సులు, సర్వగంధ సముపేతమైన పూదోటలు, కుంకుమ పూదోటలు అక్కడంతట మనల్ని సేవిస్తుంటాయి.

**లసద్గంధజలైః శుభ్రై రాపూర్ణైః స్వచ్ఛకాంతిభిః ।**
**శాద్వలై స్తరుణై స్తుంగై స్తీరస్థై రుపశోభితమ్ ॥41॥**

శుభ్రమైన సుగంధ భరితమైన జలాలతో పూర్తిగానిండి స్వచ్ఛ కాంతితో ప్రకాశిస్తున్నట్టియు, తీరప్రాంతంలో లేతపచ్చిక బయళ్ళతో శోభిల్లుతున్నట్టియు, సరస్సులుకూడ అక్కడున్నాయి.

**నృత్యద్భిరివ శాఖోటై ర్వర్జయంతం స్వసంభవమ్ ।**
**కామదేవై స్సారసైశ్చ మత్త చక్రాంగ శోభితైః ॥42॥**

తాము జన్మించిన గూళ్ళను వదలిన బెగ్గురు పక్షులతోను, చక్రవాక పక్షులతోను, శోభిల్లు కొమ్మలనే ఊయలలనేకం ఆ తీరప్రాంతంలో ఉన్నాయి.

**రామధురారావిభిర్మోదకారిభి ర్భ్రమరాదిభిః ।**
**శబ్దాయమానంచ ముదా కామోద్దీపనకారకమ్ ॥43॥**

భ్రమరాదుల మధురశబ్దాలు అనేక విధాల ఆనందాన్ని కలిగిస్తూ కామోద్దీపన కారకాలుగా ఉన్నాయి.

**వాసవస్య కుబేరస్య యమస్య వరుణస్య చ ।**
**అగ్నేః కోణ పరాజస్య మారుతస్య పరస్య చ ॥44॥**

**పురీభి శ్శోభి శిఖరం మేరోరుచ్చై స్సురాలయమ్ ।**
**రంభా శచీ మేనకాది రంభోరు గణసేవితమ్ ॥45॥**

ఇంద్ర, కుబేర, యమ, వరుణ, అగ్ని, నిఋతి, వాయు ఈశానుల రాజధానులన్నీ అక్కడే ఉన్నాయి. రంభ, శచి, మేనకాది అప్సర స్త్రీ గణానికి నివాసమైనదదియే. ఇది మేరువుకంటె గొప్పదైన దేవతాలయం.

**కిం త్వమిచ్ఛసి సర్వేషాం పర్వతానాం హి భూభృతామ్**
**సారభూతే మహారమ్యే సంవిహర్తుం మహాగిరౌ ॥46॥**

సమస్త పర్వతాలకంటే శ్రేష్ఠమైనది, మహారమ్యమైనదియైన హిమాలయపర్వతంపై నివాసమేర్పాటు చేసుకుని, విహరించాలని నీవు కుతూహలపడుతున్నావా?

**తత్ర దేవీ సఖియుతా సాప్సరోగణమండితా ।**
**నిత్యం కరిష్యతి శచీ తవ యోగ్యాం సహాయతామ్ ॥47॥**

అక్కడైతే శచీదేవి తనచెలికత్తెలతోను, అప్సరోగణాలతోను కలిసి ప్రతినిత్యం నీకు తగిన సహాయం చేస్తుంది.

**అథవా మమ కైలాసే పర్వతేంద్రే సదాశ్రయే ।**
**స్థానమిచ్ఛసి విత్తేశ పురీపరివిరాజితే ॥48॥**

లేదా పర్వతశ్రేష్ఠమైన హిమవత్పర్వతాగ్రంపై కొలువున్నట్టియు, కుబేరపురానికి పరిసర ప్రాంతమైనట్టియు, నాకైలాసంలోనే స్థానమేర్పాటు చేసుకోవాలని కోరుకుంటున్నావా?

**గంగాజలౌఘప్రయతే పూర్ణచంద్రసమప్రభే ।**
**దరీషు సానుషు సదా బ్రహ్మకన్యాభ్యుదీరితే ॥49॥**

అక్కడ ఆకాశగంగలో నిత్యం జలక్రీడలాడుకోవచ్చు, అచ్చటి గిరికందరాలన్నీ సుస్వరంతో వేదగానం చేస్తూ ఉంటాయి. ఉపనిషత్తులు నీకు చెలికత్తెలై సేవిస్తూ ఉంటాయి.

**నానామృగగణైర్యుక్తే పద్మాకరశతావృతే ।**
**సర్వైర్గుణైశ్చ సద్వస్తు సుమేరోరపి సుందరి ॥50॥**

ఈకైలాసం సమస్త గుణాలతోను, సద్వస్తువులతోను, కూడినదై రమ్యమైన మేరువుకంటె మిక్కిలి సుందరమైనది. ఇది నానావిధ మృగగణాలతోను, పద్మనిలయాలైన అనేక కాసారాలతోను వ్యాపించింది.

**స్థానేష్వేతేషు యత్రాపి తవాంతః కరణే స్పృహా ।**
**తం ద్రుతం మే సమాచక్ష్వ వాసకర్తాస్మి తత్ర తే ॥51॥**

ఈ స్థానాలన్నింటిలోను ఎక్కడ నివాసమేర్పాటు చేసుకోవాలని నీవు మనఃపూర్తిగా కోరుకుంటున్నావో, ఆస్థానాన్ని నాకు తెలియజేయి. అక్కడ నీకు నివాసాన్ని ఏర్పాటు చేస్తాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇతీరితే శంకరేణ తదా దాక్షాయణీ శనైః ।**
**ఇదమాహ మహాదేవం లక్షణం స్వప్రకాశనమ్ ॥52॥**

శంకరుడిట్లు చెప్పగానే దాక్షాయణీదేవి సంతసించి, తన మనోగతాన్ని మెల్లగా శంకరునికిలా వెల్లడించింది.

**సత్యువాచ** - సతీదేవి చెప్పింది.

**హిమాద్రావేవ వసిత మహమిచ్ఛే త్వయా సహ ।**
**న చిరాత్కురు సంవాసం తస్మిన్నేవ మహాగిరౌ ॥53॥**

నాథా! హిమవంతంపైనున్న కైలాస శిఖరంమీదనే నేను మీతోకలసి నివాసముండాలని కోరుకుంటున్నాను. కాబట్టి కైలాసంలోనే మనకు చక్కని నివాసాన్ని త్వరలో ఏర్పాటు చెయ్యండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథ తద్వాక్య మాకర్ణ్య హరః పరమమోహితః ।**
**హిమాద్రిశిఖరం తుంగం దాక్షాయణ్యా సమాయయౌ ॥54॥**

శివుడామాటలకు మిక్కిలి మోహితుడై దాక్షాయణీదేవితోకూడి, వెంటనే హిమాద్రి శిఖరానికి బయలుదేరాడు.

**సిద్ధాంగనాగణయుతమగమ్యం చైవ పక్షిభిః ।**
**అగమచ్ఛిఖరం రమ్యం సరసీవనరాజితమ్ ॥55॥**

అది సిద్ధాంగనా గణంతో కూడిన పక్షులుకూడా వెళ్ళలేని ప్రాంతమది. చక్కని జలాలతో నిండిన సరస్సులతో రమ్యమైన శిఖరమది, అటువంటి కైలాస శిఖరానికి వారు చేరుకున్నారు.

**విచిత్రరూపైః కమలైః శిఖరం రత్నకర్బురమ్ ।**
**బాలార్క సదృశం శంభురాససాద సతీసఖః ॥56॥**

సతీదేవితోకూడిన శంభుడు విచిత్రరూపాలుగల కమలాలతోను, రత్నస్వర్ణకాంతులతోను, వెలుగొందుతు, బాలార్కునివలెనున్న కైలాస శిఖరానికి చేరుకున్నాడు.

**స్ఫటికాభ్రమయే తస్మిన్ శాద్వల ద్రుమరాజితే ।**
**విచిత్ర పుష్పావళిభి స్సరసోభిశ్చ సంయుతే ॥57॥**

కైలాస శిఖరం స్ఫటికకాంతిగల మేఘాలతోను, పచ్చికబయళ్ళతోను, వివిధ వృక్షాలతోను, విచిత్ర పుష్పావళి తోను, అందమైన సరస్సులతోను నిండియున్నది.

**ప్రఫుల్లతరుశాఖాగ్రం గుంజద్భ్రమరసేవితమ్ ।**
**పంకేరుహైః ప్రఫుల్లైశ్చ నీలోత్పలచయైస్తథా ॥58॥**

చెట్ల కొమ్మల చివరిభాగాలు నూతన పల్లవాలతో బాగా వికాసాన్ని పొందాయి. తుమ్మెదలచే సేవింపబడుచున్న పద్మాలు, బాగా వికసించిన నీలోత్పల సముదాయాలు, అంతటా కన్పిస్తున్నాయి.

**శోభితం చక్రవాకాద్యైః కాదంబై ర్హంసశంకుభిః ।**
**ప్రమత్తసారసైః క్రౌంచై ర్నీలస్కంధైశ్చ శబ్దితైః ॥59॥**

**పుంస్కోకిలానాం నినదై ర్మధురైర్గణసేవితైః ।**
**తురంగవదనైస్సిద్ధైరప్సరోభిశ్చ గుహ్యకైః ॥60॥**

**విద్యాధరీభి ర్దేవీభిః కిన్నరీభిర్విహారితమ్ ।**
**పురంధ్రీభిః పార్వతీభిః కన్యాభిరభిసంగతమ్ ॥61॥**

ఆశిఖరం తిత్తిరి, భరద్వాజ, క్రౌంచ, చాతక, చక్రవాక పక్షుల కలకూజితాలతోను, హంసకాదంబాదులతోను, శోభితమైనది. పుంస్కోకిలగణాల మధురగానాలతో నిండినదది. అది తమదేవేరులతోకూడి, గంధర్వులు, సిద్ధులు, యక్షులు, విద్యాధరులు, కిన్నరులు విహరించే స్థలం. ఆ శిఖరం అప్సరసలు, పర్వతకన్యలు, స్త్రీరత్నాలతో కూడినది.

**విపంచీతాంత్రికామత్తమృదంగపటహస్వనైః ।**
**నృత్యద్భిరప్సరోభిశ్చ కౌతుకోత్థైశ్చ శోభితమ్ ॥62॥**

ఆ కైలాసశిఖరం వీణా, మృదంగ, పటహ ధ్వనులతోను, అప్సరసల నాట్యాలతోను, కుతూహలాన్ని రేకెత్తించే వివిధ శోభలతోను, శోభితమైనది.

**వేదికాభిర్దీర్ఘికాభిర్గంధిభిస్సుసమావృతమ్ ।**
**ప్రఫుల్లకుసుమైర్నిత్యం సకుంజైరుపశోభితమ్ ॥63॥**

అది విశాలమైన వేదికలతోను, దిగుడుబావులతోను కుసుమ గంధాలతోను, వికసించిన పుష్పాలతోను కూడిన పొదరిళ్ళతో ఉపశోభితమైనది.

**శైలరాజపురాభ్యర్ణే శిఖరే వృషభధ్వజః ।**
**సహసత్యా చిరం రేమే ఏవం భూతేషు శోభనమ్ ॥64॥**

ఈ విధంగా సమస్తవిధాల శోభాయమానమైన కైలాస శిఖరంపై వృషభధ్వజుడు సతీదేవితోకూడి, చిరకాలం విహరించాడు.

**తస్మిన్స్వర్గసమే స్థానే దివ్యమానేన శంకరః ।**
**దశవర్ష సహస్రాణి రేమే సత్యా సమం ముదా ॥65॥**

ఈ విధంగా సతీశంకరులు దేవమానం ప్రకారం పదివేలదివ్యసంవత్సరాలు కైలాసశిఖరంపై ఆనందోత్సాహాలతో స్వేచ్ఛగా విహరించారు.

**స కదాచి త్తత స్థానా దన్యద్యాతి స్థలం హరః ।**
**కదాచిన్మేరుశిఖరం దేవీ దేవవృతం సదా ॥66॥**

ఒకానొకప్పుడు కైలాసంనుండి శంకరుడు సతీదేవితోకూడి, వేరే స్థలానికి వెళ్ళాడు. ఒకప్పుడు దేవీపరివృతుడైన దేవదేవుడు మేరుశిఖరానికి వెళ్ళాడు.

**ద్వీపాన్నానా తథోద్యాన వనాని వసుధాతలమ్ ।**
**గత్వా గత్వా పునస్తత్రాభ్యేత్య రేమే సతీసుఖమ్ ॥67॥**

అదేవిధంగా భూమండలంలోని నానాద్వీపాలకు, ఉద్యానవనాలకు, వెళ్ళివెళ్ళి తిరిగి మళ్ళీ కైలాసానికి చేరి హరుడు సతీసుఖాన్ని అనుభవించాడు.

**న యజ్ఞే స దివారాత్రౌ న బ్రహ్మణి తపస్సమమ్ ।**
**సత్యాం హి మనసా శంభుః ప్రీతిమేవ చకార హ ॥68॥**

శంభుడు రాత్రింబవళ్ళు యజ్ఞాలు చేయడంలేదు. పరబ్రహ్మాన్నిగూర్చి తపస్సు చేయడంలేదు. ఎల్లప్పుడు సతీదేవి మనస్సునకు ప్రీతికలిగించడమే పనిగా పెట్టుకున్నాడు.

**ఏవం మహాదేవముఖం సత్యపశ్యత్స్మ సర్వదా ।**
**మహాదేవోఽపి సర్వత్ర సదాద్రాక్షీత్సతీముఖమ్ ॥69॥**

ఇట్లు సర్వదా సతీదేవి మహాదేవుని ముఖాన్ని, మహాదేవుడు సతీదేవి ముఖాన్ని చూసుకుంటూ కాలాన్ని గడుపుతున్నారు.

**ఏవమన్యోన్యసంసర్గాదనురాగమహీరుహమ్ ।**
**వర్ధయామాసతుః కాలీశివౌ భావాంబుసేచనైః ॥70॥**

ఈ విధంగా కైలాసశిఖరంపై సతీశంకరులు అన్యోన్యసంసర్గంచే కలిగిన ప్రేమభావన అనేజలాలతో తడుపుతు, అనురాగమనే వృక్షాన్ని ప్రవర్ధమానం చేశారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే సతీశివ విహారవర్ణనం నామ ద్వావింశోఽధ్యాయః ॥22॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో సతీశివ విహారవర్ణనం అనే ఇరవైరెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయోవింశోఽధ్యాయః - ఇరవై మూడవ అధ్యాయం

## భక్తిప్రభావవర్ణనమ్ - భక్తిప్రభావవర్ణనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏవం కృత్వా విహారం వై శంకరేణ చ సా సతీ ।**
**సంతుష్టా సాభవచ్చాతి విరాగా సమజాయత ॥1॥**

ఈవిధంగా సతీదేవి శంకరునితో వివిధ విహారాలు విస్తృతంగాచేసి, అత్యంత సంతుష్టురాలైన తరువాత ఆమె ఇప్పుడు విరాగురాలైనది.

**ఏకస్మిన్దివసే దేవీ సతీ రహసి సంగతా ।**
**శివం ప్రణమ్య సద్భక్త్యా న్యస్యోచ్చైః సుకృతాంజలిః ॥2॥**

నివృత్తి భావంతోనున్న సతీదేవి ఒకరోజున ఏకాంతంలోనున్న శంకరుని కలిసింది. ఆయనకు భక్తితో నమస్కరించి, రెండుచేతులు జోడించి, పైకెత్తి నిలబడినది.

**సుప్రసన్నం ప్రభుం నత్వా సా దక్షతనయా సతీ ।**
**ఉవాచ సాంజలిర్భక్త్యా వినయావనతా తతః ॥3॥**

దక్షతనయయైన సతీదేవి సుప్రసన్నుడైన శంకరునికి నమస్కరించి, వినయంతో వంగి, భక్తిభావంతో అంజలి ఘటించి, ఇలా పలికినది.

**సత్యువాచ** - సతీదేవి చెప్పింది.

**దేవదేవ! మహాదేవ! కరుణాసాగర! ప్రభో ।**
**దీనోద్ధర మహాయోగిన్ కృపాం కురు మమోపరి ॥4॥**

దేవదేవా! మహాదేవా! కరుణాసాగరా! ప్రభూ! దీనజనోద్ధారకా! మహాయోగీంద్రా! నాయందు దయచూపుము.

**త్వం పరః పురుషస్స్వామీ రజస్సత్త్వతమః పరః ।**
**నిర్గుణస్సగుణస్సాక్షీ నిర్వికారీ మహాప్రభుః ॥5॥**

మీరు పరమపురుషులు, సమస్తానికి స్వామి, సత్త్వ, రజ, స్తమోగుణాలకతీతులు. నిర్గుణులు, సగుణులుకూడా. సమస్తానికీ సాక్షీభూతులు. నిర్వికారులు, మహాప్రభువులు.

**ధన్యాహం తే ప్రియాజాతా కామినీ సువిహారిణీ ।**
**జాతస్త్వం మే పతిస్స్వామిన్! భక్తి వాత్సల్యతో హర ॥6॥**

మీకు ప్రియురాలుగా జన్మించిన నేను ధన్యురాలను, మీరు కోరినదానను, మీతో వివిధరీతుల చక్కగా విహరించినదానను, స్వామీ! మీరు మీభక్తవాత్సల్యతతో ప్రేరితులై, నాకు భర్తగా జన్మించారు.

**కృతో బహుసమా నాథ విహారః పరమస్త్వయా ।**
**సంతుష్టాహం మహేశాన! నివృత్తం మే మనస్తతః ॥7॥**

నాథా! నేను నీతో అనేక విధాలుగ పరమ విహారాలు చేశాను. మహేశా! దీనివల్ల నేను మిక్కిలి సంతుష్టురాలనయ్యాను. నాకిప్పుడు వాటినుండి మనసు తొలగింది.

**జ్ఞాతు మిచ్ఛామి దేవేశ పరం తత్త్వం సుఖావహమ్ ।**
**యం న సంసార దుఃఖాద్వై తరేజ్జీవోఽ౦జసా హర ॥8॥**

దేవేశా! నిరతిశయ సుఖాన్ని ప్రసాదించు పరతత్త్వ జ్ఞానాన్ని పొందాలని నాకు అభిలాషగా ఉన్నది. జీవుడు సంసార దుఃఖంనుండి అనాయాసంగా ఉద్ధరింపబడేదానిని వెంటనే తెలుసుకోవాలని నాకు జిజ్ఞాస కలిగింది.

**యత్కృత్వా విషయీ జీవస్సలభేత్పరమం పదమ్ ।**
**సంసారీ న భవేన్నాథ తత్త్వం వద కృపాం కురు ॥9॥**

నాథా! ఏకర్మానుష్ఠానంచే విషయ లంపటుడైన జీవుడు పరమపదాన్ని పొందగలుగుతాడు? సంసార బంధాలలో చిక్కుపడకుండా ఉంటాడు? అట్టి తత్త్వాన్ని నాయందు దయతో తెలియజేయండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యపృచ్ఛత్స్మ సద్భక్త్యా శంకరం సా సతీ మునే ।**
**ఆదిశక్తిర్మహేశానీ జీవోద్ధారాయ కేవలమ్ ॥10॥**

నారదా! ఆదిశక్తి, మహేశానియైన సతీదేవి కేవలం జీవులనుద్ధరించాలనే ఉత్తమభావంతో మాత్రమే భగవంతుడైన శంకరుని ఈవిధంగా ప్రశ్నించింది.

**ఆకర్ణ్య తచ్ఛివః స్వామీ స్వేచ్ఛయోపాత్త విగ్రహః ।**
**అవోచత్పరమప్రీతస్సతీ యోగవిరక్తధీః ॥11॥**

ఆమె ప్రశ్ననువిని, తనఇచ్ఛతోడనే శరీరాన్ని ధరించేవాడూ, యోగంద్వారా భోగాలనుండి విరక్తచిత్తుడైన వాడూ ఐన శంకరుడు మిక్కిలి ప్రీతితో, సతీదేవితో ఇలా అన్నాడు.

**శివ ఉవాచ –** శివుడు చెప్పాడు.

**శ్రుణు దేవి! ప్రవక్ష్యామి దాక్షాయణి! మహేశ్వరి ।**
**పరం తత్త్వం తదేవాసుశయీ ముక్తో భవేద్యతః ॥12॥**

దేవీ! దాక్షాయణీ! మహేశ్వరీ! వాసనలలో చిక్కుకుపోయిన జీవుడు అప్పటికప్పుడు ముక్తుడు కాగల పరమతత్త్వాన్ని తెలియజేస్తాను విను.

**పరతత్త్వం విజానీహి విజ్ఞానం పరమేశ్వరీ ।**
**ద్వితీయం స్మరణం యత్ర నాహం బ్రహ్మేతి శుద్ధధీః ॥13॥**

పరమేశ్వరీ! నీవు విజ్ఞానమే పరతత్త్వమని తెలుసుకోవాలి. అట్టి విజ్ఞానముదయించిన వెంటనే 'నేను బ్రహ్మము' ననే దృఢనిశ్చయం కలుగుతుంది. బ్రహ్మతప్ప ఇంకేవస్తువు స్మరణకురాదు. అట్టి విజ్ఞానవంతుడైన పురుషుని బుద్ధి సర్వథా పరిశుద్ధమై ఉంటుంది.

**తద్దుర్లభం త్రిలోకేఽస్మిం స్తజ్ఞాతా విరలః ప్రియే ।**
**యాదృశో యస్సదాసోఽహం బ్రహ్మసాక్షాత్పరాత్పరః ॥14॥**

ప్రియా! అట్టి విజ్ఞానం పొందడం దుర్లభం, ముల్లోకాలలో దీనిని తెలుసుకొన్నవాడు చాలా విరళంగా ఏఒక్కడో ఉంటాడు. అట్టివాడెక్కడ, ఎలా ఉన్నప్పటికి సదా నాస్వరూపుడే యౌతాడు. సాక్షాత్తు పరబ్రహ్మమౌతాడు.

**తన్మాతా మమ భక్తిశ్చ భుక్తి ముక్తి ఫలప్రదా ।**
**సులభా మత్ప్రసాదాద్ధి నవధా సా ప్రకీర్తితా ॥15॥**

భుక్తి ముక్తి ఫలప్రదమైన ఆ విజ్ఞానముయొక్క తల్లియే నాయందుగలభక్తి. అది నాకృపవల్లనే సులభమౌతుంది. ఆ భక్తి తొమ్మిది విధాలని చెప్పబడింది.

**భక్తౌ జ్ఞానే న భేదో హి తత్కర్తుస్సర్వదా సుఖమ్ ।**
**విజ్ఞానం న భవత్యేవ సతి! భక్తివిరోధినః ॥16॥**

సతీ! భక్తి, జ్ఞానము అభేదాలు. భక్తునికి, జ్ఞానికి కూడ ఎల్లప్పుడు సుఖమే ప్రాప్తిస్తుంది. భక్తికి విరోధియైనవానికి జ్ఞానం ప్రాప్తించదు.

**భక్త్యా హీనస్సదాహం వై తత్ప్రభావాద్గృహేష్వపి ।**
**నీచానాం జాతిహీనానాం యామి దేవి న సంశయః ॥17॥**

దేవీ! భక్తిప్రభావంచేత నేను జాతిహీనుడైన నీచమానవుని ఇంటికికూడ వెళతాను. అందులో సందేహంలేదు. నేను భక్తులకధీనుణ్ణి.

**సా భక్తిర్ద్వివిధా దేవి సగుణా నిర్గుణా మతా ।**
**వైధీ స్వాభావికీ యాయా వరా సా త్వవరా స్మృతా ॥18॥**

దేవీ! ఆభక్తి రెండువిధాలు. అవి సగుణభక్తి, నిర్గుణభక్తి. అలాగే వైధిభక్తి. స్వాభావికీభక్తి అను రెండు విధాలు. శాస్త్రంద్వారా ప్రేరితమైన భక్తిని వైధిభక్తి అంటారు. సహజ హృదయానురాగంతో ప్రేరితమైనది స్వాభావికీ భక్తి. ఇట్టి భక్తియే శ్రేష్ఠమైనది. దానికి భిన్నంగా కోరికలతో కూడినభక్తి నిమ్నశ్రేణికి చెందినదిగా భావింపబడుతుంది.

**నైష్ఠిక్యా నైష్ఠికీ భేదాద్ద్వివిధే ద్వివిధే హి తే ।**
**షడ్విధా నైష్ఠికీ జ్ఞేయా ద్వితీయైకవిధా స్మృతా ॥19॥**

పైన చెప్పిన సగుణ, నిర్గుణములనే రెండు విధములైనభక్తి, నైష్ఠికీ, అనైష్ఠికీ అనే రెండు భేదాలు కలిగియుంటుంది. నైష్ఠికీభక్తి ఆరువిధాలుగా ఉంటుంది. అనైష్ఠికీభక్తి ఒకేవిధమైనదని చెప్పబడింది.

**విహితాఽ విహితా భేదాత్తామనేకాం విదుర్బుధాః ।**
**తయోర్బహువిధత్వాచ్చ తత్త్వం త్వన్యత్ర వర్ణితమ్ ॥20॥**

సగుణ, నిర్గుణభక్తి విహితమూ, అవిహితమూ అనే భేదంచే అనేకవిధాలుగా ఉంటుందని విద్వాంసులు చెబుతున్నారు. ఈ ద్వివిధ భక్తిమార్గంలో అనేక భేదప్రభేదాలున్నాయి. వీటి కారణమున వీటితత్త్వాన్ని వేరొకమారు వర్ణించి చెబుతాను.

**తే నవాంగే ఉభే జ్ఞేయే వర్ణితే మునిభిః ప్రియే ।**
**వర్ణయామి నవాంగాని ప్రేమతః శ్రుణు దక్షజే ॥21॥**

దాక్షాయణీ! మునులు సగుణ నిర్గుణమైన రెండు భక్తిమార్గాలలోను తొమ్మిదంగాలను అంగీకరిస్తున్నారు. వాటిని వివరిస్తాను ప్రేమతో విను.

**శ్రవణం కీర్తనం చైవ స్మరణం సేవనం తథా ।**
**దాస్యం తథార్చనం దేవి! వందనం మమ సర్వదా ॥22॥**

**సఖ్యమాత్మార్పణం చేతి నవాంగాని విదుర్బుధాః ।**
**ఉపాంగాని శివే తస్యా బహూని కథితాని వై ॥23॥**

దేవీ! శ్రవణం, కీర్తనం, స్మరణం, సేవనం, దాస్యం, అర్చనం, వందనం, సఖ్యం, ఆత్మసమర్పణం వీటినే పండితులు భక్తికి నవాంగాలని అంగీకరిస్తారు. భక్తియొక్క ఉపాంగాలుకూడ అనేక రకాలుగా చెప్పబడ్డాయి.

**శ్రుణు దేవి నవాంగానాం లక్షణాని పృథక్ పృథక్ ।**
**మమ భక్తేర్మనో దత్త్వా భక్తిముక్తిప్రదాని హి ॥24॥**

దేవీ! ఇప్పుడు చెప్పిన నవాంగాల భక్తియొక్క లక్షణాలను విడివిడిగా వివరిస్తాను. నాయందు భక్తిని మనసులో నుంచుకొని విను. ఆ లక్షణాలను మనసులోనుంచుకొని నాయందు భక్తిని కల్గినచో అది భక్తిముక్తిప్రదాయిని అవుతుంది.

**కథాదేర్నిత్యసమ్మానం కుర్వన్దేహాదిభిర్ముదా ।**
**స్థిరాసనేన తత్పానం యత్తచ్ఛ్రవణముచ్యతే ॥25॥**

స్థిరాసనంలో కూర్చుని, మనస్సు శరీరం మొదలగువాటిచేత నాకథాగానం చేయాలి. నిత్యం సమ్మానపూర్వకంగా ప్రసన్నతతో, తన శ్రవణపుటాలతో ఆ గానామృతరసపానం చేయాలి. ఇది శ్రవణేంద్రియం ద్వారా జరుగుతుంది కాబట్టి దీనికి 'శ్రవణమని' పేరు.

**హృదాకాశేన సంపశ్యఞ్జన్మకర్మాణి వై మమ ।**
**ప్రీత్యాచోచ్చారణం తేషామేతత్కీర్తనముచ్యతే ॥26॥**

హృదయాకాశం ద్వారా నాదివ్యజన్మ కర్మలను చింతనచేస్తు, ప్రేమతో వాక్కుద్వారా వాటిని ఉన్నత స్వరంతో ఉచ్చరిస్తూ చేసే సాధన **'కీర్తనం'** అని పిలవబడుతుంది.

**వ్యాపకం దేవి మాం దృష్ట్వా నిత్యం సర్వత్ర సర్వదా ।**
**నిర్భయత్వం సదా లోకే స్మరణం తదుదాహృతమ్ ॥27॥**

దేవీ! మహేశ్వరుడనైననన్ను సదా, సర్వత్ర వ్యాపకుడనని తెలుసుకొని, అన్నిటా నన్నుచూస్తు, ఈప్రపంచంలో నిరంతరం నిర్భయుడైనవాడు చేసేదాన్ని **'స్మరణం'** అంటారు.

**అరుణోదయమారభ్య సేవాకాలేఙ్చితా హృదా ।**
**నిర్భయత్వం సదా లోకే సేవనం తదుదాహృతమ్ ॥28॥**

అరుణోదయ వేళనుండి ప్రతిక్షణం సేవించదగినవాని అనుకూలతనుబట్టి హృదయంతోను, ఇంద్రియాలతోను, నిర్భయంగా, నిరంతరంగా, సేవచేయడమే **'సేవనం'** అని పిలవబడుతుంది.

**సదా సేవ్యానుకూల్యేన సేవనం తద్ధి గోగణైః ।**
**హృదయామృత భోగేన ప్రియం దాస్యముదాహృతమ్ ॥29॥**

తనను ఆ పరమాత్మ సేవకునిగా భావించి, హృదయామృత భోగంతో ఆ స్వామికి ఎల్లప్పుడూ ప్రియమైనదానిని సముపార్జన చేయుట **'దాస్య'** మని చెప్పబడుతుంది.

**సదా భృత్యానుకూల్యేన విధినా మే పరాత్మనే ।**
**అర్పణం షోడశానాం వై పాద్యాదీనాం తదర్చనమ్ ॥30॥**

తన ధన వైభవాలకనుగుణంగా శాస్త్రీయ పద్ధతిలో పరమాత్ముడనైన నాకు ఎల్లప్పుడు పాద్యాది షోడశోపచారాలను సమర్పించడమే **'అర్చన'** అని చెప్పబడుతుంది.

**మంత్రోచ్చారణ ధ్యానాభ్యాం మనసా వచసా క్రమాత్ ।**
**యదష్టాంగేన భూస్పర్శం తద్వై వందనముచ్యతే ॥31॥**

మనసుతో ధ్యానం, వాక్కుతో వందనాత్మక మంత్రోచ్చారణ, సాష్టాంగ భూతలస్పర్శ చేస్తూ ఇష్టదైవానికి నమస్కరించడాన్నే **'వందన'** మంటారు.

**మంగళా మంగళం యద్యత్కరోతీతీశ్వరో హి మే ।**
**సర్వం తన్మంగళాయేతి విశ్వాసః సఖ్యలక్షణమ్ ॥32॥**

భగవంతుడు శుభాశుభాలలో దేనిని కలుగజేసినప్పటికి, అదిఅంతయు తనశ్రేయస్సుకేఅని తలంచాలి. అట్లు భగవంతునియందు దృఢ విశ్వాసాన్ని ఉంచడమే **'సఖ్యభక్తి'** లక్షణం. భగవంతుని స్నేహితునిగా భావించడమే సఖ్యభక్తి.

**కృత్వా దేహాదికం తస్య ప్రీత్యై సర్వం తదర్పణమ్ ।**
**నిర్వాహాయ చ శూన్యత్వం యత్తదాత్మసమర్పణమ్ ॥33॥**

తనవి అని చెప్పుకొనే దేహాది వస్తువులనన్నిటినీ భగవంతుని ప్రీతికొరకు ఆయనకే సమర్పించాలి. తన నిర్వహణ కొరకు దేనినీ ఉంచుకొనరాదు. **'తననిర్వహణ'** అనే చింతన లేకుండా ఉండుటయే **'ఆత్మసమర్పణ'**.

**నవాంగీనీతి మద్భక్తేర్భక్తి ముక్తి ప్రదాని చ ।**
**మమ ప్రియాణి చాతీవ జ్ఞానోత్పత్తికరాణి చ ॥34॥**

నాభక్తికి చెందిన ఈతొమ్మిది అంగాలు భక్తి, ముక్తి ప్రదాయినులు. వీటివలన జ్ఞానోత్పత్తి కలుగుతుంది. ఈసాధనలన్నియు నాకు మిక్కిలి ప్రీతికరమైనవి.

**ఉపాంగాని చ మద్భక్తేర్బహూని కథితాని వై ।**
**బిల్వాది సేవనాదీని సమూహ్యాని విచారతః ॥35॥**

నాభక్తినిగూర్చిన ఉపాంగాలనేకం చెప్పబడ్డాయి. బిల్వపత్రాదులతో సేవించుట, మున్నగు ఉపాంగాలను విచారణద్వారా తెలుసుకోవాలి.

**ఇత్థం సాంగోపాంగభక్తిర్మమ సర్వోత్తమా ప్రియే ।**
**జ్ఞాన వైరాగ్య జననీ ముక్తిదాసీ విరాజతే ॥36॥**

ప్రియురాలా! ఈవిధంగా సాంగోపాంగభక్తి అన్నిటికంటె ఉత్తమమైనది. నాకు మిక్కిలి ప్రియమైనది. ఇది జ్ఞానవైరాగ్యాలకు తల్లివంటిది. ముక్తికి దాసివంటిదై ప్రకాశిస్తుంది.

**సర్వ కర్మ ఫలోత్పత్తి స్సర్వదా త్వత్సమప్రియా ।**
**యచ్చిత్తే సా స్థితా నిత్యం సర్వదా సోఽతిమత్ప్రియః ॥37॥**

భక్తి ఎల్లప్పుడు అన్నిసాధనలకంటె ఉన్నత స్థానాన్ని కలిగిస్తుంది. దీనిద్వారా సకల కర్మఫలప్రాప్తి కలుగుతుంది. నీవు నాకెంతటి ప్రీతిపాత్రమైనదానవో భక్తికూడా నాకంతటి ప్రీతిపాత్రమైనది. ఈభక్తి నిత్యం నిరంతరం ఎవరి చిత్తంలో నివసిస్తుందో అట్టి సాధకుడు కూడా నాకత్యంత ప్రియుడౌతాడు.

**త్రైలోక్యే భక్తి సదృశః పంథా నాస్తి సుఖావహః ।**
**చతుర్యుగేషు దేవేశి కలౌ తు సువిశేషతః ॥38॥**

దేవేశీ! ముల్లోకాలలోను, నాలుగు యుగాలలోను, భక్తితో సమానమైన సుఖావహమైన మార్గమింకొకటి లేదు. కలియుగంలో సుఖదాయకమైన మార్గాలలో భక్తి మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది.

**కలౌ తు జ్ఞాన వైరాగ్యో వృద్ధరూపౌ నిరుత్సవౌ ।**
**గ్రాహకాభావతో దేవి జాతౌ జర్జరతా మతి ॥39॥**

దేవీ! కలియుగంలో జ్ఞానవైరాగ్యాలను గ్రహించేవారెవ్వరు లేరు. కనుక ఈరెండును ఉత్సాహశూన్యములు, జర్జరములునై ఉన్నాయి.

**కలౌ ప్రత్యక్ష ఫలదా భక్తిస్సర్వయుగేష్వపి ।**
**తత్ప్రభావాదహం నిత్యం తద్వశో నాత్ర సంశయః ॥40॥**

భక్తి అన్నియుగాలలోను, ప్రత్యేకించి కలియుగంలోకూడ ప్రత్యక్ష ఫలదాయిని. భక్తిప్రభావంచేత నేను సదా భక్తునివశమై యుంటాననడంలో ఎట్టి సందేహము లేదు.

**యో భక్తిమాన్పుమాన్ లోకే సదాహం తత్సహాయకృత్ ।**
**విఘ్నహర్తా రిపుస్తస్య  దండ్యో నాత్ర చ సంశయః ॥41॥**

ప్రపంచంలో భక్తియుతుడైన మానవునికి నేను సదా సహాయంచేస్తూ ఉంటాను. అతని విఘ్నాలనన్నిటిని నేనే దూరంచేస్తాను. నాభక్తునికి శత్రువలెవరైనా ఉన్నచో వారిని దండిస్తాను. ఇందులో సంశయంలేదు.

**భక్తహేతో రహం దేవి కాలం క్రోధ పరిప్లుతః ।**
**అదహం వహ్నినా నేత్రభవేన నిజరక్షకః ॥42॥**

దేవీ! నేను నాభక్తులను రక్షించేవాడను. భక్తుని రక్షించడానికే నేను కుపితుడనై నానేత్రాగ్నితో కాలునికూడా దహించాను.

**భక్తహేతోరహం దేవి రవ్యుపర్యభవం కిల ।**
**అతిక్రోధాన్వితః శూలం గృహీత్వాన్వజయం పురా ॥43॥**

పూర్వం నాభక్తుని కారణంగానే నేను సూర్యునిపై అతిక్రోధాన్వితుడనయ్యాను. ఆకారణంచేతనే నేను శూలాన్ని చేగొని అతనిని కొట్టి పారద్రోలాను.

**భక్తహేతోరహం దేవి రావణం సగణం క్రుధా ।**
**త్యజతి స్మ కృతోనైవ పక్షపాతో హి తస్య వై ॥44॥**

దేవీ! నేను నాభక్తుని కారణంగానే సైన్య సహితుడైన రావణుని కూడ క్రోధంతో పరిత్యజించాను. అతని యెడల నేనెటువంటి పక్షపాతాన్ని చూపలేదు.

**భక్తహేతోరహం దేవి వ్యాసం హి కుమతిగ్రహమ్ ।**
**కాశ్యా న్యసారయత్ క్రోధాద్దణ్డయిత్వా చ నందినా ॥45॥**

నాభక్తుని కారణంగానే చెడు ఆలోచనగల కుమతియైన వ్యాసుని, నందిచే దండింపజేసి, కాశీ బహిష్కరణ శిక్ష ను విధించాను.

**కిం బహూక్తేన దేవేశి! భక్త్యాధీన స్సదాహ్యహమ్ ।**
**తత్కర్తుం పురుషస్యాతి వశగో నాత్ర సంశయః ॥46॥**

దేవేశీ! ఎక్కువ చెప్పడంవల్ల ప్రయోజనమేమీలేదు. నేను సదా సర్వధా భక్తాధీనుణ్ణి, భక్తిగల మానవునకు నేను సులభంగా వశుడనౌతాను. ఇందులో సందేహం లేదు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మచెప్పాడు.

**ఇత్థమాకర్ణ్య భక్తేస్తు మహత్త్వం దక్షజా సతీ ।**
**జహర్షాతీవ మనసి ప్రణనామ శివం ముదా ॥47॥**

నారదా! ఇట్లు భక్తుని మాహాత్మ్యాన్ని విని, దక్షకన్యయైన సతీదేవి అత్యంత సంతోషాన్ని పొందింది. ఆమె మిక్కిలి ప్రసన్నురాలై భగవంతుడైన శివునికి మనస్సులోనే ప్రణామం చేసింది.

**పునః పప్రచ్ఛ సద్భక్త్యా తత్కాణ్డవిషయం మునే ।**
**శాస్త్రం సుఖకరం లోకే జీవోద్ధారపరాయణమ్ ॥48॥**

మునీంద్రా! సతీదేవి మళ్ళీ భక్తికాండకు సంబంధించిన విషయాన్నే భక్తిపూర్వకంగా ఇలా అడిగింది. 'లోకంలో సుఖప్రదము, జీవోద్ధారణ సాధన ప్రతిపాదకమునైన శాస్త్రమేది?' అని జిజ్ఞాస పూర్వకంగా అడిగింది.

**సయంత్ర మంత్ర శాస్త్రం చ తన్మాహాత్మ్యం విశేషతః ।**
**అన్యాని ధర్మవస్తూని జీవోద్ధారకరాణి హి ॥49॥**

ఆమె మంత్ర యంత్ర శాస్త్రాలు, వాటి మాహాత్మ్యం, ఇతరమైన జీవోద్ధారక ధర్మమయ సాధనల విషయంలో విశేషంగా తెలుసుకొనే కోరికను వెలిబుచ్చింది.

**శంకరోఽపి తదాకర్ణ్య సతీప్రశ్నం ప్రహృష్టధీః ।**
**వర్ణయామాస సుప్రీత్యా జీవోద్ధారాయ కృత్స్నశః ॥50॥**

సతీదేవి ప్రశ్నువినిన శంకరునికికూడ మిక్కిలి ఆనందం కలిగింది. శంకరుడు జీవోద్ధరణ కొరకు శాస్త్రాలనన్నిటిని మిక్కిలి ప్రీతితో వర్ణించి చెప్పాడు.

**తంత్రశాస్త్రం సయంత్రం హి సపఞ్చాఙ్గం మహేశ్వరః ।**
**బభాషే మహిమానం చ తత్తద్దేవవరస్య వై ॥51॥**

మహేశ్వరుడు పంచాంగాలతోను, యంత్రశాస్త్రంతోను, కూడిన తంత్ర శాస్త్రాన్ని, భిన్నభిన్న దైవవరుల మహిమను గూర్చి వర్ణించి చెప్పాడు.

**సేతిహాస కథం తేషాం భక్తమాహాత్మ్యమేవ చ ।**
**సవర్ణాశ్రమ ధర్మాంశ్చ నృపధర్మాన్ మునీశ్వర ॥52॥**

మునీంద్రా! ఇతిహాసాలను కథాసహితంగాను, ఆయాదేవతాభక్తుల మాహాత్మ్యాన్ని, వర్ణాశ్రమధర్మాలను, రాజధర్మాలను నిరూపించాడు.

**సుత స్త్రీ ధర్మ మాహాత్మ్యం వర్ణాశ్రమమనశ్వరమ్ ।**
**వైద్యశాస్త్రం తథా జ్యోతిశ్శాస్త్రం జీవ సుఖావహమ్ ॥53॥**

పుత్రుల ధర్మాలను, స్త్రీల ధర్మాలను, ఎప్పుడూ నశింపని వర్ణాశ్రమ ధర్మాలను, జీవులకందరికి సుఖప్రదమైన వైద్యశాస్త్రాన్ని, జ్యోతిశ్శాస్త్రాన్ని వర్ణించాడు.

**సాముద్రికం పరం శాస్త్ర మన్యచ్ఛాస్త్రాణి భూరిశః ।**
**కృపాం కృత్వా మహేశానో వర్ణయామాస తత్త్వతః ॥54॥**

మహేశ్వరుడు దయతో సాముద్రిక శాస్త్రాన్ని, అనేక ఇతర శాస్త్రాలను తత్త్వతః వర్ణించి చెప్పాడు.

**ఇత్థం త్రిలోక సుఖదౌ సర్వజ్ఞౌ చ సతీశివౌ ।**
**లోకోపకారకరణధృతసద్గుణ విగ్రహౌ ॥55॥**

**చిక్రీడాతే బహువిధం కైలాసే హిమవద్గిరౌ ।**
**అన్యస్థలేషు చ తదా పరబ్రహ్మ స్వరూపిణౌ ॥56॥**

ఇట్లు లోకోపకారం కొరకు సద్గుణ సంపన్నమైన శరీరాలను ధరించినవారును, ముల్లోకాలకు సౌఖ్యాన్ని చేకూర్చేవారును, సర్వజ్ఞులును, అగు సతీశివులు హిమాలయంపైన, కైలాస శిఖరంమీద, ఇంకనూ అనేక ఇతర స్థలములందును, అనేకవిధములైన లీలలను చేస్తున్నారు. సతీశివులైన ఆ దంపతులు సాక్షాత్తు పరబ్రహ్మస్వరూపులే.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే భక్తి ప్రభావవర్ణనం నామ త్రయోవింశోఽధ్యాయః ॥23॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో భక్తి ప్రభావవర్ణనం అనే ఇరవైమూడవ అధ్యాయం సమాప్తం.

## **చతుర్వింశోఽధ్యాయః** – ఇరవై నాలుగవ అధ్యాయం
## **రామ పరీక్షావర్ణనమ్** – రామ పరీక్షావర్ణనం

**నాదర ఉవాచ** – నారదుడు చెప్పాడు.

**బ్రహ్మన్ విధే ప్రజానాథ మహాప్రాజ్ఞ కృపాకర ।**
**శ్రావితం శంకర యశస్సతీశంకరయోః శుభమ్ ॥1॥**

బ్రహ్మదేవా! విధీ! ప్రజానాథా! మహాప్రాజ్ఞా! దయానిధీ! సతీదేవి మరియు శంకర భగవానులయొక్క మంగళకరమగు చక్కని కీర్తిని మీరు వినిపించారు.

**ఇదానీం బ్రూహి సత్ప్రీత్యా పరం తద్యశ ఉత్తమమ్ ।**
**కిమకార్ష్టాం హి తత్స్థౌ వై చరితం దంపతీ శివౌ ॥2॥**

ఇప్పుడు ఈ సమయంలో వారి ఉత్తమమైన యశస్సుని వినిపించండి. ఆ శివదంపతులు తదనంతరం ఎట్టి చరిత్రను సృష్టించారు?

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**సతీశివ చరిత్రం చ శ్రుణు మే ప్రేమతో మునే ।**
**లౌకికీం గతిమాశ్రిత్య చిక్రీడా తే సదాన్వహమ్ ॥3॥**

మునీంద్రా! నీవు సతీ శివభగవానుల చరిత్రను ప్రేమతో విను. ఆ దంపతులిద్దరు లౌకిక విధానాన్ననుసరించి, నిత్యం, నిరంతరం క్రీడిస్తున్నారు.

**తతస్సతీ మహాదేవీ వియోగమలభన్మునే ।**
**స్వపత శ్శంకరస్యేతి వదంత్యేకే సుబుద్ధయః ॥4॥**

తదనంతరం ఒకానొకప్పుడు సతీదేవికి, శంకరులకు వియోగం ప్రాప్తించిందని కొంతమంది బుద్ధిమంతులు చెబుతున్నారు.

**వాగర్థావివ సంపృక్తౌ శక్తీశౌ సర్వదా చితౌ ।**
**కథం ఘటేత చ తయోర్వియోగస్తత్త్వతో మునే ॥5॥**

వారిద్దరు ఎల్లప్పుడు శబ్దార్థాలవలె కలిసియుంటారుకదా!. అటువంటప్పుడు వారిరువురకు వియోగమెలా సంభవించింది?

**లీలా రుచిత్వాదథ వా సంఘటేతాఽఖిలం చ తత్ ।**
**కురుతే యద్యదీశశ్చ సతీ చ భవరీతిగౌ ॥6॥**

శక్తియు, శక్తిమంతుడు ఒక్కటే అయినట్లు సతీశంకరులిరువురు చిత్ స్వరూపులు. వారిలో లీలా విషయిక అభిరుచి ఏర్పడినచో అది అంతయు చేకూరగలదు. కాబట్టి వారిరువురు లౌకిక రీతిననుసరించి లీలలు చేయడంవల్ల అన్నీ సంభవాలే అవుతాయి.

**సా త్యక్తా దక్షజా దృష్ట్వా పతినా జనకాధ్వరే ।**
**శంభో రనాదరా త్తత్ర దేహం తత్యాజ సంగతా ॥7॥**

దక్షుని కుమార్తెయైన సతీదేవి, తనభర్తయైన శంకరుడు తన్ను పరిత్యజించగా దక్షయజ్ఞానికి వెళ్ళింది. కాని అక్కడకూడా తండ్రిచే అవమానింపబడిన కారణంగా దేహత్యాగం చేసింది.

**పునర్హిమాలయే సైవావిర్భూతా నామతస్సతీ ।**
**పార్వతీతి శివం ప్రాప తప్త్వా భూరి వివాహతః ॥8॥**

ఆ సతీదేవియే హిమవంతుని యింట పార్వతిగా ఆవిర్భవించింది. ఆమె గొప్ప తపస్సుచేసి, వివాహం ద్వారా తిరిగి ఈశ్వరుని పొందగలిగింది.

**సూత ఉవాచ** - సూతమహర్షి చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య బ్రహ్మణస్సతు నారదః ।**
**పప్రచ్ఛ చ విధాతారం శివాశివ మహద్యశః ॥9॥**

మునులారా! నారదుడు బ్రహ్మమాటలను విని, సతీశంకరుల గొప్ప యశస్సును గూర్చి బ్రహ్మనిట్లు అడిగాడు.

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**విష్ణుశిష్య మహాభాగ విధే మే వద విస్తరాత్ ।**
**శివాశివ చరిత్రం తద్భవాచార పరానుగమ్ ॥10॥**

మహానుభావా! విష్ణుశిష్యా! బ్రహ్మన్! సతీశంకరులు లౌకిక రీతిలో భావించి చేసిన లీలాచరిత్రను వివరంగా నాకు చెప్పండి.

**కిమర్థం శంకరో జాయాం తత్యాజ ప్రాణతః ప్రియామ్ ।**
**తస్మాదాచక్ష్వ మే తాత విచిత్రమితి మన్మహే ॥11॥**

భగవంతుడైన శంకరుడు తన ప్రాణములకంటె ప్రియమైన సతీదేవిని ఎందులకు పరిత్యజించాడు? ఈసంఘటన నాకు చాలా విచిత్రంగా కనిపిస్తోంది. కాబట్టి దీనిని మీరు తప్పక వివరించి చెప్పాలి.

**కుతోఽహ్యధ్వరజః పుత్రాం నాదరో భూచ్ఛివస్య తే ।**
**కథం తత్యాజ సా దేహం గత్వా తత్ర పితృక్రతౌ ॥12॥**

మీ కుమారుడైన దక్షుని యజ్ఞంలో శివునికవమానం ఎలాజరిగింది? తండ్రి యజ్ఞానికి వెళ్ళిన సతీదేవి తన దేహాన్ని ఎలా వదిలిపెట్టింది.

**తతః కిమభవత్తత్ర కిమాకార్షీ న్మహేశ్వరః ।**
**తత్సర్వం మే సమాచక్ష్వ శ్రద్ధాయుక్ తచ్ఛ్రుతావహమ్ ॥13॥**

తదనంతరం ఏమిజరిగింది? మహేశ్వరుడేమిచేశాడు? ఈవిషయాలన్నీ నాకు వివరించండి. వీటినన్నిటిని వినడానికి నామనస్సులో చాలా శ్రద్ధ కలుగుతోంది.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**శృణు తాత పరప్రీత్యా మునిభిస్సహ నారద ।**
**సుతవర్య మహాప్రాజ్ఞ చరితం శశిమౌళినః ॥14॥**

నారదా! కుమారశ్రేష్ఠా! మహాప్రాజ్ఞా! నీవు మహర్షులతో కలిసి మిక్కిలి ప్రేమతో చంద్రశేఖరుని చరిత్రను విను.

**నమస్కృత్య మహేశానం హర్యాది సురసేవితమ్ ।**
**పరబ్రహ్మ ప్రవక్ష్యామి తచ్చరిత్రం మహాద్భుతమ్ ॥15॥**

విష్ణ్వాది సమస్త దేవతలచే సేవింపబడు పరబ్రహ్మ స్వరూపుడైన మహేశ్వరునికి నమస్కరించి, మహాద్భుతమైన వారి చరిత్రను చెబుతాను.

**సర్వోఽయం శివలీలా హి బహులీలాకరః ప్రభుః ।**
**స్వతంత్రో నిర్వికారీ చ సతీ సాపి హి తద్విధా ॥16॥**

**అన్యథా కస్సమర్థో హి తత్కర్మ కరణే మునే ।**
**పరమాత్మా పరబ్రహ్మ స ఏవ పరమేశ్వరః ॥17॥**

నారదా! ఇదంతా శివలీలా విలాసమే. ఆయన అనేక లీలల్ని చేసేవాడు. స్వతంత్రుడు, నిర్వికారుడు. సతీదేవికూడా అటువంటిదే.లేకపోయినచో అటువంటి పనిచేయడానికి ఎవరు సమర్థులౌతారు? పరమేశ్వరుడే పరమాత్మ. అతడే పరబ్రహ్మ.

**యం సదా భజతే శ్రీశోఽహం చాపి సకలాః సురాః ।**
**మునయశ్చ మహాత్మానః సిద్ధాశ్చ సనకాదయః ॥18॥**

**శేషస్సదా యశో యస్య ముదా గాయతి నిత్యశః ।**
**పారం న లభతే తాత స ప్రభు శ్శంకరః శివః ॥19॥**

నేను, శ్రీమహావిష్ణువు, సకల దేవతలు, మునులు, మహాత్ములు, సిద్ధులు, సనకాది మహర్షులు, ఎల్లప్పుడు ఎవరిని సేవిస్తున్నామో, ఎవని కీర్తిని శేషుడు నిత్యం ఆనందంతో గానం చేసినా పారమ్యాన్ని పొందలేకపోతున్నాడో ఆప్రభువే శంకరుడు, శివుడు, పరమాత్మ.

**తస్యైవ లీలయా సర్వోఽయమితి తత్త్వ విభ్రమః ।**
**తత్ర దోషో న కస్యాపి సర్వవ్యాపీ స ప్రేరకః ॥20॥**

అట్టి పరమేశ్వరుని లీలచేతనే ఈ సమస్తము సంభవమని గుర్తించాలి. సర్వవ్యాపి అయినవాడు, సమస్త లోకాలకు ప్రేరకుడైనవాడునైన శివుని లీలలో ఎవరిది ఏరకమైన దోషము ఉండదు.

**ఏకస్మి న్సమయే రుద్ర స్సత్యా త్రిభువనే భవః ।**
**వృషమారుహ్య పర్యాటద్రసాం లీలా విశారదః ॥21॥**

ఒకానొక సమయంలో లీలావిశారదుడైన రుద్రుడు సతీదేవితో ముల్లోకాలలో వృషభారూఢుడై పర్యటిస్తూ భూలోకం చేరుకున్నాడు.

**ఆగత్య దణ్డకారణ్యం పర్యటన్ సాగరాంబరామ్ ।**
**దర్శయన్ తత్రగాం శోభాం సత్యై సత్యపణః ప్రభుః ॥22॥**

ఆ విధంగా పర్యటిస్తున్నశంకరుడు సాగరపర్యంతమైన భూతలశోభనంతటిని సతీదేవికి చూపుతూ దండకారణ్యానికి చేరాడు.

**తత్ర రామం దదర్శాసౌ లక్ష్మణేనాన్వితం హరః ।**
**అన్విష్యంతం ప్రియాం సీతాం రావణేన హృతాం ఛలాత్ ॥23॥**

అక్కడ రావణుడు మోసంతో అపహరించిన సీతాదేవిని వెతుకుతూవున్న, రాముణ్ణి శంకరుడు చూశాడు.

**హా సీతేతి ప్రోచ్చరంతం విరహావిష్టమానసమ్ ।**
**యతస్తతశ్చ పశ్యంతం రుదంతం హి ముహుర్ముహుః ॥24॥**

**సమిచ్ఛంతం చ తత్ప్రాప్తిం పృచ్ఛంతం తద్గతిం హృదా ।**
**కుజాదిభ్యో నష్టధియ మత్రపం శోకవిహ్వలమ్ ॥25॥**

**సూర్యవంశోద్భవం వీరం భూపం దశరథాత్మజమ్ ।**
**భరతాగ్రజమానంద రహితం విగతప్రభమ్ ॥26॥**

**పూర్ణకామో వరాధీనం ప్రణామత్స్మ ముదా హరః ।**
**రామం భ్రమన్తం విపినే స లక్ష్మణముదార ధీః ॥27॥**

ఓ సీతా! అని గట్టిగా పల్కుతూ, ఆమెను పిలుస్తూ, విరహంతో ఆవరింపబడిన మనస్సుతో మాటిమాటికి రోదిస్తూ, అటనట వెదకుతూ, సీతాదేవి లభించాలని కోరుకుంటూ, ఆమె జాడనుగూర్చి వృక్షాలను అడుగుతూ, శోకవిహ్వాలుడు, ధైర్యవిహీనుడు, సూర్యవంశోద్భవుడు, వీరుడు, భూపాలుడు, దశరథాత్మజుడు, భరతాగ్రజుడు, కాంతి విహీనుడు, ఆనంద రహితుడునైన రాముడు సీతజాడకై లక్ష్మణునితోకూడి, దండకారణ్యంలో విహరిస్తున్నాడు. అటువంటి సమయంలో ఉదారచేతస్కుడు, పూర్ణకాముడునైన శంకరుడు మిగుల ప్రసన్నతతో రామునికి నమస్కరించాడు.

**జయేత్యుక్త్వాన్యతో గచ్ఛన్నదా త్తస్మై స్వదర్శనమ్ ।**
**రామాయ విపినే తస్మిఞ్ఛంకరో భక్తవత్సలః ॥28॥**

జయజయధ్వానాలు చేస్తూ, శంకరుడు వేరొకదిశగా వెళ్ళాడు. అంతేగాని భక్తవత్సలుడైన శంకరుడు రామునికి తన దర్శన మనొసంగె.

**ఇతీదృశీం సతీం దృష్ట్వా శివలీలాం విమోహనీమ్ ।**
**సువిస్మితా శివం ప్రాహ శివమాయా విమోహితా ॥29॥**

శివమాయా మోహితురాలైన సతీదేవి ఈవిధమైన శివలీలనుచూచి, మిక్కిలి ఆశ్చర్యాన్ని పొంది, ఆయనతో ఇలా పలికింది.

**సత్యువాచ –** సతీదేవి చెప్పింది.

**దేవదేవ పరబ్రహ్మ సర్వేశ పరమేశ్వర ।**
**సేవన్తే త్వాం సదా సర్వే హరిబ్రహ్మాదయస్సురాః ॥30॥**

దేవదేవా! పరబ్రహ్మ! సర్వేశా! పరమేశ్వరా! హరిబ్రహ్మాది దేవతలందరు నిన్ను సర్వదా సేవిస్తుంటారు.

**త్వం ప్రణమ్యో హి సర్వేషాం సేవ్యో ధ్యేయశ్చ సర్వదా ।**
**వేదాంతవేద్యో యత్నేన నిర్వికారి పరప్రభుః ॥31॥**

అందరిచే నమస్కరింపదగినవాడవు నీవే! అందరిచేత సేవింపదగినవాడవు, ధ్యానింపదగినవాడవు, వేదాంతవేద్యుడవు, నిర్వికారుడవు, పరబ్రహ్మవు నీవే.

**కావిమౌ పురుషౌ నాథ విరహ వ్యాకులాకృతీ ।**
**విచరన్తౌ వనే క్లిష్టౌ దీనౌ వీరౌ ధనుర్ధరౌ ॥32॥**

**తయోర్జ్యేష్ఠం కంజశ్యామం దృష్ట్వా వై కేన హేతునా ।**
**ముదిత స్సుప్రసన్నాత్మాఽభవో భక్త ఇవాఽధునా ॥33॥**

నాథా! ఈ ఇరువురు పురుషులెవరు? వీరు తమ ఆకృతితో విరహవ్యాకులురైనట్లు కనిపిస్తున్నారు. ఈ ఇరువురు ధనుర్బాణాలను ధరించి అడవులలో తిరుగుతున్నారు. వీరు దుఃఖాన్ని అనుభవిస్తూ దీనులైయున్నారు. ఈ ఇరువురిలోను జ్యేష్ఠుని శరీరకాంతి నీలకమలంవలె శ్యామలమైయున్నది. అతణ్ణిచూచి మీరిప్పుడు ఏకారణంచే ఆనందభరితులౌతున్నారు?

**ఇతి మే సంశయం స్వామిన్ శంకర ఛేత్తుమర్హసి ।**
**సేవ్యస్య సేవకేనైవ ఘటతే ప్రణతిః ప్రభో ॥34॥**

“స్వామీ! శంకరా! ప్రభూ! సేవ్యుడైనవానికి సేవకునివలె మీరెందుకీతనికి నమస్కరించారు”? ఇది నామనస్సులోని సందేహం. నాయీ సంశయాన్ని మీరే తీర్చగలరు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఆదిశక్తి స్సతీదేవీ శివా సా పరమేశ్వరీ ।**
**శివమాయా వశీభూత్వా పప్రచ్ఛేత్థం శివం ప్రభుమ్ ॥35॥**

నారదా! మంగళకారిణీ! ఆదిశక్తీ! పరమేశ్వరియునైన సతీదేవి శివమాయావశురాలై భగవంతుడైన శివుని ఆవిధంగా ప్రశ్నించింది.

**తదాకర్ణ్య వచస్సత్యా శ్శంకరః పరమేశ్వరః ।**
**తదా విహస్య స ప్రాహ సతీం లీలా విశారదః ॥36॥**

సతీదేవి మాటలనువిని లీలావిశారదుడు, పరమేశ్వరుడునైన శంకరుడు నవ్వి, ఆమెకు ఇలా జవాబిచ్చాడు.

**పరమేశ్వర ఉవాచ** - పరమేశ్వరుడు చెప్పాడు.

**శ్రుణు దేవి సతి ప్రీత్యా యథార్థం వచ్మి నచ్ఛలమ్ ।**
**వరదాన ప్రభావాత్తు ప్రణామం చైవ మాదరాత్ ॥37॥**

దేవీ! విను, నేను సంతోషంతో యథార్థాన్నే చెబుతున్నాను. ఇందులో కపటమేమీలేదు. వరదాన ప్రభావం చేతనే నేను వారికి గౌరవంతో నమస్కరించాను.

**రామలక్ష్మణ నామానౌ భ్రాతరౌ వీరసమ్మతౌ ।**
**సూర్యవంశోద్భవౌ దేవి ప్రాజ్ఞౌ దశరథాత్మజౌ ॥38॥**

వీరిరువురు సోదరులు. వీరులచే సన్మానితులు. రామలక్ష్మణులనేవి వీరిపేర్లు. వీరు సూర్యవంశంలో జన్మించినవారు. దశరథుని కుమారులు. ప్రాజ్ఞులు.

**గౌరవర్ణో లఘు ర్బంధు శ్శేషాంశో లక్ష్మణాభిధః ।**
**జ్యేష్ఠో రామాభిధో విష్ణుః పూర్ణాంశో నిరుపద్రవః ॥39॥**

వీరిలో గౌరవర్ణం కలవాడు చిన్నవాడు. సాక్షాత్తు శేషుని అంశం. అతనిపేరు లక్ష్మణుడు. పెద్దవానిపేరు రాముడు. భగవంతుడైన శ్రీమహావిష్ణువే తన పరిపూర్ణాంశతో నిరుపద్రవుడై ఈరూపంలో అవతరించాడు.

**అవతీర్ణ క్షితౌ సాధురక్షణాయ భవాయ నః ।**
**ఇత్యుక్త్వా విరరామాఽసౌ శంభుస్స్తుతికరః ప్రభు ॥40॥**

వీరిరువురు సాధుపురుషులను సంరక్షించడానికి, మనకు శుభాలను సమకూర్చడానికి, భూలోకంలో అవతరించారు.

**శ్రుత్వా పీత్థం వచశ్శమ్భోర్న విశశ్వాస తన్మనః ।**
**శివమాయా బలవతీ సైవ త్రైలోక్యమోహినీ ॥41॥**

శివమాయ మిక్కిలి ప్రబలమైనది. అది ముల్లోకాలను మోహింపజేయగల శక్తిగలది. అట్టి శివమాయా మోహితురాలైన సతీదేవికి శివుడు పలికిన ఈమాటలందు విశ్వాసం కలగలేదు.

**అవిశ్వస్తం మనో జ్ఞాత్వా తస్యాశ్శంభు స్సనాతనః ।**
**అవోచద్వచనం చేతి ప్రభుర్లీలా విశారదః ॥42॥**

సనాతనుడైన శంభుడు సతీదేవి మనస్సునకు తనమాటలయందు విశ్వాసం కలగలేదని తెలుసుకొని, ఆమెతో ఇలా చెప్పాడు.

**శివఉవాచ –** శివుడు చెప్పాడు.

**శ్రుణు మద్వచనం దేవి న విశ్వసితి చేన్మనః ।**
**తవ రామపరీక్షాం హి కురు తత్ర స్వయాధియా ॥43॥**

దేవీ! నా మాటలు విను. లోగడ నేను చెప్పిన మాటలపై నీమనస్సునకు విశ్వాసం కలగకపోయినచో నీవక్కడకు వెళ్ళి, నీబుద్ధికి తోచినట్లు శ్రీరాముని పరీక్షించు.

**వినశ్యతి యథా మోహస్తత్కురు త్వం సతి ప్రియే ।**
**గత్వా తత్ర స్థితస్తావద్వటే భవ పరీక్షికా ॥44॥**

ప్రియా! నీమోహం, భ్రమ, తొలగిపోయేటట్లుగా వ్యవహరించు, నీవక్కడకువెళ్ళి శ్రీరాముని పరీక్షించు, అంతవరకు నేను ఈ మఱ్ఱిచెట్టు క్రింద ఉంటాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**శివాజ్ఞయా సతీ తత్ర గత్వార్చిత యదీశ్వరీ ।**
**కుర్యాం పరీక్షాం చ కథం రామస్య వనచారిణః ॥45॥**

నారదా! భగవంతుడైన శివుని ఆజ్ఞతో సతీదేవి అక్కడకు వెళ్ళింది. ఆమె తన మనస్సులో ఈ విధంగా ఆలోచింపసాగింది. "వనచారుడైన రాముని నేనేవిధంగా పరీక్షించగలను?

**సీతారూప మహం ధృత్వా గచ్ఛేయం రామసన్నిధౌ ।**
**యది రామో హరిస్సర్వం విజ్ఞాస్యతి నచాన్యథా ॥46॥**

నేను సీతాదేవి రూపాన్ని ధరించి , రాముని చెంతకు వెళతాను. శ్రీరాముడు సాక్షాత్తు విష్ణువే యైనచో ఈ విషయమంతా తెలుసుకుంటాడు. లేనిచో నన్ను గుర్తింపడు"

**ఇత్థం విచార్య సీతా సా భూత్వా రామ సమీపతః ।**
**ఆగమ త్తత్పరీక్షార్థం సతీ మోహపరాయణా ॥47॥**

ఈ విధంగా ఆలోచించి, సతీదేవి సీతాదేవి రూపాన్ని ధరించి, శ్రీరాముని పరీక్షించడానికి ఆయన చెంతకు వెళ్ళింది. వాస్తవానికి సతీదేవి మాయామోహ పరాయణురాలైంది.

**సీతారూపాం సతీం దృష్ట్వా జపన్నామ శివేతి చ ।**
**విహస్య తత్ర్వవిజ్ఞాయ నత్వావోచద్రఘూద్వహః ॥48॥**

సతీదేవి సీతాదేవి రూపంలో తనవద్దకు వచ్చిందని శ్రీరాముడు తెలుసుకున్నాడు. ఆమెనుచూసి, నవ్వి, శివనామాన్ని జపిస్తూ, ఆమెకు నమస్కరించి, రాముడు ఆమెతో ఇలా అన్నాడు.

**రామ ఉవాచ –** రాముడు చెప్పాడు.

**ప్రేమతస్త్వం సతి బ్రూహి క్వ శంభుస్తే మనోగతః ।**
**ఏకా హి విపినే కస్మాదాగతా పతినా వినా ॥49॥**

సతీదేవీ! నీమనోగతుడైన శంభుడెక్కడకు వెళ్ళాడు? భర్తలేకుండా ఒంటరిగా మీరీవనానికి ఎందుకు వచ్చారు? ప్రేమతో నాకు తెలియజేయండి.

**త్యక్త్వా స్వరూపం కస్మాత్తే ధృతం రూపమిదం సతి ।**
**బ్రూహి తత్కారణం దేవి కృపాం కృత్వా మమోపరి ॥50॥**

మీరు మీరూపాన్ని వదలి, సీతాదేవి రూపాన్ని ఎందుకు ధరించారో నాయందు దయతో చెప్పండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి రామ వచః శ్రుత్వా చకితాసీ త్సతీ తదా ।**
**స్మృత్వా శివోక్తం మత్వా చావితథం లజ్జితా భృశమ్ ॥51॥**

శ్రీరామచంద్రుని మాటలను విని, సతీదేవి ఆశ్చర్యచకితురాలయ్యింది. అప్పుడామె శివుడు చెప్పిన మాటలను జ్ఞప్తికి తెచ్చుకొని, అవి సత్యమని తెలుసుకొని, మిక్కిలి లజ్జితురాలయ్యింది.

**రామం విజ్ఞాయ విష్ణుం తం స్వరూపం సంవిధాయ చ ।**
**స్మృత్వా శివపదం చిత్తే సత్యువాచ ప్రసన్నధీః ॥52॥**

శ్రీరాముడు సాక్షాత్తు శ్రీమహావిష్ణువని తెలుసుకొని, సతీదేవి తన నిజరూపాన్ని పొంది, మనస్సులో శివుని పాదారవిందాలను స్మరించి, ప్రసన్నచిత్తురాలై రామునితో ఇలా పలికింది.

**శివో మయా గణైశ్చైవ పర్యటన్ వసుధాం ప్రభుః ।**
**ఇహాగచ్ఛచ్చ విపినే స్వతంత్రః పరమేశ్వరః ॥53॥**

శ్రీరామా! స్వతంత్రుడు, పరమేశ్వరుడు, భగవానుడునైన శివుడు, నేను శివగణం వెంటరాగా భూమండలంలో పర్యటిస్తూ ఈ దండకారణ్యానికి వచ్చాము.

**అపశ్యదత్ర స త్వాం హి సీతాన్వేషణతత్పరమ్ ।**
**సలక్ష్మణం విరహిణం సీతయా క్లిష్టమానసమ్ ॥54॥**

ఇక్కడ సీతాదేవిని వెదుకుటలో లగ్నమైన లక్ష్మణుని, నిన్ను ఆయన చూశారు. నీవు సీతా విరహ శోకంతో పీడింపబడుచున్నట్లు కన్పించావు.

**నత్వా త్వాం స గతో మూలే వటస్య స్థిత ఏవ హి ।**
**ప్రశంసన్ మహిమానం తే వైష్ణవం పరమం ముదా ॥55॥**

అట్టి స్థితిలోనున్న నీకు ఆయన ప్రణామమొనర్చి, వెళ్ళి వటవృక్షంక్రింద నిలబడ్డారు. నీ వైష్ణవరూపంయొక్క మహిమను ఆనందంతో గానంచేస్తున్నారు.

**చతుర్భుజం హరిం త్వాం నో దృష్ట్వేవం ముదితోఽభవత్ ।**
**యథేదం రూపమమలం పశ్యన్నానందమాప్తవాన్ ॥56॥**

చతుర్భుజ హరిరూపంలో నిన్ను చూడకపోయినప్పటికి, ఈరూపం దర్శించినంత మాత్రంచేతనే ఆయన ఆనందపరవశులయ్యారు.

**తచ్ఛ్రుత్వా వచనం శంభో ర్భ్రమమానీయ చేతసి ।**
**తదాజ్ఞయా పరీక్షాం తే కృతవత్యస్మి రాఘవ ॥57॥**

ఆ ఆనందానికిగల కారణాన్నిగూర్చి నేనడుగగా శివభగవానుడు చెప్పిన మాటలను విని, నామనస్సునకు భ్రమకలిగింది. అందుచే ఆయన ఆజ్ఞతో నేనిచ్చటకువచ్చి, పరీక్షించి, కృతార్థురాలనయ్యాను.

**జ్ఞాతం మే రామ విష్ణుస్త్వం దృష్ట్వా తే ప్రభుతాఽఖిలా ।**
**నిస్సంశయా తదాపి తచ్ఛృణు త్వం చ మహామతే ॥58॥**

శ్రీరామా! నీవు సాక్షాత్తు విష్ణుదేవుడవని తెలుసుకున్నాను. నీ మాహాత్మ్యాన్ని కనులారా చూశాను. నా సందేహం తొలగిపోయింది. అయినప్పటికి ఓ మహామతే! నామాట విను.

**కథం ప్రణమ్యస్త్వం తస్య సత్యం బ్రూహి మమాగ్రతః ।**
**కురు నిస్సంశయాం త్వం మాం శమలం ప్రాప్నుహి ద్రుతమ్ ॥59॥**

భగవంతుడైన శివునికికూడా నీవు వందనీయుడ వెలా అయ్యావు? ఈవిషయంలో ఉన్నదున్నట్లుగా నాకు తెలియజేయి. నాయీ సందేహాన్ని తొలగించి, నాకు సంపూర్ణశాంతిని కలిగించు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్యా రామశ్చోత్ఫుల్లలోచనః ।**
**అస్మరత్స్వం ప్రభుం శంభుం ప్రేమాభూద్ధృది చాధికమ్ ॥60॥**

సతీదేవి మాటలనువిని, శ్రీరాముని నేత్రాలు వికసించిన కమలాలవలె శోభిల్లాయి. ఆయన మనస్సులో తన ప్రభువైన శంభుని స్మరించాడు. దీనివలన ఆయన హృదయంలో ప్రేమ ప్రవాహంవలె పొంగింది.

**సత్యా వినాజ్ఞయా శంభుసమీపం నాగమన్మనే ।**
**సంవర్ణ్య మహిమానం చ ప్రావోచ ద్రాఘవ స్సతీమ్ ॥61॥**

మునీంద్రా! శివాజ్ఞ లేనందున శ్రీరాముడు సతీదేవితో కలసి, శంకరుని సమీపానికి రాలేదు. కాని మనస్సులో శివుని మహిమను వర్ణిస్తూ సతీదేవితో రాముడిలా చెప్పనారంభించాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే రామ పరీక్షావర్ణనం నామ చతుర్వింశోఽధ్యాయః ॥24॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో రామ పరీక్షావర్ణనం అనే ఇరవై నాలుగవ అధ్యాయం సమాప్తం.

* * * * * *

## పంచవింశోఽధ్యాయః -ఇరవై ఐదవ అధ్యాయం
## సతీవియోగః - సతీవియోగం

**రామ ఉవాచ** - రాముడు చెప్పాడు.

**ఏకదా హి పురా దేవి శంభుః పరమసూతికృత్ ।**
**విశ్వకర్మాణమాహూయ స్వలోకే పరతః పరే ॥1॥**

దేవీ! ప్రాచీనకాలంలో ఒకనాడు సృష్టికర్త అయినశంభుడు తన పరాత్పరధామానికి విశ్వకర్మను పిలిపించాడు.

**స్వధేనుశాలాయాం రమ్యం కారయామాస తేన చ ।**
**భవనం విస్తృతం సమ్యక్ తత్ర సింహాసనం వరమ్ ॥2॥**

అతనిచేత తన గోశాలయందు మిగుల విశాలము, రమణీయమునైన భవనాన్ని నిర్మింపజేశాడు. దానిలో నొక శ్రేష్ఠమైన సింహాసనాన్ని కూడా నిర్మింపజేశాడు.

**తత్ర చ్ఛత్రం మహాదివ్యం సర్వదాఽద్భుతముత్తమమ్ ।**
**కారయామాస పరమం శంకరో విశ్వకర్మణా ॥3॥**

అక్కడ విశ్వకర్మద్వారా శంకరుడు ఒక ఛత్రాన్నికూడా చేయించాడు. అది మిక్కిలి దివ్యమైనది. సర్వదాద్భుతమైనది. చాలా ఉత్తమమైనది.

**శక్రాదీనాం జుహావాశు సమస్తాన్ దేవతాగణాన్ ।**
**సిద్ధగంధర్వనాగాదీ నుపదేశాంశ్చ కృత్స్నశః ॥4॥**

అనంతరం శంకరుడు ఇంద్రాది దేవతాగణాలను, సిద్ధులను, గంధర్వులను, నాగులను మున్నగువారిని అక్కడకు శీఘ్రంగా పిలిపించాడు.

**దేవాన్ సర్వానాగమాంశ్చ విధిం పుత్రైర్మునీనపి ।**
**దేవీస్సర్వా అప్సరోభిర్నానావస్తుసమన్వితాః ॥5॥**

దేవతలనందర్నీ ఆగమాలను, కుటుంబ సమేతుడైన బ్రహ్మను, మునులను, అనేకాభరణాలతో సుశోభితలైన అప్సరసలతో కూడా సమస్తదేవతాస్త్రీలను ఆహ్వానించాడు. వారందరు వివిధవస్తువులను తీసుకొని విచ్చేశారు.

**దేవానాం చ తథర్షీణాం సిద్ధానాం ఫణినామపి ।**
**ఆనయన్మంగళకరాః కన్యాః షోడశ షోడశ ॥6॥**

అంతేగాక దేవతల, ఋషుల, సిద్ధుల, నాగులనుండి పదహారుగురు చొప్పున శుభలక్షణాలుకల కన్యలను కూడా పిలిపించాడు.

**వీణామృదంగప్రముఖవాద్యాన్నానావిధాన్మునే ।**
**ఉత్సవం కారయామాస వాదయిత్వా సుగాయనైః ॥7॥**

వీణ, మృదంగం, మొదలైన అనేక ప్రముఖమంగళవాద్యాలను ప్రయోగిస్తూ, సుందరగీతాలను గానం చేస్తూ గొప్ప ఉత్సవాన్ని నిర్వహించారు.

**రాజాభిషేకయోగ్యాని ద్రవ్యాణి సకలౌషధైః ।**
**ప్రత్యక్షతీర్థపాథోభిః పంచకుంభాంశ్చ పూరితాన్ ॥8॥**

సకల ఓషధులతో కూడిన రాజ్యాభిషేకానికి కావలసిన ద్రవ్యాలన్నీ సమీకరింపబడ్డాయి. ప్రత్యక్ష తీర్థజలాలతో నిండిన ఐదు కలశాలు సిద్ధం చేయబడ్డాయి.

**తథాన్యాస్సంవిధా దివ్యా ఆనయత్స్వగణైస్తదా ।**
**బ్రహ్మఘోషం మహారావం కారయామాస శంకరః ॥9॥**

అంతేగాక ఇంకను అనేకములైన దివ్యసామగ్రులను కూడ శంకరుడు తన గణాల ద్వారా రప్పించాడు. అక్కడ శంకరుడు ఉచ్చస్వరంతో వేదమంత్రఘోష చేయించాడు.

**అథో హరిం సమాహూయ వైకుంఠాత్ప్రీతమానసః ।**
**తద్భక్త్యా పూర్ణయా దేవి మోదతి స్మ మహేశ్వరః ॥10॥**

దేవీ! విష్ణుభగవానునియొక్క సంపూర్ణభక్తికి మహేశ్వరుడు మిక్కిలి ప్రసన్నుడై యున్నాడు. ఆయన శ్రీహరిని వైకుంఠం నుండి పిలిపించాడు.

**సుముహూర్తే మహాదేవస్తత్ర సింహాసనే వరే ।**
**ఉపవేశ్య హరిం ప్రీత్యా భూషయామాస సర్వశః ॥11॥**

ఒక సుముహూర్తంలో మహాదేవుడు శ్రీహరిని శ్రేష్ఠమైన ఆ సింహాసనంపై కూర్చుండబెట్టి, సర్వాభరణభూషితుణ్ణి చేశాడు.

**ఆబద్ధరమ్యముకుటం కృతకౌతుకమంగళమ్ ।**
**అభ్యషించన్ మహేశస్తు స్వయం బ్రహ్మాండమండపే ॥12॥**

మహాదేవుడు శ్రీహరి తలపై మనోహరమైన కిరీటాన్ని ధరింపజేశాడు. రక్షాబంధనం ధరింపచేసాడు. ఇదంతా జరిగినపిమ్మట మహేశ్వరుడు స్వయంగా బ్రహ్మాండమండపంలో శ్రీహరిని అభిషేకించాడు.

**దత్తవాన్నిఖిలైశ్వర్యం యన్నైజం నాన్యగామి యత్ ।**
**తతస్తుష్టావ తం శంభుస్స్వతంత్రో భక్తవత్సలః ॥13॥**

అనంతరం శంభుడు అన్యులెవరివద్ద లేని తన సకలైశ్వర్యాలను శ్రీహరికి సమర్పించాడు. స్వతంత్రుడు, ఈశ్వరుడు, భక్తవత్సలుడునగు శంభుడు శ్రీహరిని స్తుతించి సంతోషాన్ని కలుగజేశాడు.

**బ్రహ్మాణం లోకకర్తారమవోచద్వచనం త్విదమ్ ।**
**వ్యాపయన్స్వం పరాధీనం స్వతంత్రం భక్తవత్సలః ॥14॥**

శంభుడు తానిచ్చిన వరములకు వశుడైన యుండుటను, భక్తి పరవశతను, సర్వత్ర ప్రసిద్ధంచేస్తు లోకకర్తయైన బ్రహ్మదేవునితో ఇలా అన్నాడు.

**మహేశ ఉవాచ** – మహేశుడు చెప్పాడు.

**అతః ప్రభృతి లోకేశ మన్నిదేశాదయం హరిః ।**
**మమ వంద్యః స్వయం విష్ణుర్జ్ఞాతస్సర్వశ్శృణోతు హి ॥15॥**

లోకేశా! నేటినుండి నా ఆదేశానుసారం ఈవిష్ణువు స్వయంగా నాకు వంద్యుడయ్యాడు. ఈ విషయాన్ని అందరు వినండి.

**సర్వైర్దేవాదిభిస్తాత ప్రణమ త్వమముం హరిమ్ ।**
**వర్ణయంతు హరిం వేదా మమైతే మామివాజ్ఞయా ॥16॥**

నీవు సకల దేవతలతో బాటుగా ఈ శ్రీహరికి ప్రణామం చెయ్యి. ఈవేదాలు నన్ను వర్ణించిన విధంగానే నా ఆజ్ఞతో ఈనాటినుండి శ్రీహరిని వర్ణించాలి.

**రామ ఉవాచ** – రాముడు చెప్పాడు.

**ఇత్యుక్త్వాథ స్వయం రుద్రోఽనమద్వై గరుడధ్వజమ్ ।**
**విష్ణుభక్తిప్రసన్నాత్మా వరదో భక్తవత్సలః ॥17॥**

దేవీ! వరదుడు, భక్తవత్సలుడు నైన రుద్రుడు పై విషయాలను చెప్పి, స్వయంగా గరుడధ్వజునికి నమస్కరించాడు.

**తతో బ్రహ్మాదిభి ర్దేవైః సర్వరూప సురైస్తథా ।**
**ముని సిద్ధాదిభిశ్చైవం వందితోఽభూద్ధరిస్తదా ॥18॥**

తదనంతరం బ్రహ్మాదులగు దేవతలు, మునులు, సిద్ధులు, మున్నగువారుకూడా శ్రీహరికి నమస్కరించారు.

**తతో మహేశో హరయేఽశంసద్దివిషదాం తదా ।**
**మహావరాన్ సుప్రసన్నో దత్తవాన్భక్తవత్సలః ॥19॥**

దీని తరువాత భక్తవత్సలుడైన మహేశ్వరుడు అత్యంతప్రసన్నుడై, దేవతల సమక్షంలో శ్రీహరికి గొప్పగొప్ప వరాలను ప్రసాదించాడు.

**మహేశ ఉవాచ** – మహేశుడు చెప్పాడు.

**త్వం కర్తా సర్వలోకానాం భర్తా హర్తా మదాజ్ఞయా ।**
**దాతా ధర్మార్థకామానాం శాస్తా దుర్నయకారిణామ్ ॥20॥**

శ్రీహరీ! నా ఆజ్ఞచే సకల లోకాలకు కర్తవు, పాలకుడవు, సంహారకుడవు నీవే. ధర్మార్థకామాల ప్రదాతవు నీవే. దుర్నీతిపరులను, దుష్టులను, శిక్షించువాడవు నీవే.

**జగదీశో జగత్పూజ్యో మహాబలపరాక్రమః ।**
**అజేయస్త్వం రణే క్వాపి మమాపి హి భవిష్యసి ॥21॥**

నీవు మహాబలపరాక్రమసంపన్నుడవు, జగత్పూజ్యుడవు, జగదీశ్వరుడవు, అజేయుడవు, యుద్ధములో నిన్నెవురును జయింపలేరు. నాచేకూడా నీవెప్పుడు పరాజితుడవు కావు.

**శక్తిత్రయం గృహాణ త్వమిచ్ఛాది ప్రాపితం మయా ।**
**నానాలీలాప్రభావత్వం స్వతంత్రత్వం భవత్రయే ॥22॥**

నాచే నీకివ్వబడుచున్న ఇచ్ఛాది శక్తిత్రయాన్ని స్వీకరించు. ఆ మూడింటిలో మొదటిది ఇచ్ఛ మొదలగువాటి సిద్ధిశక్తి. రెండవది నానావిధములైన లీలలను ప్రకటించే శక్తి. మూడవది త్రిలోకాలలోను నిత్యస్వాతంత్ర్యం.

**త్వద్ద్వేష్టారో హరే నూనం మయా శాస్యాః ప్రయత్నతః ।**
**త్వద్భక్తానాం మయా విష్ణో దేయం నిర్వాణ ముత్తమమ్ ॥23॥**

శ్రీహరీ! నిన్ను ద్వేషించువాడు నాచే దండింపబడతాడు. నీభక్తులకు నేను మోక్షాన్ని ప్రసాదిస్తాను.

**మాయాం చాపి గృహాణేమాం దుష్ప్రణోద్యాం సురాదిభిః ।**
**యయా సంమోహితం విశ్వమచిద్రూపం భవిష్యతి ॥24॥**

నీవు ఈ మాయనుకూడా స్వీకరించు. దీనిని నివారించడం దేవతలకు కూడ సాధ్యం కాదు. ఆ మాయయొక్క మోహంలో మునిగిన ఈ విశ్వం జడరూపమౌతుంది.

**మమ బాహుర్మదీయస్త్వం దక్షిణోఽసౌ విధిర్హరే ।**
**అస్యాపి హి విధేః పాతా జనితాఽపి భవిష్యసి ॥25॥**

శ్రీహరీ! నీవు నా ఎడమ భుజం. ఈబ్రహ్మ దక్షిణ భుజం. నీవు ఈ విధాతకుకూడ జనకుడవు, పాలకుడవు,కాగలవు.

**హృదయం మమ యో రుద్రస్స ఏవాహం న సంశయః ।**
**పూజ్యస్తవ సదా సోఽపి బ్రహ్మాదీనామపి ధ్రువమ్ ॥26॥**

నా హృదయరూపమైన రుద్రుడను నేనే. ఇందులో సందేహము లేదు. ఆ రుద్రుడు నీకును బ్రహ్మాది సమస్త దేవతలకును పూజ్యుడనేది నిశ్చయం.

**అత్ర స్థిత్వా జగత్సర్వం పాలయ త్వం విశేషతః ।**
**నానావతారభేదైశ్చ సదా నానోతికర్తృభిః ॥27॥**

నీవిచ్చటినుండియే సంపూర్ణ జగత్తును విశేషముగా పాలింపుము. అనేక విధములైన లీలలను చేసే భిన్న భిన్న అవతారాలతో అందరిని సదా రక్షిస్తూ ఉండుము.

**మమ లోకే తవేదం వై స్థానం చ పరమర్థిమత్ ।**
**గోలోక ఇతి విఖ్యాతం భవిష్యతి మహోజ్జ్వలమ్ ॥28॥**

నా చిన్మయధామంలో అత్యంత ఉజ్జ్వలస్థానమైనది, పరమవైభవశాలియైనది యైన నీధామం గోలోకమనే పేరుతో భవిష్యత్తులో విఖ్యాతి చెందుతుంది.

**భవిష్యన్తి హరే యే తేఽవతారా భువి రక్షకాః ।**
**మద్భక్తాస్తాన్ ధ్రువం ప్రీతాః పశ్యన్తిస్మ నిజాద్వరాత్ ॥29॥**

శ్రీహరీ! భూతలంపై ప్రకటితమయ్యే నీ అవతారాలన్నీ అందరిని రక్షిస్తాయి. నాభక్తులు నా వరప్రభావంవలన ఆ అవతారాలను ఎంతో ఆనందంగా దర్శించుకుంటారు.

**రామ ఉవాచ –** రాముడు చెప్పాడు.

**అఖండైశ్వర్యమాసాద్య హరేరిత్థం హరస్స్వయమ్ ।**
**కైలాసే స్వగణై స్తస్మిన్ స్వైరం క్రీడత్యుమాపతిః ॥30॥**

దేవీ! ఈవిధంగా హరుడు విష్ణువునకు అఖండైశ్వర్యాలను ప్రసాదించాడు. ఉమాపతియైన హరుడు స్వయంగా కైలాస పర్వతంమీద నివసిస్తూ తన శైవగణాలతోకూడి, స్వచ్ఛందంగా క్రీడిస్తూ ఉన్నాడు.

**తదా ప్రభృతి లక్ష్మీశో గోపవేషోఽభవత్తథా ।**
**అయాసీత్తత్ర సుప్రీత్యా గోపగోపీగవాంపతిః ॥31॥**

నాటినుండి లక్ష్మీపతి గోపవేషాన్ని ధరించి, అచ్చటికి వచ్చి, గోపకులకు, గోవులకు, గోపికలకు అధిపతియై మిక్కిలి ఆనందంతో నివాసమున్నాడు.

**సోఽపి విష్ణుః ప్రసన్నాత్మా జుగోప నిఖిలం జగత్ ।**
**నానావతారస్సంధర్తాఽవనకర్తా శివాజ్ఞయా ॥32॥**

ఆవిష్ణువే ప్రసన్నాత్ముడై, సమస్త జగత్తును రక్షింపసాగాడు. శివాజ్ఞచే అనేకావతారలనెత్తి జగత్పాలన చేస్తున్నాడు.

**ఇదానీం స చతుర్ధాత్రావతరచ్ఛంకరాజ్ఞయా ।**
**రామోఽహం తత్ర భరతో లక్ష్మణశ్శత్రుహేతి చ ॥33॥**

ఆ శ్రీహరియే శంకరాజ్ఞచే ఇప్పుడు నలుగురు సోదరుల రూపంలో అవతరించాడు. ఆ నలుగురిలో పెద్దవాడనైన నేను రాముడను. రెండవవాడు భరతుడు. మూడవవాడు లక్ష్మణుడు. నాల్గవవాడు శత్రుఘ్నుడు.

**అథ పిత్రాజ్ఞయా దేవి ససీతాలక్ష్మణస్సతి ।**
**ఆగతోఽహం వనే చాద్య దుఃఖితౌ దైవతోఽభవమ్ ॥34॥**

ఓ సతీదేవీ! పిమ్మట నేను తండ్రిగారి ఆజ్ఞానుసారం సీతాలక్ష్మణ సమేతుడనై ఈవనాలకు వచ్చాను. దైవవశాత్తు దుఃఖితులమయ్యాము.

**నిశాచరేణ మే జాయా హృతా సీతేతి కేనచిత్ ।**
**అన్వేష్యామి ప్రియాం చాత్ర విరహీ బంధునా వనే ॥35॥**

ఇక్కడ నాభార్యయైన సీతను నిశాచరుడెవ్వడో అపహరించాడు. నేను విరహంతో, సోదరుడైన లక్ష్మణునితో కూడి ఈ వనంలో నా ప్రియురాలిని అన్వేషిస్తున్నాను.

**దర్శనం తే యది ప్రాప్తం సర్వథా కుశలం మమ ।**
**భవిష్యతి న సందేహో మాతస్తే కృపయా సతి ॥36॥**

నాకు మీ దర్శనం లభించింది. ఇకపై అంతా కుశలం నాకుగలదు. ఓ సతీదేవీ! అమ్మా! నీ దయవల్ల ఆవిధంగా జరగడంలో సందేహం లేదు.

**సీతాప్రాప్తివరో దేవి భవిష్యతి న సంశయః ।**
**తం హత్వా దుఃఖదం పాపం రాక్షసం త్వదనుగ్రహాత్ ॥37॥**

నీ దర్శనంవల్ల నాకు సీత నిశ్చయంగా లభిస్తుందనే వరం ప్రాప్తమయ్యింది. నీ అనుగ్రహం వల్ల నాకు దుఃఖాన్ని కలిగించే పాపాత్ముడైన రాక్షసుని చంపి, సీతను తప్పక పొందగలను.

**మహద్భాగ్యం మమాద్యైవ యద్యకార్ష్టాం కృపాం యువామ్ ।**
**యస్మిన్ సకరుణౌ స్యాతాం స ధన్యః పురుషో వరః ॥38॥**

మీ ఇరువురి కృప నామీద కలగడం నాకు మహద్భాగ్యం. మీ దయను పొందిన పురుషుడు ధన్యుడు, శ్రేష్ఠుడు కాగలడు.

**ఇత్థమాభాష్య బహుధా సుప్రణమ్య సతీం శివామ్ ।**
**తదాజ్ఞయా వనే తస్మిన్ విచచార రఘూద్వహః ॥39॥**

ఇట్లనేక విషయాలు చెప్పి, కళ్యాణప్రదురాలైన సతీదేవికి ప్రణమిల్లి, ఆమె అనుమతితో రఘూద్వహుడు ఆ వనంలో సంచరింపసాగాడు.

**అథాఽకర్ణ్య సతీ వాక్యం రామస్య ప్రయతాత్మనః ।**
**హృష్టాఽభూత్సా ప్రశంసన్తీ శివభక్తిరతం హృది ॥40॥**

సతీదేవి పవిత్ర హృదయుడైన శ్రీరాముని మాటలను విని, మదిలో శివభక్తిరతుడైన శ్రీరాముని ప్రశంసిస్తు మిక్కిలి ప్రసన్నురాలయ్యింది.

**స్మృత్వా స్వకర్మ మనసాఽ కార్షీచ్ఛోకం సువిస్తరమ్ ।**
**ప్రత్యాగచ్ఛదుదాసీనా వివర్ణా శివసన్నిధౌ ॥41॥**

తాను చేసిన పనిని గుర్తునకు తెచ్చుకొని, ఆమె మనస్సులో అత్యంతదుఃఖాన్ని పొందింది. ఉదాసీనురాలు వివర్ణయునైన సతీదేవి శివుని చెంతకు తిరిగి వచ్చింది.

**అచింతయత్పథి సా దేవీ సంచలంతీ పునఃపునః ।**
**నాంగీకృతం శివోక్తం మే రామం ప్రతి కుధీః కృతా ॥42॥**

అట్లు శివుని చెంతకు వెళ్ళుచున్న సతీదేవి మార్గమధ్యంలో 'శివుని మాటను నేను వినలేదు. శ్రీరాముని యెడల కుత్సితబుద్ధిని ప్రదర్శించాను'. అని పదేపదే చింతింపసాగింది.

**కిముత్తరమహం దాస్యే గత్వా శంకరసన్నిధౌ ।**
**ఇతి సంచింత్య బహుధా పశ్చాత్తాపోఽ భవత్తదా ॥43॥**

శంకరుని దగ్గరకు వెళ్ళి, ఆయనకు నేనేమి సమాధానమియ్యగలను? అని అనేక విధాలుగా సతీదేవి పశ్చాత్తాపానికి గురియైనది.

**గత్వా శంభుసమీపం చ ప్రణనామ శివం హృదా ।**
**విషణ్ణవదనా శోకవ్యాకులా విగతప్రభా ॥44॥**

సతీదేవి శివుని సమీపించి, హృదయపూర్వకంగా ఆయనకు నమస్కరించింది. కాని ఆమె వదనం విషాద చ్ఛాయలతో నిండింది. ఆమె శోకవ్యాకులతతో విషణ్ణవదనయు, తేజోహీనయు అయ్యింది.

**అథ తాం దుఃఖితాం దృష్ట్వా పప్రచ్ఛ కుశలం హరః ।**
**ప్రోవాచ వచనం ప్రీత్యా తత్పరీక్షా కృతా కథమ్ ॥45॥**

సతీదేవి దుఃఖాన్నిచూచి హరుడామెను కుశలసమాచారం అడిగాడు. 'నీవేవిధంగా రాముని పరీక్షించావు' అని ప్రేమతో సతిని శంకరుడడిగాడు.

**శ్రుత్వా శివవచో నాహం కిమపి ప్రణతాననా ।**
**సతీ శోకవిషణ్ణా సా తస్థౌ తత్ర సమీపతః ॥46॥**

శివుని మాటలను విని, సతీదేవి తలవంచి, నేనేమీ పరీక్షించలేదనిచెప్తూ శోకవిషణ్ణయై అతనిచెంత నిలిచింది.

**అథ ధ్యాత్వా మహేశస్తు బుబోధ చరితం హృదా ।**
**దక్షజాయా మహాయోగీ నానాలీలా విశారదః ॥47॥**

అంతట మహాయోగి, నానాలీలావిశారదుడూ అగు మహేశ్వరుడు ధ్యానమగ్నుడై, సతీదేవి వృత్తాంతాన్నంతటిని తెలుసుకొన్నాడు.

**సస్మార స్వపణం పూర్వం యత్కృతం హరికోపతః ।**
**తత్ప్రార్థితోఽథ రుద్రోఽసౌ మర్యాదాప్రతిపాలకః ॥48॥**

అంతట మర్యాదాపాలకుడగు శివుడు హరికోపంతో తాను పూర్వంచేసిన ప్రతిజ్ఞను స్మరించెను.

**విషాదోఽభూత్ప్రభోస్తత్ర మనస్యేవమువాచ హ ।**
**ధర్మవక్తా ధర్మకర్తా ధర్మావనకరస్సదా ॥49॥**

ధర్మకర్త, ధర్మవక్త, వేదధర్మపరిపాలకుడునైన శివుడు మనస్సులో విషాదాన్ని పొంది, ఇలా అన్నాడు.

**శివ ఉవాచ** - శివుడు చెప్పాడు.

**కుర్యాం చేద్దక్షజాయాం హి స్నేహం పూర్వం యథా మహాన్ ।**
**నశ్యేన్మమ పణః శుద్ధో లోకలీలానుసారిణః ॥50॥**

సతీదేవియందు పూర్వం చూపిన విధంగా స్నేహాన్ని, ప్రేమను చూపిస్తే ప్రతిజ్ఞాభంగం కలుగుతుంది.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్థం విచార్య బహుధా హృదా తామత్యజత్సతీమ్ ।**
**పణం న నాశయామాస వేదధర్మ ప్రపాలకః ॥51॥**

ఆవిధంగా అనేకరీతులలో ఆలోచించి, శివుడు సతీదేవిని మానసికంగా త్యజించాడు. వేదధర్మ ప్రపాలకుడైన శివుడు ప్రతిజ్ఞను మాత్రం నాశనం చేయలేదు.

**తతో విహాయ మనసా సతీం తాం పరమేశ్వరః ।**
**జగామ స్వగిరిం భేదం జగావద్ధా స హి ప్రభుః ॥52॥**

ఇట్లు పరమేశ్వరుడు సతీదేవిని మనసులో పరిత్యజించి, తనకైలాస శిఖరానికి వెళ్ళిపోయాడు, రహస్యాన్ని ప్రకటించాడు.

**చలంతం పథి తం వ్యోమవాణ్యువాచ మహేశ్వరమ్ ।**
**సర్వాన్ సంశ్రావయన్ తత్ర దక్షజాం చ విశేషతః ॥53॥**

మార్గమధ్యంలో ఆకాశవాణి అచ్చట నున్నవారందరు వినేటట్లుగాను, ప్రత్యేకించి దాక్షాయణి వినేటట్లుగాను, మహేశ్వరుని ధర్మనిష్ఠను మెచ్చి ఇలా పలికింది.

**వ్యోమవాణ్యువాచ** - ఆకాశవాణి చెప్పింది.

**ధన్యస్త్వం పరమేశాన త్వత్సమోఽద్య తథా పణః ।**
**న కోఽప్యన్యస్త్రిలోకేఽస్మిన్ మహాయోగీ మహాప్రభుః ॥54॥**

'శంకరా నీవు ధన్యుడవు. నీతో సమానంగా ప్రతిజ్ఞాపాలన చేయగలిగిన మరియొక మహాయోగి ముల్లోకాలలోను లేదు'. అని ఆకాశవాణి పరమేశ్వరుని కీర్తించింది.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**శ్రుత్వా వ్యోమవచో దేవీ శివం పప్రచ్ఛ విప్రభా ।**
**కం పణం కృతవాన్నాథ బ్రూహి మే పరమేశ్వర! ॥55॥**

ఆకాశవాణి పలుకులను విని సతీదేవి తనకాంతిని కోల్పోయి, "స్వామీ! మీ ప్రతిజ్ఞ ఏమిటో నాకు తెలియజేయండి". అని శంకరుని కోరింది.

**ఇతి పృష్టోఽపి గిరిశస్సత్యా హితకరః ప్రభుః ।**
**నోద్వాహే స్వం పణం తస్యై యద్ధర్యగ్రేఽకరోత్పురా ॥56॥**

సతీదేవి ఈవిధంగా కోరినప్పటికి, ఆమె హితాన్ని కోరే ప్రభుడైన శంకరుడు తాను మొట్టమొదట వివాహ సమయంలో విష్ణుభగవానునెదుట చేసిన ప్రతిజ్ఞను మాత్రం ఆమెకు తెలపలేదు.

**తదా సతీ శివం ధ్యాత్వా స్వపతిం ప్రాణవల్లభమ్ ।**
**సర్వం బుబోధ హేతుం తం ప్రియత్యాగమయం మునే ॥57॥**

అంతట సతీదేవి తన ప్రాణవల్లభుడైన శంకరునే ధ్యానించి ఆవిషయాన్నంతటిని తెలుసుకొంది. దానివల్ల తన ప్రియతముడైన శివుడు తనను పరిత్యజించాడని అవగతం చేసుకొంది.

**తతోఽతీవ శుశోచాశు బుద్ధ్వాఽసా త్యాగమాత్మనః ।**
**శంభునా దక్షజా తస్మాన్నిశ్వసంతీ ముహుర్ముహుః ॥58॥**

ఈ విధంగా తనను విడవడానికికల కారణాన్నంతటిని తెలుసుకొనిన సతీదేవి మాటిమాటికి నిట్టూర్పులు విడుస్తూ మిక్కిలి దుఃఖితురాలయ్యింది.

**శివస్తస్యాః సమాజ్ఞాయ గుప్తం చక్రే మనోభవమ్ ।**
**సత్యే పణం స్వకీయం హి కథా బహ్వీర్వదన్ ప్రభుః ॥59॥**

ఆమె మనోభావమునెరిగిన శివుడు ఆమె కొరకు చేసిన ప్రతిజ్ఞను రహస్యంగా ఉంచాడు. వేరువేరు కథలను చెప్పసాగాడు.

**సత్యా ప్రాప స కైలాసం కథయన్ వివిధాః కథాః ।**
**వరే స్థిత్వా నిజం రూపం దధౌ యోగీ సమాధిభృత్ ॥60॥**

సతీదేవికి వివిధములైన కథలను చెప్పుచూ, శంకరుడు ఆమెతో కూడి కైలాసానికి చేరాడు. ఒక దివ్యాసనమున స్థిరముగా కూర్చుండి, చిత్తవృత్తులను నిరోధించి, సమాధిస్థితిలో మగ్నుడయ్యాడు. తన స్వరూపాన్ని ధ్యానింపసాగాడు.

**తత్ర తస్థౌ సతీ ధామ్ని మహావిషణ్ణమానసా ।**
**న బుబోధ చరిత్రం తత్కశ్చిచ్చ శివయోర్మునే ॥61॥**

సతీదేవి అత్యంత విషణ్ణ హృదయురాలై, తనధామంలోనే వసింపసాగింది. ఓమునీంద్రా! సతీశివుల ఈ చరిత్రనెవ్వరూ ఎరుగరు.

**మహాన్కాలో వ్యతీయాయ తయోరిత్థం మహామునే ।**
**స్వోపాత్త దేహయోః ప్రభ్వోర్లోకలీలానుసారిణోః ॥62॥**

మహామునీ! స్వచ్ఛందంగా శరీరాన్ని ధరించి, లోకలీలననుసరించి, ప్రభువులిరువురు అచ్చట చాలకాలం నివసించారు.

**ధ్యానం తత్యాజ గిరిశస్తతస్స పరమార్తిహృత్ ।**
**తత్జ్ఞాత్వా జగదంబా హి సతీ తత్రాఽజగామ సా ॥63॥**

తదుపరి ఉత్తమలీలలను చేయు మహాదేవుడు ధ్యానాన్ని విడిచాడు. ఇది తెలిసి జగదంబయైన సతీదేవి అక్కడకు వచ్చింది.

**ననామాథ శివం దేవీ హృదయేన విదూయతా ।**
**ఆసనం దత్తవాన్ శంభుః స్వసమ్ముఖ ఉదారధీః ॥64॥**

ఆమె వ్యథితహృదయంతో శివుని చరణాలకు నమస్కరించింది. ఉదారచేతస్కుడైన శివుడు తన ఎదుట కూర్చొనుటకు తగిన ఆసనాన్నిచ్చాడు.

**కథయామాస సుప్రీత్యా కథా బహ్వీర్మనోరమాః ।**
**నిశ్శోకాం కృతవాన్ సద్యో లీలాం కృత్వా చ తాదృశీమ్ ॥65॥**

మిగుల ప్రేమతో ఎన్నియో మహత్తరమైన కథలను వినిపించాడు. ఇట్టి లీలలతో శివుడు సతీదేవిశోకాన్ని తాత్కాలికంగా దూరమొనరించాడు.

**పూర్వవత్ సా సుఖం లేభే తత్యాజ స్వపణం న సః ।**
**నేత్యాశ్చర్యం శివే తాత మంతవ్యం పరమేశ్వరే ॥66॥**

వారిరువురు మునపటివలె సుఖంగానున్నారు. అయినను శివుడు తన ప్రతిజ్ఞను వదలలేదు. నాయనా! పరమేశ్వరుడైన శివుని విషయంలో ఏదియు ఆశ్చర్యకరమైన విషయం కాదని తెలుసుకోవాలి.

**ఇత్థం శివాశివకథాం వదంతి మునయో మునే ।**
**కిల కేచిదవిద్వాంసో వియోగశ్చ కథం తయోః ॥67॥**

మునీంద్రా! మునులు శివాశివుల గురించిన ఈ కథయే చెబుతారుకదా! విద్వాంసులు కాని కొందరు మాత్రం వారిరువురకు వియోగం కలిగిందని భావిస్తారు. కాని శివాశివులలో వియోగం ఎట్లు సంభవం?

**శివాశివచరిత్రం కో జానాతి పరమార్థతః ।**
**స్వేచ్ఛయా క్రీడతస్తౌ హి చరితం కురుతస్సదా ॥68॥**

శివాశివుల చరిత్రను వాస్తవంగా ఎవరెరుగుదురు? వారిరువురు ఎల్లప్పుడు తమ ఇచ్ఛానుసారం రకరకాలైన లీలలను చేస్తూ చరిత్రను సృష్టిస్తారు.

**వాగర్థావివ సంపృక్తౌ సదా ఖలు సతీశివౌ ।**
**తయోర్వియోగస్సంభావ్యస్సంభవేదిచ్ఛయా తయోః ॥69॥**

సతీశివులు శబ్దార్థములవలె ఒకరికొకరు నిత్యసంయుక్తులు. ఇరువురు ఎల్లప్పుడు కలిసే ఉంటారు. వారిరువురిలో వియోగం కలుగుట అసంభవము. ఒకవేళ సంభవిస్తే అది వారి ఇచ్ఛానుసారమే.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే సతీవియోగో నామ పంచవింశోఽధ్యాయః ॥25॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో సతీవియోగం అనే ఇరవైఐదవ అధ్యాయం సమాప్తం.

## షడ్వింశోఽధ్యాయః - ఇరవై ఆరవ అధ్యాయం
## శివేన దక్షవిరోధః - శివునితో దక్షునివిరోధం

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**పురాభవచ్చ సర్వేషామధ్వరో విధినా మహాన్ ।**
**ప్రయాగే సమవేతానాం మునీనాం చ మహాత్మనామ్ ॥1॥**

నారదా! పూర్వకాలంలో మహాత్ములైన మునులందరు ప్రయాగలో సమావేశమయ్యారు. అక్కడ కలిసిన ఆ మహాత్ములందరు ఒక గొప్ప యజ్ఞాన్ని విధివిధానంగా చేశారు.

**తత్ర సిద్ధా స్సమాయాతా స్సనకాద్యా స్సురర్షయః ।**
**సప్రజాపతయో దేవా జ్ఞానినో బ్రహ్మదర్శినః ॥2॥**

**అహం సమాగత స్తత్ర పరివార సమన్వితః ।**
**నిగమై రాగమై ర్యుక్తో మూర్తిమద్భిర్మహాప్రభైః ॥3॥**

ఆ యజ్ఞానికి సిద్ధులు, సనకాది మహర్షులు, దేవర్షులు, ప్రజాపతులు, దేవతలు, పరబ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందిన జ్ఞానులు కూడ విచ్చేశారు. నేనుకూడ మూర్తిమంతములు, మహాతేజస్సంపన్నములునైన నిగమాగమాలతో కూడ పరివార సమేతంగా అక్కడకు వెళ్ళాను.

**సమాజోభూద్విచిత్రో హి తేషాముత్సవ సంయుతః ।**
**జ్ఞానవాదోఽభవత్తత్ర నానాశాస్త్ర సముద్భవః ॥4॥**

అనేక విధాలైన ఉత్సవాలతో అక్కడ ఒక విచిత్ర సమావేశం జరిగింది. వివిధ శాస్త్ర సంబంధములైన జ్ఞానచర్చ, వాద ప్రతివాదములు జరుగుతున్నాయి.

**తస్మిన్నవసరే రుద్ర స్సభవానీగణః ప్రభుః ।**
**త్రిలోక హితకృత్స్వామీ తత్ర గాత్సూక్తికృన్మునే ॥5॥**

అదే సమయంలో సతీదేవి, శివగణం వెంటరాగా త్రిలోక హితకారియైన శివుడుకూడ అచ్చటకు వచ్చియున్నాడు.

**దృష్ట్వా శివం సురాస్సర్వే సిద్ధాశ్చ మునయస్తథా ।**
**అనమంస్తం ప్రభుం భక్త్యా తుష్టువుశ్చ తథా హ్యహమ్ ॥6॥**

శివుని రాకనుచూచి, సమస్తదేవతలు, సిద్ధులు, మునులు, నేనుకూడ భక్తితో ప్రణమిల్లాము. వారిని స్తుతించాము.

**తస్థు శ్శివాజ్ఞయా సర్వే యథాస్థానం ముదాన్వితాః ।**
**ప్రభుదర్శన సంతుష్టాః వర్ణయన్తో నిజం విధిమ్ ॥7॥**

శివాజ్ఞనుపొంది అందరు ప్రసన్నులై వారివారి స్థానాలలో ఆశీనులయ్యారు. భగవంతుని దర్శనాన్నిపొంది, అందరు సంతుష్టులై తమ భాగ్యాన్ని ప్రశంసించుకొంటున్నారు.

**తస్మిన్నవసరే దక్షః ప్రజాపతిపతిః ప్రభుః ।**
**ఆగమత్తత్ర సుప్రీత స్సువర్చస్వీ యదృచ్ఛయా ॥8॥**

ఆసమయంలో ప్రజాపతులకు ప్రభువు, తేజశ్శాలియునైన దక్షుడు కూడా వచ్చాడు.

**మాం ప్రణమ్య స దక్షో హి న్యుష్టస్తత్ర మదాజ్ఞయా ।**
**బ్రహ్మాండాధిపతి ర్మాన్యో మానీ తత్త్వ బహిర్ముఖః ॥9॥**

అతడు నాకు నమస్కరించి, నా ఆజ్ఞతో ఉచితాసనాసీనుడయ్యాడు. దక్షుడు బ్రహ్మాండాధిపతియైనందున అందరిచేత సమ్మానితుడయ్యాడు.

**స్తుతిభిః ప్రణిపాతైశ్చ దక్ష స్సర్వై స్సురర్షిభిః ।**
**పూజితో వర తేజస్వీ కరౌ బద్ధ్వా వినమ్రకైః ॥10॥**

దేవతలు, ఋషులు, అచ్చటివారందరు చేతులు జోడించి, వినమ్రపూర్వకంగా స్తోత్రములతోను, నమస్కృతులతోను, మహాతేజస్వియైన దక్షుని పూజించారు.

**నానా విహార కృన్నాథ స్స్వతంత్రః పరమోతికృత్ ।**
**నానామత్తం తదా దక్షం స్వాసనస్థో మహేశ్వరః ॥11॥**

కాని, అనేక విధాలుగా లీలావిహారాలు చేయువాడు, అందరికి ప్రభువు, సర్వస్వతంత్రుడు జగత్తును రక్షించువాడు, పరమాత్మయు నైన మహేశ్వరుడు మాత్రం ఆసమయంలో తన ఆసనమునందే కూర్చొని యున్నాడు. అహంకారమత్తుడైన దక్షునకు నమస్కరింపలేదు. తలవంచలేదు.

**దృష్ట్వాఽనతం హరం తత్ర స మే పుత్రోఽప్రసన్న ధీః ।**
**అకుపత్సహసా రుద్రే తదా దక్షః ప్రజాపతిః ॥12॥**

రుద్రుడు తనకు నమస్కరింపక పోవడం చూచి, నాకుమారుడు, ప్రజాపతియునైన దక్షుడు అప్రసన్నుడయ్యాడు. ఆసమయంలో అతనికి రుద్రునిపై కోపం వచ్చింది.

**క్రూర దృష్ట్యా మహాగర్వో దృష్ట్వా రుద్రం మహాప్రభుమ్ ।**
**సర్వాన్సంశ్రావయన్నుచ్చై రవోచ జ్ఞానవర్జితః ॥13॥**

జ్ఞానశూన్యుడు, అహంకారి యైన కారణంచే దక్షుడు మహాప్రభువైన రుద్రుని క్రూరదృష్టితో చూచి, అందరూ వినేటట్లు ఎలుగెత్తి ఇలా అన్నాడు.

**ఏతే హి సర్వే చ సురాసురా భృశం నమంతి మాం విప్రవరాస్తథర్షయః ।**
**కథం హ్యసౌ దుర్జన వన్మహా మనా స్త్వభూత్తు యః ప్రేతపిశాచ సంవృతః ॥14॥**

ఈ దేవదానవ శ్రేష్ఠులంతా విశేషంగా ఋషులు, నాకు తలవంచి నమస్కరించారు. కాని, ప్రేత పిశాచ సంవృతుడైన శివుడు మాత్రం మహామనస్వివలె కూర్చుని దుష్టుడైన మానవునివలె నాకెందుకు ప్రణమిల్లుటలేదు?

**శ్మశానవాసీ నిరపత్రపో హ్యయం కథం ప్రణామం న కరోతి మేఽధునా ।**
**లుప్తక్రియో భూతపిశాచ సేవితో మత్తోఽవిధో నీతివిదూషకస్సదా ॥15॥**

శ్మశానవాసి, లజ్జావిహీనుడునైన ఇతడిప్పుడు నాకు నమస్కరింపక పోవడానికి కారణమేమిటి? ఇతడు వేదోక్తకర్మలనాచరింపడు. భూత పిశాచాలతో సేవింపబడుతు, మత్తెక్కి తిరుగుతుంటాడు. శాస్త్రవిధానాన్ని అవహేళన చేసి నీతిమార్గాన్ని సదా కళంకితం చేస్తున్నాడు.

**పాఖండినో దుర్జన పాపశీలా దృష్ట్వా ద్విజం ప్రోద్ధత నిందకాశ్చ ।**
**వధ్వాం సదాసక్త రతిప్రవీణ స్తస్మాదముం శప్తుమహం ప్రవృత్తః ॥16॥**

ఇతనితోనుండేవారు, ఇతని అనుచరులు, పాఖండులు, దుష్టులు, పాపాచారులునై బ్రాహ్మణులనుచూసి ఉద్దండులై వారిని నిందిస్తుంటారు. ఇతడెల్లప్పుడు స్త్రీలోలుడైన రతిప్రవీణుడు. కావున నేనితనికి శాపమీయడానికి ఉద్యమించాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవముక్త్వా స మహాఖలస్తదా రుషాన్వితో రుద్రమిదం హ్యవోచత ।**
**శృణ్వాం త్వమీ విప్రవరాస్తథా సురా వధ్యం హి మే చార్హథ కర్తుమేతమ్ ॥17॥**

అనిపల్కి మహాఖలుడైన దక్షుడు క్రోధాన్వితుడై ఓబ్రాహ్మణ శ్రేష్ఠులారా!, సురవరులారా!, ఈ రుద్రుని వధించడానికి మీరు అనుజ్ఞనివ్వండి.

**దక్ష ఉవాచ** - దక్షుడు చెప్పాడు.

**రుద్రో హ్యయం యజ్ఞ బహిష్కృతో మే వర్ణేష్వతీతో థ వివర్ణ రూపః ।**
**దేవైర్న భాగం లభతాం సహైవ శ్మశాన వాసీ కులజన్మహీనః ॥18॥**

ఇతడు నాలుగు వర్ణాలవారినుండి వేరైనవాడు. వికార స్వరూపుడు. నేనితనిని ఇటుపైనుండి యజ్ఞబహిష్కృతుని చేస్తున్నాను. శ్మశానవాసి, కులజన్మహీనుడునైన వీనితోకూడి, దేవతలు యజ్ఞభాగాన్ని స్వీకరింపకుందురుగాక! అని దక్షుడు రుద్రుని శపించాడు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇతి దక్షోక్త మాకర్ణ్య భృగ్వాద్యా బహవో జనాః ।**
**అగర్హయన్ దుష్టసత్త్వం రుద్రం మత్వామరై స్సమమ్ ॥19॥**

దక్షుని ఈపల్కులనువిని, భృగువు మొదలైన చాలమంది మహర్షులు, జనులు రుద్రుని దుష్టుడని తలంచి, దేవతలతోబాటు పరమేశ్వరుని నిందింపసాగారు.

**నన్దీ నిశమ్య తద్వాక్యం లోలాక్షోతిరుషాన్వితః ।**
**అబ్రవీత్త్వరితం దక్షం శాపం దాతుమనా గణః ॥20॥**

దక్షుని శాపవాక్యాలు వినిన శివుని గణముఖ్యుడైన నంది అతిరోషాన్వితుడై అగ్నిగోళాలవంటి కనుగ్రుడ్లను వేగంగా త్రిప్పుతూ దక్షునకు శాపమిచ్చే తలంపుతో ఇలా అన్నాడు.

**నందీశ్వర ఉవాచ** – నందీశ్వరుడు చెప్పాడు.

**రే రే శఠ మహామూఢ దక్ష దుష్టమతే త్వయా ।**
**యజ్ఞ బాహ్యో హి మే స్వామీ మహేశో హి కృతః కథమ్ ॥21॥**

రే! రే! రే!, శఠ! మహామూఢా! దుష్టమతీ! నాస్వామియైన మహేశ్వరుని యజ్ఞబాహ్యునెలాచేశావు? యజ్ఞ బహిష్కృతుని ఎందుకు చేశావు?

**యస్య స్మరణ మాత్రేణ భవంతి సఫలా మఖాః ।**
**తీర్థాని చ పవిత్రాణి సోఽయం శప్తో హరః కథమ్ ॥22॥**

ఎవరిని స్మరించినంత మాత్రంచేత యజ్ఞాలు సఫలమౌతాయో, తీర్థాలన్నీ పవిత్రమౌతాయో, అట్టి మహాదేవునికి నీవు శాపమెలా ఇచ్చావు?

**వృథా తే బ్రహ్మచాపల్యా చ్ఛప్తోఽయం దక్ష దుర్మతే ।**
**వృథోపహసితశ్చైవాదుష్టో రుద్రో మహాప్రభుః ॥23॥**

దక్షా! దుర్మతీ! నీవీ బ్రాహ్మణ జాతియొక్క చాపల్యంచే ప్రేరితుడవై, మహాప్రభువు, మహాత్ముడూ అయిన రుద్రుని శపించావు. వ్యర్థంగా అవమానపరిచావు.

**యేనేదం పాల్యతే విశ్వం సృష్టమంతే వినాశితమ్ ।**
**శప్తోఽయం స కథం రుద్రో మహేశో బ్రాహ్మణాధమ! ॥24॥**

ఓ బ్రాహ్మణాధమా! ఈజగత్తును, సృష్టించి, పాలించి, సంహారమొనరించే ఆ మహేశ్వరుని నీవెందుకు శపించావు.

**యేవం నిర్భర్త్సితస్తేన నందినా హి ప్రజాపతిః ।**
**నందినం చ శశాపాథ దక్షో రోష సమన్వితః ॥25॥**

ఈవిధంగా నందిచే దూషింపబడిన, ఎదుర్కొనబడిన ప్రజాపతియైన దక్షుడు రోషసమన్వితుడై, నందిని శపిస్తూ ఇలా పలికాడు.

**దక్ష ఉవాచ** – దక్షుడు చెప్పాడు.

**యూయం సర్వే రుద్రగణా వేదబాహ్యా భవంతు వై ।**
**వేదమార్గపరిత్యక్తా స్తథా త్యక్తా మహర్షిభిః ॥26॥**

రుద్రగణములారా! మీరందరు వేదబాహ్యులౌదురుగాక! అట్లే వైదికమార్గభ్రష్టులై, మహర్షులచేతకూడ పరిత్యజింపబడుదురుగాక!

**పాఖండవాద నిరతాః శిష్టాచార బహిష్కృతాః ।**
**మదిరాపాన నిరతా జటా భస్మాస్థిధారిణః ॥27॥**

పాషండవాద నిరతులు, శిష్టాచార బహిష్కృతులు, మదిరాపాన నిరతులునై ఎల్లప్పుడు జడలను, భస్మాన్ని, ఎముకలను ధరించువారౌదురుగాక!

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి శప్తా స్తథా తేన దక్షేణ శివ కింకరాః ।**
**తచ్ఛ్రుత్వాతి రుషావిష్టో భవన్నన్దీ శివప్రియః ॥28॥**

దక్షుడు శివగణాన్ని ఈవిధంగా శపించగా, ఆశాపాన్ని విని, శివప్రియుడైన నంది అత్యంత రోషావిష్టుడయ్యాడు.

**ప్రత్యువాచ ద్రుతం పక్షం గర్వితం తం మహాఖలమ్ ।**
**శిలాద తనయో నందీ తేజస్వీ శివవల్లభః ॥29॥**

శిలాదపుత్రుడు, తేజస్వియునైన నంది గర్విష్ఠుడు, మహాదుష్టుడునైన దక్షునికి ఇలా ప్రతిశాపమిచ్చాడు.

**నందీశ్వర ఉవాచ -** నందీశ్వరుడు చెప్పాడు.

**రే దక్ష శఠ దుర్బుద్ధే వృథైవ శివకింకరాః ।**
**శప్తాస్తే బ్రహ్మచాపల్యాచ్ఛివతత్త్వమజానతా ॥30॥**

ఓరీ శఠా! దక్షా! దుర్బుద్ధీ! బ్రాహ్మణచాపల్యంతోను, శివతత్త్వాన్ని తెలయకపోవడం వల్లను, నీవు శివగణాన్ని వ్యర్థంగా శపించావు.

**భృగ్వాద్యై ర్దుష్టచిత్తైశ్చ మూఢై స్స ఉపహాసితః ।**
**మహాప్రభు ర్మహేశానో బ్రాహ్మణత్వా దహమ్మతే ॥31॥**

ఓ అహంకారీ! భృగ్వాదులు బ్రాహ్మణత్వ అహంకారంతో దుష్టాత్ములై, మూఢులై, మహాప్రభువు, మహేశానుడునైన పరమేశ్వరుని అపహసించారు.

**యే రుద్ర విముఖాశ్చాత్ర బ్రాహ్మణాస్త్వాదృశాః ఖలాః ।**
**రుద్రతేజః ప్రభావత్వా త్తేషాం శాపం దదామ్యహమ్ ॥32॥**

రుద్రతేజః ప్రభావంచేత నేను మీవంటి రుద్రవిముఖులైన దుష్టబ్రాహ్మణులను శపిస్తున్నాను.

**వేదవాదరతా యూయం వేదతత్త్వ బహిర్ముఖాః ।**
**భవంతు సతతం విప్రా నాన్యదస్తీతి వాదినః ॥33॥**

మీవంటి బ్రాహ్మణులు ఎల్లప్పుడు వేదాలయొక్క అర్థవాదమందు మాత్రమే శ్రద్ధకలవారై వేదతత్త్వ బహిర్ముఖులౌదురు గాక!

**కామాత్మాన స్స్వర్గపరాః క్రోధలోభ మదాన్వితాః ।**
**భవంతు సతతం విప్రా భిక్షుకా నిరపత్రపాః ॥34॥**

మీరు కామనలతో కూడిన మనస్సు కలవారై స్వర్గంతప్ప ఇంకేమీలేదనే అజ్ఞానంతో, నిత్యము సత్యమునైన పరబ్రహ్మ తత్త్వాన్ని తెలుసుకోలేక, అరిషడ్వర్గాదులచే పీడింపబడుతు, సిగ్గువీడి, నిత్యయాచకులై సంచరింతురుగాక!

**వేదమార్గం పురస్కృత్య బ్రాహ్మణా శ్శూద్రయాజినః ।**
**దరిద్రా వై భవిష్యంతి ప్రతిగ్రహరతాస్సదా ॥35॥**

బ్రాహ్మణులు వేదమార్గాన్ని ఎదుటనుంచుకొని, శూద్రుల యజ్ఞాన్ని చేసేవారై, దరిద్రులౌదురుగాక! సదా దానాన్ని స్వీకరించడంలోనే లగ్నమై యుందురుగాక!

**అసత్ప్రతిగ్రహాశ్చైవ సర్వే నిరయగామినః ।**
**భవిష్యన్తి సదా దక్ష కేచిద్వై బ్రహ్మరాక్షసాః ॥36॥**

దూషితమైన దానాలను గ్రహించెవారుగా ఉంటారు. నరకం పొందుతారు. దక్షా! వారిలో కొందరు బ్రాహ్మణులు బ్రహ్మరాక్షసులౌతారు.

**యశ్శివం సురసామాన్యా ముద్దిశ్య పరమేశ్వరమ్ ।**
**ద్రుహ్యత్యజో దుష్టమతి స్తత్త్వతో విముఖో భవేత్ ॥37॥**

పరమేశ్వరుడైన శివుని సామాన్యదేవతగా భావించి, ఆస్వామికి ద్రోహమొనరించు దుష్టబుద్ధిగల ప్రజాపతి దక్షుడు తత్త్వజ్ఞాన విముఖుడౌతాడు.

**కూట ధర్మేషు గేహేషు సదా గ్రామ్య సుఖేచ్ఛయా ।**
**కర్మతంత్రం వితనుతా వేదవాదం చ శాశ్వతమ్ ॥38॥**

గ్రామ్య సుఖాలయందాసక్తి కలవాడై, కేవలం కర్మతంత్రాన్ని విస్తరించేవాడై, ఆత్మజ్ఞానాన్ని విస్తరించి, ఇదే శాశ్వత వేదధర్మమని భ్రమిస్తాడు.

**వినష్టానందక ముఖో విస్మృతాత్మగతిః పశుః ।**
**భ్రష్టకర్మానయ సదా దక్షో బస్తముఖోఽ చిరాత్ ॥39॥**

ఎప్పుడూ విచారముఖంకలవాడై ఆత్మజ్ఞానాన్ని మరచి పశువుతో సమానుడై ఈ దక్షుడు కర్మభ్రష్టుడై త్వరలోనే మేకముఖం కలవాడు అగుగాక!

**శప్తాస్తే కోపినా తత్ర నందినా బ్రాహ్మణా యదా ।**
**హాహాకారో మహానాసీ చ్ఛప్తో దక్షేణ చేశ్వరః ॥40॥**

కోపంతో నందీశ్వరుని దారుణమైన శాపానికి బ్రాహ్మణులు, దక్షుడును గురికాగా అక్కడివారందరు 'హాహా'కారాలు చేశారు.

**తదాకర్ణ్యా హమత్యంత మనిందం తం ముహుర్ముహుః ।**
**భృగ్వాదీనపి విప్రాంశ్చ వేదసృట్ శివ తత్త్వవిత్ ॥41॥**

నారదా! నేను వేదాలను ప్రతిపాదించాను కనుక శివతత్త్వాన్ని చక్కగా ఎరుగుదును. కాబట్టి దక్షుడిచ్చిన శాపాన్ని విని, నేను పదేపదే దక్షుణ్ణి, భృగువు మొదలుగాగల బ్రాహ్మణులను కూడా నిందించాను.

**ఈశ్వరోఽపి వచఃశ్రుత్వా నందినః ప్రహసన్నివ ।**
**ఉవాచ మధురం వాక్యం బోధయంస్తం సదాశివః ॥42॥**

సదాశివుడగు మహాదేవుడు కూడా నంది మాటలను విని, నవ్వుతూ మధుర వాక్కులతో నందికిలా నచ్చజెప్పసాగాడు.

**సదాశివ ఉవాచ –** సదాశివుడు చెప్పాడు.

**శృణు నందిన్ మహాప్రాజ్ఞ న కర్తుం క్రోధమర్హసి ।**
**వృథాశప్తో బ్రహ్మకులో మత్వా శప్తం చ మాం భ్రమాత్ ॥43॥**

నందీ! మహాప్రాజ్ఞా! నీవు కోపించడం తగదు. నేను దక్షునిచే శపింపబడ్డానని నీవు భ్రమించి, బ్రాహ్మణ కులాన్నంతటిని వ్యర్థంగా శపించావు.

**వేదో మంత్రాక్షరమయ స్సాక్షా త్సూక్తమయో భృశమ్ ।**
**సూక్తే ప్రతిష్ఠితో హ్యాత్మా సర్వేషామపి దేహినామ్ ॥44॥**

**తస్మాదాత్మవిదో నిత్యం త్వం మా శప రుషాన్వితః ।**
**శప్యా న వేదాః కేనాపి దుర్ధియాపి కదాచన ॥45॥**

వేదాలు మంత్రాక్షరాలతో, సూక్తాలతో, నిండియుంటాయి. సర్వప్రాణుల ఆత్మ సూక్తంలో ప్రతిష్ఠితమై ఉంటుంది. కాబట్టి అటువంటి ఆత్మప్రతిపాదకమైన వేదాన్ని అధ్యయనం చేసిన విప్రులను కోపంతో శపించడం తగదు. ఎంత మానసిక క్షోభ కలిగినా వేదాలను దూషించరాదు.

**అహం శప్తో న చేదానీం తత్త్వతో బోద్ధుమర్హసి ।**
**శాన్తో భవ మహాధీమన్ సనకాది విబోధకః ॥46॥**

నేనిప్పుడు శాపాన్ని పొందలేదు. సనకాది మహర్షులకు జ్ఞానబోధ చేసిన మహాధీశాలివైన నీవు తత్త్వాన్ని తెలుసుకొని, శాంతుడవు కమ్ము.

**యజ్ఞో౽హం యజ్ఞకర్మాహం యజ్ఞాంగాని చ సర్వశః ।**
**యజ్ఞాత్మా యజ్ఞనిరతో యజ్ఞబాహ్యో౽హమేవ వై ॥47॥**

యజ్ఞాన్ని, యజ్ఞకర్మను, యజ్ఞాంగాలను, యజమానిని సర్వము నేనే. యజ్ఞబాహ్యుడనుకూడా నేనే.

**కో౽యం కస్త్వమిమే కే హి సర్వో౽హమపి తత్త్వతః ।**
**ఇతి బుద్ధ్వా హి విమృశ వృథా శప్తాస్త్వయా ద్విజాః ॥48॥**

ఇతడెవడు? నీవెవరు? వీరెవరు? తత్త్వదృష్ట్యా అన్నీ నేనే. ఈబుద్ధితో పరికిస్తే నీవు బ్రాహ్మణులకిచ్చిన శాపం వ్యర్థమేకదా!

**తత్త్వజ్ఞానేన నిర్వృత్య ప్రపంచరచనో భవ ।**
**బుధ స్స్వస్థో మహాబుద్ధే నన్దిన్ క్రోధాదివర్జితః ॥49॥**

మహామతీ! నందీ! తత్త్వజ్ఞానంచే ప్రపంచ రచనను అర్థంచేసుకొని, క్రోధవర్జితుడవై ఎల్లప్పుడూ ఆత్మనిష్ఠలో నుండు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఏవం ప్రబోధితస్తేన శంభునా నందికేశ్వరః ।**
**వివేకపరమో భూత్వా శాంతో౽భూత్క్రోధవర్జితః ॥50॥**

నారదా! భగవంతుడైన శంభుడిట్లు నచ్చజెప్పగా నందికేశ్వరుడు వివేకపరాయణుడయ్యాడు. క్రోధవర్జితుడై శాంతుడయ్యాడు.

**శివో౽పి తం ప్రబోధ్యాశు స్వగణం ప్రాణవల్లభమ్ ।**
**సగణస్సయయౌ తస్మాత్ స్వస్థానం ప్రముదాన్వితః ॥51॥**

శివుడుకూడా తన ప్రాణ ప్రియుడైన నందికి వివేకంకలిగించి ప్రమథగణాలతోకూడి శివుడు సంతోషంతో అచ్చటినుండి స్వస్థానానికి వెళ్ళాడు.

**దక్షో౽పి స రుషావిష్టస్తై ర్ద్విజైః పరివారితః ।**
**స్వస్థానం చ యయౌ చిత్తే శివద్రోహపరాయణః ॥52॥**

దక్షుడుకూడా రోషావేశంతో బ్రాహ్మణ పరివృతుడై స్వస్థానానికి వెళ్ళాడు. కాని, అతడు శివద్రోహపరాయణుడై యున్నాడు.

**రుద్రం తదానీం పరిశప్యమానం సంస్మృత్య దక్షః పరయా రుషాన్వితః ।**
**శ్రద్ధాం విహాయైవ సమూఢ బుద్ధి ర్నిందాపరో౽భూచ్ఛివపూజకానామ్ ॥53॥**

రుద్రునికి శాపమిచ్చిన సంఘటనను స్మరిస్తూ దక్షుడు మిక్కిలి కోపంతో రగిలిపోతున్నాడు. అతని బుద్ధిని మూర్ఖత్వం ఆవహించింది. అతడు శివునియందు శ్రద్ధను పరిత్యజించి, శివపూజ చేసేవారిని నిందింపసాగాడు.

**ఇత్యుక్త్వో దక్ష దుర్బుద్ధి శ్శంభునా పరమాత్మనా ।**
**పరాం దుర్ధిషణాం తస్య శృణు తాత వదామ్యహమ్ ॥54॥**

"నారదా! ఇట్లు పరమాత్ముడైన శంభునితో దుష్టంగా ప్రవర్తించి, దక్షుడు తన దుర్బుద్ధిని ప్రకటించిన విషయాన్ని నీకు తెలియజేశాను. దక్షుని పరాకాష్ఠకు చేరిన దుర్బుద్ధియొక్క వృత్తాంతాన్ని ఇప్పుడు నీకు వినిపిస్తాను. విను" అని బ్రహ్మపలికాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే సత్యుపాఖ్యానే శివేన దక్షవిరోధో నామ షడ్వింశోఽధ్యాయః ॥26॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో శివునితో దక్షునివిరోధం అనే ఇరవై ఆరవ అధ్యాయం సమాప్తం.

* * * * * *

## సప్తవింశోఽధ్యాయః - ఇరవై ఏడవ అధ్యాయం

## దక్షయజ్ఞప్రారంభః - దక్షయజ్ఞప్రారంభం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏకదా తు మునే తేన యజ్ఞః ప్రారంభితో మహాన్ ।**
**తత్రాహూతాస్తదా సర్వే దీక్షితేన సురర్షయః ॥1॥**

నారదా! ఒకానొకప్పుడు దక్షుడు ఒక గొప్ప యజ్ఞాన్ని ప్రారంభించాడు. యజ్ఞదీక్షితుడైన దక్షుడు అప్పుడు దేవర్షులనందరిని ఆహ్వానించాడు.

**మహర్షయోఽఖిలా స్తత్ర నిర్జరాశ్చ సమాగతాః ।**
**యద్యజ్ఞ కరణార్థం హి శివమాయా విమోహితాః ॥2॥**

దక్షుడు మహర్షులను, దేవతలనందరినీకూడా ఆహ్వానించాడు. వారందరు శివమాయా మోహితులై, దక్షయజ్ఞాన్ని నిర్వహించడానికి అక్కడకు విచ్చేశారు.

**అగస్త్యః కశ్యపోఽత్రిశ్చ వామదేవస్తథా భృగుః ।**
**దధీచిర్భగవాన్ వ్యాసో భారద్వాజోఽథ గౌతమః ॥3॥**

**పైలః పరాశరో గర్గో భార్గవః కకుపస్సితః ।**
**సుమంతు త్రికకంకాశ్చ వైశంపాయన ఏవ చ ॥4॥**

**ఏతే చాన్యే చ బహవో మునయో హర్షితా యయుః ।**
**మమ పుత్రస్య దక్షస్య సదారాస్సుతా మఖమ్ ॥5॥**

అగస్త్యుడు, కశ్యపుడు, అత్రి, వామదేవుడు, భృగువు, దధీచి, వ్యాసభగవానుడు, భారద్వాజుడు, గౌతముడు, పైలుడు, పరాశరుడు, గర్గుడు, భార్గవుడు, కకుపుడు, సితుడు, సుమంతుడు, త్రికుడు, కంకుడు, వైశంపాయనుడు మొదలగువారును, ఇతర అనేక మునిగణాలును, తమతమ భార్యాపుత్రులను వెంటనిడుకొని, ఆనందంతో నా పుత్రుడైన దక్షుని యజ్ఞంలో పాల్గొనడానికి విచ్చేశారు.

**తథా సర్వే సురగణా లోకపాలా మహోదయాః ।**
**తథోప నిర్జరాస్సర్వే స్వోపకార బలాన్వితాః ॥6॥**

వీరేగాక సకల దేవగణాలు, అభ్యుదయ శాలురైన లోకపాలురు, ఉపదేవతలు, తమతమ గుడారాలతో సైన్యశక్తితోకూడి, అచ్చటకు చేరుకున్నారు.

**సత్యలోకాత్సమానీతో నుతోహం విశ్వకారకః ।**
**ససుతస్సపరీవారో మూర్తవేదాపి సంయుతః ॥7॥**

జగత్స్రష్టనగు నన్ను స్తుతించి, సత్యలోకంనుండి తీసుకొని వెళ్ళారు. నేను నాకుమారులతో, పరివారంతో మరియు మూర్తీభవించిన వేదశాస్త్రాలతోకూడా వెళ్ళాను.

**వైకుంఠాచ్చ తథా విష్ణుస్సంప్రార్థ్య వివిధాదరాత్ ।**
**సపార్షద పరీవారస్సమానీతో మఖం ప్రతి ॥8॥**

అట్లే వివిధ ప్రార్థనలతో సగౌరవంగా వైకుంఠంనుండి శ్రీమహావిష్ణువుకూడ పారిషద పరీవార సమేతుడై యజ్ఞానికి రావింపబడ్డాడు.

**ఏవమన్యే సమాయాతా దక్షయజ్ఞం విమోహితాః ।**
**సత్కృతాస్తేన దక్షేన సర్వే తే హి దురాత్మనా ॥9॥**

ఆవిధంగానే దక్షయజ్ఞమందు మోహితులైన ఇతరులనేకులుకూడా అచ్చటకు విచ్చేశారు. దురాత్ముడైన దక్షుడు వారినందరిని సత్కరించాడు.

**భవనాని మహార్హాణి సుప్రభాణి మహాన్తి చ ।**
**త్వష్ట్రా కృతాని దివ్యాని తేభ్యో దత్తాని తేన వై ॥10॥**

విశ్వకర్మచే నిర్మితమైన మిక్కిలి ప్రకాశవంతమై, విశాలమె మిక్కిలి విలువైనట్టి, దివ్య భవనాలు వారికందరికి విడిది గృహాలుగా కేటాయింపబడ్డాయి.

**తేషు సర్వేషు ధిష్ణ్యేషు యథాయోగ్యం చ సంస్థితాః ।**
**సన్మానితా అరాజంస్తే సకలా విష్ణునా మయా ॥11॥**

వారందరు తగిన రీతిని గౌరవింపబడ్డారు. సమస్త భవనాలలో తమకు యోగ్యమైన స్థలాలను పొంది, వారందరు అక్కడ నివసించారు. నేను, విష్ణువుకూడా అక్కడ నివసించాము.

**వర్తమానే మహాయజ్ఞే తీర్థే కనఖలే తదా ।**
**ఋత్విజశ్చ కృతాస్తేన భృగ్వాద్యాశ్చ తపోధనాః ॥12॥**

దక్షునిచే ఈ మహాయజ్ఞం 'కనఖల' అను పేరుగల మహాతీర్థమందు నిర్వహింపబడుతోంది. ఈ యజ్ఞ నిర్వహణకు భృగువు మొదలగు తపోధనులను ఋత్విజులుగా దక్షుడు నియమించాడు.

**అధిష్ఠాతా స్వయం విష్ణుస్సహ సర్వమరుద్గణైః ।**
**అహం తత్రాऽభవం బ్రహ్మా త్రయీవిధి నిదర్శకః ॥13॥**

సంపూర్ణ మరుద్గణాలతోబాటు, స్వయంగా శ్రీమహావిష్ణువే దీనికి అధిష్ఠాతగానున్నాడు. నేను వేద విధిని చూపించడానికి, తెలియజేయడానికి, బ్రహ్మగా నియమింపబడ్డాను.

**తథైవ సర్వదిక్పాలా ద్వారపాలాశ్చ రక్షకాః ।**
**సాయుధా స్సపరీవారాః కుతూహల కరాస్సదా ॥14॥**

అట్లే సకల దిక్పాలకులు తమ ఆయుధాలతో, పరివారాలతో, ద్వారపాలకులుగా నియమింపబడ్డారు. వారు సదా కుతూహలంతో నున్నారు.

**ఉపతస్థే స్వయం యజ్ఞస్సురూపస్తస్య చాధ్వరే ।**
**సర్వే మహామునిశ్రేష్ఠాః స్వయం వేదధరాஉభవన్ ॥15॥**

స్వయంగా యజ్ఞం సుందరరూపాన్ని ధరించి, దక్షుని యజ్ఞమండపంలో ఉపస్థితమయ్యింది. మహామునిశ్రేష్ఠులందరూ స్వయంగా వేదమంత్రములను చదువువారై యున్నారు.

**తనూనపాదపి నిజం చక్రే రూపం సహస్రశః ।**
**హవిషాం గ్రహణాయాశు తస్మిన్ యజ్ఞే మహోత్సవే ॥16॥**

అగ్నిదేవుడు ఆయజ్ఞ మహోత్సవంలో శీఘ్రంగా హవిష్యాన్ని స్వీకరించడానికి తనసహస్ర రూపాలను ప్రకటించాడు.

**అష్టాశీతి సహస్రాణి జుహ్వతి సహ ఋత్విజః ।**
**ఉద్గాతారశ్చతుష్షష్టి సహస్రాణి సురర్షయః ॥17॥**

అచ్చట ఎనభై ఎనిమిది వేలమంది ఋత్విజులు ఒక్కసారిగా హవనం చేస్తున్నారు. అరవైనాలుగు వేలమంది దేవర్షులు ఉద్గాతలయ్యారు.

**అధ్వర్యవోஉథ హోతార స్తావన్తో నారదాదయః ।**
**సప్తర్షయస్సమా గాథాః కుర్వన్తి స్మ పృథక్ పృథక్ ॥18॥**

అధ్వర్యులు, హోతలు కూడా అంతేసంఖ్యలో ఉన్నారు. నారదాది దేవర్షులు, సప్తర్షులు వేరువేరుగ కథాగానాలను చేస్తున్నారు.

**గంధర్వ విద్యాధర సిద్ధ సంఘా నాదిత్య సంఘాన్ సగణాన్ సయజ్ఞాన్ ।**
**సంఖ్యావరాన్నాగ చరాన్ సమస్తాన్ వవ్రే స దక్షో హి మహాధ్వరే స్వే ॥19॥**

దక్షుడు తన మహాయజ్ఞంలో గంధర్వులను, విద్యాధరులను, సిద్ధులను, ద్వాదశాదిత్యులను, వారి గణాలను, నాగలోకంలో విహరించే నాగులందరినీకూడా గొప్ప సంఖ్యలో ఎన్నుకున్నాడు.

**ద్విజర్షి రాజర్షి సురర్షి సంఘా నృపా స్సమిత్రాః సచివాస్ససైన్యాః ।**
**వసు ప్రముఖ్యా గణదేవతాశ్చ సర్వే వృతాస్తేన మఖోపవేత్రాః ॥20॥**

ఆ యజ్ఞంలో యజమానియైన దక్షుడు ద్విజర్షులను, రాజర్షులను, దేవర్షులను, మిత్ర మంత్రి సైన్య సమేతులైన రాజులను, వసువులను, గణదేవతల నందరిని కూడ వరణం చేశాడు.

**దీక్షాయుక్తస్తదా దక్షః కృత కౌతుక మంగళః ।**
**భార్యయా సహితో రేజే కృతస్వస్త్యయనో భృశమ్ ॥21॥**

దీక్షా కంకణాన్నిధరించి దక్షుడు యజ్ఞ దీక్షాయుక్తుడై, భార్యతోకూడి, ఆసమయంలో మిక్కిలి ప్రకాశించాడు. అప్పుడు స్వస్తి పుణ్యాహవాచనాలు నిర్వహింపబడ్డాయి.

**తస్మిన్ యజ్ఞే వృతశ్శంభుర్న దక్షేణ దురాత్మనా ।**
**కపాలీతి వినిశ్చిత్య తస్య యజ్ఞార్హతా న హి ॥22॥**

శంభుడు కపాలధారి గాన, ఆయనకు యజ్ఞార్హత లేదని నిశ్చయించి, దురాత్ముడైన దక్షుడు ఆయజ్ఞానికి, శివుని ఆహ్వానింపలేదు.

**కపాలి భార్యేతి సతీ దయితా స్వసుతాపి చ ।**
**నాహూతా యజ్ఞవిషయే దక్షేణాగుణదర్శినా ॥23॥**

దోషదర్శియైన దక్షుడు సతీదేవి తన కుమార్తె అయినప్పటికి, కపాలధారియొక్క భార్యయైన కారణంచేత ఆమెనుకూడా తన యజ్ఞానికి ఆహ్వానించలేదు.

**ఏవం ప్రవర్తమానే హి దక్షయజ్ఞే మహోత్సవే ।**
**స్వకార్య లగ్నాస్తత్రాసన్ సర్వే తేఽధ్వర సంమతాః ॥24॥**

ఈవిధంగా దక్షయజ్ఞ మహోత్సవం కొనసాగుతోంది. యజ్ఞ నియుక్తులైన వారందరు తమతమ కార్యాలయందు నిమగ్నమయ్యారు.

**ఏతస్మిన్నంతరేఽదృష్ట్వా తత్ర వై శంకర ప్రభుమ్ ।**
**ప్రోద్విగ్న మానసశ్శైవో దధీచో వాక్యమబ్రవీత్ ॥25॥**

ఇంతలో శివభక్తుడగు దధీచుడు అచ్చట శంకర ప్రభువు కనబడకపోవుటచే అత్యంతోద్విగ్న మనస్కుడై ఇలా పలికాడు.

**దధీచ ఉవాచ** - దధీచుడు పలికాడు.

**సర్వే శృణుత మద్వాక్యం దేవర్షిప్రముఖా ముదా ।**
**కస్మాన్నైవాగత శ్శంభురస్మిన్ యజ్ఞే మహోత్సవే ॥26॥**

దేవప్రముఖులారా! ఋషిప్రముఖులారా! మీరందరు నామాటలను వినండి. ఈయజ్ఞ మహోత్సవానికి శంభుడెందుకు రాలేదు?

**ఏతే సురేశా మునయో మహత్తరాస్సలోకపాలాశ్చ సమాగతా హి ।**
**తథాపి యజ్ఞస్తు న శోభతే భృశం పినాకినా తేన మహాత్మనా వినా ॥27॥**

ఈ దేవేశ్వరులు, గొప్పగొప్ప మునులు, లోకపాలురు కూడా వచ్చారు. కాని మహాత్ముడైన పినాకి లేకపోవడంచేత ఈయజ్ఞం మిక్కిలిగా శోభించడంలేదు.

**యేనైవ సర్వాణ్యపి మంగళాని భవన్తి శంసన్తి మహావిపశ్చితః ।**
**సోఽసౌ న దృష్టోఽత్ర పుమాన్ పురాణో వృషధ్వజో నీలగళః పరేశః ॥28॥**

సమస్త మంగళాలు, శుభాలు ఎవనివలన కలుగుతాయని మహావిద్వాంసులు చెబుతున్నారో అట్టి పురాణ పురుషుడు, వృషధ్వజుడు, నీలకంఠుడు, సురేశ్వరుడునైన పరమేశ్వరుడిచ్చట కనబడుటలేదు.

**అమంగళాన్యేవ చ మంగళాని భవన్తి యేనాధిగతాని దక్ష ।**
**త్రిపంచకేనాప్యథ మంగళాని భవన్తి సద్యః పరతః పరాణి ॥29॥**

ఓ దక్షా! ఎవనిచే స్వీకరింపబడిన అమంగళాలుకూడా మంగళములగునో అట్టి శివుడు తన పదిహేను నేత్రాలతో చూడగానే ఎటువంటి అమంగములైనా వెంటనే మంగళమయము లవుతాయి.

**తస్మాత్త్వయైవ కర్తవ్యమాహ్వానం పరమేశితుః ।**
**త్వరితం బ్రహ్మణా వాపి విష్ణునా ప్రభవిష్ణునా ॥30॥**

కావున నీవు స్వయంగా పరమేశ్వరుని ఈ యజ్ఞానికి ఆహ్వానించడం అత్యవసరం. లేదా బ్రహ్మచే గాని, సర్వసమర్థుడైన విష్ణువుచే గాని వెంటనే శివుని ఇచ్చటకు ఆహ్వానింపజేయి.

**ఇంద్రేణ లోకపాలైశ్చ ద్విజైస్సిద్ధై సహాధునా ।**
**సర్వథాఽఽనయ నీయోఽసౌ శంకరో యజ్ఞపూర్తయే ॥31॥**

యజ్ఞసిద్ధి కొరకు ఇంద్రుడుగాని, లోకపాలురుగాని, విప్రులుగాని, సిద్ధులుగాని, ఆశంకరుని తప్పనిసరిగా వెంటనే ఇక్కడకు తోడ్కొని రావాలి.

**సర్వై ర్భవద్భిర్గంతవ్యం యత్ర దేవో మహేశ్వరః ।**
**దాక్షాయణ్యా సమం శంభుమానయధ్వం త్వరాన్వితాః ॥32॥**

మీరందరు మహేశ్వరుడున్నచోటుకు వెళ్ళండి. సతీదేవితోసహా శంభుని వెనువెంటనే ఇక్కడకు తోడ్కొనిరండి.

**తేన సర్వం పవిత్రం స్యాచ్ఛంభునా పరమాత్మనా ।**
**అత్రాగతేన దేవేశా స్సాంబేన పరమాత్మనా ॥33॥**

దేవదేవుడు, సాంబుడు, పరమాత్ముడునైన శంభుడిచ్చటకు వస్తే సర్వమూ పవిత్రమౌతుంది.

**యస్య స్మృత్యా చ నామోక్త్యా సమగ్రం సుకృతం భవేత్ ।**
**తస్మాత్సర్వ ప్రయత్నేన హ్యానేతవ్యో వృషధ్వజః ॥34॥**

ఎవనిని స్మరించడంచేతనూ, ఎవని నామాన్ని ఉచ్చరించడం చేతనూ, సర్వం పరిపూర్ణమూ, పుణ్యమయమూ అవుతుందా అట్టి శివుని, అన్నిప్రయత్నాలు చేసి ఇక్కడకు తీసుకొనిరండి.

**సమాగతే శంకరేఽత్ర పావనో హి భవేన్మఖః ।**
**భవిష్యత్యన్యథాఽపూర్ణః సత్యమేతద్బ్రవీమ్యహమ్ ॥35॥**

శంకరుడిక్కడకు వస్తే ఈ యజ్ఞం పావనమౌతుంది. అలాకాకపోతే ఈ యజ్ఞం పరిపూర్ణం కాబోదు. నేను యథార్థాన్నే చెబుతున్నాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**తస్య తద్వచనం శ్రుత్వా దక్షో రోష సమన్వితః ।**
**ఉవాచ త్వరితం మూఢః ప్రహసన్నివ దుష్టధీః ॥36॥**

దుష్టబుద్ధియు, క్రోధావిష్టుడుఅగు దక్షుడు దధీచుని మాటలను విని, నవ్వుచున్నట్లు కన్పట్టుతూ వెంటనే ఇలా పలికాడు.

**మూలం విష్ణుర్దేవతానాం యత్ర ధర్మస్సనాతనః ।**
**సమానీతో మయా సమ్యక్ కిమూనం యజ్ఞకర్మణి ॥37॥**

విష్ణుభగవానుడు సమస్తదేవతలకూ మూలం. ఆయనయందే సనాతన ధర్మం ప్రతిష్ఠితమైంది. అటువంటి శ్రీమహావిష్ణువును నేను సాదరంగా ఇక్కడకు రప్పించాను. ఇప్పు డీయజ్ఞానికి ఎటువంటి లోటు వచ్చింది?

**యస్మిన్వేదాశ్చ యజ్ఞాశ్చ కర్మాణి వివిధాని చ ।**
**ప్రతిష్ఠితాని సర్వాణి సోఽసౌ విష్ణురిహాగతః ॥38॥**

ఎవనియందు వేదాలు, యజ్ఞాలు, వివిధ కర్మలు, సమస్తమూ ప్రతిష్ఠితమయ్యాయో ఆవిష్ణువు ఇచ్చటకు వచ్చి ఉన్నాడు.

**సత్యలోకా త్సమాయాతో బ్రహ్మా లోకపితామహః ।**
**వేదైస్సోపనిషద్భిశ్చ వివిధై రాగమైస్సహ ॥39॥**

లోకాలన్నింటికి పితామహుడైన బ్రహ్మ వేదాలతో, ఉపనిషత్తులతో వివిధ శాస్త్రాలతో సహా సత్యలోకంనుండి ఇచ్చటకు విచ్చేసియున్నారు.

**తథా సురగణై స్సాక మాగత స్సురరాట్ స్వయమ్ ।**
**తథా యూయం సమాయాతా ఋషయో వీతకల్మషాః ॥40॥**

అట్లే ఇంద్రుడు స్వయంగా దేవతా గణాలతో కూడి, ఇక్కడకు వచ్చాడు. ఆవిధంగానే కల్మష మెరుగని ఋషులైన మీరందరు కూడ విచ్చేశారు.

**యే యే యజ్ఞోచితా శ్శాంతాః పాత్రభూతా స్సమాగతాః ।**
**వేద వేదార్థ తత్త్వజ్ఞాస్సర్వే యూయం దృఢవ్రతాః ॥41॥**

యజ్ఞోచితమైనవారు, శాంతస్వభావులు, సత్పాత్రులు, వేద వేదార్థ తత్త్వజ్ఞులు, దృఢవ్రతులు నైన మీరందరూ విచ్చేశారు.

**అత్రైవ చ కిమస్మాకం రుద్రేణాపి ప్రయోజనమ్ ।**
**కన్యా దత్తా మయా విప్ర బ్రహ్మణా నోదితేన హి ॥42॥**

దధీచా! మనకిచ్చుట ఇక ఇప్పుడు రుద్రునితో ఏమిపని? ఏమి ప్రయోజనం? బ్రహ్మచే ప్రేరేపితుడనైన నేను ఆతనికి నాకుమార్తెయైన సతీదేవిని కన్యాదానం చేశాను.

**హరోఽకులీనోఽసౌ విప్ర పితృమాతృవివర్జితః ।**
**భూతప్రేత పిశాచానాం పతిరేకో దురత్యయః ॥43॥**

ఓ విప్రా! ఈ హరుడు కులహీనుడు. మాతాపితృ వివర్జితుడు. భూత ప్రేత పిశాచాలకు ప్రభువు. ఏకాకి. అతని నతిక్రమించుట చాల కష్టం.

**ఆత్మసంభావితో మూఢస్తబ్ధో మౌనీ సమత్సరః ।**
**కర్మణ్యస్మిన్న యోగ్యోఽసౌ నానీతో హి మయాఽధునా ॥44॥**

అతడు తానే గొప్పవాడనను గర్వం కలవాడు. మూఢుడు, జడుడు, మౌని, అసూయాపరుడు, కాబట్టి అతడీ యజ్ఞకర్మకు యోగ్యుడు కాడు. కావుననే నేనాతనిని ఇక్కడకు రప్పించలేదు.

**తస్మాత్త్వమీదృశం వాక్యం పునర్వాచ్యం న హి క్వచిత్ ।**
**సర్వై ర్భవద్భిః కర్తవ్యో యజ్ఞో మే సఫలో మహాన్ ॥45॥**

కాబట్టి మీరిట్టి మాటలను మరెచ్చటను మళ్ళీ చెప్పవద్దు. మీరందరు కలసి నామహాయజ్ఞాన్ని సఫలం చేయండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య దధీచో వాక్యమబ్రవీత్ ।**
**సర్వేషాం శృణ్వతాం దేవమునీనాం సారసం యుతమ్ ॥46॥**

దక్షుని మాటలను విని దధీచుడు, దేవతలు, మునులు అందరూ వినేటట్లుగా సారగర్భితమైన మాటలను ఇలా పలికాడు.

**దధీచ ఉవాచ –** దధీచుడు  పలికాడు.

**అయజ్ఞోఽయం మహాజాతో వినా తేన శివేన హి ।**
**వినాశోఽపి విశేషేణ హ్యత్ర తే హి భవిష్యతి ॥47॥**

శివుడులేని ఈమహాయజ్ఞం అయజ్ఞంగా మారింది. అంతేకాదు. నీకు విశేషమైన వినాశనంకూడా సంభవిస్తుంది.

**ఏవముక్త్వా దధీచోఽసావేక ఏవ వినిర్గతః ।**
**యజ్ఞవాటాచ్చ దక్షస్య త్వరితః స్వాశ్రమం యయౌ ॥48॥**

దధీచుడిట్లు పలికి యజ్ఞవాటికనుండి అతడొక్కడే బయటకువచ్చి, వేగంగా తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

**తతోఽన్యే శాంకరా యే చ ముఖ్యాశ్శివమతానుగాః ।**
**నిర్యయు స్స్వాశ్రమాన్ సద్యశ్శాపం దత్త్వా తథైవ చ ॥49॥**

అనంతరం శివమతానుయాయులగు ఇతర శంకర భక్తులుకూడా బయటకువచ్చి వెంటనే అదేతీరులో శాపాలనిచ్చి, తమతమ ఆశ్రమాలకు వెళ్ళారు.

**మునౌ వినిర్గతే తస్మిన్ మఖాదన్యేషు దుష్టధీః ।**
**శివద్రోహీ మునీన్ దక్షః ప్రహసన్నిదమబ్రవీత్ ॥50॥**

దధీచి, ఇతర శంకరభక్తులు యజ్ఞంనుండి బయటకు రాగానే దుష్టబుద్ధి, శివద్రోహి అయిన దక్షుడు పరిహసిస్తూ ఆ మునులతో ఇలా అన్నాడు.

**దక్ష ఉవాచ –** దక్షుడు పలికాడు.

**గతః శివప్రియో విప్రో దధీచో నామ నామతః ।**
**అన్యే తథావిధా యే చ గతాస్తే మమ చాధ్వరాత్ ॥51॥**

శివప్రియుడైన దధీచుడనే పేరుగల బ్రాహ్మణుడు వెళ్ళాడు. అటువంటివారే మరికొందరుకూడా నాయజ్ఞంనుండి తొలగిపోయారు.

**ఏతచ్ఛుభతరం జాతం సంమతం మే హి సర్వథా ।**
**సత్యం బ్రవీమి దేవేశ సురాశ్చ మునయ స్తథా ॥52॥**

ఇది అంతా మిక్కిలి శుభకరం. అన్నివిధాల ఇదినాకు సమ్మతం. ఇంద్రా! దేవతలారా! మునులారా! నేను సత్యమును పలుకుచున్నాను.

**వినష్టచిత్తా మందాశ్చ మిథ్యావాదరతాః ఖలాః ।**
**వేదబాహ్యా దురాచారా స్త్యాజ్యాస్తే మఖ కర్మణి ॥53॥**

వివేకంలేని మూర్ఖులను, మందులను, మిథ్యావాదరతులను, దుష్టులను, వేదబాహ్యులను, దురాచారులను యజ్ఞకర్మలలోనికి రానీయరాదు.

**వేదవాదరతా యూయం సర్వే విష్ణుపురోగమాః ।**
**యజ్ఞం మే సఫలం విప్రాస్సురాః కుర్వంతు మాఽచిరమ్ ॥54॥**

మీరందరూ వేదాధ్యయనపరులు. విష్ణువు మీకందరకు ముందుండి మిమ్ములను నడిపిస్తాడు. ఓ బ్రాహ్మణులారా! దేవతలారా! విలంబం లేకుండా నాయజ్ఞాన్ని సఫలం చేయండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య శివమాయా విమోహితాః ।**
**యన్మఖే దేవయజనం చక్రుస్సర్వే సురర్షయః ॥55॥**

దక్షుడు పలికిన మాటలను విని, శివమాయా మోహితులై, దేవర్షులందరు ఆయజ్ఞంలో దేవతలకు హవిస్సులనీయ నారంభించారు.

**ఇతి తన్మఖ శాపో హి వర్ణితో మే మునీశ్వర ।**
**యజ్ఞ విధ్వంస యోగోఽపి ప్రోచ్యతే శృణు సాదరమ్ ॥56॥**

ఓ నారదా! ఇంతవరకు ఈయజ్ఞానికి శాపంకలిగిన తీరును వర్ణించాను. ఇప్పుడు యజ్ఞం విధ్వంసమైన తీరును వర్ణిస్తాను. శ్రద్ధతో విను

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం ద్వితీయే సతీఖండే దక్షయజ్ఞప్రారంభోనామ సప్తవింశోఽధ్యాయః ॥27॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో దక్షయజ్ఞప్రారంభం అనే ఇరవైఏడవ అధ్యాయం సమాప్తం.

## అష్టవింశోఽధ్యాయః - ఇరవై ఎనిమిదవ అధ్యాయం
## సతీయాత్రః - సతీయాత్రావర్ణనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**యదా యయుర్దక్ష మఖ ముత్సవేన సురర్షయః ।**
**తస్మిన్నేవాంతరే దేవీ పర్వతే గంధమాదనే ॥1॥**

దక్షుని యజ్ఞానికి దేవతలు, ఋషులు వెళ్ళుతున్న సమయంలో సతీదేవి గంధమాదన పర్వతం మీద ఉందా.

**ధారాగృహే వితానేన సఖీభిః పరివారితా ।**
**దాక్షాయణీ మహాక్రీడాశ్చకార వివిధాస్సతీ ॥2॥**

జలగృహంలో పందిరిక్రింద సఖురాండ్రతోకూడి, చిరకాలం క్రీడించింది.

**క్రీడాసక్తా తదా దేవీ దదర్శాథ ముదా సతీ ।**
**దక్షయజ్ఞే ప్రయాంతం చ రోహిణ్యా పృచ్ఛ్య సత్వరమ్ ॥3॥**

దక్షుని పుత్రియగు సతి ఆనందంతో క్రీడిస్తూ, రోహిణితో కలసి దక్షయజ్ఞానికి వెళ్ళుతున్న చంద్రుని చూసింది.

**దృష్ట్వా సీమంతయా భూతాం విజయాం ప్రాహ సా సతీ ।**
**స్వ సఖీం ప్రవరాం ప్రాణప్రియాం సా హి హితావహామ్ ॥4॥**

పాపిట సింధూరం ధరించిన రోహిణిని చూచి తనకు ప్రాణప్రియురాలూ, హితకారిణీ అయిన సఖి విజయతో సతీదేవి ఇలా పలికింది.

**సత్యువాచ** - సతీదేవి పలికింది.

**హే సఖీ ప్రవరే ప్రాణప్రియే త్వం విజయే మమ ।**
**క్వ గమిష్యతి చంద్రోఽయం రోహిణ్యాపృచ్ఛ్య సత్వరమ్ ॥5॥**

"ఓ విజయా! నీవునాకు ప్రాణసమానమైన ప్రీతికలదానవు. నీవు నా సఖురాండ్రలోకెల్ల శ్రేష్ఠమైన సఖివి. ఈ చంద్రుడు రోహిణితోగూడి ఎక్కడకు వెళ్ళుతున్నాడో నీవు వెంటనే తెలుసుకొనిరా" అని సతీదేవి ఆదేశించింది.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**తథోక్తా విజయా సత్యా గత్వా తత్సన్నిధౌ ద్రుతమ్ ।**
**క్వ గచ్ఛసీతి పప్రచ్ఛ శశినం తం యథోచితమ్ ॥6॥**

సతీదేవి ఆవిధంగా ఆజ్ఞాపించగా విజయ వెంటనే చంద్రుని చెంతకు వెళ్ళి, "మీరెక్కడకు వెళ్తున్నారు" అని మర్యాద పూర్వకంగా ప్రశ్నించింది.

**విజయోక్త మథాకర్ణ్య స్వయాత్రాం పూర్వమాదరాత్ ।**
**కథితం తేన తత్సర్వం దక్షయజ్ఞోత్సవాదికమ్ ॥7॥**

విజయయొక్క ప్రశ్నను విని, చంద్రుడు తాను దక్షుని యజ్ఞ మహోత్సవానికి వెళ్ళుతున్నానని చెప్పాడు. అంతేగాక మిక్కిలి ఆదరంతో దక్షయజ్ఞానికి సంబంధించిన వివరాలనన్నింటిని తెలియజేశాడు.

**తచ్ఛ్రుత్వా విజయా దేవీం త్వరితా జాత సంభ్రమా ।**
**కథయామాస తత్సర్వం యదుక్తం శశినా సతీమ్ ॥8॥**

చంద్రుని మాటలను విని ఆశ్చర్యపోయిన విజయ వేగంగా సతీదేవి వద్దకు వెళ్ళి, చంద్రుడు చెప్పిన వృత్తాంతమంతటినీ చెప్పింది.

**తచ్ఛ్రుత్వా కాళికాదేవీ విస్మితాభూత్సతీ తదా ।**
**విమృశ్య కారణం తత్రాజ్ఞాత్వా చేతస్యచింతయత్ ॥9॥**

ఆమాటలను విని, కాళికాదేవియైన సతి చాలా ఆశ్చర్యాన్ని పొందింది. ఆవిధంగా జరగడానికి, ఈసమాచారం తన చెంతకు రాకపోవడానికి గల కారణాలనుగూర్చి ఎంత ఆలోచించినా ఆమెకు తెలియలేదు. సతీదేవి తన మనస్సులో ఇలా ఆలోచించింది.

**దక్షః పితా మే మాతా చ వీరిణీ నౌ కుతస్సతీ ।**
**ఆహ్వానం న కరోతి స్మ విస్మృతా మాం ప్రియాం సుతామ్ ॥10॥**

నా తండ్రియైన దక్షుడు, తల్లియైన వీరిణి, మమ్ములనిద్దరిని ఎందుకు ఆహ్వానించలేదో? ప్రియ పుత్రికను నన్ను మరచిపోయారా ఏమి?

**పృచ్ఛేయం శంకరం తత్ర కారణం సర్వమాదరాత్ ।**
**చింతయిత్వేతి సాసీద్వై తత్ర గంతుం సునిశ్చయా ॥11॥**

'దీనికిగల కారణాన్నిగూర్చి శంకరుని అడుగుతాను'. ఈవిధంగా తలపోసి, ఆమె ఆయజ్ఞానికి వెళ్ళడానికి నిశ్చయించుకుంది.

**అథ దాక్షాయణీ దేవీ విజయాం ప్రవరాం సఖీమ్ ।**
**స్థాపయిత్వా ద్రుతం తత్ర సమగచ్ఛ చ్ఛివాంతికమ్ ॥12॥**

అపుడా దాక్షాయణీదేవి తన ప్రియసఖియైన విజయను అచ్చటనే ఉంచి, తాను వెంటనే శివుని చెంతకు వెళ్ళింది.

**దదర్శ తం సభామధ్యే సంస్థితం బహుభిర్గణైః ।**
**నంద్యాదిభి ర్మహావీరైః ప్రవరై ర్యూథ యూథపైః ॥13॥**

సభామధ్యంలో అనేక గణాలతో, నంది మొదలగు మహావీరులతో, శ్రేష్ఠులగు గణాధ్యక్షులతో, చుట్టువారబడియున్న శివుని సతీదేవి చూచింది.

**దృష్ట్వా తం ప్రభుమీశానం స్వపతిం సాథ దక్షజా ।**
**ప్రష్టుం తత్కారణం శీఘ్రం ప్రాప శంకర సంనిధిమ్ ॥14॥**

ఆ దాక్షాయణి తన భర్తయైన ఈశ్వర ప్రభువునుచూచి దక్షయజ్ఞానికి ఆహ్వానం రాకుండటానికి కారణాన్ని అడగడానికి శంకరుని సన్నిధికి వెంటనే వెళ్ళింది.

**శివేన స్థాపితా స్వాంకే ప్రీతియుక్తేన స్వ ప్రియా ।**
**ప్రమోదితా వచోభిస్సా బహుమాన పురస్సరమ్ ॥15॥**

శివుడు తన ప్రియురాలైన సతీదేవిని తన అంకంపై కూర్చుండ బెట్టుకుని ప్రేమతో? ఆదరంగా మాట్లాడగా ఆమె చాలా సంతసించింది.

**అథ శంభుర్మహాలీల స్సర్వేశ స్సుఖద స్సతామ్ ।**
**సతీమువాచ త్వరితం గణమధ్యస్థ ఆదరాత్ ॥16॥**

అప్పుడు గొప్ప లీలలను ప్రకటించేవాడు, సర్వేశ్వరుడు, సత్పురుషులకు సుఖాన్నిచ్చేవాడు అయిన శంభుడు గణాలమధ్య విరాజిల్లుతూ ఆదరంతో వెంటనే సతీదేవితో ఇలా పలికాడు.

**శంభురువాచ** - శంభుడు పలికాడు.

**కిమర్థమాగతాత్ర త్వం సభామధ్యే సవిస్మయా ।**
**కారణం తస్య సుప్రీత్యా శీఘ్రం వద సుమధ్యమే ॥17॥**

ఓ సుందరీ! ఈసభామధ్యలోనికి విస్మయంతో కూడినదానవై నీవు రావడానికి గల కారణం ప్రీతితో నాకు వెంటనే చెప్పు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏవముక్తా తదా తేన మహేశేన మునీశ్వర ।**
**సాంజలిస్సుప్రణమ్యాశు సత్యువాచ ప్రభుం శివా ॥18॥**

ఓ నారద మహర్షీ! మహేశ్వరుడావిధంగా పలుకగా శివపత్నియైన సతి చేతులు జోడించి, నమస్కరించి, శివునితో ఇలా పలికింది.

**సత్యువాచ** - సతీదేవి పలికింది.

**పితుర్మమ మహాన్ యజ్ఞో భవతీతి మయా శ్రుతమ్ ।**
**తత్రోత్సవో మహానస్తి సమవేతా స్సురర్షయః ॥19॥**

నా తండ్రి మహా యజ్ఞాన్ని చేయుచున్నాడని నేను విని ఉన్నాను. అక్కడ మహోత్సవం జరుగుతోంది. అక్కడకు దేవతలు, ఋషులు, అందరు వచ్చారట.

**పితుర్మమ మహా యజ్ఞే కస్మాత్త్వ న రోచతే ।**
**గమనం దేవదేవేశ తత్సర్వం కథయ ప్రభో ॥20॥**

ఓ దేవదేవేశా! ప్రభూ! నా తండ్రిచేసే మహాయజ్ఞానికి వెళ్ళడానికి మీకెందుకిష్టం కాలేదు? ఆవిషయమంతా నాకు చెప్పండి.

**సుహృదామేష వై ధర్మస్సుహృద్భిస్సహ సంగతిః ।**
**కుర్వంతి యన్మహాదేవ సుహృదః ప్రీతివర్ధినీమ్ ॥21॥**

మహాదేవా! మంచి హృదయం కలవారితో కలిసి మెలిసి ఉండి, వారికి ప్రీతిని వర్ధిల్లజేయడం మంచి హృదయం కలవారి ధర్మంకదా!

**తస్మాత్సర్వ ప్రయత్నేన మయాగచ్ఛ సహ ప్రభో ।**
**యజ్ఞవాటం పితుర్మేఽద్య స్వామిన్ ప్రార్థనయా మమ ॥22॥**

ఓ ప్రభూ! స్వామీ! నా ప్రార్థనను మన్నించి, ప్రత్యేక ప్రయత్నంతోనైనా నా తండ్రియొక్క యజ్ఞశాలకు నాతో ప్రయాణాన్ని ఇప్పుడే ప్రారంభించండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**తస్యా స్తద్వచనం శ్రుత్వా సత్యా దేవో మహేశ్వరః ।**
**దక్ష వాగిషు హృద్విద్ధో బభాషే సూనృతం వచః ॥23॥**

సతీదేవి మాటలను విని, మహేశ్వరుడు దక్షుని వాక్కులనే బాణాలచే దెబ్బతిన్న హృదయం కలవాడై, యథార్థ వచనాలను ఇలా పలికాడు.

**మహేశ్వర ఉవాచ –** మహేశ్వరుడు చెప్పాడు.

**దక్షస్తవ పితా దేవీ మమ ద్రోహీ విశేషతః ॥24॥**

ఓ దేవీ! దక్షుడు నీకు తండ్రి, నాకు విశేషించి ద్రోహాన్ని చేసినవాడు.

**యస్య యే మానినస్సర్వే ససురర్షి ముఖాః పరే ।**
**తే మూఢా యజనం ప్రాప్తాః పితుస్తే జ్ఞానవర్జితాః ॥25॥**

గర్విష్ఠులు, జ్ఞాన విహీనులునైన దేవతలు, ఇతరులు నీ తండ్రియొక్క యజ్ఞానికి వెళ్ళారు. వారు మూర్ఖులు.

**అనాహూతాశ్చ యే దేవీ గచ్ఛన్తి పరమందిరమ్ ।**
**అవమానం ప్రాప్నువంతి మరణాదధికం తథా ॥26॥**

ఓ దేవీ! ఎవరైతే ఆహ్వానం లేకుండగా ఇతరుల గృహాలకు వెళతారో వారు మరణంకంటే అధికమైన దుఃఖాన్నిచ్చే అవమానాన్ని పొందుతారు.

**పరాలయం గతోఽపీంద్రో లఘుర్భవతి తద్విధః ।**
**కా కథా చ పరేషాం వై రీథా యాత్రా హి తద్విధా ॥27॥**

ఆహ్వానం లేకుండా ఇతరుల గృహాలకు వెళ్ళేవాడు ఇంద్రుడైనా చులకనగా చూడబడతాడు. ఇతరులమాట చెప్పవలెనా? ఆవిధంగా వెళ్ళేవారికి అది తిరస్కారయాత్రయే. వారికి తెగడ్తయే ప్రాప్తిస్తుంది.

**తస్మాత్త్వయా మయా చాపి దక్షస్య యజనం ప్రతి ।**
**న గంతవ్యం విశేషేణ సత్యముక్తం మయా ప్రియే ॥28॥**

కావున నీవుగాని, నేనుగాని, విశేషించి దక్షుని యజ్ఞానికి వెళ్ళరాదు. ఓ ప్రియురాలా! నేను యదార్థాన్నే చెప్తున్నాను.

**తథారిభిర్న వ్యథతే హ్యర్దితోఽపి శరైర్జనః ।**
**స్వానాం దురుక్తిభి ర్మర్మతాడిత స్స యథా మతః ॥29॥**

తనకు కావలసినవారి నిందావాక్యాలచే హృదయం వేధింపబడినవాడు పొందే అంత దుఃఖాన్ని శత్రువులు బాణాలతో కొట్టికూడా కలిగించలేరు.

**విద్యాదిభిర్గుణైః షడ్భిరసదన్యై స్సతాం స్మృతౌ ।**
**హతాయాం భూయసాం ధామ న పశ్యంతి ఖలాఃప్రియే ॥30॥**

ఓ ప్రియురాలా! సత్పురుషులయందుండే విద్యాది సద్గుణాలు ఆరు ఎవరి బుద్ధిలో నశిస్తాయో ఆ ఖలులు మహాత్ముల దివ్యశక్తిని దర్శింపలేరు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏవముక్తా సతీ తేన మహేశేన మహాత్మనా ।**
**ఉవాచ రోష సంయుక్తా శివం వాక్యవిదాం వరమ్ ॥31॥**

మహాత్ముడైన మహేశ్వరుడీవిధంగా పలుకగానే సతీదేవి రోషంతో కూడినదై వాక్యవిదాంవరుడైన పరమేశ్వరునితో ఇలా పలికింది.

**సత్యువాచ** - సతీదేవి పలికింది.

**యజ్ఞస్స్యా త్సఫలో యేన స త్వం శంభోఽఖిలేశ్వర ।**
**అనాహూతోఽసి తేనాద్య పిత్రా మే దుష్టకారిణా ॥32॥**

ఓ శంభూ! నీవు అఖిలేశ్వరుడవు. నీసన్నిధిచే యజ్ఞం సఫలమౌతుంది. కాని దుర్బుద్ధిగల నాతండ్రి నేడు మిమ్ములను ఆహ్వానించలేదు.

**తత్సర్వం జ్ఞాతుమిచ్ఛామి భవ భావం దురాత్మనః ।**
**సురర్షీణాం చ సర్వేషా మాగతానాం దురాత్మనామ్ ॥33॥**

ఓ భవా! ఆ దురాత్ముని మనోభావాలనన్నింటిని నేను తెలియగోరుతున్నాను. ఆయజ్ఞానికి విచ్చేసిన దురాత్ములైన దేవతల, ఋషుల అభిప్రాయాలనుకూడా నేను తెలియగోరుతున్నాను.

**తస్మాచ్చాద్యైవ గచ్ఛామి స్వపితుర్యజనం ప్రభో ।**
**అనుజ్ఞాం దేహి మే నాథ తత్ర గంతుం మహేశ్వర ॥34॥**

కాబట్టి ఓ ప్రభూ! నేనిప్పుడే నా తండ్రి యజ్ఞానికి వెళతాను. నాథా! మహేశ్వరా! అక్కడికి వెళ్ళడానికి నాకు అనుమతిని ప్రసాదించండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తో భగవాన్ రుద్రస్తయా దేవ్యా శివస్స్వయమ్ ।**
**విజ్ఞాతాఖిల దృక్ ద్రష్టా సతీం సూతికరోఽబ్రవీత్ ॥35॥**

సతీదేవి రుద్రునితో అలా పలుకగా స్వయంగా సర్వాన్ని దర్శించే సాక్షిస్వరూపుడు, జగత్కారణుడు ఐన శివుడు ఆమెతో ఇలా పలికాడు.

**శివ ఉవాచ –** శివుడు చెప్పాడు.

**యద్యేవం తే రుచిర్దేవి తత్ర గంతుమవశ్యకమ్ ।**
**సువ్రతే వచనాన్మే త్వం గచ్ఛ శీఘ్రం పితుర్మఖమ్ ॥36॥**

ఓ దేవీ! సువ్రతా! తప్పక నీవచ్చటికి వెళ్ళవలెనని కోరుకుంటే నేను నీకు అనుమతినిస్తున్నాను. నీవు శీఘ్రమే నీతండ్రి చేసే యజ్ఞానికి వెళ్ళు.

**ఏతం నందిన మారుహ్య వృషభం సజ్జమాదరాత్ ।**
**మహారాజోపచారాణి కృత్వా బహుగుణాన్వితా ॥37॥**

**భూషితం వృషమారోహేత్యుక్తా రుద్రేణ సా సతీ ।**
**సుభూషితా సతీ యుక్తా హ్యాగమత్పితృమందిరమ్ ॥38॥**

ఈ నందిని చక్కగా అలంకరించి, దానినధిష్ఠించి వెళ్ళు. సర్వ సద్గుణ సంపన్నవగు నీవు మహారాజోపచారాలన్నింటిని వెంటతీసుకొని అలంకారాలతో కూడిన వృషభాన్ని అధిష్ఠించు. అని రుద్రుడు సతీదేవితో పలికాడు. సతీదేవి చక్కగా అలంకరించుకొని, పరివారంతోకూడి, తన తండ్రియైన దక్షుని ఇంటికి వెళ్ళింది.

**మహారాజోపచారాణి దత్తాని పరమాత్మనా ।**
**సుచ్ఛత్ర చామరాదీని సద్వస్త్రాభరణాని చ ॥39॥**

పరమాత్మ ఆమెకు గొప్ప ఛత్రాన్నీ, చామరాన్నీ, విలువైన వస్త్రాలను, ఆభరణాలను ఇటువంటి మహారాజోపచారాలనన్నింటిని ఏర్పాటుచేశాడు.

**గణాః షష్టి సహస్రాణి రౌద్రా జగ్ము శ్శివాజ్ఞయా ।**
**కుతూహలయుతాః ప్రీతా మహోత్సవసమన్వితాః ॥40॥**

కుతూహలంతో, ప్రీతితో కూడిన అరవైవేల రుద్రగణాలు మహోత్సవపూర్వకంగా శివాజ్ఞచే ఆమెవెంట వెళ్ళారు.

**తదోత్సవో మహానాసీద్యజనే తత్ర సర్వతః ।**
**సత్యాశ్శివ ప్రియాయాస్తు వామదేవగణైః కృతః ॥41॥**

**కుతూహలం గణాశ్చక్రు శ్శివయోర్యశ ఉజ్జగుః ।**
**బలాత్తే పుప్లువుః ప్రీత్యా మహావీరా శ్శివప్రియాః ॥42॥**

అక్కడ దక్షయజ్ఞంలో సర్వత్ర గొప్ప ఉత్సవం నిర్వహింపబడుతోంది. శివుని ప్రియురాలైన సతీదేవి ప్రయాణంలో వామదేవుని గణాలు ఉమాశంకరుల కీర్తిని కుతూహలంతో ఉత్సాహంతో గానం చేశారు. శివునికి ప్రియులు, మహావీరులునైన ఆగణాలు మార్గమధ్యంలో ఆనందంతో గంతులేస్తున్నారు.

**సర్వథాసీన్మహాశోభా గమనే జగదంబికే ।**
**సుఖారావస్సంబభూవ పూరితం భువనత్రయమ్ ॥43॥**

జగన్మాతయొక్క ఆప్రయాణంలో అన్నివిధాలుగా గొప్పశోభ కలిగినది. ఆసుఖకరమైన ధ్వనులచే ముల్లోకాలు నిండిపోయాయి.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే సతీయాత్రా వర్ణనం నామాష్టవింశోఽధ్యాయః ॥28॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో సతీయాత్రా వర్ణనం అనే ఇరవై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనత్రింశోఽధ్యాయః - ఇరవై తొమ్మిదవ అధ్యాయం
## సతీవాక్యమ్ - సతీదేవివాక్యవర్ణనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**దాక్షాయణీ గతా తత్ర యత్ర యజ్ఞో మహాప్రభః ।**
**సురాసుర మునీంద్రాది కుతూహలసమన్వితః ॥1॥**

దక్షుని యజ్ఞం మహాప్రభతో కొనసాగుతోంది. దేవతలు, రాక్షసులు, మునులు, ఇంద్రాది దిక్పాలకులు మిక్కిలి ఉత్సాహంతో ఆ యజ్ఞంలో పాల్గొన్నారు. అంతట దాక్షాయణి అక్కడకు వెళ్ళింది.

**స్వపితుర్భవనం తత్ర నానాశ్చర్యసమన్వితమ్ ।**
**దదర్శ సుప్రభం చారు సురర్షిగణసంయుతమ్ ॥2॥**

ఎన్నో వింతలతో కూడి, గొప్పకాంతి కలదై, దేవతల ఋషుల గణాలతో కూడి ఉన్న తన తండ్రి భవనాన్ని ఆమె అచ్చట చూచింది.

**ద్వారి స్థితా తదా దేవీ హ్యవరుహ్య నిజాసనాత్ ।**
**నందినోఽభ్యంతరం శీఘ్రమేకైవాగచ్ఛదధ్వరమ్ ॥3॥**

అప్పుడాదేవి ద్వారంవద్ద తన వాహనమైన నందినుండిదిగి, వెంటనే ఆమెఒక్కతెయే లోపలకు, , యజ్ఞశాలకు వెళ్ళింది.

**ఆగతాం చ సతీం దృష్ట్వాఽసిక్నీ మాతా యశస్వినీ ।**
**అకరోదాదరం తస్యా భగిన్యశ్చ యథోచితమ్ ॥4॥**

ఆవిధంగా విచ్చేసిన సతీదేవిని చూచి, యశస్వినియైన ఆమె తల్లి అసిక్ని (రాజస్త్రీలు చెప్పిన పనులు చేయుచు అంతఃపురమందుండెడి స్త్రీ) మరియు సోదరీమణులు యథోచితంగా ఆదరించారు.

**నాకరోదాదరం దక్షో దృష్ట్వా తామపి కించన ।**
**నాన్యోఽపి తద్భయాత్తత్ర శివమాయా విమోహితః ॥5॥**

దక్షుడామెను చూచినప్పటికి కొంచెంకూడా ఆదరాన్ని చూపలేదు. శివమాయా మోహితులైన ఇతరులుకూడ దక్షునియందలి భయంచే సతీదేవి నాదరించలేదు.

**అథ సా మాతరం దేవీ పితరం చ సతీ మునే ।**
**అనమద్విస్మితాత్యంతం సర్వలోక పరాభవాత్ ॥6॥**

ఓ నారదా! ఈవిధంగా అందరి అనాదరణకు గురియైన సతీదేవి మిక్కిలి ఆశ్చర్యాన్ని పొంది, తల్లిదండ్రులకు నమస్కరించింది.

**భాగానపశ్యద్దేవానాం హర్యాదీనాం తదధ్వరే ।**
**న శంభుభాగమకరోత్ క్రోధం దుర్విషహం సతీ ॥7॥**

ఆ యజ్ఞంలో విష్ణువు మున్నగు దేవతలకందరకు ఈయబడిన హవిర్భాగాలను ఆమె చూచింది. కాని, దక్షుడు శంభునకు హవిర్భాగమీయకుండుటచే ఆమెకు పట్టరాని కోపం వచ్చింది.

**సత్యువాచ** – సతీదేవి పలికింది.

**తదా దక్షం దహన్తీవ రుషాపూర్ణా సతీ భృశమ్ ।**
**క్రూరదృష్ట్యా విలోక్యైవ సర్వానప్యపమానితా ॥8॥**

ఈవిధంగా అవమానింపబడిన సతీదేవి మిక్కిలి క్రోధాన్ని పొంది, ఆసమయంలో దక్షుని దహించ డానికికన్నట్లు ఆమె దక్షుని చూచింది. ఇతరులను కూడ భయం కలిగించే దృష్టితో చూచింది.

**అనాహూత స్త్వయా కస్మాచ్ఛంభుః పరమశోభనః ।**
**యేన పూతమిదం విశ్వం సమగ్రం సచరాచరమ్ ॥9॥**

పరమ మంగళ స్వరూపుడైన శంభుని నీవేల ఆహ్వానించలేదు? ఆయన ఈ చరాచర జగత్తున కంతటికి పవిత్రతను కలిగిస్తున్నాడు.

**యజ్ఞో యజ్ఞవిదాం శ్రేష్ఠో యజ్ఞాంగో యజ్ఞ దక్షిణః ।**
**యజ్ఞకర్తా చ యశ్శంభుస్తం వినా చ కథం మఖః ॥10॥**

యజ్ఞ స్వరూపుడు, యజ్ఞవేత్తలలో శ్రేష్ఠుడు, యజ్ఞాంగుడు, యజ్ఞములోని దక్షిణ స్వరూపుడు, యజ్ఞకర్తయైన సోమయాజి స్వరూపుడునైన శంభుడు లేని యజ్ఞం ఎలా సాధ్యం?

**యస్య స్మరణ మాత్రేణ సర్వం పూతం భవత్యహో ।**
**వినా తేన కృతం సర్వమపవిత్రం భవిష్యతి ॥11॥**

ఆయనను స్మరించినంత మాత్రంచేతనే సర్వమూ పవిత్రమౌతుంది. అహో! ఆయన యొక్క స్మరణలేని కర్మలన్నీ అపవిత్రాలౌతాయి.

**ద్రవ్య మంత్రాదికం సర్వం హవ్యం కవ్యం చ యన్మయమ్ ।**
**శంభునా హి వినా తేన కథం యజ్ఞః ప్రవర్తితః ॥12॥**

యజ్ఞ ద్రవ్యాలు, మంత్రాలు, దేవతలకిచ్చే హవిర్భాగాలు, పితరులకిచ్చే కవ్యాలు సర్వమూ ఆయనయొక్క స్వరూపమే. అట్టి శంభుడులేని యజ్ఞం ఎలా ప్రవర్తిల్లుతుంది?

**కిం శివం సురసామాన్యం మత్వాకార్షీరనాదరమ్ ।**
**భ్రష్ట బుద్ధిర్భవానద్య జాతోఽసి జనకాధమ ॥13॥**

ఓరీ జనకాధమా! శివుని ఒక సామాన్య దేవతగా భావించి నీవు అనాదరణ చేశావు. ఈనాడు నీబుద్ధి భ్రష్టమయ్యింది.

**విష్ణు బ్రహ్మాదయో దేవా యం సంసేవ్య మహేశ్వరమ్ ।**
**ప్రాప్తాః స్వపదవీం సర్వే త్వం న జానాసి రే హరమ్ ॥14॥**

ఓరీ! ఏ మహేశ్వరుని సేవించి విష్ణు బ్రహ్మాది దేవతలు తమతమ పదవులను పొంది ఉన్నారో అట్టి హరునిగూర్చి నీవెరుగకున్నావు.

**ఏతే కథం సమాయాతా విష్ణుబ్రహ్మాదయ స్సురాః ।**
**తవ యజ్ఞే వినా శంభుం స్వప్రభుం మునయస్తథా ॥15॥**

విష్ణు బ్రహ్మాది దేవతలు, మహర్షులు తమ ప్రభువైన శంభుడులేని ఈ యజ్ఞానికి ఏవిధంగా విచ్చేశారు?

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా పరమేశానీ విష్ణ్వాదీన్సకలాన్ ప్రతి ।**
**పృథక్ పృథగవోచత్సా భర్త్సయంతీ భవాత్మికా ॥16॥**

శివస్వరూపిణి, పరమేశ్వరీ ఐన సతీదేవి ఇలా పలికి మరలా విష్ణ్వాదులకందరికి వేర్వేరుగా భయం కలిగిస్తూ ఇలా అన్నది.

**సత్యువాచ –** సతీదేవి పలికింది.

**హే విష్ణో త్వం మహాదేవం కిం న జానాసి తత్త్వతః ।**
**సగుణం నిర్గుణం చాపి శ్రుతయో యం వదంతి హ ॥17॥**

ఓ విష్ణూ! నీవు మహాదేవుని స్వరూపాన్ని ఎరుగవా? వేదాలు ఆయన్ను సగుణుడనీ, నిర్గుణుడనీ కూడా వర్ణిస్తున్నాయి కదా?

**యద్యపి త్వాం కరం దత్వా బహువారం మహేశ్వరః ।**
**అశిక్షయత్పురా శాల్వ ప్రముఖాకృతిభిర్హరే ॥18॥**

ఓ హరీ! పూర్వం పరమేశ్వరు అనేక పర్యాయాలు నీకు చేయూతనిచ్చి, సాల్వుడు మున్నగురాజుల నుండి రక్షణనిచ్చి నీకు శిక్షణనిచ్చి ఉన్నాడు కదా. శ్రీ కృష్ణుడు శిశుపాలుణ్ణి వధించిన తరువాత శిశుపాలుణ్ణి అభిమానించే సాల్వుడనే రాజు ద్వారకను ఆక్రమించబోగా శివుడు శ్రీకృష్ణునికి ఆ సాల్వుని సంహరించడంలో సహాయంచేసాడు.

**తదపి జ్ఞానమాయాతం న తే చేతసి దుర్మతే ।**
**భాగార్థీ దక్షయజ్ఞేఽస్మిన్ శివం స్వ స్వామినం వినా ॥19॥**

ఓరీ దుర్మతీ! అయినా నీకు మనస్సులో జ్ఞానముదయించలేదు. నీ ప్రభువైన శివునికి భాగంలేని ఈ యజ్ఞంలో భాగంకోరి వచ్చావు.

**పురా పంచముఖో భూత్వా గర్వితోఽసి సదాశివమ్ ।**
**కృతశ్చతుర్ముఖస్తేన విస్మృతోఽసి తదద్భుతమ్ ॥20॥**

ఓరీ బ్రహ్మా! పూర్వం నీవు ఐదుముఖాలు కలిగి సదాశివుని ఎదుట గర్వాన్ని ప్రదర్శించగా, ఆయన నిన్ను చతుర్ముఖుని చేశాడు. ఆ అద్భుతాన్ని కూడా నీవు విస్మరించావు.

**ఇంద్ర త్వం కిం న జానాసి మహాదేవస్య విక్రమమ్ ।**
**భస్మీకృతః పవిస్తే హి హరేణ క్రూర కర్మణా ॥21॥**

ఓరీ ఇంద్రా! నీవు మహాదేవుని పరాక్రమాన్ని ఎరుగవా? హరునిచే నీవజ్రాయుధం భస్మం చేయబడింది గదా!

**హే సురాః కిన్నజానీథ మహాదేవస్య విక్రమమ్ ।**
**అత్రే వసిష్ఠ మునయో యుష్మాభిః కిం కృతం త్విహ ॥22॥**

ఓ దేవతలారా! మహాదేవుని పరాక్రమాన్ని మీరెరుగరా? ఓ అత్రీ! వశిష్ఠా! మునులారా! మీరిక్కడ ఏంచేస్తున్నారు?

**భిక్షాటనం చ కృతవాన్ పురా దారువనే విభుః ।**
**శప్తో యద్భిక్షుకో రుద్రో భవద్భిర్మునిభిస్తదా ॥23॥**

పూర్వం దారువనంలో ఆ రుద్రుడు భిక్షాటన చేశాడుకదా! ఆసమయంలో మీరు ఆయనను భిక్షుకుడవు కమ్మని శపించారు కదా!

**శప్తేనాపి చ రుద్రేణ యత్కృతం విస్మృతం కథమ్ ।**
**తల్లింగేనాఖిలం దగ్ధం భువనం సచరాచరమ్ ॥24॥**

అలా మీరు శపించినా రుద్రుడేమిచేశాడో మీరెలామరచిపోయారు? లింగస్వరూపుడైన శివుడు స్థావర జంగమాత్మకమైన చరాచర జగత్తునంతటిని దహించాడు కదా!

**సర్వే మూఢాశ్చ సంజాతా విష్ణుబ్రహ్మాదయస్సురాః ।**
**మునయోఽన్యే వినా శంభుమాగతా యదిహాధ్వరే ॥25॥**

విష్ణు బ్రహ్మాది సర్వదేవతలు, మునులు, ఇతరులు శంకరుడులేని ఈ యజ్ఞానికి వచ్చి, మూర్ఖులయ్యారు.

**సర్వే వేదాశ్చ సంభూతాః సాంగాశ్శాస్త్రాణి వాగ్యతః ।**
**యోఽసౌ వేదాంతగశ్శంభుః కైశ్చిత్ జ్ఞాతుం న పార్యతే ॥26॥**

ఎవనినుండి సమస్త వేదాలు, వేదాంగాలు, శాస్త్రాలు, వాక్కు జన్మించాయో, ఎవడు వేదాంతాలచే ప్రతిపాదింపబడుతున్నాడో అట్టి శంభుని కొందరు మాత్రమే తెలుసుకోగలరు. ఇతరులకు ఆయన అందడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యనేక విధా వాణీ రగదద జ్జగదంబికా ।**
**కోపాన్వితా సతీ తత్ర హృదయేన విదూయతా ॥27॥**

జగన్మాతయైన సతీదేవి కోపంతో, దుఃఖిత హృదయంతో అప్పుడక్కడ అనేక విధాలుగా పలికింది.

**విష్ణ్వాదయోఽఖిలా దేవా మునయో యే చ తద్వచః ।**
**మౌనీభూతాస్తదాకర్ణ్య భయవ్యాకుల మానసాః ॥28॥**

ఆమె మాటలను విని, విష్ణువు మొదలైన సమస్త దేవతలు, మునులు భయంతో మనస్సు కల్లోలితమై మిన్నకున్నారు.

**అథ దక్షస్సమాకర్ణ్య స్వపుత్ర్యా స్తాదృశం వచః ।**
**విలోక్య క్రూర దృష్ట్యా తాం సతీం క్రుద్ధోఽబ్రవీద్వచః ॥29॥**

అంతట దక్షుడు తన కుమార్తెయైన సతి పలుకులను విని, ఆమెను క్రూర దృష్టితో చూచి, మిక్కిలి కోపాన్ని పొంది, ఇలా పలికాడు.

**దక్ష ఉవాచ –** దక్షుడు పలికాడు.

**తవ కిం బహునోక్తేన కార్యం నాస్తీహ సాంప్రతమ్ ।**
**గచ్ఛ వా తిష్ఠ వా భద్రే కస్మాత్త్వం హి సమాగతా ॥30॥**

నీవు అధిక ప్రసంగం ఎందుకు చేస్తున్నావు? నీకిక్కడ ఏపనీ లేదు. అమ్మాయీ! నీవు ఉండెదవా? ఉంటే ఉండు. వెళితే వెళ్ళు. అసలెందుకు వచ్చావిక్కడికి?

**అమంగళస్తు తే భర్తా శివోఽసౌ గమ్యతే బుధైః ।**
**అకులీనో వేదబాహ్యో భూత ప్రేత పిశాచరాట్ ॥31॥**

నీభర్తయగు శివుడు అమంగళుడనీ, కులహీనుడనీ, వేదబాహ్యుడనీ, భూత ప్రేత పిశాచ రాజనీ పండితులు చెబుతున్నారు.

**తస్మాన్నాహ్వానితో రుద్రో యజ్ఞార్థం సుకువేషభృత్ ।**
**దేవర్షి సంసది మయా జ్ఞాత్వా పుత్రి విపశ్చితా ॥32॥**

ఓ పుత్రీ! అందువల్లనే నేనీ సత్యాన్నెరిగి ఋషులు, దేవతలు, కొలువుదీరిన ఈ యజ్ఞానికి మిక్కిలి చెడు వేషాన్ని ధరించు రుద్రుని ఆహ్వానించలేదు.

**విధినా ప్రేరితేన త్వం దత్తా మందేన పాపినా ।**
**రుద్రాయావిదితార్థాయ చోద్ధతాయ దురాత్మనే ॥33॥**

బుద్ధిహీనుడు, పాపియు నైన బ్రహ్మ ప్రేరేపించగా వేదతాత్పర్యాలు తెలియనివాడు, గర్విష్ఠి, దుర్మార్గుడు నైన రుద్రునకు నిన్నిచ్చి నేను వివాహం చేశాను.

**తస్మాత్కోపం పరిత్యజ్య స్వస్థా భవ శుచిస్మితే ।**
**యద్యాగతాసి యజ్ఞేఽస్మిన్ దాయం గృహ్ణీష్వ చాత్మనా ॥34॥**

కాబట్టి నీవు కోపాన్ని విడిచి, స్వస్థురాలవు కమ్ము. నీవీ యజ్ఞానికి ఎటూ వచ్చావు కాబట్టి నీవు కూడా దీనిలో పాలుపంచుకో.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**దక్షేణోక్తేతి సా పుత్రీ సతీ త్రైలోక్యపూజితా ।**
**నిందాయుక్తం స్వపితరం దృష్ట్వాసీ ద్రుషితా భృశమ్ ॥35॥**

దక్షుడిలా పలుకగానే దక్షుని కుమార్తెయు, త్రైలోక్య పూజ్యురాలూ అయిన సతీదేవి నిందావచనాలు పలికిన తన తండ్రిని చూచి మిక్కిలి కోపాన్ని పొందింది.

**అచింతయత్తదా సేతి కథం యాస్యామి శంకరమ్ ।**
**శంకరం ద్రష్టు కామాహం పృష్టా వక్ష్యే కిముత్తరమ్ ॥36॥**

అంతట ఆమె ఇట్లు చింతించింది. 'నేను శంకరుని వద్దకు ఎట్లు పోగలను? నాకు శంకరుని దర్శించాలని ఉన్నది. కాని ఆయన వివరాలడిగితే నేనేమి సమాధానమీయగలను?'

**అథ ప్రోవాచ పితరం దక్షం తం దుష్టమానసమ్ ।**
**నిశ్వసంతీ రుషావిష్ట సా సతీ త్రిజగత్ప్రసూః ॥37॥**

అంతట త్రిలోక జననియైన సతీదేవి క్రోధంతో కూడినదై నిట్టూర్పులు విడుస్తూ దుష్ట మానసుడైన దక్షునితో ఇలా పలికింది.

**సత్యువాచ -** సతీదేవి పలికింది.

**యో నిందతి మహాదేవం నింద్యమానం శృణోతి వా ।**
**తావుభౌ నరకం యాతౌ యావచ్చంద్రదివాకరౌ ॥38॥**

ఎవడు మహాదేవుని నిందిస్తాడో, ఎవడు మహాదేవుని నిందను వింటాడో వారిద్దరూకూడ సూర్యచంద్రులు ఉన్నంతవరకు నరకంలోనే ఉంటారు.

**తస్మా త్త్యక్ష్యామ్యహం దేవం ప్రవేక్ష్యామి హుతాశనమ్ ।**
**కిం జీవితేన మే తాత శృణ్వంత్యనాదరం ప్రభోః ॥39॥**

కాబట్టి నేను దేహాన్ని విడుస్తాను. అగ్నిలో ప్రవేశిస్తాను. తండ్రీ! నా ప్రభువును గూర్చి అనాదరంతో పలికిన నీ పలుకులు వినిన తరువాత కూడా నాకు జీవితంతో పనేమి?

**యది శక్తస్స్వయం శంభో ర్నిందకస్య విశేషతః ।**
**ఛింద్యాత్ ప్రసహ్య రసనాం తదా శుద్ధ్యేన్న సంశయః ॥40॥**

శక్తి కలవాడు శంభుని నిందించేవాడి నాలుకను బలాత్కారంగా ఛేదించాలి. అప్పుడు ఆ నిందావచనాలు వినిన అశుద్ధి నిస్సందేహంగా తొలగిపోతుంది.

**యద్యశక్తో జనస్తత్ర నిరయాత్సుపిధాయ వై ।**
**కర్ణౌ ధీమాన్ తత శ్శుద్ధ్యే ద్వదం తీదం బుధా వరాః ॥41॥**

ఆవిధంగా చేసే శక్తిలేకపోతే బుద్ధిమంతుడైన మానవుడు చెవులను గట్టిగా మూసుకొని, అచ్చటినుండి తొలగిపోతే అతడు శుద్ధుడౌతాడని బుధవరులు చెబుతున్నారు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్థముక్త్వా ధర్మనీతిం పశ్చాత్తాప మవాప సా ।**
**అస్మర చ్ఛాంకరం వాక్యం దూయమానేన చేతసా ॥42॥**

ఈ విధంగా ఆమె ధర్మనీతిని చెప్పి, పశ్చాత్తాపాన్ని పొందింది. ఆమె కలతపడిన మనస్సుతో శంకరుని మాటలను స్మరించుకొంది.

**తతః సంక్రుద్ధ్య సా దక్షం నిశ్శంకం ప్రాహ తానపి ।**
**సర్వాన్విష్ణ్వాదికాన్దేవాన్మునీనపి సతీ ధ్రువమ్ ॥43॥**

అప్పుడాసతి మిక్కిలి కోపించి, దక్షునితో విష్ణువు మొదలగు దేవతలతో, మునులతో అందరితో నిశ్శంకగా, నిశ్చయంగా ఇలా పలికింది.

**సత్యువాచ –** సతీదేవి పలికింది.

**తాత త్వం నిందకశ్శంభోః పశ్చాత్తాపం గమిష్యసి ।**
**ఇహ భుక్త్వా మహాదుఃఖమంతే యాస్యసి యాతనామ్ ॥44॥**

తండ్రీ! నువ్వు శంభుని నిందించావు, తరువాత పశ్చాత్తాపాన్ని పొందుతావు. ఇహలోకంలో మహాదుఃఖాన్ని అనుభవించి, మరణానంతరం నరకయాతనలను పొందుతావు.

**యస్యలోకేఽ ప్రియో నాస్తి ప్రియశ్చైవ పరాత్మనః ।**
**తస్మిన్నవైరే శర్వేఽ స్మిన్ త్వాం వినా కః ప్రతీపకః ॥45॥**

ఏ పరమాత్మకు ద్వేష్యుడైన ప్రాణిగాని, ప్రియమైన ప్రాణిగాని లేడో అట్టి అజాతశత్రువగు శంకరునిపై నీవు తక్క మరెవ్వరు కక్షకట్టగలరు?

**మహద్వినిందా నాశ్చర్యం సర్వదాఽసత్సు సేర్ష్యకమ్ ।**
**మహదంఘ్రి రజో ధ్వస్త తమస్సు నైవ శోభనా ॥46॥**

దుర్మార్గులు ఈర్ష్యతో సర్వదా మహాత్ములను నిందించడం ఆశ్చర్యకరం కాదు. కానీ మహాత్ముల పాదధూళిచే తమోగుణం నశింపజేయబడిన వారికి మహాత్ములను నిందించడం శోభావహం కాదు.

**శివేతి ద్వ్యక్షరం యస్య నృణాం నామ గిరేరితమ్ ।**
**సకృత్ప్రసంగాత్సకల మఘమాశు విహంతి తత్ ॥47॥**

మానవులు ఒక్కసారి ప్రసంగవశంగానైనా 'శివ' అనే రెండక్షరాలను ఉచ్చరిస్తే వారి పాపాలన్నీ వెనువెంటనే నశిస్తాయి.

**పవిత్ర కీర్తితమలం భవాన్ ద్వేష్టి శివేతరః ।**
**అలంఘ్య శాసనం శంభుమహో సర్వేశ్వరం ఖలః ॥48॥**

దుష్టుడవైన నువ్వు పవిత్రమగు కీర్తిగలిగి, ఉల్లంఘింప శక్యంకాని శాసనం కల, సర్వేశ్వరుని శంభుని ద్వేషించడం ఆశ్చర్యకరం.

**యత్పాదపద్మం మహతాం మనోఽలిసునిషేవితమ్ ।**
**సర్వార్థదం బ్రహ్మరసైః సర్వార్థిభిరథాదరాత్ ॥49॥**

మహాత్ములు తమ మనస్సులనే తుమ్మెదలతో ఆయన పాదా లనే పద్మాలను చక్కగా సేవిస్తారు. ఆయన పాదాలు భక్తుల కోర్కెలన్నిటిని నెరవేరుస్తాయి. బ్రహ్మానందాన్ని కోరే ముముక్షువులు ఆయన పాదాలను ఆనందంతో సేవిస్తారు.

**యద్వర్షత్యర్థిన శ్శీఘ్రం లోకస్య శివ ఆదరాత్ ।**
**భవాన్ ద్రుహ్యతి మూర్ఖత్వాత్తస్మై చాశేష బంధవే ॥50॥**

శివుడు అర్థిజనులకు వరాలను ప్రేమతో వర్షిస్తాడు. సర్వప్రాణులకు హితుడైన శివునిపై మూర్ఖత్వంతో నువ్వు ద్వేషాన్ని వహించావు.

**కిం వా శివాఖ్యమశివం త్వదన్యే న విదుర్బుధాః ।**
**బ్రహ్మాదయస్తం మునయస్సనకాద్యాస్తథాపరే ॥51॥**

ఏమిటి? శివుడు అమంగళ వేషధారియా? బ్రహ్మాది దేవతలు, మునులు, సనకాది సిద్ధులు, ఇతరులైన విద్వాంసులు శివుని ఆవిధంగా తలంచుటలేదు కదా? నీవు మాత్రమే ఆవిధంగా అనుకొంటున్నావు.

**అవకీర్య జటా భూతై శ్శ్మశానే స కపాల ధృక్ ।**
**తన్మాల్య భస్మ వా జ్ఞాత్వా ప్రీత్యా వసదుదారధీః ॥52॥**

విశాల హృదయుడైన శివుడు జటలను విరబోసుకొని, భూతాలతో కూడి, శ్మశానంలో కపాలధారియై, కపాలమాలను, భస్మాన్ని ధరించి, ప్రీతితో నివసిస్తున్నాడు.

**యే మూర్ధభిర్దధతి తచ్చరణోత్సృష్ట మాదరాత్ ।**
**నిర్మాల్యం మునయో దేవాస్సశివః పరమేశ్వరః ॥53॥**

ఈ సత్యాన్ని ఎరిగిన మునులు, దేవతలు, ఆయన పాదధూళిని నిర్మాల్యంగా స్వీకరించి, ఆదరంతో శిరస్సుపై ధరిస్తున్నారు. ఆశివుడే పరమేశ్వరుడు. పరబ్రహ్మ.

**ప్రవృత్తం చ నివృత్తం చ ద్వివిధం కర్మ చోదితమ్ ।**
**వేదే వివిచ్య వృత్తం చ తద్విచార్య మనీషిభిః ॥54॥**

వేదాలలో ప్రవృత్తి, నివృత్తి అనే రెండు విధాల కర్మ విధింపబడింది. విద్వాంసులు వాటిమధ్యగల భేదాన్ని విచారించి, నిరూపించారు.

**విరోధి యౌగపద్యైక కర్తృకే చ తథా ద్వయమ్ ।**
**పరబ్రహ్మణి శంభౌ తు కర్మర్ఛంతి న కించన ॥55॥**

ఈ రెండును పరస్పర విరుద్ధమైనవి గాన ఒకేవ్యక్తి ఒకేకాలంలో రెండింటిని అనుష్ఠింపజాలదు. పరబ్రహ్మయగు శంభునియందు ఈ ద్వివిధ కర్మల సంబంధం లేదు.

**మా వః పదవ్యస్మ పితర్యా అస్మదాస్థితా స్సదా ।**
**యజ్ఞశాలాసు వో ధూమ్ర వర్త్మ భుక్తోజ్ఝితాః పరమ్ ॥56॥**

ఓ తండ్రీ! ఆయనను మీరు పొందలేరు. మీరు యజ్ఞశాలలో కామ్యకర్మల ననుష్ఠించి, ధూమ్రమార్గాన్ని పొందుతారు. మావంటి ఆత్మజ్ఞానపరులు మాత్రమే కర్మఫలాలను త్యజించి, పరమాత్మను భజిస్తారు.

**నోఽవ్యక్త లింగ స్సతత మవధూత సుసేవితః ।**
**అభిమానమతో న త్వం కురు తాత కుబుద్ధి ధృక్ ॥57॥**

ఆయన లక్షణం ఇంద్రియగోచరం కాదు. అవధూతలు ఆయనను చక్కగా సేవిస్తారు. కావున ఓ తండ్రీ! నువ్వు దుర్బుద్ధితో చూచి, అహంకారాన్ని పొందకు.

**కిం బహూక్తేన వచసా దుష్టస్త్వం సర్వథా కుధీః ।**
**త్వదుద్భవేన దేహేన న మే కించిత్ప్రయోజనమ్ ॥58॥**

ఇన్నిమాటలెందుకు? నీవు దుష్టుడవు. నీబుద్ధి అన్నివిధాలా భ్రష్టమయ్యింది. నీనుండి జన్మించిన ఈ దేహంతో నాకు ఏవిధమైన ప్రయోజనమూ లేదు.

**తజ్జన్మ ధిగ్యో మహతాం సర్వథావద్య కృత్ఖలః ।**
**పరిత్యాజ్యో విశేషేణ తత్సంబంధో విపశ్చితా ॥59॥**

మహాత్ములను పరిపరి విధాల నిందించే దుష్టునిజన్మ నిందార్హం. విద్వాంసుడు అట్టివానితో సంబంధాన్ని ప్రయత్నపూర్వకంగా నైనా వీడాలి.

**గోత్రం త్వదీయం భగవాన్ యదాహ వృషభధ్వజః ।**
**దాక్షాయణీతి సహసాహం భవామి సుదుర్మనాః ॥60॥**

భగవంతుడైన వృషభధ్వజుడు నేను నీ కుమార్తెను గాన నన్ను దాక్షాయణి అని పిలుస్తాడు. అట్టి సందర్భాలలో నా మనస్సు వెనువెంటనే మిక్కిలి క్లేశాన్ని పొందుతుంది.

**తస్మాత్త్వదంగజం దేహం కుణపం గర్హితం సదా ।**
**వ్యుత్సృజ్య నూన మధునా భవిష్యామి సుఖావహా ॥61॥**

కాబట్టి నీశరీరంనుండి ఉద్భవించిన ఈ దేహం శవంవలె మిక్కిలి అశుచి అయినది, నిందితమైనది. కావున నేనిప్పుడు ఈదేహాన్ని నిశ్చయంగా వీడి, సుఖాన్ని పొందగలను.

**హే సురా మునయస్సర్వే యూయం శృణుత మద్వచః ।**
**సర్వథానుచితం కర్మ యుష్మాకం దుష్టచేతసామ్ ॥62॥**

ఓ దేవతలారా! మునులారా! మీరందరు నామాటను వినండి. దుష్టబుద్ధిగల మీరందరు సర్వథా అనుచితమైన పనిని చేస్తున్నారు.

**సర్వే యూయం విమూఢా హి శివనిందాః కలిప్రియాః ।**
**ప్రాప్స్యంతి దండం నియతమఖిలం చ హరాద్ ధ్రువమ్ ॥63॥**

శివుని నిందించి, కలిని ప్రేమించే మీరందరు మిక్కిలి మూఢులు. మీకందరకు సంపూర్ణమైన దండన హరునినుండి కర్మఫలరూపంగా నిశ్చితంగా లభిస్తుంది. దీనిలో సందేహంలేదు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**దక్షముక్త్వాధ్వరే తాంశ్చ వ్యరమత్సా సతీ తదా ।**
**అనూద్య చేతసా శంభు మస్మర త్ప్రాణవల్లభమ్ ॥64॥**

అప్పుడా సతీదేవి యజ్ఞశాలయందు దక్షుని, ఇతరులను ఉద్దేశించి ఈవిధంగా పలికి విరమించింది. ఆమె ప్రాణప్రియుడైన శంభుని మనసులో స్మరించింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే సతీవాక్య వర్ణనం నామైకోనత్రింశోऽధ్యాయః ॥29॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో సతీదేవివాక్యవర్ణనం అనే ఇరవై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## త్రింశోఽధ్యాయః - ముప్పైయవ అధ్యాయం
## సతీదేహత్యాగః - సతీదేవితనువుచాలించుట

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**మౌనీ భూతా యదా సాసీత్సతీ శంకరవల్లభా ।**
**చరిత్రం కిమభూత్తత్ర విధే తద్వద చాదరాత్ ॥1॥**

శంకరపత్నియైన సతీదేవి మౌనం వహించిన పిదప అచ్చట జరిగిన వృత్తాంతమేమిటి? బ్రహ్మా! దానినంతటిని ఆదరంతో నాకు చెప్పండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**మౌనీభూతా సతీదేవీ స్మృత్వా స్వపతి మాదరాత్ ।**
**క్షితావుదీచ్యాం సహసా నిషసాద ప్రశాంత ధీః ॥2॥**

నారదా! సతీదేవి మౌనాన్ని వహించి, ప్రశాంతమైన మనసు కలదై తన భర్తను ఆదరంతో స్మరించి, వెంటనే ఉత్తర దిక్కునందు నేలపై కూర్చున్నది.

**జలమాచమ్య విధివత్ సంవృతా వాససా శుచిః ।**
**దృక్ నిమీల్య పతిం స్మృత్వా యోగమార్గం సమావిశత్ ॥3॥**

ఆమె యథావిధిగా జలంతో ఆచమనం చేసి, వస్త్రంతో కప్పుకొని, శుచియై, కన్నులను మూసుకొని, భర్తను స్మరించి, యోగమార్గంలో ప్రవేశించింది.

**కృత్వా సమానావనిలౌ ప్రాణాపానౌ సితాననా ।**
**ఉత్థాప్యోదాన మథ చ యత్నాత్సా నాభిచక్రతః ॥4॥**

స్వచ్ఛమైన తెల్లని ముఖంగల సతి ప్రాణాపానాలను వాయువులను సమానాలుగా చేసి, తరువాత ఉదానాన్ని నాభిచక్రంనుండి ప్రయత్నపూర్వకంగా ఉత్థాపన చేసింది.

**హృది స్థాప్యోరసి ధియా స్థితం కంఠాద్ భ్రువోస్సతీ ।**
**అనిందితానయన్మధ్యం శంకర ప్రాణవల్లభా ॥5॥**

శంకరుని ప్రాణవల్లభయూ, దోషరహితయూ అగు సతీదేవి ఉదానాన్ని బుద్ధితోసహా హృదయమనందు వక్షఃస్థలంపై ఉంచి, తరువాత కంఠమార్గంద్వారా కనుబొమ్మల మధ్యలోనికి తీసుకొని వెళ్ళింది.

**ఏవం స్వదేహం సహసా దక్షకోపాజ్జిహాసతీ ।**
**దగ్ధే గాత్రే వాయు శుచిర్ధారణం యోగమార్గతః ॥6॥**

ఆమె ఈతీరులో దక్షునియందలి కోపం వలన తన దేహాన్ని త్యజింప కోరికతో వెంటనే యోగమార్గాన్ని అనుసరించి, శరీరందగ్ధం అయిపోగా యోగబలంతో వాయురూపంలో సూక్ష్మశరీరాన్ని ధరించింది..

**తత స్స్వ భర్తుశ్చరణం చింతయంతీ న చాపరమ్ ।**
**అపశ్యత్సా సతీ తత్ర యోగమార్గ నివిష్టధీః ॥7॥**

అంతటా యోగమార్గమందు లగ్నమైన మనస్సుగల సతీదేవి తన భర్తయొక్క పాదాలను మాత్రమే ధ్యానిస్తూ ఇతరాన్నీ దేనినీ చూడలేదు.

**హత కల్మష తద్దేహః ప్రాప తచ్చ తదగ్నినా ।**
**భస్మసాదభవత్సద్యో మునిశ్రేష్ఠ తదిచ్ఛయా ॥8॥**

ఓ నారద మహర్షీ! కల్మషాలు తొలగిపోయిన ఆమె దేహం వెంటనే ఆమె కోరికకనుగుణంగా ఆ అగ్నిచే భస్మంగా చేయబడినది.

**తత్పశ్యతాం చ ఖే భూమౌ వాదోభూత్సుమహాంస్తదా ।**
**హాహేతి సోద్భుత శ్చిత్ర స్సురాదీనాం భయావహః ॥9॥**

భూమియందునూ, ఆకాశమందునూ గల దేవతలు మున్నగువారందరు ఆ దృశ్యాన్ని చూచి, భయాన్ని కలిగించే పెద్దపెద్ద హాహాకారాలు చేశారు. ఆ దృశ్యం అద్భుతంగాను, చిత్రంగాను ఉంది.

**హంత ప్రియా పరా శంభోర్దేవీ దైవత మస్య హి ।**
**అహాదసూన్ సతీ కేన సుదుష్టేన ప్రకోపితా ॥10॥**

అయ్యో! శంభునకు సతీదేవి మిక్కిలి ప్రియురాలు. ఆయన ఆమెను దైవం వలె ప్రేమించాడు. ఆమె దుష్టుడైన దక్షునిచే మిక్కిలిగా అవమానింపబడి, ఆకోపంతో ప్రాణాలను వీడింది.

**అహో త్వ నాత్మ్యం సుమహదస్య దక్షస్య పశ్యత ।**
**చరాచరం ప్రజా యస్య యత్పుత్రస్య ప్రజాపతేః ॥11॥**

అహో! చరాచర ప్రపంచం సంతానమీయనకు, బ్రహ్మగారి కుమారుడీయన. ఈ దక్షుని అతిశయ దుష్టత్వాన్ని పరికించండి.

**అహో ద్య విమనాఒభూత్సా సతీదేవీ మనస్వినీ ।**
**వృషధ్వజప్రియాఒభీక్ష్ణం మానయోగ్యా సతాం సదా ॥12॥**

అహో! మానవతీ, వృషధ్వజునకు ప్రియురాలూ, సత్పురుషులకు సర్వదా సమ్మాన యోగ్యురాలూ అయిన సతీదేవి ఈనాడు మిక్కిలి మానసిక దుఃఖానికి గురిఅయ్యింది.

**సోయం దుర్మర్ష హృదయో బ్రహ్మ ధ్రుక్ స ప్రజాపతిః ।**
**మహతీ మపకీర్తిం హి ప్రాప్స్యతి త్వఖిలే భవే ॥13॥**

దుష్ట హృదయుడు, పరబ్రహ్మ ద్వేషి అయిన దక్షప్రజాపతి సమస్త లోకాలలో పెద్ద అపకీర్తిని పొందుతాడు.

**య త్స్వాంగజాం సుతాం శంభుద్విట్ న్యషేధత్సముద్యతామ్ ।**
**మహా నరకభోగీ స మృతయే నోఽ పరాధతః ॥14॥**

శంభుని ద్వేషించు ఆ దక్షుడు తన దేహంనుండి పుట్టిన కుమార్తె ప్రాణత్యాగమునకు సిద్ధమైననూ వారించలేదు. కావున అతడు మహానరకాన్ని అనుభవిస్తాడు. దీనిలో మన అపరాధంకూడ కలదు.

**వదత్యేవం జనే సత్యా దృష్ట్వాఽ సుత్యాగ మద్భుతమ్ ।**
**ద్రుతం త త్పార్షదాః క్రోధాదుదతిష్ఠన్నుదాయుధాః ॥15॥**

సతీదేవి ప్రాణాలను వీడుట అనే అద్భుత దృశ్యాన్ని చూచిన జనులు ఇలా పలుకుతుండగా వెనువెంటనే శివగణాలు క్రోధంతో ఆయుధాలను పైకెత్తి, లేచి నిలబడ్డాయి.

**ద్వారి స్థితా గణాస్సర్వే రసాయుతమితా రుషా ।**
**శంకరస్య ప్రభోస్తే వాఽ కృధ్యన్నతి మహాబలాః ॥16॥**

ద్వారంలో అరవైవేల గణాలు నిలబడియున్నాయి. శంకరుని సేవకులైనవారు, మహాబలశాలురు క్రోధంతో మండిపడ్డారు.

**హాహాకార మకుర్వంస్తే ధిక్‌ధిక్ న ఇతి వాదినః ।**
**ఉచ్చైస్సర్వేఽ సకృద్వీరా శ్శంకరస్య గణాధిపాః ॥17॥**

'ఇది ధిక్కరించవలసిన విషయం' అని గట్టిగా పలుకుతూ శివగణంలోని వీరులైన గణాధ్యక్షు లందరు పదేపదే ఎలుగెత్తి హాహాకారాలు చేయసాగారు.

**హాహా కారేణ మహతా వ్యాప్త మాసీ ద్దిగంతరమ్ ।**
**సర్వే ప్రాపన్ భయం దేవా మునయోఽ న్యేఽ పి తే స్థితాః ॥18॥**

ఆ పెద్దపెద్ద హాహాకారాలతో దిక్కులన్నీ పిక్కటిల్లాయి. అచ్చటనున్న దేవతలు, మునులు ఇతరులందరు భయాన్ని పొందారు.

**గణాస్సంమంత్ర్య తే సర్వేఽ భూవన్ క్రుద్ధా ఉదాయుధాః ।**
**కుర్వన్తః ప్రళయం వాద్యశస్త్రైః వ్యాప్తం దిగంతరమ్ ॥19॥**

ఆగణాలన్నీ కోపించి, ఆయుధాలను పైకెత్తి, పరస్పరం సంప్రదించుకొని, ప్రళయాన్ని సృష్టింప నారంభించారు. వారుచేసే వాద్యధ్వనులతోనే కాక, వారి శస్త్రాలచే కూడ దిక్కులన్నీ నిండిపోయాయి.

**శస్త్రై రఘ్నన్నిజాంగాని కేచిత్తత్ర శుచాకులాః ।**
**శిరో ముఖాని దేవర్షే సుతీక్ష్ణైః ప్రాణనాశిభిః ॥20॥**

ఓ దేవర్షీ! అచ్చట కొందరు గణాలు దుఃఖంచే వ్యాకులపడి, ప్రాణాలనుతీసే మిక్కిలి పదునైన ఆయుధాలతో తమ శిరస్సులను, ముఖాలను, ఇతర అవయవాలను, ఖండించుకున్నారు.

**ఇత్థం తే విలయం ప్రాప్తా దాక్షాయణ్యా సమం తదా ।**
**గణాయుతే ద్వే చ తదా తదద్భుత మివాభవత్ ॥21॥**

ఈవిధంగా ఆ సమయంలో ఇరువదివేల గణాలు దక్షపుత్రికతోబాటు ప్రాణాలను వదిలారు. ఈ దృశ్యం అత్యాశ్చర్యాన్ని కలిగించింది.

**గణా నాశాఽవశిష్టా యే శంకరస్య మహాత్మనః ।**
**దక్షం తం క్రోధితం హంతుం ముదా తిష్ఠన్నుదాయుధాః ॥22॥**

ఇట్లు నశించగా మిగిలిన శంకరుని గణాలు ఆయుధాలను పైకెత్తి, కోపంతో నున్న దక్షుని సంహరించడానికి ముందుకురికాయి.

**తేషామాపతతాం వేగం నిశమ్య భగవాన్ భృగుః ।**
**యజ్ఞఘ్నఘ్నేన యజుషా దక్షిణాగ్నౌ జుహోన్మునే ॥23॥**

ఓ మహర్షీ! ఉరుకుతున్న వారి వేగాన్ని విని, భృగుమహర్షి యజ్ఞ నాశకులగు రాక్షసులను సంహరించే "అపహతా,అసురాః రక్షాంసి వేదిషదః" అనే యజుర్వేద మంత్రంతో దక్షిణాగ్నియందు హోమం చేశాడు.

**హూయమానే చ భృగుణా సముత్పేతుర్మహాసురాః ।**
**ఋభవో నామ ప్రబలవీరాస్తత్ర సహస్రశః ॥24॥**

భృగువు హోమం చేసిన వెంటనే మహావీరులు, ఋభునామం గలవారు నగు గొప్ప దేవతలు ఆ అగ్నినుండి వేలాదిగా లేచారు.

**తైరలాతాయుధైస్తత్ర ప్రమథానాం మునీశ్వర ।**
**అభూద్యుద్ధం సువికటం శృణ్వతాం రోమహర్షణమ్ ॥25॥**

ఓ మహర్షీ! ప్రమథగణాలకు, కాగడాలను ఆయుధాలుగా ధరించిన ఆ దేవతలకుమధ్య మిక్కిలి బీభత్సమై, వినేవారికి రోమహర్షణాన్ని కలిగించేదియునైన పెద్ద యుద్ధం జరిగింది.

**ఋభుభిస్తై ర్మహావీరై ర్హన్యమానాస్సమన్తతః ।**
**అయత్నయానాః ప్రమథా ఉశద్భిర్బ్రహ్మతేజసా ॥26॥**

బ్రహ్మతేజంతో కూడియున్న మహావీరులైన ఆ ఋభువులు అన్నిదిక్కులనుండి, ప్రమథగణాలపై దాడిచేయగా వారి తిరుగు ప్రయాణం వారి ప్రయత్నం లేకుండగనే సిద్ధించింది. (అంటే ఋభులు వీరిని పారద్రోలారని భావం.)

**ఏవం శివగణాస్తే వై హతా విద్రావితా ద్రుతమ్ ।**

ఈ విధంగా శివశక్తియుతమైన శివగణాలను ఋభువులు కొట్టి, వేగంగా తరిమివేశారు.

**శివేచ్ఛయా మహాశక్త్యా తదద్భుత మివాభవత్ ॥27॥**

**తద్దృష్ట్వా ఋషయో దేవా శ్శక్రాద్యా స్సమరుద్గణాః ।**
**విశ్వేశ్వినౌ లోకపాలా స్తూష్ణీం భూతాస్తదాభవన్ ॥28॥**

అప్పుడా దృశ్యాన్ని చూచి కూడా, మహాశక్తి కల శివ సంకల్పంచేత ఋషులు, ఇంద్రాది దేవతలు, మరుద్గణాలు, విశ్వేదేవతలు, అశ్వినీ దేవతలు, లోకపాలురు మిన్నకున్నారు.

**కేచిద్విష్ణుం ప్రభుం తత్ర ప్రార్థయన్త స్సమన్తతః ।**
**ఉద్విగ్నా మన్త్రయన్తశ్చ విఘ్నాభావం ముహుర్ముహుః ॥29॥**

వారిలో కొందరు విష్ణుని చుట్టూచేరి ప్రార్థిస్తున్నారు. మరికొందరు యజ్ఞం విఘ్నం లేకుండగా జరిగే విధానాన్ని ఉద్వేగంతో మళ్ళీమళ్ళీ సమాలోచన చేస్తున్నారు..

**సువిచార్యోదర్కఫలం మహోద్విగ్నా స్సుబుద్ధయః ।**
**సుర విష్ణ్వాదయో భూవంస్తన్నాశా ద్ద్రావణాన్ముహుః ॥30॥**

గొప్పబుద్ధిశాలురైన విష్ణ్వాది దేవతలు సతీ దేహత్యాగం వలనను, శివగణాలను తరిమివేయడం వలనను, భవిష్యత్తులో కలుగబోయే ఫలాలను గూర్చి బాగుగా విచారించి, తీవ్రమైన ఆందోళనను పొందారు.

**ఏవం భూతస్తదా యజ్ఞో విఘ్నో జాతో దురాత్మనః ।**
**బ్రహ్మ బంధోశ్చ దక్షస్య శంకర ద్రోహిణో మునే ॥31॥**

ఓమహర్షీ! దుష్ట బ్రాహ్మణుడును, శివద్రోహియు, దుర్మార్గుడునగు దక్షుని యజ్ఞంలో అప్పుడీ విధమైన విఘ్నం వాటిల్లింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం ద్వితీయే సతీఖండే సత్యుపాఖ్యానే సతీదేహ త్యాగం వర్ణనం నామ త్రింశో஽ధ్యాయః ॥30॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో సత్యుపాఖ్యానంలో సతీదేవి తనువుచాలించుట అనే ముప్పైయవ అధ్యాయం సమాప్తం.

## ఏకత్రింశోఽధ్యాయః - ముప్పై ఒకటవ అధ్యాయం

## నభోవాణీవచనమ్ - ఆకాశవాణిమాటలు

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏతస్మిన్నంతరే తత్ర నభోవాణీ మునీశ్వర ।**
**అవోచచ్ఛృణ్వతాం దక్ష సురాదీనాం యథార్థతః ॥1॥**

ఓ మహర్షీ! ఇంతలో అక్కడ దక్షుడు, దేవతలు మున్నగువారందరు వినుచుండగా ఆకాశవాణి యథార్థాన్ని ఇలా పలికింది.

**వ్యోమవాణ్యువాచ** - ఆకాశవాణి పలికింది.

**రేరే దక్ష దురాచార దంభాచార పరాయణ ।**
**కిం కృతం తే మహామూఢ కర్మచానర్థకారకమ్ ॥2॥**

ఓరీ! దక్షా! దురాచారా! దంభాచార పరాయణా! మహా మూఢా! అనర్థకారకమైన ఈపనినెందుకు చేశావు?

**న కృతం శైవరాజస్య దధీచేర్వచనస్య హి ।**
**ప్రమాణం తత్కృతే మూఢ సర్వానందకరం శుభమ్ ॥3॥**

ఓరీ మూఢా! శైవ శిఖామణియైన దధీచుని మాటను ప్రమాణంగా స్వీకరించలేకపోయావు. ఆయన మాటను పాటిస్తే అందరికి ఆనందం, శుభం కలిగియుండేవి.

**నిర్గతస్తే మఖాద్విప్రః శాపం దత్త్వా సుదుస్సహమ్ ।**
**తతోఽపి బుద్ధం కించిన్నో త్వయా మూఢేన చేతసి ॥4॥**

ఆ బ్రాహ్మణుడు దుస్సహమైన శాపమిచ్చి నీ యజ్ఞంనుండి నిష్క్రమించాడు. కాని, మూఢుడవైన నీకు అప్పుడుకూడా బుద్ధి రాలేదు.

**తతః కృతః కథం నౌ వై స్వపుత్ర్యాస్త్వాదరః పరః ।**
**సమాగతాయా స్సత్యాశ్చ మంగళాయా గృహం స్వతః ॥5॥**

నీ కుమార్తె, మంగళ స్వరూపురాలునైన సతీదేవి స్వయంగా నీ గృహానికి రాగా ఆమెను గొప్పగా ఆదరించాలి. కాని నీవు అలాచేయకపోడానికి కారణమేమిటి?

**సతీ భవౌ నార్చితౌ హి కిమిదం జ్ఞాన దుర్బల ।**
**బ్రహ్మపుత్ర ఇతి వృథా గర్వితోఽసి విమోహితః ॥6॥**

ఓరీ జ్ఞానదుర్బలా! నీవు సతీ శివులను అర్చించలేదు. కారణమేమిటి? బ్రహ్మ పుత్రుడననే గర్వంతో మోహితుడవయ్యావు. నీ గర్వం వ్యర్థం.

**సా సత్యేవ సదారాధ్యా సర్వాపాపఫలప్రదా ।**
**త్రిలోకమాతా కల్యాణీ శంకరార్ధాంగభాగినీ ॥7॥**

ఆ సతీదేవిని నిత్యం ఆరాధించాలి. ఆమె పుణ్యఫలాల నన్నింటిని ఇస్తుంది. ఆమె త్రిలోకమాత, కల్యాణ స్వరూపురాలు. శంకరుని అర్ధశరీరాన్ని పొందింది.

**సా సత్యేవార్చితా నిత్యం సర్వ సౌభాగ్య దాయినీ ।**
**మాహేశ్వరీ స్వభక్తానాం సర్వమంగళదాయినీ ॥8॥**

ఆ సతిని నిత్యము ఆరాధించాలి. ఆ మాహేశ్వరి తన భక్తులకు సమస్త సౌభాగ్యాలనూ, సర్వ మంగళాలనూ, ఇస్తుంది.

**సా సత్యేవార్చితా నిత్యం సంసార భయనాశినీ ।**
**మనోభీష్టప్రదా దేవీ సర్వోపద్రవహారిణీ ॥9॥**

ఆ సతీదేవిని నిత్యం అర్చించేవారికి సంసారభయం నాశనమౌతుంది. మనస్సులోని కోర్కెల నన్నిటిని ఈడేర్చి, ఆదేవి సమస్త విపత్తులను తొలగిస్తుంది.

**సా సత్యేవార్చితా నిత్యం కీర్తిసంపత్ప్రదాయినీ ।**
**పరమా పరమేశానీ భుక్తిముక్తిప్రదాయినీ ॥10॥**

ఆ సతీదేవిని నిత్యం ఆరాధించేవారికి ఆమె కీర్తిని, సంపత్తులను, భుక్తిని, ముక్తిని ప్రదానం చేస్తుంది. శంకరుని అర్ధాంగియగు ఆమె పరతత్త్వమైన బ్రహ్మ స్వరూపిణి.

**సా సత్యేవ జగద్ధాత్రీ జగద్రక్షణకారిణీ ।**
**అనాది శక్తిః కల్పాంతే జగత్సంహారకారిణీ ॥11॥**

ఆ సతీదేవియే జగద్ధాత్రి. జగత్తునంతటిని రక్షించేది ఆమెయే. అనాదిశక్తియైన ఆమెయే కల్పాంతంలో జగత్తునుసంహరిస్తుంది.

**సా సత్యేవ జగన్మాతా విష్ణుమాతా విలాసినీ ।**
**బ్రహ్మేంద్ర చంద్ర వహ్న్యర్క దేవాది జననీ స్మృతా ॥12॥**

ఆ సతీదేవియే జగన్మాత. ఆ జగదేక సుందరి విష్ణు, బ్రహ్మ, ఇంద్ర, చంద్ర, అగ్ని, సూర్యాది దేవతలకందరికిని తల్లియని మహర్షులు చెబుతున్నారు.

**సా సత్యేవ తపో ధర్మ దానాది ఫలదాయినీ ।**
**శంభుశక్తిర్మహాదేవీ దుష్టహంత్రీ పరాత్పరా ॥13॥**

శంభుని శక్తి, మహాదేవి, దుష్టహంత్రి, పరాత్పర అయిన సతీదేవియే తపస్సు, ధర్మం, దానం మున్నగువాటి ఫలాలనిస్తుంది.

**ఈదృగ్విధా సతీదేవీ యస్య పత్నీ సదాప్రియా ।**
**తస్మై భాగో న దత్తస్తే మూఢేన కువిచారణా ॥14॥**

ఇట్టి సతీదేవి ఎవని పత్నియో, ఎవని నిత్యప్రియురాలో అట్టి శివునకు మూఢుడవూ, దుష్టబుద్ధివీ అయిన నువ్వు యజ్ఞంలో భాగాన్ని ఈయలేదు.

**శంభుర్హి పరమేశాన స్సర్వస్వామీ పరాత్పరః ।**
**విష్ణు బ్రహ్మాది సంసేవ్యః సర్వకల్యాణకారకః ॥15॥**

శంభుడే పరమేశ్వరుడు. సమస్త జగత్తులకు ప్రభువుకూడా శంభుడే. ఆయనే పరాత్పరుడు. విష్ణు బ్రహ్మాదులు ఆయనను సేవిస్తారు. ఆయన సర్వకల్యాణ కారకుడు.

**తప్యతే హి తపః సిద్ధై రేతద్దర్శనకాంక్షిభిః ।**
**యుజ్యతే యోగిభిర్యోగై రేతద్దర్శనకాంక్షిభిః ॥16॥**

ఈ శివుని దర్శించే కోరికతో సిద్ధులు తపస్సును చేస్తున్నారు. ఆ శివుని దర్శించే కోరికతోనే యోగులు యోగాన్ని అభ్యసిస్తున్నారు.

**అనంత ధనధాన్యానాం యాగాదీనాం తథైవ చ ।**
**దర్శనం శంకరస్యైవ మహత్ఫల ముదాహృతమ్ ॥17॥**

అనంత ధనధాన్యాలను పొందడం కంటెను, యజ్ఞాది పుణ్యకర్మల ఫలం కంటెను, శంకరుని దర్శన ఫలమే మహత్ఫలమని చెప్పబడింది.

**శివఏవ జగద్ధాతా సర్వవిద్యాపతిః ప్రభుః ।**
**ఆదివిద్యావరస్వామీ సర్వమంగళమంగళః ॥18॥**

శివుడే జగత్కారకుడు. సర్వ విద్యాపతియు ఆయనయే. ఆయనయే ప్రభుడు. వేదవిద్యకు శ్రేష్ఠమైన ప్రభువుకూడ ఆయనయే. సర్వమంగళాలలో మంగళుడుకూడ ఆయనయే.

**తచ్ఛక్తే ర్న కృతో యస్మా త్సత్కారోద్య త్వయా ఖల ।**
**అత ఏవాధ్వరస్యాస్య వినాశో హి భవిష్యతి ॥19॥**

దుష్టుడా! ఆయన శక్తికి నీవీనాడు సత్కారాన్ని చేయకున్నావు. ఆ కారణంగా నీయజ్ఞం వినాశాన్ని పొందుతుంది.

**అమంగళం భవత్యేవ పూజార్హాణా మపూజయా ।**
**పూజ్యమానా చ నాసౌ హి యతః పూజ్యతమా శివా ॥20॥**

పూజింపదగినవారిని పూజింపనిచో నిశ్చయంగా అమంగళం కలుగుతుంది. శివపత్ని అందరికంటె అధికంగా పూజార్హురాలు. కాని నేడామెకు పూజ జరుగలేదు.

**సహస్రేణాపి శిరసాం శేషో యత్పాదజం రజః ।**
**వహత్యహరహః ప్రీత్యా తస్య శక్తిః శివా సతీ ॥21॥**

ఆదిశేషుడు ఎవని పాదధూళిని నిత్యమూ వేయి పడగలతో, ప్రీతితో ధరిస్తున్నాడో అట్టి శివుని శక్తియే సతీదేవి.

**యత్పాదపద్మ మనిశం ధ్యాత్వా సంపూజ్య సాదరమ్ ।**
**విష్ణుః విష్ణుత్వ మాపన్నస్తస్య శంభోః ప్రియా సతీ ॥22॥**

ఎవని పాదపద్మాలను నిత్యమూ ధ్యానించి, ఆదరంతో పూజించి, విష్ణువు విష్ణుత్వాన్ని పొందాడో అట్టి శంభునకు ప్రియురాలే సతీదేవి.

**యత్పాదపద్మమనిశం ధ్యాత్వా సంపూజ్య సాదరమ్ ।**
**బ్రహ్మ బ్రహ్మత్వమాపన్నః తస్య శంభోః ప్రియా సతీ ॥23॥**

ఎవని పాదపద్మాలను నిత్యమూ ధ్యానించి, ఆదరంతో పూజించి, బ్రహ్మ సృష్టికర్తయైనాడో, అట్టి శంకరునకు ప్రియురాలే సతీదేవి.

**యత్పాదపద్మ మనిశం ధ్యాత్వా సంపూజ్య సాదరమ్ ।**
**ఇంద్రాదయో లోకపాలాః ప్రాపుస్స్వం స్వం పరం పదమ్ ॥24॥**

**జగత్పితా శివశక్తి ర్జగన్మాతా చ సా సతీ ।**
**సత్కృతౌ న త్వయా మూఢ కథం శ్రేయో భవిష్యతి ॥25॥**

ఎవని పాదపద్మాలను నిత్యమూ ధ్యానించి, ఆదరంతో పూజించి, ఇంద్రాది లోకపాలకులు తమ తమ గొప్ప పదవులను పొందినారో అట్టి శివుడు జగత్తునకు తండ్రి. శివశక్తియైన సతీదేవి జగన్మాత. ఓ మూఢా! నువ్వు వారినిరువురిని పూజించలేదు. నీకు శ్రేయస్సు ఎట్లు కలుగుతుంది?

**దౌర్భాగ్యం త్వయి సంక్రాంతం సంక్రాంతాస్త్వయి చాపదః ।**
**యౌ చానారాధితౌ భక్త్యా భవానీశంకరౌ చ తౌ ॥26॥**

నీయందు దౌర్భాగ్యం సంక్రమించింది. నీకు ఆపదలుకూడ సంక్రమించాయి. ఎందుకనగా నీవు భక్తితో ఆ భవానీశంకరులను ఆరాధించలేకపోతివి.

**అనభ్యర్చ్య శివం శంభుం కల్యాణం ప్రాప్నుయామితి ।**
**కిమస్తి గర్వో దుర్వారస్స గర్వోద్య వినశ్యతి ॥27॥**

మంగళకరుడైన శంభుని ఆరాధించకుండగనే నేను శుభాలను పొందగలననే గర్వం నీకు కలదు. ఈ గర్వం వారింప శక్యం కానిది కాదుగదా! ఆ గర్వమంతా ఈరోజు నశించగలదు.

**సర్వేశవిముఖో భూత్వా దేవేష్వేతేషు కస్తవ ।**
**కరిష్యతి సహాయం తం న తే పశ్యామి సర్వథా ॥28॥**

సర్వేశ్వరునకు విముఖుడవైన, నీకు సహాయం చేయగలవారు ఈ దేవతలలో ఎవరుగలరు? అట్టివాడు ఎంత వెదికినా నాకు కనబడుటలేదు.

**యది దేవాః కరిష్యంతి సాహాయ్య మధునా తవ ।**
**తదా నాశం సమాప్స్యంతి శలభా ఇవ వహ్నినా ॥29॥**

నీకిప్పుడు దేవతలు సాహాయ్యం చేస్తే వారు నిప్పుయందు పడిన మిడతలవలె నాశనమౌతారు.

**జ్వలత్వద్య ముఖం తే వై యజ్ఞధ్వంసో భవత్వతి ।**
**సహాయాస్తవ యావంతస్తే జ్వలంత్వద్య సత్వరమ్ ॥30॥**

ఈరోజు నీ ముఖము మండిపోవుగాక! నీయజ్ఞము నాశనమౌగాక! నీకెంతమంది సహాయం చేస్తారో వారందరు వెంటనే మాడి మసియౌదురుగాక!

**అమరాణాం చ సర్వేషాం శపథో మంగళాయ తే ।**
**కరిష్యంత్యద్య సాహాయ్యం యదేతస్య దురాత్మనః ॥31॥**

దురాత్ముడవైన నీకు ఈనాడు ఏదేవతలు సహాయం చేస్తారో వారందరికి అమంగళం కలగడం నిశ్చయం. ఇది నా శపథం.

**నిర్గచ్ఛంత్వ మరాస్స్వోక మేతదధ్వర మండపాత్ ।**
**అన్యథా భవతో నాశో భవిష్యత్యద్య సర్వథా ॥32॥**

ఓ దేవతలారా! మీరీ యజ్ఞ మండపం నుండి మీమీ గృహాలకు తిరిగి వెళ్ళండి. అట్లు కానిచో ఈనాడు మీ నాశం నిశ్చయం.

**నిర్గచ్ఛం త్వపరే సర్వే మునినాగాదయో మఖాత్ ।**
**అన్యథా భవతాం నాశో భవిష్యత్యద్య సర్వథా ॥33॥**

మునులు, నాగులు మున్నగు ఇతరులందరు ఈ యజ్ఞంనుండి బయటకు పొండి. లేకపోతే ఈనాడు మీ నాశనం నిశ్చయం.

**నిర్గచ్ఛ త్వం హరే శీఘ్రమేత దధ్వర మండపాత్ ।**
**అన్యథా భవతో నాశో భవిష్యత్యద్య సర్వథా ॥34॥**

ఓ హరీ! నీవు వెంటనే ఈ యజ్ఞమండపం నుండి బయటకు పొమ్ము! లేనిచో ఈనాడు నీవిచట నాశాన్ని పొందుట నిశ్చితం.

**నిర్గచ్ఛ త్వం విధే శీఘ్రమేత దధ్వర మండపాత్ ।**
**అన్యథా భవతో నాశో భవిషత్యద్య సర్వథా ॥35॥**

ఓ బ్రహ్మ! నీవు శీఘ్రంగా ఈ యజ్ఞమండపంనుండి నిష్క్రమించు. అట్లు కానిచో నీవీనాడు సర్వథా నాశనమగుట నిశ్చితం.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వాధ్వరశాలాయా మఖిలాయాం సుసంస్థితాన్ ।**
**వ్యరమత్సా నభో వాణీ సర్వకల్యాణకారిణీ ॥36॥**

సర్వులకు మంగళాలనిచ్చే ఆకాశవాణి యజ్ఞశాల అంతటా కూర్చొంది ఉన్నవారిని ఉద్దేశించి, ఇలా పలికి విరమించింది.

**తచ్ఛ్రుత్వా వ్యోమ వచనం సర్వే హర్యాదయస్సురాః ।**
**అకార్షుర్విస్మయం తాత మునయశ్చ తథాపరే ॥37॥**

ఓ కుమారా! ఆకాశవాణియొక్క ఆ ప్రసంగాన్ని విని, విష్ణువు మున్నగు దేవతలు, మునులు, ఇతరులందరు ఆశ్చర్యాన్ని పొందారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే సత్యుపాఖ్యానే నభోవాణీ వర్ణనం నామైక త్రింశోఽధ్యాయః ॥31॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో సత్యుపాఖ్యానంలో ఆకాశవాణీమాటలు అనే ముప్పై ఒకటవ అధ్యాయం సమాప్తం.

## **ద్వాత్రింశోఽధ్యాయః** - ముప్పై రెండవ అధ్యాయం

## **వీరభద్రావిర్భావః శివాదేశశ్చ** - వీరభద్రోత్పత్తి శివాదేశం

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**శ్రుత్వా వ్యోమగిరం దక్షః కిమకార్షీత్తదాఽబుధః ।**
**అన్యే చ కృతవంతః కిం తతశ్చ కిమభూద్వద ॥1॥**

మూర్ఖుడైన దక్షుడు ఆకాశవాణిని వినిన తరువాత ఏమిచేశాడు? ఇతరులేమిచేశారు? అపుడేమయ్యింది? నాకు తెలియజేయండి.

**పరాజితాః శివగణా భృగుమంత్రబలేన వై ।**
**కిమకార్షుః కుత్ర గతాస్తత్త్వం వద మహామతే ॥2॥**

మహామతీ! భృగుమహర్షి మంత్రబలంచే పరాజితులైన శివగణాలు ఏమిచేశాయి? ఎక్కడకు వెళ్ళాయి? ఆవిషయాన్ని నాకు చెప్పండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**శ్రుత్వా వ్యోమగిరం సర్వే విస్మితాశ్చ సురాదయః ।**
**నావోచత్కించిదపి తే తిష్ఠన్తస్తు విమోహితాః ॥3॥**

ఆకాశవాణిని వినిన దేవతలు, ఇతరులందరు ఆశ్చర్యచకితులై, ఏమీమాట్లాడక , ఏమిచేయాలో తెలియక, విమూఢులై నిలబడి ఉన్నారు.

**పలాయమానా యే వీరా భృగుమంత్రబలేన తే ।**
**అవశిష్టా శ్శివగణా శ్శివం శరణమాయయుః ॥4॥**

భృగువుయొక్క మంత్రబలంచే శివగణాల్లో కొందరు సంహరింపబడ్డారు. మిగిలిన వీరులు పారిపోయి, శివుని శరణు పొందారు.

**సర్వం నివేదయామాసూ రుద్రాయామితతేజసే ।**
**చరిత్రం చ తథాభూతం సుప్రణమ్యాదరాచ్చ తే ॥5॥**

అమిత తేజస్వి యైన రుద్రునకు వారు ఆదరంతో నమస్కరించి, జరిగిన వృత్తాంతమంతటిని యథాతథంగా నివేదించారు.

**గణా ఊచుః** - శివగణాలు పలికాయి.

**దేవదేవ మహాదేవ పాహి నశ్శరణాగతాన్ ।**
**సంశృణ్వాదరతో నాథ సతీ వార్తాం చ విస్తరాత్ ॥6॥**

దేవదేవా! మహాదేవా! శరణుపొందిన మమ్ములను రక్షించండి. ఓ స్వామీ! సతీదేవి వృత్తాంతమంతటిని సవిస్తరంగా మేము తెలియజేస్తాం. మీరు ఆదరంతో వినండి.

**గర్వితేన మహేశాన దక్షేణ సుదురాత్మనా ।**
**అవమానః కృతస్సత్యాఽనాదరో నిర్జరైస్తథా ॥7॥**

ఓ మహేశ్వరా! గర్విష్ఠి, పరమ దుష్టుడునైన దక్షుడు సతీదేవిని అనాదరణ చేసి, అవమానించాడు. దేవతలు కూడ అట్లే చేశారు.

**తుభ్యం భాగమదాన్నో స దేవేభ్యశ్చ ప్రదత్తవాన్ ।**
**దుర్వచాంస్యవదత్ప్రోచ్చై ర్దుష్టో దక్షస్సుగర్వితః ॥8॥**

అతడు యజ్ఞంలో నీకు భాగాన్ని ఈయలేదు. కాని దేవతలకిచ్చాడు. దుష్టుడైన ఆ దక్షుడు మిక్కిలి గర్వంతో బిగ్గరగా పలుకరాని మాటలను పలికాడు.

**తతో దృష్ట్వా న తే భాగం యజ్ఞేఽకుప్యత్సతీ ప్రభో ।**
**వినింద్య బహుశస్తాతమధాక్షీత్ స్వతనుం తదా ॥9॥**

ఓ ప్రభూ! మీకు యజ్ఞంలో భాగమీయకపోవడాన్ని చూచి సతీదేవి మిక్కిలి కోపించింది. అప్పుడామె తన తండ్రిని అనేక విధాల నిందించి తన దేహాన్ని అగ్నికి ఆహుతి చేసుకుంది.

**గణాస్త్వయుతసంఖ్యాకా మృతాస్తత్ర విలజ్జయా ।**
**స్వాంగాన్యాచ్ఛిద్య శస్త్రైశ్చ క్రుధ్యామ హ్యపరే వయమ్ ॥10॥**

**తద్యజ్ఞం ధ్వంసితుం వేగాత్సన్నద్ధాస్తు భయావహాః ।**
**తిరస్కృతా హి భృగుణా స్వప్రభావాద్విరోధినా ॥11॥**

పదివేలమంది గణాలు మిక్కిలి సిగ్గుపడినవారై తమ దేహాలను తమ ఆయుధాలతో ఖండించుకొని అక్కడే మరణించారు. మాలో కొందరం మిక్కిలి కోపించి, భయాన్ని కలిగిస్తూ వేగంగా ఆ యజ్ఞాన్ని ధ్వంసం చేయడానికి సిద్ధమయ్యాము. కాని, శత్రువగు భృగువు తన మంత్ర మహిమచే మమ్ములను తరిమివేశాడు.

**తే వయం శరణం ప్రాప్తా స్తవ విశ్వంభర ప్రభో ।**
**నిర్భయాన్ కురు నస్తస్మాద్దయమానభవాద్భయాత్ ॥12॥**

ఓ విశ్వంభరా! ప్రభూ! మేము మిమ్ము శరణు పొందాము. మాకు సంప్రాప్తమైన ఈ భయంనుండి మమ్ములను రక్షించి మా భయాన్ని తొలగించండి. మమ్ములను నిర్భయులను చేయండి.

**అపమానం విశేషేణ తస్మిన్ యజ్ఞే మహాప్రభో ।**
**దక్షాద్యాస్తేఽఖిలా దుష్టా అకుర్వన్ గర్వితా అతి ॥13॥**

మహా ప్రభూ! ఈ యజ్ఞంలో దుష్టులైన దక్షుడు మున్నగువారు విశేషమైన పెద్ద అవమానాన్ని చేశారు.

**ఇత్యుక్తం నిఖిలం వృత్తం స్వేషాం సత్యాశ్చ నారద ।**
**తేషాంచ మూఢబుద్ధీనాం యథేచ్ఛసి తథా కురు ॥14॥**

మాకు, సతీదేవికి జరిగిన వృత్తాంతాన్నంతటిని మీకు చెప్పినాము. ఆమూర్ఖుల విషయంలో మీరెట్లు చేయగోరెదరో అట్లే చేయుము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య స్వగణానాం వచః ప్రభుః ।**
**సస్మార నారదం సర్వం జ్ఞాతుం తచ్చరితం లఘు ॥15॥**

శివుడు తన గణాల మాటలను విని, వెంటనే ఆ వృత్తాంతాన్నంతటిని తెలుసుకొనడానికి నారదుని స్మరించాడు.

**ఆగతస్త్వం ద్రుతం తత్ర దేవర్షే దివ్యదర్శన ।**
**ప్రణమ్య శంకరం భక్త్యా సాంజలిస్తత్ర తస్థివాన్ ॥16॥**

ఓ దేవర్షీ! నీదర్శనం దివ్యమైనది. నీవు వెంటనే అక్కడకు వచ్చి, శంకరునకు భక్తితో అంజలి ఘటించి, నమస్కరించి, అక్కడ నిలబడ్డావు.

**త్వాం ప్రశస్యాథ స స్వామీ సత్యా వార్తాం చ పృష్టవాన్ ।**
**దక్షయజ్ఞగతాయా వై పరం చ చరితం తథా ॥17॥**

ఆప్రభువు అప్పుడు నిన్ను ప్రశంసించి, దక్షయజ్ఞానికి వెళ్ళిన సతీదేవి వార్తను తదితర వృత్తాంతాన్ని గూర్చి ప్రశ్నించాడు.

**పృష్టేన శంభునా తాత త్వయాశ్వేవ శివాత్మనా ।**
**తత్సర్వం కథితం వృత్తం జాతం దక్షాధ్వరే హి యత్ ॥18॥**

ఓకుమారా! శంభుడిట్లు ప్రశ్నించగానే ఆయనను మనస్సులో ధ్యానించే నీవు వెంటనే దక్షయజ్ఞంలో జరిగిన వృత్తాంతమంతటిని చెప్పి ఉన్నావుగదా!

**తదాకర్ణ్యేశ్వరో వాక్యం మునే తత్త్వన్ముఖోదితమ్ ।**
**చుకోపాతి ద్రుతం రుద్రో మహారౌద్ర పరాక్రమః ॥19॥**

నారద మహర్షీ! నీవు చెప్పిన వృత్తాంతాన్ని విని, మహారౌద్రపరాక్రముడైన సర్వేశ్వరుడు వెనువెంటనే మిక్కిలి క్రోధాన్ని పొందాడు.

**ఉత్పాట్యైకాం జటాం రుద్రో లోకసంహారకారకః ।**
**ఆస్ఫాలయామాస రుషా పర్వతస్య తదోపరి ॥20॥**

లోకసంహారకారకుడైన రుద్రుడు అపుడు తన జటనొకదానిని ఊడబెరికి, కోపంతో పర్వతంపై విసిరి కొట్టాడు.

**తోదనాచ్చ ద్విధా భూతా సా జటా చ మునే ప్రభోః ।**
**సంబభూవ మహారావో మహాప్రళయభీషణః ॥21॥**

ఓ మహర్షీ! ఆ ప్రభువు జటను విసిరి కొట్టడంచే అది రెండు ముక్కలై, మహాప్రళయంలో లాగా భయంకరమైన గొప్పధ్వని కలిగింది.

**తజ్జటాయా స్సముద్భూతో వీరభద్రో మహాబలః ।**
**పూర్వభాగేన దేవర్షే మహాభీమో గణాగ్రణీః ॥22॥**

ఓ దేవర్షీ! ఆ జటయొక్క పూర్వభాగంనుండి మహాబలుడూ, అతిభయంకరుడూ, గణాగ్రణీ ఐన వీరభద్రుడు జన్మించాడు.

**స భూమిం విశ్వతో వృత్వా త్యతిష్ఠ ద్దశాంగులమ్ ।**
**ప్రళయానలసంకాశః ప్రోన్నతో దోస్సహస్రవాన్ ॥23॥**

ప్రళయాగ్నివలె ప్రకాశించువాడునూ మిక్కిలి ఎత్తైనవాడునూ. వేయి భుజాలు కలవాడునూ అగు వీరభద్రుడు భూమినంతటిని పూర్తిగా చుట్టివేసి, ఆపైన పది అంగుళాల వరకు వ్యాపించియున్నాడు.

**కోపనిఃశ్వాసతస్తత్ర మహారుద్రస్య చేశితుః ।**
**జాతం జ్వరాణాం శతకం సంనిపాతా స్త్రయోదశ ॥24॥**

అంతట సర్వేశ్వరుడైన మహారుద్రుని కోపంతో కూడిన నిట్టూర్పులనుండి వంద జ్వరాలు, పదమూడు సన్నిపాత రోగాలు పుట్టాయి.

**మహాకాళీ సముత్పన్నా తజ్జటాపరభాగతః ।**
**మహాభయంకరా తాత భూతకోటిభిరావృతా ॥25॥**

తండ్రీ! శివుని జటయొక్క రెండవ భాగంనుండి మిక్కిలి భయంకరురాలగు మహాకాళి జన్మించింది. ఆమెను కోట్లాది భూతాలు చుట్టువారి ఉన్నాయి.

**సర్వే మూర్తిధరాః క్రూరాః సర్వలోక భయంకరాః ।**
**స్వతేజసా ప్రజ్వలంతో దహంత ఇవ సర్వతః ॥26॥**

మూర్తీభవించిన క్రౌర్యం వంటి ఆ జ్వరాలన్నీసకల లోకభయంకరాలై తమ తేజస్సుతో ప్రజ్వరిల్లుతూ, సర్వం దహిస్తున్నట్లున్నాయి.

**అథ వీరో వీరభద్రః ప్రణమ్య పరమేశ్వరమ్ ।**
**కృతాంజలిపుటః ప్రాహ వాక్యం వాక్యవిశారదః ॥27॥**

అంతట వీరుడు, వాక్యవిశారదుడునైన వీరభద్రుడు దోసిలియొగ్గి, పరమేశ్వరునకు ప్రణమిల్లి, ఇలా పలికాడు.

**వీరభద్ర ఉవాచ –** వీరభద్రుడు పలికాడు.

**మహారుద్ర! మహారౌద్ర! సోమసూర్యాగ్నిలోచన ।**
**కిం కర్తవ్యం మయా కార్యం శీఘ్ర మాజ్ఞాపయ ప్రభో ॥28॥**

మహారుద్రా! నీవతిభయంకరుడవు. సూర్యుడు, చంద్రుడు, అగ్ని ఈమూడు నీ నేత్రాలు. ఓప్రభూ! నేను చేయవలసిన పనిని వెంటనే ఆజ్ఞాపించు.

**శోషణీయాః కిమీశాన క్షణార్ధేనైవ సింధవః ।**
**పేషణీయాః కిమీశాన క్షణార్ధేనైవ పర్వతాః ॥29॥**

ఓ ఈశానా! అర్ధక్షణంలో సముద్రాలను ఎండింపజేయాలా? లేక ఓ ఈశ్వరా! అర్ధక్షణంలో పర్వతాలను నుగ్గుచేయాలా?

**క్షణేన భస్మసాత్కుర్యాం బ్రహ్మాండముత కిం హర ।**
**క్షణేన భస్మసాత్కుర్యాం సురాన్వా కిం మునీశ్వరాన్ ॥30॥**

హరా! క్షణకాలంలో బ్రహ్మాండాలను భస్మంచేయాలా ఏమి? లేదా క్షణకాలంలో దేవతలనుగాని, మునీశ్వరులనుగాని, భస్మంచేయాలా?

**వ్యాశ్వాసః సర్వలోకానాం కిముకార్యో హి శంకర ।**
**కర్తవ్య కిముతేశాన సర్వప్రాణివిహింసనమ్ ॥31॥**

హే శంకరా! సర్వలోకాలకు ఊపిరి లేకుండా చేయాలా? లేదా సర్వప్రాణులను సంహరించాలా? ఏమిచేయాలి?

**మమాశక్యం న కుత్రాపి త్వత్ప్రసాదాన్మహేశ్వర ।**
**పరాక్రమేణ మత్తుల్యో న భూతో న భవిష్యతి ॥32॥**

ఓ మహేశ్వరా! నీ అనుగ్రహంచే నేను చేయలేనిపని ఎచ్చటను లేదు. పరాక్రమంలో నాతో సమానమైనవాడు ఇంతవరకు పుట్టలేదు. భవిష్యత్తులో పుట్టబోడు.

**యత్ర యత్కార్య ముద్దిశ్య ప్రేషయిష్యతి మాం ప్రభో ।**
**తత్కార్యం సాధయామ్యేవ సత్వరం త్వత్ప్రసాదతః ॥33॥**

ప్రభూ! మీరు నన్ను ఎచ్చటికైనను, ఏ కార్యాన్ని ఉద్దేశించి ఐనను పంపవచ్చును. మీ అనుగ్రహంచే నేనాకార్యాన్ని సత్త్వరమే నిశ్చయంగా సాధిస్తాను.

**క్షుద్రా స్తరంతి లోకాబ్ధిం శాసనాచ్ఛంకరస్య తే ।**
**హరాతోऽహం న కిం తర్తుం మహాపత్సాగరం క్షమః ॥34॥**

మంగళకరుడవైన నీ శాసనంచే అల్పులుకూడ సంసార సముద్రాన్ని తరిస్తున్నారు. అటువంటప్పుడు నేను మహావిపత్తు అనే సముద్రాన్ని దాటడానికి సమర్థుడను కాకపోదునా? (కాకుండా పోతానా?)

**త్వత్ప్రేషితతృణేనాపి మహత్కార్య మయత్నతః ।**
**క్షణేనశక్యతే కర్తుం శంకరాత్ర న సంశయః ॥35॥**

ఓ శంకరా! మీచే నియోగింపబడిన గడ్డిపోచయైనను సునాయాసంగా గొప్ప కార్యాన్నికూడా క్షణంలో చేయగలదనుటంలో సందేహంలేదు.

**లీలామాత్రేణ తే శంభో కార్యం యద్యపి సిధ్యతి ।**
**తథాప్యహం ప్రేషణీయో తవైవానుగ్రహోహ్యయమ్ ॥36॥**

ఓశంభూ! ఏకార్యమైనను సంకల్పరూపమైన లీలచేతనే సిద్ధిస్తుంది. అయినను ఆ కార్యంకొరకై నన్ను పంపండి. ఇది మీకు నాపైగల అనుగ్రహమే కదా!

**శక్తిరేతాదృశీ శంభో మమాపి త్వదనుగ్రహాత్ ।**
**వినా శక్తిర్న కస్యాపి శంకర త్వదనుగ్రహాత్ ॥37॥**

ఓ శంభూ! నాకిటువంటి శక్తి మీ అనుగ్రహంవల్లనే కలిగింది. మీ అనుగ్రహం లేనిదే ఎవనికైనను శక్తి యుండదు.

**త్వదాజ్ఞయా వినా కోऽపి తృణాదీనపి వస్తుతః ।**
**నైవ చాలయితుం శక్త స్సత్యమేతన్న సంశయః ॥38॥**

మీ ఆజ్ఞలేనిదే ఎవడైనను గడ్డిపోచవంటి వస్తువులనైనను కదల్చడానికి సమర్థుడుకాడు. దీనిలో సందేహంలేదు. ఇది సత్యం.

**శంభో! నియమ్యాస్సర్వేऽపి దేవాద్యాస్తే మహేశ్వర ।**
**తథైవాహం నియమ్యస్తే నియంతుస్సర్వదేహినామ్ ॥39॥**

ఓ శంభూ! మహేశ్వరా! దేవాదులందరూకూడా నీఆజ్ఞకు బద్ధులౌతారు. సర్వప్రాణులను నియంత్రించేది మీరే. అట్లే మీరు నన్నుకూడా నియోగించండి.

**ప్రణతోऽస్మి మహాదేవ భూయోऽపి ప్రణతోऽస్మ్యహమ్ ।**
**ప్రేషయస్వేష్ట సిద్ధ్యర్థం మామద్య హర సత్వరమ్ ॥40॥**

మహాదేవా! నేను మీకనేక నమస్కారాలను ఆచరిస్తున్నాను. మీరు మీకభీష్ట కార్యాన్ని చక్కబెట్టడానికి నన్నిప్పుడే వెంటనే పంపించండి.

**స్పందోఽపి జాయతే శంభోఽసవ్యాం గానాం ముహుర్ముహుః ।**
**భవిష్యత్యద్య విజయో మామతః ప్రేషయ ప్రభో ॥41॥**

ఓ శంభూ! నా కుడిభాగాలు మరల మరల అదురుతున్నాయి. ఈరోజు విజయం నిశ్చయం. కాబట్టి నన్ను పంపించండి.

**హర్షోత్సాహ విశేషోఽపి జాయతే మమ కశ్చన ।**
**శంభో త్వత్పాదకమలే సంసక్తంచ మనో మమ ॥42॥**

ఓ శంభూ! నాకు వర్ణింప శక్యముగాని ఆనందము, ఉత్సాహము కలుగుతున్నాయి. నా మనస్సు నీ పాదపద్మాలయందు లగ్నమై ఉన్నది.

**భవిష్యతి ప్రతిపదం శుభ సంతాన సంతతిః ॥43॥**

ఓ శంభూ! నాకు ప్రతి అడుగునందు శుభాలు ఒకదాని తరువాత మరియొకటి సంభవింపగలవు.

**తస్యైవ విజయో నిత్యం తస్యైవ శుభమన్వహమ్ ।**
**యస్య శంభౌ దృఢా భక్తి స్త్వయి శోభన సంశ్రయే ॥44॥**

నీయందు ఎవరికి దృఢమైన భక్తి యుంటుందో వాడికి ప్రతిదినమూ విజయమే. ప్రతిదినమూ శుభములు కలుగుటకూడ నిశ్చయం.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తం తద్వచః శ్రుత్వా సంతుష్టో మంగళాపతిః ।**
**వీరభద్ర జయేతి త్వం ప్రోక్తాశీః ప్రాహ తం పునః ॥45॥**

మంగళాపతియైన శివుడు వీరభద్రుని పలుకులను విని, సంతసించి, 'వీరభద్రా నీకు జయమగుగాక! అని ఆశీర్వదించి, మరల అతనితో ఇలా పలికాడు.

**మహేశ్వర ఉవాచ** - మహేశ్వరుడు పలికాడు.

**శృణు మద్వచనం తాత వీరభద్ర సుచేతసా ।**
**కరణీయం ప్రయత్నేన తద్ద్రుతం మే ప్రతోషకమ్ ॥46॥**

వత్సా! వీరభద్రా! నా మాటలను మంచిమనస్సుతో విను. "నేను చెప్పబోయే కార్యాన్ని ప్రయత్న పూర్వకంగా నైననూ శీఘ్రమే చేసి, నాకు ఆనందాన్ని కలిగించు."

**యాగం కర్తుం సముద్యుక్తో దక్షో విధిసుతః ఖలః ।**
**మద్విరోధీ విశేషేణ మహాగర్వోఽబుధోఽధునా ॥47॥**

బ్రహ్మకుమారుడు, దుష్టుడు, విశేషించి నన్ను ద్వేషించువాడు, మహాగర్వితుడు, మూర్ఖుడు అగు దక్షుడు ఈనాడు యజ్ఞాన్ని చేయడానికి సముద్యుక్తుడయ్యాడు.

**తన్మఖం భస్మసాత్కృత్వా సయాగ పరివారకమ్ ।**
**పునరాయా హి మత్ స్థానం సత్వరం గణసత్తమ ॥48॥**

ఓ గణసత్తమా! ఆ యజ్ఞాన్ని దాని పరికరాలు, పరివారంతో సహా భస్మంచేసి, వెంటనే నావద్దకు తిరిగిరా.

**సురా భవంతు గంధర్వా యక్షా వాన్యే చ కేచన ।**
**తానప్యద్యైవ సహసా భస్మసాత్కురు సత్వరమ్ ॥49॥**

అచటనున్నవారు దేవతలైనా, యక్షులైనా, గంధర్వులైనా, ఇంకా ఎవరైనా వారిని వెనువెంటనే భస్మం చేయుము.

**తత్రాస్తు విష్ణుర్బ్రహ్మా వా శచీశో వా యమోపి వా ।**
**అపి చాద్యైవ తాన్సర్వాన్పాతయస్వ ప్రయత్నతః ॥50॥**

అచ్చట విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుడు, యముడు కూడా ఉండవచ్చు. వారినిగాని అక్కడున్న ఎవ్వరినీ గాని విడువక అందరిని ప్రయత్నపూర్వకంగానైననూ పడగొట్టుము.

**సురా భవంతు గంధర్వా యక్షా వాన్యే చ కేచన ।**
**తానప్యద్యైవ సహసా భస్మసాత్కురు సత్వరమ్ ॥51॥**

అచటనున్నవారు దేవతలైనా, యక్షులైనా, గంధర్వులైనా, ఇంకా ఎవరైనా వారిని వెనువెంటనే భస్మం చేయి.

**దధీచికృత ముల్లంఘ్య శపథం మయి తత్ర యే ।**
**తిష్ఠంతి తే ప్రయత్నేన జ్వాలనీయాస్త్వయా ధ్రువమ్ ॥52॥**

దధీచి నావిషయంలో చేసిన శపథాన్ని ఉల్లంఘించి ఎవరైతే అక్కడున్నారో వారందరు ప్రయత్న పూర్వకంగానైనా నీచే నిశ్చయంగా తగులబెట్టబడాలి.

**ప్రమథా శ్చాగమిష్యంతి యది విష్ణ్వాదయో భ్రమాత్ ।**
**నానాకర్షణమంత్రేణ జ్వాలయానీయ సత్వరమ్ ॥53॥**

నీతోబాటు ప్రమథగణాలు కూడా రాగలవు. విష్ణువు మున్నగువారు భ్రమచే అక్కడనే ఉన్నారు. వారిని వెంటనే నానాకర్షణ మంత్రంతో ఒకచోటకు చేర్చి వారినందరిని భస్మమొనరించు.

**యే తత్రోల్లంఘ్య శపథం మదీయం గర్వితాః స్థితాః ।**
**తే హి మద్ద్రోహిణోఽతస్తాన్ జ్వాలయానలమాలయా ॥54॥**

నా శపథాన్ని ఉల్లంఘించి, గర్వంతో అక్కడనున్నవారందరు నాకు ద్రోహం చేసినవారే. కావున వారిని అగ్నిజ్వాలలతో దహించు.

**సపత్నీకాన్ ససారాంశ్చ దక్షయాగ స్థలస్థితాన్ ।**
**ప్రజ్వాల్య భస్మసాత్కృత్వా పునరాయాహి సత్వరమ్ ॥55॥**

దక్షుని యజ్ఞస్థలంలో ఉన్నవారినీ, వారి భార్యలనూ, వారి యజ్ఞోపకరణాలతో సహా అన్నింటిని అగ్నిజ్వాలలలో భస్మంచేసి, శీఘ్రమే తిరిగిరా.

**తత్ర త్వయి గతే దేవా విశ్వాద్యా అపి సాదరమ్ ।**
**స్తోష్యంతి త్వాం తదాప్యాశు జ్వాలయా జ్వాలయైవ తాన్ ॥56॥**

నీవచ్చుటకు వెళ్ళగానే విశ్వేదేవతలు మున్నగువారు నిన్ను ఆదరంతో స్తుతిస్తారు. అయినప్పటికి వారినికూడా అగ్నిజ్వాలలలో జ్వలన మొనరించు.

**దేవానపి కృతద్రోహాన్ జ్వాలామాలాసమాకులైః ।**
**జ్వాలయ జ్వలనైశ్శీఘ్రం మాధ్యాయాధ్యాయ పాలకమ్ ॥57॥**

ద్రోహం చేసిన దేవతలనుకూడ అగ్నిజ్వాలామాలలతో చుట్టుముట్టి మంటలలో శీఘ్రంగా భస్మమొనరించు. బ్రహ్మ అనబడే ఋత్విక్కునైనను లెక్కచేయక సంహరించు.

**దక్షాదీన్ సకలాంస్తత్ర సపత్నీకాన్ సబాంధవాన్ ।**
**ప్రజ్వాల్య వీర దక్షం తు సలీలం సలిలం పిబ ॥58॥**

దక్షుడు మున్నగువారినందరిని, వారి భార్యలను, బంధువులను కూడా అవలీలగా భస్మమొనరించి, లీలగా నీటిని త్రాగు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వో రోషతామ్రాక్షో వేద మర్యాదపాలకః ।**
**విరరామ మహావీరం కాలారిస్సకలేశ్వరః ॥59॥**

వేద మర్యాదను రక్షించువాడు, మృత్యువునకు మృత్యువు, సర్వేశ్వరుడునగు శివుడు క్రోధముతో ఎరుపెక్కిన కన్నులు కలవాడై, మహావీరుడైన వీరభద్రునితో ఈవిధంగా పలికి, తాను విరమించాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే వీరభద్రోత్పత్తి శివోపదేశ వర్ణనం నామ ద్వాత్రింశోఽధ్యాయః ॥32॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో వీరభద్రోత్పత్తి శివాదేశం అనే ముప్పై రెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయస్త్రింశోఽధ్యాయః - ముప్పై మూడవ అధ్యాయం
## వీరభద్ర యాత్రావర్ణనమ్ - వీరభద్రయాత్రావర్ణనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తం శ్రీ మహేశస్య శ్రుత్వా వచనమాదరాత్ ।**
**వీరభద్రోఽతి సంతుష్టః ప్రణనామ మహేశ్వరమ్ ॥1॥**

శ్రీ మహేశుని మాటలను ఆదరంతో విని, వీరభద్రుడు మిక్కిలి సంతోషించి మహేశ్వరునకు ప్రణమిల్లాడు.

**శాసనం శిరసా ధృత్వా దేవదేవస్య శూలినః ।**
**ప్రచచాల తతః శీఘ్రం వీరభద్రో మఖం ప్రతి ॥2॥**

దేవదేవుడు, శూలధారీ ఐన శివుని శాసనాన్ని శిరసా ధరించి, శీఘ్రంగా వీరభద్రుడు యజ్ఞస్థానానికి బయలుదేరాడు.

**శివోఽథ ప్రేషయామాస శోభార్థం కోటిశో గణాన్ ।**
**తేన సార్థం మహావీరా న్ప్రళయానలసన్నిభాన్ ॥3॥**

అంతట శివుడు శోభకొరకు వీరభద్రునకు తోడుగా మహావీరులు, ప్రళయాగ్ని సమానులూ అయిన కోట్లాది గణాలను పంపాడు.

**అథ తే వీరభద్రస్య పురతః ప్రబలా గణాః ।**
**పశ్చాదపి యయుర్వీరాః కుతూహల కరా గణాః ॥4॥**

అపుడు వీరులూ, బలశాలులూ, కుతూహలాన్ని రేకెత్తించేవారూ అయినఆ గణప్రముఖులు వీరభద్రునికి ముందు మరియు వెనుక నడిచారు.

**వీరభద్ర సమేతా యే గణాశ్శత సహస్రశః ।**
**పార్షదాః కాలకాలస్య సర్వే రుద్రస్వరూపిణః ॥5॥**

మృత్యువునకు మృత్యువులైన రుద్రుని అనుయాయులు, స్వయంగా రుద్రస్వరూపులు నైన వందలాది, వేలాది గణాలన్నియు వీరభద్రుని చుట్టువారి యున్నాయి.

**గణైస్సమేతః కిల తైర్మహాత్మా స వీరభద్రో హర వేష భూషణః ।**
**సహస్రబాహుర్భుజగాధిపాఢ్యో యయౌ రథస్థః ప్రబలోఽతిభీకరః ॥6॥**

ఆ గణాలతోకూడి, అతిభీకరుడు, మహాత్ముడు, శివుని వేషం మరియు భూషణాలు కలవాడు, వేయి బాహువులు కలవాడు, నాగాభరణాలతో గొప్పగా ప్రకాశించువాడునైన వీరభద్రుడు రథారూఢుడై వెళ్ళాడు.

**నల్వానాం చ సహస్రే ద్వే ప్రమాణం స్యందనస్య హి ।**
**అయుతేనైవ సింహానాం వాహనానాం ప్రయత్నతః ॥7॥**

ఆ రథం రెండువేల చేతుల ప్రమాణం కలిగియుండగా పదివేల సింహాలు ఆ రథాన్ని ప్రయత్న పూర్వకంగా లాగుతున్నాయి.

**తథైవ ప్రబలాః సింహా బహవః పార్శ్వరక్షకాః ।**
**శార్దూలా మకరా మత్స్యా గజాస్తత్ర సహస్రశః ॥8॥**

అట్లే మహాబలశాలులగు అనేక సింహాలు, శార్దూలాలు, మొసళ్ళు, మత్స్యాలు, వేలాది ఏనుగులు ఆయన ప్రక్కన రక్షకులుగా ఉన్నాయి.

**వీరభద్రే ప్రచలితే దక్ష నాశాయ సత్వరమ్ ।**
**కల్పవృక్షసముత్సృష్టా పుష్పవృష్టి రభూత్తదా ॥9॥**

వీరభద్రుడు దక్షుని యజ్ఞాన్ని నాశనం చేయడానికి వేగంగా బయలుదేరగా ఆ సమయంలో కల్పవృక్షంనుండి పుట్టిన పుష్పవర్షం కురిసింది.

**తుష్టువుశ్చ గణా వీరం శిపివిష్టే ప్రచేష్టితమ్ ।**
**చక్రుః కుతూహలం సర్వే తస్మింశ్చ గమనోత్సవైః ॥10॥**

వీరుడై శివాజ్ఞా పాలనకు ఉద్యుక్తుడైనట్టియు, వీరభద్రుని గణాలు స్తుతించాయి. ఆ గణాలన్నీ ఆ యాత్ర యందు ఉత్సవాలు చేసి, కుతూహలాన్ని కలిగించాయి.

**కాళీ కాత్యాయనీశానీ చాముండా ముండమర్దినీ ।**
**భద్రకాళీ తథా భద్రా త్వరితా వైష్ణవీ తథా ॥11॥**

**ఏతాభి ర్నవదుర్గాభి ర్మహాకాళీ సమన్వితా ।**
**యయౌ దక్ష వినాశాయ సర్వభూత గణైస్సహ ॥12॥**

కాళి, కాత్యాయిని, ఈశాని, చాముండ, ముండమర్దిని, భద్రకాళి మరియు మిక్కిలి వేగంగల వైష్ణవి, అనే తొమ్మిది దుర్గలతో కూడి మహాకాళి భూతగణాలన్నింటితోబాటు దక్షుని వినాశం కొరకు బయలుదేరింది.

**డాకినీ శాకినీ చైవ భూత ప్రమథ గుహ్యకాః ।**
**కూష్మాండాః పర్పటాశ్చైవ చటకా బ్రహ్మరాక్షసాః ॥13॥**

**భైరవాః క్షేత్రపాలాశ్చ దక్షయజ్ఞ వినాశకాః ।**
**నిర్యయుస్త్వరితం వీరాశ్శివాజ్ఞాప్రతిపాలకాః ॥14॥**

డాకిని, శాకిని, భూతాలు, ప్రమథగణాలు, యక్షులు, కూష్మాండులు, పర్పటులు, చటకులు, బ్రహ్మరాక్షసులు, వీరులైన భైరవులు, క్షేత్రపాలకులు, శివాజ్ఞాపాలకులై దక్షుని యజ్ఞం వినాశం చేయడానికి వేగంగా ప్రయాణమయ్యారు.

**తథైవ యోగినీ చక్రం చతుష్షష్టి గణాన్వితమ్ ।**
**నిర్యయౌ సహసా క్రుద్ధం దక్షయజ్ఞం వినాశితుమ్ ॥15॥**

అట్లే యోగినుల సమూహం, మిక్కిలి కోపించి, అరువది నాలుగు గణాలతోకూడి, దక్షయజ్ఞాన్ని వినాశం చేయడానికి వేగంగా తరలి వెళ్ళింది.

**తేషాం గణానాం సర్వేషాం సంఖ్యానం శృణు నారద ।**
**మహాబలవతాం సంఘో ముఖ్యానాం ధైర్యశాలినామ్ ॥16॥**

ఓ నారదా! మహాబలవంతులు, ధైర్యశాలురునైన సర్వగణాధ్యక్షులచే నడిపింపబడిన గణాల లెక్కను చెబుతాను విను.

**అభ్యయా చ్ఛంకు కర్ణశ్చ దశకోట్యా గణేశ్వరః ।**
**దశభిః కేకరాక్షశ్చ వికృతోఽష్టాభిరేవ చ ॥17॥**

**చతుః షష్ట్యా విశాఖశ్చ నవభిః పారియాత్రికః ।**
**షడ్భి స్సర్వాఙ్కకో వీరస్తథైవ వికృతాననః ॥18॥**

**జ్వాలకేశో ద్వాదశభిః కోటిభిర్గణపుంగవః ।**
**సప్తభిః సమద శ్రీమాన్ రుద్ర భోఽష్టాభిరేవ చ ॥19॥**

**పంచభిశ్చ కపాలీశః షడ్భిస్సందారకో గణః ।**
**కోటికోటిభిరేవేహ కోటికుండ స్తథైవ చ ॥20॥**

**విష్టంభశ్చాష్టభిర్వీరైః కోటిభిర్గణ సప్తమః ।**
**సహస్ర కోటిభిస్తాత సంనాదః పిప్పలస్తథా ॥21॥**

**ఆవేశన స్తథాష్టాభిరష్టాభిశ్చంద్రతాపనః ।**
**మహావేశః సహస్రేణ కోటినా గణపో వృతః ॥22॥**

శంకు కర్ణుడనే గణాధ్యక్షుడు పదికోట్లు, కేకరాక్షుడు పది, వికృతుడు ఎనిమిది, విశాఖుడు అరవైనాలుగు, పారియాత్రికుడు తొమ్మిది, వీరుడు, వికృతాననుడు నైన సర్వాంకకుడు ఆరుకోట్ల గణాలతోనూ, గుణనిధియైన జ్వాలకేశుడు పన్నెండు, శోభాయుక్తుడైన సమదుడు ఏడు, రుద్రభుడు ఎనిమిది, కపాలీశడు ఐదు, సంచారకుడు ఆరు, కోటికుండుడు ఒకటి, గణాలలో శ్రేష్ఠుడైన విష్టంభుడు ఎనిమిది కోట్లు, సంనాదుడు వేయి, పిప్పలుడు వేయి, ఆవేశనుడు ఎనిమిది, చంద్రతాపనుడు ఎనిమిది, మహావేశుడనే గణాధ్యక్షుడు వేయికోట్ల గణములచేత చుట్టువారబడి ముందుకు సాగారు.

**కుండీ ద్వాదశ కోటీభి స్తథా పర్వతకో మునే ।**
**వినాశితుం దక్షయజ్ఞం నిర్యయౌ గణసత్తమః ॥23॥**

ఓ మహర్షీ! కుండి పన్నెండు కోట్ల గణాలతోను, గుణశ్రేష్ఠుడైన పర్వతకుడు అంతే సంఖ్యగల గణాలతోను, దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేయడానికి బయలుదేరారు.

**కాలశ్చ కాలకశ్చైవ మహాకాల స్తథైవ చ ।**
**కోటీనాం శతకేనైవ దక్షయజ్ఞం యయౌ ప్రతి ॥24॥**

కాలుడు, కాలకుడు, మహాకాలుడు వంద కోట్ల గణాలతో దక్షయజ్ఞానికి వెళ్ళారు.

**అగ్నికృచ్ఛత కోట్యా చ కోట్యాగ్నిముఖ ఏవ చ ।**
**ఆదిత్యమూర్ధా కోట్యా చ తథా చైవ ఘనావహః ॥25॥**

అగ్నికృత్తు వందకోట్ల గణాలతోను, అగ్నిముఖుడు ఒక కోటి గణాలతోను, ఆదిత్యమూర్ధుడు ఒక కోటి గణాలతోను, అట్లే ఘనావహుడు ఒక కోటి గణాలతోను బయలుదేరారు.

**సన్నాహశ్శతకోట్యా చ కోట్యా చ కుముదో గణః ।**
**అమోఘః కోకిలశ్చైవ కోటికోట్యా గణాధిపః ॥26॥**

సన్నాహుడు వందకోట్లు, కుముదుడు ఒకకోటి, అమోఘుడొకకోటి, కోకిలుడు అను గణాధ్యక్షుడు ఒక కోటి గణాలతోను బయలుదేరారు.

**కాష్ఠాగూఢశ్చతుః షష్ట్యా సుకేశీ వృషభస్తథా ।**
**సుమంత్రకో గణాధీశస్తథా తాత సునిర్యయౌ ॥27॥**

కాష్ఠాగూఢుడు అరవైనాలుగు కోట్ల గణాలతో బయలుదేరాడు. అట్లే సుకేశి, వృషభుడు, సుమంత్రకుడు అనే గణాధ్యక్షులు కూడ దక్షయజ్ఞానికి తరలివెళ్ళారు.

**కాకపాదోదరః షష్టి కోటిభి ర్గణసత్తమః ।**
**తథా సంతానకః షష్టికోటిభిర్గణపుంగవః ॥28॥**

గణసత్తముడైన కాకపాదోదరుడు అరవైకోట్ల గణాలతోను, మరియు గణపుంగవుడగు సంతానకుడు కూడ అంతేసంఖ్యగల గణాలతోను ముందుకు నడిచారు.

**మహాబలశ్చ నవభిః కోటిభిః పుంగవస్తథా ।**
**మధుపింగస్తథా తాత గణాధీశో హి నిర్యయౌ ॥29॥**

వత్సా! మహాబలుడు తొమ్మిదికోట్ల గణాలతోనూ, అట్లే పుంగవుడు, మధుపింగుడను గణాధ్యక్షులు కూడ వెళ్ళారు.

**నీలో నవత్యా కోటీనాం పూర్ణభద్రస్తథైవ చ ॥30॥**

నీలుడు తొంభై కోట్ల గణాలతో వెళ్ళాడు. పూర్ణభద్రుడు కూడ అట్లే వెళ్ళాడు.

**నిర్యయౌ శతకోటీభి శ్చతుర్వక్త్రో గణాధిపః ।**
**కాష్ఠాగూఢశ్చతుష్షష్ట్యా సుకేశో వృషభస్తథా ॥31॥**

చతుర్వక్త్రుడను గణాధ్యక్షుడు వందకోట్ల గణాలతో బయలుదేరాడు. కాష్ఠాగూఢుడు అరవై నాలుగు కోట్ల గణాలతోను, సుకేశుడు, వృషభుడు కూడా ఆవిధమైన గణాలతోను వెళ్ళారు.

**విరూపాక్షశ్చ కోటీనాం చతుఃషష్ట్యా గణేశ్వరః ।**
**తాలకేతుః షడాస్యశ్చ పంచాస్యశ్చ గణాధిపః ॥32॥**

**సంవర్తక స్తథా చైవ కులీశశ్చ స్వయం ప్రభుః ।**
**లోకాంతకశ్చ దీప్తాత్మా తథా దైత్యాన్తకో మునే ॥33॥**

గణేశ్వరుడైన విరూపాక్షుడు అరవై నాలుగు కోట్ల గణాలతో వెళ్ళాడు. తాలకేతువు, షడాస్యుడు, పంచాస్యుడనే గణాధిపులు, సంవర్తకుడు, కులీశుడు, స్వయంప్రభుడు, లోకాంతకుడు మున్నగు గణాధిపులు కూడా వెళ్ళారు. ఓ నారదమునీ! వారిలో దైత్యాంతకుడు మిక్కిలి ప్రకాశించాడు.

**గణో భృంగిరిటిః శ్రీమాన్ దేవదేవ ప్రియస్తథా ।**
**అశనిర్భాలకశ్చైవ చతుఃషష్ట్యా సహస్రకః ॥34॥**

దేవదేవుడైన శివునకు మిక్కిలి ప్రీతిపాత్రులైన భృంగిరిటి, అశని, భాలకుడు మరియు సహస్రకుడు అరవైనాలుగు కోట్ల గణాలతో తరలివెళ్ళారు.

**కోటికోటి సహస్రాణాం శతైర్వింశతిభిర్వృతః ।**
**వీరేశో హ్యభ్యయాద్వీరః వీరభద్ర శివాజ్ఞయా ॥35॥**

వీరభద్రునియొక్కయు, శివునియొక్కయు ఆజ్ఞనుపొంది, వీరుడైన వీరేశుడు, కోటికోటి వేల నూట ఇరవైకోట్ల గణాలతో కూడుకొని ముందుకు నడిచాడు.

**భూతకోటి సహస్రైస్తు ప్రయయౌ కోటిభి స్త్రిభిః ।**
**రోమజైః శ్వగణైశ్చైవ తథా వీరో యయౌ ద్రుతమ్ ॥36॥**

వీరుడు వేలకోట్ల భూతగణాలతోను, రోమాలనుండి జన్మించిన మూడుకోట్ల కుక్కల గుంపుతోను, వేగంగా వెళ్ళాడు.

**తదా భేరీ మహానాదః శంఖాశ్చ వివిధ స్వనాః ।**
**జటాహరో ముఖాశ్చైవ శృంగాణి వివిధాని చ ॥37॥**

అంతట భేరీలు, శంఖాలు, కొమ్ముువాద్యాలు, శివుని ముఖాకారంతో ఉండే వాద్యాలు మున్నగు వాటి నుండి వివిధమైన మహానాదాలు వెలువడ్డాయి.

**తే తాని వితతాన్యేవ బంధనాని సుఖాని చ ।**
**వాదిత్రాణి వినేదుశ్చ వివిధాని మహోత్సవే ॥38॥**

ఆ మహోత్సవంలో అనేకవాద్యములు మ్రోగింపబడ్డాయి. ఆ శబ్దాలు చెవులకింపును కలిగించేవియై సర్వత్ర వ్యాపించాయి.

**వీరభద్రస్య యాత్రాయాం సబలస్య మహామునే ।**
**శకునాన్యభవంస్తత్ర భూరీణి సుఖదాని చ ।।39।।**

ఓ మహామునీ! వీరభద్రుడు సైన్యంతోకూడి, పయనిస్తూ ఉండగా మనస్సునకు ఆనందాన్నిచ్చే అనేక విధాలైన గొప్ప శకునాలు కన్పట్టాయి.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే వీరభద్ర యాత్రా వర్ణనం నామ త్రయస్త్రింశోఽధ్యాయః ।।33।।**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో వీరభద్రయాత్రా వర్ణనం అనే ముప్పై మూడవ అధ్యాయం సమాప్తం.

## చతుస్త్రింశోఽధ్యాయః - ముప్పై నాలుగవ అధ్యాయం
## దుశ్శకునదర్శనమ్ - దుశ్శకునదర్శనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏవం ప్రచలితే చాస్మిన్ వీరభద్రే గణాన్వితే ।**
**దుష్ట చిహ్నాని దక్షేణ దృష్టాని విబుధైరపి ॥1॥**

వీరభద్రుడీవిధంగా వివిధ గణాలతోకూడి, దక్షయజ్ఞానికి పయనిస్తూ ఉండగా అచ్చట దక్షునకూ, దేవతలకు దుశ్శకునాలు కన్పట్టాయి.

**ఉత్పాతా వివిధాశ్చాసన్ వీరభద్రే గణాన్వితే ।**
**త్రివిధా అపి దేవర్షే యజ్ఞ విధ్వంస సూచకాః ॥2॥**

ఓ దేవర్షీ! వీరభద్రుడు గణాలతోకూడి ముందుకు సాగుతుండగా దక్షయజ్ఞ విధ్వంస సూచకాలైన మూడు విధాలైన (ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక) ఉత్పాతాలు అనేక రీతుల కానవచ్చాయి.

**దక్ష వామాక్షి బాహూరు విస్పంద స్సమజాయత ।**
**నానాకష్ట ప్రదస్తాత సర్వథాఽశుభసూచకః ॥3॥**

ఓ వత్సా! దక్షుని ఎడమకన్ను, చేయి, తొడ అదిరాయి. ఇది అన్ని విధముల అశుభసూచకమైన శకునం. ఈ శకునం కనబడితే అనేక కష్టాలు కలుగుతాయి.

**భూకంపస్సమభూత్తత్ర దక్షయాగస్థలే తదా ।**
**దక్షోఽపశ్యచ్చ మధ్యాహ్నే నక్షత్రాణ్యద్భుతాని చ ॥4॥**

దక్షుని యజ్ఞస్థలంలో అప్పుడు భూమి కంపించింది. అంతేగాక దక్షుడు మధ్యాహ్న సమయంలో అద్భుతంగా నక్షత్రాలను చూశాడు.

**దిశశ్చాఽఽసన్సుమలినాః కర్బురోఽభూద్దివాకరః ।**
**పరివేష సహస్రేణ సంక్రాంతశ్చ భయంకరః ॥5॥**

దిక్కులన్నియు ధూళితో మలినమయ్యాయి. దివాకరుడు వివిధ రంగులలో కన్పట్టాడు. సూర్యునిచుట్టూ అనేక వేల మండలాలేర్పడి, భీతిని కలిగిస్తున్నాయి.

**నక్షత్రాణి పతంతి స్మ విద్యుదగ్నిప్రభాణి చ ।**
**నక్షత్రాణా మభూద్వక్రా గతిశ్చాధోముఖీ తదా ॥6॥**

మెరుపువలె నిప్పువలె మండుచున్న నక్షత్రాలు నేలకూలుతున్నాయి. ఆ సమయంలో నక్షత్రాలు వంకర టింకర మార్గంలో అథోముఖంగా పయనిస్తున్నాయి.

**గృధ్రా దక్షశిరః స్పృష్ట్వా సముద్భూతాః సహస్రశః ।**
**ఆసీద్ గృధ్ర పక్షచ్ఛాయై స్సచ్ఛాయో యాగమండపః ॥7॥**

వేలకొలది గ్రద్దలు దక్షుని శిరస్సును స్పృశించాయి. గ్రద్దల రెక్కల నీడలతో యాగమండపం కప్పివేయబడింది.

**వవాశిరే యాగభూమౌ క్రోష్టారో పోత్రకాస్తదా ।**
**ఉల్కావృష్టి రభూత్తత్ర శ్వేత వృశ్చిక సంభవా ॥8॥**

యాగ స్థలంలో నక్కలు ఊలలు పెట్టాయి. అడవి పందులు వికృత ధ్వనులు చేశాయి. ఉల్కావర్షం కురిసింది. అచ్చట తెల్లని తేళ్ళు పుట్టాయి.

**ఖరా వాతా వవుస్తత్ర పాంశు వృష్టి సమన్వితాః ।**
**శలభాశ్చ సముద్భూతా వివర్తానిల కంపితాః ॥9॥**

భయంకరమైన గాలులు ధూళిని వర్షిస్తూ వీచాయి. సుడిగాలులచే చలిస్తున్న మిడతలు పుట్టాయి.

**రీతైశ్చ పవనైరూర్ధ్వం సదక్షాధ్వరమండపః ।**
**దేవాన్వితేన దక్షేణ యః కృతో నూతనోద్భుతః ॥10॥**

దక్షుడు దేవతలతో కలసి నూతనంగా నిర్మించిన అద్భుతమైన యజ్ఞ మండపాన్ని తీవ్రమైన గాలులు పైకి లేవగొట్టాయి.

**వేముర్దక్షాదయస్సర్వే తదాశోణితమద్భుతమ్ ।**
**వేముశ్చ మాంసఖండాని సశల్యాని ముహుర్ముహుః ॥11॥**

ఆసమయంలో దక్షుడు మున్నగు వారందరు రక్తాన్ని, మాంసపు ముక్కలను, ఎముకలను అనేక పర్యాయాలు వమనం చేశారు. ఆ దృశ్యం మిక్కిలి బీభత్సంగా ఉంది.

**సకంపాశ్చ బభూవుస్తే దీపా వాతహతా ఇవ ।**
**దుఃఖితాశ్చాభవన్సర్వే శస్త్రధారా హతా ఇవ ॥12॥**

అచ్చటివారందరు గాలిలోని దీపంవలె వణకసాగారు. పదునైన శస్త్రాలతో కొట్టబడిన వారివలె దుఃఖింపసాగారు.

**తదా నినాదజాతాని బాష్పవర్షాణి తత్ క్షణే ।**
**ప్రాతస్తుషార వర్షీణి పద్మానీవ వనాంతరే ॥13॥**

అప్పుడు వారు బిగ్గరగా రోదించడంచేత కన్నీరు ప్రవాహమై, వారి కన్నులు వనమధ్యంలో సరస్సునందు మంచు బిందువులను వర్షించు పద్మాలవలె ఉన్నాయి.

**దక్షాద్యక్షీణి జాతాని హ్యకస్మాద్విశదాన్యపి ।**
**నిశాయాం కమలాక్షైవ కుముదానీవ సంగవే ॥14॥**

దక్షుడు మున్నగువారి నేత్రాలు అంతవరకు స్వచ్ఛంగానే ఉన్నా, అకస్మాత్తుగా రాత్రియందు పద్మాలవలె, పగటిభాగంలో కలువల వలె శోభను కోల్పోయాయి.

**అసృగ్వవర్ష దేవశ్చ తిమిరేణావృతా దిశః ।**
**దిగ్దాహోఽభూద్విశేషేణ త్రాసయన్ సకలాన్ జనాన్ ॥15॥**

అంతట పరమేశ్వరుడు రక్తవర్షాన్ని కురిపించాడు. దిక్కులన్నీ చీకట్లతో నిండిపోయాయి. దిక్కులన్నీ వేడితో నిండిపోవడంచేత జనులందరు భయకంపితులయ్యారు.

**ఏవం విధాన్యరిష్టాని దదృశుర్విబుధాదయః ।**
**భయమాపేదిరేఽత్యంతం మునే విష్ణ్వాదికా స్తదా ॥16॥**

ఓ నారదమునీ! ఆ సమయంలో ఈ రీతిగా వివిధాలైన అరిష్టాలను దేవతలు, విష్ణ్వాదులు చూచి, మిక్కిలి భయాన్ని పొందారు.

**భువి తే మూర్ఛితాః పేతుర్హాహతాః స్మ ఇతీరయన్ ।**
**తరవస్తీర సంజాతా నదీవేగ హతా ఇవ ॥17॥**

నదీవేగానికి తీరంలోని చెట్లు కూలిన విధంగా వారందరు 'అయ్యో! చచ్చాము' అని పలుకుతూ మూర్ఛితులై నేలకూలారు.

**పతిత్వా తే స్థితా భూమౌ క్రూరాః సర్పా హతా ఇవ ।**
**కందుకా ఇవ తే భూయః పతితాః పునరుత్థితాః ॥18॥**

వారు నేలపైపడి, చంపబడిన క్రూర సర్పాలవలె ఉన్నారు. క్రిందపడి బంతులవలె మఱల పైకి ఎగురుతున్నారు.

**తతస్తే తాపసంతప్తా రురుదుః కురరీ ఇవ ।**
**రోదన ధ్వని సంక్రాంతో రుక్తి ప్రత్యుక్తికా ఇవ ॥19॥**

అంతట వారు వేడిని తట్టుకొనలేక జల పక్షులవలె (ఆడు లకుముకి పిట్టలవలె) మిక్కిలి విలపించారు. వారి రోదనధ్వని పరస్పరం ప్రశ్న సమాధానాలు చెప్పుకొన్నట్లున్నది.

**స వైకుంఠా స్తతస్సర్వే తదా కుంఠిత శక్తయః ।**
**స్వ స్వోప కంఠమాకంఠం లులుఠుః కమఠా ఇవ ॥20॥**

అంతట విష్ణువుతోసహా దేవతలందరు తమతమ శక్తులను కోల్పోయారు. వారు తమతమ సమీపంలో శరీరాలను కంఠపర్యంతం తాబేళ్ళవలె ముడుచుకొని కూర్చుండి, దుఃఖింపసాగారు.

**ఏతస్మిన్నంతరే తత్ర సంజాతా చాశరీరవాక్ ।**
**శ్రావయత్యఖిలాన్ దేవాన్ దక్షం చైవ విశేషతః ॥21॥**

ఇంతలో అచ్చట ఆకాశవాణి దేవతలనందరిని ఉద్దేశించి, ప్రత్యేకించి దక్షుని ఉద్దేశించి, ఇలా పలికింది.

**ఆకాశవాణ్యువాచ** - ఆకాశవాణి పలికింది.

**ధిక్ జన్మ తవ దక్షాద్య మహామూఢోஉసి పాపధీః ।**
**భవిష్యతి మహద్దుఃఖ మనివార్యం హరోద్భవమ్ ॥22॥**

ఓరీ దక్షా! నీజన్మ నింద్యం. నీవీనాడు పాపబుద్ధివైనావు. మూర్ఖుడవయ్యావు. నీకు శంకరునినుండి మహా దుఃఖం సంప్రాప్తం కాగలదు. దానినెవ్వరు నివారింపజాలరు.

**హాహాపి నోஉత్ర యే మూఢాస్తవ దేవాదయ స్థితాః ।**
**తేషామపి మహాదుఃఖం భవిష్యతి న సంశయః ॥23॥**

అయ్యో! ఇచ్చట మూఢులై దేవాదులుకూడా ఉపస్థితులై ఉన్నారు. వారికికూడ ఈ మహాదుఃఖం కలుగబోతోంది. ఇది నిస్సంశయం.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**తచ్ఛ్రుత్వాஉஉకాశ వచనం దృష్ట్వారిష్టాని తాని చ ।**
**దక్షః ప్రాపద్భయం చాతి పరే దేవాదయోஉపి హ ॥24॥**

ఆకాశవాణి పలుకులను విని, దుశ్శకునాలను చూచి, దక్షుడు చాలా భయపడ్డాడు. దేవతలు మొదలగు ఇతరులుకూడ భయకంపితులయ్యారు.

**వేపమానస్తదా దక్షో వికలశ్చాతి చేతసి ।**
**అగచ్ఛచ్ఛరణం విష్ణోః స్వప్రభో రిందిరాపతేః ॥25॥**

అంతట దక్షుడు భయంతో వణుకుతూ అతి వికల మనస్కుడై తన ప్రభువూ, ఇందిరాపతీ అయిన శ్రీమహావిష్ణువును శరణు పొందాడు.

**సుప్రణమ్య భయావిష్టః సంస్తూయచ విచేతనః ।**
**అవోచద్దేవదేవం తం విష్ణుం స్వజనవత్సలమ్ ॥26॥**

భయావిష్టుడు, విచేతనుడునైన దక్షుడు, దేవదేవుడు, భక్తవత్సలుడునైన విష్ణువునకు నమస్కరించి, స్తుతించి, ఇలాపలికాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే దుశ్శకునదర్శనం నామ చతుస్త్రింశోஉధ్యాయః ॥34॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో దుశ్శకునదర్శనం అనే ముప్పైనాలుగవ అధ్యాయం సమాప్తం.

## పంచ త్రింశోఽధ్యాయః - ముప్పై ఐదవ అధ్యాయం
## విష్ణువాక్యవర్ణనమ్ - విష్ణువాక్యవర్ణనం

**దక్ష ఉవాచ** - దక్షుడు పలికాడు.

**దేవదేవ హరే విష్ణో దీనబంధో కృపానిధే ।**
**మమ రక్షా విధాతవ్యా భవతా సాధ్వరస్య చ ॥1॥**

ఓ దేవదేవా! హరే! విష్ణో! దీనబంధూ! కృపానిధీ! నీవు నన్ను, నా యజ్ఞాన్ని రక్షించాలి.

**రక్షకస్త్వం మఖస్యైవ మఖకర్మా మఖాత్మకః ।**
**కృపా విధేయా యజ్ఞస్య భంగో భవతు న ప్రభో ॥2॥**

ఓ ప్రభూ! యజ్ఞ రక్షకుడవు నీవే. యజ్ఞస్వరూపము నీవే. యజ్ఞ కర్మము, కర్తయు నీ స్వరూపమే. నీవు నాయందు దయను చూపుము. యజ్ఞభంగము కాకుండునట్లు అనుగ్రహింపుము.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్థం బహువిధాం దక్షః కృత్వా విజ్ఞప్తిమాదరాత్ ।**
**పపాత పాదయోస్తస్య భయవ్యాకులమానసః ॥3॥**

ఈ విధంగా దక్షుడు అనేక విధాల సాదరంగా విన్నవించుకొని, భయవ్యాకులమానసుడై శ్రీమహావిష్ణువు పాదాలపై పడ్డాడు.

**ఉత్థాప్య తం తతో విష్ణుర్దక్షం విక్లిన్నమానసమ్ ।**
**శ్రుత్వా చ తస్య తద్వాక్యం కుమతేరస్మరచ్ఛివమ్ ॥4॥**

అంతట విష్ణువు చింతాక్రాంతుడు, విక్లిన్న మనస్కుడునైన దక్షుని పైకి లేవదీసి దుర్బుద్ధియైన అతని పలుకులను విని, శివుని స్మరించాడు.

**స్మృత్వా శివం మహేశానం స్వప్రభుం పరమేశ్వరమ్ ।**
**అవదచ్ఛివ తత్త్వజ్ఞో దక్షం సంబోధయన్ హరిః ॥5॥**

మహేశానుడు, పరమేశ్వరుడు, తనకు ప్రభువునైన శివుని స్మరించి, శివతత్త్వమును ఎరింగిన విష్ణువు దక్షుని సంబోధించి ఇలా పలికాడు.

**హరిరువాచ** - హరి పలికాడు.

**శృణు దక్ష ప్రవక్ష్యామి తత్త్వతః శృణు మే వచః ।**
**సర్వథా తే హితకరం మహామంత్రం సుఖప్రదమ్ ॥6॥**

ఓ దక్షా! వినుము. నేను సత్యమైన తత్త్వాన్ని చెబుతున్నాను. నీకు అన్నివిధముల హితాన్ని చేకూర్చి, సుఖాన్నిచ్చే మహామంత్రాన్ని చెబుతాను.

**అవజ్ఞా హి కృతా దక్ష త్వయా తత్త్వ మజానతా ।**
**సకలాధీశ్వరస్యైవ శంకరస్య పరాత్మనః ॥7॥**

ఓ దక్షా! తత్త్వము నెరుగని నీవు సకలాధీశ్వరుడు, పరమాత్మయునైన శంకరుని అవజ్ఞ (అవమానం) గావించావు.

**ఈశ్వరావజ్ఞయా సర్వం కార్యం భవతి సర్వథా ।**
**విఫలం కేవలం నైవ విపత్తిశ్చ పదే పదే ॥8॥**

ఈశ్వరావజ్ఞ వలన సర్వకార్యములు సర్వవిధముల విఫలమౌతాయి. అంతమాత్రమేకాదు అడుగడుగున ఆపదలు ఎదురౌతాయి.

**అపూజ్యా యత్ర పూజ్యంతే  పూజనీయో న పూజ్యతే ।**
**త్రీణి తత్ర భవిష్యంతి దారిద్ర్యం మరణం భయమ్ ॥9॥**

ఎక్కడ పూజింపదగనివారు పూజింపబడతారో, ఎక్కడ పూజింపదగినవారు పూజింపబడరో, అచ్చట నిశ్చయంగా మూడు సంభవిస్తాయి. అవి దారిద్ర్యం, మరణం, భయం.

**తస్మాత్సర్వ ప్రయత్నేన మాననీయో వృషధ్వజః ।**
**అమానితాన్మహేశాచ్చ మహద్భయముపస్థితమ్ ॥10॥**

కాబట్టి అన్నివిధముల ప్రయత్నం చేసియైన వృషధ్వజుడగు శివుని పూజించాలి. కాని నీవు మహేశానుని అవమానించావు. అందువలననే ఈ గొప్పదైన భయం సంప్రాప్తమయ్యింది.

**అద్యాపి న వయం సర్వే ప్రభవః ప్రభవామహే ।**
**భవతో దుర్నయేనైవ మయా సత్యముదీర్యతే ॥11॥**

ఇప్పుడు మేమందరము సమర్థులమైనను అందరము కలిసియైనను ఈ ఆపదను నివారించుట శక్యము కాదు. ఇది అంతయు నీ దుర్నీతి వలన కలిగినది. నేను సత్యమునే పలుకుచున్నాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**విష్ణో స్తద్వచనం శ్రుత్వా దక్షశ్చింతాపరోఽభవత్ ।**
**వివర్ణ వదనో భూత్వా తూష్ణీ మాసీ ద్భువి స్థితః ॥12॥**

విష్ణువు పలుకులను విని, దక్షుడు చింతాక్రాంతుడయ్యాడు. అతని ముఖం వివర్ణమయ్యింది. నేలపై కూర్చుండి, మిన్నకున్నాడు.

**ఏతస్మిన్నంతరే వీరభద్రః సైన్య సమన్వితః ।**
**అగచ్ఛదధ్వరం రుద్రప్రేరితో గణనాయకః ॥13॥**

ఇంతలో సైన్య సమన్వితుడైన వీరభద్రుడు రుద్ర ప్రేరితుడై, యజ్ఞ స్థలాన్ని సమీపిస్తున్నాడు.

**పృష్ఠే కేచిత్సమాయాతా గగనే కేచిదాగతాః ।**
**దిశశ్చ విదిశః సర్వే సమావృత్య తథాపరే ॥14॥**

కొన్ని గణాలు ఆయన వెనుక మరికొన్ని ఆకాశంలోను మరికొన్ని అన్నిదిక్కులందును ఆక్రమించి ముందుకు సాగారు.

**శర్వాజ్ఞయా గణాః శూరా నిర్భయా రుద్రవిక్రమాః ।**
**అసంఖ్యాః సింహనాదాన్వై కుర్వంతో వీరసత్తమాః ॥15॥**

శివాజ్ఞచే శూరులు, నిర్భయులు, రుద్రవిక్రములు, మహావీరులునగు లెక్కలేనన్ని శివగణాలు సింహనాదాలు చేస్తూ ముందుకు సాగారు.

**తేన నాదేన మహతా నాదితం భువనత్రయమ్ ।**
**రజసా చావృతం వ్యోమ తమసా చావృతా దిశః ॥16॥**

ఆ మహానాదం ముల్లోకాలను దద్దరిల్లజేసింది. ఆకాశం ధూళితో నిండిపోయింది. దిక్కులన్నియు చీకట్లతో నిండిపోయాయి.

**సప్తద్వీపాన్వితా పృథ్వీ చచాలాతిభయాకులా ।**
**సశైల కాననా తత్ర చుక్షుభుస్సకలాబ్ధయః ॥17॥**

సప్తద్వీపాలతో, సప్తకుల పర్వతాలతో, అడవులతో కూడియున్న భూమండలమంతా భయంతో కంపించింది. సముద్రాలన్నియు క్షోభిల్లాయి.

**ఏవం భూతం చ తత్సైన్యం లోకక్షయకరం మహత్ ।**
**దృష్ట్వా చ విస్మితాస్సర్వే బభూవురమరాదయః ॥18॥**

లోకాలనన్నిటిని నాశనం చేయగల ఇటువంటి మహాసైన్యాన్ని చూచి, దేవతాదులందరు ఆశ్చర్య చకితులయ్యారు.

**సైన్యోద్యోగ మథాలోక్య దక్షశ్చా సృఙ్ముఖా కులః ।**
**దండవత్ప్రతితో విష్ణుం సకళత్రోఽ భ్యభాషత ॥19॥**

ఈ సైన్య సంరంభాన్ని చూచిన దక్షుడు రక్తంచిందే ముఖంతో వ్యాకులచిత్తుడై, విష్ణువు యెదుట దండంవలెపడి ఇలాపలికాడు.

**దక్ష ఉవాచ –** దక్షుడు పలికాడు.

**భవద్బలేనైవ మయా యజ్ఞః ప్రారంభితో మహాన్ ।**
**సత్కర్మ సిద్ధయే విష్ణో ప్రమాణం త్వం మహాప్రభో ॥20॥**

ఓ విష్ణో! మహాప్రభో! నీ బలంవల్లనే నేనీ మహాయజ్ఞాన్ని ప్రారంభించాను. సత్కర్మల ఫలం సిద్ధింపజేయుటలో నీవే ప్రమాణమై యున్నావు.

**విష్ణో త్వం కర్మణాం సాక్షీ యజ్ఞానాం ప్రతిపాలకః ।**
**ధర్మస్య వేదగర్భస్య బ్రహ్మణస్త్వం మహాప్రభో ॥21॥**

ఓ విష్ణో! మహాప్రభూ! నీవు సర్వకర్మసాక్షివి. నీవు యజ్ఞాలకు, వేదమూలమైన ధర్మానికి, చతుర్ముఖునకు పరిపాలకుడవు. వేదగర్భస్థమైన పరబ్రహ్మము నీవే.

**తస్మాద్రక్షా విధాతవ్యా యజ్ఞస్యాస్య మమ ప్రభో ।**
**త్వదన్యః యస్సమర్థోఽస్తి యతస్త్వం సకల ప్రభుః ॥22॥**

కాబట్టి నా యీ యజ్ఞాన్ని నీవే రక్షించాలి. ఈపనికి నీకంటే సమర్థుడు మరియొకడు లేడు. ఎందులకనగా సర్వప్రభుడవు నీవేగదా!

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**దక్షస్య వచనం శ్రుత్వా విష్ణుర్దీనతరం తదా ।**
**అవోచద్బోధయం స్తం వై శివతత్త్వ పరాఙ్ముఖమ్ ॥23॥**

దక్షుని వచనాలను విని, మిక్కిలి దీనుడు, శివతత్త్వ పరాఙ్ముఖుడునైన దక్షునకు శివతత్త్వాన్ని బోధించుచున్నవాడై విష్ణువు ఇలాపలికాడు.

**విష్ణురువాచ –** విష్ణువు పలికాడు.

**మయా రక్షా విధాతవ్యా తవ యజ్ఞస్య దక్ష వై ।**
**ఖ్యాతో మమ పణః సత్యో ధర్మస్య పరిపాలనమ్ ॥24॥**

ఓయీ దక్షా! నేను నీయజ్ఞాన్ని రక్షింపవలసినవాడనే. 'ధర్మరక్షణ చేయుదును' అనునది నా శపథం. ఇది సత్యమని అందరికిని తెలియును.

**తత్సత్యం తు త్వయోక్తం హి కిం తత్తస్య వ్యతిక్రమః ।**
**శృణు త్వం వచ్మ్యహం దక్ష క్రూరబుద్ధిం త్యజాఽధునా ॥25॥**

నీవు చెప్పినమాట సత్యమే కాని దానికి ఉల్లంఘనమేమి కలిగినది? ఓయీ దక్షా! నేను చెబుతాను. నీవిప్పుడు క్రూరబుద్ధిని విడిచి, విను.

**నైమిషే నిమిష క్షేత్రే యజ్జాతం వృత్తమద్భుతమ్ ।**
**తత్కిం న స్మర్యతే దక్ష విస్మృతం కిం కుబుద్ధినా ॥26॥**

ఓయీ దక్షా! నైమిషారణ్యంలో నిమిష క్షేత్రంలో జరిగిన అద్భుత వృత్తాంతం నీకు గుర్తులేదా? దుష్టబుద్ధితో నీవు దానిని విస్మరించావా?

**రుద్ర కోపాచ్చ కోహ్యత్ర సమర్థో రక్షణే తవ ।**
**నయస్యాభిమతం దక్ష యస్త్వాం రక్షతి దుర్మతిః ॥27॥**

రుద్రుని కోపంనుండి నిన్ను రక్షించగల సమర్థుడు ఇక్కడ ఎవడున్నాడు? ఓయీ దక్షా నిన్ను రక్షింపవలెనను ఇచ్ఛ లేనివారెవ్వరు? కాని దుర్మార్గుడు మాత్రమే నిన్ను రక్షించడానికి ప్రయత్నిస్తాడు.

**కిం కర్మ కిమకర్మేతి తన్న పశ్యసి దుర్మతే ।**
**సమర్థం కేవలం కర్మ న భవిష్యతి సర్వదా ॥28॥**

ఓ దుర్మతీ! 'ఏపనిని చేయాలి? దేనిని చేయకూడదు?' అను వివేకం నీకు లేదు. కర్మాచరణ చేసినంత మాత్రంచేత సర్వదా కర్మఫలము సంప్రాప్తింపదు.

**స్వకర్మ విద్ధి తద్యేన సమర్థత్వే న జాయతే ।**
**నత్వన్యః కర్మణో దాతా శంభవేదీశ్వరం వినా ॥29॥**

ఎట్టి కర్మాచరణవలన మానవుడు ఉన్నతిని పొందునో అది అతని కర్తవ్య కర్మఅగునని తెలుసుకొనుము. కర్మలకు శుభఫలాలనిచ్చేవాడు ఈశ్వరుడు మాత్రమేగాని మరియొకడు కాదు.

**ఈశ్వరస్య చ యో భక్త్యా శాంతస్తద్గతమానసః ।**
**కర్మణో హి ఫలం తస్య ప్రయచ్ఛతి తదా శివః ॥30॥**

ఎవడైతే మనస్సును శివునిపై నిలిపి, శాంతచిత్తంతో ఈశ్వరునారాధిస్తాడో అట్టివానికి కర్మాంతంలో శివుడు కర్మఫలాన్ని అనుగ్రహిస్తాడు.

**కేవలం జ్ఞానమాశ్రిత్య నిరీశ్వరపరా నరాః ।**
**నిరయం తే చ గచ్ఛంతి కల్పకోటి శతాని చ ॥31॥**

కేవలం జ్ఞానాన్ని ఆశ్రయించి, ఈశ్వరుని సేవింపని నరుడు వందకోటి కల్పాంతముల వరకు నరకంలోనే ఉంటాడు.

**పునః కర్మమయైః పాశైర్బద్ధా జన్మని జన్మని ।**
**నిరయేషు ప్రపచ్యంతే కేవలం కర్మరూపిణః ॥32॥**

కేవలము కర్మలనాచరించువారు కర్మపాశబద్ధులై జన్మజన్మలయందు నరకప్రాయమైన బ్రదుకులలోనే పచనం గావింపబడుతుంటారు.

**అయం రుద్రగణాధీశో వీరభద్రోఽరి మర్దనః ।**
**రుద్రకోపాగ్ని సంభూతః సమాయాతోఽధ్వరాంగణే ॥33॥**

రుద్రగణాధీశుడు, శత్రు సంహారకర్త, రుద్ర కోపాగ్నినుండి సముద్భూతమైనవాడు నగు వీరభద్రుడు యజ్ఞశాల వద్దకు వచ్చుచున్నాడు.

**అయమస్మద్వినాశార్థ మాగతోఽస్తి న సంశయః ।**
**అశక్యమస్య నాస్త్యేవ కిమప్యస్తు తు వస్తుతః ॥34॥**

ఇతడు మనలను నాశనం చేయడానికే వచ్చాడనడంలో సందేహం లేదు. ఎట్టి కార్యమైనను ఇతనికి శక్యంకానిది లేనేలేదు.

**ప్రజ్వాల్యాస్మానయం సర్వాన్ ధ్రువమేవ మహాప్రభుః ।**
**తతః ప్రశాంతహృదయో భవిష్యతి న సంశయః ॥35॥**

మహాప్రభువగు ఈ వీరభద్రుడు నిశ్చయముగా మనలనందరిని కాల్చి చంపిన పిమ్మట మాత్రమే ప్రశాంత హృదయుడు కాగలడు. ఇందులో సందేహములేదు.

**శ్రీ మహాదేవ శపథం సముల్లంఘ్య భ్రమాన్మయా ।**
**యతః స్థితం తతః ప్రాప్యం మయా దుఃఖం త్వయా సహ ॥36॥**

మహాదేవునిపై దధీచి చేసిన శపథాన్ని నేను భ్రమతో ఉల్లంఘించి, ఇక్కడనే ఉన్నకారణంచేత నీతోబాటు నాకుకూడా దుఃఖప్రాప్తి అనివార్యమయ్యింది.

**శక్తిర్మమ తు నాస్త్యేవ దక్షాద్యైతన్నివారణే ।**
**శపథోల్లంఘనాదేవ శివద్రోహీ యతోఽస్మ్యహమ్ ॥37॥**

ఓ దక్షా! ఈనాడు ఈతనిని నివారింపగల శక్తి నాకులేదు. ఎందువలననగా నేను ఆ శపథాన్ని ఉల్లంఘించి శివద్రోహినైనాను.

**కాలత్రయేఽపి న యతో మహేశ ద్రోహిణాం సుఖమ్ ।**
**తతోఽవశ్యం మయా ప్రాప్తం దుఃఖమద్య త్వయా సహ ॥38॥**

మహేశ్వర ద్రోహులు ముక్కాలములందును సుఖమును పొందజాలరు. అందువలన నీతోబాటు నాకుకూడా ఈనాడు నిశ్చయంగా దుఃఖం సంప్రాప్తమయ్యింది.

**సుదర్శనాభిధం చక్రమేతస్మిన్న లగిష్యతి ।**
**శైవచక్రమిదం యస్మాదశైవలయకారణమ్ ॥39॥**

సుదర్శనమను పేరుగల నాయీ చక్రము ఇతనిని తాకజాలదు. ఏలననగా ఇది శైవ చక్రము. కావున ఇది శివభక్తులు కానివారిని మాత్రమే సంహరిస్తుంది.

**వినాపి వీరభద్రేణ నామైతచ్చక్రమైశ్వరమ్ ।**
**హత్వా గమిష్యత్యధునా స త్వరం హరసన్నిధౌ ॥40॥**

వీరభద్రుడు లేకున్నను ఈ ఈశ్వర చక్రము ఇప్పుడు శీఘ్రంగా మనలను సంహరించి, శివునివద్దకు వెళ్ళగలుగుతుంది.

**శైవం శపథముల్లంఘ్య స్థితం మాం చక్రమీదృశమ్ ।**
**అసంహత్యైవ సహసా కృపయైవ స్థిరం పరమ్ ॥41॥**

శివ సంబంధమైన శపథాన్ని ఉల్లంఘించియున్న నన్ను ఈ చక్రము ఇప్పటివరకు ఈ విధంగా సంహరింపక పోవుటను గొప్ప దయగా భావించవచ్చును.

**అతః పరమిదం చక్రమపి న స్థాస్యతి ధ్రువమ్ ।**
**గమిష్యత్యధునా శీఘ్రం జ్వాలామాలా సమాకులమ్ ॥42॥**

ఇటుపై ఈచక్రం నిశ్చయముగా నావద్ద ఉండబోదు. ఇది ఇప్పుడే అగ్ని కీలలను వెడలగ్రక్కుచు శీఘ్రంగా వెళ్ళగలదు.

**వీరభద్రః పూజితోఽపి శీఘ్రమస్మాభిరాదరాత్ ।**
**మహాక్రోధ సమాక్రాంతో నాస్మాన్సంరక్షయిష్యతి ॥43॥**

మనము వెంటనే వీరభద్రుని అత్యంత ఆదరముతో పూజించినప్పటికిని, మహాక్రోధంతో నిండియున్న అతడు మనలను రక్షింపడు.

**అకాండ ప్రలయోఽస్మాక మాగతోద్య హి హా హహా ।**
**హా హా బత తవేదానీం నాశోస్మాకముపస్థితః ॥44॥**

హా!హా! మనపై అకాల ప్రళయం వచ్చిపడినది. ఇప్పుడు నీవు మేము కూడ వినాశము యొక్క ముంగిటనున్నాము.

**శరణ్యోఽస్మాక మధునా నాస్త్యేవహి జగత్త్రయే ।**
**శంకరద్రోహిణో లోకే కశ్శరణ్యో భవిష్యతి ॥45॥**

ముల్లోకాలలో మనకిప్పుడు శరణమునిచ్చువాడెవ్వడును లేనేలేడు. లోకంలో శివద్రోహికి శరణమిచ్చువాడు ఎవడుంటాడు?

**తనునాశేఽపి సంప్రాప్యా స్తైశ్చాపి యమయాతనాః ।**
**తానైవ శక్యతే సోఢుం బహుదుఃఖ ప్రదాయినీః ॥46॥**

ఈ దేహము నశించినప్పటికిని శివద్రోహులకు యమయాతనలు తప్పవు. యముడు పెట్టే యాతనలు బహుదుఃఖాలను కలిగిస్తాయి. వాటిని సహించడమెవరికిని శక్యముకాదు.

**శివద్రోహిణమాలోక్య దష్టదంతో యమః స్వయమ్ ।**
**తప్తతైలకటాహేషు పాతయత్యేవ నాన్యథా ॥47॥**

శివద్రోహిని చూచి, యముడు దంతములను పటపట కొరికి, కాగుచున్న నూనెతో నిండిన గుండిగలలోనికి స్వయముగా విసిరివేస్తాడు. దానిని తప్పించుకోవడం అసంభవం.

**గంతుమేవాహ ముద్యుక్తః సర్వథా శపథోత్తరమ్ ।**
**తథాపి న గత శ్శీఘ్రం దుష్టసంసర్గపాపతః ॥48॥**

దధీచి శపథం అయిన వెంటనే నేను వెళ్ళిపోవడానికి సంసిద్ధుడనయ్యాను. అయినప్పటికి దుష్ట సంసర్గం (చెడు సహవాసం) అనే పాపంవల్ల వెంటనే వెళ్ళలేకపోయాను.

**యదద్య క్రియతేఽస్మాభిః పలాయనమిత స్తదా ।**
**శార్వోనా కర్షక శ్శస్త్రై రస్మా నాకర్షయిష్యతి ॥49॥**

మనమిప్పుడు ఇక్కడనుండి పారిపోయినప్పటికి, శర్వుని కుమారుడైన వీరభద్రుడు (శార్వుడు) తన శస్త్రాలచే మనలను ఆకర్షించగలడు.

**స్వర్గే వా భువి పాతాళే యత్ర కుత్రాపి వా యతః ।**
**శ్రీవీరభద్రశస్త్రాణాం గమనం నహి దుర్లభమ్ ॥50॥**

స్వర్గంలోగాని, భూమండలంలోగాని, పాతాళంలోగాని మరియొక స్థలమందుగాని, ఎక్కడైననుగాని శ్రీవీరభద్రుని శస్త్రములు ప్రవేశింపలేని స్థలమెందునా లేదు.

**యావంతశ్చ గణాస్సంతి శ్రీరుద్రస్య త్రిశూలినః ।**
**తావతామపి సర్వేషాం శక్తిరేతాదృశీ ధ్రువమ్ ॥51॥**

త్రిశూలధారియైన శ్రీరుద్రుని గణాలెందరు గలరో వారికందరికికూడ నిశ్చయంగా ఇటువంటి శక్తియే కలదు.

**శ్రీకాలభైరవః కాశ్యాం నఖాగ్రేణైవ లీలయా ।**
**పురా శిరశ్చ చిచ్ఛేద పంచమం బ్రహ్మణో ధ్రువమ్ ॥52॥**

పూర్వకాలంలో కాశీ మహానగరంలో బ్రహ్మయొక్క ఐదవ శిరస్సును గోటికొనతో లీలగా శ్రీకాలభైరవుడు తృంచాడుగదా!

**ఏతదుక్త్వా స్థితో విష్ణు రతిత్రస్త ముఖామ్బుజః ।**
**వీరభద్రోఽపి సంప్రాప తదైవాఽధ్వరమండపమ్ ॥53॥**

విష్ణువిట్లు పలికి, అక్కడ నిలబడియున్నాడు. అతని ముఖపద్మము మిక్కిలి భయాన్ని కలిగిస్తున్నది. ఆ సమయమునందే వీరభద్రుడు కూడ యాగమండపము వద్దకు చేరినాడు.

**ఏవం బ్రువతి గోవింద ఆగతం సైన్యసాగరమ్ ।**
**వీరభద్రేణ సహితం దదృశుశ్చ సురాదయః ॥54॥**

గోవిందుడు ఈవిధముగా పలుకుచుండగానే సైన్యసముద్రం వీరభద్రునితోకూడి, అక్కడకు వచ్చింది. సురాదులందరు ఆ సైన్యాన్ని చూశారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే సత్యుపాఖ్యానే విష్ణువాక్యవర్ణనం నామ పంచత్రింశోఽధ్యాయః ॥35॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో సత్యుపాఖ్యానములో విష్ణువాక్యవర్ణనం అనే ముప్పై ఐదవ అధ్యాయం సమాప్తం.

## షట్ త్రింశోఽధ్యాయః - ముప్పై ఆరవ అధ్యాయం
## విష్ణు వీరభద్రసంవాదః - విష్ణు వీరభద్రసంవాదం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇంద్రోఽపి ప్రహసన్ విష్ణుమాత్మవాదరతం తదా ।**
**వజ్రపాణిస్సురైస్సార్ధం యోద్ధుకామోఽభవత్తదా ॥1॥**

అప్పుడీవిధంగా విష్ణువు తన అభిప్రాయాన్ని ప్రకటించగా ఇంద్రుడాయనను పరిహసించి, వజ్రాయుధాన్ని చేతబట్టి, దేవతలతోగూడి యుద్ధానికి సంసిద్ధుడయ్యాడు.

**తదేంద్రో గజమారూఢో బస్తారూఢోఽనలస్తథా ।**
**యమో మహిషమారూఢో నిరృతిః ప్రేతమేవ చ ॥2॥**

**పాశీచ మకరారూఢో మృగారూఢో స్సదాగతిః ।**
**కుబేరః పుష్పకారూఢ స్సంనద్ధోఽభూదతంద్రితః ॥3॥**

**తథాన్యే సురసంఘాశ్చ యక్ష చారణ గుహ్యకాః ।**
**ఆరుహ్య వాహనాన్యేవ స్వాని స్వాని ప్రతాపినః ॥4॥**

అంతట ఇంద్రుడు ఐరావతమనే ఏనుగును, అగ్ని మేకను, యముడు దున్నను, నిరృతి ప్రేతాన్ని, వరుణుడు మొసలిని, వాయువు లేడిని, కుబేరుడు పుష్పకాన్ని అధిష్ఠించి, జాగరూకత గలవాడై యుద్ధానికి సిద్ధమయ్యారు. అదేవిధంగా ప్రతాపవంతులైన తక్కిన దేవతలు యక్షులు, చారణులు, గుహ్యకులు తమతమ వాహనాలను అధిష్ఠించారు.

**తేషాముద్యోగ మాలోక్య దక్షశ్చాసృఙ్ముఖ స్తథా ।**
**తదంతికం సమాగత్య సకళత్రోఽభ్యభాషత ॥5॥**

ఈవిధంగా దేవతలందరు గావించే యుద్ధ ప్రయత్నాలను చూచి, దక్షుడు రక్తపూరితమైన ముఖముతో, భార్యతోకూడి ఇలాపలికాడు.

**దక్ష ఉవాచ** - దక్షుడు పలికాడు.

**యుష్మద్బలేనైవ మయా యజ్ఞః ప్రారంభితో మహాన్ ।**
**సత్కర్మ సిద్ధయే యూయం ప్రమాణాస్స్యు ర్మహాప్రభాః ॥6॥**

మహాత్ములారా! మీ బలంచేతనే నేనీయజ్ఞాన్ని ప్రారంభించాను. ఈ సత్కర్మ సిద్ధిని పొందడానికి ప్రభావ వంతులైన మీరే ప్రమాణము.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**తచ్ఛ్రుత్వా దక్షవచనం సర్వే దేవాస్సవాసవాః ।**
**నిర్యయు స్త్వరితం తత్ర యుద్ధం కర్తుం సముద్యతాః ॥7॥**

దక్షుని మాటలను విని ఇంద్రునితోసహా దేవతలందరు యుద్ధంచేయడానికి సముద్యుక్తులై శీఘ్రంగా వెళ్ళారు.

**అథ దేవగణాస్సర్వే యుయుధుస్తే బలాన్వితాః ।**
**శక్రాదయో లోకపాలా మోహితాః శివమాయయా ॥8॥**

అంతట సమస్త దేవగణాలు, బలాన్వితులైన ఇంద్రాది లోకపాలకులు, శివమాయా మోహితులై యుద్ధాన్ని చేశారు.

**దేవానాం చ గణానాం చ తదాసీత్సమరో మహాన్ ।**
**తీక్ష్ణ తోమర నారాచై ర్యుయుధుస్తే పరస్పరమ్ ॥9॥**

అప్పుడు దేవతలకు, రుద్రగణాలకు మధ్య గొప్ప యుద్ధం చెలరేగింది. వారు పదునైన బల్లెములతోను, ఇనుప బాణాలతోను, ఒకరితో నొకరు యుద్ధం చేశారు.

**నేదుశ్శంఖాశ్చ భేర్యశ్చ తస్మిన్ రణమహోత్సవే ।**
**మహాదుందుభయో నేదుః పటహా డిండిమాదయః ॥10॥**

యుద్ధమనే ఆ మహాసంరంభంలో శంఖాలు, భేరీలు, మహాదుందుభులు, పటహాలు, డిండిమములు మున్నగు వాద్యాలు మ్రోగినవి.

**తేన శబ్దేన మహతా శ్లాఘ్యమానాస్తదా సురాః ।**
**లోకపాలైశ్చ సహితా జఘ్నుస్తాన్ శివకింకరాన్ ॥11॥**

ఆ మహాశబ్దంచేత ప్రోత్సాహితులైన దేవతలు, లోకపాలురతో కూడినవారై, శివకింకరులను సంహరింపజొచ్చిరి.

**ఇంద్రాద్యై ర్లోకపాలైశ్చ గణాశ్శంభో పరాఙ్ముఖాః ।**
**కృత్తాశ్చ మునిశార్దూల భృగోర్మంత్రబలేన చ ॥12॥**

ఇంద్రాది లోకపాలురు, శివగణాలను వెనుదిరిగేటట్లు చేశారు. ఓ మహర్షీ! వారు భృగువు యొక్క మంత్రబలంచే సంహరింపబడ్డారు.

**ఉచ్చాటనం కృతం తేషాం భృగుణా యజ్వనా తదా ।**
**యజనార్థం చ దేవానాం తుష్ట్యర్థం దీక్షితస్య చ ॥13॥**

యజ్వయగు భృగువు దేవతలకు హవిర్భాగాలనిచ్చి, యజ్ఞ దీక్షితుడైన దక్షుని సంతోషపెట్టడానికి తన మంత్రబలంచే రుద్రగణాలను తరిమివేశాడు.

**పరాజితాన్ స్వకాన్ దృష్ట్వా వీరభద్రో రుషాన్వితః ।**
**భూతప్రేత పిశాచాంశ్చ కృత్వా తానేవ పృష్ఠతః ॥14॥**

**వృషభస్థాన్ పురస్కృత్య స్వయంచైవ మహాబలః ।**
**మహాత్రిశూలమాదాయ పాతయామాస నిర్జరాన్ ॥15॥**

తన బలాలు పరాజితులౌటను చూచి, వీరభద్రుడు మిక్కిలి కోపంతో భూతప్రేత పిశాచాది గణాలను వెంటనిడుకొని వృషభములనధిష్ఠించిన గణాలు ముందు నడుచుచుండగా మహాబలుడగు నతడు స్వయంగా మహాత్రిశూలాన్ని ధరించి, దేవతలను పడగొట్టడం ప్రారంభించాడు.

**దేవాన్ యక్షాన్ సాధ్యగణాన్ గుహ్యకాన్ చారణానపి ।**
**శూలఘాతైశ్చ తే సర్వే గణావేగాత్ ప్రజఘ్నిరే ॥16॥**

అప్పుడు దేవతలను, యక్షులను, సాధ్యులను, గుహ్యకులను, మరియు చారణులను రుద్రగణాలు శూలంచే పొడిచి, వేగంగా సంహరింపసాగారు.

**కేచిద్ద్విధా కృతాః ఖడ్గై ర్ముద్గరైశ్చ విపోథితాః ।**
**అన్యైశ్చ్శస్త్రైరపి సురా గణైర్భిన్నాస్తదాఽభవన్ ॥17॥**

కొందరిని ఖడ్గాలతో రెండు ముక్కలుగా చేశారు. మరికొందరిని రోకళ్ళతో పొడిచి చంపారు. ఆ యుద్ధంలో శివగణాలు దేవతలను ఇతర ఆయుధాలతోకూడా కొట్టి చంపుతున్నారు.

**ఏవం పరాజితాస్సర్వే పలాయనపరాయణాః ।**
**పరస్పరం పరిత్యజ్య గతా దేవాస్త్రివిష్టపమ్ ॥18॥**

ఈవిధంగా దేవతలందరు పరాజితులై, ఒకరితో మరియొకరికి సంబంధంలేకుండా ఒకరినొకరు విడిచి పారిపోయి స్వర్గం చేరారు.

**కేవలం లోకపాలాస్తే శక్రాద్యా స్తస్థు రుత్సుకాః ।**
**సంగ్రామే దారుణే తస్మిన్ ధృత్వా ధైర్యం మహాబలాః ॥19॥**

ఆ భయంకర సంగ్రామంలో మహాబలవంతులైన ఇంద్రాది లోకపాలురు మాత్రమే ఉత్సాహంతో, ధైర్యంతో ఉన్నారు.

**సర్వే మిళిత్వా శక్రాద్యా దేవాస్తత్ర రణాజిరే ।**
**బృహస్పతిం చ పప్రచ్ఛు ర్వినయావనతా స్తదా ॥20॥**

ఆ రణరంగంలో ఇంద్రాదులందరు కలిసి, సంప్రదించుకొని, బృహస్పతి వద్దకు వెళ్ళి, వినయంతో నమస్కరించి ఇలా ప్రశ్నించారు.

**లోకపాలా ఊచుః -** లోకపాలురు పలికారు.

**గురో బృహస్పతే తాత మహాప్రాజ్ఞ దయానిధే ।**
**శీఘ్రం వద పృచ్ఛతో నః కుతోఽస్మాకం జయో భవేత్ ॥21॥**

హే గురో! బృహస్పతీ! తండ్రీ! నీవు మహాప్రాజ్ఞుడవు, దయానిధివి, మా ప్రశ్నలకు త్వరగా సమాధానములనిమ్ము. మాకు విజయం లభించే ఉపాయమేది?

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తేషాం స్మృత్వా శంభుం ప్రయత్నవాన్ ।**
**బృహస్పతిరువాచేదం మహేన్ద్రం జ్ఞానదుర్బలమ్ ॥22॥**

వారి మాటలను వినిన బృహస్పతి ప్రయత్నపూర్వకముగా శంభుని స్మరించి, జ్ఞాన దుర్బలుడైన మహేంద్రునితో ఇలా పలికాడు.

**బృహస్పతి రువాచ –** బృహస్పతి పలికాడు.

**యదుక్తం విష్ణునా పూర్వం తత్సర్వం జాతమద్య వై ।**
**తదేవ వివృణోమీన్ద్ర సావధానతయా శృణు ॥23॥**

పూర్వం విష్ణువు చెప్పినదంతయు ఇప్పుడు మనయెదుట జరుగుచున్నది. ఓ ఇంద్రా! ఆ వివరాలన్ని చెబుతాను. సావధానంగా వినుము.

**అస్తి యశ్చేశ్వరః కశ్చిత్ ఫలదః సర్వకర్మణామ్ ।**
**కర్తారం భజతే సోఽపి న స్వకర్తుః ప్రభుర్హి సః ॥24॥**

ఓయీ! కర్మలన్నిటికిని ఫలములనిచ్చు ఈశ్వరుడొకడున్నాడు. ఆయనకూడ కర్మఫలముల నిచ్చుటలో కర్తయొక్క కర్మలపై ఆధారపడియే యుండును. కర్మలేని సందర్భంలో ఆ ఈశ్వరుడైనను ఫలముల నీయలేడు.

**నమన్త్రౌషధయస్సర్వే నాభిచారా న లౌకికాః ।**
**న కర్మాణి న వేదాశ్చ న మీమాంసాద్వయం తథా ॥25॥**

**అన్యాన్యపి చ శాస్త్రాణి నానావేదయుతాని చ ।**
**జ్ఞాతుం నేశం సంభవంతి వదంత్యేవం పురాతనాః ॥26॥**

**న స్వజ్ఞేయో మహేశానస్సర్వ వేదాయుతేన సః ।**
**భక్తేరనన్య శరణై ర్నాన్యథేతి మహాశ్రుతిః ॥27॥**

సర్వమంత్రములు, ఓషధులు, అభిచారకర్మలు, లౌకికకర్మలు, వేదోక్తకర్మలు, వేదములు, పూర్వోత్తర మీమాంసలు, ఇతరశాస్త్రములు మరియు నానావేదములు కూడా ఈశ్వరుని గూర్చి తెలియజేయలేవని పురాతనులైనవారు చెబుతుంటారు. వేదాలనన్నిటిని ఆపోశనం పట్టినప్పటికి జీవునకు మహేశ్వరుడు సాక్షాత్కరింపడు. 'అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ (నీవేతప్ప వేరేగతిలేదు)' అని శరణు పొందిన భక్తులకు మాత్రమే ఆయన దర్శనమిస్తాడు. కాని మరియొక మార్గము లేదనునది స్మృతి వాక్యము.

**శాంత్యా చ పరయా దృష్ట్యా సర్వథా నిర్వికారయా ।**
**తదనుగ్రహతో నూనం జ్ఞాతవ్యో హి సదాశివః ॥28॥**

సదాశివుని అనుగ్రహంచే శాంతము, సర్వశ్రేష్ఠము, సర్వ వికార నిర్ముక్తమునైన దృష్టి లభిస్తుంది. ఆ దృష్టిచేత మాత్రమే సదాశివుడు నిశ్చయంగా తెలియబడతాడు.

**పరం తు సంవదిష్యామి కార్యాకార్య వివక్షితౌ ।**
**సిద్ధ్యంశం చ సురేశాన తం శృణు త్వం హితాయ వై ॥29॥**

ఓ ఇంద్రా! ఏది చేయదగినది, ఏది చేయకూడనిది అను విషయం చెబుతాను. ఇది కార్యసిద్ధికి ఆవశ్యకమైన అంశము. నీవు స్వీయ హితాన్ని కోరి వినుము.

**త్వమింద్ర బాలిశో భూత్వా లోకపాలైః సదాద్య వై ।**
**ఆగతో దక్షయజ్ఞం హి కిం కరిష్యసి విక్రమమ్ ॥30॥**

ఓఇంద్రా! నీవు మూర్ఖుడవై ఈనాడు లోకపాలకులతోకూడి దక్షుని యజ్ఞానికి విచ్చేశావు. ఇక్కడ నీవేమి పరాక్రమాన్ని చూపగలవు?

**ఏతే రుద్రసహాయాశ్చ గణాః పరమకోపనాః ।**
**ఆగతా యజ్ఞవిఘ్నార్థం తం కరిష్యన్త్యసంశయమ్ ॥31॥**

రుద్రుని సేవకులైన ఈ గణాలు పరమకోపంతో యజ్ఞాన్ని ధ్వంసం చేయడానికి విచ్చేశారు. ఆపని వారు తప్పక చేస్తారు. అందులో సందేహము లేదు.

**సర్వథా నహ్యుపాయోఽత్ర కేషాంచిదపి తత్త్వతః ।**
**యజ్ఞవిఘ్నవినాశార్థం సత్యం సత్యం బ్రవీమ్యహమ్ ॥32॥**

నేను విచారించి, సత్యాన్ని చెబుతున్నాను. ఈ యజ్ఞాన్ని రక్షించే ఉపాయం లేనేలేదు. వాస్తవంగా ఈ యజ్ఞానికి సంభవించిన విఘ్నాలను తొలగించగల సమర్థత ఎవరికి లేదు. నేను ముమ్మాటికి సత్యమైన విషయాన్ని చెబుతున్నాను.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఏవం బృహస్పతేర్వాక్యం శృత్వా తే హి దివౌకసః ।**
**చింతామాపేదిరే సర్వే లోకపాలాస్సవాసవాః ॥33॥**

బృహస్పతియొక్క పలుకులను విని దేవతలందరు లోకపాలకులు, ఇంద్రుడు, చింతాగ్రస్తులయ్యారు.

**తతోఽబ్రవీద్వీరభద్రో మహావీరగణైర్వృతః ।**
**ఇంద్రాదీన్ లోకపాలాంస్తాన్ స్మృత్వా మనసి శంకరమ్ ॥34॥**

అంతట మహావీర గణాలతో కూడిన వీరభద్రుడు మనస్సులో శంకరుని స్మరించి, ఇంద్రాది లోకపాలురతో ఇలా పలికాడు.

**వీరభద్ర ఉవాచ** – వీరభద్రుడు పలికెను.

**సర్వే యూయం బాలిశత్వాదవదానార్థమాగతాః ।**
**అవదానం ప్రయచ్ఛామి ఆగచ్ఛత మమాంతికమ్ ॥35॥**

మీరందరు మూర్ఖులు కాబట్టి యజ్ఞభాగం కొరకు వచ్చారు. మీకు యజ్ఞభాగాన్ని నేనిస్తాను. మీరు నావద్దకు రండి.

**హే శక్ర! హే శుచే! భానో! హేశశిన్! హే ధనాధిప ।**
**హే పాశపాణే! హే వాయో! నిరృతే! యమ! శేష హే ॥36॥**

**హే సురాసుర సంఘాహీహైత యూయం విచక్షణాః ।**
**అవదానాని దాస్యామి ఆతృప్త్యాద్యా సతాం వరాః ॥37॥**

హే శక్రా! హే అగ్నీ! హే సూర్యా! హే చంద్రా! హే కుబేరా! హే వరుణా! హే వాయు! హే నిరృతి! ఓ యమా! ఓ శేషా! ఓ సురాసుర గణములారా! ఓ విద్వాంసులారా! మీరిక్కడకు రండి. మీకు తృప్తి కలిగేవరకు యజ్ఞభాగాలనిస్తాను. మీరందరు దుష్టాగ్రగణ్యులు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఏవముక్త్వా సితైర్బాణైర్గఘానాథ రుషాన్వితః ।**
**నిఖిలాంస్తాన్ సురాన్ సద్యో వీరభద్రో గణాగ్రణీః ।**
**తైర్బాణైర్నిహతాస్సర్వే వాసవాద్యాః సురేశ్వరాః ॥38॥**

**పలాయన పరా భూత్వా జగ్ముస్తే చ దిశో దశ ।**
**గతేషు లోకపాలేషు విద్రుతేషు సురేషు చ ।**
**యజ్ఞవాటోపకంఠం హి వీరభద్రోఽగమద్గణైః ॥39॥**

ఈ విధంగా పలికి, గణాధ్యక్షుడైన వీరభద్రుడు కోపంతో వాడియైన బాణాలతో ఆ దేవతలనందరిని వెనువెంటనే కొట్టాడు. ఇంద్రాది లోకపాలురందరు వీరభద్రుని బాణపుదెబ్బలకు గురియై దశదిశలకు పారిపోయారు. లోకపాలకులు, దేవతలు పారిపోగానే వీరభద్రుడు స్వగణాలతోకూడి యజ్ఞశాల సమీపానికి వచ్చాడు.

**తదా తే ఋషయస్సర్వే సుభీతా హి రమేశ్వరమ్ ।**
**విజ్ఞప్తుకామాస్సహసా శీఘ్రమూచుర్నతా భృశమ్ ॥40॥**

అంతట ఋషులందరు మిక్కిలి భయపడి వేగంగా విష్ణువును సమీపించి, ఆయనకు విన్నపం చేయగోరి, నమస్కరించి ఇలా పలికారు.

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

**దేవదేవ! రమానాథ! సర్వేశ్వర! మహాప్రభో ।**
**రక్ష యజ్ఞం హి దక్షస్య యజ్ఞోఽసి త్వం న సంశయః ॥41॥**

దేవదేవా! రమానాథా! సర్వేశ్వరా! మహాప్రభో! దక్షుని యజ్ఞాన్ని రక్షింపుము. యజ్ఞము నీ స్వరూపమే అనడంలో సందేహం లేదు.

**యజ్ఞకర్మా యజ్ఞరూపో యజ్ఞాంగో యజ్ఞ రక్షకః ।**
**రక్ష యజ్ఞమతోరక్ష త్వత్తోఽన్యో నహి రక్షకః ॥42॥**

యజ్ఞకర్మను చేయువాడవు నీవే, యజ్ఞరూపుడవు నీవు. యజ్ఞాంగము నీవు. యజ్ఞ రక్షకుడవు నీవే, కావున నీవు తప్పక యజ్ఞాన్ని రక్షింపుము. నీవు తక్క మరియొక రక్షకుడు లేడు.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తేషామృషీణాం వచనం హరిః ।**
**యోద్ధుకామో భయాద్విష్ణుర్వీరభద్రేణ తేన వై ॥43॥**

మహర్షుల మాటలను విని విష్ణువు యుద్ధం చేయగోరాడు. కాని ఆ వీరభద్రునితో యుద్ధానికి భయపడుతున్నాడు.

**చతుర్భుజస్సునంనద్ధో చక్రాయుధధరః కరైః ।**
**మహాబలోమరగణై ర్యజ్ఞవాటాత్స నిర్యయౌ ॥44॥**

నాలుగుభుజాలతో చక్రాది ఆయుధాలను ధరించి మహాబలుడైన శ్రీమహావిష్ణువు దేవగణాలతో కూడి వీరభద్రునితో యుద్ధంచేయడానికి సన్నద్ధుడై యజ్ఞవాటికనుండి బయటకు వెళ్లాడు.

**వీరభద్రః శూలపాణి ర్నానాగణసమన్వితః ।**
**దదర్శ విష్ణుం సంనద్ధం యోద్ధుకామం మహాప్రభుమ్ ॥45॥**

వివిధశైవగణాలతో కూడినట్టియు, శూలపాణియైనట్టియు వీరభద్రుడు, యుద్ధకాముడై వచ్చిన మహా ప్రభువైన శ్రీమహావిష్ణువును చూశాడు.

**తం దృష్ట్వా వీరభద్రోభూద్భ్రుకుటీకుటిలాననః ।**
**కృతాంత ఇవ పాపిష్ఠం మృగేంద్ర ఇవ వారణమ్ ॥46॥**

పాపాత్ముని చూసిన యమునివలె, ఏనుగును చూసిన సింహంవలె, విష్ణువును చూసిన వీరభద్రుడు కనుబొమలు ముడిపడిన ముఖం కలవాడయ్యాడు. అనగా కోపోద్రిక్తుడు అయ్యాడు.

**తథావిధం హరిం దృష్ట్వా వీరభద్రోరిమర్దనః ।**
**అవదత్త్వరితః క్రుద్ధో గణైర్వీరైస్సమావృతః ॥47॥**

అంతట శత్రుమర్దనుడు, వీరులైన శైవగణాలతో కూడినవాడు అయిన వీరభద్రుడు యుద్ధకాముడై వచ్చిన హరిని చూసి, క్రుద్ధుడై వేగంగా అతనితో ఇలా పలికాడు.

**వీరభద్ర ఉవాచః –** వీరభద్రుడు పలికాడు.

**రేరే హరే మహాదేవ శపథోల్లంఘనం త్వయా ।**
**కథమద్య కృతం చిత్తే గర్వః కిమభవత్తవ ॥48॥**

ఓరీ! హరీ! మహాదేవుడు చేసిన శపథాన్ని నీవు ఈనాడు ఏవిధంగా ఉల్లంఘించావు? నీకు ఇంతటిగర్వం ఎందులకు కలిగింది?

**తవ శ్రీరుద్రశపథోల్లంఘనే శక్తిరస్తి కిమ్ ।**
**కోవా త్వమసి కోవా తే రక్షకోస్తి జగత్త్రయే ॥49॥**

నీకు రుద్రుని శాసనాన్ని శపథాన్ని ఉల్లంఘించే శక్తి ఉన్నదా? నీవెవడవు? ముల్లోకాలలో నిన్ను రక్షించే వాడెవడైనా ఉన్నాడా?

**అత్ర త్వమాగతః కస్మాద్వయం తన్నైవ విద్మహే ।**
**దక్షస్య యజ్ఞపాతాత్వం కథం జాతోఽసి తద్వద ॥50॥**

నీవిక్కడకు రావడంలోగల కారణం మాకు తెలియడంలేదు. నీవు దక్షుని యజ్ఞానికి రక్షకుడవెట్లయ్యావో చెప్పుము.

**దాక్షాయణ్యాకృతం యచ్చ తన్నదృష్టం కిము త్వయా ।**
**ప్రోక్తం యచ్చ దధీచేన శ్రుతం తన్న కిము త్వయా ॥51॥**

దాక్షాయణి ఏమిచేసినదో నీవు చూడలేదా? దధీచుని పలుకులను నీవు వినలేదా?

**త్వఞ్చాపి దక్షయజ్ఞేఽస్మిన్నవదానార్థ మాగతః ।**
**అవదానం ప్రయచ్ఛామి తవ చాపి మహాభుజ ॥52॥**

నీవుకూడా యజ్ఞభాగం కొరకు ఈ దక్షయజ్ఞానికి వచ్చావుగదా! హే మహాభుజా! నీకుకూడా యజ్ఞభాగాన్ని నేనిస్తాను.

**వక్షో విదారయిష్యామి త్రిశూలేన హరే తవ ।**
**కస్తవాస్తి సమాయాతో రక్షకోఽద్య మమాంతికమ్ ॥53॥**

హే హరీ! నేనీనాడు నీ వక్షఃస్థలాన్ని త్రిశూలంతో చీల్చివేస్తాను. ఇప్పుడు నిన్ను రక్షించడానికి నా సమీపానికి ఎవడు రాగలడో చూస్తాను?

**పాతయిష్యామి భూపృష్ఠే జ్వాలయిష్యామి వహ్నినా ।**
**దగ్ధం భవంత మధునా పేషయిష్యామి సత్వరమ్ ॥54॥**

నేను నిన్ను నేలపై పడవేసి, అగ్నితో దగ్ధంచేసి, దగ్ధుడవైన నిన్ను శీఘ్రంగా పిండిచేస్తాను.

**రే! రే! హరే! దురాచార! మహేశ విముఖాధమ ।**
**శ్రీమహారుద్ర మాహాత్మ్యం కిన్న జానాసి పావనమ్ ॥55॥**

రే! రే! హరీ! దురాచారా! శంకరునికి విముఖమైనవాడా! అధమా! పావనమైన శ్రీమహారుద్ర మాహాత్మ్యం నీవు ఎరుగవా?

**తథాపి త్వం మహాబాహో యోద్ధుకామోఽగ్రతః స్థితః ।**
**నేష్యామి పునరావృత్తిం యది తిష్ఠేస్త్వమాత్మనా ॥56॥**

నీవా మహిమను తెలిసినప్పటికిని యుద్ధము చేయగోరి, నాయెదుట నిలబడ్డావు. నీవు నాయెదుట నిలబడినట్లయితే మరల తిరిగి రాకుండునట్లు చేస్తాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**తస్య తద్వచనం శ్రుత్వా వీరభద్రస్య బుద్ధిమాన్ ।**
**ఉవాచ విహసన్ ప్రీత్యా విష్ణుస్తత్ర సురేశ్వరః ॥57॥**

ఆ వీరభద్రుని మాటలను విని, బుద్ధిమంతుడు, దేవనాయకుడు అగు విష్ణువు ప్రేమతో నవ్వుతూ ఇలా పలికాడు.

**విష్ణురువాచ** - విష్ణువు పలికాడు.

**శృణు త్వం వీరభద్రాద్య ప్రవక్ష్యామి త్వదగ్రతః ।**
**న రుద్ర విముఖం మాం త్వం వద శంకరసేవకమ్ ॥58॥**

వీరభద్రా! నీముందు నేను చెప్పబోవు పలుకులను నీవు వినుము. శంకర సేవకుడనైన నన్ను గురించి నీవు రుద్ర విరోధియని పలుకవద్దు.

**అనేన ప్రార్థితః పూర్వం యజ్ఞార్థం చ పునః పునః ।**
**దక్షేణావిదితార్థేన కర్మనిష్ఠేన మౌఢ్యతః ॥59॥**

తత్త్వమునెరుంగనివాడును, అజ్ఞానమువలన కేవలము కర్మయందు మాత్రమే నిష్ఠ కలవాడునగు దక్షుడు పూర్వము నన్ను యజ్ఞమునకు రావలసినదిగా అనేక పర్యాయములు ప్రార్థించియున్నాడు.

**అహం భక్తపరాధీన స్తథా సోఽపి మహేశ్వరః ।**
**దక్షో భక్తో హి మే తాత తస్మాదత్రాగతో మఖే ॥60॥**

నేను భక్తపరాధీనుడనుగదా! మహేశ్వరుడుకూడా అట్టివాడేగదా! దక్షుడు నాభక్తుడు. అందువలననే నేనీయజ్ఞానికి వచ్చియున్నాను.

**శృణు ప్రతిజ్ఞాం మే వీర రుద్రకోపసముద్భవ ।**
**రుద్రతేజస్స్వరూపో హి సుప్రతాపాలయ ప్రభో ॥61॥**

రుద్రకోప సముద్భవా! వీరా! నాప్రతిజ్ఞను వినుము. రుద్రతేజస్సు స్వరూపంగాగల నీవు గొప్ప పరాక్రమశాలివి.

**అహం నివారయామి త్వాం త్వం చ మాం వినివారయ ।**
**తద్భవిష్యతి యద్భావి కరిష్యేఽహం పరాక్రమమ్ ॥62॥**

నీవు నన్ను అడ్డుకొనుము. నేనునిన్ను అడ్డుకుంటాను. ఏది జరగవలెనో అదియే జరుగుతుంది. నేను నా పరాక్రమాన్ని చూపిస్తాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తవతి గోవిన్దే ప్రహస్య స మహాభుజః ।**
**అవదత్సు ప్రసన్నోఽస్మి త్వాం జ్ఞాత్వాస్మత్ప్రభోః ప్రియమ్ ॥63॥**

గోవిందుడిట్లు పలుకగానే మహాబాహుడగు వీరభద్రుడు నవ్వి, 'నీవు మా ప్రభుడగు రుద్రునకు ప్రియుడవని తెలిసి నేను మిక్కిలి సంతసించాను' అని పలికాడు.

**తతో విహస్య సుప్రీతో వీరభద్రో గణాగ్రణీః ।**
**ప్రశ్రయావనతోఽవాదీద్విష్ణుం దేవం హి తత్త్వతః ॥64॥**

అంతట గణాగ్రణియైన వీరభద్రుడు సుప్రీతుడై నవ్వుతూ వినయంతో విష్ణుదేవునకు యథార్థంగా నమస్కరించి ఇలా పలికాడు.

**వీరభద్ర ఉవాచ –** వీరభద్రుడు పలికాడు.

**తవ భావపరీక్షార్థమిత్యుక్తం మే మహాప్రభో ।**
**ఇదానీం తత్త్వతో వచ్మి శృణు త్వం సావధానతః ॥65॥**

హే మహాప్రభో! నీ మనసులోని భావపరీక్షకొరకే నేనిలా పలికాను. ఇప్పుడు యథార్థమును చెబుతున్నాను. నీవు సావధానముగా వినుము.

**యథా శివ స్తథా త్వం హి యథా త్వం చ తథా శివః ।**
**ఇతి వేదా వర్ణయంతి శివశాసనతో హరే ॥66॥**

శివుడెట్లో నీవునూ అట్లే. నీవెట్లో శివుడునూ అట్లే. ఓహరీ! శివుని శాసనంచే వేదాలు ఈవిధంగానే వర్ణిస్తున్నాయి.

**శివాజ్ఞయా వయం సర్వే సేవకాః శంకరస్య వై ।**
**తథాపి చ రమానాథ ప్రవాదోచితమాదరాత్ ॥67॥**

మనమందరము శివుని ఆజ్ఞను పాటించు ఆయన సేవకులము మాత్రమే. హే రమానాథా! ఈ ఘర్షణకు అనురూపంగా మాత్రమే నేనీరీతిని పలికియున్నాను. అయినప్పటికి నాయందాదరమును చూపుము.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**తచ్ఛ్రుత్వా వచనం తస్య వీరభద్రస్య సోఽచ్యుతః ।**
**ప్రహస్యేదం ప్రోవాచ వీరభద్రమిదం వచః ॥68॥**

వీరభద్రుని మాటలను విని, అచ్యుతుడు చిరునవ్వునవ్వి, వీరభద్రునితో ఇలా పలికాడు.

**విష్ణురువాచ -** విష్ణువు పలికాడు.

**యుద్ధం కురు మహావీరా మయా సార్ధమశంకితః ।**
**తవాస్త్రైః పూర్యమాణోఽహం గమిష్యామి స్వమాశ్రమమ్ ॥69॥**

ఓ మహావీరా! నీవు శంకనువీడి నాతో యుద్ధమును చేయుము. నీ అస్త్రాలతో నా శరీరము నిండిన పిదప నేను నా స్థానానికి వెళ్ళెదను.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా హి విరమ్యాసౌ సన్నద్ధోఽభూద్రణాయ చ ।**
**స్వగణైర్వీరభద్రోఽపి సన్నద్ధోఽథ మహాబలః ॥70॥**

విష్ణువీవిధంగా పలికి, మాటలు విరమించి, యుద్ధానికి సంసిద్ధుడు కాగా మహాబలుడగు వీరభద్రుడుకూడా తన గణాలతో గూడి యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే విష్ణు వీరభద్ర సంవాదో నామ షట్త్రింశోఽధ్యాయః ॥36॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో విష్ణు వీరభద్ర సంవాదం అనే ముప్పై ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్త త్రింశోఽధ్యాయః - ముప్పై ఏడవ అధ్యాయం
## యజ్ఞవిధ్వంసవర్ణనమ్ - యజ్ఞధ్వంసమునువర్ణించుట

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**వీరభద్రోఽథ యుద్ధే వై విష్ణునా స మహాబలః ।**
**సంస్మృత్య శంకరం చిత్తే సర్వాపద్వినివారణమ్ ॥1॥**

**ఆరుహ్య స్యందనం దివ్యం సర్వవైరి విమర్దనః ।**
**గృహీత్వా పరమాస్త్రాణి సింహనాదం జగర్జహ ॥2॥**

సర్వాపద్వినివారకుడైన శంకరుని మనస్సులో స్మరించి, మహాబలుడైన వీరభద్రుడు మహావిష్ణువుతోడి యుద్ధంలో దివ్యమైన రథమునధిష్ఠించాడు. శత్రు మర్దనుడైన వీరభద్రుడు పరమాస్త్రాలను గ్రహించి, సింహనాదం చేశాడు.

**విష్ణుశ్చాపి మహాఘోషం పాంచజన్యాభిధం నిజమ్ ।**
**దధ్మౌ బలీ మహాశంఖం స్వకీయాన్ హర్షయన్నివ ॥3॥**

విష్ణువుకూడా పాంచజన్యమనే పేరుగలట్టియు, మహాఘోషం చేయునట్టియు, తన మహాశంఖాన్ని తనవారికి ఆనందమును కలిగించుటకనునట్లుగా మ్రోగించాడు.

**తచ్ఛ్రుత్వా శంఖ నిర్హ్రాదం దేవా యే చ పలాయితాః ।**
**రణం హిత్వా గతాః పూర్వం తే ద్రుతం పునరాయయుః ॥4॥**

ఆ శంఖనాదాన్ని విని, పూర్వంలో యుద్ధంనుండి పారిపోయిన దేవతలుకూడా వేగంగా తిరిగి యుద్ధానికి వచ్చారు.

**వీరభద్ర గణైస్తేషాం లోకపాలాస్సవాసవాః ।**
**యుద్ధఞ్చక్రు స్తథా సింహనాదం కృత్వా బలాన్వితాః ॥5॥**

సైన్య సమేతులైన లోకపాలురు ఇంద్రునితోకూడి, సింహనాదం చేసి, వీరభద్రుని గణాలతో యుద్ధం చేశారు.

**గణానాం లోకపాలానాం ద్వంద్వయుద్ధం భయావహమ్ ।**
**అభవత్తత్ర తుములం గర్జతాం సింహనాదతః ॥6॥**

సింహనాదాలు చేస్తున్న రుద్రగణాలకు, లోకపాలురకు, భయావహమైన విధంగా గొప్ప ద్వంద్వయుద్ధం జరిగింది.

**నందినా యుయుధే శక్రోఽనలో వై వైష్ణవా స్తథా ।**
**కుబేరోఽపి హి కూష్మాణ్డ పతిశ్చ యుయుధే బలీ ॥7॥**

ఇంద్రుడు నందితో యుద్ధాన్ని చేశాడు. అగ్ని, విష్ణుగణాలు, కుబేరుడు మరియు బలశాలియైన కూష్మాండపతి యుద్ధం చేశారు.

**తదేంద్రేణ హతో నందీ వజ్రేణ శతపర్వణా ॥8॥**

అంతట ఇంద్రుడు తన నూరంచుల వజ్రాయుధంతో నందిని కొట్టాడు.

**నందినా చ హతశ్శక్ర స్త్రిశూలేన స్తనాంతరే ॥9॥**

నంది తన త్రిశూలంతో ఇంద్రుని వక్షస్థలంపై స్తనాల మధ్యభాగంలో కొట్టాడు.

**బలినౌ ద్వావపి ప్రీత్యా యుయుధాతే పరస్పరమ్ ।**
**నానా ఘాతాంశ్చ కుర్వంతౌ నందిశక్రౌ జిగీషయా ॥10॥**

బలవంతులైన నంది ఇంద్రుడు ఇరువురు ఒకరినొకరు జయించు కోరిక గలవారై అనేక విధాలుగా కొట్టుకొనుచు మిక్కిలి పట్టుదలతో యుద్ధం చేస్తున్నారు.

**శక్త్యా జఘాన చాశ్మానం శుచిః పరమకోపనః ।**
**సోఽపి శూలేన తం వేగాచ్ఛితధారేణ పావకమ్ ॥11॥**

మిక్కిలి కోపంగల అగ్ని అశ్మయను గణాధిపతిని శక్తితో కొట్టాడు. ఆయనకూడ అగ్నిని వేగంగా వంద ధారలుగల శూలంతో పొడిచాడు.

**యమేన సహసంగ్రామం మహాలోకో గణాగ్రణీః ।**
**చకార తుములం వీరో మహాదేవం స్మరన్ముదా ॥12॥**

శివలోకంలోని గణాగ్రణియైన వీరుడు ఆనందంతో మహాదేవుని స్మరిస్తూ యమునితో సంకుల సమరం చేశాడు.

**నైరృతేన సమాగమ్య చండశ్చ బలవత్తరః ।**
**యుయుధే పరమాస్త్రైశ్చ నైరృతిం నివిడంబయన్ ॥13॥**

మిక్కిలి బలశాలియైన చండుడు నైరృతికి ఎదురేగి, పరమాస్త్రాలతో అతనిని కొట్టి, పరిహసిస్తు యుద్ధం చేశాడు.

**వరుణేన సమం వీరో ముండశ్చైవ మహాబలః ।**
**యుయుధే పరయా శక్త్యా త్రిలోకీం విస్మయన్నివ ॥14॥**

వీరుడు, మహాబలుడునైన ముండుడు తన గొప్ప శక్తితో ముల్లోకాలను విస్మయపరచుచున్నాడా అనునట్లు వరుణునితో యుద్ధం చేశాడు.

**వాయునా చ హతో భృంగీ స్వాస్త్రేణ పరమౌజసా ।**
**భృంగిణా చ హతో వాయుస్త్రిశూలేన ప్రతాపినా ॥15॥**

వాయువు తన అస్త్రంతో భృంగిని కొట్టగా ప్రతాపశాలియగు భృంగి వాయువును త్రిశూలంతో కొట్టాడు.

**కుబేరేణైవ సంగమ్య కూష్మాండ పతిరాదరాత్ ।**
**యుయుధే బలవాన్ వీరో ధ్యాత్వా హృది మహేశ్వరమ్ ॥16॥**

బలవంతుడు, వీరుడునైన కూష్మాండపతి మనస్సులో మహేశ్వరుని ధ్యానించి కుబేరునితో యుద్ధం చేశాడు.

**యోగినీ చక్రసంయుక్తో భైరవీ నాయకో మహాన్ ।**
**విదీర్య దేవానఖిలాన్పపౌ శోణితమద్భుతమ్ ॥17॥**

యోగినీ గణాలతో కూడియున్న మహాబలుడైన భైరవీనాయకుడు దేవతలనందరిని చీల్చి, రక్తాన్ని త్రాగాడు. ఆ దృశ్యం అద్భుతంగా నున్నది.

**క్షేత్రపాలాస్తథా తత్ర బుభుక్షుః సురపుంగవాన్ ।**
**కాళీచాపి విదార్యైవ తాన్పపౌ రుధిరం బహు ॥18॥**

ఆయుద్ధంలో క్షేత్రపాలురు దేవశ్రేష్ఠులను భక్షించిరి, మహాకాళి దేవతల నధిక సంఖ్యలో చీల్చి రక్తాన్ని త్రాగింది.

**అథ విష్ణుర్మహాతేజా యుయుధే తైశ్చ శత్రుహా ।**
**చక్రం చిక్షేప వేగేన దహన్నివ దిశో దశ ॥19॥**

అంతట మహాతేజస్వి, శత్రుహంతకుడునైన విష్ణువు వారితో యుద్ధం చేశాడు. విష్ణువు దశదిశలను దహింపజేయుచున్నాడనునట్లుగా చక్రాన్ని ప్రయోగించాడు.

**క్షేత్రపాల స్సమాయాంతం చక్రమాలోక్య వేగతః ।**
**తత్రాగత్యాగతో వీరశ్చాగ్ర సత్సహసా బలీ ॥20॥**

వేగంగా వచ్చుచున్న చక్రాన్నిచూచి, వీరుడు, బలశాలియునగు క్షేత్రపాలుడు దానికి ఎదురేగి దానిని వెంటనే మ్రింగివేశాడు.

**చక్రం గ్రసితమాలోక్య విష్ణుః పరపురంజయః ।**
**ముఖం తస్య పరామృజ్య తముద్గాలితవానరిమ్ ॥21॥**

పరపురంజయుడైన విష్ణువు తన చక్రమునతడు మ్రింగివేయుటను చూశాడు. ఇంతలో అతడు నోటిని అధికంగా విడదీసి, ఆ చక్రాన్ని బయటకు క్రక్కాడు.

**స్వచక్రమాదాయ మహానుభావశ్చుకోప చాతీవ భవైక భర్తా ।**
**మహాబలీ తైర్యుయుధే ప్రవీరై స్సంక్రుద్ధ నానాయుధ ధారకోస్త్రైః ॥22॥**

మహానుభావుడు, జగదేక రక్షకుడునైన విష్ణువు తన చక్రాన్ని స్వీకరించి, మిక్కిలి కృద్ధుడై అనేక అస్త్రాలను, ఆయుధాలను ధరించి, వీరులైన రుద్రగణాలతో యుద్ధం చేశాడు.

**చక్రే మహారణం విష్ణుస్తైస్సార్ధం యుయుధే ముదా ।**
**నానాయుధాని సంక్షిప్య తుములం భీమవిక్రమమ్ ॥23॥**

విష్ణువు భయంకరమైన పరాక్రమాన్ని ప్రదర్శిస్తూ అనేకాయుధాలను ప్రయోగించి, రుద్రగణాలతో మహాయుద్ధం చేశాడు.

**అథ తే భైరవాద్యాశ్చ యుయుధుస్తేన భూరిశః ।**
**నానాస్త్రాణి విముంచత స్సంక్రుద్ధాః పరమౌజసా ॥24॥**

అంతట భైరవాదులు మిక్కిలి కోపించి, గొప్ప తేజస్సుతో అనేకాస్త్రాలను ప్రయోగిస్తూ, విష్ణువుతో యుద్ధం చేశారు.

**ఇత్థం తేషాం రణం దృష్ట్వా హరిణాతులతేజసా ।**
**వినివృత్య సమాగమ్య తాన్ స్వయం యుయుధే బలీ ॥25॥**

ఈవిధంగా వారు యుద్ధం చేయడాన్ని చూచి, సాటిలేని తేజస్సుగల విష్ణువు వెనుకకు మరలి వచ్చి వారినెదుర్కొని స్వయంగా వారితో యుద్ధం చేశాడు.

**అథ విష్ణుర్మహాతేజాశ్చక్రముద్యమ్య మూర్ఛితః ।**
**యుయుధే భగవాంస్తేన వీరభద్రేణ మాధవః ॥26॥**

అంతట మహాతేజశ్శాలి, లక్ష్మీపతియునైన విష్ణుభగవానుడు క్రోధాన్నిపొంది, చక్రాన్ని చేతబట్టి వీరభద్రునితో యుద్ధం చేశాడు.

**తయోః సమభవద్యుద్ధం సుఘోరం రోమహర్షణమ్ ।**
**మహావీరాబ్ధి పత్యోస్తు నానాస్త్రధరయోర్మునే ॥27॥**

ఓ మహర్షీ! మహావీరుడైన వీరభద్రుడు, శేషశాయియగు విష్ణువు అనేక అస్త్రాలను ధరించి గగుర్పాటు కలిగించే విధంగా అతిభయంకరమైన యుద్ధాన్ని చేశారు.

**విష్ణోర్యోగబలాత్తస్య దేవదేవ సుదారుణాః ।**
**శంఖచక్ర గదాహస్తా అసంఖ్యాతాశ్చ జజ్ఞిరే ॥28॥**

దేవదేవుడైన విష్ణువుయొక్క యోగబలంచేత భయంకరాకారులు, శంఖచక్రగదాదులను హస్తములందు ధరించిన అసంఖ్యాకములైన విష్ణుగణాలు పుట్టారు.

**తే చాపి యుయుధుస్తేన వీరభద్రేణ భాషతా ।**
**విష్ణువత్ బలవంతో హి నానాయుధధరాగణాః ॥29॥**

విష్ణువుతో సమానమైన బలంగలవారు, నానాయుధదారులునైన విష్ణుగణాలుకూడా తేజశ్శాలియైన వీరభద్రునితో యుద్ధాన్ని చేశారు.

**తాన్సర్వానపి వీరోఽసౌ నారాయణ సమప్రభాన్ ।**
**భస్మీచకార శూలేన హత్వా స్మృత్వా శివం ప్రభుమ్ ॥30॥**

వీరుడగు వీరభద్రుడు శివుని స్మరించి, నారాయణ సమతేజులైన విష్ణుగణాలనందరిని శూలంతో సంహరించి, భస్మం చేశాడు.

**తతశ్చోరసి తం విష్ణుం లీలయైవ రణాజిరే ।**
**జఘాన వీరభద్రో హి త్రిశూలేన మహాబలీ ॥31॥**

అంతట మహాబలుడైన వీరభద్రుడు యుద్ధరంగంలో త్రిశూలంతో విష్ణువుయొక్క వక్షస్థలమునందు లీలగా పొడిచాడు.

**తేన ఘాతేన సహసా విహతః పురుషోత్తమః ।**
**పపాత చ తదా భూమౌ విసంజ్ఞోఽభూన్మునే హరిః ॥32॥**

ఓ మహర్షీ! అప్పుడు పురుషోత్తముడైన శ్రీమహావిష్ణువు శూలఘాతంచే గాయపడినవాడై, వెనువెంటనే స్పృహను కోల్పోయి భూమిపై పడ్డాడు.

**తతో యజజ్ఞేఽద్భుతం తేజః ప్రళయానలసన్నిభమ్ ।**
**త్రైలోక్య దాహకం తీవ్రం వీరాణామపి భీకరమ్ ॥33॥**

అంతట ప్రళయానల సన్నిభమైనట్టియు, ముల్లోకాలను దహించగలిగినట్టియు, తీవ్రమైనట్టియు, వీరులకు కూడ భయాన్ని కొల్పునట్టియు, ఒక తేజస్సు ఉద్భవించింది.

**క్రోధ రక్తేక్షణః శ్రీమాన్ పునరుత్థాయ స ప్రభుః ।**
**ప్రహర్తుం చక్రముద్యమ్య హ్యతిష్ఠత్పురుషర్షభః ॥34॥**

పురుషోత్తముడైన విష్ణువు మరల లేచి, క్రోధ సంరక్త లోచనుడై చక్రమును చేతబట్టి, వీరభద్రునిపై దాడిచేయడానికి సంసిద్ధుడయ్యాడు.

**తస్య చక్రం మహారౌద్రం కాలాదిత్య సమప్రభమ్ ।**
**వ్యష్టంభయ దదీనాత్మా వీరభద్రశ్శివః ప్రభుః ॥35॥**

దైన్యంలేని మనసు కలవాడు, శివప్రభుని స్వరూపుడునైన వీరభద్రుడు మహారౌద్రమైనదియు, ప్రళయకాలమునందలి సూర్యప్రభతో సమానమైనదియు నగు విష్ణువుయొక్క చక్రాన్ని స్తంభింపజేశాడు.

**మునే శంభోః ప్రభావాత్తు మాయేశస్య మహాప్రభోః ।**
**న చచాల హరేశ్చక్రం కరస్థం స్తంభితం ధ్రువమ్ ॥36॥**

నారదమునీ! హరియొక్క చేతిలోని చక్రము మాయాధీశుడు, మహాప్రభువునైన శంభుని ప్రభావంచే నిశ్చితంగా స్తంభింపజేయబడి, కదలకుండెను.

**అథ విష్ణుర్గణేశేన వీరభద్రేణ భాస్వతా ।**
**అతిష్ఠత్ స్తంభితస్తేన శ్రుంగవానివ నిశ్చలః ॥37॥**

తేజశ్శాలి, గణాధ్యక్షుడునైన వీరభద్రునిచే స్తంభింపజేయబడిన విష్ణువు పర్వతంవలె కదలిక లేకుండగా నిలబడ్డాడు.

**తతో విష్ణుః స్తంభితో హి వీరభద్రేణ నారద ।**
**యజ్ఞోప మంత్రణ మనుం నిఃస్తంభనకరం జపన్ ॥38॥**

నారదా! వీరభద్రునిచే స్తంభింపజేయబడిన యజ్ఞ రక్షకుడైన విష్ణువు ఆ స్తంభన శక్తిని నిర్వీర్యం చేసే మంత్రజపం చేసినాడు.

**తతస్స్తంభన నిర్ముక్తః శార్ఙ్గధన్వా రమేశ్వరః ।**
**శార్ఙ్గం జగ్రాహ స క్రుద్ధః స్వధనుస్సశరం మునే ॥39॥**

నారదమునీ! ఇంతలో స్తంభననుండి విడుదల పొందిన లక్ష్మీపతి క్రోధంతో శార్ఙ్గమని ప్రసిద్ధినొందిన తన ధనుస్సును, బాణములను చేతబట్టాడు.

**త్రిభిశ్చ ధర్షితో బాణైస్తేన శార్ఙ్గధనుర్హరేః ।**
**వీరభద్రేణ తత్తాత త్రిధాభూత్తత్క్షణాన్మునే ॥40॥**

ఓ మహర్షీ! వత్సా! విష్ణువుయొక్క శార్ఙ్గధనుస్సును వీరభద్రుడు మూడు బాణములతో కొట్టగా, ఆ ధనుస్సు క్షణంలో మూడు ముక్కలయ్యింది.

**అథ విష్ణుర్మయా వాణ్యా బోధితస్తం మహాగణమ్ ।**
**అసహ్య వర్చసం జ్ఞాత్వా హ్యంతర్ధాతుం మనో దధే ॥41॥**

'మహాగణాధీశుడైన వీరభద్రుని పరాక్రమము సహింప శక్యముకానిది'. అని నేను సరస్వతీదేవి విష్ణువును హెచ్చరించాము. విష్ణువు దానిని అవగతం చేసుకొని తాను అంతర్ధానమగుటకు నిశ్చయించుకున్నాడు.

**జ్ఞాత్వా చ తత్సర్వమిదం భవిష్యం దుష్ప్రసహం పరేషామ్ ।**
**గతాః స్వలోకం స్వగణాన్వితాస్తు స్మృత్వా శివం సర్వపతిం స్వతంత్రమ్ ॥42॥**

సతీదేవి దేహత్యాగము చేయుట శివగణాలకు సహింపశక్యముకాని సంఘటన యనియు, ఇందు సర్వనాశము జరుగబోవుననియు, ఎరిగిన దేవగణనాయకులు సర్వలోక ప్రభుడు, స్వతంత్రుడునైన శివుని స్మరించి, తమతమ గణాలతోకూడి, తమతమ లోకాలకు వెళ్ళారు.

**సత్యలోక గతశ్చాహం పుత్రశోకేన పీడితః ।**
**అచింతయం సుదుఃఖార్తో మయా కిం కార్యమద్య వై ॥43॥**

పుత్రశోకంతో పీడింపబడుచున్న నేను సత్యలోకానికి వెళ్ళి మిక్కిలి దుఃఖితుడనై 'ఇప్పుడు నేనేమిచేయాలి' అని చింతించాను.

**విష్ణౌ మయి గతే చైవ దేవాశ్చ మునిభిస్సహ ।**
**వినిర్జితా గణైస్సర్వే యే తే యజ్ఞోపజీవినః ॥44॥**

విష్ణువు మరియు నేను అచటినుండి మరలిపోగానే మిగిలిన దేవతల నందరిని మరియు యజ్ఞమే జీవనాధారముగాగల మునులను, శివగణాలు జయించాయి.

**సముపద్రవ మాలక్ష్య విధ్వస్తం చ మహామఖమ్ ।**
**మృగస్వరూపో యజ్ఞో హి మహాభీతో౽పి దుద్రువే ॥45॥**

సంప్రాప్తమైన మహావిపత్తునెరింగి, మహామఖము నాశనమగుట గాంచి, యజ్ఞపురుషుడు మిక్కిలి భీతిల్లి మృగరూపంలో పరుగిడినాడు.

**తం తదా మృగరూపేణ ధావంతం గగనం ప్రతి ।**
**వీరభద్రస్సమాదాయ విశిరస్క మథాకరోత్ ॥46॥**

ఆవిధంగా మృగరూపంలో ఆకాశంవైపు పరిగిడుతున్న యజ్ఞపురుషుని వీరభద్రుడు పట్టుకుని, తలను నరికివేశాడు.

**తతః ప్రజాపతిం ధర్మం కశ్యపం చ ప్రగృహ్య సః ।**
**అరిష్టనేమినం వీరో బహుపుత్ర మునీశ్వరమ్ ॥47॥**

**మునిమాంగిరసం చైవ కుశాశ్వం చ మహాగణః ।**
**జఘాన మూర్ధ్ని పాదేన దత్తం చ మునిపుంగవమ్ ॥48॥**

అంతట వీరుడైన వీరభద్రుడు ధర్మ, కశ్యప, ప్రజాపతులను, బహుపుత్రులతోనున్న అరిష్టనేమిని ఆంగిరస మహర్షిని, కుశాశ్వుని, దత్త మహర్షిని, పట్టుకుని శిరస్సుపై పాదంతో తన్నినాడు

**సరస్వత్యాశ్చ నాసాగ్రం దేవమాస్తు తథైవ చ ।**
**చిచ్ఛేద కరజాగ్రేణ వీరభద్రః ప్రతాపవాన్ ॥49॥**

ప్రతాపవంతుడైన వీరభద్రుడు దేవమాతయైన సరస్వతి నాసాగ్రాన్ని తన కొనగోటితో కోసివేసినాడు.

**తతోఽన్యానపి దేవాదీన్ విదార్య పృథివీతలే ।**
**పాతయామాస సోఽయం వై క్రోంధాక్రాంతాతిలోచనః ॥50॥**

ఆ వీరభద్రుడు క్రోధంచే ఎఱ్ఱనైన నేత్రాలు కలవాడై మిగిలినవారినందరిని దేవతలను కూడ చీల్చి నేలగూల్చాడు.

**వీరభద్రో విదార్యాపి దేవాన్ముఖ్యాన్మునీనపి ।**
**నాభూచ్ఛాంతో ద్రుతక్రోధః ఫణిరాడివ మండితః ॥51॥**

క్రోధాన్ని పొందిన ఫణిరాజువలె వీరభద్రుడు ముఖ్యులైన దేవతలను, మహర్షులను చీల్చి చెండాడిన తరువాతకూడ శాంతించలేదు.

**వీరభద్రోద్ధృతారాతిః కేసరీవ వనద్విపాన్ ।**
**దిశో విలోకయామాస కః కుత్రాస్తీత్యనుక్షణమ్ ॥52॥**

సింహము ఏనుగులను వలె శత్రువులను తరిమివేసిన వీరభద్రుడు 'ఎవడెక్కడ దాగియున్నాడో?' అని ప్రతిక్షణం దిక్కులను పరికిస్తున్నాడు.

**వ్యపోథయద్ భృగుం యావన్మణి భద్రః ప్రతాపవాన్ ।**
**పదాక్రమ్యోరసి తదాఽకార్షీత్తచ్ఛ్మశ్రు లుంచనమ్ ॥53॥**

ఇంతలో ప్రతావంతుడైన మణిభద్రుడు భృగువును నేలపై పడవైసి కాలితో గుండెలపై త్రొక్కిపెట్టి గడ్డమును, మీసములను ఊడబెరికాడు.

**చండశ్చోత్పాటయామాస పూష్ణో దంతాన్ ప్రవేగతః ।**
**శప్యమానే హరే పూర్వం యోఽహసద్దర్శయన్దతః ॥54॥**

దక్షుడు శివుని నిందించిన సమయంలో దంతములు కనబడునట్లు బిగ్గరగా నవ్విన పూషదేవత యొక్క దంతాలను చండుడు వేగంగా పెరికివేశాడు.

**నందీ భగస్య నేత్రే హి పాతితస్య రుషా భువి ।**
**ఉజ్జహార సదక్షోఽక్ష్ణా యశ్శపంత మసూసుచత్ ॥55॥**

దక్షుడు శివుని నిందించిన సమయంలో కనుసైగలతో ప్రోత్సహించిన భగుని నంది కోపంతో నేలపై బడవేసి అతని నేత్రాలను చిదిమివేశాడు.

**విడంబితా స్వధా తత్ర సా స్వాహా దక్షిణా తథా ।**
**మంత్రాస్తంత్రా స్తథా చాన్యే తత్రస్థా గణనాయకైః ॥56॥**

ఆ యజ్ఞశాలయందున్న స్వాహా, స్వధా, దక్షిణా అనే దేవతలను, మంత్ర తంత్రాధిష్ఠాన దేవతలను, ఇతరులను శివగణ నాయకులు దురవస్థకు గురిచేశారు.

**వవృషుస్తే పురీషాణి వితానాగ్నౌ రుషా గణాః ।**
**అనిర్వాచ్యం తదా చక్రుర్గణా వీరాస్తమధ్వరమ్ ॥57॥**

ఆ గణాలు కోపంతో అగ్నివేదికలందు పురీషాది మాలిన్యాలను చల్లారు. ఆ యజ్ఞాన్ని శివగణాలు ధ్వంసం చేసిన తీరు వర్ణనాతీతముగా నున్నది.

**అంతర్వేద్యంతరగతం నిలీనం తద్భయాద్బలాత్ ।**
**ఆనినాయ సమాజ్ఞాయ వీరభద్రః స్వభూసుతమ్ ॥58॥**

వేదిలోపల ఒక రంధ్రంలో వీరభద్రుని వలన భయంతో దాగియున్న దక్షుని శివగణాలు బలంగా బయటకులాగి, వీరభద్రుని సన్నిధిలో నిలబెట్టారు.

**కపోలేఽస్య గృహీత్వాతు ఖడ్గేనోపహృతం శిరః ।**
**అభేద్య మభవత్తస్య తచ్చ యోగప్రభావతః ॥59॥**

వీరభద్రుడు దక్షుని చెక్కిళ్ళయందు పట్టుకుని కత్తితో తలను నరకబోగా యోగ మహిమచేత తలను నరుకుట సంభవం కాలేదు.

**అభేద్యం తచ్ఛిరో మత్వా శస్త్రాస్త్రైశ్చ తు సర్వశః ।**
**కరేణ త్రోటయామాస పద్భ్యామాక్రమ్య చోరసి ॥60॥**

ఆ శిరస్సును శస్త్రాస్త్రములతో ఛేదించుట అసంభవమని భావించి, దక్షుని గుండెపై రెండు కాళ్ళతో నిలబడి, చేతితో పెరికివేశాడు.

**తచ్ఛిరస్తస్య దుష్టస్య దక్షస్య హరవైరిణః ।**
**అగ్నికుండే ప్రచిక్షేప వీరభద్రో గణాగ్రణీః ॥61॥**

దుష్టుడు, శివద్రోహియునగు దక్షుని ఆ శిరస్సును గణాగ్రణియైన వీరభద్రుడు అగ్నికుండము నందు పారవైచాడు.

**రేజే తదా వీరభద్ర స్త్రిశూలం భ్రామయన్కరే ।**
**క్రుద్ధా రణాక్ష సంవర్తాః ప్రజ్వాల్య పర్వతోపమాః ॥62॥**

వీరభద్రుడు పర్వతాకాములైన కోపించిన యుద్ధాగ్నులను ప్రజ్వలింపజేసి చేతిలో త్రిశూలాన్ని తిప్పుతూ విరాజిల్లినాడు.

**అనాయాసేన హత్వైతాన్ వీరభద్ర స్తతోఽగ్నినా ।**
**జ్వాలయామాస సక్రోధో దీప్తాగ్నిశ్శలభానివ ॥63॥**

వారినందరిని తేలికగా సంహరించిన తరువాత వీరభద్రుడు వారికి నిప్పుపెట్టి అగ్నిహోత్రం మిడుతలను తగులబెట్టిన రీతిలో తగులబెట్టాడు.

**వీరభద్రస్తతో దగ్ధాన్ దృష్ట్వా దక్షపురోగమాన్ ।**
**అట్టాట్టహాస మకరోత్పూరయంశ్చ జగత్త్రయమ్ ॥64॥**

అంతట దక్షుడు మున్నగువారు తగులబడుటను గాంచి, వీరభద్రుడు ముల్లోకాలు నిండేటట్లుగా పెద్ద అట్టహాసమును చేశాడు.

**వీరశ్రియా వృతస్తత్ర తతో నన్దనసంభవా ।**
**పుష్పవృష్టిరభూద్దివ్యా వీరభద్రే గణాన్వితే ॥65॥**

అప్పుడాతడు వీరశోభతో ప్రకాశించాడు. శివగణాలతో కూడియున్న వీరభద్రునిపై నందన వనమునందు పుట్టిన దివ్యపుష్పాలు వర్షించాయి.

**వవుర్గంధవహాశ్శీతా స్సుగన్ధా స్సుఖదాః శనైః ।**
**దేవదుందుభయో నేదుస్సమమేవ తతః పరమ్ ॥66॥**

పరిమళ భరితమై, సుఖదమైన చల్లని గాలులు మెల్లగా వీచినవి. అదే సమయంలో దేవదుందుభులు అద్భుతంగా మ్రోగినవి.

**కైలాసం సయయౌ వీరః కృతకార్యస్తతఃపరమ్ ।**
**వినాశిత దృఢధ్వాంతో భానుమానివ సత్వరమ్ ॥67॥**

కృతకార్యుడైన వీరభద్రుడు చీకట్లను పూర్తిగా పారద్రోలిన సూర్యునివలె ప్రకాశిస్తూ శీఘ్రంగా కైలాసానికి వెళ్ళాడు

**కృతకార్యం వీరభద్రం దృష్ట్వా సంతుష్టమానసః ।**
**శంభుర్వీరగణాధ్యక్షం చకార పరమేశ్వరః ॥68॥**

కార్యమును పూర్తిచేసివచ్చిన వీరభద్రుని గాంచి, పరమేశ్వరుడైన శంభుడు సంతుష్టమానసుడై, అతనిని శివవీర గణాధ్యక్షుని చేశాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే యజ్ఞ విధ్వంస వర్ణనం నామ సప్త త్రింశోఽధ్యాయః ॥37॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో యజ్ఞధ్వంసమును వర్ణించుట అనే ముప్పై ఏడవ అధ్యాయం సమాప్తం.

# అష్ట త్రింశోఽధ్యాయః - ముప్ఫై ఎనిమిదవ అధ్యాయం
# క్షువదధీచివివాదవర్ణనమ్ - క్షువదధీచుల వాదమునువర్ణించుట

**సూత ఉవాచ** - సూత మహాముని చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య విధేరమితధీమతః ।**
**పప్రచ్ఛ నారదః ప్రీత్యా విస్మితస్తం ద్విజోత్తమః ॥1॥**

మహాప్రాజ్ఞుడైన బ్రహ్మ మాటలను విని, ద్విజోత్తముడైన నారదుడు విస్మితుడై, ప్రీతితో ఇట్లు ప్రశ్నించాడు.

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**శివం విహాయ దక్షస్య సురైర్యజ్ఞం హరిర్గతః ।**
**హేతునా కేన తద్ బ్రూహి యత్రావజ్ఞాఽభవత్తతః ॥2॥**

శివుడులేని దక్షయజ్ఞానికి దేవతలతోకూడి వెళ్ళి విష్ణువు అచ్చట పరాభవాన్ని పొందాడు. దీనికి కారణము ఏమిటో నాకు తెలియజేయండి.

**జానాతి కిం స శంభుం నో హరిః ప్రళయవిక్రమమ్ ।**
**రణం కథం చ కృతవాన్ తద్గణైరబుధో యథా ॥3॥**

సర్వసంహారకారకుడైన శంభుని పరాక్రమమును విష్ణువెరుగడా? అజ్ఞునివలె ఆయన శివగణాలతో యుద్ధమేల చేశాడు?

**ఏష మే సంశయో భూయాంస్తం ఛింధి కరుణానిధే ।**
**చరితం బ్రూహి శంభోస్తు చిత్తోత్సాహకరం ప్రభో ॥4॥**

ఇది నాకుగల గొప్ప సందేహం. ఓ కరుణానిధీ! నా సందేహాన్ని తొలగించండి. మనోహ్లాదకరమైన శంభుని చరిత్రను చెప్పండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ద్విజవర్య శృణు ప్రీత్యా చరితం శశిమౌళినః ।**
**యత్పృచ్ఛతే కుర్వతశ్చ సర్వసంశయహారకమ్ ॥5॥**

ఓ ద్విజశ్రేష్ఠా! చంద్రశేఖరుని చరిత్రను ప్రీతితో వినుము. ఈ చరిత్ర అడిగినవారికి, వినినవారికి సమస్త సంశయాలను హరిస్తుంది.

**దధీచస్య మునేః శాపాద్భ్రష్టజ్ఞానో హరిః పురా ।**
**సామరో దక్షయజ్ఞం వై గతః క్షువ సహాయకృత్ ॥6॥**

పూర్వము దధీచి మహర్షియొక్క శాప ప్రభావముచే జ్ఞానభ్రష్టుడైన విష్ణువు దేవతలతోకూడి దక్షుని యజ్ఞానికి వెళ్ళాడు. విష్ణువు క్షువునకు సహాయం చేయబోయి, దధీచుని శాపాన్ని పొందాడు.

**నారద ఉవాచ –** నారదుడు చెప్పాడు.

**కిమర్థం శప్తవాన్విష్ణుం దధీచో మునిసత్తమః ।**
**కోఽపకారః కృతస్తస్య హరిణా తత్సహాయినా ॥7॥**

మునిసత్తముడైన దధీచుడు శ్రీమహావిష్ణువును శపించుటకు కారణమేమి? క్షువునకు సహాయము చేసిన విష్ణువు దధీచునకు ఏ అపకారం చేశాడు?

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**సముత్పన్నో మహాతేజా రాజా క్షువ ఇతి స్మృతః ।**
**అభూన్మిత్రం దధీచస్య మునీంద్రస్య మహాప్రభోః ॥8॥**

మహాతేజస్వియైన క్షువుడనే రాజొకడుండేవాడు. ఆయనకు మునిశ్రేష్ఠుడైన దధీచి మహర్షితో మైత్రి కలిగింది.

**చిరాత్తపః ప్రసంగాద్వై వాదః క్షువ దధీచయోః ।**
**మహానర్థకరః ఖ్యాతస్త్రిలోకేష్వభవత్పురా ॥9॥**

'దీర్ఘకాల తపస్సు' అనే విషయంలో పూర్వం క్షువ దధీచులిరువురకు వాదం చెలరేగింది. గొప్ప అనర్థాన్ని కలిగించిన ఈ వాదం ముల్లోకాలలోను మిక్కిలి ప్రఖ్యాతమయ్యింది.

**తత్ర త్రివర్ణతః శ్రేష్ఠో విప్ర ఏవ న సంశయః ।**
**ఇతి ప్రాహ దధీచో హి శివభక్తస్తు వేదవిత్ ॥10॥**

మూడు వర్ణాలలో శ్రేష్ఠుడైన బ్రాహ్మణుడే తపస్సునకు సమర్థుడనియు, ఇందులో సందేహము లేదనియు శివభక్తుడు, వేదవేత్తయునైన దధీచి పలికాడు.

**తచ్ఛ్రుత్వా వచనం తస్య దధీచస్య మహామునేః ।**
**క్షువః ప్రాహేతి నృపతిః శ్రీమదేన విమోహితః ॥11॥**

ధనగర్వంచే మిక్కిలి మోహితుడైన క్షువ మహారాజు దధీచి మహర్షి పలుకులను విని, ఇలా పలికాడు.

**క్షువ ఉవాచ –** క్షువుడు పలికాడు.

**అష్టానాం లోకపాలానాం వపుర్ధారయతే నృపః ।**
**తస్మాన్నృపో వరిష్ఠో హి వర్ణాశ్రమపతిః ప్రభుః ॥12॥**

ఎనమండుగురు లోకపాలకుల దేహాన్ని రాజు ధరిస్తాడు. కాబట్టి వర్ణాశ్రమరక్షకుడైన రాజే శ్రేష్ఠుడు.

**సర్వదేవమయో రాజా శ్రుతిః ప్రాహేతి తత్పురా ।**
**మహతీ దేవతా యా సా సోఽహమేవ తతో మునే ॥13॥**

'రాజు సర్వదేవతా స్వరూపుడని' శ్రుతి వాక్యము. కాబట్టి రాజు దేవతలలోకెల్ల గొప్పవాడు. ఓ మహర్షీ! అట్టి దేవతను నేనే.

**తస్మాద్విప్రాద్వరో రాజా చ్యవనేయ విచార్యతామ్ ।**
**నావమంతవ్య ఏవాతః పూజ్యోఽహం సర్వథా త్వయా ॥14॥**

కావున రాజు బ్రాహ్మణునికంటె శ్రేష్ఠుడు. ఓ చ్యవనపుత్రా! నీవు ఆలోచింపుము. ఈ కారణంగా నీవు నన్ను అవమానించరాదు. అంతేకాదు నీవునన్ను అన్నివిధములుగా పూజింపవలసియున్నది.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**శ్రుత్వా తథా మతం తస్య క్షువస్య మునిసత్తమః ।**
**శ్రుతి స్మృతి విరుద్ధం తం చుకోపాతీవ భార్గవః ॥15॥**

భృగువంశజుడైన దధీచి మహర్షికి వేదశాస్త్రవిరుద్ధమైన క్షువుని అభిప్రాయమును వినిన పిదప మిక్కిలి కోపం కలిగింది.

**అథ కృద్ధో మహాతేజా గౌరవాచ్చాత్మనో మునే ।**
**అతాడయత్ క్షువం మూర్ధ్ని దధీచో వామముష్టితః ॥16॥**

ఓ మహర్షీ! మహాతేజస్వియగు దధీచుడు కోపించినవాడై ఆత్మగౌరవాన్ని రక్షించుకొనుటకు క్షువుని శిరస్సుపై ఎడమ పిడికిలితో కొట్టాడు.

**వజ్రేణ తం చ చిచ్ఛేద దధీచం తాడితః క్షువః ।**
**జగర్జాతీవ సంక్రుద్ధో బ్రహ్మాండాధిపతిః కుధీః ॥17॥**

బ్రహ్మాండాధిపతియు, దుర్బుద్ధియు నగు క్షువుడు దధీచుడు కొట్టుటవలన మిక్కిలి కోపించి తన వజ్రంతో అతనిని చీల్చి మిక్కిలిగా గర్జించాడు.

**పపాత భూమౌ నిహతో తేన వజ్రేణ భార్గవః ।**
**శుక్రం సస్మార క్షువకృద్భార్గవస్య కులంధరః ॥18॥**

భృగు వంశమును నిలబెట్టే దధీచుడు క్షువుని వజ్రముచే కొట్టబడినవాడై నేలమీదబడి, శుక్రాచార్యుని స్మరించాడు.

**శుక్రోఽథ సంధయామాస తాడితం చ క్షువేన తు ।**
**యోగీ దధీచస్య తదా దేహమాగత్య సద్రుతమ్ ॥19॥**

అంతట యోగియైన శుక్రుడు వేగంగా వచ్చి క్షువునిచే చీల్చివేయబడిన దధీచుని దేహమును మరల సంధించాడు.

**సంధాయ పూర్వవద్దేహం దధీచస్యాహ భార్గవః ।**
**శివభక్తాగ్రణీర్మృత్యుంజయవిద్యా ప్రవర్తకః ॥20॥**

శివ భక్తాగ్రణి, మృత్యుంజయ విద్యా ప్రవర్తకుడునైన శుక్రుడు దధీచుని దేహమును పూర్వమునందుండిన రీతిని సంధించి ఇలా పలికాడు.

**శుక్ర ఉవాచ –** శుక్రుడు పలికాడు.

**దధీచ తాత సంపూజ్య శివం సర్వేశ్వరం ప్రభుమ్ ।**
**మహామృత్యుంజయం మంత్రం శ్రౌతమగ్ర్యం వదామి తే ॥21॥**

వత్సా! దధీచా! సర్వేశ్వరుడైన శివ ప్రభువును పూజించి వేదోక్తము, సర్వశ్రేష్ఠము నగు మహామృత్యుంజయ మంత్రమును నీకు ఉపదేశిస్తాను.

**త్ర్యంబకం యజామహే త్రైలోక్యపితరం ప్రభుమ్ ।**
**త్రిమండలస్య పితరం త్రిగుణస్య మహేశ్వరమ్ ॥22॥**

**త్రితత్త్వస్య త్రివహ్నేశ్చ త్రిధాభూతస్య సర్వతః ।**
**త్రిదివస్య త్రిబాహోశ్చ త్రిధాభూతస్య సర్వతః ॥23॥**

**త్రిదేవస్య మహాదేవ స్సుగంధిం పుష్టివర్ధనమ్ ।**
**సర్వభూతేషు సర్వత్ర త్రిగుణేషు కృతౌ యథా ॥24॥**

**ఇంద్రియేషు తథాన్యేషు దేవేషు చ గణేషు చ ।**
**పుష్పే సుగంధివత్సూరస్సుగంధిరమరేశ్వరః ॥25॥**

ముల్లోకాలకు తండ్రి, రక్షకుడు, సూర్య చంద్రాగ్నులనెడు మూడు మండలములను సృష్టించినవాడు, సత్త్వరజస్తమోగుణములనెడు మూడు గుణములపై సంపూర్ణ ఆధిపత్యం కలవాడు, శ్లేష్మ వాత పిత్తములనే మూడు శరీర తత్త్వములను, ఆహవనీయ గార్హపత్య దక్షిణాగ్నులనెడు మూడు అగ్నులను పాలించువాడును, పృథ్వి జలము అగ్ని అనే మూడు బాహువుల వంటి మూడు మూర్త భూతములతో సర్వమును వ్యాపించి ఉన్నవాడు, దుఃఖ మోహాత్మకమగు జగత్తునందు వ్యాపించి ముగ్గురు దేవతలలో మహాదేవుడు, సర్వభూతములలో సర్వప్రాణులలో సత్వ రజ స్తమో గుణములలో, సర్వ కర్మములలో, సుగంధమువలె వ్యాపించి యున్నాడు. ఆ దేవదేవుడు పుష్పములలో సుగంధమువలె ఇంద్రియములలో ఇతర దేవతలలో, శివగణములలో వ్యాపించి యున్నాడు.

**పుష్టిశ్చ ప్రకృతే ర్యస్మాత్పురుషాద్వై ద్విజోత్తమ ।**
**మహదాది విశేషాంత వికల్పశ్చాపి సువ్రత ॥26॥**

**విష్ణోః పితామహస్యాపి మునీనాం చ మహామునే ।**
**ఇంద్రియస్య చ దేవానాం తస్మాద్వై పుష్టివర్ధనః ॥27॥**

ద్విజోత్తమా! సువ్రతా! మహత్తు మొదలు పరమాణుగత విశేషము వరకు వివిధ కార్యరూపములలోనున్న ప్రకృతియొక్క పుష్టి (బలము) పురుషుడైన శివునినుండి లభించినది. విష్ణువునకు, బ్రహ్మకు, మునీశ్వరులకు, ఇంద్రునకు, దేవతలకు పుష్టినిచ్చుట చేతనే శివుడు పుష్టివర్ధనుడగుచున్నాడు.

**తం దేవమమృతం రుద్రం కర్మణా తపసాపి వా ।**
**స్వాధ్యాయేన చ యోగేన ధ్యానేన చ ప్రజాపతే ॥28॥**

**సత్యేనాన్యేన సూక్ష్మాగ్రాన్మృత్యు పాశాద్భవః స్వయమ్ ।**
**బంధమోక్షకరో యస్మా దుర్వారుకమివ ప్రభుః ॥29॥**

ఓ ప్రజాపతీ! అమృత స్వరూపుడగు రుద్రదేవుని వేదవిహిత కర్మానుష్ఠానముచేగాని, తపస్సుచేగాని, వేదాధ్యయనముచేగాని, యోగముచేగాని, ధ్యానముచేగాని ఆరాధింపవలెను. సత్యముచేగాని లేదా ఇతర ఆరాధనా పద్ధతిచేగాని పూజింపబడిన శివప్రభువు దోసకాయను తీగనుండివలె భక్తుని మిక్కిలి భయంకరమైన మృత్యుపాశమనే బంధమునుండి విముక్తిని కలిగిస్తాడు.

**మృతసంజీవనీ మన్త్రో మమ సర్వోత్తమః స్మృతః ।**
**ఏవం జపపరః ప్రీత్యా నియమేన శివం స్మరన్ ॥30॥**

నా అభిప్రాయంలో ఈ మృతసంజీవనీ మంత్రము సర్వశ్రేష్ఠమైనది. నీవు ప్రీతితో శివుని స్మరిస్తూ నియమముతో దీనిని జపింపుము.

**జప్త్వా హుత్వాభిమంత్ర్యైవం జలం పిబ దివానిశమ్ ।**
**శివస్య సన్నిధౌ ధ్యాత్వా నాస్తి మృత్యుభయం క్వచిత్ ॥31॥**

జపమైన తరువాత హోమమును చేయుము. అహోరాత్రములలో ఎప్పుడు జలపానము చేసినప్పటికి ఆ నీటిని ఈ మంత్రముతో అభిమంత్రించి త్రాగుము. దీనిని శివసన్నిధిలో ధ్యానము చేయువానికి ఎన్నటికిని మృత్యుభయము కలుగదు.

**కృత్వా న్యాసాదికం సర్వం సంపూజ్య విధివచ్ఛివమ్ ।**
**సంవిధాయేదం నిర్వ్యగ్ర శ్శంకరమ్ భక్తవత్సలమ్ ॥32॥**

న్యాసాదికము నంతటినిచేసి, భక్తవత్సలుడు, మంగళకరుడునగు శివుని యథావిధిగా పూజించి, ఈ మంత్రమును జపించి, దుఃఖమునుండి విముక్తిని పొందుము.

**ధ్యానమస్య ప్రవక్ష్యామి యథా ధ్యాత్వా జపేన్మనుమ్ ।**
**సిద్ధమంత్రో భవేద్ధీమాన్ యావచ్ఛంభు ప్రభావతః ॥33॥**

ఈ మంత్రమునకు ధ్యానమును చెప్పెదను. ఈవిధముగా ధ్యానించి, మంత్రమును జపించు జ్ఞాని శంభుని అనుగ్రహముచే శీఘ్రముగా మంత్రసిద్ధిని పొందుతాడు.

**హస్తాంభోజ యుగస్థ కుంభయుగళా దుద్ధృత్య తోయం శిరః ।**
**సించంతం కరయోర్యుగేన దధతం స్వాంకే సకుంభౌ కరౌ ।**
**అక్షస్రఙ్మృగహస్త మంబుజగతం మూర్ధస్థ చంద్రస్రవత్ ।**
**పీయూషార్ద్ర తనుం భజే సగిరిజం త్ర్యక్షంచ మృత్యుంజయమ్ ॥34॥**

పద్మములవంటి రెండుచేతులయందున్న రెండు కుంభములతో నీటిని పైకి గ్రహించి, శిరస్సుపై అభిషేకించుకొనుచున్నట్టియు, రెండుచేతులతో తన తొడపై రెండు కుంభములను ధరించి నట్టియు, అక్షమాలను, మృగమును చేతియందు కలిగియున్నట్టియు, పద్మమునందాసీనుడై యున్నట్టియు, శిరస్సుపైనున్న చంద్రుని నుండి జాలువారిన అమృతముతో తడిసిన దేహము కలిగినట్టియు, పార్వతీదేవితో కూడియున్నట్టియు, మూడు కన్నులు గలట్టియు మృత్యుంజయుని ధ్యానించెదను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఉపదిశ్యేతి శుక్రః స్వం దధీచిం మునిసత్తమమ్ ।**
**స్వస్థాన మగమత్తాత సంస్మరన్ శంకరం ప్రభుమ్ ॥35॥**

వత్సా! శుక్రుడు తన వంశములోనివాడును, మహర్షియునగు దధీచునకు ఇట్లుపదేశించి, శంకర ప్రభుని స్మరిస్తూ స్వస్థానానికి వెళ్ళాడు.

**తస్య తద్వచనం శ్రుత్వా దధీచో హి మహామునిః ।**
**వనం జగామ తపసే మహాప్రీత్యా శివం స్మరన్ ॥36॥**

ఆయన చెప్పిన మాటలను విని, దధీచి మహర్షి మహాప్రీతితో శివుని స్మరిస్తూ తపస్సుకొరకు వనమునకు వెళ్ళాడు.

**తత్ర గత్వా విధానేన మహామృత్యుంజయాభిధమ్ ।**
**తం మనుం ప్రజపన్ ప్రీత్యా తపస్తేపే శివం స్మరన్ ॥37॥**

దధీచుడు వనమునకు వెళ్ళి, మహామృత్యుంజయ మంత్రమును యథావిధిగా జపిస్తూ, శివుని ప్రీతితో స్మరిస్తూ, తపస్సును చేశాడు.

**తన్మనుం సుచిరం జప్త్వా తపసారాధ్య శంకరమ్ ।**
**శివం సంతోషయామాస మహామృత్యుంజయం హి సః ॥38॥**

ఆయన ఆ మంత్రాన్ని చిరకాలం జపించి, తపస్సుచేసి, శంకరుని ఆరాధించాడు. ఆయన మహామృత్యుంజయ మంత్రాన్ని జపించడంచేత శివుడు సంతసించాడు.

**అథ శంభుః ప్రసన్నాత్మా తజ్జపాద్భక్తవత్సలః ।**
**ఆవిర్బభూవ పురతస్తస్య ప్రీత్యా మహామునే ॥39॥**

ఓ మహామునీ! అంతట భక్తవత్సలుడైన శంభుడు మృత్యుంజయ మంత్ర జపంచే ప్రసన్నాత్ముడై అతని యెదుట ఆవిర్భవించాడు.

**తం దృష్ట్వా స్వప్రభుం శంభుం స ముమోద మునీశ్వరః ।**
**ప్రణమ్య విధివద్భక్త్యా తుష్టావ సుకృతాంజలిః ॥40॥**

ఆ మహర్షి తన ప్రభుడైన శంభుని దర్శించి, సంతోషించి, యథావిధిగా ప్రణమిల్లి, కృతాంజలియై భక్తితో స్తుతించాడు.

**అథ ప్రీత్యా శివస్తాత ప్రసన్నశ్చ్యావనిం మునే ।**
**వరం బ్రూహీతి స ప్రాహ సుప్రసన్నేన చేతసా ॥41॥**

నారదా! అంతట శివుడు ప్రసన్నమైన మనసు కలవాడై, చ్యవనుని కుమారుడైన దధీచునితో వరమును కోరుకొనుమని పలికాడు.

**తచ్ఛ్రుత్వా శంభువచనం దధీచో భక్తసత్తమః ।**
**సాంజలిర్నతకః ప్రాహ శంకరం భక్తవత్సలమ్ ॥42॥**

భక్తసత్తముడైన దధీచుడు శంభుని మాటలను విని, సాంజలియై నమస్కరించి, భక్తవత్సలుడైన శంకరునితో ఇట్లన్నాడు.

**దధీచ ఉవాచ –** దధీచుడు పలికాడు.

**దేవదేవ మహాదేవ మహ్యం దేహి వరత్రయమ్ ।**
**వజ్రా స్థిత్వమవధ్యత్వ మదీనత్వం హి సర్వతః ॥43॥**

దేవదేవా! మహాదేవా! వజ్రమువలె దృఢమగు ఎముకలు కలిగియుండుట, ఎవ్వరైనను నన్ను సంహరింపలేకపోవట, సర్వకాలములయందును దైన్యము లేకుండుట అను మూడు వరములను నాకు అనుగ్రహించండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**తదుక్తవచనం శ్రుత్వా ప్రసన్నః పరమేశ్వరః ।**
**వరత్రయం దదౌ తస్మై దధీచాయ తథాస్త్వితి ॥44॥**

పరమేశ్వరుదాతని మాటలు విని, ప్రసన్నుడై దధీచుని కొరకు 'తథాస్తు (అట్లే అగుగాక!)' అని పలికి, ఆ మూడు వరములను ప్రసాదించాడు.

**వరత్రయం శివాత్ప్రాప్య సానందశ్చ మహామునిః ।**
**క్షువస్థానం జగామాశు వేదమార్గే ప్రతిష్ఠితః ॥45॥**

వేదమార్గమునందు ప్రతిష్ఠితుడైన ఆ మహాముని శివుని నుండి మూడు వరములను పొంది, ఆనందించినవాడై, వెంటనే క్షువుడున్న స్థానానికి వెళ్ళాడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ప్రాప్యావధ్యత్వ ముగ్రాత్స వజ్రాస్థిత్వ మదీనతామ్ ।**
**అతాడయచ్చ రాజేన్ద్రం పాదమూలేన మూర్ధని ॥46॥**

అతడు శివుని నుండి అవధ్యత్వము, వజ్రాస్థిత్వము, అదైన్యము అను మూడు వరములను పొంది, ఆ మహారాజును పాదమూలముతో శిరస్సుపై తన్నాడు.

**క్షువో దధీచం వజ్రేణ జఘానోరస్యథో నృపః ।**
**క్రోధం కృత్వా విశేషేణ విష్ణు గౌరవ గర్వితః ॥47॥**

అంతట క్షువ మహారాజు విష్ణువు తనకిచ్చిన గౌరవముచే గర్వితుడై, గొప్ప క్రోధాన్ని పొంది, దధీచుని వక్షఃస్థలమునందు వజ్రముతో కొట్టాడు.

**నాభూన్నాశాయ తద్వజ్రం దధీచస్య మహాత్మనః ।**
**ప్రభావాత్పరమేశస్య ధాతృపుత్రో విసిస్మియే ॥48॥**

పరమేశ్వరుని ప్రభావముచే ఆ వజ్రము మహాత్ముడైన దధీచుని నశింపజేయలేకపోయాడు. దానికి బ్రహ్మపుత్రుడగు క్షువుడు ఆశ్చర్యమును పొందాడు.

**దృష్ట్వాప్యవద్యత్వ మదీనతాం చ వజ్రస్య చాత్యంత పరప్రభావమ్ ।**
**క్షువో దధీచస్య మునీశ్వరస్య విసిస్మియే చేతసి ధాతృపుత్రః ॥49॥**

వజ్రమునకతిశయించిన ప్రభావము కలిగియుండుటయేగాక దధీచి మహర్షి అవధ్యుడుగా, అదీనుడుగా, నిలచియుండుటను గాంచి, బ్రహ్మపుత్రుడైన క్షువుడు మనస్సులో విస్మయాన్ని పొందాడు.

**ఆరాధయామాస హరిం ముకుంద మిన్ద్రానుజం కాననమాశు గత్వా ।**
**ప్రపన్నపాలశ్చ పరాజితో హి దధీచ మృత్యుంజయ సేవకేన ॥50॥**

మృత్యుంజయు భక్తుడైన దధీచునిచే పరాజితుడైన క్షువుడు వెంటనే అరణ్యములకుపోయి, ఇంద్రానుజుడైన ముకుందుని ఆరాధించాడు.

**పూజయా తస్య సన్తుష్టో భగవాన్ మధుసూదనః ।**
**ప్రదదౌ దర్శనం తస్మై దివ్యం వై గరుడధ్వజః ॥51॥**

అతని పూజచే సంతుష్టుడైన భగవానుడు, గరుడధ్వజుడునైన మధుసూదనుడు అతనికి తన దివ్య దర్శనము ఇచ్చాడు.

**దివ్యేన దర్శనేనైవ దృష్ట్వా దేవం జనార్దనమ్ ।**
**తుష్టావ వాగ్భిరిష్టాభిః ప్రణమ్య గరుడధ్వజమ్ ॥52॥**

జనార్దనుని దివ్యదర్శనమును పొందిన క్షువుడు ప్రణమిల్లి, ప్రీతికరమైన వాక్కులతో స్తుతించాడు.

**సంపూజ్య చైవం త్రిదశేశ్వరాద్యైః స్తుతం దేవమజేయమీశమ్ ।**
**విజ్ఞాపయామాస నిరీక్ష్య భక్త్యా జనార్దనాయ ప్రణిపత్య మూర్ధ్నా ॥53॥**

దేవతలచే, ఇంద్రాదులచే స్తుతింపబడువాడు, అజేయుడు, సర్వనియామకుడునగు జనార్దన దేవుని ఈ తీరున పూజించి, దర్శించి, భక్తితో శిరసువంచి నమస్కరించి, ఇట్లు విన్నవించుకున్నాడు.

**రాజోవాచ –** క్షువ మహారాజు పలికాడు.

**భగవన్ బ్రాహ్మణః కశ్చిద్దధీచ ఇతి విశ్రుతః ।**
**ధర్మవేత్తా వినీతాత్మా సఖా మమ పురాऽభవత్ ॥54॥**

హే భగవన్! ధర్మవేత్త, వినీతాత్ముడు, దధీచుడని కీర్తింపబడినవాడునైన ఒకానొక బ్రాహ్మణుడు పూర్వకాలంలో నాకు మిత్రుడుగా ఉండెడివాడు.

**అవధ్యస్సర్వదా సర్వైశ్శంకరస్య ప్రభావతః ।**
**తమారాధ్య మహాదేవం మృత్యుంజయమనామయమ్ ॥55॥**

మృత్యుంజయుడు, మహాదేవుడు, దోషరహితుడునైన శంకరునారాధించి, తత్ప్రభావముచే నాతడు సర్వకాలములందు సర్వులకును వధింప శక్యము కానివాడైనాడు.

**సావజ్ఞం వామపాదేన మమ మూర్ధ్ని సదస్యపి ।**
**తాడయామాస వేగేన స దధీచో మహాతపాః ॥56॥**

మహా తపస్వియగు ఆ దధీచి సభామధ్యమందు అవమానకరముగా తన ఎడమకాలితో నా శిరస్సుపై వేగముగా తన్నాడు.

**ఉవాచ తం చ గర్వేణ న బిభేమీతి సర్వతః ।**
**మృత్యుంజయాప్త సువరో గర్వితో హ్యతులం హరే ॥57॥**

"నేను మృత్యుంజయుని వద్దనుండి వరములను పొందియున్నాను గాన నేను దేనికీ భయపడను" అని అతడు గర్వంతో పలికాడు. ఓ హరీ! అతడు అతిశయించిన గర్వాన్ని కలిగియున్నాడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**అథ జ్ఞాత్వా దధీచస్య హ్యవధ్యత్వం మహాత్మనః ।**
**సస్మారాస్య మహేశస్య ప్రభావమతులం హరిః ॥58॥**

అపుడు మహాత్ముడైన దధీచుని ఎవ్వరును సంహరింపలేరను విషయమును గుర్తించి శ్రీహరి మహేశ్వరుని సాటిలేని ప్రభావమును స్మరించుకున్నాడు.

**ఏవం స్మృత్వా హరిః ప్రాహ క్షువం విధిసుతం ద్రుతమ్ ।**
**విప్రాణాం నాస్తి రాజేన్ద్ర భయమణ్వపి కుత్రచిత్ ॥59॥**

**విశేషాద్రుద్ర భక్తానాం భయంనాస్తి చ భూపతే ।**
**దుఃఖం కరోతి విప్రస్య శాపార్థం స సురస్య మే ॥60॥**

ఈ విధంగా స్మరించిన శ్రీహరి బ్రహ్మపుత్రుడైన క్షువునితో ఇలా పలికాడు. “ఓ రాజేన్ద్రా! బ్రాహ్మణులకు ఎచటనైనను, లేశమైనను భయములేదు. ప్రత్యేకించి రుద్రభక్తులకు భయము లేనేలేదు. ఆ బ్రాహ్మణునకు దుఃఖమును కలిగించినచో అతడు దేవతనైన నాకు కూడా శాపమునీయగలడు.

**భవితా తస్య శాపేన దక్షయజ్ఞే సురేశ్వరాత్ ।**
**వినాశో మమ రాజేన్ద్ర పునరుత్థానమేవ చ ॥61॥**

ఆయన శాపంచే దక్షయజ్ఞములో దేవదేవుడైన శివునివలన నాకు వినాశనము కలుగుతుంది. ఓ రాజేన్ద్రా! నాకు మరల అభివృద్ధికూడ కలుగగలదు.

**తస్మాత్సమేత్య రాజేన్ద్ర సర్వయజ్ఞో న భూయతే ।**
**కరోమి యత్నం రాజేన్ద్ర దధీచ విజయాయ తే ॥62॥**

రాజేన్ద్రా! నేను నీతోకలసి సర్వయజ్ఞాలు చేసినను వ్యర్థమే. నీకు దధీచిపై విజయం లభించడానికి నేనే ప్రయత్నిస్తాను.

**శ్రుత్వా వాక్యం క్షువః ప్రాహ తథాస్త్వితి హరేర్నృపః ।**
**తస్థౌ తత్రైవ తత్ప్రీత్యా తత్కామోత్సుక మానసః ॥63॥**

విష్ణువుయొక్క ఈ మాటను విని, క్షువ మహారాజు ‘సరే’ అన్నాడు. దధీచిపై విజయము నందలి ఉత్కంఠతో కూడిన మనస్సుగల క్షువుడు విష్ణువునందలి ప్రీతితో అచటనే ఉన్నాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే క్షువ దధీచ వాదవర్ణనం నామాష్ట త్రింశోఽధ్యాయః ॥38॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో క్షువదధీచుల వాదమునువర్ణించుట అరు ముప్పై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## నవ త్రింశోఽధ్యాయః – ముప్పై తొమ్మిదవ అధ్యాయం
## విష్ణుదధీచయుద్ధవర్ణనమ్ – విష్ణుదధీచులయుద్ధమునువర్ణించుట

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**క్షువస్య హితకృత్యేన దధీచస్యాశ్రమం యయౌ ।**
**విప్రరూప మథాస్థాయ భగవాన్ భక్తవత్సలః ॥1॥**

భక్తవత్సలుడైన విష్ణుభగవానుడు క్షువునకు హితమును చేయగోరి, బ్రాహ్మణ వేషముతో దధీచుని ఆశ్రమానికి వెళ్ళాడు.

**దధీచం ప్రాహ విప్రర్షిమభివంద్య జగద్గురుః ।**
**క్షువ కార్యార్థ ముద్యుక్త శ్శైవేన్ద్రం ఛలమాశ్రితః ॥2॥**

క్షువుని కార్యార్థమై మారువేషములో నున్నట్టియు, జగద్గురువైనట్టియు విష్ణువు శివభక్తులలో శ్రేష్ఠుడైనట్టి దధీచి మహర్షితో ఇలా పలికాడు.

**విష్ణురువాచ –** విష్ణువు పలికాడు.

**భో భో దధీచ విప్రర్షే భవార్చనరతావ్యయ ।**
**వరమేకం వృణే త్వత్తస్తద్భవాన్ దాతుమర్హతి ॥3॥**

ఓ దధీచా! విప్రర్షే! నీవు శివారాధకులలో అగ్రగణ్యుడవు. నాశము లేనివాడవు. నీనుండి ఒక వరమును కోరుచుంటిని. నీవు ఈయదగినవాడవు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**యాచితో దేవదేవేన దధీచశ్శైవసత్తమః ।**
**క్షువ కార్యార్థినా శీఘ్రం జగాద వచనం హరిమ్ ॥4॥**

క్షువుని కార్యమును చేయగోరిన దేవదేవుడైన విష్ణువుచే యాచింపబడిన శివభక్తాగ్రగణ్యుడగు దధీచి వెంటనే విష్ణువుతో ఇట్లన్నాడు.

**దధీచ ఉవాచ –** దధీచుడు పలికాడు.

**జ్ఞాతం తవేప్సితం విప్ర క్షువ కార్యార్థ మాగతః ।**
**భగవాన్ విప్రరూపేణ మాయీ త్వమసి వై హరిః ॥5॥**

హే బ్రాహ్మణా! నీ కోరిక నాకు తెలిసినది. నీవు క్షువ కార్యార్థివై బ్రాహ్మణ రూపంలో వచ్చిన మాయావియగు విష్ణు భగవానుడవు.

**భూతం భవిష్యం దేవేశ వర్తమానం జనార్దన ।**
**జ్ఞానం ప్రసాదాద్రుద్రస్య సదా త్రైకాలికం మమ ॥6॥**

హే జనార్దనా! దేవదేవా! రుద్రుని అనుగ్రహంచే నాకు భూత భవిష్యద్వర్తమానములు మూడింటిలోని సంగతులు తెలుస్తూ ఉంటాయి.

**త్వాం జానేఽహం హరిం విష్ణుం ద్విజత్వం త్యజ సుద్రత ।**
**ఆరాధితోఽసి భూపేన క్షువేణ ఖలబుద్ధినా ॥7॥**

నీవు పాపహరుడవైన విష్ణువని నాకు తెలియును. ఆశ్రితరక్షణ దీక్షితుడా! బ్రాహ్మణ వేషమును వీడుము. దుష్ట బుద్ధియైన క్షువ మహారాజు నిన్ను ఆరాధించినాడు.

**జానే తవైవ భగవన్ భక్తవత్సలతాం హరే ।**
**ఛలం త్యజ స్వరూపం హి స్వీకురు స్మర శంకరమ్ ॥8॥**

హే హరీ! భగవన్! నీ భక్తవాత్సల్యమును నేనెరుగుదును. నీవు మారువేషమును వీడి, నిజరూపమును స్వీకరించి, శంకరుని స్మరింపుము.

**అస్తి చేత్కస్యచిద్భీతిర్భవార్చనరతస్య మే ।**
**వక్తుమర్హసి యత్నేన సత్యధారణపూర్వకమ్ ॥9॥**

శివుని అర్చించుటయందు అభిరుచి కలవాని కెవ్వనికైనను భయమున్నచో నీవు నాతో సత్యప్రతిజ్ఞను చేసి నిశ్చితముగా చెప్పవలెను.

**వదామి న మృషా క్వాపి శివస్మరణ సక్తధీః ।**
**న బిభేమి జగత్యస్మిన్ దేవదైత్యాదికాదపి ॥10॥**

నేను అసత్యమును ఎట్టి సందర్భములోనైనను పలుకను. శివుని స్మరించుటయందు లగ్నమైన బుద్ధిగల నేను ఈజగత్తులో దేవతలకుగాని, రాక్షసులకుగాని, ఇతరులకెవ్వరికినీగాని భయపడను.

**విష్ణురువాచ -** విష్ణువు పలికాడు.

**భయం దధీచ సర్వత్ర నష్టం చ తవ సుద్రత ।**
**భవార్చనరతో యస్మాద్భవాన్ సర్వజ్ఞ ఏవ చ ॥11॥**

దధీచా! సుద్రతా! నీకు సర్వత్ర భయము తొలగిపోయింది. నీవు శివుని పూజించుటయందు నిష్ఠ కలవాడవు. అందువలననే నీవు సర్వజ్ఞుడవైనావు.

**బిభేమీతి సకృద్వక్తు మర్హసి త్వం నమస్తవ ।**
**నియోగాన్మమ రాజేన్ద్ర క్షువాత్ ప్రతిసహా దహమ్ ॥12॥**

నీకు నమస్కారము. నా ఆజ్ఞచే నీవు 'భయపడుచున్నాను' అని ఒక్కసారి నీ శత్రువైన క్షువ మహారాజు ఎదుట చెప్పవలెను.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఏవం శ్రుత్వాపి తద్వాక్యం విష్ణోస్సతు మహామునిః ।**
**విహస్య నిర్భయః ప్రాహ దధీచశ్శైవ సత్తమః ॥13॥**

విష్ణువు యొక్క ఆమాటలను వినికూడా భయమును పొందనివాడై శివభక్తాగ్రగణ్యుడగు దధీచి మహర్షి నవ్వి, ఇలా పలికాడు.

**దధీచ ఉవాచ** – దధీచుడు పలికాడు.

**న బిభేమి సదా క్వాపి కుతశ్చిదపి కించన ।**
**ప్రభవాద్దేవదేవస్య శంభోస్సాక్షాత్పినాకినః ॥14॥**

పినాకపాణి, దేవదేవుడు అగు శంభుని ప్రభావం వలన నేను ఏకాలమునందైనను, ఏదేశమునందైనను, ఏ వస్తువువలనను లేశమైనను భయపడను.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**తతస్తస్య మునేః శ్రుత్వా వచనం కుపితో హరిః ।**
**చక్రముద్యమ్య సంతస్థౌ దిధక్షుర్మునిసత్తమమ్ ॥15॥**

ఆ మహర్షియొక్క మాటలను విని, విష్ణువు కోపించి, ఆ మహర్షిని దహించు కోరికతో చక్రమునెత్తి నిలబడ్డాడు.

**అభవత్కుంఠితం తత్ర విప్రే చక్రం సుదారుణమ్ ।**
**ప్రభావాచ్చ తదీశస్య నృపతే స్సంనిధావపి ॥16॥**

శంకరుని మహిమచే మిక్కిలి భయంకరమైన ఆచక్రము ఈ బ్రాహ్మణునియందు వ్యర్థమైనది. క్షువ మహారాజు సన్నిధిలోకూడ ఆ విధముగానే జరిగినది కదా!

**దృష్ట్వా తం కుంఠితాస్యం తచ్చక్రం విష్ణుం జగాదహ ।**
**దధీచస్సస్మితం సాక్షాత్సదసద్వ్యక్తికారణమ్ ॥17॥**

మొక్కవోయిన ఆ చక్రమునుచూచి, దధీచుడు సదసద్రూపమగు జగత్తు ఆవిర్భవించుటకు కారణభూతుడైన విష్ణువు ఎదుట చిరునవ్వు నవ్వుచూ ఇలా పలికాడు.

**దధీచ ఉవాచ** – దధీచుడు పలికాడు.

**భగవన్ భవతా లబ్ధం పురాతీవ సుదారుణమ్ ।**
**సుదర్శనమితి ఖ్యాతం చక్రం విష్ణోః ప్రయత్నతః ॥**
**భవస్య తచ్ఛుభం చక్రం న జిఘాంసతి మామిహ ॥18॥**

ఓ భగవంతుడా! నీవు పూర్వం ప్రయత్నముచేసి, అతిభయంకరమైన ఈ చక్రాన్ని పొందినావు. ఇది లోకంలో సుదర్శనమనియు, విష్ణుచక్రమనియు, ప్రఖ్యాతిని పొందినది. శివుడనుగ్రహించిన ఈ శుభచక్రము నన్ను సంహరింప నిచ్చగించుటలేదు.

**భగవానథ కృద్ధోఽ_స్మై సర్వాస్త్రాణి క్రమాద్ధరిః ।**
**బ్రహ్మాస్త్రాద్యైః శరైశ్చాస్త్రైః ప్రయత్నం కర్తుమర్హసి ॥19॥**

భగవానుడగు శ్రీహరి కోపించి అన్ని అస్త్రాలను ఆయనపై ప్రయోగించాడు. అపుడు దధీచుడు - భగవన్! నీవు బ్రహ్మాస్త్రము మున్నగు అస్త్రములతోను వివిధ శరములతోను ప్రయత్నించవచ్చును.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**స తస్య వచనం శ్రుత్వా దృష్ట్వా నిర్వీర్య మానుషమ్ ।**
**ససర్జాథ క్రుధా తస్మై సర్వాస్త్రాణి క్రమాద్ధరిః ॥20॥**

విష్ణువు మనుష్యులను నిర్వీర్యపరచేశక్తిగల దధీచునిచూచి, అతని మాటలనువిని, కోపించి అతనిపై అస్త్రాల నన్నిటిని క్రమంగా ప్రయోగించాడు.

**చక్రుర్దేవా స్తతస్తస్య విష్ణో స్సాహాయ్య మాదరాత్ ।**
**ద్విజే నైకేన సంయోద్ధుం ప్రసృతస్య విబుద్ధయః ॥21॥**

ఒక్క బ్రాహ్మణునితో యుద్ధానికి తలబడిన విష్ణువు పక్షంలో నిలబడి, మూర్ఖులైన ఇంద్రాది దేవతలు అతనికి సహాయపడ్డారు.

**చిక్షిపుః స్వాని స్వాన్యాశు శస్త్రాన్యస్త్రాణి సర్వతః ।**
**దధీచోపరి వేగేన శక్రాద్యా హరిపాక్షికాః ॥22॥**

ఇంద్రాది దేవతలు హరి పక్షంలో నిలబడి, దధీచునిపై వేగంతో తమతమ శస్త్రాలను, అస్త్రాలను ప్రయోగించారు.

**కుశముష్టి మథాదాయ దధీచ స్సంస్మరన్ శివమ్ ।**
**ససర్జ సర్వదేవేభ్యో వజ్రాస్థిః సర్వతో వశీ ॥23॥**

అంతట వజ్రమువంటి ఎముకలు కలవాడు, సర్వము తన వశమునందున్నవాడునైన దధీచుడు శివుని స్మరించుచు గుప్పెడు దర్భలను గ్రహించి దేవతలందరిపై ప్రయోగించాడు.

**శంకరస్య ప్రభావాత్తు కుశముష్టిర్మునేర్హి సా ।**
**దివ్యం త్రిశూల మభవత్ కాలాగ్ని సదృశం మునే ॥24॥**

శంకరుని మహిమచే మహర్షి ప్రయోగించిన దర్భల కట్ట కాలాగ్నివంటి త్రిశూలమయ్యింది.

**దగ్ధుం దేవాన్ మతిం చక్రే సాయుధం సశిఖం చ తత్ ।**
**ప్రజ్వల త్సర్వత శ్చైవం యుగాంతాగ్న్యధిక ప్రభమ్ ॥25॥**

ఆ త్రిశూలము ప్రళయ కాలాగ్నికంటె అధికమైన కాంతులనంతటా విరజిమ్ముచుండెను. అది దేవతలను, వారి ఆయుధములను దహించడానికి నిశ్చయించుకొన్నది.

**నారాయణేంద్ర ముఖ్యైస్తు దేవైః క్షిప్తాని యాని చ ।**
**ఆయుధాని సమస్తాని ప్రణేముస్త్రిశిఖం చ తత్ ॥26॥**

నారాయణుడు, ఇంద్రుడు మున్నగు ముఖ్యమైన దేవతలచే ప్రయోగింపబడిన ఆయుధాలన్నియు మూడగ్రములుగల త్రిశూలమునకు నమస్కరించినవి.

**దేవాశ్చ దుద్రువుస్సర్వే ధ్వస్తవీర్యా దివౌకసః ।**
**తస్థౌ తత్ర హరిర్భీతః కేవలం మాయినాం వరః ॥27॥**

నష్టమైన పరాక్రమముగల దేవతలందరు పారిపోయారు. మాయావులలో శ్రేష్ఠుడైన హరి ఒక్కడు మాత్రము భయముతో అక్కడ నిలిచియున్నాడు.

**ససర్జ భగవాన్ విష్ణుః స్వదేహాత్పురుషోత్తమః ।**
**ఆత్మన స్సదృశాన్ దివ్యాన్ లక్షలక్షాయుతాన్ గణాన్ ॥28॥**

పురుషోత్తముడైన శ్రీమహావిష్ణువు తన దేహమునుండి తనతో సమానమైన కోట్లాకొలది దివ్య గణాలను సృష్టించాడు.

**తేచాపి యుయుధుస్తత్ర వీరా విష్ణు గణాస్తతః ।**
**మునినైకేన దేవర్షే దధీచేన శివాత్మనా ॥29॥**

మహర్షీ! వీరులైన ఆ విష్ణుగణాలుకూడా శివస్వరూపుడు, ఏకాకియునగు దధీచ మహర్షితో అచ్చట యుద్ధమును చేశారు.

**తతో విష్ణుగణాన్ తాన్వై నియుద్ధ్య బహుశో రణే ।**
**దదాహ సహసా సర్వాన్ దధీచశ్చైవసత్తమః ॥30॥**

అంతట శివభక్తశేఖరుడగు దధీచుడు విష్ణుగణాలతో పరిపరివిధాల యుద్ధముచేసి, అనంతర క్షణంలో వారినందరిని దహించివేశాడు.

**తతస్తద్విస్మయాథాయ దధీచస్య మునేర్హరిః ।**
**విశ్వమూర్తి రభూచ్ఛీఘ్రం మహామాయా విశారదః ॥31॥**

అంతట మహామాయా విశారదుడగు విష్ణువు దధీచుని ఆశ్చర్యచకితుని చేయుట కొరకు విశ్వరూపాన్ని పొందాడు.

**తస్య దేహే హరేః సాక్షాదపశ్య ద్ద్విజసత్తమః ।**
**దధీచో దేవతాదీనాం జీవానాం చ సహస్రకమ్ ॥32॥**

ద్విజశ్రేష్ఠుడగు దధీచి ఆవిష్ణువుయొక్క దేహములో అసంఖ్యాకులగు దేవతలను వేలకొలది జీవులను ప్రత్యక్షంగా చూశాడు.

**భూతానాం కోటయశ్చైవ గణానాం కోటయస్తథా ।**
**అండానాం కోటయశ్చైవ విశ్వమూర్తేస్తనౌ తదా ॥33॥**

ఆ విశ్వమూర్తియొక్క దేహంలో కోట్లకొలది భూతాలు, కోట్లకొలది గణాలు మరియు కోట్లకొలది బ్రహ్మాండాలు కన్పడ్డాయి.

**దృష్ట్వైతదఖిలం తత్ర చ్యావనిస్సతతం తదా ।**
**విష్ణుమాహ జగన్నాథం జగత్స్తువమజం విభుమ్ ॥34॥**

అప్పుడా విశ్వరూపాన్ని దర్శించిన చ్యవననందనుడు జగన్నాథుడు, సకలజగత్తుచేస్తుతింపదగినవాడు, పుట్టుకలేనివాడు, సర్వవ్యాపియునైన విష్ణువుతో ఇట్లన్నాడు.

**దధీచ ఉవాచ –** దధీచుడు పలికాడు.

**మాయాం త్యజ మహాబాహో ప్రతిభాసో విచారతః ।**
**విజ్ఞాతాని సహస్రాణి దుర్విజ్ఞేయాని మాధవ ॥35॥**

హే మహాబాహూ! మాధవా! మాయను వీడుము. విచారణ చేసినచో ఇది ఆభాసయని విదితమౌతుంది. తెలియుటకు మిక్కిలి కష్టమైన వేలాది విషయాలను నేనెరింగితిని.

**మయి పశ్య జగత్సర్వం త్వయాయుక్తమతంద్రితః ।**
**బ్రహ్మాణంచ తథా రుద్రం దివ్యాం దృష్టిం దదామి తే ॥36॥**

నీవు నాయందు శ్రద్ధగా చూడుము. నీకు దివ్యదృష్టినిచ్చుచున్నాను. నీవు బ్రహ్మ రుద్రాదులతో సహా జగత్తంతయు చూడగలవు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా దర్శయామాస స్వతనౌ నిఖిలం మునిః ।**
**బ్రహ్మాండం చ్యావని శ్శంభుతేజసా పూర్ణదేహకః ॥37॥**

ఇట్లు పలికి, చ్యవనపుత్రుడైన ఆ ముని శంభుని తేజస్సుచే పూర్ణ విరాడ్దేహమును స్వీకరించినవాడై తన దేహమునందు నిఖిల బ్రహ్మాండాలను ప్రదర్శించాడు.

**దదాహ విష్ణుం దేవేశం దధీచశ్శైవసత్తమః ।**
**సంస్మరన్ శంకరం చిత్తే విహసన్ విభయస్సుధీః ॥38॥**

శివభక్తాగ్రగణ్యుడు, నిర్భయుడు, విద్వాంసుడునైన దధీచి మనస్సులో శంకరుని స్మరిస్తూ చిరునవ్వుతో దేవేశుడైన విష్ణువునుద్దేశించి ఇలా పలికాడు.

**దధీచ ఉవాచ –** దధీచుడు పలికాడు.

**మాయయా త్వనయా కిం వా మంత్రశక్త్యాథవా హరే ।**
**సత్కామనా మిమాంకృత్వాయోద్ధుమర్హసి యత్నతః ॥39॥**

హే విష్ణూ! ఈ మాయతోగాని, మంత్రశక్తితోగాని పనిలేదు. నీవు మాయను విడిచి ప్రయత్నపూర్వకముగా యుద్ధాన్నిచేయి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఏతచ్ఛ్రుత్వా మునేస్తస్య వచనం నిర్భయస్తదా ।**
**శంభుతేజోమయం విష్ణుశ్చుకోపాతీవ తం మునిమ్ ॥40॥**

ఓ నారదమునీ! నిర్భయుడు, శంభు తేజోమయుడునైన దధీచి మహర్షి పలుకులను విని విష్ణువు ఆ మహర్షిపై మిక్కిలి కోపాన్ని పొందాడు.

**దేవాశ్చ దుద్రువు ర్భూయో దేవం నారాయణం చ తమ్ ।**
**యోద్ధుకామాశ్చ మునినా దధీచేన ప్రతాపినా ॥41॥**

దేవతలు ప్రతాపశీలియగు దధీచునితో మరల యుద్ధాన్ని చేయగోరి, వేగంగా నారాయణ దేవుని సమీపించారు.

**ఏతస్మిన్నంతరే తత్రాగమ నృత్సంగతః క్షువః ।**
**అవారయంతం నిశ్చేష్టం పద్మయోనిం హరిం సురాన్ ॥42॥**

ఇంతలో నేను, నాతోబాటు క్షువుడు అక్కడకు చేరుకున్నాము. పద్మసంభవుడనైన నేను హరిని, దేవతలను, యుద్ధం చేయకుండునట్లు వారించాను.

**నిశమ్య వచనం మే హి బ్రాహ్మణో న వినిర్జితః ।**
**జగామ నికటం తస్య ప్రణనామ మునిం హరిః ॥43॥**

"ఈ బ్రాహ్మణుడు జయింప శక్యం కానివాడు". అని చెప్పిన నా మాటలను విని హరి దధీచి మహర్షి చెంతకు వెళ్ళి, నమస్కరించాడు.

**క్షువో దీనతరో భూత్వా గత్వా తత్ర మునీశ్వరమ్ ।**
**దధీచ మభివాద్యైవ ప్రార్థయామాస విక్లబః ॥44॥**

క్షువుడు మిక్కిలి దీనుడై, దుఃఖితుడై, దధీచ మహర్షి వద్దకు వెళ్ళి, నమస్కరించి, ఇట్లు ప్రార్థించాడు.

**క్షువ ఉవాచ –** క్షువుడు పలికాడు.

**ప్రసీద మునిశార్దూల శివభక్త శిరోమణే ।**
**ప్రసీద పరమేశాన దుర్లక్ష్యో దుర్జనైస్సహ ॥45॥**

ఓ మహర్షీ! శివ భక్తాగ్రగణ్యా! దయను చూపుము. ఓ పరమేశానా! ప్రసన్నుడవు కమ్ము. దుర్జనులు నిన్ను కన్నెత్తియైన చూడజాలరు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య రాజ్ఞస్సురగణస్య హి ।**
**అనుజగ్రాహ తం విప్రో దధీచ స్తపసాం నిధిః ॥46॥**

ఆ రాజుయొక్క మాటలను విని, తపోనిధి, వేదవేత్తయునగు దధీచ మహర్షి ఆ రాజును, తక్కిన దేవతలనందరిని అనుగ్రహించాడు.

**అథ దృష్ట్వా రమేశాదీన్ క్రోధం విహ్వలితో మునిః ।**
**హృది స్మృత్వా శివం విష్ణుం శశాప చ సురానపి ॥47॥**

అంతట దధీచుడు విష్ణువు మున్నగువారిని చూచి, మిక్కిలి కోపించినవాడై, హృదయములో శివుని స్మరించి, విష్ణువును, దేవతలనుకూడా శపించాడు.

**దధీచ ఉవాచ –** దధీచుడు పలికాడు.

**రుద్రకోపాగ్నినా దేవాస్సదేవేంద్రా మునీశ్వరాః ।**
**ధ్వస్తా భవంతు దేవేన విష్ణునా చ సమం గణైః ॥48॥**

దేవతలు, దేవేంద్రుడు, మహర్షులు, విష్ణుదేవుడు, మరియు విష్ణుగణాలు రుద్రుని కోపాగ్నిలో వినాశనమును పొందెదరుగాక!

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఏవం శప్త్వా సురాన్ ప్రేక్ష్య క్షువమాహ తతో మునిః ।**
**దేవైశ్చ పూజ్యో రాజేంద్ర నృపైశ్చైవ ద్విజోత్తమః ॥49॥**

**బ్రాహ్మణా ఏవ రాజేన్ద్ర బలినః ప్రభవిష్ణవః ।**
**ఇత్యుక్త్వా స స్ఫుటం విప్రః ప్రవివేశ నిజాశ్రమమ్ ॥50॥**

ఇట్లు దేవతలను శపించిన అనంతరం దధీచుడు క్షువుని చూచి, అతనితో ఇలాపలికాడు "ఓరాజేంద్రా! బ్రాహ్మణోత్తముడు రాజులచేత, దేవతలచేత కూడ పూజ్యుడు. బ్రాహ్మణులే బలవంతులు, సమర్థులు" అని స్పష్టంగా చెప్పి మహర్షి తన ఆశ్రమంలో ప్రవేశించాడు.

**దధీచ మభివంద్యైవ క్షువో నిజగృహం గతః ।**
**విష్ణుర్జగామ స్వం లోకం సురై స్సహ యథాగతమ్ ॥51॥**

క్షువుడు దధీచునకు నమస్కరించి తన గృహానికి వెళ్ళాడు. విష్ణువు దేవతలతోగూడి వచ్చిన దారిని తన లోకానికి వెళ్ళాడు.

**తదేవం తీర్థమభవత్ స్థానేశ్వర ఇతి స్మృతమ్ ।**
**స్థానేశ్వర మనుప్రాప్య శివసాయుజ్యమాప్నుయాత్ ॥52॥**

ఆ స్థానమే **"స్థానేశ్వరము"** అనే పేరుతో పుణ్యక్షేత్రమయ్యింది. స్థానేశ్వరాన్ని చేరి, శివుని దర్శించినవారు శివ సాయుజ్యమును పొందుతారు.

**కథితస్తవ సంక్షేపాద్వాదః క్షువ దధీచయోః ।**
**నృపాప్త శాపయోస్తాత బ్రహ్మ విష్ణ్వోః శివం వినా ॥53॥**

ఓ వత్సా! క్షువ దధీచుల వివాదాన్ని, త్రిమూర్తులలో శివుడు తక్క తక్కిన ఇరువురు అనగా బ్రహ్మవిష్ణువులు పొందిన శాపాలను నీకు సంక్షేపంగా చెప్పాను.

**య ఇదం కీర్తయేన్నిత్యం వాదం క్షువ దధీచయోః ।**
**జిత్వాపమృత్యుం దేహాన్తే బ్రహ్మలోకం ప్రయాతి సః ॥54॥**

ఈ క్షువ దధీచుల వివాదాన్ని నిత్యము కీర్తించు మానవుడు అపమృత్యువును జయించి, దేహాన్ని విడిచిన తరువాత బ్రహ్మలోకమును పొందుతాడు.

**రణే యః కీర్తయిత్వేదం ప్రవిశే త్తస్య సర్వదా ।**
**మృత్యు భీతిర్భవేన్నైవ విజయీచ భవిష్యతి ॥55॥**

ఎవరైతే దీనిని కీర్తించిన పిదప యుద్ధానికి బయలుదేరతారో వారికి మృత్యుభయము ఉండనే ఉండదు. అంతేగాక వారు విజయాన్ని పొందగలరు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే విష్ణు దధీచ యుద్ధ వర్ణనం నామ నవత్రింశోఽధ్యాయః ॥39॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో విష్ణుదధీచుల యుద్ధమునువర్ణించుట అనే ముప్పై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## చత్వారింశోఽధ్యాయః - నలబైయవ అధ్యాయం

## శివదర్శన వర్ణనమ్ - శివసందర్శనం

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**విధే విధే మహాప్రాజ్ఞ శైవతత్త్వ ప్రదర్శక ।**
**శ్రావితా రమణీ ప్రాయా శివలీలా మహాద్భుతా ॥1॥**

హే విధే! నీవు శివతత్త్వాన్ని ప్రదర్శించే మహాప్రాజ్ఞుడవు. మనోరంజకమైన, మహాద్భుతమైన శివలీలలను నీవు మిక్కిలి మనోహరంగా వినిపించావు.

**వీరేణ వీరభద్రేణ దక్షయజ్ఞం వినాశ్య వై ।**
**కైలాసాద్రౌ గతే తాత కిమభూత్తద్వదాధునా ॥2॥**

తండ్రీ! వీరుడైన వీరభద్రుడు దక్షయజ్ఞాన్ని ధ్వంసమొనరించి, కైలాస పర్వతానికి వెళ్ళాడు కదా! వీరభద్రుడు అలా వెళ్ళిన పిదప ఏమయ్యిందో ఇప్పుడు చెప్పండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథ దేవగణాస్సర్వే మునయశ్చ పరాజితాః ।**
**రుద్రానీకై ర్విభిన్నాంగా మమ లోకం యయుస్తదా ॥3॥**

అప్పుడు దేవగణాలు, మునులందరు పరాజితులై రుద్రుని సేనలచే విరిచివేయబడిన అవయవాలు కలవారై నాలోకానికి వచ్చారు.

**స్వయంభువే నమస్కృత్య మహ్యం సంస్తూయ భూరిశః ।**
**తత్ స్వక్లేశం విశేషేణ కార్త్స్న్యేనైవ న్యవేదయన్ ॥4॥**

స్వయంభువుడనగు నాకు నమస్కరించి, పరిపరి విధముల స్తుతించి, తమకు కలిగిన క్లేశాలను సమగ్రంగా నివేదించాడు.

**తదాకర్ణ్య తతోఽహం వై పుత్రశోకేన పీడితః ।**
**అచిన్తయ మతివ్యగ్రో దూయమానేన చేతసా ॥5॥**

పుత్రశోకంతో పీడితుడనై, మిక్కిలి దుఃఖంతో నిండిన మనస్సుగల నేను వారిమాటలను విని, ఆలోచించాను.

**కిం కార్యం కార్యమద్యాశు మయా దేవ సుఖావహమ్ ।**
**యేన జీవతు దక్షోఽసౌ మఖః పూర్ణో భవేత్సురః ॥6॥**

ఇప్పుడు దేవతలకు సుఖం కలగడానికి, నేను చేయదగిన కర్తవ్యమేమి? దక్షుడు తిరిగి బ్రతికి యజ్ఞాన్ని పూర్తిచేయగల ఉపాయమేది?

**ఏవం విచార్య బహుధా నాలభం శమహం మునే ।**
**విష్ణుం తదా స్మరన్ భక్త్యా జ్ఞానమాప్తం తదోచితమ్ ॥7॥**

ఇట్లు నేను బహుధా విచారించితిని కాని నాకు మనశ్శాంతి లభించలేదు. అంతట విష్ణువును భక్తితో స్మరించగా అప్పటికి తగిన జ్ఞానప్రాప్తి కలిగింది.

**అథ దేవైశ్చ మునిభి ర్విష్ణోర్లోకమహం గతః ।**
**నత్వా నుత్వా చ వివిధై స్త్సవైర్దుఃఖం న్యవేదయమ్ ॥8॥**

అపుడు నేను దేవతలతో, మునులతో గూడి విష్ణులోకానికి వెళ్ళి, నమస్కరించి, వివిధ స్తోత్రాలతో స్తుతించి, మా దుఃఖాన్ని విన్నవించాను.

**యథాఽధ్వరః ప్రపూర్ణః స్యాద్దేవ యజ్ఞకరశ్చ సః ।**
**సుఖినస్స్యు స్సురాస్సర్వే మునయశ్చ తథా కురు ॥9॥**

ఓ దేవా! ఈయజ్ఞం సంపూర్ణమై యజమాని, సమస్తదేవతలు, మునులు ఏవిధంగా సుఖాన్ని పొందుతారో ఆవిధంగా చేయి.

**దేవదేవ రమానాథ విష్ణో దేవ సుఖావహ ।**
**వయం త్వచ్చరణం ప్రాప్తా స్సదేవ మునయో ధ్రువమ్ ॥10॥**

దేవదేవా! రమానాథా! విష్ణో! నీవు దేవతలకు సుఖాన్ని ఇచ్చేవాడవు. దేవతలతో, మునులతో సహా నిశ్చయంగా నిన్ను శరణు పొందియున్నాం.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచో మే హి బ్రహ్మణస్స రమేశ్వరః ।**
**ప్రత్యువాచ శివం స్మృత్వా శివాత్మా దీనమానసః ॥11॥**

బ్రహ్మనైన నాయీ మాటలను విని, శివస్వరూపుడగు లక్ష్మీపతి దీనమనస్కుడై, శివుని స్మరించి ఇలా బదులు పలికాడు.

**విష్ణురువాచ –** విష్ణువు పలికాడు.

**తేజీయసి న సా భూతా కృతాగసి బుభూషతామ్ ।**
**తత్ర క్షేమాయ బహుధా బుభూషా హి కృతాగసామ్ ॥12॥**

ఉన్నతిని గోరువారు తేజశ్శాలియైన వ్యక్తి విషయంలో అపరాధంము చేయుట తగదు. ఆవిధంగా అపరాధం చేసేవారికి క్షేమం కలుగదు.

**కృతపాపాస్సురా స్సర్వే శివే హి పరమేశ్వరే ।**
**పరాదదుర్యజ్ఞభాగం తస్య శంభోర్విధేయతః ॥13॥**

దేవతలందరూ పరమేశ్వరుడగు శివునియందు అపరాధాన్ని చేశారు. ఓ విధీ! వీరు శంభునకు విధివిరిచితమైన యజ్ఞభాగ మీయకున్నారు.

**ప్రసాదయధ్వం సర్వే హి యూయం శుద్ధేన చేతసా ।**
**అథాపరప్రసాదం తం గృహీతాంఘ్రియుగం శివమ్ ॥14॥**

మీరందరు గొప్ప ప్రసాదబుద్ధిగల శివుని శుద్ధమైన మనస్సుతో ప్రసన్నుని చేసుకోండి. మఱియు ఆయన పాదములను గ్రహించి ప్రణామంచేయండి.

**యస్మిన్ ప్రకుపితే దేవే వినశ్యత్యఖిలం జగత్ ।**
**సలోకపాల యజ్ఞస్య శాసనాజ్జీవితం ద్రుతమ్ ॥15॥**

ఆయన కోపిస్తే సమస్త జగత్తు నశిస్తుంది. ఆయన శాసనంతోనే లోకపాలురతో కూడిన యజ్ఞం పరిసమస్తమౌతుంది.

**తమాశు దేవం ప్రియయా విహీనం చ దురుక్తిభిః ।**
**క్షమాపయధ్వం హృద్విద్ధం దక్షేణ సుదురాత్మనా ॥16॥**

మిక్కిలి దురాత్ముడైన దక్షుని దురుక్తులతో ఆయన హృదయం గాయపరుపబడింది. ప్రియా విహీనుడైన ఆ దేవుని వెంటనే క్షమాపణను కోరండి.

**అయమేవ మహోపాయస్త చ్ఛాంత్యై కేవలం విధే ।**
**శంభో స్సంతుష్టయే మన్యే సత్యమేవోదితం మయా ॥17॥**

ఓ విధీ! శంభుడు శాంతించుటకు ఇది ఒక్కటియే గొప్ప ఉపాయమని నేను తలంచుచున్నాను. నేను సత్యాన్నే పలుకుతున్నా.

**నాహం న త్వం సురాశ్చాన్యే మునయో౽పి తనూభృతః ।**
**యస్య తత్త్వం ప్రమాణం చ న విదుర్బల వీర్యయోః ॥18॥**

నేనుగాని, నీవుగాని, ఇతర దేవతలుగాని, మునులుగాని, ఇతర ప్రాణులుగాని ఆయన తత్త్వమును, ఆయన బలపరాక్రమాల సీమలనూ తెలియలేరు.

**ఆత్మతంత్రస్య తస్యాపి పరస్య పరమాత్మనః ।**
**క ఉపాయం విధిత్సేద్వై పరం మూఢం విరోధినమ్ ॥19॥**

స్వతంత్రుడు, పరాత్పరుడు నగు శివునకు విరోధియైన పరమమూఢునకు ఉపాయాన్నీ ఎవరు చెప్ప నిచ్చగించెదరు?

**చలిష్యేహమపి బ్రహ్మన్ సర్వైః సార్ధం శివాలయమ్ ।**
**క్షమాపయామి గిరిశం కృతాగాశ్చ శివే ధ్రువమ్ ॥20॥**

ఓ బ్రహ్మ! నేను కూడా మీ అందరితో కూడి, శివుని నివాసానికి వచ్చెదను. నేను కూడ శివునియందు నిశ్చయంగా అపరాధం చేశాను. ఇప్పుడు క్షమాపణ వేడెదను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్థమాదిశ్య విష్ణుర్మాం బ్రహ్మాణం సామరాదికమ్ ।**
**సార్ధం దేవైర్మతిం చక్రే తద్గిరౌ గమనాయ సః ॥21॥**

అమరులతో కూడియున్న బ్రహ్మనైన నన్ను విష్ణు విలా ఆదేశించి, దేవతలతో గూడి శివుని పర్వతానికి వెళ్ళవలెనని నిశ్చయించుకున్నాడు.

**యయౌ స్వధిష్ణ్య నిలయం శివస్యాద్రివరం శుభమ్ ।**
**కైలాసం సామర మునిప్రజేశాదిమయో హరిః ॥22॥**

విష్ణువు దేవతలతో, మునులతో, దిక్పాలకులతో, ఇతరులతోకూడి తనకు పూజార్హమైన మంగళకరమై, శివుని నివాసమై, పర్వతరాజమైన కైలాసానికి వెళ్ళాడు.

**అతిప్రియం ప్రభోర్నిత్యం సుజుష్టం కిన్నరాదిభిః ।**
**నరేతరై రప్సరోభిర్యోగసిద్ధై ర్మహోన్నతమ్ ॥23॥**

కైలాసం శివప్రభునకు మిక్కిలి ప్రియమైనది. కిన్నరాదులచే చక్కగా నిత్యము సేవించబడేది. అప్సరలచేతను. యోగసిద్ధులచేతను సేవింపబడేది. అంతేకాదు మహోన్నతమైనది కూడా.

**నానామణిమయై శృంగైః శోభమానం సమంతతః ।**
**నానాధాతు విచిత్రం వై నానాద్రుమ లతాకులమ్ ॥24॥**

నానావిధ మణిమయాలైన శిఖరాలచే శోభాయమానమైనది. నానాధాతు విచిత్రమైనది. అనేక వృక్షాలతో, లతలతో దట్టంగా నిండియున్నది.

**నానామృగగణాకీర్ణం నానాపక్షిసమన్వితమ్ ।**
**నానాజలప్రస్రవణై రమరై స్సిద్ధయోషితామ్ ॥25॥**

**రమణై ర్విహరంతీనాం నానాకందరసానుభిః ।**
**ద్రుమజాతిభి రన్యాభీ రాజితం రాజతప్రభమ్ ॥26॥**

ఆ కైలాసం నానా మృగ గణాలతో, నానాపక్షులతో, నానా జలప్రవాహాలతో కూడినది. దేవతాస్త్రీలు తమ ప్రియులగు సురలతోకూడి, వివిధ గుహలలో, పర్వత సానువులలో విహరిస్తూ ఉంటారు. ఈపర్వతం వెండివలె కాంతులీనుతుంటుంది. అనేక వృక్షజాతులతో శోభిల్లుతున్నది.

**వ్యాఘ్రాదిభి ర్మహాసత్త్వై ర్నిర్ఘుష్టం క్రూరతోజ్ఝితమ్ ।**
**సర్వశోభాన్వితం దివ్యం మహావిస్మయకారకమ్ ॥27॥**

వ్యాఘ్రాది మహామృగాల గర్జనలుగలది, క్రూరత్వము లేనిది కైలాసం. సమస్త శోభలతో కూడిన ఆ దివ్యపర్వతం మహావిస్మయాన్ని కలిగిస్తోంది.

**పర్యస్తం గంగయా సత్యా స్థాన పుణ్యతరోదయా ।**
**సర్వపావనసంకర్త్ర్యా విష్ణుపద్యా సునిర్మలమ్ ॥28॥**

స్థాన మహిమచే మరింత పుణ్యతరమైన జలం కలిగి, సర్వులను పావనమొనర్చగల, విష్ణుపాదోద్భవ అయిన గంగానదిచే చుట్టువారబడియున్న ఆ పర్వతం మిక్కిలి నిర్మలంగా ఉన్నది.

**ఏవం విధం గిరిం దృష్ట్వా కైలాసాఖ్యం శివప్రియమ్ ।**
**యయుస్తే విస్మయం దేవా విష్ణ్వాద్యా స్సమునీశ్వరాః ॥29॥**

శివునకు ప్రియమైన, కైలాసమనే పేరుగల ఆ పర్వతాన్ని చూచి, విష్ణ్వాది దేవతలూ, మునీశ్వరులూ విస్మయాన్ని పొందారు.

**తత్సమీపేఽలకాం రమ్యాం దదృశుర్నామ తే పురీమ్ ।**
**కుబేరస్య మహాదివ్యాం రుద్రమిత్రస్య నిర్జరాః ॥30॥**

దాని సమీపమందు శివమిత్రుడగు కుబేరుని దివ్యనగరాన్ని, దేవతలు చూశారు. దాని పేరు అలక. అది సుందరమైన నగరం.

**వనం సౌగంధికం చాపి దదృశుస్తత్సమీపతః ।**
**సర్వద్రుమాన్వితం దివ్యం యత్ర తన్నాదమద్భుతమ్ ॥31॥**

దాని సమీపంలో సర్వ ద్రుమాన్వితమైన 'సౌగంధిక' మనే దివ్యవనాన్ని చూశారు. ఆ వనంలో పక్షుల ధ్వనులు అద్భుతంగా ఉన్నాయి.

**తద్బాహ్యతస్తస్య దివ్యే సరితా వతిపావనే ।**
**నందా చాలకనందా చ దర్శనాత్పాపహారికే ॥32॥**

దానికి కొలది దూరంలో దివ్యాలూ, పవిత్రాలూ, తలచినంతనే పాపాలు పోగొట్టగలవి. అయిన నంద, అలకనంద అనే నదులున్నవి.

**పపుః సురస్త్రియో నిత్యమవగూహ్య స్వలోకతః ।**
**విగాహ్య పుంభిస్తా స్తత్ర క్రీడంతి రతికర్శితాః ॥33॥**

దేవతా స్త్రీలు ప్రతిదినం తన లోకాలనుండి అచ్చటికి వచ్చి వాటిలోని నీటిని త్రాగుతారు. మన్మథ పీడితులైనవారు. తమ ప్రియులతోకూడి, వాటియందు జలక్రీడలాడతారు.

**హిత్వా యక్షేశ్వరపురీం వనం సౌగంధికం చ యత్ ।**
**గచ్ఛంతస్తే సురా ఆరాద్దదృశు శ్శాంకరం వటమ్ ॥34॥**

కుబేరుని నగరాన్ని, సౌగంధిక వనాన్ని దాటి ఆ దేవతలు కొలది దూరం వెళ్ళి శంకరుని మఱ్ఱిచెట్టును చూశారు.

**పర్యక్ కృతాచల చ్ఛాయం పాదోనవిటపాయతమ్ ।**
**శతయోజనకోత్సేధం నిర్నీడం తాపవర్జితమ్ ॥35॥**

దాని ఊడలన్నియు వేర్వేరు వృక్షావలె ఉన్నాయి. అది బహు విస్తారంగా ఉన్నది. అది తొలగిపోని నీడను ఇస్తోంది. దానిక్రింద చల్లగానుంది. దానిది వంద యోజనాల విస్తీర్ణం. దానియందు పక్షుల గూళ్ళులేవు.

**మహాపుణ్యవతాం దృశ్యం సురమ్యం చాతిపావనమ్ ।**
**శంభుయోగస్థలం దివ్యం యోగిసేవ్యం మహోత్తమమ్ ॥36॥**

ఆ స్థలంలో శంభుడు తపస్సు చేశాడు. ఆ దివ్యస్థలాన్ని మహాపుణ్యాత్ములైనవారు మాత్రమే దర్శించగలరు. ఆ సుందరస్థలం పరమ పావనమైనది. మహోత్తమమైన ఆ స్థలాన్ని యోగులు సేవిస్తూ ఉంటారు.

**ముముక్షు శరణే తస్మిన్ మహాయోగమయే వటే ।**
**ఆసీనం దదృశు స్సర్వే శివం విష్ణ్వాదయ స్సురాః ॥37॥**

ఆ మఱ్ఱిచెట్టు ముముక్షువులకు శరణ్యం, మహాయోగమయం. శివుడు దానివద్ద కూర్చొనియుండగా విష్ణ్వాది దేవతలు చూశారు.

**విధిపుత్రై ర్మహాసిద్ధై శ్శివభక్తిరతై స్సదా ।**
**ఉపాస్యమానం సుముదా శాంతై స్సంశాంత విగ్రహైః ॥38॥**

మహాసిద్ధులు, శివభక్తిరతులు, సుందరదేహులు, శాంతమూర్తులునైన బ్రహ్మపుత్రులు ఆనందంతో శివుని ఉపాసిస్తున్నారు.

**తథా సఖ్యా కుబేరేణ భర్త్రా గుహ్యకరక్షసామ్ ।**
**సేవ్యమానం విశేషేణ స్వగణైః జ్ఞాతిభి స్సదా ॥39॥**

యక్ష రాక్షస ప్రభువు, మిత్రుడు నగు కుబేరుడు, అతని జ్ఞాతులు, శివగణాలు పరమశివుని సర్వదా విశేషంగా సేవిస్తున్నారు.

**తాపసాభీష్ట సద్రూపం బిభ్రతం పరమేశ్వరమ్ ।**
**వాత్సల్యాద్విశ్వ సుహృదం భస్మాదిసువిరాజితమ్ ॥40॥**

సర్వ ప్రాణులందు వాత్సల్యాన్నిచూపే మిత్రుడైన పరమేశ్వరుడు భస్మాదులతో చక్కగా విరాజమానుడై, తపశ్శాలురకు అభీష్టమైన దివ్యరూపాన్ని ధరించి యున్నాడు.

**మునే తుభ్యం ప్రవోచం తం పృచ్ఛతే జ్ఞానముత్తమమ్ ।**
**కుశాసనే సూపవిష్టం సర్వేషాం శృణ్వతాం సతామ్ ॥41॥**

ఓ నారదమునీ! ఆయన ధర్భాసనమందు కూర్చొని, మహర్షులందరు వినుచుండగా నీవడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఉత్తమ జ్ఞానాన్ని బోధిస్తున్నాడు.

**కృత్వోరౌ దక్షిణే సవ్యం చరణం చైవ జానుని ।**
**బాహు ప్రకోష్ఠాక్షమాలం స్థితం సత్తర్కముద్రయా ॥42॥**

ఆయన కుడితొడపై ఎడమకాలిని, జానువును ఉంచి, బాహువులనుండి, ముంజేతులనుండి వ్రేలాడుతున్న రుద్రాక్షమాలతో జ్ఞానముద్రతో కూర్చున్నాడు.

**ఏవంవిధం శివం దృష్ట్వా తదా విష్ణ్వాదయస్సురాః ।**
**ప్రణేముస్త్వరితం సర్వే కరౌ బద్ధ్వా వినమ్రకాః ॥43॥**

ఇట్టి శివునిజూచి విష్ణువు మున్నగు దేవతలందరు వినయంతో చేతులు కట్టుకుని, శీఘ్రంగా నమస్కరించారు.

**ఉపలభ్యాగతం రుద్రో మయా విష్ణుం సతాం గతిః ।**
**ఉత్థాయ చక్రే శిరసాభివందనమపి ప్రభుః ॥44॥**

సత్పురుషులకు గతియగు రుద్రుడు అచ్చటకు వచ్చిన నన్ను, విష్ణువును చూచి, లేచి, శిరస్సుతో అభివందనాలు కూడ చేశాడు.

**వందితాంఘ్రి స్తదా సర్వైర్దివ్యై ర్విష్ణ్వాదిభి శ్శివః ।**
**ననామాథ యథా విష్ణుం కశ్యపం లోకసద్గతిః ॥45॥**

జనులకు ఉత్తమగతియు, విష్ణ్వాది దేవతలందరిచే నమస్కరింపబడిన పాదాలుగల శివుడు, విష్ణువు, ప్రజాపతికి నమస్కరించిన తీరులోనే మాకును నమస్కరించాడు.

**సుర సిద్ధ గణాధీశ మహర్షి సునమస్కృతమ్ ।**
**సమువాచ సురైర్విష్ణుం కృతసన్నతి మాదరాత్ ॥46॥**

దేవతలు, సిద్ధులు, గణాధీశులు, మహర్షులచే సాదరంగా నమస్కరింపబడిన శివుని ఉద్దేశించి దేవతలతో కూడిన విష్ణువు ఇట్లు పలికాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే శివదర్శనవర్ణనం నామ చత్వారింశోఽధ్యాయః ॥40॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో శివసందర్శనం అనే నలబైయవ అధ్యాయం సమాప్తం.

## ఏక చత్వారింశోఽధ్యాయః - నలభై ఒకటవ అధ్యాయం
## దేవకృతశంకరస్తుతి - దేవతలు శంకరునిస్తుతించుట

**విష్ణ్వాదయ ఊచుః** - విష్ణ్వాది దేవతలు పలికారు.

**దేవదేవ మహాదేవ లౌకికాచార కృత్ప్రభో ।**
**బ్రహ్మ త్వామీశ్వరం శంభుం జానీమః కృపయా తవ ॥1॥**

దేవదేవా! మహాదేవా! ఓ ప్రభూ! శంభుడవైన నిన్ను బ్రహ్మమని నీకృపచే మేమెరుంగుదుము.

**కిం మోహయసి నస్తాత మాయయా పరమా తవ ।**
**దుర్జ్ఞేయయా సదా పుంసాం మోహిన్యా పరమేశ్వర ॥2॥**

తండ్రీ! పరమేశ్వరా! మానవులను మోహింపజేయునదీ, దుర్జ్ఞేయమైనదీ అయిన నీ పరమ మాయచే మమ్ములను ఎందుకు మోహింపజేస్తున్నావు?

**ప్రకృతేః పురుషస్యాపి జగతో యోనిబీజయోః ।**
**పరబ్రహ్మ పరస్త్వం చ మనోవాచామగోచరః ॥3॥**

జగత్తునకు యోనియైన ప్రకృతికంటెను, బీజమగు పురుషుని కంటెను, పరమైన పరబ్రహ్మము నీవు. నువ్వు మనస్సునకు, వాక్కునకు అందనివాడవు.

**త్వమేవ విశ్వం సృజసి పాస్యత్సి నిజతంత్రతః ।**
**స్వరూపాం శివశక్తిం హి క్రీడన్నూర్ణపటో యథా ॥4॥**

సాలెపురుగు గూటినివలె నీవు స్వేచ్ఛచే నీ స్వరూపమైన శివశక్తిని వశం చేసుకొని ఈ జగత్తును సృష్టించి, పాలించి, లయమును చేస్తున్నావు. ఇది నీ లీల.

**త్వమేవ క్రతుమీశాన ససర్జిథ దయాపరః ।**
**దక్షిణా సూత్రేణ విభో సదా త్రయ్యభిపత్తయే ॥5॥**

ఓ ఈశ్వరా! దయానిధివైన నీవే యజ్ఞాన్ని సృష్టించావు. ఋగ్యజుస్సామ రూపమైన వేదాలను లోకంలో ప్రవర్తింప జేయడానికై సృష్టింపబడిన ఆ యజ్ఞాన్ని 'దక్షిణ' అనే సూత్రంతో దృఢం చేశావు.

**త్వయైవ లోకేఽవసితాస్సేతవో యాన్ ధ్రుతవ్రతాః**
**శుద్ధాన్ శ్రద్దధతే విప్రా వేదమార్గవిచక్షణాః ॥6॥**

లోకంలో నీచే నిర్మింపడిన శుద్ధ ధార్మిక నియమాలను ధృతవ్రతులు, వేదమార్గవిచక్షణులు అయిన వేదవేత్తలు శ్రద్ధతో ఆచరిస్తున్నారు.

**కర్తుస్త్వం మంగళానాం హి స్వపరం తు సుఖే విభో ।**
**అమంగళానాం చ హితం మిశ్రం వాథ విపర్యయమ్ ॥7॥**

శుభాశుభ కర్మలనాచరించువారికి స్వపర భేదం లేకుండగా హితకరాలైన ఫలాలను, అహితాలైన ఫలాలను, మిశ్రమఫలాలను కర్మానురూపంగా ఇచ్చెడివాడవు నీవే.

**సర్వ కర్మ ఫలానాం హి సదా దాతా త్వమేవ హి ।**
**సర్వే హి ప్రోక్తా హి యశస్తత్పతిస్త్వం శ్రుతిశ్రుతః ॥8॥**

ప్రాణులందరికిని తమ సమస్త కర్మఫలాను ఇచ్చే దాతవు నీవే. సమస్త మానవులు చేయు కీర్తిగానాలన్నీ ఆయా వ్యక్తులకుగాక నీకుమాత్రమే చెందునని వేదాలు ఉద్ఘాటిస్తున్నాయి.

**పృథగ్ధియః కర్మదృశోఽరుంతుదాశ్చ దురాశయాః ।**
**వితుదంతి పరాన్ మూఢా దురుక్తై ర్మత్సరాన్వితాః ॥9॥**

వేర్పాటు బుద్ధి కలవారు, దుర్బుద్ధి కలవారు, అసూయతో నిండినవారు, ఇతరుల మనస్సును గాయపరచువారు, కేవల కర్మరులైన మూర్ఖులు, పరుషవచనాలతో ఇతరులను బాధిస్తారు.

**తేషాం దైవవధానాం భో భూయాత్త్వచ్చ వధో విభో ।**
**భగవన్పరమేశాన కృపాం కురు పరప్రభో ॥10॥**

ఓ విభూ! అట్టి దైవద్రోహుల ఆగడాలు మితీమీరినప్పుడు నీవు వారిని సంహరింపవలసినదే. కాని స్వామీ! పరమేశానా! పరమాత్మా! దయను చూపండి.

**నమో రుద్రాయ శాంతాయ బ్రహ్మణే పరమాత్మనే ।**
**కపర్దినే మహేశాయ జ్యోత్స్నాయ మహతే నమః ॥11॥**

శాంతుడు, పరబ్రహ్మ, పరమాత్మ, జటాజూటధారి, మహేశుడు, మహాజ్యోతిస్స్వరూపుడునగు రుద్రునకు నమస్కారం.

**త్వం హి విశ్వసృజాం స్రష్టా ధాతా త్వం ప్రపితామహః ।**
**త్రిగుణాత్మా నిర్గుణశ్చ ప్రకృతేః పురుషాత్పరః ॥12॥**

జగత్తును సృష్టించు ప్రజాపతులను సృష్టించినది నీవే. సృష్టి కర్తవు నీవే. సృష్టికర్తకు తండ్రివి నీవే. త్రిగుణాత్మకుడవు నీవే. నిర్గుణుడవు నీవే. ప్రకృతికంటె పురుషునికంటె ఉత్కృష్టమైనవాడవు నీవే.

**నమస్తే నీలకంఠాయ వేధసే పరమాత్మనే ।**
**విశ్వాయ విశ్వబీజాయ జగదానంద హేతవే ॥13॥**

నీలకంఠం కలవాడవూ, జగత్సృష్టికర్తవూ, పరమాత్మవూ, విశ్వస్వరూపుడవూ, విశ్వమునకు మూలకారణమైన వాడవూ, జగదానంద హేతువునైన నీకు నమస్కారం.

**ఓంకారస్త్వం వషట్కార స్సర్వారంభ ప్రవర్తకః ।**
**హంతకార స్స్వధాకారో హవ్యకవ్యాన్నభుక్ సదా ॥14॥**

'ఓం' కారం, 'వషట్' కారం, 'హంత' కారం, 'స్వధా' కారము అను యజ్ఞోపయోగ వేద శబ్దాలు నీస్వరూపమే. సర్వక్రతువులను ప్రవర్తింపజేయువాడవు నీవే. హవ్యము (దేవతలకు అర్పింపబడు అన్నము), కవ్యం (పితరులకు అర్పింపబడు అన్నము) భుజించువాడవు నీవే.

**కృతః కథం యజ్ఞభంగస్త్వయా ధర్మపరాయణ ।**
**బ్రహ్మణస్త్వం మహాదేవ కథం యజ్ఞహనో విభో ॥15॥**

ధర్మ పరాయణుడవైన నీవు యజ్ఞాన్ని ఎలా భంగపరిచావుర్షు యజ్ఞనాశకుడు వెలా అయ్యావు?

**బ్రాహ్మణానాం గవాంచైవ ధర్మస్య ప్రతిపాలకః ।**
**శరణ్యోసి సదానంత్యః సర్వేషాం ప్రాణినాం ప్రభో ॥16॥**

ఓ విభూ! బ్రాహ్మణులను, గోవులను మరియు ధర్మాన్ని రక్షించునది నీవే. సత్స్వరూపుడవు, అనంతుడవు నగు నీవు సర్వప్రాణులకు శరణు పొందదగినవాడవు.

**నమస్తే భగవన్ రుద్ర భాస్కరామితతేజసే ।**
**నమో భవాయ దేవాయ రసాయాంబుమయాయ తే ॥17॥**

ఓ స్వామీ! రుద్రా! భాస్కరునికంటె అధికమైన, అమితమైన తేజస్సు కలవాడవు, జగద్రూపుడవు, ప్రకాశ స్వరూపుడవు, జలములలోని రసతన్మాత్ర స్వరూపుడవు అగు నీకు నమస్కారం.

**శర్వాయ క్షితిరూపాయ సదా సురభిణే నమః ।**
**రుద్రాయాగ్ని స్వరూపాయ మహాతేజస్వినే నమః ॥18॥**

గంధము నిత్యగుణంగాగల పృథివీ స్వరూపమైన శర్వునకు నమస్కారం. మహా తేజస్వి, అగ్ని స్వరూపుడునైన రుద్రునకు నమస్కారం.

**ఈశాయ వాయవే తుభ్యం సంస్పర్శాయ నమో నమః ।**
**పశూనాం పతయే తుభ్యం యజమానాయ వేధసే ॥19॥**

ఓ ఈశా! స్పర్శగుణంగల వాయువు నీస్వరూపమే. నీకు అనేక నమస్కారాలు. సర్వప్రాణులకు ప్రభువువు యజమాన స్వరూపుడవు, సృష్టికర్తవు అగు నీకు నమస్కారం.

**భీమాయ వ్యోమరూపాయ శబ్దమాత్రాయ తే నమః ।**
**మహాదేవాయ సోమాయ ప్రవృత్తాయ నమోఽస్తు తే ॥20॥**

శబ్దగుణకమగు ఆకాశము స్వరూపముగాగల భీమునకు నమస్కారము. ఉమాదేవితోగూడి, జగత్తును రక్షించే మహాదేవుడవగు నీకు నమస్కారము.

**ఉగ్రాయ సూర్యరూపాయ నమస్తే కర్మయోగినే ।**
**నమస్తే కాలకాలాయ నమస్తే రుద్రమన్యవే ॥21॥**

ఉగ్రమైనవాడవు, సూర్యరూపుడవు, కర్మయోగివి అయిన నీకు నమస్కారం. మృత్యువునకు మృత్యువైన నీకు నమస్కారం. హేరుద్రా! నీ కోపానికి నమస్కారం.

**నమశ్శివాయ భీమాయ శంకరాయ శివాయ తే ।**
**ఉగ్రోసి సర్వభూతానాం నియంతా యచ్ఛివోఽసి నః ॥22॥**

మంగళ స్వరూపుడవు, భయంకరాకారుడవు, శుభంకరుడవగు నీకు నమస్కారం. నీవు ఉగ్రుడవు, సర్వప్రాణులకు అధీశ్వరుడవు, మాకు శుభాల నిచ్చేవాడివి నీకు నమస్కారం.

**మయస్కరాయ విశ్వాయ బ్రహ్మణే హ్యార్తినాశినే ।**
**అంబికాపతయే తుభ్యముమాయాః పతయే నమః ॥23॥**

కళ్యాణకరుడవు, సర్వజగద్రూపుడవు, పరబ్రహ్మవు, బాధలను నశింపజేయువాడవు, అంబికాపతివి, ఉమాపతివి అగు నీకు నమస్కారం.

**శర్వాయ సర్వరూపాయ పురుషాయ పరమాత్మనే ।**
**సదసద్వ్యక్తిహీనాయ మహతః కారణాయ తే ॥24॥**

శర్వుడవు, సర్వరూపుడవు, దేహమునందు ఆత్మరూపముగా నుండువాడవు, పరమాత్మవు, కార్యకారణ భావాలకు అతీతుడవు, మహత్తునకు కారణమైనవాడవు, అయిన నీకు నమస్కారం.

**జాతాయ బహుధా లోకే ప్రభూతాయ నమో నమః ।**
**నీలాయ నీలరుద్రాయ కద్రుద్రాయ ప్రచేతసే ॥25॥**

లోకంలో అనేక విధాలుగా జన్మించినవాడవు, నీలుడవు, నీలరుద్రడవు, కద్రుద్రుడవు, ప్రచేతుడవు అయిన నీకు అనేక నమస్కారాలు.

**మీఢుష్టమాయ దేవాయ శిపివిష్టాయ తే నమః ।**
**మహీయసే నమస్తుభ్యం హన్త్రే దేవారిణాం సదా ॥26॥**

భక్తులకు కోర్కెలను వర్షించువాడవు, ప్రకాశ స్వరూపుడు జ్ఞానఘనుడవు, పరబ్రహ్మ, దేవతా విరోధులను సదా సంహరించువాడవగు నీకు నమస్కారం.

**తారాయ చ సుతారాయ తరుణాయ సుతేజసే ।**
**హరికేశాయ దేవాయ మహేశాయ నమో నమః ॥27॥**

ప్రణవ ప్రతిపాద్యుడు, ప్రాణులను చక్కగా తరింపజేయువాడు, నిత్య యువకుడు, గొప్ప తేజశ్శాలి, నల్లని వెంట్రుకలు కలవాడు, ప్రకాశ స్వరూపుడు అగు మహేశ్వరునకు అనేక నమస్కారాలు.

**దేవానాం శంభవే తుభ్యం విభవే పరమాత్మనే ।**
**పరమాయ నమస్తుభ్యం కాలకంఠాయ తే నమః ॥28॥**

దేవతలకు మంగళములనిచ్చువాడవు, సర్వవ్యాపివి, పరమాత్మ, సర్వోత్కృష్టుడవు, నీలకంఠుడవగు నీకు పునఃపునః నమస్కారం.

**హిరణ్యాయ పరేశాయ హిరణ్యవపుషే నమః ।**
**భీమాయ భీమరూపాయ భీమకర్మరతాయ చ ॥29॥**

తేజోమయుడు, తేజోమయమగు దేహము గలవాడు, భయంకరుడు, భయంకరాకారుడు, భయంకర కర్మలయందు అభిరుచి కలవాడునగు పరమేశ్వరునకు నమస్కారం.

**భస్మదిగ్ధ శరీరాయ రుద్రాక్షాభరణాయ చ ।**
**నమో హ్రస్వాయ దీర్ఘాయ వామనాయ నమోఽస్తు తే ॥30॥**

భస్మం పూయబడిన శరీరం కలవాడవు, రుద్రాక్షలను ఆభరణాలుగా ధరించినవాడవు, పొట్టివాడవు, పొడుగువాడవు, వామనావతారుడవగు నీకు నమస్కారం.

**దూరేవధాయ తే దేవాగ్రేవధాయ నమో నమః ।**
**ధన్వినే శూలినే తుభ్యం గదినే హలినే నమః ॥31॥**

ఓదేవా! దూరంగా ఉన్న శత్రువులను, ఎదుటనున్న శత్రువులను సంహరించువాడవు, ధనుస్సును, శూలాన్నీ, గదను, నాగలిని ధరించినవాడవగు నీకు అనేక నమస్కారాలు.

**నానాయుధ ధరాయైవ దైత్యదానవనాశినే ।**
**సద్యాయ సద్యరూపాయ సద్యోజాతాయ వై నమః ॥32॥**

అనేక ఆయుధాలను ధరించి, దైత్యులను, దానవులను నాశనమొనర్చువాడవూ, సత్పురుషులకు ఆశ్రయణీయుడవూ, సత్పురుషులచే ధ్యానింపబడువాడవూ, స్వయంగా అవ్యక్త స్థితినుండి వ్యక్త జగత్తుగా ప్రకటమగువాడవగు నీకు నమస్కారం.

**వామాయ వామరూపాయ వామనేత్రాయ తే నమః ।**
**అఘోరాయ పరేశాయ వికటాయ నమో నమః ॥33॥**

సుందరుడవు, సుందరాకారుడవు, సుందరమగు నేత్రాలు కలవాడవు, అఘోరుడవు మరియు ఘోరుడవు, పరమేశ్వరుడవు నగు నీకు అనేక నమస్కారాలు.

**తత్పురుషాయ నాథాయ పురాణ పురుషాయ చ ।**
**పురుషార్థ ప్రదానాయ వ్రతినే పరమేష్ఠినే ॥34॥**

తత్త్వమసీత్యాది మహావాక్యాలచే ప్రతిపాదింపబడు ఔపనిషద పురుషుడవు, జగన్నాథుడవు, పురాణ పురుషుడువుపురుషార్థ ప్రదాతవు, వ్రతనిష్ఠుడవు, పరమేష్ఠి స్వరూపుడవగు నీకు నమస్కారం.

**ఈశానాయ నమస్తుభ్య మీశ్వరాయ నమో నమః ।**
**బ్రహ్మణే బ్రహ్మరూపాయ నమస్సాక్షాత్పరాత్మనే ॥35॥**

సర్వజగన్నియంతవు, చతుర్ముఖ బ్రహ్మస్వరూపుడవు, పరబ్రహ్మము, సాక్షాత్పరమాత్మవు, ఈశానుడవగు నీకు నమస్కారము.

**ఉగ్రోఽసి సర్వదుష్టానాం నియంతాసి శివోఽసి నః ।**
**కాలకూటాశినే తుభ్యం దేవాద్యవనకారిణే ॥36॥**

నీవు ఉగ్రుడవై, దుష్టులనందరిని దండించెదవు. మాకు మంగళముల నిచ్చేవాడవు. కాలకూట విషాన్ని భక్షించి, దేవతలు మున్నగువారిని రక్షించినవాడవునైన నీకు నమస్కారం.

**వీరాయ వీరభద్రాయ రక్షద్వీరాయ శూలినే ।**
**మహాదేవాయ మహతే పశూనాం పతయే నమః ॥37॥**

వీరుడు, వీరభద్ర స్వరూపుడు, వీరులను రక్షించువాడు, శూలధారి, మహాదేవుడు, జీవపతియు, మహాత్ముడవగు నీకు నమస్కారం.

**వీరాత్మనే సువిద్యాయ శ్రీకంఠాయ పినాకినే ।**
**నమోఽనంతాయ సూక్ష్మాయ నమస్తే మృత్యుమన్యవే ॥38॥**

వీర స్వరూపుడవు, గొప్పజ్ఞానము కలవాడవు, విషకంఠుడవు, పినాకమను ధనుస్సును ధరించువాడవు, అనంతుడవు, సూక్ష్మ స్వరూపుడవు, మృత్యురూపమగు క్రోధము కలవాడవునగు నీకు నమస్కారము.

**పరాయ పరమేశాయ పరాత్పరతరాయ తే ।**
**పరాత్పరాయ విభవే నమస్తే విశ్వమూర్తయే ॥39॥**

శ్రేష్ఠమైన వాటన్నిటికంటే శ్రేష్ఠుడవు, తనకంటే పరం లేనివాడవు, సర్వవ్యాపివి, విశ్వమూర్తివి, పరమేశ్వరుడవగు నీకు నమస్కారం.

**నమో విష్ణుకళత్రాయ విష్ణుక్షేత్రాయ భానవే ।**
**భైరవాయ శరణ్యాయ త్ర్యంబకాయ విహారిణే ॥40॥**

విష్ణువుయొక్క అంశ పత్నిగా కలవాడును, విష్ణువు క్షేత్రంగాగల క్షేత్రజ్ఞుడును, సూర్యరూపుడు, భైరవుడు, శరణ్యుడు, లీలావిహారియు ముక్కంటి యునగునీకు నమస్కారం.

**మృత్యుంజయాయ శోకాయ త్రిగుణాయ గుణాత్మనే ।**
**చంద్రసూర్యాగ్ని నేత్రాయ సర్వకారణ సేతవే ॥41॥**

శోక స్వరూపుడు, సత్త్వ రజస్తమోగుణ స్వరూపుడు, చంద్రసూర్యాగ్నులు నేత్రాలుగా కలవాడు, సర్వానికి కారణమగు ధర్మమే తనరూపంగా కలవాడు మృత్యుంజయుడవగు నీకు నమస్కారం.

**భవతా హి జగత్సర్వం వ్యాప్తం స్వేనైవ తేజసా ।**
**పరబ్రహ్మ నిర్వికారీ చిదానందః ప్రకాశవాన్ ॥42॥**

నీవు నీ తేజస్సుచే జగత్తునందంతటను వ్యాపించి ఉన్నవాడవు. నీవు వికారాలులేని చిదానంద స్వరూపమూ, ప్రకాశ స్వరూపమూ అగు పరబ్రహ్మము.

**బ్రహ్మవిష్ణ్వింద్ర చంద్రాది ప్రముఖాస్సకలా స్సురాః ।**
**మునయశ్చాపరే త్వత్తస్సంప్రసూతా మహేశ్వర ॥43॥**

ఓమహేశ్వరా! బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, చంద్రుడు మొదలుగాగల దేవతలు, మునులు, ఇతరులు నీనుండి పుట్టినవారే.

**యతో బిభర్షి సకలం విభజ్య తనుమష్టధా ।**
**అష్టమూర్తి రితీశశ్చ త్వమాద్యః కరుణామయః ॥44॥**

**త్వద్భయాద్వాతి వాతో యం దహత్యగ్నిర్భయాత్తవ ।**
**సూర్య స్తపతి తే భీత్యా మృత్యుర్ధావతి సర్వతః ॥45॥**

నీవు నీ శరీరాన్ని ఎనిమిది భాగాలుగా విభజించి సర్వజగత్తును ధరించియున్న అష్టమూర్తివి, ఈశ్వరుడవు. నీవు ఆద్యుడవు, కరుణామయుడవు అయిఉన్నావో అట్టి నీభయంచే గాలి వీస్తున్నది. అగ్ని దహిస్తున్నది. సూర్యుడు తపింపజేస్తున్నాడు. మృత్యువు అంతటా పరుగులెత్తుచున్నది.

**దయాసింధో మహేశాన ప్రసీద పరమేశ్వర ।**
**రక్షరక్ష సదైవాస్మాన్ యస్మాన్నష్టాన్ విచేతసః ॥46॥**

ఓ దయాసముద్రా! మహేశానా! పరమేశ్వరా! ప్రసన్నుడవు కమ్ము, మూర్ఖులై భ్రష్టులైన మమ్ములను సర్వదా రక్షించు.

**రక్షితాః సతతం నాథ త్వయైవ కరుణానిధే ।**
**నానాపద్భ్యో వయం శంభో తథైవాద్య ప్రపాహి నః ॥47॥**

ఓ నాథా! కరుణానిధీ! నీవు ఎల్లప్పుడు మమ్ములను ఆపదలనుండి రక్షిస్తున్నావు. ఓ శంభూ! అదే తీరున నేడుకూడా మమ్ములను సంపూర్తిగా రక్షించు.

**యజ్ఞస్యోద్ధరణం నాథ కురు శీఘ్రం ప్రసాదకృత్ ।**
**అసమాప్తస్య దుర్గేశ దక్షస్య చ ప్రజాపతేః ॥48॥**

అనుగ్రహశీలుడవైన ఓదుర్గేశా! సమాప్తం కాని ప్రజాపతియైన దక్షుని యజ్ఞాన్ని ఉద్ధరించు.

**భగోఽక్షిణీ ప్రపద్యేత యజమానశ్చ జీవతు ।**
**పూష్ణో దంతాశ్చ రోహంతు భృగోః శ్మశ్రూణి పూర్వవత్ ॥49॥**

భగునకు నేత్రాలు లభించుగాక! యజమానుడగు దక్షుడు జీవించుగాక! పూషకు దంతాలు మొలకెత్తుగాక! భృగువునకు పూర్వంవలె గడ్డం, మీసాలు వచ్చుగాక!

**భవతాఽనుగ్రహీతానాం దేవాదీనాం చ సర్వశః ।**
**ఆరోగ్యం భగ్నగాత్రాణాం శంకర త్వాయుధాశ్మభిః ॥50॥**

ఓ శంకరా! నీ ఆయుధాలచే, రాళ్లచే విరుగగొట్టబడిన అవయవాలుగల దేవతలు మున్నగువారికందరికి నీ అనుగ్రహంచే అన్నివిధాలుగా ఆరోగ్యం సమకూరుగాక!

**పూర్ణభాగోఽస్తు తే నాథావశిష్టేఽధ్వర కర్మణి ।**
**రుద్రభాగేన యజ్ఞస్తే కల్పితో నాన్యథా క్వచిత్ ॥51॥**

హేనాథా! మిగిలిన యజ్ఞకర్మలో నీకు పూర్ణభాగం లభించుగాక! రుద్రునకు భాగముగల యజ్ఞమే పరిపూర్ణమగును. అట్లుకాని యజ్ఞమెన్నటికి పరిపూర్ణముకాదు.

**ఇత్యుక్త్వా సప్రజేశశ్చ రమేశశ్చ కృతాంజలిః ।**
**దండవత్ప్రతితో భూమౌ క్షమాపయితు ముద్యతః ॥52॥**

ఈ విధంగా పలికిన బ్రహ్మవిష్ణువులు చేతులొగ్గి భూమిపై దండంవలె పడి, నమస్కరించి, క్షమాపణలను చెప్పుకొనిరి.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే దేవకృతశంకరస్తుతి నామైక చత్వారింశోఽధ్యాయః ॥41॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో దేవతలు శంకరుని స్తుతించుట అనే నలబైఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్విచత్వారింశోऽధ్యాయః - నలబై రెండవ అధ్యాయం
## దక్షదుఃఖనిరాకరణవర్ణనమ్ - దక్షుని దుఃఖమును నివారించుట

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**శ్రీ బ్రహ్మేశప్రజేశేన సదైవ మునినా చ వై ।**
**అనునీతశ్శంభురాసీత్ప్రసన్నః పరమేశ్వరః ॥1॥**

బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, దేవతలు, మునులు కలిసి అనునయింపగా పరమేశ్వరుడగు శంభుడు ప్రసన్నుడయ్యాడు.

**ఆశ్వాస్య దేవాన్ విష్ణ్వాదీన్ విహస్య కరుణానిధిః ।**
**ఉవాచ పరమేశానః కుర్వన్ పరమనుగ్రహమ్ ॥2॥**

కరుణాసముద్రుడగు పరమేశ్వరుడు విష్ణువు మున్నగు దేవతలనోదార్చి, చిరునవ్వు నవ్వి, పరమానుగ్రహంతో ఇలా పలికాడు.

**శ్రీ మహాదేవ ఉవాచ -** శ్రీ మహాదేవుడు పలికాడు.

**శృణుతం సావధానేన మమ వాక్యం సురోత్తమౌ ।**
**యథార్థం వచ్మి వాం తాత వాం క్రోధం సర్వదా సహమ్ ॥3॥**

దేవ శ్రేష్ఠులారా! మీరిరువురు నా మాటను సావధానంగా వినండి. మీకు నేను యథార్థమును చెప్పుచున్నాను. మీరు చూపిన క్రోధాన్ని నేను సర్వదా సహించాను.

**నాఘం తనౌ తు బాలానాం వర్ణమేవానుచింతయే ।**
**మమ మాయాభిభూతానాం దండస్తత్ర ధృతో మయా ॥4॥**

బాలురు చేయు పాపములను నేను పరిగణనలోనికి గ్రహించను. వారి బాల్యమును మాత్రమే పరిగణించెదను. నా మాయచేత కొట్టబడిన వారిని అనగా నా మాయయందు తగుల్కొన్నవారిని నిశ్చయముగా నేను దండించెదను.

**దక్షస్య యజ్ఞభంగోऽయం న కృతశ్చ మయా క్వచిత్ ।**
**పరం ద్వేష్టి పరేషాం యదాత్మనస్తద్భవిష్యతి ॥5॥**

దక్షుని యజ్ఞమును ధ్వంసము చేసినవాడను నేను కాను. ఇతరుల అభివృద్ధిని ద్వేషించే వ్యక్తి తాను స్వయముగా భ్రష్టుడౌతాడు.

**పరేషాం క్లేదనం కర్మ న కార్యం తత్కదాచన ।**
**పరం ద్వేష్టి పరేషాం యదాత్మనస్తద్భవిష్యతి ॥6॥**

కావున ఎప్పుడైనను ఇతరులను నొప్పించే పనిని చేయరాదు. ఇతరులను ద్వేషించేవాడు తానే ఇతరులచే ద్వేషింపబడతాడు.

**దక్షస్య భగ్నశీర్ణోహి భవత్వజ ముఖం శిరః ।**
**మిత్ర నేత్రేణ సంపశ్యేద్యజ్ఞభాగం భగస్సురః ॥7॥**

శిరస్సును కోల్పోయిన దక్షుడు మేకతలను పొందునుగాక! భగదేవత మిత్రుని నేత్రంతో యజ్ఞభాగాన్ని దర్శించగలడు.

**పూషాభిధ స్సురస్తాత దద్భిర్జక్షతు పిష్టభుక్ ।**
**యాజమానో భగ్నదంతః సత్యమేతన్మయోదితమ్ ॥8॥**

పూష అను దేవతకు దంతములు పోయినవిగదా! ఆయన యజమానుని దంతములతో మెత్తని పిండిరూపములోనున్న యజ్ఞభాగాన్ని భక్షించగలడు. నేను సత్యమునే చెప్పుచున్నాను.

**బస్తశ్మశ్రుర్భవేదేవ భృగుర్మమ విరోధకృత్ ।**
**దేవాః ప్రకృతిసర్వాంగా యే మ ఉచ్ఛేదనం దదుః ॥9॥**

నాపై విరోధమును పూనిన భృగువు మేకయొక్క గడ్డమును పొందగలడు. నాయందు విరోధమును ప్రదర్శించిన దేవతలందరు తమ అవయవాలను యథాపూర్వంగా పొందగలరు.

**బాహుభ్యా మశ్వినౌ పూష్ణో హస్తాభ్యాం కృతవాహకః ।**
**భవంత్వధ్వర్యవశ్చాన్యే భవత్ప్రీత్యా మయోదితమ్ ॥10॥**

అశ్వినీదేవతలు బాహువులతో, పూష హస్తములతో ఇతరులైన ఋత్విజులు తమ అవయవాలతో యజ్ఞకార్యములను చక్కబెట్టగలరు. ఈ వ్యవస్థను మీయందలి ప్రీతిచే నేను ప్రకటించాను.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా పరమేశానో విరరామ దయాన్వితః ।**
**చరాచరపతిర్దేవః సమ్రాట్ వేదానుసారకృత్ ॥11॥**

దయానిధి, చరాచర జగత్ప్రభువు, ప్రకాశ స్వరూపుడు, సమ్రాట్టు, వేదమార్గానుయాయియు నైన పరమేశ్వరుడిట్లు పలికి, మిన్నకుండెను.

**తదా సర్వే సురాద్యాస్తే శ్రుత్వా శంకరభాషితమ్ ।**
**సాధు సాధ్వితి సంప్రోచుః పరితుష్టాస్సవిష్ణుజాః ॥12॥**

అంతట విష్ణువు, బ్రహ్మ, దేవతలు, తదితరులందరు శంకరుని మాటలను విని, సంతోషించినవారై 'సాధుసాధు' అని పలికారు.

**తతశ్శంభుం సమామంత్ర్య మయా విష్ణుస్సురర్షిభిః ।**
**భూయస్తద్దేవయజనం యయౌ చ పరయా ముదా ॥13॥**

అప్పుడు నేను, విష్ణువు, దేవతలు, ఋషులు కూడి శంభుని వెంటనిడుకొని మిక్కిలి ఆనందముతో మరల దక్షుని యజ్ఞవాటికకు వెళ్ళియుంటిమి.

**ఏవం తేషాం ప్రార్థనయా విష్ణుప్రభృతిభిస్సురైః ।**
**యయౌ కనఖలం శంభుర్యజ్ఞవాటం ప్రజాపతేః ॥14॥**

ఈ తీరుగా విష్ణువు మున్నగువారు ప్రార్థించగా వారితో కలసి శంభుడు దక్షప్రజాపతియొక్క కనఖలమునందలి యజ్ఞవాటిక వద్దకు వెళ్ళియున్నాడు.

**రుద్రస్తథా దదర్శాథ వీరభద్రేణ యత్కృతమ్ ।**
**ప్రధ్వంసం తం క్రతోస్తత్ర దేవర్షీణాం విశేషతః ॥15॥**

వీరభద్రుడు యజ్ఞమును ధ్వంసముచేసి, దేవతలను, ఋషులను పరాజితులను గావించిన తీరును రుద్రుడు దర్శించాడు.

**స్వాహా స్వధా తథా పూషా తుష్టిర్ధృతిః సరస్వతీ ।**
**తథాన్యే ఋషయస్సర్వే పితరశ్చాగ్నయస్తథా ॥16॥**

స్వాహా, స్వధా, పూష, తుష్టి, ధృతి, సరస్వతి, ఇతర ఋషులు, పితృదేవతలు, అగ్నులను, రుద్రుడు చూచాడు.

**యేఽన్యే చ బహవస్తత్ర యక్షగంధర్వరాక్షసాః ।**
**త్రోటితా లుంచితాశ్చైవ మృతాః కేచిద్రణాజిరే ॥17॥**

యక్ష గంధర్వ రాక్షసాదులను ఇతరులనేకులు అవయవములు కోల్పోయినవారిని కేశములూడ బెరుకబడిన వారిని, మరణించినవారిని రుద్రుడు చూచాడు.

**యజ్ఞం తథావిధం దృష్ట్వా సమాహూయ గణాధిపమ్ ।**
**వీరభద్రం మహావీరమువాచ ప్రహసన్ ప్రభుః ॥18॥**

ఆవిధంగానున్న యజ్ఞశాలను చూచి శంభుడు మహావీరుడు, గణాధ్యక్షుడునైన వీరభద్రుని పిలిపించి, రుద్రుడు నవ్వుతూ ఇలాపలికాడు.

**వీరభద్ర మహాబాహో కిం కృతం కర్మ తే త్విదమ్ ।**
**మహాన్ దండో ధృతస్తాత దేవర్ష్యాదిషు సత్వరమ్ ॥19॥**

ఓ వీరభద్రా! మహాబాహూ! వత్సా! నీవెటువంటి పనిని చేసితివో చూడుము. నీవు దేవతలు, ఋషులు మున్నగువారిపై కఠిన దండములనేకము శీఘ్రముగా అమలు చేశావు.

**దక్షమానయ శీఘ్రం త్వం యేనేదం కృతమీదృశమ్ ।**
**యజ్ఞో విలక్షణ స్తాత యస్యేదం ఫలమీదృశమ్ ॥20॥**

వత్సా! ఇట్టి విచిత్రమైన యజ్ఞాన్ని ఆచరించి, ఇట్టి ఫలితాన్ని పొందిన దక్షుని శీఘ్రముగా నీవిక్కడకు తీసుకొని రమ్ము.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏవముక్తశ్శంకరేణ వీరభద్రస్త్వరాన్వితః ।**
**కబంధమానయిత్వాగ్రే తస్య శంభోరథాక్షిపత్ ॥21॥**

ఈవిధంగా శంకరునిచే ఆజ్ఞాపింపబడిన వీరభద్రుడు దక్షుని మొండెమును తెచ్చి, శంభుని ఎదుట పారవేశాడు.

**విశిరస్కం చ తం దృష్ట్వా శంకరో లోకశంకరః ।**
**వీరభద్రమువాచాగ్రే విహసన్ మునిసత్తమ ॥22॥**

నారదమునీ! తలలేని ఆ మొండెమును చూచి లోకశంకరుడైన శంకరుడు నవ్వుచూ వీరభద్రునితో ఇలా పలికాడు.

**శిరః కుత్రేతి తేనోక్తే వీరభద్రోఽ బ్రవీత్ప్రభుః ।**
**మయా శిరో హుతం చాగ్నౌ తదానీమేవ శంకర ॥23॥**

'దక్షుని శిరస్సు ఎక్కడ?' అని రుద్రుడు ప్రశ్నింపగా వీరభద్రుడు 'ఓశంకరా! ఈ శిరస్సును అప్పుడే నేను అగ్నిహోత్రంలో హోమం చేశాను' అని చెప్పాడు.

**ఇతిశ్రుత్వా వచస్తస్య వీరభద్రస్య శంకరః ।**
**దేవాన్ తథాజ్ఞపత్ప్రీత్యా యదుక్తం తత్పురా ప్రభుః ॥24॥**

వీరభద్రుని మాటలను విని శంకరుడు తాను పూర్వంలో చెప్పిన విధంగానే దేవతలను ఆజ్ఞాపించాడు.

**విధాయ కార్త్స్న్యేన చ తద్యదాహ భగవాన్ భవః ।**
**మయా విష్ణ్వాదయః సర్వే భృగ్వాదీనథ సత్వరమ్ ॥25॥**

శివభగవానుడు చెప్పిన తీరుగానే మేము విష్ణ్వాదులందరితోగూడి భృగ్వాదులను శీఘ్రముగా స్వస్థులను చేశాము.

**అథ ప్రజాపతేస్తస్య సవనీయపశోశ్శిరః ।**
**బస్తస్య సందధుః శంభోః కాయేనారం సుశాసనాత్ ॥26॥**

అంతట శంకరుని ఆజ్ఞచే దక్షప్రజాపతి యజ్ఞపశువుయొక్క శిరస్సును వెంటనే సంధానం చేశారు.

**సంధీయమానే శిరసి శంభుసద్దృష్టివీక్షితః ।**
**సద్యస్సుప్త ఇవోత్తస్థౌ లబ్ధప్రాణః ప్రజాపతిః ॥27॥**

శిరస్సు సంధింపబడగా, శంభుని కృపాదృష్టి వానిపై పడింది. వెంటనే ఆ ప్రజాపతి ప్రాణాలను పొంది, నిద్రనుండి లేచినవానివలె లేచి నిలబడ్డాడు.

**ఉత్థితశ్చాగ్రతశ్శంభుం దదర్శ కరుణానిధిమ్ ।**
**దక్షః ప్రీతమతిః ప్రీత్యా సంస్థితః సుప్రసన్నధీః ॥28॥**

దక్షుడు లేవగానే ఎదురుగా కరుణానిధియగు శంభుని చూచి సంప్రీత మనస్కుడై మిక్కిలి ప్రసన్నమైన అంతరంగం కలవాడై, నిలబడ్డాడు.

**పురా హర మహాద్వేషకలిలాత్మాఽభవద్ధి సః ।**
**శివావలోకనాత్సద్యశ్శరచ్చంద్ర ఇవామలః ॥29॥**

పూర్వము దక్షుడు శివునియందలి తీవ్ర ద్వేషముచే మలినీకృతమైన అంతరంగం కలవాడుగా నున్నాడు. శివుని దర్శించిన తత్క్షణంలోనే అతని అంతరంగం శరత్కాలచంద్రునివలె నిర్మలమయ్యింది.

**భవం స్తోతుమనాః సోఽథ నాశక్నోదనురాగతః ।**
**ఉత్కంఠావికలత్వాచ్చ సంపరేతాం సుతాం స్మరన్ ॥30॥**

అంతట దక్షుడు శివుని స్తుతించాలని మనస్సులో తలంచాడు కాని మరణించిన తన కుమార్తెయైన సతీదేవి గుర్తుకు వచ్చుటచే ఆ దుఃఖముతోను, ఆ అనురాగముతోను స్తుతింపలేకపోయాడు.

**అథ దక్షః ప్రసన్నాత్మా శివం లజ్జాసమన్వితః ।**
**తుష్టావ ప్రణతో భూత్వా శంకరం లోకశంకరమ్ ॥31॥**

అంతట దక్షుడు కొంతసేపటికి ప్రసన్నాత్ముడై, సిగ్గుతో కూడినవాడై లోకశంకరుడైన శంకరునకు నమస్కరించి ఇలా స్తుతించాడు.

**దక్ష ఉవాచ** – దక్షుడు పలికాడు.

**నమామి దేవం వరదం వరేణ్యం మహేశ్వరం జ్ఞాననిధిం సనాతనమ్ ।**
**నమామి దేవాధిపతీశ్వరం హరం సదా సుఖాఢ్యం జగదేక బాంధవమ్ ॥32॥**

వరములనిచ్చువాడు, సర్వశ్రేష్ఠుడు, జ్ఞాననిధి, సనాతనుడు, దేవాధిపతి, ఈశ్వరుడు, సదాసుఖస్వరూపుడు, జగదేకబంధువైన మహేశ్వరునకు నమస్కరించుచున్నాను.

**నమామి విశ్వేశ్వర విశ్వరూపం పురాతనం బ్రహ్మనిజాత్మరూపమ్ ।**
**నమామి శర్వం భవభావభావం పరాత్పరం శంకరమానతోఽస్మి ॥33॥**

విశ్వప్రభువు, జగత్స్వరూపుడు, పురాతనుడు, పరబ్రహ్మయొక్క నిజాత్మరూపుడు, ప్రాణులను సంహరించువాడు, జగత్తులోని పదార్థముల ఉనికికి మూలమైనవాడు, పరాత్పరుడునైన శంకరునికి నమస్కరించుచున్నాను.

**దేవదేవ మహాదేవ కృపాం కురు నమో<sup></sup>ఽస్తు తే ।**
**అపరాధం క్షమస్వాద్య మమ శంభో కృపానిధే ॥34॥**

ఓ దేవదేవా! మహాదేవా! నీకు నమస్కారము. ఈనాడు నేను చేసిన అపరాధమును మన్నించుము. నాయందు దయను చూపుము.

**అనుగ్రహః కృతస్తే హి దండవ్యాజేన శంకర ।**
**ఖలోఽహం మూఢధీర్దేవ జ్ఞాతం తత్త్వం మయా న తే ॥35॥**

ఓ శంకరా! నీవు నన్ను దండించు మిషతో నాయందు అనుగ్రహాన్ని చూపించితివి. నేను దుష్టుడను, మూర్ఖుడను, నేను నీ తత్త్వాన్ని ఎరుగకుంటిని.

**అద్య జ్ఞాతం మయా తత్త్వం సర్వోపరి భవాన్మతః ।**
**విష్ణుబ్రహ్మాదిభిస్సేవ్యో వేదవేద్యో మహేశ్వరః ॥36॥**

ఈనాడు నీ తత్త్వము తెలిసినది. నీవు ఇందరికంటె ఉన్నతమైన ప్రభుడవు. విష్ణు బ్రహ్మాదులచేత కూడ నీవు సేవ్యుడవు. వేదవేద్యుడవు. మహేశ్వరుడవు.

**సాధూనాం కల్పవృక్షస్త్వం దుష్టానాం దండధృక్ సదా ।**
**స్వతంత్రః పరమాత్మా హి భక్తాభీష్టవరప్రదః ॥37॥**

నీవు సత్పురుషులకు కల్పవృక్షము వంటివాడవు, దుష్టులకు దండధరుని వంటివాడవు. నీవు స్వతంత్రుడవు. పరమాత్మవు. భక్తాభీష్టవరప్రదుడవు.

**విద్యాతపోవ్రతధరానసృజః ప్రథమం ద్విజాన్ ।**
**ఆత్మతత్త్వం సమావేత్తుం ముఖతః పరమేశ్వరః ॥38॥**

పరమేశ్వరుడవగు నీవు ఆత్మతత్త్వాన్ని లోకంలో ప్రవర్తిల్లజేయడానికి విద్యను, తపస్సును, దీక్షను, కలిగియున్న బ్రాహ్మణులను ముందుగా నీ ముఖమునుండి సృజించావు.

**సర్వాపద్భ్యః పాలయితా గోపతిస్తు పశూనివ ।**
**గృహీతదండో దుష్టాంస్తాన్ మర్యాదాపరిపాలకః ॥39॥**

పశువుల కాపరి గోవులను పాలించు తీరులో భక్తులను సర్వవిధములైన ఆపదలనుండి రక్షించెదవు. అంతేకాక మర్యాదాపరిపాలకుడవైన నీవు దుష్టులపై దండమును ప్రయోగిస్తావు.

**మయా దురుక్తవిశిఖైః ప్రవిద్ధః పరమేశ్వరః ।**
**అమరానతిదీనాశాన్ మదనుగ్రహకారకః ॥40॥**

నేను చెడుమాటలనే బాణాలతో పరమేశ్వరుడవైన నిన్ను వేధించాను. అయినప్పటికి నీవు నన్ను అనుగ్రహించావు. అట్లే మిక్కిలి దీనులైన ఈ దేవతలను కూడా అనుగ్రహింపుము.

**స భవాన్ భగవాన్ శంభో దీనబంధో పరాత్పరః ।**
**స్వకృతేన మహార్వేణ సంతుష్టో భక్తవత్సల ॥41॥**

ఓ దీనబంధూ! పరాత్పరా! శంభూ! భక్తవత్సలా! నీవే భగవంతుడవు. నీవు సృష్టించుకొనిన ఈ మహా బ్రహ్మాండములో నీవు ఆనంద స్వరూపుడవై యున్నావు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి స్తుత్వా మహేశానం శంకరం లోకశంకరమ్ ।**
**ప్రజాపతిర్వినీతాత్మా విరరామ మహాప్రభుమ్ ॥42॥**

లోకశంకరుడు, మహేశానుడు నైన శంకరుని దక్షప్రజాపతి వినీతాత్ముడై ఈవిధంగా స్తుతించి మిన్నకున్నాడు.

**అథ విష్ణుః ప్రసన్నాత్మా తుష్టావ వృషభధ్వజమ్ ।**
**బాష్పగద్గదయా వాణ్యా సుప్రణమ్య కృతాంజలిః ॥43॥**

అంతట విష్ణువు ప్రసన్నాత్ముడై కృతాంజలియై చక్కగా నమస్కరించి, కన్నీటితో బొంగురుపోయిన వాక్కు గలవాడై వృషభధ్వజుని ఇలా స్తుతించాడు.

**విష్ణురువాచ –** విష్ణువు పలికాడు.

**మహాదేవ మహేశాన లోకానుగ్రహకారక ।**
**పరబ్రహ్మ పరమాత్మా త్వం దీనబంధో దయానిధే ॥44॥**

ఓ మహాదేవా! మహేశా! లోకములను అనుగ్రహించువాడా! దీనబంధూ! దయానిధీ! పరమాత్మవు, పరబ్రహ్మవు నీవే.

**సర్వవ్యాపీ స్వైరవర్తీ వేదవేద్యయశాః ప్రభోః ।**
**అనుగ్రహః కృతస్తేన కృతాశ్చాసుకృతా వయమ్ ॥45॥**

ఓ ప్రభూ! సర్వవ్యాపియు, స్వైరవర్తియు, వేదవేద్యమైన యశోవైభవుడవు నీవు అనుగ్రహాన్ని చూపించితివి. మేము చేసిన విధంగానే దక్షుడుకూడా దుష్కృతాలను చేశాడు.

**దక్షోఽయం మమ భక్తస్త్వాం యన్నినింద ఖలః పురా ।**
**తత్ క్షంతవ్యం మహేశాద్య నిర్వికారో యతో భవాన్ ॥46॥**

నా భక్తుడైన దక్షుడు పూర్వంలో నిన్ను నిందించియున్నాడు. అతడు దుష్టుడు. కాని నీవు నిర్వికారుడవు, నీవు అతని దోషాలను మన్నించుము.

**కృతో మయాఽపరాధోఽపి తవ శంకర మూఢతః ।**
**త్వద్గణేన కృతం యుద్ధం వీరభద్రేణ పక్షతః ॥47॥**

మూర్ఖత్వంతో నేను కూడా నీపట్ల అపరాధాన్ని చేశాను. నీపక్షంలోని వీరగణాలతోను, వీరభద్రునితోను యుద్ధం చేశాను.

**త్వం మే స్వామీ పరబ్రహ్మ దాసోऽహం తే సదాశివ ।**
**పోష్యశ్చాపి సదా తే హి సర్వేషాం త్వం పితా యతః ॥48॥**

ఓ సదాశివా! నీవు నాకు ప్రభుడవు. పరబ్రహ్మవు. నీకు నేను దాసుడను. నీవు అందరికి తండ్రివి. పోషకుడవు. కావున నన్ను కూడ సర్వదా రక్షించుము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**దేవదేవ మహాదేవ కరుణాసాగర ప్రభో ।**
**స్వతంత్రః పరమాత్మా త్వం పరమేశోऽద్వయోऽవ్యయః ॥49॥**

ఓ దేవదేవా! మహాదేవా! కరుణాసాగరా! ప్రభో! స్వతంత్రుడవగు పరమాత్మవు. అద్వితీయుడవు. అవ్యయుడవు నీవే.

**మమ పుత్రోపరి కృతో దేవానుగ్రహ ఈశ్వర ।**
**స్వాపమానమగణయన్ దక్షయజ్ఞం సముద్ధర ॥50॥**

ఓ ఈశ్వరా! దేవా! నీకు కలిగిన అవమానాన్ని గణింపక నీవు నా కుమారునిపై అనుగ్రహాన్ని చూపించితివి. అట్లే దక్షయజ్ఞాన్ని కూడ సముద్ధరింపుము.

**ప్రసన్నో భవ దేవేశ సర్వశాపాన్నిరాకురు ।**
**సబోధః ప్రేరకస్త్వం మే త్వమేవం వినివారకః ॥51॥**

ఓ దేవేశా! ప్రసన్నుడవు కమ్ము. శాపాలనన్నింటిని నిరాకరింపుము. జ్ఞానస్వరూపుడవైన నీవే నన్నీతీరున ప్రేరేపించితివి. దీనిని నివారింపవలసినది కూడ నీవే.

**ఇతి స్తుత్వా మహేశానం పరమం చ మహామునే ।**
**కృతాంజలిపుటో భూత్వా వినమ్రీకృతమస్తకః ॥52॥**

ఓ నారదమునీ! నేనీవిధంగా దోసిలొగ్గి, తలవంచి, వినయపూర్వకంగా నేను ఆ పరమాత్మను ప్రార్థించాను.

**అథ శక్రాదయో దేవా లోకపాలా స్సుచేతసః ।**
**తుష్టువుః శంకరం దేవం ప్రసన్న ముఖపంకజమ్ ॥53॥**

అనంతరం ఇంద్రాది లోకపాలకులు, దేవతలు, మంచి మనస్సుగలవారై ప్రసన్నమైన ముఖపద్మముగల శంకరదేవుని స్తుతించారు.

**తతః ప్రసన్నమనసః సర్వే దేవాస్తథాపరే ।**
**సిద్ధర్షయః ప్రజేశాశ్చ తుష్టువుః శంకరం ముదా ॥54॥**

అట్లే ప్రసన్నమనస్కులైన దేవతలందరు, ఇతరులు, సిద్ధులు, ఋషులు, ప్రజాపతులు ఆనందంతో శంకరుని స్తుతించారు.

**తథోపదేవనాగాశ్చ సదస్యా బ్రాహ్మణాస్తథా ।**
**ప్రణమ్య పరయా భక్త్యా తుష్టువుశ్చ పృథక్ పృథక్ ॥55॥**

ఆవిధంగానే ఉపదేవతలు, నాగులు, సదస్యులైన బ్రాహ్మణులు వేరువేరుగా పరాభక్తితో నమస్కరించి స్తుతించారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే దక్షదుఃఖనిరాకరణ వర్ణనం నామ ద్విచత్వారింశోఽధ్యాయః ॥42॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో దక్షుని దుఃఖమును నివారించుట అనే నలబై రెండవ అధ్యాయం సమాప్తం.

## త్రిచత్వారింశోఽధ్యాయః - నలభై మూడవ అధ్యాయం
## దక్షయజ్ఞానుసంధానవర్ణనమ్ - దక్షయజ్ఞమును అనుసంధానపరచుట

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇతిస్తుతో రమేశేన మయా చైవ సురర్షిభిః ।**
**తథాన్యైశ్చ మహాదేవః ప్రసన్నస్సంబభూవ హ ॥1॥**

ఓ నారదా! విష్ణువు, నేను, దేవతలు, ఋషులు, ఇతరులు ఇట్లు స్తుతించగా మహాదేవుడు మిక్కిలి ప్రసన్నుడయ్యాడు.

**అథ శంభుః కృపాదృష్ట్యా సర్వాన్ ఋషిసురాదికాన్ ।**
**బ్రహ్మవిష్ణూ సమాధాయ దక్షమేతదువాచ హ ॥2॥**

అంతట శంభుడు ఋషులు, దేవతలు, బ్రహ్మ, విష్ణువు మున్నగువారినందరిని సమాధానపరచి, దక్షునితో ఇలా పలికాడు.

**మహాదేవ ఉవాచ** - మహాదేవుడు పలికాడు.

**శృణు దక్ష ప్రవక్ష్యామి ప్రసన్నోఽస్మి ప్రజాపతే ।**
**భక్తాధీనః సదాహం వై స్వతంత్రోఽప్యఖిలేశ్వరః ॥3॥**

ఓ దక్షప్రజాపతీ! నేను చెప్పు మాటను వినుము. నేను ప్రసన్నుడనైనాను. నేను స్వతంత్రుడను, సర్వేశ్వరుడను. అయినప్పటికి నేను సదా భక్తాధీనుడను.

**చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినస్సదా ।**
**ఉత్తరోత్తరతః శ్రేష్ఠాస్తేషాం దక్షప్రజాపతే ॥4॥**

ఓ దక్షప్రజాపతీ! నాల్గు విధాలైన పుణ్యాత్ములు నిత్యము నన్ను సేవిస్తూ ఉంటారు. వారిలో వరుసగా ముందువారికంటే తరువాతవారు శ్రేష్ఠులు.

**ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీచైవ చతుర్థకః ।**
**పూర్వే త్రయశ్చ సామాన్యాశ్చతుర్థో హి విశిష్యతే ॥5॥**

ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని అని నలుగురు నన్ను సేవిస్తారు. వీరిలో మొదటి ముగ్గురు సామాన్యభక్తులుకాగా నాల్గవవాడు సర్వశ్రేష్ఠుడు.

**తత్ర జ్ఞానీ ప్రియతరో మమ రూపం చ స స్మృతః ।**
**తస్మాత్ప్రియతరో నాన్యః సత్యం సత్యం వదామ్యహమ్ ॥6॥**

వారిలో జ్ఞాని నాకు అత్యంత ప్రీతిపాత్రుడు. జ్ఞాని నా స్వరూపమేనని వేదాలు చెప్పుచున్నాయి. కావున నాకు జ్ఞానికంటే ఎక్కువ ప్రియమైనవాడు లేడు. నేను ముమ్మాటికి సత్యమునే పలుకుచున్నాను.

**జ్ఞానగమ్యోఽహమాత్మజ్ఞో వేదాంతశ్రుతిపారగైః ।**
**వినా జ్ఞానేన మాం ప్రాప్తుం యతంతే చాల్పబుద్ధయః ॥7॥**

ఉపతిషత్తుల తాత్పర్యము నెరిగిన జ్ఞానులు ఆత్మజ్ఞుడనైన నన్ను జ్ఞానముచే పొందుతారు. జ్ఞానవంతులు కాకుండా నన్ను పొందుటకు ప్రయత్నించువారు అల్పబుద్ధులు.

**న వేదైశ్చ న యజ్ఞైశ్చ న దానైస్తపసా క్వచిత్ ।**
**నశక్నువంతి మాం ప్రాప్తుం మూఢాః కర్మవశా నరాః ॥8॥**

మూర్ఖులు, కర్మాధీనులునైన మానవులు నన్ను వేదాలతోగాని, యజ్ఞాలతోగాని, దానాలతోగాని, తపస్సుచేగాని పొందలేరు.

**కేవలం కర్మణా త్వం స్మ సంసారం తర్తుమిచ్ఛసి ।**
**అత ఏవాభవం రుష్టో యజ్ఞవిధ్వంసకారకః ॥9॥**

నీవు కేవల కర్మతో సంసారమును తరింపనెంచితివి. అందువలననే నేను కోపించి, యజ్ఞమును విధ్వంసమును చేశాను.

**ఇతః ప్రభృతి భో దక్ష మత్వా మాం పరమేశ్వరమ్ ।**
**బుద్ధ్యా జ్ఞానపరో భూత్వా కురు కర్మ సమాహితః ॥10॥**

ఓ దక్షా! ఇటుపై నీవు నన్ను పరమేశ్వరునిగా ఎరింగి, బుద్ధిని జ్ఞానార్జనయందు లగ్నంచేసి శ్రద్ధతో కర్మను అనుష్ఠింపుము.

**అన్యచ్చ శృణు సద్బుద్ధ్యా వచనం మే ప్రజాపతే ।**
**వచ్మి గుహ్యం ధర్మహేతోః సగుణత్వేఽప్యహం తవ ॥11॥**

ఓ ప్రజాపతీ! మరియొకమాటను చెబుతాను. సద్బుద్ధితో వినుము. నేను నా సగుణ స్వరూపానికి సంబంధించిన రహస్యమును ధర్మవృద్ధికొకరై నీకు చెబుతాను.

**అహం బ్రహ్మా చ విష్ణుశ్చ జగతః కారణం పరమ్ ।**
**ఆత్మేశ్వర ఉపద్రష్టా స్వయం దృగవిశేషణః ॥12॥**

నేను బ్రహ్మ, విష్ణురూపుడనై జగత్తుయొక్క పరమ కారణమగుచున్నాను. నేనే ఆత్మను. ఈశ్వరుడను, ద్రష్టను, స్వయం ప్రకాశుడను. నిర్గుణుడను.

**ఆత్మమాయాం సమావిశ్య సోహం గుణమయీం మునే ।**
**సృజన్రక్షన్ హరన్ విశ్వం దధే సంజ్ఞాః క్రియోచితాః ॥13॥**

అట్టి నేను నా మాయను స్వాధీనం చేసుకొని, జగత్తుయొక్క సృష్టి, స్థితి లయములను చేయుచు ఆయా క్రియలకు తగిన నామాలను ధరించుచున్నాను.

**అద్వితీయే పరే తస్మిన్ బ్రహ్మణ్యాత్మని కేవలే ।**
**అజ్ఞః పశ్యతి భేదేన భూతాని బ్రహ్మ చేశ్వరమ్ ॥14॥**

అద్వితీయమైన ఆ పరబ్రహ్మమునందు అజ్ఞులైన ప్రాణులు బ్రహ్మ, విష్ణువు, ఈశ్వరుడు అనే భేదాలను దర్శిస్తారు.

**శిరఃకరాదిస్వాంగేషు కురుతే న యథా పుమాన్ ।**
**పారక్యశేముషీం క్వాపి భూతేష్వేవం హి మత్పరః ॥15॥**

మానవుడు తన శరీరములోని కరచరణాద్యవయములయందు గొప్ప భేదబుద్ధిని కలిగియుండుటలేదు కదా! అట్లే నిజమైన నా భక్తుడు ప్రాణులయందు భేదబుద్ధిని కలిగియుండడు.

**సర్వభూతాత్మనామేకభావవానాం యో న పశ్యతి ।**
**త్రిసురాణాం భిదాం దక్ష స శాంతిమధిగచ్ఛతి ॥16॥**

ఓ దక్షా! సర్వప్రాణులందలి ఆత్మలు ఒక్కటియే అను భావన కలవాడై త్రిమూర్తులలో భేదాన్ని ఎవడు దర్శించడో అట్టివాడు శాంతిని పొందుతాడు.

**యః కరోతి త్రిదేవేషు భేదబుద్ధిం నరాధమః ।**
**నరకే స వసేన్నూనం యావదాచంద్రతారకమ్ ॥17॥**

ఎవడైతే త్రిమూర్తులలో భేదబుద్ధిని కలిగియుంటాడో అట్టి మానవాధములు చంద్రుడు, నక్షత్రములు ఉన్నంతవరకు నరకమునందు నివసించుట నిశ్చయము.

**మత్పరః పూజయేద్దేవాన్ సర్వానపి విచక్షణః ।**
**స జ్ఞానం లభతే యేన ముక్తిర్భవతి శాశ్వతీ ॥18॥**

ఏ వివేకి నాయందు భక్తికలవాడై, దేవతలనందరిని పూజిస్తాడో వాడు జ్ఞానాన్ని పొంది, దాని ప్రభావంచే శాశ్వతమైన ముక్తిని పొందుతాడు.

**విధిభక్తిం వినా నైవ భక్తిర్భవతి వైష్ణవీ ।**
**విష్ణుభక్తిం వినా మే న భక్తిః క్వాపి ప్రజాయతే ॥19॥**

బ్రహ్మయందు భక్తిలేనిదే విష్ణువుయందు భక్తి లేనేలేదు. విష్ణుభక్తి లేకుండా నాయందు భక్తి ఎన్నడు పుట్టదు.

**ఇత్యుక్త్వా శంకరస్స్వామీ సర్వేషాం పరమేశ్వరః ।**
**సర్వేషాం శృణ్వతాం తత్రోవాచ వాణీం కృపాకరః ॥20॥**

అందరు వినుచుండగా శంకరస్వామి ఇట్లు పలికి, దయామయుడైన శంకరుడు మరలా ఇలా పలికాడు.

**హరిభక్తో హి మాం నిందేత్తథా శైవో భవేద్యది ।**
**తయోః శాపా భవేయుస్తే తత్త్వప్రాప్తిర్భవేన్న హి ॥21॥**

నన్ను నిందించు విష్ణుభక్తుడు, విష్ణువును నిందించు శివభక్తుడు కూడా శాపాన్ని పొందుతారు. వారికి తత్త్వప్రాప్తి సంభవింపదు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య మహేశస్య వచనం సుఖకారకమ్ ।**
**జహర్షుస్సకలాస్తత్ర సురమున్యాదయో మునే ॥22॥**

ఓ నారదా! సుఖకరములైన శంకరుని ఈ వచనాలను విని, అక్కడనున్న దేవతలు, మునులు మున్నగువారందరు సంతోషించారు.

**దక్షోఽభవన్మహాప్రీత్యా శివభక్తిరతస్తదా ।**
**సకుటుంబస్సురాద్యాస్తే శివం మత్వాఖిలేశ్వరమ్ ॥23॥**

కుటుంబ సమేతుడై దక్షుడు మహాప్రీతితో శివభక్తితత్పరుడై సర్వదా శివుని సేవించాడు. సురాదులు, అఖిలేశ్వరుడు శివుడేనని తలపోశారు.

**యథా యేన కృతా శంభోః సంస్తుతిః పరమాత్మనః ।**
**తథా తస్మై వరో దత్తశ్శంభునా తుష్టచేతసా ॥24॥**

అచ్చట ఎవరెవరు ఏయే విధంగా పరమాత్మయైన శంభుని స్తుతించారో వారివారికి సంతుష్టాత్ముడైన శంభుడు ఆయా వరాలననుగ్రహించాడు.

**జ్ఞప్తః శివేనాశు దక్షః శివభక్తః ప్రసన్నధీః ।**
**యజ్ఞం చకార సంపూర్ణం శివానుగ్రహతో మునే ॥25॥**

ఓ నారదమునీ! శివభక్తుడు, ప్రసన్నమైన బుద్ధి కలవాడునైన దక్షుడు శివునిచే ఆజ్ఞాపింపబడినవాడై శివానుగ్రహముతో యజ్ఞమును పరిసమాప్తి గావించాడు.

**దదౌ భాగాన్సురేభ్యో హి పూర్ణభాగం శివాయ సః ।**
**దానం దదౌ ద్విజేభ్యశ్చ ప్రాప్తః శంభోరనుగ్రహః ॥26॥**

అతడు దేవతలకు వారివారి యజ్ఞభాగాలను, శివునకు పూర్ణభాగాన్ని ఇచ్చాడు. బ్రాహ్మణులకు దానాలను చేశాడు. దక్షుడీవిధంగా శంభుని అనుగ్రహాన్ని పొందాడు.

**అథో దేవస్య సుమహత్తత్కర్మ విధి పూర్వకమ్ ।**
**దక్షః సమాప్య విధివత్సహర్త్విగ్భిః ప్రజాపతిః ॥27॥**

ఇట్లు దక్షప్రజాపతి శివదేవుని అనుగ్రహముచే ఋత్విక్కుల సహకారంతో ఆ మహాయజ్ఞాన్ని యథావిధిగా పూర్తిచేశాడు. (సహ+ఋత్విగ్భిః = సహర్త్విగ్భిః)

**ఏవం దక్షమఖః పూర్ణోఽభవత్తత్ర మునీశ్వర ।**
**శంకరస్య ప్రసాదేన పరబ్రహ్మ స్వరూపిణః ॥28॥**

ఓ మునీశ్వరా! పరబ్రహ్మ స్వరూపుడైన శంకరుని అనుగ్రహంచే అచ్చట దక్షుని యజ్ఞం ఈవిధముగా పరిపూర్ణమయ్యింది.

**అథ దేవర్షయస్సర్వే శంసతశ్శాంకరం యశః ।**
**స్వధామాని యయుస్తుష్టాః పరేఽపి సుఖతస్తదా ॥29॥**

అంతట దేవతలు, ఋషులందరు శంకరుని కీర్తిని గానం చేస్తూ తమతమ నివాసాలకు చేరుకున్నారు. అపుడు ఇతరులందరూ కూడ సుఖశాంతులను పొందారు.

**అహం విష్ణుశ్చ సుప్రీతావపి స్వం స్వం పదం ముదా ।**
**గాయన్తౌ సుయశశ్శంభోః సర్వమంగళదం సదా ॥30॥**

నేను మరియు విష్ణువు, సర్వమంగళకరుడైన శంభుని కీర్తిని నిరంతరంగా గానం చేస్తూ ఆనందంతో మా ధామాలకు చేరుకున్నాము.

**దక్షసంమానితః ప్రీత్యా మహాదేవోఽపి సద్గతిః ।**
**కైలాసం స యయౌ శైలం సుప్రీతస్సగణో నిజమ్ ॥31॥**

సత్పురుషులకు శరణ్యుడగు మహాదేవుడు కూడా దక్షునిచే సన్మానింపబడినవాడై, ఆనందించి ప్రీతితో తన గణాలను వెంటబెట్టుకొని తమ ధామమైన కైలాసపర్వతానికి చేరాడు.

**ఆగత్య స్వగిరిం శంభుస్సస్మార స్వప్రియాం సతీమ్ ।**
**గణేభ్యః కథయామాస ప్రధానేభ్యశ్చ తత్కథామ్ ॥32॥**

శంభుడు తన కైలాసపర్వతానికి చేరుకొని తన ప్రియురాలైన సతీదేవిని స్మరించాడు. ఆయన ప్రధానులైన గణాధ్యక్షులతో ఆమె వృత్తాంతాన్ని విస్తారంగా చెప్పసాగాడు.

**కాలం నినాయ విజ్ఞానీ బహు తచ్చరితం వదన్ ।**
**లౌకికీం గతిమాశ్రిత్య దర్శయన్ కామితాం ప్రభుః ॥33॥**

ఆ ప్రభుడు జ్ఞానియైనను ఇష్టమైన లౌకికగతిననుసరించి ఆమె గాథలను వర్ణిస్తూ చిరకాలం గడిపాడు.

**నానీతికారకః స్వామీ పరబ్రహ్మ సతాంగతిః ।**
**తస్య మోహః క్వ వా శోకః క్వ వికారః పరో మునే ॥34॥**

ఓ మహర్షీ! పరబ్రహ్మాయు, సజ్జనులకుగతియునైన శివస్వామి నీతిలేనిదనమును సహించదు. ఆయనకు మోహముగాని, శోకముగాని, వికారముగాని, కలుగనే కలుగవు.

**అహం విష్ణుశ్చ జానీవస్తద్భేదం న కదాచన ।**
**కే పరే మునయో దేవా మానుషాద్యాశ్చ యోగినః ॥35॥**

ఆయన యొక్క భేదాన్ని నేను గాని, విష్ణువు గాని ఎన్నడు తెలియలేకపోయాము. మునులు, దేవతలు, యోగులు, మానవులు మున్నగువారిని గురించి చెప్పేదేమున్నది?.

**మహిమా శాంకరోఽనంతో దుర్విజ్ఞేయో మనీషిభిః ।**
**భక్తజ్ఞాతశ్చ సద్భక్త్యా తత్ప్రసాదాద్వినా శ్రమమ్ ॥36॥**

శంకరుని మహిమ అనంతము. దానిని పండితులుకూడా తెలియజాలరు. కాని భక్తులు మాత్రము ఆయన యందలి భక్తివలన ఆయన అనుగ్రహముచే శ్రమ లేకుండగనే ఆయనను తెలియగలుగుచున్నారు.

**ఏకోఽపి న వికారో హి శివస్య పరమాత్మనః ।**
**సందర్శయతి లోకేభ్యః కృత్వా తాం తాదృశీం గతిమ్ ॥37॥**

పరమాత్మయైన శివునకు ఒక్క వికారమైనను లేదు. కాని అట్టి గతిని పొందినాడా అన్నట్లు లోకగతి ననుసరించి లీలలను ప్రదర్శిస్తాడు.

**యత్పఠిత్వా చ సంశ్రుత్య సర్వలోకసుధీర్మునే ।**
**లభతే సద్గతిం దివ్యామిహాపి సుఖముత్తమమ్ ॥38॥**

ఓ మహర్షీ! శివుని ఈ చరితాన్ని చదివినవాడు, వినినవాడు, జ్ఞానియై సర్వలోకాలలో ఉత్తముడైన బుద్ధిమంతుడౌతాడు. అట్టివాడు ఇహలోకంలో ఉత్తమ సుఖాలను పొంది, దివ్యమైన సద్గతిని పొందుతాడు.

**ఇత్థం దాక్షాయణీ హిత్వా నిజదేహం సతీ పునః ।**
**జజ్ఞే హిమవతః పత్న్యాం మేనాయామితి విశ్రుతమ్ ॥39॥**

ఇట్లు దాక్షాయణి తన దేహాన్ని విడిచి, తిరిగి హిమవంతుని భార్యయగు మేనకకు జన్మించెనని పురాణప్రసిద్ధి.

**పునః కృత్వా తపస్తత్ర శివం వవ్రే పతిం చ సా ।**
**గౌరీ భూత్వాఽర్ధవామాంగీ లీలాశ్చక్రేఽద్భుతాశ్శివా ॥40॥**

ఆమె ఆ జన్మలో అక్కడకూడా మరల తపస్సుచేసి, శివుని భర్తగా వరించింది. ఆమెయే గౌరియై శివుని వామభాగాన్ని తనది చేసుకొని అద్భుతమైన లీలలను ప్రదర్శించింది.

**ఇత్థం సతీచరిత్రం తే వర్ణితం పరమాద్భుతమ్।**
**భుక్తిముక్తిప్రదం దివ్యం సర్వకామప్రదాయకమ్ ॥41॥**

ఇంతవరకు పరమాద్భుతము, భుక్తిముక్తిప్రదము, దివ్యము, సర్వకామప్రదాయకమునైన సతీచరిత్రమును నీకు వివరించి చెప్పాను.

**ఇదమాఖ్యానమనఘం పవిత్రం పరపావనమ్ ।**
**స్వర్గ్యం యశస్యమాయుష్యం పుత్రపౌత్రఫలప్రదమ్ ॥42॥**

ఈ గాథ పాపరహితమైనది. పరమపవిత్రమైనది. పరమపావనమైనది. స్వర్గాన్ని, యశస్సును, ఆయుష్యాన్ని కలిగించేది. పుత్రపౌత్ర ఫలప్రదమైనది.

**య ఇదం శృణుయాద్భక్త్యా శ్రావయేద్భక్తిమాన్నరాన్ ।**
**సర్వకర్మా లభేత్తాత పరత్ర పరమాం గతిమ్ ॥43॥**

వత్సా! ఎవరైతే ఈ గాథను భక్తితో వింటారో, ఎవరైతే భక్తిగలవారై ఇతరులకు వినిపిస్తారో వారు కోర్కెల నన్నింటిని పొందుటయేగాక పరలోకంలో ఉత్తమగతిని కూడ పొందుతారు.

**యః పఠేత్పాఠయేద్వాపి సమాఖ్యానమిదం శుభమ్ ।**
**సోఽపి భుక్త్వాఽఖిలాన్ భోగానంతే మోక్షమవాప్నుయాత్ ॥44॥**

ఈ శుభకరమైన గాథను చదివినవారు, చదివించినవారు కూడ ఇహలోకములో భోగాలనన్నింటిని అనుభవించి, దేహత్యాగానంతరం మోక్షాన్ని పొందుతారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సతీచరిత్రే ద్వితీయే సతీఖండే దక్షయజ్ఞానుసంధానవర్ణనం నామ త్రిచత్వారింశోఽధ్యాయః ॥43॥**

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితయందు రెండవదైన సతీఖండంలో దక్షయజ్ఞమును అనుసంధానపరచుట అనే నలబైమూడవ అధ్యాయం సమాప్తం.

**॥ శ్రీః ॥**
**॥ సమాప్తోఽయం రుద్రసంహితాన్తర్గత సతీఖండో ద్వితీయః ॥**

**॥ శ్రీః ॥**
**॥ రుద్రసంహిత యందలి రెండవదైన సతీఖండం సమాప్తం ॥**

# పార్వతీఖండః - పార్వతీఖండం

## ప్రథమోఽధ్యాయః - మొదటి అధ్యాయం

## హిమాచల వివాహవర్ణనమ్ - హిమాచల వివాహవర్ణనం

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**దాక్షాయణీ సతీదేవీ త్యక్తదేహా పితుర్మఖే ।**
**కథం గిరిసుతా బ్రహ్మన్ బభూవ జగదమ్బికా ॥1॥**

ఓ బ్రహ్మా! దాక్షాయణియైన సతీదేవి తన తండ్రియైన దక్షుడు చేసిన యజ్ఞంలో దేహాన్నివిడిచింది. అనంతరం ఆ జగదంబిక పర్వత పుత్రికయైన విధానమెట్టిది?

**కథం కృత్వా తపోఽత్యుగ్రం పతిమాప శివం చ సా ।**
**ఏతన్మే పృచ్ఛతే సమ్యక్కథయ త్వం విశేషతః ॥2॥**

ఆమె అత్యుగ్రమైన తపస్సుచేసి, శివుని భర్తగా పొందిన విధానమెట్టిది? నాయీ ప్రశ్నలకు సవిస్తరముగా, చక్కగా సమాధానం చెప్పండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**శ్రుణు త్వం మునిశార్దూల శివాచరితముత్తమమ్ ।**
**పావనం పరమం దివ్యం సర్వపాపహరం శుభమ్ ॥3॥**

ఓ మునిశ్రేష్ఠా! ఉత్తమమైన జగన్మాత చరిత్రను నీవు వినుము. అది పరమపావనము, దివ్యము, పాపములను పోగొట్టునది, శుభాలను కలిగించునది.

**యదా దాక్షాయణీ దేవీ హరేణ సహితా ముదా ।**
**హిమాచలే సుచిక్రీడే లీలయా పరమేశ్వరీ ॥4॥**

పరమేశ్వరియైన దాక్షాయణీదేవి శివునితోగూడి ఆనందంతో హిమాలయ పర్వతమునందు లీలగా క్రీడిస్తూ ఉన్నది.

**మత్సుతేయమితి జ్ఞాత్వా సిషేవే మాతృవర్చసా ।**
**హిమాచలప్రియా మేనా సర్వర్ధిభిరనిర్భరా ॥5॥**

ఆ సమయంలో హిమవంతుని ప్రియురాలును, సమస్త సంపదలతో అలరారునదియునగు మేనాదేవి మాతృప్రేమతో 'ఈమె నా కుమార్తె' అనే భావనతో ఆమెను సేవించింది.

**యదా దాక్షాయణీ రుష్టా నాదృతా స్వతనుం జహౌ ।**
**పిత్రా దక్షేణ తద్యజ్ఞే సంగతా పరమేశ్వరీ ॥6॥**

పరమేశ్వరియైన దాక్షాయణి తండ్రియగు దక్షుని యజ్ఞానికి వెళ్ళి అచట తండ్రిచే అవమానింపబడి, కోపంతో తన దేహాన్ని త్యజించింది.

**తదైవ మేనకా తాం సా హిమాచలప్రియా మునే ।**
**శివలోక స్థితాం దేవీమారిరాధయిషు స్తదా ॥7॥**

ఓ నారదమునీ! హిమాచలుని ప్రియురాలైన మేనక ఆనాడే శివలోకమునందలి ఉమాదేవిని ఆరాధించాలని తలచింది.

**తస్యామహం సుతా స్యామిత్యవధార్య సతీ హృదా ।**
**త్యక్తదేహా మనో దధ్రే భవితుం హిమవత్సుతా ॥8॥**

అప్పుడు సతీదేవి దేహాన్ని వీడిన తరువాత హిమవంతుని కుమార్తెగా మేనకా గర్భమునందు జన్మించాలని మనస్సులో నిశ్చయించుకుంది.

**సమయం ప్రాప్య సా దేవీ సర్వదేవస్తుతా పునః ।**
**సతీ త్యక్త తనుః ప్రీత్యా మేనకా తనయాభవత్ ॥9॥**

దేవతలందరిచేతా స్తుతింపబడిన సతీదేవి దేహాన్ని వీడిన తరువాత సరియైన సమయం ప్రాప్తించగానే ప్రేమపూర్వకంగా మేనకాదేవికి కుమార్తెయై అవతరించింది.

**నామ్నా సా పార్వతీ దేవీ తపః కృత్వా సుదుస్సహమ్ ।**
**నారదస్యోపదేశాద్వై పతిం ప్రాప శివం పునః ॥10॥**

పార్వతి అనుపేరుగల ఆ దేవి నారదుని ఉపదేశానుసారం మిక్కిలి దుస్సహమైన తపమాచరించి మరల శివుని భర్తగా పొందింది.

**నారద ఉవాచ** – నారదుడు చెప్పాడు.

**బ్రహ్మన్ విధే మహాప్రాజ్ఞ వద మే వదతాం వర ।**
**మేనకాయాస్సముత్పత్తిం వివాహం చరితం తథా ॥11॥**

ఓ బ్రహ్మా! విధీ! మహాప్రాజ్ఞా! మాటకారులలో శ్రేష్ఠుడా! మేనకయొక్క పుట్టుకను గూర్చియు, వివాహాన్ని గూర్చియు, తదితర వృత్తాంతమునుగూర్చియు నాకు చెప్పండి.

**ధన్యా హి మేనకాదేవీ యస్యాం జాతా సుతా సతీ ।**
**అతో మాన్యా చ ధన్యా చ సర్వేషాం సా పతివ్రతా ॥12॥**

సతీదేవిని కుమార్తెగా పొందిన మేనకాదేవి మిక్కిలి ధన్యురాలు, పూజ్యురాలు, ఆమె అందరిలోను పతివ్రతా శిరోమణి.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**శ్రుణు త్వం నారదమునే పార్వతీ మాతురుద్భవమ్ ।**
**వివాహం చరితం చైవ పావనం భక్తివర్ధనమ్ ॥13॥**

ఓ నారదమునీ! పార్వతి తల్లియైన మేనకాదేవి పుట్టుకనుగూర్చియు, వివాహాన్ని గూర్చియు వినుము. ఆమె చరిత్ర పావనమైనది. భక్తిని వృద్ధిచేయునట్టిది.

**అస్త్యుత్తరస్యాం దిశి వై గిరీశో హిమవాన్మహాన్ ।**
**పర్వతో హి మునిశ్రేష్ఠ మహాతేజాస్సమృద్ధిభాక్ ॥14॥**

ఓ మహర్షీ! ఉత్తర దిక్కునందు మహాతేజస్సుతోను, సమృద్ధులతోను, పరిఢవిల్లు 'హిమవాన్' అని ప్రసిద్ధిగాంచిన పర్వత శ్రేష్ఠుడున్నాడుగదా!

**ద్వైరూప్యం తస్య విఖ్యాతం జంగమస్థిర భేదతః ।**
**వర్ణయామి సమాసేన తస్య సూక్ష్మస్వరూపకమ్ ॥15॥**

ఆ హిమవత్పర్వతానికి జంగమము (నడయాడునది) స్థావరము (కదలనిది) అను రెండు రూపాలున్నాయని ప్రసిద్ధి. ఈ విషయంలోని సూక్ష్మ స్వరూపాన్ని సంగ్రహంగా తెలియజేస్తాను.

**పూర్వాపరౌ తోయనిధీ సువిగాహ్య స్థితో హి యః ।**
**నానారత్నాకరో రమ్యో మానదండ ఇవ క్షితేః ॥16॥**

ఈపర్వతం పశ్చిమ సముద్రంనుండి తూర్పుసముద్రము వరకు వ్యాపించి, భూమిని కొలిచే మానదండం (కొలతబద్ద) వలె ఉంటుంది. ఇది అనేక రత్నములతోను రమ్యమైన వస్తువులతోను ప్రకాశిస్తూ ఉంటుంది.

**నానావృక్ష సమాకీర్ణో నానాశృంగ సుచిత్రితః ।**
**సింహ వ్యాఘ్రాది పశుభిస్సేవిత స్సుఖిభిస్సదా ॥17॥**

ఈపర్వతము అనేక రకాల వృక్షాలతో నిండియుండి, అనేక శిఖరాలతో అతిసుందరంగా ఉంటుంది. సింహములు పెద్దపులులు మున్నగు జంతువులు ఈ పర్వతమునందు ఎల్లప్పుడు సుఖంగా సంచరిస్తూ ఉంటాయి.

**తుషార నిధిరత్యుగ్రో నానాశ్చర్య విచిత్రితః ।**
**దేవర్షి సిద్ధ మునిభిస్సంశ్రితః శివసం ప్రియః ॥18॥**

ఇది మిక్కిలి దట్టమైన మంచుతోనిండి, ఆశ్చర్యకరమైన అనేక విచిత్రాలతో కూడి ఉంటుంది. దేవతలు, ఋషులు, సిద్ధులు, మునులు సదా ఈపర్వతాన్ని సేవిస్తూ ఉంటారు. ఇది శివునకు మిక్కిలి ప్రీతికరమైన పర్వతము.

**తపః స్థానోఽతి పూతాత్మా పావనశ్చ మహాత్మనామ్ ।**
**తపస్సిద్ధి ప్రదోత్యన్తం నానాధాత్వాకరః శుభః ॥19॥**

అది మహాత్ములకు తపోభూమి. మిక్కిలి పవిత్రమైన ఆపర్వతం వారిని పవిత్రులను చేస్తుంది. ఆపర్వతమునందు తపస్సుచేయువారికి సిద్ధి నిశ్చయంగా కలుగుతుంది. శుభంకరమైన ఆపర్వతము అనేక ధాతువులకు (లోహఖనిజాలకు) నిలయమైనది.

**స ఏవ దివ్యరూపో హి రమ్యః సర్వాఙ్గసున్దరః ।**
**విష్ణ్వంశోఽవికృతః శైలరాజరాజ స్సతాం ప్రియః ॥20॥**

అది దివ్యరూపం కలది. సర్వాంగసుందరమైనది. రమణీయమైనది. వికారములు లేనిది. సత్పురుషులకు ప్రియమైన ఆ పర్వతరాజము విష్ణువుయొక్క అంశచే ఉద్భవించింది.

**కులస్థిత్యైచ స గిరి ర్ధర్మవర్ధనహేతవే ।**
**స్వ వివాహం కర్తుమైచ్ఛత్పితృదేవ హితేచ్ఛయా ॥21॥**

ఆ పర్వతుడు వంశాన్ని నిలబెట్టి, ధర్మాన్ని వర్ధిల్లచేయడానికీ, పితృదేవతలకు హితాన్ని చేయాలనే కోరికతోనూ, వివాహం చేసుకోవాలనుకున్నాడు.

**తస్మిన్నవసరే దేవాః స్వార్థమాచిన్త్య కృత్స్నశః ।**
**ఊచుః పితౄన్ సమాగత్య దివ్యాన్ప్రీత్యా మునీశ్వర ॥22॥**

మునీశ్వరా! ఆ సమయంలో దేవతలు పూర్తిగా తమ స్వార్థాన్ని మాత్రమే ఆలోచించి, పితృదేవతలను సమీపించి, వారితో ప్రీతిపూర్వకంగా ఇలా పలికారు.

**దేవా ఊచుః** – దేవతలు పలికారు.

**సర్వే శ్రుణుత నోవాక్యం పితరః ప్రీతమానసాః ।**
**కర్తవ్యం తత్తథైవాశు దేవకార్యేప్సవో యది ॥23॥**

ఓ పితృదేవతలారా! మీరు ప్రీతమనస్కులై మా వాక్యాలను వినండి. మీకు దేవకార్యాన్ని నెరవేర్చాలని కోరిక యున్నచో మేము చెప్పినదాన్ని అలాగే వెంటనే చెయ్యాలి.

**మేనా నామ సుతా యా వో జ్యేష్ఠా మఙ్గలరూపిణీ ।**
**తాం వివాహ్య చ సుప్రీత్యా హిమాఖ్యేన మహీభృతా ॥24॥**

మంగళ స్వరూపురాలైనట్టియు, మేనకాదేవియను పేరుగలట్టియు, మీ పెద్దకుమార్తెను హిమవత్పర్వతునకిచ్చి, ప్రీతిపూర్వకంగా వివాహం చేయండి.

**ఏవం సర్వమహాలాభః సర్వేషాం చ భవిష్యతి ।**
**యుష్మాక మమరాణాం చ దుఃఖహానిః పదేపదే ॥25॥**

ఈవిధంగా చేసినచో అందరికి మహాలాభం కలుగుతుంది. మీకు దేవతలకుకూడ పదేపదే సంభవించే దుఃఖాలన్నీ కూడా తొలగిపోతాయి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్యాఽమరవచః పితరస్తే విమృశ్య చ ।**
**స్మృత్వా శాపం సుతానాం చ ప్రోచురోమితి తద్వచః ॥26॥**

దేవతల మాటలను విని పితృదేవతలు ఆలోచించుకొని, తమ కుమార్తెల శాపాలను స్మరించి, దేవతల మాటలకు తమ అంగీకారాన్ని తెలుపుతూ 'ఓమ్' (అలాగే) అని పలికారు.

**దదుర్మేనాం సువిధినా హిమాగాయ నిజాత్మజామ్ ।**
**సముత్సవో మహానాసీత్తద్వివాహే సుమంగళే ॥27॥**

పితృదేవతలు తమ కుమార్తెయైన మేనకాదేవిని హిమవంతునకిచ్చి యథావిధిగా వివాహం చేశారు. పరమ మంగళకరమైన ఆ వివాహంలో మహోత్సవం ప్రవర్తిల్లింది.

**హర్యాదయోఽపి తే దేవా మునయశ్చాపరోఽఖిలాః ।**
**ఆజగ్ముస్తత్ర సంస్మృత్య వామదేవం భవం ధియా ॥28॥**

విష్ణువు మున్నగు దేవతలు, సమస్తమైన మహర్షులు, వామదేవుడైన శంకరుని మనసా స్మరించి, ఆ వివాహానికి వచ్చియున్నారు.

**ఉత్సవం కారయామాసుర్దత్త్వా దానాన్యనేకశః ।**
**సుప్రశస్య పితౄన్దివ్యాన్ప్రశశంసు ర్హిమాచలమ్ ॥29॥**

వారనేక దానాలనిచ్చి వివాహ మహోత్సవాన్ని నిర్వహించారు. దివ్యులైన పితృదేవతలను, హిమవంతుని, అనేక విధాలుగా ప్రశంసించారు.

**మహామోదాన్వితా దేవాస్తే సర్వే స మునీశ్వరాః ।**
**సంజగ్ముః స్వస్వధామాని సంస్మరన్తః శివాశివౌ ॥30॥**

దేవతలు, మునీశ్వరులు, ఇతరులందరు మహానందాన్ని పొందినవారై ఉమామహేశ్వరులను స్మరించుకుంటూ తమతమ నివాసాలకు తిరిగి వెళ్ళారు.

**కౌతుకం బహుసంప్రాప్య సువివాహ్య ప్రియాం చ తామ్ ।**
**ఆజగామ స్వభవనం ముదమాప గిరీశ్వరః ॥31॥**

హిమవంతుడనేక బహుమానాలను పొంది, మేనకాదేవిని చక్కగా వివాహమాడి, తన భవనానికి వచ్చి, ఆనందాన్ని పొందాడు.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**మేనయా హి హిమాగస్య సువివాహో మునీశ్వర ।**
**ప్రోక్తో మే సుఖదః ప్రీత్యా కిం భూయః శ్రోతుమిచ్ఛసి ॥32॥**

ఓ మహర్షీ! హిమవంతునకు మేనకాదేవితో జరిగిన దివ్యమైన సుఖప్రదమైన వివాహాన్ని ప్రీతితో వర్ణించి చెప్పియున్నాను. ఇంకను నీవేమి వినగోరుచున్నావు?

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే హిమాచల వివాహవర్ణనం నామ ప్రథమోఽధ్యాయః ॥1॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో హిమాచల వివాహవర్ణనం అనే మొదటి అధ్యాయం సమాప్తం.

## ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయం

## పూర్వగతివర్ణనమ్ - పూర్వగతివర్ణనం

**నారద ఉవాచ** -నారదుడు చెప్పాడు.

**విధే! ప్రాజ్ఞ! వదేదానీం మేనోత్పత్తిం సమాదరాత్ ।**
**అపి శాపం సమాచక్ష్వ కురు సందేహభంజనమ్ ॥1॥**

హే విధీ! హే ప్రాజ్ఞా! ఇప్పుడు మేనకాదేవియొక్క జన్మవృత్తాంతాన్ని గూర్చియు, శాపాన్ని గూర్చియు సవిస్తరంగా తెలియజేసి, నా సందేహాలను నివృత్తి చేయండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**శ్రుణు నారద సుప్రీత్యా మేనోత్పత్తిం వివేకతః ।**
**మునిభిః సహ వక్ష్యేఽహం సుతవర్య మహాబుధ ॥2॥**

ఓ నారదా! నీవు నా కుమారులలో శ్రేష్ఠుడవు. మహాపండితుడవు. నీకు మేనాదేవియొక్క జన్మవృత్తాంతాన్ని వివరంగా తెలియజేస్తాను. మునులతోగూడి, ప్రీతితో వినుము.

**దక్షనామా మమ సుతో యః పురా కథితో మునే ।**
**తస్య జాతాః సుతాః షష్టి ప్రమితాస్సృష్టికారణాః ॥3॥**

ఓ మహర్షీ! నా కుమారుడైన దక్షుని గూర్చి నీకు పూర్వమే చెప్పియున్నాను. అతనికి అరవై మంది కుమార్తెలు కలిగారు. వారే ఈ సృష్టికి కారణభూతులయ్యారు.

**తాసాం వివాహ మకరోత్స వరైః కశ్యపాదిభిః ।**
**విదితం తే సమస్తం తత్ప్రస్తుతం శ్రుణు నారద ॥4॥**

ఓ నారదా! వారిని కశ్యపాదులైన వరులకిచ్చి వివాహం చేసిన వృత్తాంతమంతయు నీకు తెలిసినదే. ప్రస్తుతమైన మేనాదేవి గాథను వినుము.

**తాసాం మధ్యే స్వధా నామ్నీం పితృభ్యో దత్తవాన్ సుతామ్ ।**
**తిస్రో భవన్సుతాస్తస్యా స్సుభగా ధర్మమూర్తయః ॥5॥**

ఆ అరవైమంది కుమార్తెలలో 'స్వధ' అను పేరుగల కుమార్తెను పితృదేవతలకిచ్చి వివాహం చేశాడు. ఆమెకు సుందరీమణులు, ధర్మమూర్తులు నైన ముగ్గురు కుమార్తెలు కలిగారు.

**తాసాం నామాని శ్రుణు మే పావనాని మునీశ్వర ।**
**సదా విఘ్న హరాణ్యేవ మహామంగళదాని చ ॥6॥**

మునీశ్వరా! పావనమైనట్టియు, విఘ్నహరములైనట్టియు, మహామంగళకరము లైనట్టియు, వారి పేర్లను చెబుతాను విను.

**మేనా నామ్నీ సుతా జ్యేష్ఠా మధ్యా ధన్యా కళావతీ ।**
**అంత్యా ఏతాస్సుతాస్సర్వాః పితౄణాం మానసోద్భవాః ॥7॥**

పెద్ద కుమార్తెపేరు 'మేన'. మధ్య కుమార్తె 'ధన్య'. చివరి కుమార్తె పేరు 'కళావతి'. ఈముగ్గురు పితృదేవతల మానసిక పుత్రికలు.

**అయోనిజాః స్వధాయాశ్చ లోకతస్తత్సుతా మతాః ।**
**ఆసాప్రోచ్య సునామాని సర్వాన్ కామాన్ జనో లభేత్ ॥8॥**

వీరు అయోనిజలు. కాని లోకంలో స్వధాదేవి కుమార్తెలుగానే విఖ్యాతులయ్యారు. వీరి పవిత్ర నామాల నుచ్చరించినచో జనులు సమస్త కోర్కెలను పొందుతారు.

**జగద్వంద్యాః సదా లోకమాతరః పరమోదదాః ।**
**యోగిన్యః పరమా జ్ఞాననిధానా స్త్రి స్త్రిలోకగాః ॥9॥**

వీరు జగద్వంద్యలు. ముల్లోకాలకు తల్లులు. మిక్కిలి పరమా ఆనందాన్ని కల్గించువారు. యోగినులు. పరమ జ్ఞాననిధులు. వీరు ముల్లోకాలలోను సంచరింపగలవారలు.

**ఏకస్మిన్సమయే తిస్రో భగిన్యస్తా మునీశ్వర ।**
**శ్వేతద్వీపం విష్ణులోకం జగ్ముర్దర్శనహేతవే ॥10॥**

ఓ మునీశ్వరా! ఒకనాడు ఈ ముగ్గురు సోదరీమణులు విష్ణువును దర్శించడానికి శ్వేతద్వీపానికి వెళ్ళారు.

**కృత్వా ప్రణామం విష్ణోశ్చ సంస్తుతిం భక్తిసంయుతాః ।**
**తస్థుస్తదాజ్ఞయా తత్ర సు సమాజో మహానభూత్ ॥11॥**

అచ్చట వారు విష్ణువునకు ప్రణమిల్లి భక్తిసంయుతులై సంస్తుతించి నిలబడ్డారు. విష్ణువు ఆజ్ఞచే అచ్చట ఒక మహాసభ నిర్వహించడానికి సమాయత్తమౌతోంది.

**తదైవ సనకాద్యాస్తు సిద్ధా బ్రహ్మసుతా మునే ।**
**గతాస్తత్ర హరిం నత్వా స్తుత్వా తస్థుస్తదాజ్ఞయా ॥12॥**

ఓ మునీ! బ్రహ్మపుత్రులైన సనకాది సిద్ధులు అప్పుడచ్చటికి విచ్చేశారు. విష్ణువునకు నమస్కరించి, స్తుతించి, ఆయన ఆజ్ఞచే వారక్కడనే ఉన్నారు.

**సనకాద్యాన్మునీ న్దృష్ట్వోత్తస్థుస్తే సకలాద్రుతమ్ ।**
**తత్రస్థాన్ సంస్థితాన్నత్వా దేవాద్యాం ల్లోకవందితాన్ ॥13॥**

సనకాది మహర్షులను చూచిన సభాసదులందరు శీఘ్రంగా లేచి నిలబడ్డారు. ఆ మహర్షులు అచ్చటనున్న దేవతలను, లోకపూజితులైన తక్కిన మహర్షులను దర్శించి, నమస్కరించారు.

**తిస్రో భగిన్యస్తాం స్తత్ర నోత్తస్థు ర్మోహితా మునే ।**
**మాయయా దైవవివశా శ్శంకరస్య పరాత్మనః ॥14॥**

ఓ నారదమునీ! ఆ సభలో ఆసీనులైన ఆ ముగ్గురు సోదరీమణులు మాత్రము శంకర మాయా మోహితులై, వివశులైనందున లేచి నిలబడలేదు.

**మోహినీ సర్వలోకానాం శివమాయా గరీయసీ ।**
**తదధీనం జగత్సర్వం శివేచ్ఛా సా ప్రకీర్త్యతే ॥15॥**

సమస్త లోకాలను మోహింపజేయగల శివమాయ మిక్కిలి బలమైనది. ఈ జగత్తంతయు ఆ శివమాయకు అధీనమై ఉన్నది. ఆ శివమాయనే లోకంలో 'శివుని సంకల్పశక్తి' అని కీర్తిస్తారు.

**ప్రారబ్ధం ప్రోచ్యతే సైవ తన్నామాని హ్యనేకశః ।**
**శివేచ్ఛయా భవత్యేవ నాత్రకార్యా విచారణా ॥16॥**

ఆ మాయకే ప్రారబ్ధమను పేరుకూడ కలదు. ఆ మాయకు అనేక నామాలున్నాయి. అది శివుని ఇచ్ఛానుసారము లోకాలను మోహింపజేస్తుంది. దీని విషయంలో విచారణ చేయగలిగినదేదియు లేదు.

**భూత్వా తద్వశగాస్తా వై న చక్రురపి తన్నతిమ్ ।**
**విస్మితా స్సంప్రదృశ్యైవ సంస్థితాస్తత్ర కేవలమ్ ॥17॥**

ఆ ముగ్గురు సోదరీమణులు ఆ మాయకు వశులై ఆ మహర్షులను చూచినప్పటికి విస్మితులై అట్లే కూర్చొని ఉన్నారే గాని లేచి వారికి నమస్కరించలేదు.

**తాదృశీం తద్గతిం దృష్ట్వా సనకాద్యా మునీశ్వరాః ।**
**జ్ఞానినోఽపి పరం చక్రుః క్రోధం దుర్విషహం చ తే ॥18॥**

సనకాది మహర్షులు జ్ఞానులైనప్పటికిని ఆ సోదరీమణుల ఆ స్థితినిచూచి, మిక్కిలి క్రోధాన్ని పొందారు.

**శివేచ్ఛా మోహితస్తత్ర సక్రోధస్తా ఉవాచ హ ।**
**సనత్కుమారో యోగీశ శ్శాపం దండకరం దదన్ ॥19॥**

శివేచ్ఛా మోహితుడైన సనత్కుమారుడను యోగి కోపించి దండరూపమైన శాపమునిచ్చువాడై వారితో ఇలా పలికాడు.

**సనత్కుమార ఉవాచ –** సనత్కుమారుడు పలికాడు.

**యూయం తిస్రో భగిన్యశ్చ మూఢాః సద్వయునోజ్ఝితాః ।**
**అజ్ఞాత శ్రుతి తత్త్వాహి పితృకన్యా అపి ధ్రువమ్ ॥20॥**

మీరు ముగ్గురు అక్కాచెల్లెండ్రు మూర్ఖులు. మీలో యోగ్యమైన జ్ఞానంలేదు. మీరు పితృదేవతలకు కుమార్తెలైనను మీకు వేదతాత్పర్యం ఎరుకలేదనుట నిశ్చయం.

**అభ్యుత్థానం కృతం నో యన్నమస్కారోఽపి గర్వతః ।**
**మోహితా నరభావత్వాత్ స్వర్గాద్దూరా భవన్తు హి ॥21॥**

మీరు గర్వంచే లేచి నిలబడలేదు. నమస్కరించలేదు. మోహితులైన మీరు మానవశరీరాలను పొంది, స్వర్గానికి దూరమౌదురు గాక!

**నరస్త్రియః సంభవంతు తిస్రోఽపి జ్ఞానమోహితాః ।**
**స్వకర్మణః ప్రభావేణ లభధ్వం ఫలమీదృశమ్ ॥22॥**

జ్ఞానంనుండి వంచితులైన మీరు ముగ్గురు మానవ స్త్రీలై జన్మించెదరుగాక! మీరు చేసుకొన్న కర్మప్రభావం చేతనే మీకిట్టి ఫలం లభిస్తోంది.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య చ సాధ్వస్తా స్తిస్రోఽపి చకితా భృశమ్ ।**
**పతిత్వా పాదయోస్తస్య సమూచూర్నత మస్తకాః ॥23॥**

జ్ఞానంనుండి వంచితలైనవారును, మిక్కిలి భయపడినవారును, తలవంచుకున్నవారునునైన ఆ ముగ్గురు ఆ శాపవాక్యాలను విని, అతని పాదాలపైపడి ఇలా పలికారు.

**పితృతనయా ఊచుః –** పితృతనయలు పలికారు.

**మునివర్య దయాసింధో ప్రసన్నో భవ చాధునా ।**
**త్వత్ప్రణామం వయం మూఢాః కుర్మహే స్మ న భావతః ॥24॥**

ఓ మునివర్యా! ఓ దయాసముద్రుడా! నీవిప్పుడు ప్రసన్నుడవు కమ్ము. మూర్ఖులమైన మేము నీకు నమస్కరింపలేకపోయితిమి. దానికి కారణము అనాదర భావన కాదు.

**ప్రాప్తంచ తత్ఫలం విప్ర న తే దోషో మహామునే ।**
**అనుగ్రహం కురుష్వాత్ర లభేమ స్వర్గతిం పునః ॥25॥**

ఓ మహామునీ! మా తప్పునకు ఫలాన్ని మేము పొందియున్నాము. ఇందులో మీ దోషమేమియు లేదు. కాని మేము తిరిగి స్వర్గవాసమును పొందునట్లు మమ్మనుగ్రహింపుడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**శ్రుత్వా తద్వచనం తాత ప్రోవాచ స మునిస్తదా ।**
**శాపోద్ధారం ప్రసన్నాత్మా ప్రేరితః శివమాయయా ॥26॥**

వత్సా! వారి మాటలను విని అప్పుడా మహర్షి ప్రసన్నాత్ముడై, శివమాయా ప్రేరితుడై, వారికి శాపోద్ధారాన్ని ఇలా చెప్పాడు.

**సనత్కుమార ఉవాచ** – సనత్కుమారుడు పలికాడు.

**పితౄణాం తనయాస్తిస్రః శ్రుణుత ప్రీతమానసాః ।**
**వచనం మమ శోకఘ్నం సుఖదం సర్వదైవ వః ॥27॥**

పితృదేవతల కుమార్తెలైన మీరు ముగ్గురు ప్రీతమానసులై వినండి. నాయీమాటలు మీ శోకాన్ని పోగొట్టి, ఎల్లప్పుడు మీకు సుఖాన్ని ఈయగలవు.

**విష్ణోరంశస్య శైలస్య హిమాధారస్య కామినీ ।**
**జ్యేష్ఠా భవతు తత్కన్యా భవిష్యత్యేవ పార్వతీ ॥28॥**

మీలో జ్యేష్ఠురాలు, విష్ణువు యొక్క అంశలో జన్మించిన హిమవంతునికి భార్య అగుగాక! వారికి 'పార్వతి' యను కన్య ఉదయించగలదు.

**ధన్యా ప్రియా ద్వితీయా తు యోగినీ జనకస్య చ ।**
**తస్యాః కన్యా మహాలక్ష్మీర్నామ్నా సీతా భవిష్యతి ॥29॥**

మీలో రెండవది, యోగినియునైన 'ధన్య' జనకునకు ప్రియురాలు కాగలదు. వారికి 'సీత' అను పేరుతో శ్రీమహాలక్ష్మి కుమార్తె కాగలదు.

**వృషభానస్య వైశ్యస్య కనిష్ఠా చ కళావతీ ।**
**భవిష్యతి ప్రియా రాధా తత్సుతా ద్వాపరాంతతః ॥30॥**

మీలో కనిష్ఠురాలైన కళావతి వృషభానుడను వైశ్యుని వివాహమాడి ద్వాపరాంతంలో 'రాధ' అను కుమార్తెను పొందగలదు.

**మేనకా యోగినీ పత్యా పార్వత్యాశ్చ వరేణ చ ।**
**తేన దేహేన కైలాసం గమిష్యతి పరం పదమ్ ॥31॥**

యోగినియైన మేనకాదేవి పార్వతీదేవి వరంచే భర్తతోగూడి, పరమపదమైన కైలాసాన్ని ఆ శరీరంతోనే పొందగలదు.

**ధన్యా చ సీతయా సీరధ్వజో జనకవంశజః ।**
**జీవన్ముక్తో మహాయోగీ వైకుంఠం చ గమిష్యతి ॥32॥**

జనకవంశంలో జన్మించినట్టియు, జీవన్ముక్తుడైనట్టియు, మహాయోగియైనట్టియు సీరధ్వజుడు అతని పత్నియైన ధన్యయు, సీతాదేవితోగూడి వైకుంఠాన్ని పొందగలరు.

**కళావతీ వృషభానస్య కౌతుకాత్కన్యయా సహ ।**
**జీవన్ముక్తా చ గోలోకం గమిష్యతి న సంశయః ॥33॥**

వృషభానుని వివాహమాడిన కళావతి జీవన్ముక్తురాలై తన కుమార్తెయైన రాధతో గూడి, గోలోకాన్ని పొందగలదనుటలో సందేహం లేదు.

**వినావిపత్తిం మహిమా కేషాం కుత్ర భవిష్యతి ।**
**సుకర్మిణాం గతే దుఃఖే ప్రభవేద్దుర్లభం సుఖమ్ ॥34॥**

కష్టముల ననుభవింపని వారికెవ్వరికైనను ఎక్కడనైనను అభ్యున్నతిలేదు. సుకర్మలు చేయువారికి దుఃఖం దూరం కాగానే దుర్లభమైన సుఖం లభిస్తుంది.

**యూయం పితౄణాం తనయాస్సర్వా స్స్వర్గ విలాసికాః ।**
**కర్మక్షయశ్చ యుష్మాకమభవద్విష్ణుదర్శనాత్ ॥35॥**

పితృదేవతల కుమార్తెలైన మీరు స్వర్గంలో విలాసవంతంగా ఉన్నవారు విష్ణుదర్శనం వల్ల మీకు కర్మక్షయ మయ్యింది.

**ఇత్యుక్త్వా పునరప్యాహ గతక్రోధో మునీశ్వరః ।**
**శివం సంస్మృత్య మనసా జ్ఞానదం భుక్తిముక్తిదమ్ ॥36॥**

అని పలికి, తొలగిన క్రోధంగల ఆ మునీశ్వరుడు జ్ఞానాన్ని, ముక్తిని, భుక్తిని, ప్రసాదించే శివుని మనసా స్మరించి, మళ్ళీ ఇలాపలికాడు.

**అపరం శ్రుణుత ప్రీత్యా మద్వచః సుఖదం సదా ।**
**ధన్యా యూయం శివప్రీతా మాన్యాః పూజ్యాహ్యభీక్ష్ణశః ॥37॥**

నేను మీకెల్లప్పుడూ సుఖమునిచ్చే మరియొక మాటను చెబుతాను, ప్రీతితో వినండి. శివుని ప్రీతికి పాత్రులైన మీరు ధన్యులు, మాన్యులు మరియు అత్యంత పూజనీయులు.

**మేనాయాస్తనయాదేవీ పార్వతీ జగదమ్బికా ।**
**భవిష్యతి ప్రియా శంభోస్తపః కృత్వా సుదుస్సహమ్ ॥38॥**

మేనాదేవి యొక్క కుమార్తెయైన పార్వతీదేవి మిక్కిలి దుస్సహమైన తపస్సుచేసి, శివుని ప్రియురాలై జగన్మాత కాగలదు.

**ధన్యా సుతా స్మృతా సీతా రామపత్నీ భవిష్యతి ।**
**లౌకికాచారమాశ్రిత్య రామేణ విహరిష్యతి ॥39॥**

ధన్యయొక్క కుమార్తె 'సీత' అనుపేరుతో రామునకు భార్యయై, లోకాచారమునను సరించి, రామునితోగూడి విహరించగలదు.

**కళావతీ సుతా రాధా సాక్షాద్గోలోకవాసినీ ।**
**గుప్త స్నేహ నిబద్ధా సా కృష్ణపత్నీ భవిష్యతి ॥40॥**

కళావతియొక్క కుమార్తె యైన రాధ కృష్ణునియందు రహస్య ప్రేమతోగూడి, జీవితమంతటిని గడిపి, గోలోకాన్ని పొంది, కృష్ణపత్ని కాగలదు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్థమాభాష్య స ముని ర్భ్రాతృభిస్సహ సంస్తుతః ।**
**సనత్కుమారో భగవాం స్తత్రైవాన్తర్హితోఽభవత్ ॥41॥**

అని ఇలా పరమపూజ్యుడగు సనత్కుమారుడు. సోదరులతో కూడినవాడై స్తుతింపబడి అక్కడే అంతర్ధానమైనాడు.

**తిస్రో భగిన్యస్తాస్తాత పితౄణాం మానసీః సుతాః ।**
**గతపాపాస్సుఖం ప్రాప్య స్వధామ ప్రయయుర్ద్రుతమ్ ॥42॥**

వత్సా! పితృదేవతల మానసిక పుత్రికలగు ఆ ముగ్గురు సోదరీమణులు తొలగిన పాపం కలవారై, సుఖాన్ని పొంది, వెంటనే తమ ధామానికి చేరారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే పూర్వగతివర్ణనం నామ ద్వితీయోఽధ్యాయః ॥2॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో పూర్వగతివర్ణనం అనే రెండవ అధ్యాయం సమాప్తం.

## తృతీయోఽధ్యాయః - మూడవ అధ్యాయం

## దేవీస్తుతిః - దేవీస్తుతి

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**విధే ప్రాజ్ఞ మహాధీమన్ వద మే వదతాం వర ।**
**తతఃపరం కిమభవచ్చరితం విష్ణు సద్గురో ॥1॥**

ఓ బ్రహ్మ! నీవు ప్రాజ్ఞుడవు. మహాధీమంతుడవు. వక్తలలో శ్రేష్ఠుడవు. విష్ణువు సద్గురువుగా కలవాడవు. తరువాత జరిగిన వృత్తాంతమును నాకు చెప్పుము.

**అద్భుతేయం కథా ప్రోక్తా మేనా పూర్వగతిః శుభా ।**
**వివాహశ్చ శ్రుత స్సమ్యక్పరమం చరితం వద ॥2॥**

శుభకరము, అద్భుతమునగు మేనకాదేవి పూర్వచరిత్రను చెప్పియున్నావు. ఆమె వివాహాన్ని గూర్చికూడా విన్నాను. తరువాతి చరిత్రను చెప్పుము.

**మేనాం వివాహ్య సగిరిః కృతవాన్ కిం తతః పరమ్ ।**
**పార్వతీ కథముత్పన్నా తస్యాం వై జగదంబికా ॥3॥**

హిమవంతుడు మేనాదేవిని వివాహమాడిన పిదప ఏమిచేశాడు? ఆమెయందు జగన్మాతయగు పార్వతీదేవి ఏవిధంగా పుట్టింది?

**తపస్సుదుస్సహం కృత్వా కథం ప్రాప పతిం హరమ్ ।**
**ఏతత్సర్వం సమాచక్ష్వ విస్తరాచ్ఛాంకరం యశః ॥4॥**

అనంతరం పార్వతీదేవి దుస్సహమైన తపస్సుచేసి, శివుని పతిగా పొందిన విధానమెట్టిది? శివుని యశస్సును వర్ణించే ఈ వృత్తాంతమంతటిని విస్తరంగా చెప్పండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**మునే త్వం శ్రుణు సుప్రీత్యా శాంకరం సుయశః శుభమ్ ।**
**యచ్ఛ్రుత్వా బ్రహ్మహా శుద్ధ్యేత్సర్వాన్కామానవాప్నుయాత్ ॥5॥**

నారదమునీ! శంకరుని శుభకరమైన పుణ్యకీర్తిని మిక్కిలి ప్రీతితో వినుము. ఈ చరిత్రను విన్నచో బ్రహ్మహత్య చేసినవాడైనను పవిత్రుడై, సమస్త కోరికలను పొందగలడు.

**యదా మేనా వివాహంతు కృత్వాగచ్ఛద్గిరిర్గృహమ్ ।**
**తదా సముత్సవో జాత స్త్రిషు లోకేషు నారద ॥6॥**

ఓ నారదా! మేనాదేవి హిమవంతుని వివాహమాడి, అతని గృహానికి వెళ్ళినప్పుడు ముల్లోకాలలో గొప్ప ఉత్సవం జరిగింది.

**హిమాచలోఽపి సుప్రీతశ్చకార పరమోత్సవమ్ ।**
**భూసురాన్ బంధువర్గాంశ్చ పరానానర్చ సద్ధియా ॥7॥**

హిమవంతుడుకూడా మిక్కిలి ఆనందించి, గొప్ప వేడుకలను నిర్వహించి, బ్రాహ్మణులను, బంధువులను, ఇతరులను కూడా మంచి మనస్సుతో పూజించాడు.

**సర్వే ద్విజాశ్చ సంతుష్టా దత్త్వాశీర్వచనం వరమ్ ।**
**యయుస్తస్మై స్వస్వధామ బంధువర్గాస్తథాపరే ॥8॥**

బ్రాహ్మణులు, బంధువులు, మరియు ఇతరులందరును సంతసించి, మహదాశీర్వచనాలను హిమవంతునకిచ్చి తమతమ స్థానాలకు మరలి వెళ్ళారు.

**హిమాచలోఽపి సుప్రీతో మేనయా సుఖదే గృహే ।**
**రేమేఽన్యత్ర చ సుస్థానే నందనాది వనేష్వపి ॥9॥**

హిమవంతుడుకూడా మిక్కిలి ఆనందించినవాడై, మేనాదేవితోకూడి, సుఖకరమైన గృహమునందు మాత్రమేగాక నందన వనాది సుందర ప్రదేశాలలోను, చక్కని స్థానాలలోను రమించాడు.

**తస్మిన్నవసరే దేవా మునే విష్ణ్వాదయోఽఖిలాః ।**
**మునయశ్చ మహాత్మానః ప్రజగ్ముర్భూధరాన్తికే ॥10॥**

ఆ సమయంలో విష్ణువు మున్నగు దేవతలందరు మరియు మహాత్ములైన మునులందరు, హిమవంతుని చెంతకు వెళ్ళారు.

**దృష్ట్వా తానాగతాన్ దేవాన్ ప్రణనామ ముదా గిరిః ।**
**సంమానం కృతవాన్ భక్త్యా ప్రశంసన్ స్వవిధిం మహాన్ ॥11॥**

వచ్చిన ఆ దేవతలనందరిని చూచి మహాత్ముడైన హిమవంతుడు తన భాగ్యాన్ని ప్రశంసిస్తూ ఆనందంతో వారికి ప్రణమిల్లి భక్తితో వారిని సన్మానించాడు.

**సాంజలిర్నతశీర్షో హి స తుష్టావ సుభక్తితః ।**
**రోమోద్గమో మహానాసీద్గిరేః ప్రేమాశ్రవోఽపతన్ ॥12॥**

అతడు భక్తితో కృతాంజలియై శిరస్సువంచి స్తుతించాడు. హిమవంతునకు ఆనందంతో గగుర్పాటు కలుగుటయేగాక ప్రేమపూర్వకమైన కన్నీరుకూడా స్రవించింది.

**తతః ప్రణమ్య సుప్రీతో హిమశైలః ప్రసన్నధీః ।**
**ఉవాచ ప్రణతో భూత్వా మునే విష్ణ్వాదికాన్సురాన్ ॥13॥**

అంతట సుప్రీతుడైన హిమవంతుడు ప్రసన్నాత్ముడై, విష్ణ్వాది దేవతలకు ప్రణమిల్లి వారితో ఇలా పలికాడు.

**హిమాచల ఉవాచ -** హిమాచలుడు చెప్పాడు.

**అద్య మే సఫలం జన్మ సఫలం సుమహత్తపః ।**
**అద్య మే సఫలం జ్ఞానమద్య మే సఫలాః క్రియాః ॥14॥**

ఈనాడు నాజన్మ సఫలమయ్యింది. నేను చేసిన గొప్ప తపస్సు ఫలించింది. నాజ్ఞానం ఈనాడు సార్థకమయ్యింది. నేను చేసిన పుణ్యకర్మల ఫలం ఈనాడు నాకు లభించింది.

**ధన్యోఽహమద్య సంజాతో ధన్యా మే సకలా క్షితిః ।**
**ధన్యం కులం తథా దారాస్సర్వం ధన్యం న సంశయః ॥15॥**

నేనీనాడు ధన్యుడనయ్యాను. నాయీ భూభాగమంతా ధన్యమయ్యింది. అంతేకాదు నా వంశం, భార్య, సర్వం ధన్యమయ్యాయనడంలో సందేహం లేదు.

**యతః సమాగతా యూయం మిళిత్వా సర్వ ఏకదా ।**
**మాం నిదేశయత ప్రీత్యోచితం మత్వా స్వసేవకమ్ ॥16॥**

మీరందరు కలసి ఒకేమారు నావద్దకు రావడమే దానికి కారణం. నన్ను మీ సేవకునిగా తలంచి, ప్రీతితో ఉచిత రీతిని నన్ను మీ కార్యమునందు నియోగించండి.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇతిశ్రుత్వా మహీధ్రస్య వచనం తే సురాస్తదా ।**
**ఊచుర్విష్ణ్వాదయః ప్రీతాః సిద్ధిం మత్వా స్వకార్యతః ॥17॥**

హిమవంతుని మాటలను విని, విష్ణువు మున్నగు దేవతలందరు తమ కార్యం సిద్ధించిందని తలంచి, సంతసించినవారై అతనితో ఇలా పలికారు.

**దేవాఊచుః -** దేవతలు పలికారు.

**హిమాచల మహాప్రాజ్ఞ శ్రుణ్వస్మద్వచనం హితమ్ ।**
**యదర్థమాగతాస్సర్వే తద్బ్రూమః ప్రీతితో వయమ్ ॥18॥**

ఓ హిమవంతా! మహాప్రాజ్ఞా! మేము చెప్పే హితకరమైన వచనాలను విను. మేమందరము ఇక్కడకు ఏపనికొరకు వచ్చియున్నామో నీకు ప్రీతితో చెబుతాము. విను.

**యా పురా జగదంబోమా దక్షకన్యాఽభవద్గిరే ।**
**రుద్రపత్నీ హి సా భూత్వా సుక్రీడే సుచిరం భువి ॥19॥**

ఓ పర్వతరాజా! జగన్మాతయైన ఉమాదేవి పూర్వం దక్షుని కుమార్తెగా జన్మించి, రుద్రునకు భార్యయై, చిరకాలం భూమండలంలో క్రీడించింది.

**పితృతోऽనాదరం ప్రాప్య సంస్మృత్య స్వపణం సతీ ।**
**జగామ స్వపదం త్యక్త్వా తచ్ఛరీరం తదాంబికా ॥20॥**

ఆ సతీదేవి తండ్రిచే అవమానింపబడి, అంతకుపూర్వం తానుచేసిన ప్రతిజ్ఞను గుర్తుకు తెచ్చుకొని జగదంబిక ఆ దేహాన్ని త్యజించి, తన స్థానానికి వెళ్ళిపోయింది.

**సా కథా విదితా లోకే తవాపి హిమభూధర ।**
**ఏవం సతి మహాలాభో భవేద్దేవ గణస్య హి ॥21॥**

**సర్వస్య భవతశ్చాపి స్యుస్సర్వే తే వశాస్సురాః ॥22॥**

ఈ కథయంతయు లోకానికి తెలుసు. నీకుకూడా ఆ గాధ తెలుసుకదా! మేము తెలియజేసే విధంగా చేస్తే దేవతలందరికి మహాలాభం చేకూరుతుంది. నీకుకూడా గొప్ప ప్రయోజనం కలుగుతుంది. దేవతలందరు నీకు వశవర్తులై ఉంటారు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తేషాం హర్యాదీనాం గిరీశ్వరః ।**
**తథాస్త్వితి ప్రసన్నాత్మా ప్రోవాచ స చ సాదరమ్ ॥23॥**

విష్ణువు మొదలుగాగల దేవతల మాటలను వినిన పర్వతరాజు ప్రసన్నాత్ముడై, ఆనందంతో 'తథాస్తు' (అటులనే ఔగాక!) అని పలికాడు.

**అథ తే చ సమాదిశ్య తద్విధిం పరమాదరాత్ ।**
**స్వయం జగ్మశ్చ శరణముమాయా శ్శంకర స్త్రియః ॥24॥**

అంతట వారుకూడా మిక్కిలి ఆనందంతో విధివిధానమునంతటిని హిమవంతునకు బోధించి తాము శంకర పత్నియైన ఉమాదేవిని శరణుజొచ్చారు.

**సుస్థలే మనసా స్థిత్వా సస్మరు ర్జగదంబికామ్ ।**
**ప్రణమ్య బహుశస్తత్ర తుష్టువుః శ్రద్ధయా సురాః ॥25॥**

వారందరు మంచి స్థలంలో నిలబడి, ఆ జగదంబికను మనస్సులో స్మరించి, అనేక పర్యాయాలు ప్రణమిల్లి శ్రద్ధతో ఇలా స్తుతించారు.

**దేవాఊచుః –** దేవతలు పలికారు.

**దేవ్యుమే జగతామంబ శివలోక నివాసినీ ।**
**సదాశివప్రియే దుర్గే త్వాం నమామో మహేశ్వరి ॥26॥**

ఓ ఉమాదేవీ! జగదంబా! శివలోక నివాసినీ! సదాశివునకు ప్రియురాలవైన నీకు నమస్కారము. ఓ దుర్గాదేవీ! ఓ మహేశ్వరీ! నీకు నమస్కరించుచున్నాము.

**శ్రీశక్తిం పావనాం శాంతాం పుష్టిం పరమపావనీమ్ ।**
**వయన్నమామహే భక్త్యా మహదవ్యక్తరూపిణీమ్ ॥27॥**

పవిత్రము చేయునదియు, శాంతి స్వరూపురాలు, పుష్టిని కలిగించునదియు, పరమ పావనమైనదియు, మహారూపిణి యైనట్టియు, అవ్యక్తరూపిణి యైనట్టియు శ్రీశక్తికి మేము భక్తితో నమస్కరించుచున్నాము.

**శివాం శివకరాం శుద్ధాం స్థూలాం సూక్ష్మాం పరాయణామ్ ।**
**అంతర్విద్యా సువిద్యాభ్యాం సుప్రీతాం త్వాం నమామహే ॥28॥**

మంగళ స్వరూపురాలైనట్టియు, మంగళకరమైనట్టియు, శుద్ధమైనట్టియు, స్థూలమైనట్టియు, సూక్ష్మ మైనట్టియు, సర్వశ్రేష్ఠురాలైనట్టియు, మంచి విద్యలన్నింటియందును అంతర్విద్యయైనట్టియు నీకు మేము ప్రీతితో నమస్కరించుచున్నాము.

**త్వం శ్రద్ధా త్వం ధృతి స్త్వం శ్రీ స్త్వమేవ సర్వగోచరా ।**
**త్వం దీధితి స్సూర్యగతా స్వప్రపంచ ప్రకాశినీ ॥29॥**

శ్రద్ధవు నీవే, ధైర్యము నీవే అన్నింటియందును గోచరమగు శోభవు నీవే. సూర్యునియందుగల ప్రకాశము నీవే. నీ స్వరూపమైన ప్రపంచాన్ని ప్రకాశింపజేయునదికూడా నీవే.

**యాచ బ్రహ్మాండ సంస్థానే జగజ్జీవేషు యా జగత్ ।**
**ఆప్యాయయతి బ్రహ్మాది తృణాంతం త్వాం నమామహే ॥30॥**

ఏదేవి బ్రహ్మాండమే దేహంగా కలిగియున్నదో, బ్రహ్మాండంలోని ప్రాణులన్నింటిలో చలనశక్తి రూపంలో నున్నదో, బ్రహ్మగారినుండి తృణంవరకుగల సమస్త ప్రాణులను ఏదేవి సంతృప్తి పరచుచున్నదో అట్టి నిన్ను నమస్కరించుచున్నాము.

**గాయత్రీ త్వం వేదమాతా త్వం సావిత్రీ సరస్వతీ ।**
**త్వాం వార్తా సర్వజగతాం త్వం త్రయీం ధర్మరూపిణీ ॥31॥**

గాయత్రీదేవివి నీవే, వేదమాతవు నీవే, సవితృ మండలాధిష్ఠాన దేవతవైన సావిత్రీదేవివి నీవే. సరస్వతివినీవే, సమస్త ప్రాణులలోని వార్తాశక్తివి నీవే. ధర్మమూలమైన త్రయీవేద స్వరూపిణివి నీవే.

**నిద్రా త్వం సర్వభూతేషు క్షుధా తృప్తి స్త్వమేవ హి ।**
**తృష్ణా కాంతి శ్ఛవిస్తుష్టి స్సర్వానందకరీ సదా ॥32॥**

ప్రాణులన్నింటియందుండు నిద్ర, ఆకలి, మరియు తృప్తియు నీవే. ప్రాణులలోని తృష్ణ, కాంతి, తేజము, సంతోషము నీవే. ఎల్లప్పుడు అందరకు ఆనందాన్ని కలిగించేదికూడా నీవే.

**త్వం లక్ష్మీః పుణ్యకర్తృణాం త్వం జ్యేష్ఠా పాపినాం సదా ।**
**త్వం శాంతిః సర్వజగతాం త్వం ధాత్రీ ప్రాణపోషిణీ ॥33॥**

పుణ్యాత్ములకు లభించు లక్ష్మివి నీవే. పాపులకు నిశ్చయంగా సంప్రాప్తించు జ్యేష్ఠాదేవివి (దరిద్ర దేవతవు) నీవే, అన్నిలోకాలలోని సర్వప్రాణులలోని, శాంతివి నీవే, సర్వప్రాణులను పోషించు భూదేవివి నీవే.

**త్వం తత్త్వ రూపా భూతానాం పంచానామపి సారకృత్ ।**
**త్వం హి నీతిర్భృతాం నీతిర్వ్యవసాయ స్వరూపిణీ ॥34॥**

పంచభూతాలలోని సారతత్త్వము నీ స్వరూపమే, నీతిశాస్త్రజ్ఞుల మరియు నీతిమంతుల నీతియు నీవే. నిశ్చయాత్మకమగు బుద్ధి నీ స్వరూపమే.

**గీతిస్త్వం సామవేదస్య గ్రంథిస్త్వం యజుషాం హుతిః ।**
**ఋగ్వేదస్య తథా మాత్రాథర్వణస్య పరాగతిః ॥35॥**

సామవేదమునందలి గీతివి నీవే. గ్రంథివి నీవే. యజుర్వేదములోని ఆహుతి నీవే. ఋగ్వేదము యొక్క మాత్రవు నీవే. అధర్వణవేదముయొక్క పరమ తాత్పర్యము నీవే.

**సమస్త గీర్వాణ గణస్య శక్తి స్తమోమయీ ధాతృ గుణైక దృశ్యా ।**
**రజః ప్రపంచాత్తు భవైకరూపా యానశ్రుతా భవ్య కరీ స్తుతేహ ॥36॥**

నీవే సమస్త దేవతా బృందముల శక్తివి. నీవే తమోమయరూపవు. సృష్టిలో దృశ్యరూపమునీవే ధూళిమయ ప్రపంచంలో నీవే భవస్వరూపమని మేము విన్నము. మంగళప్రదమైన స్తోత్రములతో నీవు స్తుతింపబడుచున్నావు.

**సంసార సాగర కరాళ భవాంగ దుఃఖ నిస్తారకారి తరణిశ్చ నివీత హీనా ।**
**అష్టాంగయోగ పరిపాలన కేళిదక్షాం వింధ్యాగవాస నిరతాం ప్రణమామ తాం వై ॥37॥**

సంసార సముద్రంలో పుట్టడమనే భయంకరమైన దుఃఖాన్ని దాటించే నావవు నీవే. అజ్ఞానావరణ నీకు లేదు. అష్టాంగయోగాన్ని పాలించడమనే క్రీడలో సమర్థురాలవు నీవు. వింధ్యపర్వత నివాసంచే ప్రీతినిపొందు దేవికి నమస్కరించుచున్నాము.

**నాసాక్షి వక్త్ర భుజవక్షసి మానసే చ ధృత్యా సుఖాని వితనోషి సదైవ జంతోః ।**
**నిద్రేతి యాతి సుభగా జగతీ భవా నః సా నః ప్రసీదంతు భవస్థితిపాలనాయ ॥38॥**

ప్రాణులలో ముక్కు, కన్ను మున్నగు జ్ఞానేంద్రియములయందును, నోరు, భుజాలు మున్నగు కర్మేంద్రియములయందును, మనస్సు నందును, ఓజోరూపములోనుండి ప్రాణుల హృదయ పుండరీకములో

నివసించి, వారికి సదా సుఖాన్ని కలిగించేది నీవే. జగదేక సుందరివైన నీవు మాయందు నిద్రారూపంలో నున్నావు. అజ్ఞానరూపంలో నున్నావు. అట్టినీవు ఈ జగత్తుయొక్క ఉనికిని రక్షించి మమ్ములను పాలింపుము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి స్తుత్వా మహేశానీం జగదంబా ముమాం సతీమ్ ।**
**సుప్రేయమనసః సర్వే తస్థుస్తే దర్శనేప్సవః ॥39॥**

ఆ దేవతలందరు మహేశ్వరి, జగదంబ, సతీ దేహధారిణియైన ఉమాదేవిని ఈవిధంగా స్తుతించి మిక్కిలి ప్రీతితో నిండిన మనస్సు కలవారై ఆమెను దర్శించు కోరికతో అచ్చటనే వేచియున్నారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే దేవీస్తుతిర్నామ తృతీయోఽధ్యాయః ॥3॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో దేవీస్తుతి అనే మూడవ అధ్యాయం సమాప్తం.

## చతుర్థోఽధ్యాయః - నాలుగవ అధ్యాయం

## దేవసాన్త్వనమ్ - దేవతలను ఓదార్చుట

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్థం దేవైః స్తుతా దేవీ దుర్గా దుర్గార్తి నాశినీ ।**
**ఆవిర్బభూవ దేవానాం పురతో జగదంబికా ॥1॥**

భయంకరమైన విపత్తులను నశింపజేసే జగన్మాతయగు దుర్గాదేవి దేవతలచే ఈవిధంగా స్తుతింపబడినదై వారియెదుట సాక్షాత్కరించింది.

**రథే రత్నమయే దివ్యే సంస్థితా పరమాద్భుతే ।**
**కింకిణీజాల సంయుక్తే మృదుసంస్మరణే వరే ॥2॥**

రత్నమయము, దివ్యము, పరమాద్భుతము, చిరుగంటల తోరణాలతో కూడినది, మెత్తని పరుపులు అమర్చబడినదియునైన శ్రేష్ఠమైన రథంలో ఆమె కూర్చుండియున్నది.

**కోటి సూర్యాధికాభాస రమ్యావయవభాసినీ ।**
**స్వ తేజో రాశిమధ్యస్థా వరరూపా సమచ్ఛవిః ॥3॥**

ఆమె సుందరమైన అవయవాలు కోటి సూర్యులకంటె అధికమైన కాంతితో ప్రకాశిస్తున్నాయి. ఆమె తననుండి ఉద్భవమైన తేజోరాశి మధ్యలో నున్నది. దివ్యమైన రూపంగల ఆమె సౌందర్యం సాటిలేనిది.

**అనూపమా మహామాయా సదాశివ విలాసినీ ।**
**త్రిగుణా నిర్గుణా నిత్యా శివలోకనివాసినీ ॥4॥**

సదాశివుని పత్నియై, శివలోక నివాసినియైన ఆ మహామాయ త్రిగుణాత్మకమైనది. మరియు నిర్గుణ స్వరూపిణియు, నిత్యురాలును, మరొకరితో పోలికలేనిది.

**త్రిదేవ జననీ చండీ శివా సర్వార్తినాశినీ ।**
**సర్వమాతా మహానిద్రా సర్వస్వజనతారిణీ ॥5॥**

ఆ చండి త్రిమూర్తులకు జనని, సమస్తమైన కష్టాలను నాశనంచేసి మంగళములను కలిగిస్తుంది. ఆమె సర్వప్రాణులకు తల్లి. ఆమె మహానిద్రా స్వరూపిణి. ఆమె తన భక్తులనందరిని సంసారంనుండి తరింపజేస్తుంది.

**తేజోరాశేః ప్రభావాత్తు సా తు దృష్ట్వా సురైశ్శివా ।**
**తుష్టువుస్తాం పునస్తే వై సురాదర్శనకాంక్షిణః ॥6॥**

తేజోరాశి రూపంలోనున్న ఆమెను చూచిన దేవతలు, మరల సుస్పష్టంగా దర్శించాలనే కోరికతో ఆమెను ప్రార్థించారు.

**అథ దేవగణాస్సర్వే విష్ణ్వాద్యా దర్శనేప్సవః ।**
**దదృశుర్జగదంబాం తాం తత్కృపాం ప్రాప్య తత్ర హి ॥7॥**

ఆమెను దర్శించాలను కోరికగల విష్ణువు మున్నగు దేవతలందరు ఆమె కరుణను పొంది, అక్కడే ఆ జగన్మాతను దర్శించగలిగారు.

**బభూవానంద సందోహస్సర్వేషాం త్రిదివౌకసామ్ ।**
**పునఃపునః ప్రణేముస్తాం తుష్టువుశ్చ విశేషతః ॥8॥**

ఆమె దర్శనంచేత దేవతలకందరికి ఆనంద సందోహం కలిగింది. వారామెకు అనేక పర్యాయాలు నమస్కరించి, విశేషంగా స్తుతించారు.

**దేవాఊచుః** – దేవతలు పలికారు.

**శివే శర్వాణి కల్యాణి జగదంబ మహేశ్వరి ।**
**త్వాం నతాస్సర్వథా దేవా వయం సర్వార్తినాశినీమ్ ॥9॥**

హే శివే! శర్వుని రాణీ! కల్యాణ స్వరూపురాలా! జగన్మాతా! మహేశ్వరీ! ఆపదలన్నింటిని తొలగించేనీకు దేవతలమైన మేము సర్వవిధముల నమస్కరించుచున్నాము.

**నహి జానంతి దేవేశి వేదాశ్శాస్త్రాణి కృత్స్నశః ।**
**అతీతో మహిమా ధ్యానం తవ వాఙ్మనసోశ్శివే ॥10॥**

ఓ దేవేశీ! వేదశాస్త్రాలు నీ స్వరూపాన్ని సమగ్రంగా తెలుపజాలవు. నీమహిమను ధ్యానించుట వాక్కుకు మనస్సుకు అందనిది.

**అతద్వ్యావృత్తితస్త్వాం వై చకితం చకితం సదా ।**
**అభిధత్తే శ్రుతిరపి పరేషాం కా కథా మతా ॥11॥**

శ్రుతికూడా భయపడుతూ నీ స్వరూపాన్ని సాక్షాత్తుగాగాక, 'నేతి నేతి' వాక్యాలచే నిషేధముఖంగా మాత్రమే చెప్పగలుగుతోంది. అట్టితరి ఇతరులగురించి చెప్పేదేమున్నది?

**జానంతి బహవో భక్తా స్త్వత్కృపాం ప్రాప్య భక్తితః ।**
**శరణాగతభక్తానాం న కుత్రాపి భయాదికమ్ ॥12॥**

నీ కృప పొందిన భక్తులెందరో భక్తిప్రభావంవల్ల నిన్ను తెలుసుకోగలరు. నిన్ను శరణుజొచ్చిన భక్తులకు ఎక్కడనైనను భయాదులుండవు.

**విజ్ఞప్తిం శృణు సుప్రీతా యస్యా దాసా స్సదాంబికే ।**
**తవ దేవి మహాదేవి హీనతో వర్ణయామహే ॥13॥**

ఓ అంబికా! నీవు సుప్రీతవై మా విన్నపాన్నివిను. ఓదేవీ! మహాదేవీ! నీకు మేము సదా దాసులము. నీ మహిమను మేము కొద్దిగా మాత్రమే వర్ణించగలము.

**పురా దక్షసుతా భూత్వా సంజాతా హరవల్లభా ।**
**బ్రహ్మణశ్చ పరేషాం వా నాశయత్త్వమ కం మహత్ ॥14॥**

పూర్వం నీవు దక్షుని కుమార్తెగా జన్మించి, హరునకు భార్యవయ్యావు. ఆ సమయంలో నీవు బ్రహ్మకు, తదితరులకు, మహాదుఃఖాన్ని నివారించావు.

**పితృతోఽనాదరం ప్రాప్యాత్యజః పణవశాత్తనుమ్ ।**
**స్వలోక మగమ స్త్వం వా లభద్దుఃఖం హరోఽపి హి ॥15॥**

నీవు తండ్రివలన అనాదరాన్ని పొంది ప్రతిజ్ఞానుసారంగా దేహాన్ని త్యజించి నీలోకాన్ని చేరావు. ఆ విషయంలో శివుడు గూడ ఎంతయో దుఃఖించాడుకదా!.

**నహి జాతం ప్రపూర్ణం తద్దేవకార్యం మహేశ్వరి ।**
**వ్యాకులా మునయో దేవా శ్శరణం త్వాం గతావయమ్ ॥16॥**

ఓ మహేశ్వరీ! ఆ దేవకార్యం పూర్తికాలేదు. మహర్షులతో కూడిన మేము దుఃఖితులమై నిన్ను శరణుజొచ్చాము.

**పూర్ణం కురు మహేశాని నిర్జరాణాం మనోరథమ్ ।**
**సనత్కుమారవచనం సఫలం స్యాద్యథా శివే ॥17॥**

ఓ మహేశ్వరీ! దేవతల మనోరథాన్ని నెరవేర్చు. సనత్కుమారుని పలుకులను సఫలమౌనట్లు చేయుము.

**అవతీర్య క్షితౌ దేవి రుద్రపత్నీ పునర్భవ ।**
**లీలాం కురు యథాయోగ్యం ప్రాప్నుయుర్నిర్జరా స్సుఖమ్ ॥18॥**

ఓ దేవి! నీవు మరల భూలోకమందవతరించి, రుద్రుని భార్యవు కమ్ము. నీవు యథోచితమైన లీలలను ప్రదర్శించడంచేత దేవతలు సుఖాన్ని పొందగలరు.

**సుఖీస్యాద్దేవి రుద్రోఽపి కైలాసాచల సంస్థితః ।**
**సర్వే భవంతు సుఖినో దుఃఖం నశ్యతు కృత్స్నశః ॥19॥**

ఓ దేవీ! కైలాసమునందున్న రుద్రుడుకూడా నీ అవతారంచేత సుఖికాగలడు. అందరిదుఃఖం సంపూర్ణంగా తొలగిపోతుంది. అందరు సుఖాన్ని పొందగలరు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇతి ప్రోచ్యామరాస్సర్వే విష్ణ్వాద్యాః ప్రేమసంకులాః ।**
**మౌనమాస్థాయ సంతస్థుర్భక్తినమ్రాత్మమూర్తయః ॥20॥**

విష్ణువు మున్నగు దేవతలందరు ఈవిధంగా పలికి, ప్రేమనిండిన హృదయాలు కలవారైనందున మౌనంగా నున్నవారై, భక్తితో శిరస్సువంచి, నమస్కరిస్తూ నిలబడియున్నారు.

**శివాపి సుప్రసన్నాభూదాకర్ణ్యామర సంస్తుతిమ్ ।**
**ఆకలయ్యాథ తద్ధేతుం సంస్మృత్య స్వప్రభుం శివమ్ ॥21॥**

దేవతల స్తోత్రాన్ని వినిన ఉమాదేవికూడా మిక్కిలి ప్రసన్నురాలై వారి స్తోత్రానికిగల హేతువును తలంచి, తన ప్రభువైన శివుని స్మరించింది.

**ఉవాచోమా తదా దేవీ సంబోధ్య విబుధాంశ్చ తాన్ ।**
**విహస్య మాపతి ముఖాన్ సదయా భక్తవత్సలా ॥22॥**

అప్పుడు ఉమాదేవి చిరునవ్వు నవ్వింది. దయామూర్తి, భక్తవత్సలయునగు ఆమె విష్ణువు మున్నగు దేవతలనుద్దేశించి, ఇలా పలికింది.

**ఉమోవాచ –** ఉమ పలికింది.

**హే హరే హే విధే దేవా మునయశ్చ గతవ్యథాః ।**
**సర్వే శ్రుణుత మద్వాక్యం ప్రసన్నాహం న సంశయః ॥23॥**

ఓ విష్ణూ! ఓ బ్రహ్మ! ఓ దేవతలారా! మునులారా! మీరందరు భయాన్ని వీడి, నాయీమాటలను వినండి. నేను ప్రసన్నురాలనయ్యాను. ఇందులో సంశయం లేదు.

**చరితం మమ సర్వత్ర త్రైలోక్యస్య సుఖావహమ్ ।**
**కృతం మయైవ సకలం దక్షమోహాధికం చ తత్ ॥24॥**

నాచరిత్ర ముల్లోకాలలోని ప్రాణులకందరికి సుఖావహమైనది. దక్షుని మోహము మున్నగునవన్నియు నాచే కల్పింపబడినవే.

**అవతారం కరిష్యామి క్షితౌ పూర్ణం న సంశయః ।**
**బహవో హేతవోఽప్యత్ర తద్వదామి మహాదరాత్ ॥25॥**

నేను భువిపై పూర్ణాంశతో అవతరిస్తాను. ఇందులో సందేహంలేదు. ఆవిధంగా నేనవతరించడానికి అనేక కారణాలున్నాయి. శ్రద్ధతో నేను వాటిని మీకు వివరిస్తాను.

**పురా హిమాచలో దేవా మేనా చాతి సుభక్తితః ।**
**సేవాం మే చక్రతుస్తాత జననీవత్సతీ తనోః ॥26॥**

దేవతలారా! సతీరూపంలో నన్ను పుత్రికగా పొందడానికి దక్షుడు వీరిణి తపస్సు చేసిన విధంగానే పూర్వకాలంలో హిమవంతుడు మేనకాదేవి కూడా మిక్కిలి భక్తితో నన్ను ఆరాధించారు.

**ఇదానీం కురుతస్సేవాం సుభక్త్యా మమ నిత్యశః ।**
**మేనా విశేషతస్తత్ర సుతాత్వే నాత్ర సంశయః ॥27॥**

ఇప్పటి నుండి మీరు నిత్యము చక్కని భక్తితో నన్ను సేవిస్తూ ఉండండి. మేనాదేవి కూడా నన్ను విశేషంగా ఆరాధించుగాక! నేనామెకు కుమార్తెగా జన్మిస్తాను. ఇందులో సందేహం లేదు.

**రుద్రో గచ్ఛతు యూయం చావతారం హిమవద్గృహే ।**
**అతశ్చావతరిష్యామి దుఃఖనాశో భవిష్యతి ॥28॥**

అందువలన రుద్రుడు  మీరుగూడ వెళ్ళండి. హిమవంతుని గృహంలో నేను అవతరిస్తాను. దుఃఖనాశం కాగలదు.

**సర్వే గచ్ఛత ధామ స్వంస్వం సుఖం లభతాం చిరమ్ ।**
**అవతీర్య సుతాభూత్వా మేనాయాః దాస్యఉత్సుఖమ్ ॥29॥**

మీరందరు మీ స్థానాలకు వెళ్ళండి. మీరు చాలాకాలం సుఖాన్ని పొందుతారు. నేను మేనాదేవియందు కుమార్తెగా జన్మించి, ఆమెకు పరమానందాన్ని కలిగిస్తాను.

**హరపత్నీ భవిష్యామి సుగుప్తం మతమాత్మనః ।**
**అద్భుతా శివలీలా హి జ్ఞానినామపి మోహినీ ॥30॥**

నేను శివునకు పత్నినౌతాను. నాయందీకోరిక రహస్యంగా దాగియుంది. శివలీలలు మిక్కిలి అద్భుతమైనవి. అవి జ్ఞానులను కూడా మోహింపజేయగలవు.

**యావత్ప్రభృతి మేత్యక్తా స్వతనుర్దక్షజా సురాః ।**
**పితృతోఽనాదరం దృష్ట్వా స్వామిన స్తత్క్రతౌ గతా ॥31॥**

నేను నాతండ్రియైన దక్షుని యజ్ఞానికి వెళ్ళి, అచ్చట నా తండ్రి నా స్వామికి చేసిన అనాదరాన్ని చూచి, దక్షునివలన కలిగిన నా సతీదేహాన్ని త్యజించాను.

**తథాప్రభృతి స స్వామీ రుద్రః కాలాగ్నిసంజ్ఞకః ।**
**దిగంబరో బభూవాశు మచ్చిన్తన పరాయణః ॥32॥**

నాటినుండియు ఆ రుద్రస్వామి "కాలాగ్ని" అను పేరుతో నాయందలి చింతతో దిగంబరుడై యున్నాడు.

**మమ రోషం క్రతౌ దృష్ట్వా పితుస్తత్ర గతా సతీ ।**
**అత్యజత్ స్వతనుం ప్రీత్యా ధర్మజ్ఞేతి విచారతః ॥33॥**

**యోగ్యభూత్సదనం త్యక్త్వా కృత్వావేష మలౌకికమ్ ।**
**న సేహే విరహం సత్యా మద్రూపా యా మహేశ్వరః ॥34॥**

"సతి తండ్రిచేసే యజ్ఞానికి వెళ్ళి, అక్కడ నాకుజరిగిన అవమానాన్ని గాంచి, కోపాన్ని పొంది, తన దేహాన్ని త్యజించింది. ఆమె ధర్మజ్ఞురాలు". అని శివుడు తలపోసి గృహమును వీడి, అలౌకికమగు వేషాన్ని ధరించి, యోగియయ్యాడు. రుద్రుడు నా అవతారమైన సతీదేవియొక్క విరహాన్ని సహింపలేకపోయాడు.

**మమ హేతోర్మహాదుఃఖీ స బభూవ కువేషభృత్ ।**
**అత్యజత్స తదారభ్య కామజం సుఖముత్తమమ్ ॥35॥**

నాకారణంగా ఆయన ఆనాటినుండియు మహాదుఃఖాన్ని పొంది, మలిన వేషధారియై ఉత్తమ సుఖాలనన్నిటిని పరిత్యజించాడు.

**అన్యచ్ఛృణుత హే విష్ణో హే విధే మునయః సురాః ।**
**మహాప్రభో ర్మహేశస్య లీలాం భువనపాలినీమ్ ॥36॥**

ఓ విష్ణూ! ఓ విధీ! దేవతలారా! మునులారా! మరియొక మాటను వినండి. లోక రక్షకములైన మహేశ్వరుని లీలలను చెబుతాను.

**విధాయ మాలాం సుప్రీత్యా మమాస్థ్నాం విరహాకులః ।**
**న శాంతిం ప్రాప కుత్రాపి ప్రబుద్ధోఽప్యేక ఏవ సః ॥37॥**

విరహవ్యధతో కూడిన శివుడు జ్ఞానియైనప్పటికి ఏకాకి యౌటచే ఏ స్థానమునందైనను శాంతిని పొందలేకున్నాడు. ఆయన నా అస్థికలతో మాలను చేసుకొని దానిని మిక్కిలి ప్రీతితో ధరిస్తున్నాడు.

**ఇతస్తతో రురోదోచ్చైరనీశ ఇవ స ప్రభుః ।**
**యోగ్యాయోగ్యం న బుబుధే భ్రమన్సర్వత్ర సర్వదా ॥38॥**

ఆ ప్రభువు ప్రాకృత జనునివలె అటునిటు తిరుగుతు బిగ్గరగా ఏడుస్తూ దుఃఖ వశుడై యోగ్యాయోగ్యాలను తెలియకున్నాడు.

**ఇత్థం లీలాం హరోఽకార్షీద్దర్శయన్కామినాం ప్రభుః ।**
**ఊచే కాముకవద్వాణీం విరహవ్యాకులామివ ॥39॥**

శివుడీవిధంగా కాముకునివలె విరహదుఃఖంతో నిండిన పలుకులను పలుకుతూ కాముకుల ప్రవృత్తిని లోకానికి ప్రదర్శించువాడై తన లీలలను ప్రకటించాడు.

**వస్తుతోఽవికృతోఽదీనోఽస్త్యజితః పరమేశ్వరః ।**
**పరిపూర్ణః శివః స్వామీ మాయాధీశోఽఖిలేశ్వరః ॥40॥**

ఆ పరమేశ్వరుడు యథార్థముగా వికారముగాని, దైన్యముగాని లేనివాడు. అజేయుడు అయిన శివుడు పరిపూర్ణుడైన స్వామి. మాయను వశం చేసుకున్న సర్వేశ్వరుడు.

**అన్యథా మోహతస్తస్య కిం కామాచ్చ ప్రయోజనమ్ ।**
**వికారేణాపి కేనాశు మాయాలిప్తో న స ప్రభుః ॥41॥**

ఆయనకు కామంతోగాని, మోహంతోగాని, ఏమిప్రయోజనం? మాయాలిప్తుడుగాని ఆ ప్రభువునకు వికారము కలుగుటెట్లు సంభవము?

**రుద్రోఽతీవేచ్ఛతి విభుస్సమే కర్తుం కరగ్రహమ్ ।**
**అవతారం క్షితౌ మేనా హిమాచలగృహే సురాః ॥42॥**

ఆ రుద్రుడు నన్ను వివాహమాడాలని తీవ్రమైన కోరికను కలిగియున్నాడు. ఓ దేవతలారా! నేను మేనాహిమవంతుల ఇంట భువిపై అవతరించాలనికూడ ఆయన కోరుకుంటున్నాడు.

**అతశ్చావతరిష్యామి రుద్ర సంతోషహేతవే ।**
**హిమాగపత్న్యాం మేనాయా లౌకికీం గతిమాశ్రితా ॥43॥**

ఆ కారణంచేత రుద్రునకు సంతోషం కలిగించడానికి లౌకికమైన రీతిలో హిమవంతుని భార్యయైన మేనాదేవియందు అవతరిస్తాను.

**భక్తా రుద్రప్రియా భూత్వా తపఃకృత్వా సుదుస్సహమ్ ।**
**దేవకార్యం కరిష్యామి సత్యం సత్యం న సంశయః ॥44॥**

నేను భక్తితో సుదుస్సహమైన తపస్సును చేసి, రుద్రునకు పత్నినై దేవకార్యాన్ని పూర్తిగావిస్తాను. ఇది ముమ్మాటికి సత్యము. ఇందులో సందేహం లేదు.

**గచ్ఛత స్వగృహం సర్వే భవం భజత నిత్యశః ।**
**తత్కృపాతోఽఖిలం దుఃఖం వినశ్యతి నసంశయః ॥45॥**

మీరందరు మీమీ గృహాలకు వెళ్ళండి. ప్రతినిత్యము శివుని ఆరాధించండి. ఆయన కృపచే సమస్త దుఃఖాలు నశిస్తాయనడంలో సందేహం లేదు.

**భవిష్యతి కృపాళోఽస్తు కృపయా మంగళం సదా ।**
**వంద్యా పూజ్యా త్రిలోకేఽహం తజ్జాయేతి చ హేతుతః ॥46॥**

నేను దయానిధియగు ఆయన కృపచే ఆయనకు భార్యనై ఆకారణంచేత ముల్లోకాలలోను నమస్కరింపదగిన దానను, పూజ్యురాలను కాగలను. ఆయన కృపచే సమస్త శుభాలు సంపన్నం కాగలవు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా జగదంబా సా దేవానాం పశ్యతాం తదా ।**
**అంతర్దధే శివా తాత స్వం లోకం ప్రాప వై ద్రుతమ్ ॥47॥**

కుమారా! జగన్మాత ఈవిధంగా పలికి, దేవతలందరు చూచుచుండగానే అంతర్ధానమై తనలోకానికి చేరింది.

**విష్ణ్వాదయ స్సురాస్సర్వే మునయశ్చ ముదాన్వితాః ।**
**కృత్వా తద్దిశి సంనామం స్వస్వధామాని సంయయుః ।।48।।**

విష్ణువు మున్నగు దేవతలు, మునులందరు సంతోషంతో ఆమె వెళ్ళిన దిక్కువైపు నమస్కారంచేసి, తమ తమ స్థానాలకు వెళ్ళారు.

**ఇత్థం దుర్గా సుచరితం వర్ణితం తే మునీశ్వర ।**
**సర్వదా సుఖదం నృణాం భుక్తిముక్తిప్రదాయకమ్ ।।49।।**

మునీశ్వరా! ఈవిధంగా నీకు దుర్గాదేవి పుణ్యచరిత్రను వర్ణించి చెప్పాను. ఇది మానవులకు సర్వదా సుఖాన్ని, భుక్తిని, ముక్తిని ప్రదానం చేయగలదు.

**య ఇదం శ్రుణుయాన్నిత్యం శ్రావయేద్వా సమాహితః ।**
**పఠేద్వా పాఠయేద్వాపి సర్వాన్కామానవాప్నుయాత్ ।।50।।**

ఎవడు దీనిని ప్రతినిత్యం వింటాడో, స్థిరచిత్తంతో వినిపిస్తాడో, పఠిస్తాడో, పఠింపజేస్తాడో అట్టివాడు సర్వకామాలను పొందగలడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే దేవ సాన్త్వనమ్ నామ చతుర్థోఽధ్యాయః ।।4।।**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో దేవతలను ఓదార్చుట అనే నాలుగవ అధ్యాయం సమాప్తం.

## పంచమోఽధ్యాయః - ఐదవ అధ్యాయం

## మేనావరలాభవర్ణనమ్ - మేనావరలాభవర్ణనం

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**అంతర్హితాయాం దేవ్యాం తు దుర్గాయాం స్వగృహేషు చ ।**
**గతేష్వమరవృందేషు కిమభూత్తదనంతరమ్ ॥1॥**

దుర్గాదేవి అంతర్ధానమై దేవగణాలు తమతమ గృహాలకు వెళ్ళిన పిదప ఏమయ్యింది?

**కథం మేనా గిరీశౌ చ తేపాతే పరమన్తపః ।**
**కథం సుతాఽభవత్తస్య మేనాయాం తాత తద్వద ॥2॥**

మేనా హిమవంతులు తీవ్రమైన తపస్సును చేసిన తీరు ఎట్టిది? మేనయందు ఆయనకు కుమార్తె ఎట్లు జన్మించింది? ఆ వృత్తాంతాన్ని నాకు చెప్పుము.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**విప్రవర్య సుతశ్రేష్ఠ శ్రుణు తచ్చరితం మహత్ ।**
**ప్రణమ్య శంకరం భక్త్యా వచ్మి భక్తి వివర్ధనమ్ ॥3॥**

ఓ బ్రాహ్మణవర్యా! సుతశ్రేష్ఠా! ఆ గొప్ప చరిత్రను వినుము. భక్తిని పెంపొందించే ఆ చరిత్రను శంకరునకు భక్తితో నమస్కరించి నీకు చెబుతాను.

**ఉపదిశ్య గతే తాత సురవృన్దే గిరీశ్వరః ।**
**హర్యాదౌ మేనకాచాపి తేపాతే పరమం తపః ॥4॥**

కుమారా! విష్ణువు మున్నగు దేవతలు ఉపదేశించి వెళ్ళిన తరువాత పర్వతరాజు మేనకాదేవితో కలసి గొప్ప తపస్సు చేశాడు.

**అహర్నిశం శివాం శంభుం చింతయంతౌ చ దంపతీ ।**
**సమ్యగారేధతుర్నిత్యం భక్తియుక్తేన చేతసా ॥5॥**

రాత్రింబవళ్ళు ఆ దంపతులు ఉమాశంకరులను స్మరిస్తూ భక్తితో కూడిన మనస్సుతో ప్రతిదినము ఆరాధించారు.

**గిరిప్రియాతీవ ముదానర్చ దేవీం శివేన సా ।**
**దానం దదౌ ద్విజేభ్యశ్చ సదా తత్తోషహేతవే ॥6॥**

హిమవంతుని భార్యయైన మేనాదేవి ఆనందంతో దేవిని పూజించింది. శివునికూడా పూజించింది. ఉమాశంకరుల ప్రీతికై ప్రతినిత్యము బ్రాహ్మణులకు దానాలిచ్చేది.

**చైత్రమాసం సమారభ్య సప్తవింశతి వత్సరాన్ ।**
**శివాం సంపూజయామాస పత్న్యార్థిన్యన్వహం రతా ॥7॥**

సంతానార్థియైన మేనాదేవి చైత్రమాసమునందారంభించి, ఇరువదిఏడు సంవత్సరాలు ప్రతిదినం భక్తిశ్రద్ధలతో ఉమాదేవిని ఆరాధించింది.

**అష్టమ్యా ముపవాసంతు కృత్వా దాన్నవమీ తిథౌ ।**
**మోదకై ర్బలిపిష్టైశ్చ పాయసై ర్గంధపుష్పకైః ॥8॥**
**గంగాయా మౌషధి ప్రస్థే కృత్వా మూర్తిం మహీమయీమ్ ।**
**ఉమాయాః పూజయామాస నానావస్తు సమర్పణైః ॥9॥**

ఆమె అష్టమినాడు ఉపవాసంచేసి, మరునాడు నవమియందు దానాలను చేసేది. మోదకాలు, పాయసం, గంధపుష్పాదులతో ఉమాదేవిని అర్చించేది. ఆమె ఓషధీప్రస్థపురంలో గంగాతీరంలో మట్టితో ఉమాదేవి మూర్తినిచేసి, నానావస్తు సమర్పణతో పూజించేది.

**కదాచిత్సా నిరాహారా కదాచిత్సా ధృతవ్రతా ।**
**కదాచిత్పవనాహారా కదాచి జ్జలభుగ్ హ్యభూత్ ॥10॥**

ఆమె ఒక్కొక్కప్పుడు ఆహారమును తీసుకొనకుండాను, మరియొకప్పుడు దృఢవ్రతురాలై, మరొకప్పుడు, గాలిని భుజించి, ఒక్కొక్కప్పుడు జలమును మాత్రమే త్రాగి ఆరాధించేది.

**శివావిన్యస్త చేతస్కా సప్తవింశతి వత్సరాన్ ।**
**నినాయ మేనకా ప్రీత్యా పరం సా మృష్టవర్చసా ॥11॥**

గొప్ప తేజశ్శాలియైన మేనాదేవి ఉమాదేవిపై చిత్తాన్ని లగ్నంచేసి, ఇరవైఏడు సంవత్సరాలు ప్రీతితో గడిపింది.

**సప్తవింశతి వర్షాన్తే జగన్మాతా జగన్మయీ ।**
**సుప్రీతా భవదత్యర్థ ముమా శంకరకామినీ ॥12॥**

ఇరవై ఏడవ సంవత్సరాంతంలో జగన్మాత, జగన్మయి మిక్కిలి సంతసించి మిక్కిలి ప్రీతురాలయ్యింది.

**అనుగ్రహాయ మేనాయాః పురతః పరమేశ్వరీ ।**
**ఆవిర్బభూవ సా దేవీ సంతుష్టా తత్సుభక్తితః ॥13॥**

పరమేశ్వరియైన ఉమాదేవి సంతోషించిమేనాదేవిని అనుగ్రహించడానికి ఆమె ఎదుట సాక్షాత్కరించింది.

**దివ్యావయవ సంయుక్తా తేజోమండల మధ్యగా ।**
**ఉవాచ విహసంతీ సా మేనాం ప్రత్యక్షతాం గతా ॥14॥**

ప్రకాశించే అవయవాలతోకూడి, తేజోమండలం మధ్యలోనున్న ఆ దేవి మేనాదేవి ఎదుట ప్రత్యక్షమై చిరునవ్వును చిందిస్తూ ఇలా పలికింది.

**దేవ్యువాచ** – దేవి పలికింది.

**వరం బ్రూహి మహాసాధ్వి యత్తే మనసి వర్తతే ।**
**సుప్రసన్నా చ తపసా తవాహం గిరి కామిని ॥15॥**

ఓ మహాసాధ్వీ! పర్వతుని ప్రియురాలా! నీ మనస్సులోని కోరికను తెలియజేయి. నీ తపస్సునకు నేను మిక్కిలి ప్రసన్నురాలనైనాను.

**యత్ప్రార్థితం త్వయా మేనే తపోవ్రత సమాధినా ।**
**దాస్యే తేఽహం చ తత్సర్వం వాంఛితం యద్యదా భవేత్ ॥16॥**

ఓ మేనా! నీవు దేనిని కోరి తపస్సును, వ్రతాలను, సమాధిస్థితిని అనుష్ఠించావో వాటినన్నిటిని నేను నీకు ఈయగలను.

**తతస్సా మేనకా దేవీం ప్రత్యక్షాం కాళికాం తదా ।**
**దృష్ట్వా చ ప్రణనామాథ వచనం చేదమబ్రవీత్ ॥17॥**

అంతట మేనక తన యెదుట ప్రత్యక్షమైన కాళికాదేవినిచూచి, నమస్కరించి, ఆమెతో ఇలా పలికింది.

**మేనోవాచ** – మేనకాదేవి పలికింది.

**దేవి ప్రత్యక్షతో రూపం దృష్టం తవ మయాధునా ।**
**త్వామహం స్తోతుమిచ్ఛామి ప్రసన్నా భవ కాళికే ॥18॥**

ఓ దేవీ! నేనీనాడు నీ రూపాన్ని ప్రత్యక్షంగా చూశాను. నేను నిన్ను స్తుతించాలనుకుంటున్నాను. ఓ కాళీ! ప్రసన్నురాలవు కమ్ము.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**అథ సా మేనయేత్యుక్తా కాళికా సర్వమోహినీ ।**
**బాహుభ్యాం సుప్రసన్నాత్మా మేనకాం పరిషస్వజే ॥19॥**

అప్పుడు మేనాదేవి ఇట్లు పలుకగానే సర్వమోహినియైన కాళికాదేవి మిక్కిలి ప్రసన్నురాలై, తన బాహువులతో మేనాదేవిని కౌగిలించుకుంది.

**తతః ప్రాప్త మహాజ్ఞానా మేనకా కాళికాం శివామ్ ।**
**తుష్టావ వాగ్భిరిష్టాభి ర్భక్త్యా ప్రత్యక్షతాం గతామ్ ॥20॥**

అంతట మేనకకు మహాజ్ఞానం కలిగింది. ఆమె తన ఎదుటనున్న పరమేశ్వరియయిన కాళికను భక్తితో ప్రీతికరమైన వాక్కులతో ఇలా స్తుతించింది.

**మేనోవాచ** - మేనకా దేవి పలికింది.

**మహామాయాం జగద్ధాత్రీం చండికాం లోకధారిణీమ్ ।**
**ప్రణమామి మహాదేవీం సర్వకామార్థదాయినీమ్ ॥21॥**

మహామాయయు, లోకాలను పోషించు తల్లియు, లోకధారిణియు, సర్వకామార్థదాయినియు నైన మహాదేవి చండికకు నమస్కరించుచున్నాను.

**నిత్యానందకరీం మాయాం యోగనిద్రాం జగత్ప్రసూమ్ ।**
**ప్రణమామి సదా సిద్ధాం శుభసారస మాలినీమ్ ॥22॥**

నిత్యానందమును కలిగించునట్టియు, మాయాస్వరూపిణియు, యోగనిద్రా స్వరూపిణియు, జగన్మాతయు, సదాసిద్ధురాలును, శుభకరమైన పుష్పమాలలను ధరించునదియునైన మహామాయకు నమస్కరించుచున్నాను.

**మాతామహీం సదానందాం భక్తశోకవినాశినీమ్ ।**
**ఆకల్పం వనితానాం చ ప్రాణినాం బుద్ధిరూపిణీమ్ ॥23॥**

తల్లులకు తల్లియు, నిత్యానంద స్వరూపిణియు, భక్తశోకవినాశినియు, కల్పాంతమువరకుగల స్త్రీల మరియు ప్రాణుల బుద్ధిరూపంలో ప్రకటితమైయున్న దేవికి నమస్కరించుచున్నాను.

**సా త్వం బంధచ్ఛేద హేతుర్యతీనాం కస్తే గేయో మాదృశీభిః ప్రభావః ।**
**హింసాయా వాథర్వవేదస్య సా త్వం నిత్యం కామం త్వం మమేష్టం విధేహి ॥24॥**

యతీశ్వరుల సంసార బంధాలను ఛేదించు జ్ఞానము నీవే. నావంటివారలు నీ ప్రభావాన్ని ఏవిధంగా గానం చేయగలరు? అథర్వవేదంలోని హింసా ప్రయోగము నీ స్వరూపమే. నీవు నిత్యము నా అభీష్టాలను నెరవేర్చుము.

**నిత్యానిత్యై ర్భావహీనైః పరాస్తై స్తత్త న్మాత్రైర్యోజ్యతే భూతవర్గః ।**
**తేషాం శక్తిస్త్వం సదా నిత్యరూపా కాలే యోషా యోగయుక్తా సమర్థా ॥25॥**

ఆకారము లేనివి, నిత్యానిత్యములు, కంటికి కనబడవి అగు భూత సూక్ష్మములనుండి ఈ పాంచభౌతిక జగత్తు కూర్చబడుచున్నది. నిత్యరూపిణివైన నీవే వాటియొక్క నిత్యశక్తివై యున్నావు. నీవు ఆయా కాలాలయందు సర్వసమర్థమైన స్త్రీరూపంలో అవతరిస్తావు.

**యోనిర్ధరిత్రీ జగతాం త్వమేవ త్వమేవ నిత్యా ప్రకృతిః పరస్తాత్ ।**
**యథా వశం క్రియతే బ్రహ్మరూపం సా త్వం నిత్యా మే ప్రసీదాద్య మాతః ॥26॥**

జగత్తులు నీనుండియే పుట్టినవి. వాటిని పోషించు తల్లివినీవె. నీవు పరబ్రహ్మ స్వరూపానివి. నీవు ప్రకృతికంటె ఉత్కృష్టురాలవు. పరబ్రహ్మ స్వరూపం నీ అనుగ్రహం చేతనే తెలియబడుతోంది. అట్టి శాశ్వతురాలవగు నీవు నాయందు ప్రసన్నురాలవు కమ్ము.

**త్వం జాతవేదోగతశక్తి రుగ్రాత్వం దాహికా సూర్యకరస్య శక్తిః ।**
**ఆహ్లాదికా త్వం బహుచంద్రికా యా తాం త్వామహం స్తౌమి నమామి చణ్డీమ్ ॥27॥**

చండీమాతా! అగ్నియందలి తీక్ష్ణమైన ఉష్ణశక్తివి నీవే. సూర్యకిరణములందలి తపింపజేయు శక్తియు నీవే. ఆహ్లాదింపజేయు వెన్నెలయునీవే. అట్టినీకు నేను నమస్కరించుచున్నాను.

**యోషాణాం సత్ప్రియా చ త్వం నిత్యా త్వం చోర్ధ్వరేతసామ్ ।**
**వాంఛా త్వం సర్వజగతాం మాయా చ త్వం యథా హరేః ॥28॥**

స్త్రీలకు మిక్కిలి ప్రియురాలవు నీవే. ఊర్ధ్వరేతస్కులైన బ్రహ్మచారులకు ధ్యేయభూతము, నిత్యబ్రహ్మ శక్తియు నీవే. సకల జగత్తులకు కోరిక మరియు శ్రీహరియొక్క మాయయు నీవే.

**యాచేష్టరూపాణి విధాయ దేవీ సృష్టిస్థితా నాశమయీ చ కర్త్రీ ।**
**బ్రహ్మాచ్యుత స్థాణు శరీరహేతు స్సా త్వం ప్రసీదాద్య పునర్నమస్తే ॥29॥**

ఓ దేవీ! ఇచ్ఛానుసారముగా రూపాలను ధరించి, సృష్టి, స్థితి, సంహారాలనే కార్యాలను నిర్వహించేది నీవే. బ్రహ్మ విష్ణు రుద్రుల శరీరాలకు కారణంకూడా నీవే. నీవు నాయెడల ప్రసన్నురాలవు కమ్ము. నీకు మరల నమస్కరించుచున్నాను.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**తత ఇత్థం స్తుతా దుర్గా కాళికా పునరేవ హి ।**
**ఉవాచ మేనకాం దేవీం వాంఛితం వరయేత్యుత ॥30॥**

ఓ నారదా! మేనాదేవిచేత ఈవిధంగా స్తుతింపబడిన దుర్గ, ఆ కాళిక మరలా ఆమెతో నీకిష్టమైనది కోరుకోమని పలికింది.

**ఉమోవాచ** – ఉమాదేవి పలికింది.

**ప్రాణప్రియా మమ త్వం హి హిమాచలవిలాసినీ ।**
**యదిచ్ఛసి ధ్రువం దాస్యే నాదేయం విద్యతే మమ ॥31॥**

హిమాచల ప్రియా! నీవు నాకు ప్రాణసమానమైన ప్రియురాలవు. నీవు నీ మనోవాంఛిత వరమును కోరుకొనుము. దానిని తప్పక ప్రసాదిస్తాను. నీకు ఇవ్వరానిది ఏదియును లేదు.

**ఇతి శ్రుత్వా మహేశాన్యాః పీయూష సదృశం వచః ।**
**ఉవాచ పరితుష్టా సా మేనకా గిరికామినీ ॥32॥**

మహేశ్వరియైన ఉమాదేవి పలికిన అమృత సమానమైన మధుర వచనాలను విని హిమగిరిప్రియ యైన మేనక మిక్కిలి సంతుష్టురాలయ్యింది. మేనాదేవి ఉమాదేవితో ఇలా పలికింది.

**మేనోవాచ** - మేనకా దేవి పలికింది.

**శివే జయజయ ప్రాజ్ఞే మహేశ్వరి భవాంబికే ।**
**వరయోగ్యాస్మహం చేత్తే వృణే భూయో వరం వరమ్ ॥33॥**

అమ్మా! శివాదేవీ! నీకు జయమగుగాక! జయమగుగాక! నీవు ఉత్కృష్టమైన జ్ఞానయుక్తవు. ఓ మహేశ్వరీ! ఓ భవాంబికా! నేను వరాలు పొందడానికి అర్హురాలనైనచో మిమ్ములను శ్రేష్ఠమైన వరాన్ని కోరతాను.

**ప్రథమం శతపుత్రా మే భవంతు జగదంబికే ।**
**బహ్వాయుషో వీర్యవంత ఋద్ధి సిద్ధి సమన్వితాః ॥34॥**

జగదంబా! ముందుగా నాకు వందమంది పుత్రులను ప్రసాదించుము. వారందరు దీర్ఘాయువులు, వీర్యవంతులు, ఋద్ధి సిద్ధి సంపన్నులు కావలెను.

**పశ్చా త్తథైకా తనయా స్వరూప గుణశాలినీ ।**
**కులద్వయానందకరీ భువనత్రయ పూజితా ॥35॥**

వందమంది కుమారుల తరువాత నాకు ఒక పుత్రిక కావలెను. ఆమె తనరూపంచేత, గుణములచేత, సుశోభితయై పుట్టినింటికి, మెట్టినింటికి, రెండు వంశములవారికి ఆనందప్రదురాలై ముల్లోకాలయందు పూజింపబడాలి.

**సుతా భవ మమ శివే దేవకార్యార్థమేవ హి ।**
**రుద్రపత్నీ భవ తథా లీలాం కురు భవాంబికే ॥36॥**

శివే! జగదంబా! నీవే దేవకార్యాన్ని నెరవేర్చడానికి నాకు పుత్రికవై రుద్రదేవునికి పత్నివి కమ్ము. దానికనుగుణమైన లీలనొనరింపుము.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**తచ్ఛ్రుత్వా మేనకోక్తం హి ప్రాహ దేవీం ప్రసన్నధీః ।**
**స్మితపూర్వం వచస్తస్యాః పూరయంతీ మనోరథమ్ ॥37॥**

నారదా! మేనక మాటలను విని, ఉమాదేవి ప్రసన్న హృదయంతో ఆమె మనోరథాన్ని పరిపూర్ణం చేస్తున్నదై, చిరునవ్వు నవ్వుతూ ఇలా పలికింది.

**దేవ్యువాచ** - దేవి పలికింది.

**శతపుత్రా స్సంభవంతు భవత్యా వీర్యసంయుతాః ।**
**తత్రైకో బలవాన్ముఖ్యః ప్రథమం సంభవిష్యతి ॥38॥**

నీకు బలశాలురైన వందమంది కుమారులు జన్మిస్తారు. వారిలో మొట్టమొదట జన్మించినవాడు అందరికంటే మిక్కిలి బలవంతుడు, ప్రముఖుడు కాగలడు.

**సుతాహం సంభవిష్యామి సంతుష్టా తవ భక్తితః ।**
**దేవకార్యం కరిష్యామి సేవితా నిఖిలై స్సురైః ॥39॥**

నీభక్తికి నేను సంతసించాను. నేను నీకు కుమార్తెనై జన్మించి, దేవతలందరిచేత ఆరాధింప బడుదాననై, దేవకార్యాన్ని నిర్వర్తిస్తాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఏవముక్త్వా జగద్ధాత్రీ కాళికా పరమేశ్వరీ ।**
**పశ్యంత్యా మేనకాయాస్తు తత్రైవాన్తర్దధే శివా ॥40॥**

జగన్మాత, పరమేశ్వరియు నైన కాళికామాత ఈవిధంగా పలికి, మేనక చూస్తూ ఉండగానే అచ్చటనే అంతర్ధానమయ్యింది.

**మేనకాపి వరం లబ్ధ్వా మహేశాన్యా అభీప్సితమ్ ।**
**ముదం ప్రాపామితాం తాత తపఃక్లేశోఽప్యనశ్యత ॥41॥**

ఓ కుమారా! మహేశ్వరినుండి అభీష్టమైన వరాన్ని పొందిన మేనక సాటిలేని ఆనందాన్ని పొందింది. ఆమెకు తపఃక్లేశమంతా మటుమాయమయ్యింది.

**దిశి తస్యాం నమస్కృత్య సుప్రహృష్ట మనాస్సతీ ।**
**జయశబ్దం ప్రోచ్చరంతీ స్వస్థానం ప్రవివేశ హ ॥42॥**

పరమేశ్వరి అదృశ్యమైన దిక్కునకు నమస్కరించి, మనస్సులో గొప్ప ఆనందము కలిగినదై జయ శబ్దాన్ని గట్టిగా ఉచ్చరిస్తూ తన గృహంలో ప్రవేశించింది.

**అథ తస్మై స్వపతయే శశంస సువరం చ తమ్ ।**
**స్వ చిహ్నా బుద్ధమివ వై సువాచా పునరుక్తయా ॥43॥**

అపుడామె తాను పొందిన గొప్ప వరాన్నిగూర్చి భర్తతో చెప్పింది. ఆమె ముఖలక్షణాలను బట్టియే సంగతి అంతయూ తెలిసినప్పటికిని ఆ వృత్తాంతమునామె భర్తకు పదే పదే చెప్పింది.

**శ్రుత్వా శైలపతిర్హృష్టోఽభవన్మేనా వచో హి తత్ ।**
**ప్రశశంస ప్రియాం ప్రీత్యా శివా భక్తిరతాం చ తామ్ ॥44॥**

మేనాదేవియొక్క మాటలను విని, శైలరాజగు హిమవంతుడు మిక్కిలి సంతసించి, శివపత్నియందు స్థిరమైన భక్తిగల మేనకను ప్రీతితో ప్రశంసించాడు.

**కాలక్రమేణాథ తయోః ప్రవృత్తే సురతే మునే ।**
**గర్భో బభూవ మేనాయా వవృధే ప్రత్యహం చ సః ॥45॥**

ఓ మహర్షీ! వారిద్దరూకలిసి కాపురం చేస్తూ ఉండగా కొంతకాలానికి మేనకాదేవి గర్భం ధరించింది. ఆ గర్భం దినదినప్రవర్ధమానమయ్యింది.

**అసూత సా నాగవధూపభోగ్యం సుతముత్తమమ్ ।**
**సముద్రబద్ధ సత్సఖ్యం మైనాకాభిధమద్భుతమ్ ॥46॥**

సముద్రునితో గాఢమైన మైత్రిని నెఱపి, నాగకన్యలతో భోగింపబోవు మైనాకుడను పేరుగల అద్భుతమైన పుత్రుణ్ణి ఆమె కన్నది.

**వృత్ర శత్రావతి క్రుద్ధే వైదనాశం సపక్షకమ్ ।**
**పవిక్షతానాం దేవర్షే పక్షచ్ఛిది వరాఙ్గకమ్ ॥47॥**

పర్వతాలకు రెక్కలుండడంచేత ప్రాణినాశం జరిగేది. దానికై కోపించిన ఇంద్రుడు తన వజ్రాయుధంతో పర్వతాల రెక్కలను త్రుంచాడు. కాని మైనాకుని రెక్కలను మాత్రం త్రుంచలేదు. మైనాకుడు మాత్రం శ్రేష్ఠమైన అంగాలతో విరాజిల్లాడు.

**ప్రవరం శతపుత్రాణాం మహాబల పరాక్రమమ్ ।**
**స్వోద్భవానాం మహీధ్రాణాం పర్వతేంద్రైక ధిష్ఠితమ్ ॥48॥**

హిమవంతుని వందమంది పుత్రులలో శ్రేష్ఠుడును, మహా బలపరాక్రమములు కలవాడును, మైనాకుడు మాత్రమే. హిమవంతుని కుమారులైన పర్వతములన్నింటియందు 'పర్వతరాజు' అనెడి స్థానం అతనికి మాత్రమే తగియున్నది.

**ఆసీన్మహోత్సవ స్తత్ర హిమాచల పురేఽద్భుతః ।**
**దంపత్యోః ప్రముదాధిక్యం బభూవ క్లేశసంక్షయః ॥49॥**

హిమవంతుని రాజధానిలో అద్భుతమైన మహోత్సవం ప్రవర్తిల్లింది. ఆ దంపతులిరువురకు కష్టాలు నశించి, ఆనందాతిశయం కలిగింది.

**దానం దదౌ ద్విజాతిభ్యోఽన్యేభ్యశ్చ ప్రదదౌ ధనమ్ ।**
**శివాశివ పదద్వంద్వే స్నేహోఽభూదధిక స్తయోః ॥50॥**

వారు బ్రాహ్మణులకు దానాలిచ్చారు. ఇతరులకు కూడ ధనాన్ని పంచిపెట్టారు వారిద్దరికి ఉమాపరమేశ్వరుల పాదపద్మాలయందు అత్యధికమైన ప్రీతి కలిగింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే మేనా వరలాభ వర్ణం నామ పంచమోఽధ్యాయః ॥5॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో మేనా వరలాభవర్ణనం అనే ఐదవ అధ్యాయం సమాప్తం.

## షష్ఠోఽధ్యాయః - ఆరవ అధ్యాయం
## పార్వతీజన్మవర్ణనమ్ - పార్వతీదేవిజన్మవర్ణనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథ సంస్మరతు ర్భక్త్యా దంపతీ తౌ భవాంబికామ్ ।**
**ప్రసూతిహేతవే తత్ర దేవకార్యార్థమాదరాత్ ॥1॥**

నారదా! తదనంతరం మేనకా హిమవంతులు దేవకార్యసిద్ధికై జగన్మాతను కుమార్తెగా పొందగోరి, భక్తితో అత్యంత ఆదరముతో ప్రతినిత్యము ఉమాదేవిని స్మరిస్తూ ఉన్నారు.

**తతస్సా చండికా యోగాత్త్యక్తదేహా పురా పితుః ।**
**ఈహయా భవితుం భూయః సమైచ్ఛద్ గిరిదారతః ॥2॥**

పూర్వం తండ్రివల్ల అవమానాన్ని పొంది, యోగాగ్నిచే శరీరాన్ని త్యజించిన చండిక అపుడు మరల హిమవంతుని భార్యయొక్క గర్భంలో జన్మించడానికి సంకల్పించింది.

**సత్యం విధాతుం స్వవచః ప్రసన్నాఖిలకామదా ।**
**పూర్ణాంశాచ్ఛైలచిత్తే సా వివేశాథ మహేశ్వరీ ॥3॥**

ప్రసన్నురాలై సమస్త కోర్కెలను తీర్చు మహేశ్వరి తానిచ్చిన మాటను సత్యం చేయదలచి, తన పూర్ణాంశతో హిమవంతుని మనస్సులో ప్రవేశించింది.

**విరరాజ తతస్సోతి ప్రమదో పూర్వసుద్యుతిః ।**
**హుతాశన ఇవాధృష్యస్తేజోరాశిర్మహామనాః ॥4॥**

అంతట విశాల హృదయుడైన హిమవంతుడు మిక్కిలి ఆనందం కలవాడై అపూర్వ కాంతులతో విరాజిల్లాడు. ఆయన అగ్నిహోత్రునివలె తేరిపారచూడరాని తేజస్సుతో ప్రకాశించాడు.

**తతో గిరిస్స్వ ప్రియాయాం పరిపూర్ణం శివాంశకమ్ ।**
**సమాధిమత్వా త్సమయే సమధత్త సుశంకరే ॥5॥**

అంతట హిమవంతుడు మంగళకరమైన శుభసమయంలో శివాదేవియొక్క పూర్ణాంశమును పరిశుద్ధమైన చిత్తంతో తన ప్రియురాలైన మేనకయందు ఆధానం చేశాడు.

**సమధత్తః గిరేః పత్నీ గర్భం దేవ్యాః ప్రసాదతః ।**
**చిత్తే స్థితాయాః కరుణా కరాయాః సుఖదం గిరేః ॥6॥**

తన మనస్సునందుండి, కరుణను వర్షించే పరమేశ్వరి అనుగ్రహం వల్ల మేనాదేవి గర్భాన్ని ధరించింది. దానితో ఆ పర్వతరాజు మిక్కిలి సుఖాన్ని పొందాడు.

**గిరిప్రియా సర్వజగన్నివాసా సంశ్రయాధికమ్ ।**
**విరేజే సుతరాం మేనా తేజోమండలగా సదా ॥7॥**

హిమవంతుని ప్రియురాలగు మేనాదేవి సర్వజగన్నివాస స్థానమైన జగన్మాతను తన గర్భంలో ధరించడంచేత ఎల్లప్పుడు తేజోరాశిచే వ్యాప్తమై అతిశయించిన ప్రకాశంతో ఒప్పారింది.

**సుఖోదయం స్వభర్తుశ్చ మేనా దౌర్హృద లక్షణమ్ ।**
**దధౌ నిదానం దేవానామానందస్యేప్సితం శుభమ్ ॥8॥**

మేనాదేవియొక్క గర్భిణీ లక్షణాలు ఆమె భర్తకు ఆనందాన్ని కలిగించాయి. అంతేగాక దేవతలకు ఆనందకరమైన కోరిక నెరవేరుటచే వారికికూడా ఆమె గర్భం ఆనందహేతువయ్యింది.

**దేహ సాదాదసంపూర్ణ భూషణా లోధ్రసంముఖా ।**
**స్వల్పభేందుక్షయే కాలం విచే ష్యర్క్షావిభావరీ ॥9॥**

శరీరంలో శక్తి తక్కువగా ఉండడంచేత, తక్కువ ఆభరణాలను ధరించి, లోధ్ర పుష్పంవలె , పాండువర్ణంగల ముఖంతో ప్రకాశించే ఆమె చంద్రుడు అస్తమించిన పిమ్మట కనబడీ కనబడని నక్షత్రాలుగల రాత్రివలె భాసిల్లింది.

**తదాననం మృత్సురభి నాయం తృప్తిం గిరీశ్వరః ।**
**మునే రహస్యుపాఘ్రాయ ప్రేమాధిక్యం బభూవ తత్ ॥10॥**

ఓ నారదమునీ! గిరీశ్వరుడైన హిమవంతుడు మృద్గంధంతోనున్న ఆమె ముఖాన్ని రహస్యంగా ముద్దాడి, తన ప్రేమాధిక్యతను ప్రదర్శించాడు. అయినప్పటికి అతనికి తృప్తి కలుగలేదు.

**మేనా స్పృహావతీ కేషు న మే శంసతి వస్తుషు ।**
**కించిదిష్టం హ్రియాపృచ్ఛ దనువేలం సఖీర్గిరిః ॥11॥**

"మేన ఏ ఏవస్తువులను కోరుతోందో సిగ్గువలన ఆమెనాకు చెప్పడంలేదు. ఆమెకభీష్టమేది?" అని హిమవంతుడు ఆమె చెలికత్తెలను పదేపదే ప్రశ్నించాడు.

**ఉపేత్య దౌహదం శల్యం యద్వవ్రేఽపశ్యదాశు తత్ ।**
**ఆనీతం నేష్టమస్యాద్ధా నాసాధ్యం త్రిదివేఽపి హి ॥12॥**

గర్భసంబంధి క్లేశాన్ని పొందిన మేనాదేవి దేనిని చూచినా, దేనిని కోరినా దానిని హిమవంతుడు వెంటనే రప్పించి, ఆమెకిచ్చేవాడు. ఆమెకిష్టమై ముల్లోకాలలో ఆయన సంపాదింపలేని వస్తువు లేదుకదా?

**ప్రచీయమానావయవా నిస్తీర్య దోహద వ్యథామ్ ।**
**రేజే మేనా బాలలతా నద్ధ పత్రాధికా యథా ॥13॥**

వృద్ధి చెందిన అవయవాలుగల ఆ మేనాదేవి గర్భక్లేశాన్ని అతిక్రమించి, అనేక అధిక పత్రాలతో నిండిన లేత తీగవలె ప్రకాశించింది.

**గిరిస్సగర్భాం మహిషీమముంస్త ధరణీమివ ।**
**నిధాన గర్భామభ్యంతర్లీనవహ్నిం శమీమివ ॥14॥**

హిమవంతుడు గర్భవతియైన తన భార్యను నిధులనన్నిటిని తనలోదాచుకొన్న ధరణివలెను, అగ్నిని తన గర్భమునందు దాచుకున్న శమీవృక్షము వలెను, భావన చేశాడు.

**ప్రియా ప్రీతేశ్చ మనసః స్వార్జిత ద్రవిణస్య చ ।**
**సమున్నతేః శ్రుతేః ప్రాజ్ఞః క్రియాశ్చక్రే యథోచితాః ॥15॥**

వివేకియైన హిమవంతుడు తన ప్రియురాలి మనస్సును సంతోషపెట్టడానికిని, తాను సంపాదించిన ధనాన్ని సద్వినియోగం చేయడానికిని, వేదధర్మంయొక్క ఉన్నతి కొరకును యధావిధిగా వైదిక సంస్కారములనన్నిటిని జరిపించాడు.

**దదర్శ కాలే మేనాం స ప్రతీతః ప్రసవోన్ముఖీమ్ ।**
**అభ్రితాం చ దివం గర్భగృహే భిషగధిష్ఠితే ॥16॥**

కొంతకాలం తరువాత వైద్యులున్న పురుటి గృహంలోనున్న మేనాదేవిని చూశాడు. మేఘాలతోనిండి, వర్షించడానికి సిద్ధంగా నున్న అంతరిక్షంవలె ప్రసవించడానికి సిద్ధంగానున్న ఆమె ప్రకాశించింది.

**దృష్ట్వా ప్రియాం శుభాంగీం వై ముమోదాతి గిరీశ్వరః ।**
**గర్భస్థ జగదంబాం హి మహాతేజోవతీం తదా ॥17॥**

తన గర్భమునందు జగదంబను ధరించి, మహాతేజస్సుతో ప్రకాశిస్తూ, శుభకరములైన అవయవాలుగల తన భార్యను చూచి, ఆ సమయంలో హిమవంతుడు మిక్కిలి ఆనందించాడు.

**తస్మిన్నవసరే దేవా మునే విష్ణ్వాదయస్తథా ।**
**మునయశ్చ సమాగమ్య గర్భస్థాం తుష్టువు శ్శివామ్ ॥18॥**

ఓ దేవమునీ! ఆ సమయంలో విష్ణువు మున్నగు దేవతలు, మునులు అచ్చటకు వచ్చి, మేనాదేవి గర్భమునందున్న ఉమాదేవిని ఇలా స్తుతించారు.

**దేవాఊచుః** – దేవతలు పలికారు.

**దుర్గే! జయజయ ప్రాజ్ఞే! జగదంబ! మహేశ్వరి ।**
**సత్యవ్రతే సత్యపరే త్రిసత్యే సత్యరూపిణీ ॥19॥**

ఓ దుర్గా! నీకు జయము జయము. ఓ మహేశ్వరీ! నీవు ప్రాజ్ఞురాలవు, జగన్మాతవు. సత్యమునందు దృఢవ్రతవు. సత్యమే నీ స్వరూపము. కావున నీవు త్రికాలములందును, సత్యరూపిణివే.

**సత్యస్థే సత్య సుప్రీతే సత్యయోనే చ సత్యతః ।**
**సత్యవక్త్రే సత్యనేత్రే ప్రసన్నాః శరణం చ తే ॥20॥**

నీవు సత్యమునందుండి, సత్యమునుండి అవతరించి, సత్యముచే సుప్రీతురాలవవుదువు. వ్యావహారిక సత్యమగు జగత్తునకు అధిష్ఠాన సత్యము నీవే. నీది సత్య దర్శనము. మేము నిన్ను శరణు వేడుచున్నాము.

**శివప్రియే! మహేశాని! దేవదుఃఖ క్షయంకరి ।**
**త్రైలోక్యమాతా శర్వాణీ వ్యాపినీ భక్తవత్సలా ॥21॥**

ఓ శివప్రియా! మహేశానీ! నీవు దేవతల దుఃఖాన్ని హరిస్తావు. ముల్లోకములకు తల్లివి, శర్వుని పత్నివిఐన నీవు సర్వమునందును వ్యాపించియున్నావు. నీవు భక్తవత్సలవు.

**ఆవిర్భూయ త్రిలోకేశి! దేవకార్యం కురుష్వహ ।**
**సనాథాః కృపయా తేహి వయం సర్వే మహేశ్వరీ ॥22॥**

ఓ త్రిలోకేశ్వరీ! నీవవతరించి, దేవకార్యాన్ని పరిపూర్ణం చేయుము. నీ దయచే మేమందరము నాథవంతులమయ్యాము.

**త్వత్తః సర్వే చ సుఖినో లభంతే సుఖముత్తమమ్ ।**
**త్వాం వినా నహి కించిద్వై శోభతే త్రిభవేష్వపి ॥23॥**

ఉత్తమ సుఖాలను పొందేవారందరు ఆయా సుఖాలనన్నిటినీ నీవలననే, నీనుండియే పొందుచున్నారు. ముల్లోకాలలో నీవు లేనిదేదియు శోభిల్లజాలదు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్థం కృత్వా మహేశాన్యా గర్భస్థాయా బహుస్తుతిమ్ ।**
**ప్రసన్నమనసో దేవాస్స్వం స్వం ధామ యయుస్తదా ॥24॥**

ఈ తీరున గర్భమునందున్న మహేశ్వరిని పరిపరివిధముల ప్రస్తుతించి, ప్రసన్నమైన మనస్సు కలవారై దేవతలందరు తమతమ ధామాలకు వెళ్ళారు.

**వ్యతీతే నవమే మాసే దశమే మాసి పూర్ణతః ।**
**గర్భస్థాయా గతిం దధ్రే కాళికా జగదంబికా ॥25॥**

తొమ్మిది నెలలు గడచి, పదవనెల పూర్తియగుసరికి జగన్మాతయైన కాళికాదేవి గర్భస్థురాలై ఉండెను.

**తదా సు సమయశ్చాసీ చ్ఛాంత భగ్రహతారకః ।**
**నభః ప్రసన్నతాం యాతం ప్రకాశః సర్వదిక్షు హి ॥26॥**

**మహీ మంగళ భూయిష్ఠా సవన గ్రామ సాగరా ।**
**సరః స్రవంతీ వాపీషు పుఫుల్లుః పంకజాని వై ॥27॥**

**వవుశ్చ వివిధా వాతా స్సుఖ స్పర్శా మునీశ్వర ।**
**ముముదు స్సాధవ స్సర్వేఽసతాందుఃఖ మభూద్ ద్రుతమ్ ॥28॥**

అపుడు ఒకానొక సుముహూర్తమునందు నక్షత్రాలు, గ్రహాలు శాంతములై యుండగా, ఆకాశం ప్రసన్నమై, దిక్కులన్నియు ప్రకాశిస్తుండగా, వనాలతో, గ్రామాలతో, సముద్రాలతో కూడిన భూమి మంగళములతో నిండియుండగా సరస్సులలో, నదులలో, దిగుడుబావులలో పద్మములు వికసించియున్నాయి. ఓ మునీశ్వరా! సుఖ స్పర్శగల వాయువులు వీచాయి. సత్పురుషులందరు ఆనందించారు. దుష్టులకు వేగంగా దుఃఖం కలిగింది.

**దుందుభీన్వాదయామాసుర్నభస్యాగత్య నిర్జరాః ।**
**పుష్పవృష్టి రభూత్తత్ర జగుర్గంధర్వసత్తమాః ॥29॥**

దేవతలు అంతరిక్షంలోనికి ప్రవేశించి, దుందుభులను మ్రోగించారు. అప్పుడచ్చట పుష్పవర్షం కురిసింది. గంధర్వశ్రేష్ఠులు గానాలు చేశారు.

**విద్యాధర స్త్రియో వ్యోమ్ని ననృతు శ్చాప్సరా స్తథా ।**
**తదోత్సవో మహానాసీద్దేవాదీనాం నభః స్థలే ॥30॥**

విద్యాధర స్త్రీలు, అప్సరసలుకూడా ఆకాశంలో నాట్యాలు చేశారు. అప్పుడు దేవతలు మున్నగువారందరు అంతరిక్షంలో మహోత్సవాన్ని జరుపుకున్నారు.

**తస్మిన్నవసరే దేవీ పూర్వశక్తిశ్శివా సతీ ।**
**ఆవిర్బభూవ పురతో మేనాయా నిజరూపతః ॥31॥**

ఆసమయంలో పూర్వం సతీరూపంగా అవతరించిన శివశక్తి స్వీయరూపంతో మేనాదేవి ఎదుట సాక్షాత్కరించింది.

**వసంతర్తౌ మధౌమాసే నవమ్యాం మృగధిష్ణ్యకే ।**
**అర్ధరాత్రే సముత్పన్నా గంగేవ శశిమండలాత్ ॥32॥**

ఆదేవి వసంత ఋతువులో, చైత్రమాసంలో, నవమి తిథినాడు మృగశిరా నక్షత్రమందు, అర్ధరాత్రి సమయమునందు, చంద్రమండలంనుండి ఆకాశగంగవలె అవతరించింది.

**సమయే తత్స్వరూపేణ మేనకా జఠరాచ్ఛివా ।**
**సముద్భూయ సముత్పన్నా సా లక్ష్మీరివ సాగరాత్ ॥33॥**

ఆ సమయంలో, ఆ స్వరూపంతో, ఉమాదేవి మేనాదేవియొక్క గర్భంనుండి సముద్రంనుండి లక్ష్మీదేవివలె జన్మించింది.

**తతస్తస్యాంతు జాతాయం ప్రసన్నోఽభూత్తదా భవః ।**
**అనుకూలో వవౌ వాయుర్గంభీరో గంధయుక్ శుభః ॥34॥**

అప్పుడామె జన్మించగానే జగత్తంతా ప్రసన్నమయ్యింది. సుగంధాలతో కూడిన వాయువు అనుకూలంగా, మెల్లగా, గంభీరంగా వీచింది.

**బభూవ పుష్పవృష్టిశ్చ తోయవృష్టి పురస్సరమ్ ।**
**జజ్వలు శ్చాగ్నయః శాంతా జగర్జుశ్చ తదా ఘనాః ॥35॥**

ఆ సమయంలో జలవర్షంతోబాటు పుష్పవృష్టికూడా కురిసింది. అగ్నులు ప్రశాంతంగా వెలిగాయి. మేఘాలు గర్జించాయి.

**తస్యాంతు జాయమానాయాం సర్వస్వం సమపద్యత ।**
**హిమవన్నగరే తత్ర సర్వదుఃఖక్షయం గతమ్ ॥36॥**

ఆమె జన్మించిన సమయంలో హిమవంతుని రాజధాని నగరమంతా సుసంపన్నమగుటయేగాక సర్వ దుఃఖాలు పోయాయి.

**తస్మిన్నవసరే తత్ర విష్ణ్వాద్యాస్సకలా స్సురాః ।**
**ఆజగ్ముః సుఖినః ప్రీత్యా దదృశుర్జగదంబికామ్ ॥37॥**

ఆ సమయంలో విష్ణువు మొదలగు దేవతలందరు అచ్చటకు వచ్చి, ఆనందించి, ప్రీతితో జగన్మాతను దర్శించారు.

**తుష్టువు స్తాం శివామంబాం కాళికాం శివకామినీమ్ ।**
**దివ్యరూపాం మహామాయాం శివలోక నివాసినీమ్ ॥38॥**

జగన్మాత, శివకామిని, దివ్యరూప, మహామాయ, శివలోక నివాసిని, శుభంకరి యగు ఆ కాళికను వారు స్తుతించారు.

**దేవా ఊచుః** - దేవతలు పలికారు.

**జగదంబ! మహాదేవి! సర్వసిద్ధి విధాయిని ।**
**దేవకార్యకరీ త్వం హి సదాతస్త్వాం నమామహే ॥39॥**

ఓ జగదంబా! మహాదేవీ! నీవు సర్వసిద్ధులను కలిగించుదానవు. నీవు సర్వదా దేవకార్యములను నెరవేర్చు దానవు. కావున నీకు నమస్కరించుచున్నాము.

**సర్వథా కురు కల్యాణం దేవానాం భక్తవత్సలే ।**
**మేనా మనోరథః పూర్ణః కృతః కురు హరస్య చ ॥40॥**

ఓ భక్తవత్సలా! దేవతలకు సర్వధా శుభముల నొనగూర్చుము. మేనాదేవియొక్క మనోరథం పరిపూర్ణమయ్యింది. శివుని మనోరథాన్నికూడా పరిపూర్ణం చేయుము.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్థం స్తుత్వా శివాం దేవాం విష్ణ్వాద్యాః సు ప్రణమ్య తామ్ ।**
**స్వం స్వం ధామ యయుః ప్రీతాశ్శంసన్తస్తద్గతిం పరామ్ ॥41॥**

విష్ణువు మున్నగు దేవతలు ఆ దేవిని ఈ విధంగా స్తుతించి, ప్రణమిల్లి, సంప్రీతులై, ఆమె జన్మను ప్రశంసిస్తూ తమతమ నివాసాలకు వెళ్ళారు.

**తాం తు దృష్ట్వా తథా జాతాం నీలోత్పల దళప్రభామ్ ।**
**శ్యామాం సా మేనకా దేవీం ముదమాయాతి నారద ॥42॥**

ఓ నారదా! నీలోత్పల దళములవలె ప్రకాశిస్తూ జన్మించినదియు, శ్యామలవర్ణం కలిగినదియు అయిన ఆమెనుచూచి, మేనకాదేవి ఆనందాతిశయాన్ని పొందింది.

**దివ్యరూపం విలోక్యాను జ్ఞానమాప గిరిప్రియా ।**
**విజ్ఞాయ పరమేశానీం తుష్టావాతి ప్రహర్షితా ॥43॥**

ఆ దివ్యరూపాన్ని దర్శించి, అనంతరం జ్ఞానాన్ని పొంది, ఆమె పరమేశ్వరియని తెలుసుకొని, అత్యంత సంతుష్టురాలై మేనాదేవి ఇలా స్తుతించింది.

**మేనోవాచ –** మేనకా దేవి పలికింది.

**జగదంబ మహేశాని కృతాతి కరుణా త్వయా ।**
**ఆవిర్భూతా మమ పురో విలసంతీ యదంబికే ॥44॥**

ఓ జగదంబా! మహేశ్వరీ! నీవు నాయందు కరుణాతిశయాన్ని చూపించావు. నీవు నీ సుందర రూపంతో నా ఎదుట ప్రత్యక్షమయ్యావు.

**త్వమాద్యా సర్వశక్తీనాం త్రిలోకజననీ శివే ।**
**శివప్రియా సదా దేవీ సర్వదేవస్తుతా పరా ॥45॥**

సర్వశక్తులకు మూలశక్తివి, ఆదిశక్తివి నీవే. ఓ శివా! నీవు త్రిలోకజననివి. నీవు సదాశివుని ప్రియురాలవు. దేవతలందరు స్తుతించే పరాశక్తివి నీవే.

**కృపాం కురు మహేశాని మమ ధ్యానస్థితా భవ ।**
**ఏతద్రూపేణ ప్రత్యక్షం రూపం ధేహి సుతాసమమ్ ॥46॥**

ఓ మహేశానీ! నాయందు దయను చూపుము. నీవు నాధ్యానమునందు నిలిచియుండుము. నీవు ప్రత్యక్షమైన ఈరూపంతో సమానమైన రూపమునే స్వీకరించి నాకుమార్తెవు కమ్ము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య మేనాయా భూధరస్త్రియాః ।**
**ప్రత్యువాచ శివాదేవీ సుప్రసన్నా గిరిప్రియామ్ ॥47॥**

హిమవంతుని భార్యయైన మేనాదేవియొక్క మాటలను విని, మిక్కిలి ప్రసన్నురాలైన శివాదేవి ఇట్లు బదులు పలికింది.

**దేవ్యువాచ** – దేవి పలికింది.

**హే మేనే త్వం పురా మాం చ సుసేవితవతీ రతా ।**
**త్వద్భక్త్యా సుప్రసన్నాహం వరం దాతుం గతాంతికమ్ ॥48॥**

ఓ మేనా! పూర్వం నీవునన్ను చాలశ్రద్ధగా సేవించావు. నీభక్తిచే నేను మిక్కిలి ప్రసన్నురాలనయ్యాను. నీకు వరాలనివ్వడానికి నీవద్దకు వచ్చాను.

**వరం బ్రూహీతి మద్వాణీం శ్రుత్వా తే తద్వరో వృతః ।**
**సుతాభవ మహాదేవీ సా మే దేవహితం కురు ॥49॥**

'వరమును కోరుకొనుము' అని నేను పలుకగా నీవువిని, "ఓ మహాదేవీ! నీవు నాకు కుమార్తెవై జన్మించి, దేవకార్యాన్ని పరిపూర్ణం చేయుమని" నీవు కోరియున్నావు.

**తథా దత్త్వా వరం తేఽహం గతా స్వం పరమాదరాత్ ।**
**సమయం ప్రాప్య తనయా భవన్తే గిరికామిని ॥50॥**

నేనప్పుడు నీకు ఆవిధంగానే వరాన్నిచ్చి నా ధామానికి వెళ్ళాను. దానికిప్పుడు సమయం వచ్చింది. కాబట్టి ఓ గిరికామినీ! ఇప్పుడు నేను నీకు కుమార్తెనై జన్మించాను.

**దివ్యరూపం ధృతం మేఽద్య యత్తే మత్స్మరణం భవేత్ ।**
**అన్యథా మర్త్యభావేన తవాజ్ఞానం భవేన్మయి ॥51॥**

నేనిప్పుడు దివ్యరూపంతో నీయెదుట ప్రత్యక్షమయ్యాను. ఆవిధంగా ప్రత్యక్షమై నీకు నా స్మరణ కలిగేటట్లు చేశాను. అట్లు కానిచో నీవు నన్ను గుర్తించలేక అజ్ఞానంచేత నన్ను సామాన్య మానవ స్త్రీయని తలపోసి యుండెడిదానవు.

**యువాం మాం పుత్రి భావేన దివ్యభావేన వా సకృత్ ।**
**చింతయంతౌ కృతస్నేహౌ యాతాస్థో మద్గతిం పరామ్ ॥52॥**

మీరిరువురు నన్ను కుమార్తె భావనతో ప్రేమతో పెంచండి. అప్పుడప్పుడు నా దివ్యతత్త్వాన్ని తెలుసుకుంటూ నా పరమపదాన్ని పొందుతారు.

**దేవకార్యం కరిష్యామి లీలాం కృత్వాద్భుతాం క్షితౌ ।**
**శంభుపత్నీ భవిష్యామి తారయిష్యామి సజ్జనాన్ ॥53॥**

భువిలో అద్భుతమైన లీలలను ప్రదర్శించి, దేవకార్యాన్ని సిద్ధింపజేస్తాను. నేను శంభుని పత్నినౌతాను. సత్పురుషులను తరింపజేస్తాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వాసీచ్ఛివా తూష్ణీమంబికా స్వాత్మమాయయా ।**
**పశ్యంత్యాం మాతరి ప్రీత్యా సద్యోఽభూత్తనయా తనుః ॥54॥**

ఈవిధంగా పలికి, జగన్మాతయైన శివాదేవి మిన్నకుండెను. తల్లి చూచుచుండగానే వెనువెంటనే తన మాయాశక్తిచే పుత్రికారూపమైన శిశువుగా అవతరించింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే పార్వతీజన్మవర్ణనం నామ షష్ఠోఽధ్యాయః ॥6॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో పార్వతీదేవి జన్మవర్ణనం అనే ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తమోऽధ్యాయః - ఏడవ అధ్యాయం
## పార్వతీబాల్యలీలావర్ణనమ్ - పార్వతీదేవిబాల్యలీలలు

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**తతో మేనా పురస్సా వై సుతా భూత్వా మహాద్యుతిః ।**
**చకార రోదనం తత్ర లౌకికీం గతిమాశ్రితా ॥1॥**

మహాద్యుతియైన ఆమె అపుడు మేనాదేవి యెదుట కుమార్తెయై శిశువుగా జన్మించి, లౌకిక గతినాశ్రయించి, రోదింపసాగింది.

**అరిష్టశయ్యాం పరితస్సద్విసారిసుతేజసా ।**
**నిశీథదీపా విహతత్విష ఆసన్నరం మునే ॥2॥**

ఓ నారదమునీ! ఆమె పరుండిన శయ్యచుట్టూ వ్యాపించిన ఆమెయొక్క గొప్ప తేజస్సుతో అచ్చటి రాత్రి దీపాలు కూడా వెంటనే వెలవెలబోయాయి.

**శ్రుత్వా తద్రోదనం రమ్యం గృహస్థా స్సర్వయోషితః ।**
**జహృషు స్సంభ్రమాత్తత్రాగతాః ప్రీతిపురస్సరాః ॥3॥**

ఆమె యొక్క రమ్యమైన రోదనాన్ని ఇంటిలోని స్త్రీలందరు విన్నారు. వారందరు ఆశ్చర్యంతో త్వరగా అచ్చటకు వచ్చి, ప్రేమతో, ఆనందంతో, పులకించారు.

**తచ్ఛుద్ధాంతచరః శీఘ్రం శశంస భూభృతే తదా ।**
**పార్వతీజన్మ సుఖదం దేవకార్యకరం శుభమ్ ॥4॥**

దేవకార్యాన్ని సిద్ధింపజేయునట్టియు, శుభకరమైనట్టియు, సుఖప్రదమైనట్టియు, పార్వతీ జననాన్ని గూర్చి అంతఃపుర పరిచారకుడు శీఘ్రమే హిమవంతునకు తెలిపాడు.

**తచ్ఛుద్ధాంతచరాయాశు పుత్రీజన్మ సుశంసతే ।**
**సితాతపత్రం నాదేయమాసీత్తస్య మహీభృతః ॥5॥**

కుమార్తె జన్మించినదను శుభవార్తను చెప్పిన అంతఃపుర పరిచారకునకు హిమవంతుడు తన శ్వేత ఛత్రాన్ని దానంచేయడం వింతగా అనిపించలేదు.

**గతస్తత్ర గిరిః ప్రీత్యా స పురోహిత సద్విజః ।**
**దదర్శ తనయాం తాం తు శోభమానాం సుభాససా ॥6॥**

ఆ శైలరాజు వెంటనే పురోహితునితో, బ్రాహ్మణునితోగూడి, ఆనందంతో అక్కడకు వెళ్ళి చక్కని కాంతులతో శోభిల్లుతున్న కుమార్తెను చూశాడు.

**నీలోత్పల దళశ్యామాం సుద్యుతిం సుమనోరమామ్ ।**
**దృష్ట్వా చ తాదృశీం కన్యాం ముమోదాతి గిరీశ్వరః ॥7॥**

నల్లకలువ రేకులవలె శ్యామల వర్ణం గలట్టియు, గొప్ప కాంతితో ప్రకాశించుచున్నట్టియు, సుమనోహరమైనట్టియు ఆ కన్యనుచూచి పర్వతరాజు మిక్కిలి ఆనందించాడు.

**సర్వే చ ముముదుస్తత్ర పౌరాశ్చ పురుషాః స్త్రియః ।**
**తదోత్సవో మహానాసీన్నేదుర్వాద్యాని భూరిశః ॥8॥**

అచటనున్న పౌరులు, పురుషులు, స్త్రీలు అందరూకూడా ఆనందించారు. అంతట అక్కడ మహోత్సవం జరిగింది. వివిధ వాద్యాలు గట్టిగా మ్రోగింపబడ్డాయి.

**బభూవ మంగళం గానం ననృతుర్వార యోషితః ।**
**దానం దదౌ ద్విజాతిభ్యో జాతకర్మ విధాయ చ ॥9॥**

మంగళగానాలు పాడబడ్డాయి. వారాంగనలు నాట్యాలు చేశారు. హిమవంతుడు జాతకర్మనుచేసి, బ్రాహ్మణులకు దానాలనిచ్చాడు.

**అథ ద్వారం సమాగత్య చకార సుమహోత్సవమ్ ।**
**హిమాచలః ప్రసన్నాత్మా భిక్షుభ్యో ద్రవిణం దదౌ ॥10॥**

అంతట హిమవంతుడు సింహద్వారం వద్దకు వచ్చి, మహోత్సవాన్ని జరిపాడు. ఆయన ప్రసన్నాత్ముడై, భిక్షుకులకు ధనాన్ని దానం చేశాడు.

**అథో ముహూర్తే సుమతే హిమవాన్మునిభిః సహ ।**
**నామాఽకరోత్సుతాయాస్తు కాళీత్యాది సుఖప్రదమ్ ॥11॥**

అంతట హిమవంతుడు శుభ ముహూర్తంలో మునులతో కూడి ఆ కుమార్తెకు 'కాళి' మొదలగు సుఖప్రదమైన పేర్లను పెట్టాడు.

**దానం దదౌ తదా ప్రీత్యా ద్విజేభ్యో బహుసాదరమ్ ।**
**ఉత్సవం కారయామాస వివిధం మానపూర్వకమ్ ॥12॥**

అప్పుడు హిమవంతుడు బ్రాహ్మణులకు మిక్కిలి ఆదరణతో, ప్రీతితో దానాన్నిచ్చాడు. అనేక విధములైన సమ్మానాలతో ఉత్సవాన్ని జరిపించాడు.

**ఇత్థం కృత్వోత్సవం భూరి కాళీం పశ్యన్ముహుర్ముహుః ।**
**లేభే ముదం సపత్నీకో బహుపుత్రోఽపి భూధరః ॥13॥**

హిమవంతుడు అనేక పుత్రులు కలవాడైనప్పటికి భార్యతోకూడి ఈవిధంగా గొప్ప ఉత్సవాన్ని చేసి, ఆ కాళిని మరల మరల చూస్తూ అమితానందాన్ని పొందాడు.

**తత్ర సా వవృధే దేవీ గిరిరాజ గృహే శివా ।**
**గంగేవ వర్షాసమయే శరదీవాథ చంద్రికా ॥14॥**

వర్షాకాలంలో గంగవలె, శరత్కాలమందలి వెన్నెలవలె, ఆ దేవి హిమవంతుని ఇంట దినదిన ప్రవర్ధమానమై వెలుగొందుతోంది.

**ఏవం సా కాళికాదేవీ చార్వఙ్గీ చారుదర్శనా ।**
**దధ్రేచానుదినం రమ్యాం చంద్రబింబకళామివ ॥15॥**

సుందరాంగియు, సుదర్శనయునైన కాళికాదేవి అచ్చట ప్రతిదినము శుక్లపక్ష చంద్రబింబ కళలవలె మనోహరంగా పెంపొందుతోంది.

**కులోచితేన నామ్నా తాం పార్వతీత్యా జుహావహ ।**
**బంధుప్రియాం బంధుజనః సౌశీల్య గుణసంయుతామ్ ॥16॥**

బంధువులకిష్టురాలు, సౌశీల్య గుణసంయుతయు నైన ఆమెను బంధుజనులు కులానికి తగినట్లు 'పార్వతి' అనే పేరుతో పిలవనారంభించారు.

**ఉమేతి మాత్రా తపసే నిషిద్ధా కాళికా చ సా ।**
**పశ్చాదుమాఖ్యాం సుముఖీ జగామ భువనే మునే ॥17॥**

ఓ నారదమునీ! ఆ కాళి భవిష్యత్తులో తపస్సునకుపక్రమింపగా తల్లియైన మేనాదేవి "ఉ,మా (ఓ అమ్మాయి, వద్దు)" అని నిషేధిస్తుంది. అప్పటినుండి ఆ సుందరికి **'ఉమ'** అనేపేరు లోకంలో ప్రసిద్ధమయ్యింది.

**దృష్టిః పుత్రవతోఽప్యద్రే స్తస్మిం స్తృప్తిం జగామ న ।**
**అపత్యే పార్వతీత్యాఖ్యే సర్వసౌభాగ్యసంయుతే ॥18॥**

**మధోరనన్త పుష్పస్య చూతే హి భ్రమరావళిః ।**
**విశేషసంగా భవతి సహకారే మునీశ్వర ॥19॥**

హిమవంతుడు పుత్రసంతానం కలవాడైనప్పటికిని, సర్వ సౌభాగ్యవతియైన పార్వతి అను పుత్రికను ఎంత చూచినా అతనికి తృప్తి కలుగలేదు. ఓ మునీశ్వరా! వసంత ఋతువులో అనంత సంఖ్యలో పుష్పాలున్నప్పటికీ తుమ్మెదల గుంపు తీపి మామిడిచెట్టుపై విశేషమైన ప్రీతిని కలిగివుంటుంది కదా!

**పూతో విభూషితశ్చాపి స బభూవ తయా గిరిః ।**
**సంస్కారవత్యైవ గిరా మనీషీవ హిమాలయః ॥20॥**

సంస్కారవంతమైన వాక్కుచేమాత్రమే మనిషి మనీషి యైనట్లు హిమవంతుడు పార్వతి వలన మాత్రమే పవిత్రుడయ్యాడు. అంతేకాక విభూషితుడు కూడా అయ్యాడు.

**ప్రభామహత్యా శిఖయేవ దీపో భువనస్య చ ।**
**త్రిమార్గయేవ సన్మార్గ స్త ద్వద్గిరిజయా గిరిః ॥21॥**

గొప్ప కాంతిని విరజిమ్ము అగ్నిశిఖతో లోకంలోని దీపము వలెను, గంగాదేవితో భువనము నందలి సన్మార్గము వలెను, హిమవంతుడు పార్వతితోకూడి ప్రకాశించాడు.

**కందుకైః కృత్రిమైః పుత్రైస్సఖీ మధ్యగతా చ సా ।**
**గంగా సైకత వేదీభి ర్బాల్యే రేమే ముహుర్ముహుః ॥22॥**

ఆమె బాల్యమునందు సఖీజనులతోగూడి, గంగా సైకత వేదికలపై బంతులతోను, ఆటబొమ్మ లతోను, చిరకాలం క్రీడించింది.

**అథ దేవీ శివా సా చోపదేశ సమయే మునే ।**
**పపాఠ విద్యాత్సుప్రీత్యా యతచిత్తా చ సద్గురోః ॥23॥**

ఓ నారదమునీ! ఆ శివాదేవి విద్యారంభ సమయంనుండియు పరమప్రీతితో, నియత చిత్తురాలై, సద్గురువులచెంత విద్యలనభ్యసించింది.

**ప్రాక్తనా జన్మవిద్యాస్తాం శరదీవ ప్రపేదిరే ।**
**హంసాళిస్స్వర్ణదీ నక్తమాత్మభాసో మహౌషధిమ్ ॥24॥**

శరత్కాలమునందు గంగానది వద్దకు హంసలుస్వయంగా వచ్చినట్లు రాత్రియందు తమ ప్రకాశం స్వయముగా మహౌషధులకు చేరినట్లుగా పూర్వజన్మయందలి విద్యలన్నియు వచ్చి ఆమెను చేరాయి.

**ఇత్థం సువర్ణితా లీలా శివాయాః కాచిదేవ హి ।**
**అన్యలీలాం ప్రవక్ష్యేఽహం శ్రుణు త్వం ప్రేమతో మునే ॥25॥**

మునీంద్రా! ఈవిధంగా శివాదేవి కొన్ని లీలలను మాత్రమే నీకు చక్కగా వర్ణించాను. ఇప్పుడు ఇతర లీలలను కూడా నేను వివరించి చెబుతాను. ప్రీతితో శ్రద్ధగా విను.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే పార్వతీ బాల్యలీలావర్ణనం నామ సప్తమోఽధ్యాయః ॥7॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో పార్వతీదేవి బాల్యలీలావర్ణనం అనే ఏడవ అధ్యాయం సమాప్తం.

## **అష్టమోఽధ్యాయః - ఎనిమిదవ అధ్యాయం**

## **నారదహిమాలయసంవాదః - నారదహిమగిరులసంవాదం**

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏకదా తు శివజ్ఞానీ శివలీలా విదాం వరః ।**
**హిమాచలగృహం ప్రీత్యా గమస్త్వం శివప్రేరితః ॥1॥**

నారదా! శివజ్ఞానియు, శివలీలల నెరిగినవారిలో శ్రేష్ఠుదవగు నీవు శివునిచే ప్రేరితుడవై ఒకనాడు ప్రీతితో హిమవంతుని గృహానికి వెళ్ళావు.

**దృష్ట్వా మునే! గిరీశస్త్వాం నత్వానర్చ స నారద ।**
**ఆహూయ చ స్వ తనయాం త్వదంఘ్ర్యో స్తామపాతయత్ ॥2॥**

ఓ నారదమునీ! ఆ పర్వతరాజు నిన్నుచూచి, నమస్కరించి, పూజించాడు. తన కుమార్తెను పిలిపించి, నీపాదాలపై పడవైచాడు.

**పునర్నత్వా మునీశ త్వా మువాచ హిమభూధరః ।**
**సాంజలిః స్వవిధిం మత్వా బహుసన్నతమస్తకః ॥3॥**

మునీశ్వరా! హిమవంతుడు చేతులు జోడించి, శిరస్సు బాగుగా వంచి, నీకు నమస్కరించి, తన విధిగా భావించి, ఇలా ప్రసంగించాడు.

**హిమాలయ ఉవాచ** - హిమాలయుడు పలికాడు.

**హే మునే నారద జ్ఞానిన్ బ్రహ్మపుత్రవర ప్రభో ।**
**సర్వజ్ఞస్త్వం సకరుణః పరోపకరణే రతః ॥4॥**

ఓ నారదమునీంద్రా! నీవు బ్రహ్మపుత్రులలో శ్రేష్ఠుదవు, జ్ఞానివి, సర్వమును ఎరిగినవాడవు, దయామూర్తివి, పరోపకారపరాయణుడవు.

**మత్సుతా జాతకం బ్రూహి గుణదోషసముద్భవమ్ ।**
**కస్యప్రియా భాగ్యవతీ భవిష్యతి సుతా మమ ॥5॥**

నా కుమార్తె జాతకంలోని గుణదోషాలవలన కలుగబోవు పరిణామాలను చెప్పుము. భాగ్యవతియైన నా కుమార్తె ఎవనికి భార్యకాగలదు?

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తో మునివర్య! త్వం గిరీశేన హిమాద్రిణా ।**
**విలోక్య కాళికాహస్తం సర్వాంగం చ విశేషతః ॥6॥**

**అవోచస్త్వం గిరిం తాత కౌతుకీ వాగ్విశారదః ।**
**జ్ఞానీ విదిత వృత్తాంతో నారదః ప్రీతమానసః ॥7॥**

పర్వతరాజైన హిమవంతుడిట్లు పలుకగా నీవు కాళికాదేవి హస్తమును విశేషించి సర్వావయవములను పరిశీలించావు. వత్సా! వాగ్విశారదుడు జ్ఞాని, వృత్తాంతము నంతయును తెలిసినవాడవుగు నీవు ప్రీతమానసుడవై, హిమవంతునితో ఇలా పలికావు.

**ఏషా తే తనయా మేనే సుధాంశోరివ వర్ధితా ।**
**ఆద్యా కళా శైలరాజ! సర్వలక్షణశాలినీ ॥8॥**

ఓ శైలరాజా! ఈ నీ కుమార్తె చంద్రుని ఆదికళతో సమానురాలై పెరిగింది. ఈమె సమస్త శుభలక్షణ సంపన్న.

**స్వపతే స్సుఖదాత్యన్తం పిత్రోః కీర్తి వివర్ధినీ ।**
**మహాసాధ్వీ చ సర్వాసు మహానందకరీ సదా ॥9॥**

తన పతికి ఈమె మిక్కిలి సుఖప్రద అవుతుంది. తల్లిదండ్రుల కీర్తిని వృద్ధిచేస్తుంది. సమస్త స్త్రీలయందును ఈమె పరమసాధ్వి. స్వజనులకు సదా మహానందాన్ని కలిగిస్తుంది.

**సులక్షణాని సర్వాణి త్వత్సుతాయాః కరే గిరే ।**
**ఏకా విలక్షణారేఖా తత్ఫలం శ్రుణు తత్త్వతః ॥10॥**

ఓ గిరిరాజా! నీపుత్రిక చేతియందు అన్నియు ఉత్తమ లక్షణాలే కనిపిస్తున్నాయి. ఒకరేఖమాత్రం విలక్షణంగా ఉంది. దాని యథార్థఫలాన్ని విను.

**యోగీ నగ్నోఽ గుణోఽ కామీ మాతృతాతవివర్జితః ।**
**అమానోఽ శివవేషశ్చ పతిరంస్యాః కిలేదృశః ॥11॥**

ఈమెకు యోగియైనవాడును, దిగంబరుడును, నిర్గుణుడును, నిష్కాముడును భర్తకాగలడు. అతనికి తల్లిదండ్రులుండరు. అతడెప్పుడును అమంగళకరమైన వేషధారణ చేస్తాడు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తే హి సత్యం మత్వా చ దంపతీ ।**
**మేనా హిమాచలశ్చాపి దుఃఖితౌ తౌ బభూవతుః ॥12॥**

నారదా! నీయీ మాటలను విని, మేనకా హిమవంతులిరువురును అవి సత్యములని తలంచి మిక్కిలి దుఃఖితులయ్యారు.

**శివాకర్ణ్య వచస్తే హి తాదృశం జగదంబికా ।**
**లక్షణైస్తం శివం మత్వా జహర్షాతి మునే హృది ॥13॥**

జగదంబ మాత్రము నీ మాటలను విని నీవు చెప్పిన లక్షణములద్వారా తనకు కాబోవు భర్త శివుడని తలంచి, మనసులోనే హర్షోల్లాసములతో పొంగిపోయింది.

**నమృషా నారద వచస్త్వితి సంచిన్త్య సా శివా ।**
**స్నేహం శివపదద్వంద్వే చకారాతి హృదా తదా ॥14॥**

నారదుని మాటలెన్నడును అసత్యములు కావని తలంచి, ఆదేవి భగవంతుడైన శివుని చరణ యుగళములను తన హృదయమునందు నాటినుండి నిలుపుకొని, నిరంతరము మిక్కిలిగా ప్రేమింపసాగింది.

**ఉవాచ దుఃఖితః శైలస్త్వాం తదా హృది నారద ।**
**కముపాయం మునే కుర్యామతిదుఃఖమభూదితి ॥15॥**

నారదా! అంతట మనస్సులో దుఃఖితుడైన హిమవంతుడు నీతో ఇలా పలికాడు. మునీంద్రా! ఆ ఫలితమును వినిన నాకు మిక్కిలి దుఃఖం కలిగింది. నా పుత్రికను దానినుండి రక్షించు ఉపాయమేమి?

**తచ్ఛ్రుత్వా త్వం మునే ప్రాత్థ మహా కౌతుక కారకః ।**
**హిమాచలం శుభైర్వాక్యైర్హర్షయన్వాగ్విశారదః ॥16॥**

నారద మునీంద్రా! నీవు గొప్ప కుతూహలాన్ని కలుగజేస్తావు. మాటలాడుటయందు మిగుల నేర్పరివి. హిమవంతుని మాటలను విని, మంగళకర వచనములద్వారా వారి ఆనందాన్ని వృద్ధిచేస్తూ నీవిలా పలికావు.

**నారద ఉవాచ –** నారదుడు చెప్పాడు.

**స్నేహాచ్ఛృణు గిరే వాక్యం మమ సత్యం మృషా న హి ।**
**కరరేఖా బ్రహ్మలిపిర్నమృషా భవతి ధ్రువమ్ ॥17॥**

పర్వతరాజా! నీవు స్నేహపూర్వకంగా నామాట వినుము. ఇది సత్యం. అది అసత్యం కాదు. చేతియందలి రేఖ బ్రహ్మలిపి. అది అసత్యం కాజాలదు. ఇది నిశ్చయం.

**తాదృశోఽస్యాః పతిఃశైల భవిష్యతి న సంశయః ।**
**తత్రోపాయం శ్రుణు ప్రీత్యా యం కృత్వా లప్స్యసే సుఖమ్ ॥18॥**

ఈ కన్యకకు అటువంటి పతియే లభిస్తాడు. సంశయం లేదు. ఇక్కడ ఒక ఉపాయంకూడా కలదు. దానిని ప్రీతితో విను. అది చేయడం వలన నీకు కూడా సుఖం కలుగుతుంది.

**తాదృశోఽస్తి వరః శంభుర్లీలారూపధరః ప్రభుః ।**
**కులక్షణాని సర్వాణి తత్ర తుల్యాని సద్గుణైః ॥19॥**

భగవంతుడగు శంకరునివంటి వరుని నేను నిరూపించి తెలియజేశాను. అతడు సర్వ సమర్థుడు. అనేక రూపాలనతడు లీలగా ధరిస్తూ ఉంటాడు. చెడులక్షణాలన్నియు అతని యందు సద్గుణాలుగా మార్పుచెందుతాయి.

**ప్రభౌ దోషో న దుఃఖాయ దుఃఖదోఽత్యప్రభౌ హి సః ।**
**రవిపావకగంగానాం తత్ర జ్ఞేయా నిదర్శనా ॥20॥**

సమర్థుడైన పురుషునియందు ఏదేని దోషమున్నచో అది అతనికి దుఃఖాన్ని కలిగింపదు. అసమర్థునికి అది దుఃఖప్రదమౌతుంది. ఈ విషయంలో సూర్యుణ్ణీ, అగ్నినీ, గంగలను దృష్టాంతాలుగా తీసుకోవాలి.

**తస్మాచ్ఛివాయ కన్యాం స్వాం శివాం దేహి వివేకతః ।**
**శివః సర్వేశ్వరః సేవ్యోఽవికారీ ప్రభురవ్యయః ॥21॥**

కావున వివేకంతో నీవు నీకన్యను భగవంతుడైన శివునకిమ్ము. శివుడు సర్వేశ్వరుడు, సేవింప దగినవాడు, నిర్వికారుడు, అవ్యయుడు నైన ప్రభుడు.

**శీఘ్రు ప్రసాదః సశివః తాం గ్రహీష్యత్యసంశయమ్ ।**
**తపః సాధ్యో విశేషేణ యది కుర్యాచ్ఛివా తపః ॥22॥**

శివుడు శీఘ్రుముగనే ప్రసన్నమౌతాడు. కనుక నీ కన్యను నిస్సంశయంగా పరిగ్రహిస్తాడు. విశేషంగా ఆ స్వామి తపస్సునకు వశుడౌతాడు. కాబట్టి పార్వతి తపమాచరించినచో సకల కార్యాలు సిద్ధిస్తాయి.

**సర్వథా సుసమర్థో హి సశివః సకలేశ్వరః ।**
**కులిశస్యాపి విధ్వంసీ బ్రహ్మాధీనః సుఖప్రదః ॥23॥**

సర్వేశ్వరుడగు శివుడు అన్నివిధముల బాగుగా సమర్థుడు. ఆయన ఇంద్రుని వజ్రాయుధమును కూడ నశింపజేయగలడు. బ్రహ్మ ఆయన అధీనంలో ఉంటాడు. ఆ స్వామి అందరికిని సుఖాన్ని ప్రసాదిస్తాడు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా త్వం పునస్తాత! కౌతుకీ బ్రహ్మవిన్మునే ।**
**శైలరాజమవోచో హి హర్షయన్వచనైః శుభైః ॥24॥**

వత్సా! ఉత్కంఠను కలిగించువాడవు, బ్రహ్మవేత్తవునగు నీవిట్లు పలికి, పర్వతరాజును శుభవచనాలతో ఆనందింపజేస్తూ మరల ఇలా పలికావు.

**భావినీదయితా శంభోః సానుకూలా సదా హరే ।**
**మహాసాధ్వీ సువ్రతా చ పిత్రోః సుఖవివర్ధినీ ॥25॥**

ఈమె శంభునకు పత్నియై, ఆయనకు సర్వదా అనుకూలవతియై, మహాపతివ్రతయై, సువ్రతయై, తల్లిదండ్రులకు సుఖవివర్ధిని కాగలదు.

**శంభోశ్చిత్తం వశేచైషా కరిష్యతి తపస్వినీ ।**
**సచాప్యేనామృతే యోషాం నహ్యన్యాముద్వహిష్యతి ॥26॥**

ఈ తపస్విని శంభుని చిత్తాన్ని తన వశం చేసుకోగలదు. ఆయనకూడా ఈమెను దక్క మరియొక స్త్రీని వివాహమాడడు.

**ఏతయో స్సదృశం ప్రేమ న కస్యాప్యేవ తాదృశమ్ ।**
**భూతం వా భవితా వాపి నాధునా చ ప్రవర్తత ॥27॥**

వీరిద్దరి ప్రేమతో సమానమైన ప్రేమ ఏ ఇద్దరి మధ్యనైనను భూతకాలంలో లేదు. వర్తమానంలోను లేదు. భవిష్యత్తులో ఉండబోదు.

**అనయోస్సురకార్యాణి కర్తవ్యాని మృతాని చ ।**
**యాని యాని నగశ్రేష్ఠ జీవితాని పునఃపునః ॥28॥**

వీరిద్దరు చేయవలసిన దేవకార్యములు కలవు. ఓ పర్వతరాజా! వీరు మృతులనెందరినో మరల జీవింపజేయవలసియున్నది.

**అనయా కన్యయా తేஉద్రే అర్ధనారీశ్వరో హరః ।**
**భవిష్యతి తథా హర్ష దినయో ర్మిలితం పునః ॥29॥**

ఓ పర్వతరాజా! శివుడు ఈ కన్యకు తన శరీరంలోని అర్ధభాగాన్నిచ్చి, అర్ధనారీశ్వరుడు కాగలడు. వీరిద్దరి కలయిక మరల సర్వత్ర ఆనందాన్ని కలిగిస్తుంది.

**శరీరార్ధం హరస్యైషా హరిష్యతి సుతా తవ ।**
**తపః ప్రభావాత్సంతోష్య మహేశం సకలేశ్వరమ్ ॥30॥**

ఈ నీ కుమార్తె శివుని శరీరం యొక్క అర్ధభాగాన్ని తన వశం చేసుకోగలదు. ఈమె తన తపశ్శక్తిచే సకలేశ్వరుడైన మహేశుని సంతోష పెట్టగలదు.

**స్వర్ణగౌరీ సువర్ణాభా తపసా తోష్య తం హరమ్ ।**
**విద్యుద్గౌరతమా చేయం తవ పుత్రీ భవిష్యతి ॥31॥**

తపస్సుతో శివుని సంతోషబెట్టి ఈ నీ కుమార్తె బంగారం వలె, మెరుపుతీగవలె, పచ్చని కాంతులతో శోభిల్లి, స్వర్ణగౌరిగా, సువర్ణాభగా వెలుగొందుతుంది.

**గౌరీతి నామ్నా కన్యాతు ఖ్యాతిమేషా గమిష్యతి ।**
**సర్వదేవగణైః పూజ్యా హరిబ్రహ్మాదిభిస్తథా ॥32॥**

ఈ కన్య 'గౌరి' అను పేరుతో విఖ్యాతి కాంచగలదు. ఈమె హరిబ్రహ్మాదులచేతను, సర్వగణాలతోను పూజింపబడుతుంది.

**నాన్యస్మై త్వమిమాం దాతుమిహార్హసి నగోత్తమ ।**
**ఇదం చోపాంశు దేవానాం న ప్రకాశ్యం కదాచన ॥33॥**

ఓ పర్వతోత్తమా! నీవీమెను మరియొకనికిచ్చి వివాహం చేయుట తగదు. ఇది దేవరహస్యం. ఎవ్వరికిని ఎప్పుడును దీనిని వెల్లడి చేయరాదు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి తస్య వచః శ్రుత్వా దేవర్షే తవ నారద ।**
**ఉవాచ హిమవాన్వాక్యం మునే త్వాం వాగ్విశారదః ॥34॥**

ఓ నారదా! దేవర్షీ! ఈ నీ మాటలను విని, వాగ్విశారదుడైన హిమవంతుడు నీతో ఇలా పలికాడు.

**హే మునే! నారద! ప్రాజ్ఞ! విజ్ఞప్తిం కాంచిదేవ హి ।**
**కరోమి తాం శ్రుణు ప్రీత్యా తస్త్వం ప్రముదమావహ ॥35॥**

ఓ నారద మునీంద్రా! ప్రాజ్ఞా! నేనొక విన్నపాన్ని చేస్తాను. దానిని నీవు ప్రీతితోవిని అనంతరం నాకు ఆనందాన్ని కలిగించు.

**శ్రూయతే త్యక్త సఙ్గః స మహాదేవో యతాత్మవాన్ ।**
**తపశ్చరతి సన్నిత్యం దేవానామప్యగోచరః ॥36॥**

ఆ మహాదేవుడు సర్వసంగ పరిత్యాగి యనియు, ఆత్మనిగ్రహం కలవాడనియు, నిత్యం తపస్సు చేయుచుండుననియు, దేవతలకు కూడా కానరాడనియు వినియున్నాను.

**స కథం ధ్యాన మార్గస్థః పరబ్రహ్మార్పితం మనః ।**
**భ్రంశయిష్యతి దేవర్షే తత్ర మే సంశయో మహాన్ ॥37॥**

ఓ దేవర్షీ! పరబ్రహ్మమునందర్పితమైన మనస్సుగల ఆ శివుడు ధ్యానమార్గమునుండి, ఎట్లు చ్యుతుడౌతాడు. ఈ విషయంలో నాకు పెద్ద సందేహం కలదు.

**అక్షరం పరమం బ్రహ్మ ప్రదీప కలికోపమమ్ ।**
**సదాశివాఖ్యం స్వం రూపం నిర్వికారమజాత్పరమ్ ॥38॥**

**నిర్గుణం సగుణం తచ్చ నిర్విశేషం నిరీహకమ్ ।**
**అతః పశ్యతి సర్వత్ర న తు బాహ్యం నిరీక్షతే ॥39॥**

నాశము లేనిదియు, హృదయములో దీపశిఖవలె ప్రకాశించునదియు, సదాశివ నామధేయము కలదియు, వికారములు లేనిదియు, పుట్టుక, మరణము లేనిదియు, నిర్గుణము, సగుణము, విశేష రహితము, కోరికలతో సంబంధం లేనిదియు నగు పరబ్రహ్మమును ఆయన స్వరూపంగా దర్శిస్తాడు. ఆయన సర్వత్ర బ్రహ్మమునే దర్శించునుగాని ఆయనకు బాహ్యదృష్టి లేదు.

**ఇతి స శ్రూయతే నిత్యం కిన్నరాణాం ముఖాన్మునే ।**
**ఇహాగతానాం సుప్రీత్యా కిం తన్మిథ్యా వచో ధ్రువమ్ ॥40॥**

ఓ దేవర్షీ! నేనీవిధంగా ఇచ్చటకు వచ్చి ప్రీతితో నాతోమాటలాడే కిన్నరుల ముఖమునుండి అనేక పర్యాయములు వినియున్నాను. ఈ మాట అసత్యమనుట నిశ్చయమేనా?

**విశేషతః శ్రూయతే స సాక్షాన్నామ్నా తథా హరః ।**
**సమయం కృతవాన్పూర్వం తన్మయా గదితం శృణు ॥41॥**

విశేషించి ఆయనకు హరుడను పేరుగలదని కూడా వినియున్నాను. ఆపేరునుబట్టి (హరించువాడు హరుడు) ఆయన అట్టివాడే అయిఉండునని లోకంలో వినబడుతోంది. ఆయన పూర్వం ఒక ప్రతిజ్ఞ చేశాడట. దానిని చెబుతాను విను.

**నత్వామృతేఽన్యాం వరయే దాక్షాయణి ప్రియే సతీ ।**
**భార్యార్థం న గ్రహీష్యామి సత్యమేతద్బ్రవీమి తే ॥42॥**

దాక్షాయణీ! సతీ! ప్రియా! నిన్నుతక్క మరియొక స్త్రీని నేను భార్యగా స్వీకరించను, వరించను. నేను సత్యమునే పలుకుచున్నాను.

**ఇతి సత్యా సమం తేన పురైవ సమయః కృతః ।**
**తస్యాం మృతాయాం సకథం స్వయమన్యాం గ్రహీష్యతి ॥43॥**

ఈవిధంగా ఆయన పూర్వమే సతీదేవి ఎదుట ప్రతిజ్ఞ చేసియున్నాడు. ఆమె మరణించింది. ఇప్పుడాతడు మరియొక స్త్రీని ఎట్లు వివాహమాడగలడు?

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా స గిరిస్తూష్ణీమాస తస్య పురస్తవ ।**
**తదా కర్ణ్యాథ దేవర్షే త్వం ప్రావోచస్సుతత్త్వతః ॥44॥**

ఆ హిమవంతుడు నీయెదుట ఇట్లు పలికి, మిన్నకుండెను. ఓ దేవర్షీ! నీవామాటలను విని, యథార్థమును నిశ్చయించి, అతనితో నీవిలాపలికావు.

**నారద ఉవాచ** – నారదుడు చెప్పాడు.

**న వై కార్యా త్వయా చింతా గిరిరాజ మహామతే ।**
**ఏషా తవ సుతా కాళీ దక్షజాహ్యభవత్పురా ॥45॥**

ఓ పర్వతరాజా! మహామతీ! నీవు చింతిల్లకుము. నీ కుమార్తెయగు ఈ కాళికయే పూర్వమునందు దక్షపుత్రికగా జన్మించింది.

**సతీనామా భవత్తస్యా స్సర్వమంగళదం సదా ।**
**సతీ సా వై దక్షకన్యా భూత్వా రుద్రప్రియాభవత్ ॥46॥**

ఆమె అప్పుడు "సతి" అను పేరుతో సర్వదా సర్వమంగళదాయిగా ప్రసిద్ధిగాంచింది. ఆ సతి దక్షపుత్రికయై రుద్రునకు పత్ని అయ్యింది.

**పితుర్యజ్ఞే తథా ప్రాప్యానాదరం శంకరస్య చ ।**
**తం దృష్ట్వా కోపమాధాయాత్యాక్షీ ద్దేహం చ సా సతీ ॥47॥**

ఆ సతి తండ్రిచేసిన యజ్ఞంలో శంకరునకు అనాదరణ జరగడం గాంచి, కోపాన్ని పొంది, దేహాన్ని త్యజించింది.

**పునస్సైవ సముత్పన్నా తవ గేహేఽమ్బికా శివా ।**
**పార్వతీ హరపత్నీయం భవిష్యతి న సంశయః ॥48॥**

ఆ జగన్మాతయగు సతీదేవియే మరల నీ గృహంలో జన్మించింది. కాబట్టి ఈ పార్వతి శివుని పత్ని అగుననుటలో ఎట్టి సందేహం లేదు.

**ఏతత్సర్వం విస్తరాత్త్వం ప్రోక్తవాన్ భూభృతే మునే ।**
**పూర్వరూపం చరిత్రం చ పార్వత్యాః ప్రీతివర్ధనమ్ ॥49॥**

ఓ మునీంద్రా! ఈ వృత్తాంతాన్నంతటిని సవిస్తరంగా నీవు పర్వతరాజునకు చెప్పావు. నీవు చెప్పిన ఆ పూర్వచరిత్ర పార్వతికి మహానందాన్ని కలిగించింది.

**తం సర్వం పూర్వవృత్తాంతం కాళ్యా మునిముఖాద్గిరిః ।**
**శ్రుత్వా సపుత్రదారః స తదా నిఃసంశయోఽభవత్ ॥50॥**

హిమవంతుడు, ఆయనభార్య మేనాదేవి, కుమారులు నారదమహర్షి ముఖంనుండి కాళికాదేవి పూర్వ వృత్తాంతా న్నంతటిని విని, నిస్సంశయులయ్యారు.

**తతః కాళీ కథాం శ్రుత్వా నారదస్య ముఖాత్తదా ।**
**లజ్జయాధోముఖీ భూత్వా స్మిత విస్తారితాననా ॥51॥**

అంతట నారదుని ముఖంనుండి ఆ గాథను విని, కాళిక సిగ్గుతో తలవంచుకుంది. ఆమె ముఖం చిరునవ్వుతో విప్పారింది.

**కరేణ తాం తు సంస్పృశ్య శ్రుత్వా తచ్చరితం గిరిః ।**
**మూర్ధ్ని శశ్వత్తథాఘ్రాయ స్వాసనాన్తే న్యవేశయత్ ॥52॥**

హిమవంతుడా చరిత్రను విని, ఆమెను చేతితో స్పృశించి, శిరస్సును మూర్కొని, తన ఆసన సమీపంలో కూర్చుండబెట్టుకున్నాడు.

**తతస్త్వం తాం పునర్దృష్ట్వాఽవోచస్తత్ర స్థితాం మునే ।**
**హర్షయన్ గిరిరాజం చ మేనకాం తనయైః సహ ॥53॥**

ఓ నారదమునీ! అచటనున్న ఆమెనుచూచి నీవు మరలా ఇట్లు పలికావు. నీ పలుకులు హిమవంతునకు, మేనకాదేవికి, వారి కుమారులకు ఆనందాన్ని కలిగించాయి.

**సింహాసనంతు కిన్త్వస్యాః శైలరాజ! భవేదతః ।**
**శంభోరూరౌ సదైతస్యా ఆసనం తు భవిష్యతి ॥54॥**

ఓ పర్వతరాజా! ఇటుపై ఈమెయొక్క సింహాసనం సర్వదా శివుని ఊరువులు కాగలవు.

**హరేరూర్వాసనం ప్రాప్య తనయా తవ సన్తతమ్ ।**
**నయత్ర కస్యాచిద్దృష్టిర్మానసం వా గమిష్యతి ॥55॥**

నీకుమార్తె శివుని ఊరువులనే ఆసనాన్ని సర్వకాలములందు పొంది, ఎవరి దృష్టికిగాని, మనస్సునకుగాని, గోచరంగాని స్థానాన్ని పొందగలదు.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి వచన ముదారం నారద త్వం గిరీశం త్రిదివ మగమ ఉక్త్వా తత్క్షణాదేవ ప్రీత్యా ।**
**గిరిపతిరపి చిత్తే చారు సంమోదయుక్తః స్వగృహ మగమదేవం సర్వసంపత్సమృద్ధమ్ ॥56॥**

నారదా! నీవీవిధంగా ఉదార వచనాలు పర్వతరాజుతో పలికి, వెంటనే ఆనందంతో స్వర్గానికి వెళ్ళియున్నావు. హిమవంతుడుకూడా ఆనందంతో నిండిన హృదయం కలవాడై, సర్వసంపదలతో నలరారు తన గృహానికి వెళ్ళాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే నారద హిమాలయ సంవాదవర్ణనం నామాష్టమోఽధ్యాయః ॥8॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో నారద హిమాలయసంవాదవర్ణనం అనే ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## నవమోఽధ్యాయః - తొమ్మిదవ అధ్యాయం

## స్వప్నవర్ణన పూర్వకం సంక్షేప శివచరిత్రవర్ణనమ్ - స్వప్నవర్ణన పూర్వక సంక్షేప శివచరిత్రవర్ణన

**నారద ఉవాచ -** నారదుడు చెప్పాడు.

**విధే తాత త్వయా శైవవర ప్రాజ్ఞాద్భుతా కథా ।**
**వర్ణితా కరుణాం కృత్వా ప్రీతిర్మే వర్ధితాధికమ్ ॥1॥**

తండ్రీ! విధీ! నీవు శివభక్తాగ్రేసరుడవు. ప్రాజ్ఞుడవు, నీవు దయతో అద్భుతము, శ్రేష్ఠము అయిన గాథను వర్ణించియున్నావు. నాకత్యధికమైన ప్రీతి వృద్ధిపొందింది.

**విధే గతే స్వకం ధామ మయి వై దివ్యదర్శగే ।**
**తతః కిమభవత్తాత కృపయా తద్వదాధునా ॥2॥**

హే విధీ! దివ్యదర్శనుడనగునేను నా స్థానానికి మరలిపోయిన తరువాత ఏమయ్యింది? తండ్రీ! దయతో నాకావృత్తాంతాన్ని ఇప్పుడు చెప్పండి.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**గతే త్వయి మునే స్వర్గే కియత్కాలే గతే సతి ।**
**మేనా ప్రాప్యైకదా శైలనికటం ప్రణనామ సా ॥3॥**

నారదా! నీవు స్వర్గలోకానికి వెళ్ళిన కొంతకాలం గడిచిన పిమ్మట ఒకనాడు మేనాదేవి హిమవంతుని వద్దకు వెళ్లి అతనికి ప్రణామం చేసింది.

**స్థిత్వా సవినయం ప్రాహ స్వనాథం గిరికామినీ ।**
**తత్ర శైలాధినాథం సా ప్రాణప్రియసుతా సతీ ॥4॥**

హిమవంతుని ప్రియురాలైన మేనాదేవి తన కుమార్తెయందు ప్రాణాధికమైన ప్రేమ కలిగినదై తన భర్తయగు పర్వతరాజుతో వినయపూర్వకంగా ఇలా పలికింది.

**మేనోవాచ -** మేనకా దేవి పలికింది.

**మునివాక్యం న బుద్ధం మే సమ్యక్ నారీ స్వభావతః ।**
**వివాహం కురు కన్యాయాస్సుందరేణ వరేణ హ ॥5॥**

ప్రాణనాథా! నారద మునీంద్రులు చెప్పిన మాటలను స్త్రీ స్వభావ కారణంచే నేను బాగా అర్థం చేసుకొనలేకపోయాను. మీరు ఒక సుందరుడైన వరునకిచ్చి పార్వతీ వివాహాన్ని చేయవలసినదిగా నా ప్రార్థన.

**సర్వథా హి భవేత్తత్రోద్వాహోఽపూర్వ సుఖావహః ।**
**వరశ్చ గిరిజాయాస్తు సులక్షణ కులోద్భవః ॥6॥**

ఆ వివాహము సర్వథా అపూర్వ సుఖావహం కావాలి. గిరిజను వరించ బోవువాడు శుభ లక్షణ సంపన్నుడు, కులీనుడు, కావాలి.

**ప్రాణప్రియా సుతా మే హి సుఖితా స్యాద్యథా ప్రియ ।**
**సద్వరం ప్రాప్య సుప్రీతా తథా కురు నమోఽస్తు తే ॥7॥**

నా ప్రాణముల కంటే కూడా నాకుమార్తె నాకధిక ప్రియమైనది. ఆమె సద్వరునిపొంది, సంప్రీతురాలై సుఖపడేటట్లు చేయుము. మీకు నా నమస్కారములు.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వాశ్రుముఖీ మేనా పత్యంఘ్ర్యోః పతితా తదా ।**
**తాముత్థాప్య గిరిః ప్రాహ యథావత్ప్రజ్ఞసత్తమః ॥8॥**

మేనాదేవి ఇట్లు పలికి, తన భర్త చరణాలపై వాలింది. ఆమె కన్నులనుండి అశ్రుధార ప్రవహిస్తోంది. ప్రాజ్ఞ శిరోమణియైన హిమవంతుడామెను లేవదీసి, నచ్చచెప్పడానికి ప్రారంభించాడు.

**హిమాలయ ఉవాచ -** హిమాలయుడు పలికాడు.

**శ్రుణు త్వం మేనకే దేవి యథార్థం వచ్మి తత్త్వతః ।**
**భ్రమం త్యజ మునేర్వాక్యం వితథం న కదాచన ॥9॥**

దేవీ! మేనకా! నేను యథార్థమైన తత్త్వ విషయాన్ని చెబుతాను. విను. భ్రమను విడిచిపెట్టు. నారదముని మాటలెప్పటికిని అసత్యాలు కాజాలవు.

**యది స్నేహః సుతాయాస్తే సుతాం శిక్షయ సాదరమ్ ।**
**తపః కుర్యాచ్ఛంకరస్య సా భక్త్యా స్థిర చేతసా ॥10॥**

నీకు కుమార్తెయందు మమతానురాగాలున్నచో భక్తిపూర్వకంగా చిత్తాన్ని స్థిరపరచుకొని, భగవంతుడైన శంకరునిగూర్చి, తపమాచరింపుమని నీ కుమార్తెకు శిక్షణనిమ్ము.

**చేత్ప్రసన్నః శివః కాల్యాః పాణిం గృహ్ణాతి మేనకే ।**
**సర్వం భూయాచ్ఛుభం నశ్యేన్నారదోక్త మమంగళమ్ ॥11॥**

మేనకా! భగవంతుడగు శివుడు ప్రసన్నుడై, కాళిక కరగ్రహణంచేస్తే అంతా శుభమే అవుతుంది. దానితో నారదుడు తెలిపిన అమంగళం, అశుభం నశిస్తాయి.

**అమంగళాని సర్వాణి మంగళాని సదాశివే ।**
**తస్మాత్సుతాం శివప్రాప్త్యై తపసే శిక్షయ ద్రుతమ్ ॥12॥**

అమంగళాలన్నీ సదాశివునియందు మంగళరూపాలుగా పరిణమిస్తాయి. కావున నీవు కుమార్తెకు శివుని పొందడానికి శీఘ్రంగా తపమాచరింపుమని శిక్షణనిమ్ము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య గిరేర్వాక్యం మేనా ప్రీతతరాఽభవత్ ।**
**సుతోపకంఠ మగమదుపదేష్టుం తపోరుచిమ్ ॥13॥**

నారదా! హిమవంతుని వచనాలను విని మేనక మిక్కిలి ఆనందాన్ని పొందింది. తపస్సునందు అభిరుచిని కలిగించడానికి, కుమార్తెకు ఉపదేశమివ్వడానికి, మేనాదేవి ఆమెవద్దకు వెళ్ళింది.

**సుతాఙ్గం సుకుమారం హి దృష్ట్వాతీవాథ మేనకా ।**
**వివ్యథే నేత్రయుగ్మే చాశ్రుపూర్ణేఽభవతాం ద్రుతమ్ ॥14॥**

కుమార్తెయొక్క సుకుమారమైన అవయవాలను చూచి మేనక మనస్సులో మిక్కిలి వ్యథచెందింది. అంతట ఆమెకు నేత్రాలనుండి అశ్రువులు స్రవించాయి.

**సుతాం సముపదేష్టుం తన్న శశాక గిరిప్రియా ।**
**బుబుధే పార్వతీ తద్వై జననీఙ్గితమాశు సా ॥15॥**

అంతట గిరిప్రియయైన మేనక తన కుమార్తెకుపదేశించడానికి అశక్తురాలయ్యింది. అంతట పార్వతి తల్లి మనోగతాన్ని వెంటనే తెలుసుకొంది.

**అథ సా కాలికాదేవీ సర్వజ్ఞా పరమేశ్వరీ ।**
**ఉవాచ జననీం సద్యః సమాశ్వాస్య పునఃపునః ॥16॥**

అంతట కాళికాదేవి సర్వజ్ఞురాలైన పరమేశ్వరి గాన పదేపదే తల్లికి ఊరటను కలిగిస్తూ ఇలా పలికింది.

**పార్వత్యువాచ –** పార్వతి పలికింది.

**మాతశ్శృణు మహాప్రాజ్ఞేఽద్యతనేఽజముహూర్తకే ।**
**రాత్రౌ దృష్టో మయా స్వప్నస్తం వదామి కృపాం కురు ॥17॥**

అమ్మా! నీవు మిగుల తెలివిగలదానవు. నా యీ మాటను వినుము. గడచినరాత్రి బ్రహ్మ ముహూర్తమున నేనొక కలగాంచాను. దానినిప్పుడు తెలుపుతాను. దయతో వినుము.

**విప్రశ్చైవ తపస్వీ మాం సదయః ప్రీతిపూర్వకమ్ ।**
**ఉపదిదేశ సుతపః కర్తుం మాతశ్శివస్య వై ॥18॥**

తల్లీ! స్వప్నంలో దయాళువు, తపస్వియునగు ఒక బ్రాహ్మణుడు నాకు కనిపించాడు. శివుని ప్రసన్నం చేసుకోవడానికి ఉత్తమమైన తపోవిధానాన్ని ప్రీతిపూర్వకంగా నాకతడుపదేశించాడు.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**తచ్ఛ్రుత్వా మేనకా శీఘ్రం పతిమాహూయ తత్ర చ ।**
**తత్స్వప్నం కథయామాస సుతా దృష్టమశేషతః ॥19॥**

నారదా! అదివిని మేనక వెంటనే తన భర్తనచ్చటకు పిలిపించింది. పుత్రిక చూచిన స్వప్నాన్నంతటిని ఆయనకు వినిపించింది.

**సుతా స్వప్న మథాకర్ణ్య మేనకాతో గిరీశ్వరః ।**
**ఉవాచ పరమప్రీతః ప్రియాం సంబోధయన్గిరా ॥20॥**

మేనకద్వారా కుమార్తె స్వప్న సమాచారాన్ని వినిన హిమవంతుడు మిగుల ప్రసన్నుడయ్యాడు. తన భార్యకు నచ్చచెబుతు ఇలా పలికాడు.

**గిరీశ్వర ఉవాచ -** గిరీశ్వరుడు చెప్పాడు.

**హే ప్రియేఽపరరాత్రాంతే స్వప్నో దృష్టో మయాపి హి ।**
**తం శృణు త్వం మహాప్రీత్యా వచ్మ్యహం తం సమాదరాత్ ॥21॥**

ఓ ప్రియురాలా! తెల్లవారుఝామున నేనుకూడా ఒక కలగన్నాను. దానినంతటిని నీకు వినిపిస్తాను. నీవు దానిని మహాప్రీతితో విను.

**ఏకస్తపస్వీ పరమో నారదోక్త వరాఙ్గ ధృక్ ।**
**పురోపకంఠం సుప్రీత్యా తపః కర్తుం సమాగతః ॥22॥**

మిగుల ఉత్తముడైన ఒక తపస్వి ఉన్నాడు. అతడు వరునిగూర్చి నారదముని చెప్పిన శ్రేష్ఠమైన లక్షణాలతో కూడిన శరీర లక్షణాలు కలిగియున్నాడు. మిగుల ప్రసన్నుడై, నా నగర సమీపంలోనే తపమాచరించడానికి వచ్చాడు.

**గృహీత్వా స్వ సుతాం తత్రాగమం ప్రీత తరోప్యహమ్ ।**
**మయా జ్ఞాతస్స వై శంభుర్నారదోక్త వరః ప్రభుః ॥23॥**

అతనిని చూసి నాకు మిక్కిలి సంతోషం కలిగింది. నేను నా కుమార్తెను వెంటతీసుకొని ఆయన దగ్గరకు వెళ్ళాను. నారదుడు తెలిపిన వరుడు, భగవంతుడగు శంభుడు ఇతడేయని అప్పుడు నాకు విదితమయ్యింది.

**సేవార్థం తస్య తనయాముపదిశ్య తపస్వినః ।**
**తం వై ప్రార్థితవాం స్తస్యాం న తదాంగీ చకార సః ॥24॥**

అప్పుడు నేను ఆ తపస్వికి సేవ చేయుమని మనకుమార్తెకుపదేశించాను. ఆమె సేవను స్వీకరింపుమని అతనినికూడా ప్రార్థించాను. కాని అతడు వెంటనే నామాటకు అంగీకరించలేదు.

**అభూద్వివాదస్సుమహాన్ సాంఖ్య వేదాంత సంమతః ।**
**తతస్తదాజ్ఞయా తత్ర సంస్థితాసీ త్సుతా మమ ॥25॥**

ఇంతలో అచ్చట సాంఖ్యం, వేదాంతాలకనుగుణంగా గొప్ప వాదవివాదాలు ప్రారంభమయ్యాయి. తదనంతరం వారి ఆదేశానుసారం నాకుమార్తె అచ్చటనే ఉండిపోయింది.

**నిధాయ హృది తం కామం సిషేవే భక్తితశ్చ సా ।**
**ఇతిదృష్టం మయా స్వప్నం ప్రోక్తవాంస్తే వరాననే ॥26॥**

తన హృదయంలో అతనినే కోరుతూ, భక్తితో అతనికి సేవచేయసాగింది. ఓ వరాననా! నేను గాంచిన స్వప్నవృత్తాంతమిదియే. దీనినంతటిని నీకు తెలియజేశాను.

**తతో మేనే కియత్కాలం పరీక్ష్యం తత్ఫలం ప్రియే ।**
**యోగ్యమస్తీదమేవేహ బుధ్యస్వ త్వం మమ ధ్రువమ్ ॥27॥**

ఓ ప్రియురాలా! కొంతకాలం వరకు వేచియుందాం. స్వప్న ఫలాన్ని పరీక్షిద్దాం. ఇప్పుడీవిధంగా చేయడమే సముచితమని తోస్తోంది. నా నిశ్చయాభిప్రాయం ఇదియే.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా గిరిరాజశ్చ మేనకా వై మునీశ్వర ।**
**సంతస్థతుః పరీక్షంతౌ తత్ఫలం శుద్ధచేతసౌ ॥28॥**

మునీంద్రా! హిమవంతుడిట్లు పలికి, స్వప్నఫలాన్ని పరీక్షించడానికి విశుద్ధ హృదయంతో మేనకా హిమవంతులు వేచియున్నారు.

**ఇత్థం వ్యతీతేఽల్పదినే పరమేశః సతాంగతిః ।**
**సతీవిరహ సువ్యగ్రో భ్రమన్సర్వత్ర సూతికృత్ ॥29॥**

**తత్రా జగామ సుప్రీత్యా కియద్గణయుతః ప్రభుః ।**
**తపః కర్తుం సతీప్రేమ విరహాకుల మానసః ॥30॥**

ఈ విధంగా కొన్నిరోజులు గడిచాయి. సత్పురుషులకు గతియు, సతీవిరహంచే వ్యగ్రుడునైన పరమేశ్వరుడు అంతటా తిరుగుతూ అక్కడకు వచ్చాడు. సతీప్రేమతో విరహాకుల మానసుడైన శివప్రభువు కొలది శైవగణాలతోకూడి, మిక్కలి ప్రేమతో తపమాచరించడానికి హిమవత్పర్వత ప్రాంతానికి వచ్చాడు.

**తపశ్చకార స్వం తత్ర పార్వతీ సేవనే రతా ।**
**సఖీభ్యాం సహితా నిత్యం ప్రసన్నార్థమభూత్తదా ॥31॥**

శివుడక్కడ తపమాచరిస్తున్నాడు. శివుని ప్రసన్నం చేసుకోవాలనే కోరికతో పార్వతీదేవి చెలికత్తెలతోకూడి ప్రతినిత్యం శివుని సేవయందు లగ్నమయ్యింది.

**విద్ధోఽపి మార్గణై శ్శంభుర్వికృతిం నాప స ప్రభుః ।**
**ప్రేషితేన సురై స్స్వాత్మ మోహనార్థం స్మరేణ వై ॥32॥**

అంతట దేవతలు శంకరుని మోహింపజేయడానికి పంపబడిన మన్మథునిచే బాణాలతో కొట్టబడినను, శివప్రభువు వికారాన్ని పొందలేదు.

**దగ్ధ్వా స్మరం చ తత్రైవ స్వవహ్ని నయనేన సః ।**
**స్మృత్వా మమ వచః క్రుద్ధో మహ్యమంతర్దధే తతః ॥33॥**

శివుడు తన ఫాల నేత్రాగ్నిచే మన్మథుని అక్కడనే దహింపజేశాడు. ఆయన నా మాటలను స్మరించి, కోపించినవాడై అచ్చటినుండి అంతర్హితుడయ్యాడు.

**తతః కాలేన కియతా వినాశ్య గిరిజా మదమ్ ।**
**ప్రసాదిత స్సుతపసా ప్రసన్నోఽభూన్మహేశ్వరః ॥34॥**

పార్వతీదేవి యొక్క గర్వాన్ని అణచిన మహేశ్వరుడు చాలాకాలం పిదప ఆమె యొక్క ఘోర తపస్సునకు ప్రసన్నుడయ్యాడు.

**లౌకికాచారమాశ్రిత్య రుద్రో విష్ణుప్రసాదితః ।**
**కాలీం వివాహయామాస తతోఽభూద్బహు మంగళమ్ ॥35॥**

తరువాత విష్ణువుచే ప్రార్థించబడిన రుద్రుడు లోకాచారాన్ననుసరించి, కాళికాదేవిని వివాహమాడాడు. అంతట అనేక మంగళాలు సంపన్నమయ్యాయి.

**ఇత్యేతత్కథితం తాత సమాసాచ్చరితం విభోః ।**
**శంకరస్య పరం దివ్యం కిం భూయః శ్రోతుమిచ్ఛసి ॥36॥**

వత్సా! శంకర విభుని గొప్ప దివ్యచరిత్రను సంగ్రహంగా నీకు చెప్పాను. ఇంకా నీవేమి వినగోరుచున్నావు?

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే స్వప్నవర్ణన పూర్వకం సంక్షేప శివచరితవర్ణనం నామ నవమోఽధ్యాయః ॥9॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో స్వప్నవర్ణన పూర్వక సంక్షేప శివచరిత్రవర్ణన అనే తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## దశమోఽధ్యాయః - పదవ అధ్యాయం

## భౌమోత్పత్తిశివలీలావర్ణనమ్ - భౌమోత్పత్తిశివలీలావర్ణనం

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**విష్ణుశిష్య!మహాభాగ!విధే!శైవవర! ప్రభో ।**
**శివలీలామిమాం వ్యాసాత్ప్రీత్యా మే వక్తుమర్హసి ॥1॥**

ఓ విష్ణుశిష్యా! మహాత్మా! విధీ! ప్రభూ! శైవవరా! ఈ శివలీలను నాకు సంగ్రహంగా నీవు ప్రీతితో చెప్పడానికర్హుడవు.

**సతీవిరహయుక్ శంభుః కిం చక్రే చరితం తథా ।**
**తపః కర్తుం కదాయాతో హిమవత్ప్రస్థముత్తమమ్ ॥2॥**

సతీ విరహంతో కూడిన శివుడేమిచేశాడు? శివుడు తపమాచరించడానికి హిమవత్ పర్వతాగ్ర భాగానికి ఎప్పుడు వచ్చాడు? ఆ చరిత్ర చెప్పు?

**శివాశివవివాదోఽభూత్కథం కామక్షయశ్చ మే ।**
**తపఃకృత్వా కథం ప్రాప శివం శంభుం చ పార్వతీ ॥3॥**

శివాశివులకు మధ్య జరిగిన సంభాషణ ఎట్టిది? మన్మథుడు నశించిన తీరేది? పార్వతి తపస్సు చేసి మంగళస్వరూపుడగు శివుని పొందిన విధమెట్టిది?

**తత్సర్వమపరం చాపి శివసచ్చరితం పరమ్ ।**
**వక్తుమర్హసి మే బ్రహ్మన్ మహానందకరం శుభమ్ ॥4॥**

ఓ బ్రహ్మ! ఈ వృత్తాంతాన్నంతటినిచెప్పి ఇతరమైన శివచరితమును కూడా చెప్పడానికి నీవే అర్హుడవు. ఈ శుభచరితం నాకు మహానందాన్ని కలిగిస్తోంది.

**సూతఉవాచ** - సూతమహాముని పలికాడు.

**ఇతి శ్రుత్వా నారదస్య ప్రశ్నం లోకాధిపోత్తమః ।**
**విధిః ప్రోవాచ సుప్రీత్యా స్మృత్వా శివపదాంబుజమ్ ॥5॥**

నారదుని ప్రశ్నలను విని, లోకపాలురందరిలో శ్రేష్ఠుడైన బ్రహ్మ శివుని పాదపద్మాలను స్మరించి, మిక్కిలి ప్రీతితో ఇట్లు పలికాడు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**దేవర్షే శైవవర్యాద్య తద్యశః శృణు చాదరాత్ ।**
**పావనం మంగళకరం భక్తివర్ధనముత్తమమ్ ॥6॥**

దేవర్షీ! శివభక్తశిరోమణీ! భగవంతుడగు శంకరుని యశస్సు పరమపవిత్రమైనది. మంగళకరమైనది. భక్తివర్ధకమైనది. ఉత్తమమైనది. దీనినిప్పుడు శ్రద్ధగా వినుము.

**ఆగత్య స్వగిరిం శంభుః ప్రియావిరహకాతరః ।**
**సస్మార స్వప్రియాం దేవీం సతీం ప్రాణాధికాం హృదా ॥7॥**

దక్షయజ్ఞం నుండి తన నివాసస్థానమైన కైలాసగిరికి తిరిగివచ్చిన శంభుడు ప్రియా విరహంతో ధైర్యాన్ని కోల్పోయాడు. ప్రాణాధికమైన ప్రియురాలగు సతీదేవిని హృదయమునందు స్మరింపసాగాడు.

**గణానాభాష్య శోచంస్తాం తద్గుణాన్ప్రేమవర్ధనాన్ ।**
**వర్ణయామాస సుప్రీత్యా దర్శయంల్లౌకికీం గతిమ్ ॥8॥**

తన పార్షదులను పిలిచి, సతీదేవినిగూర్చి శోకిస్తూ ఆమె ప్రేమవర్ధక గుణాలను మిగుల ప్రీతితో వర్ణింపసాగాడు. ఇది అంతయు ఆయన ప్రాపంచికగతివిధానాన్ని సూచించడానికే చేశాడు.

**దిగంబరో బభూవాథ త్యక్త్వా గార్హస్థ్యసద్గతిమ్ ।**
**పునర్బభ్రామ లోకాన్వై సర్వాంల్లీలా విశారదః ॥9॥**

తదుపరి గృహస్థాశ్రమం యొక్క చక్కని స్థితిని, రీతిని, పరిత్యజించి, దిగంబరుడయ్యాడు. లోకాలన్నింటి యందును ఉన్మత్తునివలె తిరుగాడసాగాడు. లీలావిశారదుడైనందున ఇట్టి విరహావస్థను ప్రదర్శింపసాగాడు.

**దర్శనం ప్రాప్య కుత్రాపి సతీవిరహదుఃఖితః ।**
**పునశ్చ గిరిమాయాతశ్శంకరో భక్తశంకరః ॥10॥**

సతీవిరహంతో దుఃఖితుడై ఆమెనెచ్చటను కానక, భక్తకల్యాణప్రదుడగు శంకరుడు మరల కైలాస పర్వతానికి తిరిగి వెళ్ళిపోయాడు.

**సమాధాయ మనోయత్నాత్సమాధిం దుఃఖనాశినమ్ ।**
**చకార చ దదర్శాసౌ స్వరూపం నిజమవ్యయమ్ ॥11॥**

మనస్సును ఏకాగ్రమొనర్చ ప్రయత్నించి, సకలదుఃఖాలను నశింపజేసే సమాధిస్థితుడయ్యాడు. ఆ ప్రభువు సమాధియందు అవ్యయుని (వినాశంలేని స్వరూపాన్ని) దర్శింపసాగాడు.

**ఇత్థం చిరతరం స్థాణుస్తస్థౌ ధ్వస్తగుణత్రయః ।**
**నిర్వికారీ పరం బ్రహ్మ మాయాధీశస్స్వయం ప్రభుః ॥12॥**

త్రిగుణరహితుడు, భగవంతుడునగు శివుడు స్థాణువు వలె చిరకాలం ఇట్టి సమాధియందు ఆసీనుడై యున్నాడు. ఆ స్వామి స్వయంగా మాయకు అధిపతి. నిర్వికారుడైన పరబ్రహ్మ.

**తతస్సమాధిం తత్యాజ వ్యతీయుర్వ్యమితాస్సమాః ।**
**యదా తదా బభూవాశు చరితం తద్వదామి వః ॥13॥**

ఈ విధంగా లెక్కలేనన్ని సంవత్సరాలు సమాధిస్థితిలో గడిపిన యనంతరం సమాధిస్థితిని వదలిపెట్టాడు. తదనంతరం జరిగిన చరిత్రనంతటిని నీకు తెలియజేస్తాను.

**ప్రభోర్లలాటదేశాత్తు యత్పృషచ్ఛ్రమసంభవమ్ ।**
**పపాత ధరణౌ తత్ర స బభూవ శిశుర్ద్రుతమ్ ॥14॥**

భగవంతుడైన శివుని లలాటం నుండి శ్రమవలన కలిగిన చెమట బిందువొకటి భూమిమీద పడింది. అది ఒక శిశువు రూపంలో పరిణతి చెందింది.

**చతుర్భుజోఽరుణాకారో రమణీయాకృతిర్మునే ।**
**అలౌకికద్యుతిః శ్రీమాంస్తేజస్వీ పరదుస్సహః ॥15॥**

మునీంద్రా! ఆ బాలుడు చతుర్భుజుడై ఉన్నాడు. ఎర్రని శరీరకాంతి కలిగి, మనోహరాకారుడై ఉన్నాడు. దివ్యప్రకాశంచేత దీప్తిమంతుడై శోభిల్లు ఆ బాలకుడు దుస్సహతేజస్సంపన్నుడై ఉన్నాడు.

**రురోద స శిశుస్తస్య పురో హి పరమేశితుః ।**
**ప్రాకృతాత్మజవత్తత్ర భవాచారరతస్య హి ॥16॥**

లోకాచారపరాయణుడు, పరమేశ్వరుడునైన శివుని ఎదుట ఆ శిశువు ఇతర సాధారణశిశువు వలె రోదింపసాగాడు.

**తదా విచార్య సుధియా ధృత్వా సుస్త్రీతనుం క్షితిః ।**
**ఆవిర్బభూవ తత్రైవ భయమానీయ శంకరాత్ ॥17॥**

అప్పుడు భగవంతుడగు శంకరునివల్ల పృథివి భయభ్రాంతురాలై చక్కగా ఆలోచించి, సుందర స్త్రీ రూపంతో అక్కడ సాక్షాత్కరించింది.

**తం బాలం ద్రుతముత్థాప్య క్రోడాయాం నిదధే వరమ్ ।**
**స్తన్యం సాఽపాయయత్ప్రీత్యా దుగ్ధం స్వోపరిసంభవమ్ ॥18॥**

ఆమె వెంటనే ఆ బాలుని పైకి లేవదీసి, తనఒడిలోనికి చేర్చుకుంది. ఆమె తన ఉపరితలంపై లభించు పాలను స్తన్యంగా నొసగి, ఆ బాలునికి త్రాగింపసాగింది.

**చుచుంబ తన్ముఖం స్నేహాత్ స్మిత్వాఽక్రీడయదాత్మజమ్ ।**
**సత్యభావాత్స్వయం మాతా పరమేశహితావహా ॥19॥**

ఆ బాలుని ముద్దులొలుకు మోమును స్నేహభావంతో ముద్దాడింది. అతనిని తన బాలుడని తలంచి, నవ్వుతూ ఆడింపసాగింది. పరమేశ్వరుడగు శివుని హితమును కోరు భూదేవి సత్యగుణం వలన ఆ బాలునకు స్వయంగా తల్లి అయ్యింది.

**తద్దృష్ట్వా చరితం శంభుః కౌతుకీ సూతికృత్కృతీ ।**
**అంతర్యామీ విహస్యాథోవాచ జ్ఞాత్వా రసాం హరః ॥20॥**

సంసారాన్ని సృష్టించేవాడు, పరమ కుతూహలుడు, విద్వాంసుడు, అంతర్యామియునగు శంభుడు దానినంతటినిచూచి, నవ్వాడు. భూదేవి ప్రవృత్తిని గుర్తించి, ఆమెతో ఇలా పలికాడు.

**ధన్యా త్వం ధరణి ప్రీత్యా పాలయైతం సుతం మమ ।**
**త్వయ్యుద్భూతం శ్రమజలాన్ మహాతేజస్వినో వరమ్ ॥21॥**

ధరణీ! నీవు ధన్యురాలవు. నాయీ కుమారుని ప్రేమతో సాకుము. మహాతేజస్విని, శంభుడు నగు నా శ్రమజలంచేత శ్రేష్ఠుడైన ఈ శిశువు నీయందు జన్మించాడు.

**మమ శ్రమకభూర్బాలో యద్యపి ప్రియకృత్ క్షితే ।**
**త్వన్నామ్నా స్యాద్భవేత్ ఖ్యాతస్త్రితాపరహితస్సదా ॥22॥**

ఓ వసుధా! ఈ బాలుడు నా శ్రమజలంతో ఉద్భవించినప్పటికీ నీ పేరుతో నీ పుత్రుడుగనే ఖ్యాతి పొందుతాడు. ఇతడు అన్నివేళలా తాపత్రయరహితుడు.

**అసౌ బాలః కుదాతా హి భవిష్యతి గుణీ తవ ।**
**మమాపి సుఖదాతా హి గృహాణైనం యథారుచి ॥23॥**

ఇతడత్యంత గుణవంతుడును, భూమినొసగువాడును కాగలడు. ఇతడు నాకు కూడ సుఖమును కలిగించగలడు. నీవితనిని నీ అభిరుచికనుగుణంగా స్వీకరింపుము.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా విరరామాథ కించిద్విరహముక్తధీః ।**
**లోకాచారకరో రుద్రో నిర్వికారీ సతాం ప్రియః ॥24॥**

ఓ నారదా! ఇట్లు పలికి భగవంతుడైన శివుడు విరమించాడు. ఆయన హృదయమునందలి విరహతాపం కొంచెం ఉపశమించింది. వాస్తవానికి సజ్జనులకు ప్రియుడైన రుద్రదేవుడు నిర్వికారపరమాత్మయే కాని ఆయన లోకాచారాన్ని పాటిస్తున్నందున ఆ స్వామిచే విరహతాపం ప్రదర్శితమయ్యింది.

**అపి క్షితిర్జగామాశు శివాజ్ఞామధిగమ్య సా ।**
**స్వస్థానం ససుతా ప్రాప సుఖమాత్యంతికం చ వై ॥25॥**

శివుని ఆదేశాన్ని శిరసావహించి, పృథ్వీదేవి ఆ పుత్రుని గైకొని స్వస్థానానికివెళ్ళి బ్రహ్మానందాన్ని పొందింది.

**స బాలో భౌమ ఇత్యాఖ్యాం ప్రాప్య భూత్వా యువాద్రుతమ్ ।**
**తస్యాం కాశ్యాం చిరం కాలం సిషేవే శంకరం ప్రభుమ్ ॥26॥**

ఆ బాలకుడు 'భౌముడు' అనే పేరుతో ప్రసిద్ధిగాంచాడు. యౌవనం ప్రాప్తించగానే కాశీనగరానికి వెళ్ళి, అచ్చట చాలాకాలం శంకరప్రభువును సేవించాడు.

**విశ్వేశ్వరప్రసాదేన గ్రహత్వం ప్రాప్య భూమిజః ।**
**దివ్యం లోకం జగామాశు శుక్రలోకాత్పరం వరమ్ ॥27॥**

విశ్వనాథుని కృపచేత ఆ భూమికుమారుడు గ్రహ పదవిని పొంది, వెంటనే శ్రేష్ఠమైన దివ్యలోకానికి వెళ్ళిపోయాడు. ఆ లోకం శుక్రలోకానికి ఆవలఉంది.

**ఇత్యుక్తం శంభుచరితం సతీవిరహ సంయుతమ్ ।**
**తపస్యాచరణం శంభోశ్శృణు చాదరతో మునే ॥28॥**

ఈ విధంగా సతీవిరహ వ్యాకులుడైయున్న శంకరుని లీలావిలాసాన్ని వివరించి చెప్పాను. ఇక శంభుని తపోవిధానాన్ని శ్రద్ధగా ఆలకించు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే భౌమోత్పత్తిశివలీలా వర్ణనం నామ దశమోఽధ్యాయః ॥10॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో భౌమోత్పత్తి శివలీలావర్ణనం అనే పదవ అధ్యాయం సమాప్తం.

## ఏకాదశోఽధ్యాయః - పదకొండవ అధ్యాయం
## శివశైలేశ సమాగమవర్ణనమ్ - శివశైలేశ సమాగమవర్ణన

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**వర్ధమానా గిరేః పుత్రీ సా శక్తిర్లోకపూజితా ।**
**అష్టవర్షా యదా జాతా హిమాలయగృహే సతీ ॥1॥**

**తజ్జన్మ గిరిశో జ్ఞాత్వా సతీవిరహకాతరః ।**
**కృత్వా తామద్భుతామంతర్ముమోదాతీవ నారద ॥2॥**

నారదా! హిమవంతుని కుమార్తె లోకపూజిత, శక్తిస్వరూప. సతీదేవియే అయిన ఆమె హిమవంతుని ఇంట ఎనిమిది సంవత్సరాల వయస్సు కల్గినది అయ్యింది అప్పుడు సతీదేవి విరహంచేత ధైర్యాన్ని కోల్పోయిన శివుడు ఆమె జన్మ వృత్తాంతాన్ని తెలుసుకొని, అద్భుతమైన బాలికయైన పార్వతిని తన హృదయమునందిడుకొని, గొప్ప ఆనందానుభూతిని పొందాడు.

**తస్మిన్నేవాంతరే శంభుర్లౌకికీం గతిమాశ్రితః ।**
**సమాధాతుం మనస్సమ్యక్తపః కర్తుం సమైచ్ఛత ॥3॥**

ఇంతలో శివుడు లౌకికవిధానాన్ననుసరించి, తన మనస్సు ఏకాగ్రతను పొందుటకు తపస్సు చేయాలనుకున్నాడు.

**కాంశ్చిద్గణవరాన్ శాంతాన్ నంద్యాదీనవగృహ్య చ ।**
**గంగావతారమగమద్ధిమవత్ప్రస్థముత్తమమ్ ॥4॥**

నంది మొదలగు శాంతులైన పార్షదులను కొందరిని వెంటనిడుకొని, హిమవంతుని ఉత్తమశిఖరమగు గంగావతారం అనే పేరుగల తీర్థానికి వెళ్ళాడు.

**యత్ర గంగా నిపతితా పురా బ్రహ్మపురాత్సుతా ।**
**సర్వాఘౌఘవినాశాయ పావనీ పరమా మునే ॥5॥**

పూర్వం బ్రహ్మధామంనుండి జాలువారి, సమస్త పాపరాశిని నశింపజేయడానికి పరవళ్ళు త్రొక్కుతూ వచ్చిన పరమపవిత్రమైన గంగ మొట్టమొదట భూతలంలో ఇక్కడే అవతరించింది.

**తపః ప్రారంభమకరోత్ స్థిత్వా తత్ర వశీ హరః ।**
**ఏకాగ్రం చింతయామాస స్వమాత్మానమతంద్రితః ॥6॥**

జితేంద్రియుడైన హరుడు ఇక్కడనే తపస్సు ప్రారంభించాడు. పరమేశ్వరుడు తన ఆత్మభూత పరమాత్మను ఏకాగ్ర భావంతో చింతన చేయసాగాడు.

**చేతోజ్ఞానభవం నిత్యం జ్యోతీరూపం నిరామయమ్ ।**
**జగన్మయం చిదానందం ద్వైతహీనం నిరాశ్రయమ్ ॥7॥**

ఆయన చైతన్యమూర్తి, జ్ఞానస్వరూపుడు, నిత్యుడు, జ్యోతిర్మయుడు, నిరామయుడు, జగన్మయుడు, చిదానంద స్వరూపుడు, ద్వైతము లేనివాడు, ఆశ్రయరహితుడు.

**హరే ధ్యానపరే తస్మిన్ప్రమథా ధ్యానతత్పరాః ।**
**అభవన్కేచిదపరే నందిభృంగ్యాదయో గణాః ॥8॥**

హరుడు ధ్యానపరాయణుడు కాగా, నంది, భృంగి మున్నగు కొంతమంది పార్షదగణాలు కూడా ధ్యానమగ్నులయ్యారు.

**సేవాం చక్రుస్తదా కేచిద్గణాః శంభోః పరాత్మనః ।**
**నైవాకూజంస్తు మౌనా హి ద్వారపాః కేచ నాభవన్ ॥9॥**

అప్పుడు కొంతమంది ప్రమథగణాలు మాత్రం పరమాత్ముడైన శంభుని సేవిస్తున్నారు. అందరు మౌనంగా ఉన్నారు. ఒక శబ్దంకూడా ఎవ్వరు ఉచ్చరించటం లేదు. అచ్చట ద్వారపాలకులెవ్వరూ లేరు.

**ఏతస్మిన్నంతరే తత్ర జగామ హిమభూధరః ।**
**శంకరస్యౌషధిప్రస్థే శ్రుత్వాగమనమాదరాత్ ॥10॥**

ఇంతలో ఓషధులతో నిండి ఆ శిఖరమునకు భగవంతుని శుభాగమనాన్ని విని, ఆయనయందలి భక్తిభావంతో హిమవంతుడచ్చటకు వెళ్లాడు.

**ప్రణనామ ప్రభుం రుద్రం సగణో భూధరేశ్వరః ।**
**సమానర్చ చ సుప్రీతస్తుష్టావ స కృతాంజలిః ॥11॥**

సేవకులతో కూడిన గిరిరాజు రుద్రునకు నమస్కరించాడు. ఆయనను పూజించి, మిగుల ఆనందంతో చేతులు జోడించి ఇలా స్తుతించాడు.

**హిమాలయ ఉవాచ –** హిమాలయుడు పలికాడు.

**దేవ దేవ మహాదేవ కపర్దిన్ శంకర ప్రభో ।**
**త్వయైవ లోకనాథేన పాలితం భువనత్రయమ్ ॥12॥**

దేవదేవా! మహాదేవా! కపర్దీ! శంకరా! ప్రభూ! ఈ భువనత్రయం లోకనాథుడవైన నీచేతనే పాలింపబడుతోంది.

**నమస్తే దేవదేవేశ యోగిరూపధరాయ చ ।**
**నిర్గుణాయ నమస్తుభ్యం సగుణాయ విహారిణే ॥13॥**

ఓ దేవా! దేవేశా! నీకు నమస్కారం. యోగిరూపధరుడవైన నీకు నమస్కారం. నిర్గుణుడవైన నీకు నమస్కారం. సగుణుడవైన విహారశీలుడవగు నీకు నమస్కారం.

**కైలాసవాసినే శంభో సర్వలోకాటనాయ చ ।**
**నమస్తే పరమేశాయ లీలాకారాయ శూలినే ॥14॥**

కైలాసవాసియైన ఓ శంభో! సర్వలోకాలలో సంచరించువాడు, పరమేశ్వరుడు, లీలాకారుడు, శూలియునైన నీకు నమస్కారము.

**పరిపూర్ణగుణాధానవికారరహితాయ తే ।**
**నమోఽనీహాయ వీహాయ ధీరాయ పరమాత్మనే ॥15॥**

పరిపూర్ణుడు, గుణనిధుడు, వికారరహితుడు, కోరికలు లేనివాడు, నిస్పృహుడు, ధీరుడు, పరమాత్ముడునైన నీకు నమస్కారము.

**అబహిర్భోగకారాయ జనవత్సల తే నమః ।**
**త్రిగుణాధీశ మాయేశ బ్రహ్మణే పరమాత్మనే ॥16॥**

అలౌకికానందకారకుడు, జనవత్సలుడు, త్రిగుణాధీశుడు, మాయేశుడు, బ్రహ్మము, పరమాత్మయునైన నీకు నమస్కారము.

**విష్ణుబ్రహ్మాదిసేవ్యాయ విష్ణుబ్రహ్మస్వరూపిణే ।**
**విష్ణుబ్రహ్మైక ధాత్రే తే భక్తప్రియ నమోఽస్తు తే ॥17॥**

బ్రహ్మవిష్ణ్వాదులచే సేవింపబడువాడు, విష్ణుబ్రహ్మ స్వరూపుడు, విష్ణుబ్రహ్మైకదాతయు, భక్తప్రియుడునగు నీకు నమస్కారము.

**తపోరత తపఃస్థాన సుతపఃఫలదాయినే ।**
**తపఃప్రియాయ శాంతాయ నమస్తే బ్రహ్మరూపిణే ॥18॥**

తపోరతుడు, తపఃస్థానం, తపఃఫలాన్ని ప్రసాదించేవాడు, తపఃప్రియుడు, శాంతుడు, పరబ్రహ్మరూపియునైన నీకు నమస్కారము.

**వ్యవహారకరాయైవ లోకాచారకరాయ తే ।**
**సగుణాయ పరేశాయ నమోఽస్తు పరమాత్మనే ॥19॥**

లౌకిక, పారలౌకిక వ్యవహారాలను కలిగించువాడు, సగుణుడు, పరేశుడు, పరమాత్మయునైన నీకు నమస్కారము.

**లీలా తవ మహేశానావేద్యా సాధు సుఖప్రదా ।**
**భక్తాధీనస్వరూపోఽసి భక్తవశ్యో హి కర్మకృత్ ॥20॥**

ఓ మహేశా! నీ లీల ఎవరికీ తెలియజాలనిది. మంచివారికి సుఖమును కలిగించునది. నీవు భక్తాధీన స్వరూపుడవు. భక్తవశ్యుడవు కర్మకారుడవు.

**మమ భాగ్యోదయాత్తత్ర త్వమాగత ఇహ ప్రభో ।**
**సనాథం కృతవాన్మాం త్వం వర్ణితో దీనవత్సలః ॥21॥**

ఓ ప్రభో! నా భాగ్యం వల్ల నీవిచ్చటకు వచ్చియున్నావు. దీనవత్సలుడవైన నిన్ను వర్ణించడంచేత నీవు నన్ను సనాథుణ్ణి చేశావు.

**అద్యమే సఫలం జన్మ సఫలం జీవనం మమ ।**
**అద్య మే సఫలం సర్వం యదత్ర త్వం సమాగతః ॥22॥**

ఈనాడు నాజన్మ సఫలమయ్యింది. నా జీవనం కూడా సఫలమయ్యింది. నీవిచ్చటకు రావడంవల్ల ఈరోజు నా సర్వస్వం సఫలమయ్యింది.

**జ్ఞాత్వా మాం దాసమవ్యగ్రమాజ్ఞాం దేహి మహేశ్వర ।**
**త్వత్సేవాం చ మహాప్రీత్యా కుర్యామహమనన్యధీః ॥23॥**

ఓ మహేశ్వరా! నీవు నన్ను నీదాసునిగా భావించి, నన్నాజ్ఞాపించు. నేను నీ సేవను అన్యమనస్కుడను కాకుండా మహాప్రీతితో చేస్తాను.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య గిరిశస్య మహేశ్వరః ।**
**కించిదున్మీల్య నేత్రే చ దదర్శ సగణం గిరిమ్ ॥24॥**

హిమవంతుని ఈ మాటలనువిని, మహేశ్వరుడు కొద్దిగా కళ్ళు తెరచి. గణాలతో కూడిన హిమవంతుని చూశాడు.

**సగణం తం తథా దృష్ట్వా గిరిరాజం వృషధ్వజః ।**
**ఉవాచ ధ్యానయోగస్థః స్మయన్నివ జగత్పతిః ॥25॥**

వృషధ్వజుడు, ధ్యానయోగస్థుడు, జగత్పతియునైన శివుడు గిరిరాజైన హిమవంతుని ఆ విధంగా చూచి, నవ్వుతున్నట్లుగానుండి, అతనితో ఇలా పలికాడు.

**మహేశ్వర ఉవాచ** – మహేశ్వరుడు పలికాడు.

**తవ పృష్ఠే తపస్తప్తుం రహస్యమహమాగతః ।**
**యథా న కోఽపి నికటం సమాయాతు తథా కురు ॥26॥**

నేను నీ శిఖరంపై ఏకాంతంగా తపస్సు చేయడానికి రహస్యంగా వచ్చియున్నాను. నా సమీపానికి ఎవ్వరును రాని విధంగా ఏర్పాటు చేయుము.

**త్వం మహాత్మా తపోధామా మునీనాం చ సదాశ్రయః ।**
**దేవానాం రాక్షసానాం చ పరేషాం చ మహాత్మనామ్ ॥27॥**

**సదావాసో ద్విజాతీనాం గంగాపూతశ్చ నిత్యదః ।**
**పరోపకారీ సర్వేషాం గిరీణామధిపః ప్రభుః ॥28॥**

నీవు మహాత్ముడవు. తపస్సుచేయు అనేక మునులకు నీవు చక్కని ఆశ్రయమై యున్నావు. దేవతలు, రాక్షసులేగాక ఇతరులగు మహాత్ములు బ్రాహ్మణులు మున్నగువారు సర్వదా నీయందు నివసించియున్నారు. గంగాజలంచే నీవు నిత్యశుద్ధుడవు. ఓషధులు మొదలగు వాటిని నిత్యమూ ఇచ్చువాడవు. అందరకు ఉపకారము చేయువాడవు. పర్వతాలకు అధిపతివి.

**అహం తపశ్చరామ్యత్ర గంగావతరణే స్థలే ।**
**ఆశ్రితస్తవ సుప్రీతో గిరిరాజ యతాత్మవాన్ ॥29॥**

నేనీ గంగావతరణక్షేత్రంలో తపమునాచరిస్తాను. ఓ పర్వతరాజా! నేను జితేంద్రియుడనై, మిక్కిలి ప్రీతితో నిన్ను ఆశ్రయించాను.

**నిర్విఘ్నం మే తపశ్చాత్ర హేతునా యేన శైలప ।**
**సర్వథా హి గిరిశ్రేష్ఠ సుయత్నం కురు సాంప్రతమ్ ॥30॥**

ఓ పర్వతరాజా! ఇచ్చట నా తపస్సు అన్నివిధములా నిర్విఘ్నంగా కొనసాగేటట్లు మంచి ప్రయత్నం చేయుము.

**మమేదమేవ పరమం సేవనం పర్వతోత్తమ ।**
**స్వగృహం గచ్ఛ సత్ప్రీత్యా తత్సంపాదయ యత్నతః ॥31॥**

ఓ పర్వతోత్తమా! నీవు నాకు చేయగల గొప్పసేవ ఇదియే. కావున ఆ కార్యమును ప్రయత్నపూర్వకముగా చేయుము. ఇప్పుడానందంతో ఇంటికి మరలుము.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా జగతాం నాథస్తూష్ణీమాస స సూతికృత్ ।**
**గిరిరాజస్తదా శంభుం ప్రణయాదిదమబ్రవీత్ ॥32॥**

గొప్ప లీలలను ప్రకటించువాడు, జగన్నాథుడునగు శివుడిట్లు పలికి, మిన్నకున్నాడు. అప్పుడా పర్వతరాజు శంభునితో స్నేహపూర్వకంగా ఇట్లన్నాడు.

**హిమాలయ ఉవాచ** – హిమాలయుడు పలికాడు.

**పూజితోఽస్మి జగన్నాథ మయా త్వం పరమేశ్వర ।**
**స్వాగతేనాద్య విషయే స్థితం త్వాం ప్రార్థయామి కిమ్ ॥33॥**

ఓ జగత్ప్రభో! పరమేశ్వరా! నేనీనాడు నిన్ను పూజించాను. ఈ ప్రదేశానికి నీకీనాడు స్వాగతం పలుకుతున్నాను. నా ప్రదేశమునందున్న నిన్ను నేనేమికోరెదను?

**మహతా తపసా త్వం హి దేవైర్యత్నపరాశ్రితైః ।**
**న ప్రాప్యసే మహేశాన స త్వం స్వయముపస్థితః ॥34॥**

ఓ మహేశ్వరా! మహాయత్నంతో గొప్ప తపస్సు చేసిన దేవతలకు కూడా దర్శనమీయని నీవు స్వయంగా ఇక్కడకు వచ్చావు.

**మత్తోఽప్యన్యతమో నాస్తి న మత్తోఽన్యోఽస్తి పుణ్యవాన్ ।**
**భవానితి చ మత్పృష్ఠే తపసే సముపస్థితః ॥35॥**

నాకంటే గొప్ప పుణ్యాత్ముడు మరియొకడుండబోడు. ఎందుకనగా నీవు నా శిఖరంపై తపస్సు కొఱకు విచ్చేశావు.

**దేవేంద్రా దధికం మన్యే స్వాత్మానం పరమేశ్వరః ।**
**సగణేన త్వయాఽగత్య కృతోఽనుగ్రహభాగహమ్ ॥36॥**

ఓ పరమేశ్వరా! నీవు గణాలతో కూడి, ఇక్కడకు వచ్చి నన్ననుగ్రహించడంచేత నేను దేవేంద్రునికంటె అధికుడనయ్యానని భావిస్తున్నాను.

**నిర్విఘ్నం కురు దేవేశ స్వతంత్రః పరమం తపః ।**
**కరిష్యేఽహం తథా సేవాం దాసోఽహం తే సదా ప్రభో ॥37॥**

ఓ దేవదేవా! నీవు స్వతంత్రుడవు. ఇచ్చట నిర్విఘ్నంగా తపస్సు చేసుకొనుము. నేను నీ దాసుడను. కనుక సదా నీ ఆజ్ఞానుసారం సేవ చేసుకుంటాను.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా గిరిరాజోఽసౌ స్వం వేశ్మ ద్రుతమాగతః ।**
**వృత్తాంతంతం సమాచఖ్యౌ ప్రియాయై చ సమాదరాత్ ॥38॥**

నారదా! ఇట్లు పలికి, గిరిరాజైన హిమాలయుడు తన ఇంటికి తిరిగి వెళ్ళిపోయాడు. తన భార్యయగు మేనకకు జరిగిన వృత్తాంతాన్నంతటిని మిక్కిలి ఆదరంతో చెప్పాడు.

**నీయమానాన్ పరీవారాన్ స్వగణానపి నారద ।**
**సమాహూయాఖిలాన్ శైలపతిః ప్రోవాచ తత్త్వతః ॥39॥**

ఓ నారదా! ఆ పర్వతరాజు తనతో వచ్చిన సేవకులను, ఇతరగణాలను అందరిని పిలిచి వారితో నిశ్చయంగా ఇలా పలికాడు.

**హిమాలయ ఉవాచ –** హిమాలయుడు పలికాడు.

**అద్య ప్రభృతి నోయాతు కోఽపి గంగావతారణమ్ ।**
**మచ్ఛాసనేన మత్రుస్థం సత్యమేతద్ బ్రవీమ్యహమ్ ॥40॥**

ఈనాటినుండి నా శాసనంచే ఎవరైనను ఈ గంగావతరణమనే శిఖరానికి వచ్చుట నిషేధింపబడినది. నేను సత్యమునే పలుకుతున్నాను

**గమిష్యతి జనః కశ్చిత్తత్ర చేత్తం మహాఖలమ్ ।**
**దండయిష్యే విశేషేణ సత్యమేతన్మయోదితమ్ ॥41॥**

అచ్చటకు ఎవరైనను వెళ్ళినచో అట్టి మహాఖలుని తీవ్రంగా దండిస్తాను. నేను సత్యమునే పలుకుతున్నాను.

**ఇతి తాన్స నియమ్యాశు స్వగణాన్నిఖిలాన్మునే ।**
**సుయత్నం కృతవాన్ శైలస్తం శృణు త్వం వదామి తే ॥42॥**

ఓ మహర్షీ! పర్వతరాజు ఈ తీరున తన గణాలనన్నిటిని శాసించి, శివుని ఏకాంతానికి మంచి ఏర్పాట్లు చేశాడు. ఆ వివరాలన్నీ చెబుతాను విను.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే శివశైలేశసమాగ మవర్ణనం నామైకాదశోఽధ్యాయః ॥11॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో శివశైలేశ సమాగమవర్ణనం అనే పదకొండవ అధ్యాయం సమాప్తం.

## ద్వాదశోఽధ్యాయః - పన్నెండవ అధ్యాయం

## శివహిమాచల సంవాదవర్ణనమ్ - శివహిమాచల సంవాదవర్ణనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథ శైలపతిర్హృష్టః సత్పుష్పఫలసంచయమ్ ।**
**సమాదాయ స్వతనయాసహితోఽగాద్ధరాంతికమ్ ॥1॥**

అంతట పర్వతరాజు సంతసించి అనేక పుష్పాలను, ఫలాలను అధిక పరిమాణంలో తీసుకొని, తన కుమార్తెతోగూడి, శివునివద్దకు వెళ్ళాడు.

**స గత్వా త్రిజగన్నాథం ప్రణమ్య ధ్యానతత్పరమ్ ।**
**అర్పయామాస తనయాం కాళీం తస్మై హృదాద్భుతామ్ ॥2॥**

ఆయన అచ్చటకు వెళ్ళి, ధ్యానతత్పరుడు, త్రిలోకాధిపతియునైన శివునకు నమస్కరించి, తన కుమార్తె కాళిని ఆయనకు హృదయపూర్వకంగా అప్పగించాడు.

**ఫలపుష్పాదికం సర్వం తత్తదగ్రే నిధాయ సః ।**
**అగ్రే కృత్వా సుతాం శంభుమిదమాహ చ శైలరాట్ ॥3॥**

ఆ పర్వతరాజు ఫలపుష్పాదులను, ఇతరములను, శంభుని ఎదుట ఉంచి, తన కుమార్తెను ఆయన ఎదుట నిలబెట్టి, ఆయనతో ఇలా పలికాడు.

**హిమగిరిరువాచ** - హిమవత్పర్వతుడు పలికాడు.

**భగవంస్తనయా మే త్వాం సేవితుం చంద్రశేఖరమ్ ।**
**సముత్సుకా సమానీతా త్వదారాధనకాంక్షయా ॥4॥**

ఓ భగవంతుడా! నా కుమార్తె చంద్రశేఖరుడవైన నిన్ను సేవించడానికి ఉత్సాహ పడుతోంది. నిన్ను ఆరాధించాలని కోరికగల ఆమెను నీవద్దకు తీసుకొని వచ్చాను.

**సఖీభ్యాం సహ నిత్యం త్వాం సేవతామేవ శంకరమ్ ।**
**అనుజానీహి తాం నాథ మయి తే యద్యనుగ్రహః ॥5॥**

ఓ నాథా! నీకు నాయందనుగ్రహమున్నచో శంకరుడవైన నిన్ను ఆమె సఖురాంద్రతోకూడి, నిత్యము సేవించుటకు అనుమతినిమ్ము.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథ తాం శంకరోఽపశ్యత్ప్రథమారూఢయౌవనామ్ ।**
**ఫుల్లేందీవరపత్రాభాం పూర్ణచంద్రనిభాననామ్ ॥6॥**

అంతట శంకరుడామెను చూశాడు. ఆమెయందు అప్పుడప్పుడే యౌవనం అంకురిస్తూ ఉంది. పూర్ణచంద్రునివంటి ముఖంగల ఆమె కన్నులు వికసించిన తామరరేకులవలె ప్రకాశిస్తున్నది.

**సమస్తలీలాసంస్థానశుభవేషవిజృంభితామ్ ।**
**కంబుగ్రీవాం విశాలాక్షీం చారుకర్ణయుగోజ్జ్వలామ్ ॥7॥**

లీలలన్నిటికీ నిధానమైన శుభవేషంలో ఆమె సౌందర్యం ఇనుమడించింది. శంఖంవంటి కంఠంతో, విశాలమైన కనులతో, సుందరమైన చెవులతో ఆమె ప్రకాశించింది.

**మృణాలాయతపర్యంతబాహుయుగ్మమనోహరామ్ ।**
**రాజీవకుట్మలప్రఖ్యౌ ఘనపీనౌ దృఢౌ స్తనౌ ॥8॥**

తామరతూడువలే పొడవైన, మృదువైన బాహు యుగళంతో ఆమె మనోహరంగా వుంది. ఆమె స్తనాలు పద్మపు మొగ్గలవలెను, బలిసి దృఢంగాను ఉన్నాయి.

**బిభ్రతీం క్షీణమధ్యాం చ త్రివలీమధ్యరాజితామ్ ।**
**స్థలపద్మప్రతీకాశపాదయుగ్మవిరాజితామ్ ॥9॥**

సన్నని నడుముతో, ఉదరంపై మూడు ముడుతలతో, ఆమె ప్రకాశించింది. ఆమె పాదయుగళం మెట్ట తామరలవలె విరాజిల్లాయి.

**ధ్యానపంజరనిర్బద్ధమునిమానసమప్యలమ్ ।**
**దర్శనాద్భ్రంశనే శక్తాం యోషిద్గణశిరోమణిమ్ ॥10॥**

స్త్రీలలో అగ్రగణ్యురాలైన ఆ సుందరి దర్శనమాత్రంచేతనే ధ్యానపంజరమునందు దృఢముగా బంధింపబడిన మునుల మానసములు కూడా హరింపబడతాయి.

**దృష్ట్వా తాం తాదృశీం తాత ధ్యానినాం చ మనోహరామ్ ।**
**విగ్రహే తంత్రమంత్రాణాం వర్ధినీం కామరూపిణీమ్ ॥11॥**

వత్సా! మునుల మనస్సునుకూడా హరింపగల ఆమె సౌందర్యాన్ని శివుడు చూశాడు. ఆ దేవియొక్క దేహంలో మంత్రతంత్రాలు వర్ధిల్లుతాయి. ఆమె తనకు నచ్చిన రూపాన్ని పొందగలుగుతుంది.

**న్యమీలయద్దృశౌ శీఘ్రం దధ్యౌ స్వం రూపముత్తమమ్ ।**
**పరతత్త్వం మహాయోగీ త్రిగుణాత్పరమవ్యయమ్ ॥12॥**

ఆయన వెంటనే కన్నులను మూసుకొని, త్రిగుణాతీతము, నాశరహితము, సర్వోపరితత్త్వమునగు ఆత్మ స్వరూపాన్ని ధ్యానించడం మొదలుపెట్టాడు.

**దృష్ట్వా తదానీం సకలేశ్వరం విభుం తపో జుషాణం వినిమీలితేక్షణమ్ ।**
**కపర్దినం చంద్రకళావిభూషణం వేదాంతవేద్యం పరమాసనే స్థితమ్ ॥13॥**

**వవంద శీర్ష్ణా చ పునర్హిమాచలః స సంశయం ప్రాపదదీనసత్త్వః ।**
**ఉవాచ వాక్యం జగదేకబంధుం గిరీశ్వరో వాక్యవిదాం వరిష్ఠః ॥14॥**

అంతట సర్వేశ్వరుడు, సర్వవ్యాపి, తపోనిష్ఠుడు, కళ్ళనుమూసుకొని ధ్యానము చేయువాడు, జటాజూటధారి, చంద్రకళావిభూషణుడు, వేదాన్తవేద్యుడు, పరమాసమునందు కూర్చొనియున్నాడు. అటువంటి శివునకు హిమవంతుడు తిరిగి శిరసా నమస్కరించాడు. దైన్యమునెరుగని మనస్సుగల హిమవంతునకు ఒక సంశయం కలిగింది. వాక్యవిదులలో శ్రేష్ఠుడైన హిమవంతుడు జగదేకబంధుడైన శివునితో ఇట్లు పలికాడు.

**హిమాచల ఉవాచ –** హిమాచలుడు పలికాడు.

**దేవదేవ మహాదేవ కరుణాకర శంకర ।**
**పశ్య మాం శరణం ప్రాప్తమున్మీల్య నయనే విభో ॥15॥**

ఓ దేవదేవా! మహాదేవా! కరుణాకరా! శంకరా! విభో! శరణుపొందిన నన్ను కనులు తెరచి చూడుము.

**శివ శర్వ మహేశాన జగదానందకృత్ప్రభో ।**
**త్వాం నతోఽహం మహాదేవ సర్వాపద్వినివర్తకమ్ ॥16॥**

ఓ శివా! శర్వా! మహేశ్వరా! ప్రభో! జగత్తునకు ఆనందాన్ని కలిగించేది నీవే. సర్వాపద్వినివారకుడవైన నీకు నేను నమస్కరించుచున్నాను.

**న త్వాం జానంతి దేవేశ వేదాశ్శాస్త్రాణి కృత్స్నశః ।**
**అతీతో మహిమాధ్వానం తవ వాఙ్మనసోః సదా ॥17॥**

ఓ దేవేశా! వేదములు గాని, శాస్త్రములు గాని, నిన్ను సంపూర్ణంగా తెలియజేయజాలవు. నీ మహిమ సర్వకాలములయందును వాక్కునకు గాని, మనస్సునకు గాని గోచరం కానేకాదు.

**అతద్వ్యావృత్తితస్త్వాం వై చకితం చకితం సదా ।**
**అభిధత్తే శ్రుతిః సర్వా పరేషాం కా కథా మతా ॥18॥**

వేదమంతయు నీ స్వరూపాన్ని ఇది కాదు, ఇది కాదు అని ఇతరములనుండి వేరుపరచుచుండగా, ఇతరముల గురించి చెప్పవలసినదేమున్నది?

**జానంతి బహవో భక్తాస్త్వత్కృపాం ప్రాప్య భక్తితః ।**
**శరణాగతభక్తానాం న కుత్రాపి భ్రమాదికమ్ ॥19॥**

ఎందరో భక్తులు తమ భక్తిప్రభావంచే నీ కృపను పొంది, నీ స్వరూపాన్ని తెలుసుకోగలుగుతున్నారు. శరణాగతులైన నీ భక్తులకు ఎప్పుడునూ భ్రమాదులుండవు.

**విజ్ఞప్తిం శృణు మత్ప్రీత్యా స్వదాసస్య మమాధునా ।**
**తవ దేవాజ్ఞయా తాత దీనత్వాద్వర్ణయామి హి ॥20॥**

ఓ దేవా! నీ దాసుడనైన నా విన్నపాన్ని ఇప్పుడు ప్రీతితో వినుము. నీ ఆజ్ఞను పొంది, దీనుడనైన నేను నీకు ఈ విన్నపాన్ని చేస్తున్నాను.

**సభాగ్యోఽహం మహాదేవ ప్రసాదాత్తవ శంకర ।**
**మత్వా స్వదాసం మాం నాథ కృపాం కురు నమోఽస్తు తే ॥21॥**

ఓ మహాదేవా! శంకరా! నీ అనుగ్రహం నాయందు కలగడంచే, నేను భాగ్యవంతుడనయ్యాను. నీవు నన్ను నీ దాసునిగా భావించి, నాయందు దయ చూపుము. నీకు నమస్కరించుచున్నాను.

**ప్రత్యహం చాగమిష్యామి దర్శనార్థం తవ ప్రభో ।**
**అనయా సుతయా స్వామిన్నిదేశం దాతుమర్హసి ॥22॥**

ఓ ప్రభూ! ప్రతిదినము నేను నీ దర్శనమునకు రావాలని తలంచుచున్నాను. నాయీ కుమార్తెకూడా ప్రతినిత్యము నిన్ను దర్శింప కోరుకుంటోంది. ఓస్వామీ! మాకు మీ అనుమతిని ప్రసాదించండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్యోన్మీల్య నేత్రే మహేశ్వరః ।**
**త్యక్తధ్యానః పరామృశ్య దేవదేవోఽబ్రవీద్వచః ॥23॥**

హిమవంతుని మాటలను విని, దేవదేవుడైన మహేశ్వరుడు ధ్యానమును వీడి, కన్నులను తెరచి, ఆలోచించి, ఇట్లు పలికాడు.

**మహేశ్వర ఉవాచ –** మహేశ్వరుడు పలికాడు.

**ఆగంతవ్యం త్వయా నిత్యం దర్శనార్థం మమాచల ।**
**కుమారీం సదనే స్థాప్య నాన్యథా మమ దర్శనమ్ ॥24॥**

ఓ పర్వతరాజా! నీవు నీ కుమార్తెను నీ ఇంటివద్దనేయుంచి, నీవు ప్రతినిత్యం నా దర్శనానికి రావచ్చును. ఆమెతోగూడి, నీవు నా దర్శనానికి రావలదు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**మహేశ వచనం శ్రుత్వా శివాతాతస్తథావిధమ్ ।**
**అచలః ప్రత్యువాచేదం గిరిశం నతకంధరః ॥25॥**

పార్వతీదేవి తండ్రియైన హిమవంతుడు మహేశుని మాటలు విని, తలవంచి, నమస్కరించి, ఇట్లు బదులు పలికాడు.

**హిమాచల ఉవాచ –** హిమాచలుడు పలికాడు.

**కస్మాన్మయానయా సార్ధం నాగంతవ్యం తదుచ్యతామ్ ।**
**సేవనే కిమయోగ్యేయం నాహం వేద్మ్యత్ర కారణమ్ ॥26॥**

ఈమె నాతోగూడి, ఇచ్చటకు రాకూడదనుటకు గల కారణాన్ని తెలియజేయుడు. మిమ్ము సేవించే యోగ్యత ఈమెకు లేదా? ఈ విధంగా ఆదేశించడానికిగల కారణం నాకు తెలియకున్నది.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**తతోఽబ్రవీద్గిరిం శంభుః ప్రహసన్వృషభధ్వజః ।**
**లోకాచారం విశేషేణ దర్శయన్హి కుయోగినామ్ ॥27॥**

అంతట వృషభధ్వజుడగు శంభుడు చిరునవ్వుతో హిమవంతునకు జవాబిచ్చాడు. శంభుడు దుష్టయోగులు లోకంలో ప్రవర్తిల్లు తీరుతెన్నులను ప్రత్యేకించి వివరించాడు.

**శంభురువాచ** – శంభుడు పలికాడు.

**ఇయం కుమారీ సుశ్రోణీ తన్వీ చంద్రాననా శుభా ।**
**నానేతవ్యా మత్సమీపే వారయామి పునఃపునః ॥28॥**

ఈ కుమారి మిక్కిలి అందగత్తె, చంద్రునివంటి మోముగల శుభదర్శనురాలు, ఈమెను నావద్దకు తీసుకురావలదని మరల మరల వారిస్తున్నాను.

**మాయారూపా స్మృతా నారీ విద్వద్భిర్వేదపారగైః ।**
**యువతీ తు విశేషేణ విఘ్నకర్త్రీ తపస్వినామ్ ॥29॥**

వేదవేత్తలగు విద్వాంసులు స్త్రీ మాయాస్వరూపురాలని చెబుతారు. ప్రత్యేకించి తపస్సుల విషయంలో స్త్రీ విఘ్నకారిణి అనియు చెబుతారు.

**అహం తపస్వీ యోగీ చ నిర్లిప్తో మాయయా సదా ।**
**ప్రయోజనం యుక్తయా వై స్త్రియా కిం మేఽస్తి భూధర ॥30॥**

ఓ పర్వతరాజా! మాయాసంబంధం లేనట్టి యోగియు, తపస్వియునైన నాకు స్త్రీతో ప్రయోజనం లేదు.

**ఏవం పునర్న వక్తవ్యం తపస్వివర సంశ్రిత ।**
**వేదధర్మప్రవీణస్త్వం యతో జ్ఞానివరో బుధః ॥31॥**

నీవు గొప్పతపశ్శాలురకు ఆశ్రయమునిచ్చినవాడవు. నీవు వేదధర్మంలో నిష్ణాతుడవు. జ్ఞానులలో శ్రేష్ఠుడవు. పండితుడవు. కావున నీవు మరల ఇట్లు పలుకవద్దు.

**భవత్యచల తత్సంగాద్విషయోత్పత్తిరాశు వై ।**
**వినశ్యతి చ వైరాగ్యం తతో భ్రశ్యతి సత్తపః ॥32॥**

ఓ పర్వతరాజా! స్త్రీతో కలిసియుండుటవలన విషయములందాసక్తి వెనువెంటనే ఉదయించి, వైరాగ్యం పూర్తిగా అదృశ్యమౌతుంది. అంతట చక్కని తపస్సు భ్రష్టమౌతుంది.

**అతస్తపస్వినా శైల న కార్యా స్త్రీషు సంగతిః ।**
**మహావిషయమూలం సా జ్ఞానవైరాగ్యనాశినీ ॥33॥**

కాబట్టి, తపశ్శాలి స్త్రీలతో మైత్రి చేయరాదు. ఇంద్రియ భోగలాలసతకు మూలమైన స్త్రీ జ్ఞానాన్ని వైరాగ్యాన్ని నశింపజేస్తుంది.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాద్యుక్త్వా బహుతరం మహాయోగీ మహేశ్వరః ।**
**విరరామ గిరీశం తం మహాయోగివరః ప్రభుః ॥34॥**

మహాయోగీ, మహేశ్వరుడునైన శంభుడు పర్వతరాజుతో ఇటువంటి మరికొన్ని మాటలను పలికి విరమించాడు.

**ఏతచ్ఛ్రుత్వా వచనం తస్య శంభోర్నిరామయం నిఃస్పృహం నిష్ఠురం చ ।**
**కాళీతాతశ్చకితోఽభూత్సురర్షే తద్వక్ష్యించి ద్వ్యాకులశ్చాస తూష్ణీమ్ ॥35॥**

దోషములు లేనిదియు, కామనలు లేనిదియు, పరుషమైనదియు నగు శంభుని పలుకులను విని, కాళికి తండ్రియైన హిమవంతుడు చకితుడై నిరుత్తరుడయ్యాడు.

**తపస్వినోక్తం వచనం నిశమ్య తథా గిరీశం చకితం విచార్య ।**
**అతః ప్రణమ్యైవ శివం భవానీ జగాద వాక్యం విశదం తదానీమ్ ॥36॥**

తపస్వియైన శివుని మాటలను విని, ఆశ్చర్యచకితుడైన పర్వతరాజునుగూర్చి తలబోసిన పార్వతీదేవి శివునకు ప్రణమిల్లి స్పష్టమైన రీతిలో ఇట్లు పలికింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే శివహిమాచలసంవాద వర్ణనం నామ ద్వాదశోఽధ్యాయః ॥12॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో శివహిమాచల సంవాద వర్ణనం అనే పన్నెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయోదశోఽధ్యాయః - పదమూడవ అధ్యాయం

## పార్వతీపరమేశ్వరసంవాదః - పార్వతీపరమేశ్వరులసంవాదం

**భవాన్యువాచ** - భవాని పలికింది.

> **కిముక్తం గిరిరాజాయ త్వయా యోగిం స్తపస్వినా ।**
> **తదుత్తరం శృణు విభో మత్తో జ్ఞానివిశారద ॥1॥**

ఓ యోగీ! తపస్వియగు నీవు పర్వతరాజుతో ఎట్టిమాటలు పలికావు? నీవు జ్ఞానులలో శ్రేష్ఠుడవు దానికి సమాధానం నానుండి విను.

> **తపశ్శక్త్యాన్విత శ్శంభో కరోషి విపులం తపః ।**
> **తవ బుద్ధిరియం జాతా తపస్తప్తుం మహాత్మనః ॥2॥**

ఓ శంభూ! నీవు తపశ్శక్తిగలవాడవు. గొప్ప తపస్సును చేస్తున్నావు. మహాత్ముడవగు నీకిలా తపస్సు చేయాలనే బుద్ధి ఉదయించింది.

> **సా శక్తిః ప్రకృతిః జ్ఞేయా సర్వేషామపి కర్మణామ్ ।**
> **తయా విరచ్యతే సర్వం పాల్యతే చ వినాశ్యతే ॥3॥**

అన్ని కర్మలకు ప్రకృతి మీ శక్తి అని తెలుసుకో ఆ ప్రకృతియే సృష్టినంతటిని రచించి, పాలించి, నశింపజేస్తోంది.

> **కస్త్వం కా ప్రకృతి స్సూక్ష్మా భగవం స్తద్విమృశ్యతామ్ ।**
> **వినా ప్రకృత్యా చ కథం లింగరూపీ మహేశ్వరః ॥4॥**

ఓ భగవన్! నీవెవరు? సూక్ష్మమైన ప్రకృతి ఏది? ఈ విషయాలన్నిటిని సూక్ష్మంగా విమర్శించి తెలుసుకో. ప్రకృతి లేకుండగా మహేశ్వరుడు సగుణరూపధారి ఎలా కాగలడు?

> **అర్చనీయోఽసి వంద్యోఽసి ధ్యేయోఽసి ప్రాణినాం సదా ।**
> **ప్రకృత్యా చ విచార్యైతి హృదా సర్వం తదుచ్యతామ్ ॥5॥**

ప్రకృతితో కూడియుండుటచేతనే నువ్వు సర్వదా ప్రాణులచే పూజింపబడి, నమస్కరింపబడి, ధ్యానింపబడుతున్నావు. ఈ సత్యాన్ని మనస్సులో ఎరిగిన పిమ్మట అన్నీ మాటాడు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

> **పార్వత్యాస్తద్వచః శ్రుత్వా మహోతికరణే రతః ।**
> **సువిహస్య ప్రసన్నాత్మా మహేశో వాక్యమబ్రవీత్ ॥6॥**

గొప్ప లీలలను ప్రదర్శించుటలో సమర్థుడైన మహేశ్వరుడు ప్రసన్నాత్ముడై పార్వతీదేవియొక్క మాటలను విని, చక్కగా నవ్వి ఇలా పలికాడు.

**మహేశ్వర ఉవాచ –** మహేశ్వరుడు పలికాడు.

**తపసా పరమేణేవ ప్రకృతిం నాశయామ్యహమ్ ।**
**ప్రకృత్యా రహిత శ్శంభురహం తిష్ఠామి తత్త్వతః ॥7॥**

నేను గొప్ప తపస్సుచేతనే ప్రకృతి బంధాన్ని దూరమొనర్చుకోగలను. శంభుడనగు నేను ప్రకృతి లేకుండా ఆత్మస్వరూపుడనై ఉంటాను.

**తస్మాచ్చ ప్రకృతే స్సద్భిర్నకార్యస్సంగ్రహః క్వచిత్ ।**
**స్థాతవ్యం నిర్వికారైశ్చ లోకాచారవివర్జితైః ॥8॥**

కావున సత్పురుషులు ఏకాలమునందైనను ప్రకృతిని (స్త్రీ) స్వీకరించరాదు. సత్పురుషులు లోకాచారాలను పరిత్యజించి, నిర్వికారులై ఉండాలి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా శంభునా తాత లౌకికవ్యవహారతః ।**
**సువిహస్య హృదా కాళీ జగాద మధురం వచః ॥9॥**

వత్సా! శంభుడు లోకపు పోకడననుసరించి ఇలా పలుకగా కాళీదేవి తనలోతాను నవ్వుకొని, మృదు మధురమైన వచనాలనిలా పలికింది.

**కాళ్యువాచ –** కాళీదేవి పలికింది.

**యదుక్తం భవతా యోగిన్వచనం శంకరప్రభో ।**
**సా చ కిం ప్రకృతిర్న స్యాదతీతస్తాం భవాన్కథమ్ ॥10॥**

ఓ శంకరప్రభూ! యోగీ! నీవు ప్రకృతినతిక్రమించినవాడనని చెప్పావు. అట్లైతే ప్రకృతి స్వరూపురాలగు స్త్రీ ఏల ఉండరాదు? ఉండకూడదంటే నీవు అతీతుడవని ఎలా చెప్పగలం?

**ఏతద్విచార్య వక్తవ్యం తత్త్వతో హి యథాతథమ్ ।**
**ప్రకృత్యా సర్వమేతచ్చ బద్ధమస్తి నిరంతరమ్ ॥11॥**

ఈ విషయాన్ని ఉన్నదున్నట్లుగా తత్త్వబుద్ధితో విచారించి, తెలుపు. ఈ సర్వము సర్వకాలముల యందు ప్రకృతిచే బంధింపబడియుంది.

**తస్మాత్త్వయా న వక్తవ్యం న కార్యం కించిదేవ హి ।**
**వచనం రచనం సర్వం ప్రాకృతం విద్ధి చేతసా ॥12॥**

నీవు ప్రకృతి లేనిదే మాటలాడలేవు. ఏపనిని చేయజాలవు. ఈ జగత్తులోని సర్వవచనాలు, రచనలు, ప్రకృతినుండి పుట్టినవని నీవు మనస్సులో నిశ్చయించుకో.

**యచ్ఛృణోషి యదశ్నాసి యత్పశ్యసి కరోషి యత్ ।**
**తత్సర్వం ప్రకృతేః కార్యం మిథ్యావాదో నిరర్థకః ॥13॥**

నీవు ఏది విన్నా, ఏది తిన్నా, ఏది చూచినా, ఏది చేసినా, అది అంతా ప్రకృతినుండియే పుడుతుంది. ప్రకృతినిగూర్చి మిథ్యావచనాలు పలకటం వ్యర్థం.

**ప్రకృతేః పరమశ్చేత్త్వం కిమర్థం తప్యసే తపః ।**
**త్వయా శంభోఽధునా హ్యస్మిన్గిరౌ హిమవతి ప్రభో ॥14॥**

నీవు ప్రకృతికి అతీతుడవైతే తపస్సునెందుకు చేస్తున్నావు? ఓశంభూ! ఓప్రభూ! నీవిప్పుడు హిమవత్పర్వతంపై ఎందుకున్నావు?

**ప్రకృత్యా గిలితోఽసి త్వం న జానాసి నిజం హర ।**
**నిజం జానాసి చేదీశ కిమర్థం తప్యసే తపః ॥15॥**

ఓ హరా! నీవు ప్రకృతినుండి విడిపోయినవాడవు కాదు. నీ ఆత్మస్వరూపాన్నీ, నిజాన్నీ నువ్వు తెలియకున్నావు. నీకు నీ ఆత్మస్వరూపం తెలిసియుంటే నీవెందుకు తపస్సుచేస్తున్నావు?

**వాగ్వాదేన చ కిం కార్యం మమ యోగిం స్త్వయా సహ ।**
**ప్రత్యక్షే హ్యనుమాన స్య నప్రమాణం విదుర్బుధాః ॥16॥**

ఓ యోగీ! నాకు నీతో వాదులాడుటవలన ఏమి ప్రయోజనం? వస్తువు ప్రత్యక్షంగా ఉన్నప్పుడు అనుమాన ప్రమాణానికి తావులేదని పండితులు చెబుతారు.

**ఇంద్రియాణాం గోచరత్వం యావద్భవతి దేహినామ్ ।**
**తావత్సర్వం విమంతవ్యం ప్రాకృతం జ్ఞానిభిర్ధియా ॥17॥**

ప్రాణులు తమ ఇంద్రియాలచే ఎంతవరకు తెలుసుకోగలరో, అది అంతా ప్రకృతినునండియే ఉద్భవించిందని జ్ఞానులు తమ బుద్ధితో దర్శించాలి.

**కిం బహూక్తేన యోగీశ శృణు మద్వచనం పరమ్ ।**
**సాచాహం పురుషోఽసి త్వం సత్యం సత్యం న సంశయః ॥18॥**

ఓ యోగీశ్వరా! ఇన్ని మాటలేల? శ్రేష్ఠమైన నా మాటలను విను. ఆ ప్రకృతిని నేనే. నీవు పురుషుడవు. ఇది ముమ్మాటికీ సత్యం. ఇది నిస్సంశయం.

**మదనుగ్రహత స్త్వం హి సగుణో రూపవాన్మతః ।**
**మాం వినా త్వం నిరీహోఽసి న కించి త్కర్తుమర్హసి ॥19॥**

నీవు నా అనుగ్రహం చేతనే రూపాన్ని పొంది, సగుణుడవై ఉన్నావని పెద్దలు చెబుతారు. నేను లేకపోతే నీయందు సంకల్ప శక్తి ఉండదు. కాబట్టి నువ్వు ఏపని చేయజాలవు.

**పరాధీనస్సదా త్వం హి నానాకర్మకరో వశీ ।**
**నిర్వికారీ కథం త్వం హి న లిప్తశ్చ మయా కథమ్ ॥20॥**

జితేంద్రియుడవైన నీవు పరాప్రకృతికి అధీనుడవై, వివిధ కర్మలననుష్ఠిస్తున్నావు. నీవు నిర్వికారుడవెట్లు కాగలవు. ప్రకృతినిన్నంటదనుట ఎలా సంభవం?

**ప్రకృతేః పరమోఽసి త్వం యది సత్యం వచస్తవ ।**
**తర్హి త్వయా న భేతవ్యం సమీపే మమ శంకర ॥21॥**

హే శంకరా! నువ్వు ప్రకృతికంటె అతీతుడ వను నీమాట సత్యమైతే నా సమీపంలో భయపడ వలసిన పనియేమి?

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్యాః సాంఖ్యశాస్త్రోదితం శివః ।**
**వేదాంతమతసంస్థో హి వాక్యమూచే శివాం ప్రతి ॥22॥**

ఆమె సాంఖ్య శాస్త్రానుసారంగా పలికిన మాటలను విని, శివుడు వేదాంత సిద్ధాంతాన్ని ఆశ్రయించి, పార్వతీదేవితో ఇట్లు పలికాడు.

**శ్రీ శివ ఉవాచ** - శ్రీ శివుడు పలికాడు.

**ఇత్యేవం త్వం యది బ్రూషే గిరిజే సాంఖ్యధారిణీ ।**
**ప్రత్యహం కురు మే సేవామనిషిద్ధాం సుభాషిణి ॥23॥**

ఓ పార్వతీ! నీవు సాంఖ్య సిద్ధాంతాన్ననుసరించి, ఇలా పలుకుతున్నావు కనుక నువ్వు ప్రతిదినం నా సేవచేయి. నాకు నిషేధం లేదు.

**యద్యహం బ్రహ్మనిర్లిప్తో మాయయా పరమేశ్వరః ।**
**వేదాంతవేద్యో మాయేశస్త్వం కరిష్యసి కిం తదా ॥24॥**

నేను మాయాలేపం లేనివాడను, పరమేశ్వరుడను, వేదాంతవేద్యుడను, పరబ్రహ్మను, నిర్లిప్తుడను, మాయను వశము **చేసుకున్నవాడను** ఇక నీవేమిచేయగలవు?

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవ ముక్త్వా గిరిజాం వాక్యమూచే గిరిం ప్రభుః ।**
**భక్తానురంజనకరో భక్తానుగ్రహకారకః ॥25॥**

భక్తానురంజనకరుడు, భక్తానుగ్రహ కారకుడునైన ఆ ప్రభువు పార్వతీదేవితో అలా పలికి, తదనంతరం హిమవంతునితో ఇలా పలికాడు.

**శివ ఉవాచ** – శివుడు పలికాడు.

**అత్రైవ సోఽహం తపసా పరేణ గిరే తవ ప్రస్థవరేఽతి రమ్యే ।**
**చరామి భూమౌ పరమార్థభావ స్వరూప మానందమయం సులోచయన్ ॥26॥**

ఓ పర్వతరాజా! నేనిచ్చటనే నీ యీ అతిసుందర పీఠభూమిలో మహాతపస్సు చేస్తాను. ఆనంద మయం, పరమతత్త్వం, సద్ఘనం అయిన ఆత్మస్వరూపాన్ని దర్శిస్తూ ఈ భూమియందు సంచరిస్తాను.

**తపస్తప్తు మనుజ్ఞా మే దాతవ్యా పర్వతాధిప ।**
**అనుజ్ఞయా వినా కించిత్తపః కర్తుం న శక్యతే ॥27॥**

ఓ పర్వతరాజా! నేనిచ్చట తపస్సుచేసుకోవడానికి అనుజ్ఞనిమ్ము. అనుజ్ఞ లేకుండగా నీ ఈ స్థానము నందేవిధమైన తపస్సు చేయుటా సంభవం కాదు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య దేవదేవస్య శూలినః ।**
**ప్రణమ్య హిమవాంచ్ఛంభు మిదం వచనమబ్రవీత్ ॥28॥**

దేవదేవుడు, త్రిశూలధారియునగు శివుని పలుకులను విని, హిమవంతుడు శివునకు నమస్కరించి ఇలా అన్నాడు.

**హిమవానువాచ** – హిమవంతుడు పలికాడు.

**త్వదీయం హి జగత్సర్వం సదేవాసురమానుషమ్ ।**
**కిమప్యహం మహాదేవ తుచ్ఛో భూత్వా వదామి తే ॥29॥**

ఓ మహాదేవా! దేవతలు, రాక్షసులు, మానవులతోకూడిన ఈ జగత్తంతయు నీదే. నేను అత్యల్పుడను. నీతో నేనేమి చెప్పగలను?

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఏవ ముక్తో హిమవతా శంకరో లోకశంకరః ।**
**విహస్య గిరిరాజం తం ప్రాహ యాహీతి సాదరమ్ ॥30॥**

హిమవంతుడిట్లు పలుకగా లోకశంకరుడైన శంకరుడు నవ్వి, హిమవంతునితో సాదరంగా 'నీవు వెళ్ళు' అని పలికాడు.

**శంకరేణాభ్యనుజ్ఞాతస్స్వ గృహం హిమవాన్యయౌ ।**
**సార్థం గిరిజయా వై స ప్రత్యహం దర్శనే స్థితః ॥31॥**

శంకరుని అనుమతిని పొంది, హిమవంతుడు తన గృహానికి వెళ్ళాడు. ఆయన పార్వతితో కూడి, ప్రతిదినం శంకరుని దర్శిస్తున్నాడు.

**పిత్రా వినాపి సా కాళీ సఖీభ్యాం సహ నిత్యశః ।**
**జగామ శంకరాభ్యాశం సేవాయై భక్తితత్పరా ॥32॥**

భక్తితత్పరురాలైన కాళిమాత్రం తండ్రి రాకపోయినా ఇద్దరు చెలికత్తెలతోకూడి ప్రతిదినం సేవకొరకై, శంకరుని సమీపానికి వెళ్ళుతున్నది.

**నిషిషేధ న తాం కోఽపి గణో నందీశ్వరాదికః ।**
**మహేశశాసనాత్తాత తచ్ఛాసనకరశ్శుచిః ॥33॥**

వత్సా! మహేశుని ఆజ్ఞను పాలించే పవిత్ర హృదయుడగు నందీశ్వరుడు తదితర గణాలు శివాజ్ఞచే ఆమెను వారించలేదు.

**సాంఖ్య వేదాంత మతయో శ్శివయో శ్శివదస్సదా ।**
**సంవాదః సుఖకృచ్ఛ్రోక్తో ఽభిన్నయోస్సువిచారతః ॥34॥**

జాగ్రత్తగా పరిశీలిస్తే పార్వతీ పరమేశ్వరులమధ్య భేదమేలేదు. అట్టి వారిరువురూ, సాంఖ్య వేదాంత మతాలననుసరించి గావింపబడిన సుఖకరమైన సంవాదాన్ని వివరించాను. ఈ సంవాదం సర్వదా మంగళాలను కలిగిస్తుంది.

**గిరిరాజస్య వచనాత్తనయాం తస్య శంకరః ।**
**పార్శ్వే సమీపే జగ్రాహ గౌరవాదపి గోపరః ॥35॥**

పర్వతరాజునందుగల గౌరవంచేత ఇంద్రియాతీతుడైన శంకరుడు హిమవంతుని కుమార్తె తనవద్దకు వచ్చుటకు అంగీకరించాడు.

**ఉవాచేదం వచఃకాళీం సఖీభ్యాం సహ గోపతిః ।**
**నిత్యం మాం సేవతాం యాతు నిర్భీతాహ్యత్ర తిష్ఠతు ॥36॥**

జితేంద్రియుడైన శివుడిట్లు పలికాడు “ఈ కాళీదేవి ఇద్దరు సఖురాండ్రతోకూడి, ప్రతిదినం నన్ను సేవించి వెళ్ళవచ్చు. అంతేగాక ఇచ్చట నిర్భయంగా ఉండవచ్చు”.

**ఏవముక్త్వా తు తాం దేవీం సేవాయై జగృహే హరః ।**
**నిర్వికారో మహాయోగీ నానాలీలాకరః ప్రభుః ॥37॥**

ఇలా పలికి నిర్వికారుడూ, మహాయోగీ, నానాలీలాకరుడూ ఐన శివప్రభువు పార్వతీదేవిని సేవకొరకై స్వీకరించాడు.

**ఇదమేవ మహద్ధైర్యం ధీరాణాం సు తపస్వినామ్ ।**
**విఘ్నవన్త్యపి సంప్రాప్య యద్విఘ్నైర్న విహన్యతే ॥38॥**

ధీరులకు, తపస్వులకు విఘ్నాలు వస్తూఉంటాయి. కాని అవి వారి తపస్సును భంగం చేయజాలవు. అదియే వారికిగల గొప్ప సామర్థ్యం.

**తతః స్వపురమాయాతో గిరిరాట్ పరిచారకైః ।**
**ముమోదాతీవ మనసి సప్రియస్స మునీశ్వర ॥39॥**

ఓ మహర్షి! పర్వతరాజు అంతట సేవకులతోకూడి తన పురానికి మరలివెళ్ళాడు. భార్యతో సహా అతడు మనస్సులో మిక్కిలి ఆనందాన్ని పొందాడు.

**హరశ్చ ధ్యానయోగేన పరమాత్మానమాదరాత్ ।**
**నిర్విఘ్నేన స్వ మనసా త్వాసీచ్చింతయితుం స్థితః ॥40॥**

శివుడుకూడ విఘ్నాల పీడలేని తన మనస్సుతో ధ్యానయోగంతో ఆత్మరూపాన్ని ధ్యానిస్తున్నాడు.

**కాళీ సఖీభ్యాం సహితా ప్రత్యహం చంద్రశేఖరమ్ ।**
**సేవమానా మహాదేవం గమనాగమనే స్థితా ॥41॥**

కాళీదేవి తన సఖురాండ్రిరువురితోగూడి, ప్రతిదినమూ అచ్చటకు వచ్చి, చంద్రభూషణుడగు మహాదేవుని సేవిస్తూ, వెళ్ళివస్తోంది.

**ప్రక్షాళ్య చరణౌ శంభోః పపౌ తచ్చరణోదకమ్ ।**
**వహ్నిశౌచేన వస్త్రేణ చక్రే తద్గాత్రమార్జనమ్ ॥42॥**

ఆమె శంభుని పాదాలు కడిగి, తత్పాదోదకాన్ని త్రాగేది. మరిగించిన నీటితో శుభ్రం చేయబడిన వస్త్రంతో శివుని శరీరాన్ని తుడిచేది.

**షోడశేనోపచారేణ సంపూజ్య విధివద్ధరమ్ ।**
**పునః పునః సుప్రణమ్య యయౌ నిత్యం పితుర్గృహమ్ ॥43॥**

ఆమె ప్రతిదినమూ శివుని యథావిధిగా షోడశోపచారాలతో పూజించి, మరల మరల నమస్కరిస్తూ తండ్రి గృహానికి మరలుతుండేది.

**ఏవం సంసేవమానాయాం శంకరం ధ్యానతత్పరమ్ ।**
**వ్యతీయాయ మహాన్ కాలశ్శివాయా మునిసత్తమ ॥44॥**

ఓ మునీంద్రా! ఇట్లు పార్వతీదేవి ధ్యానమగ్నుడైన శంకరుని సేవిస్తూ ఉండగా చాలకాలం గడచిపోయింది.

**కదాచిత్సహితా కాళీ సఖీభ్యాం శంకరాశ్రమే ।**
**వితేనే సుందరం గానం సుతాళం స్మరవర్ధనమ్ ॥45॥**

ఒకప్పుడు ఆ కాళీదేవి సఖురాంద్రతోగూడి, శంకరుని ఆశ్రమంలో కామవర్ధకమైన, చక్కని తాళంతో, మధురమైన పాటను పాడేది.

**కదాచిత్కుశ పుష్పాణి సమిధం నయతి స్వయమ్ ।**
**సఖీభ్యాం స్థానసంస్కారం కుర్వతీ న్యవసత్తదా ॥46॥**

మరియొకప్పుడు ఆమె దర్భలను, సమిధలను, పుష్పాలను స్వయంగా తెచ్చేది. అక్కడి స్థలాన్నంతటిని సఖురాంద్రతోకూడి, శుభ్రంచేస్తూ ఉండేది.

**కదాచిన్నియతా గేహే స్థితా చంద్రభృతో భృశమ్ ।**
**వీక్షంతీ విస్మయామాస సకామా చంద్రశేఖరమ్ ॥47॥**

ఒకప్పుడామె అనురాగంతో కూడినదై, చంద్రశేఖరుని కుటీరంలో ఆయన సమీపంలో కూర్చుండి, ఆయనను ఆశ్చర్యంతో చూస్తూ ఉండేది.

**తతస్తప్తేన భూతేశస్తాం నిస్సంగాం పరిస్థితామ్ ।**
**సోఽచింతయత్తదా వీక్ష్య భూతదేహే స్థితేతి చ ॥48॥**

భూతపతియైన శివుడు నిస్సంగురాలై తన సమీపంలోనున్న ఆమెను చూచి, పూర్వం సతీరూపంలోనున్న దేవియే ఈమెయని తపః ప్రభావంచే మనస్సులో దర్శించాడు.

**నాగ్రహీద్గిరిశః కాళీం భార్యార్థే నికటే స్థితామ్ ।**
**మహాలావణ్య నిచయాం మునీనామపి మోహినీమ్ ॥49॥**

శివుడు తన సమీపంలో నున్నట్టియు, మహాలావణ్య నిధియై, మునులనుకూడా మోహింపజేయగల, ఆ కాళీదేవి తనకు సమీంపలోనే నిలిచినా శివుడు ఆమెను వెంటనే భార్యగా స్వీకరించలేదు.

**మహాదేవః పునర్దృష్ట్వా తథా తాం సంయతేంద్రియామ్ ।**
**స్వసేవనే రతాం నిత్యం సదయస్సమచింతయత్ ॥50॥**

జితేంద్రియయై, నిత్యమూ తనను నిష్ఠతో సేవిస్తున్న ఆమెననేక పర్యాయాలు చూచిన పిదప మహాదేవుడు సదయుడై ఇట్లు తలపోశాడు

**యదైవైషా తపశ్చర్యావ్రతం కాళీ కరిష్యతి ।**
**తదా చ తాం గ్రహీష్యామి గర్వబీజవివర్జితామ్ ॥51॥**

ఎప్పుడైతే ఈ కాళి తీవ్ర తపస్సు చేస్తుందో, అప్పుడామెలోని గర్వబీజాలు తొలగిపోతాయి. అప్పుడామెను నేను స్వీకరిస్తాను.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇతి సంచింత్య భూతేశో ద్రుతం ధ్యాన సమాశ్రితః ।**
**మహాయోగీశ్వరోఽభూద్వై మహాలీలాకరః ప్రభుః ॥52॥**

భూతపతియు, మహాయోగీశ్వరుడును, మహాలీలాకరుడునగు శివుడిట్లు తలపోసి వెంటనే ధ్యాననిమగ్నుడయ్యాడు.

**ధ్యానాసక్తస్య తస్యాథ శివస్య పరమాత్మనః ।**
**హృది నాసీన్మునే కాచిదన్యా చింతా వ్యవస్థితా ॥53॥**

ఓ మునీంద్రా! ధ్యానాసక్తుడైన శివపరమాత్మయొక్క హృదయంలో మరియొక తలంపు లేదు.

**కాళీత్వనుదినం శంభుం సద్భక్త్యా సమసేవత ।**
**విచింతయతీ సతతం తస్య రూపం మహాత్మనః ॥54॥**

కాళీదేవి సర్వకాలాలయందూ ఆ పరమాత్ముని రూపాన్ని స్మరిస్తూ ప్రతిదినం మంచి భక్తితో శంభుని సేవిస్తూ ఉంది.

**హరో ధ్యానపరః కాళీం నిత్యం ప్రైక్షత సుస్థితమ్ ।**
**విస్మృత్య పూర్వచింతాం తాం పశ్యన్నపి న పశ్యతి ॥55॥**

శివుడు నిత్యమూ ఆ సుందరిని చూస్తూ పూర్వ దుఃఖాన్ని మరిచిపోయాడు. ధ్యానమగ్నుడైన ఆ శివుడు ఆమెను చూస్తున్నప్పటికి, చూడనివానివలెనే ఉండేవాడు.

**ఏతస్మిన్నంతరే దేవాశ్శక్రాద్యా మునయశ్చ తే ।**
**బ్రహ్మాజ్ఞయా స్మరం తత్ర ప్రేషయామాసురాదరాత్ ॥56॥**

ఇంతలో ఇంద్రాది దేవతలు, మరియు మునులు బ్రహ్మాజ్ఞను ఆదరంతో స్వీకరించి, మన్మథుని అచ్చటకు పంపారు.

**తేన కారయితుం యోగం కాళ్యా రుద్రేణ కామతః ।**
**మహావీర్యేణాసురేణ తారకేణ ప్రపీడితాః ॥57॥**

మహా బలవంతుడగు తారకాసురునిచే మిక్కిలి పీడింపబడిన దేవతలు రుద్రుడు కాళిని ప్రేమించి, వివాహమాడేటట్లు చేయడానికి మన్మథుని పంపారు.

**గత్వా తత్ర స్మరస్సర్వ ముపాయ మకరోన్నిజమ్ ।**
**చుక్షుభే న హరః కించిత్తం చ భస్మీచకారహ ॥58॥**

మన్మథుడచ్చటకు వెళ్ళి, తన ఉపాయాలనన్నిటిని ప్రయోగించాడు. శివుడు లేశమైనను చలించలేదు. పైగా అతనిని బూడిదగా చేశాడు.

**పార్వత్యపి విగర్వాభూన్మునే తస్య నిదేశతః ।**
**తతస్తపో మహత్కృత్వా శివం ప్రాప పతిం సతీ ॥59॥**

ఓ మహర్షీ! పార్వతికూడా తన గర్వాన్ని విడనాడింది. అంతట శివుని ఆదేశంచేత పార్వతీదేవి గొప్ప తపస్సుచేసి, శివుని భర్తగా పొందింది.

**బభూవతుస్తౌ సుప్రీతౌ పార్వతీ పరమేశ్వరౌ ।**
**చక్రతుర్దేవ కార్యం హి పరోపకరణే రతౌ ॥60॥**

పార్వతీ పరమేశ్వరులిరువురు మిక్కిలి ఆనందించారు. పరోపకారం చేయడంలో ప్రీతిగల ఈ దంపతులు దేవకార్యాన్ని నెరవేర్చారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే పార్వతీ పరమేశ్వర సంవాదం నామ త్రయోదశోఽధ్యాయః ॥13॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో పార్వతీ పరమేశ్వరసంవాదం అనే పదమూడవ అధ్యాయం సమాప్తం.

## చతుర్దశోఽధ్యాయః – పద్నాల్గవ అధ్యాయం

## తారకోత్పత్తౌ వజ్రాంగోత్పత్తిః తత్తపోవర్ణనశ్చ – తారకోత్పత్తి యందు వజ్రాంగోత్పత్తియు, తపోవర్ణనం

**నారద ఉవాచ** – నారదుడు చెప్పాడు.

**విష్ణుశిష్య మహాశైవ సమ్యగుక్తం త్వయా విధే ।**
**చరితం పరమం హ్యేత చ్ఛివాయాశ్చ శివస్య చ ॥1॥**

ఓ విష్ణుశిష్యా! నీవు శివభక్తులలో శ్రేష్ఠుడవు. ఓ విధీ! నీవు శివాశివుల పరమచరితను చక్కగా వివరించావు.

**కస్తారకాసురో బ్రహ్మన్యేన దేవాః ప్రపీడితాః ।**
**కస్య పుత్రస్య వై బ్రూహి తత్కథాం చ శివాశ్రయామ్ ॥2॥**

ఓ బ్రహ్మ! దేవతలను తీవ్రంగా పీడించిన ఆ తారకాసురు డెవ్వడు? అతడెవరి కుమారుడు? శివాశ్రయమైన ఆ గాథను వివరించి చెప్పు.

**భస్మీచకార స కథం శంకరశ్చ స్మరం వశీ ।**
**తదపి బ్రూహి సుప్రీత్యాద్భుతం తచ్చరితం విభోః ॥3॥**

జితేంద్రియుడగు శంకరుడు మన్మథుని భస్మం చేసిన విధమెట్టిది? పరమేశ్వరుని ఆ అద్భుత గాథను కూడా మిక్కిలి ప్రీతితో చెప్పు.

**కథం శివా తపోఽత్యుగ్రం చకార సుఖహేతవే ।**
**కథం ప్రాప పతిం శంభుమాదిశక్తిర్జగత్పరా ॥4॥**

జగత్స్వరూపిణి, ఆదిశక్తియునగు శివాదేవి శంభుని భర్తగాపొంది, ఆనందించడానికి చేసిన మిక్కిలి తీవ్రమైన తపోవిధానమెట్టిది?

**ఏతత్సర్వమశేషేణ విశేషేణ మహాబుధ ।**
**బ్రూహి మే శ్రద్దధానాయ స్వపుత్రాయ శివాత్మనే ॥5॥**

ఓ మహాప్రాజ్ఞా! శివభక్తుడను, నీ పుత్రుడను, శ్రద్ధగలవాడను అగు నాకు ఈ గాథనంతటిని వివరించి చెప్పు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**పుత్రవర్య మహాప్రాజ్ఞ సురర్షే శంసితవ్రత! ।**
**వచ్మ్యహం శంకరం స్మృత్వా సర్వం తచ్చరితం శృణు ॥6॥**

ఓ దేవర్షీ! పుత్రవర్యా! మహాప్రాజ్ఞా! జితేంద్రియుడా! నీభక్తి ముల్లోకాలలో ప్రసిద్ధిగాంచింది. నేను శంకరుని స్మరించి, ఆయన చరిత్రనంతటిని చెబుతాను విను.

**ప్రథమం తారకస్యైవ భవం సంశృణు నారద ।**
**యద్వధార్థం మహాయత్నః కృతో దేవైశ్శివాశ్రయైః ॥7॥**

ఓ నారదా! ముందుగా తారకుని జన్మవృత్తాంతాన్ని విను, తారకుని వధకొరకై దేవతలు శివుని ఆశ్రయించి, గొప్ప ప్రయత్నం చేశారు.

**మమ పుత్రో మరీచిర్యః కశ్యపస్తస్య చాత్మజః ।**
**త్రయోదశ మితాస్తస్య స్త్రియో దక్ష సుతాశ్చ యాః ॥8॥**

నా మానస పుత్రుడు మరీచి. అతని కుమారుడు కశ్యపుడు. అతడు దక్షుని పదముగ్గురు కుమార్తెలను వివాహమాడాడు.

**దితిర్జ్యేష్ఠా చ తత్ స్త్రీ హి సుషువే సా సుతద్వయమ్ ।**
**హిరణ్యకశిపుర్జ్యేష్ఠో హిరణ్యాక్షోఽనుజస్తతః ॥9॥**

వారిలో పెద్దభార్య దితి. ఆమెకు ఇద్దరు కుమారులు. వారిలో హిరణ్యకశిపుడు జ్యేష్ఠుడు. వాని తమ్ముడు హిరణ్యాక్షుడు.

**తౌ హతౌ విష్ణునా దైత్యౌ నృసింహ క్రోడరూపతః ।**
**సుదుఃఖదౌ తతో దేవాః సుఖమాపుశ్చ నిర్భయాః ॥10॥**

దేవతలకు మిక్కిలి దుఃఖాన్ని కలిగించిన ఆ రాక్షసులిద్దరిని విష్ణువు క్రమంగా నృసింహ వరాహ రూపాలతో సంహరించాడు. అంతట దేవతలు భయాన్ని వీడి, సుఖించారు.

**దితిశ్చ దుఃఖితాసీత్సా కశ్యపం శరణం గతా ।**
**పునస్సంసేవ్య తం భక్త్యా గర్భమాధత్త సువ్రతా ॥11॥**

దితి దుఃఖితురాలై కశ్యపుని శరణు పొందింది. ఆమె ఆయనను మరల భక్తితో చక్కగా సేవించింది. ఆమె మరల గర్భాన్ని పొందింది.

**తద్విజ్ఞాయ మహేంద్రోఽపి లబ్ధచ్ఛిద్రో మహోద్యమీ ।**
**తద్గర్భం వ్యచ్ఛినత్తత్ర ప్రవిశ్య పవినా ముహుః ॥12॥**

ఆవిషయాన్నెరింగి, గొప్ప యత్నశీలుడైన మహేంద్రుడు దోషాన్ని కనిపెట్టి, ఆమెయందు ప్రవేశించి, వజ్రంతో ఆమె గర్భాన్ని పలుమార్లు భేదించాడు.

**తద్వ్రతస్య ప్రభావేణ న తద్గర్భో మమార హ ।**
**స్వపంత్యా దైవయోగేన సప్తసప్తాభవన్సుతాః ॥13॥**

ఆమె వ్రతప్రభావంచే నిద్రిస్తున్నది. అందుచేత ఆమె గర్భం మరణించలేదు. దైవానుగ్రహంతో ఆమెకు నలభైతొమ్మిది మంది కుమారులు పుట్టారు.

**దేవా ఆసన్సుతాస్తే చ నామతో మరుతోఽఖిలాః ।**
**స్వర్గం యయుస్తదేంద్రేణ దేవరాజాత్మసాత్కృతాః ॥14॥**

ఆ కుమారులందరు మరుత్తులనే పేరుతో దేవతలై స్వర్గాన్ని పొందారు. అంతట దేవరాజైన ఇంద్రుడు వారినందరిని తనవారినిగా చేసుకున్నాడు.

**పునర్దితిః పతిం భేజేఽనుతప్తా నిజకర్మతః ।**
**చకార సుప్రసన్నం తం మునిం పరమసేవయా ॥15॥**

దితి తాను చేసిన దోషానికి పరితపించి, మరల భర్తవద్దకు వెళ్ళి, గొప్ప సేవచేసి, సుప్రసన్నుని గావించుకుంది.

**కశ్యప ఉవాచ** – కశ్యపుడు పలికాడు.

**తపఃకురు శుచిర్భూత్వా బ్రహ్మణశ్చాయుతం సమాః ।**
**చేద్భవిష్యతి తత్పూర్వం భవితా తే సుతస్తదా ॥16॥**

నీవు శుచివై పదివేల సంవత్సరాలు బ్రహ్మనుగూర్చి తపస్సుచేయి. నీవ్రతం పూర్తిగాగల సమయానికి పూర్వమే నీకు కుమారుడు జన్మిస్తాడు.

**తథా దిత్యాకృతం పూర్ణం తత్తపశ్శ్రద్ధయా మునే ।**
**తతః పత్యుః ప్రాప్య గర్భం సుషువే తాదృశం సుతమ్ ॥17॥**

ఓ నారదమునీ! దితి ఆవిధంగానే పూర్ణమైన తపస్సు శ్రద్ధతో చేసింది. తరువాత ఆమెభర్తనుండి గర్భాన్ని పొంది, గొప్ప కుమారుని పొందింది.

**వజ్రాంగనామా సోఽభూద్వై దితిపుత్రోఽమరోపమః ।**
**నామతుల్య తనుర్వీరస్సుప్రతాప్యుద్భవా ద్బలీ ॥18॥**

దేవతలతో సమానుడైన ఆ దితిపుత్రుడు వజ్రాంగుడనే పేరుగలవాడయ్యాడు. అతని పేరునకు తగిన విధంగా దేహం కలవాడు, వీరుడు, గొప్ప పరాక్రమశాలి. అంతేగాక పుట్టిననాటినుండి మిక్కిలి బలశాలి.

**జననీశాసనా త్సద్యస్స సుతో నిర్జరాధిపమ్ ।**
**బలాద్ధృత్వా దదౌ దండం వివిధం నిర్జరానపి ॥19॥**

ఆ వజ్రాంగుడు తల్లి ఆజ్ఞచే వెనువెంటనే ఇంద్రుడు తదితర దేవతలనందరిని బలాత్కారంగా తీసుకొనివచ్చి, అనేక విధాలుగా దండించాడు.

**దితిస్సుఖమతీవాప దృష్ట్వా శక్రాది దుర్దశామ్ ।**
**అమరా అపి శక్రాద్యా జగ్ముర్దుఃఖం స్వకర్మతః ॥20॥**

ఇంద్రాది దేవతల దుర్దశను చూచి, దితి మిక్కిలి సంతసించింది. ఇంద్రాది దేవతలు వారికి జరిగినదానికి దుఃఖాన్ని పొందారు.

**తదాహం కశ్యపేనాశు తత్రాగత్య సుసామగీః ।**
**దేవానత్యాజయం స్తస్మాత్సదా దేవహితే రతః ॥21॥**

నిత్యమూ దేవతల హితాన్ని కోరే నేను శీఘ్రమే చక్కని సామగానంచేస్తూ, అచ్చటకువచ్చి, వజ్రాంగుని చెరనుండి, దేవతలను విడిపించాను.

**దేవాన్ముక్త్వా స వజ్రాంగస్తతః ప్రోవాచ సాదరమ్ ।**
**శివభక్తోఽతి శుద్ధాత్మా నిర్వికారః ప్రసన్నధీః ॥22॥**

శివభక్తుడు, మిక్కిలి పవిత్రమైన అంతఃకరణ కలవాడు, నిర్వికారి, బుద్ధిమంతుడునైన వజ్రాంగుడు దేవతలను విడిచిపెట్టి, ఆదరంతో అప్పుడు ఇలా పలికాడు.

**వజ్రాంగ ఉవాచ** – వజ్రాంగుడు పలికాడు.

**ఇంద్రో దుష్టః ప్రజాఘాతీ మాతుర్మే స్వార్థసాధకః ।**
**సఫలం ప్రాప్తవానద్య స్వరాజ్యం హి కరోతు సః ॥23॥**

ఇంద్రుడు స్వార్థపరుడగు దుష్టుడు. నా తల్లిగారి సంతానాన్ని హింసించినవాడు. దానికీనాడు ఫలాన్ని అనుభవించాడు. అతని రాజ్యాన్ని అతడు ఏలుకోవచ్చు.

**మాతురాజ్ఞా వశాద్బ్రహ్మ న్కృతమేతన్మయాఖిలమ్ ।**
**న మే భోగాభిలాషో వై కస్యచిద్భువనస్య హి ॥24॥**

ఓ విధీ! నాతల్లి ఆజ్ఞానుసారమే నేను దీనినంతటిని చేశాను. నాకు భోగాభిలాష కొంచెం కూడా లేదు.

**తత్త్వసారం విధే బ్రూహి మహ్యం వేదవిదాం వర ।**
**యేన స్యాం సుసుఖీ నిత్యం నిర్వికారః ప్రసన్న ధీః ॥25॥**

నీవు వేదవిదులలలో శ్రేష్ఠుడవు. ఏ ఆత్మతత్త్వసారాన్ని ఎరిగి నేను నిత్యానందాన్ని, నిర్వికారాన్ని, ప్రసన్నమైన అంతఃకరణను పొందగలనో అట్టి తత్త్వసారాన్ని నాకు బోధించు.

**తచ్ఛ్రుత్వాహం మునేఽవోచం సాత్త్వికో భావ ఉచ్యతే ।**
**తత్త్వసార ఇతి ప్రీత్యా సృజామ్యేకాం వరాం స్త్రియమ్ ॥26॥**

ఓ మహర్షీ! వజ్రాంగుని మాటలను విని, ప్రీతితో జ్ఞాన వైరాగ్యాది సాత్త్విక భావనలే తత్త్వసారమని అతనికి బోధించి, శ్రేష్ఠమైన కన్యనొకదానిని సృష్టించాను.

**వరాంగీంనామ తాం దత్త్వా తస్మై దితిసుతాయ వై ।**
**అయాం స్వధామ సుప్రీతః కశ్యపస్తత్పితాపి చ ॥27॥**

'వరాంగి' అను పేరుగల ఆ కన్యను దితి సుతుడైన వజ్రాంగుని కిచ్చి, వివాహం జరిపించి నా నివాసానికి చేరుకున్నాను. జరిగినదానికి అతని తండ్రియైన కశ్యపుడుకూడా సంప్రీతుడయ్యాడు.

**తతో దైత్యస్స వజ్రాంగ స్సాత్త్వికం భావమాశ్రితః ।**
**ఆసురం భావముత్సృజ్య నిర్వైర స్సుఖమాప్తవాన్ ॥28॥**

అనంతరం దైత్యుడైన వజ్రాంగుడు ఆసురభావాలను విడిచి, సాత్త్వికభావసమన్వితుడై, విరోధులు లేకుండా సుఖాన్ని పొందాడు.

**న బభూవ వరాంగ్యా హి హృదిభావోఽథ సాత్త్వికః ।**
**సకామా స్వపతిం భేజే శ్రద్ధయా వివిధం సతీ ॥29॥**

వరాంగిమాత్రం హృదయంలో సాత్త్విక భావాలు లేనిదైనా, వివిధకామనలతో శ్రద్ధగా భర్తను సేవించేది.

**అథ తత్సేవనాదాశు సంతుష్టోఽభూన్మహాప్రభుః ।**

**స వజ్రాంగః పతిస్తస్యా ఉవాచ వచనం తదా ॥30॥**

ఆమె సేవలకు మహాప్రభుడైన వజ్రాంగుడు సంతుష్టాంతరంగుడై, అప్పుడామెతో ఇలా పలికాడు.

**వజ్రాంగ ఉవాచ** – వజ్రాంగుడు పలికాడు.

**కిమిచ్ఛసి ప్రియే బ్రూహి కిం తే మనసి వర్తతే ।**
**తచ్ఛ్రుత్వానమ్య తం ప్రాహ సా పతిం స్వమనోరథమ్ ॥31॥**

"ఓ ప్రియురాలా! నీమనసులో ఏముంది? నీకేమికావాలి? చెప్పు" అని వజ్రాంగుడు పలికాడు. ఆమె అతని మాటలను విని, నమస్కరించి, తన భర్తతో తన మనోరథాన్ని ఈవిధంగా చెప్పింది.

**వరాంగ్యువాచ** – వరాంగి పలికింది.

**చేత్ ప్రసన్నోఽభవస్త్వం వై సుతం మే దేహి సత్పతే ।**
**మహాబలం త్రిలోకస్య జేతారం హరి దుఃఖదమ్ ॥32॥**

"ఓ నాథా! మీరు నాయందు ప్రసన్నులైతే, ముల్లోకాలను జయించి ఇంద్రుని సైతం దుఃఖపెట్టగల పరాక్రమశాలియునైన పుత్రుడు కావాలి". అని కోరింది.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇతి శ్రుత్వా ప్రియావాక్యం విస్మితోఽభూత్స ఆకులః ।**
**ఉవాచ హృది స జ్ఞానీ సాత్త్వికో వైరవర్జితః ॥33॥**

ఆమె కోరికను విని, ఆశ్చర్యాన్ని దుఃఖాన్ని పొంది, సాత్త్వికుడు, వైరవర్జితుడు, జ్ఞానీ అయిన వజ్రాంగుడు ఆమెతో ఇలాపలికాడు.

**ప్రియేచ్ఛతి విరోధం వై సురైర్మే న హి రోచతే ।**
**కిం కుర్యాం హి క్వ గచ్ఛేయం కథం నశ్యేత మే పణః ॥34॥**

ఓ ప్రియా! నువ్వు దేవతలతో విరోధాన్ని కోరుకుంటున్నావు. నేను దానికి ఇష్టపడడంలేదు. ఏమిచేయాలి? ఎక్కడకు పోవాలి? నా ప్రతిజ్ఞా భంగాన్ని ఎలా చేయాలి?

**ప్రియా మనోరథశ్చైవ పూర్ణస్స్యా స్త్రి జగద్భవేత్ ।**
**క్లేశయు క్తితరాం భూయో దేవాశ్చ మునయస్తథా ॥35॥**

ప్రియురాలి మనోరథాన్ని సంపూర్ణం చేస్తే ముల్లోకాలు క్లేశపడతాయి. అంతేగాక నిరంతరం మళ్ళీ మళ్ళీ దేవతలు, మునులు కష్టాలపాలౌతారు.

**న పూర్ణస్స్యా త్ప్రియా కామస్తదా మే నరకో భవేత్ ।**
**ద్విధాపి ధర్మహానిర్వై భవతీత్యనుశుశ్రువాన్ ॥36॥**

ప్రియురాలి కోరికను నెరవేర్చకపోతే నాకు నరకం సంభవిస్తుంది. రెండు విధాలుగా కూడా ధర్మహానియే జరుగుతుందని వినియున్నాను.

**వజ్రాంగ ఇత్థం బభ్రామ స మునే ధర్మసంకటే ।**
**బలాబలం ద్వయోస్తత్ర విచిచింత చ బుద్ధితః ॥37॥**

వజ్రాంగుడీవిధంగా రెంటిలోని బలాబలాలను బుద్ధితో విచారించి ధర్మసంకటంలో పడ్డాడు.

**శివేచ్ఛయా స హి మునే వాక్యం మేనే స్త్రియో బుధః ।**
**తథాస్త్వితి వచః ప్రాహ ప్రియాం ప్రతి స దైత్యరాట్ ॥38॥**

ఓ మహర్షీ! శివేచ్ఛచే ప్రియురాలి కోరికను తీర్చాలని నిశ్చయించుకొని, ప్రియురాలితో 'అట్లే అగుగాక!" అని పలికాడు.

**తదర్థ మకరోత్తీవ్రం తపోఽన్యద్దుష్కరం స తు ।**
**మాం సముద్దిశ్య సుప్రీత్యా బహువర్షం జితేంద్రియః ॥39॥**

దానికొరకతడు నన్ను (బ్రహ్మను) ఉద్దేశించి, జితేంద్రియుడై అనేక సంవత్సరాలు తీవ్రమై, దుష్కరమైన తపస్సుచేశాడు.

**వరం దాతుమగాం తస్మై దృష్ట్వాహం తత్తపో మహత్ ।**
**వరం బ్రూహి హ్యవోచం తం సుప్రసన్నేన చేతసా ॥40॥**

అతని మహా తపస్సును చూచి, సుప్రసన్న చేతస్కుడనై, అతనికి వరం ప్రసాదించడానికి వెళ్ళాను. అతనితో వరాన్ని కోరుకోమని పలికాను.

**వజ్రాంగస్తు తదా ప్రీతం మాం దృష్ట్వా ఖే స్థితం విభుమ్ ।**
**సుప్రణమ్య బహు స్తుత్వా వరం వవ్రే ప్రియా హితమ్ ॥41॥**

సుప్రీతుడనై, ఆకాశంలోనున్న, నన్నుచూచి, వజ్రాంగుడు నాకు చక్కగా నమస్కరించి, అనేక విధాల స్తుతించి, తన ప్రియురాలి కోరికనే వరంగా కోరాడు.

**వజ్రాంగ ఉవాచ –** వజ్రాంగుడు పలికాడు.

**సుతం దేహి స్వమాతుర్మే మహాహితకరం ప్రభో ।**
**మహాబలం సుప్రతాపం సుసమర్థం తపోనిధిమ్ ॥42॥**

"ఓ ప్రభూ! మహాబలుడు, సుప్రతాపుడు, మిక్కిలి సమర్థుడు, తపోనిధి, తన తల్లికి మిక్కిలి హితకరుడునైన కుమారుని నాకు ప్రసాదించు".

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య చ తద్వాక్యం తథాస్త్విత్యబ్రవం మునే ।**
**అయాం స్వధామ తద్దత్త్వా విమనాస్సంస్మరన్ శివమ్ ॥43॥**

ఓనారదమునీ! అతని మాటను విని, 'అట్లే అగుగాక!' అని అతనితో పలికాను. ఆ వరాన్ని అతనికిచ్చి, శివుని స్మరిస్తూ నా నివాసానికి వెళ్ళాను.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే తారకోత్పత్తౌ వజ్రాంగోత్పత్తి తపోవర్ణనం నామ చతుర్దశోఽధ్యాయః ॥14॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో తారకోత్పత్తి యందు వజ్రాంగోత్పత్తియు, తపోవర్ణనం అనే పద్నాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచదశోఽధ్యాయః - పదిహేనవ అధ్యాయం

## తారకాసుర తపోరాజ్యవర్ణనమ్ - తారకాసుర తపోరాజ్యవర్ణన

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథ సా గర్భమాధత్త వరాంగీ తత్పురాదరాత్ ।**
**స వవర్ధాభ్యంతరే హి బహువర్షైః సుతేజసా ॥1॥**

అంతట వరాంగి గర్భాన్ని ధరించింది. గర్భంలోని ఆ శిశువు అనేక సంవత్సరాలు మంచి తేజస్సుతో వృద్ధిపొందాడు.

**తతః సా సమయే పూర్ణే వరాంగీ సుషువే సుతమ్ ।**
**మహాకాయం మహావీర్యం ప్రజ్వలంతం దిశో దశ ॥2॥**

అంతట వరాంగి సమయం పూర్తికాగానే మహాకాయుడై, మహా వీర్యుడు, దశదిశలను ప్రజ్వర్యలింపజేసే కుమారుని ప్రసవించింది.

**తథైవ చ మహోత్పాతా బభూవుర్దుఃఖ హేతవః ।**
**జాయమానే సుతే తస్మిన్వరాంగ్యా స్సుర దుఃఖదే ॥3॥**

ఆ వరాంగికి దేవతలకు దుఃఖాన్ని కలిగించే కుమారుడు జన్మించగానే దుఃఖ హేతువులైన అనేక మహోత్పాతాలు సంభవించాయి.

**దివి భువ్యన్తరిక్షే చ సర్వలోక భయంకరాః ।**
**అనర్థ సూచకాస్తాత త్రివిధాస్తా స్బ్రవీమ్యహమ్ ॥4॥**

ఓ వత్సా! దివిలోను, భువిలోను, అంతరిక్షంలోను, సర్వలోక భయంకరములై, అనర్థ సూచకములైన త్రివిధ మహోత్పాతాలు కలిగాయి. వాటినిగూర్చి చెబుతాను.

**సోల్కా శ్చాశనయః పేతుర్మహా శబ్దా భయంకరాః ।**
**ఉదయం చక్రురుత్కృష్టాః కేతవో దుఃఖదాయకాః ॥5॥**

ఉల్కలు వర్షించాయి. భయంకరమైన మహాశబ్దాలతో పిడుగులు పడ్డాయి. క్రూర జంతువులు అధికంగా జన్మించాయి.

**చచాల వసుధా సాద్రిర్జజ్వలుస్సకలా దిశః ।**
**చుక్షుభు స్సరిత స్సర్వాః సాగరాశ్చ విశేషతః ॥6॥**

కులపర్వత కానన సహితంగా భూమి కంపించింది. దిక్కుల్లో మంటలు చెలరేగాయి. నదులన్నీ సంక్షుభితమయ్యాయి. సముద్రాలు విశేషంగా క్షోభిల్లాయి.

**హూత్కరా నీరయన్ధీరాన్ఖరస్పర్శో మరుద్వవౌ ।**
**ఉన్మూలయన్మహావృక్షాన్వాత్యానీకో రజోధ్వజః ॥7॥**

భీకర వాయువులే సైన్యంగా, ధూళియే ధ్వజంగా గల మరుత్తు పెద్ద హోరుతో వీచి, మహావృక్షాలను నేలకూల్చాడు.

**సరాహ్వో స్సూర్య విధ్వోస్తు ముహుః పరిధయోఽభవన్ ।**
**మహాభయస్య విప్రేంద్ర సూచకా స్సుఖహారకః ॥8॥**

ఓ విప్రేంద్రా! సూర్యచంద్రులు రాహుగ్రస్తులయ్యారు. వారిచుట్టు పరివేష మండలాలు ఏర్పడ్డాయి. సుఖాన్ని పోగొడుతూ, మహాభయానకాలు నయిన అనేక సూచనలు కనబడ్డాయి.

**మహీధ్ర వివరేభ్యశ్చ నిర్ఘాతా భయసూచకాః ।**
**రథ నిర్హ్రాద తుల్యాశ్చ జజ్ఞిరేఽవసరే తతః ॥9॥**

ఆ సమయంలో కొండగుహలనుండి భయాన్ని కలిగించే రథశబ్దాన్ని పోలిన శబ్దంగల భూకంపాలు పుట్టాయి.

**సృగాలోలూక టంకారై ర్వమంత్యో ముఖతోఽనలమ్ ।**
**అంతర్గ్రామేషు వికటం ప్రణేదురశివాః శివాః ॥10॥**

అమంగళ కరాలైన నక్కలు నోటినుండి నిప్పులు గ్రక్కుతూ గ్రామాల మధ్యలో కర్ణకఠోరమైన శబ్దాలు చేశాయి. వీటికి గుడ్లగూబల ధ్వనులు తోడయ్యాయి.

**యతస్తతో గ్రామసింహా ఉన్నమయ్య శిరోధరామ్ ।**
**సంగీతవద్రోదన వద్వ్యముంచన్వివిధా న్రవాన్ ॥11॥**

కుక్కలు ఇటునటు తిరుగుతూ, శిరస్సును పైకెత్తి నేలను తన్నుతూ ఒక్కొక్కమారు సంగీతాన్ని, ఒక్కొక్కమారు ఏడ్పులను చేస్తూ అనేక శబ్దాలను చేశాయి.

**ఖార్కార రభసా మత్తాః ఖురైర్ఘ్నంతో రసాం ఖరాః ।**
**వరూథశస్తదా తాత పర్యధావన్నితస్తతః ॥12॥**

వత్సా! ఆసమయంలో మదించిన గాడిదలు గుంపులు గుంపులుగా ఇటునటు పరిగెత్తుతూ, కర్కశంగా ఓండ్రపెడుతూ, గిట్టలతో నేలను తవ్వుతున్నాయి.

**ఖగా ఉదపతన్నీడా ద్రాసభత్రస్తమానసః ।**
**క్రోశంతో వ్యగ్రచిత్తాశ్చ స్థితమాపుర్న కుత్రచిత్ ॥13॥**

భీకర శబ్దాలచే భయాన్ని పొందిన పక్షులు ఏడుస్తూ, గూళ్ళనుండి ఎగిరిపోయాయి. అవి ఒకచోట స్థిరంగా కూర్చుండలేకపోయాయి.

**శకృన్మూత్ర మకార్షుశ్చ గోష్ఠేఽ రణ్యే భయాకులాః ।**
**బభ్రముః స్థితిమాపుర్నో పశవస్తాడితా ఇవ ॥14॥**

పశువులు ఎవరో కొడుతున్నారా అన్నట్లు పశువులశాలలో గాని, అడవిలోగాని స్థిరంగా ఉండలేక ఇటు అటు తిరుగుతూ మలమూత్రాలను విసర్జించాయి.

**గావోఽత్ర సన్నసృగ్దోహా బాష్పనేత్రా భయాకులాః ।**
**తోయదా అభవం స్తత్ర భయదాః పూయవర్షిణః ॥15॥**

గోవులు భయంచే వ్యాకులపడి, కనులవెంబడి, నీరుకారుస్తూ పాలకు బదులుగా రక్తాన్ని స్రవిస్తున్నాయి. మేఘాలు భయాన్ని కలిగిస్తూ చీమును వర్షించాయి.

**వ్యరుదన్ప్రతిమాస్తత్ర దేవానా ముత్పతిష్ణవః ।**
**వినానిలం ద్రుమాః పేతుర్గ్రహయుద్ధం బభూవ ఖే ॥16॥**

దేవతా ప్రతిమలు ఎగిరిపడుతు రోదించాయి. గాలి లేకుండగానే చెట్లు నేలకూలాయి. ఆకాశంలో గ్రహాలమధ్య యుద్ధం ప్రారంభమయ్యింది.

**ఇత్యాదికా బహూత్పాతా జజ్ఞిరే మునిసత్తమ ।**
**అజ్ఞానినో జనాస్తత్ర మేనిరే విశ్వసంప్లవమ్ ॥17॥**

ఓ మునిసత్తమా! ఈవిధమైన అనేకోత్పాతాలు పుట్టాయి. అచ్చటి అజ్ఞానులైన జనులు జగత్తునకు ప్రళయం వస్తోందని తలంచారు.

**అథ ప్రజాపతిర్నామాకరోత్తస్యా సురస్య వై ।**
**తారకేతి విచార్యైవ కశ్యపో హి మహౌజసః ॥18॥**

అనంతరం కశ్యప ప్రజాపతి ఆలోచించి, మహాపరాక్రమశాలియైన ఆ రాక్షస బాలకునకు "తారకుడు" అని పేరుపెట్టాడు.

**మహావీరస్య సహసా వ్యజ్యమానాత్మ పౌరుషః ।**
**వవృధేత్యశ్మసారేణ కాయేనాద్రిపతిర్యథా ॥19॥**

మహావీరుడు, ప్రకటింపబడుతున్న ఆత్మపౌరుషం గలవాడు ఐన తారకుడు పాషాణంవలె దృఢమైన శరీరంతో శీఘ్రంగా పర్వతరాజువలె పెరగడం మొదలు పెట్టాడు.

**అథో స తారకో దైత్యో మహాబలపరాక్రమః ।**
**తపః కర్తుం జనన్యాశ్చాజ్ఞాం యయాచే మహామనాః ॥20॥**

గొప్ప బలపరాక్రమాలు కలవాడు, దృఢచిత్తుడు ఐన తారకుడు తపస్సు చేయడానికి తల్లిఆజ్ఞను వేడుకున్నాడు.

**ప్రాప్తాజ్ఞః స మహామాయీ మాయినామపి మోహకః ।**
**సర్వదేవ జయం కర్తుం తపోర్థం మన ఆదధే ॥21॥**

మాయావులనైనను మోహింపజేయగల మహామాయావియైన తారకుడు తల్లిఆజ్ఞను పొంది, దేవతలనందరిని జయించు నిమిత్తం, తపస్సుచేయడానికి మనస్సులో నిశ్చయించుకున్నాడు.

**మధోర్వనముపాగమ్య గుర్వాజ్ఞాప్రతిపాలకః ।**
**విధిముద్దిశ్య విధివత్తపస్తేపే సుదారుణమ్ ॥22॥**

పెద్దల ఆజ్ఞను పాలించి, అతడు మధువనం చేరి, బ్రహ్మనుద్దేశించి, మిక్కిలి తీవ్రమైన తపస్సును యథావిధిగా చేశాడు.

**ఊర్ధ్వబాహుశ్చైకపాదో రవిం పశ్యన్స చక్షుషా ।**
**శతవర్షం తపశ్చక్రే దృఢచిత్తో దృఢవ్రతః ॥23॥**

అతడు చేతులు పైకెత్తి, ఒంటికాలిపై నిలబడి, సూర్యుని చూస్తూ, దృఢమైన చిత్తంతో దృఢవ్రతుడై నూరు సంవత్సరాలు  తపస్సుచేశాడు.

**అంగుష్ఠేన భువం స్పృష్ట్వా శతవర్షం చ తాదృశః ।**
**తేపే తపో దృఢాత్మా స తారకోఽసురరాట్ ప్రభుః ॥24॥**

దృఢాత్ముడు, రాక్షస ప్రభువైన తారకుడు బొటనవ్రేలిపై నిలబడి, వంద సంవత్సరాలు తపమాచరించాడు.

**శతవర్షం జలం ప్రాశం చ్ఛతవర్షం చ వాయుభుక్ ।**
**శతవర్షం జలే తిష్ఠం చ్ఛతం చ స్థండిలేఽతపత్ ॥25॥**

అతడు వంద సంవత్సరాలు కేవలం నీటినిమాత్రమే త్రాగుతూ, వంద సంవత్సరాలు వాయు భక్షణం చేస్తూ, వందసంవత్సరాలు నీటిలో నిలబడి, వంద సంవత్సరాలు నేలపై నిలబడి తపస్సు చేశాడు.

**శతవర్షం తథాచాగ్నౌ శతవర్ష మధోముఖః ।**
**శతవర్షంతు హస్తస్య తలేన చ భువం స్థితః ॥26॥**

అట్లే వంద సంవత్సరాలు అగ్నులమధ్యలోను, వందసంవత్సరాలు అధోముఖంగాను, మరొక వంద సంవత్సరాలు అరచేతిపై నేలమీద నిలబడియు తపస్సు చేశాడు.

**శతవర్షం తు వృక్షస్య శాఖామాలంబ్య వై మునే ।**
**పాదాభ్యాం శుచిధూమం హి పిబంశ్చాధోముఖస్తథా ॥27॥**

ఓ మునివర్యా! వంద సంవత్సరాలు చెట్టుకొమ్మనుండి కాళ్ళతో వ్రేలాడుతూ, మరియు క్రిందకు వ్రేలాడే ముఖంతో నిప్పులనుండి వెలువడే పొగను త్రాగి తపస్సు చేశాడు.

**ఏవం కష్టతరం తేపే సుతపస్సతు దైత్యరాట్ ।**
**కామముద్దిశ్య విధివచ్ఛృణ్వతా మపి దుస్సహమ్ ॥28॥**

ఈ విధంగా ఆ రాక్షసరాజు వినడానికికూడా దుస్సహమైన తీరులో తన కోరికను సిద్ధింపజేసుకోవడానికి యథావిధిగా తపస్సు చేశాడు.

**తత్రైవం తపతస్తస్య మహత్తేజో వినిస్సృతమ్ ।**
**శిరసస్సర్వసంసర్పి మహోపద్రవకృన్మునే ॥29॥**

ఇట్లు తపస్సు ఆచరిస్తున్న తారకుని శిరస్సునుండి గొప్ప తేజస్సు బయల్వెడలి, అది అంతటా వ్యాపించి, అది గొప్ప విపత్తును కలిగించింది.

**తేనైవ దేవలోకాస్తే దగ్ధప్రాయా బభూవిరే ।**
**అభితో దుఃఖమాపన్నాస్సర్వే దేవర్షయో మునే ॥30॥**

ఓమునీ! దానితో దేవలోకాలు దహింపబడుతున్నాయా? అన్నట్లైంది. దేవతలు, మునులు అందరు అన్నివైపులనుండి దుఃఖాన్ని పొందారు.

**ఇంద్రశ్చ భయమాపేదేఽధికం దేవేశ్వరస్తదా ।**
**తపస్యత్యద్య కశ్చిద్వై మత్పదం ధర్షయిష్యతి ॥31॥**

అంతట దేవరాజైన ఇంద్రుడుకూడా " వీడెవడో తపస్సుచేస్తున్నాడు, నా పదవిని ఊడలాగుకొంటాడేమో" అని భయపడ్డాడు.

**అకాండే చైవ బ్రహ్మాండం సంహరిష్యత్యయం ప్రభుః ।**
**ఇతి సంశయమాపన్నా నిశ్చయం నోపలేభిరే ॥32॥**

పరమేశ్వరుడు అకాలంలో బ్రహ్మాండప్రళయం చేస్తున్నాడేమో నని దేవతలు సందేహాన్ని పొందారు. నిశ్చయమైన కారణం మాత్రం వారికి కూడా తెలియలేదు.

**తతస్సర్వే సుసంమన్త్ర్య మిథస్తే నిర్జరర్షయః ।**
**మల్లోకమగమన్భీతా దీనా మాం సముపస్థితాః ॥33॥**

అంతట దేవతలు, మునులు అందరు పరస్పరం చర్చించుకొని భయంతో దీనులై నాలోకానికి వచ్చి నన్ను సమీపించారు.

**మాం ప్రణమ్య సుసంస్తూయ సర్వే తే క్లిష్టచేతసః ।**
**కృతస్వంజలయో మహ్యం వృత్తం సర్వం న్యవేదయన్ ॥34॥**

క్లిష్టచిత్తులైనవారందరు అంజలి ఘటించి, నాకు నమస్కరించి, నన్ను స్తుతించి, వృత్తాంతాన్నంతటినీ నాకు నివేదించారు.

**అహం సర్వం సునిశ్చిత్య కారణం తస్య సద్ధియా ।**
**వరం దాతుం గతస్తత్ర యత్ర తప్యతి సోఽసురః ॥35॥**

ఆ లోకోపద్రవానికిగల కారణాన్ని నేను నిర్ధారణ చేసుకొని వరాన్ని ప్రసాదించడానికి, ఆ తారకుడు తపస్సు చేస్తున్న స్థలానికి వెళ్ళాను.

**అవోచం వచనం తం వై వరం బ్రూహీత్యహం మునే ।**
**తపస్తప్తం త్వయా తీవ్రం నాదేయం విద్యతే తవ ॥36॥**

ఓ నారదమునీ! నేను ఆ రాక్షసునితో ఇలా పలికాను. "నీవు తీవ్రమైన తపస్సు చేస్తున్నావు. వరాన్ని కోరుకో? నీకు ఇయ్యరాని వరంలేదు" అని.

**ఇత్యేవం మద్వచః శ్రుత్వా తారకస్సమహాసురః ।**
**మాం ప్రణమ్య సుసంస్తూయ వరం వవ్రేఽతిదారుణమ్ ॥37॥**

ఈ నా మాటలను విని, మహాసురుడగు తారకుడు నాకు ప్రణమిల్లి, చక్కగా స్తుతించి, అతిదారుణమైన వరాన్ని కోరాడు.

**తారక ఉవాచ** – తారకుడు పలికాడు.

**త్వయి ప్రసన్నే వరదే కిమసాధ్యం భవేన్మమ ।**
**అతో యాచే వరం త్వత్తః శ్రుణు తన్మే పితామహ ॥38॥**

ఓ పితామహా! మీరు నాకు వరాన్నివ్వడానికి ప్రసన్నులైతే నాకు సాధ్యం కానిదేదియు ఉండదుకదా! నేను మీనుండి కోరుకునే వరాన్ని చెబుతాను. విను.

**యది ప్రసన్నో దేవేశ యది దేయో వరో మమ ।**
**దేయం వరద్వయం మహ్యం కృపాం కృత్వా మమోపరి ॥39॥**

ఓ దేవేశా! నీవు నాయందు ప్రసన్నుడవైతే నాకు వరాలనివ్వడానికి నిర్ణయించుకుంటే, నాయందు దయతో నాకు రెండు వరాల ననుగ్రహించండి.

**త్వయా చ నిర్మితే లోకే సకలేఽస్మిన్మహాప్రభో ।**
**మత్తుల్యో బలవాన్నూనం న భవేత్కోఽపి వై పుమాన్ ॥40॥**

ఓ మహాప్రభూ! నీవు నిర్మించిన ఈ బ్రహ్మాండంలో ఎక్కడైనా నాతో సమానమైన బలవంతుడైన వాడెవ్వడూ ఉండరాదు. ఇది నిశ్చయం.

**శివవీర్య సముత్పన్నః పుత్రస్సేనాపతిర్యదా ।**
**భూత్వా శస్త్రం క్షిపేన్మహ్యం తదా మే మరణం భవేత్ ॥41॥**

శివవీర్య సముద్భూతుడైన కుమారుడు, సేనాపతియై ఏనాడు నాపై ఆయుధాన్ని ప్రయోగిస్తాడో ఆనాడు మాత్రమే నాకు మరణం కలగాలి.

**ఇత్యుక్తోஉథ తదా తేన దైత్యేనాహం మునీశ్వర ।**
**వరం చ తాదృశం దత్త్వా స్వలోక మగమం ద్రుతమ్ ॥42॥**

ఓ మునీశ్వరా! ఆ తారకుడు నన్నీ వరాల నడగగానే ఆ రెండు వరాలను వానికి ప్రసాదించి, నాలోకానికి నేను తిరిగివచ్చాను.

**దైత్యోஉపి స వరం లబ్ధ్వా మనసేప్సితముత్తమమ్ ।**
**సుప్రసన్నతరో భూత్వా శోణితాఖ్యపురం గతః ॥43॥**

తాను కోరిన గొప్ప వరాలను పొందిన ఆ రాక్షసుడు మిక్కిలి సంతోషించి శోణిత మను పేరుగల నగరానికి వెళ్ళాడు.

**అభిషిక్తస్తదా రాజ్యే త్రైలోక్యస్యాసురైస్సహ ।**
**శుక్రేణ దైత్యగురుణాజ్ఞయా మే స మహాసురః ॥44॥**

అంతట రాక్షసగురువగు శుక్రాచార్యుని ఆజ్ఞను పొంది, రాక్షసుల సన్నిధిలో ఆ మహాసురుని ముల్లోకాలకు రాజుగా అభిషేకించారు.

**తతస్తు స మహాదైత్యోஉభవత్త్రైలోక్యనాయకః ।**
**స్వాజ్ఞాం ప్రవర్తయామాస పీడయన్సచరాచరమ్ ॥45॥**

అంతట ఆ మహాదైత్యుడు ముల్లోకాలకు ప్రభువై, చరాచర జగత్తునంతటిని తన ఆజ్ఞచే పీడింపసాగాడు

**రాజ్యం చకార విధివ త్త్రిలోకస్య స తారకః ।**
**ప్రజాశ్చ పాలయామాస పీడయన్నిర్జరాదికాన్ ॥46॥**

ఆ తారకుడు ముల్లోకాలను యథావిధిగా పరిపాలిస్తున్నాడు. అతడు దేవతలు మున్నగువారినీ, ఇతర ప్రజలనూ పీడిస్తూ రాజపాలన చేస్తున్నాడు.

**తతస్స తారకో దైత్యస్తేషాం రత్నాన్యుపాదదే ।**
**ఇంద్రాది లోకపాలానాం స్వతో దత్తాని తద్భయాత్ ॥47॥**

అనంతరం ఆ తారకుడు వారందరినుండి, రత్నాదుల నన్నిటిని లాగుకున్నాడు. ఇంద్రాది లోకపాలురందరు భయంతో తమతమ శ్రేష్ఠవస్తువులనన్నిటిని స్వయంగా అతనికి సమర్పించారు.

**ఇంద్రేణైరావతస్తస్య భయాత్తస్మై సమర్పితః ।**
**కుబేరేణ తదా దత్తా నిధయో నవసంఖ్యకాః ॥48॥**

ఇంద్రుడు భయంతో తన ఐరావతాన్ని అతనికి సమర్పించాడు. కుబేరుడు తన నవనిధులను అతనికి ఇచ్చివేశాడు.

**వరుణేన హయాః శుభ్రా ఋషిభిః కామకృత్తథా ।**
**సూర్యేణోచ్చైశ్రవా దివ్యో భయాత్తస్మై సమర్పితః ॥49॥**

వరుణుడు తెల్లని గుర్రాలను, సూర్యుడు దివ్యమైన ఉచ్చైశ్రవాన్ని భయంతో అతనికి సమర్పించారు. ఋషులందరు తమ కోర్కెల నీడేర్చే కామధేనువును అతనికిచ్చారు.

**యత్ర యత్ర శుభం వస్తు దృష్టం తేనాసురేణ హి ।**
**తత్తద్గృహీతం తరసా నిస్సార స్త్రిభవోఽభవత్ ॥50॥**

ఎక్కడెక్కడ శుభవస్తువు కంటబడినా ఆ రాక్షసుడు దానిని తీసుకుపోయేవాడు. ఈ విధంగా ముల్లోకాలు కూడా నిస్సారమయ్యాయి.

**సముద్రాశ్చ తథా రత్నాన్యదుస్తస్మై భయాన్మునే ।**
**అకృష్టపచ్యాసీ త్పృథ్వీ ప్రజాః కామదుఘాః ఖిలాః ॥51॥**

ఓ నారదమునీ! సముద్రాలు కూడా మిక్కిలి భయంతో తమలోని రత్నాల నన్నిటినీ అతనికి ఇచ్చివేశాయి. భూమి దున్నకుండగానే పంటలు పండించింది. ప్రజలు కణం కణం ప్రోగుచేసి రాజుకోరికలు తీరుస్తున్నారు. (ఖిల కణశః ఆదానే ధాతువుపై ఖిలరూపం)

**సూర్యశ్చ తపతే తద్వత్తద్దుఃఖం న యథా భవేత్ ।**
**చంద్రస్తు ప్రభయా దృశ్యో వాయుస్సర్వానుకూలవాన్ ॥52॥**

తారకునకు దుఃఖం కలుగకుండేటట్లు సూర్యుడు ప్రకాశింపసాగాడు. చంద్రుని కాంతి సర్వదా కన్పట్టేది. వాయుడు సర్వానుకూలంగా వీచేవాడు.

**దేవానాం చైవ యద్ద్రవ్యం పితౄణాం చ పరస్య చ ।**
**తత్సర్వం సముపాదత్త మసురేణ దురాత్మనా ॥53॥**

ఆ దురాత్ముడైన రాక్షసుడు దేవతల హవిస్సులను, పితృదేవతల కవ్యాలను, మొత్తమన్నింటిని లాగుకున్నాడు. అంతేగాక ఇతరుల సంపదలనన్నింటిని హరించివేశాడు.

**వశీకృత్య సలోకాంస్త్రీన్స్వయమింద్రో బభూవ హ ।**
**అద్వితీయః ప్రభుశ్చాసీద్రాజ్యం చక్రేఽద్భుతం వశీ ॥54॥**

అతడు ముల్లోకాలను వశంచేసుకొని, తనకుతానే ఇంద్రపదవి నధిష్ఠించాడు. త్రిలోకాలకు ఏకైక ప్రభుడై, సర్వం తన వశంచేసుకొని అద్భుతంగా రాజ్యాన్ని చేశాడు.

**నిస్సార్య సకాలాన్దేవాన్ దైత్యానస్థాపయత్తతః ।**
**స్వయం నియోజయామాస దేవయోని స్స్వకర్మణి ॥55॥**

అనంతరం అతడు దేవతలనందరిని వెళ్లగొట్టి, ఆయా స్థానాలలో రాక్షసులను స్వయంగా నియమించాడు. గంధర్వాది దేవగణాలను తన సేవకులుగా నియమించుకున్నాడు.

**అథ తద్బాధితా దేవాస్సర్వే శక్రపురోగమాః ।**
**మునే మాం శరణం జగ్మురనాథా అతి విహ్వలాః ॥56॥**

ఓ మహర్షీ! అప్పుడు వానిచే పీడింపబడిన దేవతలందరు అనాథలై మిక్కిలి దుఃఖంతో నన్ను శరణుజొచ్చారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే తారకాసుర తపోరాజ్య వర్ణనం నామ పంచదశోఽధ్యాయః ॥15॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో తారకాసుర తపోరాజ్యవర్ణన అనే పదిహేనవ అధ్యాయం సమాప్తం.

## షోడశోఽధ్యాయః - పదహారవ అధ్యాయం
## బ్రహ్మ దేవసాంత్వనవర్ణనమ్ - బ్రహ్మదేవతలను ఓదార్చుట

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథ తే నిర్జరాస్సర్వే సుప్రణమ్య ప్రజేశ్వరమ్ ।**
**తుష్టువుః పరయా భక్త్యా తారకేణ ప్రపీడితాః ॥1॥**

అపుడా దేవతలందరు తారకునిచే పీడింపబడినవారై, ప్రజాపతికి మహాభక్తితో ప్రణమిల్లి, ఆయనను స్తుతించారు.

**అహం శ్రుత్వామరనుతిం యథార్థాం హృదయంగమామ్ ।**
**సుప్రసన్నతరో భూత్వా ప్రత్యవోచం దివౌకసః ॥2॥**

సత్యమూ, హృదయంగమమూ అయిన దేవతల స్తుతిని విని, నేను మిక్కిలి ప్రసన్నుడనై, దేవతలకిలా బదులు పలికాను.

**స్వాగతం స్వాధికారా వై నిర్విఘ్నాః సంతి వస్సురాః ।**
**కిమర్థమాగతా యూయమత్ర సర్వే వదంతు మే ॥3॥**

దేవతలారా! స్వాగతం. మీ మీ అధికారాలు విఘ్నాలు లేకుండా కొనసాగుతున్నాయా? మీరందరు ఇచ్చటకెందుకు వచ్చారు? చెప్పండి.

**ఇతి శ్రుత్వా వచో మే తే నత్వా సర్వే దివౌకసః ।**
**మామూచుర్నతకా దీనాస్తారకేణ ప్రపీడితాః ॥4॥**

తారకునిచే పీడింపబడిన ఆ దేవతలందరు నా యా మాటలను విని, ప్రణమిల్లి, నాతో ఇలా పలికారు.

**దేవా ఊచుః** - దేవతలు పలికారు.

**లోకేశ తారకో దైత్యో వరేణ తవ దర్పితః ।**
**నిరస్యాస్మాన్హఠాత్ స్థానాన్యగ్రహీన్నో బలాత్స్వయమ్ ॥5॥**

హే లోకేశా! నీవిచ్చిన వరంచే గర్వితుడైన తారకాసురుడు మమ్ములను బలాత్కారంగా మా పదవులనుండి వెళ్ళకొట్టి, ఆ పదవులను తానే ఆక్రమించాడు.

**భవతః కిము న జ్ఞాతం దుఃఖం యన్న ఉపస్థితమ్ ।**
**తద్దుఃఖం నాశయ క్షిప్రం వయం తే శరణం గతాః ॥6॥**

మాకు సంభవించిన ఈ విపత్తు గురించి, మీకు తెలియనే లేదా? మేము నిన్ను శరణుజొచ్చితిమి. మా దుఃఖాన్ని వెంటనే దూరంచేయి.

**అహర్నిశం బాధతేస్మాన్యత్ర తత్రాస్థితాన్స వై ।**
**పలాయమానాః పశ్యామో యత్ర తత్రాపి తారకమ్ ॥7॥**

మేము ఎచ్చటనున్నను ఈ దుఃఖం మమ్ములను రాత్రింబవళ్లు పీడిస్తూనే ఉంది. మేమెచ్చటకు పారిపోయినా తారకుడు అచ్చటనే మాకు ప్రత్యక్షమౌతున్నాడు.

**తారకాన్నశ్చ యద్దుఃఖం సంభూతం సకలేశ్వర ।**
**తేన సర్వే వయం తాత పీడితా వికలా అతి ॥8॥**

ఓ సకలేశ్వరా! తండ్రీ! తారకునివలన మాకు సంప్రాప్తమైన దుఃఖంచే మేమందరం మిక్కిలి పీడింపబడి దుఃఖితులమై ఉన్నాము.

**అగ్నిర్యమోఽథ వరుణో నిర్మతిర్వాయురేవ చ ।**
**అన్యే దిక్పతయశ్చాపి సర్వే యద్వశగామినః ॥9॥**

**సర్వే మనుష్య ధర్మాణస్సర్వైః పరికరైర్యుతాః ।**
**సేవన్తే తం మహాదైత్యం న స్వతంత్రాః కదాచన ॥10॥**

అగ్ని, యముడు, వరుణుడు, నిర్మతి, వాయువు, తదితర దిక్పాలకులందరు వానికి వశులై మనుష్యులవలె సంచరిస్తూ వివిధ పరికరాలను చేతబట్టి, ఆ మహాసురుని సేవిస్తున్నారు. వారికి ఎప్పుడును స్వాతంత్ర్యం లేదు.

**ఏవం తేనార్దితా దేవా వశగాస్తస్య సర్వదా ।**
**తదిచ్ఛాకార్యనిరతాస్సర్వే తస్యానుజీవినః ॥11॥**

ఈవిధంగా వానిచే పీడింపబడిన దేవతలందరు అన్నికాలాలలోను వానికి వశులై, వాని కోరికలకు అనుగుణమైన పనులను చేస్తూ, వాని సేవకులై జీవిస్తున్నారు.

**యావత్యో వనితాస్సర్వా యేచాప్యప్సరసాం గణాః ।**
**సర్వాంస్తానగ్రహీద్దైత్యస్తారకోఽసౌ మహాబలీ ॥12॥**

స్త్రీలనందరిని, అప్సర స్త్రీలనందరిని మహాబలశాలియైన తారకాసురుడు తన వశం చేసుకున్నాడు.

**న యజ్ఞాస్సంప్రవర్తంతే న తపస్యంతి తాపసాః ।**
**దానధర్మాధికం కించిన్న లోకేషు ప్రవర్తతే ॥13॥**

యజ్ఞాలు నిర్వహింపబడడంలేదు. తాపసులు తపమాచరించడంలేదు. లోకంలో దానధర్మాదికాలు కొంచమైనను జరగడంలేదు.

**తస్య సేనాపతిః క్రౌంచో మహాపాప్యస్తి దానవః ।**
**సపాతాళతలం గత్వా బాధతే త్వనిశం ప్రజాః ॥14॥**

వాని సేనాపతీ, మహాపాపీ అయిన క్రౌంచాసురుడొకడున్నాడు. వాడు ప్రతిదినం పాతాళలోకానికిపోయి, ప్రజలను బాధిస్తూ ఉంటాడు.

**తేన నస్తారకేణేదం సకలం భువనత్రయమ్ ।**
**హృతం హఠాజ్జగద్ధాతః పాపేనాకరుణాత్మనా ॥15॥**

ఓ జగత్కర్తా! కఠిన హృదయుడూ, పాపీ అయిన ఆ తారకుడు హఠాత్తుగా త్రిలోకరాజ్యాన్ని మానుండి అపహరించాడు.

**వయం చ తత్ర యాస్యామో యత్ స్థానం త్వం వినిర్దిశేః ।**
**స్వస్థాస్తద్వారితాస్తేన లోకనాథ సురారిణా ॥16॥**

హే లోకనాథా! ఆ రాక్షసుడు మా స్థానాలకు మేము వెళ్ళకుండగా వారిస్తున్నాడు. నీవు మాకొక స్థానాన్ని కేటాయించు. మేమక్కడకు వెళ్ళి, స్వస్థులమై ఉంటాము.

**త్వం నో గతిశ్చ శాస్తా చ ధాతా త్రాతా త్వమేవ హి ।**
**వయం సర్వే తారకాఖ్యవహ్నౌ దగ్ధాస్సువిహ్వలాః ॥17॥**

మాకు గతివి నీవే. మా పాలకుడవు నీవే. తండ్రివి రక్షకుడవు నీవే. మేమందరం తారకుడనే అగ్నిలో మాడి, దుఃఖితులమై ఉన్నాం.

**తేన క్రూరా ఉపాయా నః సర్వే హతబలాః కృతాః ।**
**వికారే సాంనిపాతే వా వీర్యవంత్యౌషధాని చ ॥18॥**

మేమతనియందు ప్రయోగించిన భయంకరమైన ఆయుధాలన్నీ సన్నిపాతరోగికి ఈయబడిన గొప్ప శక్తిగల ఔషధాలవలె నిర్వీర్యం చేయబడ్డాయి.

**యత్రాస్మాకం జయాశా హి హరిచక్రే సుదర్శనే ।**
**ఉత్కుంఠితమభూత్తస్య కంఠే పుష్పమివార్పితమ్ ॥19॥**

విష్ణువుయొక్క సుదర్శనచక్రంపై మాకు జయింపగలమనే ఆశ ఉండేది. కాని అది తారకుని కంఠంలో పుష్పమాలికవలె అలంకారమై, నిర్వీర్యమయ్యింది.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేతద్వచనం శ్రుత్వా నిర్జరాణామహం మునే ।**
**ప్రత్యవోచం సురాన్సర్వాంస్తత్కాలసదృశం వచః ॥20॥**

ఓ నారదమునీ! దేవతల వచనాలు విని, నేను దేవతలనుద్దేశించి, తత్కాలోచితమైన విధంగా ఇలా బదులు పలికాను.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**మమైవ వచసా దైత్యస్తారకాఖ్యస్సమేధితః ।**
**న మత్తస్తస్య హననం యుజ్యతే హి దివౌకసః ॥21॥**

ఓ దేవతలారా! తారకాసురుడు నాచేతనే పెంచి పెద్దజేయబడ్డాడు. కాబట్టి అతనిని సంహరించడం తగినది కాదు.

**తతో నైవ వధో యోగ్యో యతో వృద్ధిముపాగతః ।**
**విషవృక్షోఽపి సంవర్ధ్య స్వయం ఛేత్తుమసాంప్రతమ్ ॥22॥**

ఒక వ్యక్తిని ఎవరు పెంచుతారో వారే అతనిని సంహరించడం యోగ్యం కాదు. విషవృక్షమైన పెంచినవ్యక్తి తన చేతులతో నరకివేయడం తగదు.

**యుష్మాకం చాఖిలం కార్యం కర్తుం యోగ్యో హి శంకరః ।**
**కింతు స్వయం న శక్తో హి ప్రతికర్తుం ప్రచోదితః ॥23॥**

మీ కార్యాన్నంతటిని పూర్తిచేయడానికి శంకరుడు మాత్రమే తగినవాడు. కాని మీరు ప్రార్థించినప్పటికి శంకరుడు స్వయంగా ఆ రాక్షసుని సంహరింపజాలడు.

**తారకాఖ్యస్తు పాపేన స్వయమేష్యతి సంక్షయమ్ ।**
**యథా యూయం సంవిదధ్వ ముపదేశకరస్త్వహమ్ ॥24॥**

తారకాసురుడు తానాచరించే పాపాలచేతనే వినాశనాన్ని పొందగలడు. మీకు తెలిసే విధంగా నేను ఉపదేశం చేస్తాను.

**న మయా తారకో వధ్యో హరిణాపి హరేణ చ ।**
**నాన్యేనాపి సురైర్వాపి మద్వరాత్సత్యముచ్యతే ॥25॥**

నా వరప్రభావం వల్ల తారకుని నేనుగాని, విష్ణువుగాని, శివుడుగాని, దేవతలలో ఇతరులెవ్వరుగాని వధింపజాలరు.

**శివవీర్య సముత్పన్నో యదిస్యా త్తనయస్సురాః ।**
**స ఏవ తార కాఖ్యస్య హంతా దైత్యస్య నాపరః ॥26॥**

శివుని వీర్యం వల్ల కుమారుడు జన్మిస్తే అతడుమాత్రమే తారకాసురుని సంహరింపగలడు. ఇతరులెవ్వరును అతనిని సంహరింపజాలరు.

**యముపాయమహం వచ్మి తం కురుధ్వం సురోత్తమాః ।**
**మహాదేవప్రసాదేన సిద్ధిమేష్యతి స ధ్రువమ్ ॥27॥**

ఓ సురోత్తములారా! నేను చెప్పబోవు ఉపాయాన్ని మీరు పాటించండి. ఈ ఉపాయం మహాదేవుని ప్రసాదంచే నిస్సంశయంగా సిద్ధిస్తుంది

**సతీ దాక్షాయణీ పూర్వం త్యక్తదేహా తు యాభవత్ ।**
**సోత్పన్నా మేనకాగర్భాత్సా కథా విదితా హి వః ॥28॥**

పూర్వం దక్షుని కుమార్తెగా జన్మించి, దేహాన్ని త్యజించిన సతీదేవియే మేనకాదేవి గర్భంలో జన్మించింది. ఆ వృత్తాంతం మీకు తెలిసినదే.

**తస్యా అవశ్యం గిరిశః కరిష్యతి కరగ్రహమ్ ।**
**తత్కురుధ్వముపాయం చ తథాపి త్రిదివౌకసః ॥29॥**

ఓ దేవతలారా! ఆమెను శివుడు నిశ్చయంగా వివాహమాడే ఉపాయాన్ని మీరనుసరించండి.

**తథా విదధ్వం సుతరాం తస్యాం తు పరియత్నతః ।**
**పార్వత్యాం మేనకాజాయాం రేతః ప్రతినిపాతనే ॥30॥**

మేనకాదేవి కుమార్తెయైన పార్వతీదేవి శివుని వీర్యాన్ని తన గర్భంలో ధరించే ఉపాయాన్ని ప్రయత్నపూర్వకంగానైనా చేయండి.

**తమూర్ధ్వరేతసం శంభుం సైవ ప్రచ్యుతరేతసమ్ ।**
**కర్తుం సమర్థా నాన్యాస్తి తథా కాప్యబలా బలాత్ ॥31॥**

ఊర్ధ్వ రేతస్కుడైన శంభుని సంసారిగా చేయగలశక్తి ఆమెకు తక్క మరియొక స్త్రీకి ఏవిధంగానైననూ లేదు.

**సా సుతా గిరిరాజస్య సాంప్రతం ప్రౌఢయౌవనా ।**
**తపస్యంతం హిమగిరౌ నిత్యం సంసేవతే హరమ్ ॥32॥**

ఆ హిమవంతుని కుమార్తె ఇప్పుడు పూర్ణయౌవనయై యున్నది. హిమవత్పర్వతంపై తపస్సు చేస్తున్న శివుని ఆమె చక్కగా సేవిస్తోంది.

**వాక్యాద్ధిమవతః కాళీం స్వపితుర్దృఢతశ్శివా ।**
**సఖీభ్యాం సేవతే సార్ధం ధ్యానస్థం పరమేశ్వరమ్ ॥33॥**

ఆ కాళీదేవి హిమవంతుని మాటనుబట్టీ, తన పట్టుదలనుబట్టీ, ఇద్దరు సఖురాండ్రతోగూడి ధ్యానస్థుడైన పరమేశ్వరుని సేవిస్తోంది.

**తామగ్రతోఽర్చమానాం వై త్రైలోక్యే వరవర్ణినీమ్ ।**
**ధ్యానసక్తో మహేశో హి మనసాపి న హీయతే ॥34॥**

త్రిలోకసుందరియైన ఆమె తన యెదుట సేవచేస్తున్నను ధ్యానమగ్నుడైన మహేశ్వరుడామెను మనస్సులోనైనా కోరుకోలేదు.

**భార్యాం సమీహేత యథా స కాళీం చంద్రశేఖరః ।**
**తథా విధద్ధ్వం త్రిదశా న చిరాదేవ యత్నతః ॥35॥**

ఓ దేవతలారా! ఆ చంద్రశేఖరుడు తొందరలోనే కాళిని భార్యను చేసుకొను కోరికను పొందేటట్లు మీరు దృఢమైన ప్రయత్నాన్ని చేయండి.

**స్థానం గత్వాథ దైత్యస్య తమహం తారకం తతః ।**
**నివారయిష్యే కుహఠాత్స్వస్థానం గచ్ఛతామరాః ॥36॥**

తరువాత నేను తారకాసురుని స్థానానికివెళ్ళి, తన చెడు పట్టుదలనుండి నివారిస్తాను. ఓ దేవతలారా! మీరు మీ స్థానాలకు వెళ్ళండి.

**ఇత్యుక్త్వాహం సురాన్ శీఘ్రం తారకాఖ్యాసురస్య వై ।**
**ఉపసంగమ్య సుప్రీత్యా సమాభాష్యేదమబ్రవమ్ ॥37॥**

దేవతలతో నేనిట్లు పలికి, వెంటనే నేను తారకాసురునివద్దకు వెళ్ళి, మిక్కిలి ప్రీతితో పిలిచి, ఇలా చెప్పాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**తేజోసారమిదం స్వర్గం రాజ్యం త్వం పరిపాసి నః ।**
**యదర్థం సుతపస్తప్తం వాంఛసి త్వం తతోఽధికమ్ ॥38॥**

ఈ స్వర్గం తేజస్సుయొక్క సారం. నీవు మా రాజ్యాన్ని పాలిస్తున్నావు. నీవు దేని కోసం గొప్ప తపస్సు చేశావో, దానిని మించి ఇప్పుడు కోరుకుంటున్నావు.

**వరశ్చాప్యవరో దత్తో న మయా స్వర్గరాజ్యతా ।**
**తస్మాత్స్వర్గం పరిత్యజ్య క్షితౌ రాజ్యం సమాచర ॥39॥**

నేను నీకిచ్చిన వరం ఇంతకంటే తక్కువది. స్వర్గరాజ్య వరాన్ని నేను నీకు ఇయ్యలేదు. కాబట్టి నీవు స్వర్గాన్ని విడిచి, భూమిపై రాజ్యపాలన చేయి.

**దేవయోగ్యాని తత్రైవ కార్యాణి నిఖిలాన్యపి ।**
**భవిష్యంత్యరసురశ్రేష్ఠ నాత్ర కార్యా విచారణా ॥40॥**

ఓ రాక్షసశ్రేష్ఠా! సమస్తమైన స్వర్గభోగాలు అక్కడకూడా ఉంటాయి. నీవీ విషయంలో చింతింప నవసరంలేదు.

**ఇత్యుక్త్వాహం చ సంబోధ్యాసురం తం సకలేశ్వరః ।**
**స్మృత్వా శివం చ సశివం తత్రాంతర్ధానమాగతః ॥41॥**

నేనీ విధంగా పలికి, ఆ రాక్షసుని ఒప్పించాను. సర్వేశ్వరుడనగు నేను ఉమాపరమేశ్వరులను స్మరించి అచ్చటనే అంతర్ధానాన్ని పొందాను.

**తారకోఽపి పరిత్యజ్య స్వర్గం క్షితిమథాభ్యగాత్ ।**
**శోణితాఖ్యపురే స్థిత్వా సర్వరాజ్యం చకార సః ॥42॥**

తారకుడుకూడా స్వర్గాన్ని వీడి, భూలోకానికి వెళ్ళి, శోణిత నగరమందుండి, రాజ్యాన్నంతటినీ పాలిస్తున్నాడు.

**దేవాస్సర్వేఽపి తచ్ఛ్రుత్వా మద్వాక్యం సుప్రణమ్య మామ్ ।**
**శక్రస్థానం యయుః ప్రీత్యా శక్రేణ సుసమాహితాః ॥43॥**

నా యీ వాక్యాలను విని, దేవతలందరు నాకు ప్రణమిల్లి, ఇంద్రునితోగూడి, ప్రేమపూర్వకంగా స్వర్గానికి వెళ్ళారు.

**తత్ర గత్వా మిళిత్వా చ విచార్య చ పరస్పరమ్ ।**
**తే సర్వే మరుతః ప్రీత్యా మఘవంతం వచోఽబ్రువన్ ॥44॥**

అచ్చటకు వెళ్ళి, ఆ దేవతలందరు తమలో తాము చర్చించుకొని, ప్రేమపూర్వకంగా ఇంద్రునితో ఇలా పలికారు.

**దేవాఊచుః** – దేవతలు పలికారు.

**శంభోర్యథా శివాయాం వై రుచిర్జాయేత కామతః ।**
**మఘవంస్తే ప్రకర్తవ్యం బ్రహ్మోక్తం సర్వమేవ తత్ ॥45॥**

ఓ ఇంద్రా! కాముని ప్రభావంచే శివాదేవియందు శివునకు అనురాగం కలిగేటట్లు నువ్వు ప్రయత్నించాలి. ఈ విషయాన్నంతటిని బ్రహ్మగారు చెప్పియున్నారు గదా!

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవం సర్వవృత్తాంతం వినివేద్య సురేశ్వరమ్ ।**
**జగ్ముస్తే సర్వతో దేవాః స్వం స్వం స్థానం ముదాన్వితాః ॥46॥**

ఆ దేవతలు ఈవిధంగా సురేంద్రునకు వృత్తాంతాన్నంతటిని నివేదించి, ఆనందంతో తమ తమ స్థానాలకు వెళ్ళారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే బ్రహ్మదేవసాంత్వన వర్ణనం నామ షోడశోఽధ్యాయః ॥16॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో బ్రహ్మదేవతలను ఓదార్చుట అనే పదహారవ అధ్యాయం సమాప్తం.

## సప్తదశోఽధ్యాయః - పదిహేడవ అధ్యాయం
## ఇంద్రమదనసంవాదమ్ - ఇంద్రమన్మథుల సంభాషణము

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**గతేషు తేషు దేవేషు శక్రః సస్మార వై స్మరమ్ ।**
**పీడితస్తారకేనాతి దైత్యేన చ దురాత్మనా ॥1॥**

దేవతలు వెళ్ళిపోగానే దురాత్ముడగు తారకాసురునిచే మిక్కిలి పీడింపబడియున్న ఇంద్రుడు మన్మథుని స్మరించాడు.

**ఆగతస్తత్ క్షణాత్కామస్సవసంతో రతిప్రియః ।**
**సావలేపో యుతోరత్యా త్రైలోక్యవిజయీ ప్రభుః ॥2॥**

వసంతునితో కూడియుండువాడు, రతీదేవికి ప్రియుడు, గర్విష్ఠి, ముల్లోకాలను జయించువాడు అయిన కామప్రభుడు వెంటనే వచ్చాడు.

**ప్రణామం చ తతః కృత్వా స్థిత్వా తత్పురతస్స్మరః ।**
**మహోన్నతమనాస్తాత సాంజలిశ్శక్రమబ్రవీత్ ॥3॥**

వత్సా! మహోన్నత మనస్సుగల మన్మథుడు ప్రణమిల్లి, ఇంద్రుని ఎదుట అంజలి ఘటించి, నిలబడి, ఇంద్రునితో ఇలా పలికాడు.

**కామ ఉవాచ** - కాముడు  పలికాడు.

**కిం కార్యం తే సముత్పన్నం స్మృతోఽహం కేన హేతునా ।**
**తత్త్వం కథయ దేవేశ తత్కర్తుం సముపాగతః ॥4॥**

నీకు కలిగిన పనియేమి? నన్ను స్మరించడానికి కారణమేమి? ఓ దేవరాజా! విషయాన్ని చెప్పు. నీవాదేశించే పని చేయడానికి వచ్చాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**తచ్ఛ్రుత్వా  వచనం తస్య కందర్పస్య సురేశ్వరః ।**
**ఉవాచ వచనం ప్రీత్యా యుక్తం యుక్తమితి స్తువన్ ॥5॥**

మన్మథుని మాటలు విని, దేవరాజైన ఇంద్రుడు "బాగున్నది, బాగున్నది" అని స్తుతిస్తు , ప్రేమపూర్వకంగా ఇలా పలికాడు.

**శక్ర ఉవాచ** - ఇంద్రుడు చెప్పాడు.

**తవ సాధు సమారంభో యన్మే కార్యముపస్థితమ్ ।**
**తత్కర్తుముద్యతోఽసి త్వం ధన్యోఽసి మకరధ్వజ ॥6॥**

ఓ మన్మథా! నాకు పని కలుగగానే నువ్వు దానిని చేయడానికి సంసిద్ధుడవయ్యావు. నీ యీ ఉద్యమ శీలత కొనియాడదగినది. నువ్వు ధన్యుడవు.

**ప్రస్తుతం శృణు మద్వాక్యం కథయామి తవాగ్రతః ।**
**మదీయం చైవ యత్కార్యం త్వదీయం తన్న చాన్యథా ॥7॥**

ప్రస్తుతంలో నేను చెప్పే పలుకులనాలకించు నా కార్యం నీకార్యమేగాని మరియొకటి కాదు.

**మిత్రాణి మమ సంత్యేవ బహూని సుమహాంతి చ ।**
**వరం తు స్మర సన్మిత్రం త్వత్తుల్యం న హి కుత్రచిత్ ॥8॥**

నాకు అనేకమంది గొప్పగొప్ప మిత్రులున్నారు. కాని మన్మథా! నీవంటి మంచిమిత్రుడు ఎక్కడా లేడు.

**జయార్థం మే ద్వయం తాత నిర్మితం వజ్రముత్తమమ్ ।**
**వజ్రం చ నిష్ఫలం స్యాద్వై త్వం తు నైవ కదాచన ॥9॥**

కుమారా! నా విజయం కొరకు రెండు నిర్మింపబడ్డాయి. అందులో ఒకటి ఉత్తమమైన నా వజ్రాయుధం. రెండవది నువ్వు. వజ్రాయుధం నిష్ఫలం కావచ్చుగాని, నీవెన్నడు నిర్వీర్యుడవు కావు.

**యతో హితం ప్రజాయేత తతః కో ను ప్రియః పరః ।**
**తస్మాన్మిత్రవరస్త్వం హి సత్కార్యం కర్తుమర్హసి ॥10॥**

ఎవడు హితాన్ని కల్గిస్తారో అతనికంటే అధిక ప్రీతిపాత్రు డెవడుంటాడు? కావున నీవు నా మిత్రులలో శ్రేష్ఠుడవు. నా కార్యాన్ని చేయదగినవాడవు నువ్వే.

**మమ దుఃఖం సముత్పన్నమసాధ్యం చాపి కాలజమ్ ।**
**కేనాపి నైవ తచ్ఛక్యం దూరీకర్తుం త్వయా వినా ॥11॥**

నాకు కాలప్రభావంచే అసాధ్యమైన దుఃఖం సముత్పన్నమయ్యింది. దానిని నువ్వు తప్ప ఇతరులెవ్వరు దూరం చేయజాలరు.

**దాతుః పరీక్షా దుర్భిక్షే రణే శూరస్య జాయతే ।**
**ఆపత్కాలే తు మిత్రస్యాశక్తౌ స్త్రీణాం కులస్య హి ॥12॥**

దుర్భిక్షం నెలకొన్నప్పుడు దాతయొక్క దాతృత్వం, యుద్ధంలో శూరుని శౌర్యం, ఆపద వచ్చినప్పుడు మిత్రుని మైత్రి, భర్త అసమర్థుడైనప్పుడు కులస్త్రీల పాతివ్రత్యం నిగ్గుతేలుతుంది.

**వినయే సంకటే ప్రాప్తేఽవితథస్య పరోక్షతః ।**
**సుస్నేహస్య తథా తాత నాన్యథా సత్యమీరితమ్ ॥13॥**

కష్టం సంభవించునప్పుడు వినయము. పరోక్షమునందు మంచి స్నేహము, నిగ్గుతేలుతుంది. వీటి పరీక్షకు మార్గాంతరం లేదు. నేను సత్యాన్నే పలుకుతున్నాను.

**ప్రాప్తాయాం వై మమాపత్తావవార్యాయాం పరేణ హి ।**
**పరీక్షా చ త్వదీయాద్య మిత్రవర్య భవిష్యతి ॥14॥**

ఓ మిత్రవర్యా! నాకు ఆపద సంభవించింది. దానిని ఇతరులెవ్వరును వారించలేరు. ఈనాడు ఇది నీకు పరీక్ష కాగలదు.

**న కేవలం మదీయం చ కార్యమస్తి సుఖావహమ్ ।**
**కిం తు సర్వ సురాదీనాం కార్యమేతన్న సంశయః ॥15॥**

ఈపని కేవలం నా వ్యక్తిగత కార్యం కాదు. దీనియందు దేవతలు, తదితరులందరి క్షేమం ఇమిడియుంది. ఇది నిస్సంశయం.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేతన్మఘవద్వాక్యం శ్రుత్వా తు మకరధ్వజః ।**
**ఉవాచ ప్రేమగంభీరం వాక్యం సుస్మితపూర్వకమ్ ॥16॥**

ఇంద్రుని మాటలను మన్మథుడు విని, చిరునవ్వుతో ప్రేమగాను, గంభీరంగాను ఇలా పలికాడు.

**కామ ఉవాచ –** కాముడు  పలికాడు.

**కిమర్థమిత్థం వదసి చోత్తరం వచ్మ్యహం తవ ।**
**ఉపకృత్కృత్రిమం లోకే దృశ్యతే కథ్యతే న చ ॥17॥**

నీవిలా ఎందుకు పలుకుతున్నావు? నేను నీకు సమాధానాన్ని ఈయను. ఉపకారం చేయు మిత్రుని, కృత్రిమ మిత్రుని లోకంలో పరిశీలిస్తారేగాని, వారిగురించి ఏమియు మాట్లాడరు.

**సంకటే బహు యో బ్రూతే స కిం కార్యం కరిష్యతి ।**
**తథాపి చ మహారాజ కథయామి శృణు ప్రభో ॥18॥**

కష్టం కలిగినప్పుడు అధికంగా మాట్లాడేవాడు పని ఏమి చేయగలుగుతాడు? అయినా చెబుతాను విను.

**పదం తే కర్షితుం యో వై తపస్తపతి దారుణమ్ ।**
**పాతయిష్యామ్యహం తం చ శత్రుం తే మిత్ర సర్వథా ॥19॥**

నీ పదవిని లాగుకొనటానికి ఎవరైనా దారుణమైన తపస్సు చేస్తున్నారా ఏమి? అట్టి నీ శత్రువును నేను నిశ్చయంగా పడగొడతాను.

**క్షణేన భ్రంశయిష్యామి కటాక్షేణ వరస్త్రియాః ।**
**దేవర్షిదానవాదీంశ్చ నరాణాం గణనా న మే ॥20॥**

శ్రేష్ఠమైన స్త్రీల వాలుచూపులతో దేవతలనుగాని, ఋషులనుగాని, రాక్షసులనుగాని క్షణంలో భ్రష్టులను చేయగలను, మానవులు నాకు లెక్కగాదు.

**వజ్రం తిష్ఠతు దూరే వై శస్త్రాణ్యన్యాన్యనేకశః ।**
**కిం తే కార్యం కరిష్యన్తి మయి మిత్ర ఉపస్థితే ॥21॥**

వజ్రాయుధం, ఇతరమైన అనేక శస్త్రాలు దూరంగా నుండవలసినదే. మిత్రుడనైన నేను వచ్చిన తరువాత అవి దేనికి పనికిరాగలవు?

**బ్రహ్మాణం వా హరిర్వాపి భ్రష్టం కుర్యాం న సంశయః ।**
**అన్యేషాం గణనా నాస్తి పాతయేయం హరం త్వపి ॥22॥**

బ్రహ్మనుగాని, విష్ణువునుగాని నేను నిస్సంశయంగా భ్రష్టుని చేయగలను. ఇతరుల విషయం గణించనవసరమేలేదు. నేను శివునినైనా పడగొట్టగలను.

**పంచైవ మృదవో బాణాస్తే చ పుష్పమయా మమ ।**
**చాప స్త్రిధా పుష్పమయ శ్శింజినీ భ్రమరార్జితా ।**
**బలం సుదయితా మే హి వసంతః సచివస్స్మృతః ॥23॥**

నాకు ఐదు బాణాలు మాత్రమే ఉన్నాయి. అవి కూడా మృదువైన పూలు. నా ధనుస్సు పుష్పాలచే నిర్మింపబడి, మూడు భాగాలుగా ఉన్నది. నారి తుమ్మెదలచే కూర్చబడినది. నా బలమూ, నా నెచ్చెలీ, నా సచివుడూ – అన్నీ వసంతుడే

**అహం పంచబలో దేవా మిత్రం మమ సుధానిధిః ॥24॥**

**సేనాధిపశ్చ శృంగారో హావభావాశ్చ సైనికాః ।**
**సర్వే మే మృదవః శక్ర అహం చాపి తథావిధః ॥25॥**

ఐదు బాణాలే నా బలం, చంద్రుడు నా మిత్రుడు, శృంగారం నా సేనాధిపతి, హావభావాలు నా సైనికులు, ఇంద్రా! నావన్నియు మృదువైనవే. నేనుకూడా అట్టివాడనే.

**యద్యేన పూర్యతే కార్యం ధీమాంస్తత్తేన యోజయేత్ ।**
**మమ యోగ్యం తు యత్కార్యం సర్వం తన్మే నియోజయ ॥26॥**

ఏకార్యం దేనిచే పూర్తియగునో, బుద్ధిమంతుడు ఆ కార్యాన్ని ఆ సాధనతోనే పూర్తిచేయాలి. నాకు యోగ్యమైన కార్యమందు నన్ను సంపూర్ణంగా నియోగించు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవం తు వచస్తస్య శ్రుత్వా శక్రస్సుహర్షితః ।**
**ఉవాచ ప్రణమన్వాచా కామం కాంతాసుఖావహమ్ ॥27॥**

మన్మథుని ఈ మాటలు విని, ఇంద్రుడు మిక్కిలి ఆనందించి, నమస్కరించి, కాముకులకు కాంతాసుఖాన్నిచ్చే మన్మథునితో ఇలా పలికాడు.

**శక్ర ఉవాచ** - ఇంద్రుడు చెప్పాడు.

**యత్కార్యం మనసోద్దిష్టం మయా తాత మనోభవ ।**
**కర్తుం తత్త్వం సమర్థోఽసి నాన్యస్మాత్తస్య సంభవః ॥28॥**

వత్సా మన్మథా! నేను నా మనస్సులో తలపెట్టిన కార్యాన్ని చేయడానికి నువ్వే సమర్థుడివి. నీవుగాక మరియొకరివలన ఈ పని సంభవం కాదు.

**శృణు కామ ప్రవక్ష్యామి యథార్థం మిత్ర సత్తమ ।**
**యదర్థే చ స్పృహా జాతా తవ చాద్య మనోభవ ॥29॥**

ఓ మిత్రసత్తమా! మన్మథా! ఈనాడు నిన్ను చూడాలనే కోరిక కలగడానికి గల వాస్తవ కారణాన్ని చెబుతాను విను.

**తారకాఖ్యో మహాదైత్యో బ్రహ్మణో వరమద్భుతమ్ ।**
**అభూదజేయ స్సంప్రాప్య సర్వేషామపి దుఃఖదః ॥30॥**

తారకుడనే మహారాక్షసుడు బ్రహ్మనుండి అద్భుతమైన వరాన్ని పొంది, అందరికి దుఃఖాన్ని కలిగిస్తున్నాడు.

**తేన సంపీడ్యతే లోకో నష్టధర్మా హ్యనేకశః ।**
**దుఃఖితా నిర్జరాస్సర్వే ఋషయశ్చ తథాఖిలాః ॥31॥**

అతడు లోకాలను పీడిస్తున్నాడు. ధర్మాలన్నీ అనేక విధాలుగా నష్టమయ్యాయి. దేవతలు, ఋషులు తదితరులందరు దుఃఖితులయ్యారు.

**దేవైశ్చ సకలైస్తేన కృతం యుద్ధం యథాబలమ్ ।**
**సర్వేషాం చాయుధాన్యత్ర విఫలాన్యభవన్పురా ॥32॥**

దేవతలందరు వానితో వారి బలం కొలది యుద్ధం చేశారు. వారి అందరి ఆయుధాలు వాడి దగ్గర విఫలమయ్యాయి.

**భగ్నఃపాశో జలేశస్య హరిం చక్రం సుదర్శనమ్ ।**
**తత్కుంఠితమభూత్తస్య కంఠే క్షిప్తం చ విష్ణునా ॥33॥**

వరుణుని పాశం భగ్నమయ్యింది. విష్ణువు తన సుదర్శనచక్రాన్ని ప్రయోగించగా అది మొక్కవోయి అతని కంఠంలోనే పడింది.

**ఏతస్య మరణం ప్రోక్తం ప్రజేశేన దురాత్మనః ।**
**శంభోర్వీర్యోద్భవాద్బాలాన్మహాయోగీశ్వరస్య హి ॥34॥**

మహాయోగీశ్వరుడైన శంభుని కుమారుని చేతిలో ఈ దురాత్ముడు మరణిస్తాడని బ్రహ్మ చెప్పాడు.

**ఏతత్కార్యం త్వయా సాధు కర్తవ్యం సుప్రయత్నతః ।**
**తతస్స్యాన్మిత్రవర్యాతి దేవానాం నః పరం సుఖమ్ ॥35॥**

ఓ మిత్రవర్యా! నీవీపనిని గొప్ప ప్రయత్నం చేసియైనా సాధించాలి. ఈ కార్యం సిద్ధిస్తే దేవతలకు మహాసుఖం కలుగుతుంది.

**మమాపి విహితం తస్మాత్సర్వలోకసుఖావహమ్ ।**
**మిత్రధర్మం హృది స్మృత్వా కర్తుమర్హసి సాంప్రతమ్ ॥36॥**

సర్వలోకాలకు సుఖావహమైన ఈ కర్మ నేను తప్పక చేయదగియున్నది. నువ్వు స్నేహధర్మాన్ని మనస్సులోనుంచుకొని, ఇపు డీపనిని నువ్వు చేయడానికి అర్హుడవు.

**శంభుస్స గిరిరాజే హి తపః పరమమాస్థితః ।**
**స ప్రభుర్నాపి కామేన స్వతంత్రః పరమేశ్వరః ॥37॥**

ఆ శంభుడు పర్వతరాజైన హిమవత్పర్వతంపై గొప్ప తపస్సు చేస్తున్నాడు. ఆ ప్రభుడు కామానికి వశుడు కాడు. ఆయన స్వతంత్రుడగు పరమేశ్వరుడు.

**తత్సమీపే చ దేవాథ పార్వతీ స్వసఖీయుతా ।**
**సేవమానా తిష్ఠతీతి పిత్రా జ్ఞప్తా మయా శ్రుతమ్ ॥38॥**

తండ్రి ఆజ్ఞచే పార్వతి తన సఖురాండ్రతో కూడి, శివుని సమీపంలోనే ఉండి, ఆయనను సేవిస్తోందని నేను విన్నాను.

**యథా తస్యాం రుచిస్తస్య శివస్య నియతాత్మనః ।**
**జాయతే నితరాం మార తథా కార్యం త్వయా ధ్రువమ్ ॥39॥**

జితేంద్రియుడైన శివునకు ఆమెయందు గొప్పప్రేమ కలిగేటట్లు నువ్వు చేయాలి. మన్మథా! నీవీ కార్యాన్ని తప్పక సఫలం చేయాలి.

**ఇతికృత్వా కృతీ స్యాస్త్వం సర్వం దుఃఖం వినంక్ష్యతి ।**
**లోకే స్థాయీ ప్రతాపస్తే భవిష్యతి న చాన్యథా ॥40॥**

నీవీ కార్యాన్ని చేసి, కృతార్థుడవుకావలసింది. దుఃఖమంతా నశించగలదు. నీ ప్రతాపం లోకంలో చిరస్థాయిగా ఉండగలదు. దీనికి భిన్నంగా జరిగే అవకాశమే లేదు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తః స తు కామోహి ప్రఫుల్లముఖపంకజః ।**
**ప్రేమ్ణా వాచేతి దేవేశం కరిష్యామి న సంశయః ॥41॥**

ఇంద్రుడిట్లు పలుకగానే మన్మథుని ముఖపద్మం వికసించింది. "ఈ పనిని నిస్సందేహంగా చేస్తాను" అని ఇంద్రునితో పలికాడు.

**ఇత్యుక్త్వా వచనం తస్మై తథేత్యోమితి తద్వచః ।**
**అగ్రహీత్తరసా కామః శివమాయావిమోహితః ॥42॥**

శివమాయా మోహితుడైన మన్మథుడు ఇంద్రునితో ఈవిధంగా పలికి, తన అంగీకారాన్ని 'ఓమ్' అని తెలిపి వెంటనే ఆయనవద్ద సెలవు తీసుకున్నాడు.

**యత్ర యోగీశ్వరస్సాక్షాత్తప్యతే పరమం తపః ।**
**జగామ తత్ర సుప్రీతస్సదార స్సవసంతకః ॥43॥**

మన్మథుడు తన భార్యతోను, వసంతునితోను కూడి, ఆనందంతో యోగీశ్వరుడైన శివుడు సాక్షాత్తుగా గొప్ప తపస్సుచేస్తున్న స్థానానికి వెళ్ళాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే ఇంద్రమదనసంవాదం నామ సప్తదశోఽధ్యాయః ॥17॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో ఇంద్ర మన్మథుల సంభాషణము అనే పదిహేడవ అధ్యాయం సమాప్తం.

## **అష్టాదశోఽధ్యాయః** - పద్దెనిమిదవ అధ్యాయం

## **కామవికారవర్ణనమ్** - కామవికారవర్ణన

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**తత్ర గత్వా స్మరో గర్వీ శివమాయావిమోహితః ।**
**మోహకస్స మధోశ్చాదౌ ధర్మం విస్తారయన్ స్థితః ॥1॥**

గర్వం గలవాడు, శివమాయా విమోహితుడు, మోహాన్ని కలిగించేవాడు అయిన మన్మథుడచ్చటకు వెళ్ళి మున్ముందుగా వసంతుని ప్రభావం అచ్చట విస్తరింపజేయ సాగాడు.

**వసంతస్య చ యో ధర్మః ప్రససార స సర్వతః ।**
**తపః స్థానే మహేశస్యౌషధిప్రస్థే మునీశ్వర ॥2॥**

ఓ మునీశ్వరా! ఓషధిప్రస్థంలో మహేశ్వరుడు తపస్సు చేసే స్థలంలో అంతటా వసంతుని ప్రభావం విస్తరిల్లింది.

**వనాని చ ప్రఫుల్లాని పాదపానాం మహామునే ।**
**ఆసన్విశేషతస్తత్ర తత్ప్రభావాన్మునీశ్వర ॥3॥**

ఓ మహామునీ! అచ్చట వసంతుని ప్రభావంచే వనంలోని చెట్లన్నీ విశేషంగా వికసించాయి.

**పుష్పాణి సహకారాణామశోకవనికాసు వై ।**
**విరేజుః సుస్మరోద్దీప్తకరాణి సురభీణ్యపి ॥4॥**

మామిడిచెట్ల పూతలు, అశోకవృక్షాల పుష్పాలు సుగంధాన్ని వెదజల్లి, మన్మథ వికారాలను వృద్ధిపొందించేవిగా ప్రకాశించాయి.

**కైరవాణి చ పుష్పాణి భ్రమరాకలితాని చ ।**
**బభూవుర్మదనావేశకరాణి చ విశేషతః ॥5॥**

తుమ్మెదలచే చుట్టువారబడియున్న తెల్లకలువలు విశేషించి, మదనావేశాన్ని కలిగింపసాగాయి.

**సుకామోద్దీపనకరం కోకిలా కలకూజితమ్ ।**
**ఆసీదతిసురమ్యం హి మనోహరమతిప్రియమ్ ॥6॥**

మిక్కిలి రమ్యమూ, మనోహరమూ, అతిప్రియమూ అయిన కోకిలల మధుర కూజితాలు కామావేశాన్ని అధికం చేయసాగాయి.

**భ్రమరాణాం తథా శబ్దా వివిధా అభవన్మునే ।**
**మనోహరాశ్చ సర్వేషాం కామోద్దీపకరా అపి ॥7॥**

ఓ మునీశ్వరా! తుమ్మెదలు చేసే వివిధ ఝుంకారాలు కూడా మనోహరంగా నుండి, సర్వప్రాణుల మన్మథ వికారాలను పెంపొందించాయి.

**చంద్రస్య విశదా కాంతిర్వికీర్ణా హి సమంతతః ।**
**కామినాం కామినీనాం చ దూతికా ఇవ సాభవత్ ॥8॥**

చంద్రుని తెల్లని వెన్నెల అంతటా వెదజల్లబడియుంది. ప్రియులకు, ప్రియురాండ్రకు మధ్య దూతకృత్యాన్ని ఆ వెన్నెలయే నిర్వహిస్తున్నదా అన్నట్లుంది.

**మానినాం ప్రేరణాయాసీ త్తత్కాలే కాలదీపికా ।**
**మారుతశ్చ సుఖః సాధో వవౌ విరహిణోఽప్రియః ॥9॥**

ఆసమయంలో కాలపురుషుని దీపంవలెనున్న వెన్నెల వ్యక్తుల అభిమానాన్ని పారద్రోలి ప్రేమకు దారిచూపింది. విరహతప్తులకు దుఃఖకరమగు వాయువు సుఖకరంగా వీచింది.

**ఏవం వసంత విస్తారో మదనావేశకారకః ।**
**వనౌకసాం తదా తత్ర మునీనాం దుస్సహోఽత్యభూత్ ॥10॥**

ఈవిధంగా మన్మథావేశాన్ని కలిగించే వసంతుని విస్తారం వనమునందు నివసించే మునులకు అత్యంతం సహింపశక్యంకానిదయ్యింది.

**అచేతసామపి తదా కామాసక్తిరభూన్మునే ।**
**సుచేతాసాం హి జీవానాం సేతి కిం వర్ణ్యతే కథా ॥11॥**

ఓ మహర్షీ! అప్పుడు జడపదార్థాలకు కూడా కామాసక్తి కలిగినట్లుండగా చేతనులైన జీవులకు కామాసక్తి కలిగిందని వర్ణింపనేల?

**ఏవం చకార సమధుస్స్వప్రభావం సుదుస్సహమ్ ।**
**సర్వేషాం చైవ జీవానాం కామోద్దీపనకారకః ॥12॥**

ఈవిధంగా సర్వప్రాణులలో కామోద్దీపనంచేసే ఆ వసంతుడు మిక్కిలి దుస్సహమైన తన ప్రభావాన్ని విస్తరింపజేశాడు.

**అకాలనిర్మితం తాత మధోర్వీక్ష్య హరస్తదా ।**
**ఆశ్చర్యం పరమం మేనే స్వలీలాత్తతనుః ప్రభుః ॥13॥**

వత్సా! తన లీలచే దేహాన్ని స్వీకరించిన శివప్రభుడు విజృంభించిన వసంతుని ప్రభావాన్ని చూసి, మిక్కిలి ఆశ్చర్యాన్ని పొందాడు.

**అథ లీలాకరస్తత్ర తపః పరమదుష్కరమ్ ।**
**తతాప స వశీశో హి హరో దుఃఖహరః ప్రభుః ॥14॥**

లీలాకరుడు, జితేంద్రియుడు, సర్వజగన్నియంత, దుఃఖాలను బాపువాడు ఐన శివుడు పరమ దుష్కరమైన తపస్సు చేశాడు.

**వసంతే ప్రసూతే తత్ర కామో రతిసమన్వితః ।**
**చూతం బాణం సమాకృష్య స్థితస్తద్వామపార్శ్వతః ॥15॥**

ఇట్లు వసంతుడు విజృంభించగా రతీదేవితో కూడిన మన్మథుడు ధనుస్సుపై చూత బాణాన్ని సంధించి, ఆమెకు ఎడమప్రక్క నిలబడియున్నాడు.

**స్వప్రభావం వితస్తార మోహయన్సకలాన్ జనాన్ ।**
**రత్యా యుక్తం తదా కామం దృష్ట్వా కో వా న మోహితః ॥16॥**

అతడు తన ప్రభావాన్ని విస్తరింపజేసి, మానవులందరిని మోహింపజేశాడు. రతీదేవితో కూడియున్నట్టి మన్మథుని చూసి, మోహాన్ని పొందనివారెవరుంటారు?

**ఏవం ప్రవృత్తే సురతౌ శృంగారోఽపి గణైః సహ ।**
**హావ భావ యుతస్తత్ర ప్రవివేశ హరాన్తికమ్ ॥17॥**

ఈ విధంగా మన్మథుడు విజృంభించగా శృంగార రసంకూడా హావభావాలతో కూడినదై గణాలతో కూడియున్న శివుని సమీపానికి చేరింది.

**మదనః ప్రకటస్తత్ర న్యవసచ్చిత్తగో బహిః ।**
**న దృష్టవాంస్తదా శంభోశ్ఛిద్రం యేన ప్రవిశ్యతే ॥18॥**

మనోభవుడైన మన్మథుడు అచ్చట ప్రకటంగా బయటనే నివసింపజొచ్చాడు. కాని శంభుని ధైర్యాన్ని చెడగొట్టడానికుపకరించు దుర్బలతను మాత్రం అతడు శంభునిలో కనుగొనలేకపోయాడు.

**యదా చాప్రాప్తవివరస్తస్మిన్యోగివరే స్మరః ।**
**మహాదేవస్తదా సోఽభూన్మహాభయవిమోహితః ॥19॥**

అంతట యోగివరుడైన మహాదేవునియందు దౌర్బల్యాన్ని కానరాక మన్మథుడు మహాభయాన్ని పొంది, మోహితుడయ్యాడు.

**జ్వలజ్జ్వాలాగ్నిసంకాశఫాలనేత్రసమన్వితమ్ ।**
**ధ్యానస్థం శంకరం కో వా సమాసాదయితుం క్షమః ॥20॥**

మండే జ్వాలలతో కూడి అగ్ని సదృశమైన ఫాలనేత్రంతో కూడిన శంకరుడు ధ్యానంలో ఉండగా ఆయనను సమీపించి, ఆయన ధ్యానాన్ని చెడగొట్టగలిగే సామర్థ్యమెవరికి కలదు?

**ఏతస్మిన్నంతరే తత్ర సఖీభ్యాం సంయుతా శివా ।**
**జగామ శివపూజార్థం నీత్వా పుష్పాణ్యనేకశః ॥21॥**

ఇంతలో అచ్చటకు తన ఇద్దరి చెలికత్తెలతో కూడిన పార్వతీదేవి అనేక పుష్పాలను తీసుకొని శివ పూజకొరకు వెళ్ళింది.

**పృథివ్యాం యాదృశం లోకైస్సౌందర్యం వర్ణ్యతే మహత్ ।**
**తత్సర్వమధికం తస్యాం పార్వత్యామస్తి నిశ్చితమ్ ॥22॥**

భూమండలంలో మానవులు దేనిని గొప్ప సౌందర్యమని వర్ణిస్తారో ఆ సౌందర్యం మాత్రమే గాక అంతకంటే అధికమైన సౌందర్యంకూడా పార్వతియందు నిశ్చితంగా ఉంది.

**ఆర్తవాణి సుపుష్పాణి ధృతాని చ తయా యదా ।**
**తత్సౌందర్యం కథం వర్ణ్యమపి వర్షశతైరపి ॥23॥**

ఆయా ఋతువులలో పూసిన, అందమైన పూలను ధరించిన సమయంలో ఆమె సౌందర్యాన్ని వర్ణించడానికి వంద సంవత్సరాల కాలమైనా చాలదు.

**యదా శివసమీపే తు గతా సా పర్వతాత్మజా ।**
**తదైవ శంకరో ధ్యానం త్యక్త్వా క్షణమవస్థితః ॥24॥**

ఆ పార్వతి శివుని సమీపానికి ఎప్పుడు వెళ్ళిందో అదే సమయంలో శంకరుడు క్షణకాలం ధ్యానాన్ని వీడాడు.

**తచ్ఛిద్రం ప్రాప్య మదనః ప్రథమం హర్షణేన తు ।**
**బాణేన హర్షయామాస పార్శ్వస్థం చంద్రశేఖరమ్ ॥25॥**

ఆ అవకాశాన్ని కనిపెట్టిన మన్మథుడు "హర్షణం" అనే బాణంతో పార్వతి ప్రక్కనున్న చంద్రశేఖరుని హర్షింపజేశాడు.

**శృంగారైశ్చ తదా భావై స్సహితా పార్వతీ హరమ్ ।**
**జగామ కామసాహాయ్యే మునే సురభిణా సహ ॥26॥**

ఓ నారదమునీ! అంతట శృంగారభావాలతో కూడిన పార్వతి వసంతునితోబాటు మన్మథునికి కూడ సహాయపడే విధంగా శివుని సమీపించింది.

**తదైవాకృష్య తచ్చాపం రుచ్యర్థం శూలధారిణః ।**
**ద్రుతం పుష్పశరం తస్మై స్మరోఽముంచత్సుసంయతః ॥27॥**

అదే సమయంలో మన్మథుడు జాగరూకతతో ధనుస్సునెక్కుపెట్టి, శూలధారియైన శివునియందు ప్రేమనుత్పన్నం చేయడానికి వెనువెంటనే శివునిపై పుష్పబాణాన్ని ప్రయోగించాడు.

**యథా నిరంతరం నిత్యమాగచ్ఛతి తథా శివమ్ ।**
**తన్నమస్కృత్య తత్పూజాం కృత్వా తత్పురతః స్థితా ॥28॥**

ప్రతిదినమూ విడువకుండగా పార్వతి ఏవిధంగా శివుని వద్దకు వచ్చేదో అదేవిధంగా ఆమె వచ్చి, నమస్కరించి, పూజించి, ఆయన ఎదుట నిలబడింది.

**సా దృష్టా పార్వతీ తత్ర ప్రభుణా గిరిశేన హి ।**
**వివృణ్వతీ తదాంగాని స్త్రీస్వభావాత్సులజ్జయా ॥29॥**

స్త్రీసహజస్వభావమైన లజ్జతో పార్వతి నిలబడి యుండగా ఆమె అవయవాలలో ప్రకటితమౌతున్న శోభను శంభుడు చూశాడు.

**సుసంస్మృత్య వరం తస్యా విధిదత్తం పురా ప్రభుః ।**
**శివోఽపి వర్ణయామాస తదంగాని ముదా మునే ॥30॥**

ఓ మునీశ్వరా! పూర్వం ఆమెకు బ్రహ్మ ఇచ్చిన వరాన్ని శివుడు స్మరించుకున్నాడు. అపుడు శివుడుకూడా ఆనందంతో ఆమె అంగాలను వర్ణింపసాగాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**కిం ముఖం కిం శశాంకశ్చ కిం నేత్రే చోత్పలే చ కిమ్ ।**
**భృకుట్యౌ ధనుషీ చైతే కందర్పస్య మహాత్మనః ॥31॥**

ఇది ముఖమా? లేక చంద్రుడా? ఇవి నేత్రాలా? లేక కలువలా? ఇవి కనుబొమలా? లేక మన్మథుని ధనుస్సులా?

**అధరః కిం చ కిం బింబం కిం నాసా శుకచంచుకా ।**
**కిం స్వరః కోకిలాలాపః కిం మధ్యం చాథ వేదికా ॥32॥**

ఇది అధరమా? లేక దొండపండా? ఇది నాసికయా? లేక చిలుక ముక్కా? ఆహా! ఏమి ఈమె కంఠధ్వని? కోకిల గీతాన్ని పోలియున్నది. ఇది ఈమె నడుమా? లేక అగ్నిహోత్ర వేదికా?

**కిం గతిర్వర్ణ్యతే హ్యస్యాః కిం రూపం వర్ణ్యతే ముహుః ।**
**పుష్పాణి కించ వర్ణ్యంతే వస్త్రాణి చ తథా పునః ॥33॥**

ఈమె నడకను ఏమని వర్ణించగలను? ఈమె రూపాన్ని ఎన్నిమార్లు వర్ణించగలను? ఈమె ధరించిన పుష్పాలను వస్త్రాలను ఏమని వర్ణించగలను?

**లాలిత్యం చారు యత్సృష్టౌ తదేకత్ర వినిర్మితమ్ ।**
**సర్వథా రమణీయాని సర్వాంగాని న సంశయః ॥34॥**

సృష్టిలోని లాలిత్యమంతా ఒకేచోట ప్రోగుచేసినట్లుంది. ఈమె సర్వాంగాలు పూర్ణరమణీయాలనుట నిస్సంశయం.

**అహో! ధన్యతరా చేయం పార్వత్యద్భుతరూపిణీ ।**
**ఏతత్సమా న త్రైలోక్యే నారీ కాపి సురూపిణీ ॥35॥**

అహో! అద్భుతమైన రూపంగల ఈ పార్వతి ధన్యురాలు. ఇంతటి సౌందర్యవతియైన స్త్రీ ముల్లోకాలలోను మరియొకతె కానరాదు.

**సులావణ్యా నిధిశ్చేయమద్భుతాంగాని బిభ్రతీ ।**
**విమోహినీ మునీనాం చ మహాసుఖవివర్ధినీ ॥36॥**

అద్భుతమైన అవయవాలు కలిగియున్న ఈమె సులావణ్యనిధి. మహాసుఖ వివర్ధినియైన ఈమె మునులనైనను మోహింపజేయగలదు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవం వర్ణయిత్వా తు తదంగాని ముహుర్ముహుః ।**
**విధిదత్తవరాధ్యాసాద్ధరస్తు విరరామ హ ॥37॥**

హరుడీవిధంగా ఆమె సౌందర్యాన్ననేకమార్లు వర్ణించి, బ్రహ్మదత్తమైన వరాన్ని గుర్తుచేసుకొని, విరమించాడు.

**హస్తం వస్త్రాంతరే యావదచాలయత శంకరః ।**
**స్త్రీ స్వభావాచ్చ సా తత్ర లజ్జితా దూరతో గతా ॥38॥**

శంకరుడు తన వస్త్రంలోని హస్తాన్ని కదిలించగానే పార్వతి స్త్రీ సహజ స్వభావమైన సిగ్గుతో దూరానికి వెళ్ళింది.

**వివృణ్వతీ నిజాంగాని పశ్యంతీ చ ముహుర్ముహుః ।**
**సువీక్షణైర్మహామోదాత్సుస్మితాభూచ్ఛివా మునే ॥39॥**

ఓ మహర్షీ! పార్వతి తన ముఖాన్ని ప్రకటన చేసి పదేపదే ప్రేమవీక్షణాలతో మహానందంతో చూస్తూ చక్కటి చిరునవ్వుతో కనిపించింది.

**ఏవం చేష్టాం తదా దృష్ట్వా శంభుర్మోహముపాగతః ।**
**ఉవాచ వచనం చైవం మహాలీలో మహేశ్వరః ॥40॥**

ఆమెయొక్క ఆ చేష్టను చూచినవాడై గొప్ప లీలలు గలవాడు, మహేశ్వరుడు అయిన శంభుడు మోహాన్ని పొంది, ఇట్లు పలికాడు

**అస్యా దర్శనమాత్రేణ మహానందో భవత్యలమ్ ।**
**యదాలింగనమేతస్యాః కుర్యాం కింతు తతః సుఖమ్ ॥41॥**

ఈమెను చూచినంత మాత్రంచేతనే మహానందం కలుగుతోంది. ఈమెను నేను ఆలింగనం చేసుకున్నప్పుడు ఎంతటిసుఖం కలుగుతుందో గదా!

**క్షణమాత్రం విచార్యేత్థం సంపూజ్య గిరిజాం తతః ।**
**ప్రబుద్ధస్స మహాయోగీ సువిరక్తో జగావితి ॥42॥**

మహాయోగియైన శివుడు క్షణకాలమిట్లు ఆలోచించి, అనంతరం పార్వతిని ఆదరించాడు. ఆయన మోహాన్ని వీడి, విరక్తుడై ఇట్లనుకున్నాడు.

**కిం జాతం చరితం చిత్రం కిమహం మోహమాగతః ।**
**కామేన వికృతశ్చాద్య భూత్వాపి ప్రభురీశ్వరః ॥43॥**

ఏమయ్యింది? చిత్రమైన సంఘటన జరిగింది. నేనేల మోహితుడనయ్యాను? నేను సమర్థుడను, ప్రభుడను అయినప్పటికి, ఈనాడు కామునిచే వికారాన్ని పొందేటట్లు చేయబడ్డాను.

**ఈశ్వరోఽహం యదీచ్ఛేయం పరాంగ స్పర్శనం ఖలు ।**
**తర్హి కోఽన్యోఽక్షమః క్షుద్రః కిం కిం నైవ కరిష్యతి ॥44॥**

ఈశ్వరుడనైన నేనే పరస్త్రీని స్పృశించాలని కోరుకుంటే ఇతరులగు సామాన్య ప్రాణులు ఏపనిని చేయడానికి తగరు? ఏ యేపనులను చేయకుంటారు?

**ఏవం వైరాగ్య మాసాద్య పర్యంకాసాదనం చ తత్ ।**
**వారయామాస సర్వాత్మా పరేశః కిం పతేదిహ ॥45॥**

సర్వాత్ముడైన పరమేశ్వరుడు "దీనివలన ప్రయోజనమేమున్నది" అని నిశ్చయించుకొని వైరాగ్యాన్నిఆశ్రయించి, ఆమెను పొందాలనే కాంక్షను నివారించుకున్నాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే కామకృత వికార వర్ణనం నామాష్టాదశోఽధ్యాయః ॥18॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో కామకృత వికారవర్ణన అనే పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోన వింశోఽధ్యాయః - పంతొమ్మిదవ అధ్యాయం

## కామనాశవర్ణనమ్ - మన్మథనాశవర్ణనం

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**బ్రహ్మన్ విధే మహాభాగ కిం జాతం తదనంతరమ్ ।**
**కథయ త్వం ప్రసాదేన తాం కథాం పాపనాశినీమ్ ॥1॥**

ఓ బ్రహ్మ!, విధీ!, మహాత్మా! తదనంతరం ఏమయ్యింది? పాపాలను నశింపజేసే ఆ గాథను దయతో చెప్పుము.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**శ్రూయతాం సా కథా తాత యజ్జాతం తదనంతరమ్ ।**
**తవ స్నేహాత్ప్రవక్ష్యామి శివలీలాం ముదావహామ్ ॥2॥**

వత్సా! ఆతరువాత జరిగిన గాథను వినుము. ఆనందాన్ని కలిగించు శివలీలలను నీయందలి ప్రేమచే చెబుతాను.

**ధైర్యస్య వ్యసనం దృష్ట్వా మహాయోగీ మహేశ్వరః ।**
**విచిచిన్త మనస్యేవం విస్మితోఽతి తతః పరమ్ ॥3॥**

మహాయోగియు, మహేశ్వరుడునగు శంభుడు తాను ధైర్యాన్ని కోల్పోవుటను గాంచి, మిక్కిలి చకితుడైన పిమ్మట మనస్సులో ఇట్లు తలపోశాడు.

**శివ ఉవాచ** - శివుడు చెప్పాడు.

**కిము విఘ్నాః సముత్పన్నాః కుర్వతస్తప ఉత్తమమ్ ।**
**కేన మే వికృతం చిత్తం కృతమత్ర కుకర్మిణా ॥4॥**

ఉత్తమమైన తపస్సు చేస్తున్న నాకు విఘ్నాలు కలగడానికి కారణమేమి? ఆ సమయంలో నా మనస్సులో వికారాన్ని కలిగించిన దుష్టుడెవడు?

**కువర్ణనం మయా ప్రీత్యా పరస్త్ర్యుపరి వైకృతమ్ ।**
**జాతో ధర్మవిరోధోఽత్ర శ్రుతిసీమా విలంఘితా ॥5॥**

నేను పరస్త్రీని గూర్చి చెడువర్ణన చేశాను. ఇప్పుడు ధర్మానికి విరుద్ధంగా జరిగింది. వేదమర్యాద ఉల్లంఘింపబడింది.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**విచింత్యేత్థం మహాయోగీ పరమేశస్సతాం గతిః ।**
**దిశో విలోకయామాస పరితశ్శంకితస్తదా ॥6॥**

సత్పురుషులకు దిక్కు అయినవాడు, మహాయోగియునైన పరమేశ్వరుడిట్లు తలపోసి, శంకను పొందినవాడై, చుట్టుదిక్కులనన్నిటిని పరికించాడు.

**వామభాగే స్థితం కామం దదర్శాకృష్టబాణకమ్ ।**
**స్వశరం క్షేప్తుకామం హి గర్వితం మూఢచేతసమ్ ॥7॥**

ఎడమభాగంలో బాణాలను వదులుతు నిలబడియున్న కామదేవునిమీద ఆ స్వామి దృష్టి పడింది. మూర్ఖుడైన మదనుడు తన శక్తిగర్వంతో మళ్ళీ బాణాలను వదలాలనుకుంటున్నాడు.

**తం దృష్ట్వా తాదృశం కామం గిరిశస్య పరాత్మనః ।**
**సంజాతః క్రోధసంమర్దస్తత్ క్షణాదపి నారద ॥8॥**

నారదా! ఈస్థితిలోనున్న కాముని చూడగానే పరమాత్ముడైన శివుడు వెంటనే రోషంతో నిండిపోయాడు.

**కామః స్థితోఽన్తరిక్షే స ధృత్వా తత్సశరం ధనుః ।**
**చిక్షేపాస్త్రం దుర్నివారమమోఘం శంకరే మునే ॥9॥**

మునీంద్రా! ఆకాశంలో ధనుస్సును చేబట్టి, బాణాన్ని సంధించిన కామదేవుడు, భగవంతుడైన శివునిమీద నివారింపరాని తన అమోఘాస్త్రాన్ని వదిలాడు.

**బభూవామోఘమస్త్రం తు మోఘం తత్పరమాత్మని ।**
**సమశామ్యత్తతస్తస్మిన్సంక్రుద్ధే పరమేశ్వరే ॥10॥**

పరమాత్ముడైన శివునియెడల ఆ అమోఘాస్త్రంకూడా వ్యర్థమయ్యింది. క్రోధంతోనున్న ఆ అస్త్రం ప్రభువును సమీపంచగానే శాంతించింది.

**మోఘీభూతే శివే స్వేఽస్త్రే భయమాపాశు మన్మథః ।**
**చకంపే చ పురః స్థిత్వా దృష్ట్వా మృత్యుంజయం ప్రభుమ్ ॥11॥**

భగవంతుడైన శివునియందు తన అస్త్రం వ్యర్థమౌటను గాంచి, మన్మథునికి భయం కలిగింది. భగవంతుడైన మృత్యుంజయునిచూచి, అతడు గజగజ వణికిపోయాడు.

**సస్మార త్రిదశాన్సర్వాన్శక్రాదీన్భయవిహ్వలః ।**
**స స్మరో మునిశార్దూల స్వప్రయాసే నిరర్థకే ॥12॥**

ఇంద్రాదిదేవతలను స్మరింపసాగాడు. మునివరా! తన ప్రయాస నిష్ఫలం కావడంతో కామదేవుడు భయంతో వ్యాకులపాటు చెందాడు.

**కామేన సుస్మృతా దేవా శ్శక్రాద్యాస్తే మునీశ్వర ।**
**ఆయయుః సకలాస్తే హి శంభుం నత్వా చ తుష్టువుః ॥13॥**

మునీశ్వరా! కామదేవుడు స్మరించగానే ఇంద్రాదిదేవతలచ్చటకు వచ్చి చేరారు. శంకరునికి నమస్కరించి, ఆ స్వామిని స్తుతింపసాగారు.

**స్తుతిం కుర్వత్సు దేవేషు క్రుద్ధస్యాతి హరస్య హి ।**
**తృతీయాత్తస్య నేత్రాద్వై నిస్ససార తతో మహాన్ ॥14॥**

దేవతలు స్తుతిస్తూ ఉండగానే కుపితుడైన, భగవంతుడైన హరుని లలాటం మధ్యనున్న తృతీయనేత్రం నుండి బలమైన అగ్నిజ్వాలలు అప్పటికప్పుడు ప్రకటితమై బయల్వెడలాయి.

**లలాట మధ్యగాత్తస్మాత్స వహ్నిర్ద్రుతసంభవః ।**
**జజ్వాలోర్ధ్వశిఖో దీప్తః ప్రలయాగ్నిసమప్రభః ॥15॥**

ఆ జ్వాలలు ఊర్ధ్వభాగానికి ఎగసి పడుతున్నాయి. దాని ప్రభలు ప్రలయాగ్నిని తలపింపజేస్తున్నాయి.

**ఉత్పత్య గగనే తూర్ణం నిష్పత్య ధరణీతలే ।**
**భ్రామం భ్రామం స్వపరితః పపాత మేదినీం పరి ॥16॥**

వెంటనే ఆ అగ్ని ఆకాశానికెగసి, భూమిమీద పడింది. అన్నివైపులా తిరుగుతు ఆ అగ్ని భూమిపై పడింది.

**భస్మసాత్కృతవాన్నాథో మదనం తావదేవ హి ।**
**యావచ్చ మరుతాం వాచః క్షమ్యతాం క్షమ్యతామితి ॥17॥**

"ప్రభూ! క్షమింపుము" అనే మాట దేవతల ముఖంనుండి వెలువడకముందే ఆ అగ్ని కామదేవుని దహించి భస్మం చేసింది.

**హతే తస్మిన్స్మరే వీరే దేవా దుఃఖముపాగతాః ।**
**రురుదుర్విహ్వలాశ్చాతిక్రోశంతః కిమభూదితి ॥18॥**

వీరుడైన కామదేవుడు సంహరింపబడటంవల్ల దేవతలకు మిక్కిలి దుఃఖం కలిగింది. వారు వ్యాకులులై "అయ్యో! ఎంతపని జరిగింది.!" అని పలుకుతు బిగ్గరగా పెడబొబ్బలు పెడుతూ, ఏడుస్తూ, విలపింపసాగారు.

**శ్వేతాంగా వికృతాత్మా చ గిరిరాజసుతా తదా ।**
**జగామ మందిరం స్వం చ సమాదాయ సఖీజనమ్ ॥19॥**

అప్పుడు పార్వతీదేవి వికృతచిత్తురాలయ్యింది. ఆమె శరీరమంతా వెలవెలబోయింది. ఆమె తన చెలికత్తెలను వెంటనిడుకొని తన భవనానికి వెళ్ళిపోయింది.

**క్షణమాత్రం రతిస్తత్ర విసంజ్ఞా సాఽభవత్తదా ।**
**భర్తృమృత్యుజదుఃఖేన పతితా సా మృతా ఇవ ॥20॥**

కామదేవుడు కాలిపోగా రతీదేవి అచ్చటనే ఒక క్షణం చైతన్యవిహీనయై పడియుంది. భర్తయొక్క మృత్యు దుఃఖంతో ఆమె తానే మరణించినట్లు పడియుంది.

**జాతాయాం చైవ సంజ్ఞాయాం రతిరత్యంతవిహ్వలా ।**
**విలలాప తదా తత్రోచ్చరంతీ వివిధం వచః ॥21॥**

స్పృహ రాగానే ఆమె మిగుల వ్యాకులతకు లోనై, రకరకాల మాటలతో విలపిస్తూ ఉంది.

**రతిరువాచ** – రతీదేవి పలికింది.

**కిం కరోమి క్వ గచ్ఛామి కిం కృతం దేవతైరిహ ।**
**మత్స్వామినం సమాహూయ నాశయామాసురుద్ధతమ్ ॥22॥**

అయ్యో! నేనేమి చేయాలి? ఎచటికి పోవాలి? దేవతలేమి చేశారు? ఉద్దండుడైన నా స్వామిని పిలిచి నశింపజేశారు.

**హా హా నాథ స్మర స్వామిన్ప్రాణప్రియ సుఖప్రద ।**
**ఇదం తు కిమభూదత్ర హా హా ప్రియ ప్రియేతి చ ॥23॥**

అయ్యో! అయ్యో! నాథా! స్మరా! స్వామీ! ప్రాణప్రియా! నాకు సౌఖ్యాన్ని ఇమ్ము. ప్రియతమా ఇప్పుడేమి జరిగింది!.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్థం విలపతీ సా తు వదంతీ బహుధా వచః ।**
**హస్తౌ పాదౌ తదాస్ఫాల్య కేశానత్రోటయత్తదా ॥24॥**

నారదా! ఈవిధంగా రోదిస్తూ, విలపిస్తూ, వివిధములైన పలుకులు పలుకుతూ, రతీదేవి చేతులు, కాళ్ళు నేలపై కొడుతు, తన తలవెంద్రుకలు పీకుకోసాగింది.

**తద్విలాపం తదా శ్రుత్వా తత్ర సర్వే వనేచరాః ।**
**అభవన్దుఃఖితాస్సర్వే స్థావరా అపి నారద ॥25॥**

అప్పుడామె విలాపాన్ని విని, అచ్చటనున్న వనవాసులైన జీవులు, వృక్షాలు, స్థావరాలు, ప్రాణులు కూడా మిక్కిలి దుఃఖించారు.

**ఏతస్మిన్నంతరే తత్ర దేవాశ్శక్రాదయోఽఖిలాః ।**
**రతిమూచుస్సమాశ్వాస్య సంస్మరంతో మహేశ్వరమ్ ॥26॥**

ఈ మధ్యలో ఇంద్రాది సకల దేవతలు మహాదేవుని స్మరిస్తూ, రతీదేవిని ఊరడిస్తూ, ఇలా పలికారు.

**దేవాఊచుః** – దేవతలు పలికారు.

**కించిద్భస్మ గృహీత్వా తు రక్ష యత్నాద్భయం త్యజ ।**
**జీవయిష్యతి స స్వామీ లప్స్యసే త్వం పునః ప్రియమ్ ॥27॥**

నీవు కాముని శరీరం యొక్క కొద్దిపాటి భస్మాన్ని తీసుకొని దానిని ప్రయత్నపూర్వకంగా రక్షించు, భయాన్ని విడిచిపెట్టు, మా అందరికి ప్రభువైన మహాదేవుడు కామదేవుని పునరుజ్జీవితుని చేస్తాడు. మరల నీవు నీ ప్రియతముని పొందుతావు.

**సుఖదాతా న కోఽప్యస్తి దుఃఖదాతా న కశ్చన ।**
**సర్వోఽపి స్వకృతం భుంక్తే దేవాన్ శోచసి వై వృథా ॥28॥**

ఎవ్వరును ఎవ్వరికిని సుఖాన్ని ఇచ్చేవారుగాని, దుఃఖాన్ని ఇచ్చేవారుగాని లేరు. అందరు తమ తమ కర్మఫలాలను అనుభవిస్తారు. నీవు దేవతలను దూషించి, వ్యర్థంగానే శోకిస్తున్నావు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాశ్వాస్య రతిం దేవాస్సర్వే శివముపాగతాః ।**
**సుప్రసాద్య శివం భక్త్యా వచనం చేదమబ్రువన్ ॥29॥**

ఈరీతిని రతిని ఊరడించి దేవతలందరు భగవంతుడగు శివుని సమీపించారు. ఆ స్వామిని భక్తిభావంతో సుప్రసన్నంచేసి ఇలా పలికారు.

**దేవా ఊచుః –** దేవతలు పలికారు.

**భగవన్ శ్రూయతామేతద్వచనం నశ్శుభం ప్రభో ।**
**కృపాం కృత్వా మహేశాన శరణాగతవత్సల ॥30॥**

భగవన్! శరణాగతవత్సలా! మహేశ్వరా! మమ్ములను కరుణించి మా యీ శుభవచనాలను వినండి.

**సువిచారయ సుప్రీత్యా కృతిం కామస్య శంకర ।**
**కామేనైతత్కృతం యత్ర న స్వార్థం తన్మహేశ్వర ॥31॥**

శంకరా! కామదేవుని ఈ చర్యను చక్కగా విచారించి, ప్రసన్నుడవై, ప్రీతితో పరిశీలింపుము. కామదేవుడు చేసిన ఈ పనిలో అతని స్వార్థమేదియు లేదు.

**దుష్టేన పీడితైర్దేవైస్తారకేణాఽఖిలైర్విభో ।**
**కర్మ తత్కారితం నాథ నాన్యథా విద్ధి శంకర ॥32॥**

దుష్టుడైన తారకాసురునిచే పీడితులమైన దేవతలమందరం కలిసి అతనితో ఈ పని చేయించాము. ప్రభూ! శంకరా! దీనిని అన్యథా భావింపకుము. నీవు సమస్తాన్ని ప్రసాదించే దేవదేవుడవు.

**రతిరేకాకినీ దేవ విలాపం దుఃఖితా సతీ ।**
**కరోతి గిరిశ త్వం చ తామాశ్వాసయ సర్వదా ॥33॥**

గిరిశా! సాధ్వియైన రతీదేవి ఒంటరిగా మిక్కిలి దుఃఖంతో విలపిస్తోంది. ఆమెకు ఓదార్పును ప్రసాదించండి.

**సంహారం కర్తుకామోఽసి క్రోధేనానేన శంకరః ।**
**దేవతైస్సహ సర్వేషాం హతవాంస్తం యది స్మరమ్ ॥34॥**

శంకరా! క్రోధంతో మీరు కామదేవుని హతమార్చినట్లైతే సమస్తదేవతలతో కూడిన సమస్తప్రాణులను ఇప్పుడే సంహరింపదలుస్తున్నారని మేమనుకుంటున్నాము.

**దుఃఖం తస్యా రతేర్దృష్ట్వా నష్టప్రాయాశ్చ దేవతాః ।**
**తస్మాత్త్వయా చ కర్తవ్యం రత్యాః శోకాపనోదనమ్ ॥35॥**

రతియొక్క దుఃఖాన్ని చూచి, దేవతలు నష్టప్రాయులయ్యారు. కనుక మీరు ఆమె శోకాన్ని తొలగించండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తేషాం ప్రసన్నో భగవాన్ శివః ।**
**దేవానాం సకలానాం చ వచనం చేదమబ్రవీత్ ॥36॥**

నారదా! సమస్త దేవతల వచనాలను విని, భగవంతుడైన శివుడు ప్రసన్నుడై, ఇలా పలికాడు.

**శివ ఉవాచ –** శివుడు చెప్పాడు.

**దేవాశ్చ ఋషయస్సర్వే మద్వచఃశృణుతాదరాత్ ।**
**మత్కోపేన చ యజ్జాతం తత్తథా నాన్యథా భవేత్ ॥37॥**

దేవతలారా! ఋషులారా! మీరు సాదరంగా నా మాట వినండి. నా కోపంతో జరిగినదంతా జరగవలసినదే. దానిని వేరుగా భావించవద్దు.

**అనంగస్తావదేవ స్యాత్కామో రతిపతిః ప్రభుః ।**
**యావచ్చావతరేత్కృష్ణో ధరణ్యాం రుక్మిణీపతిః ॥38॥**

రుక్మిణీపతియైన శ్రీకృష్ణుడు భూమిమీద అవతరించే వరకు రతీదేవిభర్తయు, శక్తిశాలియునగు కామదేవుడు అనంగుడై (శరీర రహితుడై) ఉంటాడు.

**ద్వారకాయాం యదా స్థిత్వా పుత్రానుత్పాదయిష్యతి ।**
**తదా కృష్ణస్తు రుక్మిణ్యాం కామముత్పాదయిష్యతి ॥39॥**

శ్రీకృష్ణుడు ద్వారకలోనుండి, పుత్రులను పొందినపుడు రుక్మిణీదేవి గర్భంలో కామదేవుడు జన్మిస్తాడు.

**ప్రద్యుమ్ననామ తస్యైవ భవిష్యతి న సంశయః ।**
**జాతమాత్రం తు తం పుత్రం శంబరస్స హరిష్యతి ॥40॥**

అప్పుడతనిపేరు **"ప్రద్యుమ్నుడు"**. ఆ పుత్రుడు జన్మించగానే శంబరాసురుడు ఇతనిని అపహరిస్తాడు.

**హృత్వా పాత్య సముద్రం తం శంబరో దానవోత్తమః ।**
**మృతం జ్ఞాత్వా వృథా మూఢో నగరం స్వం గమిష్యతి ॥41॥**

ఆ విధంగా హరించిన తరువాత దానవోత్తముడైన శంబరుడు ఆ శిశువును సముద్రంలో పడవేస్తాడు. ఆ మూర్ఖుడు అతడు మరణించాడని తలంచి తన నగరానికి వెళ్ళిపోతాడు.

**తావచ్ఛ నగరం తస్య రతే స్థేయం యథాసుఖమ్ ।**
**తత్రైవ స్వపతేః ప్రాప్తిః ప్రద్యుమ్నస్య భవిష్యతి ॥42॥**

రతీ! అప్పటివరకు నీవు శంబరాసురుని నగరంలో సుఖంగా నివసించు. అక్కడే నీకు నీ భర్తయైన ప్రద్యుమ్నుడు ప్రాప్తిస్తాడు.

**తత్ర కామో మిలిత్వా తం హత్వా శంబరమాహవే ।**
**భవిష్యతి సుఖీ దేవాః ప్రద్యుమ్నాఖ్యస్స్వకామినీమ్ ॥43॥**

అప్పుడు కామదేవుడు నీతో కలసి, యుద్ధంలో శంబరాసురుని వధిస్తాడు. అప్పుడు దేవతలు సుఖిస్తారు. ప్రద్యుమ్నునితోకూడి, ఆమెకూడ సుఖిస్తుంది.

**తదీయం చైవ యద్ద్రవ్యం నీత్వా స నగరం పునః ।**
**గమిష్యతి తయా సార్ధం దేవాస్సత్యం వచో మమ ॥44॥**

దేవతలారా! ప్రద్యుమ్ననామధారియైన కాముడు తన కామిని రతిని, శంబరాసురుని ధనాన్ని గైకొని మరల తన నగరానికి వెళతాడు. నేను చెప్పినదంతా సర్వథా సత్యము.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇతి శ్రుత్వా వచశ్శంభోర్దేవా ఊచుః ప్రణమ్య తమ్ ।**
**కించిదుచ్ఛ్వసితాశ్చిత్తే కరౌ బద్ధ్వా నతాంగకాః ॥45॥**

భగవంతుని మాటలు విని, దేవతల చిత్తాలకు ఉల్లాసం కలిగింది. వారు రెండుచేతులు జోడించి, ఆ ప్రభువునకు నమస్కరించి, వినీతభావంతో పలికారు.

**దేవాఊచుః** – దేవతలు పలికారు.

**దేవ దేవ మహాదేవ కరుణాసాగర ప్రభో ।**
**శీఘ్రం జీవయ కామం త్వం రక్ష ప్రాణాన్ రతేర్హర ॥46॥**

దేవదేవా! మహాదేవా! కరుణాసాగరా! ప్రభూ! మీరు కామదేవునికి శీఘ్రంగా జీవనదానాన్ని ప్రసాదించండి. అట్లే రతీదేవిప్రాణాలను రక్షించండి.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్యామరవచః ప్రసన్నః పరమేశ్వరః ।**
**పునర్బభాషే కరుణాసాగరస్సకలేశ్వరః ॥47॥**

దేవతల మాటలు విని, సకలేశ్వరుడు, కరుణాసాగరుడు, పరమేశ్వరుడునగు శివుడు ప్రసన్నుడై మరలా ఇలా పలికాడు.

**శివ ఉవాచ –** శివుడు చెప్పాడు.

**హే దేవాస్సుప్రసన్నోఽస్మి జీవయిష్యామి చాంతరే ।**
**కామః స మద్గణో భూత్వా విహరిష్యతి నిత్యశః ॥48॥**

దేవతలారా! నేను మిక్కిలి ప్రసన్నుడనయ్యాను. నేను కామదేవుని అందరి హృదయాలలో జీవింపజేస్తాను. అతడు సదా నా గణాలలో ఒకడై విహరిస్తాడు.

**నాఖ్యేయమిదమాఖ్యానం కస్యచిత్పురతస్సురాః ।**
**గచ్ఛత స్వస్థలం దుఃఖం నాశయిష్యామి సర్వతః ॥49॥**

ఓ దేవతలారా! ఈగాథను ఎవరికి చెప్పరాదు. మీరు మీ స్థానాలకు వెళ్ళండి. నేను మీ దుఃఖాన్ని తొలగిస్తాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వాంతర్దధే రుద్రో దేవానాం స్తువతాం తదా ।**
**సర్వే దేవాస్సుప్రసన్నా బభూవుర్గతవిస్మయాః ॥50॥**

అని పలికి రుద్రదేవుడు అప్పుడు తనను స్తుతించు సకలదేవతలు చూస్తూ ఉండగా అంతర్ధానుడయ్యాడు. దేవతల విస్మయం దూరమయ్యింది. వారందరు ప్రసన్నచిత్తులయ్యారు.

**తతస్తాం చ సమాశ్వాస్య రుద్రస్య వచనే స్థితాః ।**
**ఉక్త్వా వచస్తదీయం చ స్వం స్వం ధామ యయుర్మునే ॥51॥**

మునీంద్రా! తదనంతరం రుద్రుని మాటనాధారంగా చేసుకొని స్థిరచిత్తులైన దేవతలు రతీదేవికి ఆ స్వామి చెప్పిన మాటలను వినిపించారు. ఆవిధంగా వారామెను ఓదార్చి తమతమ స్థానాలకు వెళ్ళిపోయారు.

**కామపత్నీసమాదిష్టం నగరం సా గతా తదా ।**
**ప్రతీక్షమాణా తం కాలం రుద్రాదిష్టం మునీశ్వర ॥52॥**

మునీశ్వరా! కామపత్నియైన రతీదేవి శివుడు చెప్పిన శంబర నగరానికి వెళ్ళిపోయింది. రుద్రదేవుడు చెప్పిన సమయం కొరకు ఆమె వేచిచూడసాగింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే కామనాశవర్ణనం నామైకోన వింశోఽధ్యాయః ॥19॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో కామనాశవర్ణనం అనే పంతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## **వింశోఽధ్యాయః** - ఇరవైయవ అధ్యాయం

## **బడబానలచరితమ్** - బడబానల చరిత్రం

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**విధే నేత్రసముద్భూత వహ్నిజ్వాలా హరస్య సా ।**
**గతా కుత్ర వద త్వం తచ్చరిత్రం శశిమౌళినః ॥1॥**

ఓ విధీ! రుద్రుని కంటినుండి పుట్టిన అగ్నిజ్వాల కాముని దహించిన తరువాత ఎక్కడకు వెళ్ళిందో ఆ గాథనంతటిని నాకు చెప్పండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**యదా భస్మ చకారాశు తృతీయనయనానలః ।**
**శంభోః కామం ప్రజజ్వాల సర్వతో విఫలస్తదా ॥2॥**

నారదా! భగవంతుడైన రుద్రుని మూడవ నేత్రంనుండి ప్రకటితమైన అగ్ని కామదేవుని దహించి భస్మం చేసింది. అప్పుడది ఏ ప్రయోజనము లేకుండా ప్రజ్వలితమై అన్నివైపులా వ్యాపింపసాగింది ..

**హాహాకారో మహానాసీత్త్రైలోక్యే సచరాచరే ।**
**సర్వదేవర్షయస్తాత శరణం మాం యయుర్ద్రుతమ్ ॥3॥**

చరాచర ప్రాణులతోకూడిన ముల్లోకాలలో హాహాకారాలు పెల్లుబికాయి. అప్పుడు సకల దేవతలు, ఋషులు నన్ను (బ్రహ్మను) శరణు జొచ్చారు.

**సర్వే నివేదయామాసుస్తద్దుఃఖం మహ్యమాకులాః ।**
**సుప్రణమ్య సుసంస్తూయ కరౌ బద్ధ్వా నతాననాః ॥4॥**

వారందరు అత్యంత వ్యాకులపాటునకు లోనై, తలలువంచి, చేతులు జోడించి, నాకు ప్రణామం చేశారు. నన్ను స్తుతించి, తమ దుఃఖాన్ని నాకు నివేదించారు.

**తచ్ఛ్రుత్వాహం శివం స్మృత్వా తద్ధేతుం సువిమృశ్య చ ।**
**గతస్తత్ర వినీతాత్మా త్రిలోకావనహేతవే ॥5॥**

అది విని నేను శంకరభగవానుని స్మరించాను. వారి దుఃఖహేతువును తెలుసుకొని, ముల్లోకాలను రక్షించడానికి, వినీతాత్ముడనై అచ్చటకు చేరాను.

**సందగ్ధకామః స శుచిర్జ్వాలామాలాతిదీపితః ।**
**స్తంభితోఽరం మయా శంభుప్రసాదాప్తసుతేజసా ॥6॥**

ఆ అగ్నిజ్వాలామాలికలు అత్యంత ఉద్దీప్తమై, సకల జగత్తును భస్మం చేయడానికి ఉద్యమిస్తున్నాయి. కాని భగవంతుడైన శివుని కృపచేత ప్రాప్తించిన ఉత్తమతేజస్సుతో నేను తాత్కాలికంగా దానిని స్తంభింపజేశాను.

**అథ క్రోధమయం వహ్నిం దగ్ధుకామం జగత్త్రయమ్ ।**
**బాడవాన్తమకార్షం చ సౌమ్యజ్వాలాముఖం మునే ॥7॥**

మునీంద్రా! త్రిలోకాలను దగ్ధమొనరించే కోరికగల ఆ క్రోధాగ్నిని నేనొక గుఱ్ఱం రూపంలో మార్చివేశాను. దానిముఖంనుండి అప్పుడు సౌమ్యజ్వాలలు ప్రకటితం కాజొచ్చాయి.

**తం వాడవతనుమహం సమాదాయ శివేచ్ఛయా ।**
**సాగరం సమగాం లోకహితాయ జగతాం పతిః ॥8॥**

భగవంతుడైన శివుని ఇచ్ఛానుసారం ఆ బాడబశరీరం (గుఱ్ఱం) గల అగ్నిని తీసుకొని నేను లోకహితార్థం సముద్రతీరానికి వెళ్ళాను.

**ఆగతం మాం సమాలోక్య సాగరస్సాంజలిర్మునే ।**
**ధృత్వా చ పౌరుషం రూపమాగతస్సంనిధిం మమ ॥9॥**

మునీంద్రా! నా రాకను చూచి, సముద్రుడు ఒక దివ్యపురుషుని రూపాన్ని ధరించి, చేతులు జోడించి, నావద్దకు వచ్చాడు.

**సుప్రణమ్యాథ మాం సింధుస్సంస్తూయ చ యథావిధి ।**
**స మామువాచ సుప్రీత్యా సర్వలోకపితామహమ్ ॥10॥**

సర్వలోకపితామహుడనైన నన్ను చక్కగా విధివిధానంగా స్తుతించి, పూజించి, సంతోషంతో సాగరుడు నాతో ఇలా పలికాడు.

**సాగర ఉవాచ –** సాగరుడు చెప్పాడు.

**కిమర్థమాగతోఽసి త్వం బ్రహ్మన్నత్రాఖిలాధిప ।**
**తం నిదేశయ సుప్రీత్యా మత్వా మాం చ స్వసేవకమ్ ॥11॥**

సర్వేశ్వరా! బ్రహ్మదేవా! మీరెందులకిచ్చటకు విచ్చేశారు? నన్ను నీ సేవకునిగా తలంచి, మీరు వచ్చిన విషయం తెలపండి.

**అథాహం సాగరవచశ్శ్రుత్వా ప్రీతిపురస్సరమ్ ।**
**ప్రావోచం శంకరం స్మృత్వా లౌకికం హితమావహన్ ॥12॥**

సముద్రుని మాటలను విని, భగవంతుడైన శంకరుని స్మరించి, లోకహితాన్ని మనస్సునందుంచుకొని, నేను ప్రసన్నుడనై ఇలా పలికాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**శ్రుణు తాత మహాధీమన్సర్వలోకహితావహ ।**
**వచ్మ్యహం ప్రీతితస్సింధో శివేచ్ఛాప్రేరితో హృదా ॥13॥**

నాయనా! సముద్రా! నీవు గొప్ప బుద్ధిమంతుడవు. నేను శివుని కోరికతో ప్రేరితుడనై, హృదయపూర్వకంగా ప్రేమతో తెలుపుతున్నాను.

**అయం క్రోధో మహేశస్య వాడవాత్మా మహాప్రభుః ।**
**దగ్ధ్వా కామం ద్రుతం సర్వం దగ్ధుకామోఽభవత్తతః ॥14॥**

ఇది భగవంతుడైన మహేశ్వరుని క్రోధం. ఇది గొప్ప శక్తిశాలియైన అశ్వరూపంలో ఇక్కడ ఉపస్థితమైయుంది. ఇది కామదేవుని భస్మంచేసి, సకల జగత్తును దహించడానికి ఉద్యమించింది.

**ప్రార్థితోఽహం సురైశ్శీఘ్రం పీడితైశ్శంకరేచ్ఛయా ।**
**తత్రాగత్య ద్రుతం తం వై తాత స్తంభితవాన్ శుచిమ్ ॥15॥**

అంతట పీడితులైన దేవతలు దుఃఖంతో ప్రార్థించగా, శంకరేచ్ఛతో నేనచ్చటికివెళ్ళి స్తంభింపజేశాను.

**వాడవం రూపమాధత్త తమాదాయాగతోఽత్ర హ ।**
**నిర్దిశామి జలాధార త్వామహం కరుణాకరః ॥16॥**

జలాధారా! అది అప్పుడు అశ్వరూపాన్ని ధరించింది. దానిని తీసుకొని ఇప్పుడు నేనిక్కడకు వచ్చాను.

**అయం క్రోధీ మహేశస్య వాడవం రూపమాశ్రితః ।**
**జ్వాలాముఖస్త్వయా ధార్యో యావదాభూతసంప్లవమ్ ॥17॥**

ఈ మహేశ్వర క్రోధం బాడబరూపం ధరించి, ముఖంనుండి జ్వాలను వెడలగ్రక్కుతు ఇచ్చట నిలుచున్నది. దీనిని నీవు ప్రళయకాలంవరకు నీయందు ధరించుము.

**యదాత్రాహం సమాగమ్య వత్స్యామి సరితాం పతే ।**
**తదా త్వయా పరిత్యాజ్యః క్రోధోఽయం శంకరోఽద్భుతః ॥18॥**

ఓ సముద్రా! నేనిచ్చటకు వచ్చి నివాసముండునప్పుడు భగంతుడైన శంకరుని ఈ క్రోధాన్ని నీవు వదలిపెట్టు

**భోజనం తోయమేతస్య తవ నిత్యం భవిష్యతి ।**
**యత్నాదేవావధార్యోఽయం యథా నోపైతి చాంతరమ్ ॥19॥**

నీ జలమే ప్రతిదినం దీనికి భోజనమౌతుంది. నీవు దీనిని నీ ఉపరితలంలోనే ఉంచుకొనుము. ఇది నీ అనంతజలరాశిలో లీనం కాకూడదు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తో హి మయాసింధురంగీచక్రే తదా ధ్రువమ్ ।**
**గ్రహీతుం వాడవం వహ్నిం రౌద్రం చాశక్యమన్యతః ॥20॥**

నారదా! నేనట్లు చెప్పడంవల్ల సముద్రుడు రుద్రుని క్రోధాగ్నిరూపమైన బడబానలాన్ని తనలో ధరించడానికి అంగీకరించాడు. అది ఇతరులకసంభవం.

**తతః ప్రవిష్టో జలధౌ స వాడవతనుః శుచిః ।**
**వార్యోఘాన్సుదహంస్తస్య జ్వాలామాలాభిదీపితః ॥21॥**

తదనంతరం ఆ బడబాగ్ని సముద్రంలో ప్రవేశించింది. తన జ్వాలామాలికలతో ప్రదీప్తమై, సాగర జలరాశిని దహింపసాగింది.

**తతస్సంతుష్టచేతస్కస్స్వం ధామాహం గతో మునే ।**
**అంతర్ధానమగాత్సింధుర్దివ్యరూపః ప్రణమ్య మామ్ ॥22॥**

మునీంద్రా! దీనివలన సంతుష్టచిత్తుడనై నేను నా లోకానికి వెళ్ళిపోయాను. ఆ దివ్యరూపధారియైన సముద్రుడు నాకు ప్రణమిల్లి అదృశ్యుడయ్యాడు.

**స్వాస్థ్యం ప్రాప జగత్సర్వం నిర్ముక్తం తద్భవాద్భయాత్ ।**
**దేవా బభూవుః సుఖినో మునయశ్చ మహామునే ॥23॥**

ఓ మహామునీ! రుద్రుని క్రోధాగ్నిభయం తొలగిపోగా సకల జగత్తు ఆనందాన్ని అనుభవింపసాగింది. దేవతలు, మునులు సుఖంగా ఉన్నారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే వడవానల చరితం నామ వింశోఽధ్యాయః ॥20॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో బడబానల చరిత్రం అనే ఇరవైయవ అధ్యాయం సమాప్తం.

## ఏకవింశోఽధ్యాయః - ఇరవై ఒకటవ అధ్యాయం

## నారదోపదేశః - నారదోపదేశం

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**విధే తాత మహాప్రాజ్ఞ విష్ణుశిష్య త్రిలోకకృత్ ।**
**అద్భుతేయం కథా ప్రోక్తా శంకరస్య మహాత్మనః ॥1॥**

ఓ విధీ! తండ్రీ! మహాప్రాజ్ఞా! ఓ విష్ణుశిష్యా! త్రిలోకాలను సృష్టించువాడవు. శంకరమహాత్ముని అద్భుతగాథను వివరించావు.

**భస్మీభూతే స్మరే శంభుతృతీయనయనాగ్నినా ।**
**తస్మిన్ప్రవిష్టే జలధౌ వద త్వం కిమభూత్తతః ॥2॥**

శంభుని మూడవ నేత్రంనుండి పుట్టిన అగ్నిచే మన్మథుడు భస్మం కాగా ఆ అగ్ని సముద్రంలో ప్రవేశించిన అనంతరం ఏమి జరిగిందో చెప్పండి?

**కిం చకార తతో దేవీ పార్వతీ కుధరాత్మజా ।**
**గతా కుత్ర సఖీభ్యాం సా తద్వదాద్య దయానిధే ॥3॥**

హిమవత్పుత్రిక యైన పార్వతీదేవి అప్పుడేమి చేసినది? ఆమె సఖురాండ్రిద్దరితోగూడి ఎచ్చటకు వెళ్ళింది? ఇప్పుడా వృత్తాంతాన్ని చెప్పండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**శృణు తాత మహాప్రాజ్ఞ చరితం శశిమౌళినః ।**
**మహోతికారకస్యైవ స్వామినో మమ చాదరాత్ ॥4॥**

వత్సా! ఓ బుద్ధిమంతుడా! మహాలీలాకరుడైన చంద్రశేఖరస్వామి చరిత్రను వర్ణించి చెబుతాను నీవు ఆదరంతో విను.

**యదాదహచ్ఛంభునేత్రోద్భవో హి మదనం శుచిః ।**
**మహాశబ్దోఽద్భుతోఽభూద్వై యేనాకాశః ప్రపూరితః ॥5॥**

శంభుని కంటినుండి వెలువడిన అగ్ని మన్మథుని దహించివేసింది కదా! దాని ప్రభావంచే అద్భుతమైన మహాశబ్దం పుట్టి, ఆకాశమంతా నిండిపోయింది.

**తేన శబ్దేన మహతా కామం దగ్ధం సమీక్ష్య చ ।**
**సఖీభ్యాం సహ భీతా సా యయౌ స్వగృహమాకులా ॥6॥**

దహింపబడిన కాముని చూచి, ఆ మహాద్భుతశబ్దాన్ని విని, పార్వతి భయపడి, సఖురాండ్రిరువురితో కూడి, కంగారుగా తన గృహానికి వెళ్ళింది.

**తేన శబ్దేన హిమవాన్పరివారసమన్వితః ।**
**విస్మితోఽభూదతిక్లిష్టః సుతాం స్మృత్వా గతాం తతః ॥7॥**

ఆ శబ్దాన్ని కుటుంబసభ్యులతో కూడియున్న హిమవంతుడు కూడ విని, శివునివద్దకు వెళ్ళియున్న కుమార్తెను స్మరించి, విస్మయాన్ని, మహాదుఃఖాన్ని పొందాడు.

**జగామ శోకం శైలేశః సుతాం దృష్ట్వాతివిహ్వలామ్ ।**
**రుదంతీం శంభువిరహాదాససాదాచలేశ్వరః ॥8॥**

శంభుని విరహంచే మహాదుఃఖాన్ని పొంది రోదిస్తున్న కుమార్తెను చూచి, పర్వతరాజైన హిమవంతుడు శోకాన్ని పొంది ఆమెవద్దకు వచ్చాడు.

**ఆసాద్య పాణినా తస్యా మార్జయన్నయనద్వయమ్ ।**
**మా బిభీహి శివేఽరోదీరిత్యుక్త్వా తాం తదాగ్రహీత్ ॥9॥**

ఆమెను తన దగ్గరకు తీసుకొని, కన్నీటిని తుడిచి "ఓ పార్వతీ! భయపడకుము. ఏడ్వవద్దు" అని పలికి ఓదార్చాడు.

**క్రోడే కృత్వా సుతాం శీఘ్రం హిమవానచలేశ్వరః ।**
**స్వమాలయమథానిన్యే సాంత్వయన్నతివిహ్వలామ్ ॥10॥**

పర్వతరాజగు హిమవంతుడు తన కుమార్తెను వెంటనే ఒడిలో కూర్చుండబెట్టుకున్నాడు. మిక్కిలి దుఃఖితురాలైన ఆమెను ఓదారుస్తూ, తన ప్రాసాదంలోనికి తీసుకొని వచ్చాడు.

**అంతర్హితే స్మరం దగ్ధ్వా హరే తద్విరహాచ్ఛివా ।**
**వికలాభూద్ భృశం సా వై లేభే శర్మ న కుత్రచిత్ ॥11॥**

శివుడు మన్మథుని బూడిద చేసి, అంతర్ధానం కాగానే పార్వతి ఆయన విరహంచే మిక్కిలి దుఃఖితురాలై, ఎక్కడను సుఖాన్ని పొందలేదు.

**పితుర్గృహం తదా గత్వా మిలిత్వా మాతరం శివా ।**
**పునర్జాతం తదా మేనే స్వాత్మానం సా ధరాత్మజా ॥12॥**

పార్వతి తండ్రి గృహం చేరిన పిమ్మట తల్లిని కలుసుకున్నది. అపుడామెకు తాను పునర్జన్మను పొందినట్లు భావించింది.

**నినింద చ స్వరూపం సా హా హతాస్మీత్యథాబ్రవీత్ ।**
**సఖీభిర్బోధితా చాపి న బుబోధ గిరీంద్రజా ॥13॥**

ఆమె తన రూపాన్ని నిందించుకుని, "అయ్యో! హతురాలనయ్యాను" అని దుఃఖించింది. సఖురాండ్రు ఆమెను ఓదార్చినప్పటికి ఆమెకు దుఃఖవిముక్తి కలగలేదు.

**స్వపంతీ చ పిబంతీ చ సా స్నాతీ గచ్ఛతీ శివా ।**
**తిష్ఠంతీ చ సఖీమధ్యే న కించిత్సుఖమాప హ ॥14॥**

ఆ పార్వతి నిద్రించుచున్నప్పుడుగాని, నీటిని త్రాగునప్పుడు కాని, స్నానం చేయునప్పుడుగాని, నడుచునప్పుడుకాని, సఖురాండ్ర మధ్యలో నున్నప్పుడుగాని లేశమైనను సుఖాన్ని పొందలేకపోయింది.

**ధిక్స్వరూపం మదీయం చ తథా జన్మ చ కర్మ చ ।**
**ఇతి బ్రువంతీ సతతం స్మరంతీ హరచేష్టితమ్ ॥15॥**

"అయ్యో! నా రూపము, నా జన్మము, నా కర్మము, నిందింపదగినవి" అని పలుకుతూ ఆమె సర్వదా శివుని చేష్టలను స్మరింపజొచ్చింది.

**ఏవం సా పార్వతీ శంభువిరహోత్క్లిష్టమానసా ।**
**సుఖం న లేభే కించిద్వాఽబ్రవీచ్ఛివ శివేతి చ ॥16॥**

ఈ విధంగా శంభుని విరహంచే గొప్ప క్లేశాన్ని పొందిన మనస్సుగల పార్వతి కొంచమైనను సుఖాన్ని పొందజాలక శివ! శివా! అని పలుకజొచ్చింది.

**నివసంతీ పితుర్గేహే పినాకిగతచేతనా ।**
**శుశోచాథ శివా తాత ముమోహ చ ముహుర్ముహుః ॥17॥**

వత్సా! ఆ పార్వతి తండ్రి ఇంటివద్ద ఉన్నను ఆమె మనస్సు శివునిపై ఉన్నది. ఆమె తీవ్రమైన దుఃఖాన్ని పొంది, అనేక పర్యాయాలు స్పృహను కోల్పోయింది.

**శైలాధిరాజోఽప్యథ మేనకాపి మైనాకముఖ్యాస్తనయాశ్చ సర్వే ।**
**తాం సాంత్వయామాసురదీనసత్త్వా హరం విసస్మార తథాపి నో సా ॥18॥**

దైన్యము నెరుంగని దృఢచిత్తులైన హిమవంతుడు, మేనకాదేవి మైనాకుడు మున్నగు హిమవత్పుత్రులందరు ఆమెను ఓదార్చారు. కాని ఆమె శివుని మరవలేకపోయింది.

**అథ దేవమునే ధీమన్ హిమవత్ప్రస్థరే తదా ।**
**నియోజితో బలభిదాగమస్త్వం కామచారతః ॥19॥**

ఓ దేవర్షీ! బుద్ధిమంతుడా! అప్పుడు నీవు యథేచ్ఛగా సంచరిస్తున్నవాడవై, ఇంద్రునిచే నియోగింపబడి, హిమవత్పర్వతం వద్దకు విచ్చేశావు.

**తతస్త్వం పూజితస్తేన భూధరేణ మహాత్మనా ।**
**కుశలం పృష్టవాంస్తం వై తదావిష్టో వరాసనే ॥20॥**

అప్పుడు మహాత్ముడైన హిమవంతుడు నిన్ను పూజించి, శ్రేష్ఠమైన ఆసనమునందు కూర్చుండబెట్టి కుశలప్రశ్నలడిగాడు.

**తతః ప్రోవాచ శైలేశః కన్యాచరితమాదితః ।**
**హరసేవాన్వితం కామదహనం చ హరేణ హ ॥21॥**

తదనంతరం హిమవంతుడు పార్వతి ప్రారంభంనుండి శివుని సేవలో లగ్నమై యుండుట, శివుడు మన్మథుని దహించుట మున్నగు వృత్తాంతములన్నిటిని నీకు వివరించాడు.

**శ్రుత్వా వచో మునే త్వం తు తం శైలేశం శివం భజ ।**
**తమామంత్ర్యోదతిష్ఠస్త్వం సంస్మృత్య మనసా శివమ్ ॥22॥**

ఓ మహర్షీ! నీవామాటలను విని, హిమవంతునితో "శివుని సేవింపుము" అని బోధించి, మనములో శివుని స్మరిస్తూ లేచి వచ్చావు.

**తం సముత్సృజ్య రహసి కాలీం తామగమస్త్వరా ।**
**లోకోపకారకో జ్ఞానీ త్వం మునే శివవల్లభః ॥23॥**

ఓ మహర్షీ! లోకోపకారకుడవైనట్టియు, శివునకు ప్రీతిపాత్రుడవైనట్టియు, జ్ఞానియునగు నీవు హిమవంతుని విడిచి ఏకాంతంలోనున్న పార్వతిని వెంటనే కలుసుకున్నావు.

**ఆసాద్య కాలీం సంబోధ్య తద్ధితే స్థిత ఆదరాత్ ।**
**అవోచస్త్వం వచస్తథ్యం సర్వేషాం జ్ఞానినాం వరః ॥24॥**

జ్ఞానులలో శ్రేష్ఠుడవైన నీవు పార్వతీదేవి హితాన్ని కోరి, ఆమెను ఆదరంతో సమీపించి, ఇలా పలికావు.

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**శ్రుణు కాళి వచో మే హి సత్యం వచ్మి దయారతః ।**
**సర్వథా తే హితకరం నిర్వికారం సుకామదమ్ ॥25॥**

ఓ పార్వతీ! నా మాటలు వినుము. దయామయురాలవైన నీకు నేను సర్వదా హితకరమును, రాగద్వేషాది దోషములు లేనిదియు, కోర్కెలనీడేర్చునదియునగు సత్యాన్ని చెబుతాను.

**సేవితశ్చ మహాదేవస్త్వయేహ తపసా వినా ।**
**గర్వవత్యా యదధ్వంసీద్దీనానుగ్రహకారకః ॥26॥**

దీనులననుగ్రహించే మహాదేవుని నీవిచట సేవించియున్నావు. కాని, నీవు తపస్సును చేయలేదు. అంతేకాదు నీవు గర్వాన్ని కలిగియున్నావు. దానితో దీనులను అనుగ్రహించే పరమేశ్వరుడు ధ్వంసము చేసాడు.

**విరక్తశ్చ స తే స్వామీ మహాయోగీ మహేశ్వరః ।**
**విసృష్టవాన్ స్మరం దగ్ధ్వా త్వాం శివే భక్తవత్సలః ॥27॥**

ఓ పార్వతీ! విరాగి, మహాయోగి, భక్తవత్సలుడగు ఆ పరమేశ్వరుడు మన్మథుని దహించి, నిన్ను విడిచిపెట్టి వెళ్ళాడు.

**తస్మాత్త్వం సుతపోయుక్తా చిరమారాధయేశ్వరమ్ ।**
**తపసా సంస్కృతాం రుద్రస్స ద్వితీయాం కరిష్యతి ॥28॥**

కాబట్టి నీవు చిరకాలం గొప్ప తపస్సుచేసి, ఈశ్వరుని ఆరాధించుము. తపస్సుచే పవిత్రురాలవగు నిన్ను ఆయన తన భార్యగా స్వీకరించగలడు.

**త్వం చాపి శంకరం శంభుం న త్యక్ష్యసి కదాచన ।**
**నాన్యం పతిం హఠాద్దేవి గ్రహీష్యసి శివాదృతే ॥29॥**

నీవెన్నడును శంకరుని వీడి యుండవు. నీవు శివునితక్క మరియొకరిని హఠాత్తుగా భర్తగా స్వీకరించుట జరుగబోదు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తే హి మునే సా భూధరాత్మజా ।**
**కించిదుచ్ఛ్వసితా కాళీ ప్రాహ త్వాం సాంజలిర్ముదా ॥30॥**

నీ యీ మాటలను హిమవత్పుత్రియైన పార్వతి విని, చిన్న నిట్టూర్పును విడిచి, ఆనందంతో చేతులు జోడించి, నమస్కరించి, ఇలా పలికింది.

**శివోవాచ** - పార్వతి పలికింది.

**త్వం తు సర్వజ్ఞ జగతాముపకారకర ప్రభో ।**
**రుద్రస్యారాధనార్థాయ మంత్రం దేహి మునే హి మే ॥31॥**

హే ప్రభో! నీవు సర్వజ్ఞుడవు. జగత్తులకు ఉపకారము చేయువాడవు నీవే. ఓ మహర్షీ! నేను రుద్రుని ఆరాధించడానికి ఒక మంత్రాన్ని ప్రసాదించండి.

**న సిద్ధ్యతి క్రియా కాపి సర్వేషాం సద్గురుం వినా ।**
**మయా శ్రుతా పురా సత్యం శ్రుతిరేషా సనాతనీ ॥32॥**

ఎవరికైనను సద్గురువు లేనిదే పుణ్యకర్మలేవియు సిద్ధింపవని నేను పూర్వం వినియున్నాను. సనాతనమైన వేదము ఈ సత్యాన్నే చెబుతోంది.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇతిశ్రుత్వా వచస్తస్యాః పార్వత్యా మునిసత్తమః ।**
**పంచాక్షరం శంభుమంత్రం విధిపూర్వముపాదిశః ॥33॥**

ఓ మహర్షీ! పార్వతియొక్క పలుకులను విని, శివపంచాక్షరీ మహామంత్రాన్ని యథావిధిగా ఆమెకు నీవు ఉపదేశించావు.

**అవోచశ్చ వచస్తాం త్వం శ్రద్ధాముత్పాదయన్మునే ।**
**ప్రభావం మంత్రరాజస్య తస్య సర్వాధికం మునే ॥34॥**

నీవామంత్రముయొక్క సర్వశ్రేష్ఠమైన మహిమను చెప్పి ఆమెకు దానిపై శ్రద్ధను కలిగించావు.

**నారద ఉవాచ –** నారదుడు చెప్పాడు.

**శ్రుణు దేవి మనోరస్య ప్రభావం పరమాద్భుతమ్ ।**
**యస్య శ్రవణమాత్రేణ శంకరస్సుప్రసీదతి ॥35॥**

ఓ దేవీ! ఈ మంత్రముయొక్క పరమాశ్చర్యకరమైన మహిమను వినుము. శంకరుడీ మంత్రాన్ని వినినంత మాత్రాన మిక్కిలి ప్రసన్నుడౌతాడు.

**మంత్రోఽయం సర్వమంత్రాణామధిరాజశ్చ కామదః ।**
**భుక్తిముక్తిప్రదోఽత్యంతం శంకరస్య మహాప్రియః ॥36॥**

శంకరునకత్యంత ప్రీతిపాత్రమైన ఈ మంత్రం మంత్రాలలోకెల్ల గొప్పది. కోర్కెలను, భక్తిని, ముక్తిని ప్రసాదిస్తుంది.

**సుభగే యేన జప్తేన విధినా సోఽచిరాద్ ద్రుతమ్ ।**
**ఆరాధితస్తే ప్రత్యక్షో భవిష్యతి శివో ధ్రువమ్ ॥37॥**

ఓ పార్వతీ! నీవు యథావిధిగా దీనిని జపించుము. నీవు శివుని ఆరాధించినచో శివుడు నీకు శీఘ్రంగా ప్రత్యక్షం కాగలడు. ఇది నిశ్చయం.

**చింతయంతీ చ తద్రూపం నియమస్థా శరాక్షరమ్ ।**
**జపమంత్రం శివే త్వం హి సంతుష్యతి శివో ద్రుతమ్ ॥38॥**

ఓ పార్వతీ! నీవు నియమాలను పాటిస్తూ, శివుని రూపాన్ని స్మరిస్తూ, ఈ పంచాక్షరీ మంత్రాన్ని జపించుము. శివుడు శీఘ్రమే నీయందు ప్రసన్నుడు కాగలడు.

**ఏవం కురు తపస్సాధ్వి తపస్సాధ్యో మహేశ్వరః ।**
**తపస్యేవ ఫలం సర్వైః ప్రాప్యతే నాన్యథా క్వచిత్ ॥39॥**

ఓ సాధ్వీ! నీవీ తీరున తపస్సు చేయుము. మహేశ్వరుడు తపస్సుచే ప్రసన్నుడవుతాడు. సర్వప్రాణులు తపస్సుచేతనే ఫలాన్ని పొందుతున్నాయి. మరియొక ఉపాయం లేదు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏవముక్త్వా తదా కాళీం నారద త్వం శివప్రియః ।**
**యాదృచ్ఛికోఽగమస్త్వం తు స్వర్గం దేవహితే రతః ॥40॥**

ఓ నారదా! శివునకిష్టుడవైన నీవప్పుడా పార్వతితో ఇట్లు పలికి, దేవతలకు హితాన్ని చేయగోరి, యథేచ్ఛగా స్వర్గానికి వెళ్ళియున్నావు.

**పార్వతీ చ తదా శ్రుత్వా వచనం తవ నారద ।**
**సుప్రసన్నా తదా ప్రాప పంచాక్షరమనుత్తమమ్ ॥41॥**

ఓ నారదా! అప్పుడా పార్వతీదేవి నీమాటలను విని, మిక్కిలి ప్రసన్నురాలై, సర్వశ్రేష్ఠమైన పంచాక్షరీ మంత్రాన్ని చేబట్టింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే నారదోపదేశం నామైక వింశోఽధ్యాయః ॥21॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో నారదోపదేశం అనే ఇరవై ఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్వావింశోఽధ్యాయః - ఇరవై రెండవ అధ్యాయం

## పార్వతీతపోవర్ణనమ్ - పార్వతి తపోవర్ణనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**త్వయి దేవమునే యాతే పార్వతీ హృష్టమానసా ।**
**తపస్సాధ్యం హరం మేనే తపోఽర్థం మన ఆదధే ॥1॥**

ఓ దేవర్షీ! నీవు వెళ్ళగానే పార్వతి సంతోషిచిన మనసుగలదై, శివుడు తపస్సుచే ప్రసన్నుడగునని తలంచి, తపమొనరించుటకు మనస్సులో నిశ్చయించుకున్నది.

**తతః సఖ్యౌ సమాదాయ జయాం చ విజయాం తథా ।**
**మాతరం పితరం చైవ సఖీభ్యాం పర్యపృచ్ఛత ॥2॥**

అనంతరం జయవిజయలనే, తన చెలికత్తెలిరువురిని తోడ్కొని, తల్లింద్రుల వద్దకు వెళ్ళి, వారిచే తల్లిదండ్రుల నడిగించింది.

**ప్రథమం పితరం గత్వా హిమవంతం నగేశ్వరమ్ ।**
**పర్యపృచ్ఛత్సుప్రణమ్య వినయేన సమన్వితా ॥3॥**

ముందుగా పర్వతరాజు, తన తండ్రియునైన హిమవంతుని వద్దకు వెళ్ళి, వినయముతో కూడినదై, ప్రణమిల్లి ఇట్లు అడిగించింది.

**సఖ్యావూచతుః** - సఖులు అడిగారు.

**హిమవన్ శ్రూయతాం పుత్రీవచనం కథ్యతేఽధునా ।**
**సా స్వయం చైవ దేహస్య రూపస్యాపి తథా పునః ॥4॥**

**భవతో హి కులస్యాస్య సాఫల్యం కర్తుమిచ్ఛతి ।**
**తపసా సాధనీయోఽసౌ నాన్యథా దృశ్యతాం వ్రజేత్ ॥5॥**

ఓ హిమవంతుడా! మీ కుమార్తె మనసులోని మాటలను మేమిపుడు చెప్పెదము. ఆమె తన దేహానికి, సౌందర్యానికి అంతేగాక నీ యీ కులానికి సార్థకత చేకూర్చాలని కోరుకుంటోంది. ఈ శివుడు తపస్సునకు మాత్రమే లొంగును. తపస్సు చేయనిచో ఆయన దర్శనమీయడు.

**తస్మాచ్చ పర్వతశ్రేష్ఠ దేయాఽజ్ఞా భవతాధునా ।**
**తపః కరోతు గిరిజా వనం గత్వేతి సాదరమ్ ॥6॥**

కాబట్టి ఓ పర్వతరాజా! మీరిప్పుడు అనుమతినీయండి. పార్వతి ప్రేమపూర్వకమైన ఆజ్ఞను పొంది, అడవికి వెళ్ళి తపస్సుచేయునుగాక!

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవం చ తదా పృష్టస్సఖీభ్యాం మునిసత్తమ ।**
**పార్వత్యా సువిచార్యాథ గిరి రాజోఽబ్రవీదిదమ్ ॥7॥**

ఓ మహర్షీ! పార్వతి చెలికత్తెలిరువురు ఈవిధంగా కోరగా పర్వతరాజు చక్కగా ఆలోచించి, ఈవిధంగా పలికాడు.

**హిమాలయ ఉవాచ -** హిమాలయుడు పలికాడు.

**మహ్యం చ రోచతేఽత్యర్థం మేనాయై రుచ్యతాం పునః ।**
**యథేదం భవితవ్యం చ కిమతః పరముత్తమమ్ ॥8॥**

ఇది నాకు సమ్మతమే. కాని, మేనక సమ్మతము కావాలిగదా! భవిష్యత్తు ఈవిధంగానే జరిగినచో అంతకంటె ఉత్తమమైన విషయమేముంటుంది?

**సాఫల్యం తు మదీయస్య కులస్య చ న సంశయః ।**
**మాత్రే తు రుచ్యతే చేద్వై తతః శుభతరం ను కిమ్ ॥9॥**

ఈమె తపస్సు చేస్తే నాకులం సార్థకమౌతుందనడంలో సందేహం లేదు. కాబట్టి ఈమె తల్లికి సమ్మతమైతే అంతకంటె గొప్ప శుభం మరియొకటి యేమికలదు?

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవం వచనం పిత్రా ప్రోక్తం శ్రుత్వా తు తే తదా ।**
**జగ్మతుర్మాతరం సఖ్యౌ తదాజ్ఞప్తే తయా సహ ॥10॥**

హిమవంతుని మాటలను విని, చెలికత్తెలిద్దరు ఆమెతోగూడి, తల్లిఅనుమతి పొందడానికి ఆమె వద్దకు వెళ్ళారు.

**గత్వా తు మాతరం తస్యాః పార్వత్యాస్తే చ నారద ।**
**సుప్రణమ్య కరౌబద్ధ్వోచతుర్వచనమాదరాత్ ॥11॥**

ఓ నారదా! వారిరువురు పార్వతి తల్లివద్దకు వెళ్ళి, ఆమెకు చేతులు జోడించి, నమస్కరించి, ఆదరంతో ఇలా అన్నారు.

**సఖ్యావూచతుః -** సఖులు పలికారు.

**మాతస్త్వం వచనం పుత్ర్యాః శృణు దేవి నమోఽస్తు తే ।**
**సుప్రసన్నతయా తద్వై శ్రుత్వా కర్తుమిహార్హసి ॥12॥**

ఓ తల్లీ! నీవు నీ కుమార్తెయొక్క మనసులోని మాటను వినుము. ఓ దేవీ! నీకు నమస్కారము. ఆమె మాటను ప్రసన్నమైన మనస్సుతో విని, నీవు ఆచరించ తగినదానవు.

**తప్తుకామా తు తే పుత్రీ శివార్థం పరమం తపః ।**
**ప్రాప్తానుజ్ఞా పితుశ్చైవ తుభ్యం చ పరిపృచ్ఛతి ॥13॥**

నీ కుమార్తె శివుని కొరకు తపస్సును చేయగోరుచున్నది. ఆమె పరమతపస్సును చేయడానికి తండ్రిగారి అనుమతి లభించింది. ఇప్పుడామె నీ అనుమతిని కోరుతోంది.

**ఇయం స్వరూపసాఫల్యం కర్తుకామా పతివ్రతే ।**
**త్వదాజ్ఞా యది జాయేత తప్యతే చ తథా తపః ॥14॥**

ఓ పతివ్రతా! ఈమె తన స్వరూపాన్ని సఫలం చేయగోరుతోంది. నీవు అనుమతించినచో ఆమె ఈ ఆకాంక్షను సత్యం చేయడానికి తపస్సు చేస్తుంది.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా చ తతస్సఖ్యౌ తూష్ణీమాస్తాం మునీశ్వర ।**
**నాంగీచకార మేనా సా తద్వాక్యం ఖిన్నమానసా ॥15॥**

ఓ మునీశ్వరా! ఆ సఖురాండ్రిద్దరు ఈవిధంగా పలికి మిన్నకున్నారు. కాని ఖేదాన్ని పొందిన మనస్సుగల మేనాదేవి వారిమాటను అంగీకరించలేదు.

**తతస్సా పార్వతీ ప్రాహ స్వయమేవాథ మాతరమ్ ।**
**కరౌ బద్ధ్వా వినీతాత్మా స్మృత్వా శివపదాంబుజమ్ ॥16॥**

అప్పుడా పార్వతి వినయంతో నిండిన మనస్సు గలదై, శివుని పాదపద్మాలను స్మరించి,తల్లికి చేతులు జోడించి, నమస్కరించి స్వయంగా ఇలాపలికింది.

**పార్వత్యువాచ** – పార్వతి పలికింది.

**మాతస్తప్తుం గమిష్యామి ప్రాతః ప్రాప్తుం మహేశ్వరమ్ ।**
**అనుజానీహి మాం గంతుం తపసేఽద్య తపోవనమ్ ॥17॥**

తల్లీ! నేను మహేశ్వరుని పొందగోరి, తపస్సుచేయడానికి ఉదయమే వెళ్తాను. తపస్సుకొరకు తపోవనానికి వెళ్ళడానికి నాకు అనుమతినివ్వండి.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచః పుత్ర్యా మేనా దుఃఖముపాగతా ।**
**సోపాహూయ తదాపుత్రీమువాచ వికలా సతీ ॥18॥**

కుమార్తె మాటలు విని, మేనాదేవి దుఃఖితురాలయ్యింది. ఆమె మనస్సు వికలమయ్యింది. ఆమె కుమార్తెను దగ్గరకు పిలిచి, ఇలా పలికింది.

**మేనోవాచ** - మేనకాదేవి పలికింది.

**దుఃఖితాసి శివే పుత్రి తపస్తప్తుం పురా యది ।**
**తపశ్చర గృహేఽద్య త్వం న బహిర్గచ్ఛ పార్వతి ॥19॥**

హే శివే! పుత్రీ! పూర్వం తపస్సుచేసి, దుఃఖాన్ని పొందావు. ఇపుడింటిలోనుండి తపస్సు చేయుము. పార్వతీ! బయటకు వెళ్ళకుము.

**కుత్ర యాసి తపః కర్తుం దేవాస్సంతి గృహే మమ ।**
**తీర్థాని చ సమస్తాని క్షేత్రాణి వివిధాని చ ॥20॥**

నీవు తపస్సు చేయడానికి ఎక్కడికి వెళతావు? నాఇంటిలోనే దేవతలందరు ఉన్నారు. ఇక్కడనే సర్వతీర్థాలు, వివిధ క్షేత్రాలు ఉన్నాయి.

**కర్తవ్యో న హఠః పుత్రి! గంతవ్యం న బహిః క్వచిత్ ।**
**సాధితం కిం త్వయా పూర్వం పునః కిం సాధయిష్యసి ॥21॥**

పుత్రీ! మొండితనాన్ని వీడుము. బయటకు ఎక్కడికీ వెళ్ల పనిలేదు. పూర్వం నీవు సాధించిందేమిటి? భవిష్యత్తులో నీవు సాధించబోయేదేమిటి?

**శరీరం కోమలం వత్సే తపస్తు కఠినం మహత్ ।**
**ఏతస్మాత్తు త్వయా కార్యం తపోఽత్ర న బహిర్వ్రజ ॥22॥**

అమ్మాయి! నీ శరీరం సుకుమారమైనది. తపస్సు చాల క్లేశాలతో కూడినది. కాబట్టి నీవు ఇక్కడనే యుండి, తపస్సుచేయి. బయటకు వెళ్ళవద్దు.

**స్త్రీణాం తపోవనగతిర్న శ్రుతా కామనార్థినీ ।**
**తస్మాత్త్వం పుత్రి మాకార్షీ స్తపోఽర్థం గమనం ప్రతి ॥23॥**

ఓ పుత్రీ! కోర్కెలను సిద్ధింపజేసుకొనడానికి స్త్రీలు తపోవనాలకు వెళ్ళారనేమాట ఇంతకుముందు నేను వినియుండలేదు. కాబట్టి నీవు తపస్సుకొరకు వెళ్ళాలను తలంపు చేయవద్దు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవం బహుధా పుత్రీ తన్మాత్రా వినివారితా ।**
**సంవేదే న సుఖం కించిద్వినారాధ్య మహేశ్వరమ్ ॥24॥**

ఈవిధంగా తల్లి తన కుమార్తెను అనేక విధాలుగా వారించింది. ఆమె మహేశ్వరుని ఆరాధించని ఆ స్థితిలో లేశమైనా సుఖాన్ని పొందలేకపోయింది.

**తపోనిషిద్ధా తపసే వనం గంతుం చ మేనయా ।**
**హేతునా తేన సోమేతి నామ ప్రాప శివా తదా ॥25॥**

మేన పార్వతిని తపస్సు కొరకు వనాలకు వెళ్లవద్దని నిషేధించడంచేత మంగళస్వరూపురాలైన పార్వతికి 'ఉమా (ఉ, మా : అమ్మాయీ! వద్దు)' అనే పేరు స్థిరమయ్యింది.

**అథ తాం దుఃఖితాం జ్ఞాత్వా మేనా శైలప్రియా శివామ్ ।**
**నిదేశం సా దదౌ తస్యాః పార్వత్యాస్తపసే మునే ॥26॥**

ఓ మహర్షీ! హిమవంతుని భార్యయైన మేనాదేవి తన కుమార్తెయైన శివాదేవి దుఃఖించడాన్ని చూసింది. అప్పుడామె పార్వతికి తపస్సు చేసుకోవడానికి అనుమతినిచ్చింది.

**మాతురాజ్ఞాం చ సంప్రాప్య సువ్రతా మునిసత్తమ ।**
**తతః స్వాంతే సుఖం లేభే పార్వతీ స్మృతశంకరా ॥27॥**

ఓ మునిసత్తమా! సువ్రతయైన పార్వతి తల్లి అనుమతిని పొంది, శంకరుని స్మరించి, తన అంతరంగంలో సుఖాన్ని పొందింది.

**మాతరం పితరం సాథ ప్రణిపత్య ముదా శివా ।**
**సఖీభ్యాం చ శివం స్మృత్వా తపస్తప్తుం సముద్గతా ॥28॥**

అప్పుడాపార్వతి తల్లిదండ్రులకు ఆనందంతో ప్రణమిల్లి, చెలికత్తెలిరువురితోగూడి, శివుని స్మరించి, తపస్సు చేయడానికి బయలుదేరింది.

**హిత్వా మతాన్యనేకాని వస్త్రాణి వివిధాని చ ।**
**వల్కలాని ధృతాన్యాశు మౌంజీం బధ్వా తు శోభనామ్ ॥29॥**

ఆమె తనకు ప్రీతిపాత్రమైన వివిధ వస్త్రాలను విడిచి, నారబట్టలను ధరించి, ముంజిత్రాడును నడుముకు బంధించుకొని శోభిల్లింది.

**హిత్వా హారం తథా చర్మ మృగస్య పరమం ధృతమ్ ।**
**జగామ తపసే తత్ర గంగావతరణం ప్రతి ॥30॥**

ఆమె హారాన్ని వీడి, మృగచర్మాన్ని ధరించి, తపస్సు చేయడానికి గంగానది దివినుండి భువికి అవతరించిన స్థలానికి చేరుకుంది.

**శంభునా కుర్వతా ధ్యానం యత్ర దగ్ధో మనోభవః ।**
**గంగావతరణో నామ ప్రస్థో హిమవతస్స చ ॥31॥**

గంగావతరణమని ప్రసిద్ధిగాంచిన ఆ హిమవంతుని శిఖరం పైననే శంభుడు ధ్యానంచేస్తూ విఘ్నకారకుడైన మన్మథుని దహించాడు.

**హరశూన్యోఽథ దదృశే స ప్రస్థో హిమభూభృతః ।**
**కాళ్యా తత్రేత్య భోస్తాత పార్వత్యా జగదంబయా ॥32॥**

హిమవంతుని ఆ శిఖరానికి జగదంబయైన పార్వతీదేవి విచ్చేసింది. ఓ వత్సా! అచ్చట ఆమెకు శివుడెచ్చటను కానరాలేదు.

**యత్ర స్థిత్వా పురా శంభుస్తప్తవాన్దుస్తరం తపః ।**
**తత్ర క్షణం తు సా స్థిత్వా బభూవ విరహార్దితా ॥33॥**

ఏ స్థలంలో పూర్వం శంభుడు ఘోరమైన తపస్సు నాచరించాడో, అదే స్థలంలో ఆమె క్షణకాలం నిలబడి, విరహంచే దుఃఖితురాలయ్యింది.

**హా హరేతి శివా తత్ర రుదంతీ సా గిరేస్సుతా ।**
**విలలాపాతిదుఃఖార్తా చింతాశోకసమన్వితా ॥34॥**

ఆ పార్వతీదేవి చింతాశోకాలతో నిండిన మనస్సుతో మిక్కిలి దుఃఖితురాలై "హా! హరా!" అని బిగ్గరగా రోదించింది.

**తతశ్చిరేణ సా మోహం ధైర్యాత్ సంస్తభ్య పార్వతీ ।**
**నియమాయాఽభవత్తత్ర దీక్షితా హిమవత్సుతా ॥35॥**

తర్వాత చాలసేపటికి మోహాన్ని వీడి, ధైర్యాన్ని వహించి, తపోనియమాలనారంభించడానికి దీక్షను గైకొంది.

**తపశ్చకార సా తత్ర శృంగితీర్థే మహోత్తమే ।**
**గౌరీశిఖరనామాసీత్తత్తపః కారణాద్ధి తత్ ॥36॥**

పరమపవిత్రతీర్థమైన ఆ శిఖరంపై ఆమె తపస్సు చేసింది. ఆమె తపస్సు చేయడంవల్ల ఆ శిఖరానికి **"గౌరీశిఖరం"** అని పేరువచ్చింది.

**సుందరాశ్చ ద్రుమాస్తత్ర పవిత్రాశ్శివయా మునే ।**
**ఆరోపితాః పరీక్షార్థం తపసః ఫలభాగినః ॥37॥**

ఓ మహర్షీ! తపస్సు చేసిన కాలంయొక్క గణన కొరకు ఆమె అచ్చట సుందరమైనవి, పవిత్రమైనవి, ఫలాల నిచ్చేవియైన వృక్షాలను నాటింది.

**భూమిశుద్ధిం తతః కృత్వా వేదీం నిర్మాయ సుందరీ ।**
**తథా తపస్సమారబ్ధం మునీనామపి దుష్కరమ్ ॥38॥**

సుందరియైన శివాదేవి అచట భూమిని శుద్ధి చేసి, వేదికను నిర్మించిన అనంతరం మునులకైన చేయుటకు శక్యంకాని కఠినమైన తపస్సును చేయడం ప్రారంభించింది.

**విగృహ్య మనసా సర్వాణీంద్రియాణి సహాశు సా ।**
**సముపస్థానికే తత్ర చకార పరమం తపః ॥39॥**

ఆమె వెనువెంటనే మనస్సును, ఇంద్రియాలనన్నింటిని నిగ్రహించి, శివుడు తపస్సుచేసిన స్థానానికి సమీపంలో గొప్ప తపస్సు చేసింది.

**గ్రీష్మే చ పరితో వహ్నిం ప్రజ్వలంతం దివానిశమ్ ।**
**కృత్వా తస్థౌ చ తన్మధ్యే సతతం జపతీ మనుమ్ ॥40॥**

ఆమె గ్రీష్మకాలంలో చుట్టూ అగ్ని ప్రజ్వరిల్లుచుండగా మధ్యలో కూర్చుండి, రాత్రింబవళ్ళు నిరంతరంగా మంత్రాన్ని జపించింది.

**సతతం చైవ వర్షాసు స్థండిలే సుస్థిరాసనా ।**
**శిలాపృష్ఠే చ సంసిక్తా బభూవ జలధారయా ॥41॥**

ఆమె వర్షాకాలంలో వేదికపై స్థిరాసనంలో కూర్చుండి, లేదా రాయిపై కూర్చుండి, నిరంతరంగా జపం చేస్తూ ఉండగా ఆమెపై జలధారలు వర్షించేవి.

**శీతే జలాంతరే శశ్వత్తస్థౌ సా భక్తితత్పరా ।**
**అనాహారాఽతపత్తత్ర నీహారేషు నిశాసు చ ॥42॥**

భక్తితత్పరురాలైన పార్వతి ఆహారం లేనిదై, శీతాకాలంలో మంచుకురిసే రాత్రులందుకూడా నిరంతరంగా నీటిమధ్యలో నిలబడి తపస్సు చేసింది.

**ఏవం తపః ప్రకుర్వాణా పంచాక్షరజపే రతా ।**
**దధ్యౌ శివం శివా తత్ర సర్వకామఫలప్రదమ్ ॥43॥**

ఆ విధంగా శివాదేవి పంచాక్షరీజపంలో నిమగ్నురాలై తపస్సు చేస్తూ, సకల అభీష్ట ఫలాలను ఇచ్చే శివుని ధ్యానించింది.

**స్వారోపితాఞ్ఛుభాన్వృక్షాన్సఖీభిస్సించతీ ముదా ।**
**ప్రత్యహం సావకాశే సా తత్రాతిథ్యమకల్పయత్ ॥44॥**

ఆమె ప్రతిదినము చెలికత్తెలతోకూడి, తాను నాటిన శుభకరమైన, వృక్షాలకు నీరు పోసేది. ఆమె అచ్చట అతిథులకు ఆనందంతో స్వాగతసత్కారాలు చేసేది.

**వాతశ్చైవ తథా శీతవృష్టిశ్చ వివిధా తథా ।**
**దుస్సహోఽపి తథా ధర్మస్తయా సేహే సుచిత్తయా ॥45॥**

దృఢమైన చిత్తం గల పార్వతి సహింప శక్యంగాని గాలిని, చలిని, వర్షాన్ని, ఎండలను, ఇటువంటి వివిధ వాతావరణాలను సహించింది.

**దుఃఖం చ వివిధం తత్ర గణితం న తయా గతమ్ ।**
**కేవలం మన ఆధాయ శివే సాసీత్ స్థితా మునే ॥46॥**

ఓ మహర్షీ! ఆమె తనకు సంప్రాప్తమైన వివిధ దుఃఖాలను గణించలేదు. ఆమె మనస్సును శివునియందు మాత్రమే లగ్నం చేసి, నిర్వికారంగా ఉంది.

**ప్రథమం ఫలభోగేన ద్వితీయం పర్ణభోజనైః ।**
**తపః ప్రకుర్వతీ దేవీ క్రమాన్నిత్యేఽమితాః సమాః ॥47॥**

పార్వతీదేవి ప్రారంభంలో ఫలాలను తిని తపస్సు చేసింది. తదనంతరం పత్రాలను భుజించి తపస్సుచేసింది. ఈవిధంగా ఆమె అనేక సంవత్సరాలు తపస్సులో గడిపింది.

**తతః పర్ణాన్యపి శివా నిరస్య హిమవత్సుతా ।**
**నిరాహారాఽభవద్దేవీ తపశ్చరణసంరతా ॥48॥**

హిమవత్పుత్రియైన శివాదేవి అనంతరకాలంలో పర్ణములను కూడా విడనాడి, ఆహారమును భుజించకుండగనే తపస్సు చేయడంలో నిమగ్నమయ్యింది.

**ఆహారే త్యక్తపర్ణాభూద్యస్మాద్ధిమవతః సుతా ।**
**తేన దేవైరపర్ణేతి కథితా నామతః శివా ॥49॥**

ఆమె పర్ణములను కూడా భుజించుట మానివేసినందున దేవతలు పార్వతీదేవిని **"అపర్ణ"** అనే నామంతో కొనియాడారు.

**ఏకపాదస్థితా సాసీచ్ఛివం సంస్మృత్య పార్వతీ ।**
**పంచాక్షరం జపంతీ చ మనుం తేపే తపో మహత్ ॥50॥**

పార్వతీదేవి ఒంటికాలిపై నిలబడి, శివుని స్మరిస్తూ, పంచాక్షర మంత్రాన్ని జపిస్తూ, గొప్ప తపస్సును ఆచరించింది.

**చీరవల్కలసంవీతా జటాసంఘాతధారిణీ ।**
**శివచింతనసంసక్తా జిగాయ తపసా మునీన్ ॥51॥**

నారబట్టలను ధరించిన ఆమె కేశములు జడలు కట్టాయి. శివచింతనయందు సంసక్తమైన మనస్సుగల ఆమె తపస్సు చేయడంలో మునులను కూడా జయించింది.

**ఏవం తస్యాస్తపస్యన్త్యా చింతయంత్యా మహేశ్వరమ్ ।**
**త్రీణి వర్షసహస్రాణి జగ్ముః కాల్యాస్తపోవనే ॥52॥**

ఈ విధంగా ఆ కాళి మహేశ్వరుని ధ్యానిస్తూ, తపోవనంలో తపస్సు చేస్తూ ఉండగా మూడువేల సంవత్సరాలు గడిచిపోయాయి.

**షష్టి వర్షసహస్రాణి యత్ర తేపే తపో హరః ।**
**తత్ర క్షణమథోషిత్వా చింతయామాస సా శివా ॥53॥**

ఏ స్థానంలో శివుడు అరవైవేల సంవత్సరాలు తపమాచరించాడో ఆ స్థానంలో పార్వతి కొంతసేపు కూర్చుండి ఈ విధంగా తలంచింది.

**నియమస్థాం మహాదేవ కిం మాం జానాసి నాధునా ।**
**యేనాహం సుచిరం తేన నానుయాతా తపోరతా ॥54॥**

ఓ మహాదేవా! నేను చిరకాలంనుండి తపస్సు చేస్తున్నాను నీవు నన్నుగ్రహించడంలేదు. నేనీ నియమంలో ఉన్నాననే విషయం నీకింతవరకు తెలియదా ఏమి?

**లోకే వేదే చ గిరిశో మునిభిర్గీయతే సదా ।**
**శంకరస్స హి సర్వజ్ఞస్సర్వాత్మా సర్వదర్శనః ॥55॥**

లోకంలోని భక్తులు, వేదాలు, మహర్షులు, శంకరుడు కైలాసగిరివాసి అనియు, సర్వజ్ఞుడనియు, సర్వాత్మ స్వరూపుడనియు, సర్వసాక్షి అనియు సర్వదా కీర్తిస్తారు కదా!.

**సర్వభూతిప్రదో దేవస్సర్వభావానుభావనః ।**
**భక్తాభీష్టప్రదో నిత్యం సర్వక్లేశనివారణః ॥56॥**

ఆ దేవుడు సర్వసంపదలనిచ్చువాడు. సర్వభావానుభావనుడు, భక్తాభీష్టప్రదుడు, సర్వక్లేశ నివారకుడు కదా!

**సర్వకామాన్పరిత్యజ్య యది చాహం వృషధ్వజే ।**
**అనురక్తా తదా సోఽత్ర సంప్రసీదతు శంకరః ॥57॥**

నేను సర్వకామాలను పరిత్యజించి, శివునియందు అనురాగం కలిగియున్నదాననైనచో వృషధ్వజుడైన శంకరుడు నన్ననుగ్రహించుగాక!

**యది నారద తంత్రోక్తమంత్రో జప్తశ్శరాక్షరః ।**
**సుభక్త్యా విధినా నిత్యం సంప్రసీదతు శంకరః ॥58॥**

నారదుడుపదేశించిన పంచాక్షరమంత్రాన్ని తంత్రపూర్వకంగా భక్తితో యథావిధిగా ప్రతిదినం నేను జపించి యున్నచో శంకరుడు ప్రసన్నుడగుగాక!

**యది భక్త్యా శివస్యాహం నిర్వికారా యథోదితమ్ ।**
**సర్వేశ్వరస్య చాత్యంతం సంప్రసీదతు శంకరః ॥59॥**

నేను వికారములు లేనిదాననై, సర్వేశ్వరుడైన శివుని భక్తితో యథావిధిగా ఆరాధించియున్నచో శంకరుడు ప్రసన్నుడగుగాక!

**ఏవం చింతయతీ నిత్యం తేపే సా సుచిరం తపః ।**
**అధోముఖీ నిర్వికారా జటావల్కలధారిణీ ॥60॥**

ఈ విధంగా నిత్యం చింతిస్తూ ఆమె జటావల్కలధారిణియై, నిర్వికారయై, తలను వంచుకుని చిరకాలం తపమాచరించింది.

**తథా తయా తపస్తప్తం మునీనామపి దుష్కరమ్ ।**
**స్మృత్వా చ పురుషాస్తత్ర పరమం విస్మయం గతాః ॥61॥**

ఆమె ఆవిధంగా మునులకు కూడా దుష్కరమైన తపమునాచరించింది. అచ్చటి వ్యక్తులు ఆమె తపస్సు గుర్తుకు వచ్చినప్పుడు మిక్కిలి ఆశ్చర్యాన్ని పొందేవారు.

**తత్తపోదర్శనార్థం హి సమాజగ్ముశ్చ తేఽఖిలాః ।**
**ధన్యాన్నిజాన్మన్యమానా జగదుశ్చేతి సమ్మతాః ॥62॥**

వారందరు ఆమె తపస్సును చూడడానికి వచ్చి, తాము ధన్యులమయ్యామని తలంచుచు, ఆమె తపోమహిమ విషయంలో వారందరు ఒకే అభిప్రాయంలో ఉండేవారు

**మహతాం వృద్ధిధర్మేషు గమనం శ్రేయ ఉచ్యతే ।**
**ప్రమాణం తపసో నాస్తి మాన్యో ధర్మస్సదా బుధైః ॥63॥**

మహాత్ములు ఆచరించే గొప్ప ధర్మాలను అనుసరించుట శ్రేయోదాయకమని పెద్దలు చెబుతారు. తపస్సునకు ప్రమాణంలేదు. వివేకులు సర్వదా ధర్మాన్ని ఆదరించాలికదా!

**శ్రుత్వా దృష్ట్వా తపోఽస్యాస్తు కిమన్యైః క్రియతే తపః ।**
**అస్మాత్తపోఽధికం లోకే న భూతం న భవిష్యతి ॥64॥**

ఈమె చేసే తపస్సుగురించి విని, చూచి, ఇతరులు తపస్సునేల కొనసాగిస్తున్నారు? ఈమె తపస్సుకంటే అధికమైన తపస్సు లోకంలో ఇంతకుముందు లేదు. భవిష్యత్తులో ఉండబోదు.

**జల్పంత ఇతి తే సర్వే సుప్రశస్య శివాతపః ।**
**జగ్ముః స్వం ధామ ముదితాః కఠినాంగాశ్చ యే హ్యపి ॥65॥**

వారందరు ఈవిధంగా పలుకుతు పార్వతి తపస్సును అధికంగా ప్రశంసిస్తూ ఆనందంతో తమ స్థానాలకు వెళ్ళారు. రాటుదేలిన దేహం కలవారు కూడా ఆమె తపస్సునకు విస్తుపోయారు.

**అన్యచ్ఛృణు మహర్షే త్వం ప్రభావం తపసోఽధునా ।**
**పార్వత్యా జగదంబాయాః పరాశ్చర్యకరం మహత్ ॥66॥**

ఓ మహర్షీ! ఆమె తపోమహిమనుగూర్చి మరొక విషయం చెబుతాను విను. జగదంబయైన పార్వతియొక్క గొప్పదైనతపస్సు పరమాశ్చర్యాన్ని కలిగిస్తుంది.

**తదాశ్రమగతా యే చ స్వభావేన విరోధినః ।**
**తేప్యాసంస్తత్ప్రభావేణ విరోధరహితాస్తదా ॥67॥**

సహజవిరోధంగల జంతువులుకూడా ఆమె ఆశ్రమం వద్దకు వెళ్ళిన వెంటనే ఆమె తపఃప్రభావంచే విరోధాన్ని వీడి, సహజీవనం చేసేవి.

**సింహా గావశ్చ సతతం రాగాదిదోషసంయుతాః ।**
**తన్మహిమ్నా చ తే తత్ర నాబాధంత పరస్పరమ్ ॥68॥**

ఆమెయొక్క మహిమచే గోవులకు నిత్యవిరోధియైన సింహాది క్రూరమృగాలు కూడ ఇతర మృగాలను బాధించడం మానివేశాయి. మృగాలలోకూడ రాగద్వేషాదిదోషాలు అదృశ్యమయ్యాయి.

**అథాన్యే చ మునిశ్రేష్ఠ మార్జారా మూషకాదయః ।**
**నిసర్గాద్వైరిణో యత్ర విక్రియంతే స్మ న క్వచిత్ ॥69॥**

ఓ మునిశ్రేష్ఠా! పిల్లి ఎలుక మున్నగు సహజవైరంగల ఇతరజంతువులుకూడా అచ్చట ఏ కాలమునందైనప్పటికి ఏ వికారాన్ని పొందకుండా జీవించేవి.

**వృక్షాశ్చ సఫలాస్తత్ర తృణాని వివిధాని చ ।**
**పుష్పాణి చ విచిత్రాణి తత్రాసన్మునిసత్తమ ॥70॥**

ఓ మహర్షీ! అచ్చటి చెట్లు చక్కని ఫలాలనిచ్చేవి. వివిధ తృణధాన్యములు విరివిగానున్నవి. చిత్ర విచిత్రమైన పుష్పాలతో ఆస్థలం ప్రకాశించింది.

**తద్వనం చ తదా సర్వం కైలాసేనోపమాన్వితమ్ ।**
**జాతం చ తపసస్తస్యాస్సిద్ధిరూపమభూత్తదా ॥71॥**

ఆకాలంలో "ఆమె తపస్సిద్ధియే వనరూపాన్ని ధరించిందా!" అన్నట్లుగా ఆ వనమంతా కైలాసంవలె ప్రకాశించింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే పార్వతీతపోవర్ణనం నామ ద్వావింశోఽధ్యాయః ॥22॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో పార్వతితపోవర్ణనం అనే ఇరవై రెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయోవింశోఽధ్యాయః - ఇరవై మూడవ అధ్యాయం

## పార్వతీసాంత్వన శివదేవదర్శనవర్ణనమ్ - పార్వతిని ఓదార్చుట మరియు శివదేవునిదర్శనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏవం తపంత్యాం పార్వత్యాం శివప్రాప్తౌ మునీశ్వర ।**
**చిరకాలో వ్యతీయాయ ప్రాదుర్భూతో హరో న హి ॥1॥**

ఓ దేవర్షీ! శివప్రాప్తి కొరకు పార్వతి తపస్సుచేస్తూ ఉండగా చాలాకాలం గడిచిపోయింది. కాని శివుడు సాక్షాత్కరించలేదు.

**హిమాలయస్తదాగత్య పార్వతీం కృతనిశ్చయామ్ ।**
**సభార్యస్ససుతామాత్య ఉవాచ పరమేశ్వరీమ్ ॥2॥**

అపుడు హిమవంతుడు భార్యతోను, కుమారులతోను మంత్రులతోను గూడి అచ్చటికి వచ్చి, దృఢనిశ్చయంగల పార్వతితో ఇలా పలికాడు.

**హిమాలయ ఉవాచ** - హిమాలయుడు పలికాడు.

**మా ఖిద్యతాం మహాభాగే తపసానేన పార్వతి ।**
**రుద్రో న దృశ్యతే బాలే విరక్తో నాత్ర సంశయః ॥3॥**

ఓ పార్వతీ! నీవిట్లు తపస్సుచేస్తూ ఖేదాన్ని పొందకు. రుద్రుడు దర్శనమివ్వడంలేదు. ఆయన విరాగి అనడంలో సందేహం లేదు

**త్వం తన్వీ సుకుమారాంగీ తపసా చ విమోహితా ।**
**భవిష్యసి న సందేహస్సత్యం సత్యం వదామి తే ॥4॥**

నీవు సుకుమారాంగివి, నీవీ తపస్సునందు మిక్కిలి ఆసక్తురాలివి అయ్యావు. ఇందులో సందేహం లేదు. నేను ముమ్మాటికి సత్యాన్నే చెబుతున్నాను.

**తస్మాదుత్తిష్ఠ చైహి త్వం స్వగృహం వరవర్ణిని ।**
**కిం తేన తవ రుద్రేణ యేన దగ్ధః పురా స్మరః ॥5॥**

కాబట్టి నీవు లేచి నీ ఇంటికి రమ్ము. పూర్వం మన్మథుని బూడిదచేసిన రుద్రునితో నీకేమిపని?

**అతో హి నిర్వికారత్వాత్త్వామాదాతుం వరాం హరః ।**
**నాగమిష్యతి దేవేశి తం కథం ప్రార్థయిష్యసి ॥6॥**

ఓ దేవేశీ! ఆయన నిర్వికారుడు. కావున ఆయన నిన్ను వివాహమాడుటకు రాడు. ఆయనను నీవెట్లు కోరుకొంటావు?

**గగనస్థో యథా చంద్రో గ్రహీతుం నహి శక్యతే ।**
**తథైవ దుర్గమం శంభుం జానీహి త్వమిహానఘే ॥7॥**

ఓ పుణ్యాత్మురాలా! ఆకాశంలోనున్న చంద్రుని పట్టుకోవడం సాధ్యం కాదు. అట్లే శివుడుకూడా పొందశక్యం కానివాడని తెలుసుకో.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**తథైవ మేనయా చోక్తా తథా సహ్యాద్రిణా సతీ ।**
**మేరుణా మందరేణైవ మైనాకేన తథైవ సా ॥8॥**

**ఏవమన్యైః క్షితిధ్రైశ్చ క్రౌంచాదిభిరనాతురా ।**
**తథైవ గిరిజా ప్రోక్తా నానావాదవిధాయిభిః ॥9॥**

అదే విధంగా మేనాదేవికూడా చెప్పింది. అట్లే ఏమాత్రం బాధపడిని గిరిజతో సహ్యాద్రి, మేరువు, మందరపర్వతం, మైనాకుడు, క్రౌంచుడు తదితరులుకూడా అనేక యుక్తులు పలికి, అదేవిధంగా కోరారు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఏవం ప్రోక్తా యదా తన్వీ సా సర్వైస్తపసి స్థితా ।**
**ఉవాచ ప్రహసంత్యేవ హిమవంతం శుచిస్మితా ॥10॥**

వారందరు తపమాచరిస్తున్న ఆ సుందరితో ఈవిధంగా పలుకగా స్వచ్ఛమైన చిరునవ్వుగల పార్వతి నవ్వుతూ, హిమవంతునితో ఇలాపలికింది.

**పార్వత్యువాచ** – పార్వతి పలికింది.

**పురా ప్రోక్తం మయా తాత మాతః కిం విస్మృతం త్వయా ।**
**అధునాపి ప్రతిజ్ఞాం చ శృణుధ్వం మమ బాంధవాః ॥11॥**

తండ్రీ! నేను మీకు పూర్వం చెప్పాను. తల్లీ నీవు మర్చిపోయావా ఏమి? బంధువులారా! ఇపుడైనా నా ప్రతిజ్ఞను వినండి.

**విరక్తోఽసౌ మహాదేవో యేన దగ్ధో రుషా స్మరః ।**
**తం తోషయామి తపసా శంకరం భక్తవత్సలమ్ ॥12॥**

ఈ మహాదేవుడు విరాగి. ఆయన కోపించి, మన్మథుని భస్మం చేశాడు. భక్తవత్సలుడైన ఆ శంకరుని నేను తపస్సుతో సంతోషింపజేస్తాను.

**సర్వే భవంతో గచ్ఛంతు స్వం స్వం ధామ ప్రహర్షితాః ।**
**భవిష్యత్యేవ తుష్టోఽసౌ నాత్ర కార్యా విచారణా ॥13॥**

మీరందరు ఆనందంగా మీ మీ గృహాలకు వెళ్ళండి. శివుడు తప్పక ప్రసన్నుడౌతాడు. చింతించకండి.

**దగ్ధో హి మదనో యేన యేన దగ్ధం గిరేర్వనమ్ ।**
**తమానయిష్యే చాత్రైవ తపసా కేవలేన హి ॥14॥**

ఏ శివుడు మన్మథుని, హిమవంతుని వనాన్ని, తగులబెట్టాడో అట్టి శివుని కేవలం తపఃప్రభావంచే ఇదే స్థానానికి తీసుకొని వస్తాను.

**తపోబలేన మహతా సుసేవ్యో హి సదా శివః ।**
**జానీధ్వం హి మహాభాగాస్సత్యం సత్యం వదామి వః ॥15॥**

గొప్ప తపోబలంతో సదాశివుని సులభంగా సేవించవచ్చు. మహాత్ములారా! మీకు నేను ముమ్మాటికి సత్యాన్నే చెబుతున్నాను. మీరు తెలుసుకోండి.

**ఆభాష్య చైవం గిరిజా చ మేనకాం మైనాకబంధుం పితరం హిమాలయమ్ ।**
**తూష్ణీం బభూవాశు సుభాషిణీ శివా సమందరం పర్వతరాజబాలికా ॥16॥**

సుభాషిణియు, పర్వతరాజు కుమార్తెయునగు పార్వతి మేనకను, మైనాకుని, మందరుని, తండ్రియైన హిమవంతుని ఉద్దేశించి ఇట్లు పలికి మిన్నకున్నది.

**జగ్ముస్తథోక్తాః శివయా హి పర్వతా యథాగతేనాపి విచక్షణాస్తే ।**
**ప్రశంసమానా గిరిజాం ముహుర్ముహుః సువిస్మితా హేమనగేశ్వరాద్యాః ॥17॥**

పార్వతి ఇట్లు పలుకగా మేరువు మున్నగు జ్ఞానులైన పర్వతరాజులు విస్మితులై, పార్వతిని అనేక విధాలుగా ప్రశంసిస్తూ వచ్చినదారిని వెళ్ళారు.

**గతేషు తేషు సర్వేషు సఖీభిః పరివారితా ।**
**తపస్తేపే తదధికం పరమార్థ సునిశ్చయా ॥18॥**

వారందరు వెళ్ళగానే సఖురాండ్రతో కూడియున్న పార్వతి శివదర్శనమను పరమార్థమునందు దృఢనిశ్చయం కలిగినదై అంతకంటె అధికంగా తపమాచరించింది.

**తపసా మహతా తేన తప్తమాసీచ్చరాచరమ్ ।**
**త్రైలోక్యం హి మునిశ్రేష్ఠ సదేవాసురమానుషమ్ ॥19॥**

ఓ మునిశ్రేష్ఠా! ఆమె గొప్ప తపస్సుచే చరాచర జగత్తు, దేవాసుర మానుష గణాలతోకూడిన ముల్లోకాలు తాపాన్ని పొందాయి.

**తదా సురాసురాః సర్వే యక్షకిన్నరచారణాః ।**
**సిద్ధాస్సాధ్యాశ్చ మునయో విద్యాధరమహోరగాః ॥20॥**

**సప్రజాపతయశ్చైవ గుహ్యకాశ్చ తథాపరే ।**
**కష్టాత్ కష్టతరం ప్రాప్తాః కారణం న విదుః స్మ తత్ ॥21॥**

అప్పుడు దేవతలు, రాక్షసులు, యక్షులు, కిన్నరులు, చారణులు, సిద్ధులు, సాధ్యులు, మునులు, విద్యాధరులు, మహోరగులు, ప్రజాపతులు, గుహ్యకులు తదితరులందరు తీవ్రమైన కష్టాన్ని పొందారు. కాని, వారు పొందిన కష్టానికి గల కారణం వారెరుగలేదు.

**సర్వే మిలిత్వా శక్రాద్యా గురుమామంత్ర్య విహ్వలాః ।**
**సుమేరౌ తప్త సర్వాంగా విధిం మాం శరణం యయుః ॥22॥**

సర్వావయవములందును తాపాన్ని పొందిన ఇంద్రాది దేవతలందరు కంగారుపడి, ఒకచోగూడి, బృహస్పతిని పిలిచి, సుమేరు పర్వతమునందున్న నన్ను (బ్రహ్మను) శరణు జొచ్చారు.

**తత్ర గత్వా ప్రణమ్యాశు విహ్వలా నష్టసుత్విషః ।**
**ఊచుస్సర్వే చ సంస్తూయ హ్యైకపద్యేన మాం హి తే ॥23॥**

వారందరు నష్టమైన కాంతిగలవారై కంగారుపడుతు, అచ్చటకుచేరి, నన్ను స్తుతించి, ఒక్కమారుగా ఇలా పలికారు.

**దేవా ఊచుః** – దేవతలు పలికారు.

**త్వయా సృష్టమిదం సర్వం జగదేతచ్చరాచరమ్ ।**
**సంతప్తమతి కస్మాద్వై న జ్ఞాతం కారణం విభో ॥24॥**

హే విభో! ఈ స్థావరజంగమాత్మకమైన జగత్తంతయు నీచే సృష్టింపబడింది. ఇప్పుడీజగత్తు గొప్ప తాపాన్ని పొందుతోంది. దానికి కారణం తెలియడం లేదు.

**తద్బ్రూహి కారణం బ్రహ్మన్ జ్ఞాతుమర్హసి నః ప్రభో ।**
**దగ్ధభూతతనూన్దేవాన్ త్వత్తో నాన్యోఽస్తి రక్షకః ॥25॥**

అట్లు జరగడానికిగల కారణం నీకు తెలుసు. దానిని మాకు చెప్పుము. దగ్ధమైన దేహాలుగల దేవతలను రక్షించగలవాడవు నీవుతక్క మరియొకడు కానరాడు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తేషామహం స్మృత్వా శివం హృదా ।**
**విచార్య మనసా సర్వం గిరిజాయాస్తపః ఫలమ్ ॥26॥**

వారి మాటలనాలకించి, నేను మనస్సులో శివుని స్మరించి, అదంతయు పార్వతి తపః ప్రభావం చేతనేనని మనస్సులో నిశ్చయించుకున్నాను.

**దగ్ధం విశ్వమితి జ్ఞాత్వా తైః సర్వైరిహ సాదరాత్ ।**
**హరయే తత్కథయితుం క్షీరాబ్ధిమగమం ద్రుతమ్ ॥27॥**

జగత్తు దహింపబడుచున్నదని తెలుసుకొని, నేను వారందరితో (దేవతలందరిలో) కలసి విష్ణువునకు అత్యాదరంతో ఈ వృత్తాంతాన్నంతటిని విన్నవించడానికి వెంటనే పాలసముద్రం వద్దకు వెళ్ళాను.

**తత్ర గత్వా హరిం దృష్ట్వా విలసంతం సుఖాసనే ।**
**సుప్రణమ్య సుసంస్తూయ ప్రావోచం సాంజలిః సురైః ॥28॥**

అక్కడకు వెళ్ళి, సుఖాసనమునందు విలసితుడైన హరిని చూచి, దేవతలతోసహా చేతులు జోడించి, నమస్కరించి, స్తుతించి ఇలా పలికాను.

**త్రాహి త్రాహి మహావిష్ణో తప్తాన్నశ్శరణాగతాన్ ।**
**తపసోగ్రేణ పార్వత్యాస్తపంత్యాః పరమేణ హి ॥29॥**

ఓ మహావిష్ణూ! రక్షింపుము, రక్షింపుము, మేము తాప పీడితులమై నిన్ను శరణు వేడినాము. పార్వతి చేయు పరమోగ్రతపస్సు మమ్ములను దహిస్తోంది.

**ఇత్యాకర్ణ్య వచస్తేషామస్మదాదిదివౌకసామ్ ।**
**శేషాసనే సమావిష్టోఽస్మానువాచ రమేశ్వరః ॥30॥**

దేవతలతో కూడియున్న నా మాటలను విని, శేషాసనంపై సమావిష్టుడైన లక్ష్మీపతి మాతో ఇట్లు పలికాడు.

**విష్ణురువాచ –** విష్ణువు పలికాడు.

**జ్ఞాతం సర్వం నిదానం మే పార్వతీతపసోఽద్య వై ।**
**యుష్మాభిస్సహితస్త్వద్య వ్రజామి పరమేశ్వరమ్ ॥31॥**

పార్వతీదేవి చేయుచున్న తపస్సుయొక్క పరిస్థితి అంతయు నాకు తెలుసు. నేనిపుడు నీతోకూడి పరమేశ్వరుని వద్దకు వెళుతున్నాను.

**మహాదేవం ప్రార్థయామో గిరిజాప్రాపణాయ తమ్ ।**
**పాణిగ్రహార్థ మధునా లోకానాం స్వస్తయేఽమరాః ॥32॥**

ఓ దేవతలారా! లోకకల్యాణార్థం ఆయన పార్వతిని చేబట్టవలయుననియు, ఆమెవద్దకు వెంటనే వెళ్ళుడనియు మనము ఆయనను ప్రార్థిద్దాం.

**వరం దాతుం శివాయై హి దేవదేవః పినాకధృక్ ।**
**యథా చేష్యతి తత్రైవ కరిష్యామోఽధునా హి తత్ ॥33॥**

పినాకపాణియైన శివదేవుడు శివాదేవికి వరాన్నివ్వడానికి ఇప్పుడే ఆయనను ఒప్పించాలి. మనమాప్రయత్నాన్ని అచ్చటనే చేద్దాం.

**తస్మాద్వయం గమిష్యామో యత్ర రుద్రో మహాప్రభుః ।**
**తపసోగ్రేణ సంయుక్తోఽద్యాస్తే పరమమంగళః ॥34॥**

కావున మహాప్రభుడు, పరమమంగళస్వరూపుడునగు రుద్రుడు ఉగ్రతపమాచరిస్తున్న స్థలానికి మనమిప్పుడే వెళ్దాము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**విష్ణోస్తద్వచనం శ్రుత్వా సర్వ ఊచుస్సురాదయః ।**
**మహాభీతా హఠాత్ క్రుద్ధాద్దగ్ధుకామాత్ లయంకరాత్ ॥35॥**

విష్ణువుయొక్క ఆ మాటలు విని, దేవతలు మున్నగు వారందరు లయకారకుడైన రుద్రుడు హఠాత్తుగా కోపించి, దహించకోరునేమోయని మహాభయాన్ని పొంది, ఇలా పలికారు.

**దేవా ఊచుః –** దేవతలు పలికారు.

**మహాభయంకరం క్రుద్ధం కాలానలసమప్రభమ్ ।**
**న యాస్యామో వయం సర్వే విరూపాక్షం మహాప్రభమ్ ॥36॥**

మహాభయంకరుడు, క్రోధంలో ప్రళయకాల సమానమైన కాంతి కలవాడును, ముక్కంటియు, మహాప్రభుడునగు రుద్రుని వద్దకు మేమెవ్వరము వెళ్ళము.

**యథా దగ్ధః పురా తేన మదనో దురతిక్రమః ।**
**తథైవ క్రోధయుక్తో నః స ధక్ష్యతి న సంశయః ॥37॥**

పూర్వం ఆయన దుర్జయుడైన మన్మథుని ఏవిధంగా దహించాడో, అదేవిధంగా క్రోధయుక్తుడైన ఆయన మమ్ములనుకూడా దహించివేస్తాడు. ఇందులో సందేహం లేదు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**తదాకర్ణ్య వచస్తేషాం శక్రాదీనాం రమేశ్వరః ।**
**సాంత్వయంస్తాన్సురాన్సర్వాన్ ప్రోవాచ స హరిర్మునే ॥38॥**

ఓ మునీ! ఇంద్రాది దేవతల మాటలను విని, లక్ష్మీపతి దేవతలనందరిని ఓదార్చాడు. అంతట విష్ణువు వారితో ఇలా పలికాడు.

**హరిరువాచ –** హరి చెప్పాడు.

**హే సురా మద్వచః ప్రీత్యా శృణుతాదరతోఽఖిలాః ।**
**న వో ధక్ష్యతి స స్వామీ దేవానాం భయనాశనః ॥39॥**

ఓ దేవతలారా! మీరందరు ప్రీతితో నామాటను వినండి. దేవతల భయనాశకుడైన ఆ స్వామి మిమ్ములను దహించడు.

**తస్మాద్భవద్భిర్గంతవ్యం మయా సార్ధం విచక్షణైః ।**
**శంభుం శుభకరం నత్వా శరణం తస్య సుప్రభోః ॥40॥**

కావున మీరు వివేకం గలవారై శంభుడు శుభాలనిచ్చేవాడని ఎరిగి, నాతోగూడి, ఆ మహాప్రభుని శరణు పొందండి.

**శివం పురాణం పురుషం హ్యధీశం వరేణ్యరూపం హి పరం పురాణమ్ ।**
**తపోజుషాణం పరమాత్మరూపం పరాత్పరం తం శరణం వ్రజామః ॥41॥**

సనాతనుడు, పరమపురుషుడు, అధీశ్వరుడు, శ్రేష్ఠమైన రూపంగలవాడు, తపమాచరించువాడు, పరమాత్మ స్వరూపుడు, సర్వోత్కృష్టుడునగు ఆ శివుని శరణు వేడుదాం.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఏవముక్తాస్తదా దేవా విష్ణునా ప్రభవిష్ణునా ।**
**జగ్ముస్సర్వే తేన సహ ద్రష్టుకామాః పినాకినమ్ ॥42॥**

సర్వసమర్థుడైన విష్ణువిట్లు పలుకగా దేవతలందరు విష్ణువుతోగూడి, పినాకధారియైన శివుని దర్శించడానికి వెళ్ళారు.

**ప్రథమం శైలపుత్ర్యాస్తత్తపో ద్రష్టుం తదాశ్రమమ్ ।**
**జగ్ముర్మార్గవశాత్సర్వే విష్ణ్వాద్యాస్సకుతూహలాః ॥43॥**

వారందరు ముందుగా పార్వతి తపస్సును చూచు కుతూహలం కలవారై, మార్గమునందున్న ఆమె ఆశ్రమానికి వెళ్ళారు.

**పార్వత్యాస్సుతపో దృష్ట్వా తేజసా వ్యాపృతాస్తదా ।**
**ప్రణేముస్తాం జగద్ధాత్రీం తేజోరూపాం తపఃస్థితామ్ ॥44॥**

పార్వతియొక్క గొప్ప తపస్సును చూడగానే వారందరు తేజస్సుచే వ్యాప్తులయ్యారు. వారప్పుడు జగన్మాత, తేజోరూపిణి, తపోనిష్ఠురాలునైన పార్వతీదేవికి ప్రణమిల్లారు.

**ప్రశంసంతస్తపస్తాస్యాస్సాక్షాత్సిద్ధితనోస్సురాః ।**
**జగ్ముస్తత్ర తదా తే చ యత్రాస్తే వృషభధ్వజః ॥45॥**

మూర్తీభవించిన తపస్సిద్ధివలెనున్న ఆమెయొక్క తపస్సును కొనియాడుచు తదనంతరం దేవతలందరు వృషభధ్వజుడైన శంకరుడున్న స్థానానికి వెళ్ళారు.

**తత్ర గత్వా చ తే దేవాస్త్వాం మునే ప్రైషయంస్తదా ।**
**పశ్యంతో దూరతస్తస్థుః కామభస్మకృతో హరాత్ ॥46॥**

ఓ మహర్షీ! అప్పుడా దేవతలు అచ్చటకు చేరి, శివునివద్దకు నిన్ను (నారదుని) పంపారు. కాముని భస్మం చేసిన శివునకు దూరంగానుండి, వారు చూస్తున్నారు.

**నారద! త్వం శివస్థానం తదా గత్వాభయస్సదా ।**
**శివభక్తో విశేషేణ ప్రసన్నం దృష్టవాన్ ప్రభుమ్ ॥47॥**

ఓ నారదా! భయము నెరుగని నీవప్పుడు శివుని స్థానానికి వెళ్ళియున్నావు. విశేషించి, శివభక్తుడవైన నీవప్పుడు ప్రసన్నుడైయున్న ఆ ప్రభుని చూశావు.

**పునరాగత్య యత్నేన దేవానాహూయ తాంస్తతః ।**
**నినాయ శంకరస్థానం తదా విష్ణ్వాదికాన్మునే ॥48॥**

ఓ మహర్షీ! నీవప్పుడు తిరిగి వచ్చి, విష్ణువు మున్నగు దేవతలను పిలిచి ప్రయత్నపూర్వకంగా శంకరుని వద్దకు తీసుకొని వెళ్ళావు.

**అథ విష్ణ్వాదయస్సర్వే తత్ర గత్వా శివం ప్రభుమ్ ।**
**దదృశుస్సుఖమాసీనం ప్రసన్నం భక్తవత్సలమ్ ॥49॥**

అంతట విష్ణువు మున్నగు దేవతలందరు అచ్చటకు వెళ్ళి, సుఖాసీనుడై, ప్రసన్నుడైయున్న భక్తవత్సలుడగు శివప్రభుని దర్శించారు.

**యోగపట్టస్థితం శంభుం గణైశ్చ పరివారితమ్ ।**
**తపోరూపం దధానం చ పరమేశ్వరరూపిణమ్ ॥50॥**

**తతోవిష్ణుర్మయాన్యే చ సురసిద్ధమునీశ్వరాః ।**
**ప్రణమ్య తుష్టువుస్సూక్తైర్వేదోపనిషదన్వితైః ॥51॥**

యోగపట్టమునందున్నవాడు (ఒక విశేషబంధంలోనున్న వస్త్రం) గణాలచే పరివేష్టితుడు, తపోరూపాన్ని ధరించినవాడు, పరమేశ్వర స్వరూపుడునగు శివుని విష్ణువు, నేను, దేవతలు, సిద్ధులు, మహర్షులు, తదితరులు నమస్కరించి, వేదాలతో, ఉపనిషత్తులతో కూడిన సూక్తాలతో స్తుతించాము.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే పార్వతీసాంత్వన శివదేవదర్శనవర్ణనం నామ త్రయోవింశోఽధ్యాయః ॥23॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో పార్వతిని ఓదార్చుట మరియు శివదేవునిదర్శనం అనే ఇరవై మూడవ అధ్యాయం సమాప్తం.

## చతుర్వింశోఽధ్యాయః - ఇరవై నాలుగవ అధ్యాయం

## పార్వతీవివాహస్వీకారః - పార్వతివివాహస్వీకారం

**దేవాఊచు** - దేవతలు పలికారు.

**నమో రుద్రాయ దేవాయ మదనాంతకరాయ చ ।**
**స్తుత్యాయ భూరిభాసాయ త్రినేత్రాయ నమో నమః ॥1॥**

ప్రకాశ స్వరూపుడు, మదనాంతకుడు, స్తుతింపదగినవాడు, గొప్పతేజశ్శాలి, ముక్కంటియునగు రుద్రునకు అనేక నమస్కారాలు.

**శిపివిష్టాయ భీమాయ భీమాక్షాయ నమో నమః ।**
**మహాదేవాయ ప్రభవే త్రివిష్టపతయే నమః ॥2॥**

రశ్మలచే సర్వాన్ని ప్రకాశింపజేయు ఆదిత్యుడు, భయంకరాకారుడు, భయాన్ని కలిగించే కన్నులుగలవాడు, ప్రభువు, మహాదేవుడునగు నీకు అనేక నమస్కారాలు. ఇంద్రరూపుడవై స్వర్గాన్ని పాలించు నీకు నమస్కారము.

**త్వం నాథః సర్వలోకానాం పితా మాతా త్వమీశ్వరః ।**
**శంభురీశశ్శంకరోఽసి దయాలుస్త్వం విశేషతః ॥3॥**

సమస్తలోకాలకు నాథుడవు నీవే. సమస్త ప్రాణులకు తల్లి, తండ్రి, పాలకుడవు నీవే. నీవు మంగళ స్వరూపుడవు. ఈశ్వరుడవు. మంగళములనిచ్చువాడవు. నీయందు దయ విశేషంగా కలదు.

**త్వం ధాతా సర్వజగతాం త్రాతుమర్హసి నః ప్రభో ।**
**త్వాం వినా కస్సమర్థోఽస్తి దుఃఖనాశే మహేశ్వర ॥4॥**

హే ప్రభో! లోకాలనన్నింటిని పోషించు నీవు మమ్ము రక్షింపగలవు. ఓ మహేశ్వరా! దుఃఖాలను పోగొట్టడంలో నీకంటె సమర్థుడు మరియొకరెవరుగలరు?

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తేషాం సురాణాం నందికేశ్వరః ।**
**కృపయా పరయా యుక్తో విజ్ఞప్తుం శంభుమారభత్ ॥5॥**

దేవతలు మాటలాడిన మాటలను విని, మిక్కిలి దయామయుడైన నందికేశ్వరుడు శంభునికి విన్నవించడానికి ప్రారంభించాడు.

**నందికేశ్వర ఉవాచ** - నందికేశ్వరుడు పలికాడు.

**విష్ణ్వాదయస్సురగణా మునిసిద్ధసంఘా స్త్వాం ద్రష్టుమేవ సురవర్య విశేషయంతి ।**
**కార్యార్థినోఽసురవరైః పరిభర్త్స్యమానాః సమ్యక్ పరాభవపదం పరమం ప్రపన్నాః ॥6॥**

విష్ణువు మున్నగు దేవగణాలు, మునిగణాలు, సిద్ధగణాలు నిన్ను దర్శించడానికి స్తుతించుచున్నారు. రాక్షసులచే పీడింపబడి, తీవ్రమైన పరాభవానికి గురియైన వీరలు నీ అనుగ్రహంచే కార్యసిద్ధిని పొందాలని కోరుకుంటున్నారు.

**తస్మాత్త్వయా హి సర్వేశ త్రాతవ్యా మునయః సురాః ।**
**దీనబంధుర్విశేషేణ త్వముక్తో భక్తవత్సలః ॥7॥**

కాబట్టి నీవు మునులను, దేవతలను రక్షించాలి. విశేషించి నీవు దీనబంధుడవనియు, భక్తవత్సలుడవనియు ఖ్యాతిని పొందావు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఏవం దయావతా శంభుర్విజ్ఞప్తో నందినా భృశమ్ ।**
**శనైశ్శనైరుపరమద్ధ్యానాదున్మీల్య చాక్షిణీ ॥8॥**

దయాళువైన నంది ఈవిధంగా పరిపరివిధాల విన్నవించగా శివుడు మెల్లమెల్లగా ధ్యానమును విరమించి కన్నులు తెరిచాడు.

**ఈశోఽథోపరతశ్శంభుస్తదా పరమకోవిదః ।**
**సమాధేః పరమాత్మాసౌ సురాన్సర్వానువాచ హ ॥9॥**

ఈశ్వరుడు, పరమజ్ఞాని, పరమాత్మయునగు శంభుడు సమాధినుపసంహరించి, దేవతలందరితో ఇలా పలికాడు.

**శంభురువాచ –** శంభుడు పలికాడు.

**కస్మాద్యూయం సమాయాతా మత్సమీపం సురేశ్వరాః ।**
**హరిబ్రహ్మాదయస్సర్వే బ్రూత కారణమాశు తత్ ॥10॥**

ఓ దేవతాశ్రేష్ఠులారా! బ్రహ్మవిష్ణువులను ముందిడుకుని మీరందరు నావద్దకు రావడానికిగల కారణాన్ని వెంటనే నాకు చెప్పండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి శ్రుత్వా వచశ్శంభోస్సర్వే దేవా ముదాన్వితాః ।**
**విష్ణోర్విలోకయామాసుర్ముఖం విజ్ఞప్తిహేతవే ॥11॥**

శంభుని మాటలను విని దేవతలందరు ఆనందంతో నిండినవారై శంభునికి విన్నవించడానికి విష్ణువు ముఖంవైపు చూశారు.

**అథ విష్ణుర్మహాభక్తో దేవానాం హితకారకః ।**
**మదీరితమువాచేదం సురకార్యం మహత్తరమ్ ॥12॥**

అంతట మహాభక్తుడు, దేవతలకు మేలుచేయువాడు నగు విష్ణువు గొప్పదేవకార్యాన్ని సాధింపగోరి, నేను వెనుక చెప్పిన అంశాన్ని చెప్పబోయే విధంగా శంభునితో పలికాడు.

**తారకేణ కృతం శంభో దేవానాం పరమాద్భుతమ్ ।**
**కష్టాత్కష్టతరం దేవా విజ్ఞప్తుం సర్వ ఆగతాః ॥13॥**

హే శంభో! తారకుడు దేవతలకు పరమాశ్చర్యకరమైన పద్ధతిలో తీవ్రవేదనలను కలిగిస్తున్నాడు. ఆ సంగతిని విన్నవించడానికి దేవతలందరు ఇక్కడకు వచ్చియున్నారు.

**హే శంభో తవ పుత్రేణౌరసేన హి భవిష్యతి ।**
**నిహతస్తారకో దైత్యో నాన్యథా మమ భాషితమ్ ॥14॥**

హే శంభో! నీనుండి జన్మించిన నీ కుమారుని చేతిలో మాత్రమే తారకాసురుడు హతుడౌతాడు. నామాట యథార్థమే.

**విచార్యేత్థం మహాదేవ కృపాం కురు నమోఽస్తు తే ।**
**దేవాన్సముద్ధర స్వామిన్ కష్టాత్తారకనిర్మితాత్ ॥15॥**

ఓ మహాదేవా! ఈ విషయాన్ని విచారించి, దయను చూపుము. నీకు నమస్కారమగుగాక! ఓ స్వామీ! తారకుడు కలిగించిన కష్టాలనుండి దేవతలనుద్ధరించండి.

**తస్మాత్త్వయా గిరిజా దేవ శంభో గ్రహీతవ్యా పాణినా దక్షిణేన ।**
**పాణిగ్రహేణైవ మహానుభావాం దత్తాం గిరీంద్రేణ చ తాం కురుష్వ ॥16॥**

హే దేవా! శంభో! కావున నీవు నీ కుడిచేతితో పార్వతిని స్వీకరించుము. పర్వతరాజు సమర్పించగా మహాపతివ్రతయైన పార్వతిని పరిణయమాడుము.

**విష్ణోస్తద్వచనం శ్రుత్వా ప్రసన్నో హ్యబ్రవీచ్ఛివః ।**
**దర్శయన్ సద్గతిం తేషాం సర్వేషాం యోగతత్పరః ॥17॥**

విష్ణువు మాటలను విని, శివుడు ప్రసన్నుడయ్యాడు. యోగనిష్ఠుడైన శివుడు వారందరికి సద్గతిని దర్శింపజేస్తూ ఇలాపలికాడు.

**శివ ఉవాచ** - శివుడు పలికాడు.

**యదా మే స్వీకృతా దేవీ గిరిజా సర్వసుందరీ ।**
**తదా సర్వే సురేంద్రాశ్చ మునయో ఋషయస్తదా ॥18॥**

**సకామాశ్చ భవిష్యంతి న క్షమాశ్చ పరే పథి ।**
**జీవయిష్యతి దుర్గా సా పాణిగ్రహణతస్స్మరమ్ ॥19॥**

నేను సర్వాంగ సుందరియైన పార్వతీదేవిని ఎప్పుడు స్వీకరిస్తానో అప్పుడే దేవతలు, దిక్పాలకులు, మునులు, ఋషులు మున్నగువారందరు వారికోరిక తీరినవారు కాగలరు. కాని వారు మోక్షమార్గము నందు సమర్థులు కాజాలరు. పాణిగ్రహణంచేత ఆ దుర్గ మన్మథుని జీవింపజేయగలదు.

**మదనో హి మయా దగ్ధస్సర్వేషాం కార్యసిద్ధయే ।**
**బ్రహ్మణో వచనాద్విష్ణో నాత్ర కార్యా విచారణా ॥20॥**

ఓ విష్ణువా! అందరి కార్యం సిద్ధించడానికి బ్రహ్మవచనానుసారం వచ్చిన మన్మథుని నేను దహించాను. ఇందులో ఆలోచించేదేదియు లేదు.

**ఏవం విమృశ్య మనసా కార్యాకార్యవ్యవస్థితౌ ।**
**సుధీః సర్వైశ్చ దేవేంద్ర హఠం నో కర్తుమర్హసి ॥21॥**

ఏది కర్తవ్యం? ఏదికాదు? అని నిర్ధారణ చేయుటలో వివేకి మనస్సులో చక్కగా విమర్శించుకోవాలి. ఓ దేవేంద్రా! నీవు దేవతలందరితోగూడి హఠం చేయదగదు.

**దగ్ధే కామే మయా విష్ణో సురకార్యం మహత్ కృతమ్ ।**
**సర్వే తిష్ఠంతు నిష్కామా మయా సహ సునిశ్చితమ్ ॥22॥**

ఓ విష్ణో! నేను మన్మథుని దహించి, గొప్పదేవకార్యాన్ని చేశాను. మీరందరు నాతోగూడి నిష్కాములై యుందురుగాక! ఇది నిశ్చయము.

**యథాహం చ సురాస్సర్వే తథా యూయమయత్నతః ।**
**తపః పరమసంయుక్తాః కరిష్యధ్వం సుదుష్కరమ్ ॥23॥**

ఓ దేవతలారా! మీరందరు అప్రయత్నంగా సుదుష్కరమైన తపస్సును నావలెనే చేయండి.

**యూయం సమాధినా తేన మదనేన వినా సురాః ।**
**పరమానంద సంయుక్తా నిర్వికారా భవంతు వై ॥24॥**

మన్మథుడిప్పుడు లేదు గనుక మీరు పరమానందంతో కూడినవారై, నిర్వికారులై, సమాధినిష్ఠులు కాగలరు.

**పురావృత్తం స్మరకృతం విస్మృతం యద్విధే హరే ।**
**మహేంద్ర మునయో దేవా యత్తత్సర్వం విమృశ్యతామ్ ॥25॥**

ఓ బ్రహ్మా! హే విష్ణో! మహేంద్రా! మునులారా! దేవతలారా! పూర్వం మన్మథుడు చేసిన పనిని మీరు విస్మరించారు. ఆ వృత్తాంతాన్నంతటిని ఒకమారు విమర్శించుకోండి.

**మహాధనుర్ధరేణైవ మదనేన హఠాత్సురాః ।**
**సర్వేషాం ధ్యానవిధ్వంసః కృతస్తేన పురాఽమరాః ॥26॥**

ఓ దేవతలారా! మహాధనుర్ధారియైన మన్మథుడు పూర్వం హఠాత్తుగా మీయందరి ధ్యానాన్ని నాశనం చేశాడు.

**కామో హి నరకాయైవ తస్మాత్ క్రోధోఽభిజాయతే ।**
**క్రోధాద్భవతి సమ్మోహో మోహాచ్చ భ్రంశతే తపః ॥27॥**

కామమే నరకానికి దారితీస్తుంది. కామంనుండి క్రోధం పుడుతుంది. క్రోధంనుండి మోహం పుడుతుంది. వ్యామోహంవల్ల తపస్సు భ్రష్టమౌతుంది.

**కామక్రోధౌ పరిత్యాజ్యౌ భవద్భిస్సురసత్తమైః ।**
**సర్వైరేవ చ మంతవ్యం మద్వాక్యం నాన్యథా క్వచిత్ ॥28॥**

దేవతా శ్రేష్ఠులైన మీరందరు కామక్రోధాలను విడనాడండి, నామాటను మననం చేసుకోండి. నా మాటకు భిన్నంగా ఎప్పటికి జరగదు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఏవం విశ్రావ్య భగవాన్ మహాదేవో వృషధ్వజః ।**
**సురాన్ ప్రవాచయామాస విధివిష్ణూ తథా మునీన్ ॥29॥**

వృషధ్వజుడు, భగవంతుడునైన మహాదేవుడు బ్రహ్మావిష్ణువులను, దేవతలను, ఋషులను ఉద్దేశించి ఈవిధంగా బోధించాడు.

**తూష్ణీం భూతోఽభవచ్ఛంభుర్ధ్యానమాశ్రిత్య వై పునః ।**
**ఆస్తే పురా యథా స్థాణుర్గణైశ్చ పరివారితః ॥30॥**

అనంతరం ఆయన మాటలాడుటను విరమించి, మరల ధ్యానమగ్నుడై, పూర్వంవలెనె కదలిక లేనివాడైయున్నాడు. గణాలు ఆయనను చుట్టువారియున్నాయి.

**స్వాత్మానమాత్మనా శంభురాత్మన్యేవ వ్యచింతయత్ ।**
**నిరంజనం నిరాభాసం నిర్వికారం నిరామయమ్ ॥31॥**

నిరంజనం, నిరాభాసం, నిర్వికారం, నిరామయమునైన పరమాత్మను ఆ శంభుడు తన ఆత్మలోనే చింతించాడు.

**పరాత్పరతరం నిత్యం నిర్మమం నిరవగ్రహమ్ ।**
**శబ్దాతీతం నిర్గుణం చ జ్ఞానగమ్యం పరాత్పరమ్ ॥32॥**

**ఏవం స్వరూపం పరమం చింతయన్ ధ్యానమాస్థితః ।**
**పరమానంద సంమగ్నో బభూవ బహుసూతికృత్ ॥33॥**

పరాత్పరతరము, నిత్యము, మమకారం లేనిది, దోషాలు లేనిది, శబ్దాతీతము, నిర్గుణము, జ్ఞానగమ్యమునగు పరమాత్మస్వరూపాన్ని మనస్సులోనే ధ్యానిస్తూ జగత్కారణుడైన శివుడు పరమానంద నిమగ్నుడై యున్నాడు.

**ధ్యానస్థితం చ సర్వేశం దృష్ట్వా సర్వే దివౌకసః ।**
**హరిశక్రాదయస్సర్వే నందినం ప్రోచురానతాః ॥34॥**

ధ్యానమునందున్న సర్వేశ్వరుని విష్ణువు, ఇంద్రుడు మున్నగు దేవతలందరు చూచి, నందీశ్వరునుద్దేశించి, వినయంతో ఇలా పలికారు.

**దేవా ఊచుః –** దేవతలు పలికారు.

**కిం వయం కరవామాద్య విరక్తో ధ్యానమాస్థితః ।**
**శంభుస్త్వం శంకరసఖస్సర్వజ్ఞః శుచిసేవకః ॥35॥**

శంభుడు విరక్తుడై ధ్యానంలో నున్నాడు. మేమిప్పుడేమి చేయాలి? నీవు శంకరుని మిత్రుడవు, సర్వజ్ఞుడవు, శుద్ధహృదయంగల సేవకుడవు.

**కేనోపాయేన గిరిశః ప్రసన్నః స్యాద్గణాధిప ।**
**తదుపాయం సమాచక్ష్వ వయం త్వచ్ఛరణం గతాః ॥36॥**

ఏ ఉపాయంచే కైలాసపతి ప్రసన్నుడౌతాడో అట్టి ఉపాయాన్ని మాకు చెప్పుము. మేము మిమ్ము శరణు పొందుచున్నాము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి విజ్ఞాపితో దేవైర్మునే హర్యాదిభిస్తదా ।**
**ప్రత్యువాచ సురాంస్తాన్ స నందీ శంభుప్రియో గణః ॥37॥**

ఓ మహర్షీ! విష్ణువు మున్నగు దేవతలీ విధంగా విన్నవించుకొనగానే గణాధ్యక్షుడు, శంభునకు ప్రియుడునైన నందీశ్వరుడు దేవతలకిట్లు బదులిచ్చాడు.

**నందీశ్వర ఉవాచ –** నందీశ్వరుడు చెప్పాడు.

**హే హరే హే విధే శక్ర నిర్జరా మునయస్తథా ।**
**శృణుధ్వం వచనం మే హి శివసంతోషకారకమ్ ॥38॥**

హే విష్ణో! ఓ బ్రహ్మ! ఇంద్రా! దేవతలారా! మునులారా! శివునికి సంతోషాన్ని కలిగించే మాటచెబుతాను వినండి.

**యది వో హఠ ఏవాద్య శివదారపరిగ్రహే ।**
**అతిదీనతయా సర్వే సునుతిం కురుతాదరాత్ ॥39॥**

ఈనాడే శివుడు వివాహమాడాలని మీకు పట్టుదల ఉంటే మీరందరు మిక్కిలి దైన్యంతో, ఆదరంతో, చక్కని స్తోత్రాన్ని చేయండి.

**భక్తేర్వశ్యో మహాదేవో న సాధారణతస్సురాః ।**
**అకార్యమపి సద్భక్త్యా కరోతి పరమేశ్వరః ॥40॥**

దేవతలారా! సాధారణంగా వశంకాని మహాదేవుడు భక్తికి వశుడౌతాడు. ఆ పరమేశ్వరుడు మంచి భక్తికలవాని విషయంలో చేయతగని పనినికూడా చేసిపెడతాడు.

**ఏవం కురుత సర్వే హి విధివిష్ణుముఖాస్సురాః ।**
**యథాగతేన మార్గేణాన్యథా గచ్ఛత మా చిరమ్ ॥41॥**

బ్రహ్మ, విష్ణువు మొదలుగాగల దేవతలారా! మీరందరు ఈవిధంగా చేయండి, లేదా వచ్చిన దారిలోనే ఆలస్యం చేయకుండా వెళ్ళండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య మునే విష్ణ్వాదయస్సురాః ।**
**తథేతి మత్వా సుప్రీత్యా శంకరం తుష్టువుర్హి తే ॥42॥**

ఓ మహర్షీ! అతని మాటలు విని, విష్ణ్వాది దేవతలందరు అట్లే చేయుదమని అంగీకరించి, మిక్కిలి ప్రీతితో శంకరుని ఇలా స్తుతించారు.

**దేవదేవ మహాదేవ కరుణాసాగర ప్రభో ।**
**సముద్ధర మహాక్లేశాత్త్రాహి నశ్శరణాగతాన్ ॥43॥**

ఓ దేవదేవా! మహాదేవా! కరుణాసాగరా! ప్రభో! శరణుజొచ్చిన మమ్ములను ఈ మహాదుఃఖంనుండి ఉద్ధరించి, రక్షించండి

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవం బహుదీనోక్త్యా తుష్టువుశ్శంకరం సురాః ।**
**రురుదుస్సుస్వరం సర్వే ప్రేమవ్యాకులమానసాః ॥44॥**

దేవతలీవిధంగా మిక్కిలి దీనోక్తులతో శంకరుని స్తుతించారు. ప్రేమతో నిండిన మనస్సుగల దేవతలందరు చక్కని స్వరంతో రోదించారు.

**హరిర్మయా సుదీనోక్త్యా సువిజ్ఞప్తం చకార హ ।**
**సంస్మరన్ మనసా శంభుం భక్త్యా పరమయాన్వితః ॥45॥**

విష్ణువు నాతోగూడి, పరమభక్తి కలవాడై, మనస్సులో శంభుని స్మరిస్తూ, దీనంగా విన్నవించాడు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**సురైరేవం స్తుతశ్శంభుర్హరిణా చ మయా భృశమ్ ।**
**భక్తవాత్సల్యతో ధ్యానాద్విరతోఽభూన్మహేశ్వరః ॥46॥**

నేను(బ్రహ్మ), విష్ణువు, దేవతలు, ఇట్లు పరిపరివిధాలుగా స్తుతించగా మహేశ్వరుడు భక్తవాత్సల్యంచే ధ్యానాన్ని విరమించాడు.

**ఉవాచ సుప్రసన్నాత్మా హర్యాదీన్ హర్షయన్ హరః ।**
**విలోక్య కరుణాదృష్ట్యా శంకరో భక్తవత్సలః ॥47॥**

భక్తవత్సలుడైన శంకరుడు ప్రసన్నాత్ముడై, విష్ణువు మున్నగు దేవతలకందరికి ఆనందం కలిగేటట్లు దయాదృష్టితో చూచి, ఇలాపలికాడు.

**శంకర ఉవాచ** – శంకరుడు పలికాడు.

**హే హరే హే విధే దేవాశ్శక్రాద్యా యుగపత్సమే ।**
**కిమర్థమాగతా యూయం సత్యం బ్రూత మమాగ్రతః ॥48॥**

ఓ బ్రహ్మా! హే విష్ణో! ఇంద్రాది దేవతలారా! మీరందరు ఒక్కసారిగా ఇక్కడకు రావడానికి గల కారణమేమిటి? నా ఎదుట సత్యాన్ని చెప్పండి.

**హరిరువాచ** – విష్ణువు పలికాడు.

**సర్వజ్ఞస్త్వం మహేశాన త్వం తర్యామ్యఖిలేశ్వరః ।**
**కిం న జానాసి చిత్తస్థం తథా వచ్మ్యపి శాసనాత్ ॥49॥**

ఓ మహేశ్వరా! నీవు సర్వజ్ఞుడవు, అంతర్యామివి, సర్వేశ్వరుడవు, మా మనస్సులోని మాట నీకు తెలియదా? అయినప్పటికి నీ శాసనంచే చెబుతున్నాను.

**తారకాసురతో దుఃఖం సంభూతం వివిధం మృడ ।**
**సర్వేషాం న స్తదర్థం హి ప్రసన్నోఽకారి వై సురైః ॥50॥**

ఓ మృడా! మాకందరికి తారకాసురునివల్ల అనేక రకాల దుఃఖం సంప్రాప్తమయ్యింది. అందువల్లనే దేవతలు నిన్ను స్తుతించి ప్రసన్నుని చేసుకున్నారు.

**శివా సా జనితా శైలాత్త్వదర్థం హి హిమాలయాత్ ।**
**తస్యాం త్వదుద్భవాత్పుత్రాత్తస్య మృత్యుర్నచాన్యథా ॥51॥**

ఉమాదేవి నీ కొరకు హిమవంతుని కుమార్తెగా జన్మించింది. ఆమెయందు నీకు కలిగే పుత్రునిచే మాత్రమే ఆ తారకుడు సంహరింపబడతాడు. అతని మరణానికి మరియొక ఉపాయం లేదు.

**ఇతి దత్తో బ్రహ్మణా హి తస్మై దైత్యాయ యద్వరః ।**
**తదన్యస్మాదమృత్యుస్స బాధతే నిఖిలం జగత్ ॥52॥**

బ్రహ్మ అతనికిట్టి వరాన్ని ఇచ్చియున్నాడు. కాబట్టి ఇతరుల చేతిలో అతనికి చావు లేదు. అతడు జగత్తునంతటిని పీడిస్తున్నాడు.

**నారదస్య నిర్దేశాత్సా కరోతి కఠినం తపః ।**
**తత్తేజసాఖిలం వ్యాప్తం త్రైలోక్యం స చరాచరమ్ ॥53॥**

నారదుని సూచనతో పార్వతి కఠినమైన తపస్సు చేస్తోంది. ఆమె తేజస్సుచే చరాచరాత్మకమైన ముల్లోకాలు వ్యాప్తమయ్యాయి.

**వరం దాతుం శివాయై హి గచ్ఛ త్వం పరమేశ్వర ।**
**దేవ దుఃఖం జహి స్వామిన్నస్మాకం సుఖమావహ ॥54॥**

ఓ పరమేశ్వరా! నీవాపార్వతికి వరాన్నివ్వడానికి వెళ్ళుము. దేవతలమైన మా దుఃఖాన్ని పోగొట్టి, సుఖాలనిమ్ము.

**దేవానాం మే మహోత్సాహో హృదయే చాస్తి శంకర ।**
**వివాహం తవ సంద్రష్టుం తత్త్వం కురు యథోచితమ్ ॥55॥**

ఓ శంకరా! దేవతలకు, నాకు నీ వివాహం చూడాలనే ఉత్సాహం మా హృదయాలలో అధికంగా వుంది. కాబట్టి నీవు యథాయోగ్యంగా చేయుము.

**రత్యై యద్భవతా దత్తో వరస్తస్య పరాత్పర ।**
**ప్రాప్తోఽవసర ఏవాశు సఫలం స్వపణం కురు ॥56॥**

ఓ పరాత్పరా! నీవు రతీదేవికిచ్చిన వరం నెరవేర్చే సమయం ఆసన్నమయ్యింది. నీ ప్రతిజ్ఞను వేగంగా సఫలం చేయుము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా తం ప్రణమ్యైవ విష్ణుర్దేవా మహర్షయః ।**
**సంస్తూయ వివిధై స్తోత్రైస్సంతస్థు స్తత్పురోఽఖిలాః ॥57॥**

విష్ణువు, దేవతలు, మహర్షులు ఇట్లు పలికి, శివునకు నమస్కరించి, అనేక స్తోత్రాలతో చక్కగా స్తుతించి, వారందరు ఆయన ఎదుట నిలబడ్డారు.

**భక్తాధీనః శంకరోఽపి శ్రుత్వా దేవవచస్తదా ।**
**విహస్య ప్రత్యువాచాశు వేదమర్యాదరక్షకః ॥58॥**

భక్తాధీనుడైన శంకరుడుకూడా దేవతల మాటలను విని, నవ్వి వేదమర్యాదరక్షకుడైన శివుడు వారికిట్లు బదులు పలికాడు.

**శంకర ఉవాచ** – శంకరుడు పలికాడు.

**హే హరే హే విధే దేవాశ్శృణుతాదరతో௨ఖిలాః ।**
**యథోచితమహం వచ్మి సవిశేషం వివేకతః ॥59॥**

హే హరే! హే విధీ! దేవతలారా! అందరు ఆదరంతో వినండి. నేను వివేకంతో కూడిన యథోచితమైన ప్రత్యేక వచనాన్ని చెబుతాను.

**నోచితం హి విధానం వై వివాహకరణం నృణామ్ ।**
**మహానిగడసంజ్ఞో హి వివాహో దృఢబంధనః ॥60॥**

మానవులు వివాహమాడుట యోగ్యమైన కర్మ కాదు. వివాహం దృఢమైన బంధనం. అది పెద్ద సంకెళ్ళని చెప్పవచ్చు.

**కుసంగా బహవో లోకే స్త్రీసంగస్తత్ర చాధికః ।**
**ఉద్ధరేత్సకలబంధైర్నస్త్రీసంగాత్రపముచ్యతే ॥61॥**

లోకంలో చెడు సంగమాలనేకమున్నాయి. వాటిలో అన్నిటికంటే అధికమైనది స్త్రీ సంగమమే. మానవుడన్నిబంధాలను విడిపించుకోగలడు కాని స్త్రీసంగంనుండి మాత్రం విడిపించుకోలేడు.

**లోహదారుమయైః పాశైర్దృఢం బద్ధో௨పి ముచ్యతే ।**
**స్త్ర్యాదిపాశసుసంబద్ధో ముచ్యతే న కదాచన ॥62॥**

ఇనుపసంకెళ్లతోగాని, కొయ్య సంకెళ్ళతోగాని దృఢంగా బంధింపబడిన వ్యక్తికూడా ఆ బంధనాలనుండి విడిపించుకోగలడు. కాని స్త్రీ మూలకమైన పాశంచే బంధింపబడిన వ్యక్తి ఎన్నటికిని విముక్తుడు కాలేడు.

**వర్ధంతే విషయాశ్శశ్వన్మహాబంధనకారిణః ।**
**విషయాక్రాంతమనసస్స్వప్నే మోక్షో௨పి దుర్లభః ॥63॥**

దృఢంగా బంధించే ఈ ఇంద్రియసుఖాలు ఎల్లప్పుడు వృద్ధి పొందుతూనే ఉంటాయి. భోగలాలసతతో నిండిన మనస్సుగల వానికి మోక్షప్రాప్తి స్వప్నమునందైనను అసంభవమే.

**సుఖమిచ్ఛతి చేత్ప్రాజ్ఞో విషవద్విషయాంస్త్యజేత్ ।**
**విషవద్విషయానాహుర్విషయైర్యైర్నిహన్యతే ॥64॥**

సుఖాన్ని కోరే ప్రాజ్ఞుడైన మానవుడు విషయసుఖాలను విషంవలె విడిచిపెట్టాలి. విషయసుఖాలు విషం వంటివని పెద్దలు చెబుతారు. ఇంద్రియసుఖాలు మానవుని నాశనాన్ని కొని తెస్తాయి.

**జనో విషయిణా సాకం వార్తాతః పతతి క్షణాత్ ।**
**విషయం ప్రాహురాచార్యాస్సితాలిప్తేంద్రవారుణీమ్ ॥65॥**

భోగలాలసునితో మాట్లాడే వ్యక్తికూడా క్షణంలో పతితుడౌతాడు. ఇంద్రియసుఖాలు పంచదార స్ఫటికం కలిపిన ఇంద్రవారుణీలతారసం (చేదుగానుండేది) వంటివని ఆచార్యులు వక్కాణిస్తున్నారు.

**యద్యప్యేవం హి జానామి సర్వం జ్ఞానం విశేషతః ।**
**తథాప్యహం కరిష్యామి ప్రార్థనాం సఫలాం చ వః ॥66॥**

సమస్తజ్ఞానములు నాకు తెలియును. అయినప్పటికి మీ ప్రార్థనను నేను సఫలం చేస్తాను.

**భక్తాధీనోఽహమేవాస్మి తద్వశాత్సర్వకార్యకృత్ ।**
**అయథోచితకర్తా హి ప్రసిద్ధో భువనత్రయే ॥67॥**

నేను భక్తాధీనుడనై, వారి ఇచ్ఛానుసారం సర్వకార్యాలు చేస్తాను. భక్తుల కొరకు నేను అనుచితమైన పనిని కూడా చేస్తానని ముల్లోకాలలోను ప్రసిద్ధి కలదు.

**కామరూపాధిపస్యైవ పణశ్చ సఫలః కృతః ।**
**సుదక్షిణస్య భూపస్య భైమబంధగతస్య హి ॥68॥**

భీమమహారాజుచే బంధింపబడిన సుదక్షిణుడనే కామరూపదేశాధిపతి ప్రతిజ్ఞను సఫలం చేశాను.

**గౌతమక్లేశకర్తాహం త్ర్యంబకాత్మా సుఖావహః ।**
**తత్కష్టప్రదదుష్టానాం శాపదాయీ విశేషతః ॥69॥**

ముక్కంటినైన నేను గౌతముని కష్టాలను తొలగించి, సుఖాలను కలిగించి, ఆయనకు కష్టాలను కలిగించిన దుష్టులకు కఠినశాపాలనిచ్చాను.

**విషం పీతం సురార్థం హి భక్తవత్సలభావధృక్ ।**
**దేవకష్టం హృతం యత్నాత్సర్వదైవ మయా సురాః ॥70॥**

భక్తవాత్సల్యమే నా స్వరూపము. కాబట్టి నేను దేవతలకొరకు విషాన్ని త్రాగాను. నేను అన్నివేళలా దేవతల కష్టాలను ప్రయత్నపూర్వకంగా నివారిస్తూనే ఉన్నాను.

**భక్తార్థమసహం కష్టం బహుశో బహుయత్నతః ।**
**విశ్వానర మునేర్దుఃఖం హృతం గృహపతిర్భవన్ ॥71॥**

భక్తులకొరకు నేననేక పర్యాయాలు అధికప్రయత్నంతో అనేకకష్టాలు సహించాను. నేను గృహపతినై విశ్వానర మహర్షి దుఃఖాన్ని తొలగించాను.

**కిం బహూక్తేన చ హరే విధే సత్యం బ్రవీమ్యహమ్ ।**
**మత్పణోఽస్తీతి యూయం వై సర్వే జానీథ తత్త్వతః ॥72॥**

ఓ బ్రహ్మా! హే విష్ణో! పెక్కుమాటలేల? నేను సత్యాన్నే పలుకుతున్నాను. నేను ప్రతిజ్ఞ చేశానని మీరందరెరుగుదురు. ఆ ప్రతిజ్ఞయొక్క తత్త్వం మీకు తెలుసు.

**యదా యదా విపత్తిర్హి భక్తానాం భవతి క్వచిత్ ।**
**తదా తదా హరామ్యాశు తత్ క్షణాత్సర్వశస్సదా ॥73॥**

ఎప్పుడెప్పుడు ఎక్కడెక్కడ భక్తులకు కష్టం వస్తుందో అప్పుడప్పుడు అక్కడక్కడ వెంటనే నేను ప్రత్యక్షమై, ఆ కష్టాన్ని తొలగిస్తాను.

**జానేఽహం తారకాద్దుఃఖం సర్వేషాం వస్సముత్థితమ్ ।**
**అసురాత్తద్ధరిష్యామి సత్యం సత్యం వదామ్యహమ్ ॥74॥**

మీకందరకు తారకాసురునివలన సంప్రాప్తమైన దుఃఖం గురించి నేనెరుగుదును. ఆదుఃఖాన్ని నేను తొలగిస్తాను. నేను ముమ్మాటికి సత్యాన్నే పలుకుతున్నాను.

**నాస్తి యద్యపి మే కాచిద్విహారకరణే రుచిః ।**
**వివాహయిష్యే గిరిజాం పుత్రోత్పాదనహేతవే ॥75॥**

నాకు భోగ విలాసాలలో అభిరుచి లేకపోయినప్పటికి, పుత్రసంతానం కొరకు పార్వతిని వివాహమాడతాను.

**గచ్ఛత స్వగృహాణ్యేవం నిర్భయాస్సకలాః సురాః ।**
**కార్యం వస్సాధయిష్యామి నాత్ర కార్యా విచారణా ॥76॥**

దేవతలారా! మీరందరు నిర్భయంగా మీ గృహాలకు వెళ్ళండి. మీ కార్యాన్ని నేను సిద్ధింపజేస్తాను. మీరీవిషయంలో విచారించవలసిన పనిలేదు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా మౌనమాస్థాయ సమాధిస్థోఽభవద్ధరః ।**
**సర్వే విష్ణ్వాదయో దేవాస్స్వధామాని యయుర్మునే ॥77॥**

ఓ మహర్షీ! శివుడిట్లు పలికి, మౌనాన్ని వహించి, సమాధిలోనికి వెళ్ళిపోయాడు. విష్ణువు మున్నగు దేవతలందరు తమతమ నివాసాలకు వెళ్ళారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే పార్వతీవివాహస్వీకారం నామ చతుర్వింశోఽధ్యాయః ॥24॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో పార్వతివివాహస్వీకారం అనే ఇరవై నాలుగవ అధ్యాయం సమాప్తం.

## పంచవింశోఽధ్యాయః - ఇరవై ఐదవ అధ్యాయం

## సప్తర్షికృతపరీక్షావర్ణనమ్ - సప్తర్షులు పార్వతిని పరీక్షించుట

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**గతేషు తేషు దేవేషు విధివిష్ణ్వాదికేషు చ ।**
**సర్వేషు మునిషు ప్రీత్యా కిం బభూవ తతః పరమ్ ॥1॥**

బ్రహ్మ, విష్ణువు మున్నగు దేవతలు, మునులు అందరు ఆనందంతో తిరిగి వెళ్ళిన పిదప ఏమి జరిగింది?

**కిం కృతం శంభునా తాత వరం దాతుం సమాగతః ।**
**కియత్కాలేన చ కథం తద్వద ప్రీతిమావహన్ ॥2॥**

ఓ తండ్రీ! శంభుడేమిచేశాడు? ఆయన ఎంతకాలం తర్వాత వరమివ్వడానికి వచ్చాడు? ఎట్లు వచ్చాడు? ఈవిషయమంతాచెప్పి, నాకు ప్రీతిని కలిగించండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**గతేషు తేషు దేవేషు బ్రహ్మాదిషు నిజాశ్రమమ్ ।**
**తత్తపః సుపరీక్షార్థం సమాధిస్థోఽభవద్భవః ॥3॥**

బ్రహ్మాదిదేవతలందరు తమ తమ స్థానాలకు వెళ్ళగా శివుడు పార్వతి తపస్సును చక్కగా పరీక్షింపగోరి, సమాధిస్థితిలోనికి వెళ్ళాడు.

**స్వాత్మానమాత్మనా కృత్వా స్వాత్మన్యేవ వ్యచింతయత్ ।**
**పరాత్పరతరం స్వస్థం నిర్మాయ నిరవగ్రహమ్ ॥4॥**

పరాత్పరతరమైనది, స్వరూపభూతమైనది, మాయారహితమైనది, ఆటంకములు లేనిదియునైన ఆత్మతత్త్వాన్ని తన ఆత్మలోనే, ఆత్మతోనే విచారించాడు.

**తద్వస్తుభూతో భగవానీశ్వరో వృషభధ్వజః ।**
**అవిజ్ఞాతగతిస్సూతిస్స హరః పరమేశ్వరః ॥5॥**

ఆ హరుడు తత్పదవాచ్యుడు, భగవానుడు, ఈశ్వరుడు, వృషభధ్వజుడు, తెలియ బడని స్వరూపం గలవాడు. సర్వకారణుడు మరియు పరమేశ్వరుడు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**గిరిజా హి తదా తాత తతాప పరమం తపః ।**
**తపసా తేన రుద్రోఽపి పరం విస్మయమాగతః ॥6॥**

వత్సా! అపుడాపార్వతి ఉగ్ర తపస్సు చేస్తోంది. ఆ తపస్సును చూచి, రుద్రుడుకూడా మిక్కిలి విస్మయాన్ని పొందాడు.

**సమాధేశ్చలితస్సో౽భూద్భక్తాధీనో౽పి నాన్యథా ।**
**వసిష్ఠాదీన్మునీన్ సప్త సస్మార సూతికృద్ధరః ॥7॥**

ఆయన భక్తులకధీనుడేగాని మరియొకటి కాదు. ఆయన సమాధినుండి చలించాడు. జగత్కారకుడగు హరుడు వసిష్ఠాది సప్తర్షులను స్మరించాడు.

**సప్తాపి మునయశ్శీఘ్రమాయయుస్స్మృతిమాత్రతః ।**
**ప్రసన్నవదనాస్సర్వే వర్ణయంతో విధిం బహు ॥8॥**

స్మరించినంత మాత్రంచేతనే తమ భాగ్యాన్ని అనేక విధాలుగా వర్ణించుకుంటూ, ప్రసన్నమైన ముఖం కలవారై, సప్తర్షులు అచ్చటకు విచ్చేశారు.

**ప్రణమ్య తం మహేశానం తుష్టువుర్హర్షనిర్భరాః ।**
**వాణ్యా గద్గదయా బద్ధకరా వినతకంధరాః ॥9॥**

వారానందభరితులై, మహేశ్వరునకు ప్రణమిల్లి, చేతులు జోడించి, తలలు వంచి, గద్గదవాక్కుతో ఇలా స్తుతించారు.

**సప్తర్షయ ఊచుః –** సప్తర్షులు పలికారు.

**దేవదేవ మహాదేవ కరుణాసాగర ప్రభో ।**
**జాతా వయం సుధన్యా హి త్వయా యదధునా స్మృతాః ॥10॥**

ఓ దేవదేవా! మహాదేవా! కరుణాసాగరా! ప్రభో! నీవీనాడు మమ్ము స్మరించుటచే మేము మిక్కిలి ధన్యులమయ్యాము.

**కిమర్థం సంస్మృతా నాథ శాసనం దేహి తద్ధి నః ।**
**స్వదాససదృశీం స్వామిన్ కృపాం కురు నమో౽స్తు తే ॥11॥**

స్వామీ! నీవు మమ్ములను దేనికొరకు స్మరించావు? నీవావిషయాన్ని మాకు ఆజ్ఞాపించు. నీదాసులయందు చూపించే కృపవంటి కృపను చూపుము. నీకు నమస్కారమగుగాక!

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య మునీనాం తు విజ్ఞప్తిం కరుణానిధిః ।**
**ప్రోవాచ విహసన్ ప్రీత్యా ప్రోత్ఫుల్లనయనాంబుజః ॥12॥**

మహర్షుల విన్నపాన్ని కరుణానిధియైన శివుడు విని, వికసించిన పద్మాలవంటి కన్నులు గలవాడై, ప్రేమతో నవ్వి ఇలా పలికాడు.

**మహేశ్వర ఉవాచ –** మహేశ్వరుడు పలికాడు.

**హే సప్తమునయ స్తాతాశ్శృణుతారం వచో మమ ।**
**అస్మద్ధితకరా యూయం సర్వజ్ఞానవిచక్షణాః ॥13॥**

ఓ సప్తర్షులారా! కుమారులారా! నా మాటను వినండి. సర్వజ్ఞులగు మీరు మాకు హితాన్ని చేసేవారు.

**తపశ్చరతి దేవేశీ పార్వతీ గిరిజాధునా ।**
**గౌరీశిఖరసంజ్ఞే హి పర్వతే దృఢమానసా ॥14॥**

దేవదేవియైన పార్వతి ఈసమయంలో గౌరీశిఖరమనే పేరుగల పర్వతం నందు దృఢచిత్తయై, తపమాచరిస్తోంది.

**మాం పతిం ప్రాప్తుకామా హి సా సఖీసేవితా ద్విజాః ।**
**సర్వాన్కామాన్ విహాయాన్యాన్పరం నిశ్చయమాగతా ॥15॥**

ఓ ద్విజులారా! ఆమె నన్ను భర్తగా పొందాలనే అంతిమనిశ్చయం చేసుకొని, ఇతర కామనల నన్నింటిని విడిచింది. ఆమెను చెలికత్తెలు కనిపెట్టియున్నారు.

**తత్ర గచ్ఛత యూయం మచ్ఛాసనాన్మునిసత్తమాః ।**
**పరీక్షాం దృఢతాయాస్తత్కురుత ప్రేమచేతసః ॥16॥**

ఓ మహర్షులారా! మీరు నా ఆజ్ఞచే అచ్చటకు వెళ్ళి ప్రేమతో నిండిన మనస్సు గలవారై ఆమె మనస్సు ఎంత దృఢమైనది అనే విషయాన్ని పరీక్షించండి.

**సర్వథా ఛలసంయుక్తం వచనీయం వచశ్చ వః ।**
**న సంశయః ప్రకర్తవ్య శ్శాసనాన్మమ సువ్రతాః ॥17॥**

ఓ ఋషులారా! మీరు నా శాసనంచే పూర్తి అసత్యాలు, నిందావాక్యాలు పలకండి. ఈ విషయంలో ఎటువంటి సందేహాన్ని పొందకండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాజ్ఞప్తాశ్చ మునయో జగ్ముస్తత్ర ద్రుతం హి తే ।**
**యత్ర రాజతి సా దీప్తా జగన్మాతా నగాత్మజా ॥18॥**

ఇట్లాజ్ఞాపింపబడిన మునులు శీఘ్రమే అచ్చటకు వెళ్ళారు. అచ్చట జగన్మాతయైన పార్వతీదేవి గొప్ప తేజస్సుతో విరాజిల్లుతోంది.

**తత్ర దృష్ట్వా శివా సాక్షాత్తపః సిద్ధిరివాపరా ।**
**మూర్తా పరమ తేజస్కా విలసంతీ సుతేజసా ॥19॥**

మూర్తీభవించిన తపస్సిద్ధివలె నున్నట్టియు, పరమతేజస్సుతో విలసిల్లుతున్నట్టియు, పార్వతిని వారచ్చట చూశారు.

**హృదా ప్రణమ్య తాం తే తు ఋషయస్సప్త సువ్రతాః ।**
**సన్నతా వచనం ప్రోచుః పూజితాశ్చ విశేషతః ॥20॥**

దృఢవ్రతులైన సప్తర్షులు ఆమెకు మనస్సులో నమస్కరించి, ఆమెచే ప్రత్యేకంగా పూజింపబడినవారై, వినయంతో ఇలా పలికారు.

**ఋషయ ఊచుః –** ఋషులు పలికారు.

**శృణు శైలసుతే దేవీ కిమర్థం తప్యతే తపః ।**
**ఇచ్ఛసి త్వం సురం కం చ కిం ఫలం తద్వదాధునా ॥21॥**

ఓ పార్వతీదేవీ! వినుము. నీవు దేనికొరకు తపస్సు చేస్తున్నావు? ఏ దేవతను కోరుకుంటున్నావు? ఏ ఫలాన్ని కోరుతున్నావు?

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా సా శివా దేవీ గిరీంద్రతనయా ద్విజైః ।**
**ప్రత్యువాచ వచస్సత్యం సుగూఢమపి తత్పురః ॥22॥**

సప్తర్షులిట్లు పలుకగా పార్వతీదేవి పరమ రహస్యమైనప్పటికి, సత్యాన్ని వారి యెదుట ఇట్లు పలికింది.

**పార్వత్యువాచ –** పార్వతి పలికింది.

**మునీశ్వరాస్సంశృణుత మద్వాక్యం ప్రీతితో హృదా ।**
**బ్రవీమి స్వవిచారం వై చింతితో యో ధియా స్వయా ॥23॥**

ఓ మునీశ్వరులారా! నామాటను ప్రీతితో మనస్సు లగ్నం చేసి వినండి. నేను నా బుద్ధితో ఆలోచించి, నిశ్చయించిన నా ఆలోచన చెబుతాను.

**కరిష్యథ ప్రహాసం మే శ్రుత్వా వాచో హ్యసంభవాః ।**
**సంకోచో వర్ణనాద్విప్రా భవత్యేవ కరోమి కిమ్ ॥24॥**

అసంభవమైన నా మాటలను విని, మీరు పరిహాసం చేస్తారు. మీ ఎదుట వర్ణించి చెప్పడానికి సంకోచం కలుగుతోంది. నేనేమిచేయగలను?

**ఇదం మనో హి సద్దృఢమవశం పరకర్మకృత్ ।**
**జలోపరి మహాభిత్తిం చికీర్షతి మహోన్నతామ్ ॥25॥**

ఈ నా మనస్సు నియంత్రింప సంభవం కానిది. నా వశంలో లేదు. అసంభవమైన కర్మలనపేక్షిస్తోంది. ఈ నా మనస్సు నీటిపై ఎత్తైన గోడను నిర్మించాలనుకుంటోంది.

**సురర్షే శ్శాసనం ప్రాప్య కరోమి సుదృఢం తపః ।**
**రుద్రః పతిర్భవేన్మే హి విధాయేతి మనోరథమ్ ॥26॥**

రుద్రుడు నాకు భర్తకావలెనను కోరికను మనస్సులో నుంచుకొని, దేవర్షియైన నారదుని ఆదేశం మేరకు తీవ్రమైన తపస్సు చేస్తున్నాను.

**అపక్షో మన్మనః పక్షీ వ్యోమ్ని ఉడ్డీయతే హఠాత్ ।**
**తదాశాం శంకరస్వామీ పిపర్తు కరుణానిధిః ॥27॥**

రెక్కలులేని నా మనస్సనే పక్షి హఠాత్తుగా ఆకాశంలో ఎగురుతోంది. కరుణానిధియైన శంకరస్వామి దాని ఆశను పరిపూర్ణం చేయుగాక!

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్యా విహస్య మునయశ్చ తే ।**
**సమ్మాన్య గిరిజాం ప్రీత్యా ప్రోచుశ్ఛలవచో మృషా ॥28॥**

ఆమె మాటలను విని, మహర్షులు నవ్వి, మనస్సులో పార్వతిని ప్రీతితో ఆదరించి, మాయమాట లిలా పలికారు.

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**న జ్ఞాతం తస్య చరితం వృథాపండితమానినః ।**
**దేవర్షేః క్రూరమనసః సుజ్ఞా భూత్వాప్యగాత్మజే ॥29॥**

దేవర్షియైన నారదుడు తాను పండితుడనని వ్యర్థంగా భావించేవాడు. క్రూరమైన మనస్సు కలవాడు. అతని చరిత్ర నీకు తెలియదు. ఓ పార్వతీ! నీవు సహజంగా బుద్ధిమంతురాలవే.

**నారదః కూటవాదీ చ పరచిత్తప్రమంథకః ।**
**తస్య వార్తాశ్రవణతో హానిర్భవతి సర్వథా ॥30॥**

నారదుడు మోసపు మాటలు చెప్పి ఇతరుల మనసులను కల్లోల పెడతాడు. అతని మాటలు విన్నవారికి సర్వథా హాని కలుగుతుంది.

**తత్ర త్వం శృణు సద్బుద్ధ్యా చేతిహాసం సుశోభితమ్ ।**
**క్రమాత్త్వాం బోధయంతో హి ప్రీత్యా తముపధారయ ॥31॥**

మేము నీకు క్రమంగా బోధిస్తాము. ఈ చక్కని వృత్తాంతాన్ని నీవు మంచిబుద్ధితో విని, ప్రీతితో దాన్ని తెలుసుకొని మనస్సులో నిశ్చయించు.

**బ్రహ్మపుత్రో హి యో దక్షస్సుషవే పితురాజ్ఞయా ।**
**స్వపత్న్యామయుతం పుత్రానయుంక్తం తపసి ప్రియాన్ ॥32॥**

బ్రహ్మపుత్రుడైన దక్షుడు తండ్రి ఆజ్ఞతో తన భార్యయందు పదివేల పుత్రులను కని, ఆ పుత్రులను తపస్సు చేయుమని నియోగించాడు.

**తే సుతాః పశ్చిమదిశి నారాయణసరో గతాః ।**
**తపోఽర్థే తే ప్రతిజ్ఞాయ నారదస్తత్ర వై యయౌ ॥33॥**

ఆ కుమారులు తపస్సు చేయడానికి ప్రతిజ్ఞ చేసి, పశ్చిమదిక్కుననున్న నారాయణసరస్సు వద్దకు వెళ్ళారు. నారదుడు కూడా అక్కడకు వెళ్ళాడు.

**కూటోపదేశమాశ్రావ్య తత్ర తాన్నారదో మునిః ।**
**తదాజ్ఞయా చ తే సర్వే పితుర్న గృహమాయయుః ॥34॥**

వారికి మోసపు ఉపదేశాన్ని చేశాడు. వారాతని ఉపదేశంచే తిరిగి తండ్రివద్దకు ఒక్కడైనా వెళ్ళలేదు.

**తచ్ఛ్రుత్వా కుపితో దక్షః పిత్రాశ్వాసితమానసః ।**
**ఉత్పాద్య పుత్రాన్ప్రాయుంక్త సహస్ర ప్రమితాంస్తతః ॥35॥**

ఈ వార్తను విని దక్షుడు కుపితుడు కాగా తండ్రి అతనిని ఓదార్చాడు. అనంతర కాలంలో అతడు తిరిగి వేయిమంది కుమారులను కని, తపస్సుకొరకు పంపాడు.

**తేఽపి తత్ర గతాః పుత్రాస్తపోఽర్థం పితురాజ్ఞయా ।**
**నారదోఽపి యయౌ తత్ర పునస్తత్ స్వోపదేశకృత్ ॥36॥**

ఆ కుమారులు కూడా తండ్రి ఆజ్ఞచే తపస్సు చేయడానికి అచ్చటికే వెళ్ళారు. నారదుడుకూడా అచ్చటకు మళ్ళీ వెళ్ళి వారికి వైరాగ్యాన్ని ఉపదేశించాడు.

**దదౌ తదుపదేశం తే తేభ్యో భ్రాతృపథం యయుః ।**
**ఆయయుర్న పితుర్గేహం భిక్షువృత్తిరతాశ్చ తే ॥37॥**

అతని ఉపదేశం చే వారు కూడా వారి సోదరుల మార్గంలోనే వెళ్ళారు. వారు భిక్షాటనయందభిరుచి గలవారై, తండ్రి గృహానికి మరలిపోలేదు.

**ఇత్థం నారదసద్వృత్తిర్విశ్రుతా శైలకన్యకే ।**
**అన్యాం శృణు హి తద్వృత్తిం వైరాగ్యకరణీం నృణామ్ ॥38॥**

ఈ విధంగా నారదుని మంచితనం లోకప్రసిద్ధమయ్యింది. మానవులలో వైరాగ్యాన్ని కలిగించే మరియొక గాథను వినుము.

**విద్యాధరశ్చిత్రకేతుర్యో బభూవ పురాఽకరోత్ ।**
**స్వోపదేశమయం దత్త్వా తస్మై శూన్యం చ తద్గృహమ్ ॥39॥**

పూర్వం చిత్రకేతుడనే విద్యాధరుడుండేవాడు. నారదుడాతనికి ఉపదేశం చేసి, అతని ఇంటిని శూన్యం చేశాడు.

**ప్రహ్లాదాయ స్వోపదేశాన్హిరణ్యకశిపోః పరమ్ ।**
**దత్త్వా దుఃఖం దదౌ చాయం పరబుద్ధిప్రభేదకః ॥40॥**

ఇతరుల బుద్ధిలో భేదాలను కల్పించే నారదుడు తన ఉపదేశాలను ప్రహ్లాదునకు చేసి, హిరణ్యకశిపునకు మహాదుఃఖాన్ని కలిగించాడు.

**మునినా నిజవిద్యా యచ్ఛ్రావితా కర్ణరోచనా ।**
**స్వస్వగేహం విహాయాశు భిక్షాం చరతి ప్రాయశః ॥41॥**

నారదముని ఎవరికి తన విద్యను వినిపిస్తాడో వాడు తప్పనిసరిగా తన ఇంటిని వీడి, వెంటనే భిక్షాటన మొదలు పెడతాడు.

**నారదో మలినాత్మా హి సర్వదోజ్జ్వలదేహవాన్ ।**
**జానీమస్తం విశేషేణ వయం తత్సహవాసినః ॥42॥**

నారదుని దేహం సర్వదా ప్రకాశించేదే. కాని అతని మనస్సు మాత్రం మలినం. అతనితో కలసి నివసించే మాకు అతని గురించి పూర్తిగా తెలుసు.

**బకం సాధుం వర్ణయంతి న మత్స్యానత్తి సర్వథా ।**
**సహవాసీ విజానీయాచ్చరిత్రం సహవాసినామ్ ॥43॥**

కొంగ సాధువని కొందరు చెబుతారు. కొంగ అన్నివేళలా చేపలను తినదుకదా! సహవాసుల చరిత్ర సహవాసులకు మాత్రమే తెలుస్తుంది కదా!

**లబ్ధ్వా తదుపదేశం హి త్వమపి ప్రాజ్ఞసమ్మతా ।**
**వృథైవ మూర్ఖీభూతా తు తపశ్చరసి దుష్కరమ్ ॥44॥**

నీవు బుద్ధిమంతురాలవే అయినను అతని ఉపదేశాన్ని పొంది, మూర్ఖురాలవై, వ్యర్థంగా కఠిన తపస్సు చేస్తున్నావు.

**యదర్థమీదృశం బాలే కరోషి విపులం తపః ।**
**సదోదాసీ నిర్వికారో మదనారిర్న సంశయః ॥45॥**

అమ్మాయీ! నీవు ఎవని కొరకు ఇంత విస్తారమైన తపస్సు చేస్తున్నావో ఆ శివుడు సర్వదా ఉదాసీనుడై యుంటాడు. ఆయన నిర్వికారుడు. మన్మథుడ్ని సంహరించినవాడు, ఇందులో సందేహము లేదు.

**అమంగళవపుర్ధారీ నిర్లజ్జోఽసదనోఽకులీ ।**
**కువేషీ ప్రేతభూతాదిసంగీ నగ్నో హి శూలభృత్ ॥46॥**

శూలధారియైన శివుడు అమంగళమైన శరీరం కలిగి, సిగ్గులేనివాడై యుంటాడు. ఆయనకు ఇల్లు లేదు. కులంలేదు. ఆయన దిగంబరుడై, చెడు వేషాన్ని కలిగి, ప్రేత పిశాచాదులతో స్నేహం చేస్తాడు.

**స ధూర్తస్తవ విజ్ఞానం వినాశ్య నిజమాయయా ।**
**మోహయామాస సద్యుక్త్యా కారయామాస వై తపః ॥47॥**

ఆ మోసగాడు తన మాయచే నీ బుద్ధిని చెడగొట్టి, నిన్ననేక యుక్తులతో మోహింపజేసి, నీచే చేతపస్సు చేయిస్తున్నాడు.

**ఈదృశం హి వయం లబ్ధ్వా కిం సుఖం సంభవిష్యతి ।**
**విచారం కురు దేవేశి త్వమేవ గిరిజాత్మజే ॥48॥**

ఇటువంటివానిని వివాహమాడిన స్త్రీకి ఏమి సుఖం కలుగుతుందో ఓ దేవదేవీ! పార్వతీ! నీవే ఆలోచించు.

**ప్రథమం దక్షజాం సాధ్వీం వివాహ్య సుధియా సతీమ్ ।**
**నిర్వాహం కృతవాన్నైవ మూఢః కించిద్దినాని హి ॥49॥**

ఆ మూర్ఖుడు ముందుగా దక్షపుత్రియు, పతివ్రతయునగు సతిని వివాహమాడి, సద్బుద్ధితో కొన్నిరోజులైనా సరిగా కాపురం చేయలేదు.

**తాం తథైవ స వై దోషం దత్త్వాత్యాక్షీత్స్వయం ప్రభుః ।**
**ధ్యాయన్ స్వరూపమకలమశోకమరమత్సుఖీ ॥50॥**

స్వయంగా ఆ ప్రభువే ఆమెయందు దోషాన్నారోపించి, పరిత్యజించాడు. ఆయన నిరవయవం, శోకరహితమునైన ఆత్మతత్త్వాన్ని ధ్యానిస్తూ సుఖంగా రమిస్తున్నాడు.

**ఏకలః పరనిర్వాణో హ్యసంగోఽద్వయ ఏవ చ ।**
**తేన నార్యాః కథం దేవి నిర్వాహః సంభవిష్యతి ॥51॥**

ఆయన ఏకాకి, పరమ మోక్షస్వరూపుడు, సంగరహితుడు, అద్వితీయుడు, స్త్రీలు అతనితో ఎట్లు వేగుతారు? అది సంభవం కాదు.

**అద్యాపి శాసనం ప్రాప్య గృహమాయాహి దుర్మతిమ్ ।**
**త్యజాస్మాకం మహాభాగే భవిష్యతి చ శం తవ ॥52॥**

ఇప్పటికైనను మా ఆజ్ఞను మన్నించి, చెడుబుద్ధిని వీడి, ఇంటికి వెళ్ళుము. ఓ పుణ్యాత్మురాలా! నీకు శుభం కలుగగలదు.

**త్వద్యోగ్యో హి వరో విష్ణుస్సర్వసద్గుణవాన్ప్రభుః ।**
**వైకుంఠవాసీ లక్ష్మీశో నానాక్రీడావిశారదః ॥53॥**

మంచి గుణాలన్నియు కలిగిన విష్ణువు నీకు తగిన వరుడు. ఆయన వైకుంఠంలో ఉంటాడు. లక్ష్మీపతియైన విష్ణువు వివిధక్రీడలలో నిపుణుడు.

**తేన తే కారయిష్యామో వివాహం సర్వసౌఖ్యదమ్ ।**
**ఇతీదృశం త్యజ హఠం సుఖితా భవ పార్వతి ॥54॥**

ఆయనతో వివాహం సర్వసుఖాలనిస్తుంది. నీకా వివాహం మేము చేయిస్తాము. ఓ పార్వతీ! మొండిపట్టును విడిచిపెట్టు, సుఖపడు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేదం వచనం శ్రుత్వా పార్వతీ జగదంబికా ।**
**విహస్య చ పునః ప్రాహ మునీన్ జ్ఞానవిశారదాన్ ॥55॥**

ఈ మాటలను విని, జగన్మాతయైన పార్వతీదేవి నవ్వి, జ్ఞానవిశారదులైన మునులతో ఇలా పలికింది.

**పార్వత్యువాచ** - పార్వతి పలికింది.

**సత్యం భవద్భిః కథితం స్వజ్ఞానేన మునీశ్వరాః ।**
**పరం తు మే హఠో నైవ ముక్తో భవతి హే ద్విజాః ॥56॥**

ఓ మునీశ్వరులారా! మీరు మీకు తెలిసిన సత్యాన్ని పలికారు. కాని నాకుగల మొండిపట్టుదల తొలగిపోయేది కానేకాదు.

**స్వతనోః శైలజాతత్వాత్కాఠిన్యం సహజం స్థితమ్ ।**
**ఇత్థం విచార్య సుధియా మాం నిషేద్ధుం న చార్హథ ॥57॥**

నేను పర్వతపుత్రికను కదా! కాబట్టి నేను సహజంగానే కఠినురాలను. మీరు మంచి బుద్ధితో సత్యాన్ని విచారించండి. నన్ను తపస్సు చేయవద్దని వారించడం తగదు.

**సురర్షేర్వచనం పథ్యం త్యక్ష్యేనైవ కదాచన ।**
**గురూణాం వచనం పథ్యమితి వేదవిదో విదుః ॥58॥**

దేవర్షియైన నారదుని హితకరమైన వచనాన్ని నేనెన్నటికి పరిత్యజించను. గురువుల వచనం హితకరమని వేదవేత్తలు చెబుతారు.

**గురూణాం వచనం సత్యమితి యేషాం దృఢా మతిః ।**
**తేషామిహాముత్ర సుఖం పరమం నాసుఖం క్వచిత్ ॥59॥**

గురువుల వచనం సత్యమని ఎవరికైతే దృఢమైన నిశ్చయం ఉంటుందో వారికి ఇహపర లోకాలలో పరమ సుఖం కలుగుతుంది. వారికెన్నడును దుఃఖం కలుగదు.

**గురూణాం వచనం సత్యమితి యద్ధృదయే న ధీః ।**
**ఇహాముత్రాపి తేషాం హి దుఃఖం న చ సుఖం క్వచిత్ ॥60॥**

గురువుల వచనం సత్యమనే నిర్ణయం ఎవరి హృదయాలలో ఉండదో వారికి ఇహపరములు రెండింటియందు దుఃఖమే కలుగుతుంది. వారికెచ్చటను, ఎన్నడును సుఖం కలుగదు.

**సర్వథా న పరిత్యాజ్యం గురూణాం వచనం ద్విజాః ।**
**గృహం వసేద్వా శూన్యం స్యాన్మే హఠస్సుఖదస్సదా ॥61॥**

ఓ బ్రాహ్మణులారా! గురువుల వాక్యాన్ని ఎట్టిపరిస్థితులలోను వీడరాదు. నా యీ హఠం నన్ను గృహిణిని చేసి, శాశ్వతసుఖాన్ని ఈయవచ్చు, లేదా నాకు శూన్యం మిగలవచ్చు.

**యద్భవద్భిస్సుభణితం వచనం మునిసత్తమాః ।**
**తదన్యథా తద్వివేకం వర్ణయామి సమాసతః ॥62॥**

ఓ మునిసత్తములారా! మీరు చక్కగా చెప్పిన వచనం సరికాదు. దానిలోగల వివేకాన్ని సంగ్రహంగా వర్ణించి చెబుతాను.

**గుణాలయో విహారీ చ విష్ణుస్సత్యం ప్రకీర్తితః ।**
**సదాశివోఽగుణః ప్రోక్తస్తత్ర కారణముచ్యతే ॥63॥**

విష్ణువు గుణసంపన్నుడనియు, విహరించువాడనియు, మీరు చెప్పారు. అది సత్యమే. మీచే సదాశివుడు గుణరహితుడని చెప్పబడ్డాడు. దానికి గల కారణం నేను చెబుతాను.

**శివో బ్రహ్మ వికారః స భక్తహేతోర్ధృతాకృతిః ।**
**ప్రభుతాం లౌకికీం నైవ సందర్శయితుమిచ్ఛతి ॥64॥**

పరబ్రహ్మయొక్క సగుణరూపమే శివుడు. ఆయన భక్తుల కొరకు ఆకారాన్ని పొందాడు. ఆయనకు లౌకికమైన సామర్థ్యాన్ని ప్రదర్శించాలనే ఆకాంక్ష లేనే లేదు.

**అతః పరమహంసానాం ధార్యతే సుప్రియా గతిః ।**
**అవధూతస్వరూపేణ పరానందేన శంభునా ॥65॥**

అందువల్లనే అవధూత స్వరూపుడు, పరమానందఘనుడునైన శివుడు పరమహంసలకు ఆనందంతో పొందదగిన పరమగతియై యున్నాడు.

**భూషణాదిరుచిర్మాయాలిప్తానాం బ్రహ్మణో న చ ।**
**స ప్రభుర్నిగుణోఽజో నిర్మాయోఽలక్ష్యగతిర్విరాట్ ॥66॥**

మాయాలేపం గలవారికి భూషణాదులయందభిరుచి యుంటుంది. కాని పరబ్రహ్మకు అట్టి అభిరుచి యుండదు. ఆ ప్రభుడు. నిర్గుణుడు, పుట్టుకలేనివాడు, మాయాలేపం లేనివాడు, ఆయన స్వరూపం ఇంద్రియ గోచరం కాదు. కాని విరాడ్రూపంలో నున్నది ఆయనయే.

**ధర్మజాత్యాదిభిశ్శంభుర్నానుగృహ్ణాతి వై ద్విజాః ।**
**గురోరనుగ్రహేణైవ శివం జానామి తత్త్వతః ॥67॥**

ఓ ద్విజులారా! ధర్మము, జాతి మున్నగునవి శివానుగ్రహం పొందడంలో హేతువులు కాజాలవు. గురువుయొక్క అనుగ్రహంచేత మాత్రమే నేను శివుని యథార్థస్వరూపాన్ని తెలుసుకున్నాను.

**చేచ్ఛివస్స హి మే విప్రా వివాహం న కరిష్యతి ।**
**అవివాహా సదాహం స్యాం సత్యం సత్యం వదామ్యహమ్ ॥68॥**

ఓ విప్రులారా! ఆ శివుడు నన్ను వివాహమాడనిచో నేను అవివాహితురాలిగా శాశ్వతకాలం మిగిలియుంటాను. నేను ముమ్మాటికి సత్యాన్నే పలుకుతున్నాను.

**ఉదయతి యదిభానుః పశ్చిమే దిగ్విభాగే ।**
**ప్రచలతి యది మేరుః శీతతాం యాతి వహ్నిః ॥69॥**

**వికసతి యది పద్మం పర్వతాగ్రే శిలాయామ్ ।**
**న హి చలతి హఠో మే సత్యమేతద్బ్రవీమి ॥70॥**

సూర్యుడు పశ్చిమ దిక్కునందుదయించినను, మేరుపర్వతం కదలడం ప్రారంభించినను, అగ్ని చల్లబడినను, పర్వతశిఖరాగ్రశిలపై పద్మం వికసించినను, నాయీ హఠం చలించదు. నేను సత్యమునే పలుకుతున్నాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా తాన్ప్రణమ్యాశు మునీన్సా పర్వతాత్మజా ।**
**విరరామ శివం స్మృత్వా నిర్వికారేణ చేతసా ॥71॥**

ఇట్లు పలికి, పార్వతి వెంటనే మహర్షులకు నమస్కరించి, వికారంలేని మనస్సుతో శివుని స్మరించి, విరమించింది.

**ఋషయోఽపీత్థమాజ్ఞాయ గిరిజాయాస్సునిశ్చితమ్ ।**
**ప్రోచుర్జయగిరం తత్ర దదుశ్చాశిషముత్తమామ్ ॥72॥**

ఆ ఋషులుకూడా పార్వతి దృఢనిశ్చయాన్ని తెలుసుకుని, "జయము కలుగుగాక!" అని ఉత్తమమైన ఆశీర్వచనాన్ని పలికారు.

**అథ ప్రణమ్య తాం దేవీం మునయో హృష్టమానసాః ।**
**శివస్థానం ద్రుతం జగ్ముస్తత్పరీక్షాకరా మునే ॥73॥**

అంతట ఆనందంతో నిండిన మనస్సుగల ఆ మహర్షులు పార్వతీదేవికి నమస్కరించారు. ఓ మహర్షీ! ఈ విధంగా ఆమెను పరీక్షించినవారు వెంటనే శివస్థానానికి చేరారు.

**తత్ర గత్వా శివం నత్వా వృత్తాంతం వినివేద్య తత్ ।**
**తదాజ్ఞాం సమనుప్రాప్య స్వర్లోకం జగ్మురాదరాత్ ॥74॥**

వారచ్చటకువెళ్ళి, శివునకు నమస్కరించి, పార్వతి వృత్తాంతాన్నంతటిని నివేదించి, ఆయన ఆజ్ఞను పొంది, ఆనందంతో స్వర్గలోకానికి వెళ్ళారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే సప్తర్షికృతపరీక్షావర్ణనం నామ పంచవింశోఽధ్యాయః ॥25॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో సప్తర్షులు పార్వతిని పరీక్షించుట అనే ఇరవై ఐదవ అధ్యాయం సమాప్తం.

## షడ్వింశోఽధ్యాయః - ఇరవై ఆరవ అధ్యాయం

## పార్వతీజటిలసంవాదః - పార్వతీజటిలసంవాదం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**గతేషు తేషు మునిషు స్వం లోకం శంకరః స్వయమ్ ।**
**పరీక్షితుం తపో దేవ్యా ఐచ్ఛత్సూతికరః ప్రభుః ॥1॥**

ఆ మునులు తమ లోకానికి వెళ్ళగానే సృష్టికారణుడగు శంకరప్రభువు పార్వతీదేవి తపస్సును స్వయంగా పరీక్షించాలనుకున్నాడు.

**పరీక్షాఛద్మనా శంభుర్ద్రష్టుం తాం తుష్టమానసః ।**
**జాటిలం రూపమాస్థాయ స యయౌ పార్వతీవనమ్ ॥2॥**

పరీక్షయనే నెపంతో ఆమెను చూడగోరిన శంభుడు, సంతోషంతో గూడిన మనస్సు గలవాడై, జటాధారియైన విప్రరూపాన్ని ధరించి, పార్వతి తపస్సు చేస్తున్న వనానికి వెళ్ళాడు.

**అతీవ స్థవిరో విప్రదేహధారీ స్వతేజసా ।**
**ప్రజ్జ్వలన్మనసా హృష్టో దండీ ఛత్రీ బభూవ సః ॥3॥**

సంతోషంతో నిండిన మనస్సుగల శివుడు స్వతేజస్సుతో ప్రకాశిస్తూ, కర్రను, గొడుగును ధరించిన ముదుసలి బ్రాహ్మణవేషాన్ని ధరించాడు.

**తత్రాపశ్యత్స్థితాం దేవీం సఖీభిః పరివారితామ్ ।**
**వేదికోపరిశుద్ధాం తాం శివామివ విధోః కలామ్ ॥4॥**

ఆయన అచ్చట చెలికత్తెలతో చుట్టువారబడి, తపోవేదికపై స్వచ్ఛమైన చంద్రకళవలె ప్రకాశిస్తున్న పార్వతీదేవిని చూశాడు.

**శంభుర్నిరీక్ష్య తాం దేవీం బ్రహ్మచారిస్వరూపవాన్ ।**
**ఉపకంఠం యయౌ ప్రీత్యా తదాసౌ భక్తవత్సలః ॥5॥**

భక్తవత్సలుడైన శంభుడు బ్రహ్మచారి రూపాన్ని ధరించినవాడై, పార్వతీదేవినిచూచి, ప్రేమతో సమీపానికి వెళ్ళాడు.

**ఆగతం తం తదా దృష్ట్వా బ్రాహ్మణం తేజసాద్భుతమ్ ।**
**అపూజయచ్ఛివాదేవీ సర్వపూజోపహారకైః ॥6॥**

అద్భుతమైన తేజస్సుతో ప్రకాశిస్తూ, అక్కడకు విచ్చేసిన బ్రాహ్మణుని చూచి పార్వతీదేవి సర్వపూజోప హారాలతో ఆయనను పూజించింది.

**సుసత్కృతం సంవిధాభిః పూజితం పరయా ముదా ।**
**పార్వతీ కుశలం ప్రీత్యా పప్రచ్ఛ ద్విజమాదరాత్ ॥7॥**

పార్వతీదేవి పరమానందంతో చక్కగా అమర్చిన పూజా ద్రవ్యాలతో ఆ బ్రాహ్మణుని పూజించి, ఆదరంతోను, ప్రీతితోను ఆయనను కుశలమడిగింది.

**పార్వత్యువాచ** – పార్వతి పలికింది.

**బ్రహ్మచారిస్వరూపేణ కస్త్వం హి కుత ఆగతః ।**
**ఇదం వనం భాసయసే వద వేదవిదాంవర ॥8॥**

ఓ వేదవిదులలో శ్రేష్ఠుడా! బ్రహ్మచారి రూపంలోనున్న నీవెవరవు? ఎక్కడనుండి వచ్చావు? చెప్పుము? ఈవనం నీచే ప్రకాశిస్తోంది.

**విప్ర ఉవాచ** – విప్రుడు పలికాడు.

**అహమిచ్ఛాభిగామీ చ వృద్ధో విప్రతనుస్సుధీః ।**
**తపస్వీ సుఖదోఽన్యేషాముపకారీ న సంశయః ॥9॥**

నేను ఇచ్చవచ్చినచోట సంచరించే వృద్ధ బ్రాహ్మణుడను, విద్వాంసుడను, తపశ్శాలిని. నేనితరులకుపకారం చేసి, సుఖాన్ని కలిగిస్తాననడంలో సందేహం లేదు.

**కా త్వం కస్యాసి తనయా కిమర్థం విజనే వనే ।**
**తపశ్చరసి దుర్ధర్షం మునిభిః ప్రపదైరపి ॥10॥**

నీవెవరు? ఎవరి కుమార్తెవు. ఈ నిర్జనవనంలో తపమాచరించే మునులకు కూడా చేయశక్యం కాని తపస్సు ఎందులకు చేస్తున్నావు?.

**న బాలా న చ వృద్ధాసి తరుణీ భాసి శోభనా ।**
**కథం పతిం వినా తీక్ష్ణం తపశ్చరసి వై వనే ॥11॥**

నీవు చిన్నపిల్లవు కాదు. వృద్ధురాలవూ కాదు. నీవు అందమైన యువతివని స్పష్టమౌతోంది. భర్త తోడు లేకుండా ఈ వనంలో ఉగ్రతపస్సు ఎందులకు చేస్తున్నావు?

**కిం త్వం తపస్వినీ భద్రే కస్యచిత్సహచారిణీ ।**
**తపస్వీ స న పుష్ణాతి దేవి త్వాం చ గతోఽన్యతః ॥12॥**

ఓ మంగళస్వరూపురాలా! తపస్వినీ! నీవెవరి భార్యవు? ఆ దీనుడు నిన్ను పోషించుటలేదా? అతడు నిన్ను విడిచి మరియొక చోటకు వెళ్ళాడా ఏమి?

**వద కస్య కులే జాతా కః పితా తవ కా విధా ।**
**మహాసౌభాగ్యరూపా త్వం వృథా తవ తపోరతిః ॥13॥**

నీవెవరికులంలో జన్మించావో చెప్పు? నీతండ్రి ఎవరు? నీజీవనాధారమేమిటి? నీరూపం మహాసౌభాగ్యవంతమై ఉన్నది. తపస్సుపై నీకుగల ప్రేమ వ్యర్థం.

**కిం త్వం వేదప్రసూర్లక్ష్మీః కిం సురూపా సరస్వతీ ।**
**ఏతాసు మధ్యే కా వా త్వం నాహం తర్కితుముత్సహే ॥14॥**

నీవు వేదమాతవా? లక్ష్మీదేవివా? లేక సుందరరూపిణియగు సరస్వతివా? వీరిలో నీవెవ్వరివో ఊహించడం నాకు శక్యం కాదు.

**పార్వత్యువాచ** - పార్వతి పలికింది.

**నాహం వేదప్రసూర్విప్ర న లక్ష్మీశ్చ సరస్వతీ ।**
**అహం హిమాచలసుతా సాంప్రతం నామ పార్వతీ ॥15॥**

నేను వేదమాతను గాను. లక్ష్మినీగాను, సరస్వతినికూడగాను. నేనీ జన్మలో హిమవంతుని కుమార్తెను. నాపేరు పార్వతి.

**పురా దక్షసుతా జాతా సతీ నామాన్యజన్మని ।**
**యోగేన త్యక్త దేహాహం యత్పిత్రా నిందితః పతిః ॥16॥**

పూర్వజన్మలో నేను సతి అను పేర దక్షునికుమార్తెనై జన్మించాను. నాభర్తను నాతండ్రి నిందించడంచేత నేను యోగమార్గంలో దేహాన్ని త్యజించాను.

**అత్ర జన్మని సంప్రాప్త శ్శివోఽపి విధివైభవాత్ ।**
**మాం త్యక్త్వా భస్మసాత్కృత్య మన్మథం చ జగామ హ ॥17॥**

ఈ జన్మలో శివుడు లభించాడు. కాని విధివిలాసం వల్ల ఆయన మన్మథుని దహించి, నన్ను వీడి వెళ్ళిపోయాడు.

**ప్రయాతే శంకరే తాపో ద్విజితాహం పితుర్గృహాత్ ।**
**ఆగతా తపసే విప్ర సుదృఢా స్వర్ణదీతటే ॥18॥**

శంకరుడు వెళ్ళిన తరువాత నేను దుఃఖంచే పీడింపబడినదాననై, తండ్రిగారి గృహాన్ని విడిచిపెట్టాను. హే విప్రా! గంగానదీ తీరంలో తపస్సు చేయాలనే దృఢనిశ్చయంతో ఇచ్చటకు వచ్చియున్నాను.

**కృత్వా తపః కఠోరం చ సుచిరం ప్రాణవల్లభమ్ ।**
**న ప్రాప్యాగ్నౌ వివిక్షంతీ త్వాం దృష్ట్వా సంస్థితా క్షణమ్ ॥19॥**

నేను చిరకాలం కఠిన తపస్సు చేసినను నా ప్రాణప్రియుని పొందజాలక పోవడంచేత అగ్నిలో ప్రవేశింపగోరి, నిన్నుచూచి కొద్దిసేపు ఆగాను.

**గచ్ఛ త్వం ప్రవిశామ్యగ్నౌ శివేనాంగీకృతా న హి ।**
**యత్ర యత్ర జనుర్లప్స్యే వరిష్యామి శివం వరమ్ ॥20॥**

నీవు వెళ్ళు, నేను అగ్నిలో ప్రవేశిస్తాను. ఎందుకనగా శివుడు నన్ను స్వీకరించలేదు. నేను ఎక్కడ జన్మించినా శివుని భర్తగా వరిస్తాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా పార్వతీ వహ్నౌ తత్పురః ప్రవివేశ సా ।**
**నిషిధ్యమానా పురతో బ్రాహ్మణేన పునః పునః ॥21॥**

ఇట్లు పలికి ఆ పార్వతి ఆయన యెదుట అగ్నిలో ప్రవేశించింది. ఆ బ్రాహ్మణుడు వద్దు వద్దని ఎన్నిమార్లు వారించినప్పటికి ఆమె లెక్కచేయలేదు.

**వహ్నౌ ప్రవేశం కుర్వత్యాః పార్వత్యాస్తత్ప్రభావతః ।**
**బభూవ తత్క్షణం సద్యో వహ్నిశ్చందనపంకవత్ ॥22॥**

అగ్నిలో ప్రవేశించిన పార్వతికి ఆయన మహిమచే వెంటనే అగ్ని గంధపు ముద్దవలె అయ్యింది.

**క్షణం తదంతరే స్థిత్వా హ్యుత్పతంతీం దివం ద్విజః ।**
**పునః ప్రప్రచ్ఛ సహసా విహసన్సుతనుం శివః ॥23॥**

క్షణకాలం అగ్నియందుండి, ఆకాశంపైకి వస్తున్న సుందరియైన పార్వతినిచూచి, శివుడు చిరునవ్వుతో ఇట్లు ప్రశ్నించాడు.

**ద్విజ ఉవాచ –** బ్రహ్మచారి పలికాడు.

**అహో తపస్తే కిం భద్రే న బుద్ధం కించిదేవ హి ।**
**న దగ్ధో వహ్నినా దేహో న చ ప్రాప్తం మనీషితమ్ ॥24॥**

ఓ మంగళస్వరూపురాలా! నీవుచేసే తపస్సు పరమాశ్చర్యం. నాకేమీ తెలియడంలేదు. అగ్నిలో ప్రవేశించినప్పటికి నీకేమీ తెలియలేదు. నీ దేహాన్ని అగ్ని దహించలేదు. నీ కోరిక నెరవేరలేదు.

**అతస్సత్యం నికామం వై వద దేవి మనోరథమ్ ।**
**మమాగ్రే విప్రవర్యస్య సర్వానందప్రదస్య హి ॥25॥**

కాబట్టి అందరికి ఆనందాన్నిచ్చే (నీ మనస్సులోని యథార్థమైన కోరికను) బ్రాహ్మణశ్రేష్ఠుడనైన నాతో నీ మనోరథమును యథార్థముగా చెప్పుము.

**యథావిధి త్వయా దేవి కీర్త్యతాం సర్వథాత్మనా ।**
**తస్మాన్మైత్రీ చ సంజాతా కార్యం గోప్యం త్వయా న హి ॥26॥**

ఓ దేవీ! నీవు నన్ను యథావిధిగా ఆదరించావు. నీ మనస్సులోని మాట చెప్పుము. నీకు నాకు మధ్య స్నేహం ఏర్పడింది. కావున నీ కోరికను నీవు దాచిపెట్టకుము.

**కిమిచ్ఛసి వరం దేవి ప్రష్టుమిచ్ఛామ్యతః పరమ్ ।**
**త్వయ్యేవ తదసౌ దేవి ఫలం సర్వం ప్రదృశ్యతే ॥27॥**

ఓ దేవీ! నీకేమి వరం కావాలి. నిన్నింకనూ ప్రశ్నించాలనే కోరిక నాకు కలుగుతోంది. నీ తపఃఫలమంతా నీలోనే కనిపిస్తోంది.

**పరార్థే చ తపశ్చేద్వై తిష్ఠేత్తు తప ఏవ తత్ ।**
**రత్నం హస్తే సమాదాయ హిత్వా కాచస్తు సంచితః ॥28॥**

పరలోకం కోసం తపస్సు చేస్తున్నావా? అట్లైన ఈ తపస్సును దూరంగా ఉంచు. ఎందుకనగా చేతికి చిక్కిన రత్నాన్ని వీడి, గాజుముక్కను పట్టుకున్నట్లౌతుంది.

**ఈదృశం తవ సౌందర్యం కథం వ్యర్థీకృతం త్వయా ।**
**హిత్వా వస్త్రాణ్యనేకాని చర్మాది చ ధృతం త్వయా ॥29॥**

ఇటువంటి నీ సౌందర్యాన్ని వ్యర్థం చేయడానికిగల కారణమేమిటి? అనేక రకాలైన వస్త్రాలను వీడి, చర్మం మున్నగు వాటిని ఎందులకు ధరిస్తున్నావు?

**తత్సర్వం కారణం బ్రూహి తపసస్త్వస్య సత్యతః ।**
**తచ్ఛ్రుత్వా విప్రవర్యోఽహం యథా హర్షమవాప్నుయామ్ ॥30॥**

నీ యీ తపస్సునకుగల యథార్థ కారణాన్ని పూర్తిగా వివరించి చెప్పుము. బ్రాహ్మణశ్రేష్ఠుడనైన నేను ఆ వివరాలను విని ఆనందిస్తాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇతి పృష్టా తదా తేన సఖీం ప్రైరయితాంబికా ।**
**తన్ముఖేనైవ తత్సర్వం కథయామాస సువ్రతా ॥31॥**

ఆయన ఇట్లు ప్రశ్నించగా దృఢవ్రతయైన పార్వతి చెలికత్తెలను ప్రేరేపించి, ఆమెద్వారా వృత్తాంతాన్నంతటిని చెప్పించింది.

**తయా చ ప్రేరితా తత్ర పార్వత్యా విజయాభిధా ।**
**ప్రాణప్రియా సువ్రతజ్ఞా సఖీ జటిలమబ్రవీత్ ॥32॥**

పార్వతిచే ప్రేరేపింపబడినట్టియు, ఆమెకు ప్రాణప్రియురాలైనట్టియు, దీక్షను గురించి చక్కని జ్ఞానం కలట్టియు, 'విజయ' అను పేరుగలట్టియు, చెలికత్తె ఆ బ్రహ్మచారితో ఇట్లు పలికింది.

**సఖ్యువాచ** – సఖి పలికింది.

**శృణు సాధో ప్రవక్ష్యామి పార్వతీచరితం పరమ్ ।**
**హేతుం చ తపసస్సర్వం యది త్వం శ్రోతుమిచ్ఛసి ॥33॥**

ఓ సాధూ! శ్రేష్ఠమైన పార్వతీచరిత్రను, ఆమె తపస్సునకుగల కారణాన్నంతటిని నీవు వినగోరుచున్నచో నేను చెబుతాను విను.

**సఖీ మే గిరిరాజస్య సుతేయం హిమభూభృతః ।**
**ఖ్యాతా వై పార్వతీనామ్నా సా కాళీతి చ మేనకా ॥34॥**

ఈ నా చెలికత్తె పర్వతరాజగు హిమవంతునికి మేనకయందు జన్మించింది. ఈమెకు పార్వతి, కాళీ అనుపేర్లు ప్రసిద్ధంగా ఉన్నాయి.

**ఊఢేయం న చ కేనాపి న వాంఛతి శివాత్పరమ్ ।**
**త్రీణి వర్ష సహస్రాణి తపశ్చరణసాధినీ ॥35॥**

ఈమెకింకను వివాహం కాలేదు. ఈమె శివుని తక్క మరియొకరిని కోరడం లేదు. ఈమె మూడు వేల సంవత్సరాలనుండి తపస్సు చేస్తోంది.

**తదర్థం మేఽనయా సఖ్యా ప్రారబ్ధం తప ఈదృశమ్ ।**
**తదత్ర కారణం వక్ష్యే శృణు సాధో ద్విజోత్తమ ॥36॥**

ఓ సాధూ! ఈ నా చెలికత్తె శివుని కొరకు ఇట్టి తపస్సు ఆరంభించింది. దానికిగల కారణం చెబుతాను విను.

**హిత్వేంద్ర ప్రముఖాన్దేవాన్ హరిం బ్రహ్మాణమేవ చ ।**
**పతిం పినాకపాణిం వై ప్రాప్తుమిచ్ఛతి పార్వతీ ॥37॥**

ఇంద్రాది దేవతలను, విష్ణువును, బ్రహ్మనుకూడా విడిచి పార్వతి పినాకపాణియైన శివుని భర్తగా పొందగోరుతోంది.

**ఇయం సఖీ మదీయా వై వృక్షానారోపయత్పురా ।**
**తేషు సర్వేషు సంజాతం ఫలపుష్పాదికం ద్విజ ॥38॥**

ఈ నా చెలికత్తె పూర్వం వృక్షాలను నాటింది. అవన్నీ పూవులు పూచి,ఫలాలనిస్తున్నాయి.

**రూపసార్థాయ జనకకులాలంకరణాయ చ ।**
**సముద్దిశ్య మహేశానం కామస్యానుగ్రహాయ చ ॥39॥**

**మత్సఖీ నారదోపదేశాత్తపస్తపతి దారుణమ్ ।**
**మనోరథః కుతస్తస్యా న ఫలిష్యతి తాపస ॥40॥**

తన రూపాన్ని సార్థకం చేసుకోవడానికి, తండ్రి వంశాన్ని అలంకరింపజేయడానికి, మన్మథుని అనుగ్రహించడానికి నా యీ చెలికత్తె మహేశ్వరునుద్దేశించి, నారదుని ఉపదేశంచే మిక్కిలి తీవ్రమైన తపస్సును చేస్తోంది. ఓ తపశ్శాలీ! ఆమె కోరిక ఎందులకు నెరవేరదు?

**యత్తే పృష్టం ద్విజశ్రేష్ఠ మత్సఖ్యా మనసీప్సితమ్ ।**
**మయా ఖ్యాతం చ తత్ప్రీత్యా కిమన్యచ్ఛ్రోతు మిచ్ఛసి ॥41॥**

ఓ ద్విజశ్రేష్ఠా! నీవడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాను. నా చెలికత్తెయొక్క మనోరథాన్ని ప్రీతితో వివరించాను. ఇంకను నీవేమి వినాలనుకుంటున్నావు?

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవం వచనం శ్రుత్వా విజయాయా యథార్థతః ।**
**మునే స జటిలో రుద్రో విహసన్వాక్యమబ్రవీత్ ॥42॥**

ఓ మహర్షీ! విజయ పలికిన యథార్థవచనాలను విని, బ్రహ్మచారిరూపంలోనున్న రుద్రుడు నవ్వి ఇట్లన్నాడు.

**జటిల ఉవాచ –** బ్రహ్మచారి పలికాడు.

**సఖ్యేదం కథితం తత్ర పరిహాసోఽనుమీయతే ।**
**యథార్థం చేత్తదా దేవీ స్వముఖేనాభిభాషతామ్ ॥43॥**

ఈ చెలికత్తె చెప్పిన మాటలలో పరిహాసమున్నట్లు తోస్తోంది. ఆ వచనం యథార్థమైతే, ఆమాటను ఆమే చెప్పనీ!

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తే చ తదా తేన జటిలేన ద్విజన్మనా ।**
**ఉవాచ పార్వతీ దేవీ స్వముఖేనైవ తం ద్విజమ్ ॥44॥**

ఆ బ్రాహ్మణ బ్రహ్మచారి ఇట్లు పలుకగా పార్వతీదేవి ఆ బ్రాహ్మణునితో తన నోటితో ఇలా పలికింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే పార్వతిజటిలసంవాదం నామ షడ్వింశోఽధ్యాయః ॥26॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో శిపార్వతీజటిల సంవాదం అనే ఇరవై ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తవింశోఽధ్యాయః - ఇరవై ఏడవ అధ్యాయం

## బ్రహ్మచారిప్రతారణవాక్యవర్ణనమ్ - బ్రహ్మచారి మోసపుమాటలవర్ణనం

**పార్వత్యువాచ** - పార్వతి పలికింది.

**శృణు ద్విజేంద్ర జటిల మద్వృత్తం నిఖిలం ఖలు ।**
**సఖ్యుక్తం మేఽద్య యత్సత్యం తత్తథైవ న చాన్యథా ॥1॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! బ్రహ్మచారీ! నా వృత్తాంతమంతా విను. నా చెలికత్తె ఇప్పుడు చెప్పిన వచనాలు సత్యమేగాని వేరుగాదు.

**మనసా వచసా సాక్షాత్కర్మణా పతిభావతః ।**
**సత్యం బ్రవీమి నోఽసత్యం వృతో వై శంకరో మయా ॥2॥**

నేను మనసుచే సత్యాన్ని సంకల్పించి, వాక్కుచే సత్యాన్ని పలికి, కర్మచే సత్యాన్ని అనుష్ఠిస్తాను. సత్యమే పలుకుతాను. అసత్యం పలుకను. నేను శంకరుని భర్తగా వరించాను.

**జానామి దుర్లభం వస్తు కథం ప్రాప్యం మయా భవేత్ ।**
**తథాపి మన ఔత్సుక్యాత్తప్యతేఽద్య తపో మయా ॥3॥**

దుర్లభమైన వస్తువును నేనెట్లు పొందగలను? ఆ విషయం నేనెరుగుదును. అయినప్పటికి మనస్సునందు ఉత్సాహముండుటచే నేనీ తపస్సు చేస్తున్నాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా వచనం తస్మై స్థితా సా గిరిజా తదా ।**
**ఉవాచ బ్రాహ్మణస్తత్ర తచ్ఛ్రుత్వా పార్వతీవచః ॥4॥**

ఇట్లు పలికి పార్వతి మిన్నకుంది. పార్వతి మాటలను విని బ్రాహ్మణుడిట్లు పలికాడు.

**బ్రాహ్మణ ఉవాచ** - బ్రాహ్మణుడు పలికాడు.

**ఏతావత్కాలపర్యంతం మమేచ్ఛా మహతీ హ్యభూత్ ।**
**కిం వస్తు కాంక్షతీ దేవీ కురుతే సుమహత్తపః ॥5॥**

ఈ దేవి ఏ వస్తువును కోరి తీవ్రమైన తపస్సు చేస్తున్నదో తెలియాలని నాకింతకాలం నుండి కోరిక కలదు.

**తత్ జ్ఞాత్వా నిఖిలం దేవి శ్రుత్వా త్వన్ముఖ పంకజాత్ ।**
**ఇతో గచ్ఛామ్యహం స్థానాద్యథేచ్ఛసి తథా కురు ॥6॥**

ఓ దేవీ! ఇప్పుడా వృత్తాంతము నంతటిని తెలుసుకొని, నీ ముఖపద్మంనుండి విని, ఇప్పుడీ స్థానంనుండి నేను వెళ్ళిపోతున్నాను. నీకు తోచినట్లు చేయుము.

**న కథ్యతే త్వయా మహ్యం మిత్రత్వం నిష్ఫలం భవేత్ ।**
**యథా కార్యం తథా భావి కథనీయం సుఖేన చ ॥7॥**

నీవు నాకు చెప్పనిచో మిత్రత్వం నిష్ఫలమయ్యేది. నీవెలా ప్రవర్తిస్తావో నీ భవిష్యత్తు ఆ విధంగానే నిర్మాణమౌతుంది. నీకు దీనియందే సుఖముంటే నీకు చెప్పవలసిందేదీలేదు.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా వచనం తస్య యావద్గంతుమియేష సః ।**
**తావచ్చ పార్వతీ దేవీ ప్రణమ్యోవాచ తం ద్విజమ్ ॥8॥**

ఇట్లు పలికి ఆ బ్రహ్మచారి బయలుదేరడానికి సిద్ధపడుతున్నాడు. ఇంతలో పార్వతీదేవి ఆ బ్రాహ్మణునకు నమస్కరించి, ఇలా పలికింది.

**పార్వత్యువాచ -** పార్వతి పలికింది.

**కిం గమిష్యసి విప్రేంద్ర స్థితో భవ హితం వద ।**
**ఇత్యుక్తే చ తయా తత్ర స్థిత్వోవాచ సదండధృక్ ॥9॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! వెళ్ళిపోవుచున్నావేమి? ఉండుము. నాకు హితాన్ని బోధించు అని పార్వతి పలుకగా బ్రాహ్మణుడు దండాన్ని ధరించి, నిలబడి ఇలా పలికాడు.

**ద్విజ ఉవాచ -** బ్రాహ్మణుడు పలికాడు.

**యది శ్రోతుమనా దేవి మాం స్థాపయసి భక్తితః ।**
**వదామి తత్త్వం తత్సర్వం యేన తే వయునం భవేత్ ॥10॥**

ఓ దేవీ! నన్ను వెళ్ళనీయక భక్తిపూర్వకంగా ఆపివేస్తున్నావు. నామాటను వినాలనుకుంటున్నావా? అట్లైతే నీకు జ్ఞానాన్ని కలిగించే సత్యాన్నంతటిని చెబుతాను.

**జానామ్యహం మహాదేవం సర్వథా గురుధర్మతః ।**
**ప్రవదామి యథార్థం హి సావధానతయా శృణు ॥11॥**

నేను మహాదేవుని బాగుగా ఎరుగుదును. నేను గురుధర్మాన్ననుసరించి నీకు సత్యాన్నే చెబుతున్నాను. శ్రద్ధగా వినుము.

**వృషధ్వజో మహాదేవో భస్మదిగ్ధో జటాధరః ।**
**వ్యాఘ్రచర్మాంబరధరః సంవీతో గజకృత్తినా ॥12॥**

మహాదేవుడు వృషభధ్వజుడు. భస్మంచే లిప్తమైన దేహం గలవాడు. జటాధరుడు, వ్యాఘ్రచర్మాంబర ధరుడు, గజచర్మం ఉత్తరీయంగా కలవాడు.

**కపాలధారీ సర్పైఘైస్సర్వగాత్రేషు వేష్టితః ।**
**విషదిగ్ధోఽభక్ష్య భక్షో విరూపాక్షో విభీషణః ।।13।।**

ఆయన కపాలధారి. ఆయన శరీరమంతయు పాములచే చుట్టబడియుంటుంది. ఆయన విషాన్ని ధరించినవాడు. ఆయన తినకూడని పదార్థాలను తింటాడు. వికృతమైన కన్నులు గలవాడు. ఆయనను చూస్తే భయం కలుగుతుంది.

**అవ్యక్తజన్మా సతతం గృహభోగ వివర్జితః ।**
**దిగంబరో దశభుజో భూతప్రేతాన్వితస్సదా ।।14।।**

ఆయన పుట్టుక గురించి ఎవరికి తెలియదు. ఆయన సతతం గృహభోగ వివర్జితుడు. ఆయన దిగంబరుడు. దశభుజుడు. ఎల్లప్పుడు భూతప్రేతాలతో కూడియుంటాడు.

**కేన వా కారణేన త్వం తం భర్తారం సమీహసే ।**
**క్వ జ్ఞానం తే గతం తద్వదాద్య విచారతః ।।15।।**

నీవేకారణంచేత ఆయనను భర్తగా కోరుకుంటున్నావు? ఓ దేవీ! నీజ్ఞానం ఎక్కడకు పోయింది? నాకీ విషయాన్ని ఆలోచించి చెప్పుము.

**పూర్వం శ్రుతం మయా చైవ వ్రతం తస్య భయంకరమ్ ।**
**శ్రుణుతే నిగదామ్యద్య యది తే శ్రవణే రుచిః ।।16।।**

నేనాతని భయంకరవ్రతాన్ని గూర్చి పూర్వమే వినియున్నాను. నీకు కూడా వినడంలో అభిరుచి యుంటే ఇప్పుడు చెబుతాను విను.

**దక్షస్య దుహితా సాధ్వీ సతీ వృషభవాహనమ్ ।**
**వవ్రే పతిం పురా దైవాత్తత్సంభోగః పరిశ్రుతః ।।17।।**

పూర్వం దక్షపుత్రియు, పతివ్రతయునగు సతి వృషభం వాహనంగాగల శివుని దైవవశంచే భర్తగా పొందింది. ఆమె పొందిన భోగం అందరికి తెలిసినదే.

**కపాలిజాయేతి సతీ దక్షేణ పరివర్జితా ।**
**యజ్ఞే భాగప్రదానాయ శంభుశ్చాపి వివర్జితః ।।18।।**

సతీదేవి కపాలిభార్య అనే కారణంచే దక్షుడామెను తిరస్కరించాడు. అంతేగాదు యజ్ఞభాగ మీయబడే దేవతలలో శంభుని చేర్చలేదు.

**సా తథైవాపమానేన భృశం కోపాకులా సతీ ।**
**తత్యాజాసూన్ప్రియాంస్తత్ర తయా త్యక్తశ్చ శంకరః ।।19।।**

ఆ అవమానంచే మిక్కిలి కోపాన్ని, దుఃఖాన్ని పొందిన సతీదేవి ప్రియమైన శంకరుని విడిచిపెట్టి ప్రాణాలను కూడా త్యజించింది.

**త్వం స్త్రీరత్నం తవ పితా రాజా నిఖిలభూభృతామ్ ।**
**తథావిధం పతిం కస్మాదుగ్రేణ తపసేహసే ॥20॥**

నీవు స్త్రీ రత్నానివి. నీతండ్రి పర్వతరాజు. అట్టినీవు అటువంటి భర్తను పొందాలనే కోరికతో ఎందుకు ఉగ్రమైన తపస్సు చేస్తున్నావు?

**దత్త్వా సువర్ణముద్రాం చ గ్రహీతుం కాచమిచ్ఛసి ।**
**హిత్వా చ చందనం శుభ్రం కర్దమం లేప్తుమిచ్ఛసి ॥21॥**

బంగారునాణెమునిచ్చి నీవు గాజుముక్కను పొందాలనుకుంటున్నావు. నీవు స్వచ్ఛమైన చందనాన్ని త్రోసిపుచ్చి బురదను శరీరంపై లేపనంగా పూసుకోవాలనుకుంటున్నావు.

**సూర్యతేజః పరిత్యజ్య ఖద్యోతద్యుతిమిచ్ఛసి ।**
**చీనాంశుకం విహాయైవ చర్మాంబరమిహేచ్ఛసి ॥22॥**

నీవు సూర్యతేజస్సును విడిచిపెట్టి మిణుగురు పురుగుల కాంతిని కోరుతున్నావు. పట్టు వస్త్రాలను వదలి చర్మాంబరాలను కోరుకుంటున్నావు.

**గృహవాసం పరిత్యజ్య వనవాసం సమీహసే ।**
**లోహమిచ్ఛసి దేవేశి త్యక్త్వా శేవధిముత్తమమ్ ॥23॥**

నీవు గృహవాసాన్ని విడిచి, వనవాసం చేయాలని కోరుకుంటున్నావు. ఓ దేవేశీ! నీవు ఉత్తమమైన నిధిని విడిచిపెట్టి ఇనుమును కోరుతున్నావు.

**ఇంద్రాది లోకపాలాంశ్చ హిత్వా శివమనువ్రతా ।**
**నైతత్సూక్తం హి లోకేషు విరుద్ధం దృశ్యతేఽధునా ॥24॥**

ఇంద్రాది లోకపాలకులను వదలి శివుని గురించి వ్రతం చేస్తున్నావు. నీవు చేసే ఈ చర్యను లోకులు మంచిగా చెప్పుకోరు. నీ చర్య లోకవిరుద్ధంగా కనిపిస్తోంది.

**క్వ త్వం కమలపత్రాక్షీ క్వాసౌ వై త్రివిలోచనః ।**
**శశాంకవదనా త్వం చ పంచవక్త్రః శివస్స్మృతః ॥25॥**

పద్మ పత్రాలవంటి కన్నులుగల నీవెక్కడ? ఆ ముక్కంటి ఎక్కడ? ఆహ్లాదకరమైన చంద్రునివంటి ముఖంగల నీవెక్కడ? పంచవక్త్రుడైన శివుడెక్కడ?

**వేణీ శిరసి తే దివ్యా సర్పిణీవ విభాసితా ।**
**జటాజూటం శివస్యైవ ప్రసిద్ధం పరిచక్షతే ॥26॥**

నీ శిరస్సుపై జడ దివ్యమైన సర్పంవలె భాసిస్తోంది. జటాజూటం శివునికి మాత్రమే ప్రసిద్ధమైనట్టిదని చెప్పుచున్నారు.

**చందనం చ త్వదీయాంగే చితాభస్మ శివస్య చ ।**
**క్వ దుకూలం త్వదీయం వై శాంకరం క్వ గజాజినమ్ ॥27॥**

నీ శరీరంపై చందనముండగా శివుని శరీరంపై చితాభస్మముంటుంది. నీ పట్టుచీర ఎక్కడ? శంకరుని గజచర్మమెక్కడ?

**భూషణాని దివ్యాని క్వ సర్పాశ్శంకరస్య చ ।**
**క్వ చరా దేవతాస్సర్వాః క్వ చ భూతబలిప్రియః ॥28॥**

నీ దివ్యాలంకారాలెక్కడ? శంకరుని సర్పాలెక్కడ? దేవతలే అనుచరులుగా గల నీవెక్కడ? భూతబలిప్రియుడైన శివుడెక్కడ?

**క్వ వా మృదంగవాదశ్చ క్వ చ తడ్డమరుస్తథా ।**
**క్వ చ భేరీకలాపశ్చ క్వ చ శృంగరవోఽశుభః ॥29॥**

మృదంగ ధ్వని యెక్కడ? శివుని దమరుక ధ్వని ఎక్కడ? భేరీ ధ్వనులెక్కడ? అశుభమైన కొమ్ముబూరాల ధ్వని యెక్కడ?

**క్వ చ ఢక్కామయశ్శబ్దో గలనాదః క్వచాశుభః ।**
**భవత్యాశ్చ శివస్యైవ న యుక్తం రూపముత్తమమ్ ॥32॥**

ఢక్కా శబ్దమెక్కడ? భూత ప్రేతాదులయొక్క అమంగళకంఠధ్వని ఎక్కడ? ఉత్తమమైన నీ సౌందర్యం శివునకు అర్హమైనది కానే కాదు.

**యది ద్రవ్యం భవేత్తస్య కథం స్యాత్స దిగంబరః ।**
**వాహనం చ బలీవర్దస్సామగ్రీ కాపి తస్య న ॥31॥**

ఆయనవద్ద ధనముంటే దిగంబరుడై ఉండడమెందులకు? ఆయన వాహనం వృషభం. ఆయనవద్ద సామగ్రి ఏదియూ లేదు.

**వరేషు యే గుణాః ప్రోక్తా నారీణాం సుఖదాయకాః ।**
**తన్మధ్యే హి విరూపాక్షే ఏకోఽపి న గుణః స్మృతః ॥32॥**

వరులలోని ఏయే గుణాలు స్త్రీలకు సుఖాలనిస్తాయని చెప్పబడ్డాయో వాటిలో ఒక్కగుణమైనా ముక్కంటియందు లేదు.

**తవాపి కామో దయితో దగ్ధస్తేన హరేణ చ ।**
**అనాదరస్తదా దృష్టో హిత్వా త్వామన్యతో గతః ॥33॥**

నీకాప్తుడైన మన్మథుని ఆ హరుడు దహించాడు. అంతేకాదు. ఆయన చూపిన అనాదరంకూడా నీవెరుగుదువు. ఆయన నిన్ను విడిచి ఎక్కడకో వెళ్ళాడు?

**జాతిర్న దృశ్యతే తస్య విద్యాజ్ఞానం తథైవ చ ।**
**సహాయాశ్చ పిశాచా హి విషం కంఠే హి దృశ్యతే ॥34॥**

ఆయనకు జాతిగాని, విద్యగాని, జ్ఞానంగాని కానరాదు. ఆయనకు పిశాచాలు తోడు. కంఠంలో విషం కదా! కనబడుతుంది.

**ఏకాకీ చ సదా నిత్యం విరాగీ చ విశేషతః ।**
**తస్మాత్త్వం హి హరేణైవ మనో యోక్తుం న చార్హసి ॥35॥**

ఆయన సర్వదా ఒంటరిగా ఉంటాడు. ఆయన నిత్యవైరాగ్యం దృఢంగా గలవాడు. కాబట్టి నీవు మనస్సులో శివుని కోరుకోవడం ఎంతమాత్రం తగినదికాదు.

**క్వ చ హారస్త్వదీయో వై క్వ చ తన్ముండమాలికా ।**
**అంగరాగః క్వ తే దివ్యః చితాభస్మ క్వ తత్తనౌ ॥36॥**

నీ హారమెక్కడ? ఆయన కపాలమాల ఎక్కడ? నీ దివ్యమైన శరీర లేపమెక్కడ? ఆయన శరీరమందలి చితాభస్మమెక్కడ?

**సర్వం విరుద్ధం రూపాది తవ దేవి హరస్య చ ।**
**మహ్యం న రోచతే హ్యేతద్యదిచ్ఛసి తథా కురు ॥37॥**

ఓ దేవీ! నీకు శివునకు రూపాదులన్నియు విరుద్ధమైనవే. కావున శివునితో నీ వివాహము నాకు నచ్చలేదు. నీకు తోచినట్లు చేయుము.

**అసద్వస్తు చ యత్కించిత్ తత్సర్వం స్వయమీహసే ।**
**నివర్తయ మనస్తస్మాన్నోచేదిచ్ఛసి తత్కురు ॥38॥**

నీవు సృష్టిలోని అసద్వస్తువులనన్నింటిని కోరుకుంటున్నావు. మనస్సు శివునినుండి మళ్ళించు. లేదా నీకు తోచినట్లు చేసుకో.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవం వచనం శ్రుత్వా తస్య విప్రస్య పార్వతీ ।**
**ఉవాచ క్రుద్ధమనసా శివనిందాపరం ద్విజమ్ ॥39॥**

బ్రాహ్మణుని మాటలను విని, మనస్సులో క్రోధాన్ని పొందిన పార్వతి శివుని నిందించడంలో ఉత్సాహం చూపించిన బ్రాహ్మణునితో ఇలా పలికింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే బ్రహ్మచారిప్రతారణ వాక్యవర్ణనం నామ సప్తవింశోऽధ్యాయః ॥27॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో బ్రహ్మచారి మోసపుమాటలవర్ణనం అనే ఇరవై ఏడవ అధ్యాయం సమాప్తం.

## అష్టావింశోఽధ్యాయః - ఇరవై ఎనిమిదవ అధ్యాయం
## పార్వత్యా శ్శివరూపదర్శనమ్ - పార్వతికి పరమశివ సాక్షాత్కారం

**పార్వత్యువాచ** - పార్వతి పలికింది.

**ఏతావద్ధి మయాజ్ఞాతం కశ్చిదన్యోయమాగతః ।**
**ఇదానీం సకలం జ్ఞాతమవధ్యస్త్వం విశేషతః ॥1॥**

ఎవరో ఒక మహాత్ముడు వచ్చాడనిమాత్రమే నేను భావించాను. ఇప్పుడు విషయమంతా తెలిసింది. పైగా నీవు చంపదగనివాడవు, బ్రాహ్మణుడవు.

**త్వయోక్తం విదితం దేవ తదలీకం న చాన్యథా ।**
**యది త్వయోదితం స్యాద్వై విరుద్ధం నోచ్యతే త్వయా ॥2॥**

ఓ దేవా! నీవు చెప్పింది నాకు తెలిసింది. అది అసత్యమేగాని సత్యంకాదు. సర్వం తెలుసునని నీవు చెప్పినమాట సత్యమైతే నీవిలా విరుద్ధంగా మాటాడియుండవు.

**కదాచిద్దృశ్యతే తాదృక్ వేషధారీ మహేశ్వరః ।**
**స్వలీలయా పరబ్రహ్మ స్వరాగోపాత్త విగ్రహః ॥3॥**

పరబ్రహ్మ అయిన మహేశ్వరుడు అప్పుడప్పుడు తనకు నచ్చిన రీతిగా వేషాన్ని ధరించి కనిపిస్తాడు.

**బ్రహ్మచారి స్వరూపేణ ప్రతారయితుముద్యతః ।**
**ఆగతశ్ఛల సంయుక్తం వచోఽవాదీః కుయుక్తితః ॥4॥**

నీవు బ్రహ్మచారి వేషంతో నన్ను మోసగించడానికి వచ్చి, కుయుక్తులు పన్ని, మోసపూరితమైన మాటలు పలికావు.

**శంకరస్య స్వరూపంతు జానామి సువిశేషతః ।**
**శివతత్త్వ మతో వచ్మి సువిచార్య యథార్థతః ॥5॥**

ప్రత్యేకించి నేను శంకరుని స్వరూపాన్ని ఎరుగుదును. శివతత్త్వాన్ని ఎరుగుదును. కాబట్టి నా యోగ్యత కనుగుణంగా బాగా ఆలోచించి చెబుతున్నాను.

**వస్తుతో నిర్గుణో బ్రహ్మ సగుణః కారణేన సః ।**
**కుతో జాతిర్భవేత్తస్య నిర్గుణస్య గుణాత్మనః ॥6॥**

శివుడు వస్తుతః నిర్గుణబ్రహ్మ. కాని కారణమైన ప్రకృతితో కూడి, సగుణుడయ్యాడు. నిర్గుణుడూ, సగుణుడూ అయిన ఆయనకు జాతి ఎలా ఉంటుంది?

**స సర్వాసాం హి విద్యానామధిష్ఠానం సదాశివః ।**
**కిం తస్య విద్యయా కార్యం పూర్ణస్య పరమాత్మనః ॥7॥**

ఆ సదాశివుడు విద్యలన్నింటికి నిధానం. పూర్ణపరమాత్ముడైన ఆ శివునకు విద్యతో పనియేమి?

**వేదా ఉచ్ఛ్వాసరూపేణ పురా దత్తాశ్చ విష్ణవే ।**
**శంభునా తేన కల్పాదౌ తత్సమః కోఽస్తి సుప్రభుః ॥8॥**

ఆ శంభుడు కల్పప్రారంభంలో వేదాలను ఉచ్ఛ్వాసరూపంగా విష్ణునకిచ్చాడు. ఆయనతో సమానమైన గొప్పప్రభువు మరియొకడు లేడు.

**సర్వేషామాదిభూతస్య వయోమానం కుతస్తతః ।**
**ప్రకృతిస్తు తతో జాతా కిం శక్తే స్తస్య కారణమ్ ॥9॥**

సర్వప్రాణులకు ఆదియందున్న సద్ఘనుడైన పరమేశ్వరునకు వయస్సుయొక్క లెక్కలెక్కడివి? ప్రకృతి ఆయననుండి పుట్టింది. ఆయన శక్తికి కారణమేముంటుంది?

**యే భజంతి చ తం ప్రీత్యా శక్తీశం శంకరం సదా ।**
**తస్మై శక్తిత్రయం శంభుః స దదాతి సదావ్యయమ్ ॥10॥**

శక్తికి ప్రభువు, అవ్యయుడు అగు ఆ శంకరుని ఎవడైతే సర్వదా ప్రేమతో సేవిస్తాడో, అట్టివానికి ఆ శంభుడు ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తులను ప్రసాదిస్తాడు.

**తస్యైవ భజనాజ్జీవో మృత్యుంజయతి నిర్భయః ।**
**తస్మాన్మృత్యుంజయం నామ ప్రసిద్ధం భువనత్రయే ॥11॥**

శివుని భజించిన మానవుడు భయంలేనివాడై, మృత్యువును జయిస్తాడు. అందువల్లనే ముల్లోకాలలో 'మృత్యుంజయు' డనే పేరు ప్రసిద్ధిగాంచింది.

**తస్యైవ పక్షపాతేన విష్ణుర్విష్ణుత్వమాప్నుయాత్ ।**
**బ్రహ్మత్వం చ యథా బ్రహ్మా దేవా దేవత్వమేవ చ ॥12॥**

ఆయన అనుగ్రహం చేతనే విష్ణువు విష్ణుత్వాన్ని, బ్రహ్మ బ్రహ్మత్వాన్ని, దేవతలు దేవత్వాన్ని పొందియున్నారు.

**దర్శనార్థం శివస్యాదౌ యథా గచ్ఛతి దేవరాట్ ।**
**భూతాదయస్తత్పరస్య ద్వారపాలా శ్శివస్య తు ॥13॥**

శివుని దర్శనార్థం ముందుగా దేవరాజైన ఇంద్రుడు వెళతాడు. ఆత్మధ్యానపరుడైన శివుని ద్వారాన్ని భూతాలు, గణాలు, మున్నగువారు కాపలాకాస్తూ ఉంటారు.

**దండైశ్చ ముకుటం విద్ధం మృష్టం భవతి సర్వతః ।**
**కిం తస్య బహుపక్షేణ స్వయమేవ మహాప్రభుః ॥14॥**

వారు బెత్తాలతో ఇంద్రుని కిరీటంపై మోదుతుంటారు. ఇంద్రుడు త్రొక్కిసలాటలో నలిగిపోతుంటాడు. ఆయన పక్షాన్ని స్వీకరించి, పలుమాట లనవసరం. ఆయన తనంత తానుగా మహాప్రభువై యున్నాడు.

**కల్యాణ రూపిణస్తస్య సేవయేహ న కిం భవేత్ ।**
**కిం న్యూనం తస్య దేవస్య మామిచ్ఛతి సదాశివః ॥15॥**

మంగళ స్వరూపుడైన ఆయనను సేవిస్తే ఇహలోకంలో లభించనిదేముంది? ఆ దేవునకు లోటేముంది? ఆ సదాశివుడు నన్నేలకోరును?

**సప్తజన్మ దరిద్రః స్యాత్సేవేన్నో యది శంకరమ్ ।**
**తస్యై తత్సేవనాల్లోకో లక్ష్మీః స్యాదనపాయినీ ॥16॥**

శంకరుని సేవించని మానవుడు ఏడు జన్మలలో దరిద్రుడౌతాడు. ఆయనను సేవించే మానవుడు తొలగిపోని సంపదలను పొందుతాడు.

**యదగ్రే సిద్ధయోఽష్టౌ చ నిత్యం నృత్యంతి తోషితుమ్ ।**
**అవాఙ్ముఖాస్సదా తత్ర తద్ధితం దుర్లభం కుతః ॥17॥**

అష్టసిద్ధులు ఎవనిని సంతోష పెట్టడానికి నిత్యం తలవంచుకుని, ఎవరి యెదుట నాట్యం చేస్తాయో అట్టి ఈశ్వరుని వల్ల హితం కలుగకుండట మెలా పొసగుతుంది?

**యద్యస్య మంగళానీహ సేవతే శంకరస్య న ।**
**యథాపి మంగళం తస్య స్మరణాదేవ జాయతే ॥18॥**

మంగళకరమైన వస్తువులు శంకరుని సేవచేయకపోయినప్పటికి ఆయనను స్మరించినంతమాత్రాన మంగళాలు కలుగుతాయి.

**యస్య పూజా ప్రభావేణ కామాస్సిధ్యంతి సర్వశః ।**
**కుతో వికారస్తస్యాస్తి నిర్వికారస్య సర్వదా ॥19॥**

ఎవని పూజా ప్రభావంతో కోర్కెలన్నీ సిద్ధిస్తాయో, అట్టి నిర్వికారుడైన శివునకెప్పుడైనా వికారమెలా కలుగుతుంది?

**శివేతి మంగళం నామ ముఖే యస్య నిరంతరమ్ ।**
**తస్యైవ దర్శనాదన్యే పవిత్రాస్సంతి సర్వదా ॥20॥**

**"శివ"** అనే మంగళనామం నిరంతరంగా ఎవరినోటననుండి వెలువడుతుందో అట్టివానిని దర్శించినంతమాత్రం చేతనే మానవులు పవిత్రులౌతారు.

**యద్యపూతం భవేద్భస్మ చితాయాశ్చ త్వయోదితమ్ ।**
**నిత్యమస్యాంగగం దేవైశ్శిరోభిర్ధార్యతే కథమ్ ॥21॥**

నీవు చెప్పిన విధంగా చితాభస్మ అపవిత్రమైతే ఆయన శరీరంనుండి జారిన భస్మాన్ని దేవతలు నిత్యం శిరస్సుపై ధరించడానికి కారణమేమిటి?

**యో దేవో జగతాం కర్తా భర్తా హర్తా గుణాన్వితః ।**
**నిర్గుణశ్శివసంజ్ఞశ్చ స విజ్ఞేయః కథం భవేత్ ॥22॥**

సగుణుడై, జగత్తులను సృష్టించి, పోషించి, సంహరిస్తూ నిర్గుణ స్వరూపుడై శివనామధేయాన్ని కలిగిన, దేవు డెట్లు తెలియబడతాడు?

**అగుణం బ్రహ్మణోరూపం శివస్య పరమాత్మనః ।**
**తత్కథం హి విజానంతి త్వాదృశా స్తద్బహిర్ముఖాః ॥23॥**

పరబ్రహ్మయైన శివపరమాత్ముని నిర్గుణ స్వరూపాన్ని నీవంటి బహిర్ముఖులు ఏవిధంగా తెలుసుకో గలుగుతారు?

**దురాచారాశ్చ పాపాశ్చ దేవేభ్యస్తే వినిర్గతాః ।**
**తత్త్వం తే నైవ జానంతి శివస్యాగుణరూపిణః ॥24॥**

దురాచారపరులు, పాపాత్ములు, దేవతాగణంనుండి బహిష్కరింపబడినవారు నిర్గుణ స్వరూపుడైన శివుని తత్త్వాన్ని ఎప్పటికి తెలుసుకోలేరు.

**శివనిందాం కరోతీహ తత్త్వమజ్ఞాయ యఃపుమాన్ ।**
**ఆజన్మసంచితం పుణ్యం భస్మీభవతి తస్య తత్ ॥25॥**

శివతత్త్వం తెలియక శివుని నిందించిన వానికి పూర్వజన్మలనుండి సంపాదించుకున్న పుణ్యమంతా బూడిదౌతుంది.

**త్వయా నిందా కృతా యాత్ర హరస్యామిత తేజసః ।**
**త్వత్పూజా చ కృతా యన్మే తస్మాత్పాపం భజామ్యహమ్ ॥26॥**

మహాతేజస్వియైన శివుని నీవిచ్చట నిందించావు. అట్టి నిన్ను పూజించిన నాకు పాపం కలుగుతుంది.

**శివ విద్వేషిణం దృష్ట్వా సచైలం స్నానమాచరేత్ ।**
**శివవిద్వేషిణం దృష్ట్వా ప్రాయశ్చిత్తం సమాచరేత్ ॥27॥**

శివుని ద్వేషించేవానిని చూస్తే వెంటనే కట్టుబట్టలతో స్నానం చేయాలి. శివ విద్వేషులను చూస్తే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి.

**రే రే దుష్ట త్వయా చోక్తమహం జానామి శంకరమ్ ।**
**నిశ్చయేన న విజ్ఞాతశ్శివ ఏవ సనాతనః ॥28॥**

ఓరీ దుష్టా! నాకు శంకరుడు తెలుసునని నీవు చెప్పావు. కాని సనాతనుడైన ఆ శివుణ్ణి నిశ్చయంగా నీవెరుగవు.

**యథా తథా భవే ద్రుద్రో యథా వా బహురూపవాన్ ।**
**మమాభీష్టతమో నిత్యం నిర్వికారీ సతాం ప్రియః ॥29॥**

రుద్రుడెట్లైనను ఉండుగాక! ఆయన బహురూపాలను ధరించుగాక! నిర్వికారుడు, సజ్జనులకు ఇష్టుడు రుద్రుడు నాకు సర్వదా ప్రియతముడు.

**విష్ణుర్బ్రహ్మాపి చ సమస్తస్య క్వాపి మహాత్మనః ।**
**కుతోఽన్యే నిర్జరాద్యాశ్చ కాలాధీనాస్సదైవతమ్ ॥30॥**

విష్ణువు బ్రహ్మ కూడా ఏకాలమందైనా ఆ మహాత్మునితో సరితూగరు. అటువంటప్పుడు కాలాధీనులైన తక్కిన దేవతలను గూర్చి చెప్పేదేమున్నది?

**ఇతి బుధ్యా సమాలోక్య స్వయా సత్యా సుతత్త్వతః ।**
**శివార్థం వనమాగత్య కరోమి విపులం తపః ॥31॥**

ఈ సత్యాన్ని సద్బుద్ధితో విచారించి, తెలుసుకొని, నేను శివుని పొందడానికి అడవికి వచ్చి, విస్తారమైన తపస్సు చేస్తున్నాను.

**స ఏవ పరమేశాన స్సర్వేశో భక్తవత్సలః ।**
**సంప్రాప్తుం మేఽభిలాషో హి దీనానుగ్రహకారకమ్ ॥32॥**

ఆయనయే పరమేశ్వరుడు, సర్వేశ్వరుడు, భక్తవత్సలుడు, లీలానుగ్రహకారకుడు. ఆయనను పొందాలనే అభిలాష మాత్రమే నాకుంది.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా గిరిజా సా హి గిరీశ్వరసుతా మునే ।**
**విరరామ శివం దధ్యో నిర్వికారేణ చేతసా ॥33॥**

ఓ మహర్షీ! పర్వతరాజ పుత్రిక ఇట్లు పలికి, మిన్నకుండి, నిర్వికారమైన మనస్సుతో శివుని ధ్యానించింది.

**తదాకర్ణ్య వచో దేవ్యా బ్రహ్మచారీ స వై ద్విజః ।**
**పునర్వచనమాఖ్యాతుం యావదేవ ప్రచక్రమే ॥34॥**

పార్వతీదేవి మాటలు విని, బ్రాహ్మణ బ్రహ్మచారి మరల ఏదో చెప్పడానికి సిద్ధపడ్డాడు.

**ఉవాచ గిరిజా తావత్స్వసఖీం విజయాం ద్రుతమ్ ।**
**శివసక్తమనోవృత్తి శ్శివనిందా పరాఙ్ముఖీ ॥35॥**

కాని శివుని మీదనే మనస్సు లగ్నమై శివనిందను సహింపలేని పార్వతి వెంటనే తన చెలికత్తె అగు విజయతో ఇలా పలికింది.

**గిరిజోవాచ** - గిరిజ పలికింది.

**వారణీయః ప్రయత్నేన సఖ్యయం హి ద్విజాధమః ।**
**పునర్వక్తుమనాశ్చైవ శివనిందాం కరిష్యతి ॥36॥**

ఓ సఖీ! ఈ బ్రాహ్మణాధము డింకా ఏదో చెప్పాలనుకుంటున్నాడు. మళ్ళీ శివుని నిందిస్తాడు. కాబట్టి ఇతణ్ణి ప్రయత్నపూర్వకంగానైనా వారించాలి.

**న కేవలం భవేత్పాపం నిందాం కర్తుశ్శివస్య హి ।**
**యో వై శ్రుణోతి తన్నిందాం పాపభాక్ స భవేదిహ ॥37॥**

శివుని నిందించేవానికి మాత్రమే కాక ఆ నిందను వినేవారికి కూడా పాపం చుట్టుకుంటుంది.

**శివనిందా కరోవధ్యస్సర్వథా శివకింకరైః ।**
**బ్రాహ్మణశ్చేత్స వై త్యాజ్యో గంతవ్యం తత్ స్థలాద్రుతమ్ ॥38॥**

శివనింద చేసేవారిని సర్వథా శివభక్తులు వధించాలి. శివనింద చేసేవాడు బ్రాహ్మణుడైనచో విడిచిపెట్టాలి. అక్కడినుండి దూరంగా వెంటనే వెళ్ళిపోవాలి.

**అయం దుష్టః పునర్నిందాం కరిష్యతి శివస్య హి ।**
**బ్రాహ్మణత్వా దవధ్యశ్చేత్త్యాజ్యోఽదృశ్యశ్చ సర్వథా ॥39॥**

ఈ దుష్టుడు మళ్ళీ శివనింద చేస్తాడు. బ్రాహ్మణుడు కనుక ఇతడు వధార్హుడు కాడు. కాబట్టి ఇతనిని విడిచిపోవాలి. ఎట్టిపరిస్థితులలోను ఇతనిని చూడరాదు.

**హిత్వైతత్ స్థలమద్యైవ యాస్యామోఽన్యత్ర మా చిరమ్ ।**
**యథా సంభాషణం న స్యాదనేనాఽవిదుషా పునః ॥40॥**

మనమీ స్థలాన్ని విడిచి ఈ క్షణంలోనే మరియొక చోటుకు శీఘ్రంగా పోదాం. అలా చేయడంవల్ల ఈ మూర్ఖునితో మళ్ళీ సంభాషించడం తప్పిపోతుంది.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా చోమయా యావత్పాదముత్క్షిప్యతే మునే ।**
**అసౌ తావచ్ఛివ స్సాక్షాదాలంబే ప్రియయా స్వయమ్ ॥41॥**

ఓ మహర్షీ! ఉమాదేవి అలా పలికి వెళ్లడానికి ముందడుగు వేయబోయే సమయంలో శివుడు స్వస్వరూపంతో ప్రత్యక్షమై, ఆమెను పట్టుకున్నాడు.

**కృత్వా స్వరూపం సుభగం శివధ్యానం యథా తథా ।**
**దర్శయిత్వా శివాయై తామువాచావాఙ్ముఖీం శివః ॥42॥**

ఉమాదేవి ఏ సగుణ శివస్వరూపాన్ని ధ్యానించిందో అదే రూపాన్ని ఆమెకు దర్శింపజేసి, తలవంచుకుని ఉన్న ఆమెతో శివుడిలా పలికాడు.

**శివ ఉవాచ** – శివుడు పలికాడు.

**కుత్ర యాస్యసి మాం హిత్వా న త్వం త్యాజ్యా మయా పునః ।**
**ప్రసన్నోఽస్మి వరం బ్రూహి నాదేయం విద్యతే తవ ॥43॥**

నన్ను విడిచి నీవెచ్చటకు పోతావు? నిన్ను నేను రెండవసారి విడిచిపెట్టను. నేను ప్రసన్నుడనయ్యాను. వరాన్ని కోరుకో? నీకు ఈయదగని వరంలేదు.

**అద్యప్రభృతి తే దాసః తపోభిః క్రీత ఏవ తే ।**
**క్రీతోఽస్మి తవ సౌందర్యాత్ క్షణమేకం యుగాయ తే ॥44॥**

ఈనాటినుండి నేను నీదాసుణ్ణి. నీ తపస్సుతో నన్ను నువ్వు కొన్నావు. నీ సౌందర్యానికి సంప్రీతుడ నయ్యాను. నీవు లేని క్షణం యుగంవలె ఉంటుంది.

**త్యజ్యతాం చ త్వయా లజ్జా మమ పత్నీ సనాతనీ ।**
**గిరిజే త్వం హి సద్బుధ్యా విచారయ మహేశ్వరి ॥45॥**

నీవు సిగ్గును విడువు. నీవు నా సనాతన ధర్మపత్నివి. ఓ గిరిజా! మహేశ్వరీ! నువ్వే సరిగా ఆలోచించు.

**మయా పరీక్షితాసి త్వం బహుధా దృఢమానసే ।**
**తత్ క్షమస్వాపరాధం మే లోకలీలానుసారిణః ॥46॥**

ఓ ధృడమానసా! నేను నిన్ను అనేక విధాల పరీక్షించాను. లోకలీలానుసారం నా ఈ అపరాధాన్ని మన్నించు.

**న త్వాదృశీం ప్రణయినీం పశ్యామి చ త్రిలోకకే ।**
**సర్వథాహం తవాధీనస్స్వకామః పూర్యతాం శివే ॥47॥**

నీవంటి ప్రేమమూర్తి ముల్లోకాలలోను కానరాదు. నేను అన్నివిధాలా నీకు అధీనుడనై ఉన్నాను. ఓ శివా! నీకోర్కె నెరవేరుగాక!

**ఏహి ప్రియే మత్సకాశం పత్నీ త్వం మే వరస్తవ ।**
**త్వయాసాకం ద్రుతం యాస్యే స్వగృహం పర్వతోత్తమమ్ ॥48॥**

ఓ ప్రియా! నావద్దకు రా! నువ్వు నా పత్నివి. నేను నీ వరుడను. నా నివాసమైన కైలాసానికి త్వరలో నిన్ను తోడ్కొని వెళతాను.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తే దేవదేవేన పార్వతీ ముదమాప సా ।**
**తపోజాతం తు యత్కష్టం తజ్జహౌ చ పురాతనమ్ ॥49॥**

దేవదేవుడిట్లు పలుకగా పార్వతి చాలా సంతసించింది. అంతవరకు ఆమె తపమాచరించుటంలో పడిన క్లేశమంతా మటుమాయమయ్యింది.

**సర్వః శ్రమో వినిష్టోభూత్సత్యాస్తు మునిసత్తమ ।**
**ఫలే జాతే శ్రమః పూర్వో జంతోర్నాశమవాప్నుయాత్ ॥50॥**

ఓ మునిశ్రేష్ఠా! పార్వతీదేవి శ్రమయంతయు తొలగిపోయింది. చేసిన కష్టానికి ఫలం లభించినప్పుడు మానవులకు అంతవరకు పడిన శ్రమ మటుమాయమౌతుంది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే పార్వత్యా శ్శివరూపదర్శనం నామాష్టావింశోఽధ్యాయః ॥28॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో పార్వతికి పరమశివ సాక్షాత్కారం అనే ఇరవై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనత్రింశోఽధ్యాయః - ఇరవై తొమ్మిదవ అధ్యాయం
## శివా, శివసంవాద - పార్వతీ పరమేశ్వరులసంవాదం

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**బ్రహ్మన్ విధే మహాభాగ కిం జాతం తదనంతరమ్ ।**
**తత్సర్వం శ్రోతుమిచ్ఛామి కథయ త్వం శివాయశః ॥1॥**

ఓ బ్రహ్మా! విధీ! మహాభాగా! తరువాత ఏమయ్యింది? ఆ వృత్తాంతమంతటిని వినగోరుతున్నాను. నువ్వు శివాదేవియొక్క కీర్తిని గురించి చెప్పు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**దేవర్షే శ్రూయతాం సమ్యక్ కథయామి కథాం ముదా ।**
**తాం మహాపాప సంహర్త్రీం శివభక్తి వివర్ధినీమ్ ॥2॥**

ఓ దేవర్షీ! నేనీగాథను ఆనందంతో చెబుతాను. నీవు చక్కగా విను. ఈగాథ మహాపాపాలను పోగొట్టి, శివభక్తిని వర్ధిల్లజేస్తుంది.

**పార్వతీ వచనం శ్రుత్వా హరస్స పరమాత్మనః ।**
**దృష్ట్వానందకరం రూపం జహర్షాతీవ చ ద్విజ ॥3॥**

ఓ బ్రాహ్మణా! పరమాత్మయైన శివుని మాటవినీ, ఆనందదాయకమైన ఆయన రూపాన్ని చూసీ, పార్వతి చాలా సంతసించింది.

**ప్రత్యువాచ మహాసాధ్వీ స్వోపకంఠస్థితం విభుమ్ ।**
**అతీవ సుఖితా దేవీ ప్రీత్యుత్ఫుల్లాననా శివా ॥4॥**

పరమానందమూ, ఆనందంతో వికసించిన కళ్ళుగల ఆ మహాపతివ్రత పార్వతీదేవి తన సమీపంలోనున్న శివ విభునకు ఇలా బదులిచ్చింది.

**పార్వత్యువాచ** - పార్వతి పలికింది.

**త్వం నాథో మమ దేవేశ త్వయా కిం విస్మృతం పురా ।**
**దక్షయజ్ఞవినాశం హి యదర్థం కృతవాన్ హఠాత్ ॥5॥**

ఓ దేవేశా! నీవు నా నాథుడవు. నాకోసమే ఆగ్రహించి, దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేశావు. ఆ పూర్వగాథను మరచావా ఏమి?

**స త్వం సాహం సముత్పన్నా మేనాయాం కార్యసిద్ధయే ।**
**దేవానాం దేవదేవేశ తారకాప్తాఽసుఖాత్మనామ్ ॥6॥**

ఓ దేవదేవా! ఈశ్వరా! తారకునిచే పీడింపబడుచున్న దేవతల కార్యసిద్ధికై నేను మేనాదేవియందు జన్మించాను.

**యది ప్రసన్నో దేవేశ కరోషి చ కృపాం యది ।**
**పతిర్భవ మమేశాన మమ వాక్యం కురు ప్రభో ॥7॥**

ఓ దేవదేవా! ఓ ప్రభూ! నీవు ప్రసన్నుడవైతే, నీకు దయ కలిగితే, నా మాటను పాలించి, నాకు భర్తవు కమ్ము.

**పితుర్గేహే మయా సమ్యగ్గమ్యతే త్వదనుజ్ఞయా ।**
**ప్రసిద్ధం క్రియతాం తద్వైవిశుద్ధం పరమం యశః ॥8॥**

నీ అనుమతితో నేను మా తండ్రిగారింటికి వెళతాను. పరమ పవిత్రమైన మీకీర్తి నలుదిక్కుల వ్యాపించేటట్లు చేయి.

**గంతవ్యం భవతా నాథ హిమవత్పార్శ్వతః ప్రభో ।**
**యాచస్వ మాం తతో భిక్షుర్భూత్వా లీలా విశారదః ॥9॥**

ఓ నాథా! హేప్రభూ! హిమవంతుని వద్దకు వెళ్ళు. లీలా విశారుదడవైన నువ్వు భిక్షుకుడవై అతనినుండి నన్ను కోరుకో.

**తథా త్వయా ప్రకర్తవ్యం లోకే ఖ్యాపయతా యశః ।**
**పితుర్మే సఫలం సర్వం కురుష్వైవం గృహాశ్రమమ్ ॥10॥**

అట్లు చేసి, నీకీర్తిని లోకంలో విస్తరిల్లజేసుకో. నా తండ్రియొక్క గృహస్థాశ్రమాన్ని సఫలంచేయి.

**ఋషిభిః బోధితః ప్రీత్యా స్వబంధుపరివారితః ।**
**కరిష్యతి న సందేహస్తవ వాక్యం పితా మమ ॥11॥**

మహర్షులచే బోధింపబడి బంధువులతోగూడి, నాతండ్రి ప్రీతియుక్తంగా నీకోర్కెను మన్నిస్తాడు. ఈ విషయంలో సందేహం లేదు.

**దక్ష కన్యా పురాహం వై పిత్రా దత్తా యదా తవ ।**
**యథోక్తవిధినా తత్ర వివాహో న కృతస్త్వయా ॥12॥**

పూర్వం నేను దక్షకన్యనై జన్మించినపుడు నాతండ్రి నన్ను నీకిచ్చి వివాహం చేశాడు. కాని ఆ సమయంలో నీవు యథావిధిగా వివాహకార్యం నిర్వర్తించలేదు.

**న గ్రహాః పూజితాస్తేన దక్షేణ జనకేన మే ।**
**గ్రహాణాం విషయస్తేన సచ్ఛిద్రోయం మహానభూత్ ॥13॥**

నా తండ్రియైన దక్షునిచే గ్రహాలు పూజింపబడలేదు. గ్రహాల విషయంలో అది పెద్ద పొరబాటుగా పరిణమించింది.

**తస్మాద్యథోక్తవిధినా కర్తుమర్హసి మే ప్రభో ।**
**వివాహం త్వం మహాదేవ దేవానాం కార్యసిద్ధయే ॥14॥**

ఓ ప్రభూ! మహాదేవా! కాబట్టి నువ్వు యథావిధిగా ఇప్పుడు వివాహం చేసుకోవాలి. దేవతల కార్యసిద్ధికై నువ్వు వివాహమాడుతున్నావు.

**వివాహస్య యథారీతిః కర్తవ్యా సా తథా ధ్రువమ్ ।**
**జానాతు హిమవాన్ సమ్యక్ కృతం పుత్ర్యా శుభం తపః ॥15॥**

వివాహాన్ని ఏరీతిగా నిర్వర్తించాలో అదే రీతిని నువ్వు పాటించు. ఇది తప్పనిసరి. హిమవంతుడు తన కుమార్తె చేసిన శుభకరమైన తపస్సు గురించి చక్కగా తెలుసుకుంటాడు కదా!

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవం వచనం శ్రుత్వా సుప్రసన్న స్సదాశివః ।**
**ప్రోవాచ వచనం ప్రీత్యా గిరిజాం ప్రహసన్నివ ॥16॥**

ఈ మాటలను సదాశివుడు విని, మిక్కిలి ప్రసన్నుడై, చిరునవ్వుతో ప్రీతియుక్తంగా పార్వతితో ఇలా పలికాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**శ్రుణు దేవి మహేశాని పరమం వచనం మమ ।**
**యథోచితం సుమాంగళ్య మవికారి తథా కురు ॥17॥**

ఓ దేవీ! మహేశ్వరీ! శ్రేష్ఠమైన నా మాటలు విను. చక్కని శుభాలు కలిగేటట్లుగా, వికారాలు లేనివిధంగా యథోచితంగా చేయి.

**బ్రహ్మాదికాని భూతాని త్వనిత్యాని వరాననే ।**
**దృష్టం యత్సర్వమేతచ్చ నశ్వరం విద్ధి భామిని ॥18॥**

వరాననా! బ్రహ్మాది ప్రాణులన్నీ అనిత్యాలు. కనబడే ఇదంతా నశించేదని తెలుసుకో.

**ఏకో నేకత్వమాపన్నో నిర్గుణో హి గుణాన్వితః ।**
**స్వజ్యోత్స్నా యా యో విభాతి పరజ్యోత్స్నాన్వితోఽభవత్ ॥19॥**

నేనొక్కడనే అనేకంగా, నిర్గుణునిగా, సగుణునిగా అయ్యాను. స్వప్రకాశంచే వెలుగొందే నేను పరప్రకాశంతో కూడినవాడనయ్యాను.

**స్వతంత్రః పరతంత్రశ్చ త్వయా దేవి కృతోహ్యహమ్ ।**
**సర్వకర్త్రీచ ప్రకృతిర్మహామాయా త్వమేవ హి ॥20॥**

ఓ దేవీ! స్వతంత్రుడనైన నన్ను నువ్వు పరతంత్రునిగా చేశావు. సర్వాన్ని సృష్టించు ప్రకృతివి నీవే. మహామాయవు నీవే.

**మాయామయం కృతమిదం చ జగత్సమగ్రం సర్వాత్మనాహి విధృతం పరయా స్వబుద్ధ్యా ।**
**సర్వాత్మభిః సుకృతిభిః పరమాత్మ భావైః సంసిక్తమాత్మని గుణైః పరివేష్టితం చ ॥21॥**

మాయామయమైన ఈ జగత్తునంతటిని నేను సృష్టించాను. అమోఘమైన నా సంకల్పశక్తిచే సృష్టింపబడిన ఈ జగత్తును సర్వాత్మరూపుడనై నేను ధరిస్తున్నాను. సర్వాత్మ భావంగల పుణ్యాత్ములు సర్వత్రా పరమాత్మను దర్శిస్తూ, త్రిగుణాత్మకమైన ఈ జగత్తు ఆత్మయందు మాత్రమే అధిష్ఠితమై యున్నట్లుగా దర్శిస్తారు.

**కే గ్రహాః కే ఋతుగణాః కేవాన్యేపి త్వయా గ్రహాః ।**
**కిముక్తం చాధునా దేవి శివార్థం వరవర్ణిని ॥22॥**

గ్రహాలంటే ఏమిటి? ఋతుసమూహాలంటే ఏమిటి? నీకంటే భిన్నంగా ఉపగ్రహాలున్నాయా? ఓ బ్రహ్మచారిణీ! నీవిప్పుడు శివుని కొరకు తపస్సు చేస్తున్నావనుమాట ఎట్టిది?

**గుణకార్య ప్రభేదే నావాభ్యాం ప్రాదుర్భవః కృతః ।**
**భక్త హేతోర్జగత్యస్మి న్భక్తవత్సల భావతః ॥23॥**

మనమిరువురమూ భక్తుల యందలి ప్రేమతో ఈ జగత్తులో గుణబేధాన్ని బట్టి విభిన్న కార్యరూపంగా సృష్టించాము.

**త్వం హి వై ప్రకృతిస్సూక్ష్మా రజస్సత్త్వతమోమయీ ।**
**వ్యాపారదక్షా సతతం సగుణా నిర్గుణాపి చ ॥24॥**

సూక్ష్మమూ, రజస్సత్త్వ తమోగుణాత్మకమూ, జగద్వ్యాపారమందు సమర్థమైనదీ, నిర్గుణమైనదీ అయినా నిత్యం సగుణ రూపంలో నుండే ప్రకృతివి నీవే.

**సర్వేషామిహ భూతానా మహమాత్మా సుమధ్యమే ।**
**నిర్వికారీ నిరీహశ్చ భక్తేచ్ఛోపాత్త విగ్రహః ॥25॥**

ఓ సుమధ్యమే! ఈ జగత్తులోని సమస్త ప్రాణులకు ఆత్మను నేను. వికారాలు, కామనలు లేని నేను భక్తుల కోరిక మేరకు దేహాన్ని స్వీకరిస్తాను.

**హిమాలయం న గచ్ఛేయం జనకం తవ శైలజే ।**
**తతస్త్వాం భిక్షుకో భూత్వా న యాచేయం కథంచన ॥26॥**

ఓ పార్వతీ! నీతండ్రియైన హిమవంతుని వద్దకు నేను వెళ్ళను. నేను భిక్షుకుడనై, నిన్నిమ్మని నేనెన్నటికీ యాచించను.

**మహాగుణైర్గరిష్ఠోఽపి మహాత్మాపి గిరీంద్రజే ।**
**దేహీతి వచనాత్సద్యః పురుషో యాతి లాఘవమ్ ॥27॥**

ఓ పర్వతరాజపుత్రీ! మహాగుణ గరిష్ఠుడైనను, మహాత్ముడైనను, "ఇమ్ము" అనే మాటను పలికిన మరుక్షణంలో చులకన అవుతాడు.

**ఇత్థం జ్ఞాత్వా తు కల్యాణి కిమస్మాకం వదస్యథ ।**
**కార్యం త్వదాజ్ఞయా భద్రే యథేచ్ఛసి తథా కురు ॥28॥**

ఓ కల్యాణీ! ఈవిషయం నీవెరుగుదువు. నువ్వు మాకేమని చెబుతావు? నీ ఆజ్ఞ తప్పక అనుసరింపదగినదే. కాబట్టి నీ ఇచ్ఛానుసారమే చేయి.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**తేనోక్తాపి మహాదేవీ సా సాధ్వీ కమలేక్షణా ।**
**జగాద శంకరం భక్త్యా సుప్రణమ్య పునః పునః ॥29॥**

ఈశ్వరుడీవిధంగా చెప్పినప్పటికీ, సాధ్వీ, మహాదేవీ అయిన ఆ కమలేక్షణ, పార్వతి భక్తితో అనేక పర్యాయాలు సాష్టాంగ నమస్కారం గావించి, శంకరునితో ఇలా పలికింది.

**పార్వత్యువాచ** – పార్వతి పలికింది.

**త్వమాత్మా ప్రకృతిశ్చాహం నాత్ర కార్యా విచారణా ।**
**స్వతంత్రౌ భక్తవశగౌ నిర్గుణౌ సగుణావపి ॥30॥**

నీవు ఆత్మవు నేను ప్రకృతిని అనే విషయంలో చర్చలేదు. మనం స్వతంత్రులం, అయినప్పటికి మనం భక్తవశులం, సగుణులం, నిర్గుణులంకూడా

**ప్రయత్నేన త్వయా శంభో కార్యం వాక్యం మమ ప్రభో ।**
**యాచస్వ మాం హిమగిరేస్సౌభాగ్యం దేహి శంకర ॥31॥**

ఓ శంభూ! ప్రభూ! నీవీ పనిని ప్రయత్నపూర్వకంగానైనా నేను చెప్పిన విధంగా చెయ్యాలి. ఓ శంకరా! హిమవంతునికీ భాగ్యాన్ని కలిగించు. నన్ను ఇమ్మని ఆయనను యాచించు.

**కృపాం కురు మహేశాన తవ భక్తాస్మి నిత్యశః ।**
**తవ పత్నీ సదానాథ హ్యహం జన్మని జన్మని ॥32॥**

మహేశా! నాపై దయచూపు. నేను నీకు నిత్యభక్తురాలను. నాథా! జన్మజన్మలయందు సర్వదా నేను నీభార్యను.

**త్వం బ్రహ్మ పరమాత్మా హి నిర్గుణః ప్రకృతేః పరః ।**
**నిర్వికారీ నిరీహశ్చ స్వతంత్రః పరమేశ్వరః ॥33॥**

పరమాత్మ, పరబ్రహ్మ నీవే. నిర్గుణుడవైన నువ్వు ప్రకృతికి అతీతుడవు. వికారాలు, కామనలు లేని స్వతంత్రుడవు. పరమేశ్వరుడవు.

**తథాపి సగుణోపీహ భక్తోద్ధార పరాయణః ।**
**విహారీ స్వాత్మనిరతో నానాలీలా విశారదః ॥34॥**

అయినప్పటికి నీవు సగుణుడవై, భక్తులను ఉద్ధరించుట ప్రధాన లక్ష్యంగా కలిగి విహరిస్తున్నావు. నువ్వు నానా లీలా విశారదుడవు. ఆత్మనిష్ఠుడవై ఉంటావు.

**సర్వథా త్వామహం జానే మహాదేవ మహేశ్వర ।**
**కిముక్తేన చ సర్వజ్ఞ బహునా హి దయాం కురు ॥35॥**

ఓ మహాదేవా! మహేశ్వరా! నిన్నునేను పూర్తిగా ఎరుగుదును. పెక్కుమాటలెందుకు? నీవు సర్వజ్ఞుడవు. దయను చూపు.

**విస్తారయ యశో లోకే కృత్వా లీలాం మమాద్భుతామ్ ।**
**యత్సుగీయ జనా నాథాంజసోత్తీర్ణా భవాంబుధేః ॥36॥**

గొప్ప అద్భుతమైన లీలను ప్రదర్శించి, లోకంలో కీర్తివిస్తరిల్ల జేయి. నాథా! ఆ కీర్తిని చక్కగా గానంచేసే జనులు శీఘ్రమే సంసార సముద్రంనుండి ఉత్తీర్ణులౌతారు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవముక్త్వా గిరిజా సుప్రణమ్య పునః పునః ।**
**విరరామ మహేశానం నతస్కంధా కృతాంజలిః ॥37॥**

ఇట్లు పలికి పార్వతీదేవి అనేక పర్యాయాలు తలవంచి, చేతులొగ్గి, మహేశ్వరునికి మళ్ళీ మళ్ళీ నమస్కరించి, మిన్నకుంది.

**ఇత్యేవముక్తస్తయా మహాత్మా మహేశ్వరో లోకవిడంబనాయ ।**
**తథేతి మత్వా ప్రహసన్ బభూవ ముదాన్వితః కర్తుమనాస్తదేవ ॥38॥**

ఆమె ఇట్లు పలుకగా మహాత్ముడైన మహేశ్వరుడు లోకపుతీరు ననుసరించుటకై అట్లే చేస్తానని తలంచి, ఆనందంతో నవ్వుతూ నిలిచాడు.

**తతోహ్యంతర్హితశ్శంభుర్బభూవ సుప్రహర్షితః ।**
**కైలాసం ప్రయయౌ కాళ్యా విరహాకృష్టమానసః ॥39॥**

అప్పుడు మిక్కిలి ఆనందించిన శంకరుడు అంతర్ధానమై, కాళియొక్క విరహం మనస్సును లాగుతుండగా కైలాసాన్ని చేరుకున్నాడు.

**తత్ర గత్వా మహేశానో నంద్యాదిభ్యస్స ఊచివాన్ ।**
**వృత్తాంతం సకలం తం వై పరమానందనిర్భరః ॥40॥**

అక్కడకు వెళ్ళి, పరమానందంతో నిండియున్న మహేశ్వరుడు ఆ వృత్తాంతాన్నంతటిని నంది మున్నగువారికి చెప్పాడు.

**తేఽపి శ్రుత్వా గణాస్సర్వే భైరవాద్యాశ్చ సర్వశః ।**
**బభూవు స్సుఖినోఽత్యంతం విదధుః పరమోత్సవమ్ ॥41॥**

నంది మొదలగు వారు, భైరవాది గణాలన్నీ ఆ వృత్తాంతాన్ని విని, మిక్కిలి ఆనందించినవారై, మహోత్సవాన్ని జరుపుకున్నారు.

**సుమంగళం తత్ర ద్విజ బభూవాతీవ నారద ।**
**సర్వేషాం దుఃఖనాశోఽభూద్రుద్రః ప్రాపాపి సంముదమ్ ॥42॥**

ఓ నారదా! ద్విజా! అక్కడ గొప్పమంగళం ప్రవర్తిల్లింది. అందరికి దుఃఖం తొలగిపోయింది. రుద్రుడుకూడా మహానందాన్ని పొందాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే శివా, శివ సంవాదమ్ వర్ణనం నామైకోన త్రింశోఽధ్యాయః ॥29॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో పార్వతీ పరమేశ్వరులసంవాద అనే ఇరవై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## త్రింశోఽధ్యాయః - ముప్పైయవ అధ్యాయం

## పార్వతీ ప్రత్యాగమన మహోత్సవవర్ణనమ్ - పార్వతి తపస్సునుండి తిరిగివచ్చుట

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**విధే తాత మహాభాగ ధన్యస్త్వం పరమార్థదృక్ ।**
**అద్భుతేయం కథాశ్రావి త్వదనుగ్రహతో మయా ॥1॥**

ఓ విధీ! తండ్రీ! మహాత్మా! పరమార్థాన్ని దర్శించు నీవు ధన్యుడవు. నీ అనుగ్రహంచే నేనీ అద్భుతగాథను విన్నాను.

**గతే హరే స్వశైలే హి పార్వతీ సర్వమంగళా ।**
**కిం చకార గతా కుత్ర తన్మే వద మహామతే ॥2॥**

శివుడు తన పర్వతానికి వెళ్ళిన పిదప సర్వమంగళయైన పార్వతీదేవి ఏమిచేసింది? ఎక్కడకు వెళ్ళింది? నాకాగాథను చెప్పు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**శ్రుణు సుప్రీతితస్తాత యజ్జాతం తదనంతరమ్ ।**
**హరే గతే నిజస్థానే తద్వదామి శివం స్మరన్ ॥3॥**

వత్సా! ప్రీతితో విను. నేను శివుని స్మరించి, శివుడు తన ధామానికి వెళ్ళిన పిదప జరిగిన వృత్తాంతమంతా చెబుతాను.

**పార్వత్యపి సఖీయుక్తా రూపం కృత్వా తు సార్థకమ్ ।**
**జగామ స్వపితుర్గేహం మహాదేవేతి వాదినీ ॥4॥**

తన రూపాన్ని సార్థకం చేసుకున్న పార్వతికూడా చెలికత్తెలతో కూడి, మహాదేవ నామాన్ని జపిస్తూ తన తండ్రిగారి గృహానికి వెళ్ళింది.

**పార్వత్యాగమనం శ్రుత్వా మేనా చ స హిమాచలః ।**
**దివ్యం యానం సమారుహ్య ప్రయయౌ హర్షవిహ్వలః ॥5॥**

పార్వతి రాకనుగూర్చి విని, మేనా హిమవంతులు, సంతోషాన్ని పట్టజాలక దివ్యరథమెక్కి ఎదురేగారు.

**పురోహితశ్చ పౌరాశ్చ సఖ్యశ్చైవాప్యనేకశః ।**
**సంబంధిన స్తథాన్యే చ సర్వే తే చ సమాయయుః ॥6॥**

పురోహితులు, పౌరులు, సఖురాండ్రు, బంధువులు, ఇతరులు పెద్దసంఖ్యలో విచ్చేశారు.

**భ్రాతరః సకలా జగ్ముర్మైనక ప్రముఖాస్తదా ।**
**జయశబ్దం ప్రబ్రువంతో మహాహర్ష సమన్వితాః ॥7॥**

మైనాకుడు మున్నగు సోదరులందరు మహానందంతో నిండినవారై, జయధ్వానాలు చేస్తూ విచ్చేశారు.

**సంస్థాప్య మంగళఘటం రాజవర్త్మని రాజితే ।**
**చందనాగరు కస్తూరీ ఫలశాఖా సమన్వితే ॥8॥**

ప్రకాశించే రాజమార్గాలలో మంగళ ఘటాన్ని స్థాపించారు. రాజమార్గం చందనం, అగరు, కస్తూరి, ఫలాలు, శాఖలతో ప్రకాశించింది.

**సపురోధో బ్రాహ్మణైశ్చ మునిభిర్బ్రహ్మవాదిభిః ।**
**నారీభిర్నర్తకీభిశ్చ గజేంద్రాది సుశోభితైః ॥9॥**

పురోహితులైన బ్రాహ్మణులతో, బ్రహ్మవేత్తలైన మహర్షులతో, నాట్యంచేసే స్త్రీలతో, పర్వతాలవంటి ఏనుగులతో రాజమార్గమంతా శోభిల్లింది.

**పరితః పరితో రంభా స్తంభ వృంద సమన్వితే ।**
**పతిపుత్రవతీ యోషిత్సమూహై ర్దీపహస్తకైః ॥10॥**

రెండువైపులా అరటి స్తంభాలచే అలంకరింపబడిన రాజమార్గంలో పతీపుత్రులు కలిగిన ముత్తైదువలు దీపాలను చేతబట్టి, గుంపులుగా నిలబడ్డారు.

**ద్విజబృందైశ్చ సంయుక్తే కుర్వద్భిర్మంగళధ్వనిమ్ ।**
**నానాప్రకార వాద్యైశ్చ శంఖధ్వనిభిరన్వితే ॥11॥**

అక్కడ బ్రాహ్మణ బృందాలు మంగళధ్వనిని చేస్తున్నాయి. శంఖం మున్నగు అనేక వాద్యాలు మ్రోగింపబడు తున్నాయి.

**ఏతస్మిన్నంతరే దుర్గా జగామ స్వపురాంతికమ్ ।**
**విశంతీ నగరం దేవి దదర్శ పితరౌ పునః ॥12॥**

ఇంతలో దుర్గ తన నగరాన్ని సమీపించింది. ఆమె నగరంలో ప్రవేశిస్తూనే ఆనందం పట్టజాలని తల్లిదండ్రులను చూచింది.

**సుప్రసన్నౌ ప్రధావంతౌ హర్షవిహ్వల మానసౌ ।**
**దృష్ట్వా కాళీ సుప్రహృష్టా స్వాలిభిః ప్రణనామ తౌ ॥13॥**

హర్షపులకిత మనస్కులై, మిక్కిలి ప్రసన్నులై, మిక్కిలి వేగంగా వచ్చిన వారినిచూచి, కాళి మిక్కిలి సంతసించి, తన సఖురాండ్రతో సహా వారికి నమస్కరించింది.

**తౌ సంపూర్ణాశిషం దత్త్వా చక్రతుస్తౌ స్వవక్షసి ।**
**హే వత్సే త్వేవముచ్చార్య రుదంతౌ ప్రేమ విహ్వలౌ ॥14॥**

వారు సంపూర్ణమైన ఆశీర్వచనాలను పలికి, ఓ అమ్మాయీ! అని అక్కున చేర్చుకుని, పట్టరాని ఆనందంతో ఆనందబాష్పాలు రాల్చారు.

**తతస్స్వకీయా అప్యస్యా అన్యానార్యాపి సంముదా ।**
**భ్రాతృ స్త్రియోఽపి సుప్రీత్యా దృఢాలింగనమాదధుః ॥15॥**

అనంతరం ఆమెకు బంధువులైన ఇతర స్త్రీలు, సోదరుల భార్యలుకూడా మహానందంతో, పరమప్రీతితో, ఆమెను గాఢాలింగనం చేసుకున్నారు.

**సాధితం హి త్వయా సమ్యక్ సుకార్యం కుల తారణమ్ ।**
**త్వత్సదాచరణేనాపి పావితాః స్మాఖిలా వయమ్ ॥16॥**

నీవు వంశాన్ని తరింపజేసే పుణ్యకార్యాన్ని చక్కగా సాధించావు. నీ పవిత్రమైన ఆచరణచే మేమందరంకూడ పవిత్రులమయ్యాం.

**ఇతి సర్వే సుప్రశంస్య ప్రణేముస్తాం ప్రహర్షితాః ।**
**చందనైః సుప్రసూనైశ్చ సమానర్చుశ్శివాం ముదా ॥17॥**

ఇట్లు వారందరు మహా హర్షంతో ఆమెను బాగా ప్రశంసించి, సుగంధ ద్రవ్యాలతోను, పుష్పాలతోను శివాదేవిని సంతోషంతో పూజించారు.

**తస్మిన్నవసరే దేవా విమానస్థా ముదాంబరే ।**
**పుష్పవృష్టిం శుభాం చక్రుర్నత్వా తాం తుష్టువుః స్తవైః ॥18॥**

ఆసమయంలో ఆకాశంలో విమానాలలోనున్న దేవతలు, ఆనందంతో మంగళకరమైన పుష్పవృష్టిని కురిపించి, ఆమెకు నమస్కరించి, స్తోత్రాలు చేశారు.

**తదా తాం చ రథే స్థాప్య సర్వశోభాన్వితే వరే ।**
**పురం ప్రవేశయామాసు స్సర్వే విప్రాదయో ముదా ॥19॥**

అప్పుడామెను శోభాయమానమైన రథంపై కూర్చుండబెట్టి, బ్రాహ్మణులు మున్నగువారందరు ఆనందంతో నగరంలో ప్రవేశపెట్టారు.

**అథ విప్రాః పురోధాశ్చ సఖ్యోఽన్యాశ్చ స్త్రియః శివామ్ ।**
**గృహం ప్రవేశయామాసు ర్బహుమానపురస్సరమ్ ॥20॥**

అపుడు బ్రాహ్మణులు, పురోహితులు, చెలికత్తెలు, ఇతర స్త్రీలు పార్వతిని సమ్మానపూర్వకంగా ఇంటిలో ప్రవేశపెట్టారు.

**స్త్రియో నిర్మచ్ఛనం చక్రు ర్విప్రా యుయుజురాశిషః ।**
**హిమవాన్మేనకా మాతా ముమోదాతి మునీశ్వర ॥21॥**

స్త్రీలు ఆమెకు దిష్టితీశారు. బ్రాహ్మణులు ఆమెకు ఆశీర్వచనాలు పలికారు. తల్లిదండ్రులైన మేనా హిమవంతులు మిక్కిలి ఆనందించారు.

**స్వాశ్రమం సఫలం మేనే కుపుత్రా త్పుత్రికా వరా ।**
**హిమవాన్నారదం త్వాం చ సంస్తువన్ సాధుసాధ్వితి ॥22॥**

తన గృహస్థాశ్రమం సఫలమయ్యిందనియు, కుపుత్రునికంటె పుత్రికయే శ్రేష్ఠమనియు భావించిన హిమవంతుడు నిన్ను (నారదుని) "బాగుబాగని" స్తుతించాడు.

**బ్రాహ్మణేభ్యశ్చ బందిభ్యః పర్వతేంద్రో ధనం దదౌ ।**
**మంగళం పాఠయామాస సద్విజేభ్యో మహోత్సవమ్ ॥23॥**

ఆ పర్వతరాజు బ్రాహ్మణులకు, వందిమాగధులకు ధనాన్నిచ్చాడు. బ్రాహ్మణులచే మంగళ పాఠాలను చదివించాడు. మహోత్సవాన్ని నిర్వహించాడు.

**ఏవం స్వకన్యయా హృష్టో పితరౌ భ్రాతరస్తథా ।**
**జామయశ్చ మహాప్రీత్యా సమ్మృషుః ప్రాంగణే మునే ॥24॥**

ఓ నారదమహర్షీ! ఈవిధంగా తమ కుమార్తెచే సంతసించిన తల్లిదండ్రులు, సోదరులు, వారి భార్యలు మహానందంతో వాకిట కూర్చున్నారు.

**తతస్స హిమవాన్ తాత సుప్రహృష్టః ప్రసన్నధీః ।**
**సమ్మాన్య స కాలాన్ప్రీత్యా స్నాతుం గంగాం జగామ హ ॥25॥**

ఓ కుమారా! హిమవంతుడు ప్రసన్నమానసుడై, ప్రీతిపూర్వకంగా అందరిని ఆదరించి, స్నానమాచరించదానికి గంగానదికి వెళ్ళాడు.

**ఏతస్మిన్నంతరే శంభుస్సులీలో భక్తవత్సలః ।**
**సునర్తక నటో భూత్వా మేనకా సంనిధిం యయౌ ॥26॥**

ఇంతలో భక్తవత్సలుడు, సులీలాకరుడునైన శంభుడు నాట్యంచేసే నటుని రూపాన్ని ధరించి, మేనాదేవివద్దకు వెళ్ళాడు.

**శృంగం వామే కరే ధృత్వా దక్షిణే డమరుం తథా ।**
**పృష్ఠే కంథాం రక్తవాసా నృత్యగాన విశారదః ॥27॥**

నృత్యగాన విశారదుడైన శంకరుడు ఎర్రని వస్త్రాలను ధరించి, ఎడమచేతియందు కొమ్ము బూరాను, కుడిచేతియందు డమరుకాన్ని, భుజంపై మచ్చల దుప్పటిని ధరించాడు.

**తతస్సునటరూపోఽసౌ మేనకాయా గణే ముదా ।**
**చక్రే సునృత్యం వివిధం గానం చాతి మనోహరమ్ ॥28॥**

మహానటుని రూపంలోనున్న శివు డప్పుడు మేనకాదేవి మరియు ఇతర స్త్రీల ఎదుట చక్కని నాట్యాన్నిచేసి, అతిమనోహరంగా అనేక గీతాలను పాడాడు.

**శృంగం చ డమరుం తత్ర వాదయామాస సుధ్వనిమ్ ।**
**మహతీం వివిధాం తత్ర సచకార మనోహరామ్ ॥29॥**

ఆయన అచ్చట చక్కని ధ్వనిగల కొమ్ముబూరను, ఢమరును ప్రయోగించి, మనోహరమైన వివిధ మహానాట్యాలు చేశాడు.

**తాం ద్రష్టుం నాగరాస్సర్వే పురుషాశ్చ స్త్రియస్తథా ।**
**ఆజగ్ముస్సహసా తత్ర బాలా వృద్ధా అపి ధ్రువమ్ ॥30॥**

ఆ నాట్యాన్ని చూడడానికి నగర జనులందరు అనగా పురుషులు, స్త్రీలు, పిల్లలు, పెద్దలు, అందరు వెంటనే అక్కడకు వచ్చారు.

**శ్రుత్వా సుగీతం తద్దృష్ట్వా సునృత్యం చ మనోహరమ్ ।**
**సహసా ముముహుస్సర్వే మేనాపి చ తదా మునే ॥31॥**

ఓ మహర్షీ! ఆ చక్కని గీతాన్ని మనోహరమైన నృత్యాన్ని చూచి, మేనాదేవితో సహా అందరూ మోహాన్ని పొందారు.

**మూర్ఛాం సంప్రాప్య సా దుర్గా సుదృష్ట్వా హృది శంకరమ్ ।**
**త్రిశూలాదిక చిహ్నాని బిభ్రతంచాతి సుందరమ్ ॥32॥**

**విభూతి భూషితం రమ్యమస్థి మాలా సమన్వితమ్ ।**
**త్రిలోచనోజ్జ్వలద్వక్త్రం నాగయజ్ఞోపవీతకమ్ ॥33॥**

**వరం వృణ్వీత్యుక్తవంతం గౌరవర్ణం మహేశ్వరమ్ ।**
**దీనబంధుం దయాసింధుం సర్వథా సుమనోహరమ్ ॥34॥**

**హృదయస్థం హరం దృష్ట్వేదృశం సా ప్రణనామ తమ్ ।**
**వరం వవ్రే మానసం హి పతిర్మే త్వం భవేతి చ ॥35॥**

దుర్గాదేవికూడా మూర్ఛిల్లి మనసా శంకరుని దర్శించింది. త్రిశూలాది చిహ్నాలను ధరించినవాడు, మిక్కిలి సుందరాకారుడు, విభూతి భూషితుడు, రమ్యమైన ఎముకల మాలను ధరించినవాడు, మూడు కన్నులతో ఉజ్జ్వలమైన ముఖం కలవాడు, నాగ యజ్ఞోపవీతం గలవాడు, వరాన్ని కోరుకొమ్మని పలికినవాడు, గౌరవర్ణం గలవాడు, మహేశ్వరుడు, దీనబంధుడు, దయాసింధువు, సర్వథా సుమనోహరుడు, హృదయమునందున్న వాడునైన హరునిజూచి, ఆమె అతనికి నమస్కరించింది. అంతేగాక ఆమె తన మనస్సులో 'నీవు నాకు భర్తవు కమ్ము' అనే వరాన్నికూడా కోరింది.

**వరం దత్వా శివం చాథ తాదృశం ప్రీతితో హృదా ।**
**అంతర్ధాయ పునస్తత్ర సుననర్త స భిక్షుకః ॥36॥**

**తతో మేనా సురత్నాని స్వర్ణపాత్రస్థితాని చ ।**
**తస్మై దాతుం యయౌ ప్రీత్యా తద్భూతి ప్రీతమానసః ॥37॥**

**తాని న స్వీచకారాసౌ భిక్షాం యాచే శివాం చ తామ్ ।**
**పునస్సునృత్యం గానం చ కౌతుకాత్కర్తుముద్యతః ॥38॥**

శివుడామెకు హృదయంలో దర్శనమిచ్చి, ప్రీతితో మంగళకరమైనట్టి వరాన్నిచ్చి, అంతర్ధానమై, మరల అచ్చట భిక్షుకుడై, నాట్యంచేశాడు. అంతట మేనాదేవి బంగారు పాత్రలో మంచి రత్నాలను పోసి, అతనికివ్వడానికి తీసుకొని వెళ్ళింది. సంతసించిన మనస్సుగల శివుడా రత్నాలను నిరాకరించి, పార్వతిని భిక్షగా ఇమ్మని కోరాడు. ఆయన మరలా పాటలు పాడుతూ, ఉత్సాహంతో నృత్యంచేయడం మొదలుపెట్టాడు.

**మేనా తద్వచనం శ్రుత్వా చుకోపాతి సువిస్మితా ।**
**భిక్షుకం భర్త్సయామాస బహిష్కర్తు మియేష సా ॥39॥**

ఆ మాటను వినిన మేనాదేవి మిక్కిలి ఆశ్చర్యాన్ని, కోపాన్ని పొంది, ఆ భిక్షుకుని నిందించింది. ఆమె అతనిని బయటకు నెట్టింపగోరింది.

**ఏతస్మిన్నంతరే తత్ర గంగాతో గిరిరాయయౌ ।**
**దదర్శ పురతో భిక్షుం ప్రాంగణస్థం నరాకృతిమ్ ॥40॥**

ఇంతలో గంగానదినుండి హిమవంతుడచ్చటకు వచ్చాడు. ఆయనకు నరరూపంలోనున్న ఆదిభిక్షువు వాకిట కనబడ్డాడు.

**శ్రుత్వా మేనా ముఖాద్వృత్తం తత్సర్వం సుచుకోప సః ।**
**ఆజ్ఞాం చకారానుచరాన్బహిష్కర్తుం చ తం నటమ్ ॥41॥**

మేనాదేవి చెప్పగా జరిగిన వృత్తాంతమంతా విని, హిమవంతుడు చాలా కోపించి, ఆ నటుని బయటకు గెంటండని సేవకుల కాజ్ఞాపించాడు.

**మహాగ్నిమివ దుస్స్పర్శం ప్రజ్జ్వలంతం సుతేజసమ్ ।**
**న శశాక బహిష్కర్తుం కోపి తం మునిసత్తమ ॥42॥**

ఓ మునిశ్రేష్ఠా! స్పృశింప శక్యంకాని మహాగ్నివలె, మహాతేజస్సుతో ప్రజ్వరిల్లుతున్న శివుని బయటకు నెట్టగల సామర్థ్యం ఎవరికీ లేకపోయింది.

**తతస్స భిక్షుకస్తాత నానాలీలా విశారదః ।**
**దర్శయామాస శైలాయ స్వప్రభావమనంతకమ్ ॥43॥**

ఓ కుమారా! అంతట నానాలీలా విశారదుడైన ఆ భిక్షుకుడు తన అనంత మహిమను హిమవంతునకు చూపించాడు.

**శైలో దదర్శ తం తత్ర విష్ణురూపధరం ద్రుతమ్ ।**
**కిరీటినం కుండలినం పీతవస్త్రం చతుర్భుజమ్ ॥44॥**

**యద్యత్పుష్పాదికం దత్తం పూజాకాలే గదాభృతే ।**
**గాత్రే శిరసి తత్సర్వం భిక్షుకస్య దదర్శ హ ॥45॥**

అప్పుడచ్చట వెనువెంటనే హిమవంతునకు కిరీటం, కుండలం, పీతవస్త్రం ధరించిన, చతుర్భుజుడైన విష్ణురూపం కనిపించింది. పూజా సమయంలో గదాధారియైన విష్ణువునకు ఏ యే పుష్పాదులు సమర్పింపబడ్డాయో, వాటినన్నింటిని భిక్షుకుని శిరస్సునందు, శరీరంపై హిమవంతుడు చూశాడు.

**తతో దదర్శ జగతాం స్రష్టారం స చతుర్ముఖమ్ ।**
**రక్తవర్ణం పఠన్తం చ శ్రుతి సూక్తం గిరీశ్వరః ॥46॥**

అనంతరం చతుర్ముఖుడై, ఎర్రని వర్ణంగలిగి, వేదసూక్తాలను పఠిస్తున్నవాడు, సృష్టికర్తయునగు బ్రహ్మను హిమవంతుడు దర్శించాడు.

**తతస్సూర్య స్వరూపం చ జగచ్చక్షు స్వరూపకమ్ ।**
**దదర్శ గిరిరాజస్స క్షణం కౌతుక కారిణామ్ ॥47॥**

అనంతరం హిమవంతుడు జగచ్చక్షు స్వరూపుడైన సూర్య స్వరూపాన్ని క్షణకాలం దర్శించి, విస్మయాన్ని పొందాడు.

**తతో దదర్శ తం తాత రుద్రరూపం మహాద్భుతమ్ ।**
**పార్వతీ సహితం రమ్యం విహసంతం సుతేజసమ్ ॥48॥**

ఓ కుమారా! అనంతరం ఆ పర్వతుడు మహాద్భుతమై, పార్వతీ సహితమై, రమ్యమై, నవ్వుచున్న మోమూ గొప్పతేజస్సు గల రుద్రరూపాన్ని దర్శించాడు.

**తతస్తేజస్స్వరూపం చ నిరాకారం నిరంజనమ్ ।**
**నిరుపాధిం నిరీహం చ మహాద్భుత మరూపకమ్ ॥49॥**

తదనంతరం తేజోరూపం, నిరాకారం, నిరంజనం, నిరుపాధీ, సంకల్పరహితం, మహాద్భుతం అయిన నిర్గుణ స్వరూపాన్ని దర్శించాడు.

**ఏవం బహూని రూపాణి తస్య తత్ర దదర్శ సః ।**
**సువిస్మితో బభూవాశు పరమానంద సంయుతః ॥50॥**

ఈవిధంగా హిమవంతుడు భిక్షుకునియందనేక రూపాలను దర్శించి, సువిస్మితుడై పరమానందాన్ని పొందాడు.

**అథాసౌ భిక్షువర్యో హి తస్మాత్తస్యాశ్చ సూతికృత్ ।**
**భిక్షాం యయాచే దుర్గాం తాం నాన్యజ్జగ్రాహ కించన ॥51॥**

అంతట జగత్కారణుడగు ఆదిభిక్షువు హిమవంతునినుండి దుర్గను భిక్షగా కోరాడు. ఇతరమైన భిక్షను దేనినీ స్వీకరించలేదు.

**న స్వీచకార శైలేంద్రో మోహితశ్శివమాయయా ।**
**భిక్షుః కించిన్న జగ్రాహ తత్రైవాంతర్దధే తతః ॥52॥**

శివమాయా మోహితుడైన పర్వతరాజు అంగీకరించలేదు. ఆ భిక్షువు ఇతరములను వేటిని స్వీకరింపకుండా అక్కడే అంతర్ధానమయ్యాడు.

**తదా బభూవ సుజ్ఞానం మేనా శైలేశయోరితి ।**
**ఆవాం శివో వంచయిత్వా స్వస్థానం గతవాన్ప్రభుః ॥53॥**

అప్పుడు "శివప్రభువు మనలను మోసగించి తన స్థానానికి వెళ్ళాడు". అనేజ్ఞానం మేనా హిమవంతులకు కలిగింది.

**తయోర్విచింత్య తత్రైవం శివే భక్తిరభూత్పరా ।**
**మహామోక్షకరీ దివ్యా సర్వానందప్రదాయినీ ॥54॥**

ఈవిధంగా ఆలోచించిన వారిరువురికీ మహామోక్షప్రదమూ, దివ్యమూ, సర్వానంద ప్రదాయిని అగు శివభక్తి ఉదయించింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే పార్వతీ ప్రత్యాగమన మహోత్సవవర్ణనం నామ త్రింశోఽధ్యాయః ॥30॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో పార్వతి తపస్సునుండి తిరిగివచ్చుట అనే ముప్పైయవ అధ్యాయం సమాప్తం.

## ఏకత్రింశోఽధ్యాయః - ముప్పై ఒకటవ అధ్యాయం

## శివమాయావర్ణనమ్ - శివమాయావర్ణనం

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**తయోర్భక్తిం శివే జ్ఞాత్వా పరామవ్యభిచారిణీమ్ ।**
**సర్వే శక్రాదయో దేవాశ్చిచింతురితి నారద ॥1॥**

శివునియందు వారిద్దరికి అనన్యమైన పరాభక్తి కలదని ఇంద్రాది దేవతలందరికి తెలిసింది. ఓ నారదా! అప్పుడు వారిట్లు తలపోశారు.

**దేవా ఊచుః -** దేవతలు పలికారు.

**ఏకాంతభక్త్యా శైలశ్చేత్కన్యాం తస్మై ప్రదాస్యతి ।**
**ధ్రువం నిర్వాణతా సద్యస్స ప్రాప్స్యతి చ భారతే ॥2॥**

హిమవంతుడు అనన్య భక్తితో శివునికి కన్యాదానం చేస్తే భారతఖండంలో అతడు వెనువెంటనే మోక్షాన్ని పొందుతాడు.

**అనంత రత్నాధారశ్చేత్పృథ్వీం త్యక్త్వా ప్రయాస్యతి ।**
**రత్నగర్భాభిధా భూమిర్మిథ్యైవ భవితా ధ్రువమ్ ॥3॥**

అనంత రత్నాల కాధారమైన అతడు భూలోకాన్ని వీడి, పయనమైతే భూమికిగల **"రత్నగర్భ"** అనే బిరుదు మిథ్యకావటం నిశ్చయం.

**స్థావరత్వం పరిత్యజ్య దివ్యరూపం విధాయ సః ।**
**కన్యాం శూలభృతే దత్త్వా శివలోకం గమిష్యతి ॥4॥**

అతడు తన కన్యను శూలధారియైన శివునకిచ్చి పర్వతరూపాన్ని విడిచిపెట్టి, దివ్యరూపాన్ని ధరించి, శివలోకాన్ని పొందగలడు.

**మహాదేవస్య సారూప్యం లప్స్యతే నాత్రసంశయః ।**
**తత్ర భుక్త్వా వరాన్భోగాంస్తతో మోక్షమవాప్స్యతి ॥5॥**

అతడు మహాదేవునితో సారూప్యాన్ని పొంది, అచ్చట శ్రేష్ఠమైన భోగాలనుభవించి, తరువాత మోక్షాన్ని పొందుతాడు. ఇందులో సందేహం లేదు.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాలోచ్య సురాస్సర్వే కృత్వా చామంత్రణం మిథః ।**
**ప్రస్థాపయితు మైచ్ఛంస్తే గురుం తత్ర సువిస్మితాః ॥6॥**

దేవతలందరూ ఇలా తలపోసి, ఒకరితోనొకరు సంప్రదించుకొని చకితులై, హిమవంతుని వద్దకు బృహస్పతిని పంపాలని తలంచారు.

**తతః శక్రాదయో దేవాస్సర్వే గురునికేతనమ్ ।**
**జగ్ముః ప్రీత్యా సవినయా నారద స్వార్థసాధకాః ॥7॥**

ఓ నారదా! అప్పుడు ఇంద్రాది దేవతలందరు తమ ప్రయోజనాన్ని సాధింపబూని, వినయంతో ప్రీతితో బృహస్పతి గృహానికి వెళ్ళారు.

**గత్వా తత్ర గురుం నత్వా సర్వే దేవాస్సవాసవాః ।**
**చక్రుర్నివేదనం తస్మై గురవే వృత్తమాదరాత్ ॥8॥**

ఇంద్రాది దేవతలందరు అచ్చటకువెళ్ళి, బృహస్పతికి నమస్కరించి, జరుగుతున్న వృత్తాంతాన్ని సాదరంగా ఆయనకు నివేదించారు.

**దేవా ఊచుః** – దేవతలు పలికారు.

**గురో హిమాలయ గృహం గచ్ఛాస్మత్కార్యసిద్ధయే ।**
**తత్ర గత్వా ప్రయత్నేన కురు నిందాం చ శూలినః ॥9॥**

గురుదేవా! మా కార్యసిద్ధికి మీరు హిమవంతుని వద్దకు వెళ్ళండి. అచ్చటకు వెళ్ళి, ప్రయత్న పూర్వకంగా శూలధారియైన శివుని నిందించండి.

**పినాకినా వినా దుర్గా వరం నాన్యం వరిష్యతి ।**
**అనిచ్ఛయా సుతాం దత్త్వా ఫలం తూర్ణం లభిష్యతి ॥10॥**

పినాకధారియైన శివుని తక్క దుర్గ మరియొకరిని వివాహమాడబోదు. ఆయన ప్రీతి లేకుండగా తన కుమార్తెను శివునకు దానం చేస్తే వెంటనే ఫలం లభిస్తుంది.

**కాలేనైవాధునా శైల ఇదానీం భువి తిష్ఠతు ।**
**అనేక రత్నాధారం తం స్థాపయ త్వం క్షితౌ గురో! ॥11॥**

కాని ప్రస్తుతం హిమవంతుడు భూమియందు మాత్రమే ఉండగలడు. కాబట్టి ఓ గురుదేవా! నీవావిధంగా చేసి, అనేక రత్నాధారమైన హిమవంతుని భూమండలంలో స్థిరంగా ఉండేటట్లు చేయి.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇతి దేవ వచః శ్రుత్వా ప్రదదౌ కర్ణయోః కరమ్ ।**
**న స్వీచకార స గురుస్స్మరన్నామ శివేతి చ ॥12॥**

దేవతల మాటను విని బృహస్పతి శివుని నామాన్ని స్మరిస్తూ, చెవులు మూసుకున్నాడు. వారి కోరికను బృహస్పతి అంగీకరించలేదు.

**అథ స్మృత్వా మహాదేవం బృహస్పతి రుదారధీః ।**
**ఉవాచ దేవవర్యాంశ్చ ధిక్కృత్వా చ పునః పునః ॥13॥**

అంతట విశాల హృదయుడైన బృహస్పతి మహాదేవుని స్మరించి, దేవతలననేక పర్యాయాలు నిందించి, వారితో ఇలా పలికాడు.

**బృహస్పతి రువాచ –** బృహస్పతి పలికాడు.

**సర్వే దేవా స్స్వార్థపరాః పరార్థ ధ్వంసకారకాః ।**
**కృత్వా శంకర నిందాం హి యాస్యామి నరకం ధ్రువమ్ ॥14॥**

దేవతలందరు స్వార్థపరులై, పరుల కార్యాన్ని ధ్వంసం చేయడంలో నిమగ్నులై ఉన్నారు. శంకరుని నేను నిందిస్తే నాకు నరకప్రాప్తి తప్పనిసరియౌతుంది.

**కశ్చిన్మధ్యే చ యుష్మాకం గచ్ఛేచ్ఛైలాంతికం సురాః ।**
**సంపాదయేత్స్వాభిమతం శైలేంద్రం ప్రతిబోధ్య చ ॥15॥**

ఓ దేవతలారా! మీలో ఒకరు హిమవంతుని వద్దకు వెళ్ళి, ఆయనకు బోధించి మీ కోర్కెను నెరవేర్చుకోండి.

**అనిచ్ఛయా సుతాం దత్వాஉసుఖం తిష్ఠతు భారతే ।**
**తస్మై భక్త్యా సుతాం దత్వా మోక్షం ప్రాప్స్యతి నిశ్చితమ్ ॥16॥**

ఆయన శివునకు భక్తితో కన్యాదానంచేసి, మోక్షాన్ని పొందడం నిశ్చితం. కాని ప్రీతిలేకుండగా కుమార్తెనిస్తే భారత ఖండంలో సుఖంగా ఉండలేడు.

**పశ్చాత్సప్తర్షయస్సర్వే బోధయిష్యంతి పర్వతమ్ ।**
**పినాకినా వినా దుర్గా వరం నాన్యం వరిష్యతి ॥17॥**

మీలో ఒకరు వెళ్ళివచ్చినతర్వాత సప్తర్షులందరు వెళ్ళి, ఆ పర్వతునకు ఉపదేశించండి. దుర్గాదేవి పినాకపాణిని తక్క వేరొకరిని వివాహమాడదు.

**అథవా గచ్ఛత సురా బ్రహ్మలోకం సవాసవాః ।**
**వృత్తం కథయత స్వం తత్సవః కార్యం కరిష్యతి ॥18॥**

లేదా మీరు ఇంద్రునితో కలిసి బ్రహ్మలోకానికి వెళ్లండి. మీ వృత్తాంతాన్ని ఆయనకు చెప్పండి. ఆయన మీకార్యాన్ని చక్కబెట్టగలడు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**తచ్ఛ్రుత్వా తే సమాలోచ్యాజగ్ముర్మమ సభాం సురాః ।**
**సర్వే నివేదయాం చక్రుర్నత్వా తద్గతమాదరాత్ ॥19॥**

ఆ మాటలను విని, దేవతలందరు సమాలోచన చేసుకొని, నా (బ్రహ్మ) సభకు విచ్చేశారు. అక్కడున్న నాకు వారందరు సాదరంగా నమస్కరించి, విన్నవించారు.

**దేవానాం తద్వచః శ్రుత్వా శివనిందాకరం తదా ।**
**వేదవక్తా విలప్యాహం తానవోచం సురాన్మునే ॥20॥**

శివనిందను ప్రస్తావించే దేవతల మాటలను విని, వేదాలను ప్రవర్తిల్లజేసిన నేను విలపించాను. అప్పుడు నేను దేవతలతో ఇలా పలికాను.

**నాహం కర్తుం క్షమో వత్సాః శివనిందాం సుదుస్సహామ్ ।**
**సంపద్వినాశరూపాం చ విపదాం బీజరూపిణీమ్ ॥21॥**

వత్సలారా! శివనింద సహింప శక్యంకానిది. సంపదలను నశింపజేస్తుంది. ఆపదలకు బీజభూతమైనది. కావున నేను శివనిందను చేయజాలను.

**సురా గచ్ఛత కైలాసం సంతోషయత శంకరమ్ ।**
**ప్రస్థాపయత తం శీఘ్రం హిమాలయ గృహం ప్రతి ॥22॥**

దేవతలారా! మీరు కైలాసానికిపోయి, శంకరుని ప్రసన్నుని చేసుకుని, వెనువెంటనే ఆయనను హిమవంతుని గృహానికి ప్రయాణం కట్టించండి.

**సగచ్ఛే దుపశైలేశ మాత్మనిందాం కరోతు వై ।**
**పరనిందా వినాశాయ స్వనిందా యశసే మతా ॥23॥**

ఆయన పర్వతరాజు వద్దకు వెళ్ళి, ఆత్మనింద చేయుగాక! పరనింద వినాశనాన్ని, ఆత్మనింద కీర్తిని, కలిగిస్తుందని పెద్దలు చెబుతారు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**శ్రుత్వేతి మద్వచో దేవా మాం ప్రణమ్య ముదా చ తే ।**
**కైలాసం ప్రయయుః శీఘ్రం శైలానామధిపం గిరిమ్ ॥24॥**

దేవతలు నాయీ మాటలు విని, ఆనందంతో నాకు ప్రణమిల్లి, వెనువెంటనే కైలాసానికి ప్రయాణ మయ్యారు.

**తత్ర గత్వా శివం దృష్ట్వా ప్రణమ్య నతమస్తకాః ।**
**సుకృతాంజలయస్సర్వే తుష్టువుస్తం సురా హరమ్ ॥25॥**

దేవతలచ్చటకు వెళ్ళి శివుని దర్శించారు. వారందరు తలలు వంచి, చేతులు జోడించి, నమస్కరించి, శివుని స్తుతించారు.

**దేవా ఊచుః** - దేవతలు పలికారు.

**దేవదేవ మహాదేవ కరుణాకర శంకర ।**
**వయం త్వాం శరణాపన్నాః కృపాం కురు నమోఽస్తు తే ॥26॥**

దేవదేవా! మహాదేవా! కరుణాకరా! శంకరా! మేము నిన్ను శరణుజొచ్చాము. దయను చూపు. నీకు నమస్కారం.

**త్వం భక్తవత్సలః స్వామిన్భక్త కార్యకరస్సదా ।**
**దీనోద్ధరః కృపాసింధుర్భక్తాపద్వినిమోచకః ॥27॥**

నువ్వు స్వామీ! భక్తవత్సలుడవు. ఎల్లవేళలా భక్తుల కార్యాలను సిద్ధింపజేస్తావు. దీనులనుద్ధరించే దయానిధివి. భక్తుల ఆపదలను తొలగిస్తావు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇతి స్తుత్వా మహేశానం సర్వే దేవాస్సవాసవాః ।**
**సర్వం నివేదయాంచక్రుస్తద్వృత్తం తత ఆదరాత్ ॥28॥**

ఇంద్రాది దేవతలందరు మహేశ్వరునీవిధంగా స్తుతించి, తదనంతరం జరిగిన వృత్తాంతమంతా సాదరంగా నివేదించారు.

**తచ్ఛ్రుత్వా దేవవచనం స్వీచకార మహేశ్వరః ।**
**దేవాన్ సుయాపయామాస తానాశ్వాస్య విహస్య సః ॥29॥**

దేవతల మాటలు విని, మహేశ్వరుడు తన అంగీకారాన్ని తెలియజేశాడు. ఆయన చిరునవ్వునవ్వి, వారినోదార్చి, పంపివేశాడు.

**దేవా ముముదిరే సర్వే శీఘ్రం గత్వా స్వమందిరమ్ ।**
**సిద్ధం మత్వా స్వకార్యం హి ప్రశంసంతస్సదాశివమ్ ॥30॥**

దేవతలందరు ఆనందించి, తమ కార్యం సిద్ధించిందని తెలుసుకొని, సదాశివుని కొనియాడుతూ, తమ గృహాలకు వెళ్ళారు.

**తతః సభగవాన్ శంభు ర్మహేశో భక్తవత్సలః ।**
**ప్రయయౌ శైలభూపం చ మాయేశో నిర్వికారవాన్ ॥31॥**

అంతట భక్తవత్సలుడు, మహేశ్వరుడు, మాయావి, నిర్వికారుడు అయిన శంభుభగవానుడు హిమవంతుని వద్దకు బయలుదేరాడు.

**యదా శైలస్సభామధ్యే సమువాస ముదాన్వితః ।**
**బంధువర్గైః పరివృతః పార్వతీ సహితస్స్వయమ్ ॥32॥**

హిమవంతుడు సభామధ్యంలో బంధువర్గంతో స్వయంగా పార్వతితో కూడి, ఆనందంగా కొలువుతీరి ఉన్నాడు.

**ఏతస్మిన్నంతరే తత్ర హ్యాజగామ సదాశివః ।**
**దండీ చక్రీ దివ్యవాసా బిభ్రత్తిలకముజ్జ్వలమ్ ॥33॥**

ఇంతలో అచ్చటకు సదాశివుడేతెంచాడు. ఆయన దండాన్ని, ఛత్రాన్ని పట్టుకుని, దివ్యమైన వస్త్రాలను, ప్రకాశించే తిలకాన్ని ధరించి ఉన్నాడు.

**కరే స్ఫటికమాలాం చ శాలగ్రామం గళే దధత్ ।**
**జపన్నామ హరేర్భక్త్యా సాధువేషధరో ద్విజః ॥34॥**

చేతిలో స్ఫటికమాలను, మెడలో సాలగ్రామాన్ని ధరించి, భక్తితో హరినామాన్ని జపిస్తున్నాడు. ఆ బ్రాహ్మణుడు సాధువేషాన్ని ధరించి ఉన్నాడు.

**తం చ దృష్ట్వా సముత్తస్థౌ సగణోఽపి హిమాలయః ।**
**ననామ దండవద్భూమౌ భక్త్యాతిథి మపూర్వకమ్ ॥35॥**

ఆయననుచూచి, హిమవంతుడు పరివారంతో సహా లేచి నిలబడ్డాడు. అపూర్వమైన ఆ అతిథికి భక్తితో సాష్టాంగ నమస్కారాలు చేశాడు.

**ననామ పార్వతీ భక్త్యా ప్రాణేశం విప్రరూపిణమ్ ।**
**జ్ఞాత్వా తం మనసా దేవీ తుష్టావ పరయా ముదా ॥36॥**

పార్వతి బ్రాహ్మణరూపంలో నున్న ప్రాణప్రియునికి భక్తితో నమస్కరించింది. ఆ దేవి ఆయనను గుర్తెరిగి, పరమానందంతో మనసులో స్తుతించింది.

**ఆశిషం యుయుజే విప్రస్సర్వేషాం ప్రీతితః శివః ।**
**శివాయా అధికం తాత మనోఽభిలషితం హృదా ॥37॥**

బ్రాహ్మణ వేషధారియైన శివుడు వారినందరిని ప్రీతిపూర్వకంగా ఆశీర్వదించాడు. ఆయన మనస్సులో పార్వతికి తన మనసుకు నచ్చిన ఆశీస్సుల నధికంగా ఇచ్చాడు.

**మధుపర్కాదికం సర్వం జగ్రాహ బ్రాహ్మణో ముదా ।**
**దత్తం శైలాధిరాజేన హిమాంగేన మహాదరాత్ ॥38॥**

పర్వతరాజైన హిమవంతునిచే మహాదరంతో ఈయబడిన మధుపర్కాదికమైన అతిథిపూజను బ్రాహ్మణుడు పూర్తిగా స్వీకరించాడు.

**పప్రచ్ఛ కుశలం చాస్య హిమాద్రిః పర్వతోత్తమః ।**
**తం ద్విజేంద్రం మహాప్రీత్యా సంపూజ్య విధివన్మునే ॥39॥**

మహర్షీ! పర్వతశ్రేష్ఠుడైన హిమవంతుడు! ఆ బ్రాహ్మణోత్తముని మహాప్రీతితో యథావిధిగా పూజించి, కుశలమడిగాడు.

**పునః పప్రచ్ఛ శైలేశస్తం తతః కో భవానితి ।**
**ఉవాచ శీఘ్రం విప్రేంద్రో గిరీంద్రం సాదరం వచః ॥40॥**

తదనంతరం పర్వతరాజు ఆయనను 'మీరెవరు?' అని ప్రశ్నించాడు. ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుడు వెంటనే సాదరంగా పర్వతరాజుతో ఇట్లన్నాడు.

**విప్రేంద్ర ఉవాచ –** బ్రాహ్మణ శ్రేష్ఠుడు పలికాడు.

**బ్రాహ్మణోఽహం గిరిశ్రేష్ఠ వైష్ణవో బుధసత్తమః ।**
**ఘటికీం వృత్తిమాశ్రిత్య భ్రమామి ధరణీతలే ॥41॥**

ఓ పర్వతరాజా! నేను బ్రాహ్మణుడను, వైష్ణవుడను, మహాపండితుడను. జ్యోతిషవృత్తిని చేబట్టి భూమండలంలో తిరుగాడుతున్నాను.

**మనోయాయీ సర్వగామీ సర్వజ్ఞోఽహం గురోర్బలాత్ ।**
**పరోపకారీ శుద్ధాత్మా దయాసింధుర్వికారహా ॥42॥**

నేను నాకు నచ్చిన విధంగా తిరుగుతాను. అన్నిచోట్లకు వెళుతుంటాను. గురుబలంచే నేను సర్వజ్ఞుణ్ణి. నేను పరోపకారిని. శుద్ధాత్ముడను. దయానిధిని. నిర్వికారుడను.

**మయా జ్ఞాతం హరాయ త్వం స్వసుతాం దాతుమిచ్ఛసి ।**
**ఇమాం పద్మసమాం దివ్యాం వరరూపాం సులక్షణామ్ ॥43॥**

పద్మసమానం, దివ్యం, శ్రేష్ఠమైన రూపంతో సులక్షణయైన నీ యీ కుమార్తెను నువ్వు శివునకు ఈయగోరుచున్నావని నాకు తెలిసింది.

**నిరాశ్రయాయాసంగాయ కురూపాయాగుణాయ చ ।**
**శ్మశానవాసినే వ్యాలగ్రాహి రూపాయ యోగినే ॥44॥**

శివుడు నిరాశ్రయుడు, సంగహీనుడు, కురూపి, గుణహీనుడు, శ్మశానవాసి, ఆయన శరీరాన్ని పాములు చుట్టుకుని ఉంటాయి. ఆయన యోగి.

**దిగ్వాససే కుగాత్రాయ వ్యాలభూషణధారిణే ।**
**అజ్ఞాత కులనామ్నే చ కుశీలాయావిహారిణే ॥45॥**

ఆయన దిగంబరుడు. వికృతరూపం కలవాడు. నాగాభరణుడు. కులనామాలనెరుగనివాడు. దుశ్శీలుడు. విహారమంటే తెలియనివాడు.

**విభూతి దిగ్ధ దేహాయ సంక్రుద్ధాయావివేకినే ।**
**అజ్ఞాత వయసేஉతీవ కుజటాధారిణే సదా ॥46॥**

విభూతి లేపనంతో కూడిన దేహంకలవాడు, క్రోధస్వభావుడు, అవివేకి, ఆయన వయస్సు తెలియదు. సర్వదా చిక్కుబడిన జటలను ధరించేవాడు.

**సర్వాశ్రయాయ భ్రమిణే నాగహారాయ భిక్షవే ।**
**కుమార్గనిరతాయాథ వేదార్థత్యాగినే హఠాత్ ॥47॥**

సర్వులనాశ్రయించి తిరిగేవాడు, నాగహారాలు కలవాడు, భిక్షుకుడు, కుమార్గ నిరతుడు, దురహంకారంతో వేదమార్గాన్ని వీడినవాడు.

**ఇయం తే బుద్ధిరచల న హి మంగళదా ఖలు ।**
**విబోధ జ్ఞానినాం శ్రేష్ఠ నారాయణ కులోద్భవ ॥48॥**

ఇట్టి శివునకు పార్వతినీయవలెననే నీ బుద్ధి మంగళదాయకం కాదు. హే పర్వతరాజా! నువ్వు జ్ఞానులలో శ్రేష్ఠుడవు. నారాయణ కులోద్భవుడవు. నిజాన్ని తెలుసుకో.

**న తే పాత్రానురూపశ్చ పార్వతీ దానకర్మణి ।**
**మహాజనః స్మేరముఖః శ్రుతమాత్రాద్భవిష్యతి ॥49॥**

నీవు పార్వతిని దానంచేయడానికి ఆయన యోగ్యుడు కాదు. ఈవిషయం విన్నంతనే మహాజనులు నవ్వుతారు.

**పశ్య శైలాధిప త్వం చ న తస్యై కోஉస్తి బాంధవః ।**
**మహారత్నాకరస్త్వం చ తస్య కించిద్ధనం న హి ॥50॥**

ఓ పర్వతరాజా! గమనించు. ఆయనకు బంధువొక్కడైనను లేడు. నీవు మహారత్నాకరుడవు. ఆయనవద్ద ధనం కొంచమైనా లేదు.

**బాంధవాన్మేనకాం కుధ్రపతే శీఘ్రం సుతాం స్తథా ।**
**సర్వాన్పృచ్ఛ ప్రయత్నేన పండితాన్పార్వతీ వినా ॥51॥**

ఓ పర్వతరాజా! బంధువులను, మేనకను, కుమారులను, ఇతరులనందరిని శ్రద్ధతో అడిగిచూడు. పండితులనుకూడా ప్రశ్నించు. కాని పార్వతిని ప్రశ్నింపవద్దు.

**రోగిణో నౌషధం శశ్వద్రోచతే గిరిసత్తమ ।**
**కుపథ్యం రోచతేஉభీక్ష్ణం మహాదోషకరం సదా ॥52॥**

ఓ పర్వతరాజా! ఏనాడైనను రోగికి మందు రుచింపదు. రోగికి అన్నివేళలా మహాదోషకరమైన చెడుపథ్యం బాగా రుచిస్తుంది.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా బ్రాహ్మణః శీఘ్రం స వై భుక్త్వా ముదాన్వితః ।**
**జగామ స్వాలయం శాంతో నానాలీలాకరశ్శివః ॥53॥**

ఆ బ్రాహ్మణుడిట్లు పలికి, ఆనందంగా భుజించి, శీఘ్రమే నిర్గమించాడు. నానాలీలాకరుడైన శివుడు శాంతంగా తన నివాసానికి చేరుకున్నాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే శివమాయా వర్ణనం నామైక త్రింశోఽధ్యాయః ॥31॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో శివమాయా వర్ణనం అనే ముప్పై ఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్వాత్రింశోఽధ్యాయః - ముప్పై రెండవ అధ్యాయం
## సప్తర్షీణామ్ఆగనమ్ - సప్తర్షులరాక

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**బ్రాహ్మణస్య వచః శ్రుత్వా మేనోవాచ హిమాలయమ్ ।**
**శోకేనాసాధునయనా హృదయేన విదూయతా ॥1॥**

బ్రాహ్మణుని మాటలు వినిన మేనకాదేవి శోకంచే ఎర్రబడిన కన్నులు గలదై, దుఃఖిస్తున్న హృదయంతో హిమవంతునుద్దేశించి ఇలా పలికింది.

**మేనో వాచ** - మేనాదేవి పలికింది.

**శృణు శైలేంద్ర మద్వాక్యం పరిణామే సుఖావహమ్ ।**
**పృచ్ఛ శైవ వరాన్సర్వాన్కిముక్తం బ్రాహ్మణేన హ ॥2॥**

ఓ పర్వతరాజా! పరిణామంలో సుఖాన్ని కలిగించే నామాట విను. శివభక్తులనందరిని అడిగి తెలుసుకో. ఈబ్రాహ్మణుడు చెప్పినదేమి?

**నిందానేన కృతా శంభోర్వైష్ణవేన ద్విజన్మనా ।**
**శ్రుత్వా తాం మే మనోఽతీవ నిర్విణ్ణం హి నగేశ్వర ॥3॥**

పర్వతరాజా! ఈ వైష్ణవ బ్రాహ్మణుడు శివుని నిందించాడు. ఆనిందను విన్న నేను మిక్కిలి నిరాశపడ్డాను.

**తస్మై రుద్రాయ శైలేశ న దాస్యామి సుతామహమ్ ।**
**కురూప శీలనం మే హి సులక్షణయుతాం నిజామ్ ॥4॥**

శైలేంద్రా! మంచి లక్షణాలతో కూడియున్న నా కుమార్తెను కురూపి, దుశ్శీలుడునైన ఆ రుద్రునకీయను.

**న మన్యసే వచో చేన్మే మరిష్యామి న సంశయః ।**
**త్యక్ష్యామి చ గృహం సద్యో భక్షయిష్యామి వా విషమ్ ॥5॥**

నీవు నా మాటను మన్నించకపోతే నేను నిస్సందేహంగా మరణిస్తాను. వెంటనే ఇంటిని విడిచి వెళతాను. లేదా విషం మ్రింగుతాను.

**గళే బద్ధ్వాంబికాం రజ్జ్వా యాస్యామి గహనం వనమ్ ।**
**మహాంబుధౌ మజ్జయిష్యే తస్మై దాస్యామి నో సుతామ్ ॥6॥**

త్రాడుతో అమ్మాయిని మెడకు కట్టుకుని, దట్టమైన అడవికి పోతాను. లేదా మహాసముద్రంలో మునుగుతాను. అంతేగాని అమ్మాయిని రుద్రునకీయను.

**ఇత్యుక్త్వాశు తథా గత్వా మేనా కోపాలయం శుచా ।**
**త్యక్త్వాహారం రుదంతీ సా చకార శయనం భువి ॥7॥**

ఈవిధంగా పలికి, మేనాదేవి వెంటనే దుఃఖంతో కోపగృహానికి వెళ్ళి, ఆభరణాలను వీడి, దుఃఖిస్తూ, రోదిస్తూ, నేలపై పడుకుంది.

**ఏతస్మిన్నంతరే తాత శంభునా సప్త ఏవ తే ।**
**సంస్మృతా ఋషయస్సద్యో విరహవ్యాకులాత్మనా ॥8॥**

ఓ కుమారా! ఇంతలో విరహంతో దుఃఖితమైన మనస్సుగల శంభుడు వెంటనే సప్తర్షులను స్మరించాడు.

**ఋషయశ్చైవ తే సర్వే శంభునా సంస్మృతా యదా ।**
**తదా జగ్ముః స్వయం సద్యః కల్పవృక్షా ఇవాపరమ్ ॥9॥**

అపర కల్పవృక్షాలవంటి సప్తర్షులు శివుడు స్మరించిన మరుక్షణంలో అచ్చటకు స్వయంగా విచ్చేశారు.

**అరుంధతీ తథాయాతా సాక్షాత్సిద్ధిరివాపరా ।**
**తాన్ దృష్ట్వా సూర్య సంకాశాన్విజహౌ స్వజపం హరః ॥10॥**

సాక్షాత్సిద్ధి స్వరూపిణియైన అరుంధతికూడ వచ్చింది. సూర్య సంకాశులైన వారిని చూసి, శివుడు తన జపాన్ని ఆపివేశాడు.

**స్థిత్వాగ్రే ఋషయః శ్రేష్ఠం నత్వా స్తుత్వా శివం మునే ।**
**మేనిరే చ తదాత్మానం కృతార్థం తే తపస్వినః ॥11॥**

ఓ మహర్షీ! తపశ్శాలురైన సప్తర్షులు శ్రేష్ఠుడైన శివుని ఎదుట నిలబడి, ఆయనకు నమస్కరించి, స్తుతించి, కృతార్థుల మయ్యామని భావించారు.

**తతో విస్మయమాపన్నా నమస్కృత్య స్థితాః పునః ।**
**ప్రోచుః ప్రాంజలయస్తే వై శివం లోకనమస్కృతమ్ ॥12॥**

అనంతరం ఆశ్చర్యచకితులైన సప్తర్షులు లోకవందితుడైన శివునకు మరల నమస్కరించి, చేతులు జోడించి, ఇలా పలికారు.

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**సర్వోత్కృష్టం మహారాజ సార్వభౌమ దివౌకసామ్ ।**
**స్వభాగ్యం వర్ణ్యతేఽస్మాభిః కిం పునస్సకలోత్తమమ్ ॥13॥**

ఓ మహారాజా! దేవతా సార్వభౌమా! సర్వోత్కృష్టమూ సర్వోత్తమమైన మా భాగ్యాన్ని ఏమని వర్ణించగలము?

**తపస్తప్తం త్రిధాపూర్వం వేదాధ్యయనముత్తమమ్ ।**
**అగ్నయశ్చ హుతాః పూర్వం తీర్థాని వివిధాని చ ॥14॥**

పూర్వం త్రికరణశుద్ధిగా తపస్సు చేశాము. ఉత్తమమైన వేదాధ్యయనాన్ని చేశాము. అగ్నిహోత్రాన్ని హవనం చేశాము. వివిధ తీర్థాలను సేవించాము.

**వాఙ్మనః కాయజం కించిత్పుణ్యం స్మరణసంభవమ్ ।**
**తత్సర్వం సంగతం చాద్య స్మరణానుగ్రహాత్తవ ॥15॥**

వాఙ్మనఃకాయాలచే చేసిన కొంచెము పుణ్యమూ, నిన్ను స్మరించడంచేత కలిగిన పుణ్యమూ, మొత్తమంతా ఏకమై నువ్వు మమ్ములను స్మరించడమనే భాగ్యం మాకీనాడు కలిగింది.

**యో వై భజతి నిత్యం త్వాం కృతకృత్యో భవేన్నరః ।**
**కిం పుణ్యం వర్ణ్యతే తేషాం యేషాం చ స్మరణం తవ ॥16॥**

నిన్ను ప్రతిదినం స్మరించే మానవుడు కృతార్థుడౌతాడు. నీచే స్మరింపబడే వారిపుణ్యం ఏమని వర్ణింపవచ్చు?

**సర్వోత్కృష్టా వయం జాతాః స్మరణాత్తే సదాశివ ।**
**మనోరథపథం నైవ గచ్ఛసి త్వం కథంచన ॥17॥**

ఓ సదాశివా! నీవు స్మరించడంచేత మేము సర్వోత్కృష్టులమయ్యాము. నిన్ను మనస్సులో స్మరించుటైనా మానవులకు దుర్లభమే.

**వామనస్య ఫలం యద్వజ్జన్మాంధస్య దృశౌ యథా ।**
**వాచాలత్వం చ మూకస్య రంకస్య నిధిదర్శనమ్ ॥18॥**

**పంగోర్గిరివరాక్రాంతిర్వన్ధ్యాయః ప్రసవస్తథా ।**
**దర్శనం భవతస్తద్వజ్జాతం నో దుర్లభం ప్రభో ॥19॥**

ఓ ప్రభూ! పొట్టివానికి ఫలమందినట్లును, జన్మాంధునికి చూపువచ్చినట్లును, మూగవాడు మాట్లాడ గలిగినట్లును, దరిద్రునకు నిధి లభించినట్లును, కుంటివాడు శ్రేష్ఠమైన పర్వతాన్ని అధిరోహించినట్లును, గొడ్రాలికి సంతానం కలిగినట్లును, మాకు దుర్లభమైన నీ దర్శనం మాకు కలిగినది.

**అద్యప్రభృతి లోకేషు మాన్యాః పూజ్యా మునీశ్వరాః ।**
**జాతాస్తే దర్శనాదేవ స్వముచ్చైః పదమాశ్రితాః ॥20॥**

ఈనాటినుండి లోకంలో మేము పూజ్యులమయ్యాము. మునీశ్వరులమయ్యాము మాన్యులమయ్యాము. నీ దర్శనం చేతనే మాకు సమున్నతమైన స్థానం లభించింది.

**అత్ర కిం బహునోక్తేన సర్వథా మాన్యతాం గతాః ।**
**దర్శనాత్తవ దేవేశ సర్వదేవేశ్వరస్య హి ॥21॥**

పెక్కు మాటలేల! మాకు అన్నివిధాలా మాన్యత కలిగింది. ఓ దేవదేవా! దేవేశ్వరుడవైన నీ దర్శనంచే మాకు పూజ్యత కలిగింది.

**పూర్ణానాం కించ కర్తవ్యమస్తి చేత్పరమా కృపా ।**
**సదృశం సేవకానాం తు దేయం కార్యం త్వయా శుభమ్ ॥22॥**

పూర్ణులకు కర్తవ్యమేముంటుంది? మీకు దయకలిగితే సేవకులకీయదగిన శుభకార్యాన్ని మాకు అప్పగించండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవం వచనం శ్రుత్వా తేషాం శంభుర్మహేశ్వరః ।**
**లౌకికాచారమాశ్రిత్య రమ్యం వాక్యముపాదదే ॥23॥**

శంభుడు వారి ఆ మాటలను విని, లోకాచారాన్ని అనుసరిస్తూ, రమ్యవాక్కుల నిలా పలికాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**ఋషయశ్చ సదా పూజ్యా భవన్తశ్చ విశేషతః ।**
**యుష్మాకం కారణాద్విప్రాః స్మరణం చ మయా కృతమ్ ॥24॥**

విప్రులారా! ఋషులు సర్వదా పూజనీయులు. మీరు మరింత పూజనీయులు. నేనొక కారణంచే మిమ్ములను స్మరించాను.

**మమావస్థా భవద్భిశ్చ జ్ఞాయతే హ్యుపకారికా ।**
**సాధనీయా విశేషేణ లోకానాం సిద్ధిహేతవే ॥25॥**

నేను లోకాలకు సిద్ధిని కలిగించి, ఉపకారం చేయడానికి నడుంకట్టి యుంటానని మీరెరుగుదురు.

**దేవానాం దుఃఖముత్పన్నం తారకాత్సు దురాత్మనః ।**
**బ్రహ్మణా చ వరో దత్తః కిం కరోమి దురాసదః ॥26॥**

దుర్మార్గుడైన తారకుని వలన దేవతలకు దుఃఖం సంప్రాప్తమయ్యింది. బ్రహ్మ అతిక్లిష్టమైన వరాలనిచ్చాడు. నేనేమిచేయగలను?

**మూర్తయోఽష్టౌ చ యాః ప్రోక్తా మదీయాః పరమర్షయః ।**
**తాస్సర్వా ఉపకారాయ న తు స్వార్థాయ తత్ స్ఫుటమ్ ॥27॥**

ఓ మహర్షులారా! నా అష్టమూర్తులు లోకప్రసిద్ధాలు. అవి లోకాల ఉపకారం కొరకేగాని, నా స్వార్థం కొరకు గాదని స్పష్టమే.

**తథా చ కర్తుకామోహం వివాహం శివయా సహ ।**
**తయా వై సుతపస్తప్తం దుష్కరం పరమర్షిభిః ॥28॥**

ఆకారణంచేతనే నేను శివాదేవిని వివాహమాడగోరాను. ఆమె, మహర్షులుకూడా చేయరాని గొప్ప తపస్సు చేసింది.

**తస్యై పరం ఫలం దేయమభీష్టం తద్ధితావహమ్ ।**
**ఏతాదృశః పణో మే హి భక్తానందప్రదః స్ఫుటమ్ ॥29॥**

ఆమెకభీష్టమూ, హితకరమూ అయిన పరమఫలాన్ని ఈయవలసియున్నది. భక్తులకు ఆనందం కలిగించడం నా ప్రతిజ్ఞయని స్పష్టమేగదా!

**పార్వతీ వచనాద్భిక్షురూపో యాతో గిరేర్గృహమ్ ।**
**అహం పాలితవాన్కాలీం యతో లీలా విశారదః ॥30॥**

పార్వతి వచనానుసారం భిక్షురూపంలో నేను హిమవంతుని గృహానికి వెళ్ళాను. లీలా విశారదుడనైన నేను కాళిమాటను నిలబెట్టాను.

**మాం జ్ఞాత్వా తౌ పరం బ్రహ్మ దంపతీ పరభక్తితః ।**
**దాతు కామావభూతాం చ స్వసుతాం వేదరీతితః ॥31॥**

ఆ దంపతులు నన్ను పరబ్రహ్మయని గుర్తించి, పరమభక్తితో తన కుమార్తెను వేదోక్తవిధిగా నాకు ఈయగోరారు.

**దేవప్రేరణయాహం వై కృతవానస్మి నిందనమ్ ।**
**తదా స్వస్య చ తద్భక్తిం విహంతుం వైష్ణవాత్మనా ॥32॥**

దేవతల ప్రేరణచే నేను శివనిందను చేశాను. వారిభక్తిని చెడగొట్టడానికి నేను వైష్ణవ రూపాన్ని ధరించి, ఆవిధంగా చేశాను.

**తచ్ఛ్రుత్వా తౌ సు నిర్విణ్ణౌ తద్ధీనౌ సంబభూవతుః ।**
**స్వకన్యాం నేచ్ఛతో దాతుం మహ్యం హి మునయోఽధునా ॥33॥**

వారానిందను విని, మిక్కిలి నిర్వేదాన్ని పొంది, భక్తిని కోల్పోయారు. ఇప్పుడు వారు నాకు తమకన్య నివ్వడానికి ఇష్టపడడంలేదు.

**తస్మాద్భవన్తో గచ్ఛంతు హిమాచలగృహం ధ్రువమ్ ।**
**తత్ర గత్వా గిరివరం తత్పత్నీం చ ప్రబోధయ ॥34॥**

కాబట్టి మీరు హిమవంతుని గృహానికి వెళ్ళి, ఆ పర్వతరాజునకు, ఆయన భార్యకు హితాన్ని ఉపదేశించండి.

**కథనీయం ప్రయత్నేన వచనం వేదసమ్మితమ్ ।**
**సర్వథా కరణీయం తద్యథా స్యాత్కార్యముత్తమమ్ ॥35॥**

వేదతుల్యమైన ఉపదేశాన్ని ప్రయత్నపూర్వకంగా మీరు వారికి చేయండి. నా ఉత్తమకార్యం తప్పక సఫలమయ్యేటట్లు చేయండి.

**ఉద్వాహం కర్తుమిచ్ఛామి తత్పుత్ర్యా సహ సత్తమాః ।**
**స్వీకృతస్తద్వివాహో మే వరో దత్తశ్చ తాదృశః ॥36॥**

ఓ మహర్షులారా! వారి పుత్రికను నేను వివాహమాడదలంచితిని. ఈ వివాహం నాకంగీకారమే. బ్రహ్మ ఇట్టి వరాన్ని యిచ్చి ఉన్నాడు.

**అత్ర కిం బహునోక్తేన బోధనీయో హిమాలయః ।**
**తథా మేనా చ బోద్ధవ్యా దేవానాం స్యాద్ధితం యథా ॥37॥**

ఈ విషయంలో పలుమాటలేల? మీరు మేనా హిమవంతులకు బోధించి, దేవతలకు హితాన్ని చేకూర్చండి

**భవద్భిః కల్పితో యో వై విధిస్స్యాదధికస్తతః ।**
**భవతాం చైవ కార్యంతు భవన్తః కార్యభాగినః ॥38॥**

మీచే కల్పింపబడిన (కన్యావరణ) విధికంటే అధికమైన వరణాన్ని చేసినట్లౌతుంది. ఇది మీకార్యమే కనుక దీనికి సిద్ధింపజేయడంలో మీపాత్రను నిర్వహించండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవం వచనం శ్రుత్వా మునయస్తేఽమలాశయాః ।**
**ఆనందం లేభిరే సర్వే ప్రభునానుగ్రహీకృతాః ॥39॥**

పవిత్ర హృదయులు, ప్రభుని అనుగ్రహం పొందినవారు నైన సప్తర్షులందరు ఆ మాటలను విని, ఆనందాన్ని పొందారు.

**వయం ధన్యా అభూవంశ్చ కృతకృత్యాశ్చ సర్వథా ।**
**వంద్యా యాతాశ్చ సర్వేషాం పూజనీయా విశేషతః ॥40॥**

మేము ధన్యులం. అన్ని విధముల కృతకృత్యులమయ్యాం. మేమందరికి వంద్యులమూ, విశేషించి పూజనీయులమూ, అయినాం.

**బ్రహ్మణా విష్ణునా యో వై వంద్యస్సర్వార్థసాధకః ।**
**సోఽస్మాన్ప్రేషయతే ప్రేష్యాన్కార్యే లోకసుఖావహే ॥41॥**

బ్రహ్మ విష్ణువులచే నమస్కరింపబడువాడు, సర్వకార్యాలను సిద్ధింపజేసేవాడునైన శివుడు లోకసుఖావహమైన కార్యానికి మేము పంపదగినవారమని తలంచి, మమ్ము పంపుతున్నాడు.

**అయం వై జగతాం స్వామీ పితా సా జననీ మతా ।**
**అయం యుక్తశ్చ సంబంధో వర్ధతాం చంద్రవత్సదా ॥42॥**

ఈ శివుడు లోకాలకు ప్రభువు. తండ్రి. ఆమె తల్లి. ఈ యోగ్యమైన సంబంధం శుక్లపక్ష చంద్రునివలె దినదినప్రవర్ధమానమౌగాక!

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా హ్యృషయో దివ్యా నమస్కృత్య శివం తదా ।**
**గతా ఆకాశమార్గేణ యత్రాస్తి హిమవత్పురమ్ ॥43॥**

ఆ సప్తర్షులు అలా పలికి శివునకు నమస్కరించి, ఆకాశమార్గంలో హిమవంతుని రాజధానికి వెళ్ళారు.

**దృష్ట్వా తాం చ పురం దివ్యామృషయస్తేఽతివిస్మితాః ।**
**వర్ణయంతశ్చ స్వం పుణ్యమబ్రువన్వై పరస్పరమ్ ॥44॥**

ఆ ఋషులు ఆ దివ్యనగరాన్ని చూచి, మిక్కిలి ఆశ్చర్యాన్నిపొంది, వారిలోవారు తమ భాగ్యాన్ని అభినందించుకుంటూ పరస్పరం ఇలా అన్నారు.

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**పుణ్యవంతో వయం ధన్యా దృష్ట్వైతద్ధిమవత్పురమ్ ।**
**యస్మాదేవంవిధే కార్యే శివేనైవ నియోజితాః ॥45॥**

మనం హిమవంతుని రాజధానిని దర్శించడం, శివుడు స్వయంగా ఇట్టి కార్యానికి మనలను నియోగించడం మన పుణ్యం. మనం ధన్యులం.

**అలకాయాశ్చ స్వర్గాచ్చ భోగవత్యా స్తథా పునః ।**
**విశేషేణామరావత్యా దృశ్యతే పురముత్తమమ్ ॥46॥**

ఈ నగరం అలకానగరం కంటే, స్వర్గం కంటే, భోగవతీ నగరం కంటే, అమరావతీ నగరం కంటే ఉత్తమమైనదిగా కనబడుతోంది.

**సుగృహాణి సురమ్యాణి స్ఫటికైర్వివిధై ర్వరైః ।**
**మణిభిర్వా విచిత్రాణి రచితాన్యంగణాని చ ॥47॥**

గృహాలు అందంగా ఉన్నాయి. వాకిళ్ళు వివిధమైన శ్రేష్ఠ స్ఫటికాలతోను, మణులతోను, పొదగబడి, రంగులీనుతున్నాయి.

**సూర్యకాంతాశ్చ మణయశ్చంద్రకాంతా స్తథైవ చ ।**
**గృహే గృహే విచిత్రాశ్చ వృక్షా స్స్వర్గ సముద్భవాః ॥48॥**

ప్రతీ గృహంలోను సూర్యకాంత మణులు, చంద్రకాంత మణులు, స్వర్గంలో పెరిగే విచిత్రమైన వృక్షాలు ఉన్నాయి.

**తోరణానాం తథా లక్ష్మీర్దృశ్యతే చ గృహే గృహే ।**
**వివిధాని విచిత్రాణి శుక హంసై ర్విమానకైః ॥49॥**

గృహాలన్నీ తోరణాలతో శోభిల్లుతున్నాయి. గృహాలు చిలుకలతో, హంసలతో, విమానాలతో, చిత్రవిచిత్రమైన రంగులతో విరాజిల్లుతున్నాయి.

**వితానాని విచిత్రాణి చైలవత్తోరణై స్సహ ।**
**జలాశయాన్యనేకాని దీర్ఘికా వివిధాః స్థితాః ॥50॥**

రంగురంగుల వస్త్రాల తోరణాలతో కూడి, వితానాలు ప్రకాశిస్తున్నాయి. అనేక జలాశయాలు, వివిధమైన దిగుడు బావులు ఉన్నాయి.

**ఉద్యానాని విచిత్రాణి ప్రసన్నైః పూజితాన్యథ ।**
**నరాశ్చ దేవతాస్సర్వే స్త్రియశ్చాప్సరస స్తథా ॥51॥**

ఉద్యానాలు రంగురంగుల పుష్పాలతో ప్రకాశిస్తున్నాయి. అచ్చటి పురుషులందరు దేవతలు. స్త్రీలందరు అప్సరసలుగా ఉన్నారు.

**కర్మభూమౌ యాజ్ఞికాశ్చ పౌరాణాస్స్వర్గకామ్యయా ।**
**కుర్వంతి తే వృథా సర్వే విహాయ హిమవత్పురమ్ ॥52॥**

కర్మభూమియందు యాజ్ఞికులు, పౌరాణికులు, హిమవంతుని రాజధానిని వీడి, స్వర్గం కొరకు వ్యర్థంగా యజ్ఞాదులను చేస్తున్నారు.

**యావన్న దృష్టమేతచ్చ తావత్స్వర్గపరా నరాః ।**
**దృష్టమేతద్యదా విప్రాః కిం స్వర్గేణ ప్రయోజనమ్ ॥53॥**

ఇది కంటబడనంత వరకు మాత్రమే మానవులు స్వర్గాన్ని కోరతారు. దీనిని చూచిన తరువాత స్వర్గంతో ప్రయోజనమేమున్నది?

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవమృషివర్యాస్తే వర్ణయంతః పురం చ తత్ ।**
**గతా హైమాలయం సర్వే గృహం సర్వ సమృద్ధిమత్ ॥54॥**

ఆ ఋషిశ్రేష్ఠులు ఆ నగరాన్ని ఇట్లు వర్ణిస్తూ, సర్వసంపదలతో విలసిల్లే హిమవంతుని గృహానికి వెళ్ళారు.

**తాన్ దృష్ట్వా సూర్య సంకాశాన్ హిమవాన్విస్మితోఽబ్రవీత్ ।**
**దూరాదాకాశ మార్గస్థాన్మునీన్సప్త సుతేజసః ॥55॥**

ఆకాశంలో సూర్యునివలె గొప్ప తేజస్సుతో వెలుగొందే సప్తర్షులను దూరంనుండి చూసి, చకితుడైన హిమవంతుడిలా అనుకున్నాడు.

**హిమవానువాచ –** హిమవంతుడు పలికాడు.

**సప్తైతే సూర్య సంకాశాః సమాయాంతి మదంతికే ।**
**పూజా కార్యా ప్రయత్నేన మునీనాం చ మయాధునా ॥56॥**

సూర్యునివలె వెలుగొందే ఈ ఏడుగురు నావద్దకు వస్తున్నారు. ఈ మహర్షులకు నేనిప్పుడు శ్రద్ధగా పూజచేయాలి.

**వయం ధన్యా గృహస్థాశ్చ సర్వేషాం సుఖదాయినః ।**
**యేషాం గృహే సమాయాంతి మహాత్మానో యదీదృశాః ॥57॥**

ఇటువంటి మహాత్ములు ఎవరింటికి విచ్చేస్తారో ఆ గృహస్తు ధన్యుడు. మనం అట్టి ధన్యులం. ఈ మహర్షులు అందరికీ సుఖాన్నిస్తారు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఏతస్మిన్నంతరే చైవాకాశాదేత్య భువి స్థితాన్ ।**
**సన్ముఖే హిమవాన్దృష్ట్వా యయౌ మానపురస్సరమ్ ॥58॥**

ఇంతలోనే ఆకాశం నుండి భూమిపైకి దిగి, ఎదురుగా నిలబడిన సప్తర్షులను చూచి, హిమవంతుడు సన్మానపూర్వకంగా ఎదురేగాడు.

**కృతాంజలిర్నతస్కంధః సప్తర్షీన్సుప్రణమ్య సః ।**
**పూజాం చకార తేషాం వై బహుమానపురస్సరమ్ ॥59॥**

చేతులు జోడించి, తలను వంచి, ఆయన సప్తర్షులకు నమస్కరించి, వారిని బహుమానపూర్వకంగా పూజించాడు.

**హితా స్సప్తర్షయస్తే చ హిమవంతం నగేశ్వరమ్ ।**
**గృహీత్వోచుః ప్రసన్నాస్యాః వచనం మంగళాలయమ్ ॥60॥**

హితులగు ఆ సప్తర్షులు పర్వతరాజైన హిమవంతుని (చేతులు) పట్టుకుని ప్రసన్నమైన ముఖము కలవారై, శుభాస్పదాలైన వచనాలను పలికారు.

**యథాగ్రతశ్చ తాన్ కృత్వా ధన్యా మమ గృహాశ్రమః ।**
**ఇత్యుక్త్వాసనమానీయ దదౌ భక్తిపురస్సరమ్ ॥61॥**

వారిని ముందిడుకుని హిమవంతుడు నా గృహస్థాశ్రమం ధన్యమయ్యిందని పలికి, వారికి భక్తి పురస్సరంగా ఆసనం సమర్పించాడు.

**ఆసనేషూపవిష్టేషు తదాజ్ఞప్తస్స్వయం స్థితః ।**
**ఉవాచ హిమవాంస్తత్ర మునీంజ్యోతిర్మయాంస్తదా ॥62॥**

తేజోమూర్తులైన ఆ మునులు ఆసనములందు కూర్చున్నతర్వాత, వారి ఆజ్ఞానుసారం హిమవంతుడు తాను నిలబడి ఇలా పలికాడు.

**హిమాలయ ఉవాచ -** హిమవంతుడు పలికాడు.

**ధన్యోఽహం కృతకృత్యోఽహం సఫలం జీవితం మమ ।**
**లోకేషు దర్శనీయోఽహం బహుతీర్థ సమో మతః ॥63॥**

**యస్మాద్భవంతో మద్గేహ మాగతా విష్ణురూపిణః ।**
**పూర్ణానాం భవతాం కార్యం కృపణానాం గృహేషు కిమ్ ॥64॥**

నేను ధన్యుడను. కృతకృత్యుడను. నా జీవితం సఫలమయ్యింది. ప్రజలు నన్ను అనేక తీర్థాలతో, సమానంగా భావించి, దర్శిస్తారు. ఎందుకనగా విష్ణుస్వరూపులైన మీరు నా గృహానికి విచ్చేశారు. పూర్ణులైన మీకు దీనులైన గృహస్థుల గృహాలలో పనియేముంటుంది?

**తథాపి కించిత్ కార్యం చ సదృశం సేవకస్య మే ।**
**కథనీయం సుదయయా సఫలం స్యాజ్జనుర్మమ ॥65॥**

అయినను దయచేసి సేవకుడనైన నాకు తగినదేదో ఒక పనిని చెప్పండి. వానితో నా జన్మ సఫలం కాగలదు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే సప్తర్షీణామ్ ఆగమనం నామ ద్వాత్రింశోఽధ్యాయః ॥32॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో సప్తర్షులరాక అనే ముప్పై రెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయస్త్రింశోఽధ్యాయః - ముప్పై మూడవ అధ్యాయం

## సప్తర్షి కృత సాంత్వనమ్ - సప్తర్షులు హిమవంతునకునచ్చచెప్పుట

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**జగత్పితా శివః ప్రోక్తో జగన్మాతా శివా మతా ।**
**తస్మాద్దేయా త్వయా కన్యా శంకరాయ మహాత్మనే ॥1॥**

శివుడు జగత్పితయనియూ, శివాదేవి జగన్మాతఅనియూ, పెద్దలు చెబుతారు. కాబట్టి నువ్వు కన్యను శంకరునకివ్వు.

**ఏవం కృత్వా హిమగిరే సార్థకం తే భవేజ్జనుః ।**
**జగద్గురోర్గురుస్త్వం హి భవిష్యసి న సంశయః ॥2॥**

ఓ హిమగిరీ! ఈవిధంగా చేస్తే నీజన్మ సార్థకమౌతుంది. నీవు జగద్గురువునకు గురువు కాగలవు. ఇందులో సందేహం లేదు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏవం వచనమాకర్ణ్య సప్తర్షీణాం మునీశ్వర ।**
**ప్రణమ్య తాన్ కరౌ బద్ధ్వా గిరిరాజోఽబ్రవీదిదమ్ ॥3॥**

ఓ మునీశ్వరా! సప్తర్షుల మాటలు విని, హిమవంతుడు వారికి చేతులు జోడించి, నమస్కరించి ఇలా పలికాడు.

**హిమాలయ ఉవాచ** - హిమవంతుడు పలికాడు.

**సప్తర్షయో మహాభాగా భవద్భిర్యదుదీరితమ్ ।**
**తత్ప్రమాణీకృతం మే హి పురైవ గిరిశేచ్ఛయా ॥4॥**

మహాత్ములారా! సప్తర్షులారా! శివాజ్ఞచే మీరు చెప్పినమాట నాచేత పూర్వమే ప్రమాణంగా స్వీకరింపబడింది.

**ఇదానీమేక ఆగత్య విప్రో వైష్ణవధర్మవాన్ ।**
**శివముద్దిశ్య సుప్రీత్యా విపరీతం వచోఽబ్రవీత్ ॥5॥**

ఇప్పుడే ఒక వైష్ణవ ధర్మానుయాయియైన బ్రాహ్మణుడు వచ్చి, శివునిగూర్చి విపరీతమగు మాటలను మహాప్రీతితో పలికాడు.

**తదారభ్య శివామాతా జ్ఞానభ్రష్టా బభూవ హ ।**
**సుతా వివాహం రుద్రేణ యోగినా తేన నేచ్ఛతి ॥6॥**

అప్పటినుండి పార్వతి తల్లి(మేన)కి మతిపోయింది. యోగియైన రుద్రునితో పార్వతి వివాహానికి అంగీకరించడంలేదు.

**కోపాగారమగాత్సా హి సుతప్తా మలినాంబరా ।**
**కృత్వా మహాహఠం విప్రా బోధ్యమానాపి నాబుధత్ ॥7॥**

ఆమె మిక్కిలి దుఃఖితురాలై, మాసిన వస్త్రాలు ధరించి, కోపగృహంలో ప్రవేశించింది. ఆమెకు ఎంత బోధించినా తెలుసుకోవడంలేదు. ఆమె చాలా మొండిపట్టుతో ఉంది.

**అహం చ జ్ఞానవిభ్రష్టో జాతోఽహం సత్యమీర్యతే ।**
**దాతుం సుతాం మహేశాయ నేచ్ఛామి భిక్షురూపిణే ॥8॥**

నేనుకూడా జ్ఞానాన్ని కోల్పోయాను. నేను సత్యాన్నే పలుకుతున్నాను. భిక్షుక రూపధారియైన మహేశ్వరునకు కుమార్తె నివ్వడం నాకిష్టంలేదు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా శైలరాజస్తు శివమాయావిమోహితః ।**
**తూష్ణీం బభూవ తత్రస్థో మునీనాం మధ్యతో మునే ॥9॥**

శివమాయా మోహితుడైన శైలరాజు మునులతో నిట్లు పలికి, వారి ఎదుట నిలబడి, మిన్నకున్నాడు.

**సర్వే సప్తర్షయస్తే హి శివమాయాం ప్రశస్య వై ।**
**ప్రేషయామాసురథ తాం మేనకాం ప్రత్యరుంధతీమ్ ॥10॥**

సప్తర్షులు శివమాయను కొనియాడిన పిదప, అరుంధతిని మేనక వద్దకు పంపారు.

**అథ పత్యుస్సమాదాయ నిదేశం జ్ఞానదా హి సా ।**
**జగామారుంధతీ తూర్ణం యత్ర మేనా చ పార్వతీ ॥11॥**

జ్ఞానదాయిని యైన అరుంధతి భర్త ఆజ్ఞను గైకొని వెంటనే పార్వతి, మేనకాదేవి ఉన్నచోటకు వెళ్ళింది.

**గత్వా దదర్శ మేనాం తాం శయానాం శోకమూర్ఛితామ్ ।**
**ఉవాచ మధురం సాధ్వీ సావధానా హితం వచః ॥12॥**

ఆమె అచటకు వెళ్ళి, కోపంచే పరాభూతయై పరుండియున్న మేనకను చూచింది. అంతట ఆ సాధ్వి మెల్లగా మధురమూ, హితకరమూ అయిన వచనాలనిలా పలికింది.

**అరుంధత్యువాచ** - అరుంధతి పలికింది.

**ఉత్తిష్ఠ మేనకే సాధ్వి త్వద్గృహేఽహమరుంధతీ ।**
**ఆగతా మునయశ్చాపి సప్తాయాతాః కృపాలవః ॥13॥**

ఓ మేనకా! సాధ్వీ! లెమ్ము. నేనరుంధతిని, కృపాళువులైన సప్తర్షులతో గూడి, నేను మీయింటికి వచ్చా.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**అరుంధతీ స్వరం శ్రుత్వా శీఘ్రముత్థాయ మేనకా ।**
**ఉవాచ శిరసా నత్వా తాం పద్మామివ తేజసా ॥14॥**

అరుంధతి కంఠస్వరాన్ని విన్నంతనే మేనక వేగంగా లేచి, నిలబడి, లక్ష్మీదేవివలె వెలుగొందుచున్న అరుంధతికి శిరసా నమస్కరించి, ఇలా పలికింది.

**మేనోవాచ** – మేనక పలికింది.

**అహోద్య కిమిదం పుణ్యమస్మాకం పుణ్యజన్మనామ్ ।**
**వధూర్జగద్విధేః పత్నీ వసిష్ఠస్యాగతేహ వై ॥15॥**

అహో! మేమెంతో పుణ్యం చేసుకుని జన్మించాం. అందువల్లనే జగత్తునకు విధివిధానాలను తెలియజేసిన వశిష్ఠుని ధర్మపత్ని ఇచ్చటకు విచ్చేసింది.

**కిమర్థమాగతా దేవీ తన్మే బ్రూహి విశేషతః ।**
**అహం దాసీసమా తే హి ససుతా కరుణాం కురు ॥16॥**

ఓ దేవీ! మీరిక్కడకు రావడానికిగల కారణాన్ని నాకు వివరంగా చెప్పండి. నా పుత్రికతో బాటుగా నేను నీకు దాసీసమానురాలను. నాపై దయచూపండి.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తా మేనకాం సాధ్వీ బోధయిత్వా చ తాం బహు ।**
**తథాగతా చ సుప్రీత్యా సాస్తే యత్రర్షయోఽపి తే ॥17॥**

మేనకయొక్క ఈ మాటలను సాధ్వియైన అరుంధతి విని, ఆమెకనేక విధాల బోధించి, సప్తర్షులున్నచోటుకు తిరిగి వచ్చింది.

**అథ శైలేశ్వరం తే చ బోధయామాసురాదరాత్ ।**
**స్మృత్వా శివపదద్వంద్వం సర్వే వాక్యవిశారదాః ॥18॥**

వాక్యవిశారదులైన ఆ పై సప్తర్షులు శివుని పాదపద్మాలను స్మరించి, సాదరంగా పర్వతరాజునకిలా బోధించారు.

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**శైలేంద్ర శ్రూయతాం వాక్యమస్మాకం శుభకారణమ్ ।**
**శివాయ పార్వతీం దేహి సంహర్తుః శ్వశురో భవ ॥19॥**

ఓ పర్వతరాజా! శుభకరమైన మా మాటలను విను. శివునకు పార్వతినివ్వు. జగత్తును లయమొనరించు రుద్రునకు మామవు కమ్ము.

**అయాచితారం సర్వేశం ప్రార్థయామాస యత్నతః ।**
**తారకస్య వినాశాయ బ్రహ్మా సంబంధకర్మణి ॥20॥**

యాచించుట యెరుగని సర్వేశ్వరుని బ్రహ్మ, తారకుని సంహారం నిమిత్తం వివాహం చేసుకొనవలసినదిగా ప్రయత్నపూర్వకంగా ప్రార్థించాడు.

**నోత్సుకో దారసంయోగే శంకరో యోగినాం వరః ।**
**విధేః ప్రార్థనయా దేవస్తవ కన్యాం గ్రహీష్యతి ॥21॥**

యోగివర్యుడైన శంకరునకు వివాహం చేసుకోవాలనే అభిరుచి లేదు. కాని, బ్రహ్మ ప్రార్థనవల్ల నీ కుమార్తెను వివాహమాడడానికి సర్వేశ్వరు డంగీకరించాడు.

**దుహితుస్తే తపస్తప్తం ప్రతిజ్ఞానం చకార సః ।**
**హేతుద్వయేన యోగీంద్రో వివాహం చ కరిష్యతి ॥22॥**

నీ కుమార్తె తపస్సుచేయగా ఆమెకాయన మాటయిచ్చాడు. ఈ రెండు కారణాలవల్ల యోగీంద్రుడైన శివుడు వివాహం చేసుకుంటాడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఋషీణాం వచనం శ్రుత్వా ప్రహస్య చ హిమాలయః ।**
**ఉవాచ కించిద్భీతస్తు పరం వినయపూర్వకమ్ ॥23॥**

ఋషుల మాటలను విని, హిమవంతుడు నవ్వి, కొద్దిపాటి భయంతో పరమ వినయాన్ని చూపుతూ, ఇలా పలికాడు.

**హిమాలయ ఉవాచ –** హిమవంతుడు పలికాడు.

**శివస్య రాజసామగ్రీం న హి పశ్యామి కాంచన ।**
**కంచిదాశ్రయ మైశ్వర్యం కం వా స్వజనబాంధవమ్ ॥24॥**

మహారాజునకుండదగిన ఏవిధమైన వస్తు సామగ్రి శివునివద్ద కానరాదు. ఆయనకు ఒక ఆశ్రయం గాని, ఐశ్వర్యం గాని, స్వజనులు గాని, బంధువులు గాని, ఉన్నట్లు కనబడడంలేదు.

**నేచ్ఛామ్యతి వినిర్లిప్త యోగినే స్వాం సుతామహమ్ ।**
**యూయం వేదవిధాతుశ్చ పుత్రా వదత నిశ్చితమ్ ॥25॥**

మిక్కిలి నిర్లిప్తుడైన యోగికి నాకుమార్తెనిచ్చి వివాహం చేయడం నాకిష్టంలేదు. వేదాలు ప్రవర్తిల్లజేసిన బ్రహ్మగారి పుత్రులైన మీరు మీ నిర్ణయాన్ని చెప్పండి.

**వరాయాననురూపాయ పితా కన్యాం దదాతి చేత్ ।**
**కామాన్మోహాద్భయాల్లోభాత్స నష్టో నరకం వ్రజేత్ ॥26॥**

కామంవలనగాని, భయంవలనగాని, మోహంవలనగాని, లోభంవలనగాని, కుమార్తెను తగని వరునకిచ్చిన తండ్రి నశించి, నరకాన్ని పొందుతాడు.

**న హి దాస్యామ్యహం కన్యామిచ్ఛయా శూలపాణయే ।**
**యద్విధానం భవేద్యోగ్య మృషయస్తద్విధీయతామ్ ॥27॥**

ఓ ఋషులారా! నేనిష్టపడి శూలపాణియైన శివునకు నాకుమార్తె నీయలేకున్నాను. ఈవిషయంలో ఏది యోగ్యంగా ఉంటుందో మీరే నిర్ణయించండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య హిమాగస్య మునీశ్వర ।**
**ప్రత్యువాచ వశిష్ఠస్తం తేషాం వాక్యవిశారద ॥28॥**

ఓ మునీశ్వరా! హిమవంతుని మాటలను విని, సప్తర్షులలో వాక్య విశారదుడైన వసిష్ఠు డిలా బదులు పలికాడు.

**వసిష్ఠ ఉవాచ –** వసిష్ఠుడు పలికాడు.

**శృణు శైలేశ మద్వాక్యం సర్వథా తే హితావహమ్ ।**
**ధర్మావిరుద్ధం సత్యం చ పరత్రేహ ముదావహమ్ ॥29॥**

ఓ పర్వతరాజా! ఇహపర సంతోష దాయకమునైన నా మాటను విను. అది మీకు సర్వథా హితావహమైనది, ధర్మవిరుద్ధం కానిది, సత్యమూ,

**వచనం త్రివిధం శైల లౌకికే వైదికేఽపి చ ।**
**సర్వం జానాతి శాస్త్రజ్ఞో నిర్మలజ్ఞానచక్షుషా ॥30॥**

ఓ పర్వతరాజా! లోకంలోనూ వేదంలోనూ కూడా వచనం మూడు విధాలుగా ఉంటుంది. శాస్త్రజ్ఞులైనవారు నిర్మల జ్ఞాననేత్రంతో సర్వాన్ని తెలుసుకుంటారు.

**అసత్యమహితం పశ్చాత్సాంప్రతం శ్రుతి సుందరమ్ ।**
**సుబుద్ధిర్వక్తి శత్రుర్హి హితం నైవ కదాచన ॥31॥**

అసత్యం వర్తమానంలో వినడానికి మధురంగా ఉండి, భవిష్యత్తులో కష్టాన్ని కలిగిస్తుంది. శత్రువు బుద్ధిమంతుడైతే హితమెప్పుడూ పలుకడు.

**ఆదావప్రీతి జనకం పరిణామే సుఖావహమ్ ।**
**దయాళుర్ధర్మశీలో హి బోధయత్యేవ బాంధవః ॥32॥**

దయాళువూ, ధర్మబుద్ధి అయిన బాంధవుడు ఆదిలో ప్రీతికానిదీ, పరిణామంలో సుఖాన్ని కలిగించేదీ అయిన వచనాన్ని పలుకుతాడు.

**శ్రుతిమాత్రా త్సుధాతుల్యం సర్వకాలసుఖావహమ్ ।**
**సత్యసారం హితకరం వచనం శ్రేష్ఠమీప్సితమ్ ॥33॥**

వినడానికి అమృతం వంటిదీ, సర్వకాలములందూ సుఖావహమైనట్టిదీ సత్యమూ, హితమూ అయిన వచనం శ్రేష్ఠమైనదని పెద్దలు చెబుతారు.

**ఏవం చ త్రివిధం శైల నీతిశాస్త్రోదితం వచః ।**
**కథ్యతాం త్రిషు మధ్యే కిం బ్రువే వాక్యం త్వదీప్సితమ్ ॥34॥**

ఓ పర్వత రాజా! ఈవిధంగా మూడు రకాల వచనాలను నీతిశాస్త్రం తెలియజేస్తోంది. ఈ మూడింటిలో ఎటువంటి వచనం నేను నీకు చెప్పాలని కోరుకుంటున్నావు?

**బ్రహ్మ సంపద్విహీనస్య శంకర స్త్రిదశేశ్వరః ।**
**తత్త్వజ్ఞానసముద్రేషు సన్నిమగ్నైకమానసః ॥35॥**

దేవదేవుడైన శంకరుడు బాహ్య సంపద లేనివానికి వేదమే సంపద. ఆయన మనస్సు తత్త్వజ్ఞాన సముద్రంలో మునకలు వేస్తుంటుంది.

**జ్ఞానానందస్యేశ్వరస్య బాహ్య వస్తుషు కా స్పృహా ।**
**గృహీ దదాతి స్వసుతాం రాజ్యసంపత్తిశాలినే ॥36॥**

జ్ఞానఘనుడు, ఆనంద ఘనుడునైన శివునకు బాహ్యవస్తువులయందు కోరికెందులకుంటుంది? గృహస్తు తన కుమార్తెను రాజ్య సంపత్తిగలవాడికిస్తాడు.

**కన్యకాం దుఃఖినే దత్త్వా కన్యాఘాతీ భవేత్పితా ।**
**కో వేద శంకరో దుఃఖీ కుబేరో యస్య కింకరః ॥37॥**

తన కుమార్తెను దుఃఖితునకిచ్చిన తండ్రి కన్యాఘాతకుడే యౌతాడు. కాని కుబేరుడు తనకు కింకరుడైన శంకరుడు దుఃఖియని ఎవరెరుంగుదురు.

**భ్రూభంగలీలయా సృష్టిం స్రష్టుం హర్తుం క్షమో హి సః ।**
**నిర్గుణః పరమాత్మా చ పరేశః ప్రకృతేః పరః ॥38॥**

ఆయన కనుబొమల కదలిక మాత్రం చేతనే సృష్టి స్థితి లయలు చేయ సమర్థుడు. ఆయన నిర్గుణుడు. పరమాత్మ. పరమేశ్వరుడు. ప్రకృతికతీతుడు.

**యస్య చ త్రివిధా మూర్తిర్విధాతు స్సృష్టి కర్మణి ।**
**సృష్టిస్థిత్యంతజననీ బ్రహ్మవిష్ణు హరాభిధా ॥39॥**

సృష్టి స్థితి లయ కార్యాలను నిర్వహించే మూడు రకాల మూర్తులు శివునవే. సృష్టి స్థితి లయాలను చేయు ఆ త్రిమూర్తులకు బ్రహ్మ విష్ణు రుద్రులని పేరు.

**బ్రహ్మా చ బ్రహ్మలోకస్థో విష్ణుః క్షీరోదవాసకృత్ ।**
**హరః కైలాసనిలయః సర్వాః శివవిభూతయః ॥40॥**

బ్రహ్మలోకమునందుండే బ్రహ్మ, క్షీరసాగరమందుండే విష్ణువు, కైలాసమందుండే రుద్రుడు, అనే ముగ్గురు శివుని విభూతులు మాత్రమే.

**ధత్తే చ త్రివిధా మూర్తిః ప్రకృతిః శివసంభవా ।**
**అంశేన లీలయా సృష్టౌ కలయా బహుధా అపి ॥41॥**

శివునినుండి పుట్టిన ప్రకృతి కూడా అనేక రూపాలుగా వ్యక్తమైనప్పటికి, సృష్టికార్యంలో తన లీలచే మూడు విధాల మూర్తులుగా తన అంశచేతనే ధరిస్తోంది.

**ముఖోద్భవా స్వయంవాణీ వాగధిష్ఠాతృదేవతా ।**
**వక్షఃస్థలోద్భవా లక్ష్మీ స్సర్వసంపత్స్వరూపిణీ ॥42॥**

వాగధిష్ఠాతృదేవతయైన సరస్వతి స్వయంగా ముఖం నుండి పుట్టింది. ఇదిఒక మూర్తి. సర్వ సంపత్స్వరూపురాలైన లక్ష్మి రెండవది. ఈమె వక్షఃస్థలంనుండి పుట్టినది.

**శివా తేజస్సు దేవానామావిర్భావం చకార సా ।**
**నిహత్య దానవాన్సర్వాన్ దేవేభ్యశ్చ శ్రియం దదౌ ॥43॥**

మూడవదైన ఉమ దేవతల తేజస్సునుండి ఆవిర్భవించింది. ఆమె రాక్షసులనందరిని సంహరించి, దేవతలకు సంపదలనిచ్చేది.

**ప్రాప కల్పాంతరే జన్మ జఠరే దక్షయోషితః ।**
**నామ్నా సతీ హరం ప్రాప దక్షస్తస్మై దదౌ చ తామ్ ॥44॥**

ఆమె మరొక కల్పంలో దక్షునిభార్య గర్భంనుండి పుట్టి, **"సతి"** అనే పేరును పొంది, శివుని వివాహమాడింది. దక్షుడామెను హరునకిచ్చి వివాహం చేశాడు.

**దేహం తత్యాజ యోగేన శ్రుత్వా సా భర్తృనిందనమ్ ।**
**సాద్య త్వత్తస్తు మేనాయం జజ్ఞే జఠరతశ్శివా ॥45॥**

ఆమె తన భర్తను దక్షుడు నిందించడం విని, యోగమహిమచే దేహత్యాగం చేసింది. ఆమెయే నీవల్ల మేనాగర్భంలో జన్మించి, పార్వతిరూపంలో ఉంది.

**శివా శివస్య పత్నీయం శైలజన్మని జన్మని ।**
**కల్పే కల్పే బుద్ధిరూపా జ్ఞానినాం జననీ పరా ॥46॥**

ఓ పర్వతరాజా! ఈ శివాదేవి జన్మజన్మలందును, సర్వకల్పములందును, శివుని అర్ధాంగి. ఈ తల్లి సర్వోత్కృష్టురాలు. జ్ఞానులయందీమె బుద్ధిరూపంలో నుంటుంది.

**జాయతే స్మ సదా సిద్ధా సిద్ధిదా సిద్ధిరూపిణీ ।**
**సత్యా అస్థి చితాభస్మ భక్త్యా ధత్తే హరస్స్వయమ్ ॥47॥**

సదా సిద్ధినిచ్చునదీ, సిద్ధి స్వరూపురాలూ, స్వయంసిద్ధ అయిన ఈదేవి ఇక్కడ జన్మించింది. శివుడు సతీదేవియొక్క అస్థికలను, చితాభస్మాన్ని, భక్తితో స్వయంగా ధరిస్తాడు.

**అతస్త్వం స్వేచ్ఛయా కన్యాం దేహి భద్రాం హరాయ చ ।**
**అథవా సా స్వయం కాంతస్థానే యాస్యత్యదాస్యసి ॥48॥**

కాబట్టి మంగళ స్వరూపురాలైన ఈ కన్యను నీవు సంతోషంతో శివునకివ్వు. ఈయకపోతే ఆమెయే స్వయంగా తన భర్త స్థానానికి వెళుతుంది.

**కృత్వా ప్రతిజ్ఞాం దేవేశో దృష్ట్వా క్లేశమసంఖ్యకమ్ ।**
**దుహితుస్తే తపః స్థానమాజగామ ద్విజాత్మకః ॥49॥**

నీ కుమార్తెయొక్క తీవ్ర తపస్సులోని క్లేశాలను చూచి, దేవదేవులు దేవతలకు ప్రతిజ్ఞచేసి, బ్రాహ్మణవేషంలో నీ కుమార్తె తపస్సు చేసే స్థలానికి వచ్చాడు.

**తామాశ్వాస్య వరం దత్వా జగామ నిజమందిరమ్ ।**
**తత్ర్పార్థనా వశాచ్ఛంభు ర్యయాచే త్వాం శివాం గిరే ॥50॥**

శంభు డామె నోదార్చి, వరాన్నిచ్చి, తన నివాసానికి వెళ్ళి, ఆమె కోరిక మేరకు నీవద్దకు వచ్చి, పార్వతినిమ్మని యాచించాడు.

**అంగీకృతం యువాభ్యాం తచ్ఛివభక్తి రతాత్మనా ।**
**విపరీత మతిర్జాతా వద కస్మాద్గిరీశ్వర ॥51॥**

ఓ పర్వతరాజా! శివభక్తి రతమైన మనస్సుతో మీరిరువురూ అంగీకరించి ఉన్నారు. కాని ఇప్పుడు తద్విరుద్ధంగా మనసు కలగడానికి కారణమేమి? చెప్పు?

**తద్గత్వా ప్రభుణా దేవ ప్రార్థితేన త్వదంతికమ్ ।**
**ప్రస్థాపితా వయం శీఘ్రం హ్యృషయస్సాప్యరుంధతీ ॥52॥**

అంతట దేవతలు శివునివద్దకు వెళ్ళి, ప్రార్థించగా ఆయన సప్తర్షులమైన మమ్ములను, అరుంధతిని వెనువెంటనే నీవద్దకు పంపించాడు.

**శిక్షయామో వయం త్వా హి దత్వా రుద్రాయ పార్వతీమ్ ।**
**ఏవం కృతే మహానందో భవిష్యతి గిరే తవ ॥53॥**

ఓ శైలరాజా! మేము నీకుపదేశిస్తున్నాం. నీవు పార్వతిని రుద్రున కివ్వు. ఆవిధంగా చేస్తే నీకు మహానందం కలుగుతుంది.

**శివాం శివాయ శైలేంద్ర స్వేచ్ఛయా చేన్నదాస్యసి ।**
**భవితా తద్వివాహోఽత్ర భవితవ్య బలేన హి ॥54॥**

ఓ పర్వతరాజా! నీవు శివాదేవిని ప్రీతిపూర్వకంగా శివునికీయని పక్షంలో విధిబలంచే వారి వివాహం సంపన్నం కాగలదు.

**వరం దదౌ శివాయై స తపంత్యై తాత శంకరః ।**
**న హీశ్వర ప్రతిజ్ఞాతం విపరీతాయ కల్పతే ॥55॥**

వత్సా! శంకరుడు శివాదేవికి తపస్సుచేస్తుండగా వరమిచ్చాడు. ఈశ్వరుని ప్రతిజ్ఞ వమ్ముకాదుకదా!

**అహో ప్రతిజ్ఞా దుర్లంఘ్యా సాధూనామీశ వర్తినామ్ ।**
**సర్వేషాం జగతాం మధ్యే కిమీశస్య పునర్గిరే ॥56॥**

ఓ పర్వతరాజా! ఈశ్వర భక్తులైన సాధువుల ప్రతిజ్ఞయే ముల్లోకాలలో ఉల్లంఘింప శక్యం కానిదిగా ఉన్నప్పుడు ఈశ్వరుని ప్రతిజ్ఞ గురించి చెప్పేదేమున్నది?

**ఏకో మహేంద్ర శ్శైలానాం పక్షాంశ్చిచ్ఛేద లీలయా ।**
**పార్వతీ లీలయా మేరో శ్శృంగభంగం చకార చ ॥57॥**

మహేంద్రుడొక్కడే పర్వతాల రెక్కల నవలీలగా ఛేదించాడు. పార్వతికూడ అవలీలగా మేరువునకు శృంగభంగం చేసింది.

**ఏకార్థే నహి శైలేశ నాశ్యా స్సర్వా హి సంపదః ।**
**ఏకం త్యజేత్కులస్యార్థే శ్రుతి రేషా సనాతనీ ॥58॥**

ఓ పర్వతరాజా! ఒక్కని కొరకు సమస్త సంపదలను నాశనం చేసుకోరాదు. వంశం కొరకు ఒక వ్యక్తిని విడిచిపెట్టడమే సనాతనధర్మం. శ్రుతి వాక్యం.

**దత్వా విప్రాయ స్వసుతా మనరణ్యో నృపేశ్వరః ।**
**బ్రాహ్మణాద్భయమాపన్నో రరక్ష నిజ సంపదమ్ ॥59॥**

అనరణ్య మహారాజు బ్రాహ్మణ భయం గలవాడై, తన కుమార్తెను బ్రాహ్మణులకిచ్చి, తన సంపదలను రక్షించుకున్నాడు.

**తమాశు బోధయామాసుర్నీతిశాస్త్రవిదో జనాః ।**
**బ్రహ్మశాపాద్విభీతాశ్చ గురవో జ్ఞాతిసత్తమాః ॥60॥**

నీతిశాస్త్రజ్ఞులైన జనులు, గురువులు, జ్ఞాతులు, బ్రాహ్మణశాపానికి భయపడినవారై, ఆ రాజునకు బోధించారు.

**శైలరాజ త్వమప్యేవం సుతాం దత్వా శివాయ చ ।**
**రక్ష సర్వాన్బంధువర్గాన్ వశం కురు సురానపి ॥61॥**

ఓ శైలరాజా! అదేవిధంగా నీవుకూడా నీ కుమార్తెను శివునకిచ్చి బంధువులనందరిని రక్షించు, దేవతలనందరిని వశపరచుకో.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వసిష్ఠస్య వచనం స ప్రసహ్య చ ।**
**పప్రచ్ఛ నృపవార్తాం చ హృదయేన విదూయతా ॥62॥**

వసిష్ఠుని మాటలు విని, హిమవంతుడు నవ్వి, దుఃఖంతో నిండిన హృదయంతో అనరణ్యుని వృత్తాంతాన్ని గూర్చి ఇలా ప్రశ్నించాడు.

**హిమాలయ ఉవాచ** - హిమవంతుడు పలికాడు.

**కస్య వంశోద్భవో బ్రహ్మన్ననరణ్యో నృపశ్చ సః ।**
**సుతాం దత్త్వాం స చ కథం రరక్షాఖిల సంపదః ॥63॥**

ఓ బ్రహ్మన్! ఆ అనరణ్య మహారాజు ఏ వంశంలో జన్మించాడు? ఆయన కుమార్తెనిచ్చి సంపదలనన్నిటిని రక్షించుకున్న విధానమెట్టిది?

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇతి శ్రుత్వా వసిష్ఠస్తు శైలవాక్యం ప్రసన్నధీః ।**
**ప్రోవాచ గిరయే తస్మై నృపవార్తాం సుఖావహామ్ ॥64॥**

ప్రసన్నాత్ముడైన వసిష్ఠుడు హిమవంతుని మాటలను విని, సుఖదాయకమైన అనరణ్యచరిత్రను పర్వతరాజునకు చెప్పాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే సప్తర్షి కృత సాంత్వనమ్ నామ త్రయస్త్రింశోఽధ్యాయః ॥33॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో సప్తర్షులు హిమవంతునకునచ్చచెప్పుట అనే ముప్పై మూడవ అధ్యాయం సమాప్తం.

## **చతుస్త్రింశోఽధ్యాయః** - ముప్పై నాలుగవ అధ్యాయం

## **అనరణ్యచరితమ్** - అనరణ్యచరిత్ర

**వసిష్ఠ ఉవాచ** - వసిష్ఠ మహర్షి పలికాడు.

**మనోర్వంశోద్భవో రాజా సోఽనరణ్యో నృపేశ్వరః ।**
**ఇంద్రసావర్ణి సంజ్ఞస్య చతుర్దశ మితస్య హి ॥1॥**

ఇంద్రసావర్ణి అను పేరుగల పదునాల్గవ మనువు వంశంలో అనరణ్యుడనే చక్రవర్తి జన్మించాడు.

**అనరణ్యో నృపశ్రేష్ఠస్సప్తద్వీప మహీపతిః ।**
**శంభుభక్తో విశేషేణ మంగలారణ్యజో బలీ ॥2॥**

అనరణ్య మహారాజు సప్తద్వీపాలతోకూడిన భూమండలానికి ప్రభువు. మంగళారణ్యమునందు జన్మించిన బలశాలియైన ఆ మహారాజు ప్రత్యేకించి శివభక్తుడు.

**భృగుం పురోధసం కృత్వా శతం యజ్ఞాంశ్చకార సః ।**
**న స్వీచకార శక్రత్వం దీయమానం సురైరపి ॥3॥**

ఆయన భృగువును పురోహితునిగా చేసుకొని వంద యజ్ఞాలను చేశాడు. దేవతలిచ్చినప్పటికీ ఆయన ఇంద్రపదవిని స్వీకరించలేదు.

**బభూవుశ్శతంపుత్రాశ్చ రాజ్ఞస్తస్య హిమాలయ ।**
**కన్యైకా సుందరీ నామ్నా పద్మా పద్మాలయాసమా ॥4॥**

ఓ హిమాలయా! ఆ మహారాజునకు వందమంది కుమారులున్నారు. లక్ష్మీ సమానురాలైన **'పద్మ'** అనే పేరుగల సుందరియైన ఒక కుమార్తె గలదు.

**యస్స్నేహః పుత్ర శతకే కన్యాయాం చ తతోఽధికః ।**
**నృపస్య తస్య తస్యాం హి బభూవ నగసత్తమ ॥5॥**

ఆ మహారాజునకు వందమంది పుత్రులపై ఎంత ప్రేమకలదో అంతకంటే అధికమైన ప్రేమ తన కుమార్తెయందుండెడిది.

**ప్రాణాధికాః ప్రియతమా మహిష్యస్సర్వయోషితః ।**
**నృపస్య పత్న్యః పంచాసన్సర్వాస్సౌభాగ్యసంయుతా ॥6॥**

ఆ మహారాజునకు ప్రాణాధిక ప్రియతమలు, సర్వ సౌభాగ్య సంయుతలునైన ఐదుగురు భార్యలున్నారు.

**సా కన్యా యౌవనస్థా చ బభూవ స్వపితుర్గృహే ।**
**పత్రం ప్రస్థాపయామాస సువరానయనాయ సః ॥7॥**

ఆ కన్య తండ్రి ఇంటిలో పెరిగి, యౌవనంలో అడుగుపెట్టింది. ఆ మహారాజు మంచి వరులను రప్పించడానికి పత్రాలను పంపించాడు.

**ఏకదా పిప్పలాదర్షిర్గంతుం స్వాశ్రమముత్సుకః ।**
**తపః స్థానే నిర్జనే చ గంధర్వం స దదర్శ హ ॥8॥**

ఒకనాడు పిప్పలాదమహర్షి తన ఆశ్రమానికి వెళ్ళే తొందరలో నిర్జనమైన తపోవనంలో ఒక గంధర్వుని చూశాడు.

**స్త్రీయుతం మగ్నచిత్తం చ శృంగారే రససాగరే ।**
**విహరంతం మహాప్రేమ్ణా కామశాస్త్రవిశారదమ్ ॥9॥**

**దృష్ట్వా తం మునిశార్దూలః సకామః సంబభూవ సః ।**
**తపస్స్వదత్త చిత్తశ్చాచింతయద్దారసంగ్రహమ్ ॥10॥**

స్త్రీలతోగూడి, శృంగారరస సముద్రంలో మునిగిన మనస్సుగలవాడై, మహాప్రేమతో విహరిస్తున్న, కామశాస్త్ర కోవిదుడైన, ఆ గంధర్వుని చూచి, మహర్షి కామవికారం పొందినవాడై తపస్సునందు మనస్సులగ్నం కాక పెళ్ళిచేసుకోవాలనుకున్నాడు.

**ఏవం వృత్తస్య తస్యైవ పిప్పలాదస్య సన్మునేః ।**
**కియత్కాలో గతస్తత్ర కామోన్మథితచేతసః ॥11॥**

ఈవిధంగా కామంచే పీడింపబడిన మనస్సుగల పిప్పలాదమహర్షి కొంతకాలం గడిపాడు.

**ఏకదా పుష్పభద్రాయాం స్నాతుం గచ్ఛన్మునీశ్వరః ।**
**దదర్శ పద్మాం యువతీం పద్మామివ మనోరమామ్ ॥12॥**

ఒకనాడామునీశ్వరుడు పుష్పభద్రానదికి స్నానానికి వెళుతూ, లక్ష్మి వలె మనోరమయు, యౌవనవతియునైన పద్మను చూశాడు.

**కేయం కన్యేతి పప్రచ్ఛ సమీపస్థాన్ జనాన్మునిః ।**
**జనా నివేదయాంచక్రుర్నత్వా శాప నియంత్రితాః ॥13॥**

ఆ మహర్షి సమీపంలోనున్న జనులను 'ఈకన్య ఎవరు?' అని ప్రశ్నించాడు. శాపభీతులైన జనులు నమస్కరించి, ఇలా నివేదించారు.

**జనా ఊచుః** – జనులు పలికారు.

**అనరణ్యసుతేయం వై పద్మా నామ రమాపరా ।**
**వరారోహా ప్రార్థ్యమానా నృపశ్రేష్ఠై ర్గుణాలయా ॥14॥**

అపరలక్ష్మీదేవి అనదగిన ఈ సుందరి అనరణ్యుని కుమార్తె. ఈమెపేరు పద్మ. సద్గుణాలయయైన ఈమెను శ్రేష్ఠులైన రాజకుమారులు వివాహమాడాలని కోరుకుంటున్నారు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**తచ్ఛ్రుత్వా స మునిర్వాక్యం జనానాం తథ్యవాదినామ్ ।**
**చుక్షోభాతీవ మనసి తల్లిప్సురభవచ్చ సః ॥15॥**

సత్యాన్ని పలికే జనుల మాటలను విని, ఆ మహర్షి మనస్సులో చాలా క్షోభను పొంది, ఆమెను పొందాలని కోరుకున్నాడు.

**మునిః స్నాత్వాభీష్టదేవం సంపూజ్య విధివచ్ఛివమ్ ।**
**జగామ కామీ భిక్షార్థ మనరణ్యసభాం గిరే ॥16॥**

ఓ శైలరాజా! కామియైన ఆ మహర్షి స్నానంచేసి, ఇష్టదైవమైన శివుని యథావిధిగా పూజించి, భిక్షకొరకు అనరణ్యుని సభకు వెళ్ళాడు.

**రాజా శీఘ్రం మునిం దృష్ట్వా ప్రణనామ భయాకులః ।**
**మధుపర్కాదికం దత్త్వా పూజయామాస భక్తితః ॥17॥**

రాజు మహర్షిని చూచి, భయాకులుడై, వెంటనే నమస్కరించాడు. అంతేగాక మధుపర్కాదులిచ్చి భక్తితో పూజించాడు.

**కామాత్సర్వం గృహీత్వా చ యయాచే కన్యకాం మునిః ।**
**మౌనీ బభూవ నృపతిః కించిన్నిర్వక్తుమక్షమః ॥18॥**

సత్కార ద్రవ్యాలలో తనకు నచ్చినవాటిని స్వీకరించిన మహర్షి కన్యను తనకిమ్మని కోరాడు. రాజు ఏమీ చెప్పజాలక మౌనంగా ఉండిపోయాడు.

**మునిర్యయాచే కన్యాం చ తాం దేహీతి నృపేశ్వర ।**
**అన్యథా భస్మసాత్సర్వం కరిష్యామి క్షణేన చ ॥19॥**

"ఆ కన్యను నాకివ్వు, లేనిచో క్షణకాలంలో సర్వాన్ని భస్మం చేస్తా" అని మహర్షి మహారాజును కోరాడు.

**సర్వే బభూవు రాచ్ఛన్నా గణాస్త త్తేజసా మునే ।**
**రురోద రాజా సగణో దృష్ట్వా విప్రం జరాతురమ్ ॥20॥**

రాజపరివారమంతా ఆ ముని తేజస్సును చూసి దిగ్భ్రాంతమైంది. రాజు ఆ ముదుసలి బ్రాహ్మణుని చూచి, బంధువులతో సహా రోదించాడు.

**మహిష్యో రురుదుస్సర్వా ఇతి కర్తవ్యతాక్షమాః ।**
**మూర్ఛామాప మహారాజ్ఞీ కన్యామాతా శుచాకులా ॥21॥**

అతని భార్యలందరు ఏమిచేయడానికి తోచక ఏడ్చారు. కన్య తల్లియైన మహారాణి దుఃఖ పీడితురాలై మూర్ఛిల్లింది.

**బభూవు స్తనయాస్సర్వే శోకాకులితమానసాః ।**
**సర్వం శోకాకులం జాతం నృపసంబంధి శైలప ॥22॥**

కుమారులందరు శోకాకులిత మనస్కులయ్యారు. రాజ సంబంధ జనులందరు శోకాన్ని పట్టజాల లేకపోయారు.

**ఏతస్మిన్నంతరే ప్రాజ్ఞో ద్విజో గురురనుత్తమః ।**
**పురోహితశ్చ మహిమానాగతో నృపసన్నిధిమ్ ॥23॥**

ఇంతలో ప్రాజ్ఞుడు, బ్రాహ్మణోత్తముడునగు గురువు, బుద్ధిమంతుడైన పురోహితుడు రాజసన్నిధికి విచ్చేశారు.

**రాజా ప్రణమ్య సంపూజ్య రురోద చ తయోః పురః ।**
**సర్వం నివేదయాం చక్రే పప్రచ్ఛోచితమాశు తత్ ॥24॥**

రాజు వారిద్దరికి నమస్కరించి, పూజించి, వారి ఎదుట భోరుమన్నాడు. వారు ప్రశ్నించగా రాజు ఉచిత రీతిని వృత్తాంతమంతటిని నివేదించాడు.

**అథ రాజ్ఞో గురుర్విప్రః పండితశ్చ పురోహితః ।**
**అపి ద్వౌ శాస్త్రనీతిజ్ఞౌ బోధయామాసతుర్నృపమ్ ॥25॥**

అంతట వేదవేత్తయైన గురువు, పండితుడైన పురోహితుడు కలిసి నీతి శాస్త్రజ్ఞులు గనుక రాజునకు ఇలా బోధించారు.

**శోకాకులాశ్చ మహిషీర్నృప బాలాంచ కన్యకామ్ ।**
**ఉత్తమాం నీతిమాదృత్య సర్వేషాం హితకారిణీమ్ ॥26॥**

శోకాకులులైన రాజపత్నులను, రాజకుమారులను, రాజకన్యకను, అందరిని దృష్టిలో పెట్టుకుని హితాన్ని కలిగించే ఉత్తమనీతిని వారిరువురు సాదరంగా విన్నవించారు.

**గురుపురోధసావూచతుః** – గురువు, పురోహితుడు పలికారు.

**శృణు రాజన్ మహాప్రాజ్ఞ వచో నౌ సద్ధితావహమ్ ।**
**మాశుచః సపరివార శ్శాస్త్రే కురు మతిం సతీమ్ ॥27॥**

మహాప్రాజ్ఞా! రాజా! హితావహమైన మా ఇద్దరి మాటలను వినండి. బంధువర్గంతోకూడి దుఃఖింపకు. శాస్త్రమందు సద్బుద్ధిని కలిగియుండు.

**అద్యవాబ్దదినాంతే వా దాతవ్యా కన్యకా నృప ।**
**పాత్రాయ విప్రాయాన్యస్మై కస్మైచిద్వా విశేషతః ॥28॥**

రాజా! ఈనాడుగాని, సంవత్సరం తర్వాతగాని, అమ్మాయిని యోగ్యుడైన బ్రాహ్మణునికిగాని, ఎవరికో ఒకరికిగాని ఈయవలసిందేగదా!

**సత్పాత్రం బ్రాహ్మణాదన్యన్న పశ్యావో జగత్త్రయే ।**
**సుతాం దత్త్వా చ మునయే రక్ష స్వాం సర్వసంపదమ్ ॥29॥**

ముల్లోకాలలో బ్రాహ్మణునికంటే యోగ్యమైన పాత్ర మాకు కానరాదు. కావున కుమార్తెను మహర్షికిచ్చి, నీ సంపదలనన్నింటిని రక్షించుకొమ్ము.

**రాజన్నేక నిమిత్తేన సర్వసంపద్వినశ్యతి ।**
**సర్వం రక్షతి తం త్యక్త్వా వినా తం శరణాగతమ్ ॥30॥**

రాజా! ఒక్కరిగురించి సర్వం నశించే సందర్భంలో వానిని విడిచి సర్వాన్ని రక్షించుకోవాలి. ఈ నీతి శరణాగతుని విషయంలో వర్తించదు.

**వసిష్ఠ ఉవాచ –** వసిష్ఠుడు పలికాడు.

**రాజా ప్రాజ్ఞ వచః శ్రుత్వా విలప్య చ ముహుర్ముహుః ।**
**కన్యాం సాలంకృతాం కృత్వా మునీంద్రాయ దదౌ కిల ॥31॥**

రాజు ఆ బుద్ధిమంతుల మాటలు విని, అనేక పర్యాయాలు రోదించి, కన్యక నలంకరించి, ఆ మహర్షి కప్పగించాడు.

**కాంతాం గృహీత్వా స మునిర్వివాహ్య విధివద్గిరే ।**
**పద్మాం పద్మోపమాం తాం వై ముదితస్స్వాలయం యయౌ ॥32॥**

ఓ శైలరాజా! ఆ ముని కన్యను స్వీకరించాడు. అతడు లక్ష్మి వంటి పద్మను ఆనందంతో పరిణయమాడి, యథావిధిగా తన గృహానికి తోడ్కొని వెళ్ళాడు.

**రాజా సర్వాన్పరిత్యజ్య దత్త్వా వృద్ధాయ చాత్మజామ్ ।**
**గ్లాని చిత్తే సమాధాయ జగామ తపసే వనమ్ ॥33॥**

రాజు వృద్ధునికి కుమార్తెనివ్వడంచే అందరినీ వీడి, మనస్సులో దుఃఖం కలవాడై, తపస్సు కొరకు అడవికి పోయాడు.

**తద్భార్యాపి వనం యాతే ప్రాణనాథే తదా గిరే ।**
**భర్తుశ్చ దుహితుశ్శోకాత్ప్రాణాం స్తత్యాజ సుందరీ ॥34॥**

ఆయన భార్య తన ప్రాణనాథుడు అడవికి పోగానే భర్త వియోగాన్ని, కుమార్తె దుఃఖాన్ని సహించలేకపోయింది. ప్రాణాలను విడిచిపెట్టింది.

**పూజ్యాః పుత్రాశ్చ భృత్యాశ్చ మూర్ఛామాపుర్నృపం వినా ।**
**శుశుచుః శ్వాస సంయుక్తం జ్ఞాత్వా సర్వే పరే జనాః ॥35॥**

రాజు లేకపోవడంచే పూజ్యులైన అమాత్యాదులు, రాజపుత్రులు, సేవకులు కూడా మూర్ఛపొందారు. ఈవార్తనెరింగిన ఇతరులందరు నిట్టూర్పులను విడిచి, దుఃఖించారు.

**అనరణ్యో వనం గత్వా తపస్తప్త్వాతి శంకరమ్ ।**
**సమారాధ్య యయౌ భక్త్యా శివలోకమనామయమ్ ॥36॥**

అనరణ్యుడు అడవికి వెళ్ళి, శంకరునుద్దేశించి, గొప్ప తపస్సుచేసి, భక్తితో శివుని ఆరాధించి, దుఃఖరహితమైన శివలోకాన్ని పొందాడు.

**నృపస్య కీర్తిమాన్నామ్నా జ్యేష్ఠపుత్రోఽథ ధార్మికః ।**
**పుత్రవత్పాలయామాస ప్రజా రాజ్యం చకార హ ॥37॥**

అనంతరం రాజుయొక్క కీర్తిమంతుడు అనే పేరుగల జ్యేష్ఠపుత్రుడు ధర్మబద్ధుడై, ప్రజలను పుత్రులవలె పాలించి, రాజ్యపాలన చేశాడు.

**ఇతి తే కథితం శైలానరణ్యచరితం శుభమ్ ।**
**కన్యాం దత్త్వా యథా రక్షత్వంశం చాప్యఖిలం ధనమ్ ॥38॥**

ఓ పర్వతరాజా! అనరణ్యుడు కన్యనిచ్చి, సర్వసంపదలను, వంశాన్ని రక్షించుకున్న ఈ శుభవృత్తాంతాన్ని నీకు వివరించాను.

**శైలరాజ త్వమప్యేవం సుతాం దత్త్వా శివాయ చ ।**
**రక్ష సర్వకులం సర్వాన్ వశాన్ కురు సురానపి ॥39॥**

ఓ శైలరాజా! నీవుకూడా ఇదేతీరున నీ కుమార్తెను శివునకిచ్చి, కులాన్నంతటిని రక్షించుకొమ్ము. దేవతలందరు నీకు వశులౌనట్లు చేసుకో.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే అనరణ్యచరితమ్ నామ చతుస్త్రింశోఽధ్యాయః ॥34॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో అనరణ్యచరిత్ర అనే ముప్పై నాలుగవ అధ్యాయం సమాప్తం.

## **పంచత్రింశోఽధ్యాయః** – ముప్పై ఐదవ అధ్యాయం

## **పిప్పలాదచరితమ్** – పిప్పలాదునిచరిత్ర

**నారద ఉవాచ** – నారద మహర్షి పలికాడు.

**అనరణ్యస్య చరితం సుతాదాన సమన్వితమ్ ।**
**శ్రుత్వా గిరివరస్తాత కిం చకార చ తద్వద ॥1॥**

ఓతండ్రీ! తన కుమార్తెను మహర్షికిచ్చిన అనరణ్యుని చరిత్రను విని, హిమవంతుడేమిచేశాడో చెప్పు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**అనరణ్యస్య చరితం కన్యాదానసమన్వితమ్ ।**
**శ్రుత్వా పప్రచ్ఛ శైలేశో వసిష్ఠం సాంజలిః పునః ॥2॥**

కుమార్తెను మహర్షికి కన్యాదానం చేసిన అనరణ్యుని వృత్తాంతాన్ని విని, పర్వతరాజైన హిమవంతుడు చేతులు జోడించి, వసిష్ఠునితో మరల ఇలా పలికాడు.

**శైలేశ ఉవాచ** – పర్వతరాజు పలికాడు.

**వసిష్ఠ మునిశార్దూల బ్రహ్మపుత్ర కృపానిధే ।**
**అనరణ్యచరిత్రం తే కథితం పరమాద్భుతమ్ ॥3॥**

వసిష్ఠ మహర్షీ! నువ్వు బ్రహ్మపుత్రుడవు. కృపానిధివి. పరమాద్భుతమైన అనరణ్యుని వృత్తాంతాన్ని చెప్పావు.

**అనరణ్య సుతా యస్మాత్ పిప్పలాదం మునిం పతిమ్ ।**
**సంప్రాప్య కిమకార్షీత్సా తచ్చరిత్రం ముదావహమ్ ॥4॥**

అనరణ్యుని కుమార్తె పిప్పలాద మహర్షిని వివాహమాడిన తరువాత ఏమి జరిగింది? ఆనందాన్ని కలిగించే ఆమె చరిత్రను చెప్పు.

**వసిష్ఠ ఉవాచ** – వసిష్ఠుడు పలికాడు.

**పిప్పలాదో మునివరో వయసా జర్జరోధికః ।**
**గత్వా నిజాశ్రమం నార్యాఽనరణ్య సుతయా తయా ॥5॥**

పిప్పలాదుడు మునిముఖ్యుడు. వయస్సు వలన శరీరం శిథిలమైనవాడు. అనరణ్యుని కుమార్తెతో కలిసి తన ఆశ్రమంలో ప్రవేశించాడు.

**ఉవాస తత్ర సుప్రీత్యా తపస్వీ నాతిలంపటః ।**
**తత్రారణ్యే గిరివర స నిత్యం నిజధర్మకృత్ ॥6॥**

అచ్చట ఆనందంగా నివసించారు. ఆ తపస్వికి సంసార లంపటంపై మక్కువ అధికంగా లేదు. అతడా అరణ్యంలో తన నిత్య ధర్మానుష్ఠానాన్ని ఆచరిస్తూ ఉన్నాడు.

**అథానరణ్యకన్యా సా సిషేవే భక్తితో మునిమ్ ।**
**కర్మణా మనసా వాచా లక్ష్మీర్నారాయణం యథా ॥7॥**

అప్పుడా అనరణ్యుని కుమార్తె మనోవాక్కాయ కర్మలతో ఆ మహర్షిని, లక్ష్మీదేవి నారాయణుని వలె భక్తితో సేవించింది.

**ఏకదా స్వర్ణదీం స్నాతుం గచ్ఛంతీం సుస్మితాం చ తామ్ ।**
**దదర్శ పథి ధర్మశ్చ మాయయా నృపరూపధృక్ ॥8॥**

ఒకనాడామె ఆనందంతో గంగానదికి స్నానానికి పోతుండగా, రాజవేషధారియైన ధర్ముడు ఆమెను మార్గమధ్యంలో చూశాడు.

**చారురత్న రథస్థశ్చ నానాలంకారభూషితః ।**
**నవీన యౌవన శ్రీమాన్ కామదేవసమప్రభః ॥9॥**

**దృష్ట్వా తాం సుందరీం పద్మామువాచ స వృషో విభుః ।**
**విజ్ఞాతుం భావమంతః స్థం తస్యాశ్చ మునియోషితః ॥10॥**

సుందరమైన రత్నాలు పొదిగిన రథంపై అనేకాభరణాలచే అలంకరించుకొని, శ్రీమంతుడై నూతన యౌవనంతో మన్మథునితో సమానమైనకాంతి గల ఆ ధర్ముడు సుందరియు, మునిభార్యయు, పద్మయను పేరుకలదియునగు ఆమెను చూచి, ఆమె మనోగతాన్ని ఎరుగుటకు ఆమెతో ఇట్లు పలికాడు.

**ధర్మ ఉవాచ** – ధర్ముడు చెప్పాడు.

**అయి సుందరి లక్ష్మీర్త్వె రాజయోగ్యే మనోహరే ।**
**అతీవ యౌవనస్థే చ కామిని స్థిరయౌవనే ॥11॥**

ఓ సుందరీ! నీ సౌందర్యం మనోహరం. రాజయోగ్యమైనది. నీ యౌవనం నూతన ప్రాయంలో స్థిరమైయుంది.

**జరాతురస్య వృత్తస్య పిప్పలాదస్య వై మునేః ।**
**సత్యం వదామి తన్వంగి సమీపే నైవ రాజసే ॥12॥**

ముసలితనంచే వంగియున్న పిప్పలాద మహర్షియొక్క ప్రక్కన నీవు ప్రకాశించడం లేదుసుమా! నేను సత్యాన్నే పలుకుతున్నాను.

**విప్రం తపస్సు నిరతం నిర్ఘృణం మరణోన్ముఖమ్ ।**
**త్యక్త్వా మాం పశ్య రాజేంద్రం రతిశూరం స్మరాతురమ్ ॥13॥**

సర్వదా తపస్సులందు నిమగ్నమై యుండువాడు, జాలిలేనివాడు, మరణించడానికి సిద్ధంగా నున్నవాడునైన ఆ విప్రునివీడి, నన్ను చూడు. నేను రాజశ్రేష్ఠుడను. రతి శూరుడను. మన్మథపీడితుడను.

**ప్రాప్నోతి సుందరీ పుణ్యాత్సౌందర్యం పూర్వజన్మనః ।**
**సఫలం తద్భవేత్సర్వం రసికాలింగనేన చ ॥14॥**

స్త్రీకి పూర్వజన్మలో చేసుకున్న పుణ్యఫలం ఈ జన్మలో సౌందర్యం రూపంలో లభిస్తుంది. ఈ సౌందర్యమంతా రసికుని కౌగిలించుకున్నప్పుడే సార్థకమౌతుంది.

**సహస్ర సుందరీకాంతం కామశాస్త్ర విశారదమ్ ।**
**కింకరం కురు మాం కాంతే సంపరిత్యజ్య తం పతిమ్ ॥15॥**

ఓ సుందరీ! నేను వేయిమంది కాంతలకు భర్తను. కామశాస్త్ర విశారదుడను. ఆ భర్తను విడిచి నన్ను నీ సేవకునిగా చేసుకో.

**నిర్జనే కాననే రమ్యే శైలే శైలే నదీతటే ।**
**విహరస్వ మయా సార్ధం జన్మేదం సఫలం కురు ॥16॥**

నిర్జనారణ్యాలలో, సుందర పర్వతాలలో, నదీతీరాలలో, నాతోగూడి విహరించు. ఈ జన్మను సఫలం చేసుకో.

**వసిష్ఠ ఉవాచ –** వసిష్ఠుడు పలికాడు.

**ఇత్యేవముక్తవంతం సా స్వరథాదవరుహ్య చ ।**
**గ్రహీతు ముత్సుకం హస్తే తమువాచ పతివ్రతా ॥17॥**

ఇట్లు పలికి, తన రథంనుండి క్రిందికి దిగి, ఆమెను చేతితో పట్టుకోవడానికి తొందర పడుతున్న ధర్మునితో ఆ పతివ్రత ఇలా పలికింది.

**పద్మోవాచ –** పద్మ పలికింది.

**గచ్ఛ దూరం గచ్ఛ దూరం పాపిష్ఠస్త్వం నరాధిప ।**
**మాం చేత్పశ్యసి కామేన సద్యో నష్టో భవిష్యసి ॥18॥**

ఓ రాజా! నీవు పాపాత్ముడవు. దూరంగా పో! దూరంగా పో! నన్ను కామదృష్టితోచూస్తే నువ్వు వెంటనే నశిస్తావు.

**పిప్పలాదం మునిశ్రేష్ఠం తపసా పూతవిగ్రహమ్ ।**
**త్యక్త్వా కథం భజేయం త్వాం స్త్రీజితం రతిలంపటమ్ ॥19॥**

మునిశ్రేష్ఠుడు, తపస్సుచే పవిత్రమైన దేహం గలవాడు అయిన పిప్పలాద మహర్షిని వీడి, స్త్రీలచే జయింపబడి, రతిలంపటంలో తగుల్కొనియున్న నిన్ను నేనెలా సేవిస్తాను?

**స్త్రీజిత స్పర్శమాత్రేణ సర్వం పుణ్యం ప్రణశ్యతి ।**
**స్త్రీజితః పరపాపీ చ తద్దర్శన మఘావహమ్ ॥20॥**

స్త్రీలోలుని స్పృశించినంత మాత్రంచే పుణ్యమంతా నశిస్తుంది. స్త్రీలోలుడు పరమపాపి. వానినిచూస్తే పాపం చుట్టుకుంటుంది.

**సత్క్రియో హ్యశుచిర్నిత్యం స పుమాన్ యః స్త్రియాజితః ।**
**నిందంతి పితరో దేవా మానవా స్సకలాశ్చ తమ్ ॥21॥**

స్త్రీలోలుడు సత్క్రియలనాచరించినను, సర్వదా అపవిత్రుడే ఔతాడు. అతనిని పితృదేవతలు, దేవతలు, మానవులందరు నిందిస్తారు.

**తస్య కిం జ్ఞాన సుతపోజప హోమ ప్రపూజనైః ।**
**విద్యయా దానతః కిం వా స్త్రీభిర్యస్య మనోహృతమ్ ॥22॥**

ఎవని మనస్సు స్త్రీలయందు లగ్నమై యుంటుందో, అట్టివానికి జ్ఞానంతోగాని, తపస్సుచే గాని, జపహోమాదులతోగాని, విద్యతోగాని, దానంతోగాని, పనియేముంది?

**మాతరం మాం స్త్రియో భావం కృత్వా యేన బ్రవీషి హ ।**
**భవిష్యతి క్షయస్తేన కాలేన మమ శాపతః ॥23॥**

నీకు తల్లినైన నాయందు నీవు స్త్రీభావం కలిగి మాట్లాడావు. కాబట్టి నేను నిన్ను శపిస్తున్నాను. నీవు కాలక్రమంలో క్షయాన్ని పొందుదువుగాక!

**వసిష్ఠ ఉవాచ** – వసిష్ఠుడు పలికాడు.

**శ్రుత్వా ధర్మస్సతీశాపం నృపమూర్తిం విహాయ చ ।**
**ధృత్వా స్వమూర్తిం దేవేశః కంపమాన ఉవాచ సః ॥24॥**

ధర్ముడు పతివ్రత శాపాన్ని విని, రాజవేషాన్ని విడిచిపెట్టాడు. ఆ దేవదేవుడు నిజరూపం ధరించి, వణికిపోతూ ఇలా అన్నాడు.

**ధర్మ ఉవాచ** – ధర్ముడు పలికాడు.

**మాతర్జానీహి మాం ధర్మం జ్ఞానినాం చ గురోర్గురుమ్ ।**
**పరస్త్రీ మాతృబుద్ధిం చ కుర్వంతం సతతం సతి ॥25॥**

ఓ తల్లీ! నేను ధర్ముడనని తెలుసుకో, నేను జ్ఞానులకు, గురువులకుకూడా గురువును. నేను సర్వదా పరస్త్రీని మాతృభావంతోనే దర్శిస్తాను.

**అహం తవాంతరం జ్ఞాతుమాగతస్తవ సన్నిధిమ్ ।**
**తవాహం చ మనో జానే తథాపి విధినోదితః ॥26॥**

నేనే నీ మనస్సునెరుంగుదును. అయినప్పటికి విధిప్రేరితుడనై, నీలోని లోపాన్ని కనిపెట్టడానికి నీవద్దకు వచ్చాను.

**కృతం మే దమనం సాధ్వి న విరుద్ధం యథోచితమ్ ।**
**శాస్తిః సముత్పథస్థానా మీశ్వరేణ వినిర్మితా ॥27॥**

ఓ సాధ్వీ! నీవు నాకు తగిన శాస్తిని చేశావు. నువ్వు శపించడంలో తప్పులేదు. తప్పుమార్గంలో వెళ్ళువారికి ఈశ్వరుడు తగు శాస్తిని ఏర్పాటు చేస్తాడు.

**స్వయం ప్రదాతా సర్వేభ్యః సుఖదుఃఖ వరాన్ క్షమః ।**
**సంపదం విపదం యో హి నమస్తస్మై శివాయ హి ॥28॥**

సర్వప్రాణులకు సుఖదుఃఖాలను, వరాలను, స్వయంగా ఇచ్చువాడు, సంపదలను, ఆపదలను కలిగించడంలో సమర్థుడునగు శివునకు నమస్కారము.

**శత్రుం మిత్రం సంవిధాతుం ప్రీతిం చ కలహం క్షమః ।**
**స్రష్టుం నష్టుం చ యస్సృష్టిం నమస్తస్మై శివాయ హి ॥29॥**

శత్రుత్వాన్ని, మిత్రత్వాన్ని నెరపుటకు, ప్రీతిని చూపడానికి, కలహాన్ని కలిగించడానికి, సృష్టించడానికి, సృష్టినుపసంహరించడానికి, ఎవడు సమర్థుడో అట్టి శివునకు నమస్కారం.

**యేన శుక్లీకృతం క్షీరం జలే శైత్యం కృతం పురా ।**
**దాహీకృతో హుతాశశ్చ నమస్తస్మై శివాయ హి ॥30॥**

ఎవడు పాలను తెల్లగా చేశాడో, సృష్ట్యాదియందు నీటిలో చల్లదనాన్ని ఎవడు నింపాడో, అగ్నిని వేడిగా ఎవడు నిర్మించాడో, అట్టి శివునకు నమస్కారం.

**ప్రకృతిర్నిర్మితా యేన తప్త్వాతి మహదాదితః ।**
**బ్రహ్మవిష్ణు మహేశాద్యా నమస్తస్మై శివాయ హి ॥31॥**

ఎంతయో ఆలోచించి, మహదాదిక్రమంలో ప్రకృతినుండి ఎవడైతే సృష్టినిచేసి, బ్రహ్మవిష్ణు రుద్రాదులను కూడా సృష్టించాడో, అట్టి శివునకు నమస్కారం.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా పురతస్తస్యాస్తస్థౌ ధర్మో జగద్గురుః ।**
**కించిన్నోవాచ చకితస్తత్పాతివ్రత్య తోషితః ॥32॥**

జగద్గురువైన ధర్ముడిట్లు పలికి ఆమె ఎదుట నిలబడ్డాడు. ఆమె పాతివ్రత్యంతో సంతోషాన్ని, విస్మయాన్ని పొందిన ధర్ముడేమీ మాట్లాడక మిన్నకున్నాడు.

**పద్మాపి నృపకన్యా సా పిప్పలాద ప్రియా తదా ।**
**సాధ్వీ తం ధర్మమాజ్ఞాయ విస్మితోవాచ పర్వత ॥33॥**

రాజకుమార్తెయును, పిప్పలాదుని పత్నియు, మహాసాధ్వియునైన పద్మకూడా అతడు ధర్ముడని తెలిసి, విస్మయాన్ని పొంది, ఇట్లు పలికింది.

**పద్మోవాచ –** పద్మ పలికింది.

**త్వమేవ ధర్మ సర్వేషాం సాక్షీ నిఖిల కర్మణామ్ ।**
**కథం మనో మే విజ్ఞాతుం విడంబయసి మాం విభో ॥34॥**

ఓ ధర్మా! సర్వప్రాణుల సర్వకర్మలకు సాక్షివైన నీవు నా మనస్సును తెలుసుకోవడానికి ప్రయత్నించడం ఎలా పొసగుతుంది? నువ్వు నన్ను మోసగిస్తున్నావు.

**యత్తత్సర్వం కృతం బ్రహ్మన్ నాపరాధో బభూవ మే ।**
**త్వం చ శప్తో మయాజ్ఞానాత్ స్త్రీ స్వభావాద్వృథా వృష ॥35॥**

ఓ ధర్మా! బ్రహ్మస్వరూపా! జరిగినదానినంతట్లో నా అపరాధమేమీలేదు. నా అజ్ఞానం వలనను, స్త్రీ స్వభావం వల్లను నిన్ను వృథాగా శపించాను.

**కా వ్యవస్థా భవేత్తస్య చింతయామీతి సాంప్రతమ్ ।**
**చిత్తే స్ఫురతు సా బుద్ధిర్యయాశం సంల్లభామి వై ॥36॥**

ఆ శాపానికిప్పుడు ఎట్టి వ్యవస్థ చేయాలి అని నేను ఆలోచిస్తున్నాను. నా మనస్సులో చక్కని మార్గం స్ఫురిస్తే నాకు శాంతి కలుగుతుంది.

**ఆకాశోஉసౌ దిశస్సర్వా యది నశ్యంతు వాయవః ।**
**తథాపి సాధ్వీ శాపస్తు న నశ్యతి కదాచన ॥37॥**

ఈ ఆకాశం, సర్వదిక్కులు, వాయువు నశించినప్పటికి పతివ్రత శాపంమాత్రం ఎప్పటికి వ్యర్థంకాదు.

**సత్యే పూర్ణ శ్చతుష్పాదః పౌర్ణమాస్యాం యథా శశీ ।**
**విరాజసే దేవరాజ సర్వకాలం దివానిశమ్ ॥38॥**

ఓ దేవరాజా! నీవు సత్యయుగంలో పూర్ణిమనాటి చంద్రునివలె సంపూర్ణంగా నాలుగు పాదాలతో రాత్రింబవళ్ళు అన్నికాలాలలోను విరాజిల్లుతావు.

**త్వం చ నష్టో భవసి చేత్సృష్టినాశో భవేత్తదా ।**
**ఇతి కర్తవ్యతా మూఢో వృథాపి చ వదామ్యహమ్ ॥39॥**

నీవు నశిస్తే సృష్టియే నశించిపోతుంది. ఏమిచేయాలో నాకు తెలియడంలేదు. వ్యర్థంగా శపించాను. అయినను ఉపాయాన్ని చెబుతున్నాను.

**పాదక్షయశ్చ భవితా త్రేతాయాం చ సురోత్తమ ।**
**పాదోఽపరో ద్వాపరే చ తృతీయోఽపి కలౌ విభో ॥40॥**

ఓ దేవోత్తమా! నీకు త్రేతాయుగంలో ఒకపాదం, ద్వాపరంలో రెండుపాదాలు, కలియుగంలో మూడు పాదాలు క్షయాన్ని పొందుతాయి.

**కలిశేషేఽఖిలాశ్ఛిన్నా భవిష్యన్తి తవాంఘ్రయః ।**
**పునస్సత్యే సమాయాతే పరిపూర్ణో భవిష్యసి ॥41॥**

కలియుగం అంతిమభాగంలో పాదాదులన్నీ ఛిన్నమౌతాయి. మరలా సత్యయుగం రాగానే పరిపూర్ణుడవై, వెలుగొందుతావు.

**సత్యే సర్వవ్యాపకస్త్వం తదన్యేషు చ కుత్రచిత్ ।**
**యుగవ్యవస్థయా స త్వం భవిష్యసి తథా తథా ॥42॥**

సత్యయుగంలో నీవు సర్వవ్యాపకుడవై ఉంటావు. తక్కిన యుగాలలో నీవ్యాప్తి కొన్ని స్థలాలకు మాత్రమే పరిమితం. నీవు యుగవ్యవస్థననుసరించి, వృద్ధిక్షయాలు పొందగలవు.

**ఇత్యేవం వచనం సత్యం మమాస్తు సుఖదం తవ ।**
**యామ్యహం పతిసేవాయై గచ్ఛ త్వం స్వగృహం విభో ॥43॥**

నాయీ మాటలు నీకు సుఖాన్ని కలిగించుగాక! నేను సత్యాన్నే పలికాను. ఓవిభూ! నేను పతిసేవ కొరకు వెళుతున్నాను. నీ గృహానికి నీవు చేరుకో.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్యా స్సంతుష్టోఽభూద్వృష స్స వై ।**
**తదేవం వాదినీం సాధ్వీమువాచ విధినందన ॥44॥**

ఓ నారదా! ధర్ముడామె మాటలు విని సంతుష్టుడయ్యాడు. అంతేగాక అతడు ఆ పతివ్రతతో ఇలా అన్నాడు.

**ధర్మ ఉవాచ –** ధర్ముడు పలికాడు.

**ధన్యాసి పతిభక్తాపి స్వస్తి తేఽస్తు పతివ్రతే ।**
**వరం గృహాణ త్వత్స్వామీ త్వత్పరిత్రాణ కారణాత్ ॥45॥**

ఓ పతివ్రతా! నీవు ధన్యురాలవు. పతిభక్తిగలనీకు మంగళమౌగాక! వరాన్ని కోరుకో, నీభర్త నిన్ను రక్షించాలిగదా!

**యువా భవతు తే భర్తా రతిశూరశ్చ ధార్మికః ।**
**రూపవాన్ గుణవాన్ వాగ్మీ సంతత స్థిర యౌవనః ॥46॥**

కాబట్టి నీభర్త యువకుడు, రతిశూరుడు, ధార్మికుడు, రూపవంతుడు, గుణవంతుడు, వాగ్మి, సతతం స్థిర యౌవనం కలవాడూ అగుగాక!

**చిరంజీవీ స భవతు మార్కండేయాత్పరశ్శుభే ।**
**కుబేరాద్ధనవాంశ్చైవ శక్రాదైశ్వర్యవానపి ॥47॥**

**శివభక్తో హరి సమస్సిద్ధస్తు కపిలాత్పరః ।**
**బుద్ధ్యా బృహస్పతిసమః నమత్వేన విధేస్సమః ॥48॥**

నీభర్త మార్కండేయునికంటె అధికమైన చిరంజీవియు, కుబేరునికంటే అధికమైన ధనవంతుడు, ఇంద్రునికంటె అధిక ఐశ్వర్యం కలవాడు, విష్ణువుతో సమానమైన శివభక్తి కలవాడు, కపిలునికంటె గొప్ప సిద్ధుడు, బృహస్పతితో సమానమైన బుద్ధిశాలి, బ్రహ్మతో సమమైన సమత్వం కలవాడునూ అగుగాక!

**స్వామిసౌభాగ్యసంయుక్తా భవ త్వం జీవనావధి ।**
**తథా చ సుభగే దేవి త్వం భవ స్థిరయౌవనా ॥49॥**

ఓ సుందరీ! నీవు జీవించినంతకాలం భర్తృసౌభాగ్యంతో అలరారు. నీ యౌవనం స్థిరంగా నుండగలదు.

**మాతా త్వం దశపుత్రాణాం గుణినాం చిరజీవినామ్ ।**
**స్వభర్తు రధికానాం చ భవిష్యసి న సంశయః ॥50॥**

నీభర్త కంటే అధిక గుణవంతులు, చిరంజీవులునైన పదిమంది పుత్రులకు నీవు తల్లివి కాగలవు. ఇందులో సందేహం లేదు.

**గృహా భవంతు తే సాధ్వి సర్వసంపత్సమన్వితాః ।**
**ప్రకాశవంతస్సతతం కుబేరభవనాధికాః ॥51॥**

ఓ సాధ్వీ! నీగృహం సర్వసంపదలతోకూడి, కుబేరుని భవనంకంటే అధికంగా సర్వకాలాలలో విలసిల్లుగాక!

**వసిష్ఠ ఉవాచ** - వసిష్ఠుడు పలికాడు.

**ఇత్యేవముక్త్వా సన్తస్థౌ ధర్మస్స గిరిసత్తమ ।**
**సా తం ప్రదక్షిణీకృత్య ప్రణమ్య స్వగృహం యయౌ ॥52॥**

ఓ పర్వతరాజా! ధర్ముడిట్లు పలికి, నిలబడియున్నాడు. ఆమె అతనికి ప్రదక్షిణ చేసి, నమస్కరించి, తన గృహానికి వెళ్ళింది.

**ధర్మస్తథాశిషో దత్త్వా జగామ నిజమందిరమ్ ।**
**ప్రశశంస సతాం ప్రీత్యా పద్మాం సంసది సంసది ॥53॥**

ధర్ముడీవిధంగా ఆమెకు ఆశీర్వచనాలు పలికి, తనగృహానికి వెళ్ళాడు. అంతేకాదు అతడు ప్రతిసభయందు ఆమెను ప్రీతితో కొనియాడాడు.

**సా రేమే స్వామినా సార్ధం యూనా రహసి సంతతమ్ ।**
**పశ్చాద్బభూవు స్సత్పుత్రాస్తద్భర్తు రధికా గుణైః ॥54॥**

ఆమె యువకుడైన తన భర్తతో నిరంతరం ఏకాంతంగా రమించింది. అనంతరం ఆమెకు తన భర్తకంటే అధికమైన గుణవంతులైన పుత్రులు కలిగారు.

**బభూవ సకలా సంపద్దంపత్యోః సుఖవర్ధినీ ।**
**సర్వానందవృద్ధికరీ పరత్రేహ చ శర్మణే ॥55॥**

సమస్తానందాలను వృద్ధిపొందించి, ఇహపర సుఖశాంతులను కలిగించే సంపదలన్నీ ఆ దంపతులకు లభించాయి.

**శైలేంద్ర కథితం సర్వమితిహాసం పురాతనమ్ ।**
**దంపత్యోశ్చ తయోః ప్రీత్యా శ్రుతం తే పరమాదరాత్ ॥56॥**

ఓ శైలేంద్రా! నీకీ పురాతనమైన ఇతిహాసాన్ని సంపూర్ణంగా చెప్పాను. ఆ దంపతుల చరిత్రను నీవు ప్రీతితో, మహాదరంతో విన్నావు.

**బుద్ధ్వా తత్త్వం సుతాం దేహి పార్వతీ మీశ్వరాయ చ ।**
**కురుషం త్యజ శైలేంద్ర మేనయా స్వస్త్రియా సహ ॥57॥**

ఓ పర్వతరాజా! నీవు తత్త్వాన్ని యెరింగి, నీకుమార్తెయైన పార్వతిని శివునకిమ్ము. నీవు నీ భార్యయైన మేనాదేవియు, చెడ్డదైన రోషాన్ని విడిచిపెట్టండి.

**సప్తాహే సమతీతే తు దుర్లభేతిశుభే క్షణే ।**
**లగ్నాధిపే చ లగ్నస్థే చంద్రే స్వతనయాన్వితే ॥58॥**

**ముదితే రోహిణీయుక్తే విశుద్ధే చంద్రతారకే ।**
**మార్గమాసే చంద్రవారే సర్వదోష వివర్జితే ॥59॥**

**సర్వసద్గ్రహ సంస్పృష్టేఽసద్గ్రహ దృష్టి వర్జితే ।**
**సదపత్యప్రదే జీవే పతిసౌభాగ్యదాయినీ ॥60॥**

**జగదంబాం జగత్పిత్రే మూలప్రకృతి మీశ్వరీమ్ ।**
**కన్యాం ప్రదాయ గిరిజాం కృతీ త్వం భవ పర్వత ॥61॥**

ఏడు రోజులు గడిచిన తర్వాత దుర్లభము శుభమునైన ముహూర్తంలో లగ్నాధిపుడైన చంద్రుడు తన కుమారుడైన బుధునితో కలసి, లగ్నంలోనుండి, ఆనందంతో రోహిణితో కలిసియుండగా, చంద్రుడు నక్షత్రాలు స్వచ్ఛంగా ప్రకాశిస్తుండగా మార్గశీర్ష మాసంలో ఏదోషమూలేని సోమవారంనాడు మంచిగ్రహా లన్నింటితో కూడియున్నదియు, చెడు గ్రహాల దృష్టి లేనిదియు, మంచి సంతానయోగం కలదియు, భర్తజీవించియుండే సౌభాగ్యాన్నిచ్చే సుముహూర్తంలో జగన్మాత మూలప్రకృతి, ఈశ్వరి, కన్యయునైన పార్వతిని జగత్పితయైన శంభునకిచ్చి వివాహం చేయుము. ఓ పర్వతరాజా! నీవిట్లుచేసి కృతార్థుడవు కమ్ము.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా మునిశార్దూలో వసిష్ఠో జ్ఞాని సత్తమః ।**
**విరరామ శివం స్మృత్వా నానాలీలాకరం ప్రభుమ్ ॥62॥**

మునిశ్రేష్ఠుడు, జ్ఞానులలో ఉత్తముడునైన వసిష్ఠుడీవిధంగా పలికి, నానాలీలాకరుడైన శివప్రభుని స్మరించి విరమించాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే పద్మా పిప్పలాదచరితమ్ నామ పంచత్రింశోఽధ్యాయః ॥35॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో పద్మా పిప్పలాదుల చరిత్ర అనే ముప్పై ఐదవ అధ్యాయం సమాప్తం.

## షట్ త్రింశోఽధ్యాయః – ముప్పై ఆరవ అధ్యాయం
## సప్తర్షీణాముపదేశః – సప్తర్షులు హిమవంతునకు ఉపదేశించుట

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**వసిష్ఠస్య వచః శ్రుత్వా సగణోఽపి హిమాలయః ।**
**విస్మితో భార్యయా శైలానువాచ స గిరీశ్వరః ॥1॥**

వసిష్ఠుని మాటను విని, బంధవులతో, భార్యతో కూడియున్న పర్వతరాజగు హిమవంతుడు ఇతర పర్వతాలతో ఇట్లన్నాడు.

**హిమాలయ ఉవాచ** – హిమవంతుడు పలికాడు.

**హే మేరో గిరిరాట్ సహ్య గంధమాదన మందర ।**
**మైనాక వింధ్య శైలేంద్రాస్సర్వే శృణుత మద్వచః ॥2॥**

పర్వతరాజగు ఓ మేరుపర్వతమా! సహ్య, గంధమాధన, మందర, మైనాక, వింధ్య పర్వత శ్రేష్ఠులారా! మీరందరు నామాట వినండి.

**వసిష్ఠో హి వదత్యేవం కిం మే కార్యం విచార్యతే ।**
**యథా తథా చ శంసధ్వం నిర్ణీయ మనసాఖిలమ్ ॥3॥**

వసిష్ఠుడిలా చెబుతున్నాడు. 'నాకర్తవ్యమేమిటి? అనే విషయాన్ని విచారించి, సర్వం మనస్సులో నిర్ణయించి, మీరు నాకు చెప్పండి.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**తచ్ఛ్రుత్వా వచనం తస్య సుమేరు ప్రముఖాశ్చ తే ।**
**ప్రోచుర్హిమాలయం ప్రీత్యా సునిర్ణీయ మహీధరాః ॥4॥**

హిమవంతుని మాటలు విని, మేరువు మున్నగు పర్వత ప్రముఖులు చక్కగా నిర్ణయించి, హిమవంతునితో ప్రీతితో ఇలా చెప్పారు.

**శైలా ఊచుః** – పర్వతాలు పలికాయి.

**అధునా కిం విమర్శేన కృతం కార్యం తథైవ హి ।**
**ఉత్పన్నేయం మహాభాగా దేవకార్యార్థమేవ హి ॥5॥**

ఇప్పుడు విమర్శించి, ప్రయోజనమేమి? కర్తవ్యాన్ని అనుష్ఠించాలి. ఈమె దేవకార్యం కొరకు మాత్రమే జన్మించింది.

**ప్రదాతవ్యా శివాయేతి శివస్యార్థేఽవతారిణీ ।**
**అనయారాధితో రుద్రో రుద్రేణ యది భాషితా ॥6॥**

ఈమె రుద్రుని ఆరాధించింది. రుద్రుడు ఈమెతో సంభాషించాడు. ఈమె రుద్రునికొరకే అవతరించింది. కాబట్టి ఈమెను రుద్రునకిచ్చి వివాహం చేయి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏతచ్ఛ్రుత్వా వచస్తేషాం మేర్వాదీనాం హిమాచలః ।**
**సుప్రసన్నతరోఽభూద్వై జహాస గిరిజా హృది ॥7॥**

మేరువు మున్నగువారి మాటలను విని, హిమాచలుడు మిక్కిలి ప్రసన్నుడయ్యాడు. పార్వతి తన మనస్సులో నవ్వుకుంది.

**అరుంధతీ చ తాం మేనాం బోధయామాస కారణాత్ ।**
**నానావాక్య సమూహేనేతిహాసైర్వివిధైరపి ॥8॥**

అరుంధతి మేనకకు అనేక యుక్తులను, వివిధమైన ఇతిహాసాలను చెప్పి ఆమెను ఒప్పించింది.

**అథ సా మేనకా శైలపత్నీ బుద్ధ్వా ప్రసన్నధీః ।**
**మునీనరుంధతీం శైలం భోజయిత్వా బుభోజ చ ॥9॥**

అప్పుడు హిమవంతుని పత్నియైన మేనక అంతయు తెలుసుకొని, ప్రసన్నయై, సప్తర్షులకు, అరుంధతికి భోజనంపెట్టి, తాను భుజించింది.

**అథ శైలవరో జ్ఞానీ సుసంసేవ్య మునీంశ్చ తామ్ ।**
**ఉవాచ ప్రాంజలిః ప్రీత్యా ప్రసన్నాత్మా గతభ్రమః ॥10॥**

అంతట జ్ఞానియైన హిమవంతుడు ప్రసన్నమైన మనస్సు గలవాడై, భ్రమలు తొలగినవాడై, మునులను, అరుంధతిని చక్కగా సేవించి, చేతులు జోడించి, ప్రీతిపూర్వకంగా ఇలా పలికాడు.

**హిమాచల ఉవాచ** - హిమవంతుడు పలికాడు.

**సప్తర్షయో మహాభాగా వచః శృణుత మామకమ్ ।**
**విస్మయో మే గతస్సర్వ శ్శివయోశ్చరితం శ్రుతమ్ ॥11॥**

ఓ సప్తర్షులారా! మహాత్ములారా! నామాట వినండి. నాకు గల గర్వమంతా తొలగిపోయింది. ఉమామహేశ్వరుల చరిత్రను విన్నాను.

**మదీయం చ శరీరం వై పత్నీ మేనా సుతాస్సుతా ।**
**ఋద్ధిస్సిద్ధిశ్చ చాన్యద్వై శివస్యైవ న చాన్యథా ॥12॥**

నాశరీరం, భార్యయైన మేనాదేవి, కుమారులు, కుమార్తె, సాధన సంపత్తి, సిద్ధి తదితరాలు, అన్నీ శివునికి చెందినవే గాని మరియొకటి కాదు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా స తదా పుత్రీం దృష్ట్వా తత్సాదరం చ తామ్ ।**
**భూషయిత్వా తదంగాని ఋష్యుత్సంగే న్యవేశయేత్ ॥13॥**

హిమవంతుడిట్లు పలికి తన కుమార్తెను ప్రేమతో వీక్షించి, ఆమెనలంకరింపజేసి, మహర్షి ఒడిలో కూర్చుండబెట్టాడు.

**ఉవాచ చ పునః ప్రీత్యా శైలరాజా ఋషీంస్తదా ।**
**అయం భాగో మయా తస్మై దాతవ్య ఇతి నిశ్చితమ్ ॥14॥**

ఆ పర్వతరాజు సప్తర్షులతో తిరిగి ఇలాపలికాడు. "ఈభాగం శివునకీయదగిందని నిశ్చయించు కున్నాను".

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**శంకరో భిక్షుకస్తేఽథ స్వయం దాతా భవాన్ గిరే ।**
**భైక్ష్యం చ పార్వతీదేవీ కిమతః పరముత్తమమ్ ॥15॥**

ఓ పర్వతరాజా! యాచించేవాడు శంకరుడు. దాతవు స్వయంగా నీవే. యాచింపబడేది పార్వతీదేవి. ఇంతకంటె పరమోత్తమమైన సన్నివేశం వేరొకటి ఏముంటుంది?

**హిమవన్ శిఖరాణాం తే యద్ధేతో స్సదృశీ గతిః ।**
**ధన్యస్త్వం సర్వశైలానా మధిపస్సర్వతో వరః ॥16॥**

ఓ హిమవంతుడా! నీ ప్రవర్తన నీ శిఖరాలవలె ఉన్నతమైనది. పర్వత శ్రేష్ఠుడవైన నువ్వు అందరికంటె శ్రేష్ఠుడవు. ధన్యుడవు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏవముక్త్వా తు కన్యాయై మునయో విమలాశయాః ।**
**ఆశిషం దత్తవంతస్తే శివాయ సుఖదా భవ ॥17॥**

పవిత్ర హృదయులైన మహర్షులిట్లు పలికి, "శివునికి సుఖాన్నిచ్చుదానవు కమ్ము". అని పార్వతిని ఆశీర్వదించారు.

**స్పృష్ట్వా కరేణ తాం తత్ర కల్యాణం తే భవిష్యతి ।**
**శుక్లపక్షే యథా చంద్రో వర్ధంతాం తద్గుణాస్తథా ॥18॥**

వారు పార్వతిని చేతితో స్పృశించి, "నీకు కల్యాణమౌగాక! శుక్లపక్షచంద్రునివలె నీ గుణాలు వృద్ధిపొందునుగాక!" అని ఆశీర్వదించారు.

**ఇత్యుక్త్వా మునయస్సర్వే దత్త్వా తే గిరయే ముదా ।**
**పుష్పాణి ఫలయుక్తాని ప్రత్యయం చక్రిరే తదా ॥19॥**

మహర్షులందరూ ఇట్లు పలికి, హిమవంతునికి ఫలపుష్పాలను ఆనందంతో ఇచ్చి, విశ్వాసాన్ని కలిగించారు.

**అరుంధతీ తదా తత్ర మేనాం సా సుముఖీ ముదా ।**
**గుణైశ్చ లోభయామాస శివస్య పరమా సతీ ॥20॥**

గొప్ప శివభక్తురాలు, సాధ్వి, సుందరియునైన అరుంధతి శివుని గుణసంపదచే మేనకను లోభపడేటట్లు చేసుకుంది.

**హరిద్రాకుంకుమై శ్శైల శ్మశ్రూణి ప్రత్యమార్జయత్ ।**
**లౌకికాచారమాధాయ మంగళాయనముత్తమమ్ ॥21॥**

మంగళాలకు నిలయమూ, ఉత్తమమూ అయిన లోకాచారాన్ననుసరించి ఆమె హిమవంతుని మీసాలకు పసుపుకుంకుమల లేపనం చేసింది.

**తతశ్చ తే చతుర్థేఽహ్ని సంధార్య లగ్నముత్తమమ్ ।**
**పరస్పరం చ సంతుష్య సంజగ్ముశ్శివసన్నిధిమ్ ॥22॥**

తదనంతరం నాల్గవ రోజున ఉత్తమ లగ్నాన్ని నిర్ణయించి, పరస్పరం సన్మానించుకుని శివుని సన్నిధికి వెళ్ళారు.

**తత్ర గత్వా శివం నత్వా స్తుత్వా వివిధసూక్తిభిః ।**
**ఊచుః సర్వే వసిష్ఠాద్యా మునయః పరమేశ్వరమ్ ॥23॥**

వసిష్ఠాది సప్తర్షులు కైలాసానికి వెళ్ళి, శివునకు నమస్కరించి, అనేక సూక్తులచే స్తుతించి, పరమేశ్వరునితో ఇట్లన్నారు.

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**దేవదేవ మహాదేవ పరమేశ మహాప్రభో ।**
**శృణ్వస్మద్వచనం ప్రీత్యా యత్కృతం సేవకైస్తవ ॥24॥**

ఓ దేవదేవా! మహాదేవా! పరమేశా! మహాప్రభో! నీ సేవకులమైన మేము చేసిన కార్యాన్ని గురించి చెబుతాను. మా మాటలను ప్రీతితో వినండి.

**బోధితో గిరిరాజశ్చ మేనా వివిధసూక్తిభిః ।**
**సేతిహాసం మహేశాన ప్రబుద్ధోఽసౌ న సంశయః ॥25॥**

ఓ మహేశ్వరా! మేనా హిమవంతులకు అనేక సూక్తులను, ఇతిహాస దృష్టాంతాలను బోధించి, సత్యాన్ని తెలుసుకొనేటట్లు చేశాం. ఇందులో సందేహం లేదు.

**వాక్యదత్తా గిరీంద్రేణ పార్వతీ తే హి నాన్యథా ।**
**ఉద్వాహాయ ప్రగచ్ఛ త్వం గణైర్దేవైశ్చ సంయుతః ॥26॥**

పర్వతరాజు పార్వతిని నీకు వాగ్దత్తం చేశాడు. కాబట్టి వేరేవిధంగా జరగదు. నీవు దేవతలతోను, గణాలతోను గూడి, వివాహానికి తరలివెళ్ళు.

**గచ్ఛ శీఘ్రం మహాదేవ హిమాచలగృహం ప్రభో ।**
**వివాహయ యథా రీతిః పార్వతీ మాత్మజన్మనే ॥27॥**

ఓ మహాదేవా! ప్రభూ! నీవు పార్వతిని వివాహమాడి, పుత్రసంతానాన్ని పొందవలసియుంది. కాబట్టి శీఘ్రంగా హిమవంతుని గృహానికి బయలుదేరండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు,

**తచ్ఛ్రుత్వా వచనం తేషాం లౌకికాచారతత్పరః ।**
**ప్రహృష్టాత్మా మహేశానః ప్రహస్యేదమువాచ సః ॥28॥**

లౌకికాచార తత్పరుడైన మహేశ్వరుడు మిక్కిలి సంతసించిన మనస్సు కలవాడై, వారి మాటలను విని, నవ్వి, ఇలా పలికాడు.

**మహేశ ఉవాచ –** మహేశ్వరుడు పలికాడు.

**వివాహో హి మహాభాగా న దృష్టో న శ్రుతో మయా ।**
**యథా పురా భవద్భిస్తద్విధిః ప్రోచ్యో విశేషతః ॥29॥**

మహాత్ములారా! నేను వివాహం గురించి వినలేదు. చూడలేదు. మీరు పూర్వం వివాహ విధిని గురించి విశేషంగా వివరించారుగదా! ఆ వివరాలు నాకు చెప్పండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**తదాకర్ణ్య మహేశస్య లౌకికం వచనం శుభమ్ ।**
**ప్రత్యూచుః ప్రహసంతస్తే దేవదేవం సదాశివమ్ ॥30॥**

మహేశుని శుభకరమైన లౌకిక వచనాన్ని విని, వారు నవ్వి, దేవదేవుడైన సదాశివునికి ఇలా బదులు పలికారు.

**ఋషయ ఊచుః –** ఋషులు పలికారు.

**విష్ణుమాహూయ వై శీఘ్రం ససమాజం విశేషతః ।**
**బ్రహ్మాణం ససుతం ప్రీత్యా తథా దేవం శతక్రతుమ్ ॥31॥**

పరివారంతో కూడిన విష్ణువును వెంటనే ప్రత్యేకంగా ఆహ్వానించండి. కుమారులతోకూడిన బ్రహ్మను, అట్లే ఇంద్రుని ప్రీతిపూర్వకంగా ఆహ్వానించండి.

**తథా ఋషిగణాన్ సర్వాన్ యక్ష గంధర్వ కిన్నరాన్ ।**
**సిద్ధాన్ విద్యాధరాంశ్చైవ తథా చైవాప్సరో గణాన్ ॥32॥**

అట్లే సర్వఋషి గణాలను, యక్ష, గంధర్వ, కిన్నరులను, సిద్ధులను, విద్యాధరులను, అప్సరోగణాన్ని పిలిపించండి.

**ఏతాంశ్చాన్యాన్ ప్రభో సర్వానానయస్వేహ సాదరమ్ ।**
**సర్వం స సాధయిష్యంతి త్వత్కార్యం తే న సంశయః ॥33॥**

ఓ ప్రభూ! వీరితోబాటు ఇతరులందరినికూడా ఇచ్చటకు సాదరంగా పిలిపించండి. వారు ఈకార్యాన్నంతటిని చక్కబెట్టగలరు. సందేహం లేదు.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా సప్తఋషయస్తదాజ్ఞాం ప్రాప్యతే ముదా ।**
**స్వధామ ప్రయయుస్సర్వే శంసంతః శంకరీం గతిమ్ ॥34॥**

సప్తర్షులిట్లుపలికి, శివుని ఆజ్ఞను పొంది, శంకరుని మహిమను కొనియాడుతు వారందరు ఆనందంతో తమ ఆశ్రమాలకు వెళ్ళారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే సప్తర్షీణాముపదేశః నామ షట్‌త్రింశోऽధ్యాయః ॥36॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో సప్తర్షులు హిమవంతునకు ఉపదేశించుట అనే ముప్పై ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్త త్రింశోఽధ్యాయః – ముప్పై ఏడవ అధ్యాయం
## లగ్నపత్రసంప్రేషణ, సామగ్రీసంగ్రహ, శైలాగమనవర్ణనమ్ –
లగ్నపత్రమును పంపుట, సామగ్రి సమకూర్చుకొనుట, పర్వతముల రాక

**నారద ఉవాచ –** నారదుడు చెప్పాడు.

**తాత ప్రాజ్ఞ వదేదానీం సప్తర్షిషు గతేషు చ ।**
**కిమకార్షీద్ధిమగిరిస్తన్మే కృత్వా కృపాం ప్రభో ॥1॥**

తండ్రీ! ప్రాజ్ఞా! ప్రభూ! నాయందు దయయుంచి సప్తర్షులు వెళ్ళిన పిదప హిమవంతుడేమి చేశాడు? ఆ వృత్తాంతాన్ని నాకు చెప్పండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**గతేషు తేషు మునిషు సప్తస్వపి మునీశ్వర ।**
**సారుంధతీషు హిమవాన్ యదకార్షీద్బ్రవీమి తే ॥2॥**

ఓ నారద మునీశ్వరా! అరుంధతితోకూడి సప్తర్షులు వెళ్ళిన పిదప హిమవంతుడు ఏమిచేశాడనే విషయాన్ని నీకు చెబుతాను.

**తత ఆమంత్ర్య స్వభ్రాతౄన్ మేర్వాదీన్ స సుతప్రియః ।**
**మహామనాస్స ముముదే హిమవాన్ పర్వతేశ్వరః ॥3॥**

మహాత్ముడు, పరమేశ్వరుడునగు హిమవంతుడు మేరువు మున్నగు తన సోదరులను, కుమారులను, బంధువులను, ఆహ్వానించి, ఆనందించాడు.

**తదాజ్ఞప్తస్తతః ప్రీత్యా హిమవాన్ లగ్నపత్రికామ్ ।**
**లేఖయామాస సుప్రీత్యా గర్గేణ స్వపురోధసా ॥4॥**

మహర్షుల ఆజ్ఞ ప్రకారం హిమవంతుడు తన పురోహితుడైన గర్గునిచేత ప్రీతిపూర్వకంగా లగ్నపత్రికను వ్రాయించాడు.

**అథ ప్రస్థాపయామాస తాం శివాయ సపత్రికామ్ ।**
**నానావిధాస్తు సామగ్ర్యః స్వజనైర్ముదితాత్మభిః ॥5॥**

ఆ పత్రికను అనేక విధాలైన వస్తువులను, ఆనందంతో నిండిన హృదయంగల బంధువులతో హిమవంతుడు శివునకు పంపించాడు.

**తే జనాస్తత్ర గత్వా చ కైలాసే శివసన్నిధిమ్ ।**
**దదుశ్శివాయ తత్పత్రం తిలకం సంవిధాయ చ ॥6॥**

ఆ జనులు కైలాసంలోని శివుని సన్నిధికిచేరి, ఆ పత్రానికి తిలకమద్ది శివునకు సమర్పించారు.

**సన్మానితా విశేషేణ ప్రభుణా చ యథోచితమ్ ।**
**సర్వే తే ప్రీతమనస ఆజగ్ము శ్శైలసన్నిధిమ్ ॥7॥**

ఆ ప్రభువు వారందరికి యథాయోగ్యంగా ప్రత్యేక సన్మానం చేయగా వారు ప్రీతమనస్కులై, పర్వతుని సన్నిధికి మరలివచ్చారు.

**సన్మానితాన్ విశేషేణ మహేశేనాగతాన్ జనాన్ ।**
**దృష్ట్వా సుహర్షితాన్ శైలో ముమోదాతీవ చేతసి ॥8॥**

మహేశ్వరునిచే ప్రత్యేకంగా సన్మానింపబడి, మిక్కిలి ఆనందంతో తిరిగివచ్చిన జనులను చూచి, పర్వతరాజు మనస్సులో చాలా సంతోషించాడు.

**తతో నిమంత్రణం చక్రే స్వబంధూనాం ప్రమోదితః ।**
**నానాదేశ స్థితానాం చ నిఖిలానాం సుఖాస్పదమ్ ॥9॥**

అపుడాయన ఆనందంతో అనేక దేశాలందున్న తన బంధువులందరికి ప్రీతికరమైన ఆహ్వానాన్ని పంపాడు.

**తతస్స కారయామాస స్వర్ణ సంగ్రహ మాదరాత్ ।**
**నానావిధాశ్చ సామగ్రీ ర్వివాహ కరణోచితాః ॥10॥**

అనంతరం ఆయన వివాహానికి కావలసిన వివిధ సామగ్రులను, బంగారాన్ని శ్రద్ధతో ప్రోగుజేయజొచ్చెను.

**తండులానాం బహూన్ శైలాన్ పృథుకానాం తథైవ చ ।**
**గుడానాం శర్కరాణాం చ లవణానాం తథైవ చ ॥11॥**

బియ్యం, అటుకులు, బెల్లం, పంచదార, లవణం మున్నగునవి పర్వత శిఖరాలవలె గుట్టలుగా పోయబడ్డాయి.

**క్షీరాణాం చ ఘృతానాం చ దధ్నాం వాపీశ్చకార సః ।**
**యవాది ధాన్యపిష్టానాం లడ్డుకానాం తథైవ చ ॥12॥**

**శష్కులీనాం స్వస్తికానాం శర్కరాణాం తథైవ చ ।**
**అమృతేక్షురసానాం చ తత్ర వాపీశ్చకార సః ॥13॥**

పాలు, నేయి, పెరుగు, మున్నగునవి దిగుడుబావులవంటి పాత్రలలో నింపిఉంచాడు. యవలు మున్నగు ధాన్యాలపిండి తోటి లడ్డూలు, చక్కిలాలు, జంతికలు ఇతర పదార్థాలు గుట్టలుగా పోయబడ్డాయి. అమృతంవంటి చెరుకురసాలు నూతులుగా ఏర్పరచారు.

**బహ్వీ ర్హైయంగవానాం చ హ్యాసవానాం తథైవ చ ।**
**నానా పక్వాన్నసంఘాంశ్చ మహాస్వాదు రసాంస్తథా ॥14॥**

తాజానెయ్యి, పూతేనె, సమృద్ధిగా సరఫరా చేయబడ్డాయి. గొప్ప రుచిగల వివిధ రకాల అన్నాలు సమృద్ధంగా లభిస్తున్నాయి.

**నానా వ్యంజనవస్తూని గణదేవ హితాని చ ।**
**అమూల్య నానావస్త్రాణి వహ్నిశౌచాని యానిచ ॥15॥**

శివగణాలకు, దేవతలకు అభీష్టమైన అనేక రకాల పచ్చళ్ళు సిద్ధమయ్యాయి. గొప్ప విలువైన అనేక వస్త్రాలు సిద్ధంగా ఉంచబడ్డాయి. అగ్నియందు శుద్ధిచేయబడిన వెండి బంగారాలు భద్రపరప బడ్డాయి.

**మణిరత్నప్రకారాణి సువర్ణరజతాని చ ।**
**ద్రవ్యాణ్యేతాని చాన్యాని సంగృహ్య విధిపూర్వకమ్ ॥16॥**

ఆయన వివిధ రకాల మణులను, రత్నాలను, బంగారాన్ని, వెండిని, ఇతర ద్రవ్యాలను, యథావిధిగా సంపాదించి సిద్ధంచేశాడు.

**మంగళం కర్తుమారేభే గిరిర్మంగళకృద్దినే ।**
**సంస్కారం కారయామాసుః పార్వత్యాః పర్వతస్త్రియః ॥17॥**

మంగళ కార్యాలను చేయవలసిన రోజున ఆయన ఆ కార్యాలను మొదలు పెట్టించాడు. పర్వతుని అంతఃపుర స్త్రీలు పార్వతికి స్నానాది సంస్కారాలు చేయించారు.

**తా మంగళం ముదా చక్రుర్భూషితా భూషణైః స్వయమ్ ।**
**పురద్విజస్త్రియో హృష్టా లోకాచారం ప్రచక్రిరే ॥18॥**

ఆ నగరంలోని బ్రాహ్మణ స్త్రీలు తామలంకరించుకొని, లోకాచారాన్ననుసరించి, ఆనందంతో మంగళకర్మలననుష్ఠించారు.

**సోత్సవం వివిధం తత్ర సుమంగళ పురస్సరమ్ ।**
**హిమాలయోఽపి హృష్టాత్మా కృత్వాచారం సుమంగళమ్ ॥19॥**

హిమవంతుడు ఆనందంతో నిండిన మనస్సుకలవాడై, మంగళకర్మలను, ఉత్సవాన్ని, ఆచారాన్ననుసరించి చేయించాడు.

**సర్వభావేన సుప్రీతో బంధువర్గాగమోత్సుకః ।**
**ఏతస్మిన్నంతరే తస్య బాంధవాశ్చ నిమంత్రితాః ॥20॥**

అదేసమయంలో బంధువులకు ఆహ్వానాన్ని పంపి, వారి రాకకొరకు ఉత్సాహంతో, ప్రీతితో వేచియున్నాడు.

**ఆజగ్ముస్స్త్రియో హృష్టాస్ససుతాస్సపరిచ్ఛదాః ।**
**తదైవ శృణు దేవర్షే గిర్యాగమనమాదృతః ॥21॥**

బంధువులు, స్త్రీలు, పిల్లలు, పరిచారికలతోసహా విచ్చేశారు. ఓ దేవర్షీ! ఇతర పర్వతరాజులు వేంచేసిన తీరును శ్రద్ధతో వినుము.

**వర్ణయామి సమాసేన శివప్రీతివివృద్ధయే ।**
**దేవాలయ గిరిర్యోహి దివ్యరూపధరో మహాన్ ॥22॥**

శివుని ప్రీతిని పెంపొందించడానికి దేవతల నిలయమైన మేరువు దివ్యరూపాన్ని ధరించి విచ్చేసిన విధానాన్ని సంగ్రహంగా వర్ణిస్తాను.

**నానారత్న పరిభ్రాజత్సమాజస్సపరిచ్ఛదః ।**
**నానామణి మహారత్న సారమాదాయ యత్నతః ॥23॥**

**సువేషాలంకృతః శ్రీమాన్ జగామ స హిమాలయమ్ ।**
**మందరస్సర్వశోభాఢ్య స్సనారీతనయో గిరిః ॥24॥**

**సూపాయనాని సంగృహ్య జగామ వివిధాని చ ।**
**అస్తాచలోఽపి దివ్యాత్మా సోపాయన ఉదారధీః ॥25॥**

**బహుశోభాసమాయుక్త ఆజగామ ముదాన్వితః ।**
**ఉదయాచల ఆదాయ సద్రత్నాని మణీనపి ॥26॥**

అనేక రత్నాభరణాలతో ప్రకాశించే బంధువర్గం కలవాడై, విలువైన వస్త్రాలను ధరించి, అనేక మణులను, సారభూతములైన మహారత్నాలను శ్రద్ధతో సంపాదించి, వాటిని తీసుకుని మేరు పర్వతుడు చక్కని వేషంతో అలంకరించుకుని, ప్రకాశించువాడై, హిమవంతుని రాజధానికి వెళ్ళాడు. భార్యతో, కుమారులతోగూడి, మందర పర్వతుడు అనేక శోభలతో, వివిధములైన బహుమతులను సంగ్రహించుకుని వెళ్ళాడు. దేవతా స్వరూపుడు, విశాల హృదయుడు, వివిధ శోభలతో కూడినవాడైన అస్తాచలుడు కూడా బహుమానాలను తీసుకుని ఆనందంతో విచ్చేశాడు. ఉదయాచలుడు గొప్ప రత్నాలను, మణులను కూడా తీసుకొని విచ్చేశాడు.

**అత్యుత్కృష్టపరీవార ఆజగామ మహాసుఖీ ।**
**మలయో గిరిరాజో హి సపరీవార ఆదృతః ॥27॥**

పెద్ద పరివారం గలవాడు, మహా సుఖం కలవాడునైన మలయ పర్వతుడు ఆదరంతో విచ్చేశాడు.

**సుదివ్య రచనాయుక్త ఆయయౌ బహుసద్బలః ।**
**సద్యో దర్దురనామా చ ముదితస్సకళత్రకః ॥28॥**

గొప్ప విన్యాసం కలవాడు, మహాబలశాలియునైన దర్దురుడు భార్యతోగూడి, ఆనందంతో శీఘ్రంగా విచ్చేశాడు.

**బహుశోభాన్వితస్తాత యయౌ హిమగిరేర్గృహమ్ ।**
**నిషధోఽపి ప్రహృష్టాత్మా సపరిచ్ఛద ఆయయౌ ॥29॥**

ఓ కుమారా! గొప్ప శోభగలవాడు, హర్షంతో నిండిన మనస్సు కలవాడై నిషదుడు కూడా నూతన వస్త్రాలు ధరించి, హిమవంతుని ఇంటికి వచ్చాడు.

**ససుతస్త్రీగణః ప్రీత్యా యయౌ హిమగిరే ర్గృహమ్ ।**
**ఆజగామ మహాభాగ్యో భూధరో గంధమాదనః ॥30॥**

మహాభాగ్యవంతుడైన గంధమాదనపర్వతుడు భార్యలతో, కుమారులతోగూడి, ప్రీతితో హిమవంతుని గృహానికి విచ్చేశాడు.

**కరవీర స్తథైవాపి మహావిభవసంయుతః ।**
**మహేంద్రః పర్వతశ్రేష్ఠ ఆజగామ హిమాలయమ్ ॥31॥**

గొప్ప సంపదతో కూడిన కరవీరుడు, పర్వతశ్రేష్ఠుడైన మహేంద్రుడు హిమవంతుని గృహానికి విచ్చేశాడు.

**సగణస్ససుత స్త్రీకో బహుశోభాసమన్వితః ।**
**పారియాత్రో హి హృష్టాత్మా మణిరత్నాకరస్సయుత్ ॥32॥**

గొప్ప శోభతో ప్రకాశించే పారిజాతుడు, భార్యలు, కుమారులు, బంధువులతోగూడి, హర్షంతో నిండిన మనస్సు కలవాడై విచ్చేశాడు. మణులకు, రత్నాలకు నిధియైన అతడు వాటిని తోడ్కొని వచ్చాడు.

**సగణస్సపరీవార ఆయయౌ హిమభూధరమ్ ।**
**క్రౌంచః పర్వతరాజో హి మహాబలపరిచ్ఛదః ॥**
**ఆజగామ గిరిశ్రేష్ఠస్సముపాయన ఆదృతః ॥33॥**

పర్వత శ్రేష్ఠుడైన క్రౌంచుడు పెద్ద సైన్యాన్ని, పరివారాన్ని గణాలను తోడ్కొని, బహుమానాలను తీసుకొని, సాదరంగా హిమవంతుని గృహానికి విచ్చేశాడు.

**పురుషోత్తమ శైలోఽపి సపరిచ్ఛద ఆదృతః ।**
**మహోపాయన మాదాయాజగామ హిమభూధరమ్ ॥34॥**

పురుషోత్తమ పర్వతుడుకూడా సపరివారంతోగూడి, గొప్ప బహుమతులను తీసుకొని సాదరంగా హిమవంతుని గృహానికి విచ్చేశాడు.

**నీలః సలీలస్ససుత స్సస్త్రీకో ద్రవ్యసంయుతః ।**
**ఆజగామ హిమాగస్య గృహమానందసంయుతః ॥35॥**

లీలలతో, ఆనందంతో కూడియున్న నీలుడు భార్యలను, కుమారులను తోడ్కొని, ధనాన్ని తీసుకొని, హిమవంతుని గృహానికి విచ్చేశాడు.

**త్రికూటశ్చిత్రకూటోఽపి వేంకటః శ్రీగిరిస్తథా ।**
**గోకాముఖీ నారదశ్చ హిమగేహముపాగమత్ ॥36॥**

త్రికూటుడు, చిత్రకూటుడు, వేంకటుడు, శ్రీపర్వతుడు, గోకాముఖుడు, నారదుడు, హిమవంతుని గృహానికి విచ్చేశారు.

**వింధ్యశ్చ పర్వతశ్రేష్ఠో నానాసంపత్సమన్వితః ।**
**ఆజగామ ప్రహృష్టాత్మా సదార తనయశ్శుభః ॥37॥**

అనేక సంపదలతో కూడినవాడు, పర్వతశ్రేష్ఠుడు, శుభకరుడునగు వింధ్యుడు ఆనందంతో నిండిన మనస్సు కలవాడై, భార్యతో, కుమారులతోగూడి విచ్చేశాడు.

**కాలంజరో మహాశైలో బహుహర్ష సమన్వితః ।**
**బహుభిస్స్వగణైః ప్రీత్యా జగామ హిమభూధరమ్ ॥38॥**

మహాపర్వతుడు, అనేక కాంతులు గలవాడునైన కాలంజరుడు మహానందంతో కూడినవాడై, గణాలను తోడ్కొని, ప్రీతితో హిమవంతుని గృహానికి విచ్చేశాడు.

**కైలాసస్తు మహాశైలో మహాహర్షసమన్వితః ।**
**ఆజగామ కృపాం కృత్వా సర్వోపరి లసత్ప్రభుః ॥39॥**

మహాశైలుడు, అందరికంటె ప్రకాశించువాడు, ప్రభువును అయిన కైలాసుడు మహాహర్షంతో కూడినవాడై దయతో విచ్చేశాడు.

**అన్యేఽపి భూభృతో యే హి ద్వీపేష్వన్యేష్వపి ద్విజ ।**
**ఇహాపి యేఽచలాస్సర్వే ఆయయుస్తే హిమాలయమ్ ॥40॥**

ఓ విప్రా! ఈ ద్వీపంలోనేగాక ఇతర ద్వీపాలతోనున్న పర్వతాలన్నీకూడా హిమవంతుని నగరానికి విచ్చేశాయి.

**నిమంత్రితా నగాస్తత్ర తేన పూర్వం ముదా మునే ।**
**ఆయయుర్నిఖిలాః ప్రీత్యా వివాహశ్శివయోరితి ॥41॥**

ఓ మహర్షీ! హిమవంతుడు పూర్వమే వారిని ఆనందంతో ఆహ్వానించియున్నాడు. పార్వతీ పరమేశ్వరుల వివాహం గనుక వారందరు ప్రేమతో విచ్చేశారు.

**తదా సర్వే సమాయాతాశ్శోణభద్రాదయః ఖలు ।**
**బహుశోభా మహాప్రీత్యా వివాహ శ్శివయోరితి ॥42॥**

పార్వతీ పరమేశ్వరుల వివాహం కనుక శోణ, భద్ర మున్నగు గొప్ప శోభగల నదులన్నీ మహానందంతో విచ్చేశాయి.

**నద్య స్సర్వా స్సమాయాతా నానాలంకారసంయుతాః ।**
**దివ్యరూపధరాః ప్రీత్యా వివాహశ్శివయోరితి ॥43॥**

నదులన్నీ దివ్యరూపాలు ధరించి, అనేకమైన అలంకారాలు పెట్టుకొని, పార్వతీ పరమేశ్వరులు వివాహం కనుక ప్రీతితో విచ్చేశాయి.

**గోదావరీ చ యమునా బ్రహ్మస్త్రీర్వేణికా తథా ।**
**ఆయయౌ హిమశైలం వై వివాహశ్శివయోరితి ॥44॥**

గోదావరి, యమున, సరస్వతి, వేణి అనే నదులు పార్వతీ పరమేశ్వరుల వివాహాన్ని దర్శించడానికి హిమవత్పర్వతానికి విచ్చేశాయి.

**గంగా తు సుమహాప్రీత్యా నానాలంకార సంయుతౌ ।**
**దివ్యరూపా యయౌ ప్రీత్యా వివాహ శ్శివయోరితి ॥45॥**

గంగానది పార్వతీ పరమేశ్వరుల వివాహం దర్శించడానికి దివ్యరూపాన్ని ధరించి, అనేక భూషణాలతో అలంకరించుకొని మహానందంతో విచ్చేసింది.

**నర్మదా తు మహామోదా రుద్రకన్యా సరిద్వరా ।**
**మహాప్రీత్యా జగామాశు వివాహ శ్శివయోరితి ॥46॥**

రుద్రుని కుమార్తెయు, గొప్ప నదియు నగు నర్మద పార్వతీ పరమేశ్వరుల వివాహానికి మహానందంతో శీఘ్రంగా విచ్చేసింది.

**ఆగతై స్తై స్తతః సర్వై స్సర్వతో హిమభూధరమ్ ।**
**సంకులాసీత్పురీ దివ్యా సర్వశోభాసమన్వితా ॥47॥**

అన్ని వైపులనుండి విచ్చేసిన వారందరితో హిమవంతుని దివ్యనగరమంతట నిండిపోయింది. ఆ నగరం సర్వశోభా సమన్వితమయ్యింది.

**మహోత్సవా లసత్కేతుధ్వజతోరణకాధికా ।**
**వితాన వినివృత్తార్కా తథా నానాలసత్ప్రభా ॥48॥**

అక్కడ మహోత్సవం జరిగింది. జండాలు, ధ్వజాలు, తోరణాలు, అధికంగా ఉన్నాయి. చాందినీల విస్తారంచే సూర్యకాంతి ప్రవేశించకుంది. అయినప్పటికి అనేక కాంతులతో ప్రకాశిస్తోంది.

**హిమాలయోఽపి సుప్రీత్యాదరేణ వివిధేన చ ।**
**తేషాం చకార సన్మానం తాసాం చైవ యథాయథమ్ ॥49॥**

హిమవంతుడు మిక్కిలి ప్రీతితో ఆ పర్వతాలకు, నదులకు యథోచితంగా, సాదరంగా సన్మానం చేశాడు.

**సర్వాన్నివాసయామాస సుస్థానేషు పృథక్ పృథక్ ।**
**సామగ్రీభిరనేకాభి స్తోషయామాస కృత్స్నశః ॥50॥**

వారినందరిని వేర్వేరు గృహాలలో నివసింపజేసి, సమస్త సామగ్రులనేర్పాటుచేసి, వారిని సంతోషపెట్టాడు

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే లగ్నపత్ర సంప్రేషణ, సామగ్రీ సంగ్రహ, శైలాగమనం నామ సప్త త్రింశోఽధ్యాయః ॥37॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో లగ్నపత్రమును పంపుట, సామగ్రి సమకూర్చుకొనుట, పర్వతముల రాక అనే ముప్పై ఏడవ అధ్యాయం సమాప్తం.

## అష్ట త్రింశోఽధ్యాయః - ముప్పై ఎనిమిదవ అధ్యాయం

## మండపాది రచనావర్ణనమ్ - మండపాదుల నిర్మాణవర్ణనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథ శైలేశ్వరః ప్రీతో హిమవాన్మునిసత్తమ ।**
**స్వపురం రచయామాస విచిత్రం పరమోత్సవమ్ ॥1॥**

ఓ మునిసత్తమా! పర్వతరాజైన హిమవంతుడు ఆనందంతో, నగరమంతా రంగురంగుల శోభ కల్గేటట్లు అలంకరింపజేశాడు. అక్కడ పరమోత్సవం ప్రారంభమయ్యింది.

**సిక్తమార్గం సంస్కృతం చ శోభితం పరమర్ధిభిః ।**
**ద్వారి ద్వారి చ రంభాదిమంగళద్రవ్యసంయుతమ్ ॥2॥**

మార్గాలన్నింటిని నీటితో కడిగి, శుద్ధిచేసి, విలువైన అలంకారాలతో శోభిల్లేటట్లు చేశారు. ద్వారాలన్నీ అరటిస్తంభాలు మున్నగు మంగలద్రవ్యాలతో అలంకరింపబడ్డాయి.

**ప్రాంగణం రచయామాస రంభాస్తంభసమన్వితమ్ ।**
**పట్టసూత్రై స్సంనిబద్ధ రసాల పల్లవాన్వితమ్ ॥3॥**

ప్రాంగణమంతా అరటిస్తంభాలు పాతి, పట్టుదారాలతో, మామిడి చిగుళ్ళ తోరణాలు కట్టబడ్డాయి.

**మాలతీమాల్యసంయుక్తం లసత్తోరణసుప్రభమ్ ।**
**శోభితం మంగళద్రవ్యై శ్చతుర్దిక్షు స్థితై శ్శుభైః ॥4॥**

సింహద్వారాలు మల్లెల మాలలతో శోభిల్లాయి. నాల్గు దిక్కులతో నుంచబడిన మంగళ ద్రవ్యాలతో ఆ నగరం విరాజిల్లింది.

**తథైవ సర్వం పరయా ముదాన్విత శ్చక్రే గిరీంద్ర స్స్వసుతార్థమేవ ।**
**గర్గం పురస్కృత్య మహా ప్రభావంప్రస్తావయోగ్యం చ సుమంగళం హి ॥5॥**

గొప్ప ఆనందంతో కూడిన పర్వతరాజు గర్గుని ముందిడుకుని, తన కుమార్తె వివాహం కొరకు కీర్తింప యోగ్యమైనదియు, మంగళకరమైనదియునగు వ్యవస్థనేర్పాటుచేశాడు.

**ఆహూయ విశ్వకర్మాణం కారయామాస సాదరమ్ ।**
**మండపం చ సువిస్తీర్ణం వేదికాదిమనోహరమ్ ॥6॥**

సాదరంగా విశ్వకర్మను పిలిపించి సువిస్తీర్ణమైనదియు, మిక్కిలి మనోహరమైనదియునగు వివాహ మండపాన్ని నిర్మింపజేశాడు.

**అయుతేన సురర్షే తద్యోజనానాం చ విస్తృతమ్ ।**
**అనేక లక్షణోపేతం నానాశ్చర్య సమన్వితమ్ ॥7॥**

ఓ దేవర్షీ! అనేక శుభలక్షణాలతోకూడి, మహాశ్చర్యాన్ని కలిగించే వివాహ మండపం పదివేల యోజనాల విస్తీర్ణం కలిగియుంది.

**స్థావరం జంగమం సర్వం సదృశం తైర్మనోహరమ్ ।**
**సర్వతోఽద్భుత సర్వస్వం నానావస్తు చమత్కృతమ్ ॥8॥**

సౌందర్యంలో స్థావరాలు, జంగమాలు, సర్వం సమానంగా నుండి, మనోహరంగా ఉంటాయి. సర్వత్ర అద్భుతాలతో నిండియున్న ఆ నగరం అనేక చమత్కార వస్తువులతో అలరారుతోంది.

**జంగమం విజితం తత్ర స్థావరేణ విశేషతః ।**
**జంగమేన చ తత్రాసీజ్జితం స్థావరమేవ హి ॥9॥**

సౌందర్యంలో అచ్చట స్థావరాలు, జంగమాలను జయించాయా? లేక జంగమాలు స్థావరాలను జయించాయా? అన్నది చెప్పడం సాధ్యంకాదు.

**పయసా చ జితా తత్ర స్థలభూమిర్న చాన్యథా ।**
**జలం కిం హి స్థలం కిం హి న విదుః కేఽపి కోవిదాః ॥10॥**

అచ్చట స్థలాన్ని జలం జయించింది. కుశలురైన వ్యక్తులైనప్పటికి, జలస్థల భేదాన్ని నిర్ణయింపలేక పోయారు.

**క్వచిత్సింహాః కృత్రిమాశ్చ క్వచిత్సారస పంక్తయః ।**
**క్వచిచ్ఛిఖండినస్తత్ర కృత్రిమాశ్చ మనోహరాః ॥11॥**

కొన్నిచోట్ల కృత్రిమ సింహాలు, మరికొన్నిచోట్ల కృత్రిమ జల పక్షుల వరుసలు, మరొకొన్నిచోట్ల కృత్రిమములైన నెమళ్ళు అలంకరింపబడి, మనోహరంగానున్నాయి.

**క్వచిత్ స్త్రియః కృత్రిమాశ్చ నృత్యంత్యః పురుషైస్సహ ।**
**మోహయన్త్యో జనాన్సర్వాన్పశ్యన్త్యః కృత్రిమాస్తథా ॥12॥**

కొన్నిచోట్ల కృత్రిమ స్త్రీలు, కృత్రిమ పురుషులతో కలసి నృత్యం చేస్తూ ఉండగా ఎందరో కృత్రిమ ప్రేక్షకులు పరవశులై తిలకిస్తున్నారు.

**తథా తేనైవ విధినా ద్వారపాలా మనోహరాః ।**
**హస్తైర్ధనూంషి చోద్ధృత్య స్థావరా జంగమోపమాః ॥13॥**

అట్లే సుందరాకారులైన ద్వారపాలకులు చేతులతో ధనుస్సులెక్కుపెట్టియున్నారు. అవి బొమ్మలే అయినప్పటికి ప్రాణమున్నవారివలెనున్నాయి.

**ద్వారి స్థితా మహాలక్ష్మీః కృత్రిమా రచితాద్భుతా ।**
**సర్వలక్షణసంయుక్తా గతా సాక్షాత్పయోర్ణవాత్ ॥14॥**

అద్భుతమైన మహాలక్ష్మీ విగ్రహం ద్వారంలో నిర్మింపబడింది. సర్వలక్షణాలతో విలసిల్లిన ఆ విగ్రహం క్షీరసముద్రంనుండి ఆవిర్భవించిన లక్ష్మీదేవియా? అన్నట్లున్నది.

**గజాశ్చాలంకృతా హ్యాసన్ కృత్రిమా అకృతోపమాః ।**
**తథాశ్వాః సాదిభిశ్చైవ గజాశ్చ గజసాదిభిః ॥15॥**

అలంకరింపబడిన కృత్రిమ గజాలు నిజమైన ఏనుగులను పోలియున్నాయి. గుఱ్ఱాలు రౌతులతోను, గజాలు మావటివారితోను కూడియున్నాయి.

**రథా రథిభిరాకృష్టా మహాశ్చర్య సమన్వితాః ।**
**వాహనాని తథాన్యాని పత్తయః కృత్రిమాస్తథా ॥16॥**

కృత్రిమ రథాలను కృత్రిమ సారథులు తోలుతున్నారు. ఇతర వాహనాలుకూడా అట్లే అమర్చబడ్డాయి. అంతేకాదు కృత్రిమమైన సైనిక దళాలుకూడా ఉన్నాయి. ఇటువంటివన్నీ మహాశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి.

**ఏవం విమోహనార్థం తు కృతం వై విశ్వకర్మణా ।**
**దేవానాం చ మునీనాం చ తేన ప్రీతాత్మనా మునే ॥17॥**

ఓ మునీ! దేవతలను, మునులను మోహింపజేయడానికి విశ్వకర్మ ఉత్సాహంతో ఇట్టి దృశ్యాలను నిర్మించాడు.

**మహాద్వారి స్థితో నందీ కృత్రిమశ్చ కృతోమునే ।**
**శుద్ధస్ఫటికసంకాశో యథా నందీ తథైవ సః ॥18॥**

ఓ మహర్షీ! మహాద్వారంలో ఒక కృత్రిమనంది నిలబడియుంది. శుద్ధస్ఫటిక సంకాశమైన ఆబొమ్మ యథార్థమైన నందివలెనే భాసిల్లుతోంది.

**తస్యోపరి మహాదివ్యం పుష్పకం రత్నభూషితమ్ ।**
**రాజితం పల్లవైశ్శుభ్రై శ్చామరైశ్చ సుశోభితమ్ ॥19॥**

ఆ ద్వారానికి పైన రత్నాలతోను, స్వచ్ఛమైన పుష్పాలతోను, చిగుళ్ళతోను, ప్రకాశించే కృత్రిమ పుష్పక విమానం దేవతలతోగూడి, మిక్కిలి శోభిల్లింది.

**వామపార్శ్వే గజౌ ద్వౌ చ శుద్ధ కాశ్మీర సన్నిభౌ ।**
**చతుర్దంతౌ షష్టివర్షౌ భేదమానౌ మహాప్రభౌ ॥20॥**

ఎడమవైపున శుద్ధ కాషాయవర్ణంగల రెండు ఏనుగులు నిర్మింపబడ్డాయి. నాలుగు దంతాలతో గొప్పగా ప్రకాశించే ఆ ఏనుగులు అరవై సంవత్సరాల వయస్సుగల ఏనుగులవలె భాసిల్లుతున్నాయి. అవి పరస్పరం స్పృశించుకుంటున్నట్లు భాసిస్తున్నాయి.

**తథైవార్కనిభౌ తేన కృతౌ చాశ్వౌ మహాప్రభౌ ।**
**చామరాలంకృతౌ దివ్యౌ దివ్యాలంకారభూషితౌ ॥21॥**

అట్లే సూర్యునివలె ప్రకాశించే రెండు గుఱ్ఱాలనుకూడా విశ్వకర్మ నిర్మించాడు. చామరాలతోను, దివ్యాభరణాలతోను అలంకరింపబడిన ఆ దివ్యాశ్వాలు గొప్పగా ప్రకాశిస్తున్నాయి.

**దంశితా వర రత్నాఢ్యా లోకపాలాస్తథైవ చ ।**
**సర్వే దేవా యథార్థం వై కృతా వై విశ్వకర్మణా ॥22॥**

విశ్వకర్మ కవచాలతోను, శ్రేష్ఠ రత్నాలతోను ఒప్పారు లోకపాలురను, దేవతలనందరిని "వాస్తవమైనవారా"? అన్నట్లు నిర్మించాడు.

**తథా హి ఋషయస్సర్వే భృగ్వాద్యాశ్చ తపోధనాః ।**
**అన్యే హ్యుపసురాస్తద్వత్సిద్ధాశ్చాన్యేఽపి వైకృతాః ॥23॥**

అట్లే భృగువు మున్నగు తపోధనులైన ఋషులనందరిని ఇతరులైన ఉపదేవతలను, సిద్ధులను బొమ్మలరూపంలో ప్రదర్శించాడు.

**విష్ణుశ్చ పార్షదైస్సర్వై ర్గరుడాఖ్యై స్సమన్వితః ।**
**కృత్రిమో నిర్మితస్తద్వత్పరమాశ్చర్యరూపవాన్ ॥24॥**

గరుడుడను పేరుగల వానితోను, గణాలందరితోను గూడియున్న కృత్రిమ విష్ణువు నిర్మింప బడ్డాడు. ఆ బొమ్మ మహాశ్చర్యాన్ని కలిగించింది.

**తథైవాహం సుతైర్వేదైస్సిద్ధైశ్చ పరివారితః ।**
**కృత్రిమో నిర్మితస్తద్వత్పఠన్ సూక్తాని నారద ॥25॥**

నారదా! అదేవిధంగా వేదాలతోను, ప్రజాపతులతోను, సిద్ధులతోను, చుట్టబడి, సూక్తాలను పఠిస్తున్న నా (బ్రహ్మ) కృత్రిమ శిల్పంకూడా అచ్చట నిర్మింపబడింది.

**ఐరావతగజారూఢ శ్శక్రస్స్వదళసంయుతః ।**
**కృత్రిమో నిర్మితస్తద్వత్పరిపూర్ణేందుసంనిభః ॥26॥**

ఓ నారదా! అదేవిధంగా ఐరావత గజారూఢుడై, పూర్ణచంద్రుని పోలియున్న కృత్రిమ ఇంద్రుడు తన సైన్యంతో కూడియున్నట్లుగా నిర్మించడింది.

**కిం బహూక్తేన దేవర్షే సర్వో వై విశ్వకర్మణా ।**
**హిమాగ ప్రేరితేనాశు క్లుప్తస్సురసమాజకః ॥27॥**

ఓ దేవర్షీ! ఇన్నిమాటలేల! హిమవంతునిచే ప్రేరితుడైన విశ్వకర్మ దేవసమాజాన్నంతటిని అనతికాలంలో అక్కడ నిర్మించాడు.

**ఏవం భూతః కృతస్తేన మండపో దివ్యరూపవాన్ ।**
**అనేకాశ్చర్యసంభూతో మహాన్దేవ విమోహనః ॥28॥**

దివ్యరూపం గలదీ, అనేకాద్భుతాలతో కూడినదీ, చాల పెద్దదీ, దేవతలను సైతం మోహింపజేయునదీ అయిన వివాహమంటపాన్ని విశ్వకర్మ నిర్మించాడు.

**అథాజ్ఞప్తో గిరీశేన విశ్వకర్మా మహామతిః ।**
**నివాసార్థం సురాదీనాం తత్తల్లోకాం హి యత్నతః ॥29॥**

అనంతరం హిమవంతునిచే ఆజ్ఞాపింపబడిన విశ్వకర్మ దేవతాదుల నివాసానికి ప్రయత్న పూర్వకంగా వారివారి లోకాలను నిర్మించాడు.

**తత్రైవ చ మహామంచాః సుప్రభాః పరమాద్భుతాః ।**
**రచితాస్సుఖదా దివ్యాస్తేషాం వై విశ్వకర్మణా ॥30॥**

ఆమండపం వద్ద గొప్పగా వెలుగొందునట్టియు, పరమాద్భుతములై, సుఖకరములైనట్టియు, దివ్యమైనట్టియు, పెద్ద ఆసనాలను విశ్వకర్మ నిర్మించాడు.

**తథాప్త సప్తలోకం వై విరేచే క్షణతోఽద్భుతమ్ ।**
**దీప్త్యా పరమయా యుక్తం నివాసార్థం స్వయంభువః ॥31॥**

అతడు అద్భుతము, గొప్ప ప్రకాశంతో కూడినదియు నైన కృత్రిమ సత్యలోకం స్వయంభువునైన నా నివాసం కొరకు క్షణంలో నిర్మించాడు.

**తథైవ విష్ణోస్స్వపరం వైకుంఠాఖ్యం మహోజ్జ్వలమ్ ।**
**విరేచే క్షణతో దివ్యం నానాశ్చర్యసమన్వితమ్ ॥32॥**

అదేవిధంగా విష్ణువు కొరకు మహోజ్జ్వలమైనదియు, దివ్యమైనదియు, నానాశ్చర్య సమన్వితమైనదగు వైకుంఠాన్ని అతడు క్షణంలో నిర్మించాడు.

**అమరేశగృహం దివ్యం తథైవాద్భుతముత్తమమ్ ।**
**విరేచే విశ్వకర్మాసౌ సర్వైశ్వర్యసమన్వితమ్ ॥33॥**

ఆ విశ్వకర్మ అద్భుతము, ఉత్తమము, దివ్యము, సర్వైశ్వర్య సమన్వితమునైన గృహాన్ని ఇంద్రుని కొరకు నిర్మించాడు.

**గృహాణి లోకపాలానాం విరేచే సుందరాణి చ ।**
**తద్వత్స ప్రీతితో దివ్యాన్యద్భుతాని మహాంతి చ ॥34॥**

అదే విధంగా లోకపాలుర కొరకు సుందరమైనవి, దివ్యమైనవి, అద్భుతమైనవి, పెద్దవియునైన గృహాలను సంతోషంతో నిర్మించాడు.

**అన్యేషామమరాణాం చ సర్వేషాం క్రమశస్తథా ।**
**సదనాని విచిత్రాణి రచితాని చ తేన వై ॥35॥**

అతడు ఇతర దేవతలందరికి కూడా విచిత్ర సదనాలను వరుసగా నిర్మించాడు.

**విశ్వకర్మా మహాబుద్ధిః ప్రాప్తశంభుమహావరః ।**
**విరేచే క్షణతః సర్వం శివతుష్ట్యర్థమేవ చ ॥36॥**

మహాబుద్ధిశాలియు, శివునినుండి గొప్పవరాన్ని పొందినవాడునైన విశ్వకర్మ శివునకు పూర్తిగా సంతోషాన్ని కలిగించడానికి క్షణాలలో గృహాన్ని నిర్మించాడు.

**తథైవచిత్రం పరమం మహోజ్జ్వలం మహాప్రభం దేవవరై స్సుపూజితమ్ ।**
**గిరీశచిహ్నం శివలోకసంస్థితం సుశోభితం శంభుగృహం చకార ॥37॥**

చిత్రమైనది, గొప్పగా ప్రకాశించేది, దేవతలచే పూజింపబడేది, శివుని చిహ్నాలు కలది, శివలోక హర్మ్యాలను పోలియున్నది, మిక్కిలి సుందరమైనదియునగు గృహాన్ని విశ్వకర్మ శివునికొరకు నిర్మించాడు.

**ఏవం భూతా కృతా తేన రచనా విశ్వకర్మణా ।**
**విచిత్రా శివతుష్ట్యర్థం పరాశ్చర్యా మహోజ్జ్వలా ॥38॥**

ఈవిధంగా విశ్వకర్మ శివుని ప్రీతికొరకు విచిత్రము, అత్యాశ్చర్యకరము, గొప్ప ప్రకాశవంతమునైన తన రచనా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు.

**ఏవం కృత్వాఖిలం చేదం వ్యవహారం చ లౌకికమ్ ।**
**పర్యైక్షిష్ట ముదా శంభ్వాగమనం స హిమాచలమ్ ॥39॥**

ఈవిధమైన లౌకిక వ్యవహారాలనంతటిని పూర్తిచేసుకొని హిమవంతుడు శంభుని రాకకొరకు ఆనందంతో నిరీక్షిస్తున్నాడు.

**ఇతిప్రోక్త మశేషేణ వృత్తాంతం ప్రముదావహమ్ ।**
**హిమాలయశ్చ దేవర్షే కింభూయః శ్రోతుమిచ్ఛసి ॥40॥**

ఓ దేవర్షీ! ఈతీరున నీకు హిమవంతుని ఆనందదాయకమైన చరిత్రనంతటిని చెప్పియున్నాను. ఇంకను ఏమి వినగోరుచున్నావు?

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే వివాహ మండపాది రచనావర్ణనం నామాష్ట త్రింశోఽధ్యాయః ॥38॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో మండపాదుల నిర్మాణవర్ణనం అనే ముప్పై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోన చత్వారింశోఽధ్యాయః - ముప్పై తొమ్మిదవ అధ్యాయం
## దేవనిమన్త్రణ, దేవాగమన శివయాత్రావర్ణనమ్ - దేవనిమంత్రణ, దేవాగమన శివయాత్రావర్ణనం

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**విధే తాత మహాప్రాజ్ఞ విష్ణుశిష్య నమోఽస్తుతే ।**
**అద్భుతేయం కథాశ్రావి త్వత్తోఽస్మాభిః కృపానిధే ॥1॥**

ఓ విధీ! తండ్రీ! మహాప్రాజ్ఞా! విష్ణుశిష్యా! నీకు నమస్కారము. ఓ దయానిధే! నీవు నాకీ అద్భుతగాథను వినిపించావు.

**ఇదానీం శ్రోతుమిచ్ఛామి చరితం శశిమౌళినః ।**
**వైవాహికం సుమాంగల్యం సర్వాఘౌఘవినాశనమ్ ॥2॥**

చంద్రశేఖరుని సుమంగళము, సమస్త పాపరాశుల నాశనమొనర్చునదియునగు వివాహ వృత్తాంతాన్ని ఇప్పుడు వినగోరుతున్నాను.

**కిం చకార మహాదేవః ప్రాప్య మంగళపత్రికామ్ ।**
**తాం శ్రావయ కథాం దివ్యాం శంకరస్య పరాత్మనః ॥3॥**

లగ్నపత్రికను పొందిన తరువాత మహాదేవుడేమి చేశాడు? శంకరపరమాత్ముని ఆ దివ్యగాథను వినిపింపుము.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**శృణు వత్స మహాప్రాజ్ఞ శాంకరం పరమం యశః ।**
**యచ్చకార మహాదేవః ప్రాప్య మంగళపత్రికామ్ ॥4॥**

వత్సా! మహాప్రాజ్ఞా! శంకరుని పరమకీర్తిని వినుము. ఆమహాదేవుడు మంగళపత్రికను స్వీకరించిన తరువాత ఏమిచేశాడనే విషయాన్ని వినుము.

**అథ శంభుర్గృహీత్వా తాం ముదా మంగళపత్రికామ్ ।**
**విజహాస ప్రహృష్టాత్మా మానన్తేషాం వ్యధాద్విభుః ॥5॥**

మంగళపత్రికను శంభుడానందంతో స్వీకరించి, సంతోషంతో నిండిన అంతరంగం కలవాడై, నవ్వుతూ వారికి సత్కారం చేశాడు.

**వాచయిత్వా చ తాం సమ్యగ్ స్వీచకార విధానతః ।**
**తజ్జనాన్ప్రేషయామాస బహు సమ్మాన్య చాదృతః ॥6॥**

ఆ పత్రికను యథావిధిగా చదివించి, ఆయన స్వీకరించాడు. వారిని ఘనంగా సత్కరించి, పంపించాడు.

**ఉవాచ మునివర్గాం స్తాన్కార్యం సమ్యక్ కృతం శుభమ్ ।**
**ఆగన్తవ్యం వివాహే మే వివాహస్స్వీకృతో మయా ॥7॥**

అప్పుడాయన సప్తర్షులతో "శుభకార్యాన్ని చక్కగా నిర్వహించారు. ఈ వివాహం నాకంగీకారమే. ఈ వివాహానికి మీరు రండు" అని పలికాడు.

**ఇత్యాకర్ణ్య వచశ్శంభోః ప్రహృష్టాస్తే ప్రణమ్య తమ్ ।**
**పరిక్రమ్య యయుర్ధామ శంసన్తః స్వం విధిం పరమ్ ॥8॥**

శంభుని మాటను విని, వారు మిక్కిలి సంతసించినవారై, ఆయనకు నమస్కరించి, ప్రదక్షిణం చేసి, మహాభాగ్యాన్ని కొనియాడుతు, తమ ఆశ్రమాలకు వెళ్ళారు.

**అథ దేవేశ్వర శ్శంభుస్సామరస్త్వాం మునే ద్రుతమ్ ।**
**లౌకికాచార మాశ్రిత్య మహాలీలాకరప్రభుః ॥9॥**

ఓ నారద మునీశ్వరా! అంతట మహాలీలాకరుడైన శంభుప్రభుడు లోకవ్యవహారమును ఆశ్రయించు వెంటనే నిన్ను (నారదుని) స్మరించాడు.

**త్వమాగతః పరప్రీత్యా ప్రశంసంస్స్వం విధిం పరమ్ ।**
**ప్రణమంశ్చ నతస్కంధో వినీతాత్మా కృతాంజలిః ॥10॥**

నీవు మహానందంతో నీ పరమభాగ్యాన్ని కొనియాడుతు విచ్చేసి, చేతులు జోడించి, వినయం నిండిన మనస్సుతో తలవంచి, నమస్కరించావు.

**అస్తౌస్సుజయశబ్దాన్ హి సముచ్చార్య ముహుర్ముహుః ।**
**నిదేశం ప్రార్థయంస్తస్య ప్రశంసంస్స్వం విధిం మునే ॥11॥**

ఓ నారదా! నీవనేకమార్లు జయశబ్దాన్ని పలికి ఆయనను స్తుతించావు. నీవు శంభుని ఆదేశంగూర్చి ప్రార్థించి, నీ భాగ్యాన్ని కొనియాడుకున్నావు.

**తతః శంభుః ప్రహృష్టాత్మా దర్శయంల్లౌకికీం గతిమ్ ।**
**ఉవాచ మునివర్య త్వాం ప్రీణయన్ శుభయా గిరా ॥12॥**

ఓ మునిశ్రేష్ఠా! అనంతరం శంభుడు హర్షంతో నిండిన మనస్సుగలవాడై, లోకాచారాన్ని ప్రదర్శించువాడై, శుభవచనాలతో ఆనందాన్ని కలిగిస్తూ నీతో ఇలా పలికాడు.

**శివ ఉవాచ** – శివుడు చెప్పాడు.

**ప్రీత్యా శృణు మునిశ్రేష్ఠ హ్యస్మత్తోఽద్య వదామి తే ।**
**బ్రువే తత్త్వాం ప్రియో మే యద్భక్తరాజ శిరోమణిః ॥13॥**

ఓ మునిశ్రేష్ఠా! నేను నీకు చెబుతాను. నీవిప్పుడు దానిని ప్రీతితో వినుము. నీవు భక్తరాజ శిరోమణివి. నాకు ప్రియుడవు. కాబట్టి నేను నీకు చెబుతున్నాను.

**కృతం మహత్తపో దేవ్యా పార్వత్యా తవ శాసనాత్ ।**
**తస్యై వరో మయా దత్తః పతిత్వే తోషితేన వై ॥14॥**

పార్వతీదేవి నీ ఆదేశంచే గొప్ప తపస్సుచేసింది. నేను సంతోషించి, ఆమెను వివాహ మాడతానని వరమిచ్చాను.

**కరిష్యేఽహం వివాహం చ తస్యా వశ్యో హి భక్తితః ।**
**సప్తర్షిభిస్సాధితం చ తల్లగ్నం శోధితం చ తైః ॥15॥**

భక్తవశ్యుడనైన నేనామెను వివాహమాడతాను. ఈకార్యాన్ని సప్తర్షులు సాధించారు. వారు వివాహ లగ్నంకూడా నిర్ణయించారు.

**అద్యతస్సప్తమే చాహ్ని తద్భవిష్యతి నారద ।**
**మహోత్సవం కరిష్యామి లౌకికీం గతిమాశ్రితః ॥16॥**

ఓ నారదా! నేటినుండి ఏడవనాడు వివాహం సంపన్నం కాగలదు. లోకాచారాన్ననుసరించి నేను మహోత్సవాన్ని చేస్తాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి శ్రుత్వా వచస్తస్య శంకరస్య పరాత్మనః ।**
**ప్రసన్నధీః ప్రభుం నత్వా తాత త్వం వాక్యమబ్రవీః ॥17॥**

ఓ కుమారా! శంకరుని మాటలు విని ప్రసన్నాత్ముడవైన నీవు ఆ ప్రభువునకు నమస్కరించి ఇలా పలికావు.

**నారద ఉవాచ –** నారదుడు చెప్పాడు.

**భవతస్తు వ్రతమిదం భక్తవశ్యో భవాన్మతః ।**
**సమ్యక్ కృతం చ భవతా పార్వతీమానసేప్సితమ్ ॥18॥**

ఇది నీ వ్రతం. నీవు భక్తవశ్యుడవని చెబుతారు. పార్వతీదేవి మనస్సులోని కోర్కెను తీర్చి నీవు మంచిపని చేశావు.

**కార్యం మత్సదృశం కించిత్కథనీయం త్వయా విభో ।**
**మత్వా స్వసేవకం మాం హి కృపాం కురు నమోఽస్తు తే ॥19॥**

హే విభో! నీవునన్ను నీ సేవకునిగా భావించి, నాకు తగిన కార్యంలో నన్ను నియోగించు. నాయందు దయచూపుము. నీకు నమస్కారము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తస్తు త్వయా శంభుశ్శంకరో భక్తవత్సలః ।**
**ప్రత్యువాచ ప్రసన్నాత్మా సాదరం త్వాం మునీశ్వర ॥20॥**

ఓ మహర్షీ! నీవట్లు పలుకగా భక్తవత్సలుడైన శంకరుడు ప్రసన్నాత్ముడై సాదరంగా నీతో ఇలా పలికాడు.

**శివ ఉవాచ –** శివుడు చెప్పాడు.

**విష్ణుప్రభృతి దేవాంశ్చ మునీన్ సిద్ధానపి ధ్రువమ్ ।**
**త్వం నిమంత్రయ మద్వాణ్యా మునేఽన్యానపి సర్వతః ॥21॥**

ఓ మునీ! విష్ణువు మొదలైన దేవతలను, మునులను, సిద్ధులను, ఇతరులనందరినికూడ నామాటగా నీవు తప్పనిసరిగా ఆహ్వానించు.

**సర్వ ఆయాంతు సోత్సాహా స్సర్వశోభాసమన్వితాః ।**
**సస్త్రీసుతగణాఃప్రీత్యా మమ శాసనగౌరవాత్ ॥22॥**

అందరు నాశాసనమునందలి ఆదరంతో, ఉత్సాహంతో సర్వశోభా సమన్వితులై, భార్యాపుత్రులతో పరివారంతోకూడా, ప్రీతితో వచ్చెదరుగాక!

**నాగమిష్యన్తి యే త్వత్ర మద్వివాహోత్సవే మునే ।**
**తే స్వకీయా న మంతవ్యా మయా దేవాదయః ఖలు ॥23॥**

ఓ మునీ! దేవతలు మున్నగువారెవరైతే ఈవివాహ మహోత్సవానికి రారో, వారిని నేను నావారని భావించలేను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇతీశాజ్ఞాం తతో ధృత్వా భవాన్ శంకరవల్లభః ।**
**సర్వాన్నిమంత్రయామాస తం తం గత్వా ద్రుతం మునే ॥24॥**

ఓ మునీ! శివునకు ప్రియుడవైన నీవు శివాజ్ఞను స్వీకరించి, అందరివద్దకు వ్యక్తిగతంగా వెళ్ళి, ఆహ్వానించావు.

**శంభూపకంఠమాగత్య శ్రుతం మునివరో భవాన్ ।**
**తద్దూత్యా త్త్రత సంతస్థౌ తదాజ్ఞాం ప్రాప్య నారద ॥25॥**

నారదా! నీవు శివుని దూతవై, ఆయన ఆజ్ఞను నిర్వర్తించి, వెనువెంటనే శివునివద్దకు వచ్చి, నిలబడ్డావు.

**శివోఽపి తస్థౌ సోత్కంఠ స్తదాగమనలాలసః ।**
**స్వగణై స్సోత్సవై స్సర్వై ర్నృత్యద్భి స్సర్వతో దిశమ్ ॥26॥**

శివుడు కూడా ముహూర్తం కొరకు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాడు. శివగణాలన్నీ అన్నిదిక్కులందు నాట్యంచేస్తూ, ఉత్సవాన్ని చేసుకున్నాయి.

**ఏతస్మిన్నేవకాలే తు రచయిత్వా స్వవేషకమ్ ।**
**ఆజగామాచ్యుత శ్శీఘ్రం కైలాసం సపరిచ్ఛదః ॥27॥**

అదేకాలంలో విష్ణువు తనవేషాన్ని ధరించి, పరివారముతోకూడి, శీఘ్రంగా కైలాసానికి వచ్చాడు.

**శివం ప్రణమ్య సద్భక్త్యా సదారస్సదళో ముదా ।**
**తదాజ్ఞాం ప్రాప్య సంతస్థౌ సుస్థానే ప్రీతమానసః ॥28॥**

ఆయన భార్యతో, గణాలతోగూడి శివునకు ఆనందంతో, పూర్ణభక్తితో నమస్కరించి, ఆయన ఆజ్ఞనుపొంది, ప్రీతమానసుడై, చక్కని స్థానంలో నివసించాడు.

**తథాహం స్వగణైరాశు కైలాసమగమం ముదా ।**
**ప్రభుం ప్రణమ్యాతిష్ఠం వై సానంద స్స్వగణాన్వితః ॥29॥**

అదే విధంగా నేనుకూడా నాగణాలతోకూడి, ఆనందంతో వెంటనే కైలాసానికి వెళ్ళి, గణాలతోసహా శివునకు నమస్కరించి, ఆనందంగా మకాము చేశాను.

**ఇంద్రాదయో లోకపాలా ఆయయుః సపరిచ్ఛదాః ।**
**తథైవాలంకృతాస్సర్వే సోత్సవాస్సకళత్రకాః ॥30॥**

ఇంద్రాది లోకపాలురందరు చక్కగా అలంకరించుకొని, తమ భార్యలతో, పరివారంతోకూడి, ఉత్సాహంతో విచ్చేశారు.

**తథైవ మునయో నాగాస్సిద్ధా ఉపసురాస్తథా ।**
**ఆయయుశ్చాపరేఽపీహ సోత్సవా స్సునిమన్త్రితాః ॥31॥**

అటే ఆహ్వానింపబడిన మునులు, నాగులు, సిద్ధులు, ఉపదేవతలు, ఇతరులందరు ఉత్సాహంతో కైలాసానికి విచ్చేశారు.

**మహేశ్వరస్తదా తత్రాగతానాం చ పృథక్ పృథక్ ।**
**సర్వేషామమరాద్యానాం సత్కారం వ్యదధాన్ముదా ॥32॥**

అప్పుడు మహేశ్వరుడు అక్కడకు వచ్చిన దేవతాదులందరికి వ్యక్తిగతంగా సత్కారాలను ఆనందంతో చేశాడు.

**అథోత్సవో మహానాసీ త్కైలాసే పరమోఽద్భుతః ।**
**నృత్యాదికాన్ తదాచ్రక్రుర్యథాయోగ్యం సురస్త్రియః ॥33॥**

అనంతరం కైలాసంలో పరమాద్భుతమైన మహోత్సవం జరిగింది. అప్పుడు దేవతా స్త్రీలు యథోచితంగా నాట్యాదులు చేశారు.

**ఏతస్మిన్సమయే దేవా విష్ణ్వాద్యా యే సమాగతాః ।**
**యాత్రాం కారయితుం శంభోస్తత్రోషుస్తేఽఖిలా మునే ॥34॥**

ఆసమయంలో అచ్చటకు విచ్చేసిన విష్ణువు మున్నగు దేవతలందరు శంభుని వివాహయాత్రను సుసంపన్నం చేయడానికి అచ్చటనే నివాసమున్నారు.

**శివాజ్ఞప్తా స్తదా సర్వే మదీయమితి యంత్రితాః ।**
**శివకార్యమిదం సర్వం చక్రిరే శివసేవనమ్ ॥35॥**

శివునిచే ఆజ్ఞాపింపబడినవారందరు శివకార్యమునంతటిని స్వకార్యంగా భావించి, శివుని సేవించారు.

**మాతరస్సప్త తాస్తత్ర శివభూషావిధిం పరమ్ ।**
**చక్రిరే చ ముదా యుక్తా యథాయోగ్యం తథా పునః ॥36॥**

కైలాసంలో సప్తమాతృకలు శివునకు చక్కని యథోచితరీతిని, అలంకారవిధిని, ఆనందంతో నిర్వర్తించారు.

**తస్య స్వాభావికో వేషో భూషావిధిరభూత్తదా ।**
**తస్యేచ్ఛయా మునిశ్రేష్ఠ పరమేశస్య సుప్రభోః ॥37॥**

పరమేశ్వరుడైన శివప్రభుని ఇచ్ఛతో ఆయనయొక్క సహజవేషమే అలంకారవిధిగా మారిపోయింది.

**చంద్రశ్చ ముకుటస్థానే సాన్నిధ్య మకరోత్తదా ।**
**లోచనం సుందరం హ్యాసీ తృతీయం తిలకం శుభమ్ ॥38॥**

చంద్రుడు కిరీటంగా రూపుదిద్దుకున్నాడు. సుందరమైన మూడవకన్ను శుభతిలకంగా మారిపోయింది.

**కర్ణాభరణరూపౌ చ యౌ హి సర్పౌ ప్రకీర్తితౌ ।**
**కుండలేஉభవతాం తస్య నానారత్నాన్వితే మునే ॥39॥**

ఓ మునీ! రెండు సర్పాలు అనేక రత్నాలతోకూడిన కర్ణకుండలాలుగా రూపుదాల్చాయి.

**అన్యాంగ సంస్థితా స్సర్పా స్తదంగాభరణాని చ ।**
**బభూవు రతిరమ్యాణి నానారత్నమయాని చ ॥40॥**

తక్కిన అవయవాలయందుండే సర్పాలు ఆయా అంగాలకు అతిరమ్యములు, నానారత్నమయములైన ఆభరణాలుగాను రూపుదిద్దుకున్నాయి.

**విభూతిరంగరాగోஉభూచ్చందనాది సముద్భవః ।**
**తద్దుకూల మభూద్దివ్యం గజచర్మాది సుందరమ్ ॥41॥**

విభూతి గంధాదులతో కూడిన అంగవిలేపనమయ్యింది. గజచర్మం దివ్యము సుందరమునైన పట్టువస్త్రమయ్యింది.

**ఈదృశం సుందరం రూపం జాతం వర్ణాతి దుష్కరమ్ ।**
**ఈశ్వరోஉపి స్వయం సాక్షాదైశ్వర్యం లబ్ధవాన్ స్వతః ॥42॥**

ఆయన ఇట్టి వర్ణింప శక్యంగాని సుందర రూపాన్ని పొందాడు. ఈశ్వరుడే స్వయంగా ఐశ్వర్యాన్ని పొందాడు.

**తతశ్చ సర్వే సుర పక్ష దానవా నాగాః పతంగాప్సరసో మహర్షయః ।**
**సమేత్య సర్వే శివసన్నిధిం తదా మహోత్సవాః ప్రోచురహో ముదాన్వితాః ॥43॥**

అంతట దేవతలు, రాక్షసులు, యక్షులు, నాగులు, పతంగములు, అప్సరసలు, మహర్షులు తదితరులందరు మహోత్సాహంతో శివుని సన్నిధికి వచ్చి, ఆనందభరితులై, ఆశ్చర్యంతో ఇలా పలికారు.

**సర్వ ఊచుః –** అందరూ పలికారు.

**గచ్ఛ గచ్ఛ మహాదేవ వివాహార్థం మహేశ్వర ।**
**గిరిజాయా మహాదేవ్యాః సహాస్మాభిః కృపాం కురు ॥44॥**

ఓ మహాదేవా! మహేశ్వరా! పార్వతీమహాదేవిని వివాహమాడడానికి శీఘ్రమే బయలుదేరండి. దయను చూపండి.

**తతో విష్ణురువాచేదం ప్రస్తావసదృశం వచః ।**
**ప్రణమ్య శంకరం భక్త్యా విజ్ఞాన ప్రీతమానసః ॥45॥**

అప్పుడు విజ్ఞాన ప్రీతమానసుడైన విష్ణువు భక్తితో శంకరునికి నమస్కరించి, సందర్భోచితంగా ఇలా పలికాడు.

**విష్ణురువాచ –** విష్ణువు పలికాడు.

**దేవదేవ మహాదేవ శరణాగతవత్సల ।**
**కార్యకర్తా స్వభక్తానాం విజ్ఞప్తిం శృణు మే ప్రభో ॥46॥**

ఓ దేవదేవా! మహాదేవా! శరణాగత వత్సలా! నీవు నీ భక్తుల కార్యాలను చక్కబెడతావు. నా విన్నపాన్ని విను.

**గృహ్యోక్తవిధినా శంభో స్వవివాహస్య శంకర ।**
**గిరీశసుతయా దేవ్యా కర్మ కర్తుమిహార్హసి ॥47॥**

శంభో! శంకరా! నీవు పార్వతీదేవిని గృహ్యోక్త విధిలో వివాహ మాడదగినవాడవు.

**త్వయా చ క్రియమాణే తు వివాహస్య విధే హర ।**
**స ఏవ హి తథా లోకే సర్వస్సుఖ్యాతిమాప్నుయాత్ ॥48॥**

ఓ శివా! నీవు వివాహ విధిని పాటిస్తే లోకమంతటా ఆవిధిగా ఖ్యాతిని పొందుతుంది.

**మండపస్థాపనం నాందీముఖం తత్కుల ధర్మతః ।**
**కారయ ప్రీతితో నాథ లోకే స్వం ఖ్యాపయన్ యశః ॥49॥**

ఓ నాథా! వారి కులధర్మాన్ననుసరించి, మండపస్థాపన, నాందీముఖం, ప్రీతిపూర్వకంగా అనుష్ఠించి, లోకంలో నీకీర్తిని విస్తరింపజేయుము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఏవముక్తస్తదా శంభుర్విష్ణునా పరమేశ్వరః ।**
**లౌకికాచారనిరతో విధినా తచ్చకార సః ॥50॥**

విష్ణువిట్లు పలుకగా లోకాచార నిరతుడైన శంభుపరమేశ్వరుడు యథావిధిగా ఆ కర్మలనన్నిటిని చేశాడు.

**అహం హ్యధికృతస్తేన సర్వమభ్యుదయోచితమ్ ।**
**అకుర్వం మునిభిః ప్రీత్యా తత్ర తత్కర్మ చాదరాత్ ॥51॥**

ఆయనచే నియమింపబడిన నేను మునులతోకూడి, అభ్యుదయోచితమైన కర్మలనన్నింటినీ ప్రీతితో ఆదరంతో చేశాను.

**కశ్యపోఽత్రి ర్వశిష్ఠశ్చ గౌతమో భాగురిర్గురుః ।**
**కణ్వో బృహస్పతిశ్శక్తి ర్జమదగ్నిః పరాశరః ॥52॥**

**మార్కండేయశ్శిలాపాకోఽరుణపాలోఽకృతశ్రమః ।**
**అగస్త్య శ్చ్యవనో గర్గశ్శిలాదోఽథ మహామునే ॥53॥**

ఓ మహర్షీ! కశ్యపుడు, అత్రి, వసిష్ఠుడు, గౌతముడు, భాగురి, గురుడు, కణ్వుడు, బృహస్పతి, శక్తి, జమదగ్ని, పరాశరుడు, మార్కండేయుడు, శిలాపాకుడు, అరుణపాలుడు, అకృతశ్రముడు, అగస్త్యుడు, చ్యవనుడు, గర్గుడు, శిలాదుడు అచ్చటకు విచ్చేశారు.

**దధీచి రుపమన్యుశ్చ భరద్వాజోఽకృతవ్రణః ।**
**పిప్పలాదోఽథ కుశికః కౌత్సో వ్యాసః సశిష్యకః ॥54॥**

**ఏతే చాన్యే చ బహవ ఆగతా శ్శివసన్నిధిమ్ ।**
**మయా సునోదితాస్తత్ర చక్రుస్తే విధివత్క్రియామ్ ॥55॥**

దధీచి, ఉపమన్యువు, భరద్వాజుడు, అకృతవ్రణుడు, పిప్పలాదుడు, కుశికుడు, కౌత్సుడు, వ్యాసుడు, అతని శిష్యులు ఇంకా ఎందరో ఇతరులు శివుని సన్నిధికి వచ్చియున్నారు. వారందరు నాప్రేరణచే అచట వైవాహిక కర్మను యథావిధిగా నిర్వర్తించారు.

**వేదోక్తవిధినా సర్వే వేద వేదాంగపారగాః ।**
**రక్షాం చక్రుర్మహేశస్య కృత్వా కౌతుకమంగళమ్ ॥56॥**

వేదవేదాంగవేత్తలైన వారందరు మహేశ్వరునకు వేదోక్త విధానంగా పవిత్ర వివాహ కర్మకు మంగళాన్ని కలిగించే రక్షాబంధనాన్ని నిర్వర్తించారు.

**ఋగ్యజుస్సామ సూక్తైస్తు తథా నానావిధైః పరైః ।**
**మంగళాని చ భూరీణి చక్రుః ప్రీత్యర్షయోఽఖిలాః ॥57॥**

ఆ ఋషులందరు ఋగ్యజుస్సామవేదములందలి సూక్తాలను, ఇతరములైన వివిధ ఆశీర్వచనాలను పఠించి, ప్రేమతో విస్తృతమైన మంగళాశాసనం చేశారు.

**గ్రహాణాం పూజనం ప్రీత్యా చక్రుస్తే శంభునా మయా ।**
**మండలస్థ సురాణాం చ సర్వేషాం విఘ్నశాంతయే ॥58॥**

వారు శంభునిచే గ్రహపూజను ఆనందంతో చేయించారు. విఘ్న నివారణ కొరకు మండపాన్ని స్థాపించి, దానియందు దేవతలనందరిని ఆరాధించారు.

**తతశ్శివస్సుసంతుష్టః కృత్వా సర్వం యథోచితమ్ ।**
**లౌకికం వైదికం కర్మ ననామ చ ముదా ద్విజాన్ ॥59॥**

అప్పుడు శివుడు లౌకిక, వైదిక కర్మలన్నింటిని యథాయోగ్యంగా చేసి, ఆ బ్రాహ్మణులకు ఆనందంతో నమస్కరించాడు.

**అథ సర్వేశ్వరో విప్రాన్ దేవాన్కృత్వా పురస్సరాన్ ।**
**నిస్ససార ముదా తస్మాత్కైలాసా త్పర్వతోత్తమాత్ ॥60॥**

అప్పుడు సర్వేశ్వరుడైన శివుడు దేవతలను, బ్రాహ్మణులను ముందిడుకొని, పర్వతరాజమైన కైలాసంనుండి, ఆనందంతో బయలుదేరాడు.

**బహిః కైలాస కుధరాచ్ఛంభుస్తస్థౌ ముదాన్వితః ।**
**దేవైస్స ద్విజైశ్చైవ నానాస్వీకారకః ప్రభుః ॥61॥**

అనేక లీలలను నెరపు శంభుప్రభుడు ఆనందంగా, దేవతలతో, ఋషులతోగూడి కైలాసపర్వతానికి బయట నిలబడ్డాడు.

**తదోత్సవో మహానాసీత్తత్ర దేవాదిభిః కృతః ।**
**సంతుష్ట్యర్థం మహేశస్య గానవాద్య సునృత్యకః ॥62॥**

అప్పుడు దేవతలు మహేశుని సంతోషం కొరకు గాన వాద్య నృత్యాలతో అలరారే ఉత్సవాన్ని జరిపించారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే దేవనిమన్త్రణ, దేవాగమన శివయాత్రావర్ణనం నామైకోన చత్వారింశోఽధ్యాయః ॥39॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో దేవనిమంత్రణ దేవాగమన శివయాత్రావర్ణనం అనే ముప్పై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## **చత్వారింశోఽధ్యాయః** - నలబైయవ అధ్యాయం

## **యాత్రావర్ణనమ్** - శివయాత్రనువర్ణించుట

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథ శంభుః సమాహూయ నంద్యాదీన్ సకలాన్ గణాన్ ।**
**ఆజ్ఞాపయామాస ముదా గంతుం స్వేన చ తత్ర వై ॥1॥**

అప్పుడు శంభుడు నంది మున్నగు గణాలనందరిని పిలిచి, తనతోబాటు ఆనందంతో వివాహానికి రమ్మని ఆజ్ఞాపించాడు.

శివ ఉవాచ - శివుడు చెప్పాడు.

**అపి యూయం సహ మయా సంగచ్ఛధ్వం గిరేఃపురమ్ ।**
**కియద్గణానిహాస్థాప్య మహోత్సవ పురస్సరమ్ ॥2॥**

కొద్ది గణాలనిచ్చట ఉంచి, మీరుకూడా నాతోబాటు మహోత్సవాన్ని జరుపుకుంటూ, హిమవన్నగరానికి పయనించండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథ తే సమనుజ్ఞప్తా గణేశా నిర్యయుర్ముదా ।**
**స్వం స్వం బలముపాదాయ తాన్ కథంచిద్వదామ్యహమ్ ॥3॥**

అప్పుడు శివునిచే ఆజ్ఞాపించబడిన గణనాయకులు ఆనందంతో తమతమ సైన్యాలను తీసుకొని, బయలుదేరారు. సేనా వివరాలను కొంత శ్రమపడి వర్ణిస్తాను.

**అభ్యగాచ్ఛంఖ కర్ణశ్చ గణకోట్యా గణేశ్వరః ।**
**శివేన సార్ధం సంగన్తుం హిమాచలపురం ప్రతి ॥4॥**

శంఖకర్ణుడనే గణాధ్యక్షుడు కోటి గణాలతోకూడి శివునితోబాటు హిమవంతుని నగరానికి బయలుదేరాడు.

**దశకోట్యా కేకరాక్షో గణానాం సమహోత్సవః ।**
**అష్టకోట్యా చ వికృతో గణానాం గణనాయకః ॥5॥**

**చతుష్కోట్యా విశాఖశ్చ గణానాం గణనాయకః ।**
**పారిజాతశ్చ నవభిః కోటిభిర్గణపుంగవః ॥6॥**

మహోత్సవాన్ని చేస్తూ కేకరాక్షుడు పదికోట్ల గణాలతోను, వికృతుడు ఎనిమిదికోట్ల గణాలతోనూ, విశాఖుడనే గణనాయకుడు నాలుగు కోట్ల గణాలతోను, పారిజాతుడు అనే గణాధ్యక్షుడు తొమ్మిదికోట్ల గణాలతోను బయలుదేరారు.

**షష్టి స్సర్వాంతకః శ్రీమాన్ తథైవ వికృతాననః ।**
**గణానాం దుందుభో౽ష్టాభిః కోటి కోటిభి ర్గణనాయకః ॥7॥**

శ్రీమంతుడైన సర్వాంతకుడు అరవై, వికృతాననుడు అరవై, దుందుభుడనే గణాధ్యక్షుడు ఎనిమిదికోట్ల గణాలతోను బయలుదేరారు.

**పంచభిశ్చ కపాలాఖ్యో గణేశః కోటిభిస్తథా ।**
**షడ్భిస్సందారకో వీరో గణానాం కోటిభిర్మునే ॥8॥**

**కోటి కోటిభిరేవేహ కందుకః కుండక స్తథా ।**
**విష్టంభో గణపో౽ష్టాభిర్గణానాం కోటిభి స్తథా ॥9॥**

**సహస్రకోట్యా గణపః పిప్పలో ముదితో యయౌ ।**
**తథా సంనాదకో వీరో గణేశో మునిసత్తమ ॥10॥**

కపాలుడను గణాధ్యక్షుడు ఐదుకోట్లు, సందారకుడు ఆరుకోట్లు, వీరుడు ఒకకోటి గణాలతోను కందుక కుండకులు ఒక్కొక్క కోటి గణాలతోను, విష్ఠంభుడు ఎనిమిది కోట్ల గణాలతోను, పిప్పలుడనే గణాధ్యక్షుడు వేయికోట్ల గణాలతోను ఆనందంతో బయలుదేరారు. వీరుడైన సంనాదకుడనే గణాధ్యక్షుడుకూడా వెళ్ళాడు.

**ఆవేశనస్తథాష్టాభిః కోటిభిర్గణనాయకః ।**
**మహాకేశ స్సహస్రేణ కోటీనాం గణపో యయౌ ॥11॥**

ఓ మహర్షీ! ఆవేశనుడనే గణనాయకుడు ఎనిమిది కోట్ల గణాలతోను, మహాకేశుడు వేయికోట్ల గణాలతోను వెళ్ళారు.

**కుండో ద్వాదశకోట్యా హి తథా పర్వతకో మునే ।**
**అష్టాభిః కోటిభిర్వీరస్సమగాచ్చంద్రతాపనః ॥12॥**

కుండుడు పన్నెండు, పర్వతకుడు పన్నెండు, వీరుడైన చంద్రతాపనుడు ఎనిమిది కోట్ల గణాలతోను వెళ్లారు.

**కాలశ్చ కాలకశ్చైవ మహాకాలశ్శతేన వై ।**
**కోటీనాం గణనాథో హి తథైవాగ్నిక నామకః ॥13॥**

**కోట్యగ్నిముఖ ఏవాగాద్ గణానాం గణనాయకః ।**
**ఆదిత్యమూర్ధా కోట్యా చ తథా చైవ ధనావహః ॥14॥**

కాలుడు, కాలకుడు, మహాకాలుడు, అగ్నికుడు అనే గణనాయకులు కోటి చొప్పున, అగ్నిముఖుడనే గణనాయకుడు కోటి, ఆదిత్యమూర్ధుడు, ఘనావహుడు కోటిగణాలతో నడిచారు.

**సన్నాహశ్శతకోట్యా హి కుముదో గణపస్తథా ।**
**అమోఘః కోకిలశ్చైవ శతకోట్యా గణాధిపః ॥15॥**

సన్నాహుడు, కుముదుడు, అమోఘుడు, కోకిలుడను గణనాయకులు వంద కోట్ల చొప్పున గణాలతో బయలుదేరారు.

**సుమంత్రః కోటి కోట్యా చ గణానాం గణనాయకః ।**
**కాకపాదోదరః కోటిషష్ట్యా సంతానక స్తథా ॥16॥**

**మహాబలశ్చ నవభిర్మధు పింగశ్చ కోకిలః ।**
**నీలో నవత్యా కోటీనాం పూర్ణభద్రస్తథైవ చ ॥17॥**

**సప్తకోట్యా చతుర్వక్త్రః కరణో వింశకోటిభిః ।**
**యయౌ నవతికోట్యా తు గణేశానో హి రోమకః ॥18॥**

సుమంత్రుడనే గణనాయకుడు ఒక కోటి, కాకపాదోదరుడు, సంతానకుడు అరవైకోట్ల చొప్పున మహాబలుడు తొమ్మిది, మధుపింగుడు తొమ్మిది. నీలుడు తొంభై, పూర్ణభద్రుడు తొంభైకోట్ల గణాలతోను, చతుర్వక్త్రుడు ఏడుకోట్లు, కరణుడు ఇరవైకోట్ల గణాలతోను, అహిరోమకుడు తొంభైకోట్ల గణాలతోను బయలుదేరారు.

**యజ్వాశశ్శతమన్యుశ్చ మేఘమన్యుశ్చ నారద ।**
**తావత్కోట్యా యయుస్సర్వే గణేశా హి పృథక్ పృథక్ ॥19॥**

ఓ నారదా! యజ్వాశుడు, శతమన్యుడు, మేఘమన్యుడు అనే గణనాయకులు విడివిడిగా ఒక్కొక్కరు కోటి గణాలతో బయలుదేరారు.

**కాష్టాంగుష్ఠ శ్చతుష్షష్ట్యా కోటీనాం గణనాయకః ।**
**విరూపాక్ష స్సుకేశస్య వృషాభశ్చ సనాతనః ॥20॥**

**తాలకేతుః షడాస్యశ్చ చంచ్వాస్యశ్చ సనాతనః ।**
**సంవర్తకస్తథా చైత్రో లకులీశస్స్వయం ప్రభుః ॥21॥**

**లోకాంతకశ్చ దీప్తాత్మా తథా దైత్యాంతకో మునే ।**
**దేవో భృంగిరిటి శ్రీమాన్ దేవ దేవ ప్రియస్తథా ॥22॥**

కాష్టాంగుష్ఠడనే గణనాయకుడు అరవైనాలుగు కోట్ల గణాలతో బయలుదేరారు. విరూపాక్షుడు, సుకేశుడు, వృషాభుడు, సనాతనుడు, తాలకేతుడు, షడాస్యుడు, చంచ్వాస్యుడు, సంవర్తకుడు, చైత్రుడు, లకులీశుడు, స్వయంప్రభుడు, దీప్తాత్ముడు, లోకాంతకుడు, దైత్యాంతకుడు, శోభాసంపన్నుడై దేవదేవునకు ప్రియుడునగు భృంగిరిటిదేవుడు బయలుదేరారు.

**అశనిర్భానుకశ్చైవ చతుష్షష్ట్యా సహస్రశః ।**
**యయుశ్శివ వివాహార్థం శివేన సహసోత్సవాః ॥23॥**

అశని, భానుకుడు అరవైనాలుగువేల గణాలతోకూడి, శివుని వివాహం కొరకు ఉత్సాహంతో శివుని వెంట నడిచారు.

**భూతకోటి సహస్రేణ ప్రమథాః కోటిభిస్త్రిభిః ।**
**వీరభద్ర చతుష్షష్ట్యా రోమజానాం త్రికోటిభిః ॥24॥**

ఒకకోటి భూతగణములు, మూడుకోట్లప్రమథ గణములు రోమజులున అరవైనాలుగుకోట్లతో వీర భద్రుడు, మూడుకోట్ల రోమజులు

**కోటికోటిసహస్రాణాం శతైర్వింశతిభిర్వృతాః ।**
**తత్ర జగ్ముశ్చ నంద్యాద్యా గణపాశ్శంకరోత్సవే ॥25॥**

నంది మున్నగు గణాధ్యక్షులు పదకొండు వందల ఇరవైకోట్ల గణాలతో శంకరుని వివాహ మహోత్సవానికి విచ్చేశారు.

**క్షేత్రపాలో భైరవశ్చ కోటికోటిగణైర్యుతః ।**
**ఉద్వాహ శ్శంకరస్యేత్యాయయౌ ప్రీత్యా మహోత్సవే ॥26॥**

క్షేత్రపాలుడైన భైరవుడు శంకరుని వివాహ మహోత్సవానికి కోటి గణాలతోకూడి, ఆనందంతో విచ్చేశాడు.

**ఏతే చాన్యే చ గణపా అసంఖ్యాతా మహాబలాః ।**
**తత్ర జగ్ముర్మహాప్రీత్యా సోత్సాహా శ్శంకరోత్సవే ॥27॥**

వీరుమాత్రమేగాక మహాబలశాలురైన గణాధ్యక్షులు లెక్కలేనంతమంది శంకరుని వివాహానికి ఆనందంతో, ఉత్సాహంతో హిమవంతుని రాజధానికి వెళ్ళారు.

**సర్వే సహస్రహస్తాశ్చ జటాముకుటధారిణః ।**
**చంద్రరేఖావతంసాశ్చ నీలకంఠా స్త్రిలోచనాః ॥28॥**

వారందరు వేయి భుజాలు కలవారు. జటలను, కిరీటాలను ధరించినవారు. చంద్రరేఖను శిరస్సుపై ఆభరణంగా ధరించినవారు. నీలవర్ణంతో కూడిన కంఠం కలవారు. త్రిలోచనులునై యున్నారు.

**రుద్రాక్షాభరణాస్సర్వే తథా సద్భస్మధారిణః ।**
**హారకుండలకేయూర ముకుటాద్యై రలంకృతాః ॥29॥**

వారందరు రుద్రాక్షమాల ఆభరణంగా గలవారు, చక్కని భస్మాన్ని ధరించినవారు. హారకుండల కేయూర ముకుటాద్యాభరణాలచే అలంకరింపబడినవారు.

**బ్రహ్మవిష్ణ్వింద్ర సంకాశా అణిమాది గుణైర్యుతాః ।**
**సూర్యకోటి ప్రతీకాశాస్తత్ర రేజుర్గణేశ్వరాః ॥30॥**

బ్రహ్మ, విష్ణువు, ఇంద్రులను పోలియున్నవారు, అణిమాది సిద్ధులు కలవారుగానున్న ఆ గణాధ్యక్షులు కోటి సూర్య కాంతులతో ప్రకాశించారు.

**పృథివీచారిణః కేచిత్ కేచిత్పాతాళచారిణః ।**
**కేచిద్వ్యోమచరాః కేచిత్సప్తస్వర్గచరా మునే ॥31॥**

ఓ మునీ! వారిలో కొందరు భూమియందు, మరికొందరు పాతాళమందు, కొందరు ఆకాశమందు, ఇంకొందరు సప్తస్వర్గాలలోను చరిస్తూ ఉంటారు.

**కిం బహూక్తేన దేవర్షే సర్వలోక నివాసినః ।**
**ఆయయుస్స్వగణాశ్శంభోః ప్రీత్యా వై శంకరోత్సవే ॥32॥**

ఓ దేవర్షీ! పెక్కుమాటలేల? సర్వలోకాలలోనుండే శంభుని గణాలు శంకరుని వివాహానికి ఆనందంతో విచ్చేశారు.

**ఇత్థం దేవైర్గణైశ్చాన్యై స్సహితశ్శంకరః ప్రభుః ।**
**యయౌ హిమగిరిపురం వివాహార్థం నిజస్య వై ॥33॥**

ఈవిధంగా దేవతలతో, గణాలతో, ఇతరులతో కూడిన శంకరప్రభుడు తన వివాహం కొరకు హిమవంతుని రాజధానికి వెళ్ళాడు.

**యదా జగామ సర్వేశో వివాహార్థం సురాదిభిః ।**
**తదా తత్ర హ్యభూద్వృత్తం తచ్ఛృణు త్వం మునీశ్వర ॥34॥**

ఓ మహర్షీ! సర్వేశ్వరుడైన శివుడు దేవతలు మున్నగువారితో కలిసి వివాహం కొరకై వెళ్ళిన సమయంలో అచ్చట ఒక వృత్తాంతం జరిగింది. దానిని నీవు వినుము.

**రుద్రస్య భగినీ భూత్వా చండీ సూత్సవసంయుతా ।**
**తత్రాజగామ సుప్రీత్యా పరేషాం సుభయావహా ॥35॥**

రుద్రుని సోదరియైన చండి మహోత్సాహంతో, ఆనందంతో, ఇతరులకు చాల భయాన్ని కలిగిస్తు, అచ్చటకు వచ్చింది.

**ప్రేతాసనసమారూఢా సర్పాభరణభూషితా ।**
**పూర్ణం కలశమాదాయ హైమం మూర్ధ్ని మహాప్రభమ్ ॥36॥**

**స్వపరీవారసంయుక్తా దీప్తాస్యా దీప్తలోచనా ।**
**కుతూహలం ప్రకుర్వంతీ జాతహర్షా మహాబలా ॥37॥**

ప్రేతమునందు ఆసీనురాలై, సర్పములను ఆభరణములుగా ధరించి, బంగారముతో కుడిన క్షేత్రాసన సమారూఢయై, సర్పాభరణ భూషితయై, శిరస్సుపై, గొప్పకాంతులను వెదజల్లే బంగారు పూర్ణకలశాన్ని తలపై

ధరించి, తన సహచరులతోకూడి యున్నదై, ఎర్రని ముఖము, ఎర్రని నేత్రాలు గలదియై, గొప్ప హర్షంతో సర్వులకు ఉత్కంఠను రేకెత్తించుచున్నదియై, మహాబలవతియై, చండి వచ్చింది.

**తత్ర భూతగణా దివ్యా విరూపాః కోటిశో మునే ।**
**విరాజంతేస్మ బహుశస్తథా నానావిధాస్తదా ॥38॥**

ఓ మునీ! అచ్చట దివ్యములైన భూతగణాలు, అనేక రూపాలవారు, కోట్లాదిసంఖ్యలో విరాజిల్లారు.

**తై స్సమేతాగ్రతశ్చండీ జగామ వికృతాననా ।**
**కుతూహాలాన్వితా ప్రీతా ప్రీత్యుపద్రవకారిణీ ॥39॥**

వికృతాననయైన చండి వారినెదుట నుంచుని కుతూహలంతో, ఆనందంతో, ఉపద్రవాన్ని సృష్టిస్తున్నదై నడచింది.

**చండ్యా సర్వే రుద్రగణాః పృష్ఠతశ్చ కృతాస్తదా ।**
**కోట్యేకాదశ సంఖ్యాకా రౌద్ర రుద్ర ప్రియాశ్చ తే ॥40॥**

రుద్రునకు ప్రియమైన, భయంకరాకారులైన పదకొండు కోట్ల రుద్రగణాలు అప్పుడామెను అనుసరించాయి.

**తదా డమరు నిర్ఘోషై ర్వ్యాప్తమాసీజ్జగత్రయమ్ ।**
**భేరీ ఝుంకార శబ్దేన శంఖానాం నినదేన చ ॥41॥**

అపుడు ముల్లోకాలు డమరు ధ్వనులతో, భేరీ ఝుంకారాలతో, శంఖనాదాలతో నిండిపోయాయి.

**తథా దుందుభి నిర్ఘోషైశ్శబ్దః కోలాహలోఽభవత్ ।**
**కుర్వన్ జగన్ మంగలం చ నాశయేన్మంగళేతరత్ ॥42॥**

అట్లే కోలాహలంగానున్న దుందుభిధ్వని జగత్తులోని అమంగళాలను నశింపజేసి, జగత్తును మంగళమయం చేసింది.

**గణానాం పృష్ఠతో భూత్వా సర్వే దేవాస్సముత్సుకాః ।**
**అన్వయుస్సర్వ సిద్ధాశ్చ లోకపాలాదికా మునే ॥43॥**

ఓ మునీ! గణాలవెనుక దేవతలు, సిద్ధులు, లోకపాలురు, మున్నగువారందరు ఉత్సాహంతో నడిచారు.

**మధ్యే వ్రజన్ రమేశోఽథ గరుడాసనమాశ్రితః ।**
**శుశుభే ధ్రియమాణేన ఛత్రేణ మహతా మునే ॥44॥**

ఓ మునీ! వారిమధ్యలో గరుడాసనంపై కూర్చుండి, లక్ష్మీపతి వెళుతున్నాడు. ఆయనకు గొడుగు ధరింపబడింది. ఆయన గొప్పగా ప్రకాశించాడు.

**చామరైర్వీజ్యమానోఽసౌ స్వగణైః పరివారితః ।**
**పార్షదైర్విలసద్భిశ్చ స్వభూషావిధిభూషితః ॥45॥**

తన పార్షదులతో విష్ణువు చుట్టబడ్డాడు. కొందరాయనకు వింజామరలు వీస్తున్నారు. ఆయన తన అలంకారాలన్నిటిని ధరించి ఉన్నాడు.

**తథాహమప్యశోభం వై వ్రజన్మార్గే విరాజితః ।**
**వేదైర్మూర్తిధరై శ్శాస్త్రైః పురాణై రాగమై స్తథా ॥46॥**

అదేవిధంగా నేనుకూడా మార్గంలో వెళుతూ శోభిల్లాను. మూర్తిని దాల్చిన వేదశాస్త్రాలతో, పురాణాలతో, ఆగమాలతో, నేను ప్రకాశించాను.

**సనకాది మహాసిద్ధై సప్రజాపతిభిస్సుతైః ।**
**పరివారై స్సంయుతో హి శివసేవనతత్పరః ॥47॥**

సనకాది మహాసిద్ధులు, ప్రజాపతులు, పుత్రులు, పరిచారకులు చుట్టుకొని ఉండగా నేను శివుని సేవించడంలో తత్పరుడనయ్యాను.

**స్వసైన్యమధ్యగశ్శక్ర ఐరావతగజస్థితః ।**
**నానా విభూషితోऽత్యంతం వ్రజన్ రేజే సురేశ్వరః ॥48॥**

ఐరావతగజంపై ఆసీనుడై, అనేక విభూషణాలను అలంకరించుకొని, సురపతియైన ఇంద్రుడు సైన్యం మధ్యలో వెళుతూ ప్రకాశించాడు.

**తదా తు వ్రజమానాస్తే ఋషయో బహవశ్చ తే ।**
**విరేజురతిసోత్కంఠశ్శివస్యోద్వాహనం ప్రతి ॥49॥**

శివుని వివాహానికై, మిక్కిలి ఉత్కంఠతో ప్రయాణం కట్టిన అనేకులగు ఋషులు అప్పుడాయాత్రలో విరాజిల్లారు.

**శాకిన్యో యాతుధానాశ్చ బేతాళా బ్రహ్మరాక్షసాః ।**
**భూతప్రేత పిశాచాశ్చ తథాన్యే ప్రమథాదయః ॥50॥**

శాకినులు, రాక్షసులు, బేతాళులు, బ్రహ్మరాక్షసులు, భూతాలు, ప్రేతాలు, పిశాచాలు, ప్రమథగణాలు తదితరులుకూడా వెళ్ళారు.

**తుంబురుర్నారదో హాహా హూహూ శ్చేత్యాదయో వరాః ।**
**గంధర్వాః కిన్నరా జగ్ముర్వాద్యానాధ్మాయ హర్షితాః ॥51॥**

తుంబురుడు, నారదుడు, హాహా హూహూ మున్నగు గంధర్వ శ్రేష్ఠులు, కిన్నరులు, వాద్యాలను మ్రోగిస్తూ ఆనందంతో ముందుకు సాగారు.

**జగతో మాతరస్సర్వా దేవకన్యాశ్చ సర్వశః ।**
**గాయత్రీ చైవ సావిత్రీ లక్ష్మీరన్యాస్సురస్త్రియః ॥52॥**

గాయత్రి, సావిత్రి, లక్ష్మి మున్నగు జగన్మాతలు, దేవతా స్త్రీలు, దేవకన్యలందరు కూడ వచ్చారు.

**ఏతాశ్చాన్యాశ్చ దేవానాం పత్నయో భవమాతరః ।**
**ఉద్వాహ శ్శంకరస్యేతి జగ్ముస్సర్వా ముదాన్వితాః ॥53॥**

వీరుకాక, ఇతర దేవభార్యలు, జగత్తుకు తల్లులు కూడా శంకరుని వివాహానికి ఆనందంతో విచ్చేశారు.

**శుద్ధస్ఫటికసంకాశో వృషభస్సర్వసుందరః ।**
**యో ధర్మ ఉచ్యతే వేదై శ్శాస్త్రై స్సిద్ధ మహర్షిభిః ॥54॥**

**తమారూఢో మహాదేవో వృషభం ధర్మవత్సలః ।**
**శుశుభేఽతీవ దేవర్షి సేవిత స్సకలైర్వ్రజన్ ॥55॥**

శుద్ధ స్ఫటికంవలె తెల్లనిది, సర్వాంగసుందరమైనది, వేదశాస్త్రాల చేతను, సిద్ధులచేతను, మహర్షులచేతను ధర్మమూర్తియని కొనియాడబడినదియునైనవృషభాన్ని ధర్మవత్సలుడైన మహాదేవుడధిష్ఠించాడు. దేవతలచే, ఋషులచే, ఇతరులందరిచే, సేవింపబడుతూ, పయనిస్తున్న శంకరుడు మిక్కిలి ప్రకాశించాడు.

**ఏభిస్సమేతై స్సఫలైర్మహర్షిభి ర్బభౌ మహేశో బహుశోఽత్యలంకృతః ।**
**హిమాలయాహ్వస్య ధరస్య సంవ్రజన్ పాణిగ్రహార్థం సదనం శివాయాః ॥56॥**

పూర్ణంగా అలంకరింపబడిన మహేశ్వరుడు పార్వతీదేవితో వివాహానికి హిమవంతుని గృహానికి వెళుతున్నవాడై, ఋషులందరితోగూడి ప్రకాశించాడు.

**ఇత్యుక్తం శంభుచరితం గమనం పరమోత్సవమ్ ।**
**హిమాలయ పురోద్భూతం సద్వృత్తం శ్రుణు నారద ॥57॥**

శివుని పరమోత్సవ యాత్రను ఇంతవరకు వర్ణించియున్నాను. ఓ నారదా! హిమాలయ నగరంలో జరిగిన చక్కని వృత్తాంతం విను.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే యాత్రావర్ణనం నామ చత్వారింశోఽధ్యాయః ॥40॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో శివయాత్రను వర్ణించుట అనే నలభైయవ అధ్యాయం సమాప్తం.

## ఏకచత్వారింశోఽధ్యాయః - నలబై ఒకటవ అధ్యాయం

## మండపరచనావర్ణనమ్ - మండప నిర్మాణవర్ణన

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**తత స్సమ్మన్త్ర్య చ మిథః ప్రాప్యాజ్ఞాం శాంకరీం హరిః ।**
**మునే త్వాం ప్రేషయామాస ప్రథమం కుధరాలయమ్ ॥1॥**

ఓ నారదమునీ! అప్పుడు విష్ణువు ఇతరులతో సంప్రదించి, శంకరుని ఆజ్ఞపొంది, ముందుగా నిన్ను (నారదుని) హిమవంతుని గృహానికి పంపాడు.

**అథ ప్రణమ్య సర్వేశం గతస్త్వం నారదాగ్రతః ।**
**హరిణా నోదితః ప్రీత్యా హిమాచలగృహం ప్రతి ॥2॥**

ఓ నారదా! హరిచే ప్రేరితుడవైన నీవు సర్వేశ్వరునికి నమస్కరించి, ముందుగా హిమవంతుని గృహానికి ఆనందంతో వెళ్ళావు.

**త్వం మునేపశ్య ఆత్మానం గత్వా తద్వ్రీడయాన్వితమ్ ।**
**కృత్రిమం రచితం తత్ర విస్మితో విశ్వకర్మణా ॥3॥**

ఓ మునీ! నీవక్కడకువెళ్ళి, విశ్వకర్మచే రచింపబడిన నీ కృత్రిమమూర్తిని గాంచి, సిగ్గు ఆశ్చర్యాన్ని పొందావు.

**శ్రాంతస్త్వమాత్మనా తేన కృత్రిమేణ మహామునే ।**
**అవలోకపరస్సోఽభూచ్చరితం విశ్వకర్మణః ॥4॥**

ఓ మహామునీ! అలసియున్ననీవు విశ్వకర్మచే నిర్మింపబడిన నీ కృత్రిమమూర్తినిచూస్తూ నిలబడిపోయావు.

**ప్రవిష్టో మండపస్తస్య హిమాద్రే రత్నచిత్రితమ్ ।**
**సువర్ణ కలశైర్జుష్టం రంభాది బహుశోభితమ్ ॥5॥**

**సహస్ర స్తంభసంయుక్తం విచిత్రం పరమాద్భుతమ్ ।**
**వేదికాం చ తథా దృష్ట్వా విస్మయం త్వం మునే హ్యయాః ॥6॥**

ఓ మహామునీ! రత్నాలతో పొదగబడినది, బంగారు కలశాలతో కూడినది, అరటిచెట్లు మున్నగు అలంకారాలతో మిక్కిలి శోభిల్లినది, వేయిస్తంభాలు కలది, అనేక రంగులు కలది, మిక్కిలి అద్భుతమైనదగు హిమవంతుని వివాహ మండపాన్ని ప్రవేశించి, వేదికను చూసి, విస్మయాన్ని పొందావు.

**తదావోచశ్చ స మునే నారద త్వం నగేశ్వరమ్ ।**
**విస్మితోఽతీవ మనసి నష్టజ్ఞానో విమూఢధీః ॥7॥**

ఓ నారదమునీ! అట్టినీవు మనస్సులో గొప్ప విస్మయాన్ని పొంది, జ్ఞానం తొలగడంచే విమోహిత బుద్ధికలవాడవై, పర్వతరాజుతో ఇలా పలికావు.

**ఆగతాస్తే కిమధునా దేవా విష్ణుపురోగమాః ।**
**తథా మహర్షయస్సర్వే సిద్ధా ఉపసురాస్తథా ॥8॥**

విష్ణువు మున్నగు దేవతలు ఇప్పుడు వచ్చారా ఏమి? మహర్షులు, సిద్ధులు, ఉపదేవతలు, అందరు విచ్చేశారా?

**మహాదేవో వృషారూఢో గణైశ్చ పరివారితః ।**
**ఆగతః కిం వివాహార్థం వద తథ్యం నగేశ్వర ॥9॥**

మహాదేవుడు వృషారూఢుడై, గణాలచే పరివేష్టింపబడినవాడై, వివాహం కొరకు వచ్చినాడా ఏమి? ఓ పర్వతరాజా! యథార్థాన్ని చెప్పుము.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యేవం వచనం శ్రుత్వా తవ విస్మితచేతసః ।**
**ఉవాచ త్వాం మునే తథ్యం వాక్యం స హిమవాన్ గిరిః ॥10॥**

ఓ మునీ! విస్మయంతో నిండిన మనస్సుగల నీ మాటలువిని, హిమవంతుడు నీతో సత్యవాక్యాన్నిలా పలికాడు.

**హిమవానువాచ** – హిమవంతుడు పలికాడు.

**హే నారద! మహాప్రాజ్ఞ! గతో నైవాధునా శివః ।**
**వివాహార్థం చ పార్వత్యాస్సగణస్సవరాతకః ॥11॥**

ఓ నారదా! మహాప్రాజ్ఞా! శివుడు గణాలతోకూడి వరయాత్రా సమేతుడై, పార్వతిని వివాహమాడడానికి ఇంతవరకు రాలేదు.

**విశ్వకర్మకృతం చిత్రం విద్ధి నారద సద్ధియా ।**
**విస్మయం త్యజ దేవర్షే స్వస్థో భవ శివం స్మర ॥12॥**

ఓ నారదా! ఇది విశ్వకర్మ సద్బుద్ధితో చేసిన చిత్రమని తెలుసుకో, ఓ దేవర్షీ! విస్మయాన్ని వీడుము. స్వస్థుడవై శివుని స్మరింపుము.

**భుక్త్వా విశ్రమ్య సుప్రీతః కృపాం కృత్వా మమోపరి ।**
**మైనాకాదిధరైస్సార్ధం గచ్ఛ త్వం శంకరాంతికమ్ ॥13॥**

నీవు భోజనంచేసి, విశ్రమించి, నాయందు దయతో మైనాకుడు మున్నగు పర్వతాలతోగూడి, ఆనందంతో శంకరునివద్దకు వెళ్ళుము.

**ఏభిస్సమేతో గిరిభిర్మహామతే సంప్రార్థ్య శీఘ్రం శివమత్ర చానయ ।**
**దేవై స్సమేతం చ మహర్షిసంఘైః సురాసురైరర్చితపాదపల్లవమ్ ॥14॥**

ఓ మహామతీ! ఈ పర్వతాలతోకూడి శీఘ్రమే నీవు శంకరుని వద్దకువెళ్ళి ప్రార్థించుము. దేవతా సమేతుడు, మహర్షి సంఘాలతోను, సురాసురులతోను, పూజింపబడే పాదపల్లవాలు కలవాడునైన శివుని ఇక్కడకు తీసుకొనిరమ్ము.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**తథేతి చోక్త్వాగమ ఆశు హి త్వం సదైవతైశ్శైలసుతాదిభిశ్చ ।**
**తత్రత్యకృత్యం సువిధాయ భుక్త్వా మహామనాస్త్వం శివసన్నిధానమ్ ॥15॥**

'సరే' అనిపలికి, నీవు వెంటనే అచ్చటికార్యాన్ని చక్కబెట్టి, భోజనంచేసి, ఆ పర్వతరాజ కుమారులతోను, ఇతరులతోను గూడి, శివుని సన్నిధికి వచ్చావు.

**తత్ర దృష్టో మహాదేవో దేవాదిపరివారితః ।**
**నమస్కృతస్త్వయా దీప్తైశ్శైలైస్తైర్భక్తితశ్చ వై ॥16॥**

అచ్చట దేవతలు మున్నగువారిచే చుట్టువారబడియున్న మహాదేవునిచూచి, నీవు, ఆ పర్వతులు భక్తితో ఆయనకు నమస్కరించారు.

**తదా మయా విష్ణునా చ సర్వే దేవాస్సవాసవాః ।**
**పప్రచ్ఛుస్త్వాం మునే సర్వే రుద్రస్యానుచరాస్తథా ॥17॥**

ఓ మునీ! అప్పుడు నేను, విష్ణువు, ఇంద్రుడు, దేవతలందరు రుద్రుని అనుచరులందరు నిన్ను ప్రశ్నించాము.

**విస్మితాః పర్వతాన్ దృష్ట్వా సందేహాకులమానసాః ।**
**మైనాకసహ్యమేర్వాద్యా న్నానాలంకారసంయుతాన్ ॥18॥**

అనేకాభరణాలు ధరించియున్న మైనాక, సహ్య, మేరువు మున్నగు పర్వతులను చూసినవెంటనే అందరి మనస్సులు సందేహంతో వ్యాకులమయ్యాయి. వారికి విస్మయం కలిగింది.

**దేవా ఊచుః** – దేవతలు పలికారు.

**హే నారద మహాప్రాజ్ఞ! విస్మితస్త్వం హి దృశ్యసే ।**
**సత్కృతోఽసి హిమాగేన కిం న వా వద విస్తరాత్ ॥19॥**

ఓ నారదా! మహాప్రాజ్ఞా! నీవు విస్మయాన్ని పొందినవానివలె కనబడుతున్నావు. హిమవంతుడు నిన్ను సత్కరించాడా లేదా? విస్తరంగా చెప్పు.

**ఏతే కస్మాత్సమాయాతాః పర్వతా ఇహ సత్తమాః ।**
**మైనాకసహ్యమేర్వాద్యాస్సుప్రతాపాస్స్వలంకృతాః ॥20॥**

గొప్ప ప్రతాపం కలవారు, చక్కగా అలంకరించుకున్నవారునైన ఈ మైనాక సహ్యాద్రి పర్వతోత్తములందరు ఇచ్చటికేలవిచ్చేశారు?

**కన్యాం దాస్యతి శైలోఽసౌ స భవే వా న నారద ।**
**హిమాలయ గృహే తాత కిం భవత్యద్య తద్వద ॥21॥**

ఓ నారదా! హిమవంతుడు శివునికి కన్యను ఇచ్చువాడా? కాదా? ఇప్పుడు హిమవంతుని గృహంలో ఏమిజరుగుతోంది? ఆ విషయాన్ని చెప్పు.

**ఇతి సందిగ్ధమనసామస్మాకం చ దివౌకసామ్ ।**
**వద త్వం పృచ్ఛమానానాం సందేహం హర సువ్రత ॥22॥**

దేవతలమైన మాకు మనస్సులో సందేహం కలుగుతోంది. హే మహావ్రతా! మాప్రశ్నలకు సమాధానాలిచ్చి, మా సందేహాలు తీర్చుము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తేషాం విష్ణ్వాదీనాం దివౌకసామ్ ।**
**అవోచస్తాన్ మునే త్వం హి విస్మితస్త్వాష్ట్ర మాయయా ॥23॥**

ఓ మునీ! విశ్వకర్మ మాయచే విస్మితుడవైన నీవు విష్ణువు మున్నగు దేవతలమాటవిని వారికి బదులు చెప్పావు.

**ఏకాంతమాశ్రిత్య చ మాం హి విష్ణుమభాషథా వాక్యమిదం మునే త్వమ్ ।**
**శచీపతిం సర్వసురేశ్వరం వై పక్షచ్ఛిదం పూర్వరిపుం ధరాణామ్ ॥24॥**

ఓ మునీ! నీవు నన్ను విష్ణువును, దేవతల ప్రభువు శచీపతియు, పర్వతాల రెక్కలను దునుమాడి, పర్వతాలకు శత్రుత్వాన్ని నెరిపిన ఇంద్రుని, ఏకాంతానికి పిలిచి ఇలా పలికావు.

**నారద ఉవాచ –** నారదుడు చెప్పాడు.

**త్వష్ట్రా కృతం తద్వికృతం విచిత్రం విమోహనం సర్వదివౌకసాం హి ।**
**యేనైవ సర్వాన్స విమోహితుం సురాన్సమిచ్ఛతి ప్రేమత ఏవ యుక్త్యా ॥25॥**

వికృతము, విచిత్రము, దేవతలనందరిని మోహింపజేయునదియునైన మాయను విశ్వకర్మ నిర్మించాడు. అతడు ప్రేమతో గూడిన యుక్తితో, దేవతలనందరిని మోహింపజేయ గోరుచున్నాడు.

**పురాకృతం తస్య విమోహనం త్వయా సువిస్మృతం తత్ సకలం శచీపతే ।**
**తస్మాదసౌ త్వాం విజిగీషురేవ గృహే ధ్రువం తస్య గిరేర్మహాత్మనః ॥26॥**

ఓ శచీపతీ! పూర్వం నీవాతనిని మోహింపజేశావు. ఆ వృత్తాంతాన్ని నీవు మరిచావు. అందువలన అతడు హిమవంతుని ఇంటిలో నిన్ను జయించాలనుకుంటున్నాడనడంలో సందేహం లేదు.

**అహం విమోహితస్తేన ప్రతిరూపేణ భాస్వతా ।**
**తథా విష్ణుః కృతస్తేన బ్రహ్మ శక్రోఽపి తాదృశః ॥27॥**

ప్రకాశంతో కూడిన నా కృత్రిమరూపం నన్ను మోహపెట్టింది. అతడు విష్ణు బ్రహ్మ ఇంద్రుల రూపాలను అదేవిధంగా నిర్మించాడు.

**కిం బహూక్తేన దేవేశ సర్వదేవగణాః కృతాః ।**
**కృత్రిమాశ్చిత్రరూపేణ న కించిదవశేషితమ్ ॥28॥**

ఇన్నిమాటలేల ఓ దేవదేవా! దేవగణాలందరి కృత్రిమ రూపాలుకూడా నిర్మింపబడ్డాయి. ఎవ్వరు మిగలలేదు.

**విమోహనార్థం సర్వేషాం దేవానాం చ విశేషతః ।**
**కృతా మాయా చిత్రమయీ పరిహాసవికారిణీ ॥29॥**

దేవతల నందరిని ప్రత్యేకించి మోహింపజేయడానికి కృత్రిమ చిత్రాల రూపంలో పరిహాసం చేసే వికృతమైన మాయ నిర్మించబడింది.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**తచ్ఛ్రుత్వా వచనం తస్య దేవేంద్రో వాక్యమబ్రవీత్ ।**
**విష్ణుం ప్రతి తదా శీఘ్రం భయాకులతనుర్హరిమ్ ॥30॥**

ఆమాటలు విని, భయాకులుడైన దేవేంద్రుడు వెంటనే విష్ణువుతో ఇలా పలికాడు.

**దేవేంద్ర ఉవాచ –** దేవేంద్రుడు పలికాడు.

**దేవదేవ! రమానాథ! త్వష్టా మాం నిహనిష్యతి ।**
**పుత్రశోకేన తప్తోఽసౌ వ్యాజేనానేన నాన్యథా ॥31॥**

దేవదేవా! రమానాథా! పుత్రశోకంతో పీడింపబడే విశ్వకర్మ ఈ మిషతో నన్ను నిశ్చయంగా చంపేస్తాడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**తస్య తద్వచనం శ్రుత్వా దేవదేవో జనార్దనః ।**
**ఉవాచ ప్రహసన్ వాక్యం శక్రమాశ్వాసయంస్తదా ॥32॥**

ఇంద్రుని మాటవిని, దేవదేవుడైన జనార్దనుడు నవ్వుతూ, అతనిని ఓదారుస్తూ, ఇలాపలికాడు.

**విష్ణు రువాచ –** విష్ణువు పలికాడు.

**నివాతకవచైః పూర్వం మోహితోఽసి శచీపతే ।**
**మహావిద్యాబలేనైవ దానవైః పూర్వవైరిభిః ॥33॥**

ఓ శచీపతీ! నీకు పూర్వ శత్రువులైన నివాత కవచులనే రాక్షసులు మహావిద్యయొక్క బలంచేతనే పూర్వం నిన్ను మోహింపజేశారు.

**పర్వతో హిమవానేష తథాన్యాఽఖిలపర్వతాః ।**
**విపక్షా హి కృతాస్సర్వే మమ వాక్యాచ్చ వాసవ ॥34॥**

ఇంద్రా! నా ఆదేశంచే నీవు హిమవత్పర్వతంతోనేగాక, ఇతర పర్వతాలనన్నింటితోనూకూడా విరోధం వహించావు.

**తేఽనుస్మృత్యా తు వై దృష్ట్వా మాయయా గిరయో హ్యమీ ।**
**జేతుమిచ్ఛంతు యే మూఢా న భేతవ్యమరావపి ॥35॥**

ఈ పర్వతాలు ఆ వృత్తాంతాన్ని స్మరించి, మూఢులై మనలను మాయచే జయించాలని భావించి యుండవచ్చు. కాని నీవు లేశమైనా భయపడవలదు.

**ఈశ్వరో నో హి సర్వేషాం శంకరో భక్తవత్సలః ।**
**సర్వథా కుశలం శక్ర కరిష్యతి న సంశయః ॥36॥**

ఇంద్రా! మనందరికి ప్రభువు. భక్తవత్సలుడునైన శంకరుడు నిస్సందేహంగా అన్నివిధాలుగా క్షేమాన్ని కలిగిస్తాడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఏవం సంవదమానం తం శక్రం వికృతమానసమ్ ।**
**హరిణోక్తశ్చ గిరిశో లౌకికీం గతిమాశ్రితః ॥37॥**

వికృతమానసుడైన ఇంద్రుడు, విష్ణువు ఇట్లు మాట్లాడుకొనుచుండగా, శివుడు లోకంపోకడ ననుసరిస్తూ, వారితో ఇలా అన్నాడు.

**ఈశ్వర ఉవాచ –** ఈశ్వరుడు పలికాడు.

**హే హరే! హేసురేశాన! కిం బ్రూథోఽద్య పరస్పరమ్ ।**
**ఇత్యుక్త్వా తౌ మహేశానో మునే తాం ప్రత్యువాచ సః ॥38॥**

"హే హరీ! హే ఇంద్రా! మీరిద్దరు ఒకరితోనొకరు ఏమి మాట్లాడుకుంటున్నారు?" మహేశ్వరుడు ఇట్లు పలికిన అనంతరం నీతో ఇలా పలికాడు.

**కిం ను వక్తి మహాశైలో యథార్థం వద నారద ।**
**వృత్తాంతం సకలం బ్రూహి న గోప్యం కర్తుమర్హసి ॥39॥**

ఓ నారదా! పర్వతరాజు ఏమంటున్నాడు. సత్యాన్నిచెప్పు. వృత్తాంతాన్నంతటిని చెప్పు. ఏదీ దాచిపెట్టవద్దు.

**దదాతి వా నైవ దదాతి శైల సుతాం స్వకీయాం వద తచ్ఛశీఘ్రమ్ ।**
**కిం తే దృష్టం కిం కృతం తత్ర గత్వా ప్రీత్యా సర్వం తద్వదాశ్వద్య తాత ॥40॥**

ఓ వత్సా! హిమవంతుడు తన కుమార్తెనిస్తాడా? ఈయడా? ఆ విషయం వెంటనే చెప్పు. నీవక్కడకు వెళ్ళి ఏమి చూశావు? ఏమి చేశావు? ఇప్పుడావిషయాన్నంతటిని వెంటనే చెప్పు?

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తశ్శంభునా తత్ర మునే త్వం దేవదర్శనః ।**
**సర్వం రహస్యవోచో వై యద్దృష్టం తత్ర మండపే ॥41॥**

ఓ మహర్షీ! శంభుడిలా పలుకగానే మహాజ్ఞానివైన నీవు అక్కడ మండపంలో చూచినదంతయు రహస్యంగా ఇలా చెప్పావు.

**నారద ఉవాచ** - నారదుడు చెప్పాడు.

**దేవదేవ మహాదేవ శ్రుణు మద్వచనం శుభమ్ ।**
**నాస్తి విఘ్నభయం నాథ వివాహే కించిదేవ హి ॥42॥**

దేవదేవ! మహాదేవ! నాశుభవచనాన్ని విను. వివాహానికి విఘ్నం కలుగుతుందనే భయమేమీలేదు.

**అవశ్యమేవ శైలేశస్తుభ్యం దాస్యతి కన్యకామ్ ।**
**త్వామానయితుమాయాతా ఇమే శైలా న సంశయః ॥43॥**

హిమవంతుడు తన కుమార్తెను నీకిచ్చుట నిశ్చయము. ఈపర్వతులంతా నిన్ను తోడ్కొని వెళ్లడానికే వచ్చియున్నారు. సంశయంలేదు.

**కిం తు హ్యమరమోహార్థం మాయా విరచితాద్భుతా ।**
**కుతూహలార్థం సర్వజ్ఞ న కశ్చిద్విఘ్నసంభవః ॥44॥**

ఓ సర్వజ్ఞా! కాని దేవతల్ని మోహింపజేసి, కుతూహలం కలిగించడానికి అచ్చట అద్భుతమైన మాయ రచింపబడింది. విఘ్నంమాత్రం కలిగే ప్రసక్తియే లేదు.

**విచిత్రం మండపం గేహేఽకార్షీత్తస్య తదాజ్ఞయా ।**
**విశ్వకర్మా మహామాయీ నానాశ్చర్యమయం విభో ॥45॥**

ఓ విభూ! హిమవంతుని ఆజ్ఞచే అతని గృహంలో మహామాయావియైన విశ్వకర్మ అనేకాద్భుతాలతో నిండిన విచిత్ర మండపాన్ని నిర్మించాడు.

**సర్వదేవసమాజశ్చ కృతస్తత్ర విమోహనః ।**
**తం దృష్ట్వా విస్మయం ప్రాప్తోఽహం తన్మాయావిమోహితః ॥46॥**

దేవసమాజమంతయూ అక్కడ మోహాన్నిపొందే రీతిలో నిర్మింపబడింది. నేను దానినిచూచి, మాయావిమోహితుడనై, విస్మయాన్ని పొందాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**తచ్ఛ్రుత్వా తద్వచస్తాత లోకాచారకరః ప్రభుః ।**
**హర్షాదీన్ ప్రహసన్ శంభురువాచ సకలాన్సురాన్ ॥47॥**

వత్సా! లోకాచారకరుడైన శంభుప్రభుడు ఆమాటలు విని, నవ్వి, విష్ణువు మున్నగు దేవతల లందరితో ఇలా పలికాడు.

**ఈశ్వర ఉవాచ** - ఈశ్వరుడు పలికాడు.

**కన్యాం దాస్యతి చేన్మహ్యం పర్వతో హి హిమాచలః ।**
**మాయయా మమ కిం కార్యం వద విష్ణో యథాతథమ్ ॥48॥**

హిమవంతుడు నాకు కన్యనిచ్చే పక్షంలో నాకు మాయతో పనిఏమి? ఓవిష్ణూ! నీవు యథాతథంగా చెప్పుము.

**హే బ్రహ్మన్! శక్ర మునయస్సురా బ్రూత యథార్థతః ।**
**మాయయా మమ కిం కార్యం కన్యాం దాస్యతి చేద్గిరిః ॥49॥**

ఓ బ్రహ్మా! ఇంద్రా! మునులారా! దేవతలారా! సత్యాన్ని పలకండి. పర్వతరాజు కన్యనిచ్చే పక్షంలో నాకు మాయతోపనియేమి?

**కేనాప్యుపాయేన ఫలం హి సాధ్యమిత్యుచ్యతే పండితైర్న్యాయవిద్భిః ।**
**తస్మాత్సర్వైర్గమ్యతాం శీఘ్రమేవ కార్యార్థిభిర్విష్ణుపురోగమైశ్చ ॥50॥**

ఏ ఉపాయంచేనైనా ఫలాన్ని సాధించాలని నీతివేత్తలైన పండితులు చెబుతారు. కాబట్టి మీరందరు విష్ణువును ముందిడుకుని వివాహకార్యం కొరకు శీఘ్రమే ముందుకు సాగండి.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏవం సంవదమానోఽసౌ దేవైశ్శంభురభూత్తదా ।**
**కృతః స్మరేణైవ వశీ వశం వా ప్రాకృతో నరః ॥51॥**

ఈవిధంగా దేవతలతో సంభాషిస్తున్న శంభుడు ప్రాకృత మానవునివలె మన్మథునికి వశుడైనట్లున్నాడు.

**అథ శంభ్వాజ్ఞయా సర్వే విష్ణ్వాద్యా నిర్జరాస్తదా ।**
**ఋషయశ్చ మహాత్మానో యయుర్మోహభ్రమాపహమ్ ॥52॥**

అంతట శంభుని ఆజ్ఞచే విష్ణువు మున్నగు దేవతలు, ఋషులు, సిద్ధులు, మోహజనితమైన భ్రమను విడనాడారు.

**పురస్కృత్య మునే త్వాం చ పర్వతాంస్తాన్సవిస్మయాః ।**
**హిమాద్రేశ్చ తదా జగ్ముర్మందిరం పరమాద్భుతమ్ ॥53॥**

ఓ నారదమునీ! నిన్ను, ఆ పర్వతులను ముందిడుకుని, విస్మయావిష్టులైన దేవతలు మున్నగు వారందరు పరమాశ్చర్యకరమైన హిమవంతుని మందిరానికి వెళ్ళారు.

**అథ విష్ణ్వాదిసంయుక్తో ముదితైస్స్వబలైర్యుతః ।**
**ఆజగామోపహైమాగపురం ప్రముదితో హరః ॥54॥**

అంతట విష్ణువు మున్నగువారితోను, ఆనందంతోకూడిన తనగణాలతోను కూడి, ప్రహర్షితుడైన శివుడు హిమవన్నగర సమీపానికి వచ్చాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే మండపరచనావర్ణనం నామైక చత్వారింశోఽధ్యాయః ॥41॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో మండప నిర్మాణవర్ణన అనే నలబై ఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్విచత్వారింశోऽధ్యాయః - నలభై రెండవ అధ్యాయం

## దేవగిరిమిలనవర్ణనమ్ - దేవగిరిమిలనవర్ణనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథాకర్ణ్య గిరీశశ్చ నిజపుర్యుపకంఠతః ।**
**ప్రాప్తమీశం సర్వగం వై ముముదేతి హిమాలయః ॥1॥**

సర్వవ్యాపియైన ఈశ్వరుడు తన నగరం శివార్లకు వచ్చాడని తెలుసుకుని పర్వతరాజైన హిమవంతుడు మిక్కిలి ఆనందించాడు.

**అథ సంభృతసంభారస్సంభాషాం కర్తుమీశ్వరమ్ ।**
**శైలాన్ ప్రస్థాపయామస బ్రాహ్మణానపి సర్వశః ॥2॥**

అప్పుడాతడు ఈశ్వరునితో మాట్లాడడానికి పర్వతాలను, బ్రాహ్మణులను సంభారాలనిచ్చి పంపించాడు.

**స్వయం జగామ సద్భక్త్యా ప్రాణేష్టం ద్రష్టుమీశ్వరమ్ ।**
**భక్త్యుద్రుత మనాశ్శైలః ప్రశంసన్ స్వవిధిం ముదా ॥3॥**

హిమవంతుడు భక్తితో నిండిన మనస్సుగలవాడై, ప్రాణప్రియుడైన ఈశ్వరుని దర్శించడానికి తన భాగ్యాన్ని ప్రశంసిస్తు స్వయంగా ఎదురేగాడు.

**దేవసేనాం తదా దృష్ట్వా హిమవాన్ విస్మయం గతః ।**
**జగామ సమ్ముఖస్తత్ర ధన్యోऽహమితి చింతయన్ ॥4॥**

అప్పుడు హిమవంతుడు దేవసేనను చూసి విస్మయాన్ని పొందాడు. "నేను ధన్యుడ' నని భావిస్తు ఎదురేగాడు.

**దేవా హి తద్బలం దృష్ట్వా విస్మయం పరమం గతాః ।**
**ఆనందం పరమం ప్రాపుర్దేవాశ్చ గిరయస్తథా ॥5॥**

దేవతలు హిమవంతుని పరివారాన్ని చూచి మిక్కిలి విస్మయాన్ని పొందారు. దేవతలు మరియు గిరులు పరమానందాన్ని పొందారు.

**పర్వతానాం మహాసేనా దేవానాం చ తథా మునే ।**
**మిళిత్వా విరరాజేవ పూర్వపశ్చిమసాగరౌ ॥6॥**

ఓ మునీ! పర్వతుల మహాసేన, దేవతల పెద్దసేనతో కలసి తూర్పు పడమర సముద్రాల కలయికవలె భాసిల్లింది.

**పరస్పరం మిళిత్వా తే దేవాశ్చ పర్వతాస్తథా ।**
**కృతకృత్యం తథాత్మానం మేనిరే పరయా ముదా ॥7॥**

దేవతలు, పర్వతాలు (పర్వతములకు అధిదేవతలు) పరస్పరం మిళితులై, పరమానందాన్ని పొంది, కృతార్థులమయ్యామని భావించారు.

**అథేశ్వరం పురో దృష్ట్వా ప్రణనామ హిమాలయః ।**
**సర్వే ప్రణేముర్గిరయో బ్రాహ్మణాశ్చ సదాశివమ్ ॥8॥**

అప్పుడు హిమవంతుడు ముందుగా పరమేశ్వరుని చూచి ప్రణమిల్లాడు. పర్వతాలు, బ్రాహ్మణులు అందరు సదాశివునికి నమస్కరించారు.

**వృషభస్థం ప్రసన్నాస్యం నానాభరణభూషితమ్ ।**
**దివ్యావయవలావణ్యప్రకాశిత దిగంతరమ్ ॥9॥**

**సుసూక్ష్మాహతసత్పట్టవస్త్రశోభితవిగ్రహమ్ ।**
**సద్రత్నవిలసన్మౌళిం విహసంతం శుచిప్రభమ్ ॥10॥**

**భూషాభూతా హి యుక్తాంగమద్భుతావయవప్రభమ్ ।**
**దివ్యద్యుతిం సురేశైశ్చ సేవితం కరచామరైః ॥11॥**

**వామస్థితాచ్యుతం దక్షభాగస్థితవిభుం ప్రభుమ్ ।**
**పృష్ఠస్థితహరిం పృష్ఠపార్శ్వస్థిత సురాదికమ్ ॥12॥**

వృషభారూఢుడు, ప్రసన్నమైన ముఖం గలవాడు, నానాభరణ భూషితుడు, దివ్యమైన అవయవాల కాంతిచే ప్రకాశింపజేయబడిన దిక్కులు గలవాడు, అతిసూక్ష్మమగు దారాలతో నేసిన మంచి పట్టు వస్త్రాలతో శోభిల్లు దేహం గలవాడు, మంచి రత్నాలతో ప్రకాశించే శిరస్సు గలవాడు, స్వచ్ఛమగు కాంతులతో నవ్వుచున్నవాడు, ఆభరణాలుగా మారిపోయిన పాములతో నిండిన దేహం గలవాడు, అద్భుతమైన అవయవ కాంతులు గలవాడు, దివ్యమగు కాంతిగలవాడు, లోకపాలకులచే వింజామరలు చేతబట్టి సేవింపబడువాడు, ఎడమవైపున అచ్యుతుడు కలవాడు, కుడివైపున బ్రహ్మగలవాడు, వెనుక ఇంద్రుడు గలవాడు, ప్రక్కన, వెనుక దేవతాదులతోకూడి యుండువాడునగు శివప్రభుని చూశారు.

**నానావిధ సురాద్యైశ్చ సంస్తుతం లోకశంకరమ్ ।**
**స్వహేత్వాత్తతనుం బ్రహ్మ సర్వేశం వరదాయకమ్ ॥13॥**

**సగుణం నిర్గుణం చాపి భక్తాధీనం కృపాకరమ్ ।**
**ప్రకృతేః పురుషస్యాపి పరం సచ్చిత్సుఖాత్మకమ్ ॥14॥**

దేవతలు మున్నగువారందరిచేత స్తుతింపబడువాడు, లోకాలకు మంగళాలనిచ్చువాడు, స్వేచ్ఛచే స్వీకరింపబడిన దేహం కలవాడు, పరబ్రహ్మ స్వరూపుడు, వరదాయకుడు, సర్వేశ్వరుడు, సగుణుడు, నిర్గుణుడు, భక్తాధీనుడు, కృపాకరుడు, ప్రకృతి పురుషులిరువురకు అతీతుడు, సచ్చిదానంద ఘనుడునైన శివుని చూశారు.

**ప్రభోర్దక్షిణభాగేతు దదర్శ హరిమచ్యుతమ్ ।**
**వినతాతనయారూఢం నానాభూషణభూషితమ్ ॥15॥**

ఆ ప్రభువునకు కుడివైపున గరుడుని అధిష్ఠించినవాడు, అనేక భూషణాలతో అలంకరించుకున్నవాడు, పాపాలను హరించువాడునైన అచ్యుతుని హిమవంతుడు చూశాడు.

**ప్రభోశ్చ వామభాగే తు మునే మాం సందదర్శ హ ।**
**చతుర్ముఖం మహాశోభం స్వపరీవారసంయుతమ్ ॥16॥**

ఓ మునీ! ఆ ప్రభుని ఎడమవైపున నాలుగు మోములు గలవాడు, తన పరివారంతోగూడి అధికంగా శోభిల్లువాడునగు నన్ను (బ్రహ్మను) చూశాడు.

**ఏతౌ సురేశ్వరౌ దృష్ట్వా శివస్యాతిప్రియౌ సదా ।**
**ప్రణనామ గిరీశశ్చ సపరీవార ఆదరాత్ ॥17॥**

శివునకు మిక్కిలి ప్రియులైన ఈ దేవతోత్తములనిద్దరిని చూచి, హిమవంతుడు పరివారంతోగూడి, సాదరంగా వారికి ప్రణమిల్లాడు.

**తథా శివస్య పృష్ఠే చ పార్శ్వయోస్సువిరాజితాన్ ।**
**దేవాదీన్ ప్రణనామాసౌ దృష్ట్వా గిరివరేశ్వరః ॥18॥**

పర్వతరాజగు హిమవంతుడు శివునకిరువైపులా ప్రక్కలయందు విరాజిల్లుతున్న దేవతలు మున్నగు వారినిచూచి ప్రణమిల్లాడు.

**శివాజ్ఞయా పురో భూత్వా జగామ స్వపురం గిరిః ।**
**శేష హర్యాత్మభూశ్శీఘ్రం మునిభిర్నిర్జరాదిభిః ॥19॥**

శివుని ఆజ్ఞచే హిమవంతుడు ముందు నడుస్తూ తన నగరానికి దారితీశాడు. విష్ణువు, బ్రహ్మ , మునులు దేవతలతోగూడి స్వామి వెనుక నడిచారు.

**సర్వే ముని సురాద్యాశ్చ గచ్ఛంతః ప్రభుణా సహ ।**
**గిరేః పురం సముదితాః శశంసుర్బహు నారద ॥20॥**

ఓ నారదా! మునులు, దేవతలు ఇతరులందరు శివునితోబాటు వెళ్ళుతున్నవారై హిమవంతుని నగరాన్ని పెక్కు విధాలుగా కొనియాడజొచ్చారు.

**రచితే శిఖరే రమ్యే సంస్థాప్య దేవతాదికమ్ ।**
**జగామ హిమవాంస్తత్ర యత్రాస్తి విధివేదికా ॥21॥**

హిమవంతుడు దేవతలను, ఇతరులను తీర్చిదిద్దిన సుందర శిఖరంపై నిలిపి, తాను వివాహ వేదికయున్న స్థలానికి వెళ్ళాడు.

**కారయిత్వా విశేషేణ చతుష్కం తోరణైర్యుతమ్ ।**
**స్నానదానాదికం కృత్వా పరీక్షామకరోత్తదా ॥22॥**

నాలుగు స్తంభాలతో, తోరణాలతో కూడియున్న ఆ వేదికను స్నానదానాదికాలు విశేషంగా చేసి, పరీక్షించాడు.

**స్వపుత్రాన్ ప్రేషయామాస శివస్య నికటే తథా ।**
**హిమో విష్ణ్వాదిసంపూర్ణవర్గయుక్తస్య శైలరాట్ ॥23॥**

పర్వత శ్రేష్ఠుడైన హిమవంతుడు తన పుత్రులను, విష్ణువు మున్నగువారితో కూడియున్న శివుని సమీపానికి పంపాడు.

**కర్తుమైచ్ఛద్ద్వారాచారం మహోత్సవపురస్సరమ్ ।**
**మహాహర్షయుతస్సర్వబంధుయుగ్ఘిమశైలరాట్ ॥24॥**

మహానందంతో కూడియున్నవాడు, బంధువులందరితో కలిసియున్నవాడునైన పర్వతరాజు వరుని ఆహ్వానించే కార్యాన్ని మహోత్సవంగా చేయదలచాడు.

**అథ తే గిరిపుత్రాశ్చ తత్ర గత్వా ప్రణమ్య తమ్ ।**
**స స్వవర్గం ప్రార్థనాం తామూచుశ్శైలేశ్వరస్య వై ॥25॥**

అప్పుడా హిమవంతుని పుత్రులు అచ్చటకువెళ్ళి, తనవారితో కూడియున్న శివునకు ప్రణమిల్లి, హిమవంతుని ప్రార్థనను గురించి చెప్పారు.

**తతస్తే స్వాలయం జగ్ముశ్శైలపుత్రాస్తదాజ్ఞయా ।**
**శైలరాజాయ సంచఖ్యుస్తేచాయాన్తీతి హర్షితాః ॥26॥**

అప్పుడా హిమవంతుని పుత్రులు శివాజ్ఞను పొంది, తమ గృహాలకు వెళ్ళి, శివుడు తదితరులందరు వస్తున్నారని ఆనందంతో హిమవంతునికి చెప్పారు.

**అథ దేవాః ప్రార్థనాం తాం గిరేః శ్రుత్వాతిహర్షితాః ।**
**మునే విష్ణ్వాదయస్సర్వే సేశ్వరా ముముదుర్భృశమ్ ॥27॥**

ఓ మహర్షీ! విష్ణువు మొదలగు దేవతలు, శివుడు, హిమవంతుని ప్రార్థన విని, మిక్కిలి ఆనందించారు.

**కృత్వా సువేషం సర్వేఽపి నిర్జరా మునయో గణాః ।**
**గమనం చక్రురన్యేఽపి ప్రభుణా గిరిరాడ్గృహమ్ ॥28॥**

దేవతలు, మునులు, గణాలు అందరు చక్కని వేషాలు ధరించి, శివునితో కలిసి, హిమవంతుని గృహానికి వెళ్ళారు.

**తస్మిన్నవసరే మేనా ద్రష్టుకామాభవచ్ఛివమ్ ।**
**ప్రభోరాహ్వాయయామాస మునే త్వాం మునిసత్తమమ్ ॥29॥**

ఆ సమయంలో మేనాదేవి శివుని చూడాలని కోరుకుంది. ఓ మునీ! ఆమె హిమవంతుని సేవకునిచే మహర్షి శ్రేష్ఠుడవైన నిన్ను పిలిపించింది.

**అగమస్త్వం మునే తత్ర ప్రభుణా ప్రేరితస్తదా ।**
**మనసా శివహృద్ధేతుం పూర్ణం కర్తుం తమిచ్ఛతా ॥30॥**

ఓ నారదమునీ! శివుడు వెళ్ళుమని నిన్ను ప్రేరేపించాడు. శివుని హృదయంలోని ఆకాంక్షను పూర్ణంచేయగోరి నీవు వెళ్ళావు.

**త్వాం ప్రణమ్య మునే మేనా ప్రాహ విస్మితమానసా ।**
**ద్రష్టుకామా ప్రభోరూపం శంకరస్య మదాపహమ్ ॥31॥**

ఓ నారదమునీ! ఆశ్చర్యముతో కూడిన మేన నీకు నమస్కరించి అహంకారాన్ని నాశంచేయు, శంకరుని రూపాన్ని చూడదలచినదై నీతో పలికెను.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే దేవ, గిరి మిలనవర్ణనం నామ ద్విచత్వారింశోఽధ్యాయః ॥42॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో దేవ, గిరి మిలనవర్ణనం అనే నలభై రెండవ అధ్యాయం సమాప్తం.

## త్రిచత్వారింశోఽధ్యాయః - నలబై మూడవ అధ్యాయం
## శివాద్భుత లీలావర్ణనమ్ - శివుని అద్భుతలీలావర్ణనం

**మేనోవాచ** - మేనకాదేవి పలికింది.

**నిరీక్షిష్యామి ప్రథమం మునే తం గిరిజాపతిమ్ ।**
**కీదృశం శివరూపం హి యదర్థే తప ఉత్తమమ్ ॥1॥**

ఓ మునీ! ఎవనికొరకు పార్వతి గొప్ప తపస్సుచేసిందో అట్టి గిరిజాపతియైన శివుని రూపం ఎలా ఉంటుందో మున్ముందుగా చూడాలని కోరికగా నున్నది.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యజ్ఞానపరా సా చ దర్శనార్థం శివస్య చ ।**
**త్వయా మునే సమం సద్యశ్చంద్రశాలాం సమాగతా ॥2॥**

ఓ మునీ! మూర్ఖురాలైన ఆమె నీతోబాటు శివుని చూడడానికి వెంటనే ప్రాసాదంయొక్క పైభాగానికి వచ్చింది.

**శివోఽపి చ తదా తస్యాం జ్ఞాత్వాహంకారమాత్మనః ।**
**ప్రాహ విష్ణుం చ మాం తాత లీలాం కృత్వాద్భుతాం ప్రభుః ॥3॥**

ఆమెయందుగల అహంకారాన్ని ఎరిగి, శివప్రభుడత్యద్భుత లీలను ప్రదర్శింపగోరి, విష్ణువును నన్ను ఉద్దేశించి ఇట్లు పలికాడు.

**శివ ఉవాచ** - శివుడు చెప్పాడు.

**మదాజ్ఞయా యువాం తాతౌ సదేవౌ చ పృథక్ పృథక్ ।**
**గచ్ఛతం హి గిరిద్వారం వయం పశ్చాద్వ్రజేమ హి ॥4॥**

కుమారులారా! మీరిద్దరు దేవతలతోగూడి వేర్వేరుగా హిమవంతుని గృహద్వారం వద్దకు వెళ్ళండి. మేము తర్వాత వస్తాము.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య హరిస్సర్వానాహూయోవాచ తన్మయాః ।**
**సురాస్సర్వే తథైవాశు గమనం చక్రురుత్సుకాః ॥5॥**

ఈ మాటవిని విష్ణువు అందరిని పిలిచి వివరించాడు. అప్పుడు తన్మయులైన దేవతలందరు అదేతీరున ఉత్సాహంతో శీఘ్రంగా ముందుకు సాగారు.

**స్థితాం శిరోగృహే మేనాం మునే విశ్వేశ్వరస్త్వయా ।**
**తథైవ దర్శయామాస హృద్విభ్రంశో యథా భవేత్ ॥6॥**

ఓ మునీ! ప్రాసాదంయొక్క అగ్రభాగంలో నీతోకలిసియున్న మేనాదేవికి గుండె జారిపోయే విధంగా విశ్వేశ్వరుడు తన రూపాన్ని ప్రదర్శించాడు.

**ఏతస్మిన్సమయే మేనా సేనాం చ పరమాం శుభామ్ ।**
**నిరీక్షంతీ మునే దృష్ట్వా సామాన్యం హర్షితాభవత్ ॥7॥**

ఓ మునీ! ఆ సమయంలో మేనకాదేవి శుభకరమైన సేననుచూచి, సామాన్యంగా హర్షాన్ని పొందింది.

**ప్రథమం చైవ గంధర్వాస్సుందరాస్సుభగాస్తదా ।**
**ఆయాతాశ్శుభవస్త్రాఢ్యా నానాలంకారభూషితాః ॥8॥**

సుందరులు, సౌభాగ్యవంతులునైన గంధర్వులు శుభవస్త్రాలతో ప్రకాశిస్తూ అనేక భూషణాలను అలంకరించుకొని మున్ముందుగా వచ్చారు.

**నానా వాహన సంయుక్తా నానావాద్యపరాయణాః ।**
**పతాకాభిర్విచిత్రాభిరప్సరోగణసంయుతాః ॥9॥**

వారనేక వాహనాలలో ముందుకు సాగుతు, అనేక వాద్యాలు మ్రోగించారు. వారి వాహనాలపై రంగురంగుల జెండాలున్నాయి. వారితోబాటు అప్సరోగణంకూడా ఉన్నారు.

**అథ దృష్ట్వా వసుం తత్ర తత్పతిం పరమప్రభుమ్ ।**
**మేనా ప్రహర్షితా హ్యాసీచ్ఛివోఽయమితి చాబ్రవీత్ ॥10॥**

అప్పుడు పరమప్రభుడగు వసువునుచూచి మేన ఆనందించినదై “ఇతడేశివుడు” అని పలికాడు.

**శివస్య గణకా ఏతే న శివోఽయం శివాపతిః ।**
**ఇత్యేవం త్వం తతస్తాం వై అవోచ ఋషిసత్తమ ॥11॥**

ఓ మహర్షీ! నీవు అప్పుడామెతో “వీరు శివుని సేవకులు, ఇతడు పార్వతీపతియైన శివుడుకాదు” అని చెప్పి ఉన్నావు.

**ఏవం శ్రుత్వా తదా మేనా విచారే తత్పరాభవత్ ।**
**ఇతశ్చాభ్యధికో యో వై స చ కీదృగ్భవిష్యతి ॥12॥**

ఆ మాటను విని, మేన అప్పుడు “ఇంతకంటె గొప్పవాడైన శివుడెట్లుండునో?” అని ఆలోచించడం మొదలుపెట్టింది.

**ఏతస్మిన్నంతరే యక్షా మణిగ్రీవాదయశ్చ యే ।**
**తేషాం సేనా తయా దృష్టా శోభాది ద్విగుణీకృతా ॥13॥**

ఇంతలో మణిగ్రీవాదులగు యక్షులు కనిపించారు. వారిసేన గంధర్వుల సేనకంటె రెట్టింపు శోభతో ఆమెకు కనబడింది.

**తత్పతిం చ మణిగ్రీవం దృష్ట్వా శోభాన్వితం హి సా ।**
**అయం రుద్రశ్శివా స్వామీ మేనా ప్రాహేతి హర్షితా ॥14॥**

వారి ప్రభువైన మణిగ్రీవుని ప్రకాశాన్ని చూచి, ఆమె "శివస్వామి ఈయనయే" అని మిక్కిలి ఆనందంతో పలికింది.

**నాయం రుద్ర శ్శివాస్వామీ సేవకోఽయం శివస్య వై ।**
**ఇత్యవోచోఽగపత్నై త్వం తావద్వహ్నిస్స ఆగతః ॥15॥**

"ఈయన రుద్రుడు కాదు, ఈయన శివసేవకుడు" అని నీవు హిమవంతుని భార్యతో చెప్పావు. ఇంతలో అగ్ని ముందుకు వచ్చాడు.

**తతోఽపి ద్విగుణాం శోభాం దృష్ట్వా తస్య చ సాఽబ్రవీత్ ।**
**రుద్రోఽయం గిరిజాస్వామీ తదా నేతి త్వమబ్రవీః ॥16॥**

మణిగ్రీవునికంటె రెట్టింపు శోభగల అతనిని చూసి, "పార్వతీపతియగు రుద్రుడితడే" అని ఆమె పలికింది. అప్పుడు నీవు "కాదని" చెప్పావు.

**తావద్యమస్సమాయాత స్తతోఽపి ద్విగుణ ప్రభః ।**
**తం దృష్ట్వా ప్రాహ సా మేనా రుద్రోఽయమితి హర్షితా ॥17॥**

ఇంతలో అంతకంటె రెట్టింపు శోభగల యముడు వచ్చాడు. వానిని చూచి మేన ఆనందంతో "ఇతడే రుద్రుడు" అని పలికింది.

**నేతి త్వమబ్రవీస్తాం వై తావన్నిరృతిరాగతః ।**
**బిభ్రాణో ద్విగుణాం శోభాం శుభః పుణ్యజన ప్రభుః ॥18॥**

కాదని నీవు చెప్పావు. ఇంతలో అంతకంటే రెట్టింపు శోభగలవాడు, పుణ్యాత్ములకు ప్రభువు, శుభకారకుడునగు నిరృతి వచ్చాడు.

**తం దృష్ట్వా ప్రాహ సా మేనా రుద్రోఽయమితి హర్షితా ।**
**నేతి త్వమబ్రవీస్తాం వై తావద్వరుణ ఆగతః ॥19॥**

ఆయననుజూచి ఇతడే రుద్రుడని మేనాదేవి ఆనందంతో పలికింది. కాదని నీవామెతో చెప్పావు. ఇంతలో వరుణుడు వచ్చాడు.

**తతోఽపి ద్విగుణాం శోభాం దృష్ట్వా తస్య చ సాఽబ్రవీత్ ।**
**రుద్రోఽయం గిరిజాస్వామీ తదా నేతి త్వమబ్రవీః ॥20॥**

నిరృతికంటె రెట్టింపు శోభగల అతనినిచూచి "పార్వతీపతియైన రుద్రుడితడే" నని ఆమె పలికింది. కాదని నీవు చెప్పావు.

**తావద్వాయుస్సమాయాతస్తతోఽపి ద్విగుణప్రభః ।**
**తం దృష్ట్వా ప్రాహ సా మేనా రుద్రోఽయమితి హర్షితా ॥21॥**

ఇంతలో వరుణునికంటె రెట్టింపు శోభగల వాయువు వచ్చాడు. వానినిచూచి మేనాదేవి ఆనందంతో ఇతడే రుద్రుడని పలికింది.

**నేతి త్వమబ్రవీస్తాం వై తావద్ధనద ఆగతః ।**
**తతోఽపి ద్విగుణాం శోభాం బిభ్రాణో గుహ్యకాధిపః ॥22॥**

కాదని నీవామెతో చెప్పావు. ఇంతలో వాయువుకంటె రెట్టింపు శోభగలవాడు, యక్షులకు ప్రభువునైన కుబేరుడు వచ్చాడు.

**త్వం దృష్ట్వా ప్రాహ సా మేనా రుద్రోఽయమితి హర్షితా ।**
**నేతి త్వమబ్రవీస్తాం వై తావదీశాన ఆగతః ॥23॥**

అతనినిచూచి మేనాదేవి హర్షంతో ఇతడే రుద్రుడని పలికింది. నీవామెతో కాదని చెప్పావు. ఇంతలో ఈశానుడు విచ్చేశాడు.

**తతోఽపి ద్విగుణాం శోభాం దృష్ట్వా తస్య చ సాబ్రవీత్ ।**
**రుద్రోఽయం గిరిజాస్వామీ తదా నేతి త్వమబ్రవీః ॥24॥**

అతని శోభ కుబేరుని శోభకు రెట్టింపు ఉండడంగాంచి పార్వతీపతియైన రుద్రుడితడే అని మేనాదేవి పలికింది. అప్పుడు నీవు కాదని చెప్పావు.

**తావదింద్రస్సమాయాతస్తతోఽపి ద్విగుణప్రభః ।**
**సర్వామరవరో నానాదివ్యభస్త్రిదివేశ్వరః ॥25॥**

ఇంతలో అంతకు రెట్టింపు కాంతికలవాడును, దేవతలందరిలో శ్రేష్ఠుడు, అనేక దివ్యప్రభలు కలవాడు, దేవతలకు ప్రభువునైన ఇంద్రుడు వచ్చాడు.

**తం దృష్ట్వా శంకర స్సోఽయమితి సా ప్రాహ మేనకా ।**
**శక్రస్సురపతిశ్చాయం స నేతి త్వం తదాబ్రవీః ॥26॥**

ఆ మేనక అతనిని చూచి, ఇతడే శంకరుడని పలికింది. అప్పుడునీవు "ఇతడు దేవతాధిపతియైన ఇంద్రుడు రుద్రుడు కాదు" అని చెప్పావు.

**తావచ్చంద్రస్సమాయాతశ్శోభాం తద్ద్విగుణాం దధత్ ।**
**దృష్ట్వా తం ప్రాహ రుద్రోఽయం తాం తు నేతి త్వమబ్రవీః ॥27॥**

ఇంతలో అంతకు రెట్టింపు శోభకలిగియున్న చంద్రుడు వచ్చాడు. ఆమె అతనినిచూచి ఇతడు రుద్రుడని పలుకగా నీవామెతో కాదని చెప్పావు.

**తావత్సూర్యస్సమాయాతశ్శోభాం తద్ద్విగుణాం దధత్ ।**
**దృష్ట్వా తం ప్రాహ సా సోఽయన్తాం తు నేతి త్వమబ్రవీః ॥28॥**

అంతకు రెట్టింపు శోభకలిగిన సూర్యుడు ఇంతలో ముందుకు వచ్చాడు. అతనినిచూచి ఆమె "శివుడీతడే" అని పలుకగా నీవామెతో కాదని చెప్పావు.

**తావత్సమాగతా స్తత్ర భృగ్వాద్యాశ్చ మునీశ్వరాః ।**
**తేజసో రాశయస్సర్వే స్వశిష్యగణసంయుతాః ॥29॥**

ఇంతలో అచటికి తేజోరాశులైన భృగువు మున్నగు మునిశ్రేష్ఠులు తమ శిష్యగణాలతోగూడి విచ్చేశారు.

**తన్మధ్యే చైవ వాగీశం దృష్ట్వా సా ప్రాహ మేనకా ।**
**రుద్రోఽయం గిరిజాస్వామీ తదా నేతి త్వమబ్రవీః ॥30॥**

వారి మధ్యలోనున్న బృహస్పతినిచూచి మేనక పార్వతీపతియగు రుద్రుడితడే అని పలుకగా కాదని నీవు చెప్పావు.

**తావద్బ్రహ్మా సమాయాతస్తేజసాం రాశి రుత్తమః ।**
**సర్షివర్యసుతస్సాక్షాద్ధర్మపుంజ ఇవ స్తుతః ॥31॥**

ఇంతలో అక్కడకు గొప్ప తేజోరాశి ఋషివర్యులచేతను, కుమారులచేతను స్తుతింపబడువాడు, సాక్షాత్తుగా మూర్తీభవించిన ధర్మంవలెనున్న బ్రహ్మ విచ్చేశాడు.

**దృష్ట్వా మాం తం తదా మేనా మహాహర్షవతీ మునే ।**
**సోఽయం శివాపతిః ప్రాహ తాం తు నేతి త్వమబ్రవీః ॥32॥**

ఓ మునీ! ఆయననుచూచి మేనాదేవి మహానందాన్ని పొంది, గిరిజాపతియగు శివుడితడేయని పలుకగా నీవామెతో కాదని చెప్పావు.

**ఏతస్మిన్నంతరే తత్ర విష్ణుర్దేవస్సమాగతః ।**
**సర్వశోభాన్వితః శ్రీమాన్మేఘశ్యామశ్చతుర్భుజః ॥33॥**

**కోటికందర్పలావణ్యః పీతాంబరధరస్స్వరాట్ ।**
**రాజీవలోచనశ్శాంతః పక్షీంద్రవరవాహనః ॥34॥**

**శంఖాదిలక్షణైర్యుక్తో ముకుటాదివిభూషితః ।**
**శ్రీవత్సవక్షా లక్ష్మీశోహ్యప్రమేయప్రభాన్వితః ॥35॥**

ఇంతలో అచ్చటకు సర్వ శోభాన్వితుడు, మేఘశ్యాముడు, చతుర్భుజుడు, శ్రీమంతుడు, కోటి మన్మథుల లావణ్యం గలవాడు, సత్త్వగుణ ప్రధానుడు, పీతాంబరధారి, రాజీవలోచనుడు, శాంతుడు, పక్షీంద్రవరుడైన గరుడుడు వాహనంగా కలవాడు, శంఖాది చిహ్నాలతో గూడినవాడు, కిరీటాదులతో అలంకరింప బడినవాడు, శ్రీవత్స వక్షుడు, లక్ష్మీపతి, అప్రమేయ ప్రభాన్వితుడునైన శ్రీమహావిష్ణువు విచ్చేశాడు.

**తం దృష్ట్వా చకితాక్ష్యాసీన్మహాహర్షేణ సాఽబ్రవీత్ ।**
**సోఽయం శివాపతిః సాక్షాచ్ఛివో వై నాత్రసంశయః ॥36॥**

ఆయనను చూచి, విస్మయంతో నిండిన కన్నులతో మేనాదేవి మహానందాన్ని పొంది, "పార్వతీపతియైన శివుడు నిశ్చయంగా ఇతడే సందేహం లేదు" అని పలికింది.

**అథ త్వం మేనకావాక్యమాకర్ణ్యోవాచ ఊతికృత్ ।**
**నాయం శివాపతిరయం కిం త్వయం కేశవో హరిః ॥37॥**

అప్పుడు మేనకా వాక్యాన్ని విని నీవిట్లు పలికావు. "పార్వతీపతి ఇతడు కాడు. ఇతడు కేశవుడు, ఇతడు హరి.

**శంకరాఖిలకార్యస్య హ్యధికారీ చ తత్ప్రియః ।**
**అతోఽధికో వరో జ్ఞేయస్సశివః పార్వతీపతిః ॥38॥**

ఈయన శంకరుని సర్వకార్యాలకు అధికారి. శంకరునకు ప్రియుడు. కాబట్టి పార్వతీపతియైన శివుడు ఈయనకంటె అధికుడు, శ్రేష్ఠుడునని ఎరుంగుము.

**తచ్ఛోభాం వర్ణితుం మేనే మయా నైవ హి శక్యతే ।**
**స ఏవాఖిలబ్రహ్మాండపతిస్సర్వేశ్వరః స్వరాట్ ॥39॥**

ఆయన శోభను వర్ణించడానికి నాకు శక్తిలేదు. ఓ మేనా! ఆయనయే బ్రహ్మాండాలన్నింటికి ప్రభువు. సర్వేశ్వరుడు, స్వరాట్.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య మేనా మేనే చ తాం శుభామ్ ।**
**మహాధనాం భాగ్యవతీం కులత్రయసుఖావహామ్ ॥40॥**

నారదుని మాటవిని మేనాదేవి పార్వతినిగూర్చి "శుభకరురాలు, మహాభాగ్యవతి, మహాధనం గలది, మూడు కులాలకు సుఖాన్ని కలిగించేదగునని" తలపోసింది.

**ఉవాచ చ ప్రసన్నాస్యా ప్రీతియుక్తేన చేతసా ।**
**స్వభాగ్యమధికం చాపి వర్ణయంతీ ముహుర్ముహుః ॥41॥**

ఆమె ప్రసన్నమైన ముఖం కలదియై ఆనందంతో నిండిన మనస్సుతో తనభాగ్యమధికమని అనేక పర్యాయాలు వర్ణిస్తూ ఇట్లు పలికింది.

**మేనోవాచ –** మేనక పలికింది.

**ధన్యాహం సర్వథా జాతా పార్వత్యా జన్మనాధునా ।**
**ధన్యో గిరీశ్వరోఽప్యద్య సర్వం ధన్యతమం మమ ॥42॥**

పార్వతి పుట్టడంవల్ల నేనీనాడు అన్నివిధాలుగా ధన్యురాలనయ్యాను. పర్వతరాజుకూడా ధన్యుడయ్యాడు. నా సర్వము మిక్కిలి ధన్యమయ్యింది.

**యే యే దృష్టా మయా దేవా నాయకాస్సుప్రభాన్వితాః ।**
**ఏతేషాం యఃపతిస్సోఽత్ర పతిరస్యా భవిష్యతి ॥43॥**

నేను గొప్పకాంతిగల దేవనాయకులనెవరినెవరిని చూశానో వారందరికి ప్రభువైన శివుడు ఈమెకు భర్త కాబోతున్నాడు.

**అస్యాః కిం వర్ణ్యతే భాగ్యమపి వర్షశతైరపి ।**
**వర్ణితుం శక్యతే నైవ తత్ప్రభుప్రాప్తిదర్శనాత్ ॥44॥**

ఆ ప్రభువును ఈమె పొందడం చూడగలిగిన నా భాగ్యాన్నిగాని, ఆమె భాగ్యాన్నిగాని వర్ణించడానికి వంద సంవత్సరాలైనప్పటికి చాలదు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యవాదీచ్చ సా మేనా ప్రేమనిర్భరమానసా ।**
**తావత్సమాగతో రుద్రోఽద్భుతోఽతికారకః ప్రభుః ॥45॥**

ప్రేమతో నిండిన మనస్సుగల మేనాదేవి ఇట్లు పలుకుతూ ఉండగానే అద్భుత లీలలను ప్రకటించే రుద్రప్రభుడు విచ్చేశాడు.

**అద్భుతాత్మా గణాస్తాత మేనా గర్వాపహారకాః ।**
**ఆత్మానం దర్శయన్ మాయానిర్లిప్తం నిర్వికారకమ్ ॥46॥**

వత్సా! ఆయన అద్భుత గణాలు మేనాదేవియొక్క గర్వాన్ని అణచగలవు. మాయాలేపంలేనట్టియు, వికారం లేనట్టియు తన స్వరూపాన్ని ఆయన ప్రదర్శించాడు.

**తమాగతమభిప్రేత్య నారద త్వం మునే తదా ।**
**మేనా మవోచః సుప్రీత్యా దర్శయంస్తం శివాపతిమ్ ॥47॥**

ఓ నారదమునీ! ఆయన రాకను గాంచిన నీవు మిక్కిలి ప్రీతితో అప్పుడు మేనకకు ఆ పార్వతీపతిని చూపించి, ఇలా పలికావు.

**నారద ఉవాచ** – నారదుడు చెప్పాడు.

**అయం స శంకరస్సాక్షాద్దృశ్యతాం సుందరి త్వయా ।**
**యదర్థే శివయా తప్తం తపోఽతివిపినే మహత్ ॥48॥**

ఓ సుందరీ! ఎవనికొరకు పార్వతి అడవిలో అతితీవ్రమైన తపస్సు చేసిందో, సాక్షాత్తుగా ఆ శంకరుడితడే. నీవు చూడుము.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా హర్షితా మేనా తం దదర్శ ముదా ప్రభుమ్ ।**
**అద్భుతాకృతిమీశానమద్భుతానుగమద్భుతమ్ ॥49॥**

నీవిట్లు పలుకగా మేనాదేవి ఆనందంతో అద్భుతాకృతి కలిగినట్టియు, అద్భుతానుచరులు గలట్టియు, ఆశ్చర్యకరుడునగు ఆ శివప్రభుని దర్శించింది.

**తావదేవ సమాయాతా రుద్రసేనా మహాద్భుతా ।**
**భూతప్రేతాదిసంయుక్తా నానాగణసమన్వితా ॥50॥**

ఇంతలో మహాద్భుతము, భూతప్రేతాదులతో కూడినది, అనేక గణాలతో కూడినదియునగు రుద్రసేన వచ్చింది.

**వాత్యా రూపధరాః కేచిత్ పతాకా మర్మరస్వనా ।**
**వక్రతుండాస్తత్ర కేచిద్విరూపాశ్చాపరే తథా ॥51॥**

**కరాలాః శ్మశ్రులాః కేచిత్కేచిత్ఖంజాహ్యలోచనాః ।**
**దండపాశధరాః కేచిత్కేచిన్ముద్గరపాణయః ॥52॥**

కొందరు తుఫానువలె మహాశబ్దాన్ని చేస్తున్నారు. మరికొందరు జెండాల రెపరెపలవంటి శబ్దాన్ని చేస్తున్నారు. వారిలో కొందరు వంకరతుండం కలవారు. మరికొందరు వికృతరూపులు. కొందరు భయంకరాకారులు మరికొందరు కుంటివారు. మరికొందరు గ్రుడ్డివారు. కొందరు దండాన్ని పాశాన్ని, మరికొందరు రోకలిని ధరించియున్నారు.

**విరుద్ధవాహనాః కేచిచ్ఛృంగనాదవివాదినః ।**
**డమరోర్వాదినః కేచిత్ కేచిద్గోముఖవాదినః ॥53॥**

కొందరి వాహనాలు వెనుకకు తిరిగి నడుస్తున్నాయి. కొందరు కొమ్ముబూరాలు ఊదుతున్నారు. కొందరు డమరుకాలు, మరికొందరు గోముఖాలు వాయిస్తున్నారు.

**అముఖా విముఖాః కేచిత్ కేచిద్బహుముఖా గణాః ।**
**అకరా వికరాః కేచిత్ కేచిద్బహుకరా గణాః ॥54॥**

కొందరికి నోళ్ళులేవు. మరికొందరు గణాలకు అనేక నోళ్ళున్నాయి. ఇంకొందరి నోళ్ళు వికృతంగా ఉన్నాయి. కొందరికి చేతులు లేవు. కొందరి చేతులు వికృతంగా ఉన్నాయి. మరికొందరికి అనేకమైన చేతులున్నాయి.

**అనేత్రా బహునేత్రాశ్చ విశిరాః కుశిరాస్తథా ।**
**అకర్ణా బహుకర్ణాశ్చ నానావేషధరా గణాః ॥55॥**

కొందరికి కళ్ళులేవు. కొందరికి చాలాకళ్ళున్నాయి. కొందరికి తలలులేవు. మరికొందరికి తలలు వికృతంగా ఉన్నాయి. కొందరికి చెవులులేవు. కొందరికి చాలాచెవులున్నాయి. ఆ గణాలు వివిధ వేషాలు ధరించాయి.

**ఇత్యాది వికృతాకారా అనేకే ప్రబలా గణాః ।**
**అసంఖ్యాతాస్తథా తాత మహావీరా భయంకరాః ॥56॥**

ఓ కుమారా! ఇట్టి వికృతాకారులు, బలశాలురు, మహావీరులు, భయంకరులునైన ఆ గణాలు లెక్కలేనంతమంది ఉన్నారు.

**అంగుళ్యా దర్శయంస్త్వం తాం మునే రుద్రగణాంస్తతః ।**
**హరస్య సేవకాన్పశ్య హరం చాపి వరాననే ॥57॥**

ఓ మునీ! నీవామెతో "ఓ సుందరీ! హరుని సేవకులను చూడుము. హరునికూడా చూడుము" అని పలికి ఆమెకు రుద్రగణాలను వ్రేలితో చూపించావు.

**అసంఖ్యాతాన్ గణాన్ దృష్ట్వా భూతప్రేతాదికాన్మునే ।**
**తత్ క్షణాదభవత్సా వై మేనకా త్రాససంకులా ॥58॥**

ఓ మునీ! భూతప్రేతాది గణాలను లెక్కలేనంతమందిని చూచి, ఆ మేనక తక్షణమే భయంతో కంగారు పడింది.

**తన్మధ్యే శంకరం చైవ నిర్గుణం గుణవత్తరమ్ ।**
**వృషభస్థం పంచవక్త్రం త్రినేత్రం భూతిభూషితమ్ ॥59॥**

**కపర్దినం చంద్రమౌళిం దశహస్తం కపాలినమ్ ।**
**వ్యాఘ్రచర్మోత్తరీయం చ పినాకవరపాణినమ్ ॥60॥**

**శూలయుక్తం విరూపాక్షం వికృతాకారమాకులమ్ ।**
**గజచర్మవసానం హి వీక్ష్య త్రేసే శివాప్రసూః ॥61॥**

వారిమధ్యలో నిర్గుణుడు, సకల గుణవత్తరుడు, వృషభమునధిష్ఠించినవాడు, పంచముఖుడు, త్రినేత్రుడు, భూతినలంకరించుకున్నవాడు, జటాజూటధారి, చంద్రుని శిరస్సుపై ధరించినవాడు, పది చేతులవాడు, కపాలం చేతబట్టినవాడు, పులిచర్మం ఉత్తరీయంగా కలవాడు, చేతియందు పినాకమనే శ్రేష్ఠమైన ధనుస్సు గలవాడు, శూలాన్ని ధరించినవాడు, విరూపాక్షుడు, వికృతాకారంతో నున్నవాడు, గజచర్మాన్ని వస్త్రంగా ధరించినవాడునగు శంకరునిచూచి, పార్వతి తల్లి భయపడింది.

**చకితాం కంపసంయుక్తాం విహ్వలాం విభ్రమద్ధియమ్ ।**
**శివో౬యమితి చాంగుళ్యా దర్శయంస్తాం త్వమబ్రవీః ॥62॥**

ఆశ్చర్యంతోను, భయంతోను, వణుకుచున్నట్టియు, భ్రమించిన బుద్ధికలదియునగు ఆమెకు “ఈయనయే శివుడు” అని నీవు వ్రేలితో చూపుతూ పలికావు.

**త్వదీయం తద్వచః శ్రుత్వా వాతాహతలతా ఇవ ।**
**సా పపాత ద్రుతం భూమౌ మేనా దుఃఖభరా సతీ ॥63॥**

నీమాటలు విని, దుఃఖాన్ని సహింపజాలక మేనాదేవి గాలిచే పెకలింపబడిన తీగవలె వెంటనే నేలపై పడిపోయింది.

**కిమిదం వికృతం దృష్ట్వా వాంఛితాహం దురాగ్రహే ।**
**ఇత్యుక్త్వా మూర్ఛితా తత్ర మేనకా సాభవత్ క్షణాత్ ॥64॥**

“ఓసి మొండిపట్టుదలగల పార్వతీ! ఏమి ఈ వికృతరూపం? నేను మోసపోయాను” అనిపలికి మేనక అచ్చట క్షణంలో మూర్ఛపోయింది.

**అథ ప్రయత్నైర్వివిధైస్సఖీభిరుపసేవితా ।**
**లేభే సంజ్ఞాం శనైర్మేనా గిరీశ్వరప్రియా తదా ॥65॥**

అప్పుడు సఖురాండ్రు ఆమెకు వివిధోపచారాలు చేయగా హిమవత్పత్నియైన మేనాదేవి మెల్లగా తెలివిని పొందింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే శివాద్భుత లీలావర్ణనం నామ త్రిచత్వారింశో౬ధ్యాయః ॥43॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో శివుని అద్భుత లీలావర్ణనం అనే నలభై మూడవ అధ్యాయం సమాప్తం.

## చతుశ్చత్వారింశోఽధ్యాయః - నలబై నాలుగవ అధ్యాయం
## మేనాప్రబోధవర్ణనమ్ - మేనాదేవికి తెలియజెప్పుటను గూర్చివర్ణన

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**సంజ్ఞాం లబ్ధ్వా తతస్సా చ మేనా శైలప్రియా సతీ ।**
**విలలాపాతిసంక్షుబ్ధా తిరస్కారమథాకరోత్ ॥1॥**

అనంతరం హిమవంతుని ప్రియురాలు, సాధ్వియునగు మేనాదేవి తెలివిని పొంది, మిక్కిలి సంక్షోభాన్ని పొందినదై రోదించి, ఆ వివాహాన్ని తిరస్కరించింది.

**తత్ర తావత్స్వపుత్రాంశ్చ నినింద ఖలితా ముహుః ।**
**ప్రథమం సా తతః పుత్రీం కథయామాస దుర్వచః ॥2॥**

ఆమె మిక్కిలి దుఃఖాన్నిపొంది, ముందుగా తన కుమారుల ననేకపర్యాయాలు నిందించి, తదనంతరం తన కుమార్తెతో పరుషవచనాలు పలికింది.

**మేనోవాచ** - మేనాదేవి పలికింది.

**మునే పురా త్వయా ప్రోక్తం వరిష్యతి శివాశివమ్ ।**
**పశ్చాద్ధిమవతః కృత్యం పూజార్థం వినివేశితమ్ ॥3॥**

ఓ మునీ! శివాదేవి శివుని వరించగలదని పూర్వం నీవు చెప్పావు. అనంతరం హిమవంతునకు కర్తవ్యాన్ని బోధించి ఆయనను పూజకొరకు కూర్చుండబెట్టావు.

**తతో దృష్టం ఫలం సత్యం విపరీతమనర్థకమ్ ।**
**మునేఽధమాహం దుర్బుద్ధే సర్వథా వంచితా త్వయా ॥4॥**

దానివల్ల విపరీతము, అనర్థకమునైన ఫలం లభించింది. ఇది వాస్తవము. ఓ మునీ! దుష్టబుద్ధీ! అభాగ్యురాలనైన నేను నీచే అన్నివిధాలుగా మోసగింపబడ్డాను.

**పునస్తయా తపస్తప్తం దుష్కరం మునిభిశ్చ యత్ ।**
**తస్య లబ్ధం ఫలం హ్యేతత్పశ్యతాం దుఃఖదాయకమ్ ॥5॥**

అనంతరం ఆమె మునులుకూడా చేయశక్యంగాని తపస్సు చేసింది. దానికి ఈ దుఃఖదాయకమైన ఫలం లభించింది చూడుము.

**కిం కరోమి క్వ గచ్ఛామి కో మే దుఃఖం వ్యపోహతామ్ ।**
**కులాదికం వినష్టం మే విహితం జీవితం మమ ॥6॥**

నేనేమిచేయుదును? ఎక్కడకు వెళ్ళుదును? నాదుఃఖాన్ని ఎవరు పోగొడతారు? నాకులం, జీవితం సర్వం నాశాన్ని పొందాయి.

**క్వ గతా ఋషయో దివ్యాః శ్మశ్రూణి త్రోటయామ్యహమ్ ।**
**తపస్వినీ చ యా పత్నీ సా ధూర్తా స్వయమాగతా ॥7॥**

ఆ దివ్యర్షులెక్కడికి వెళ్ళారు? నేను వారి గెడ్డాలనూడపెరుకుతాను. తపస్సు చేసుకునే ఆ వసిష్ఠపత్ని దుష్టురాలు. కాబట్టి స్వయంగా వచ్చి వివాహం నిశ్చయించింది.

**కేషాం చైవాపరాధేన సర్వం నష్టం మమాధునా ।**
**ఇత్యుక్త్వా వీక్ష్య చ సుతామువాచ వచనం కటు ॥8॥**

కొందరి అపరాధంచేత నేనీనాడు సర్వస్వాన్ని పోగొట్టుకున్నాను. ఈవిధంగా పలికి ఆమె కుమార్తెనుచూచి పరుషవాక్యాలు పలికింది.

**కిం కృతం తే సుతే దుష్టే కర్మ దుఃఖకరం మమ ।**
**హేమదత్త్వా త్వయానీతః కాచో వై దుష్టయా స్వయమ్ ॥9॥**

ఓ అమ్మాయీ! దుష్టురాలా! నీవునాకు దుఃఖాన్ని కలిగించేపని ఎందులకు చేశావు. నీవు స్వయంగా బంగారాన్నిచ్చి ఇత్తడిని తెచ్చావు.

**హిత్వా తు చందనం భూయో లేపితః కర్దమస్త్వయా ।**
**హంసముడ్డీయ కాకో వై గృహీతో హస్తపంజరే ॥10॥**

నీవు చందనాన్ని పారద్రోసి, బురదను పూసుకున్నావు. చేతిపంజరంలోని హంసను విడిచిపెట్టి కాకిని భద్రపరిచావు.

**హిత్వా బ్రహ్మజలం దూరే పీతం కూపోదకం త్వయా ।**
**సూర్యం హిత్వా తు ఖద్యోతో గృహీతో యత్నతస్త్వయా ॥11॥**

గంగాజలం పారబోసి నూతిలోని నీటిని త్రాగావు. సూర్యుని విడిచి, ప్రయత్నపూర్వకంగా మిణుగురు పురుగును పట్టుకున్నావు.

**తండులాంశ్చ తథా హిత్వా కృతం వై తుషభక్షణమ్ ।**
**ప్రక్షిప్యాజ్యం తథా తైలం కారండం భుక్తమాదరాత్ ॥12॥**

నీవు బియ్యాన్ని విడిచి ఊకను భక్షించావు. నేతిని పారబోసి ఆముదం త్రాగావు.

**సింహ సేవాం తథా ముక్త్వా శృగాలస్సేవితస్త్వయా ।**
**బ్రహ్మవిద్యాం తథా ముక్త్వా కుగాథా చ శ్రుతా త్వయా ॥13॥**

సింహాన్ని సేవించడంమాని నీవు నక్కను సేవించావు. బ్రహ్మవిద్యను విడిచి చెడుగాథ విన్నావు.

**గృహే యజ్ఞవిభూతిం హి దూరీకృత్య సుమంగళామ్ ।**
**గృహీతం చ చితాభస్మ త్వయాపుత్రి హ్యమంగళమ్ ॥14॥**

ఓ అమ్మాయీ! ఇంటిలోని పరమ మంగళకరమైన యజ్ఞ విభూతిని దూరంచేసి అమంగళకరమైన చితాభస్మాన్ని స్వీకరించావు.

**సర్వాన్ దేవవరాంస్త్యక్త్వా విష్ణ్వాదీన్ పరమేశ్వరాన్ ।**
**కృతం త్వయా కుబుద్ధ్యా వై శివార్థం తప ఈదృశమ్ ॥15॥**

పరమప్రభువులైన విష్ణువు మున్నగు దేవతలనందరిని విడిచి, దుర్బుద్ధివైన నీవిట్టి శివుని కొరకు తపస్సు చేశావు.

**ధిక్త్వాం చ తవబుద్ధిం చ ధిగ్రూపం చరితం తవ ।**
**ధిక్చోపదేశకర్తారం ధిక్ సఖ్యావపి తే తథా ॥16॥**

నీకు, నీ బుద్ధికి, నీ రూపానికి, నీ ప్రవృత్తికి, నీకుపదేశించినవానికి, నీ ఈ ఇద్దరు చెలికత్తెలకి, నింద కలుగుతుంది.

**ఆవాం చ ధిక్తథా పుత్రీ యౌ తే జన్మప్రవర్తకౌ ।**
**ధిక్తే నారద బుద్ధిం చ సప్తర్షీంశ్చ సుబుద్ధిదాన్ ॥17॥**

**ధిక్కులం ధిక్క్రియాదాక్ష్యం సర్వం ధిగ్యత్కృతం త్వయా ।**
**గృహం తు ధుక్షితం త్వేతన్మరణం తు మమైవ హి ॥18॥**

ఓ అమ్మాయీ! నీకు జన్మనిచ్చిన మేమిద్దరం నిందార్హులం. ఓ నారదా! నీబుద్ధికి, మంచిబుద్ధిని కలిగించు సప్తర్షులకు, కులానికి కర్మలు చేసే సామర్థ్యానికి నిందయౌగాక! నీవు సర్వం నిందార్హమైనదే చేశావు. ఈ ఇంటిని నాశనం చేశావు. నాకు మరణమే గతి.

**పర్వతానామయం రాజా నాయాతు నికటే మమ ।**
**సప్తర్షయస్స్వయం నైవ దర్శయంతు ముఖం మమ ॥19॥**

ఈ పర్వతరాజు నాదరిదాపులకు రాకుందుగాక! సప్తర్షులు వారి ముఖాలను నాకు చూపకుందురు గాక!

**సాధితం కిం చ సర్వైస్తు మిళిత్వా ఘాతితం కులమ్ ।**
**వంధ్యాహం న కథం జాతా గర్భో న గళితః కథమ్ ॥20॥**

**అథో న వా మృతాచాహం పుత్రికా న మృతా కథమ్ ।**
**రక్షసాద్య కథం నో వా భక్షితా గగనే పునః ॥21॥**

మీరందరు కలసి ఏమి సాధించారు? నాకులం నాశనమయ్యింది. నేను గొడ్రాలిగా ఎందుకు జన్మించలేదో? నాగర్భం ఏల భగ్నం కాలేదో? నేనెందులకు మరణించలేదో? నాపుత్రిక ఏల మరణించలేదో? ఈనాడు రాక్షసుడు నా కుమార్తెను గగనవీధికి తీసుకొని వెళ్ళి ఏల భక్షింపడో?

**ఛేదయామి శిరస్తేఽద్య కిం కరోమి కళేబరైః ।**
**త్యక్త్వా త్వాం చ కుతో యాయాం హా హా మే జీవితం హతమ్ ॥22॥**

నీ శిరస్సు ఈనాడు నేను నరికివేస్తాను. ఈ దేహాలతో పనిఏముంది? నిన్ను విడిచి నేనెక్కడకు పోగలను? అయ్యో! నాజీవితం నాశనమయ్యింది.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా పతితా సా చ మేనా భూమౌ విమూర్ఛితా ।**
**వ్యాకులా శోకరోషాద్యైర్న గతా భర్తృసన్నిధౌ ॥23॥**

మిక్కిలి దుఃఖితురాలైన మేనాదేవి ఈవిధంగా పలికి మూర్ఛిల్లి భూమిపై పడింది. శోక రోషాదులవల్ల ఆమె తన భర్తవద్దకు వెళ్ళలేదు.

**హాహాకారో మహానాసీత్తస్మిన్కాలే మునీశ్వర ।**
**సర్వే సమాగతాస్తత్ర క్రమాత్తత్సన్నిధౌ సురాః ॥24॥**

ఓ మహర్షీ! ఆ సమయంలో పెద్ద హాహాకారం చేశారు. క్రమంగా దేవతలందరు ఆమె ఉన్నచోటుకి వచ్చారు.

**పురా దేవమునే చాహమాగతస్తు స్వయం తదా ।**
**మాం దృష్ట్వా త్వం వచస్తాం వై ప్రావోచ ఋషిసత్తమ ॥25॥**

ఓ దేవర్షీ! అప్పుడచ్చటికి నేనుకూడా విచ్చేశాను. నన్నుచూసి నీవు ఆమెతో ఇలా పలికావు.

**నారద ఉవాచ** – నారదుడు చెప్పాడు.

**యథార్థం సుందరం రూపం నాజ్ఞాతం తే శివస్య వై ।**
**లీలయేదం ధృతం రూపం న యథార్థం శివేన చ ॥26॥**

**తస్మాత్క్రోధం పరిత్యజ్య స్వస్థా భవ పతివ్రతే ।**
**కార్యం కురు హఠం త్యక్త్వా శివాం దేహి శివాయ చ ॥27॥**

ఓ పతివ్రతా! శివుని యథార్థ సుందరరూపం నీకు తెలియనిదికాదు. ఆయన ఈ రూపాన్ని లీలగా ధరించాడు. ఇది వాస్తవరూపం కాదు. కాబట్టి నీవు కోపాన్ని విడిచి స్వస్థురాలవు కమ్ము. మొండిపట్టుదలవీడి కార్యాన్ని నడిపించు. పార్వతిని శివునకిమ్ము.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**తదాకర్ణ్య వచస్తే సా మేనా త్వాం వాక్యమబ్రవీత్ ।**
**ఉత్తిష్ఠేతో గచ్ఛ దూరం దుష్టాధమ వరో భవాన్ ॥28॥**

నీమాటను విని, మేనాదేవి నీతో "లెమ్ము, నీవిచ్చటినుండి దూరంగా పొమ్ము, నీవు దుష్టుడవు, అధమాధముడవు" అని పలికింది.

**ఇత్యుక్తే తు తయా దేవ ఇంద్రాద్యాః సకలాః క్రమాత్ ।**
**సమాగత్య చ దిక్పాలా వచనం చేదమబ్రువన్ ॥29॥**

ఆమె ఇట్లు పలుకగా ఇంద్రాది సకల దేవతలు, దిక్పాలకులు, వరుసగావచ్చి ఇలా పలికారు.

**దేవా ఊచుః** – దేవతలు పలికారు.

**హే మేనే పితృకన్యే హి శ్రుణ్వస్మద్వచనం ముదా ।**
**అయం వై పరమః సాక్షాచ్ఛివః పరసుఖావహః ॥30॥**

**కృపయా చ భవత్పుత్ర్యాస్తపో దృష్ట్వాతి దుస్సహమ్ ।**
**దర్శనం దత్తవాన్ శంభుర్వరం సద్భక్తవత్సలః ॥31॥**

ఓ మేనాదేవీ! నీవు పితృదేవతల కుమార్తెవు. మామాట ప్రీతితో వినుము. ఈయన సాక్షాత్తుగా పరమానందాన్నిచ్చే పరమశివుడు. నీకుమార్తె మిక్కిలి దుస్సహమైన తపస్సుచేయగా భక్తవత్సలుడైన శంభుడు దయతో దర్శనాన్ని, వరాన్ని యిచ్చియున్నాడు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**అథోవాచ సురాన్మేనా విలప్యాతి ముహుర్ముహుః ।**
**న దేయా తు మయా కన్యా గిరిశాయోగ్రరూపిణే ॥32॥**

అప్పుడు మేనాదేవి చాలాసేపు దుఃఖించి "భయంకరాకారుడైన కైలాసపతికి నేను నాకుమార్తెనీయను" అని పలికింది.

**కిమర్థం తు భవంతశ్చ సర్వే దేవాః ప్రపంచితాః ।**
**రూపమస్యాః పరం నామ వ్యర్థీకర్తుం సముద్యతః ॥33॥**

**ఇత్యుక్తే తు తయా తత్ర ఋషయస్సప్త ఏవ హి ।**
**ఊచుస్తే వచ ఆగత్య వసిష్ఠాద్యా మునీశ్వర ॥34॥**

"ఓ దేవతలారా! మీరందరు యోచనచేసి ఈ పార్వతి పరమసౌందర్యాన్ని వ్యర్థం చేయడానికి ఏల పూనుకున్నారు?" అని ఆమె పలుకగా వసిష్ఠాది సప్తర్షులు ముందుకువచ్చి ఇలా పలికారు.

**సప్తర్షయ ఊచుః** – సప్తర్షులు పలికారు.

**కార్యం సాధయితుం ప్రాప్తాః పితృకన్యే గిరిప్రియే ।**
**విరుద్ధం చాత్ర ఉక్తార్థే కథం మన్యామహే వయమ్ ॥35॥**

హిమవత్పత్నీ! నీవు పితృదేవతల కుమార్తెవు. నీ కార్యాన్ని సాధించడానికి మేము వచ్చాము. మేము చెప్పిన వచనాలలో మాకేమీ విరోధం తోచడంలేదు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**అయం వై పరమో లాభో దర్శనం శంకరస్య యత్ ।**
**దానపాత్రం స తే భూత్వా గతస్తవ చ మందిరమ్ ॥36॥**

**ఇత్యుక్త్వా తైస్తతో మేనా మునివాక్యం మృషాకరోత్ ।**
**ప్రత్యువాచ చ రుష్టా సా తానృషీం జ్ఞానదుర్బలా ॥37॥**

"శంకరుని దర్శనం సర్వోత్కృష్టమైన లాభం. ఆయన నీ దానాన్ని స్వీకరించడానికి నీ గృహానికి వచ్చియున్నాడు". వారిట్లు పలుకగా జ్ఞానహీనురాలైన మేనాదేవి మునుల వాక్యాలను వమ్ముచేసి, కోపంతో వారికిట్లు బదులు పలికింది.

**మేనోవాచ** – మేనాదేవి పలికింది.

**శస్త్రాద్యైర్ఘాతయిష్యేఽహం న హాస్యే శంకరాయతామ్ ।**
**దూరం గచ్ఛత సర్వే హి నాగంతవ్యం మదంతికే ॥38॥**

నేనామెను శస్త్రాదులతో సంహరించడానికైనా సిద్ధమేగాని ఆమెను శంకరునకీయను. మీరందరు దూరంగా పొండు, నాసమీపానికి రావద్దు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా విరరామాశు సా విలప్యాతి విహ్వలా ।**
**హాహాకారో మహానాసీత్తత్ర తద్వృత్తతో మునే ॥39॥**

దుఃఖితురాలైన మేన ఈవిధంగా పలికి మిన్నకున్నది. ఓ మునీ! ఆమె ప్రవర్తనను చూచి అచ్చటనున్నవారందరు బిగ్గరగా హాహాకారాలు చేశారు.

**తతో హిమాలయస్తత్రాజగామాతి సమాకులః ।**
**తాం చ బోధయితుం ప్రీత్యా ప్రాహ తత్త్వం చ దర్శయన్ ॥40॥**

అప్పుడచ్చటకు కంగారు పడుతు హిమవంతుడు వచ్చాడు. అతడు మేనాదేవికి సత్యాన్ని బోధించి సర్దిచెప్పడానికి ప్రయత్నించాడు.

**హిమాలయ ఉవాచ** – హిమవంతుడు పలికాడు.

**శ్రుణు మేనే వచో మేఽద్య వికలాసి కథం ప్రియే ।**
**కే కే సమాగతా గేహం కథం చైతాన్వినిందసి ॥41॥**

ఓ మేనా! నా మాటవిను. నీవేల దుఃఖిస్తున్నావు? ఇంటికెవరెవరు వచ్చారు? వారిని నీవెందుకు నిందిస్తున్నావు?

**శంకరత్వం చ జానాసి రూపం దృష్ట్వాఽసి విహ్వలా ।**
**వికటం తస్య శంభోఽస్తు నానారూపాభిధస్య హి ॥42॥**

శంకరుడు నీకు తెలిసినవాడే. అనేక నామాలు, రూపాలు ధరించు శంభుని భయంకరరూపాన్ని చూచి నీవు కంగారు పడ్డావు.

**స శంకరో మయా జ్ఞాతస్సర్వేషాం ప్రతిపాలకః ।**
**పూజ్యానాం పూజ్య ఏవాసౌ కర్తానుగ్రహనిగ్రహాన్ ॥43॥**

ఆ శంకరుని నేనెరుగుదును. అందరినీ రక్షించువాడాయనే. ఆయన పూజ్యులలోకెల్ల పూజ్యుడు. అనుగ్రహ నిగ్రహాలు చేయువాడాయనయే.

**హఠం న కురు ముంచ త్వం దుఃఖం ప్రాణప్రియేఽనఘే ।**
**ఉత్తిష్ఠారం తథా కార్యం కర్తుమర్హసి సువ్రతే ॥44॥**

ఓ ప్రాణప్రియురాలా! మొండిపట్టు పట్టకుము. దుఃఖాన్ని వీడు. ఓ పూజ్యురాలా! వెంటనే లెమ్ము. నీకర్తవ్య కర్మను నీవు చేయదగుదువు.

**యద్వై ద్వారగతశ్శంభుః పురా వికటరూపధృక్ ।**
**నానాలీలాం చ కృతవాన్ చేతయామి చ తామిమామ్ ॥45॥**

ఇంతకుముందు శంభుడు వికృతరూపం ధరించి, మనద్వారంవద్దకు వచ్చి, అనేక లీలలు చేశాడు. ఆ లీలలు నీకిపుడు నేను గుర్తుచేస్తున్నాను.

**తన్మాహాత్మ్యం పరం దృష్ట్వా కన్యాం దాతుం త్వయా మయా ।**
**అంగీకృతం తదా దేవి తత్ప్రమాణం కురు ప్రియే ॥46॥**

ఓ దేవీ! మనమప్పుడు ఆయన మహామహిమను చూచి, ఇద్దరం కన్యనీయదానికి అంగీకరించి యున్నాము. ఓ ప్రియురాలా! ఆ అంగీకారాన్ని ప్రమాణంగా చేసుకొమ్ము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా సోఽద్రినాథో హి విరరామ తతో మునే ।**
**తదాకర్ణ్య శివా మాతా మేనోవాచ హిమాలయమ్ ॥47॥**

ఓ మునీ! ఇట్లు పలికి పర్వతేశ్వరుడు విరమించాడు. పార్వతి తల్లియైన మేనాదేవి ఆ మాటలు విని, హిమవంతునితో ఇలా పలికింది.

**మేనోవాచ** - మేనాదేవి పలికింది.

**మద్వచః శ్రూయతాం నాథ తథా కర్తుం త్వమర్హసి ।**
**గృహీత్వా తనుజాం చైనాం బద్ధ్వా కంఠే తు పార్వతీమ్ ॥48॥**

**అధః పాతయ నిశ్శంకం దాస్యేతాం న హరాయ హి ।**
**తథైనామథవా నాథ గత్వా వై సాగరే సుతామ్ ॥49॥**

**నిమజ్జయ దయాం త్యక్త్వా తతోఽద్రీశ సుఖీ భవ ।**
**యది దాస్యసి పుత్రీం త్వం రుద్రాయ వికటాత్మనే ।**
**తర్హి త్యక్ష్యామ్యహం స్వామిన్ నిశ్చయేన కళేబరమ్ ॥50॥**

ఓ నాథా! నామాటవిని నేను చెప్పినట్లు చేయుము. ఈ నీ కుమార్తెయైన పార్వతిని తీసుకువెళ్ళి, కంఠాన్ని బంధించి (బిగించి), నిశ్శంకగా క్రిందకు త్రోసివేయుము. నేనామెను శివునకీయను. లేదా ఈమెను సముద్రంలో ముంచివేయుము. ఓ పర్వతరాజా! అప్పుడునీకు సుఖం కలుగుతుంది. ఓ స్వామీ! నీవు నీ పుత్రికను వికటరూపుడైన రుద్రునకిచ్చినచో నేను నిశ్చయంగా దేహత్యాగం చేస్తాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తే చ తదా తత్ర వచనే మేనయా హఠాత్ ।**
**ఉవాచ వచనం రమ్యం పార్వతీ స్వయమాగతా ॥51॥**

మేనాదేవి మొండి పట్టుదలతో అప్పుడట్లు పలుకగా పార్వతి స్వయంగా వచ్చి, రమ్యంగా ఇట్లు పలికింది.

**పార్వత్యువాచ** - పార్వతి పలికింది.

**మాతస్తే విపరీతా హి బుద్ధిర్జాతాఽశుభావహా ।**
**ధర్మావలంబనాత్త్వం హి కథం ధర్మం జహాసి వై ॥52॥**

తల్లీ! నీకు అశుభాలు కలిగించే విపరీతబుద్ధి పుట్టింది. ధర్మాన్ని అవలంబించిన నీవిప్పుడు ధర్మాన్ని ఎందుకు వీడుతున్నావు?

**అయం రుద్రోఽపరః సాక్షాత్సర్వప్రభవ ఈశ్వరః ।**
**శంభుస్సురూపస్సుఖదస్సర్వశ్రుతిషు వర్ణితః ॥53॥**

ఈ రుద్రుడే పరమాత్మ యనియు, సర్వకారణుడైన ఈశ్వరుడనియు, సుఖాన్నిచ్చేవాడనియు, అందమైన రూపం గలవాడనియు వేదాలన్నీ వర్ణిస్తున్నాయి.

**మహేశశ్శంకరశ్చాయం సర్వదేవప్రభుస్స్వరాట్ ।**
**నానారూపాభిధో మాతర్హరిబ్రహ్మాదిసేవితః ॥54॥**

అమ్మా! ఈ శంకరుడు మహేశ్వరుడు. సర్వదేవతలకు ప్రభువు. జగన్నాథుడు. అనేక రూపాలు ధరించేవాడు. విష్ణు బ్రహ్మాదులచే సేవింపబడువాడు.

**అధిష్ఠానం చ సర్వేషాం కర్తా హర్తా చ స ప్రభుః ।**
**నిర్వికారీ త్రిదేవేశో హ్యవినాశీ సనాతనః ॥55॥**

సర్వప్రాణులకు అధిష్ఠానము. జగత్తును సృష్టించి, సంహరించు ప్రభుడు. వికారాలు లేనివాడు. బ్రహ్మవిష్ణురుద్రులనే త్రిమూర్తులకు ప్రభువు. వినాశం లేనివాడు. సనాతనుడు.

**యదర్థే దేవతాస్సర్వా ఆయాతా కింకరీకృతాః ।**
**ద్వారి తే సోత్సవాశ్చాద్య కిమతోఽన్యత్పరం సుఖమ్ ॥56॥**

ఆయన కొరకు దేవతలందరు విచ్చేసి, కింకరులవలె ఈరోజు నీ ద్వారంవద్ద ఉత్సవాన్ని చేస్తున్నారు. ఇంతకంటె గొప్పసుఖం ఏముంది?

**ఉత్తిష్ఠాతః ప్రయత్నేన జీవితం సఫలం కురు ।**
**దేహి మాం త్వం శివాయాస్మై స్వాశ్రమం కురు సార్థకమ్ ॥57॥**

కాబట్టి నీవు జాగ్రత్తగా లెమ్ము. నీ జీవితాన్ని సార్థకం చేసుకొమ్ము. నన్ను ఈ శివునకిచ్చి నీ గృహస్థాశ్రమాన్ని సఫలం చేసుకొమ్ము.

**దేహి మాం పరమేశాయ శంకరాయ జనన్యహో ।**
**స్వీకురు త్వమిమం మాతర్వినయం మే బ్రవీమి తే ॥58॥**

అమ్మా! నన్ను పరమేశ్వరుడైన శంకరునకిమ్ము. నేను వినయంతో పలికే మాట నీవంగీకరించుము.

**చేన్న దాస్యసి తస్మై మాం న వృణేఽన్యమహం వరమ్ ।**
**లాభం లభేత్కథం సైంహం శృగాలః పరవంచకః ॥59॥**

నీవు నన్ను శివునకీయకపోయినచో నేను మరియొక వరుని వివాహమాడను. ఇతరులను వంచించి జీవించేనక్క సింహానికుద్దేశించిన భాగాన్ని ఎట్లు పొందగలుగుతుంది?

**మనసా వచసా మాతః కర్మణా చ హరస్స్వయమ్ ।**
**మయావృతో వృతశ్చైవ యదిచ్ఛసి తథా కురు ॥60॥**

తల్లీ! నేను మనోవాక్కాయ కర్మలచే శివుని వరించాను. ఇది నిశ్చయము. నీకు నచ్చిన తీరున నీవాచరింపుము.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య శివావాక్యం మేనా శైలేశ్వరప్రియా ।**
**సువిలప్య మహాక్రుద్ధా గృహీత్వా తత్కళేబరమ్ ॥61॥**

**ముష్టిభిః కూర్పరైశ్చైవ దంతాన్ ఘర్షయతీ చ సా ।**
**తాడయామాస తాం పుత్రీం విహ్వలాతి రుషాన్వితా ॥62॥**

హిమవత్పుత్నియైన మేనాదేవి పార్వతి మాటవిని, మిక్కిలి కోపించి, బిగ్గరగా ఏడ్చి, ఆమె శరీరాన్ని పళ్ళు పటపట కొరుకుతు మిక్కిలి దుఃఖంతో, మహాక్రోధంతో తన కుమార్తెయైన పార్వతిని పిడికిళ్ళతోను, మోచేతులతోను కొట్టింది.

**యే తత్ర ఋషయస్తాత త్వదాద్యాశ్చాపరే మునే ।**
**తద్ధస్తాత్తాం పరిచ్ఛిద్య నిన్యుర్దూరతరం తతః ॥63॥**

ఓ మునీ! కుమారా! అక్కడున్న ఋషులు, నీవు, ఇతరులు ఆ పార్వతిని ఆమె చేతినుండి విడిపించి, అచటినుండి దూరంగా తీసుకొనిపోయారు.

**తాన్వై తథా విధాం దృష్ట్వా భర్త్సయిత్వా పునఃపునః ।**
**ఉవాచ శ్రావయంతీ సా దుర్వచో నిఖిలాన్పునః ॥64॥**

అప్పుడామె వారిపై అనేక విధాలుగా కోపించి, వారికి మరలా నిందావచనాలు వినిపిస్తూ ఇట్లు పలికింది.

**మేనోవాచ** – మేనాదేవి పలికింది.

**కిం మేనా హి కరిష్యేఽహం దుష్టాం గ్రహవతీం శివామ్ ।**
**దాస్యామ్యస్యై గరం తీవ్రం కూపే క్షేప్స్యామి వా ధ్రువమ్ ॥65॥**

నేను మేనకను. దుష్టమైన పట్టుదలగల పార్వతి నేమిచేస్తానో చెప్పనా? ఈమెకు తీవ్రమైన గరళాన్ని ఇస్తాను. లేదా నూతిలో తోస్తాను. సందేహం లేదు.

**ఛేత్స్యామి కాలీమథవా శస్త్రైరస్త్రై ర్బ్ఖరిఖండశః ।**
**నిమజ్జయిష్యే వా సింధౌ స్వసుతాం పార్వతీం ఖలు ॥66॥**

లేదా ఈకాళిని శస్త్రాలతో ముక్కలు ముక్కలుగా నరికివేస్తాను. లేదా నాకుమార్తెయైన పార్వతిని సముద్రంలో ముంచేస్తాను.

**అథవా స్వశరీరం హి త్యక్ష్యామ్యశ్వన్యథా ధ్రువమ్ ।**
**న దాస్యే శంభవే కన్యాం దుర్గాం వికటరూపిణే ॥67॥**

లేదా నేనే రేపటిలోగా నిశ్చయంగా దేహత్యాగం చేస్తాను. అంతేగాని నా కుమార్తెయైన దుర్గను వికృతాకారుడైన శంభునకీయను.

**వరోఽయం కీదృశో భీమోఽనయా లబ్ధశ్చ దుష్టయా ।**
**కారితశ్చోపహాసో మే గిరేశ్చాపి కులస్య హి ॥68॥**

ఈ దుష్టురాలు భయంకరాకారుడైన ఎటువంటి వరుని సంపాదించింది? ఈమె నన్ను, హిమవంతుని, మాకులాన్ని అపహాస్యం పాలు చేసింది.

**న మాతా న పితా భ్రాతా న బంధుర్గోత్రజోఽపి హి ।**
**నో సురూపం న చాతుర్యం న గృహం వాస్య కించన ॥69॥**

ఇతనికి తల్లిలేదు. తండ్రిలేదు. సోదరుడు లేడు. బంధువులులేరు. సగోత్రీకుడైనా లేడు. అందమైన రూపంలేదు. ఇల్లులేదు. ఏమీలేదు.

**న వస్త్రం నాప్యలంకారాస్సహాయాః కేఽపి తస్య న ।**
**వాహనం న శుభం హ్యస్య న వయో న ధనం తథా ॥70॥**

వస్త్రంలేదు. భూషణాలు లేవు. పరిచారకులెవ్వరులేరు. ఈయనకు వాహనం లేదు. శుభకర్మలు లేవు. వయస్సు లేదు. ధనం లేదు.

**న పావిత్ర్యం న విద్యా చ కీదృశః కాయ ఆర్తిదః ।**
**కిం విలోక్య మయా పుత్రీ దేయాస్మై స్యాత్సుమంగళా ॥71॥**

పవిత్రత లేదు. విద్యలేదు. దుఃఖాన్ని కలిగించే ఆయన దేహం ఎట్లుందో? సుమంగళయైన నాకుమార్తెను ఏమిచూసి ఈయనకివ్వాలి?

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాది సువిలప్యాథ బహుశో మేనకా తదా ।**
**రురోదోచ్చైర్మునే సా హి దుఃఖశోకపరిప్లుతా ॥72॥**

ఓ మునీ! ఈవిధంగా మేనక పరిపరి విధాల విలపించి, బిగ్గరగా రోదించింది. ఆమె మనస్సు దుఃఖంతో నిండిపోయింది.

**అథాహం ద్రుతమాగత్యాకథయం మేనకాం చ తామ్ ।**
**శివతత్త్వం చ పరమం కుజ్ఞానహరముత్తమమ్ ॥73॥**

అంతట నేను వెంటనే అచ్చటకువచ్చి, దుష్టజ్ఞానాన్ని హరించే ఉత్తమమైన పరమ శివతత్త్వాన్ని మేనకకు ఇలా బోధించాను.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**శ్రోతవ్యం ప్రీతితో మేనే మదీయం వచనం శుభమ్ ।**
**యస్య శ్రవణతః ప్రీత్యా కుబుద్ధిస్తే వినశ్యతి ॥74॥**

ఓ మేనా! శుభకరమైన నా పలుకులు ప్రీతితో వినుము. నా మాట శ్రద్ధగా వింటే నీ చెడుబుద్ధి నశిస్తుంది.

**శంకరో జగతః కర్తా భర్తా హర్తా తథైవ చ ।**
**న త్వం జానాసి తద్రూపం కథం దుఃఖం సమీహసే ॥75॥**

జగత్తును సృష్టించి, పోషించి, లయంచేసేది శంకరుడే. నీవాయన రూపాన్ని ఎరుగవు. ఆయన దుఃఖానికి నిలయుడని నీవెట్లు ఊహిస్తున్నావు?

**అనేకరూపనామా చ నానాలీలాకరః ప్రభుః ।**
**సర్వస్వామీ స్వతంత్రశ్చ మాయాధీశోఽవికల్పకః ॥76॥**

ఆ ప్రభుడు అనేక నామరూపాలతో వివిధలీలలు చూపుతుంటాడు. ఈ సర్వేశ్వరుడు స్వతంత్రుడు, మాయాధీశుడు. అద్వితీయుడు.

**ఇతి విజ్ఞాయ మేనే త్వం శివాం దేహి శివాయ వై ।**
**కు హఠన్త్యజ కుజ్ఞానం సర్వకార్యవినాశనమ్ ॥77॥**

ఓ మేనా! నీవీసత్యమెరిగి పార్వతిని శివునకిమ్ము. చెడు పట్టుదలను సర్వకార్యాలను పాడుచేసే చెడు జ్ఞానాన్ని విడిచిపెట్టు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తా సా మయా మేనా విలపంతీ ముహుర్ముహుః ।**
**లజ్జాం కించిచ్ఛనైస్త్యక్త్వా మునే మాం వాక్యమబ్రవీత్ ॥78॥**

ఓ మునీ! మేనకాదేవి నాయీ మాటలు విని, పరిపరి విధాల విలపిస్తూ సిగ్గు కొద్దిగా మెల్లగా విడిచి, నాతో ఇట్లు పలికింది.

**మేనోవాచ –** మేనాదేవి పలికింది.

**కిమర్థం తు భవాన్బ్రహ్మన్రూపమస్య మహావరమ్ ।**
**వ్యర్థీ కరోతి కిమియం హన్యతాం న స్వయం శివా ॥79॥**

ఓ బ్రహ్మా! నీవీమె గొప్పరూపాన్ని ఏల వ్యర్థం చేయడానికి ఇచ్ఛగించావు? ఈమెను నీవే స్వయంగా సంహరించరాదా?

**న వక్తవ్యం చ భవతా శివాయ ప్రతిదీయతామ్ ।**
**న దాస్యేఽహం శివాయైనాం స్వసుతాం ప్రాణవల్లభామ్ ॥80॥**

శివునకిమ్మని నీవు నాకు చెప్పవద్దు. నాకు ప్రాణప్రియురాలైన నా యీ కుమార్తెను నేను శివునకీయలేను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తే తు తదా సిద్ధాః సనకాద్యా మహామునే ।**
**సమాగత్య మహాప్రీత్యా వచనం హీదమబ్రువన్ ॥81॥**

ఓ మహర్షీ! మేనక ఈవిధంగా చెప్పగా సనకాది సిద్ధులు ముందుకువచ్చి మహాప్రేమతో ఇలా పలికారు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**అయం వై పరమస్సాక్షాచ్ఛివః పరసుఖావహః ।**
**కృపయా చ భవత్పుత్ర్యై దర్శనం దత్తవాన్ప్రభుః ॥82॥**

బ్రహ్మానందాన్నిచ్చువాడు, జగన్నాథుడునైన ఈ పరమశివుడు దయతో నీకుమార్తెకు సాక్షాత్కరించి దర్శనమిచ్చాడు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**అథోవాచ తు తాన్మేనా విలప్య చ ముహుర్ముహుః ।**
**న దేయా తు మయా సమ్యగ్గిరిశాయోగ్రరూపిణే ॥83॥**

అంతట మేనక మరల మరల విలపించి, వారితో ఇట్లు పలికింది. ఉగ్రరూపుడైన కైలాసపతికి నేను నాకుమార్తెనీయను.

**కిమర్థం తు భవన్తశ్చ సర్వే సిద్ధాః ప్రపంచినః ।**
**రూపమస్యాః పరం నామ వ్యర్థీకర్తుం సముద్యతాః ॥84॥**

సిద్ధులైన మీరందరు ప్రపంచ వ్యవహారాలలో ప్రవేశించి, ఒక్కటిగా జతగూడి, ఈమె సుందర రూపాన్ని వ్యర్థం చేయడానికి మీరెందులకు నడుం కట్టారు?

**ఇత్యుక్తే చ తయా తత్ర మునేఽహం చకితోఽభవమ్ ।**
**సర్వే విస్మయమాపన్నా దేవసిద్ధర్షి మానవాః ॥85॥**

అప్పుడామె అట్లు పలుకగా నేను, దేవతలు, సిద్ధులు, ఋషులు, మానవులందరు ఆశ్చర్యమగ్నుల మయ్యాము.

**ఏతస్మిన్సమయే తస్యా హఠం శ్రుత్వా దృఢం మహత్ ।**
**ద్రుతం శివప్రియో విష్ణుస్సమాగత్యాఽబ్రవీదిదమ్ ॥86॥**

ఇంతలో ఆమె గట్టి మొండి పట్టుదలనుగూర్చి వినిన శివప్రియుడైన విష్ణువు వెంటనే వచ్చి ఇలా పలికాడు.

**విష్ణురువాచ** – విష్ణువు పలికాడు.

**పితౄణాం చ ప్రియాపుత్రీ మానసీ గుణసంయుతా ।**
**పత్నీ హిమవతస్సాక్షాద్బ్రహ్మణః కులముత్తమమ్ ॥87॥**

ఓ మేనా! నీవు పితృదేవతల అనుంగు మానసపుత్రివి. సద్గుణవతివి. హిమవంతుని భార్యవు. నీకులం సాక్షాత్తుగా బ్రహ్మగారినుండి ప్రవర్తిల్లడంచేత పవిత్రమయ్యింది.

**సహాయాస్తాదృశా లోకే ధన్యా హ్యసి వదామి కిమ్ ।**
**ధర్మస్యాధారభూతాసి కథం ధర్మం జహాసి హి ॥88॥**

నీకు అటువంటివారు సహాయకులు. నీవీలోకంలో ధన్యురాలవు. నేనేమి చెప్పగలను? నీవు ధర్మానికి ఆధారమైనదానవు. నీవు ధర్మాన్ని ఎలా విడిచిపెడుతున్నావు?

**దేవైశ్చ ఋషిభిశ్చైవ బ్రహ్మణా వా మయా తథా ।**
**విరుద్ధం కథ్యతే కిం ను త్వయైవ సువిచార్యతామ్ ॥89॥**

దేవతలుగాని, ఋషులుగాని, బ్రహ్మగాని, నేనుగాని విరుద్ధంగా మాట్లాడుతున్నామా? నీవే బాగుగా ఆలోచించుకో?

**శివం త్వం న చ జానాసి నిర్గుణస్య గుణస్సహి ।**
**విరూపస్స సురూపో హి సర్వసేవ్యస్సతాంగతిః ॥90॥**

శివుని నీవెరుగవు. ఆయన సగుణుడు, నిర్గుణుడు కూడా. ఆయన సుందరాకారుడు, వికృతాకారుడు కూడా. సర్వులకు సేవ్యుడు. సత్పురుషులు పొందే గతియు ఆయనయే.

**తేనైవ నిర్మితా దేవీ మూలప్రకృతిరీశ్వరీ ।**
**తత్పార్శ్వే చ తదా తేన నిర్మితః పురుషోత్తమః ॥91॥**

మూలప్రకృతియైన ఈశ్వరీదేవిని ఆయనయే సృష్టించాడు. అనంతరం ఆయన ఆమెప్రక్కన ఉండేట్లు పురుషోత్తముని సృష్టించాడు.

**తాభ్యాం చాహం తథా బ్రహ్మా తతశ్చ గుణరూపతః ।**
**అవతీర్య స్వయం రుద్రో లోకానాం హితకారకః ॥92॥**

వారినుండియే నేనూ బ్రహ్మ జన్మించాము. అనంతరం లోకానికి హితంచేసే రుద్రుడు స్వయంగా సగుణరూపాన్ని స్వీకరించి, అవతరించాడు.

**తతో వేదా స్తథా దేవా యత్కించిద్దృశ్యతే జగత్ ।**
**స్థావరం జంగమం చైవ తత్సర్వం శంకరాదభూత్ ॥93॥**

అనంతరం శంకరునినుండి వేదాలు, దేవతలు, దృశ్యమానమైన ఈ సమస్త జగత్తు, చరాచర ప్రాణులు ఈ సమస్తం ఉద్భవించాయి.

**తద్రూపం వర్ణితం కేన జ్ఞాయతే కేన వా పునః ।**
**మయా చ బ్రహ్మణా యస్య హ్యాతో లబ్ధశ్చ నైవ హి ॥94॥**

ఆయన రూపాన్ని ఎవరు వర్ణించగలరు? వర్ణన యేల? ఎరిగినవారెవ్వరు? నాకుగాని, బ్రహ్మకుగాని ఆయన యథార్థ స్వరూపం తెలియనే తెలియదు.

**ఆబ్రహ్మస్తంబపర్యంతం యత్కించిద్దృశ్యతే జగత్ ।**
**తత్సర్వం చ శివం విద్ధి నాత్ర కార్యా విచారణాత్ ॥95॥**

బ్రహ్మనుండి గడ్డిపోచవరకుగల ఈ జగత్తంతయు శివస్వరూపమేనని తెలుసుకో. ఈవిషయంలో నీవు సందేహింపవలసిన పనిలేదు.

**స ఏవేదృక్ సురూపేణావతీర్ణో నిజలీలయా ।**
**శివా తపఃప్రభావాద్ధి తవ ద్వారి సమాగతః ॥96॥**

ఆయన తన లీలచే ఇట్టి స్వరూపంతో అవతరించాడు. పార్వతీదేవి చేసిన తపఃఫలంగా నీగుమ్మం వద్దకు వచ్చియున్నాడు.

**తస్మాత్త్వం హిమవత్పత్ని దుఃఖం ముంచ శివం భజ ।**
**భవిష్యతి మహానందః క్లేశో యాస్యతి సంక్షయమ్ ॥97॥**

కావున నీవు దుఃఖాన్ని విడిచి శివుని భజింపుము. ఓ హిమవత్పత్నీ! నీకు మహానందం కలుగగలదు. నీ దుఃఖం పూర్తిగా నశిస్తుంది.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏవం ప్రబోధితాయాస్తు మేనకాయా అభూన్మునే ।**
**తస్యాస్తు కోమలం కించిన్మనో విష్ణు ప్రబోధితమ్ ॥98॥**

ఓ మహర్షీ! విష్ణువు ఈవిధంగా బోధించగానే మేనకయొక్క మనస్సు కొద్దిగా మెత్తబడింది.

**పరం హఠం న తత్యాజ కన్యాం దాతుం హరాయ న ।**
**స్వీచకార తదా మేనా శివమాయా విమోహితా ॥99॥**

ఈమె తన మొండితనాన్ని మాత్రం వీడలేదు. శివమాయా విమోహితురాలైన మేనాదేవి ఆ సమయంలో పార్వతిని శివునకీయడానికి అంగీకరించలేదు.

**ఉవాచ చ హరిం మేనా కించిద్బుద్ధా గిరిప్రియా ।**
**శ్రుత్వా విష్ణువచో రమ్యం గిరిజా జననీ హి సా ॥100॥**

హిమవత్పత్నియు, పార్వతి తల్లియునైన మేనాదేవి విష్ణువుయొక్క మధురమైన బోధను విని, కొంత జ్ఞానాన్ని పొందినదై విష్ణువుతో ఇట్లు పలికింది.

**యది రమ్యతనుస్స స్యాత్తదా దేయా మయా సుతా ।**
**నాన్యథా కోటిశో యత్నైర్వచ్మి సత్యం దృఢం వచః ॥101॥**

అతడు సుందరాకారుడైనచో నేను నా కుమార్తెనిస్తాను. అట్లు కానిచో కోటి యత్నాలు చేసినప్పటికి నేనీయను. నేను సత్యము దృఢమునైన వచనాలనే పలుకుతున్నాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా వచనం మేనా తూష్ణీమాస దృఢవ్రతా ।**
**శివేచ్ఛా ప్రేరితా ధన్యా తథాయాఖిలమోహినీ ॥102॥**

దృఢదీక్షగల మేనకాదేవి శివేచ్ఛచే ప్రేరితురాలై ఇట్లు పలికి, మిన్నకుండి, ధన్యురాలయ్యింది. సర్వప్రాణులను ఆ శివేచ్ఛయే మోహింపజేస్తుంది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే మేనాప్రబోధవర్ణనం నామ చతుశ్చత్వారింశోఽధ్యాయః ॥44॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో మేనాదేవికి తెలియజెప్పుటను గూర్చివర్ణన అనే నలభై నాలుగవ అధ్యాయం సమాప్తం.

## పంచచత్వారింశోऽధ్యాయః – నలబై ఐదవ అధ్యాయం

## శివసుందర స్వరూప పురవాస్యుత్సవః – శివసుందరస్వరూప పురవాసియొక్క ఉత్సవం

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఏతస్మిన్నంతరే త్వం హి విష్ణునా ప్రేరితో ద్రుతమ్ ।**
**అనుకూలయితుం శంభుమయాస్తన్నికటే మునే ॥1॥**

ఓ మునీ! ఇంతలోనీవు విష్ణువుచే ప్రేరితుడవై వెంటనే శంభునకు నచ్చచెప్పడానికి ఆయన వద్దకు వెళ్ళావు.

**తత్ర గత్వా స వై రుద్రో భవతా సుప్రబోధితః ।**
**స్తోత్రైర్నానావిధైస్తుత్వా దేవకార్య చికీర్షయా ॥2॥**

నీవు దేవకార్యాన్ని చేయగోరి, అక్కడకు వెళ్ళి, రుద్రుని అనేక విధాలైన స్తోత్రాలతో స్తుతించి, ఆయనకు నచ్చజెప్పావు.

**శ్రుత్వా త్వద్వచనం ప్రీత్యా శంభునా ధృతమద్భుతమ్ ।**
**స్వరూపముత్తమం దివ్యం కృపాళుత్వం చ దర్శితమ్ ॥3॥**

శంభుడు నీమాటను ప్రీతితోవిని, తన దయాగుణాన్ని ప్రదర్శించువాడై, అద్భుతము, ఉత్తమము, దివ్యమునైన రూపాన్ని ధరించాడు.

**తద్దృష్ట్వా సుందరం శంభుం స్వరూపం మన్మథాధికమ్ ।**
**అత్యహృష్టో మునే త్వం హి లావణ్య పరమాయనమ్ ॥4॥**

ఓ మునీ! సుందర రూపంలో మన్మథుని మించినదియు, లావణ్యానికి పరమ నిదానమైన దియునగు శంభుని రూపాన్నిచూచి నీవు చాలా ఆనందించావు.

**స్తోత్రై ర్నానావిధైస్తుత్వా పరమానందసంయుతః ।**
**ఆగచ్ఛస్త్వం మునే తత్ర యత్ర మేనా స్థితాఖిలైః ॥5॥**

ఓ మునీ! పరమానందాన్ని పొందియున్న నీవనేక విధాల స్తోత్రాలచే స్తుతించి ఇతరులందరితో నున్న మేనయున్న చోటుకి వెళ్ళావు.

**తత్రాగత్య సుప్రసన్నో మునేऽతిప్రేమసంకులః ।**
**హర్షయంస్తాం శైలపత్నీం మేనాం త్వం వాక్యమబ్రవీః ॥6॥**

ఓ మునీ! నీవు మిక్కిలి ప్రసన్నుడవై అధిక ప్రేమతో నిండియున్న నీవచ్చటకు వచ్చి, హిమవంతుని పత్నియైన మేనాదేవిని ఆనందింపజేస్తూ ఇలా పలికావు.

**నారద ఉవాచ** – నారదుడు చెప్పాడు.

**మేనే పశ్య విశాలాక్షి! శివరూపమనుత్తమమ్ ।**
**కృతా శివేన తేనైవ సుకృపా కరుణాత్మనా ॥7॥**

ఓ మేనా! విశాలాక్షీ! సర్వోత్తమమైన శివుని రూపాన్ని చూడుము. కరుణామూర్తియైన శివుడు దయచూపించాడు.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**శ్రుత్వా సా తద్వచో మేనా విస్మితా శైలకామినీ ।**
**దదర్శ శివరూపం తత్పరమానందదాయకమ్ ॥8॥**

**కోటిసూర్యప్రతీకాశం సర్వావయవసుందరమ్ ।**
**విచిత్రవసనం చాత్ర నానాభూషణభూషితమ్ ॥9॥**

**సుప్రసన్నం సుహాసం చ సులావణ్యం మనోహరమ్ ।**
**గౌరాభం ద్యుతిసంయుక్తం చంద్రరేఖావిభూషితమ్ ॥10॥**

**సర్వై ర్దేవగణైః ప్రీత్యా విష్ణ్వాద్యైస్సేవితం తథా ।**
**సూర్యేణ చ్ఛత్రితం మూర్ధ్ని చంద్రేణ చ విశోభితమ్ ॥11॥**

ఆ మాటవిని, హిమవంతుని పత్నియైన మేన ఆశ్చర్యపడి, పరమానందాన్ని కలిగించేది, కోటిసూర్యుల కాంతిగలది, సర్వావయవ సుందరమైనది, విచిత్ర వస్త్రాలు కలది, అనేక భూషణాలచే అలంకరించబడినది, మిక్కిలి ప్రసన్నమైనది, చక్కని చిరునవ్వు కలది, గొప్ప లావణ్యం కలది, మనోహరమైనది, తెల్లని కాంతులు వెదజల్లేది, చంద్రవంకతో అలంకరింపబడినది, విష్ణువు మున్నగు దేవతా గణాలతో సేవింపబడినది, శిరస్సుపై సూర్యుడు ఛత్రముగా కలది, చంద్రునితో ప్రకాశించునది యగు శివుని రూపాన్ని చూచింది.

**సర్వథా రమణీయం చ భూషితస్య విభూషణైః ।**
**వాహనస్య మహాశోభా వర్ణితుం నైవ శక్యతే ॥12॥**

ఆభరణాలతో అలంకరింపబడిన శివుడు అన్నివిధములుగా రమణీయంగా ఉన్నాడు. ఆయన వాహనం శోభను వర్ణింపశక్యంగాదు.

**గంగా చ యమునా చైవ విధత్తః స్మ సుచామరే ।**
**సిద్ధయోఽష్టౌ పురస్తస్య కుర్వంతి స్మ సునర్తనమ్ ॥13॥**

గంగాయమునలు అందమైన వింజామరలు పట్టారు. అష్టసిద్ధులు అలంకరించుకొని ఆయన ఎదుట అందంగా నాట్యమాడాయి.

**మయా చైవ తదా విష్ణురింద్రాద్యా హ్యమరాస్తథా ।**
**స్వం స్వం వేషం సుసంభూష్య గిరిశేనాచరన్వృతాః ॥14॥**

నేను, విష్ణువు, దేవతలు, తమతమ వేషాలను చక్కగా అలంకరించుకొని, కైలాసపతితో కలిసి నడిచాము.

**తథా జయేతి భాషంతో నానారూపా గణాస్తదా ।**
**స్వలంకృతమహామోదా గిరీశపురతోఽచరన్ ॥15॥**

అప్పుడనేక రూపాలు గలవారు, స్వయంగా చక్కగా అలంకరించుకున్నవారు, మహానందంతో కూడినవారు అయిన శివగణాలు జయజయధ్వానాలు చేస్తూ శివుని ఎదుట నడిచారు.

**సిద్ధాశ్చోపసురాస్సర్వే మునయశ్చ మహాసుఖాః ।**
**యయుశ్శివేన సుప్రీతాస్సకలాశ్చాపరే తథా ॥16॥**

సిద్ధులు, ఉపదేవతలు, మునులు, ఇతరులందరు మహానందంతో శివునితోబాటు నడిచారు.

**ఏవం దేవాదయస్సర్వే కుతూహలసమన్వితాః ।**
**పరంబ్రహ్మ గృణన్తస్తే స్వపత్నీభి రలంకృతాః ॥17॥**

ఈవిధంగా దేవతలందరు కుతూహలంతో కూడినవారై, అలంకరించుకొని, తమ భార్యలతోకూడి, పరబ్రహ్మమైన శివుని సేవించారు.

**విశ్వావసుముఖాస్తత్ర హ్యప్సరోగణసంయుతాః ।**
**గాయంతోఽప్యగ్రతస్తస్య పరమం శాంకరం యశః ॥18॥**

విశ్వావసువు మున్నగువారు అప్సరసలతోగూడి, శంకరుని ఎదుట ఆయనయొక్క ఉత్తమ కీర్తిని గానంచేస్తూ నడచారు.

**ఇత్థం మహోత్సవస్తత్ర బభూవ మునిసత్తమ! ।**
**నానావిధో మహేశే హి శైలద్వారి చ గచ్ఛతి ॥19॥**

ఓ మహర్షీ! ఇట్లు మహేశ్వరుడు హిమవంతుని గృహద్వారం వద్దకు వెళ్ళుతుండగా నానావిధ మహోత్సవం సంపన్నమయ్యింది.

**తస్మింశ్చ సమయే తత్ర సుషమా యా పరాత్మనః ।**
**వర్ణితుం తాం విశేషేణ కశ్శక్నోతి మునీశ్వర ॥20॥**

ఓ మహర్షీ! ఆ సమయంలోని పరమాత్మయొక్క మహాసౌందర్యాన్ని ప్రత్యేకించి ఎవడు వర్ణింపగలడు?

**తథావిధం చ తం దృష్ట్వా మేనా చిత్రగతా ఇవ ।**
**క్షణమాసీత్తతః ప్రీత్యా ప్రోవాచ వచనం మునే ॥21॥**

ఓ మహర్షీ! అటువంటి శివునిచూచి మేనాదేవి క్షణకాలం చిత్తర్వునందలి మనిషివలె బిత్తర పోయింది. అనంతరం ఆనందంతో ఇట్లు పలికింది.

**మేనోవాచ** – మేనాదేవి పలికింది.

**ధన్యా పుత్రీ మదీయా చ యయా తప్తం మహత్తపః ।**
**యత్రప్రభావాన్మహేశాన! త్వం ప్రాప్త ఇహ మద్గృహే ॥22॥**

నాకుమార్తె ధన్యురాలు. ఆమె గొప్ప తపస్సుచేసింది. ఓ మహేశ్వరా! ఆమె తపఃప్రభావంచేత నీవీనాడు మా ఇంటికి వచ్చావు.

**మయా కృతా పురా యా వై శివనిందా దురత్యయా ।**
**తాం క్షమస్వ శివాస్వామిన్ సుప్రసన్నో భవాధునా ॥23॥**

ఓ పార్వతీపతీ! నేనింతకుముందు శివనింద చేశాను. దానిని క్షమించి ఇప్పుడు నాయందు ప్రసన్నుడవు కమ్ము.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్థం సంభాష్య సా మేనా సంస్తూయేందులలాటకమ్ ।**
**సాంజలిః ప్రణతా శైలప్రియా లజ్జాపరాభవత్ ॥24॥**

మేనాదేవి ఇట్లు పలికి, చంద్రశేఖరుని బాగుగా స్తుతించి, చేతులు జోడించి, నమస్కరించింది. అప్పుడా హిమవంతుని భార్య మిక్కిలి సిగ్గుపడింది.

**తావత్ స్త్రియస్సమాజగ్ముర్హిత్వా కామాననేకశః ।**
**బహ్వ్యస్తాః పురవాసిన్యశ్శివదర్శనలాలసాః ॥25॥**

ఇంతలో నగరంలో నివసించే ఎందరో స్త్రీలు శివుని చూడగోరి, వివిధ కార్యాలు విడిచిపెట్టి, బయటకు వచ్చారు.

**మజ్జనం కుర్వతీ కాచిత్తచ్చూర్ణసహితా యయౌ ।**
**ద్రష్టుం కుతూహలాఢ్యా చ శంకరం గిరిజావరమ్ ॥26॥**

ఒకామె పార్వతీవరుడగు శంకరుని చూడాలనే కుతూహలాన్ని పట్టజాలక స్నానంచేస్తూ ఆచూర్ణంతోసహా బయటకు వచ్చింది.

**కాచిత్తు స్వామినస్సేవాం సఖీయుక్తా విహాయ చ ।**
**సుచామరకరా ప్రీత్యాఽఽగాచ్ఛంభోర్దర్శనాయ వై ॥27॥**

ఒకామె భర్తయొక్క సేవను విడనాడి, చెలికత్తెతోగూడి, చేతిలో అందమైన చామరం ఉండగానే శంభుని దర్శించాలనే ప్రీతితో వెళ్ళింది.

**కాచిత్తు బాలకం హిత్వా పిబంతం స్తన్యమాదరాత్ ।**
**అతృప్తం శంకరం ద్రష్టుం యయౌ దర్శనలాలసా ॥28॥**

ఒకామె శ్రద్ధతో స్తన్యాన్ని త్రాగుతున్న బాలకుడు తృప్తి చెందకుండగనే విడిచిపెట్టి, శివుని దర్శించాలనే ఉత్కంఠతో వెళ్ళింది.

**రశనాం బధ్నతీ కాచిత్తయైవ సహితా యయౌ ।**
**వసనం విపరీతం వై ధృత్వా కాచిద్యయౌ తతః ॥29॥**

ఒకామె బంగరు మొలత్రాటిని కట్టుకొనబోయి, అది చేతిలోనుండగానే వెళ్ళింది. ఒకామె చీరను తలక్రిందులుగా కట్టుకుని వెళ్ళింది.

**భోజనార్థం స్థితం కాంతం హిత్వా కాచిద్యయౌ ప్రియా ।**
**ద్రష్టుం శివావరం ప్రీత్యా సతృష్ణా సకుతూహలా ॥30॥**

ఒకామె పార్వతీవరుని చూడాలనే తృష్ణతో, కుతూహలంతో, ప్రీతితో, భోజనానికి కూర్చున్న భర్తను విడిచి వెళ్ళింది.

**కాచిద్ధస్తే శలాకాం చ ధృత్వాంజనకరా ప్రియా ।**
**అంజిత్వైకాక్షి సంద్రష్టుం యయౌ శైలసుతావరమ్ ॥31॥**

ఒకామె చేతియందు కాటుక భరిణెను పట్టుకుని, ఒకకన్నుకుమాత్రమే కాటుక పెట్టుకొని, అంతలో పార్వతీవరుని చూడడానికి అదేభంగిమలో వెళ్ళింది.

**కాచిత్తు కామినీ పాదౌ రంజయంతీ హ్యలక్తకైః ।**
**శ్రుత్వా ఘోషం చ తద్ధిత్వా దర్శనార్థముపాగతా ॥32॥**

ఒక సుందరి పాదాలను లత్తుక రంగుతో దిద్దుకుంటూ ఊరేగింపు శబ్దాన్ని విని, ఆపనిని విడిచిపెట్టి శివుని చూడడానికి వెళ్ళింది.

**ఇత్యాది వివిధం కార్యం హిత్వా వాసం స్త్రియో యయుః ।**
**దృష్ట్వా తు శాంకరం రూపం మోహం ప్రాప్తా స్తదాభవత్ ॥33॥**

ఈవిధంగా స్త్రీలు వివిధ కార్యాలు విడిచిపెట్టి చేతిలోని వస్త్రాన్ని క్రిందకు జారవైచి వెళ్ళారు. వారప్పుడు శంకరుని రూపాన్నిచూచి మోహం పొందారు.

**తతస్తాః ప్రేమసంవిగ్నా శ్శివదర్శనహర్షితాః ।**
**నిధాయ హృది తన్మూర్తిం వచనం చేదమబ్రువన్ ॥34॥**

అప్పుడు వారు శివునిజూచి, ఆనందించి, ప్రేమతో నిండిన హృదయం గలవారై, ఆ శివుని రూపాన్ని హృదయమందిడుకొని ఇలా పలికారు.

**పురవాసిన్య ఊచుః -** పురవాసినులు పలికారు.

**నేత్రాణి సఫలాన్యాసన్ హిమవత్పురవాసినామ్ ।**
**యో యోఽపశ్యదదో రూపం తస్య వై సార్థకం జనుః ॥35॥**

హిమవంతుని నగరమునందు నివసించు పౌరుల కన్నులు సార్థకమయ్యాయి. ఎవరెవరైతే ఈరూపాన్ని చూచారో, వారివారి జన్మలు సార్థకమయ్యాయి.

**తస్యైవ సఫలం జన్మ తస్యైవ సఫలాః క్రియాః ।**
**యేన దృష్టశ్శివస్సాక్షాత్సర్వపాపప్రణాశకః ॥36॥**

సర్వపాపాలను పోగొట్టే శివుని ఎవరైతే ప్రత్యక్షంగా దర్శిస్తారో వారిజన్మమాత్రమే సఫలము. అటువంటివారి కర్మలు మాత్రమే సఫలమౌతాయి.

**పార్వత్యా సాధితం సర్వం శివార్థే యత్తపః కృతమ్ ।**
**ధన్యేయం కృతకృత్యేయం శివా ప్రాప్య శివం పతిమ్ ॥37॥**

శివుని కొరకు తపస్సుచేసి పార్వతి సర్వాన్ని సాధించింది. ఈమె ధన్యురాలు. శంభుని భర్తగా పొందిన ఈ పార్వతి కృతకృత్యురాలు.

**యదీదం యుగలం బ్రహ్మా న యుంజ్యాచ్ఛివయోర్ముదా ।**
**తదా చ సకలోఽప్యస్య శ్రమో నిష్ఫలతామియాత్ ॥38॥**

సృష్టికర్త ఆనందంతో ఈ పార్వతీ పరమేశ్వరుల జంటను కలుపకపోయినచో అప్పుడాతని శ్రమయంతయు నిష్ఫలమై యుండేది.

**సమ్యక్ కృతం తథా చాత్ర యోజితం యుగ్మముత్తమమ్ ।**
**సర్వేషాం సార్థతా జాతా సర్వకార్యసముద్భవా ॥39॥**

ఈ ఉత్తమమైన జంటను కలిపి బ్రహ్మ మంచిపని చేశాడు. అందరు చేసిన కర్మలన్నియు ఈ కలయికచే సార్థకమయ్యాయి.

**వినా తు తపసా శంభోర్దర్శనం దుర్లభం నృణామ్ ।**
**దర్శనాచ్ఛంకరస్యైవ సర్వే యాతాః కృతార్థతామ్ ॥40॥**

మానవులకు తపస్సు చేయనిదే శివుని దర్శనం లభించదు. మానవులందరు శివుని దర్శనం చేతమాత్రమే కృతార్థులౌతారు.

**లక్ష్మీర్నారాయణం లేభే యథా వై స్వామినం పురా ।**
**తథాఽసౌ పార్వతీదేవీ హరం ప్రాప్య సుభూషితా ॥41॥**

పూర్వం లక్ష్మీదేవి నారాయణుని భర్తగా పొందిన తీరున ఈ పార్వతీదేవి శివుని భర్తగాపొంది, మిక్కిలి ప్రకాశిస్తుంది.

**బ్రహ్మాణం చ యథా లేభే స్వామినం వై సరస్వతీ ।**
**తథాఽసౌ పార్వతీదేవీ హరం ప్రాప్య సుభూషితా ॥42॥**

సరస్వతి బ్రహ్మను భర్తగా పొందిన విధంగానే పార్వతీదేవి శివుని పొంది శోభిల్లగలదు.

**వయం ధన్యాః స్త్రియస్సర్వాః పురుషాస్సకలావరాః ।**
**యే యే పశ్యంతి సర్వేశం శంకరం గిరిజాపతిమ్ ॥43॥**

స్త్రీలమందరము ధన్యులము. పురుషులందరు ధన్యులు. ఎవరెవరైతే సర్వేశ్వరుడు, గిరిజాపతియునగు శంకరుని దర్శిస్తారో వారందరూ ధన్యులు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్థముక్త్వా తు వచనం చందనైశ్చాక్షతైరపి ।**
**శివం సమర్చయామాసుర్లాజాన్వవృషురాదరాత్ ॥44॥**

ఇట్లు పలికి, వారూ గంధంతో, అక్షతలతో శివుని బాగుగా పూజించి, సాదరంగా పేలాలు వర్షించారు.

**తస్థుస్తత్ర స్త్రియః సర్వా మేనయా సహ సోత్సుకాః ।**
**వర్ణయంత్యోఽధికం భాగ్యం మేనాయాశ్చ గిరేరపి ॥45॥**

స్త్రీలందరూ మేనాదేవితోకూడి ఉత్సుకతతో అచ్చట నిలబడ్డారు. వారు మేనాహిమవంతుల మహాభాగ్యాన్ని వర్ణిస్తున్నారు.

**కథాస్తథావిధాశ్శృణ్వంస్తద్వామావర్ణితాశ్శుభాః ।**
**ప్రహృష్టోఽభూత్ప్రభుః సర్వైర్మునే విష్ణ్వాదిభిస్తదా ॥46॥**

ఆ స్త్రీలచే వర్ణింపబడిన అటువంటి శుభగాధలను శివుడు వింటున్నాడు. ఓ మహర్షీ! శంభుడు విష్ణువు మున్నగువారందరితోగూడి చాలా ఆనందించాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే శివసుందర స్వరూప పురవాస్యుత్సవ వర్ణనం నామ పంచచత్వారింశోఽధ్యాయః ॥45॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో శివసుందర స్వరూప పురవాసి యొక్క ఉత్సవం అనే నలభై ఐదవ అధ్యాయం సమాప్తం.

## **షట్చత్వారింశోఽధ్యాయః** - నలబై ఆరవ అధ్యాయం
## **వరాగమనవర్ణనమ్** - వరుడైన శివుని రాకనువర్ణించుట

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథ శంభుః ప్రసన్నాత్మా సదూతం స్వగణైస్సురైః ।**
**సర్వైరన్యైర్గిరేర్ధామ జగామ సకుతూహలమ్ ॥1॥**

అంతట ప్రసన్నాత్ముడైన శివుడు దూతలతో, తన గణాలతో, దేవతలతో, మిగిలినవారందరితో గూడి, కుతూహలంతో హిమవంతుని గృహానికి వెళ్ళాడు.

**మేనాపి స్త్రీగణైస్తైశ్చ హిమాచల వరప్రియా ।**
**తత ఉత్థాయ స్వగృహాభ్యంతరం సా జగామ హ ॥2॥**

హిమవంతుని ప్రాణప్రియురాలైన మేనాదేవికూడా అప్పుడులేచి, స్త్రీగణాలతోకూడి తన ఇంటిలోపలికి వెళ్ళింది.

**నీరాజనార్థం శంభోశ్చ దీపపాత్రకరా సతీ ।**
**సర్వర్షి స్త్రీగణైస్సాకమగచ్ఛద్ద్వారమాదరాత్ ॥3॥**

ఆమె చేతిలో దీపపాత్ర ధరించి, శంభునకు నీరాజనమీయడానికి స్త్రీగణాలందరితోబాటు సాదరంగా ద్వారం వద్దకు వచ్చింది.

**తత్రాగతం మహేశానం శంకరం గిరిజావరమ్ ।**
**దదర్శ ప్రీతితో మేనా సేవితం సకలైస్సురైః ॥4॥**

అక్కడకు విచ్చేసినట్టియూ, మహేశ్వరుడైనట్టియూ, పార్వతీపతియైనట్టియూ, దేవతలందరిచే సేవింపబడునట్టియూ, శంకరుని మేనాదేవి ప్రీతితో చూచింది.

**చారు చంపక వర్ణాభం హ్యేకవక్త్రం త్రిలోచనమ్ ।**
**ఈషద్ధాస్యప్రసన్నాస్యం రత్నస్వర్ణాదిభూషితమ్ ॥5॥**

**మాలతీమాలయాయుక్తం సద్రత్నముకుటోజ్జ్వలమ్ ।**
**సత్కంఠాభరణం చారువలయాంగదభూషితమ్ ॥6॥**

**వహ్నిశౌచేనాతులేన త్వతిసూక్ష్మేణ చారుణా ।**
**అమూల్యవస్త్రయుగ్మేన విచిత్రేణాతిరాజితమ్ ॥7॥**

**చందనాగరుకస్తూరీచారుకుంకుమభూషితమ్ ।**
**రత్నదర్పణహస్తం చ కజ్జలోజ్జ్వలలోచనమ్ ॥8॥**

సుందరమగు సంపెంగల కాంతివంటి కాంతితో ప్రకాశించేవాడు, ఒకముఖం కలవాడు, మూడు కన్నులుకలవాడు, చిరునవ్వుతోగూడి, ప్రసన్నమైన ముఖం గలవాడు, రత్నాలతో, బంగారు ఆభరణాలతో అలంకరింపబడినవాడు. మల్లెలమాలను ధరించినవాడు, రత్నాలు పొదిగిన కిరీటంతో విరాజిల్లువాడు, చక్కని కంఠాభరణాలు ధరించినవాడు, సుందరమైన కంకణాలతో, అంగదాలతో అలంకరింపబడినవాడు. అగ్నివలె ప్రకాశించు సాటిలేని, సన్నని నూలుతో వడకిన సుందరమైన అమూల్య వస్త్రాలతో ప్రకాశించువాడు. చందనం, అగరు, కస్తూరి, మంచి కుంకుమలతో అలంకరింపబడినవాడు, రత్నదర్పణం చేతియందు కలవాడు, కాటుకతో ఒప్పారు కన్నులుగలవాడు అయిన శివుని పార్వతి చూచింది.

**సర్వస్వప్రభయాచ్ఛన్నమతీవసుమనోహరమ్ ।**
**అతీవ తరుణం రమ్యం భూషితాంగైశ్చ భూషితమ్ ॥9॥**

**కామినీకాంతమవ్యగ్రం కోటిచంద్రాననాంబుజమ్ ।**
**కోటిస్మరాధికతనుచ్ఛవిం సర్వాంగసుందరమ్ ॥10॥**

**ఈదృగ్విధం సుదేవం తం స్థితం స్వపురతః ప్రభుమ్ ।**
**దృష్ట్వా జామాతరం మేనా జహౌ శోకం ముదాఽన్వితా ॥11॥**

తన కాంతిచే సర్వస్వాన్ని కప్పివేసినవాడు, మిక్కిలి మనోహరాకారుడు, యువకుడు, సుందరుడు, అలంకరింపబడిన అవయవాలతో విరాజిల్లువాడు. స్త్రీలను మోహింపజేయువాడు, తొందరబాటు లేనివాడు, కోటిచంద్రుల కాంతిగల పద్మమువంటి ముఖం కలవాడు, కోటి మన్మథులకంటె అధికమైన శరీరకాంతి కలవాడు, సర్వాంగసుందరుడు గొప్పదైవం, మహాప్రభుడునగు శివుడు అల్లుని స్థానంలో తన ఎదుట నిలబడి యుండగా గాంచి మేనాదేవి శోకాన్ని వీడి, ఆనందించింది.

**ప్రశశంస స్వభాగ్యం సా గిరిజాం భూధరం కులమ్ ।**
**మేనే కృతార్థమాత్మానం జహర్ష చ పునః పునః ॥12॥**

మేనాదేవి తన భాగ్యాన్ని, పార్వతి సౌభాగ్యాన్ని, హిమవంతుని యొక్క, తనయొక్క, కులాన్ని కొనియాడింది. ఆమె తాను కృతార్థురాలైనట్లు భావించి మళ్ళీ మళ్ళీ ఆనందాన్ని పొందింది.

**నీరాజనం చకారాసౌ ప్రఫుల్లవదనా సతీ ।**
**అవలోకపరా తత్ర మేనా జామాతరం ముదా ॥13॥**

వికసించిన ముఖంగల మేనాదేవి అల్లుని ఆనందంతో పరికిస్తూ ఆయనకు నీరాజనమిచ్చింది.

**గిరిజోక్తమనుస్మృత్య మేనా విస్మయమాగతా ।**
**మనసైవ హ్యువాచేదం హర్షఫుల్లాననాంబుజా ॥14॥**

పార్వతి పలుకులను స్మరించుకొని విస్మయాన్ని పొందిన మేనాదేవి ఆనందంతో వికసించిన పద్మంవంటి ముఖం కలదై, మనస్సులో ఇట్లు తలపోసింది.

**యద్వై పురోక్తం చ తయా పార్వత్యా మమ తత్ర చ ।**
**తతోఽధికం ప్రపశ్యామి సౌందర్యం పరమేశితుః ॥15॥**

పూర్వం పార్వతి నాతోచెప్పిన సౌందర్యంకంటే అధికమైన సౌందర్యం మహేశ్వరునిలో కనబడుతోంది.

**మహేశస్య సులావణ్యమనిర్వాచ్యం చ సంప్రతి ।**
**ఏవం విస్మయమాపన్నా మేనా స్వగృహమాయయౌ ॥16॥**

"ఇప్పటి మహేశ్వరుని సొగసు వర్ణించుట సాధ్యంకాదు". మేనాదేవి ఈవిధంగా విస్మయాన్ని పొంది, తన గృహానికి వెళ్ళింది.

**ప్రశశంసు ర్యువతయో ధన్యా ధన్యా గిరేఃసుతా ।**
**దుర్గా భగవతీత్యేవమూచుః కాశ్చన కన్యకాః ॥17॥**

"పార్వతి ధన్యురాలు, ధన్యురాలు" అని స్త్రీలు కొనియాడారు. ఈమె దుర్గఅనియు, భగవతిఅనియు మరికొందరు కన్యకలు కీర్తించారు.

**న దృష్టో వర ఇత్యేవమస్మాభిర్ధానగోచరః ।**
**ధన్యా హి గిరిజాదేవీమూచుః కాశ్చన కన్యకాః ॥18॥**

"ఇటువంటి వరుడు మాకెన్నడును కానరాలేదు. మేము ధ్యానములోనైనను ఇట్టి వరుని చూడలేదు పార్వతి ధన్యురాలు". అని కొందరు కన్యలు మేనాదేవితో చెప్పారు.

**జగుర్గంధర్వప్రవరా ననృతుశ్చాప్సరోగణాః ।**
**దృష్ట్వా శంకరరూపం చ ప్రహృష్టాస్సర్వదేవతాః ॥19॥**

గంధర్వ శ్రేష్ఠులు గానం చేయగా అప్సరోగణాలు నర్తించాయి. శంకరుని రూపాన్నిచూచి, దేవతలందరు మిక్కిలి ఆనందించారు.

**నానాప్రకారవాద్యాని వాదకా మధురాక్షరమ్ ।**
**నానాప్రకారశిల్పేన వాదయామాసురాదరాత్ ॥20॥**

వాద్యగాండ్రు వివిధ వాద్యాలను వివిధ రకాల నైపుణ్యాలతో మధురంగా శ్రద్ధతో ప్రయోగించారు.

**హిమాచలోఽపి ముదితో ద్వారాచారమథాకరోత్ ।**
**మేనాపి సర్వనారీభిర్మహోత్సవపురస్సరమ్ ॥21॥**

ఆనందంతో నిండిన మేనాహిమవంతులు స్త్రీలందరితో గూడి, మహోత్సాహంతో ద్వారంవద్ద జరిగే ఆచారాన్ని అనుష్ఠించారు.

**పరపుచ్ఛాం చకారాసౌ ముదితా స్వగృహం యయౌ ।**
**శివో నివేదితం స్థానం జగామ గణనిర్జరైః ॥22॥**

మేనాదేవి పార్వతీ పరమేశ్వరుల పేర్లనడిగి చెప్పించింది. ఆమె ఆనందంతో తన గృహానికి వెళ్ళింది. శివుడు తన గణాలతో, దేవతలతోగూడి వినయంతో తనకు నిర్దేశింపబడిన స్థానానికి వెళ్ళాడు.

**ఏతస్మిన్నంతరే దుర్గాం శైలాంతఃపురచారికా ।**
**బహిర్జగ్ముస్సమాదాయ పూజితుం కులదేవతామ్ ॥23॥**

ఇంతలో హిమవంతుని అంతఃపుర పరిచారికలు కులదేవతనారాధించడానికి దుర్గను తీసుకొని నగర వెలుపలస్థానానికి వెళ్ళారు.

**తత్ర తాం దదృశుర్దేవా నిమేషరహితా ముదా ।**
**సునీలాంజనవర్ణాభాం స్వాంగైశ్చ ప్రతిభూషితామ్ ॥24॥**

**త్రినేత్రాదృత నేత్రాంతామన్యవారితలోచనామ్ ।**
**ఈషద్ధాస్యప్రసన్నాస్యాం సకటాక్షాం మనోహరామ్ ॥25॥**

ఆసమయంలో నల్లని కాటుక రంగు కలిగినది, తన అవయవాలే అలంకారంగా కలది ముక్కంటిని ప్రేమతోచూచు నేత్రాలుకలది, కన్నులతో ఇతరులను చూడనిది, చిరునవ్వుతో ప్రసన్నమైన ముఖం కలది, మనోహరములైన నేత్రాలుకల దేవిని దేవతలు ఆనందంతో రెప్పవాల్చకుండగా చూశారు.

**సుచారు కబరీభారాం చారుపత్రక శోభితామ్ ।**
**కస్తూరీబిందుభిస్సార్థం సిందూరబిందుశోభితామ్ ॥26॥**

**రత్నేంద్రసారహారేణ వక్షసా సువిరాజితామ్ ।**
**రత్నకేయూరవలయాం రత్నకంకణ మండితామ్ ॥27॥**

**సద్రత్నకుండలాభ్యాం చ చారుగండస్థలోజ్జ్వలామ్ ।**
**మణిరత్నప్రభాముష్టి దంతరాజివిరాజితామ్ ॥28॥**

**మధుబింబాధరోష్ఠాం చ రత్నయావకసంయుతామ్ ।**
**రత్నదర్పణహస్తాం చ క్రీడాపద్మవిభూషితామ్ ॥29॥**

అందమైన కేశపాశాలు కలది, చెక్కిళ్ళపై సుందరమైన పత్ర రచన కలది, కస్తూరి బిందువులతో కూడిన కుంకుమ బొట్టుతో ప్రకాశించునది. సర్వశ్రేష్ఠ రత్నాలు పొదిగిన హారంతో శోభిల్లు వక్షఃస్థలం కలది, రత్నములు

పొదిగిన అంగదాలను, కంకణాలను ధరించి శోభిల్లునది. చక్కని రత్నకుండలాల కాంతులతో ప్రకాశించే అందమైన చెక్కిళ్ళుకలది. మణుల కాంతులను, రత్నప్రభలను అపహరించే దంత పంక్తులతో ప్రకాశించునది, దొండపండువంటి అధరోష్ఠము కలది, పాదముల యందు రత్ననూపురాలు, లత్తుక రంగు కలిగినదియు, చేతియందు రత్నపుటద్దాన్ని లీలా పద్మాన్ని ధరించి ప్రకాశించునదియునగు పార్వతిని వారు చూశారు.

**చందనాగరుకస్తూరీకుంకుమేనాతిచర్చితామ్ ।**
**క్వణన్ మంజీరపాదాం చ రక్తాంఘ్రితలరాజితామ్ ॥30॥**

ఆమె చందనాగరు కస్తూరి కుంకుమాలను లేపనం చేసుకున్నది. ఆమె పాదాలు ఎర్రగా ప్రకాశిస్తున్నాయి. మంజీరాలు మధురంగా ధ్వనిస్తున్నాయి.

**ప్రణేముశ్శిరసా దేవీం భక్తియుక్తాః సమేనకామ్ ।**
**సర్వే సురాదయో దృష్ట్వా జగదాద్యాం జగత్ప్రసూమ్ ॥31॥**

జగత్కారణము, జగన్మాతయునగు పార్వతీదేవిని మేనకతోసహా చూచి, దేవతలు మున్నగు వారందరూ భక్తితో శిరస్సులు వంచి నమస్కరించారు.

**త్రినేత్రో నేత్రకోణేన తాం దదర్శ ముదాన్వితః ।**
**శివః సత్యాకృతిం దృష్ట్వా విజహౌ విరహజ్వరమ్ ॥32॥**

త్రినేత్రుడు ఆనందంతో ఆమెను కనుకొనలతో చూశాడు. ఆ సతీదేవి ఆకృతినిచూసి, శివుడు విరహజ్వరాన్ని విడనాడాడు.

**శివస్సర్వం విసస్మార శివా సంన్యస్తలోచనః ।**
**పులకాంచిత సర్వాంగో హర్షాద్గౌరీ విలోచనః ॥33॥**

పార్వతివైపు చూస్తున్న శివుని శరీరావయవాలన్నీ పులకించిపోయాయి. ఆయన కన్నులానందంతో నిండిపోయాయి. ఆయన కన్నులలో ఆమెయే నిండియుండడంచేత ఆయన సర్వాన్నీ మరచిపోయాడు.

**అథ కాళీ బహిః కుర్యాం గత్వా పూజ్య కులాంబికామ్ ।**
**వివేశ భవనం రమ్యం స్వపితుః సద్విజాంగనా ॥34॥**

అనంతరం కాళి బ్రాహ్మణ స్త్రీలతో కలసి నగరానికి బయటనున్న కులదైవమైన అంబికనర్చించి, తిరిగి తన తండ్రియొక్క సుందర భవనంలో ప్రవేశించింది.

**శంకరోఽపి సురైస్సార్ధం హరిణా బ్రహ్మణా తథా ।**
**హిమాచల సముద్దిష్టం స్వస్థానమగమన్ముదా ॥35॥**

శంకరుడు కూడా దేవతలతో, విష్ణువుతో, బ్రహ్మతోగూడి, హిమవంతునిచే నిర్దేశింపబడిన తన నివాసానికి ఆనందంతో వెళ్ళాడు.

**తత్ర సర్వే సుఖం తస్థుస్సేవంతశ్శంకరం యథా ।**
**సమ్మానితా గిరీశేన నానావిధాసు సంపదా ॥36॥**

హిమవంతునిచే సమస్త సంపదలతో సమ్మానింపబడిన దేవతలందరూ అక్కడ శంకరుని సేవిస్తూ సుఖంగా నున్నారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే వరాగమాది వర్ణనం నామ షట్ చత్వారింశోఽధ్యాయః ॥46॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో వరుడైన శివుని రాకనువర్ణించుట అనే నలబై ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్త చత్వారింశోఽధ్యాయః – నలబై ఏడవ అధ్యాయం

## శివహిమగిరి గృహాభ్యంతర గమనోత్సవః – శివుడు హిమవంతుని గృహంలోనికి వెళ్ళుట

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**తతః శైలవరః సోఽపి ప్రీత్యా దుర్గోపవీతకమ్ ।**
**కారయామాస సోత్సాహం వేదమంత్రైశ్శివస్య చ ॥1॥**

పిమ్మట పర్వతరాజు ప్రీతితో, ఉత్సాహంతో శివపార్వతులకు వేదమంత్రపూర్వకంగా ఉపవీతాలను ధరింపజేశాడు.

**అథ విష్ణ్వాదయో దేవా మునయ స్సకుతూహలమ్ ।**
**హిమాచలప్రార్థనయా వివేశాంతర్గృహం గిరేః ॥2॥**

అప్పుడు విష్ణువు మొదలగు దేవతలు, మునులు హిమవంతుని ప్రార్థనను మన్నించి, కుతూహలంతో ఆయన అంతఃపురంలో ప్రవేశించారు.

**శ్రుత్యాచారం భవాచారం విధాయ చ యథార్థతః ।**
**శివామలంకృతాం చక్రుశ్శివదత్తవిభూషణైః ॥3॥**

వేదాచారాన్ని, లోకాచారాన్ని యథావిధిగా ఆచరించి, శివుడిచ్చిన అలంకారాలతో పార్వతిని అలంకరింపజేశారు.

**ప్రథమం స్నాపయిత్వా తాం భూషయిత్వాథ సర్వశః ।**
**నీరాజితా సఖీభిశ్చ విప్రపత్నీభిరేవ చ ॥4॥**

ఆమెకు స్నానం చేయించి, అనంతరం దేహాన్నంతటిని అలంకరించి, బ్రాహ్మణులతో, స్త్రీలతో నీరాజనమిచ్చారు.

**అహతాంబరయుగ్మేన శోభితా వరవర్ణినీ ।**
**విరరాజ మహాశైలదుహితా శంకరప్రియా ॥5॥**

పర్వతాధీశుని కుమార్తె, శంకరుని ప్రియురాలు, బ్రహ్మచారిణీ అయిన పార్వతి విడిపోని జంటవస్త్రాలను ధరించి ప్రకాశించింది.

**కంచుకీ పరమా దివ్యా నానారత్నాన్వితాద్భుతా ।**
**విధృతా చ తయా దేవ్యా విలసంత్యాధికం మునే ॥6॥**

ఓ మహర్షీ! ఆ దేవి గొప్పగా ప్రకాశించే అనేక రత్నాలు పొదగడంచే అద్భుతంగానున్న, శ్రేష్ఠమైన, దివ్యమైన రవికను ధరించింది.

**సా బభార తథాహారం దివ్యరత్నసమన్వితమ్ ।**
**వలయాని మహార్హాణి శుద్ధచామీకరాణి చ ॥7॥**

ఆమె దివ్యమైన రత్నాలతో చేయబడిన హారాన్ని, మిక్కిలి విలువైన, శుద్ధమైన బంగారంతో చేయబడిన గాజులు ధరించింది.

**స్థితా తత్రైవ సుభగా ధ్యాయంతీ మనసా శివమ్ ।**
**శుశుభేతి మహాశైలకన్యకా త్రిజగత్ప్రసూః ॥8॥**

పర్వతాధీశుని కుమార్తెయు, ముల్లోకాలకు తల్లియునగు ఆ సుందరి అచ్చటనే నిలబడి, మనసులో శివుని ధ్యానిస్తూ మిక్కిలి ప్రకాశించింది.

**తదోత్సవో మహానాసీదుభయత్ర ముదావహః ।**
**దానం బభూవ వివిధం బ్రాహ్మణేభ్యో వివర్ణితమ్ ॥9॥**

అంతట ఇరువర్గాలవారికి ఆనందాన్ని కలిగించే మహోత్సవం ప్రవర్తిల్లింది. బ్రాహ్మణులకు విభిన్నమైన దానాలను ఇచ్చారు.

**అన్యేషాం ద్రవ్యదానం చ బభూవ వివిధం మహత్ ।**
**గీతవాద్య వినోదశ్చ తత్రోత్సవపురస్సరమ్ ॥10॥**

ఇతురులకు అనేక వస్తువులు, అధికమైన ధనం ఇచ్చారు. గీతవాద్య వినోదాలతోగూడిన ఉత్సవం ప్రవర్తిల్లింది.

**అథ విష్ణురహం ధాతా శక్రాద్యా అమరాస్తథా ।**
**మునయశ్చ మహాప్రీత్యా నిఖిలాస్సోత్సవా ముదా ॥11॥**

**సుప్రణమ్య శివాం భక్త్యా స్మృత్వా శివపదాంబుజమ్ ।**
**సంప్రాప్య హిమగిర్యాజ్ఞాం స్వం స్వం స్థానం సమాశ్రితాః ॥12॥**

అంతట విష్ణువు, బ్రహ్మనగునేను, ఇంద్రాది దేవతలు, మునులు, అందరు మహోత్సాహంతో, మహానందంతో శివునకు భక్తిపూర్వకంగా ప్రణమిల్లి, శివుని పాదపద్మాలను స్మరించి, హిమవంతుని ఆజ్ఞను పొంది, తమతమ నివాసాలకు చేరుకున్నాము.

**ఏతస్మిన్నంతరే తత్ర జ్యోతిశ్శాస్త్రవిశారదః ।**
**హిమవంతం గిరీంద్రం తం గర్గో వాక్యమభాషత ॥13॥**

ఇంతలో జ్యోతిశ్శాస్త్ర విశారదుడైన గర్గుడు పర్వతరాజగు హిమవంతుని వద్దకు వచ్చి, ఇలా పలికాడు.

**గర్గ ఉవాచ** – గర్గుడు చెప్పాడు.

**హిమాచల ధరాధీశ స్వామిన్ కాళీపతిః ప్రభో ।**
**పాణిగ్రహార్థం శంభుం చానయ త్వం నిజమందిరమ్ ॥14॥**

ఓ పర్వతరాజా! హిమాలయా! స్వామీ! ప్రభూ! కాళీపతియైన శంభుని పాణిగ్రహణం కొరకు నీ మందిరానికి తోడ్కొనిరమ్ము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**అథ తం సమయం జ్ఞాత్వా కన్యాదానోచితం గిరిః ।**
**నివేదితం చ గర్గేణ ముముదేఽతీవ చేతసి ॥15॥**

కన్యాదానానికి సమయమాసన్నమైనదని గుర్తించి గర్గుడు నివేదించగా హిమవంతుడు మనస్సులో చాలా సంతోషించాడు.

**మహీధరాం ద్విజాంశ్చైవ పరానపి తదా గిరిః ।**
**ప్రేషయామాస సుప్రీత్యా శివానయనకామ్యయా ॥16॥**

అంతట హిమవంతుడు పర్వతాలను, బ్రాహ్మణులను, ఇతరులను, శివుని తీసుకొని రావడానికి ఆనందంతో పంపాడు.

**తే పర్వతా ద్విజాశ్చైవ సర్వమంగళ పాణయః ।**
**సంజగ్ముస్సోత్సవాః ప్రీత్యా యత్ర దేవో మహేశ్వరః ॥17॥**

పర్వతాలు, బ్రాహ్మణులు మంగళద్రవ్యాలన్నిటిని చేతులందు పట్టుకుని ఉత్సాహంతో మహేశ్వరుడు నివసించిన స్థానానికి వెళ్ళారు.

**తదా వాదిత్రఘోషేణ బ్రహ్మఘోషేణ భూయసా ।**
**మహోత్సాహోఽభవత్తత్ర గీత నృత్యాన్వితేన హి ॥18॥**

అప్పుడచ్చట వాద్యఘోష, విస్తారమైన వేదఘోష, గీతాలతో, నృత్యాలతో, మహోత్సవం వర్ధిల్లింది.

**శ్రుత్వా వాదిత్ర నిర్ఘోషం సర్వే శంకర సేవకాః ।**
**ఉత్థితాస్త్వేకపద్యేన సదేవర్షిగణా ముదా ॥19॥**

వాద్యాల శబ్దాన్ని విని, శంకరుని గణాలు, దేవతలు, ఋషులు అందరు ఒక్కసారిగా ఆనందంతో లేచి నిలబడ్డారు.

**పరస్పరం సమూచుస్తే హర్షనిర్భరమానసాః ।**
**అత్రాగచ్ఛంతి గిరయశ్శివానయనకామ్యయా ॥20॥**

ఆనందంతో నిండిన మనస్సుగలవారందరు వారిలోవారిట్లు మాట్లాడుకున్నారు. "శివుని తోడ్కొని వెళ్ళడానికిచ్చటకు పర్వతాలు వస్తున్నాయి".

**పాణిగ్రహణ కాలో హి నూనం సద్యస్సమాగతః ।**
**మహద్భాగ్యం హి సర్వేషాం సంప్రాప్త మహిమన్మహే ॥21॥**

పాణిగ్రహణ ముహూర్తం చాల తొందరగా ఆసన్నమయ్యింది. మనందరికి మహాభాగ్యం సంపన్నమయిందని భావిస్తున్నాము.

**ధన్యా వయం విశేషేణ వివాహం శివయోర్ధ్రువమ్ ।**
**ద్రక్ష్యామః పరమప్రీత్యా జగతాం మంగళాలయమ్ ॥22॥**

మనము చాల ధన్యులము. సందేహం లేదు. ఎందుకనగా లోకాలకు మంగళాలు కలిగించే పార్వతీ పరమేశ్వరుల వివాహాన్ని పరమానందంతో చూడబోతున్నాము.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఏవం యావదభూత్తేషాం సంవాదస్తత్ర చాదరాత్ ।**
**తావత్సర్వే సమాయాతాః పర్వతేంద్రస్య మంత్రిణః ॥23॥**

ఇట్లు వారందరు సాదరంగా మాట్లాడుచుండగానే పర్వతరాజుయొక్క మంత్రులందరు విచ్చేశారు.

**తే గత్వా ప్రార్థయాం చక్రుశ్శివం విష్ణ్వాదికానపి ।**
**కన్యాదానోచితః కాలో వర్తతే గమ్యతామితి ॥24॥**

వారు శివునివద్దకు, విష్ణువు మున్నగువారివద్దకు వెళ్ళి, కన్యాదానసమయం సమీపిస్తోంది కావున బయలుదేరండని ప్రార్థించారు.

**తే తచ్ఛ్రుత్వా సురాస్సర్వే మునే విష్ణ్వాదయోఽఖిలాః ।**
**ముముదుశ్చేతసాతీవ జయేత్యూచుర్గిరిం ద్రుతమ్ ॥25॥**

ఓ మునీ! విష్ణువు మున్నగువారందరు ఆ మాటలు విని, మనస్సులో చాల సంతసించి, వెంటనే హిమవంతుని ఉద్దేశించి జయధ్వానం చేశారు.

**శివోఽపి ముముదేఽతీవ కాళీప్రాపణలాలసః ।**
**గుప్తం చకార తచ్చిహ్నం మనస్యేవాద్భుతాకృతిః ॥26॥**

కాళిని పొందాలనే ఉత్కంఠగల శివుడుకూడ మిక్కిలి సంతసించాడు. కాని ఆ చిహ్నాలను మనస్సులోనే రహస్యంగా నుంచుకొని గంభీరాకారుడై యున్నాడు.

**అథ స్నానం కృతం తేన మంగళద్రవ్యసంయుతమ్ ।**
**శూలినా సుప్రసన్నేన లోకానుగ్రహకారిణా ॥27॥**

అంతట శూలధారి, లోకానుగ్రహ కారకుడు, మిక్కిలి ప్రసన్నుడునైన శివుడు మంగళ ద్రవ్యాలతో స్నానం చేశాడు.

**స్నాతస్సువాససాయుక్తస్సర్వైస్తైః పరివారితః ।**
**ఆరోపితో వృషస్కంధే లోకపాలైస్సుసేవితః ॥28॥**

స్నానంచేసి, చక్కని వస్త్రాలు ధరించిన శివుని, వారందరు చుట్టుముట్టారు. లోకపాలకులాయనను చక్కగా సేవిస్తూ, వృషభాన్ని ఎక్కించారు.

**పురస్కృత్య ప్రభుం సర్వే జగ్ముర్హిమగిరేర్గృహమ్ ।**
**వాద్యాని వాదయంతశ్చ కృతవంతః కుతూహలమ్ ॥29॥**

వారందరూ వాద్యాలను మ్రోగిస్తూ పండుగ చేసుకుంటూ ఆ ప్రభుని ముందిడుకుని, హిమవంతుని గృహానికి వెళ్ళారు.

**హిమాగప్రేషితా విప్రాస్తథా తే పర్వతోత్తమాః ।**
**శంభోరగ్రచరా హ్యాసన్ కుతూహలసమన్వితాః ॥30॥**

హిమవంతునిచే పంపబడిన బ్రాహ్మణులు శ్రేష్ఠులైన పర్వతులు కుతూహలంతో కూడినవారై, శంభుని ఎదుట నడిచారు.

**బభౌ ఛత్రేణ మహతా ధ్రియమాణో హి మూర్ధని ।**
**చామరైర్వీజ్యమానోఽసౌ సవితానో మహేశ్వరః ॥31॥**

శివుని శిరస్సుపై పెద్ద ఛత్రం ఏర్పాటు చేయబడింది. చామరాలు వీచబడ్డాయి. వితానం క్రింద (వస్త్రంతో చేసిన పందిరి) మహేశ్వరుడు శోభిల్లాడు.

**అహం విష్ణు స్తథా చేంద్రో లోకపాలాస్తథైవ చ ।**
**అగ్రగాః స్మాతిశోభంతే శ్రియా పరమయా శ్రితాః ॥32॥**

నేను, విష్ణువు, ఇంద్రుడు, లోకపాలకులు ముందు నడిచాము. మేముకూడా గొప్ప శోభతో ప్రకాశించాము.

**తతః శంఖాశ్చ భేర్యశ్చ పటహానకగోముఖాః ।**
**పునఃపునరవాద్యంత వాదిత్రాణి మహోత్సవే ॥33॥**

అనంతరం శంఖాలు, భేరీలు, పటహాలు, ఆనకాలు, గోముఖాలు, మహోత్సాహంతో అనేక పర్యాయాలు మ్రోగించారు.

**తథైవ గాయకాస్సర్వే జగుః పరమమంగళమ్ ।**
**నర్తక్యో ననృతుస్సర్వా నానాతాళసమన్వితాః ॥34॥**

గాయకులందరు పరమ మంగళకరమైన పాటలు పాడారు. నాట్యకత్తెలందరు అనేక తాళాలతోగూడి నాట్యాన్ని చేశారు.

**ఏభిస్సమేతో జగదేకబంధుర్యయౌ తదానీం పరమేశవర్చసా ।**
**సుసేవ్యమానస్సకలైస్సురేశ్వరైర్వికీర్యమాణః కుసుమైశ్చ హర్షితైః ॥35॥**

జగదేక బంధుడైన శివుడు వీరితోగూడి, పరమేశ్వర తేజస్సుతో ముందుకుసాగాడు. లోకపాలకులందరు ఆయనను సేవిస్తూ ఆనందంతో పుష్పాలు చల్లుతున్నారు.

**సంపూజితస్తదా శంభుః ప్రవిష్టో యజ్ఞమండపమ్ ।**
**సంస్తూయమానో బహ్వీభిః స్తుతిభిః పరమేశ్వరః ॥36॥**

ఈవిధంగా పూజింపబడిన శంభుడు అనేక స్తుతులతో స్తూయమానుడై, యజ్ఞమండపంలోనికి ప్రవేశించాడు.

**వృషా దుత్తారయామాసుర్మహేశం పర్వతోత్తమాః ।**
**నిన్యుర్గృహాన్తరం ప్రీత్యా మహోత్సవపురస్సరమ్ ॥37॥**

పర్వతశ్రేష్ఠులు మహోత్సవపురస్సరంగా మహేశ్వరుని వృషభంనుండి దింపి, ప్రీతితో గృహంలోనికి తోడ్కొని వెళ్ళారు.

**హిమాలయోఽపి సంప్రాప్తం సదేవగణమీశ్వరమ్ ।**
**ప్రణమ్య విధివద్భక్త్యా నీరాజనమథాకరోత్ ॥38॥**

హిమవంతుడు కూడ దేవతలతో, గణాలతోకూడి విచ్చేసిన ఈశ్వరునకు భక్తితో ప్రణమిల్లి యథావిధిగా నీరాజనమిచ్చాడు.

**సర్వాన్ సురాన్ మునీనన్యాన్ప్రణమ్య స మహోత్సవః ।**
**సమ్మానమకరోత్తేషాం ప్రశంసన్ స్వవిధిం ముదా ॥39॥**

హిమవంతుడు తన భాగ్యాన్ని కొనియాడుతూ దేవతలకు, మునులకు, తదితరులందరికి నమస్కరించి, మహోత్సాహంతో సన్మానించాడు.

**సోఽగస్సాచ్యుతమీశానం సుపాద్యార్ఘ్యపురస్సరమ్ ।**
**సదేవముఖ్యవర్గం చ నినాయ స్వాలయాంతరమ్ ॥40॥**

అచ్యుతునితోను, ముఖ్యులైన దేవతలతోను కూడియున్న ఈశ్వరునికి హిమవంతుడు అర్ఘ్యపాద్యాదులిచ్చి, తన గృహంలోపలికి తీసుకొని వెళ్ళాడు.

**ప్రాంగణే స్థాపయామాస రత్నసింహాసనేషు తాన్ ।**
**సర్వాన్విష్ణుం చ మామీశం విశిష్టాంశ్చ విశేషతః ॥41॥**

నన్ను, విష్ణువును, ఈశ్వరుని, ఇతర పెద్దలను, వాకిటియందు రత్నసింహాసనాలపై ప్రత్యేకంగా కూర్చుండబెట్టాడు.

**సఖీభిర్మేనయా ప్రీత్యా బ్రాహ్మణస్త్రీభిరేవ చ ।**
**అన్యాభిశ్చ పురంధ్రీభిశ్చక్రే నీరాజనం ముదా ॥42॥**

చెలికత్తెలు, మేనాదేవి, బ్రాహ్మణస్త్రీలు, ఇతర ముత్తైదువలు ఆనందంతో నీరాజనమిచ్చారు.

**పురోధసా కృత్యవిదా శంకరాయ మహాత్మనే ।**
**మధుపర్కాదికం యద్యత్కృత్యం తత్తత్కృతం ముదా ॥43॥**

వివాహ ప్రక్రియనెరిగిన పురోహితుడు మహాత్ముడైన శంకరునకు మధుపర్కాదికములిచ్చి, చేయదగిన కర్మలనన్నింటిని ఆనందంతో చేయించాడు.

**మయా స నోదితస్తత్ర పురోధాః కృతవాంస్తదా ।**
**సుమంగలం చ యత్కర్మ ప్రస్తావసదృశం మునే ॥44॥**

ఓ మునీ! నాచే ప్రేరితుడైన ఆ పురోహితుడు వివాహ ప్రస్తావానికి అనురూపమైన మంగళ కార్యాలనన్నింటిని చేశాడు.

**అంతర్వేద్యాం మహాప్రీత్యా సంప్రవిశ్య హిమాద్రిణా ।**
**యత్ర సా పార్వతీ కన్యా సర్వాభరణభూషితా ॥45॥**

అంతట శివుడు హిమవంతునితోబాటు వేదిపై ప్రవేశించాడు. అప్పటికి సర్వాలంకార శోభితయైన పార్వతీదేవి అచ్చటనే ఉన్నది.

**వేదికోపరి తన్వంగీ సంస్థితా సువిరాజితా ।**
**తత్ర నీతో మహాదేవో విష్ణునా చ మయా సహ ॥46॥**

ఆ సుందరి వేదికపై నున్నదై, మిక్కిలి ప్రకాశించింది. మహాదేవుని, విష్ణువును, నన్ను అక్కడకు తోడ్కొని వెళ్ళారు.

**లగ్నం నిరీక్షమాణాస్తే వాచస్పతిపురోగమాః ।**
**కన్యాదానోచితం తత్ర బభూవుః పరమోత్సవాః ॥47॥**

బృహస్పతి మున్నగువారు పరమానందంతో అచ్చట కన్యాదానోచితమైన లగ్నంగూర్చి నిరీక్షిస్తున్నారు.

**తత్రోపవిష్టో గర్గశ్చ యత్రాస్తి ఘటికాలయమ్ ।**
**యావచ్ఛేషా ఘటీ తావత్కృతం ప్రణవభాషణమ్ ॥48॥**

గర్గుడు గడియారమున్నచోట కూర్చుండి, లగ్నంవరకు ఉన్న మధ్యకాలంలో 'ఓం' కారాన్ని ఉచ్చరించాడు.

**పుణ్యాహం ప్రవదన్గర్గః సమాద్ధ్రే౨ంజలిమ్ముదా ।**
**పార్వత్యక్షత పూర్ణం చ వవృషే చ శివోపరి ॥49॥**

గర్గుడు పుణ్యాహ మంత్రాలను పఠిస్తూ, పార్వతి దోసిలిలో అక్షతలు నింపాడు. ఆమె ఆనందంతో వాటిని శివుని శిరస్సుపై పోసింది.

**తయా సంపూజితో రుద్రో దధ్యక్షత కుశాంబుభిః ।**
**పరమోదాఢ్యయా తత్ర పార్వత్యా రుచిరాస్యయా ॥50॥**

పరమోదారురాలు, సురుచిరాశ్రయునైన పార్వతి పెరుగు, అక్షతలు, దర్భలు, జలం, మున్నగు వానితో రుద్రుని పూజించింది.

**విలోకయంతీ తం శంభుం యస్యార్థే పరమం తపః ।**
**కృతం పురా మహాప్రీత్యా విరరాజ శివాతి సా ॥51॥**

ఎవనికొరకు పూర్వం పరమ తపస్సునాచరించిందో, అట్టి శివుని మహానందంతో చూస్తూ పార్వతి మిక్కిలి ప్రకాశించింది.

**మయా మునే తదోక్తస్తు గర్గాది మునిభిశ్చ సః ।**
**సమానర్చ శివాం శంభుర్లౌకికాచారసంరతః ॥52॥**

ఓ మునీ! నేను గర్గాది మునులు చెప్పగా శంభుడు లోకాచారంనందు శ్రద్ధకలవాడై పార్వతిని పూజించాడు.

**ఏవం పరస్పరం తౌ వై పార్వతీపరమేశ్వరౌ ।**
**అర్చయంతౌ తదానీం చ శుశుభాతే జగన్మయౌ ॥53॥**

ఈవిధంగా జగద్రూపులైన పార్వతీ పరమేశ్వరులు పరస్పరం పూజించుకొని ప్రకాశించారు.

**త్రైలోక్యలక్ష్మ్యా సంవీతౌ నిరీక్షంతౌ పరస్పరమ్ ।**
**తదా నీరాజితౌ లక్ష్మ్యాదిభిస్త్రీభిర్విశేషతః ॥54॥**

త్రైలోక్య శోభతోకూడి ఒకరినొకరు చూచుకొనుచున్న వారిద్దరికి లక్ష్మి మున్నగు స్త్రీలు విశేషంగా నీరాజనమిచ్చారు.

**తథా పరా వై ద్విజయోషితశ్చ నీరాజయామాసురథ పురస్త్రియః ।**
**శివాం చ శంభుం చ విలోకయంత్యోஉవాపుః ముదం తాస్సకలా మహోత్సవమ్ ॥55॥**

అట్లే బ్రాహ్మణ స్త్రీలు తదితర స్త్రీలుకూడా పార్వతీ పరమేశ్వరులకు తదనంతరం నీరాజనమిచ్చారు. వారిద్దరినీచూస్తూ వారందరు మహానందాన్ని, ఉత్సాహాన్ని పొందారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే శివహిమగిరి గృహాభ్యంతర గమనోత్సవ వర్ణనం నామ సప్తచత్వారింశోஉధ్యాయః ॥47॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో శివుడు హిమవంతుని గృహంలోనికి వెళ్ళుట అనే నలభై ఏడవ అధ్యాయం సమాప్తం.

## **అష్ట చత్వారింశోఽధ్యాయః** - నలభై ఎనిమిదవ అధ్యాయం

## **కన్యాదానవర్ణనమ్** - కన్యాదానవర్ణనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఏతస్మిన్నంతరే తత్ర గర్గాచార్యప్రణోదితః ।**
**హిమవాన్ మేనయా సార్ధం కన్యా దాతుం ప్రచక్రమే ॥1॥**

ఇంతలో గర్గాచార్యునిచే ప్రేరేపింపబడిన హిమవంతుడు మేనాదేవితోగూడి, కన్యాదానాని కుపక్రమించాడు.

**హైమం కలశమాదాయ మేనా చార్ధాంగమాశ్రితా ।**
**హిమాద్రేశ్చ మహాభాగా వస్త్రాభరణభూషితా ॥2॥**

పుణ్యాత్మురాలైన మేనాదేవి నూతన వస్త్రాలు ధరించి, ఆభరణాలు ధరించి, బంగారు కలశాన్ని చేతబట్టి హిమవంతుని ప్రక్కన కూర్చున్నది.

**పాద్యాదిభిస్తతః శైలః ప్రహృష్టః స్వపురోహితః ।**
**తం వరం వరయామాస వస్త్రచందనభూషణైః ॥3॥**

అంతట హిమవంతుడు పురోహితునితోగూడి పాద్యం, వస్త్రం, చందనం, భూషణాలు మున్నగు వాటితో వరుని ఆనందంగా పూజించాడు.

**తతో హిమాద్రిణా ప్రోక్తా ద్విజాస్తిథ్యాదికీర్తనే ।**
**ప్రయోగో భణ్యతాం తావదస్మిన్సమయ ఆగతే ॥4॥**

అంతట హిమవంతుడు సమయం కాగానే తిథ్యాదులను కీర్తించి, వివాహ ప్రయోగం పఠించుమని బ్రాహ్మణులను కోరాడు.

**తథేతి చోక్త్వా తే సర్వే కాలజ్ఞా ద్విజసత్తమాః ।**
**తిథ్యాదికీర్తనం చక్రుః ప్రీత్యా పరమనిర్వృతాః ॥5॥**

కాలజ్ఞాన పండితులైన బ్రాహ్మణోత్తములందరు "అటులనే" అని పలికి పరమానందంతో తిథ్యాదులను కీర్తించారు.

**తతో హిమాచలః ప్రీత్యా శంభునా ప్రేరితో హృదా ।**
**సూతీకృతః పరేశేన విహసన్ శంభుమబ్రవీత్ ॥6॥**

అప్పుడు హృదయంలో శంభునిచే ఆనందంగా ప్రేరితుడైన హిమవంతుడు అనేక లీలలను ప్రకటించే పరమేశ్వరునితో నవ్వుతూ ఇలా పలికాడు.

**స్వగోత్రం కథ్యతాం శంభో ప్రవరశ్చ కులం తథా ।**
**నామవేదం తథా శాఖాం మాకార్షీస్సమయాత్యయమ్ ॥7॥**

ఓ శంభూ! సమయం దాటిపోకుండా నీ గోత్రాన్నీ, ప్రవరను, కులాన్నీ, పేరును, వేదాన్ని, వేదశాఖను చెప్పుము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తస్య హిమాద్రే శ్శంకరస్తదా ।**
**సుముఖా విముఖః సద్యోఽప్యశోచ్యః శోచ్యతాం గతః ॥8॥**

హిమవంతుని మాటలు విని శంకరుడు క్షణంలో సుముఖుడుగా నున్నవాడు విముఖుడయ్యాడు. శోచింపదగనివాడు వెంటనే శోచనీయస్థితిని పొందాడు.

**ఏవం విధ స్సురవరైర్మునిభిస్తదానీం గంధర్వయక్ష గణసిద్ధ గణైస్తథైవ ।**
**దృష్టో నిరుత్తర ముఖో భగవాన్మహేశోఽకార్షీస్సుహాస్యమథ తత్ర స నారద త్వమ్ ॥9॥**

ఈవిధంగా దేవోత్తములు, మునులు, గంధర్వులు, యక్షగణాలు, సిద్ధులు, శివగణాలు, చూస్తుండగా భగవంతుడైన మహేశ్వరుని నోటివెంట సమాధానం రాలేదు. ఓ నారదా! అప్పుడు నీవొక నవ్వదగిన పని చేశావు.

**వీణామవాదయస్త్వం హి బ్రహ్మవిజ్ఞోఽథ నారద ।**
**శివేన ప్రేరితస్తత్ర మనసా శంభుమానసః ॥10॥**

ఓ నారదా! మనస్సులో శంభుని ధ్యానించే నీవు శివప్రేరితుడవై, వీణ వాయించడం మొదలుపెట్టావు. నీవు బ్రహ్మవేత్తవుగదా!

**తదా నివారితో ధీమాన్ పర్వతేంద్రేణ వై హఠాత్ ।**
**విష్ణునా చ మయా దేవై ర్మునిభిశ్చాఖిలైస్తథా ॥11॥**

అప్పుడు హిమవంతుడు, విష్ణువు, నేను, దేవతలు, మునులందరు బుద్ధిశాలివైన నిన్ను ఆపమని గట్టిగా వారించాము.

**న నివృత్తోఽభవస్త్వం హి స యదా శంకరేచ్ఛయా ।**
**ఇతి ప్రోక్తోఽద్రిణా తర్హి వీణాం మా వాదయాధునా ॥12॥**

కాని శంకరేచ్ఛచే నీవు ఆపలేదు. అంతట హిమవంతుడు నీతో వీణావాదనమాపుమని చెప్పాడు.

**సునిషిద్ధో హఠాత్తేన దేవర్షే త్వం యదా బుధ ।**
**ప్రత్యువాచ గిరీశం తం సుసంస్మృత్య మహేశ్వరమ్ ॥13॥**

ఓ దేవర్షీ! విద్వాంసుడా! ఆయన నిన్ను వీణనాపుమని హఠాత్తుగా, గట్టిగా చెప్పగా నీవు మహేశ్వరుని స్మరించి, పర్వతరాజునకు ఇలా బదులిచ్చావు.

**నారద ఉవాచ –** నారదుడు చెప్పాడు.

**త్వం హి మూఢత్వమాపన్నో న జానాసి చ కించన ।**
**వాచ్యే మహేశ విషయేఽతీవాసి త్వం బహిర్ముఖః ॥14॥**

నీవు మూర్ఖుడవయ్యావు. నీకేమియు తెలియదు. మహేశ్వరుని గురించి ప్రశ్నించడంవల్ల నీవు పూర్తిగా బహిర్ముఖుడవయ్యావని స్పష్టమౌతోంది.

**త్వయా పృష్టో హరస్సాక్షాత్స్వగోత్రకథనం ప్రతి ।**
**సమయేఽస్మిం స్తదత్యంతముపహాసకరం వచః ॥15॥**

నీవీసమయంలో సాక్షాత్తు హరుని తన గోత్రాదులను చెప్పమని ప్రశ్నించావు. ఇది ఎంతటి అపహాస్యకరమైన మాటయోగదా!

**అస్య గోత్రం కులం నామ నైవ జానంతి పర్వత ।**
**విష్ణుబ్రహ్మాదయోఽపీహ పరేషాం కా కథా స్మృతా ॥16॥**

ఓ పర్వతా! ఈయన గోత్ర, కుల, నామాలు విష్ణు బ్రహ్మాదులకైనా తెలియవు. ఇతరులగురించి చెప్పనేల?

**యస్యైకదివసే శైలబ్రహ్మకోటిర్లయం గతా ।**
**స ఏవ శంకరస్తేఽద్య దృష్టః కాలీతపోబలాత్ ॥17॥**

ఓ పర్వతా! ఎవనియొక్క ఒక్క దినంలో కోటి బ్రహ్మలు లయమౌతారో ఆ శంకరుడీనాడు కాళి తపోబలంవల్ల నీకు కనబడ్డాడు.

**అరూపోఽయం పరబ్రహ్మ నిర్గుణః ప్రకృతేః పరః ।**
**నిరాకారో నిర్వికారో మాయాధీశః పరాత్పరః ॥18॥**

ఈయన నిర్మల, నిరాకార పరబ్రహ్మ. ప్రకృతికతీతుడై, ప్రకృతిని తనవశమందుంచుకుంటాడు. నిర్వికారుడైన శివుడు సర్వోత్కృష్టుడు.

**అగోత్రకులనామా హి స్వతంత్రో భక్తవత్సలః ।**
**తదిచ్ఛయా హి సగుణస్సుతనుర్బహునామభృత్ ॥19॥**

భక్తవత్సలుడు, స్వతంత్రుడు, కులగోత్రాలు, నామాలు లేనివాడు అయిన శివుడు తన ఇచ్ఛచే సగుణుడై దేహాన్ని స్వీకరించి అనేక నామాలు ధరిస్తాడు.

**సుగోత్రీ గోత్రహీనశ్చ కులహీనః కులీనకః ।**
**పార్వతీ తపసా సోఽద్య జామాతా తే న సంశయః ॥20॥**

మంచి గోత్రం కలవాడు, కాని గోత్రం లేనివాడు. మంచి కులానికి చెందినవాడు, కాని కులం లేనివాడు. అట్టి శివుడీనాడు పార్వతి తపస్సుచే నీ అల్లుడయ్యాడు. ఇందులో సందేహం లేదు.

**లీలా విహారిణా తేన మోహితం చ చరాచరమ్ ।**
**నో జానాతి శివం కోఽపి ప్రాజ్ఞోఽపి గిరిసత్తమ ॥21॥**

లీలా విహారియైన శివునిచే స్థావర జంగమాత్మకమైన విశ్వమంతా మోహింపబడియున్నది. ఓ పర్వత శ్రేష్ఠా! పండితులుకూడా శివుని ఎరుగజాలరు.

**లింగాకృతే ర్మహేశస్య కేన దృష్టం న మస్తకమ్ ।**
**విష్ణుర్గత్వా హి పాతాలం తదేనం నాపవిస్మితః ॥22॥**

మహేశ్వరుడు లింగాకారాన్ని ధరించగా దాని అగ్రభాగం ఎవరికీ కానరాలేదు. విష్ణువు పాతాళానికి వెళ్ళినను ఆ లింగంయొక్క మూలాన్ని కనుగొనలేక ఆశ్చర్యపోయాడు.

**కిం బహూక్త్యా నగశ్రేష్ఠ శివమాయా దురత్యయా ।**
**తదధీనాస్త్రయోలోకా హరిబ్రహ్మాదయోఽపి చ ॥23॥**

ఓ పర్వతరాజా! ఇన్నిమాటలేల! శివమాయ దాటడం శక్యంకాదు. విష్ణుబ్రహ్మాదులతోసహా ముల్లోకాలు శివమాయాధీనమై ఉన్నాయి.

**తస్మాత్త్వయా శివాతాత! సువిచార్య ప్రయత్నతః ।**
**న కర్తవ్యో విమర్శోఽత్ర త్వేవంవిధవరే మనాక్ ॥24॥**

కావున పార్వతీ జనకుడవైన నీవు జాగ్రత్తగా ఆలోచించు. ఇటువంటి వరుల విషయంలో అల్పమైన విమర్శకూడా ఈ సమయంలో చేయదగదు.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా త్వం మునే జ్ఞానీ శివేచ్ఛాకార్యకారకః ।**
**ప్రత్యువాచ పునస్తం వై శైలేంద్రం హర్షయన్ గిరా ॥25॥**

ఓ మునీ! జ్ఞానియు, శివేచ్ఛానుసారం కార్యకారకుడవైన నీవీవిధంగా పలికి, నీ మాటలచే పర్వతరాజునకానందం కలిగిస్తూ, తిరిగి ఇలా హిమవంతునితో పలికావు.

**నారద ఉవాచ -** నారదుడు చెప్పాడు.

**శ్రుణు తాత! మహాశైల శివాజనక మద్వచః ।**
**తచ్ఛ్రుత్వా తనయాం దేవీం దేహి త్వం శంకరాయ హి ॥26॥**

వత్సా! మహాపర్వతరాజా! పార్వతీజనకా! నామాట విని నీకుమార్తెయైన పార్వతిని శంకరునకిమ్ము.

**సగుణస్య మహేశస్య లీలయా రూపధారిణః ।**
**గోత్రం కులం విజానీహి నాదమేవ హి కేవలమ్ ॥27॥**

సగుణుడు, లీలారూపధారియునగు మహేశ్వరుని కులగోత్రాలు కేవలం నాదం మాత్రమే అని ఎరుంగుము.

**శివో నాదమయః సత్యం నాదశ్శివమయస్తథా ।**
**ఉభయోరంతరం నాస్తి నాదస్య చ శివస్య చ ॥28॥**

శివుడు నాదస్వరూపుడు. నాదం శివస్వరూపం. ఇది సత్యం. నాదానికి శివునకు భేదంలేదు.

**సృష్టౌ ప్రథమజత్వాద్ధి లీలాసగుణరూపిణః ।**
**శివాన్నాదస్య శైలేంద్ర! సర్వోత్కృష్ట స్తతస్స హి ॥29॥**

ఓ పర్వతరాజా! లీలచే సగుణరూపాన్ని స్వీకరించిన శివునినుండి మున్ముందుగా నాదం సృష్టింపబడడంచేత అది సృష్టిలో సర్వశ్రేష్ఠమయ్యింది.

**అతో హి వాదితా వీణా ప్రేరితేన మయాద్య వై ।**
**సర్వేశ్వరేణ మనసా శంకరేణ హిమాలయ ॥30॥**

అందువల్లనే శివప్రేరితుడనై నేనీనాడు వీణ వాయించాను. ఓ హిమాలయా! తెలుసుకో!

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఏతచ్ఛ్రుత్వా తవ మునే వచస్తత్తు గిరీశ్వరః ।**
**హిమాద్రిస్తోషమాపన్నో గతవిస్మయమానసః ॥31॥**

ఓ మునీ! నీ మాట వినినపిమ్మట పర్వతరాజైన హిమవంతుడు గర్వాన్ని వీడి, మనస్సులో ఆనందాన్ని పొందాడు.

**అథ విష్ణుప్రభుతయస్సురాశ్చ మునయస్తథా ।**
**సాధు సాధ్వితి తే సర్వే ప్రోచుర్విగతవిస్మయాః ॥32॥**

అంతట విష్ణువు మున్నగు దేవతలు, మునులు గర్వం తొలగినవారై "బాగు, బాగు" అని పలికారు.

**మహేశ్వరస్య గాంభీర్యం జ్ఞాత్వా సర్వే విచక్షణాః ।**
**సవిస్మయా మహామోదాన్వితాః ప్రోచుః పరస్పరమ్ ॥33॥**

పండితులైనవారందరు మహేశ్వరుని మహిమనెరింగి, ఆశ్చర్యాన్ని, మహానందాన్ని పొంది, వారిలోవారు ఇలా అనుకున్నారు.

**యస్యాజ్ఞయా జగదిదం చ విశాలమేవ జాతం పరాత్పరతరో నిజబోధరూపః ।**
**శర్వః స్వతంత్రగతికృత్పరభావగమ్యస్సోఽసౌ త్రిలోకపతిరద్య చ నస్సుదృష్టః ॥34॥**

ఎవని ఆజ్ఞచే ఈ విశాలమైన జగత్తు పుట్టిందో, అట్టి శర్వుడు సర్వానికి అతీతుడు, ఆత్మజ్ఞాన రూపుడు, మోక్షాన్నిచ్చువాడు ఆయనయే. ముల్లోకాలకు పతియైన ఆయన బ్రహ్మజ్ఞానంచే మాత్రమే పొందబడతాడు. అట్టి ఆయనను మనమీనాడు చూడగలిగాము.

**అథ తే పర్వతశ్రేష్ఠా మేర్వాద్యా జాతసంభ్రమాః ।**
**ఊచుస్తే చైకపద్యేన హిమవంతం నగేశ్వరమ్ ॥35॥**

అంతట మేరువు మున్నగు పర్వత శ్రేష్ఠులు ఆశ్చర్య పడినవారై, ఏకకంఠంతో పర్వత రాజైన హిమవంతుని ఉద్దేశించి ఇలా పలికారు.

**పర్వతా ఊచుః** – పర్వతకులు పలికారు.

**కన్యాదానే స్థీయతాం చాద్య శైలనాథోక్త్యా కిం కార్యనాశస్తవైవ ।**
**సత్యం బ్రూమో నాత్ర కార్యో విమర్శస్తస్మాత్కన్యా దీయతామీశ్వరాయ ॥36॥**

ఓ పర్వతరాజా! నీవిప్పుడు కన్యాదాన కార్యమునందు నిమగ్నుడవు కమ్ము. ఉత్తిమాటలతో నీ కార్యం చెడగలదు. కాన ఈమాటలేల? ఈవిషయంలో విమర్శ కట్టిపెట్టు. కన్యను ఈశ్వరునకిమ్ము. మేము సత్యమే పలుకుతున్నాము.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**తచ్ఛ్రుత్వా వచనం తేషాం సుహృదాం స హిమాలయః ।**
**స్వకన్యాదానమకరోచ్ఛివాయ విధినోదితః ॥37॥**

ఆ మిత్రుల మాటలు విని, హిమవంతుడు బ్రహ్మగారి పర్యవేక్షణలో తన కుమార్తెను శివునకు కన్యాదానం చేశాడు.

**ఇమాం కన్యాం తుభ్యమహం దదామి పరమేశ్వర ।**
**భార్యార్థం పరిగృహ్ణీష్వ ప్రసీద సకలేశ్వర ॥38॥**

ఓ పరమేశ్వరా! నీకొరకు ఈ కన్యను ఇస్తున్నాను. సకలేశ్వరుడవైన నీవు ప్రసన్నుడవై ఈమెను భార్యగా స్వీకరింపుము.

**తస్మై రుద్రాయ మహతే మంత్రేణానేన దత్తవాన్ ।**
**హిమాచలో నిజాం కన్యాం పార్వతీం త్రిజగత్ప్రసూమ్ ॥39॥**

హిమవంతుడు "రుద్రాయ మహతే" అనే మంత్రాన్ని చెప్పి, త్రిజగన్మాతయు, తన కుమార్తెయునగు పార్వతిని మహాత్ముడైన రుద్రునకు దానమిచ్చాడు.

**ఇత్థం శివాకరం శైలః శివహస్తే నిధాయ చ ।**
**ముమోదాతీవ మనసి తీర్ణకామమహార్ణవః ॥40॥**

ఈవిధంగా హిమవంతుడు పార్వతి చేతిని శివుని చేతిలోనుంచి, మనస్సులో చాలా ఆనందించాడు. ఆయన కామనలనే మహాసముద్రాన్ని దాటాడు.

**వేదమంత్రేణ గిరిశో గిరిజాకరపంకజమ్ ।**
**జగ్రాహ స్వకరేణాశు ప్రసన్నః పరమేశ్వరః ॥41॥**

పరమేశ్వరుడైన కైలాసపతి ప్రసన్నుడై, వెంటనే వేదమంత్రాన్ని పఠించి పార్వతి కరపంకజాన్ని తన కరంతో గ్రహించాడు.

**క్షితిం సంస్పృశ్య కామస్య కోऽదాదితి మనుం మునే ।**
**పపాఠ శంకరః ప్రీత్యా దర్శయల్లౌకికీం గతిమ్ ॥42॥**

ఓ మునీ! శంకరుడు లోకాచారాన్ని ప్రదర్శించువాడై, భూమిని స్పృశించి, "కామస్య కోऽదాత్" ఇత్యాది మంత్రాన్ని శ్రద్ధగా పఠించాడు.

**మహోత్సవో మహానాసీత్సర్వత్ర ప్రముదావహః ।**
**బభూవ జయసంరావో దివి భూమ్యంతరిక్షకే ॥43॥**

అంతట మహానందాన్నిచ్చే మహోత్సవమారంభమయ్యింది. భూలోకంలో, అంతరిక్షంలో, స్వర్గలోకంలో జయధ్వానాలు బయలుదేరాయి.

**సాధుశబ్దం నమఃశబ్దం చక్రుః సర్వేऽతిహర్షితాః ।**
**గంధర్వాస్సుజగుః ప్రీత్యా ననృతుశ్చాప్సరో గణాః ॥44॥**

అందరు ఆనందంతో "బాగు, నమస్కారం" అంటున్నారు. గంధర్వులానందంతో పాడగా, అప్సరసలు నాట్యమాడారు.

**హిమాచలస్య పౌరా హి ముముదుశ్చాస్తి చేతసి ।**
**మంగలం మహదాసీద్వై మహోత్సవపురస్సరమ్ ॥45॥**

హిమవంతుని రాజ్యంలోని పౌరులు మనస్సులో చాలా ఆనందించారు. గొప్ప మంగళ శబ్దాలతో కూడిన మహోత్సవం ప్రవర్తిల్లింది.

**అహం విష్ణుశ్చ శక్రశ్చ నిర్జరా మునయోऽఖిలాః ।**
**హర్షితా హ్యభవంశ్చాతి ప్రఫుల్లవదనాంబుజాః ॥46॥**

నేను, విష్ణువు, ఇంద్రుడు, దేవతలు, మునులందరు వికసించిన ముఖపద్మాలు గలవారమై మిక్కిలి ఆనందించాము.

**అథ శైలవరస్సోఽదాత్సుప్రసన్నో హిమాచలః ।**
**శివాయ కన్యాదానస్య సాంగతాం సుయథోచితామ్ ॥47॥**

అంతట పర్వతరాజైన హిమవంతుడు మిక్కిలి ప్రసన్నుడై, శివునకు కన్యాదానానికి అంగంగా యథోచిత పురస్కారం చేశాడు.

**తతో బంధుజనాస్తస్య శివాం సంపూజ్య భక్తితః ।**
**దదుశ్శివాయ సద్ద్రవ్యం నానావిధివిధానతః ॥48॥**

అప్పుడా హిమవంతుని బంధువులు పార్వతిని భక్తితో పూజించి, విధివిధానంగా అనేక మంచి ద్రవ్యాలు శివునకిచ్చారు.

**హిమాలయస్తుష్టమనాః పార్వతీశివప్రీతయే ।**
**నానావిధాని ద్రవ్యాణి దదౌ తత్ర మునీశ్వర ॥49॥**

ఓ మహర్షీ! అప్పుడు సంతుష్టాంతరంగుడైన హిమవంతుడు శివపార్వతుల ఆనందం కొరకు అనేక విధాల ద్రవ్యాలిచ్చాడు.

**కౌతుకాని దదౌ తస్మై రత్నాని వివిధాని చ ।**
**చారు రత్నవికారాణి పాత్రాణి వివిధాని చ ॥50॥**

ఆయనకు రక్షాబంధనాలను, వివిధ రత్నాలను, రత్నాలతోకూడిన సుందరాభరణాలను, వివిధ పాత్రలను ఇచ్చాడు.

**గవాం లక్షం హయానాం చ సజ్జితానాం శతం తథా ।**
**దాసీనామనురక్తానాం లక్షం సద్ద్రవ్యభూషితమ్ ॥51॥**

**నాగానాం శతలక్షం హి రథానాం చ తథా మునే ।**
**సువర్ణజటితానాం చ రత్నసారవినిర్మితమ్ ॥52॥**

లక్షగోవులు, సవారీకి సజ్జితమైన వంద గుఱ్ఱాలు, చక్కని ఆభరణాలతో అలంకరింపబడి, అనురాగంగల లక్షమంది దాసీలు, కోటి ఏనుగులు, కోటి బంగారు రథాలు ఈయబడ్డాయి. ఓ మునీ! ఆ రథాలలో శ్రేష్ఠమైన రత్నాలు పొదగబడ్డాయి.

**ఇత్థం హిమాలయో దత్త్వా స్వసుతాం గిరిజాం శివామ్ ।**
**శివాయ పరమేశాయ విధినాఽఽప కృతార్థతామ్ ॥53॥**

ఈవిధంగా హిమవంతుడు తన కుమార్తెయైన పార్వతిని పరమేశ్వరుడైన శివునకు యథావిధిగా కన్యాదానంచేసి, కృతార్థుడయ్యాడు.

**అథ శైలవరో మాధ్యం దినోక్త స్తోత్రతో ముదా ।**
**తుష్టావ పరమేశానం సద్గిరా సుకృతాంజలిః ॥54॥**

అంతట పర్వతరాజు చేతులు జోడించి, శుక్ల యజుర్వేద మాధ్యందిన శాఖయందలి స్తోత్రాన్ని చక్కని స్వరంతో పఠించి, ఆనందంతో పరమేశ్వరుని స్తుతించాడు.

**తతో వేదవిదా తేనాజ్ఞప్తా మునిగణాస్తదా ।**
**శిరోఽభిషేకం చక్రుస్తే శివాయాః పరమోత్సవాః ॥55॥**

అనంతరం వేదవేత్తలగు మహర్షులు హిమవంతుని ఆజ్ఞతో పరమోత్సాహంతో పార్వతి శిరస్సుపై అభిషేకించారు.

**దేవాభిధానముచ్చార్య పర్యుక్షణవిధిం వ్యధుః ।**
**మహోత్సవస్తదాచాసీన్మహానందకరో మునే ॥56॥**

ఓ మునీ! వారప్పుడు శివుని నామాన్ని ఉచ్చరించి, యథావిధిగా ప్రోక్షణ చేశారు. అచ్చట మహానందాన్ని కలిగించు మహోత్సవం ప్రవర్తిల్లింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే కన్యాదానవర్ణనం నామాష్ట చత్వారింశోఽధ్యాయః ॥48॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో కన్యాదానవర్ణనం అనే నలభై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## నవచత్వారింశోఽధ్యాయః - నలభై తొమ్మిదవ అధ్యాయం

## విధిమోహనవర్ణనమ్ - విధిమోహనవర్ణనం

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**అథో మమాజ్ఞయా విప్రైస్సంస్థాప్యానలమీశ్వరః ।**
**హోమం చకార తత్రైవమంకే సంస్థాప్య పార్వతీమ్ ॥1॥**

అప్పుడు నా ఆజ్ఞచే బ్రాహ్మణులు అగ్నిని వ్రేల్చారు. ఈశ్వరుడు పార్వతి ప్రక్కన కూర్చుండగా హోమం చేశాడు.

**ఋగ్యజుస్సామమంత్రైశ్చాహుతిం వహ్నౌ దదౌ శివః ।**
**లాజాంజలిం దదౌ కాళీ భ్రాతా మైనాకసంజ్ఞకః ॥2॥**

శివుడు ఋగ్యజుస్సామ మంత్రాలచే అగ్నియందాహుతులనిచ్చాడు. కాళిసోదరుడైన మైనాకుడు లాజహోమం చేయించాడు.

**అథ కాళీశివశ్శోభౌ చక్రతుర్విధివన్ముదా ।**
**వహ్నిప్రదక్షిణాం తాత లోకాచారం విధాయ చ ॥3॥**

కుమారా! అప్పుడు పార్వతీ పరమేశ్వరులిద్దరు లోకాచారాన్ననుసరించి, యథావిధిగా ఆనందంతో అగ్నికి ప్రదక్షిణం చేశారు.

**తత్రాద్భుతమలంచక్రే చరితం గిరిజాపతిః ।**
**తదేవ శృణు దేవర్షే తవ స్నేహాద్బ్రవీమ్యహమ్ ॥4॥**

అచ్చట వెంటనే పార్వతీపతి అద్భుతమైన వృత్తాంతాన్ని చేశాడు. ఓ దేవర్షీ! అదివినుము. నీయందలి ప్రేమచే నేను చెబుతున్నాను.

**తస్మిన్నవసరే చాహం శివమాయావిమోహితః ।**
**అపశ్యం చరణే దేవ్యా నఖేందుం చ మనోహరమ్ ॥5॥**

ఆసమయంలో శివమాయా మోహితుడనైన నేను ఆదేవి పాదాలను, చంద్రవంకవంటి కాలి గోళ్లను చూశాను.

**దర్శనాత్తస్య చ తదాఽభూవం దేవమునే హ్యహమ్ ।**
**మదనేన సమావిష్టోఽతీవ క్షుభితమానసః ॥6॥**

ఓ దేవర్షీ! ఆ నఖచంద్రుని దర్శనంచే నాయందు కామవికారం ఆవేశించి, నామనస్సు అల్లకల్లోలమయ్యింది.

**ముహుర్ముహురపశ్యం వై తదంగం స్మరమోహితః ।**
**తతస్తద్దర్శనాత్సద్యో వీర్యం మే ప్రాచ్యుతద్భువి ॥7॥**

నేను కామమోహితుడనై, ఆమె పాదాలు తేరిపారజూచాను. అలా చూడడంవల్ల నాకు వీర్యస్ఖలనమై, భూమిపై పడింది.

**రేతసా క్షరతా తేన లజ్జితోఽహం పితామహః ।**
**మునే వ్యమర్దం తచ్ఛిశ్నం చరణాభ్యాం హి గోపయన్ ॥8॥**

అట్లు రేతస్ఖలనం కలగడంతో పితామహుడనైన నేను సిగ్గుపడ్డాను. భూమిపై పడిన వీర్యాన్ని దాచడానికి చరణాలతో దాచాను, శిశ్నాన్ని మర్దించాను.

**తత్ జ్ఞాత్వా చ మహాదేవశ్చుకోపాతీవ నారద ।**
**హంతుమైచ్ఛత్తదా శీఘ్రం మాం విధిం కామమోహితమ్ ॥9॥**

ఓ నారదా! నా కామవికారాన్ని గమనించిన మహాదేవుడు మిక్కిలి కోపించి వెంటనే నన్ను చంపడాని కుద్యమించాడు.

**హాహాకారో మహానాసీత్తత్ర సర్వత్ర నారద ।**
**జనాశ్చ కంపిరే సర్వే భయమాయాతి విశ్వభృత్ ॥10॥**

ఓ నారదా! అప్పుడచ్చట పెద్ద హాహాకారం చెలరేగింది. జనులందరు వణికిపోయారు. విష్ణువు కూడా భయపడ్డాడు.

**తతస్తంతుష్టువుశ్శంభుం విష్ణ్వాద్యా నిర్జరా మునే ।**
**సకోపం ప్రజ్వలన్తం తం తేజసా హన్తుముద్యతమ్ ॥11॥**

అంతట కోపంతో మండిపడుతు, నన్ను సంహరించడానికి ఉద్యమిస్తున్న శంభుని విష్ణువు మున్నగు దేవతలు స్తుతించారు.

**దేవా ఊచుః** – దేవతలు పలికారు.

**దేవదేవ జగద్వ్యాపిన్! పరమేశ సదాశివ ।**
**జగదీశ జగన్నాథ సంప్రసీద జగన్మయ ॥12॥**

ఓ దేవదేవా! జగత్తునందంతటను వ్యాపించి యున్నవాడా! పరమేశ్వరా! సదాశివా! జగత్ప్రభూ! జగన్నాథా! జగత్స్వరూపా! ప్రసన్నుడవు కమ్ము.

**సర్వేషామపి భావానాం త్వమాత్మా హేతురీశ్వరః ।**
**నిర్వికారోఽవ్యయో నిత్యో నిర్వికల్పోఽక్షరః పరః ॥13॥**

సర్వప్రాణులకు ఆత్మయు, కారణము, ఈశ్వరుడు నీవే. నీవు వికార రహితుడవు. నాశనం లేనివాడవు. నిత్యము, నిర్వికల్పము, అక్షరమునగు పరబ్రహ్మవు నీవే.

**ఆద్యన్తావస్య యన్మధ్య మిదమన్యదహం బహిః ।**
**యతోఽవ్యయః స నైతాని తత్సత్యం బ్రహ్మచిద్భవాన్ ॥14॥**

ఆది, అంతం, మధ్యం, ఇది, మరియొకటి, నేను, నాకంటె భిన్నం ఇత్యాది భేదాలు లేనిదియు, అవ్యయమైనదియు, సచ్చిద్ఘనమైనదియునగు పరబ్రహ్మవు నీవే.

**తవైవ చరణాంభోజం ముక్తికామా దృఢవ్రతా ।**
**విసృజ్యోభయతస్సంగం మునయస్సముపాసతే ॥15॥**

ముముక్షువులు, దృఢవ్రతులునగు మునులు ఇహపరాలయందు సంగాన్ని వీడి, నీ పాదపద్మాలను మాత్రమే సేవిస్తారు.

**త్వం బ్రహ్మ పూర్ణమమృతం విశోకం నిర్గుణం పరమ్ ।**
**ఆనందమాత్రమవ్యగ్రమవికారమనాత్మకమ్ ॥16॥**

పూర్ణము, అమృతము, శోకరహితము, నిర్గుణము, ఆనందమయము, వ్యగ్రత లేనిది, వికార రహితము, ఉపాధికంటే భిన్నమైనదియునగు పరబ్రహ్మవు నీవే.

**విశ్వస్య హేతురుదయస్థితిసంయమనస్య హి ।**
**తదపేక్షతయాత్మేశోఽనపేక్షస్సర్వదా విభుః ॥17॥**

జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయములకు కారణము నీవే. ఈ జగత్తునకు ఆత్మ, ప్రభుడు నీవే. సర్వవ్యాపకుడవైన నీవు ఏనాడైనను జగత్తుపై ఆధారపడి లేవు.

**ఏకస్త్వమేవ సదసద్ద్వయమద్వయమేవ చ ।**
**స్వర్ణం కృతాకృతమివ వస్తుభేదో న చైవ హి ॥18॥**

నీవొక్కడివే అయిననూ కార్యకారణ రూపాలను పొంది, ద్వైతుడుగాను, అద్వైత స్వరూపుడుగాను ఉన్నావు. ఒకేబంగారం ఆభరణాలుగను, స్వరూపంగాను ఉన్నదిగదా! వస్తుభేదం లేనేలేదు.

**అజ్ఞానతస్త్వయి జనైర్వికల్పో విదితో యతః ।**
**తస్మాద్భ్రమప్రతీకారో నిరుపాధేర్న హి స్వతః ॥19॥**

జనులు అజ్ఞానంచే నీయందు భేదాన్ని దర్శిస్తారు. కావున భ్రమను నివారించడం ఆవశ్యకమౌతోంది. ఉపాధికతీతుడవగు నీయందు భేదం లేదు. జనులు అజ్ఞానంచే నీయందు భేదాన్ని దర్శిస్తారు. కావున భ్రమను నివారించడం ఆవశ్యకమౌతోంది. ఉపాధికతీతుడవగు నీయందు భేదం లేదు.

**ధన్యా వయం మహేశాన! తవదర్శనమాత్రతః ।**
**దృఢభక్తజనానందప్రదశ్శంభో దయాం కురు ॥20॥**

మహేశ్వరా! నీ దర్శనమాత్రంచే మేము ధన్యులమయ్యాము. దృఢభక్తిగల మానవులకు ఆనందాన్నిచ్చే శంకరా! దయ చూపుము.

**త్వమాదిస్త్వమనాదిశ్చ ప్రకృతేస్త్వం పరః పుమాన్ ।**
**విశ్వేశ్వరో జగన్నాథో నిర్వికారః పరాత్పరః ॥21॥**

జగత్తునకు నీవే కారణం కాని, నీకు కారణం లేదు. ప్రకృతికి అతీతుడవగు పురుషుడవు నీవే. నీవే విశ్వేశ్వరుడవు. జగన్నాథుడవు. నిర్వికారుడవు. పరాత్పరుడవు.

**యోఽయం బ్రహ్మాస్తి రజసా విశ్వమూర్తిః పితామహః ।**
**త్వత్ప్రసాదాత్ప్రభో విష్ణుస్సత్త్వేన పురుషోత్తమః ॥22॥**

ఓ ప్రభో! ఈ బ్రహ్మ నీ అనుగ్రహంచే రజోగుణ ప్రధానుడై, విరాడ్రూపుడు, లోకాలకు పితామహుడు అయినాడు. సత్త్వగుణ ప్రధానుడగు విష్ణువు పురుషోత్తముడైనాడు.

**కాలాగ్ని రుద్రస్తమసా పరమాత్మా గుణైః పరః ।**
**సదాశివో మహేశానస్సర్వవ్యాపీ మహేశ్వరః ॥23॥**

ఆయనయే తమోగుణప్రధానుడై, కాలాగ్నిరుద్రుడైనాడు. కానీ పరమాత్మ గుణాతీతుడు. ఆయన సదాశివుడు. సర్వవ్యాపి, మహేశ్వరుడు.

**వ్యక్తం మహచ్చ భూతాదిస్తన్మాత్రాణీంద్రియాణి చ ।**
**త్వయైవాధిష్ఠితాన్యేవ విశ్వమూర్తే మహేశ్వర ॥24॥**

ఓ విశ్వమూర్తీ! మహేశ్వరా! అవ్యక్తంనుండి పుట్టిన భూతాదియగు మహాతత్త్వము భూత తన్మాత్రలు, ఇంద్రియాలు నీచేతనే అధిష్ఠితములై ఉన్నాయి.

**మహాదేవ! పరేశాన! కరుణాకర! శంకర ।**
**ప్రసీద దేవదేవేశ! ప్రసీద పురుషోత్తమ ॥25॥**

మహాదేవా! పరమేశ్వరా! కరుణానిధీ! శంకరా! దేవదేవా! ఈశ్వరా! పురుషోత్తమా! ప్రసన్నుడవు కమ్ము.

**వాసాంసి సాగరాస్సప్త దిశశ్చైవ మహాభుజాః ।**
**ద్యౌర్మూర్ధా తే విభోర్నాభిః ఖం వాయుర్నాసికా తతః ॥26॥**

సప్తసముద్రాలు నీ వస్త్రాలు. దిక్కులు నీ మహాభుజాలు. ద్యులోకం నీ శిరస్సు. ఆకాశం నాభి. వాయువు నీ నాసిక.

**చక్షూంష్యగ్నీ రవిస్సోమః కేశా మేఘాస్తవ ప్రభో ।**
**నక్షత్ర తారకాద్యాశ్చ గ్రహాశ్చైవ విభూషణమ్ ॥27॥**

అగ్ని, సూర్యుడు, చంద్రుడు నీ కన్నులు. మేఘాలు నీ కేశాలు. నక్షత్రాలు గ్రహాలు మున్నగునవి నీ అలంకారాలు.

**కథం స్తోష్యామి దేవేశ త్వాం విభో పరమేశ్వర ।**
**వాచామగోచరోఽసి త్వం మనసా చాపి శంకర ॥28॥**

ఓ దేవదేవా! విభూ! పరమేశ్వరా! నేను నిన్నెట్లు స్తోత్రం చేయగలను. నీవు వాక్కులకందవు. ఓ శంకరా! నీవు మనస్సునకైనను గోచరముకావు.

**పంచాస్యాయ చ రుద్రాయ పంచాశత్కోటి మూర్తయే ।**
**త్ర్యధిపాయ వరిష్ఠాయ విద్యాతత్త్వాయ తే నమః ॥29॥**

ఐదు మోములు కలవాడు, యాభైకోట్ల రూపాలు కలవాడు, భూర్భువస్సువర్లోకాలకు ప్రభువు, సర్వోత్తముడు, ధ్యానస్వరూపుడునగు రుద్రునకు నమస్కారము.

**అనిర్దేశ్యాయ నిత్యాయ విద్యుజ్జ్వాలాయ రూపిణే ।**
**అగ్నివర్ణాయ దేవాయ శంకరాయ నమో నమః ॥30॥**

ఇదమిత్థంగా నిర్దేశింప శక్యంగానివాడు, నిత్యుడు, విద్యుత్తువలె ప్రకాశించు రూపంగలవాడునైన శంకరదేవునకు అనేక అభివాదాలు.

**విద్యుత్కోటిప్రతీకాశమష్టకోణం సుశోభనమ్ ।**
**రూపమాస్థాయ లోకేఽస్మిన్ సంస్థితాయ నమో నమః ॥31॥**

కోటి విద్యుత్తులకాంతికలవాడు, సుందరమైన ఎనిమిది రూపాలు ధరించి, లోకమంతయు వ్యాపించియున్నవాడునైన శంకరునకు అనేక నమస్కారాలు.

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య వచస్తేషాం ప్రసన్నః పరమేశ్వరః ।**
**బ్రహ్మణో మే దదౌ శీఘ్రమభయం భక్తవత్సలః ॥32॥**

వారి యీమాటలు విని భక్తవత్సలుడైన పరమేశ్వరుడు ప్రసన్నుడై, బ్రహ్మనగు నాకు వెంటనే అభయమిచ్చాడు.

**అథ సర్వే సురాస్తత్ర విష్ణ్వాద్యా మునయస్తథా ।**
**అభవన్ సుస్మితాస్తాత చక్రుశ్చ పరమోత్సవమ్ ॥33॥**

ఓ కుమారా! అప్పుడచ్చట విష్ణువు మున్నగు దేవతలు, మునులు చిరునవ్వుగలవారై మహోత్సవాన్ని చేసుకున్నారు.

**మమ తద్రేతసా తాత మర్దితేన ముహుర్ముహుః ।**
**అభవన్కణకాస్తత్ర భూరిశః పరమోజ్జ్వలాః ॥34॥**

ఓ కుమారా! నాయీవీర్యం మరల మరల మర్దింపబడింది. దానివలన అది అనేక పరమ ఉజ్వలమైన వీర్యకణాలుగా మారింది.

**ఋషయో బహవో జాతా వాలఖిల్యాస్సహస్రశః ।**
**కణకైస్తైశ్చ వీర్యస్య ప్రజ్వలద్భిః స్వతేజసా ॥35॥**

ఆ వీర్యకణాలనుండి గొప్ప తేజస్సుతో ప్రకాశించే వాలఖిల్యులు అను వేలాది ఋషుల జన్మించారు.

**అథ తే హ్యృషయస్సర్వే ఉపతస్థుస్తదా మునే ।**
**మమాంతికం పరప్రీత్యా తాత తాతేతి చాబ్రువన్ ॥36॥**

ఓ మునీ! అప్పుడా ఋషులు పరమానందంతో తండ్రీ, తండ్రీ అని పలుకుచూ నా సమీపానికి వచ్చి నిలబడ్డారు.

**ఈశ్వరేచ్ఛా ప్రయుక్తేన ప్రోక్తాస్తే నారదేన హి ।**
**వాలఖిల్యాస్తు తే తత్ర కోపయుక్తేన చేతసా ॥37॥**

కోపంతో నిండిన మనస్సుగల నారదుడు ఈశ్వరుని సంకల్పంచే ప్రేరితుడై వాలఖిల్యులతో ఇలా పలికాడు.

**నారద ఉవాచ** – నారదుడు చెప్పాడు.

**గచ్ఛధ్వం సంగతా యూయం పర్వతం గంధమాదనమ్ ।**
**న స్థాతవ్యం భవద్భిశ్చ న హి వోఽత్ర ప్రయోజనమ్ ॥38॥**

మీరందరు కలసి గంధమాదన పర్వతానికి వెళ్ళండి. ఇచ్చట మీకు ప్రయోజనంలేదు. కాబట్టి మీరిచ్చట ఉండవలదు.

**తత్ర తప్త్వా తపశ్చాతి భవితారో మునీశ్వరాః ।**
**సూర్యశిష్యా శ్శివస్యైవాజ్ఞయా మే కథితన్త్విదమ్ ॥39॥**

అక్కడ మీరు గొప్ప తపస్సుచేసి, మునీశ్వరులై సూర్యునకు శిష్యులు కాగలరు. నేనీమాటను శివాజ్ఞ చేతనే చెబుతున్నాను.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తాస్తే తదా సర్వే వాలఖిల్యాశ్చ పర్వతమ్ ।**
**సత్వరం ప్రయయుర్నత్వా శంకరం గంధమాదనమ్ ॥40॥**

నారదుడిట్లు పలుకగా వాలఖిల్యాదులందరు శంకరునకు ప్రణమిల్లి, వెంటనే గంధమాదన పర్వతానికి వెళ్ళారు.

**విష్ణ్వాదిభిస్తదాభూవం శ్వాసితోఽహం మునీశ్వర ।**
**నిర్భయః పరమేశాన ప్రేరితైస్తైర్మహాత్మభిః ॥41॥**

ఓ మహర్షీ! అప్పుడు పరమేశ్వరునిచే ప్రేరితులై, మహాత్ములైన విష్ణువు మున్నగువారు నన్ను ఓదార్చగా నేను భయాన్ని విడనాడాను.

**అస్తవం చాపి సర్వేశం శంకరం భక్తవత్సలమ్ ।**
**సర్వకార్యకరం జ్ఞాత్వా దుష్టగర్వాపహారకమ్ ॥42॥**

శంకరుడు, సర్వేశ్వరుడు, భక్తవత్సలుడు, సమస్త కార్యకరుడు, దుష్టగర్వాపహారకుడు అని ఎరింగి, నేనాయనను స్తుతించాను.

**దేవదేవ మహాదేవ కరుణాసాగర ప్రభో ।**
**త్వమేవ కర్తా సర్వస్య భర్తా హర్తా చ సర్వథా ॥43॥**

దేవదేవా! మహాదేవా! కరుణా సముద్రా! ప్రభూ! సర్వానికీ సర్వవిధాలుగా నీవే కర్తవు. భర్తవు, హర్తవు.

**త్వదిచ్ఛయా హి సకలం స్థితం హి సచరాచరమ్ ।**
**తంత్యాం యథా బలీవర్దా మయా జ్ఞాతం విశేషతః ॥44॥**

త్రాటి అధీనంలోనుండి నడిచే ఎద్దులవలె ఈ చరాచర జగత్తంతా నీ సంకల్పానికి లోబడి, నడుస్తోందని నేను తెలుసుకున్నాను. ఈ విశిష్టజ్ఞానం నాకు కలిగింది.

**ఇత్యేవముక్త్వా సోఽహం వై ప్రణామం చ కృతాంజలిః ।**
**అన్యేఽపి తుష్టువుస్సర్వే విష్ణ్వాద్యాస్తం మహేశ్వరమ్ ॥45॥**

నేనిట్లు పలికి, చేతులు జోడించి, నమస్కరించాను. విష్ణువు తదితరులనేకులు కూడా మహేశ్వరుని స్తుతించారు.

**అథాకర్ణ్య నుతిం శుద్ధాం మమ దీనతయా తదా ।**
**విష్ణ్వాదీనాం చ సర్వేషాం ప్రసన్నోఽభూన్మహేశ్వరః ॥46॥**

నేను దీనంగా చేసిన శుద్ధమైన ప్రార్థనను, విష్ణువు మున్నగవారందరి ప్రార్థనను విని, మహేశ్వరుడు ప్రసన్నుడయ్యాడు.

**దదౌ సోఽతివరం మహ్యమభయం ప్రీతమానసః ।**
**సర్వే సుఖమతీవాపురత్యమోదమహం మునే ॥47॥**

ప్రీతమానసుడైన ఆయన నాకు అభయాన్ని వరంగా ప్రసాదించాడు. ఓ మునీ! అందరు అధిక సుఖాన్ని పొందారు. నేను మహానందాన్ని పొందాను.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే విధిమోహనవర్ణనం నామ నవ చత్వారింశోఽధ్యాయః ॥49॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో విధి మోహవర్ణనం అనే నలబై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## పంచాశత్తమోఽధ్యాయః - యాభైయవ అధ్యాయం

## పరిహాస వర్ణనమ్ - పరిహాసవర్ణనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**తతశ్చాహం మునిగణైశ్శేషకృత్యం శివాజ్ఞయా ।**
**అకార్షం నారద ప్రీత్యా శివాశివవివాహతః ॥1॥**

ఓ నారదా! అనంతరం శివాజ్ఞచే నేను పార్వతీ పరమేశ్వరుల వివాహంలో మిగిలిన కార్యాన్ని మునిగణాలతోకూడి ప్రీతితో చేశాను.

**తయోశ్శిరోభిషేకశ్చ బభూవాదరతస్తతః ।**
**ధ్రువస్య దర్శనం విప్రాః కారయామాసురాదరాత్ ॥2॥**

బ్రాహ్మణులు వారిద్దరికి శిరస్సులపై అభిషేకాన్ని సాదరంగా జరిపించారు. తరువాత ధ్రువ నక్షత్ర దర్శనం చేయించారు.

**హృదయాలంభనం కర్మ బభూవ తదనంతరమ్ ।**
**స్వస్తిపాఠశ్చ విప్రేంద్ర మహోత్సవపురస్సరః ॥3॥**

అనంతరం హృదయాన్ని స్పృశించడమనే కర్మ జరుపబడింది. స్వస్తి పఠనం మహోత్సవంతో సాగింది.

**శివా శిరసి సిందూరం దదౌ శంభుర్ద్విజాజ్ఞయా ।**
**తదానీం గిరిజాభిఖ్యాద్భుతా వర్ణ్యా బభూవ హ ॥4॥**

శంభుడు బ్రాహ్మణుల ఆజ్ఞచే పార్వతి శిరస్సుపై సిందూరాన్ని ఉంచాడు. అప్పుడు పార్వతి వర్ణనాతీతమైన అద్భుత సౌందర్యంతో ప్రకాశించింది.

**తతో విప్రాజ్ఞయా తౌ ద్వావేకాసనసమాస్థితౌ ।**
**లేభాతే పరమాం శోభాం భక్తచిత్త ముదావహామ్ ॥5॥**

అనంతరం బ్రాహ్మణాజ్ఞచే వారిరువురు ఒకే ఆసనంలో కూర్చొండి, పరమశోభతో ప్రకాశించారు. ఆ దృశ్యానికి భక్తుల చిత్తాలుప్పొంగాయి.

**తతః స్వస్థానమాగత్య సంస్రవప్రాశనం ముదా ।**
**చక్రతుస్తౌ నిదేశాన్మేఽద్భుతలీలాకరౌ మునే ॥6॥**

ఓ మునీ! అనంతరం ఆ దంపతులు నా ఆదేశంచే తమస్థానాలకు వచ్చి, హోమశేష ద్రవ్యాన్ని ఆనందంతో భుజించారు.

**ఇత్థం నివృత్తే విధివద్యాజ్ఞే వైవాహికే శివః ।**
**బ్రహ్మణే పూర్ణపాత్రం మే దదౌ లోకకృతే ప్రభుః ॥7॥**

ఈవిధంగా వివాహయజ్ఞం యథావిధిగా సంపన్నంకాగా శివుడు సృష్టికర్తయు, బ్రహ్మనునైన నాకు పూర్ణపాత్రనిచ్చాడు.

**గోదానం విధివచ్ఛంభురాచార్యాయ దదౌ తతః ।**
**మహాదానాని చ ప్రీత్యా యాని మంగళదాని వై ॥8॥**

అనంతరం శంభుడు గోదానాన్ని యథావిధిగా ఆచార్యునకిచ్చి, మంగళప్రదమైన మహాదానాలుకూడా ప్రీతితో చేశాడు.

**తతశ్శతసువర్ణం చ విప్రేభ్యస్స దదౌ పృథక్ ।**
**బహుభ్యో రత్నకోటీశ్చ నానా ద్రవ్యాణ్యనేకశః ॥9॥**

అనంతరం ఆయన బ్రాహ్మణులకు ఒక్కొక్కరికి వంద సువర్ణాలిచ్చాడు. అంతేగాక కోట్లకొలదీ రత్నాలు, వివిధ ద్రవ్యాలు అనేకమందికి ఇచ్చాడు.

**తదానీమమరాస్సర్వే పరే జీవాశ్చరాచరాః ।**
**ముముదుశ్చేతసాతీవ బభూవాతి జయధ్వనిః ॥10॥**

అప్పుడు సర్వదేవతలు, చరాచర ప్రాణులందరు మనస్సులో చాలా ఆనందించి, జయజయ ధ్వానాలు చేశారు.

**మంగళధ్వనిగానం చ బభూవ బహుసర్వతః ।**
**వాద్యధ్వనిరభూద్రమ్యో సర్వానందప్రవర్ధనః ॥11॥**

సర్వత్ర అనేక మంగళ ధ్వనులు, గానాలు, ఆరంభమయ్యాయి. అందరికి ఆనందాన్ని పెంపొందించే రమ్యమైన వాద్యధ్వని చెలరేగింది.

**హరిర్మమాథ దేవాశ్చ మునయశ్చాపరేఽఖిలాః ।**
**గిరిమామంత్ర్య సుప్రీత్యా స్వస్థానం ప్రయయుర్ద్రుతమ్ ॥12॥**

విష్ణువు, నేను, దేవతలు, మునులు, తదితరులందరమూ హిమవంతుని అనుమతిని పొంది, మహానందంతో వెంటనే మాస్థానాలకు వెళ్ళాము.

**తదానీం శైలనగరే స్త్రియశ్చ ముదితా వరమ్ ।**
**శివాశివౌ సమానీయ యయుః కుహవరాలయమ్ ॥13॥**

అప్పుడు హిమవంతుని రాజధానిలో స్త్రీలు మహానందంతో, పార్వతీ పరమేశ్వరులను తోడ్కొని, హిమవంతుని గృహానికి వెళ్ళారు.

**లౌకికాచారమాజహ్రుస్తాః స్త్రియస్తత్ర చాదృతాః ।**
**మహోత్సాహో బభూవాథ సర్వతః ప్రముదావహః ॥14॥**

ఆస్త్రీలు సాదరంగా లోకాచారాలను నిర్వర్తింపజేశారు. అంతటా ఆనందదాయకమైన మహోత్సాహం వెల్లివిరిసింది.

**అథ తాస్తౌ సమానీయ దంపతీ జనశంకరౌ ।**
**వాసాలయం మహాదివ్యం భవాచారం వ్యధుర్ముదా ॥15॥**

అప్పుడు వారు జనులకు కల్యాణాలను కలిగించే ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరులను మహాదివ్యమైన వాసగృహానికి తోడ్కొనివెళ్ళి, ఆనందంతో లోకాచారాలను నిర్వహించారు.

**అథో సమీపమాగత్య శైలేంద్రనగరస్త్రియః ।**
**నిర్వృత్య మంగళం కర్మ ప్రాపయన్ దంపతీగృహమ్ ॥16॥**

అప్పుడు హిమవంతుని రాజధాని నగరంలోని స్త్రీలు వారివద్దకు వచ్చి, మంగళకర్మలు చేయించి, దంపతులను వాసగృహంలో ప్రవేశపెట్టారు.

**కృత్వా జయధ్వనిం చక్రుర్గ్రంథినిర్మోచనాదికమ్ ।**
**సస్మితాస్సకటాక్షాశ్చ పులకాంచితవిగ్రహాః ॥17॥**

ఆ స్త్రీలు పులకిత దేహలై చిరునవ్వుతో ఒకరినొకరు చూసుకుంటూ, జయజయధ్వానాలు చేస్తూ, వధూవరుల వస్త్రాలముడిని విప్పడం మున్నగు పనులను పూర్తిచేశారు.

**వాసగేహం సంప్రవిశ్య ముముహుః కామినీవరాః ।**
**ప్రశంసన్త్యస్స్వభాగ్యాని పశ్యంతః పరమేశ్వరమ్ ॥18॥**

ఆ ఉత్తమ స్త్రీలు వాస గృహంలో ప్రవేశించి, దాని శోభకు మోహాన్ని పొందారు. వారు పరమేశ్వరునిచూస్తూ తమ భాగ్యాన్ని ప్రశంసించుకున్నారు.

**మహాసురూపవేషం చ సర్వలావణ్యసంయుతమ్ ।**
**నవీనయౌవనస్థం చ కామినీచిత్తమోహనమ్ ॥19॥**

**ఈషద్ధాస్యప్రసన్నాస్యం సకటాక్షం సుసుందరమ్ ।**
**సుసూక్ష్మవాసో బిభ్రాణం నానారత్నవిభూషితమ్ ॥20॥**

గొప్ప అందమైన రూపము, వేషము గలవాడు, సొగసులన్నింటితో కూడినవాడు, నూతన యౌవనము నందున్నవాడు, స్త్రీల చిత్తాన్ని మోహింపజేయువాడు, చిరునవ్వుతో ప్రసన్నమైనముఖం కలవాడు, సుందరమైన చూపులు కలవాడు, విలువైన వస్త్రాలు ధరించినవాడు, అనేక రత్నాభరణాలతో అలంకరింపబడినవాడునైన శివుని చూశారు.

**తదానీం దివ్య నార్యశ్చ షోడశారం సమాయయుః ।**
**తౌ దంపతీ చ సంద్రష్టుం మహాదర పురస్సరమ్ ॥21॥**

అప్పుడా దంపతులను చూడడానికి పదునార్గురు దివ్యస్త్రీలు వెంటనే మహాదరంతో విచ్చేశారు.

**సరస్వతీ చ లక్ష్మీశ్చ సావిత్రీ జాహ్నవీ తథా ।**
**అదితిశ్చ శచీచైవ లోపాముద్రాప్యరుంధతీ ॥22॥**

**అహల్యా తులసీ స్వాహా రోహిణీ చ వసుంధరా ।**
**శతరూపా చ సంజ్ఞా చ రతిరేతాస్సురస్త్రియః ॥23॥**

సరస్వతి, లక్ష్మి, సావిత్రి, గంగ, అదితి, శచి, లోపాముద్ర, అరుంధతి, అహల్య, తులసి, స్వాహా, రోహిణి, పృథ్వి, శతరూప, సంజ్ఞ, రతి అనే దివ్య స్త్రీలు విచ్చేశారు.

**దేవకన్యా నాగకన్యా మునికన్యా మనోహరాః ।**
**తత్ర యాయాః స్థితా స్తాసాం సంఖ్యాం కర్తుం చ కః క్షమః ॥24॥**

మనోహరలగు దేవకన్యలు, నాగకన్యలు, మునికన్యలందరు విచ్చేశారు. వారి సంఖ్య చెప్పగలిగే సామర్థ్యమెవరికుంది?

**తాభీ రత్నాసనే దత్తే తత్రోవాస శివో ముదా ।**
**తమూచుః క్రమతో దేవ్యస్సుహాసం మధురం వచః ॥25॥**

వారు సమర్పించిన రత్నమయమైన ఆసనంలో శివుడానందంతో కూర్చున్నాడు. అంతట దేవీమూర్తులు క్రమంగా ఆయనతో చిరునవ్వుతోకూడిన మధుర వచనాలు ఇలా పలికారు.

**సరస్వత్యువాచ** – సరస్వతి పలికింది.

**ప్రాప్తా సతీ మహాదేవాధునా ప్రాణాధికా ముదా ।**
**దృష్ట్వా ప్రియాస్యం చంద్రాభం సంతాపం త్యజ కాముక ॥26॥**

మహాదేవా! ఇప్పుడు నీకు ప్రాణాధిక ప్రియురాలైన సతీదేవి లభించింది. ఓయీ సుందరా! చంద్రాభమైన ప్రియురాలి ముఖాన్ని చూచి తాపాన్ని వీడుము.

**కాలం గమయ కాలేశ సతీసంశ్లేషపూర్వకమ్ ।**
**విశ్లేషస్తే న భవితా సర్వకాలం మమాశ్రితా ॥27॥**

ఓయీ కాలనియంతా! నీవు సతితోకలసి కాలాన్ని గడుపుము. మీకు వియోగము ఏకాలమునందైనను ఉండబోదు. పార్వతి నాకు ఆశ్రితురాలు కాగలదు.

**లక్ష్మీ రువాచ** – లక్ష్మి పలికింది.

**లజ్జాం విహాయ దేవేశ సతీం కృత్వా స్వవక్షసి ।**
**తిష్ఠ తాం ప్రతికాలజ్ఞా ప్రాణా యాంతి యయా వినా ॥28॥**

ఓ దేవేశా! సిగ్గునువీడి సతిని నీ గుండెలలో దాచుకొనుము. ఆమె లేనిదే నీకు ప్రాణాలు నిలువవు. ఆమె విషయంలో లజ్జయేల?

**సావిత్ర్యువాచ** – సావిత్రి పలికింది.

**భోజయిత్వా సతీ శంభో శీఘ్రం త్వం భుంక్ష్వ మా ఖిదః ।**
**తదాచమ్య సకర్పూరం తాంబూలం దేహి సాదరమ్ ॥29॥**

ఓ శంభూ! సతిని భుజింపజేసి నీవు శీఘ్రమే భుజింపుము. నీవు ఖేదాన్ని పొందకుము. అనంతరం నీటిని త్రాగి కర్పూర తాంబూలాన్ని ఆదరంతో ఆమెకిమ్ము.

**జాహ్నవ్యువాచ** – జాహ్నవి పలికింది.

**స్వర్ణకాంతి కరాం ధృత్వా కేశాన్ మార్జయ యోషితః ।**
**కామిన్యాస్స్వామిసౌభాగ్యసుఖం నాతఃపరం భవేత్ ॥30॥**

స్వర్ణకాంతిగల ప్రియురాలి చేతిని పట్టుకొని, కేశాలను సరిజేయుము. ప్రభువునకు లభించే సౌభాగ్య సుఖం ఇంతకంటె గొప్పది ఉండబోదు.

**అదితి రువాచ** – అదితి పలికింది.

**భోజనాన్తే శివం శంభుం ముఖం శుద్ధ్యర్థమాదరాత్ ।**
**జలం దేహి మహాప్రీత్యా దంపతిప్రేమ దుర్లభమ్ ॥31॥**

పార్వతీ! భోజనానంతరం ముఖశుద్ధికొరకు శివునకు ఆదరంతో, మహాప్రీతితో జలాన్నిమ్ము. ఇటువంటి ప్రేమ దంపతులమధ్య దుర్లభమైనది.

**శచ్యువాచ** – శచీదేవి పలికింది.

**కృత్వా విలాపం యద్ధేతోః శివాం కృత్వా చ వక్షసి ।**
**యో బభ్రామానిశం మోహాత్ కాలజ్ఞాతే ప్రియాం ప్రతి ॥32॥**

ఓ శివా! ఎవతెకొరకు నీవు విలపించి, రాత్రింబవళ్లు మోహంతో తిరిగావో, అట్టి శివాదేవిని గుండెలో దాచుకో! అట్టి ప్రియురాలి విషయంలో లజ్జకు స్థానమేది?

**లోపాముద్రోవాచ** – లోపాముద్ర పలికింది.

**వ్యవహారోఽస్తి చ స్త్రీణాం భుక్త్వా వాసగృహే శివ ।**
**దత్త్వా శివాయై తాంబూలం శయనం కర్తుమర్హసి ॥33॥**

ఓ శివా! వాసగృహంలో భుజించిన పిమ్మట స్త్రీలకు పని మిగిలియుంటుంది. పార్వతికి తాంబూలాన్నిచ్చి, నీవు శయనించవచ్చు.

**అరుంధత్యువాచ** - అరుంధతి పలికింది.

**మయా దత్తాం సతీమేనాం తుభ్యం దాతుమనీప్సితామ్ ।**
**వివిధం బోధయిత్వేమాం సురతిం కర్తుమర్హసి ॥34॥**

మేనాదేవి ఈమెను నీకిచ్చి వివాహం చేయడానికి అంగీకరించలేదు. కానీ నేనామెకు పరిపరివిధాల బోధించి, నీకు వివాహం చేయించాను. కాబట్టి ఈమెను జాగరూకతతో పాలించుము.

**అహల్యోవాచ** - అహల్య పలికింది.

**వృద్ధావస్థాం పరిత్యజ్య హ్యతీవ తరుణో భవ ।**
**యేన మేనానుమన్యేత త్వాం సుతార్పితమానసా ॥35॥**

నీవు వృద్ధావస్థను విడిచిపెట్టి నవయువకుడవు కమ్ము. అట్లు చేయడంవల్ల తన మనస్సును కుమార్తెపై లగ్నంచేసిన మేనాదేవి నిన్నంగీకరిస్తుంది.

**తులస్యువాచ** - తులసి పలికింది.

**సతీ త్వయా పరిత్యక్తా కామో దగ్ధః పురాకృతః ।**
**కథం తదా వసిష్ఠశ్చ ప్రభో ప్రస్థాపితోఽధునా ॥36॥**

ఓ ప్రభూ! పూర్వం నీవు సతిని పరిత్యజించి, మన్మథుని దహించావు. అట్టి నీవు ఈనాడు వసిష్ఠుని ఈమెకొరకు ఏల పంపావు?.

**స్వాహోవాచ** - స్వాహాదేవి పలికింది.

**స్థిరో భవ మహాదేవ స్త్రీణాం వచసి సాంప్రతమ్ ।**
**వివాహే వ్యవహారేఽస్తి పురంధ్రీణాం ప్రగల్భతా ॥37॥**

మహాదేవా! ఇప్పుడు నీవు స్త్రీలమాటలు జవదాటకుము. వివాహంలోను, వ్యవహారంలోను, స్త్రీలకు అహంకారం కలదు.

**రోహిణ్యువాచ** - రోహిణి పలికింది.

**కామం పూరయ పార్వత్యాః కామశాస్త్రవిశారద ।**
**కురు పారం స్వయం కామీ కామినీకామసాగరమ్ ॥38॥**

ఓ కామశాస్త్ర విశారదా! పార్వతి కోర్కెను తీర్చుము. నీవు స్వయంగా కామివై, కామినితోగూడి, కామసాగరాన్ని దాటుము.

**వసుంధరోవాచ** - వసుంధర పలికింది.

**జానాసి భావం భావజ్ఞ కామార్తానాం చ యోషితామ్ ।**
**న చ స్వం స్వామినం శంభో ఈశ్వరం పాతి సంతతమ్ ॥39॥**

ఓ భావజ్ఞా! కోరికగల యువతుల భావాలు నీకెరుకయే. ఓ శంభో! సమర్థుడైన ప్రభువును ధనం ఎల్లపుడూ రక్షించదు.

**శతరూపోవాచ –** శతరూప పలికింది.

**భోగం దివ్యం వినా భుక్త్వా న హి తుష్యేత్ క్షుధాతురః ।**
**యేన తుష్టిర్భవేచ్ఛంభో తత్కర్తుముచితం స్త్రియాః ॥40॥**

ఓ శంభూ! ఆకలిగొన్నవానికి మృష్టాన్నం భుజింపనిదే ఆకలి తీరదు. ఏకార్యంచే స్త్రీకి తృప్తికలుగు తుందో ఆపని చేయట నీకు తగును.

**సంజ్ఞోవాచ –** సంజ్ఞ పలికింది.

**తూర్ణం ప్రస్థాపయ ప్రీత్యా పార్వత్యా సహ శంకరమ్ ।**
**రత్నప్రదీపం తాంబూలం తల్పం నిర్మాయ నిర్జనే ॥41॥**

ఓసీ శతరూపా! నిర్జన స్థానంలో తల్పం ఏర్పాటుచేసి, రత్నదీపమమర్చి, తాంబూలముంచి, పార్వతీ పరమేశ్వరులను ప్రేమతో అచ్చటకు వెంటనే పంపుము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**స్త్రీణాం తద్వచనం శ్రుత్వా తా ఉవాచ శివఃస్వయమ్ ।**
**నిర్వికారశ్చ భగవాన్ యోగీంద్రాణాం గురోర్గురుః ॥42॥**

దివ్య స్త్రీల మాటలను విని, వికారాలు లేనివాడు, యోగివరులకు, గురువులకు, గురువైన శివుడు వారితో స్వయంగా ఇట్లన్నాడు.

**శంకర ఉవాచ –** శంకరుడు చెప్పాడు.

**దేవ్యో న బ్రూత వచనమేవం భూతం మమాంతికమ్ ।**
**జగతాం మాతరః సాధ్వ్యః పుత్రే చపలతా కథమ్ ॥43॥**

ఓ దేవీమూర్తులారా! నావద్ద ఇటువంటి వచనాలు పలుకవద్దు. జగన్మాతలు, పతివ్రతలునైన మీరు పుత్రుని విషయంలో చాపల్యాన్ని ఎందులకు కలిగియున్నారు?

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**శంకరస్య వచఃశ్రుత్వా లజ్జితాస్సురయోషితః ।**
**బభూవుః సంభ్రమాత్తూష్ణీం చిత్రపుత్తలికా యథా ॥44॥**

శంకరుని మాటవిని, సిగ్గుపడిన దేవతాస్త్రీలు కంగారుపడి, చిత్రమునందలి స్త్రీ మూర్తులవలె ఉలుకు పలుకు లేకయున్నారు.

**భుక్త్వా మిష్టాన్నమాచమ్య మహేశో హృష్టమానసః ।**
**సకర్పూరం చ తాంబూలం బుభుజే భార్యయా సహ ॥45॥**

మహేశ్వరుడు మృష్టాన్నాని భుజించి, ఆచమనంచేసి, ఆనందంతోకూడిన మనస్సుగలవాడై, భార్యతో కలసి కర్పూరతాంబూలాన్ని సేవించాడు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే పరిహాసవర్ణనం నామ పంచాశత్తమోఽధ్యాయః ॥50॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో పరిహాసవర్ణనం అనే యాభైయవ అధ్యాయం సమాప్తం.

**ఏక పంచాశత్తమోఽధ్యాయః** – యాభై ఒకటవ అధ్యాయం

**కామ సంజీవనవర్ణనమ్** – కామదేవుని జీవనవిదానవర్ణనం

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**తస్మిన్నవసరే జ్ఞాత్వాఽనుకూలం సమయం రతిః ।**
**సుప్రసన్నా చ తం ప్రాహ శంకరం దీనవత్సలమ్ ॥1॥**

అది అనుకూలమైన సమయమని తలంచిన రతీదేవి మిక్కిలి ప్రసన్నురాలై, దీనవత్సలుడైన శంకరునితో ఇలా పలికింది.

**రతిరువాచ** – రతి పలికింది.

**గృహీత్వా పార్వతీం ప్రాప్తం సౌభాగ్యమతిదుర్లభమ్ ।**
**కిమర్థం ప్రాణనాథో మే నిస్స్వార్థం భస్మసాత్కృతః ॥2॥**

పార్వతిని వివాహమాడి నీవు మిక్కిలి దుర్లభమైన సౌభాగ్యాన్ని పొందావు. స్వార్థమెరుగని ప్రాణ ప్రియుడైన నా భర్త భస్మం చేయబడడానికి కారణమేమిటి?

**జీవయాత్రా పతిం మే హి కామవ్యాపారమాత్మని ।**
**కురు దూరం చ సంతాపం సమవిశ్లేష హేతుకమ్ ॥3॥**

ఈసమయంలో నాభర్తను బ్రతికించి, నీయందు ప్రేమకార్యాన్ని నింపుకో. మనిద్దరికి సమానంగా కలిగిన వియోగ దుఃఖాన్ని దూరం చేయుము.

**వివాహోత్సవ ఏతస్మిన్ సుఖినో నిఖిలా జనాః ।**
**అహమేకా మహేశాన దుఃఖినీ స్వపతిం వినా ॥4॥**

ఓ మహేశ్వరా! ఈవివాహ మహోత్సవంలో జనులందరు ఆనందంగానున్నారు. నేనొక్కతెను మాత్రమే భర్తలేకపోవడంచేత దుఃఖితురాలనయ్యాను.

**సనాథాం కురు మాం దేవ ప్రసన్నో భవ శంకర ।**
**స్వోక్తం సత్యం విధేహి త్వం దీనబంధో పరప్రభో ॥5॥**

ఓ దేవా! నా భర్తను బ్రతికింపుము. ఓ శంకరా! ప్రసన్నుడవు కమ్ము. ఓ దీనబంధూ! మహాప్రభూ! నీమాట నీవు కార్యరూపంలో పెట్టుము.

**త్వాం వినా కస్సమర్థోఽత్ర త్రైలోక్యే సచరాచరే ।**
**నాశనే మమ దుఃఖస్య జ్ఞాత్వేతి కరుణాం కురు ॥6॥**

స్థావరజంగమాత్మకమైన త్రిలోకాలలో నాదుఃఖాన్ని నశింపజేయగలవాడవు నీవుతక్క మరియొకడెవడున్నాడు? ఈసత్యమెరిగి నాయందు దయచూపుము.

**సోత్సవే స్వవివాహేఽస్మిన్ సర్వానందప్రదాయినీ ।**
**సోత్సవామపి మాం నాథ కురు దీనకృపాకర ॥7॥**

దీనులయందు దయనుచూపే ఓ నాథా! అందరికీ ఆనందాన్ని కలిగించేటట్లు నీ వివాహ మహోత్సవం జరిగింది. నన్నుకూడా ఆనందం కలదానిగా చేయుము.

**జీవితే మమ నాథే హి పార్వత్యా ప్రియయా సహ ।**
**సు విహారః ప్రపూర్ణశ్చ భవిష్యతి న సంశయః ॥8॥**

నాభర్త జీవించినతరువాత ప్రియురాలైన పార్వతితో నీ యీ విహారం పరిపూర్ణం కాగలదనడంలో సందేహం లేదు.

**సర్వం కర్తుం సమర్థోఽసి యతస్త్వం పరమేశ్వరః ।**
**కిం బహూక్త్యాత్ర సర్వేశ జీవయాశు పతిం మమ ॥9॥**

పరమేశ్వరుడవైన నీవు సమస్తం చేయడానికి సమర్థుడవు. ఇన్నిమాటలేల. ఓ సర్వేశ్వరా! వెంటనే నాభర్తను బ్రతికింపుము.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**తదిత్యుక్త్వా కామభస్మ దదౌ సగ్రంథిబంధనమ్ ।**
**రురోద పురతశ్శంభోర్నాథ! నాథేత్యుదీర్య చ ॥10॥**

ఈవిధంగా పలికి రతీదేవి మూటకట్టియున్న మన్మథుని భస్మాన్ని ఇచ్చింది. శివుని ఎదుట "నాథా! నాథా!" అని రోదించింది.

**రతిరోదనమాకర్ణ్య సరస్వత్యాదయః స్త్రియః ।**
**రురుదుస్సకలా దేవ్యః ప్రోచుర్దీనతరం వచః ॥11॥**

రతి విలాపాన్ని విని, సరస్వతి మున్నగు దేవీమూర్తులందరు రోదించి, దీనాతిదీనంగా ఇట్లు పలికారు.

**దేవ్యఊచుః -** దేవతాస్త్రీలు పలికారు.

**భక్తవత్సలనామా త్వం దీనబంధుర్దయానిధిః ।**
**కామం జీవయ సోత్సాహం రతిం కురు నమోఽస్తు తే ॥12॥**

నీకు భక్తవత్సలుడని పేరు. దీనబంధుడవు నీవే. నీవు దయానిధివి, మన్మథుని బ్రతికించి, రతికి ఉత్సాహాన్నిమ్ము. నీకు నమస్కారము.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి తద్వచనం శ్రుత్వా ప్రసన్నోఽభూన్మహేశ్వరః ।**
**కృపాదృష్టిం చకారాశు కరుణాసాగరః ప్రభుః ॥13॥**

వారి ఈమాటవిని, కరుణా సముద్రుడైన మహేశ్వర ప్రభుడు ప్రసన్నుడై, వెంటనే దయాదృష్టిని కురిపించాడు.

**సుధాదృష్ట్యా శూలభృతో భస్మతో నిర్గతః స్మరః ।**
**తద్రూపవేషచిహ్నాత్మా సుందరోఽద్భుతమూర్తిమాన్ ॥14॥**

శూలపాణియైన శివుని అమృత దృష్టిచే భస్మంనుండి అదేరూపం, వేషం, చిహ్నాలుగల అద్భుతమైన, సుందరమైన దేహంగలవాడైన మన్మథుడు బయటకు వచ్చాడు.

**తద్రూపం చ తదాకారం సస్మితం సధనుశ్శరమ్ ।**
**దృష్ట్వా పతిం రతిస్తం చ ప్రణనామ మహేశ్వరమ్ ॥15॥**

అదే రూపంతో, చిరునవ్వుతో, ధనుర్బాణాలను ధరించియున్న తనభర్తను చూచి, రతి అతనికి మహేశ్వరునకు ప్రణమిల్లింది.

**కృతార్థాఽభూచ్ఛివం దేవం తుష్టావ చ కృతాంజలిః ।**
**ప్రాణనాథప్రదం పత్యా జీవితేన పునః పునః ॥16॥**

భర్త జీవించడంచేత కృతార్థురాలైన ఆమె ప్రాణనాథునిచ్చిన శివుని అనేక పర్యాయాలు స్తుతించింది.

**కామస్య స్తుతిమాకర్ణ్య సనారీకస్య శంకరః ।**
**ప్రసన్నోఽభవదత్యంత మువాచ కరుణార్ద్రధీః ॥17॥**

భార్యతోకూడి, మన్మథుడు చేసిన స్తోత్రాన్ని విని, కరుణార్ద్ర హృదయుడైన శంకరుడు మిక్కిలి ప్రసన్నుడై, ఇట్లు పలికాడు.

**శంకర ఉవాచ –** శంకరుడు చెప్పాడు.

**ప్రసన్నోఽహం తవ స్తుత్యా సనారీకస్య చిత్తజ ।**
**స్వయంభవ వరం బ్రూహి వాంఛితం తద్దదామి తే ॥18॥**

ఓయీ! మనస్సులో నీయంతట నీవు పుట్టే మన్మథా! భార్యతో గూడి నీవు చేసిన స్తుతికి నేను ప్రసన్నుడనయ్యాను. నీకిష్టమైన వరాన్ని కోరుకో! నీకిస్తాను.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి శంభువచః శ్రుత్వా మహానందస్స్మరస్తతః ।**
**ఉవాచ సాంజలిర్నమ్రో గద్గదాక్షరయా గిరా ॥19॥**

శంభుని మాటవిని, మన్మథుడప్పుడు మహానందాన్ని పొందినవాడై, చేతులు జోడించి, నమస్కరించి, గద్గదమైన కంఠంతో ఇలా అన్నాడు.

**కామ ఉవాచ** – కాముడు పలికెను.

**దేవదేవ మహాదేవ కరుణాసాగర ప్రభో ।**
**యది ప్రసన్నస్సర్వేశః మమానందకరో భవ ॥20॥**

దేవదేవా! మహాదేవా! ప్రభూ! కరుణాసాగరుడా! సర్వేశ్వరుడవైన నీవు ప్రసన్నుడవైతే నాకానందాన్ని కలిగించుము.

**క్షమస్వ మేఽపరాధం హి యత్కృతశ్చ పురా ప్రభో ।**
**స్వజనేషు పరాం ప్రీతిం భక్తిం దేహి స్వపాదయోః ॥21॥**

ప్రభూ! పూర్వం నేనుచేసిన అపరాధాన్ని మన్నించు. నీభక్తులయందు పరమ ప్రీతిని, నీపాదాలయందు భక్తిని ప్రసాదించుము.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య స్మరవచః ప్రసన్నః పరమేశ్వరః ।**
**ఓమిత్యుక్త్వా బ్రవీత్తం వై విహసన్ కరుణానిధిః ॥22॥**

మన్మథుని మాటవిని ప్రసన్నుడైన పరమేశ్వరుడు నవ్వి, అతనితో అటులనే అంటూ "ఓమ్" అని పలికి, ఇట్లన్నాడు.

**ఈశ్వర ఉవాచ** – ఈశ్వరుడు పలికాడు.

**హే కామాహం ప్రసన్నోఽస్మి భయం త్యజ మహామతే ।**
**గచ్ఛ విష్ణుసమీపం చ బహిః స్థానే స్థితో భవ ॥23॥**

ఓ మన్మథా! నేను ప్రసన్నుడనయ్యాను. నీవు గొప్ప బుద్ధిశాలివి. భయాన్ని వీడుము. విష్ణువు వద్దకు వెళ్ళుము. ఈ గృహానికి వెలుపల ఉండుము.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**తచ్ఛ్రుత్వా శిరసా నత్వా పరిక్రమ్య స్తువన్విభుమ్ ।**
**బహిర్గత్వా హరిం దేవాన్ ప్రణమ్య సముపాస్త సః ॥24॥**

ఆ మాటను విని, అతడు శిరస్సు వంచి, నమస్కరించి, విభునకు ప్రదక్షిణం చేసి, స్తుతించి, బయటకు వెళ్ళి, విష్ణువునకు, దేవతలకు నమస్కరించి వారిని సేవించాడు.

**కామం సంభాష్య దేవాశ్చ దదుస్తస్మై శుభాశిషమ్ ।**
**విష్ణ్వాదయః ప్రసన్నాస్తే ప్రోచుః స్మృత్వా శివం హృది ॥25॥**

దేవతలు మన్మథునితో మాట్లాడి, అతనికి శుభాశీస్సులనందించారు. విష్ణువు మున్నగువారు హృదయంలో శివుని స్తుతించి, ప్రసన్నులై ఇలా పలికారు.

**దేవా ఊచుః –** దేవతలు పలికారు.

**ధన్యస్త్వం స్మరసందగ్ధః శివేనానుగ్రహీకృతః ।**
**జీవయామాస సత్త్వాంశ కృపాదృష్ట్యాఖిలేశ్వరః ॥26॥**

ఓ మన్మథా! నీవు ధన్యుడవు. శివునిచే దహింపబడిన నీవు అనుగ్రహింపబడ్డావు. ఆ సర్వేశ్వరుడు సత్త్వగుణాంశమైన దయాదృష్టితో నిన్ను బ్రతికించాడు.

**సుఖదుఃఖదో న చాన్యోఽస్తి యతస్స్వకృతభుక్ పుమాన్ ।**
**కాలే రక్షా వివాహశ్చ నిషేకః కేన వార్యతే ॥27॥**

మానవులకు సుఖదుఃఖాలను ఇతరులీయరు. అందరు తాము చేసిన కర్మల ఫలాన్ని అనుభవిస్తారు. కాలం వచ్చినపుడు అనుగ్రహాన్ని, వివాహాన్ని, సంతానాన్ని ఎవరాపగలరు?

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా తే చ సమ్మాన్య తం సుఖేనామరాస్తదా ।**
**సంతస్థు స్తత్ర విష్ణ్వాద్యాస్సర్వే లబ్ధమనోరథాః ॥28॥**

అప్పుడు విష్ణువు మున్నగు దేవతలందరు ఇట్లు పలికి, అతనిని ఆనందంతో సత్కరించి, తీరిన కోరిక గలవారై అక్కడున్నారు.

**సోఽపి ప్రముదితస్తత్ర సమువాస శివాజ్ఞయా ।**
**జయశబ్దో నమశ్శబ్దస్సాధుశబ్దో బభూవ హ ॥29॥**

మన్మథుడుకూడా మిక్కిలి ఆనందించి, శివుని ఆజ్ఞచే అచ్చటనే నివసించాడు. "జయము కలుగుగాక!, నమస్కారము, బాగుబాగు" అనే మాటలు వినబడుతున్నాయి.

**తతశ్శంభుర్వాసగేహే వామే సంస్థాప్య పార్వతీమ్ ।**
**మిష్టాన్నం భోజయామాస తం చ సా చ ముదాన్వితా ॥30॥**

అంతట శంభుడు నివాసగృహంలో పార్వతిని ఎడమవైపు కూర్చుండబెట్టుకుని ఆమెకు మృష్టాన్నాన్ని తినిపించగా ఆమెకూడా ఆనందంతో ఆయనకు తినిపించింది.

**అథ శంభుర్భవాచారీ తత్ర కృత్యం విధాయ తత్ ।**
**మేనామామంత్ర్య శైలం చ జనవాసం జగామ సః ॥31॥**

తరువాత శంభుడచ్చట కర్తవ్యాన్ని పూర్తిచేసి, మేనాహిమవంతుల అనుమతిని పొంది, జనావాసానికి వెళ్ళాడు.

**మహోత్సవస్తదా చాసీద్వేదధ్వనిరభూన్మునే ।**
**వాద్యాని వాదయామాసుర్జనాశ్చతుర్విధాని చ ॥32॥**

అప్పుడు గొప్ప ఉత్సవం జరిగింది. ఓ మునీ! వేదధ్వని విస్తరిల్లింది. జనులు తత, అనద్ధ, సుషిర, ఘనములనే నాలుగు విధాల వాద్యాలను ప్రయోగించారు.

**శంభురాగత్య స్వస్థానం వవందే చ మునీస్తదా ।**
**హరిం చ మాం భవాచారాద్వందితోఽభూత్సురాదిభిః ॥33॥**

శంభుడు తన స్థానానికి వచ్చి, లోకాచారాన్ననుసరించి, మునులకు, హరికి, నాకు నమస్కరించాడు. దేవతలు మున్నగువారు ఆయనకు నమస్కరించారు.

**జయశబ్దో బభూవాథ నమశ్శబ్దస్తథైవ చ ।**
**వేదధ్వనిశ్చ శుభదః సర్వవిఘ్నవిదారణః ॥34॥**

అప్పుడు జయశబ్దం, నమశ్శబ్దం, సర్వవిఘ్న నివారణము, శుభదమునైన వేదధ్వనియు, విస్తరిల్లింది.

**అథ విష్ణురహం శక్రస్సర్వే దేవాశ్చ సర్షయః ।**
**సిద్ధా ఉపసురా నాగాస్తుష్టువుస్తే పృథక్ పృథక్ ॥35॥**

అంతట విష్ణువు, నేను, ఇంద్రుడు, అందరు దేవతలు, ఋషులు, సిద్ధులు, ఉపదేవతలు, నాగులు, వేరువేరుగా స్తుతించారు.

**దేవా ఊచుః** – దేవతలు పలికారు.

**జయశంభోఽఖిలాధార జయనామ మహేశ్వర ।**
**జయరుద్ర మహాదేవ జయవిశ్వంభర ప్రభో ॥36॥**

ఓ శంభో! సర్వాధారా! జయం. ఓ మహేశ్వరా! నీ నామానికి జయం. ఓ రుద్రా! మహాదేవా ! జయం. జగత్తును పోషించే ఓ ప్రభూ! జయం.

**జయకాళీపతే స్వామిన్ జయానందప్రవర్ధక ।**
**జయ త్ర్యంబక సర్వేశ జయ మాయాపతే విభో ॥37॥**

కాళీపతీ! స్వామీ! జయం. ఆనందాన్ని పెంపొందించేవాడా! జయం. ముక్కంటీ! సర్వేశ్వరా! జయం. మాయాధీశా! ప్రభూ! జయం.

**జయ నిర్గుణ నిష్కామ కారణాతీత సర్వగ ।**
**జయ లీలాఖిలాధార ధృతరూప నమోఽస్తు తే ॥38॥**

గుణరహితా! కామరహితా! జయం. కారణమైన ప్రకృతికతీతమైనవాడా! సర్వవ్యాపీ! జయం. లీలచే సర్వాధార రూపాన్ని ధరించువాడా! నీకు జయం. నీకు నమస్కారం.

**జయ స్వభక్త సత్కామ ప్రదేశ కరుణాకర ।**
**జయ సానంద సద్రూప జయ మాయాగుణాకృతే ॥39॥**

నీభక్తులకు యోగ్యమైన కామనలిచ్చే ఈశ్వరా! దయానిధీ! జయం. సచ్చిదానందరూపా! జయం. మాయాగుణాకృతే! జయం.

**జయోగ్ర మృడ సర్వాత్మన్ దీనబంధో దయానిధే ।**
**జయావికార మాయేశ వాఙ్మనోఽతీతవిగ్రహ ॥40॥**

భయంకరాకారా! రక్షకుడా! సర్వాత్మా! దీనబంధూ! దయానిధీ! జయం. అవికారా! మాయాధీశా! వాఙ్మనోతీత విగ్రహా! జయం.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి స్తుత్వా మహేశానం గిరిజానాయకం ప్రభుమ్ ।**
**సిషేవిరే పరప్రీత్యా విష్ణ్వాద్యాస్తే యథోచితమ్ ॥41॥**

విష్ణువు మున్నగు దేవతలు గిరిజాపతియైన మహేశ్వరుని ఈవిధంగా స్తుతించి, మహానందంగా, యథాయోగ్యంగా సేవించారు.

**అథ శంభుర్మహేశానో లీలాత్తతనురీశ్వరః ।**
**దదౌ మానవరం తేషాం సర్వేషాం తత్ర నారద ॥42॥**

ఓ నారదా! అంతట లీలచే స్వీకరింపబడిన దేహంగలవాడు, మహేశ్వరుడునైన శివుడు అచ్చటివారినందరిని సమ్మానించి వరాలనిచ్చాడు.

**విష్ణ్వాద్యాస్తేఽఖిలాస్తాత ప్రాప్యాజ్ఞాం పరమేశితుః ।**
**అతిహృష్టాః ప్రసన్నాస్యాః స్వస్థానం జగ్మురాద్రుతాః ॥43॥**

వత్సా! విష్ణువు మున్నగు దేవతలందరు పరమేశ్వరుని అనుమతిని పొంది, మహానందంతో ప్రసన్నమైన ముఖాలు కలవారై, సాదరంగా తమతమ స్థానాలకు వెళ్ళారు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే కామ సంజీవన వర్ణనం నామైకపంచాశత్తమోఽధ్యాయః ॥51॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో కామదేవుని జీవనవిదానవర్ణనం అనే యాభైఒకటవ అధ్యాయం సమాప్తం.

## **ద్విపంచాశత్తమోఽధ్యాయః** - యాభై రెండవ అధ్యాయం

## **వరవర్గభోజన, శివశయనవర్ణనమ్** - వరవర్గీయుల భోజన ఏర్పాటు, శివుని శయనవర్ణనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథ శైలవరస్తాత! హిమవాన్ భాగ్యసత్తమః ।**
**ప్రాంగణం రచయామాస భోజనార్థం విచక్షణః ॥1॥**

కుమారా! అప్పుడు మహాభాగ్యవంతుడు, పర్వతరాజు, విద్వాంసుడునగు హిమవంతుడు భోజనం కొరకు ప్రాంగణాన్ని ఏర్పాటు చేశాడు.

**మార్జనం లేపనం సమ్యక్కారయామాస తస్య సః ।**
**స సుగంధైరలంచక్రే నానావస్తుభిరాదరాత్ ॥2॥**

ఆయన దానిని తుడిపించి, చక్కగా సుగంధ ద్రవ్యాలు చల్లించి, అనేక వస్తువులచే శ్రద్ధగా అలంకరింపజేశాడు.

**అథ శైలస్సురాన్సర్వానన్యానపి చ సేశ్వరాన్ ।**
**భోజనాయాహ్వాయామాస పుత్రైశ్శైలైః పరైరపి ॥3॥**

అంతట హిమవంతుడు దేవతలనందరినీ, ఈశ్వరునీ, తదితరులను, తనకుమారులైన పర్వతాలచేతను, ఇతరుల చేతను ఆహ్వానింపజేశాడు.

**శైలాహ్వానమథాకర్ణ్య స ప్రభుస్సాచ్యుతో మునే ।**
**సర్వై స్సురాదిభిస్తత్ర భోజనాయ యయౌ ముదా ॥4॥**

ఓ మునీ! ఆ ప్రభువు పర్వతుని ఆహ్వానాన్ని విని, అచ్యుతునితో కూడి, దేవతాదులందరితో కలసి, ఆనందంగా అచ్చటకు భోజనానికి వెళ్ళాడు.

**గిరిః ప్రభుం చ సర్వాంస్తాన్సుసత్కృత్య యథావిధి ।**
**ముదోపవేశయామాస సత్పీఠేషు గృహాన్తరే ॥5॥**

హిమవంతుడు, శివుని, ఇతరులందరిని యథావిధిగా మంచిగా సత్కరించి, పీటలపై ఆనందంతో కూర్చుండబెట్టాడు.

**నానాసుభోజ్య వస్తూని పరివిష్య చ తత్పునః ।**
**సాంజలిర్భోజనాయాజ్ఞాం చక్రే విజ్ఞప్తిమానతః ॥6॥**

అనేక మధుర పదార్థాలు వడ్డించిన తరువాత ఆయన సమ్మానపూర్వకంగా చేతులు జోడించి, భోజనానికి అనుమతినిచ్చాడు.

**అథ సమ్మానితాస్తత్ర దేవా విష్ణుపురోగమాః ।**
**సదాశివం పురస్కృత్య బుభుజుస్సకలాశ్చ తే ॥7॥**

అప్పుడచ్చట సమ్మానింపబడిన విష్ణువు మున్నగు దేవతలందరు సదాశివుని ముందిడుకుని, భోజనం చేశారు.

**తదా సర్వే హి మిళితా ఐకపద్యేన సర్వశః ।**
**పంక్తిభూతాశ్చ బుభుజుర్విహసంతః పృథక్ పృథక్ ॥8॥**

అప్పుడు వారందరు ఒకేసారి అంతటా వరుసలో వేర్వేరుగా కూర్చుండి నవ్వుతూ భుజించారు.

**నంది భృంగి వీరభద్ర వీరభద్రగణాః పృథక్ ।**
**బుభుజుస్తే మహాభాగాః కుతూహల సమన్వితాః ॥9॥**

మహాత్ములైన నంది, భృంగీ, వీరభద్రుడు, వారి గణాలు కుతూహలంతో కూడినవారై, వేర్వేరుగా భుజించారు.

**దేవాస్సేంద్రాలోకపాలా నానాశోభా సమన్వితాః ।**
**బుభుజుస్తే మహాభాగా నానాహాస్య రసైస్సహ ॥10॥**

ఇంద్రాది దేవతలు, మహాత్ములైన లోకపాలకులు, వివిధ శోభలతో కూడినవారై, అనేక హాస్యోక్తులను పలుకుతూ భుజించారు.

**సర్వే చ మునయో విప్రా భృగ్వాద్యా ఋషయస్తథా ।**
**బుభుజుః ప్రీతితస్సర్వే పృథక్ పంక్తిగతా స్తదా ॥11॥**

మునులు, విప్రులు, భృగువు మున్నగు ఋషులందరు వేర్వేరు పంక్తులలో కూర్చుండి, ప్రీతితో భుజించారు.

**తథా చండీగణా స్సర్వే బుభుజుః కృతభాజనాః ।**
**కుతూహలం ప్రకుర్వంతో నానాహాస్యకరా ముదా ॥12॥**

చండీ గణాలందరు కుతూహలాన్ని కలిగించేవారై, అనేక హాస్యవచనాలు పలుకుతూ, ఆనందంతో పళ్ళెరాలలో భుజించారు.

**ఏవం తే భుక్తవంతశ్చాచమ్య సర్వే ముదాన్వితాః ।**
**విశ్రామార్థం గతాః ప్రీత్యా విష్ణ్వాద్యా స్స్వంస్వమాశ్రమమ్ ॥13॥**

విష్ణువు మున్నగువారందరు ఈవిధంగా ఆనందంగా భుజించి, నీటిని త్రాగి, ప్రీతితో విశ్రమించడానికి తమతమ నివాసాలకు వెళ్ళారు.

**మేనాజ్ఞయా స్త్రియస్సాధ్వ్యశ్శివం సంప్రార్థ్య భక్తితః ।**
**గేహే నివాసయామాసు ర్వాసాఖ్యే పరమోత్సవే ॥14॥**

మేనాదేవి ఆజ్ఞచే సాధ్వీమణులు శివుని భక్తితో ప్రార్థించి, పరమోత్సాహంతో కూడియున్న గృహంలో నివసింపజేశారు.

**రత్నసింహాసనే శంభుర్మేనాదత్తే మనోహరే ।**
**సన్నిధాయ ముదాయుక్తో దదృశే వాసమందిరమ్ ॥15॥**

శంభుడు మేనాదేవిచే ఈయబడిన మనోహరమైన రత్నసింహాసనంలో కూర్చుండి, ఆనందంతో వాసగృహాన్ని పరికించాడు.

**రత్నప్రదీపశతకైర్జ్వలద్భిర్జ్వలితం శ్రియా ।**
**రత్నపాత్రఘటాకీర్ణం ముక్తామణి విరాజితమ్ ॥16॥**

మెరిసిపోయే అనేక రత్న దీపాలతో శోభిల్లునదియు, రత్నాలు పొదిగిన పాత్రలతో, ఘటాలతో, కూడియున్నదియూ, ముత్యాలతో, మణులతో, విరాజిల్లునదియునగు మందిరాన్ని చూశాడు.

**రత్నదర్పణశోభాఢ్యం మండితం శ్వేతచామరైః ।**
**ముక్తామణిసుమాలాభిర్వేష్టితం పరమర్ధిమత్ ॥17॥**

**అనూపమం మహాదివ్యం విచిత్రం సుమనోహరమ్ ।**
**చిత్తాహ్లాదకరం నానా రచనా రచిత స్థలమ్ ॥18॥**

**శివదత్త వరస్యైవ ప్రభావమతులం పరమ్ ।**
**దర్శయంతం సముల్లాసి శివలోకాభిధానకమ్ ॥19॥**

**నానాసుగంధసద్ద్రవ్యైర్వాసితం సుప్రకాశకమ్ ।**
**చందనాగురుసంయుక్తం పుష్పశయ్యాసమన్వితమ్ ॥20॥**

రత్నదర్పణాల శోభతో విరాజిల్లునదియు, తెల్లని చామరలతో అలంకరింపబడినదియు, ముత్యాల మణుల మాలలతో అలంకరింపబడినదియు, మహాసంపదలతో కూడియున్నదియు, సాటిలేనిదియు, మహాదివ్యమైనదియు, చిత్రవిచిత్రమైనదియు, సుమనోహరమైనదియు, చిత్తాహ్లాదకరమైనదియు, నేలపై వివిధ రచనలతో శోభిల్లునదియు, శివదత్త వరప్రభావంచేత నిర్మితమైనదియు, చూచువారికి ఉల్లాసాన్ని కలిగించునదియు, అనేక సుగంధ ద్రవ్యాలచే సుగంధభరితమైనదియు, చందనాగరులతో కూడినదియు, పుష్పశయ్యతో కూడియున్నదియునగు గృహాన్ని చూశాడు.

**నానాచిత్రవిచిత్రాఢ్యం నిర్మితం విశ్వకర్మణా ।**
**రత్నేంద్రసార రచితైరాచితం హారకైర్వరైః ॥21॥**

అనేక చిత్ర విచిత్రాలతో ప్రకాశించునదియు, విశ్వకర్మచే నిర్మింపబడినదియు, శ్రేష్ఠమైన రత్నాలతో తయారైన శ్రేష్ఠమైన హారాలతో అలంకరింపబడింది.

**కుత్రచిత్సురనిర్మాణం వైకుంఠం సుమనోహరమ్ ।**
**కుత్రచిచ్చ బ్రహ్మలోకం లోకపాలపురం క్వచిత్ ॥22॥**

**కైలాసం కుత్రచిద్రమ్యం కుత్రచిచ్ఛక్రమందిరమ్ ।**
**కుత్రచిచ్ఛివలోకం చ సర్వోపరి విరాజితమ్ ॥23॥**

ఈవిధంగా అలంకరింపబడిన గృహాన్ని చూశాడు. ఆ గృహంలో ఒకచోట దేవతలచే నిర్మింపబడిన, మిక్కిలి అందమైన వైకుంఠం, బ్రహ్మలోకం, మరియొకచోట లోకపాలక నగరం, ఒకచోట రమ్యమైన కైలాసం, మరియొకచోట ఇంద్రభవనం వీటన్నిటిపై విరాజిల్లు శివలోకం రచింపబడి యుంది.

**ఏతాదృశగృహం సర్వదృష్టాశ్చర్యం మహేశ్వరః ।**
**ప్రశంసన్ హిమశైలేశం పరితుష్టో బభూవ హ ॥24॥**

అందరిచేత ఆశ్చర్యంగా చూడబడే ఇట్టి గృహాన్ని చూసి, మహేశ్వరుడు హిమవంతుని ప్రశంసించి సంతుష్టుడయ్యాడు.

**తత్రాతి రమణీయే చ రత్నపర్యంక ఉత్తమే ।**
**అశయిష్ట ముదా యుక్తో లీలయా పరమేశ్వరః ॥25॥**

ఆ భవనంలో ఉత్తమము, అతిరమణీయమునైన శయ్యపై పరమేశ్వరుడు ఆనందంతో లీలగా శయనించాడు.

**హిమాచలశ్చ స్వభ్రాతౄన్ భోజయామాస కృత్స్నశః ।**
**సర్వానన్యాంశ్చ సుప్రీత్యా శేషకృత్యం చకార హ ॥26॥**

హిమవంతుడు తన సోదరులను, ఇతరులను, చక్కని మృష్టాన్నంతో ఆనందింపజేసి, ఇతర కృత్యాలు (తాంబూలాదులను సమర్పించడం) కూడా చేశాడు.

**ఏవం కుర్వతి శైలేశే స్వపతి ప్రేష్ఠ ఈశ్వరే ।**
**వ్యతీతా రజనీ సర్వా ప్రాతః కాలో బభూవ హ ॥27॥**

హిమవంతుడిట్లు కార్యమగ్నుడై యుండగా ప్రియతముడైన ఈశ్వరుడు నిద్రించుచుండగా రాత్రి గడిచి ప్రాతఃకాలమయ్యింది.

**అథ ప్రభాతకాలే చ ధృత్యుత్సాహపరాయణాః ।**
**నానాప్రకారవాద్యాని వాదయాం చక్రిరే జనాః ॥28॥**

అప్పుడా ప్రభాత సమయంలో జనులు ధైర్యోత్సాహాలతో నిండినవారై, అనేక రకాల వాద్యాలు మ్రోగించారు.

**సర్వే సురాస్సముత్తస్థుర్విష్ణ్వాద్యాస్సుముదాన్వితాః ।**
**స్వేష్టం సంస్మృత్య దేవేశం సజ్జీభూతాస్ససంభ్రమాః ॥29॥**

విష్ణువు మున్నగు దేవతలందరు ఆనందంతో నిద్రలేచి, తమ ఇష్టదైవమైన ఈశ్వరుని స్మరించి, త్వరగా సంసిద్ధులయ్యారు.

**స్వవాహనాని సజ్జాని కైలాసం గంతుముత్సుకాః ।**
**కృత్వా సంప్రేషయామాసుర్ధర్మం శివసమీపతః ॥30॥**

వారు కైలాసానికి వెళ్లడానికి తమతమ వాహనాలను సిద్ధంచేసుకొని, ధర్ముని శివుని వద్దకు పంపారు.

**వాసగేహమథాగత్య ధర్మో నారాయణాజ్ఞయా ।**
**ఉవాచ శంకరం యోగీ యోగీశం సమయోచితమ్ ॥31॥**

యోగియగు ధర్ముడు నారాయణాజ్ఞచే వాసగృహానికి వచ్చి, యోగిశ్రేష్ఠుడైన శివునితో సమయోచితంగా ఇలా పలికాడు.

**ధర్మ ఉవాచ –** ధర్ముడు పలికాడు.

**ఉత్తిష్ఠోత్తిష్ఠ భద్రం తే భవ నః ప్రమథాధిప ।**
**జనావాసం సమాగచ్ఛ కృతార్థం కురు తత్ర తాన్ ॥32॥**

ఓ ప్రమథపతీ! లెమ్ము! లెమ్ము! మీకు మంగళమగుగాక! మాకు మంగళాలనిమ్ము. జనావాసం వద్దకు రండు. అచ్చట వారిని కృతార్థులను చేయండి.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇతి ధర్మవచః శ్రుత్వా విజహాస మహేశ్వరః ।**
**దదర్శ కృపయా దృష్ట్యా తల్పముజ్ఝాఞ్చకార హ ॥33॥**

ధర్మపతి మాటలను విని, మహేశ్వరుడు నవ్వి, దయాదృష్టితోచూచి, శయ్యను వీడాడు.

**ఉవాచ విహసన్ ధర్మం త్వమగ్రే గచ్ఛ తత్ర హ ।**
**అహమప్యాగమిష్యామి ద్రుతమేవ న సంశయః ॥34॥**

"ఓ ధర్మా! నీవు ముందు అచ్చటకు వెళ్ళుము. నేనుకూడా శీఘ్రంగా వస్తాను సందేహం లేదు". అని ఆయన నవ్వుతూ పలికాడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్తశ్శంకరేణాథ జనావాసం జగామ సః ।**
**స్వయం గంతుమనా ఆసీత్తత్ర శంభురపి ప్రభుః ॥35॥**

శంకరుడిట్లు పలుకగా అతడు జనావాసానికి వెళ్ళాడు. శంభుడుకూడా అచ్చటకు స్వయంగా వెళ్లాలని తలంచాడు.

**తత్ జ్ఞాత్వా స్త్రీగణస్సోఽసౌ తత్రాగచ్ఛన్మహోత్సవః ।**
**చక్రే మంగళగానం హి పశ్యన్ శంభుపదద్వయమ్ ॥36॥**

ఆ విషయం తెలిసి, స్త్రీలందరు గొప్ప ఉత్సాహంతో అచ్చటకు వచ్చారు. వారు శంభుని పాదద్వయాన్ని చూస్తూ మంగళగానాలు పాడారు.

**అథ శంభుర్భవాచారీ ప్రాతః కృత్యం విధాయ చ ।**
**మేనా మామంత్ర్య కుధ్రం చ జనావాసం జగామ సః ॥37॥**

అప్పుడు శంభుడు లోకాచారాన్ని అనుసరించి, ప్రాతఃకాల కృత్యాలు పూర్తిచేసుకుని, మేనాహిమవంతుల అనుమతిని తీసుకొని జనావాసానికి వెళ్లాడు.

**మహోత్సవస్తదా చాసీద్వేదధ్వనిరభూన్మునే ।**
**వాద్యాని వాదయామాసుర్జనాశ్చాతుర్విధాని చ ॥38॥**

ఓ మునీ! అప్పుడు మహోత్సవం ఆరంభమయ్యింది. వేదధ్వని మొదలయ్యింది. జనులు నాలుగు విధాల వాద్యాలు మ్రోగించారు.

**శంభురాగత్య స్వస్థానం వవందే చ మునీం స్తదా ।**
**హరిం చ మాం భవాచారాత్ వందితోఽభూత్సురాదిభిః ॥39॥**

అప్పుడు శంభుడు తన స్థానానికి వచ్చి, లోకాచారాన్ననుసరించి, మునులకు, విష్ణువునకు, నాకు నమస్కరించాడు. దేవతలు మున్నగువారాయనకు నమస్కరించారు.

**జయశబ్దో బభూవాథ నమశ్శబ్దస్తథైవ చ ।**
**వేదధ్వనిశ్చ శుభదో మహాకోలాహలోఽభవత్ ॥40॥**

అనంతరం జయధ్వానాలు, నమశ్శబ్దాలు, శుభదమైన వేదధ్వని కలిసి, పెద్ద కోలాహలం ప్రవర్తిల్లింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే వరవర్గ భోజన, శివశయనవర్ణనం నామ ద్విపంచాశత్తమోఽధ్యాయః ॥52॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో వరవర్గయుల భోజన ఏర్పాటు, శివుని శయనవర్ణనం అనే యాభై రెండవ అధ్యాయం సమాప్తం.

## **త్రిపంచాశత్తమోఽధ్యాయః - యాభై మూడవ అధ్యాయం**
## **శివయాత్రావర్ణనమ్ - శివయాత్రావర్ణనం**

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**అథ విష్ణ్వాదయో దేవా మునయశ్చ తపోధనాః ।**
**కృత్వావశ్యకకర్మాణి యాత్రాం సంతేనిరే గిరేః ॥1॥**

అంతట విష్ణువు మున్నగు దేవతలు, తపోధనులైన మునులు, అవశ్యమైన పనులు పూర్తిచేసుకుని కైలాస యాత్రకు సన్నద్ధులయ్యారు.

**తతో గిరివరః స్నాత్వా స్వేష్టం సంపూజ్య యత్నతః ।**
**పౌరబంధూన్ సమాహూయ జనవాసం యయౌ ముదా ॥2॥**

అప్పుడు హిమవంతుడు స్నానంచేసి, తన ఇష్టదైవాన్ని శ్రద్ధగా పూజించి, పౌరులను, బంధువులను, తోడ్కొని, పెళ్ళివారి నివాస గృహానికి వెళ్ళాడు.

**తత్ర ప్రభుం ప్రపూజ్యాథ చక్రే సంప్రార్థనాం ముదా ।**
**కియద్దినాని సంతిష్ఠ మద్గేహే సకలై స్సహ ॥3॥**

అక్కడ ఆనందంతో శివుని పూజించి, ఇట్లు ప్రార్థించాడు. "నాగృహంలో కొద్దిరోజులు అందరితో కలసి నివసించండి"

**విలోకనేన తేశంభో కృతార్థోహం న సంశయః ।**
**ధన్యశ్చ యస్య మద్గేహే ఆయాతోఽసి సురై స్సహ ॥4॥**

హే శంభో! నిన్ను దర్శించడంచేతను, దేవతలతోగూడి నీవు మాఇంటికి రావడంచేతను, నేను కృతార్థుడను, ధన్యుడను అయ్యాననడంలో సందేహం లేదు.

**బ్రహ్మోవాచ -** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా బహుశైలేశః కరౌ బద్ధ్వా ప్రణమ్య చ ।**
**ప్రభుం నిమంత్రయామాస సహ విష్ణుసురాదిభిః ॥5॥**

ఈవిధంగా పర్వతరాజు చేతులుజోడించి, నమస్కరించి, విష్ణువును, దేవతలను, ఇతరులను, శివప్రభువును ఆహ్వానించాడు.

**అథ తే మనసా గత్వా శివసంయుతమాదరాత్ ।**
**ప్రత్యూచుర్మునయో దేవా హృష్టా విష్ణుసురాదిభిః ॥6॥**

విష్ణువు మున్నగు వారితోగూడిన దేవతలు, మునులు శివుని సాదరంగా మనస్సులో స్మరించి, ఇట్లు బదులు పలికారు.

**దేవా ఊచుః** – దేవతలు పలికారు.

**ధన్యస్త్వం గిరిశార్దూల తవ కీర్తిర్మహీయసీ ।**
**త్వత్సమో న త్రిలోకేషు కోఽపి పుణ్యతమో జనః ॥7॥**

ఓ గిరిరాజా! నీవు ధన్యుడవు. నీకీర్తి చాలగొప్పది. ముల్లోకాలలో నీవంటి పుణ్యాత్ముడైన జనులు మరియొకడులేడు.

**యస్య ద్వారి మహేశానః పరబ్రహ్మ సతాంగతిః ।**
**సమాగ తస్సదాసైశ్చ కృపయా భక్తవత్సలః ॥8॥**

పరబ్రహ్మయు, సత్పురుషులకు ఆశ్రయుడం, భక్తవత్సలుడునైన మహేశ్వరుడు తన కింకరులతోగూడి, దయతో నీఇంటి గుమ్మంలోనికి వచ్చాడు.

**జనావాసోఽతిరమ్యశ్చ సమ్మానో వివిధః కృతః ।**
**భోజనాని త్వపూర్వాణి న వర్ణ్యాని గిరీశ్వర ॥9॥**

ఇచ్చటి విడిది చాల సుందరంగా ఉంది. వివిధ సన్మానాలు చేశావు. ఓ పర్వతరాజా! నీవేర్పాటు చేసిన అపూర్వమైన భోజనాలను వర్ణించడం ఎవరివల్లను కాదు.

**చిత్రం న ఖలు తత్రాస్తి యత్ర దేవీ శివాంబికా ।**
**పరిపూర్ణమశేషం చ వయం ధన్యా యదాగతాః ॥10॥**

వీటిలో వింత ఏమియులేదు. ఎందుకనగా ఎచ్చట జగన్మాతయైన శివాదేవి గలదో, అచ్చట సర్వం సంపూర్ణమౌతాయి. మేమిచ్చటకు వచ్చి ధన్యులమయ్యాము.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్థం పరస్పరం తత్ర ప్రశంసాభవదుత్తమా ।**
**ఉత్సవో వివిధో జాతో వేదసాధు జయధ్వనిః ॥11॥**

ఈవిధంగా అక్కడ పరస్పరం ప్రశంసించుకున్నారు. మహోత్సవం మొదలయ్యింది. వేదశబ్దం, సాధుకారం, జయధ్వానాలు ప్రవర్తిల్లాయి.

**అభూన్మంగలగానం చ ననర్తాప్సరసాంగణః ।**
**నుతిం చక్రుర్మాగధాద్యా ద్రవ్యదానమభూద్బహు ॥12॥**

మంగళ గీతాలాపన ఆరంభమయ్యింది. అప్సరసలు నాట్యమాడారు. వందిమాగధులు స్తోత్రాలు చేశారు. వివిధ దానాలు చేశారు.

**తత ఆమంత్ర్య దేవేశం స్వగేహమగమద్గిరిః ।**
**భోజనోత్సవమారేభే నానావిధివిధానతః ॥13॥**

అంతట హిమవంతుడు దేవదేవుని ఆహ్వానించి, తనగృహానికి వెళ్ళాడు. యథావిధిగా భోజనోత్సవం ఆరంభమయ్యింది.

**భోజనార్థం ప్రభుం ప్రీత్యాऽऽనయామాస యథోచితమ్ ।**
**పరివారసమేతం చ సకుతూహల మీశ్వరమ్ ॥14॥**

పరివారంతోగూడి, కుతూహలం కలిగిన ఈశ్వరుని ప్రీతితో యథావిధిగా భోజనానికి తీసుకువెళ్లారు.

**ప్రక్షాల్య చరణౌ శంభోర్విష్ణోర్మమ వరాదరాత్ ।**
**సర్వేషామమరాణాం చ మునీనాం చ యథార్థతః ॥15॥**

శంభునకు, విష్ణువునకు, నాకు, దేవతలందరికి, మునులకు మిక్కిలి ఆదరంతో కాళ్ళుకడిగారు.

**పరేషాం చాగతానాం చ గిరీశో మండపాంతరే ।**
**ఆసయామాస సుప్రీత్యా తాంస్తాన్బంధుభిరన్వితః ॥16॥**

హిమవంతుడు మిగిలిన బంధువులను, ప్రేమతో ఆహ్వానించి, అందరినీ మండపంలోపల కూర్చుండబెట్టాడు.

**సురసైర్వివిధాన్నైశ్చ తర్పయామాస తాన్గిరిః ।**
**బుభుజుర్నిఖిలాస్తే వై శంభునా విష్ణునా మయా ॥17॥**

పర్వతుడు వారిని మధురమైన వివిధ భక్ష్యాలతోను, వివిధ రకాలైన అన్నాదులతోను, తృప్తి పరచాడు. శంభుడు, విష్ణువు, నేను తదితరులందరం భుజించాము.

**తదానీం పురనార్యశ్చ గాలీదానం వ్యధుర్ముదా ।**
**మృదువాణ్యా హసంత్యశ్చ పశ్యంత్యో యత్నతశ్చ తాన్ ॥18॥**

అప్పుడు పురస్త్రీలు నవ్వుతూ మృదువైన మాటలతో వారిని పరిహాసంచేసి, వారిని చూస్తూ ఆనందించారు.

**తే భుక్త్వాచమ్య విధివద్గిరిమామంత్ర్య నారద ।**
**స్వస్థానం ప్రయయుస్సర్వే ముదితా స్తృప్తిమాగతాః ॥19॥**

ఓ నారదా! వారందరు భుజించి, యథావిధిగా ఆచమనం చేసి, పర్వతుని అనుమతి పొంది, సంతుష్టులై, తమ స్థానం చేరుకున్నారు.

**ఇత్థం తృతీయే ఘస్రేऽపి మానితాస్తేऽభవన్మునే ।**
**గిరీశ్వరేణ విధివద్దానమానాదరాదిభిః ॥20॥**

ఇదేవిధంగా మూడవనాడుకూడా పర్వతరాజు వారికి యథావిధిగా వస్తువులనిచ్చి, ఆదరాన్ని చూపి, సన్మానించాడు.

**చతుర్థే దివసే ప్రాప్తే చతుర్థీకర్మ శుద్ధితః ।**
**బభూవ విధివద్యేన వినా ఖండిత ఏవ సః ॥21॥**

నాల్గవనాడు శుద్ధిగా, యథావిధిగా చతుర్థీకర్మ ఆచరింపబడింది. దీనిని ఆచరింపనిచో వివాహ యజ్ఞం భగ్నమౌతుంది.

**ఉత్సవో వివిధశ్చాసీ త్సాధువాద జయధ్వనిః ।**
**బహుదానం సుగానం చ నర్తనం వివిధం తథా ॥22॥**

అప్పుడు వివిధ ఉత్సవాలు జరిగాయి. సాధువాదం, జయధ్వానాలు మిన్ను ముట్టాయి. అనేక దానాలు చేయబడ్డాయి. నృత్యాలు వివిధ గానాలు ప్రవర్తిల్లాయి.

**పంచమే దివసే ప్రాప్తే సర్వే దేవా ముదాన్వితాః ।**
**విజ్ఞప్తిం చక్రిరే శైలం యాత్రార్థమతి ప్రేమతః ॥23॥**

ఐదవరోజు ఉదయమే దేవతలందరూ అత్యానందంతో, అతిప్రేమతో హిమవంతునకు తిరుగు యాత్రగురించి విన్నవించారు.

**తదాకర్ణ్య గిరీశశ్చోవాచ దేవాన్ కృతాంజలిః ।**
**కియద్దినాని తిష్ఠంతు కృపాం కుర్వంతు మాం సురాః ॥24॥**

ఆ మాటవిని హిమవంతుడు చేతులు జోడించి, దేవతలతో "ఓ దేవతలారా! దయచేసి మరికొన్ని రోజులుండండి" అని కోరాడు.

**ఇత్యుక్త్వా స్నేహతస్తాంశ్చ ప్రభుం విష్ణుం చ మాం పరాన్ ।**
**వాసయామాస దివసాన్ బహూన్నిత్యం సమాదరాత్ ॥25॥**

ఇట్లు పలికి ఆయన ప్రేమతో వారిని, శివుని, విష్ణువును, నన్ను, ఇతరులను చాలరోజులు అక్కడనే నిల్పి, నిత్యము గొప్ప ఆదరాన్ని చూపాడు.

**ఇత్థం వ్యతీయుర్దివసా బహవో వసతాం చ తత్ ।**
**సప్తర్షీన్ ప్రేషయామాసుర్గిరీశాంతే తతస్సురాః ॥26॥**

అక్కడ నివసించి యుండగానే అనేక దినాలు ఈతీరున గడిచిపోయాయి. తరువాత దేవతలు పర్వతరాజు వద్దకు సప్తర్షులను పంపారు.

**తే తం సంబోధయామాసు ర్మేనాం చ సమయోచితమ్ ।**
**శివతత్త్వం పరం ప్రోచుః ప్రశంసన్ విధివన్ముదా ॥27॥**

వారు మేనాదేవికి సమయోచితంగా పరమశివ తత్త్వాన్ని యథావిధిగా బోధించి, ఆనందంతో ఆమెను ప్రశంసించారు.

**అంగీకృతం పరేశేన తత్తద్బోధనతో మునే ।**
**యాత్రార్థమగమచ్ఛంభుశ్శైలేశం సామరాదికః ॥28॥**

ఓ మునీ! వారు వారు చెప్పగా పరమేశ్వరుడు యాత్రకంగీకరించి, దేవతలు మున్నగు వారితోకూడి, హిమవంతుని వద్దకు వెళ్ళారు.

**యాత్రాం కుర్వతి దేవేశో స్వశైలం సామరే శివే ।**
**ఉచ్చై రురోద సా మేనా తమువాచ కృపానిధిమ్ ॥29॥**

దేవదేవుడైన శివుడు దేవతలతోకూడి యాత్రకు సంసిద్ధమౌచుండగా మేనాదేవి బిగ్గరగా విలపించి, దయానిధియైన శంభునితో ఇట్లు పలికింది.

**మేనోవాచ –** మేనాదేవి పలికింది.

**కృపానిధే కృపాం కృత్వా శివాం సంపాలయిష్యసి ।**
**సహస్రదోషం పార్వత్యా ఆశుతోషః క్షమిష్యసి ॥30॥**

ఓ దయానిధీ! దయచేసి నీవు పార్వతిని చక్కగా పాలింపుము. తేలికగా సంతసించు నీవు పార్వతియొక్క వేయి దోషాలు క్షమింపుము.

**త్వత్పదాంబుజభక్తా చ మద్వత్సా జన్మజన్మని ।**
**స్వప్నే జ్ఞానే స్మృతిర్నాస్తి మహాదేవం ప్రభుం వినా ॥31॥**

నా కుమార్తె జన్మజన్మలయందు నీ పాదపద్మాలపై భక్తికలిగియుంది. ఆమె మెళకువగానున్నను, స్వప్నంలోనైనను, స్మృతిలోను మహాదేవుని తలచనికాలంలేదు.

**త్వద్భక్తిశ్రుతిమాత్రేణ హర్షాశ్రుపులకాన్వితా ।**
**త్వన్నిందయా భవేన్మౌనా మృత్యుంజయ మృతా ఇవ ॥32॥**

ఆమె నీభక్తినిగురించి వినినంత మాత్రంచేతనే ఆనందంతో కన్నీరు గార్చేది. శరీరం గగుర్పొడిచేది. నిన్ను నిందించినచో ఆమె మరణించినదానివలె మౌనంగా నుండేది.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా మేనకా తస్మై సమర్ప్య స్వసుతాం తదా ।**
**అత్యుచ్చైః రోదనం కృత్వా మూర్ఛామాప తయోఃపురః ॥33॥**

మేనక ఈవిధంగా పలికి, తన కుమార్తెను ఆయనకు సమర్పించి, బిగ్గరగా రోదించి, వారిద్దరి ఎదుట మూర్ఛిల్లింది.

**అథ మేనాం బోధయిత్వా తామామంత్ర్య గిరిస్తథా ।**
**చకార యాత్రాం దేవైశ్చ మహోత్సవపురస్సరమ్ ॥34॥**

అప్పుడు మేనాదేవికి తెలివి వచ్చేటట్లు చేసి, శివుడు మేనాహిమవంతుల అనుమతిని పొంది, దేవతలతోగూడి, మహోత్సవంతో యాత్ర చేశాడు.

**అథ తే నిర్జరాస్సర్వే ప్రభుణా స్వగణై స్సహ ।**
**యాత్రాం ప్రచక్రిరే తూష్ణీం గిరిం ప్రతి శివం దధుః ॥35॥**

అంతట దేవతలందరు శివగణాలతోకూడి, యాత్రను మొదలుపెట్టారు. వారు మౌనంగా హిమవంతునకు, మంగళాశాసనం చేశారు.

**హిమాచల పురీ బాహ్యోపవనే హర్షితాస్సురాః ।**
**సేశ్వరా స్సోత్సవా స్తస్థుః పర్యైషంత శివాగమమ్ ॥36॥**

హిమవంతుని నగరంయొక్క బాహ్యోద్యానవనంలో దేవతలు శివునితోగూడి, ఉత్సాహంతో, ఆనందంతో వేచియున్నారు. వారు పార్వతి రాకను ప్రతీక్షిస్తున్నారు.

**ఇత్యుక్తా శివసద్యాత్రా దేవైస్సహ మునీశ్వర ।**
**ఆకర్ణయ శివయాత్రాం విరహోత్సవ సంయుతామ్ ॥37॥**

ఓ మహర్షీ! దేవతలతో గూడిన శివుని యాత్రను ఇంతవరకు వర్ణించాను. వియోగదుఃఖంతో మరియు ఆనందంతో కలిసియున్న పార్వతి యాత్రగూర్చి ఇప్పుడు వినుము.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే శివయాత్రావర్ణనం నామ త్రిపంచాశత్తమో௨ధ్యాయః ॥53॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో శివయాత్రా వర్ణనం అనే యాభై మూడవ అధ్యాయం సమాప్తం.

## చతుః పంచాశత్తమో౽ధ్యాయః - యాభై నాలుగవ అధ్యాయం

## పతివ్రతా ధర్మవర్ణనమ్ - పతివ్రతల ధర్మములవర్ణనం

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథ సప్తర్షయస్తే చ ప్రోచుర్హిమగిరీశ్వరమ్ ।**
**కారయస్వాత్మజాదేవ్యా యాత్రా మద్యోచితాం గిరే ॥1॥**

అంతట సప్తర్షులు హిమవంతునితో "ఓపర్వతరాజా! ఈరోజు నీకుమార్తె పార్వతీదేవి యాత్రకు బాగున్నది. కాబట్టి ఏర్పాట్లు చేయుము" అని చెప్పారు.

**ఇతిశ్రుత్వా గిరీశో హి బుద్ధ్వా తద్విరహం పరమ్ ।**
**విషణ్ణో౽భూన్మహాప్రేమ్ణా కియత్కాలం మునీశ్వర ॥2॥**

ఓ మునీశ్వరా! ఈ మాటవిని, కుమార్తె విరహాన్ని స్మరించి, మహాప్రేమచే హిమవంతుడు దుఃఖితుడయ్యాడు. అతడు కొంతసేపు స్పృహ కోల్పోయాడు.

**కియత్కాలేన సంప్రాప్య చేతనాం శైలరాట్ తతః ।**
**తథాస్త్వితి గిరాముక్త్వా మేనాం సందేశమబ్రవీత్ ॥3॥**

అనంతరం కొంతసేపటికి పర్వతరాజు తెలివి తెచ్చుకుని 'అటులనే' అని పలికి, మేనాదేవికి సందేశాన్ని పంపాడు.

**శైలసందేశమాకర్ణ్య హర్షశోకవశా మునే ।**
**మేనా సంయాపయామాస కర్తుమాసీత్సముద్యతా ॥4॥**

ఓ మునీ! ఒకేసారి ఆనంద దుఃఖాలతో నిండిన మనస్సుగల మేనాదేవి హిమవంతుని సందేశాన్ని విని, పార్వతిని సాగనంపడానికి సంసిద్ధురాలయ్యింది.

**శ్రుతిస్వకులజాచారం చచార విధివన్మునే ।**
**ఉత్సవం వివిధం తత్ర సా మేనా క్షితిభృత్ప్రియా ॥5॥**

ఓ మునీ! ఆమె వేదోక్త విధానాన్ని, తమ కులాచారాన్ని యథావిధిగా పాటించింది. అప్పుడచ్చట గొప్ప ఉత్సవం ప్రారంభమయ్యింది.

**గిరిజాం భూషయామాస నానారత్నాంశుకైర్వరైః ।**
**ద్వాదశాభరణైశ్చైవ శృంగారైర్నృపసమ్మితైః ॥6॥**

హిమవత్పత్నియైన మేనాదేవి శ్రేష్ఠమైన పట్టు వస్త్రాలతో రాజుయొక్క హెూదాకు తగినట్లుగా పన్నెండు రకాల ఆభరణాలతో పార్వతిని అలంకరించింది.

**మేనామనోగం బుద్ధ్వా సాధ్వేకా ద్విజకామినీ ।**
**గిరిజాం శిక్షయామాస పాతివ్రత్యవ్రతం పరమ్ ॥7॥**

పవిత్రతయైన ఒక బ్రాహ్మణపత్ని, మేనాదేవి మనోగతాన్ని ఎరింగి, గొప్ప పాతివ్రత్య వ్రతంగూర్చి పార్వతికి బోధించింది.

**ద్విజపత్న్యువాచ –** ద్విజపత్ని పలికింది.

**గిరిజే శృణు సుప్రీత్యా మద్వచో ధర్మవర్ధనమ్ ।**
**ఇహాముత్రానందకరం శృణ్వతాం చ సుఖప్రదమ్ ॥8॥**

ఓ పార్వతీ! ధర్మవర్ధనమైనది, ఇహపర ఆనందదాయకమైనది, సుఖప్రదమైనదియునగు నా మాట ప్రీతితో వినుము.

**ధన్యా పతివ్రతా నారీ నాన్యా పూజ్యా విశేషతః ।**
**పావనీ సర్వలోకానాం సర్వపాపౌఘనాశినీ ॥9॥**

పతివ్రతయైన స్త్రీ ధన్యురాలు, అట్టి స్త్రీని మాత్రమే ప్రత్యేకంగా పూజించాలి. ఆమె సర్వలోకాలను పవిత్రం చేస్తుంది. సమస్త పాపరాశిని నశింపజేస్తుంది.

**సేవతే యా పతిం ప్రేమ్ణా పరమేశ్వరవచ్ఛివే ।**
**ఇహ భుక్త్వాఖిలాం భోగానంతే పత్యాశివాం గతిమ్ ॥10॥**

ఓ పార్వతీ! ఏ స్త్రీ భర్తను ప్రేమతో పరమేశ్వరుని సేవించినట్లు సేవిస్తుందో ఆ స్త్రీ ఇహలోకంలో భోగాలనన్నిటిని అనుభవించి, దేహాన్ని వీడిన తరువాత భర్తతోగూడి శుభగతిని పొందుతుంది.

**పతివ్రతా చ సావిత్రీ లోపాముద్రా హ్యరుంధతీ ।**
**శాండిల్యా శతరూపానసూయా లక్ష్మీస్స్వధా సతీ ॥11॥**

సావిత్రి, లోపాముద్ర, అరుంధతి, శాండిల్య, శతరూప, అనసూయ, లక్ష్మి, స్వధా, సతీదేవి అనువారు గొప్ప పతివ్రతలు.

**సంజ్ఞా చ సుమతి శ్రృద్ధా మేనా స్వాహా తథైవ చ ।**
**అన్యా బహ్వ్యోఽపి సాధ్వ్యోహి నోక్తా విస్తరజాద్భయాత్ ॥12॥**

సంజ్ఞ, సుమతి, శ్రద్ధ, మేన, స్వాహా అనువారలేగాక ఇంకా ఎందరో సాధ్వీమణులున్నారు. వారి పేర్లనన్నింటిని విస్తరభీతిచే చెప్పడంలేదు.

**పాతివ్రత్యవృషేణైవ తా గతాస్సర్వపూజ్యతామ్ ।**
**బ్రహ్మవిష్ణుహరైశ్చాపి మాన్యా జాతా మునీశ్వరైః ॥13॥**

పాతివ్రత్య ధర్మం చేతనే వారు బ్రహ్మవిష్ణు మహేశ్వరులకు, మునీశ్వరులకు, సర్వులకు పూజింపదగినవారు, సమ్మానింపదగినవారు ఐనారు.

**సేవ్యస్త్వయా పతిస్తస్మాత్సర్వదా శంకరః ప్రభుః ।**
**దీనానుగ్రహకర్తా చ సర్వసేవ్యస్సతాం గతిః ॥14॥**

కాబట్టి నీవు, సర్వకాలాలలో నీ భర్తయైన శంకరుని సేవింపుము. ఆయన దీనానుగ్రహకర్త, సర్వసేవ్యుడు. సతాంగతి.

**మహాన్ పతివ్రతాధర్మశ్శ్రుతిస్మృతిషు నోదితః ।**
**యథైష వర్ణ్యతే శ్రేష్ఠో న తథాన్యోఽస్తి నిశ్చితమ్ ॥15॥**

పతివ్రతా ధర్మం చాలగొప్పదని శ్రుతి స్మృతులు చెబుతున్నాయి. దీనితో సమానమైన శ్రేష్ఠ ధర్మం మరియొకటి లేదనుట నిశ్చయం.

**భుంజ్యాద్భుక్తే ప్రియే పత్యౌ పాతివ్రత్య పరాయణా ।**
**తిష్ఠేత్తస్మించ్ఛివే నారీ సర్వథా సతి తిష్ఠతి ॥16॥**

ఓ పార్వతీ! పాతివ్రత్య ధర్మనిష్ఠగల స్త్రీ భర్త భుజించిన పిదప భుజించాలి. భర్త నిలబడి ఉన్నంత సమయం పతివ్రత నిలబడియే ఉండాలి.

**స్వప్యాత్స్వపితి సా నిత్యం బుధ్యేత్తు ప్రథమం సుధీః ।**
**సర్వదా తద్ధితం కుర్యా దకైతవగతిః ప్రియా ॥17॥**

సద్బుద్ధిగల స్త్రీ ప్రతినిత్యము భర్త నిద్రించిన పిమ్మట నిద్రించి, అతనికంటె ముందు నిద్ర లేవాలి. సర్వవిధాలుగా భర్తకు హితాన్నిచేస్తు అతని ప్రేమను పొందాలి.

**అనలంకృతమాత్మానం దర్శయేన్న క్వచిచ్ఛివే ।**
**కార్యార్థం ప్రోషితే తస్మిన్ భవేన్మండనవర్జితా ॥18॥**

ఓ పార్వతీ! భర్త ఎదుట అలంకారాలు లేకుండగా కనబడరాదు. భర్త కార్యార్థియై పొరుగూరు వెళ్ళిన సమయంలో అలంకారాలు ధరించరాదు.

**పత్యుర్నామ న గృహ్ణీయాత్ కదాచన పతివ్రతా ।**
**ఆకృష్టాపి న చా క్రోశేత్ప్రసీదే త్తాడితాపి చ ।**
**హన్యతామితి చ బ్రూయాత్స్వామిన్నితి కృపాం కురు ॥19॥**

పతివ్రత ఏసమయంలోనైనను భర్తపేరు నుచ్చరింపరాదు. భర్త తిట్టినను, కొట్టినను తిరిగి తిరిగి తిట్టకుండగ, కొట్టకుండగ ప్రసన్నురాలై ఉండాలి.

**ఆహూతా గృహకార్యాణి త్యక్త్వా గచ్ఛేత్తదంతికమ్ ।**
**సత్వరం సాంజలిః ప్రీత్యా సుప్రణమ్య వదేదితి ॥20॥**

భర్త పిలిచినచో ఆమె వెంటనే ఇంటిపనులను విడనాడి, ప్రేమతో అతని వద్దకువెళ్ళి, చేతులు జోడించి, నమస్కరించి ఇట్లు పలకాలి.

**కిమర్థం వ్యాహృతా నాథ సప్రసాదో విధీయతామ్ ।**
**తదాదిష్టా చరేత్కర్మ సుప్రసన్నేన చేతసా ॥21॥**

"నాథా! ఏలపిలిచారు? పనిచెప్పి అనుగ్రహించండి!" అని పలికి, ఆయన ఆదేశించిన పనిని ప్రసన్న మనస్సుతో చేయాలి.

**చిరం తిష్ఠేన్న న చ ద్వారే గచ్ఛేన్నైవ పరాలయే ।**
**ఆదాయ తత్త్వం యత్కించిత్కస్మై చిన్నార్పయేత్క్వచిత్ ॥22॥**

ద్వారం వద్ద చిరకాలం నిలబడరాదు. ఇతరుల గృహాలకు పోరాదు. భర్త హృదయ భావననెరిగి ప్రవర్తించాలి. దేనినిపడితే దానిని, ఎక్కడపడితే అక్కడ, ఎవరికి పడితే వారికి ఈయరాదు.

**పూజోపకరణం సర్వమనుక్తా సాధయేత్స్వయమ్ ।**
**ప్రతీక్షమాణావసరం యథాకాలోచితం హితమ్ ॥23॥**

పూజా సామగ్రిని భర్త చెప్పకుండగానే సర్వం స్వయంగా సంపాదించాలి. హితం చేయడానికి ఎదురుచూస్తు, కాలోచితంగా హితాన్ని ఆచరించాలి.

**న గచ్ఛేత్తీర్థయాత్రాం వై పత్యాజ్ఞాం న వినా క్వచిత్ ।**
**దూరతో వర్జయేత్సా హి సమాజోత్సవదర్శనమ్ ॥24॥**

భర్త అనుమతి లేనిదే ఏతీర్థ యాత్రలకు వెళ్లరాదు. పతివ్రత సమాజోత్సవాలకు దూరంగా ఉండాలి.

**తీర్థార్థినీ తు యా నారీ పతిపాదోదకం పిబేత్ ।**
**తస్మిన్సర్వాణి తీర్థాని క్షేత్రాణి చ న సంశయః ॥25॥**

తీర్థాలను సేవించగోరు స్త్రీ భర్త పాదోదకాన్ని త్రాగాలి. సర్వక్షేత్రాలు, తీర్థాలు, అందులోనే ఉన్నాయనడంలో సందేహంలేదు.

**భుంజ్యాత్సా భర్తురుచ్ఛిష్టమిష్టమన్నాదికం చ యత్ ।**
**మహాప్రసాద ఇత్యుక్త్వా పతిదత్తం పతివ్రతా ॥26॥**

భర్త భుజించిన తరువాత మిగిలిన మృష్టాన్నాన్ని, ఇతర భోజ్యాలను, భర్త మహాప్రసాదమనే భావనతో స్వీకరించి, భుజించాలి.

**అవిభజ్య న చాశ్నీయాద్దేవపిత్రతిథిష్వపి ।**
**పరిచారకవర్గేషు గోషు భిక్షు కులేషు చ ॥27॥**

దేవతలకు, అతిథులకు, పితృదేవతలకు, పరిచారకులకు, గోవులకు, భిక్షుకులకు పెట్టకుండగా పతివ్రత తినరాదు.

**సంయతోపస్కరా దక్షా హృష్టా వ్యయపరాఙ్ముఖీ ।**
**భవేత్సా సర్వదా దేవీ పతివ్రత పరాయణా ॥28॥**

పతివ్రతా ధర్మంలో నిష్ఠ కలిగినచో గృహవస్తువులను, పొందికగా, భద్రంగా ఉంచుకోవాలి. ఇంటిని పొదుపుగా నిర్వహించాలి. ఆమె సర్వదా ఆనందంగానుండి, దుర్వ్యయాన్ని విసర్జించాలి.

**కుర్యాత్పత్యననుజ్ఞాతా నోపవాసవ్రతాదికమ్ ।**
**అన్యథా తత్ఫలం నాస్తి పరత్ర నరకం వ్రజేత్ ॥29॥**

భర్త అనుజ్ఞ లేనిచో, ఉపవాసాలు, వ్రతాదికాలు చేయరాదు. అట్లు చేసినచో ఆ ఫలం లభింపకపోవుటయేగాక, నరకం ప్రాప్తిస్తుంది.

**సుఖపూర్వం సుఖాసీనం రమమాణం యదృచ్ఛయా ।**
**ఆంతరేష్వపి కార్యేషు పతిం నోత్థాపయేత్క్వచిత్ ॥30॥**

సుఖంగా భర్త కూర్చొని యుండగాగాని, స్వేచ్ఛగా భర్త క్రీడిస్తున్నప్పుడుగాని, ఆటంకాన్ని కలిగించరాదు. భర్త నిద్రిస్తున్న సమయంలో అవశ్యకార్యమున్నప్పటికి నిద్ర లేపరాదు.

**క్లీబం వా దురవస్థం వా వ్యాధితం వృద్ధమేవ చ ।**
**సుఖితం దుఃఖితం వాపి పతిమేకం న లంఘయేత్ ॥31॥**

భర్త నపుంసకుడైనప్పటికి, దురవస్థలోనున్నను, వ్యాధిగ్రస్తుడైనను, వృద్ధుడైనను, సుఖం కలవాడైనను, దుఃఖం కలవాడైనను పతివ్రత ఉల్లంఘించరాదు.

**స్త్రీధర్మిణీ త్రిరాత్రం చ స్వముఖం నైవ దర్శయేత్ ।**
**స్వవాక్యం శ్రావయేన్నాపి యావత్స్నానాన్న శుద్ధ్యతి ॥32॥**

రజస్వలా సమయంలో భర్తకు దూరంగా ఉండాలి. స్నానమయ్యేవరకు కబుర్లాడరాదు. తనమాట వినబడకుండునట్లు ప్రవర్తించాలి.

**సుస్నాతా భర్తృవదనమీక్షేతాన్యస్య న క్వచిత్ ।**
**అథవా మనసి ధ్యాత్వా పతిం భానుం విలోకయేత్ ॥33॥**

స్నానం చేసిన పిదప భర్తముఖాన్నే చూడాలి. ఇతరుల ముఖాన్ని చూడరాదు. భర్త దగ్గర లేనిచో భర్తను మనస్సులో ధ్యానించి, సూర్యుని దర్శించాలి.

**హరిద్రా కుంకుమం చైవ సిందూరం కజ్జలాదికమ్ ।**
**కూర్పాసకం చ తాంబూలం మాంగల్యాభరణాదికమ్ ॥34॥**

**కేశసంస్కారకబరీకరకర్ణాదిభూషణమ్ ।**
**భర్తురాయుష్యమిచ్ఛంతీ దూరయేన్న పతివ్రతా ॥35॥**

భర్త ఆయుష్షుకోరు పతివ్రత పసుపు, కుంకుమ, సిందూరం, కాటుక, తాంబూలం, మంగళ సూత్రం, ఆభరణాలు, కేశసంస్కారం, కేశాభరణాలు, చేతులకు, చెవులకు ఆభరణాలు, ఇటువంటి ఇతర ఆభరణాలు విడనాడరాదు.

**న రజక్యా న బంధక్యా తథా శ్రవణయా న చ ।**
**న చ దుర్భగయా క్వాపి సఖిత్వం కారయేత్క్వచిత్ ॥36॥**

చాకలితోను, కులటతోను, సన్యాసినితోను, భాగ్యహీనురాలితోను, ఎన్నడు ఎక్కడా స్నేహం చేయరాదు.

**పతివిద్వేషిణీం నారీం న సా సంభాషయే త్క్వచిత్ ।**
**నైకాకినీం క్వచిత్తిష్ఠేన్నగ్నా స్నాయాన్న చ క్వచిత్ ॥37॥**

భర్తను ద్వేషించే స్త్రీతో పతివ్రత ఎన్నడు మాట్లాడరాదు. ఎక్కడనైనా ఒంటరిగా నుండరాదు. నగ్నంగా ఎప్పుడూ స్నానం చేయరాదు.

**నోలూఖలే న ముసలే న వర్ధన్యాం దృషద్యపి ।**
**న యంత్రకే నదేహల్యాం సతీ చ ప్రవసేత్క్వచిత్ ॥38॥**

పతివ్రత రోటిపైన, రోకలిపైన, చీపురుకట్టపైన, రాతిపైన, తిరగలిపైన, గడపపైన, ఎన్నడూ కూర్చుండరాదు.

**వినా వ్యవాయసమయం ప్రాగల్భ్యం నాచరేత్ క్వచిత్ ।**

**యత్ర యత్ర రుచిర్భర్తుస్తత్ర ప్రేమవతీ భవేత్ ॥39॥**

సంభోగ సమయంలోతక్క ఇతరత్ర ప్రాగల్భ్యం ప్రదర్శించరాదు. భర్తకు దేనియందభిరుచి కలదో దానియందామె ప్రేమ కలిగి యుండాలి.

**హృష్టా హృష్టే విషణ్ణా స్యాద్విషణ్ణాస్యే ప్రియే ప్రియా ।**
**పతివ్రతా భవేద్దేవీ సదా పతి హితైషిణీ ॥40॥**

భర్త ఆనందంగా ఉంటే భార్యకూడా ఆనందించాలి. భర్త విషాదాన్ని పొందితే ప్రియురాలైన భార్యకూడా విషాదాన్ని పొందాలి. పతివ్రత సర్వకాలాలలోను భర్త హితాన్నే కోరాలి.

**ఏకరూపా భవేత్పుణ్యా సంపత్సు చ విపత్సు చ ।**
**వికృతిం స్వాత్మనః క్వాపి న కుర్యాద్ధైర్యధారిణీ ॥41॥**

సందప కలిగినప్పుడు, ఆపద వచ్చినప్పుడుకూడా భార్య ఏకరూపగా పుణ్యభావం కలిగియుండాలి. ఆమె ధైర్యాన్ని కలిగియుండి, ఎట్టి వికారానికి తావీయరాదు.

**సర్పిర్లవణతైలాదిక్షయేపిఽ చ పతివ్రతా ।**
**పతిం నాస్తీతి న బ్రూయాదాయాసేషు న యోజయేత్ ॥42॥**

పోపుసామగ్రి, ఉప్పు, నూనె, మున్నగునవి లేకపోయినను పతివ్రత భర్తతో "లేదు" అనిచెప్పరాదు. భర్తకు ఆయాసాన్ని కలిగించరాదు.

**విధేర్విష్ణోర్హరాద్వాపి పతిరేకోఽధికో మతః ।**
**పతివ్రతా యా దేవేశి స్వపతి శ్శివ ఏవ చ ॥43॥**

భర్త విష్ణువుకంటె, బ్రహ్మకంటె, శివునికంటె, గొప్పవాడని పెద్దలు చెబుతారు. ఓ దేవేశీ! పతివ్రతకు తన భర్త శివుడే అవుతాడు.

**వ్రతోపవాసనియమం పతిముల్లంఘ్య యా చరేత్ ।**
**ఆయుష్యం హరతే భర్తుర్మృతా నిరయమృచ్ఛతి ॥44॥**

భర్తను కాదని వ్రతాలు, ఉపవాసాలు, నియమాలు అనుష్ఠించు స్త్రీ భర్త ఆయుష్షను క్షీణింప జేయుటయేగాక, మరణించిన పిదప నరకాన్ని పొందుతుంది.

**ఉక్తా ప్రత్యుత్తరం దద్యాద్యా నారీ క్రోధతత్పరా ।**
**సరమా జాయతే గ్రామే శృగలీ నిర్జనే వనే ॥45॥**

భర్త చెప్పిన మాటకు కోపంతో మండిపడుతూ బదులు పలికే స్త్రీ గ్రామంలో కుక్కగాగాని, నిర్జనారణ్యంలో నక్కగా గాని జన్మిస్తుంది.

**ఉచ్చాసనం న సేవేత న వ్రజే ద్దుష్టసన్నిధౌ ।**
**న చ కాతరవాక్యాని వదేన్నారీ పతిం క్వచిత్ ॥46॥**

పతివ్రత ఎత్తైన ఆసనంపై కూర్చుండరాదు. దుష్టుల సన్నిధికి పోరాదు. భర్తతో ఎప్పుడైనను పిరికి దనాన్ని, భయాన్ని కలిగించే మాటలు చెప్పరాదు.

**అపవాదం న చ బ్రూయాత్కలహం దూరతస్త్యజేత్ ।**
**గురూణాం సన్నిధౌ క్వాపి నోచ్చైర్బ్రూయాన్న వై హసేత్ ॥47॥**

కొండెములు చెప్పరాదు. కలహాలకు దూరంగా ఉండాలి. పెద్దల సన్నిధిలో బిగ్గరగా మాట్లాడరాదు. నవ్వరాదు.

**బాహ్యాదాయాన్తమాలోక్య త్వరితాన్నజలాశనైః ।**
**తాంబూలైర్వసనైశ్చాపి పాదసంవాహనాదిభిః ॥48॥**

**తథైవ చాటువచనైః స్వేదసన్నోదనైః పరైః ।**
**యా ప్రియం ప్రీణయేత్ప్రీతా త్రిలోకీ ప్రీణతా తయా ॥49॥**

బయటనుండి వచ్చిన భర్తనుగాంచి, వెంటనే నీరిచ్చి, వస్త్రాలిచ్చి, భోజనం పెట్టి, తాంబూలమిచ్చి, పాదాలొత్తి, సేవించాలి. అట్లే ప్రేమతోనిండిన మాటలు చెప్పి, శ్రమ తొలగింపజేసి, ప్రీతిని కలిగించు స్త్రీ ముల్లోకాలను సంతోషబెట్టిన పుణ్యం పొందుతుంది.

**మితం దదాతి జనకో మితం భ్రాతా మితం సుతః ।**
**అమితస్య హి దాతారం భర్తారం పూజయేత్సదా ॥50॥**

తండ్రిగాని, సోదరుడుగాని, కుమారుడుగాని, స్త్రీకి పరిమితంగానే ఇస్తాడు. కాని సర్వస్వాన్ని ఇచ్చే భర్తను స్త్రీ సదా పూజించాలి.

**భర్తా దేవో గురుర్భర్తా ధర్మతీర్థవ్రతాని చ ।**
**తస్మాత్సర్వం పరిత్యజ్య పతిమేకం సమర్చయేత్ ॥51॥**

దైవం, గురువు, ధర్మం, తీర్థం, వ్రతం, అన్నియు భర్తయే. కావున అన్నిటిని విడిచి ఒక్క భర్తను మాత్రమే సేవించాలి.

**యా భర్తారం పరిత్యజ్య రహశ్చరతి దుర్మతిః ।**
**ఉలూకీ జాయతే క్రూరా వృక్షకోటరశాయినీ ॥52॥**

భర్తను విడిచి రహస్యంగా తిరిగే దుష్టస్త్రీ చెట్టు తొర్రలో నివసించే క్రూరమైన గుడ్లగూబగా జన్మిస్తుంది.

**తాడితా తాడితుం చేచ్ఛేత్సా వ్యాఘ్రీ వృషదంశికా ।**
**కటాక్షయతి యాన్యం వై కేకరాక్షీ తు సా భవేత్ ॥53॥**

భర్తను కొట్టబోవు స్త్రీ పెద్దపులి, లేదా పిల్లిగా పుడుతుంది. ఇతర పురుషులను ఓరచూపుతో చూసే స్త్రీ మెల్లకన్ను కలదౌతుంది.

**యా భర్తారం పరిత్యజ్య మిష్టమశ్నాతి కేవలమ్ ।**
**గ్రామే వా సూకరీ భూయాద్వల్గుర్వాపి స్వవిడ్భుజా ॥54॥**

ఏ స్త్రీ భర్తను విడిచి తానొక్కతియే మృష్టాన్నాన్ని భుజిస్తుందో ఆమె గ్రామ సూకరంగాగాని, మేకగాగాని జన్మిస్తుంది.

**యాతు కృత్య ప్రియం బ్రూయాన్మూకా సా జాయతే ఖలు ।**
**యా సపత్నీ సదేర్ష్యేత దుర్భగా సా పునః పునః ॥55॥**

ఏ స్త్రీ భర్తను నిరాకరించి మాట్లాడుతుందో ఆమె మూగియై జన్మిస్తుంది. ఎల్లవేళలా సవతితో కొట్లాడే స్త్రీ భాగ్యహీనురాలిగా అనేక జన్మలు పొందుతుంది.

**దృష్టిం విలుప్య భర్తుర్యా కంచిదన్యం సమీక్షతే ।**
**కాణా చ విముఖీ చాపి కురూపాపి చ జాయతే ॥56॥**

భర్తను చూడడంమాని, ఇతర పురుషుని చూచే స్త్రీ కురూపి, గ్రుడ్డి, వికృతమైన ముఖంకలది అవుతుంది.

**జీవహీనో యథా దేహః క్షణాదశుచితాం వ్రజేత్ ।**
**భర్తృహీనా తథా యోషిత్సుస్నాతాప్యశుచిస్సదా ॥57॥**

ప్రాణంలేని దేహం అశుచి కనుక మానవులు దానిని వెంటనే తగులపెడతారు. అదేతీరున భర్తను విడిచిన స్త్రీ చక్కగా స్నానంచేసినా అశుచియే అవుతుంది.

**సా ధన్యా జననీ లోకే స ధన్యో జనకః పితా ।**
**ధన్యస్స చ పతిర్యస్య గృహే దేవీ పతివ్రతా ॥58॥**

ఏ గృహంలో పతివ్రత ఉంటుందో ఆమె తల్లిదండ్రులు ధన్యులు, ఆమె భర్త ధన్యుడు.

**పితృవంశ్యాః మాతృవంశ్యాః పతిర్వంశ్యాస్త్రయస్త్రయః ।**
**పతివ్రతాయాః పుణ్యేన స్వర్గే సౌఖ్యాని భుంజతే ॥59॥**

పతివ్రతయొక్క తండ్రి వంశంలోని ముగ్గురు, మాతృవంశంలోని ముగ్గురు, భర్తవంశంలోని ముగ్గురు ఆమె పుణ్యంచే స్వర్గ సౌఖ్యాలననుభవిస్తారు.

**శీలభంగేన దుర్వృత్తాః పాతయంతి కులత్రయమ్ ।**
**పితుర్మాతుస్తథా పత్యురిహాముత్రాపి దుఃఖితాః ॥60॥**

శీలాన్ని వీడి, చెడ్డదారులలో తిరిగే స్త్రీలయొక్క పితృ, మాతృ భర్తృ వంశాలవారు పతితులౌతారు. అట్టి స్త్రీలు ఇహ పర లోకాలలో దుఃఖాన్ని పొందుతారు.

**పతివ్రతాయాశ్చరణో యత్ర యత్ర స్పృశేద్భువమ్ ।**
**తత్ర తత్ర భవేత్సా హి పాపహంత్రీ సుపావనీ ॥61॥**

పతివ్రత యొక్క పాదం ఏయే స్థానాలలో భూమిని స్పృశిస్తుందో ఆయా స్థానాలు పాపాలు తొలగి, పావనమౌతాయి.

**విభుః పతివ్రతాస్పర్శం కురుతే భానుమానపి ।**
**సోమో గంధవహశ్చాపి స్వపావిత్ర్యాయ నాన్యథా ॥62॥**

సూర్యభగవానుడు, చంద్రుడు, వాయువు కూడా తమ పవిత్రతకొరకు పతివ్రతను స్పృశిస్తారనడంలో సందేహం లేదు.

**ఆపః పతివ్రతా స్పర్శమభిలష్యంతి సర్వదా ।**
**అద్య జాడ్యవినాశో నో జాతస్త్వద్యాన్యపావనాః ॥63॥**

జలాలు సర్వదా పతివ్రతల స్పర్శను కోరతాయి. ఇటువంటి స్పర్శపొంది, "ఈనాడు మనజడత్వం తొలగి, ఇతరులను పవిత్రులనుచేసే సామర్థ్యం లభించింది" అని జలాలు భావిస్తాయి.

**భార్యామూలం గృహస్థాస్య భార్యా మూలం సుఖస్య చ ।**
**భార్యా ధర్మఫలావాప్త్యై భార్యా సంతానవృద్ధయే ॥64॥**

గృహస్థ ధర్మానికి, గృహస్థుని సుఖానికి, ధర్మఫలం పొందడానికి, సంతానాభివృద్ధికి భార్యయే మూలం.

**గృహే గృహే న కిం నార్యో రూపలావణ్యగర్వితాః ।**
**పరం విశ్వేశభక్త్యైవ లభ్యతే స్త్రీ పతివ్రతా ॥65॥**

రూప లావణ్యాలచే, గర్వించే స్త్రీలు అన్ని గృహాలలోను లేరా? ఏమి? కాని విశ్వేశ్వరుని యందలి భక్తిచే మాత్రమే పతివ్రతయైన స్త్రీ లభిస్తుంది.

**పరలోక స్త్వయం లోకో జీయతే భార్యయా ద్వయమ్ ।**
**దేవపిత్రతిథీజ్యాది నాభార్యః కర్మ చార్హతి ॥66॥**

మానవుడు భార్య సహాయంతో ఇహ పరలోకాలు రెండిటిని జయిస్తాడు. భార్యలేనివాడు దేవయజ్ఞ, పితృయజ్ఞ, అతిథియజ్ఞాది కర్మలకు అర్హుడు కాడు.

**గృహస్థస్స హి విజ్ఞేయో యస్య గేహే పతివ్రతా ।**
**గ్రస్యతేఽ న్యాన్ప్రతిదినం రాక్షస్యా జరయా యథా ॥67॥**

ఎవని గృహంలో పతివ్రత ఉంటుందో వాడే గృహస్థుడు అని తెలుసుకోవాలి. పతివ్రతగాని స్త్రీ రాక్షసివలె, వార్ధక్యంవలె పురుషుని ప్రతిదినం భక్షిస్తుంది.

**యథా గంగావగాహేన శరీరం పావనం భవేత్ ।**
**తథా పతివ్రతాం దృష్ట్వా సకలం పావనం భవేత్ ॥68॥**

గంగా స్నానంచే శరీరం పవిత్రమౌతుంది. అట్లే పతివ్రతను చూచినంత మాత్రంచే సర్వం పవిత్రమౌతుంది.

**న గంగాయా తయా భేదో యా నారీ పతిదేవతా ।**
**ఉమాశివసమౌ సాక్షాత్తస్మాత్తౌ పూజయేద్బుధః ॥69॥**

పతివ్రతకు, గంగకు తేడాలేదు. పతివ్రత, ఆమె భర్త సాక్షాత్తుగా పార్వతీ పరమేశ్వరులతో సమానమైనవారు గనుక విద్వాంసులు వారిని పూజించాలి.

**తారః పతిశ్శ్రుతిర్నారీ క్షమా సా స స్వయం తపః ।**
**ఫలం పతిః సత్క్రియా సా ధన్యౌ తౌ దంపతీ శివే ॥70॥**

భర్త ఓంకారం. భార్య వేదం. భర్త తపస్సు, భార్య క్షమ. భార్య పుణ్యకర్మ. భర్త తత్కర్మఫలం. ఓ పార్వతీ! అటువంటి దంపతులు ధన్యులు.

**ఏవం పతివ్రతా ధర్మో వర్ణితస్తే గిరీంద్రజే ।**
**తద్భేదాం శృణు సుప్రీత్యా సావధానతయాఽద్య మే ॥71॥**

ఓ పార్వతీ! నీకీ విధంగా పతివ్రతా ధర్మాన్ని వర్ణించి చెప్పాను. ఇప్పుడు నేను పతివ్రతలలోని భేదాలను వివరిస్తాను. ప్రీతితో సావధానంగా వినుము.

**చతుర్విధాస్తాః కథితా నార్యో దేవి పతివ్రతాః ।**
**ఉత్తమాదివిభేదేన స్మరతాం పాపహారికాః ॥72॥**

ఓ దేవీ! స్మరణ మాత్రంచేతనే పాపాలు పోగొట్టే పతివ్రతలు ఉత్తమాది భేదాలచే నాల్గు విధాలని పెద్దలు చెబుతారు.

**ఉత్తమా మధ్యమా చైవ నికృష్టాతినికృష్టికా ।**
**బ్రువే తాసాం లక్షణాని సావధానతయా శృణు ॥73॥**

ఉత్తమ, మధ్యమ, నికృష్ట, అతినికృష్ట అనే నాలుగు విధాల పతివ్రతల లక్షణాలు చెబుతాను. సావధానంగా వినుము.

**స్వప్నేఽపి యన్మనో నిత్యం స్వపతిం పశ్యతి ధ్రువమ్ ।**
**నాన్యం పరపతిం భద్రే ఉత్తమా సా ప్రకీర్తితా ॥74॥**

ఓ మంగళ స్వరూపురాలా! ఏ స్త్రీయొక్క మనస్సు స్వప్నంలోనైనను తనభర్తనే నిశ్చితంగా చూస్తుందో, పరపురుషుని చూడదో ఆమె "ఉత్తమ" అని చెప్పబడింది.

**యా పితృభ్రాతృసుతవత్ పరం పశ్యతి సద్ధియా ।**
**మధ్యమా సా హి కథితా శైలజే వై పతివ్రతా ॥75॥**

ఓ పార్వతీ! ఏ స్త్రీ పరపురుషుని సద్బుద్ధితో తండ్రివలె, సోదరునివలె, కుమారునివలె దర్శిస్తుందో ఆమె **"మధ్యమ"** పతివ్రత అనబడుతుంది.

**బుద్ధ్వా స్వధర్మం మనసా వ్యభిచారం కరోతి న ।**
**నికృష్టా కథితా సా హి సుచరిత్రా చ పార్వతి ॥76॥**

ఓ పార్వతీ! స్వధర్మాన్నెరిగి మనస్సునందైనను వ్యభిచరించని సుశీలయైన స్త్రీ **"నికృష్ట పతివ్రత"** అనబడుతుంది.

**పత్యుః కులస్య చ భయాద్వ్యభిచారం కరోతి న ।**
**పతివ్రతాఽధమా సా హి కథితా పూర్వసూరిభిః ॥77॥**

భర్త ఇంటిలోని వారికి భయపడి వ్యభిచరించని స్త్రీ "అధమ పతివ్రత" యగునని ప్రాచీన విద్వాంసులు చెబుతారు.

**చతుర్విధా అపి శివే పాపహంత్ర్యః పతివ్రతాః ।**
**పావనాస్సర్వలోకానామిహాముత్రాపి హర్షితాః ॥78॥**

ఓ పార్వతీ! ఈనాలుగు విధాలైన పతివ్రతలుకూడా పాపాలు పోగొట్టి, మానవులందరిని పవిత్రులనుజేసి, ఇహపర సుఖాలనిస్తారు.

**పాతివ్రత్యప్రభావేణాత్రిస్త్రియా త్రిసురార్థనాత్ ।**
**జీవితో విప్ర ఏకో హి మృతో వారాహశాపతః ॥79॥**

అత్రి భార్యయైన అనసూయ పాతివ్రత్య ప్రభావంచే త్రిమూర్తులనర్థించి, వారాహ శాపంచే మరణించిన ఒకానొక బ్రాహ్మణుని జీవింపజేసింది.

**ఏవం జ్ఞాత్వా శివే నిత్యం కర్తవ్యం పతిసేవనమ్ ।**
**త్వయా శైలాత్మజే ప్రీత్యా సర్వకామప్రదం సదా ॥80॥**

ఓ పార్వతీ! నీవీ సత్యమెరిగి, సర్వదా సర్వకామనలనీడేర్చు పతిసేవను ప్రీతితో ప్రతిదినం చేయాలి.

**జగదంబా మహేశీ త్వం శివస్సాక్షాత్పతిస్తవ ।**
**తవ స్మరణతో నార్యో భవంతి హి పతివ్రతాః ॥81॥**

నీవు జగన్మాతవైన మహేశ్వరివి. ఆ శివుడే సాక్షాత్తుగా నీ భర్త. నిన్ను స్మరించే స్త్రీలు పతివ్రతలౌతారు.

**త్వదగ్రే కథనేనానేన కిం దేవి ప్రయోజనమ్ ।**
**తథాపి కథితం మేఽద్య జగదాచారతః శివే ॥82॥**

ఓ శివాదేవీ! ఈ ధర్మాలు నీకు చెప్పవలసిన అవసరంలేదు. అయినను ఈనాడు లోకాచారాన్ని అనుసరించి నీకు చెప్పాను.

**బ్రహ్మోవాచ** – బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యుక్త్వా విరరామాసౌ ద్విజస్త్రీ సుప్రణమ్య తామ్ ।**
**శివా ముదమతి ప్రాప పార్వతీ శంకరప్రియా ॥83॥**

ఆ బ్రాహ్మణస్త్రీ పార్వతితో ఇట్లు పలికి విరమించింది. శంకరునకు ప్రియురాలు, పర్వతునకు కుమార్తెయునైన శివాదేవి ఆమెకు ప్రణమిల్లి మహానందాన్ని పొందింది.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే పతివ్రతా ధర్మవర్ణనం నామ చతుః పంచాశత్తమోఽధ్యాయః ॥54॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో పతివ్రతల ధర్మములవర్ణనం అనే యాభై నాలుగవ అధ్యాయం సమాప్తం.

## పంచ పంచాశత్తమోఽధ్యాయః - యాభై ఐదవ అధ్యాయం

## శివకైలాసగమనవర్ణనమ్ - శివుడు కైలాసానికి వెళ్లుటనువర్ణించుట

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**అథ సా బ్రాహ్మణీ దేవ్యై శిక్షయిత్వా వ్రతం చ తత్ ।**
**ప్రోవాచ మేనా మామంత్ర్య యాత్రా మస్యాశ్చ కారయ ॥1॥**

ఆ బ్రాహ్మణ స్త్రీ పార్వతీదేవికి ఆ వ్రతాన్ని నేర్పి, మేనాదేవిని పిలిచి, “ఈమెను యాత్రకు పంపుము” అని చెప్పింది.

**తథాస్త్వితి చ సంప్రోచ్య ప్రేమవశ్యా బభూవ సా ।**
**ధృతిం ధృత్వాహూయ కాళీం విశ్లేషవిరహాకులా ॥2॥**

ఆమె అట్లేనని పలికి ప్రేమకు వశురాలై, వియోగ దుఃఖంచే పీడితురాలైనప్పటికి, ధైర్యాన్ని వహించి, కాళిని పిలిచింది.

**అత్యుచ్చై రోదనం చక్రే సంశ్లిష్య చ పునః పునః ।**
**పార్వత్యపి రురోదోచ్చైరుచ్చరంతీ కృపావచః ॥3॥**

ఆమె పార్వతిని పలుమార్లు కౌగిలించుకొని, ఏడ్చింది. పార్వతికూడ కృపావచనాలు పలుకుతు బిగ్గరగా ఏడ్చింది.

**శైలప్రియా శివా చాపి మూర్ఛామాప శుచార్దితా ।**
**మూర్ఛాం ప్రాపుర్దేవపత్న్యః పార్వత్యా రోదనేన చ ॥4॥**

హిమవంతుని పత్ని మరియు పార్వతి దుఃఖ పీడితులై మూర్ఛను పొందారు. పార్వతి ఏడ్వడంచేత దేవపత్నులుకూడా మూర్ఛపొందారు.

**సర్వాశ్చ రురుదుర్నార్యస్సర్వమాసీదచేతనమ్ ।**
**స్వయం రురోద యోగీశో గచ్ఛన్కోఽన్యపరః ప్రభుః ॥5॥**

స్త్రీలందరు ఏడుస్తున్నారు. సర్వం జడమయ్యిందా? అన్నట్లుంది. యోగీశ్వరుడైన శివుడే వెళ్లబోతూ స్వయంగా రోదించాడు. ఆ పరమ ప్రభువే రోదించగా ఇతరుల మాట చెప్పనేల?

**ఏతస్మిన్నంతరే శీఘ్రమాజగామ హిమాలయః ।**
**ససర్వతనయస్తత్ర సచివైశ్చ ద్విజైః పరైః ॥6॥**

ఇంతలో అచ్చటకు హిమవంతుడు కుమారులందరితో, మంత్రులతో, బ్రాహ్మణోత్తములతోగూడి, వెంటనే విచ్చేశాడు.

**స్వయం రురోద మోహేన వత్సాం కృత్వా స్వవక్షసి ।**
**క్వ యాసీత్యేవ ముచ్చార్య శూన్యం కృత్వా ముహుర్ముహుః ॥7॥**

ఆయన కుమార్తెను గుండెలకు హత్తుకుని, "నీవు సర్వం శూన్యంచేసి ఎక్కడకు వెళుతున్నావు?" అని పలికి మోహంచే అనేక పర్యాయాలు రోదించాడు.

**తతః పురోహితో విప్రైరధ్యాత్మవిద్యయా సుఖమ్ ।**
**సర్వాన్ప్రబోధయామాస కృపయా జ్ఞానవత్తరః ॥8॥**

అంతట జ్ఞాని శ్రేష్ఠుడైన పురోహితుడు బ్రాహ్మణులతోగూడి, సుఖకరమైన ఆధ్యాత్మవిద్యను వారందరికి దయతో బోధించాడు.

**ననామ పార్వతీ భక్త్యా మాతరం పితరం గురుమ్ ।**
**మహామాయా భవాచారాద్రురోదో చ్చైర్ముహుర్ముహుః ॥9॥**

మహామాయయగు పార్వతి భక్తితో తల్లికి, తండ్రికి, గురువునకు నమస్కరించి, లోకాచారాన్ని అనుసరించి, పరిపరి విధాల బిగ్గరగా రోదించింది.

**పార్వత్యా రోదనేనైవ రురుదుస్సర్వయోషితః ।**
**నితరాం జననీ మేనా యామయో భ్రాతరస్తథా ॥10॥**

పార్వతి రోదించడంతో స్త్రీలందరూ రోదించ నారంభించారు. తల్లియైన మేనాదేవి, చెల్లెళ్ళు, తండ్రి, సోదరులు ప్రేమతో రోదించారు.

**పునః పునః శివా మాతా యామయోఽన్యాశ్చ యోషితః ।**
**భ్రాతరో జనకః ప్రేమ్ణా రురుదుర్బద్ధసౌహృదాః ॥11॥**

పార్వతి యందు దృఢమైన ప్రేమగల ఆమె తల్లి, సోదరీమణులు, ఇతర స్త్రీలు, సోదరులు, తండ్రి, ప్రేమతో రోదించారు.

**తదా విప్రాః సమాగత్య బోధయామాసురాదరాత్ ।**
**లగ్నన్నివేదయామాసు ర్యాత్రాయాస్సుఖదం పరమ్ ॥12॥**

అంతట బ్రాహ్మణులు వచ్చి, ఆదరంతో నచ్చజెప్పి, సుఖకరము, శ్రేష్ఠమునగు యాత్రాలగ్నం సమీపించిందని విన్నవించారు.

**తతో హిమాలయో మేనాం ధృత్వా ధైర్యం వివేకతః ।**
**శిబికామానయామాస శివారోహణహేతవే ॥13॥**

అప్పుడు వివేకియైన హిమవంతుడు మేనాదేవికి ధైర్యంచెప్పి, పార్వతి అధిరోహించడానికి పల్లకిని రప్పించాడు.

**శివామారోహయామాసుస్తత్ర విప్రాంగనాశ్చ తామ్ ।**
**ఆశిషం ప్రదదుస్సర్వాః పితా మాతా ద్విజా స్తథా ॥14॥**

అచ్చటనున్న బ్రాహ్మణ స్త్రీలు పార్వతిని పల్లకిలో కూర్చుండబెట్టారు. అప్పుడు తల్లిదండ్రులు, స్త్రీలందరు, బ్రాహ్మణులు ఆశీర్వదించారు.

**మహారాజ్ఞ్యుపచారాంశ్చ దదౌ మేనా గిరిస్తథా ।**
**నానాద్రవ్యసమూహం చ పరేషాం దుర్లభం శుభమ్ ॥15॥**

మేనా హిమవంతులు మహారాణికి తగిన ఉపచారాలను, ఇతరులకు దుర్లభము, శుభకరమునగు అనేక ద్రవ్యాలను ఆమెకిచ్చారు.

**శివా నత్వా గురూన్సర్వాన్ జనకం జననీం తథా ।**
**ద్విజాన్పురోహితం యామీ స్త్రీస్తథాన్యా యయౌ మునే ॥16॥**

ఓ మునీ! పార్వతి గురువులకు, తల్లిదండ్రులకు, బ్రాహ్మణులకు, పురోహితునకు, తదితర స్త్రీలకు నమస్కరించి వెళ్ళింది.

**హిమాచలోఽపి ససుతోఽగచ్ఛత్స్నేహవశీ బుధః ।**
**ప్రాప్తస్తత్ర ప్రభుర్యత్ర సామరః ప్రీతిమావహన్ ॥17॥**

వివేకియైన హిమవంతుడుకూడా ప్రేమకు వశుడై, కుమారులతోగూడి, శివుడు దేవతలతోబాటు ఉన్నచోటుకువచ్చి, వారందరికి ఆనందాన్ని కలిగించాడు.

**ప్రీత్యాభిరేభిరే సర్వే మహోత్సవ పురస్సరమ్ ।**
**ప్రభుం ప్రణేముస్తే భక్త్యా ప్రశంసంతోఽవిశన్పురీమ్ ॥18॥**

వారందరు మహోత్సాహంతో పరస్పరం కలుసుకున్నారు. అప్పుడు వారు భక్తితో శివునకు నమస్కరించి, ఆయనను ప్రశంసిస్తూ నగరానికి తిరిగివచ్చారు.

**జాతిస్మరాం స్మారయామి నిత్యం స్మరసి చేద్వద ।**
**లీలయా త్వాం చ దేవేశి సదా ప్రాణప్రియా మమ ॥19॥**

"పూర్వజన్మ స్మృతిగల నీకు గుర్తుచేస్తున్నాను. నీవు నన్ను నిత్యం స్మరిస్తున్న పక్షంలో చెప్పుము. ఓ దేవదేవీ! నేను నిన్ను పొందుట ఒకలీల. నీవునాకు సర్వదా ప్రాణప్రియురాలవు".

**బ్రహ్మోవాచ** - బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య మహేశస్య స్వనాథస్యాథ పార్వతీ ।**
**శంకరస్య ప్రియా నిత్యం సస్మితోవాచ సా సతీ ॥20॥**

తన నాథుడైన మహేశ్వరుని మాటలువిని, శంకరునకు నిత్యప్రియురాలైన పార్వతి (సతీదేవి) చిరునవ్వుతో ఇట్లు పలికింది.

**పార్వత్యువాచ –** పార్వతి పలికింది.

**సర్వం స్మరామి ప్రాణేశ మౌనీ భూతో భవేతి చ ।**
**ప్రస్తావోచితమద్యాశు కార్యం కురు నమోఽస్తు తే ॥21॥**

ఓ ప్రాణనాథా! సర్వం నాకు గుర్తున్నది. ఇప్పుడు మీరు మౌనంగా నుండి సందర్భోచిత కార్యాన్ని వెంటనే చేయండి. మీకు నమస్కారము.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ చెప్పాడు.

**ఇత్యాకర్ణ్య ప్రియావాక్యం సుధాధారాశతోపమమ్ ।**
**ముముదేఽతీవ విశ్వేశో లౌకికాచారతత్పరః ॥22॥**

అమృతధారలతో సమానమైన ప్రియురాలి మాటలు విని, లోకాచారమునందు నిష్ఠగల విశ్వేశ్వరుడు మిక్కిలి సంతసించాడు.

**శివః సంభృతసంభారో నానావస్తుమనోహరమ్ ।**
**భోజయామాస దేవశ్చ నారాయణపురోగమాన్ ॥23॥**

శివుడు సామగ్రిని కూడగట్టి, అనేక పదార్థాలతో గూడిన మనోహరమైన భోజనాన్ని నారాయణుడు మున్నగు దేవతలకు ఏర్పాటు చేశాడు.

**తథాన్యాన్నిఖిలాన్ప్రీత్యా స్వవివాహసమాగతాన్ ।**
**భోజయామాస సురసమన్నం బహువిధం ప్రభుః ॥24॥**

అట్లే ఆ ప్రభుడు తన వివాహానికి వచ్చినవారందరికి రుచ్యమైన బహువిధ అన్నాలను ప్రీతితో భుజింపజేశాడు.

**తతో భుక్త్వా చ తే దేవా నానారత్నవిభూషితాః ।**
**సస్త్రీకాస్సగణాస్సర్వే ప్రణేముశ్చంద్రశేఖరమ్ ॥25॥**

అనేక రత్నాభరణాలతో ప్రకాశించే దేవతలందరు భుజించి, భార్యలతో, గణాలతో కలసి చంద్రశేఖరునకు ప్రణమిల్లారు.

**సంస్తుత్య వాగ్భిరిష్టాభిః పరిక్రమ్య ముదాన్వితాః ।**
**ప్రశంసంతో వివాహం చ స్వధామాని యయుస్తతః ॥26॥**

దేవతలు, ఇష్టమైన వాక్కులతో చక్కగా స్తుతించి, ఆనందంతో ప్రదక్షిణం చేసి, వివాహాన్ని కొనియాడుతూ తమ నివాసాలకు వెళ్ళారు.

**నారాయణం మునే మాం చ ప్రణనామ శివస్స్వయమ్ ।**
**లౌకికాచారమాశ్రిత్య యథా విష్ణుశ్చ కశ్యపమ్ ॥27॥**

ఓ మునీ! శివుడు లోకాచారాన్ననుసరించి, విష్ణువు కశ్యపునకువలె నారాయణునకు నాకు స్వయంగా ప్రణమిల్లాడు.

**మయాశ్లిష్యాశిషం దత్త్వా శివస్య పునరగ్రతః ।**
**మత్వా వై తం పరం బ్రహ్మ చక్రే చ స్తుతిరుత్తమా ॥28॥**

నేను శివుని కౌగలించుకొని, ఆశీర్వదించి, మరల ఆయన పరబ్రహ్మయని గుర్తించి, ఆయన ఎదుట ఉత్తమమైన స్తోత్రాన్ని చేశాను.

**తమామన్త్ర్య మయా విష్ణుస్సాంజలిశ్శివయోర్ముదా ।**
**ప్రశంసంస్తద్వివాహం చ జగామ స్వాలయం పరమ్ ॥29॥**

విష్ణువు నాతోకలసి, శివాజ్ఞను పొంది, పార్వతీ పరమేశ్వరుల వివాహాన్ని ప్రీతితో కొనియాడుతు తమ పరమధామానికి వెళ్ళాడు.

**శివోఽపి స్వగిరౌ తస్థౌ పార్వత్యా విహరన్ముదా ।**
**సర్వే గణాస్సుఖం ప్రాపురతీవ స్వభజఞ్ఛివౌ ॥30॥**

శివుడుకూడా పార్వతితో ఆనందంగా విహరిస్తూ, కైలాసపర్వతమందున్నాడు. గణాలందరు సుఖాన్ని పొంది, పార్వతీ పరమేశ్వరులను చక్కగా సేవించారు.

**ఇత్యేవం కథితస్తాత శివోద్వాహస్సుమంగలః ।**
**శోకఘ్నో హర్షజనక ఆయుష్యో ధనవర్ధనః ॥31॥**

కుమారా! నీకింతవరకు పరమ మంగళము, శోకాన్ని నశింపజేయునదియు, ఆనందాన్ని కలిగించునదియు, ఆయుర్దాయాన్ని ఇచ్చునదియు, ధనవర్ధనమునగు పార్వతీ కల్యాణాన్ని చెప్పియున్నాను.

**య ఇమం శ్రుణుయాన్నిత్యం శుచిస్తద్గతమానసః ।**
**శ్రావయేద్వాథ నియమాచ్ఛివలోకమవాప్నుయాత్ ॥32॥**

ఎవడైతే దీనిని నిత్యం శుచియై, దానియందు మనస్సు లగ్నంచేసి వింటాడో, లేదా నియమంతో వినిపిస్తాడో అట్టివాడు శివలోకాన్ని పొందుతాడు.

**ఇదమాఖ్యానమాఖ్యాతమద్భుతం మంగళాయనమ్ ।**
**సర్వవిఘ్నప్రశమనం సర్వవ్యాధివినాశనమ్ ॥33॥**

అద్భుతము, మంగళ నిలయము, విఘ్నప్రశమనము, సర్వవ్యాధి వినాశకమునగు ఈ వృత్తాంతాన్ని చెప్పాను.

**యశస్యం స్వర్గ్యమాయుష్యం పుత్రపౌత్రకరం పరమ్ ।**
**సర్వకామప్రదం చేహ భుక్తిదం ముక్తిదం సదా ॥34॥**

**అపమృత్యు ప్రశమనం మహాశాంతికరం శుభమ్ ।**
**సర్వ దుస్స్వప్నశమనం బుద్ధిప్రజ్ఞాదిసాధనమ్ ॥35॥**

**శివోత్సవేషు సర్వేషు పఠితవ్యం ప్రయత్నతః ।**
**శుభేప్సుభిర్జనైః ప్రీత్యా శివసంతోషకారణమ్ ॥36॥**

కీర్తిని కలిగించునదియు, స్వర్గాన్నిచ్చునదియు, ఆయుష్యమునిచ్చునదియు, పుత్రపౌత్రకరమును, ఇహలోకంలో సర్వకామప్రదమును, భుక్తిముక్తి ప్రదమును, అపమృత్యు ప్రశమనమును, మహాశాంతికరమును, శుభకరమును, సమస్త దుస్స్వప్న ప్రశమనమును, బుద్ధి ప్రజ్ఞాది సాధనమును, శివ సంతోష కారణమునగు ఈ వృత్తాంతము శుభాన్ని కోరే జనులు శివోత్సవాలన్నింటియందును, శ్రద్ధతో, ప్రీతితో పఠించాలి.

**పఠేత్ప్రతిష్ఠాకాలే తు దేవాదీనాం విశేషతః ।**
**శివస్య సర్వకార్యస్య ప్రారంభే చ సుప్రీతితః ॥37॥**

**శ్రుణుయాద్వా శుచిర్భూత్వా చరితం శివయోశ్శివమ్ ।**
**సిధ్యంతి సర్వకార్యాణి సత్యం సత్యం న సంశయః ॥38॥**

దేవాదులను, శివుని ప్రతిష్ఠించే సమయంలోను, సర్వకార్యాలనారంభించే సమయంలోను, దీనిని ప్రత్యేకించి, మిక్కిలి ప్రీతితో పఠించాలి. లేదా శుచియై పార్వతీ పరమేశ్వరుల యీ మంగళచరిత్ర వినాలి. అట్లు చేస్తే సర్వకార్యాలు సిద్ధిస్తాయి. ఇది ముమ్మాటికీ సత్యం. ఇందులో సందేహం లేదు.

**ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే పార్వతీఖండే శివ కైలాసగమనవర్ణనం నామ పంచపంచాశత్తమోఽధ్యాయః ॥55॥**

శ్రీశివమహాపురాణంలో రెండవదైన రుద్రసంహితయందు మూడవదైన పార్వతీ ఖండంలో శివ కైలాసానికి వెళ్లుటనువర్ణించుట అనే యాభై ఐదవ అధ్యాయం సమాప్తం.

**॥ శ్రీః ॥**

**॥ సమాప్తోఽయం రుద్రసంహితాయాం తృతీయే పార్వఖండే ద్వితీయః ॥**

**॥ శ్రీః ॥**

**॥ రుద్రసంహిత యందలి మూడవదైన పార్వతీఖండం సమాప్తం ॥**

# పురాణప్రశస్తి

## (అష్టాదశపురాణాలు)

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య

**వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।**
**నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥**
**నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।**
**దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥**

అతి ప్రాచీనకాలంలో గురుకులాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పదునాలుగు విధాలైన విద్యల నభ్యసించేవారు. ఆ విద్యల నిలా పేర్కొనడం జరిగింది.

**అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।**
**పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతాశ్చతుర్దశ ॥**

శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం–అనే ఆరు వేదాంగాలు, ఋగ్యజుస్సామాథర్వణము లనే నాలుగు వేదాలు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం–అనేవే పదునాల్గు విద్యలు.

**'వేదోఽఖిలో ధర్మమూలం'** అన్నట్లు వేదమంతా ధర్మమూలమైనది. వేదోక్తమైన ధర్మాలను గ్రహించడం అందరికీ సాధ్యంకాని పని. అందుచేత వేదాలను విభజించిన వేదవ్యాసుడే వేదార్థాలను సామాన్యులు గూడా గ్రహించడాని కనువుగా పురాణాలను రచించాడు. **అష్టాదశపురాణానాం కర్తా సత్యవతీసుతః** –అను ప్రమాణవచనం కూడా పదునెన్మిది పురాణాల రచయిత సత్యవతీ సుతుడైన వ్యాసుడే అని నిరూపిస్తున్నది.

**ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।**
**బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥**

అల్పజ్ఞుడు తనకు హాని కల్గిస్తాడేమో అని వేదం భయపడుతుంది. అందువల్ల ఇతిహాసాలతోనూ, పురాణాలతోనూ వేదార్థాలను విస్తరింపజేయాలి. ఈ దృష్టితోనే, అనగా అల్పజ్ఞులను దృష్టిలో పెట్టుకొనే వ్యాసుడు వేదార్థాలను పురాణాలద్వారా విస్తరింపజేశాడు. అట్లని పురాణాలు అల్పజ్ఞులకు మాత్రమే పరిమితమైనవి కావు. అధికజ్ఞులు కూడా గ్రహించవలసిన విషయాలు పురాణాలలో ఎన్నో ఉన్నాయి.

వేదం ప్రభువుతో సమానమైనది. శబ్దప్రధానమైన వేదవాణి కర్తవ్యవిషయంలో రాజాజ్ఞను పోలి వుంటుంది. పురాణవచనం మిత్రతుల్యంగా వుంటుంది. అది అర్థప్రధానమై శ్రోతను కర్తవ్యానికి పురికొల్పుతుంది. కావ్యం కాంతాసమ్మితమై సరసంగా బోధించి పాఠకుణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తుంది అని ఆలంకారికులు వేదార్థాలను వివరించే పురాణాలకు మిత్రసాదృశ్యాన్ని ప్రతిపాదించారు.

**యద్వేదాత్ప్రభుసమ్మితాదధిగతం శబ్దప్రధానాచ్చిరం**
**యచ్చార్థప్రవణాత్పురాణవచనాదిష్టం సుహృత్సమ్మితాత్ ।**

**కాన్తాసమ్మితయా యయా సరసతామాపాద్య కావ్యశ్రియా**
**కర్తవ్యే కుతుకీ బుధో విరచితస్తస్మై స్పృహాం కుర్మహే ॥** (ప్రతాపరుద్రీయం)

పురాణాలలో గూడా కావ్యశైలిని పాటించి రసవత్తరంగా కర్తవ్యబోధ కావించిన ఘట్టాలెన్నో ఎడనెడా కానవస్తాయి.

పురాణాలలో పూర్వకాలానికి చెందిన అనేక కథలున్నాయి. కథాకథనం ద్వారా ధర్మస్వరూపం అందులో నిరూపింపబడింది. పురాణకథలు వాగ్వైభవాన్ని ప్రదర్శించడానికి చెప్పినవి కావనీ, విజ్ఞాన వైరాగ్యాలను విస్తరించి చెప్పడానికే ఆ కథలను వివరించడమయిందనీ భాగవతపురాణంలో వ్యాసభగవానుడే చెప్పాడు.

**కథా ఇమాస్తే కథితా మహీయసాం**
**వితాయ లోకేషు యశః పరేయుషామ్ ।**
**విజ్ఞానవైరాగ్య వివక్షయా విభో!**
**వచోవిభూతిర్న చ పారమార్థ్యమ్ ॥** (భాగవతం-12-3-14)

ఇక్కడ 'విజ్ఞాన' మంటే వేదవిజ్ఞానమనే గ్రహించాలి.

**'వేదాః ప్రతిష్ఠితాస్సర్వే పురాణే నాత్ర సంశయః'** పురాణాలలో వేదాలు ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఇందులో సందేహం లేదు. కథల ద్వారా అవి ఆవిష్కృతాలవుతాయి.

## పురాణ ప్రాముఖ్యం

**యన్నదృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।**
**ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥**

వేదాలలో గోచరం కానిదంతా స్మృతులలో కనిపిస్తుంది. శ్రుతి స్మృతులు రెండింటిలో కనిపించనిది పురాణం ద్వారా అవగతం అవుతుంది అన్న ప్రమాణాన్ని బట్టి శ్రుతులలోనూ, స్మృతులలోనూ లేని విషయాలను సైతం విస్తృతరచనావిధానం కల పురాణాలద్వారా గ్రహించవచ్చునని తెలుస్తున్నది. **'పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్'** అన్నట్లు శాస్త్రాలన్నింటిలోను మొదటిదిగా పురాణాన్ని విధాత స్మరించాడని విదితమవుతున్నది. యాగానుష్ఠానసమయంలో పురాణాలు పఠించే సంప్రదాయం కద్దు. ఇంకా పురాణాలలో భగవన్మహిమ, భగవదవతారాలు, భక్తిప్రబోధం, నానావిధాలైన ఆచారాలు, ధర్మాధర్మాలు, సాంఘిక -చారిత్రకాంశాలు, కళలు, వేదాంతతత్త్వాలు, నీతి ఇత్యాదిగా ఎన్నో విషయాలు నిరూపితాలయ్యాయి.

పురాణం ఐహికాముష్మిక సుఖసాధనం. మన సంస్కృతి సంప్రదాయాలను గ్రహించడానికి పురాణజ్ఞానం అవసరం.

## పురాణ శబ్ద నిర్వచనం

**పురాణం అంటే -** పురా భవం ప్రాచీనకాలంలో రచించబడినది అని అర్థం.

**పురాஉపి నవం -** ప్రాచీనమైనా విషయ విశిష్టతను బట్టి క్రొత్తది అని మరొక అర్థం.

**పురా-అణతి-ఆగతానాగతే కథయతీతి పురాణం**-అంటే జరిగిన, జరుగనున్న కాలానికి చెందిన విషయాలను వివరించునది అని వేరొక అర్థం.

**పురా-పూర్వస్మిన్ జాతమితి పురాణమ్**-పూర్వం ఎప్పుడో జరిగిన వృత్తాంతం పురాణం అని భావం.

**పురా**-అంటే పరంపరను వ్యక్తం చేసేది పురాణం అని మరొక వివరణ.

**పురా-ప్రాచీన కాలోదంతం అనక్తీతి పురాణం** - పురాతన కాలానికి చెందిన చరిత్రను చెప్పునది పురాణం.

ఇలా పురాణ శబ్దానికి పలు విధాల నిర్వచనం పెద్దలు చెప్పారు.

## పురాణోత్పత్తి

అథర్వవేదంలో పురాణ శబ్దం ప్రయుక్తమైంది. యజ్ఞోచ్ఛిష్టంనుండి పురాణం పుట్టినదని అందులో చెప్పబడింది.

**ఋచః సామాని ఛందాంసి పురాణం యజుషా సహ ।**
**ఉచ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వే దివి దేవా దివి శ్రితాః ॥** అథర్వ సంహిత (11-7-24)

నాల్గువేదాల తరువాత ఇక్కడ పురాణోత్పత్తి నిర్దేశించబడింది. పురాణాల ఉనికి వేద సమకాలికమని తెలుస్తున్నది.

అందుచేత వేదసంహితల కాలంలోనే పురాణాలకు చెందిన మూలస్వరూపం రూపొందిందని భావించవచ్చు. బృహదారణ్యకోపనిషత్తులోని ఈ క్రింది వాక్యం గమనార్హం.

**"అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతత్ యదృగ్వేదో, యజుర్వేదస్సామవేదోఽథర్వాఙ్గిరసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణి".**(2-4-10)

ఈ ఉపనిషద్ వాక్యం వేదాదులతోపాటు పురాణం కూడా పరమాత్మయొక్క నిఃశ్వాసరూపమైనదని వ్యక్తం చేస్తున్నది. దీనివల్ల వేదం ఎంత ప్రాచీనమో పురాణం కూడా అంతే ప్రాచీనమని గ్రహించవచ్చు. ఇక్కడ పురాణ శబ్దం ఏకవచనంలో ప్రయుక్తమైనది. అందుచేత పూర్వం సంక్షిప్తంగా ఉండిన పురాణం కాలక్రమంలో విస్తృతరూపం సంతరించుకొని వివిధ పురాణాలుగా విస్తరించిందని భావించవచ్చు.

భారతీయసంస్కృతిని ప్రతిబింబించే దర్పణాలు పురాణాలు. సామాన్య జనానీకంలో సనాతన ధర్మతత్వాన్ని ప్రచారం చేయడంలో అవి ప్రముఖపాత్ర వహించాయి. ఆధునికకాలంలో ప్రాచ్య పండితులేకాక పాశ్చాత్య పండితులు కూడా పురాణాల విశిష్టతను గుర్తించారు. పురాణం అన్న వ్యవహారమే ఇది అతిప్రాచీన సాహిత్యమని తెలియజేస్తుంది.

పురాణాలకంటే భిన్నంగా ఇతిహాసాలను గూడా మన పెద్దలు పేర్కొన్నారు. గతకాలంలో జరిగిన సంఘటనలను తెలిపేవి ఇతిహాసాలు. ఇతి హ+ఆస = ఇతిహాసం అనగా ఇలా పూర్వం జరిగినది-అని అర్థం. పురాణంలోని విషయాలు ఇతిహాసంలోని అంశాలకంటె వ్యాపకంగానూ, విస్తృతంగానూ వుంటాయి.

సాధారణ పురాణాల నుద్దేశించి నిర్దేశించిన సర్గం, ప్రతిసర్గం మొదలైన లక్షణాల కంటె భిన్నమైన వివిధ విషయాలు పురాణాలలో గోచరిస్తాయి. ఉదా: అగ్నిపురాణాన్ని పరిశీలిస్తే వివిధ విద్యలు, పదార్థలక్షణాలు, స్వప్నాలు,

శకున ఫలితాలు, కావ్యనాటక లక్షణాలు, ప్రళయస్వరూపం, నరకం తీరుతెన్నులు, అద్వైత బ్రహ్మతత్త్వం మున్నగు అంశాలు అందులో ఉండడం గమనార్హం. అందుకే అగ్నిపురాణాన్ని 'జ్ఞానకోశం' అన్నారు.

సృష్ట్యారంభంనుండి నేటివరకు సమాజంలోని స్థితిగతులను చెప్పే పురాణాలను శ్రద్ధతో పఠించి పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతేకాని అవేవో కల్పనాత్మకమైన కథలని ఉపేక్షించడం తగదు. పురాణాలను ఏ దృష్టితో వ్యాసభగవానుడు రచించాడు? అన్న ప్రశ్నకు ఈ క్రింది శ్లోకం సమాధానమిస్తున్నది.

**విష్ణోరంశో మునిర్జాతః సత్యవత్యాం పరాశరాత్ ।**
**పురాణసంహితాం దధ్యౌ తేషాం ధర్మవిధిత్సయా ॥**

విష్ణ్వంశంతో జనించిన సత్యవతీ పరాశరుల పుత్రుడగు వ్యాసుడు ధర్మస్వరూప నిరూపణకై పురాణసంహితను రూపొందించాడని భావం.

అంతేకాక శ్రీమన్నారాయణుడు స్వయంగా వ్యాసరూపుడై వేదార్థాల విస్తృతి నపేక్షించి భూతలములో పురాణాలు రచించాడని ఈ క్రింది శ్లోకం నిరూపిస్తున్నది.

**విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।**
**వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥**

సూతుని ద్వారా ఈ పురాణవాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది. నైమిశారణ్య నివాసులైన శౌనకాది మునులు సూతునినుండి ఈ పురాణాలను విన్నారు.

## విష్ణువుయొక్క అవయవాలే పురాణాలు

త్రిమూర్తులలో ఒక్కడుగా, స్థితికారకుడుగా, దుష్టశిక్షకుడుగా, శిష్టరక్షకుడుగా, ధర్మసంస్థాపకుడుగా ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణుదేవుని యొక్క అవయవాలుగా పదునెన్మిది పురాణాలను పేర్కొనడం కద్దు. దీన్నిబట్టి ధర్మప్రభువైన అచ్యుతునికీ, ధర్మస్వరూప నిరూపకాలైన పురాణాలకూ కల సామ్యాన్ని గ్రహించవచ్చు. పురాణాలు ఈ క్రిందివిధంగా విష్ణుదేవుని అవయవాలుగా పేర్కొనబడ్డాయి.

**బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ ।**
**వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥**

**ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ ।**
**మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥**

**భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః ।**
**బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥**

**లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ ।**
**స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥**

**కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేదః ప్రకీర్త్యతే ।**
**మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥**
**ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।**

దీని తాత్పర్యం ఇది-శ్రీమహావిష్ణువునకు బ్రహ్మపురాణం-శిరస్సు, పద్మపురాణం-హృదయం, విష్ణుపురాణం-దక్షిణహస్తం, వాయుపురాణం-వామహస్తం, భాగవతపురాణం-తొడలు, నారదపురాణం-నాభి, మార్కేండయపురాణం-దక్షిణపాదం, అగ్నిపురాణం-వామపాదం, భవిష్యపురాణం-కుడి మోకాలు, బ్రహ్మవైవర్త పురాణం-ఎడమ మోకాలు, లింగపురాణం-కుడి చీలమండ, వరాహపురాణం-ఎడమ చీలమండ, స్కాంద పురాణం-కేశాలు, వామనపురాణం-చర్మం, కూర్మపురాణం-వీపు, మత్స్యపురాణం-మెదడు, గరుడపురాణం-మజ్జ, బ్రహ్మాండపురాణం-ఎముకలు. ఇలా శ్రీహరి పురాణాలే అవయవాలుగా కల్గి వున్నాడు.

## పురాణ సంఖ్య

పురాణాలు మొత్తం పదునెనిమిది. వీటిని ఆ యా పురాణాల పేర్లలో మొదటి అక్షరాన్ని మాత్రం పేర్కొనే ఒక శ్లోకంలో ఇలా చెప్పడమయింది.

**మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వ చతుష్టయమ్ ।**
**అనాపలింగ కూస్కాని పురాణాని విదుర్బుధాః ॥**

'మ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే పురాణాలు రెండు-(1) మత్స్యపురాణం (2) మార్కండేయపురాణం. 'భ' అను అక్షరంతో ప్రారంభమయ్యేవి, రెండు -(1) భాగవతం (2) భవిష్యపురాణం -'బ్ర'తో ప్రారంభమయ్యేవి -మూడు (1) బ్రహ్మపురాణం (2) బ్రహ్మాండపురాణం (3) బ్రహ్మవైవర్త పురాణం -'వ' కారంతో ప్రారంభమయ్యేవి నాల్గు (1) విష్ణుపురాణం (2) వాయుపురాణం (3) వామనపురాణం (4) వరాహపురాణం -అ=అగ్నిపురాణం నా=నారదపురాణం-ప=పద్మపురాణం, లిం=లింగపురాణం, గ=గరుడపురాణం, కూ=కూర్మపురాణం, స్కా=స్కాందపురాణం ఇలా మొత్తం పురాణాల సంఖ్య పదునెన్మిది.

## పురాణ విభాగం

పురాణాలను మహాపురాణాలనీ, ఉప పురాణాలనీ రెండు విధాలుగా విభజించడం కద్దు. పైన ప్రథమాక్షర నిర్దేశంతో పేర్కొన్నవన్నీ మహాపురాణాలే. ఈ క్రిందివిధంగా కూడా ఈ పురాణాలను పెద్దలు నిర్దేశించారు.

**బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవ చ ।**
**భాగవతం నారదీయం మార్కండేయం చ కీర్తితమ్ ॥**
**ఆగ్నేయం చ భవిష్యం చ బ్రహ్మవైవర్తలింగకే ।**
**వారాహం చ తథా స్కాందం వామనం కూర్మసంజ్ఞకమ్ ।**
**మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥**

ఈ పదునెన్మిది పురాణాలనూ పద్మపురాణం సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అని మూడు వర్గాలుగా విభజించింది.

**సాత్త్వికాలు–**

**వైష్ణవం నారదీయం చ తథా భాగవతం శుభమ్ ।**
**గారుడం చ తథా పాద్మం వారాహం శుభదర్శనే ॥**

**రాజసాలు–**

**బ్రహ్మాండం బ్రహ్మవైవర్తం మార్కండేయం తథైవ చ ।**
**భవిష్యం వామనం బ్రాహ్మం రాజసాని నిబోధత ॥**

**తామసాలు–**

**మాత్స్యం కౌర్మం తథా లైంగం శైవం స్కాందం తథైవ చ ।**
**ఆగ్నేయం చ షడేతాని తామసాని నిబోధత ॥**

ఇందులో (1) వైష్ణవం (2) నారదీయం (3) భాగవతం (4) గారుడం (5) వారాహం (6) పాద్మం –అనునవి సాత్త్వికపురాణాలు. (1) బ్రహ్మాండం (2) బ్రహ్మవైవర్తం (3) మార్కండేయం, (4) భవిష్యం (5) వామనం (6) బ్రాహ్మం–అనేవి రాజసాలు. (1) మాత్స్యం (2) కౌర్మం (3) లైంగం (4) వాయవీయం (శైవం) (5) స్కాందం (6) అగ్నేయం అనేవి తామసాలు.

ఇలా ఒక్కొక్క వర్గంలో ఆరేసి పురాణాలు లెక్కకు వస్తాయి.

సాత్త్వికపురాణాలు శ్రీమహావిష్ణువు యొక్క ప్రాధాన్యాన్నీ, రాజస పురాణాలు చతుర్ముఖ బ్రహ్మ ప్రాముఖ్యాన్నీ, తామస పురాణాలు శివునియొక్క ఆధిక్యాన్నీ వర్ణిస్తున్నాయి. ఈ ముగ్గురు దేవతలు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు.

అన్ని పురాణాలూ ఈ దేవత లందరికీ సమప్రాధాన్యాన్ని ప్రతిపాదించక కొన్ని పురాణాలు ఒక దేవతను ఇతర దేవతల కంటె అధికుడని చెప్పడం యుక్తమా? అనే సంశయం కలుగవచ్చు.

వేదం **'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'** అని చెప్పింది. అంటే సద్రూపుడైన పరమాత్మ ఒక్కడే, తత్త్వజ్ఞులు ఆయనను నానా నామరూపాలతో వర్ణిస్తారని భావం. పరబ్రహ్మానికి మూర్తమని, అమూర్తమని రెండు రూపాలు కలవనీ; అందులో మూర్తం క్షరం–అంటే నశించే స్వభావం కలిగినదనీ, అమూర్తం నాశం లేనిదనీ గ్రహించాలి. క్షరాక్షరాలు సకలభూతాలలోనూ సమంగా ఉన్నాయి. అక్షరం పరబ్రహ్మం కాగా, ఈ చరాచరజగత్తు క్షరం అవుతున్నది. ఈ విషయాన్ని విష్ణుపురాణం ఇలా వివరించింది.–

**ద్వే రూపే బ్రహ్మణస్తస్య మూర్తం చామూర్తమేవ చ ।**
**క్షరాక్షరస్వరూపే తే సర్వభూతేష్వవస్థితే ।**
**అక్షరం తత్ పరం బ్రహ్మ క్షరం సర్వమిదం జగత్ ॥**

దీనినిబట్టి పురాణాలలో వర్ణింపబడిన త్రిమూర్తులలో ఒకరు పెద్ద, మరొకరు చిన్న అనే తేడాలు లేవు. ఒకే తత్త్వం మూడు రూపాలతో విరాజిల్లుతున్నది. ఆ దేవతలు నిర్వహించే క్రియలలోని భేదమే వారిని మూడు రూపాలతో నిర్దేశించడానికి హేతువైనది. ఈ సంగతినే విష్ణుపురాణం ఈ విధంగా వివరించింది.

**సృష్టిస్థిత్యంతకరణాత్ బ్రహ్మవిష్ణుశివాత్మికామ్ ।**
**స సంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః ॥**

ఒక జనార్దనుడే సృష్టి, స్థితి, లయం - అనే మూడు కార్యాలు నిర్వహించడంవల్ల బ్రహ్మ, విష్ణువు, శివుడు అన్న మూడు సంజ్ఞలు పొందాడని భావం.

ఈ సత్యాన్ని గ్రహిస్తే ఆయా దేవతల పట్ల వైషమ్యం తొలగి సమత్వం నెలకొంటుంది. అందువల్ల త్రిమూర్తుల ప్రభావాలను సమయానుగుణంగా వర్ణించే పురాణాల పట్ల సమన్వయదృష్టినే కలిగివుండాలి.

మహాపురాణాల లాగానే ఉపపురాణాలు గూడా పదునెన్మిది ఉన్నాయని కూర్మపురాణం పేర్కొంటున్నది.

**ఆద్యం సనత్కుమారోక్తం నారసింహం తథాఽపరమ్ ।**
**తృతీయం స్కంద ముద్దిష్టం కుమారేణ తు భాషితమ్ ॥**

**చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశభాషితమ్ ।**
**దుర్వాససోక్తమాశ్చర్యం నారదోక్తమతః పరమ్ ॥**

**కపిలం వామనం చైవ తథోశనససేవితమ్ ।**
**బ్రహ్మాండం వారుణం చాథ కాలికాహ్వయమేవ చ ॥**

**మాహేశ్వరం తథా సాంబం సౌరం సర్వార్థ సంచయమ్ ।**
**పరాశరోక్తమపరే మారీచం భాస్కరాహ్వయమ్ ॥**

ఉపపురాణాలు-(1) సనత్కుమారోక్తం (2) నారసింహం (3) స్కాందం (4) శివధర్మం (5) దౌర్వాసం (6) నారదోక్తం (7) కాపిలం (8) వామనం (మానవం) (9) ఉశనసఃప్రోక్తం (10) బ్రహ్మాండం (11) వారుణం (12) కాలికా పురాణం (13) మాహేశ్వరం (14) సాంబం (15) సౌరం (16) పరాశరోక్తం (17) మారీచం (18) భాస్కరం (భార్గవం).

కొందరి మతం ప్రకారం ఉపపురాణాల సంఖ్య ముప్పదినాల్గుగా నిర్దిష్టమయింది. వీటికి తోడుగా ఔపపురాణాలు అన్న పేరుతో మరొక పదునెన్మిది పురాణాలను గూడ నిర్దేశించడం కద్దు.

## పురాణలక్షణం

**సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।**
**వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్ ॥**

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం-అని పురాణం ఐదు లక్షణాలు గల్గి యుంటుంది. వీటి సంగ్రహవివరణ ఇది.

1. సర్గం - అవ్యాకృతతత్త్వం నుండి మహత్తత్త్వం, దానినుండి అహంకారతత్త్వం, దానినుండి సూక్ష్మభూతాల సృష్టి.
2. ప్రతిసర్గం - మరీచ్యాదులవల్ల జరిగిన చరాచరసృష్టి.
3. వంశం - ఆ యా ఋషుల, రాజుల వంశాలు.

4. మన్వంతరాలు – మనువుల పరిపాలనకాలంలో జరిగిన విషయాలు మరియు ఆ యా మన్వంతరాలలో సప్తఋషులు, మునులు మొదలగువారి వివరణ.

5. వంశానుచరితం–ఆ యా రాజవంశీయులైన రాజుల పరిపాలన మున్నగువాటికి చెందిన కథలను వివరించడం.

పక్షాంతరంలో పురాణాలకు పది లక్షణాలు గూడా నిర్దేశించడం కద్దు. పైన చెప్పిన ఐదు లక్షణాలు సాధారణ పురాణాల లక్షణం కాగా, క్రింద చెప్పబోయే పది లక్షణాలు మహాపురాణాలకు చెందినవని పెద్దల అభిప్రాయం.

**అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణమూతయః ।**
**మన్వంతరేశానకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥**

సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశాన కథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం–అనేవే ఈ పది లక్షణాలు.

వీటి సంగ్రహ వివరణ ఇది–

(1) సర్గం: –భగవత్ప్రేరణతో సత్త్వరజస్తమోగుణాలలో క్షోభ ఏర్పడి పంచభూతాలు, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, అహంకారం, మహత్త్వం జనించడాన్ని సర్గమంటారు.

2) విసర్గం:–విరాట్పురుషునినుండి ఉదయించిన బ్రహ్మ వివిధ చరాచరాలను సృష్టిస్తాడు. ఈ సృష్టినే విసర్గమంటారు.

3) స్థానం:–వినాశోన్ముఖమైన సృష్టిని ఒక మర్యాదలో నిల్పడమే స్థానం.

4) పోషణం:–భగవానుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావిస్తాడు. జగత్తుకు మేలు గల్గించే సందేశాన్ని అందిస్తాడు. నామరూపాలతో పుష్టిని కల్గిస్తాడు. దీనిని పోషణమంటారు.

5) ఊతులు:–కర్మవాసనలను ఊతులంటారు.

6) మన్వంతరాలు:–మనువులు మారినప్పుడు మన్వంతరకాలంలో తత్కాలానికి చెందిన అధిపతులు భక్తినీ,ధర్మాన్నీ ప్రబోధించే సంఘటనను మన్వంతరమంటారు.

7) ఈశానకథలు:– భగవదవతారాలు, భక్తులు–వీరికి సంబంధించిన చరిత్రలు.

8) నిరోధం:–జీవోపాధులను తనలో లీనం చేసుకొని భగవానుడు యోగనిద్రాముద్రితుడు కావడమే నిరోధం.

9) ముక్తి:–వేరే రూపాలు వదలి స్వస్వరూపంతో వుండడమే ముక్తి. ప్రకృతినుండి విముక్తి లభించే స్థితి ఇది.

10) ఆశ్రయం:– అధిష్ఠానమే ఆశ్రయం. దీని విశుద్ధికొరకే పై తొమ్మిది లక్షణాలనూ వివరించడం జరిగింది.

పై పది లక్షణాలూ మహాపురాణమైన శ్రీమద్భాగవతానికి చక్కగా అన్వయిస్తాయి. పెద్దలు వ్రాసిన గ్రంథాలలో వాటి సమన్వయాన్ని చూడవచ్చు.

## పురాణశ్లోక సంఖ్య

భాగవతంలోని ద్వాదశస్కంధమందలి పదమూడవ అధ్యాయంలో ఆ యా పురాణాలలోని శ్లోకాల సంఖ్య ఈ క్రిందివిధంగా నిర్దేశించడమయింది.

బ్రాహ్మం దశ సహస్రాణి పాద్మం పఞ్చోనషష్టి చ ।
శ్రీవైష్ణవం త్రయోవింశచ్చతుర్వింశతి శైవకమ్ ॥
దశాష్టౌ శ్రీభాగవతం నారదం పఞ్చవింశతిః ।
మార్కండేయం నవాగ్నేయం దశ పఞ్చ చతుశ్శతమ్ ॥
చతుర్దశ భవిష్యం స్యాత్తథా పఞ్చ శతాని చ ।
దశాష్టౌ బ్రహ్మవైవర్తం లైఙ్గమేకాదశైవ తు ॥
చతుర్వింశతి వారాహమేకాశీతిసహస్రకమ్ ।
స్కాందం శతం తథా చైకం వామనం దశ కీర్తితమ్ ॥
కౌర్మం సప్తదశాఽఽఖ్యాతం మాత్స్యం తత్తు చతుర్దశ ।
ఏకోనవింశత్సౌపర్ణం బ్రహ్మాండం ద్వాదశైవ తు ॥
త్రయోదశే పురాణానాం సంఖ్యామాహ యథాక్రమమ్ । **(భాగవతం-12-13-2-9)**

| | | | |
|---|---|---|---|
| 1. బ్రహ్మపురాణం | - | 10,000 | శ్లోకాలు |
| 2. పద్మపురాణం | - | 55,000 | ,, |
| 3. విష్ణుపురాణం | - | 23,000 | ,, |
| 4. వాయుపురాణం | - | 24,000 | ,, |
| 5. భాగవతపురాణం | - | 18,000 | ,, |
| 6. నారదపురాణం | - | 25,000 | ,, |
| 7. మార్కండేయపురాణం | - | 9,000 | ,, |
| 8. అగ్నిపురాణం | - | 15,400 | ,, |
| 9. భవిష్యపురాణం | - | 14,500 | ,, |
| 10. బ్రహ్మవైవర్తపురాణం | - | 18,000 | ,, |
| 11. లింగపురాణం | - | 11,000 | ,, |
| 12. వరాహపురాణం | - | 24,000 | ,, |
| 13. స్కందపురాణం | - | 81,100 | ,, |
| 14. వామనపురాణం | - | 10,000 | ,, |
| 15. కూర్మపురాణం | - | 17,000 | ,, |
| 16. మత్స్యపురాణం | - | 14,000 | ,, |
| 17. గరుడపురాణం | - | 19,000 | ,, |
| 18. బ్రహ్మాండపురాణం | - | 12,000 | ,, |
| **మొత్తం శ్లోకాలు** | - | **4,00,000** | |

## పురాణాలలో ముఖ్యాంశాలు

పురాణాలు మానవకర్తవ్యాలను నిర్దేశిస్తూ కొన్ని ముఖ్యమైన సందేశాత్మక ప్రబోధాలు కావించాయి. ధర్మాన్ని రక్షించవలసిన ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలను వివిధ కథల ద్వారా అవి విశదీకరించాయి.

విశ్వమంతా భగవన్మయమనీ, మోక్షప్రాప్తికి భక్తి ముఖ్యసాధనమనీ, వివిధ వ్రతాలను వాటికి తగిన కాలాలలో అనుష్ఠించి పవిత్రులు కావాలనీ, పుణ్యక్షేత్రాలను సందర్శించాలనీ, ఆ యా క్షేత్రాలలో ప్రతిష్ఠితులైన దేవతలను ఆరాధిస్తే శుభాలు సిద్ధిస్తాయనీ, పితృదేవతలకు శ్రాద్ధవిధిని తప్పక అనుష్ఠించాలనీ, కర్మఫలం అనుభవించక తప్పదనీ ఇత్యాదిగా పురాణాలు ప్రబోధించే అంశాలు అందరికీ గమనింపదగినవై యున్నాయి.

## వర్ణనాశైలి

కవితా రూపంలో గల రచనలను కవులు ఆలంకారిక ప్రక్రియలో కొనసాగిస్తారు. ఈ ప్రక్రియ పాఠకులను ఆకర్షిస్తుంది. యథాతథంగా సాగే కథాకథనంతోపాటు అవసరమైనచోట అలంకార ప్రక్రియనాశ్రయించి కవులు వర్ణన నిర్వహిస్తారు. అతిశయోక్తులను గూడా మేళవిస్తారు. ఉన్నదున్నట్లు చెప్పడం యథాతథకథనం కాగా కథనంలో ఉపమా, రూపకాదులను ఆశ్రయించడం ఒక విశిష్టమైన పద్ధతి. వేదాలలో గూడ ఈ పద్ధతి కనిపిస్తుంది. ఉదాహరణకు కఠోపనిషత్తులో

**ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।**
**బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥**

ఇత్యాదిగా శరీరానికి రథరూపకల్పన చేసి ఆత్మను రథికునిగా పేర్కొనడం జరిగింది. సూర్యుని కిరణాలలోని ఏడు రంగులను ఏడు గుర్రాలుగా వర్ణించడం గూడా ఈ ప్రక్రియకు చెందిన విషయమే.

పురాణాలు గూడా ఈ శైలిని విస్తృతంగా అనుకరించాయి. అతిశయోక్తిని గూడా విపులంగా వినియోగించాయి. ఈ పద్ధతి పురాణ వాఙ్మయానికి శోభావహమైం దనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

## పురాణ ప్రయోజనం

**యథా పాపాని పూయన్తే గంగావారివిగాహనాత్ ।**
**తథా పురాణశ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥**

గంగాజలంలో స్నానం చేయడంవల్ల పాపాలు నశించినట్లే పురాణశ్రవణంవల్ల దురితాలు నశిస్తాయి.

## సదాచారప్రబోధం

యజ్ఞాలు, దానాలు, తపస్సులు ఇత్యాదిగా ఎన్ని చేసినా – సదాచారం లేనివాడు ఆత్మోన్నతి పొందలేడు.

**దురాచారో హి పురుషో నేహ నాముత్ర నందతి ।**

అన్నట్లు దురాచారుడైన మనుజుడు ఇహపరలోకాలు రెండింటా సుఖానికి దూరమౌతాడు.

**ఆచారహీనం న పునన్తి వేదా యద్యప్యధీతాః సహ షడ్భిరంగైః ।**

సదాచారం లేనివాడిని వేదాలు గూడా పవిత్రుణ్ణి చేయజాలవు. దురాచారాలు, సదాచారాల స్వరూపాన్ని వివిధ కథల ద్వారా పురాణాలు చక్కగా నిరూపించాయి. రామాయణంలో రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్, -రామాదులవలె ప్రవర్తించాలి కాని, రావణాదులవలె ప్రవర్తించరాదు అన్న విధంగా నీతిప్రబోధం పురాణాలలో రమణీయంగా చేయబడింది.

అందువల్ల పురాణ పఠన శ్రవణాలు సమాజాభ్యున్నతి కల్గిస్తాయి. పూర్వం గ్రామసీమలలో గూడ రాత్రివేళల పౌరాణికులు పురాణ పఠనం కావించి, అందలి విశేషాలను సామాన్య జనులకు బోధించేవారు. ఈ బోధ ప్రజానీకానికి సముచితసంస్కారం కల్గించేది. తద్వారా వారు ఆత్మోన్నతి కల్గించే మార్గంలో నడిచేవారు.

## కాలనిర్ణయం

పురాణాల కాలనిర్ణయం అంత సుకరం కాదు. శ్రీ శంకరభగవత్పాదులు మున్నగువారు తమ రచనల్లో పురాణాల నుదాహరించియున్నారు. బాణకవి (క్రీ.శ.625) తన హర్షచరిత్రలో **పురాణేషు వాయుప్రలపితం** అని చెప్పి వాయుపురాణాన్ని ప్రస్తావించాడు.

కలియుగరాజులను నిర్దేశించిన పురాణాలు గూడా ఉన్నాయి. విష్ణుపురాణంలో మౌర్యవంశం పేర్కొనబడింది. మాత్స్యపురాణం-దాక్షిణాత్యులైన ఆంధ్రరాజులను (క్రీ.శ 225) ప్రస్తావించింది. గుప్తరాజుల ప్రస్తావన వాయుపురాణంలో కనిపిస్తున్నది.

లక్ష శ్లోకాలుగల ఇప్పటి మహాభారతం రూపొందకముందే పురాణాల ఉనికిని పరిశోధకులు గుర్తించారు. మహాభారతవక్త అయిన రౌమహర్షణి పురాణాలలో పారంగతుడు. అతని తండ్రిగూడ పౌరాణికుడుగా ప్రసిద్ధుడే. మహాభారతంలో పెక్కు శ్లోకాలు పురాణాంతర్గత శ్లోకాలతో సామ్యం కల్గి వున్నాయి. మహాభారతంలోని కొన్ని ఆఖ్యానాల ప్రాచీన స్వరూపం పురాణాలలో గోచరిస్తున్నది. దీన్ని బట్టి మహాభారతం కంటె పురాణాలు ప్రాచీనమైనవని విశ్వసించవచ్చు.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో పురాణ ప్రస్తావన ఉన్నది. అపమార్గగాములైన రాజకుమారులను పురాణోపదేశం ద్వారా సన్మార్గగాములను చేయాలని కౌటిల్యుడు వచించాడు. రాజుకు సంబంధించిన అధికారులలో పౌరాణికుడు గూడా ఒకడని కౌటిల్యుడు పేర్కొన్నాడు. అంచేత కౌటిల్యుని కంటె పురాణాలు ప్రాచీనాలని భావించడం సముచితం. కౌటిల్యుడు క్రీ.పూర్వం తృతీయ శతకం వాడని అనేకుల భావన. అందువల్ల ఆ కాలానికంటె ముందే పురాణాలుండేవని భావించాలి.

గౌతమ-ఆపస్తంబ సూత్రగ్రంథాలలో గూడ పురాణప్రస్తావన వస్తుంది. రాజు శాసనవ్యవస్థలో వేదంతోపాటు పురాణాన్ని గూడా ప్రముఖంగా గ్రహించాలని గౌతముడు చెప్పాడు. అతిప్రాచీన పురాణభాగాలనుండి మూడు శ్లోకాలను ఆపస్తంబ ధర్మసూత్రాలలో ఉదాహరించడం జరిగింది. ఆ శ్లోకాలతో సామ్యం కల శ్లోకాలు నేటి పురాణాలలో లభిస్తున్నాయి. కాబట్టి సూత్రకాలంలో గూడా పురాణ గ్రంథాలుండేవని బోధపడుతున్నది.

మరొక ముఖ్యాంశ మేమంటే అతిప్రాచీనములైన ఉపనిషత్తులలో గూడా పురాణ ప్రస్తావన కలదు, ఛాందోగ్యంలో నారద సనత్కుమారుల సంవాదంలో ఇతర శాస్త్రాలతోపాటు పురాణాలను పేర్కొన్నారు.

**"ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదం"** (ఛాందో 7-1-2).

అందుచేత క్రీ.పూ 600 సం॥ పూర్వం పురాణాల నిర్మాణం జరిగిందని పెద్దల భావన. వాటికి మూల భూతమైన పురాణా లిప్పుడు లభించవు.

పురాణాలు ఏ ఒక్క శతాబ్దానికో చెందిన రచనలు కావు. కాలక్రమములో వాటిలో క్రొత్తక్రొత్త అధ్యాయాలు చేర్చడం జరిగింది. గుప్తకాలానికి పురాణాలు నేటిరూపం సంతరించుకొన్నాయని చెప్పవచ్చు.

## పురాణ వైశిష్ట్యం

పురాణాలు సామాన్యులకు దుర్బోధమైన వేదార్థాలను వారికవగతమయ్యే రీతిలో కథలు జోడించి చెప్పాయి. ప్రాచీన కాలానికి చెందిన భారతీయ సమాజ స్వరూప స్వభావాలను అర్థం చేసుకోవడానికి పురాణాలే ప్రామాణికమైన ఆధారాలు. ఆనాటి ఋషుల చరిత్రలను మనం పురాణాలనుండే సమగ్రంగా గ్రహించడానికి వీలవుతుంది.

భారతభౌగోళికస్థితి, నదీనదపర్వతాల ఉనికి, వివిధ తీర్థాల స్థితిగతులు, పలువృక్షాలు, జంతువులు- వీటిని గూర్చిన విజ్ఞానం కూడా పురాణాలలో లభిస్తుంది.

పురాణాలను, శిలాశాసనాదులగు ఇతర ప్రామాణికాధారాలతో తులనాత్మకంగా పరిశీలిస్తే గత చరిత్రకు చెందిన అనేక విషయాలు తేటతెల్లమవుతాయి.

కాబట్టి భారతీయులే కాక పాశ్చాత్యులు గూడా పురాణాలను శ్రద్ధతో పరిశోధించి మానవజాతి గతచరిత్రను సమగ్రంగా అవగతం చేసుకోవచ్చు.

ధార్మికంగానూ, ఆధ్యాత్మికంగానూ సామాన్యప్రజలను చైతన్యవంతులను చేయడంలో పురాణాలు నిర్వహించిన పాత్ర ఎంతో గణనీయమైనది. మొత్తం పదునెనిమిది పురాణాలలోని శ్లోకాల సంఖ్య నాల్గు లక్షలని ముందే చెప్పుకొన్నాం. ఇంత విస్తృతమైన గ్రంథరాశి సంస్కృతభాషానిబద్ధమై లభిస్తున్నది.

వేదాలలోని నిగూఢమైన వేదాంతతత్త్వాన్ని సామాన్య జనులకు గూడా అర్థం కావాలనే దృష్టితో ఆఖ్యానాలతోనూ, ఉపాఖ్యానాలతోనూ పురాణాలు వివరించాయి.

ప్రాచీనకాలంలో యజ్ఞాలు నిర్వహించే ప్రదేశాలలో పురాణపఠనం విధిగా నిర్వహింపబడేది. పురాణపఠనం పాపనివారకమనీ, పుణ్యప్రదమనీ ప్రశంసింపబడింది. పౌరాణికులు పురాణాలను పఠిస్తూ ప్రవృత్తి నివృత్తి రూపాలైన రెండు విధాల ధర్మాలనూ ప్రజలకు వివరించేవారు.

పురాణాలను ఆధారంగా చేసుకొని కవులు కావ్యనాటకాదులు విస్తృతంగా రచించారు. భారతీయుల జీవితాలకూ, విశ్వాసాలకూ పురాణాలు శతాబ్దాల తరబడి మార్గనిర్దేశకా లయ్యాయి. వేదార్థాలను అతివిస్తృతస్థాయిలో జనానీకానికి అందజేయడానికి పురాణాలు ముఖ్యసాధనా లయ్యాయి.

వేదాంతతత్త్వాన్ని బోధించడానికవతరించిన శ్రీశంకర రామానుజాద్యాచార్యులు గూడా అవసరమైన చోట పురాణవచనాలను ప్రమాణాలుగా పేర్కొనియున్నారు.

కర్మ–భక్తి–ధ్యాన–జ్ఞాన యోగాలు మోక్షసౌధాన్ని అధిష్ఠించడానికి సోపానాలు. ఇందులో కలియుగంలో భక్తియొక్కటే సులభమైన తరణోపాయమని పెద్దలు పేర్కొన్నారు.

**"కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః"** అన్నట్లు కలియుగంలో అనన్యభక్తిచేతనే భగవదనుగ్రహం కలుగుతుందన్న సత్యాన్ని భాగవతాది పురాణాలు ప్రహ్లాదచరిత్రాది కథల ద్వారా మనోజ్ఞంగా నిరూపించాయి.

అట్లే గృహస్థులు పాటించవలసిన పలురకాలైన కర్మవిధానాలూ, వ్రతాలూ, వాటివల్ల కలిగే ఫలితాలూ పురాణాలలో ఎడనెడా విశదంగా నిరూపించబడ్డాయి. ఈ విధంగా కర్మయోగ నిరూపణం గూడా పురాణాలలో కనిపిస్తుంది. వివిధ విషయాలతో కూడిన పురాణాలను విజ్ఞానసర్వస్వాలుగా, జ్ఞాననిలయాలుగా భావించవచ్చు.

పురాణాలలో వివిధ ప్రదేశాలలో గల నానాతీర్థాలు, ఆ తీర్థాల ప్రాముఖ్యం, తీర్థయాత్రలవల్ల కలిగే ప్రయోజనాలు మొదలైన విషయాలు పలుచోట్ల వివరింపబడివున్నాయి. తీర్థయాత్రలవల్ల ప్రజలలో ఏకజాతీయతాభావం పెంపొందుతుంది. గతచరిత్రకు సంబంధించిన విజ్ఞానం భావిపురోగతికి దోహదం చేస్తుంది. పురాణాలను క్షణ్ణంగా పరిశీలిస్తే భారతదేశ గతచరిత్రకు చెందిన ఎన్నో విషయాలు గోచరిస్తాయి. "పురోఽభివృద్ధి గోరువారు పూర్వవృత్తాంతమును మరువరాదు" అని శ్రీమలయాళస్వామి సూక్తి. అందుచేత చారిత్రక పరిశోధకులు పురాణాలను పరిశీలనాత్మకమైన దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తమ పాలనలో ఎదురయ్యే సమస్యలను ఆనాటి పాలకులు పురాణ వృత్తాంతాలను ప్రమాణంగా పరిగ్రహించి పరిష్కరించేవారు. అందుచేత రాజధర్మ పరిజ్ఞానానికి గూడా పురాణ సారస్వతం ఉపకరిస్తుంది.

పురాణాలలో బోధింపబడిన నీతులను కేవలం హిందూజాతికి మాత్రమే పరిమితాలని భావించరాదు. ప్రపంచజను లందరికీ ఉపయోగపడే శాశ్వత నైతికబోధ లందులో ఉన్నాయి.

ఆధునిక విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలు పురాణాలలో నిర్దిష్టములై యున్నాయని ఇప్పటి శాస్త్రజ్ఞులలో కొందరి భావన. అందుచేత వైజ్ఞానిక పరిశోధకులకు గూడా పురాణజ్ఞానం అవసరమే.

అతి ప్రాచీన కాలంనుండి నేటివరకూ అమూల్య సారస్వతరూపంలో మనకు ఉపలబ్ధమవుతున్న వాఙ్మయంలో పూర్వోక్తపద్ధతిలో పురాణాలకు గల ప్రాముఖ్యాన్ని గుర్తించి మానవజాతి పురోగతికి వాటిని వినియోగించుకొని సర్వతోముఖమైన శ్రేయస్సును పొందుదుము గాక!

**సముద్రాల లక్ష్మణయ్య**
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

# అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం

## 1. బ్రహ్మపురాణం

పురాణాలలో మొదటిది బ్రహ్మపురాణం. ఇది విష్ణుదేవుని మాహాత్మ్యాన్ని విశదీకరిస్తుంది. ఆ దేవుని శిరస్సుగా వర్ణింపబడిన ఈ పురాణం ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాల ప్రాప్తికి తగిన ఉపాయాలను వివరిస్తుంది.

10,000 వేల శ్లోకాలు గల ఈ పురాణంలో పలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. నైమిశారణ్య వర్ణనం, ప్రళయస్వరూపం, హరిశ్చంద్ర సగరాదుల చరిత్రలు, సప్తద్వీపాలు, పార్వతీ స్వయంవరం, సాగరస్నానవిధి, గోదావరీ పవిత్రత, క్షీరసాగరమథనం, దధీచి వృత్తాంతం, వరాహాద్యవతారాలు–ఇత్యాదిగా అనేక విషయాలు ఇందులో నిబంధింపబడి వున్నాయి.

భారతావని, దండకారణ్యం, గంగాదినదుల ప్రాశస్త్యం విస్తృతంగా ఈ పురాణంలో వివరించడ మయింది.

ప్రతిపురాణంలోనూ తత్త్వాన్నీ, నీతినీ, ధర్మాన్నీ బోధించే కథలు ఉంటాయి. ఈ పురాణంలోని కథలలో 'కండు' మహర్షి కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది. అతని తపస్సుకు భంగం కల్గించడానికి దేవతలు పంపిన అప్సరస ప్రమ్లోచ దాదాపు 900 సంవత్సరాలు అతనితో విహరించి అతని నియమానికి భంగం కల్గిస్తుంది.

చివరికి తన పొరబాటు గుర్తించిన మహర్షి పురుషోత్తమ క్షేత్రమనే పూరీ జగన్నాథక్షేత్రానికి వెళ్ళి శ్రీ జగన్నాథుని సేవించి ముక్తుడవుతాడు.

తరువాతి కథలలో కార్తవీర్యార్జునుని వృత్తాంతం ప్రముఖమైనది. ఇది మిక్కిలి విస్తృతమైన చరిత్ర. దత్తాత్రేయుని అనుగ్రహంతో సహస్రబాహువులు కల్గి శిష్టరక్షణ కావిస్తూ రావణాదులను జయించి ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించిన ఈ రాజు చివరికి తనకంటె బలవంతుడైన పరశురామునిచే వీరమరణం పొందుతాడు. ఏడువందల యాగాలు నిర్వహించినవాడుగా ఈతడు ప్రసిద్ధుడయ్యాడు. విష్ణుతత్త్వం బోధించే పలు విషయాలు ఇంకా ఎన్నో ఈ పురాణంలో గోచరిస్తాయి.

**ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసమ్మితమ్ ।**
**యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భువనం హరేః ॥**

వేదతుల్యమైన ఈ పురాణాన్ని శ్రద్ధతో చదివినవాడు, లేక విన్నవాడు హరినిలయమైన వైకుంఠం చేరుకుంటాడని ఫలశ్రుతి.

## 2. పద్మపురాణం

మహావిష్ణువుయొక్క హృదయస్థానంతో పోల్చబడిన పురాణమిది. సృష్టి ప్రక్రియ ఆ దేవుని నాభికమలంనుండి జన్మించిన బ్రహ్మద్వారా మొదలయింది. ఆ ప్రక్రియయే ఈ పురాణాని కాధారం. కాన ఇది 'పద్మపురాణ' మనబడింది. ఇందులో 55,000 వేల శ్లోకాలున్నాయి.

సృష్టిఖండం, భూఖండం, స్వర్గఖండం, పాతాళఖండం, ఉత్తరఖండం – అని ఐదు ఖండాలుగా విభజింప బడిన ఇందులో మొత్తం 641 అధ్యాయాలున్నాయి.

కాలపరిమాణం, క్షీరసాగరమథనం, దక్షయాగధ్వంసం, చంద్రవంశం, వామనావతారం, తారకాసుర వృత్తాంతం, నృసింహావతారం, సదాచారం – ఇత్యాదిగా పలువిషయాలను ఈ పురాణం వివరిస్తున్నది.

శరీరవర్ణనం, ఆత్మస్వరూపం, విష్ణుభక్తి మహిమ, కార్తికమాస ప్రాశస్త్యం, దీపావళీమాహాత్మ్యం పూజావిధానాలు, యుగధర్మాలు మున్నగు విషయాలను విపులంగా ఇందులో చూడవచ్చు.

ప్రపంచమంతా శ్రీహరిమయమే అని ఈ పురాణం ఘోషిస్తున్నది. ఇందులో పేర్కొన్న సదాచారాలు అవశ్యం ఆచరింపదగి వున్నాయి.

తల్లిదండ్రుల విశిష్టతను ప్రశంసించి **"మాతరం పితరం తస్మాత్సర్వయత్నేన పూజయేత్"** –సకల ప్రయత్నాలతోనూ తల్లిదండ్రుల నర్చించాలి అని ఈ పురాణం బోధించింది. ఇది **'మాతృదేవో భవ, పితృదేవో భవ'** అన్న శ్రుతివచనానికి వివరణగా ఉన్నది.

ఇంకా ఉసిరికాయకు గల పవిత్రత, దాన్ని సేవించే విధానం విపులంగా ఇందులో పేర్కొనబడింది. అట్లే తులసికి గల ప్రాశస్త్యం కీర్తించబడింది.

పురాణపఠనావశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనం, కలియుగ ధర్మాలు, ఆ యుగంలో స్త్రీపురుషుల స్వభావాలు, జనుల విపరీతప్రవృత్తులు విశదంగా ఇందులో నిరూపింపబడి యుండడం గమనార్హం.

కలియుగంలో ధర్మాత్మకమైన కర్మను మనుజుడు భక్తితో భగవదర్పితంగా ఆచరిస్తే సర్వపాప నిర్ముక్తు డవుతాడని ఈ పురాణం ప్రతిపాదించింది. ఇలా ఏ పురాణాన్ని పరిశీలించినా నానావిధములైన, ఆత్మోన్నతి హేతువులైన, మానవ జీవితాని కవసరములైన పెక్కు విషయాలు విశదీకరింపబడి వున్నాయి.

ఈ పద్మపురాణాన్ని చదివేవారికి, వినేవారికి కోరిన కోర్కెలన్నీ శ్రియఃపతి అనుగ్రహంవల్ల సిద్ధిస్తాయని ఫలశ్రుతి.

**యద్యదిష్టం పఠంత్యేతత్ శృణ్వంతి చ ముముక్షవః ।**
**లభన్తే తత్తదేవాశు ప్రసాదాత్కమలాపతేః ॥**

## 3. విష్ణుపురాణం

శ్రీ మహావిష్ణువు యొక్క దక్షిణబాహువుగా విష్ణుపురాణం వర్ణించబడింది. ఆరు అంశాలుగా విభజింపబడిన ఈ పురాణంలో 126 అధ్యాయాలున్నాయి. విష్ణుధర్మోత్తరంతోగూడ కలుపుకొంటే ఇందలి మొత్తం 23,000 వేల శ్లోకాలు. పరాశరమహర్షి మైత్రేయునకు జెప్పిన పురాణ మిది.

ఇరవైనాలుగు తత్త్వాలు, జగదావిర్భావం, కాలస్వరూపం, వరాహావతారం, భూవిభజన, సనకాదుల జననం, స్వాయంభువమనువు పుట్టుక, దక్షపుత్రికల వివాహం, ధ్రువచరిత్ర, నృసింహావతారం, భరతవంశవర్ణన, జడభరతోపాఖ్యానం–ఇత్యాదిగా అనేకాంశాలు ఈ పురాణంలో విశదీకరింపబడ్డాయి.

మరియు బ్రహ్మజ్ఞాన ప్రాశస్త్యం, వేదవిభాగం, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు, దేవాసురుల యుద్ధం, సగరవంశవర్ణన, శ్రీకృష్ణావతారం, కలి లక్షణాలు, నామసంకీర్తన ప్రభావం మొదలైన విషయాలు గూడ విపులంగా ఇందులో నిరూపించడమైనది.

వైష్ణవులకు మిక్కిలిగా ఆరాధనీయమైన పురాణమిది. వైష్ణవసిద్ధాంతాలకు మూలభూతమైన గ్రంథం గాన శ్రీభగవద్రామానుజాచార్యులు ఆ సిద్ధాంతప్రచారాన్ని ఈ పురాణాన్ని ఆధారంగా స్వీకరించి నిర్వర్తించారు.

శరణాగతి, భగవద్గుణ కర్మ నామాల గానం, విష్ణ్వర్పణంగా కర్మల ననుష్ఠించడం మొదలగు అంశాలకు ఈ పురాణంలో ప్రాముఖ్యం ఇవ్వడమయింది.

మరియు శ్రవణం, కీర్తనం మున్నగు నవవిధభక్తి మార్గాలు ఇందులో విస్తృతంగా ప్రతిపాదింపబడి వున్నాయి. భాగవతపురాణం లాగా ఈ పురాణం గూడా భక్తియోగానికి ప్రాధాన్యాన్ని ప్రతిపాదించింది.

దేవతలను ఆరాధించేవారిలో అనేకులు శివకేశవులలో భేదాన్ని చూస్తారు. అయితే ఈ పురాణంలో–

**అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ।**
**వదంతి భేదం పశ్యన్తి చావయోరన్తరం హర! ॥**

'అవిద్యామోహితులే నీకూ, నాకు భేదం పాటిస్తారు' అని కేశవుడు శివునితో చెప్పాడు. ఈ శివకేశవాభేద సిద్ధాంతం ఇక్కడ గమనార్హం.

ఈ పురాణంలో జడభరతుని వృత్తాంతం మిక్కిలి ఆసక్తిని రేకెత్తించేదిగా వర్ణితమై వున్నది. ఆతని మూడు జన్మలకు సంబంధించిన విశేషాలు గ్రహిస్తే మనలో జ్ఞానవిజ్ఞానాలు వికసిస్తాయి.

**యో నరః పఠతే భక్త్యా యః శృణోతి చ సాదరమ్ ।**
**తావుభౌ విష్ణులోకం హి వ్రజేతాం భుక్తభోగకౌ ॥**

అన్నట్లు – భక్తితో దీన్ని పఠించేవాడు, ఆదరంతో వినేవాడూ ఈ లోకంలో భోగాలనుభవించి తుదకు విష్ణుసాన్నిధ్యం చేరగలరని ఫలశ్రుతి.

## 4. వాయుపురాణం

వాయుదేవుడు శివలీలలను వివరించిన పురాణమిది. అందుచేత దీన్ని 'శివపురాణ' మని కూడా పేర్కొంటారు. **'చతుర్వింశతి సాహస్రం పురాణం'** –అనుటవల్ల ఇందులో 24,000 వేల శ్లోకాలున్నాయని గ్రహించాలి. కాని ఇపుడు మనకు లభించేవి 11,000 శ్లోకాలు మాత్రమే. శ్లోకసంఖ్యలలో ఇట్టి వ్యత్యాసాలు కొన్ని పురాణాలలో కనిపిస్తున్నాయి. ఈ పురాణం మహావిష్ణువుయొక్క వామభుజంగా పేర్కొనబడింది.

ఇందులో (1) ప్రక్రియాపాదం (2) అనుషంగ పాదం (3) ఉపోద్ఘాత పాదం (4) ఉపసంహార పాదం–అని నాలుగు పాదాలున్నాయి.

భూగోళ-ఖగోళాలు, బ్రహ్మాండసృష్టి, యుగధర్మాలు మున్నగు విషయాలతోపాటు కైలాసవర్ణన, గంగావతరణవర్ణన మొదలగు వర్ణనలు గూడా ఇందు గోచరిస్తాయి.

ఇది శైవపురాణం. అయినా సందర్భానుగుణంగా మహావిష్ణువు గూడా ఇందు వర్ణింపబడినాడు.

వివేకవిజ్ఞానాలు కావాలంటే తప్పకుండా పురాణాల అధ్యయనం చేయాలని ఈ పురాణం చెబుతున్నది.

**యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో నరః ।**
**న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥**

నాల్గువేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు చదివినా పురాణం చదువనివాడు విచక్షణుడు కాలేడని భావం. కాబట్టి పురాణాధ్యయనం ఎంత ముఖ్యమైనదో గ్రహించాలి.

ఈనాడు మనం యోగాభ్యాసాని కెంతో ప్రాముఖ్యం ఇస్తున్నాము. వాయుపురాణంలో యోగాని కవసరమైన ప్రాణాయామాన్ని గూర్చి విపులమైన వివరణ ఉన్నది. బ్రహ్మప్రాప్తికది అవసరం. శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదం-అనే నాల్గు ప్రయోజనాలు దానివల్ల కల్గుతాయని ఈ పురాణం చెబుతున్నది.

ఓంకారోపాసన గూడా ఇందులో చెప్పడమయింది. ఓంకారధ్యానపరులకు శివసాయుజ్యం కల్గుతుందని ఇందులో నిరూపించబడివున్నది.

'రమణకం' అనే దేశంలోని ప్రజలు పదివేల సంవత్సరాలు, 'హిరణ్యకం' లోనివారు పదకొండు వేల సంవత్సరాలు జీవిస్తారంటూ అక్కడి ప్రకృతివిశిష్టతను ఇక్కడ చెప్పడమయింది.

అక్కడి చెట్లు ఫలాలతోపాటు వస్త్రాలనూ, ఆభరణాలను గూడా ప్రసాదిస్తాయని చెప్పడం ఆశ్చర్యావహంగా ఉన్నది. కథాకథనంకంటే ఇట్టి వర్ణనలే ఈ గ్రంథంలో ఎక్కువగా గోచరిస్తాయి.

గయాక్షేత్రప్రాముఖ్యం గూడా ఇందు చెప్పడమయింది. గయను సందర్శించిన పుత్రుడు పితరులకు రక్షకుడనీ, అతణ్ణి చూచి పితరులు హర్షిస్తారనీ ఇక్కడ పేర్కొనబడింది.

ఈ పురాణకీర్తనం శ్రవణం,ధారణ-కీర్తినీ, పూర్ణాయువునూ, పాపనాశాన్నీ కల్గిస్తాయని ఫలశ్రుతి.

**ధన్యం యశస్యమాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।**
**కీర్తనం శ్రవణం చాస్య ధారణం చ విశేషతః ॥**

## 5. శ్రీమద్భాగవతం

శ్రీమహావిష్ణుని ఊరువుగా వర్ణించబడిన శ్రీమద్భాగవతంలో పంద్రెండు స్కంధాలు, 18,000 వేల శ్లోకాలున్నాయి. ఇది భక్తియోగ ప్రాముఖ్యాన్ని కథలతో, ఉపకథలతో వివరించే పురాణం.

**'నిగమకల్పతరోర్గళితం ఫలం'**-అన్నట్లు వేదమనే కల్పవృక్షంనుండి జారిపడిన పండుగా దీన్ని కీర్తించడమయింది. భక్తితోపాటు జ్ఞానవైరాగ్యాలు గూడా ఇందు నిర్దేశించబడి వున్నాయి.

వేదాలను విభజించిన వ్యాసుడు ధర్మనిరూపకమైన ఒక లక్షశ్లోకాలతో గూడిన మహాభారతం రచించాడు. అయినా మనశ్శాంతి లేక, చింతాక్రాంతు డయ్యాడు. నారదుడాయన చెంతకు వచ్చి 'నీ చింతకు కారణ మేమి?' అని ప్రశ్నించాడు! 'అదేదో నీవే చెప్పు' అని వ్యాసుడన్నాడు.

అపుడు నారదమహర్షి ఊరక ధర్మాలు చెప్పితే చాలదు, విష్ణుకథాప్రధానమైన గ్రంథం రచిస్తే కానీ నీకు మనశ్శాంతి లభించదంటాడు. ఆయన చెప్పినట్లు వ్యాసభగవానుడు భగవంతుని గుణ కర్మ నామాలను కీర్తించే విష్ణుకథలను వర్ణిస్తూ భాగవతం రచించాడు, మనశ్శాంతి పొందాడు. భాగవత రచనకు చెందిన వృత్తాంతమిది.

దీని కథాప్రారంభమిది–పాండవవంశంలో జన్మించిన పరీక్షిత్తు వేటకు వెళ్ళి, అలసిపోయి, తపోనిమగ్నుడైన శమీక మహర్షిని నీళ్ళిమ్మంటాడు. నిర్వికల్పధ్యానంలో ఉన్న ఆ ముని కతని మాట వినిపించదు. కోపించిన రాజు అతని మెడలో సర్పశవాన్ని వేసి శృంగిశాపానికి గురి అవుతాడు. వారం దినాలలో మరణించవలసిన దుఃస్థితి పాలవుతాడు.

అంతట రాజకార్యాలు త్యజించి ప్రాయోపవిష్టుడై ఏడు దినాలలో ముక్తి పొందే ఉపాయమేమి? అని విచారిస్తాడు. అపుడు శుకుడు వచ్చి అందుకు ఉపాయం భాగవత శ్రవణమే అని చెప్పి భాగవత ప్రవచనం కావిస్తాడు.

ఇందులో ధ్రువుడు, జడభరతుడు, అజామిళుడు, దధీచి, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, రంతిదేవుడు మున్నగు భాగవతుల కథలు మనోజ్ఞంగా వివరింపబడివున్నాయి. ఆ కథల ద్వారా విజ్ఞానవైరాగ్యభక్తివిశేషాలు నిరూపితాలయ్యాయి.

దశమస్కంధం ఇందులో అతిముఖ్యమైనది. శ్రీకృష్ణావతార ప్రతిపాదకమైన ఇందులో శ్రీకృష్ణుని లీలలు, ఆయన కావించిన కంసాదుల సంహారం, రుక్మిణీ కల్యాణం, కుచేలాదుల ఉద్ధరణ–ఇత్యాదిగా పలు అంశాలు రసవత్తరంగా చిత్రించబడినాయి.

ముఖ్యంగా గోపికలు కృష్ణుణ్ణి ప్రేమించిన ఘట్టం మనోహరంగా ఉన్నది. మధురభక్తితత్త్వం ఇందులో ప్రతిపాదితమయింది.

పదకొండవ స్కంధంలోని ఉద్ధవగీత ప్రశస్తం. శ్రీకృష్ణుడు అవసానదశలో గావించిన ఆధ్యాత్మిక ప్రబోధమిది. చివరి స్కంధంలో కలి స్వరూపం నిరూపించబడింది. మార్కండేయ చరిత్రను గూడా ఇందులో చూడవచ్చు.

**'విద్యావతాం భాగవతే పరీక్షా'** అన్నట్లు విద్యావంతుల జ్ఞానవిజ్ఞానాలను భాగవతం ద్వారా పరీక్షించవచ్చు. భగవన్నామసంకీర్తనం సర్వపాపప్రణాశకమని భాగవతం చెప్పింది. భారతావనిలో జన్మించి గూడా భాగవతం విననివారు ఆత్మఘాతకులని పేర్కొనబడ్డారు.

**భారతే మానవం జన్మ ప్రాప్య భాగవతం న యైః ।**
**శ్రుతం పాపపరాధీనైరాత్మఘాతస్తు తైః కృతః ॥**

భాగవత శ్రవణ ఫలం ఈ క్రిందిశ్లోకంలో ఇలా పేర్కొనబడింది.

**మత్కథావాచనే నిత్యం మత్కథాశ్రవణే రతమ్ ।**
**మత్కథాప్రీతమనసం నాహం త్యక్ష్యామి తం నరమ్ ॥**

'నా కథలు పఠించేవాడు, వినేవాడు, నా కథలచే సంతోషించేవాడు అయిన జనుణ్ణి నేను వదలను' అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

## 6. నారదపురాణం

మహావిష్ణువుయొక్క నాభిస్థానంగా కీర్తింపబడిన పురాణమిది. నారదుడు ఉపదేశించినది కావడం వల్ల 'నారద పురాణం' అనే పేరు దీనికి స్థిరపడింది. ఇందులో 25,000 వేల శ్లోకాలున్నాయి.

పూర్వఖండం, ఉత్తరఖండం అని ఈ పురాణం రెండు ఖండాలుగా విభక్తమై యున్నది. పూర్వఖండంలో 125, ఉత్తరఖండంలో 82 అధ్యాయాలు ఉన్నాయి.

పురాణాల ప్రశస్తి. శివకేశవుల అభేదం, భక్తికి గల ప్రాముఖ్యం, సదాచార ప్రాశస్త్యం, పౌరాణికుల గురుత్వం-ఇత్యాదులు ఇందులో చక్కగా కీర్తితాలయ్యాయి.

సత్యహరిశ్చంద్రుని గాథ ఇందులో ఉన్నది. అట్లే శ్రీకృష్ణుని ప్రభావం చక్కగా పేర్కొనబడివున్నది. బ్రహ్మాండోత్పత్తి ఎలా జరిగిందో ఇందులో చూడవచ్చు.

విష్ణుభక్తికి గల ప్రాముఖ్యాన్ని వర్ణించే ఈ పురాణంలోని క్రిందిశ్లోకం గమనార్హమై యున్నది-

**లోకే స ధన్యః స శుచి స్స విద్వాన్ స ఏవ వక్తా స చ ధర్మశీలః ।**
**జ్ఞాతా స దాతా స చ సత్యవక్తా యస్యాస్తి భక్తిః పురుషోత్తమాఖ్యే ॥**

పురుషోత్తమునిపై భక్తి గలవాడే లోకంలో ధన్యుడు, శుచి, విద్వాంసుడు, ధర్మశీలుడు, జ్ఞాత, దాత, సత్యవక్త అని భావం. భక్తిలేనివాని గుణాలు విలువలేనివని తాత్పర్యం.

ఒక్క భక్తినే కాక తీర్థయాత్రలో సేవించవలసిన తీర్థాల ప్రాశస్త్యాన్ని గూడా ఈ పురాణం విశదీకరించింది. అయోధ్య, మధుర, మాయ, కాశి, కంచి, అవంతిక, ద్వారక-ఈ ఏడు నగరాలు మోక్షప్రదాలని ఈ పురాణం ఉద్ఘాటించింది.

రాజధర్మాలను గూడా ఈ పురాణం వివరించింది. ప్రజారక్షణ, శత్రుసంహారం, న్యాయబద్ధంగా పన్నులు వసూలు చేయడం, గోరక్షణ, అన్న-వస్త్ర గృహాలు అనే కనీసపు సౌకర్యాలను ప్రజలకు కల్గించడం, మద్యనిషేధం-మున్నగు రాజుల కర్తవ్యాలు గూడా ఇందులో నిర్దేశింపబడివున్నాయి.

పరులపై దౌర్జన్యం, వారిని హింసించడం మున్నగు పది పాపాలు పరిహరణీయాలు. వాటి వినాశానికే, 'దశహరా' అని పేరు. దానికి ప్రతీకగానే నేటికీ 'దశరా' పండుగ జరుపుకొంటున్నాము.

భర్తృహరి సుభాషితంవంటి గ్రంథాలలో మనం ఎన్నో సుభాషితాలు చదువుతుంటాం. వాటిని పోలిన పలు సుభాషితాలను మనం ఈ నారదపురాణంలో గూడా చూడవచ్చు.

**యః శృణోతి నరో భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।**
**స యాతి బ్రహ్మణో ధామ నాత్ర కార్యా విచారణా ॥**

అని ఫలశ్రుతి. ఎవడు భక్తితో ఈ పురాణాన్ని వింటాడో, లేదా వినిపిస్తాడో, అతడు బ్రహ్మలోకం చేరుతాడు. ఇందుకు సందేహం లేదు.

## 7. మార్కండేయ పురాణం

మునులు తమ సందేహాలను మార్కండేయ మహర్షికి తెల్పగా ఆయన వారి సంశయాలు తొలగిస్తూ చెప్పిన పురాణమిది. విష్ణు భగవానుని దక్షిణపాదంగా ఇది కీర్తింపబడింది. ఇందులో 134 అధ్యాయాలు, 9,000 వేల శ్లోకాలు ఉన్నాయి.

బలరాముని తీర్థయాత్రలు, హరిశ్చంద్రుని వృత్తాంతం, పతివ్రతాస్త్రీల ప్రభావం, కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని అనుగ్రహం పొందడం, రాజధర్మాలు, యోగశాస్త్రవిషయాలు, ఓంకారనిరూపణ, బ్రహ్మాండోత్పత్తి, దేవీమాహాత్మ్యం, సూర్యవంశవర్ణన ఇత్యాదిగా గల వివిధ విషయాలు ఈ పురాణంలో నిరూపించడమయింది.

దుర్గాదేవి జనుల ననుగ్రహించి వారి కోర్కెలు తీర్చే దేవత. ఆ దేవిని ఆరాధించడంలో సప్తశతీపారాయణం ముఖ్యకర్తవ్యం. ఆ సప్తశతి ఈ పురాణంలోని భాగమే. దేవీనవరాత్ర్యుత్సవాలలో సప్తశతిని పారాయణం చేస్తారు.

మహిళామణులలో కొందరు మహాయోగిను లున్నారు. వారిలో మదాలసాదేవి ఒకరు. ఈమెకు సంబంధించిన అద్భుతమైన చరిత్ర ఈ పురాణంలో అతి విపులంగానూ, రమణీయంగానూ నిరూపింపబడివున్నది.

ఋతధ్వజుడనే రాజుయొక్క ధర్మపత్ని మదాలస. ఈమెకు విక్రాంతుడు, సుబాహుడు, అరిమర్దనుడు, అలర్కుడు–అని నల్గురు కుమారులు. ఆమె ఉగ్గుబాలతోపాటు మొదటి ముగ్గురికీ బ్రహ్మవిద్యను గూడా బోధించింది. వారు అధ్యాత్మవిద్యలో ఆరితేరి సంసారవిరక్తులవుతారు. ఋతధ్వజుడు నాల్గవ కుమారుణ్ణి తల్లి వద్ద అధ్యాత్మవిద్యనభ్యసింపనీకుండా లౌకికవిద్యలు బోధించే ఏర్పాటు చేస్తాడు. అవసానదశలో ఆమె అతణ్ణి కూడా సత్సంగప్రభావముతో తత్త్వవేత్తగా రూపొందేటట్లు చేస్తుంది. ఇది ఆ కథా సంగ్రహ సారాంశం.

విష్ణువుయొక్క నాల్గు రూపాలు వాసుదేవ–శేష–ప్రద్యుమ్న–అనిరుద్ధములని ప్రసిద్ధాలు. వీటికి సంబంధించిన వివరణ కూడా ఈ పురాణంలో వస్తుంది.

ఇక ధర్మపక్షులుగా ప్రసిద్ధి వహించిన పక్షుల వృత్తాంతం గూడా మార్కండేయపురాణంలో పేర్కొనబడివున్నది. జైమినిమహర్షి తనకు గల్గిన సంశయాల నన్నింటినీ ఈ పక్షులద్వారానే తొలగించుకొంటాడు.

ఈ పురాణం పుత్రులను మూడురకాలుగా విభజించింది. తండ్రినుండి సంక్రమించిన కీర్తినీ, ధనాన్నీ పెంపొందించేవాడు ఉత్తముడు. పెంపొందించకున్నా పోగొట్టకుండా ఉండేవాడు మధ్యముడు. పోగొట్టుకొనేవాడు అధముడు. ఎంతో చక్కని ప్రబోధమిది.

తండ్రిపేరు చెప్పుకొని కాలం గడపువాడు వ్యర్థజన్ముడు. తండ్రికి కీర్తి తెచ్చేవాడు ఉత్తముడు. ఇలాంటి విషయాలు యుక్తియుక్తంగా ఆసక్తిజనకంగా ఇందులో వివరించబడి వున్నాయి.

**శ్రుత్వా తత్పూజయేద్యస్తు పురాణం సప్తమం పునః ।**
**సర్వపాపవినిర్ముక్తః పునాత్యేవ నిజం కులమ్ ॥**

అని ఫలశ్రుతి. ఇది విని దీనిని పూజించేవాడు సకలపాపవిముక్తుడై తన కులాన్ని పావనం చేస్తాడు.

## 8. అగ్నిపురాణం

అగ్నిదేవుడు వసిష్ఠమహర్షికి ఉపదేశించినదే అగ్నిపురాణం. ఇది విష్ణుదేవుని ఎడమపాదంగా వర్ణింపబడింది. ఇందులో 383 అధ్యాయాలు, 15,400 శ్లోకాలు ఉన్నాయి.

దశావతారాలు ఇందులో వర్ణింపబడ్డాయి. మరియు రామాయణ మహాభారతాలలోని కొన్ని ఘట్టాలు ఇందులో కనిపిస్తాయి.

దేవాలయ నిర్మాణం, సాలగ్రామలక్షణాలు, సూర్యపూజ, శివపూజ, వాస్తుపూజ, చతురాశ్రమధర్మాలు ఈ పురాణంలో పేర్కొనబడివున్నాయి. పలురకాల వ్రతాలు, రాజధర్మాలు, స్వప్న ఫలితాలు, స్త్రీ పురుష లక్షణాలు, ఆయుర్వేద విషయాలు, అద్వైతవేదాంతతత్త్వం ఇత్యాదిగా గల పలువిషయాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

కూర్మావతారవర్ణన సందర్భంలో విష్ణువు దేవతలకు ఎలా ఉపకరించాడో ఇక్కడ మనోజ్ఞంగా చెప్పడమయింది.

ఇక రామాయణ ఘట్టాలలో సుగ్రీవుడు సీతాన్వేషణ విషయంలో అశ్రద్ధ చూపినప్పుడు రాముడతనికి పంపిన తీక్ష్ణపదజాలంతో కూడిన సందేశం పాఠకులలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రామాయణంలో సీతాపహరణకు రావణుడు మారీచుణ్ణి ప్రేరేపించినప్పుడు మారీచుడు చెప్పిన ఈ క్రిందిశ్లోకం గమనార్హం.

**రావణాదపి మర్తవ్యం మర్తవ్యం రాఘవాదపి ।**
**అవశ్యం యది మర్తవ్యం వరం రామాన్న రావణాత్ ॥**

"రావణుని ఆజ్ఞ పాటించకుంటే అతనినుండి చావు తప్పదు. పాటిస్తే రామునిచేత మరణం తప్పదు. రావణునికన్న రామునిచేత మరణించడమే మేలు" అని భావం. ఇలా రామాయణ భారతాదులలోని కొన్ని ఘట్టాలు ఈ పురాణాల్లో కనిపిస్తాయి.

భగవంతు డనే పదానికి ఈ క్రింది శ్లోకంలో ఇచ్చిన నిర్వచనం అర్థవంతంగా ఉంది.

**ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ।**
**వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥**

సృష్టిస్థితిలయాలు, జీవుల జననమరణాలు, విద్యా విద్యల స్వరూపం సమగ్రంగా ఎరిగినవాడే భగవంతుడు.

ఇక దేవాలయ నిర్మాణానికి చెందిన విశేషాలు కూడా ఈ పురాణంలో లభిస్తున్నాయి. ఆలయనిర్మాణం వల్ల బ్రహ్మహత్యాది దోషాలు కూడా తొలగిపోతాయని చెప్పడం విశేషం.

ఈ పురాణంలో కథలకు అంతగా ప్రాముఖ్యం లేదు కాని విద్యలు, పదార్థ లక్షణాలు, శుభాశుభస్వప్నాలు, శకునాలు, ఇవి మొదలుగాగల అనేక విషయాలు నిరూపింపబడి వున్నాయి. వివిధ శాస్త్రాలకు చెందిన విషయాలు ఇందులో ఉండడం వల్ల ఇదొక విశిష్టమైన పురాణంగా ప్రశంసింపబడుతున్నది. దీని ఫలశ్రుతి యిది–

**'ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తిముక్తిదమ్'**

ఈ ఆగ్నేయ పురాణాన్ని చదివినా, ధ్యానించినా భుక్తిముక్తులు చేకూరుతాయని, శుభం కలుగుతుందని చెప్పడమయినది.

## 9. భవిష్యపురాణం

విష్ణుదేవుని కుడిమోకాలితో పోల్చబడిన ఈ పురాణంలో 14,500 శ్లోకాలున్నాయి. ఇందలి అధ్యాయాల సంఖ్య 585.

సృష్టివివరణ, పురాణాల ఉత్పత్తి, షోడశసంస్కారాలు. సావిత్రీమాహాత్మ్యం, స్త్రీలక్షణాలు, వివిధ వ్రతాలు ఇందులో వివరించడమయినది. రథసప్తమీ మాహాత్మ్యం, సూర్యుని ప్రభావం, ప్రతిమాలక్షణాలు, ధర్మస్వరూపం, జీమూతవాహనాదుల చరిత్రలు, అన్నదానప్రశస్తి మున్నగు విషయాలు అతివిస్తృతంగా ఇందులో వర్ణించడం జరిగింది.

భర్తపట్ల భార్య, భార్యపట్ల భర్త ప్రవర్తించవలసిన తీరుతెన్నులు చక్కగా ప్రతిపాదింపబడినాయి. సూర్యప్రభావవర్ణనా సందర్భంలో రాజు, దొంగలు, గ్రహాలు, పాములు, పేదరికం, దుఃఖాలు–ఇవేవీ సూర్యానుగ్రహం పొందిన వారిని బాధించవు అని చెప్పడం విశేషం.

ఇక జీవితంలో అతిముఖ్యమైన వివాహాన్ని గురించి వివరిస్తూ సమస్థాయిగలవారిలో జరిగే వివాహాలు శుభకరాలని, తదితరవివాహాలు దుఃఖదాయకాలని ఈ పురాణం చెప్పింది. స్మృతులలో పేర్కొనబడిన వివిధ వివాహభేదాలు ఇందులో ప్రతిపాదింపబడివున్నాయి. సామాజిక జీవితంలో అత్యావశ్యకాలైన వివాహాది విషయాలను ఈ పురాణంలో ప్రతిపాదించడంవల్ల సంఘశ్రేయస్సుపట్ల పురాణకర్తకు కల అభినివేశమెట్టిదో వ్యక్తమవుతున్నది.

అన్నదాన ప్రాశస్త్యాన్ని పేర్కొంటూ–

**"అన్నం వై ప్రాణినాం ప్రాణా అన్నమోజో బలం సుఖమ్ ।**
**ఏతస్మాత్కారణాత్సద్భిరన్నదః ప్రాణదః స్మృతః ॥**

ప్రాణులకు అన్నమే ప్రాణం. అన్నమే ఓజస్సు, బలం, సుఖం. అందుచేత అన్నదాత ప్రాణదాతగా పేర్కొనబడినాడు. ఈ పురాణంలో మరొక విశేషం విక్రమాదిత్యుడికీ, బేతాళునికీ సంబంధించిన కథలు. ఈ కథలు మిక్కిలి లోకప్రసిద్ధి వహించాయి. కథలలో జీవితంలో ఎదురయ్యే గడ్డు సమస్యలను పరిష్కరించే నైతికసూత్రాలు మనోజ్ఞంగా నిరూపింపబడివున్నాయి.

ఈ పురాణానికి ఫలశ్రుతిని వివరిస్తూ గ్రంథకర్త ఇలా అన్నాడు–

**యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవో నృప! ।**
**అశ్వమేధఫలం ప్రాప్య గచ్ఛేద్భానుం న సంశయః ॥**

ఈ పురాణం వింటే సకలపాపవిముక్తి చేకూరుతుంది. అశ్వమేధయాగఫలం లభిస్తుంది. చివరికి సూర్య సాయుజ్యప్రాప్తి కలుగుతుంది.

## 10. బ్రహ్మవైవర్తపురాణం

సావర్ణిమనువు నారదమునీంద్రునికి చెప్పిన పురాణమిది. ఇందులో వరాహమూర్తికి, శ్రీకృష్ణునికి సంబంధించిన విషయాలు ప్రధానంగా ప్రతిపాదించబడివున్నాయి. ఈ పురాణం శ్రీమహావిష్ణువుయొక్క ఎడమ మోకాలుగా కీర్తింపబడింది.

బ్రహ్మఖండం, ప్రకృతిఖండం, గణేశఖండం, శ్రీకృష్ణఖండమని నాలుగు ఖండాలుగా ఇది విభజింపబడివున్నది. అన్ని ఖండాలలోను కలిపి మొత్తం 18,000 వేల శ్లోకాలున్నాయి. **'సారభూతం పురాణేషు బ్రహ్మవైవర్తముచ్యతే'** అన్నట్లు ఈ పురాణం పురాణా లన్నింటికీ సారభూతమైనదిగా ప్రశస్తి పొందింది.

బ్రహ్మఖండంలో పరబ్రహ్మవర్ణన చేయబడింది. ప్రకృతిఖండంలో దుర్గాదేవి మున్నగు స్వరూపాలతో ప్రకృతి ఆవిర్భవించడం నిర్దేశించబడింది. గణేశఖండంలో వినాయక చరిత్ర నిబద్ధమైనది. శ్రీకృష్ణఖండంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన మొదలగు అంశాలు పేర్కొనబడ్డాయి.

అతిథిని పూజించవలసిన అవశ్యకతను వివరిస్తూ ఈ పురాణం చెప్పిన విషయమిది–

**అపూజితోఽతిథిర్యస్య భవనాద్వినివర్తతే ।**
**పితృదేవాగ్నయః పశ్చాద్గురవో యాన్త్యపూజితాః ॥**

ఏ గృహస్థుని యింట అతిథి ఆదరింపబడడో ఆ యింటినుండి పితరులు, దేవతలు, అగ్నిదేవుడు, గురువులు పూజలను తిరస్కరించి వెళ్ళిపోతారని భావం.

ఇక జన్మకారణమైన తండ్రితోపాటు విద్యాదాత, అన్నదాత, భయమునుంచి కాపాడినవాడు, కన్యాదాత– ఈ నలుగురు కూడ తండ్రులుగానే పేర్కొనబడ్డారు. అట్లే సేవకుడు, శిష్యుడు, పోషితుడు, ఔరసుడు, శరణాగతుడు– ఈ ఐదుగురు పుత్రులుగానే పరిగణింపదగి ఉన్నారు.

ఈ గ్రంథంలో మొదటి పురుషార్థమైన ధర్మముయొక్క ప్రాశస్త్యం ఈ క్రిందివిధంగా ఉగ్గడింపబడింది–

**నాస్తి ధర్మాత్పరో బన్ధుర్నాస్తి ధర్మాత్పరం ధనమ్ ।**
**ధర్మాత్ప్రియతరః కో వా స్వధర్మం రక్ష యత్నతః ॥**

“ధర్మంకంటే శ్రేష్ఠుడైన బంధువు లేడు. మేలైన ధనం లేదు. ధర్మంకంటే ప్రియతరమైన దేదీ లేదు. కాన ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించాలి.” అని భావం. అట్లే మరొక చోట గురువులో సకలదేవతలూ ఉన్నారని గురుమహిమ ప్రశంసింప బడినది.

పై విషయాలతోపాటు భగవంతుని స్వరూపం, సరస్వతీపూజ, భూదానప్రాశస్త్యం, గంగావతరణం, సంక్షిప్త రామాయణం, తులసీమాహాత్మ్యం, దుర్గోపాఖ్యానం మొదలైన విషయాలు కూడా ఈ పురాణంలో వివరింపబడి వున్నాయి.

ఈ గ్రంథంలో పేర్కొన్న కథలలో ముఖ్యంగా పేర్కొనదగినది వేదవతీ చరిత్ర. కృతయుగంలో వేదవతిగా, త్రేతాయుగంలో సీతగా, ద్వాపరయుగంలో ద్రౌపదిగా వేదవతిని పురాణం వర్ణించింది. తదుపరి పురాణాల కథలలో ఈ వేదవతియే పద్మావతిగా అవతరించి విష్ణుని రూపాంతరమైన వేంకటేశ్వరుణ్ణి చేపట్టినట్లు చెప్పడమయినది.

కశ్యపమహర్షిమానసపుత్రిక జరత్కారువుయొక్క స్తుతి కూడా ఈ పురాణంలోనే లభిస్తున్నది.

**శుభదం పుణ్యదం చైవ విఘ్ననిఘ్నకరం పరమ్ ।**
**హరిదాస్యప్రదం చైవ పరలోకే ప్రహర్షదమ్ ॥**

ఇత్యాదిగా ఈ పురాణ పఠనం శుభాన్నీ, పుణ్యాన్నీ, విఘ్నవినాశాన్నీ, హరిదాస్యాన్నీ, పరలోకంలో సంతోషాన్నీ ప్రసాదిస్తుంది అని చెప్పడమైనది.

## 11. లింగపురాణం

అగ్నిలింగంలో అంతర్గతుడైవున్న శివుడు ఉపదేశించినదే లింగపురాణం. ఇది విష్ణుదేవుని కుడిచీల మండతో పోల్చబడింది. శివుని ప్రభావాన్ని వర్ణించే ఈ పురాణంలో 11,000 వేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వార్ధమనీ, ఉత్తరార్ధమనీ రెండు భాగాలుగా ఉన్నది. పూర్వార్ధంలో 108, ఉత్తరార్ధంలో 55 కలిపి మొత్తం 163 అధ్యాయాలున్నాయి.

శివుని అవతారాలను ఈ పురాణం విరివిగా వర్ణిస్తున్నది. అందుచేత శైవులు ఈ పురాణాన్ని ప్రముఖంగా ఆదరిస్తారు. అష్టాంగయోగ సహితమైన శివారాధన, విష్ణువు కావించిన శివస్తోత్రం, బ్రహ్మజననం, లింగార్చనావిధానం, శివునికి చెందిన మానసపూజ, యుగధర్మాలు, సప్తద్వీపాలు, సప్తసాగరాలు, దిక్పాలకుల నగరవర్ణన, చంద్రవంశరాజుల వృత్తాంతం, త్రిపురాసురసంహారం, కైలాసగిరివర్ణన, సదాచారం ఇత్యాదిగా పలు విషయాలు ఈ పురాణంలో అతివిస్తృతంగా ప్రతిపాదింపబడివున్నాయి.

ఇందలి ఉత్తరార్ధంలో పృథివి, జలం, అగ్ని, వాయువు మొదలగు అష్టవిధాలైన శివుని మూర్తుల వివరణ వున్నది. శివభక్తిని ప్రతిపాదించే కథలు కూడా ఈ పురాణంలో  చోటు చేసుకొనివున్నాయి.

మృత్యువు సమీపించిన శ్వేతుడు అనే శివభక్తుడు శివుని అనుగ్రహంచేత మరణంనుంచి తప్పించుకొనిన కథ శివారాధనవల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తున్నది.

ఇక కాశీక్షేత్రమహిమ ఇందులో విస్తారంగా ప్రతిపాదితమయింది.

**కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్హి వివిధాః క్రియాః ।**
**అవిముక్తే త్యజేత్ ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥**

భుజిస్తూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, యథేచ్ఛగా వివిధక్రియలాచరిస్తూ కూడ ఈ క్షేత్రంలో మరణిస్తే మోక్షం సిద్ధిస్తుందని ఇందులో చెప్పడమయినది.

అష్టదిక్పాలకులుగా ఇంద్రాదులు ప్రసిద్ధులు. వారు నివసించే నగరాలు క్రమంగా 1. అమరావతి 2.తేజస్విని 3.వైవస్వతి 4.కృష్ణవర్ణ 5. శుద్ధవతి, 6.గన్ధవతి 7.అలక 8.యశోవతి – అనేవి ఈ పురాణంలో పేర్కొనబడ్డాయి.

ఇది శైవపురాణం కాన శివపూజామాహాత్మ్యాన్ని ఘనంగా కీర్తిస్తున్నది. శివానుగ్రహంతోనే పరాశరుడు ఎన్నడో మరణించిన తన తండ్రిని, పినతండ్రులను చూస్తాడు. ఇట్టి విశిష్టమైన కథలతోను, వర్ణనలతోనూ సాగిపోయే లింగపురాణం చాలా ప్రభావోపేతమైనది.

మంచినీతులు చెప్పిన సందర్భాలు కూడా ఈ పురాణంలో లేకపోలేదు. భోగాశను నిరోధించాలనీ, విషయ విచారణచేత అది సాధ్యమనీ, మనోవాక్కాయాలతో వైరాగ్యాన్ని పాటించాలనీ చెప్పే ఈక్రింది శ్లోకం గమనార్హం–

**భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।**
**తస్మాద్విరాగః కర్తవ్యః మనసా కర్మణా గిరా ॥**

ఈ పురాణపఠన ప్రయోజనాన్ని ఈ క్రిందిశ్లోకం ఇలా చెప్పింది–

**యః పఠేచ్ఛృణుయాద్వాఽపి లైంగం పాపహరం నరః ।**
**స భుక్తభోగో లోకేఽస్మిన్నన్తే శివపురం వ్రజేత్ ॥**

పాపహరమైన ఈ పురాణాన్ని చదివేవారు, వినేవారు ఈ లోకంలో ఉన్నంతకాలం సకల భోగాల ననుభవించి కడపట కైలాసం చేరుకోగలరు.

## 12. వరాహపురాణం

వరాహావతారధారియైన విష్ణుదేవుడు భూదేవికి చెప్పిన పురాణమే వరాహపురాణం. ఇందులో 24,000 వేల శ్లోకాలున్నాయి. విష్ణువుయొక్క ఎడమ చీలమండతో ఈ పురాణాన్ని పోల్చడమయింది. ఇందలి అధ్యాయాల సంఖ్య 215.

నానావిధ సృష్టులు, నారదమునీంద్రుని పూర్వజన్మచరిత్ర, విష్ణుభగవానుని అష్టమూర్తులు, ధర్మవ్యాధుని చరిత్ర, దక్షయాగధ్వంసం, పార్వతీజననం, వినాయకుని పుట్టుక, వివిధవ్రతాలు, వాటి ఫలితాలు, నాలుగు యుగాలు, అన్నదానప్రాశస్త్యం, వరాహస్వామి భూదేవిని ఉద్ధరించడం, నాచికేతుని వృత్తాంతం ఇత్యాదిగా పలువిషయాలు ఈ పురాణంలోని అంశాలుగా ఉన్నాయి.

అష్టాదశపురాణాల క్రమమూ, వివరణ గూడా ఇందులో నిర్దేశింపబడివున్నది. మహావిష్ణువు తన భక్తులకు అంగరక్షకుడై ఉంటాడన్న విషయం ఈ గ్రంథంలో చెప్పడమయింది.

శ్రీకృష్ణుడు గీతలో **'మమ మాయా దురత్యయా'** అని అంటాడు. 'నా మాయ దాటరానిది' అని దీని అర్థం. భూదేవి 'మాయ' అంటే ఏమిటి? దాని స్వరూపం వివరించుమని విష్ణువును అడుగుతుంది. అందుకా దేవుడు తన మాయాస్వరూపాన్ని ఈ పురాణంలో అతి విస్తృతంగా వివరిస్తాడు.

లోకంలో తరచు సంభవించే అతివృష్టి, అనావృష్టి మున్నగు విపరీత సంఘటనలు, మాయవల్లనే కల్గుతున్నాయనీ, సృష్టిలో క్రమబద్ధంగా జరిగే సూర్యోదయాదులు, పంచభూతాల ప్రవర్తన, మాయాప్రభావం వల్లనే ఏర్పడుతున్నాయనీ ఇక్కడ చెప్పడమయింది.

దానాలన్నింటిలో అన్నదానం ప్రశస్తమయింది. అట్లే మనం వాడే వివిధములైన లోహాలతో నిర్మించబడిన పాత్రలలో రాగిపాత్రలు మేలైనవి అని ఈ పురాణం నిరూపించింది.

ఇంకా ఈ పురాణంలో వివిధతీర్థాల ప్రభావం గూడా వర్ణింపబడివున్నది. ఏ తీర్థాన్ని ఎప్పుడు సేవిస్తే మంచిదో ఇక్కడ వివరించబడివున్నది.

విష్ణుమందిరాలలో సేవలు చేసే వారికి గలిగే ఫలమేమి? అన్న భూదేవి ప్రశ్నకు విష్ణువు అట్టి వివిధ సేవాఫలాలను వివరంగా పేర్కొంటాడు. సకల జగత్తుకు సత్యమే ఆధారం కాన, సత్యాన్ని తప్పక పాటించాలన్న సంగతి ఇందులో చెప్పడమయింది.

ఇక కఠోపనిషత్తులో నాచికేతుని వృత్తాంతం ఇందులో రమ్యంగా ప్రతిపాదితమయింది. ఇంకా ఎన్నో కథాంశాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

**శ్రుత్వా తు పూజయేద్యస్తు శాస్త్రం వారాహసంజ్ఞితమ్ ।**

**సర్వపాపవినిర్ముక్తో విష్ణుసాయుజ్యమాప్రజేత్ ॥**

అన్నట్లు దీన్ని ఎవరు శ్రవణం చేసి భక్తితో పూజిస్తారో, వారు సర్వపాపనిర్ముక్తులై విష్ణుసాయుజ్యం పొందుతారని ఫలశ్రుతి.

## 13. స్కాందపురాణం

స్కందుడనగా శివుని కుమారుడైన కుమారస్వామి. ఆ దేవుని పేరుతో ఈ పురాణం ప్రసిద్ధమయింది. శివుడు స్కందుణ్ణి ఉద్దేశించి చెప్పిన విషయమే ఈ స్కాందపురాణం. తండ్రినుండి విన్న ఈ పురాణాన్ని తరువాత స్కందుడు మునుల కుపదేశిస్తాడు.

**'ఏకాశీతిసహస్రం తు స్కాందం సర్వాఘకృంతనం'** – అన్నట్లు సకల పాపవిచ్ఛేదకమైన ఈ పురాణంలో 81,100 శ్లోకాలున్నాయి. దీన్ని బట్టి ఇతర పురాణాలకంటె ఇది ఆకృతిలో చాలా పెద్ద పురాణమని తెలుస్తున్నది.

మహావిష్ణుని వెండ్రుకలతో పోల్చబడిన ఈ గ్రంథంలో మహేశ్వరఖండం, వైష్ణవఖండం, బ్రహ్మఖండం, కాశీఖండం, అవంతీఖండం, నాగరఖండం, ప్రభాసఖండం అని ఏడు ఖండాలున్నాయి.

మహేశ్వరఖండంలో కేదారఖండం, కౌమారీ ఖండం, అరుణాచలమాహాత్మ్యం మొదలైన అంశాలున్నాయి. వైష్ణవఖండంలో వేంకటాచల–జగన్నాథక్షేత్రాల మాహాత్మ్యం, బ్రహ్మఖండంలో సేతు మాహాత్మ్యం, ధర్మారణ్య, బ్రహ్మోత్తరఖండాలున్నాయి. కాశీఖండంలో కాశీక్షేత్రప్రభావం విస్తృతంగా వర్ణింపబడి వున్నది. నాగరఖండంలో వివిధ తీర్థాల వర్ణన ఉన్నది. విశ్వకర్మోపాఖ్యానాది కథలు గూడా ఉన్నాయి.

ప్రభాసఖండంలో ద్వారకానగర పరిసరాల ప్రభావం వివరించబడివున్నది. సంహితారూపంలో గూడా ఈ స్కాందపురాణం ప్రసిద్ధమైవున్నది.

సనత్కుమారసంహిత, సూతసంహిత, శంకరసంహిత, వైష్ణవసంహిత, బ్రహ్మసంహిత, సౌరసంహిత అనేవే ఈ సంహితలు.

సూతసంహితలో శివోపాసనాప్రాముఖ్యం కీర్తింపబడివున్నది. కాశీక్షేత్రప్రభావాన్ని వర్ణించే కాశీఖండంలో అయోధ్యాదిక్షేత్రాలలో మరణించినవారు స్వర్లోకసుఖం అనుభవించి తరువాత కాశిలో జన్మించి అక్కడ ముక్తులవుతారని చెప్పడం విశేషం. **'కాశ్యాం తు మరణాన్ముక్తిః'** అన్న మాట గూడా ప్రసిద్ధం.

జీర్ణదేవాలయోద్ధరణ చేసేవారికి కలిగే ఫలాన్ని గూడా ఈ పురాణం వివరించింది. సత్యనారాయణ వ్రతస్వరూపం ఇందలి రేవాఖండంలో నిరూపితమయింది.

ఇంకను రామావతారం, క్షీరసాగరమథనం, గిరిజా కల్యాణం, కుమారోత్పత్తి, ఓంకారప్రభావం, 14 మంది మనువుల వర్ణన ఇత్యాద్యంశాలు ఇందులో గోచరిస్తాయి. అంతే కాక వనభోజనం, కార్తికవైభవం, ఉసిరిక విశిష్టత, ఇత్యాదివిషయాలు గూడా గమనింపదగి వున్నాయి.

**సర్వేషామేవ ధర్మాణాం గురుపూజా పరా మతా ।**
**గురుశుశ్రూషయా సర్వం ప్రాప్నోతి హి న సంశయః ॥**

అన్ని ధర్మాలలోనూ గురుపూజ మేలైన ధర్మం. గురుసేవచేత అన్ని ఫలితాలూ పొందవచ్చు అని గురుసేవా ప్రాశస్త్యం పేర్కొనబడింది. రుద్రాక్ష మహిమ కథాకథన పూర్వాంకంగా ఇందులో వివరించబడింది.

పురాణ శ్రవణ ఫలాన్ని ఈ పురాణం 136 శ్లోకాలలో వివరించింది. జ్ఞానదీపాలుగా, భవరోగౌషధాలుగా పురాణాలిందులో కీర్తింపబడివున్నాయి.

## 14. వామనపురాణం

బ్రహ్మదేవుడు వామనావతార ప్రభావాన్ని కీర్తిస్తూ చెప్పినదే వామనపురాణం. మహావిష్ణుని చర్మంతో దీన్ని పోల్చారు. ఇందలి 10,000 వేల శ్లోకాలు, అధ్యాయాలు 95.

వైష్ణవధర్మ ప్రతిపాదకమైన ఈ పురాణంలో విష్ణుమందిరాలు, విష్ణుభక్తుల వృత్తాంతాలు అధికంగా కనిపిస్తాయి. ఉత్పత్తి ప్రళయాలు, కామదహనం, ప్రహ్లాదవరదానం, దేవీమాహాత్మ్యం, నానావిధ తీర్థాలు, వినాయక విజయం ఇత్యాద్యంశాలు ఈ పురాణంలో వర్ణించబడివున్నాయి.

వివిధ దేవతలకు చెందిన 25 స్తోత్రాలు ఈ పురాణంలో లభిస్తాయి. దేవతలలో మహావిష్ణువు, ఆయుధాలలో సుదర్శనం, పక్షులలో గరుడుడు, సర్పాలలో వాసుకి, ఈ రీతిగా ఆయా వర్గాలలో మేలైనవారినీ, వస్తువులను కీర్తించే ఇందలి ఘట్టం ఆసక్తిజనకంగా ఉంటుంది.

లోకంలో ఎన్నో పాపాలున్నాయి, కాని అన్నింటినీ మించిన పాపం కృతఘ్నత్వమని ఈ పురాణం చెబుతున్నది.

నిత్యమూ ఉదయం లేవగానే త్రిమూర్తులు, గ్రహాలూ, సప్తర్షులూ, సప్తలోకాలూ తనకు శుభావహాలు కావాలని ప్రార్థించాలని ఈ గ్రంథం బోధిస్తున్నది.

జీవితంలో ఎన్ని విపత్తు లెదురైనా, షండుడు, మార్జారుడు, ఆఖువు, కుక్కుటుడు, పతితుడు, అపవిద్ధుడు, నగ్నుడు, చండాలుడు, అధముడు-ఇట్టివారిని ఆశ్రయించరాదని ఇందులో చెప్పడమయింది.

మనుజుడు అవశ్యం ఆచరించవలసిన సదాచారాలను 122 శ్లోకాలలో ఈ పురాణం వివరించింది.

పుత్రుడు - శిష్యుడు-వీరిరువురిలో శ్రేష్ఠ డెవరు? అన్న ప్రశ్నకు ఇందులో బ్రహ్మ పుత్రునికంటె శిష్యుడే శ్రేష్ఠుడని సమాధానం చెబుతాడు.

**పున్నామ్నో నరకాత్త్రాతి పుత్రస్తేనేహ గీయతే ।**
**శిష్టపాపహరశ్శిష్య ఇతీయం వైదికీ శ్రుతిః ॥**

'పుత్' అనే నరకం నుండి మాత్రమే రక్షించువాడు పుత్రుడు కాగా తక్కిన సకల పాపాలనుండీ కాపాడేవాడు శిష్యుడని భావం.

పాపాలను దూరం చేసుకొనే విధానాన్ని ప్రతిపాదిస్తూ దానికి ఉదాహరణంగా ఇందులో కోశకారుని వృత్తాంతం చక్కగా వర్ణించబడింది. పూర్వజన్మకృతపాపాలు తరువాతి జన్మలో స్మరణకు వస్తాయని ఈ కథ ద్వారా తెలుస్తున్నది.

**యే పఠంతి చ శృణ్వంతి తేఽపి యాన్తి పరాం గతిమ్ ।**

అన్నట్లు ఈ వామనపురాణం చదివేవారు, వినేవారు ఉత్తమగతిని పొందుతారని ఫలశ్రుతి.

## 15. కూర్మపురాణం

17,000 వేల శ్లోకాలు గల కూర్మపురాణం విష్ణువు యొక్క పృష్ఠంగా వర్ణించబడింది. పూర్వార్ధం, ఉత్తరార్ధం అని రెండు విభాగాలుగా ఉన్న ఈ పురాణంలో 53+46=99 అధ్యాయాలున్నాయి.

కూర్మరూపంలో ఉన్న విష్ణుదేవుడు మహర్షుల నుద్దేశించి చెప్పిన పురాణమిది. లక్ష్మి-ఇంద్రద్యుమ్నుల సంవాదం, విష్ణువు-మహర్షులకు జరిగిన సంవాదం, సృష్టివిధానం, వర్ణాశ్రమాలు, భృగువంశవర్ణన, యుగధర్మాలు, కాశీప్రయాగక్షేత్రాల మాహాత్మ్యం, సదాచారాలు, ద్వాదశాదిత్యుల వర్ణన-ఇత్యాదిగా గల అనేకాంశాలు ఈ పురాణంలో ఉన్నాయి.

మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు. పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు-అనే తొమ్మిదిమంది బ్రహ్మపుత్రులుగా ఇందు పేర్కొనబడినారు. మొదటికాలంలో ప్రజలు సుఖసంతోషాలతో వుండేవారనీ, క్రమంగా రాగద్వేషాలు కారణంగా ప్రజలకు దుఃస్థితి ఏర్పడిందనీ ఈ పురాణం చెబుతున్నది.

ధర్మం ఆచరణీయమనీ, ధర్మంవల్లనే తక్కిన పురుషార్థాలు సిద్ధిస్తాయనీ ఈ పురాణం పేర్కొంటున్నది.

**ధర్మాత్సంజాయతే హ్యర్థో ధర్మాత్కామోఽభిజాయతే ।**
**ధర్మ ఏవాపవర్గాయ తస్మాద్ధర్మం సమాశ్రయేత్ ॥**

అనగా ధర్మంనుంచే అర్థ,కామ,మోక్షాలు సిద్ధిస్తాయి. కాన ధర్మాన్ని ఆశ్రయించాలి అని భావం.

శివకేశవులకు భేదం లేదని, భక్తులు ఏఏరూపాలను ఆరాధిస్తారో భగవంతుడు ఆయా రూపాలతోనే వారిని అనుగ్రహిస్తాడని ఈ పురాణంలో చెప్పిన విషయం భగవద్గీతలోని

**'యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం'** అనే వచనానికి అనుగుణంగా ఉన్నది.

స్వధర్మాన్ని త్యజించి చేసే తీర్థయాత్రలవల్ల ప్రయోజనం శూన్యమనీ, దేవాలయాదులను మిక్కిలి పరిశుభ్రంగా ఉంచాలనీ, మూత్రవిసర్జనాదులతో అపరిశుద్ధం చేయరాదనీ, అలాచేయడం పాపహేతువనీ ఈ పురాణం హెచ్చరిస్తున్నది. పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యం ఇందులో చక్కగా వివరించబడింది.

వేదాన్ని విభజించేవారు వేదవ్యాసు లనబడతారు. అట్టివారు 26మంది ఉన్నారనీ పరాశరపుత్రుడైన కృష్ణద్వైపాయనుడు చివరివాడనీ ఈ పురాణం చెప్పిన విషయం గమనార్హమై ఉన్నది.

ఇంకను సమాజంలో వున్నవారి కర్తవ్యాలు, గురువులవద్ద ఉండవలసిన తీరుతెన్నులు, పాపాత్ములతో చేసే సాంగత్యంవల్ల కలిగే దోషాలు-ఇత్యాది విషయాలు మిక్కిలి ఆసక్తిదాయకంగా ఈ పురాణంలో చెప్పడమయినది.

ఇందులో వామనావతారానికి సంబంధించిన చరిత్ర చాలా చక్కగా నిరూపించబడివున్నది. భక్తిప్రధానమైన దుర్జయు డనేవాని కథవంటి కొన్ని కథలు పాఠకులకు చక్కని చైతన్యం కలిగిస్తాయి. అట్టివి ఇందులో పలుకథలు వున్నాయి.

**ఏతత్కూర్మపురాణం తు చతుర్వర్గఫలప్రదమ్ ।**
**పఠతాం శృణ్వతాం నృణాం సర్వోత్కృష్టగతిప్రదమ్ ॥**

ఈ పురాణం చదివేవారికి, వినేవారికి చతుర్వర్గ ఫలాలు సిద్ధిస్తాయి. సర్వోత్కృష్టగతి కూడా కలుగుతుంది.

## 16. మత్స్యపురాణం

మహావిష్ణువు మత్స్యరూపుడై వైవస్వతమనువు నుద్దేశించి చెప్పిన పురాణమిది. విష్ణువుయొక్క మెదడుతో దీన్ని పోల్చడమైనది. ఇందులో 14,000 వేల శ్లోకాలున్నాయి. మొత్తం అధ్యాయాల సంఖ్య 283.

ఇందలి ముఖ్య విషయాలివి-మత్స్యావతారవర్ణన, అజాండసృష్టి, సూర్యచంద్రవంశాలు, గయాక్షేత్రవర్ణన, పురూరవుని చరిత్ర, కచదేవయానుల కథ, కార్తవీర్యార్జునుని వృత్తాంతం, కలిధర్మాలు మరియు కృష్ణాష్టమి, అక్షయ తృతీయ, కల్యాణసప్తమి మున్నగు పలువ్రతాల వర్ణన, సప్తద్వీపాల వివరణ, త్రిపురాసురవృత్తాంతం, తారక వృత్తాంతం మున్నగు విషయాలే కాక రాజధర్మాలు, చతుర్విధ దండోపాయాలు, స్వప్నఫలాలు, వామన వరాహావతారాల వర్ణన ఇత్యాదిగా గల విషయాలు ప్రతిపాదితాంశాలై వున్నాయి.

పుట్టిన ప్రతివాడూ పురుషార్థసాధనకై ప్రయత్నించాలి. అలా చేయనివాని జన్మ వ్యర్థమని ఈ పురాణం నొక్కి వక్కాణిస్తున్నది.

**లబ్ధ్వా జన్మ న యః కశ్చిద్ఘటయేత్పౌరుషం నరః ।**
**జన్మ తస్య వృథా భూతమజన్మా తు విశిష్యతే ॥**

శ్రాద్ధకాలంలో పితృదేవతలకు అన్నపానాదులు సమర్పించడాన్ని గూర్చిన విశేషవివరణ యిందులో కనిపిస్తున్నది. శ్రాద్ధ కర్మలు అవశ్యాచరణీయాలని ఇక్కడ పేర్కొనడమైనది.

ఇక కాలమానం గురించి ప్రస్తావిస్తూ బ్రహ్మ, శివుడు, విష్ణువు అను త్రిమూర్తులకు చెందిన వివిధ కాలమానాల విశ్లేషణ ఇందులో చేయబడింది.

1.భృగువు 2.అత్రి 3. వసిష్ఠుడు 4. విశ్వకర్మ 5.మయుడు 6. నారదుడు 7. నగ్నజిత్తు 8. విశాలాక్షుడు 9. పురందరుడు 10. బ్రహ్మ 11. కుమారుడు 12.నందీశుడు 13.శౌనకుడు 14. గర్గుడు 15. వాసుదేవుడు 16. అనిరుద్ధుడు 17. శుకుడు 18. బృహస్పతి అనే ఈ పదునెనిమిది మంది వాస్తుశాస్త్రోపదేశకులుగా ఇందులో పేర్కొనబడినారు.

తల,లలాటం మున్నగు అవయవాల కదలికవల్ల కలిగే ఫలాన్ని కూడా భగవంతుడు ఈ పురాణంలో చెప్పియున్నాడు.

ఇక పితృశ్రాద్ధంవల్ల కలిగే ఫలాన్ని వివరించే కౌశికుడనే విద్యావంతుడు, అతని ఏడుగురు కుమారులకు చెందిన విస్తృతమైన కథ ఇందులో కనిపిస్తున్నది. భక్తిశ్రద్ధలతో ఆచరించిన పితృశ్రాద్ధం గోహత్యను కూడా పోగొడుతుందని ఈ కథలో నిరూపితమయినది. బ్రహ్మదత్తుని కథలో ఆడు చీమ, మగ చీమల మధ్య జరిగే సంభాషణ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది.

పతివ్రతల ప్రభావం గురించి చెప్పే ఈ క్రింది శ్లోకం వారిపట్ల గౌరవంతో వుండాలని హెచ్చరిస్తున్నది.

**పతివ్రతానాం వచనం ప్రకృష్టం తాసాం తు వాక్యం భవతీహ మిథ్యా ।**
**న జాతు లోకేషు చరాచరేషు తస్మాత్సదా తాః పరిపూజనీయాః ॥**

పతివ్రతల మాట శ్రేష్ఠమైనది. ఎప్పుడును వారి మాట మిథ్య కాదు. అందువల్ల వారు సదా పూజింపదగినవారు.

ఇక ఫలశ్రుతి –

**అస్మాత్పురాణాదపి పాదమేకం పఠేత్తు యస్సోఽపి విముక్తపాపః ।**
**నారాయణాఖ్యం పదమేతి నూనమనంగవద్దివ్యసుఖాని భుంక్తే ॥**

ఈ పురాణంలో ఒక్క పాదం చదివినా పాపనివృత్తుడై వైకుంఠం పొందగలడని, సకల దివ్యసుఖాలు అనుభవింపగలడని ఫలశ్రుతి చెబుతున్నది.

## 17. గరుడపురాణం

విష్ణువాహనమైన గరుడుడు అడిగిన ప్రశ్నలకు విష్ణుదేవుడు చెప్పిన సమాధానాలే గరుడపురాణం. ఇందులో 19,000 వేల శ్లోకాలు గల పూర్వఖండం, ఉత్తరఖండం అనే రెండు ఖండాలున్నాయి.

పూర్వఖండంలో 229, ఉత్తరఖండంలో 35 కలిపి 264 అధ్యాయాలు గల పురాణమిది. విష్ణుదేవుని "మజ్జ" గా ఇది వర్ణించబడింది.

ఈ పురాణంలోని ఉత్తరఖండంలో ప్రేతకల్పం మిక్కిలి ప్రశస్తమైనది. మరణానంతరం జీవుని స్థితిగతులను విస్తృతంగా వివరించే ఘట్టమిది. అందువల్లనే మరణించిన వానియింట పదవ దినంలోగా ఈ పురాణాన్ని పఠించే సంప్రదాయమేర్పడింది.

గరుడపురాణం కేవలం యమలోకవృత్తాంతాన్ని మాత్రమే చెబుతుందని కొందరు భావించడం కద్దు. ఈ భావన తగదు. ఇందలి పూర్వఖండంలో ఈ క్రింద నిర్దేశించబడిన నానావిషయాలున్నాయి.

భగవదవతారాలు, సరస్వత్యుపాసన, విష్ణుదీక్ష, శివార్చనావిధి, సుదర్శనచక్ర పూజావిధానం, సూర్యార్చన, దేవతాప్రతిష్ఠ, నిత్యనైమిత్తిక కామ్యకర్మల వివరణ, పాపప్రాయశ్చిత్తవిధి, నవరత్నాల పరీక్ష, వివిధములైన వ్రతాలు, ఆయుర్వేద వైద్యవిధానాలు మున్నగు అనేక విషయాలు ఈ పురాణంలో గోచరిస్తాయి. పశువుల చికిత్సా విధానం కూడా ఇందులో నిర్దిష్టమైయున్నది.

మానవజీవితానికి అత్యవసరమైన పలు నీతులు గూడా ఈ గ్రంథంలో పేర్కొనబడివున్నాయి. యజమానులు నిష్కారణంగా సేవకులను నిందించరాదన్న ఉపదేశం ఇందులో ఉన్నది. ధనం, జ్ఞానం, రూపం, మిత్రులు–వీరి స్వభావా లెలా ఉండాలో ఇందులో సూచించబడింది.

**అర్థేన కిం కృపణహస్తగతేన పుంసాం జ్ఞానేన కిం బహుశఠాకుల సంకులేన ।**
**రూపేణ కిం గుణ పరాక్రమవర్జితేన మిత్రేణ కిం వ్యసనకాలపరాఙ్ముఖేన ॥**

కృపణుని చేతి ధనం, మొండి మనిషికి గల జ్ఞానం, గుణపరాక్రమాలులేని రూపం, వ్యసనకాలంలో కనిపించని మిత్రుడు ఉండీ ప్రయోజనం లేదని భావం. కష్టకాలంలో పరిచితవ్యక్తులు సైతం ఎలా తప్పించుకొంటారో సోదాహరణంగా ఈ పురాణం వివరించింది. గృహంలో వుంటూనే ముక్తిని సాధించే విధానం గూడా చెప్పడమయింది.

గరుడ పురాణంలో ఎన్నో కథలున్నాయి. కథలకంటె ఇందలి నీతివచనాలు మనోజ్ఞాలు. ఉదాహరణకు వేలకొలది గోవులలో దూడ తన తల్లిని గుర్తించి అనుసరించినట్లు మనమెంత దూరంగా ఉన్నా మనకర్మ మనల్ని విడువక వెంటాడుతూ వుంటుందని నీతిబోధ.

హయగ్రీవ పూజావిధి, పంచమహాయజ్ఞాలు, రాజలక్షణాలు, సేవకలక్షణాలు, రోగనివారణోపాయాలు మున్నగునవి కూడా ఈ పురాణంలో చూడవచ్చు.

**'కీర్తితం పాపశమనం పఠతాం శృణ్వతాం నృణామ్'** అనగా ఈ పురాణం చదివేవారు, వినేవారు సకల పాపాల నుండి విడుదల పొందుతారని దీనికి ఫలశ్రుతి చెప్పబడింది.

## 18. బ్రహ్మాండపురాణం

బ్రహ్మదేవుని సృష్టిని వివరించే పురాణమిది. **"బ్రహ్మాండం చాస్థి గీయతే"** అన్నట్లు విష్ణువుయొక్క ఎముకలుగా ఇది పేర్కొనబడింది. ఇందులో 12,000 వేల శ్లోకాలున్నాయి. బ్రహ్మాండపురాణం పూర్వభాగం, మధ్యభాగం, ఉత్తరభాగమని మూడు భాగాలుగా వున్నది. పూర్వభాగంలో 38, మధ్యభాగంలో 74, ఉత్తరభాగంలో 44, మొత్తం కలిపి 156 అధ్యాయాల గ్రంథమిది. రోమహర్షణుడనే ముని కురుక్షేత్రంలో ఋషులకు చెప్పిన పురాణమిది.

ప్రక్రియాపాదం, అనుషజ్గపాదం, ఉపోద్ఘాతపాదం, ఉపసంహారపాదమని నాలుగు భాగాలుగా ఈ పురాణం విభజింపబడింది. నైమిశారణ్యవర్ణన, చతుర్ముఖబ్రహ్మ వర్ణనం, వరాహావతారం మున్నగు విషయాలు ప్రక్రియాపాదంలో కనిపిస్తాయి.

తరువాతి పాదంలో చతురాశ్రమ ధర్మాలు, మునుల జన్మవృత్తాంతం, దక్షుడు గావించిన శివనింద, సతీదేవి అగ్నిప్రవేశం, దక్షుడు, శంకరుడు పరస్పరం శపించుకొనడం, ప్రియవ్రతవర్ణన మున్నగు విషయాలతోపాటు సప్తద్వీపాల వర్ణన, సూర్యుని మహిమ, సూర్యుని అధీనంలో ఉండి ఇతర గ్రహాలు సంచరించడం, రాత్రింబవళు ళ్ళ, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు, యుగాలు అనబడే కాలానికి సూర్యుడే మూలకారణమని నిరూపించడం, లింగజననం, యుగధర్మాలు, మొదలగు విషయాలు ఇందులో కనిపిస్తాయి.

మూడవదైన ఉపోద్ఘాతపాదంలో సప్తర్షులజననం, నృసింహావతార వర్ణన, కుమారసంభవం, పుణ్యప్రదేశవర్ణన, శ్రాద్ధాలకు ప్రశస్తమైన నదులు, తీర్థాలు, అన్నదానం, గయలో శ్రాద్ధం, మొదలగు విషయాలు నిరూపింపబడి వున్నాయి. పరశురాముని తపస్సు, జమదగ్నిని కార్తవీర్యార్జునుడు హతమార్చడం, జమదగ్నిపునర్జననం, సగర యయాతుల చరిత్ర మున్నగు విషయాలు కనిపిస్తాయి.

చివరిపాదంలో లలితాదేవి వర్ణన, కామాక్షీ మాహాత్మ్యం, దేవీదీక్ష, మొదలైన విషయాలు ఉన్నాయి. ఈ పురాణపఠనఫలం క్రింది విధంగా పేర్కొనబడింది.

**య ఇదం కీర్తయేద్వత్స! శృణోతి చ సమాహితః।**
**స విధూయేహ పాపాని యాతి లోకమనామయమ్ ॥**

బ్రహ్మాండపురాణం పఠించేవాడు, ఏకాగ్రతతో వినేవాడు పాపరహితుడై సర్వోత్తమలోకాలను చేరుకుంటాడు అని భావం.

**సముద్రాల లక్ష్మణయ్య**
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు - తి.తి.దే.